زَادُ الخطِيب

# జాదుల్ ఖతీబ్

## (ఖుత్బాల సంగ్రహము)

సంపుటం -1

ఉర్దూ గ్రంథ కర్త

డాక్టర్ హాఫిజ్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ జాహిద్ హఫిజహుల్లాహ్



తెలుగు అనువాదం

ముహమ్మద్ ఖలీలుర్ రహ్మాన్, కొత్తగూడెం

ముద్రణ

అల్ ఇదారతుల్ ఇస్లామియ, కొత్తగూడెం

https://teluguislam.net

# ZAADUL KHATHEEB (Vol.1)

**(Khuthbaala Sangrahamu)** ***(Telugu)***

# జాదుల్ ఖతీబ్

## (ఖుత్బాల సంగ్రహము)

## సంపుటం-1

ఉర్దూ గ్రంథకర్త

**డాక్టర్ హాఫిజ్ ముహమ్మద్ ఇస్హాఖ్ జాహిద్** హఫిజహుల్లాహ్

తెలుగు అనువాదం

**ముహమ్మద్ ఖలీలుర్ రహ్మాన్,** కొత్తగూడెం.

ముద్రణ

**అల్ ఇదారతుల్ ఇస్లామియ**

కొత్తగూడెం.

https://teluguislam.net

*Name of the Book* : **ZAADUL KHATHEEB (Vol.1)**

**(Khuthbaala Sangrahamu)** ***(Telugu)***

*Author* : **Dr. Haafiz Mohammad Ishaaq Zaahid**

**(Hafizahullah)**

*Telugu Translation by* : **Mohammad Khaleel-ur-Rahman**
**Kothagudem**

**(khaleelr1570@gmail.com)**


***All Rights Reserved with Publishers***


First Edition : June 2021

Copies : **2000**

**PRICE : Rs.350/-**

Published by : **Al Idaaratul Islamia**
(Educational, Welfare and
Charitable Society.)
H.No.9-82/1A, Prashanthi Nagar,
L.D. Pally, **Kothagudem -** 507 101
Cell: 9951388332 (Google pay)

*DTP, Print Supervision* : **Al-Baseer Graphics**, Hyderabad

whatsapp Cell: 9441055065

*బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం*

# నా మాట

అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్, వస్సలాతు వస్సలాము అలా సయ్యదిల్ ముర్సలీన్ – అమ్మాబాద్!

శుక్రవారపు నమాజు ప్రక్రియలో అత్యంత ముఖ్యమైన ఘట్టం దాని ఖుత్బా (ప్రసంగం). దీనిలో వివరించాల్సిన విషయాలను దివ్య ఖురాను మరియు ప్రామాణిక హదీసుల వెలుగులో, సలఫుస్సాలిహీన్‌ల దృక్పథంతో సమగ్రంగా, పూర్తి ఆధారాలతో సహా వివరించే పుస్తకం ఏదియూ తెలుగు భాషలో ఇంతవరకు అందుబాటులో లేదన్న విషయం తెలుగు పాఠక లోకానికి తెలుసు.

అందుకే, **అల్ ఇదారతుల్ ఇస్లామియ**, కొత్తగూడెం ఈ లోటును పూరిస్తూ తెలుగు పాఠక లోకానికి – శుక్రవారపు ఖుత్బాల గురించి డాక్టర్ హాఫిజ్ ముహమ్మద్ ఇస్‌హాఖ్ జాహిద్ హఫిజహుల్లాహ్ **'జాదుల్ ఖతీబ్'** పేరుతో ఉర్దూ భాషలో గ్రంథీకరించిన వివిధ సంపుటాలలో మొదటి సంపుటం యొక్క తెలుగు అనువాదాన్ని **'జాదుల్ ఖతీబ్' (ఖుత్బాల సంగ్రహము), సంపుటం–1** అనే పేరుతో మీకు సమర్పిస్తోంది!

మా సంస్థ సేవకులు మరియు నాకు ఆప్త మిత్రులయిన **జనాబ్ ముహమ్మద్ ఖలీలుర్ రహ్మాన్** గారు ఈ బాధ్యతను చేపట్టి, ఎంతో పట్టుదలతో శ్రమించి, సామాన్య ప్రజానీకానికి సయితం అర్థమయ్యేలా అత్యంత సులభమైన శైలిలో ఈ అనువాద ప్రక్రియను పూర్తి చేశారు. అల్లాహ్‌కే సమస్త స్తోత్రాలు, ఆయన అనుగ్రహం ద్వారానే సదాచరణలు సంపూర్ణం గావించబడతాయి.

అనువాద ప్రక్రియలో **జనాబ్ అబూ సూఫ్యాన్ ముహమ్మద్ ఆరిఫుద్దీన్ (హైదరాబాద్)** గారు ఎంతగానో సహాయపడ్డారు. నాకున్న జ్ఞానం మేరకు స్వయంగా నేను కూడా అనువాద ప్రక్రియలో పాలుపంచుకున్నాను. పుస్తకం యొక్క డి.టి.పి. మరియు కంపోజింగ్ ప్రక్రియను ఈ రంగంలో నిష్ణాతులైన **జనాబ్ అబ్దుల్ వకీల్ (హైదరాబాద్)** గారు పూర్తి చేశారు.

ఇలా అల్లాహ్ దయతో, ఈ అందరి నిరంతర కృషి మరియు శ్రమల ఫలితమే మీ ముందున్న ఈ పుస్తకం!

దీనిని అత్యంత సులభంగా, ఆకర్షణీయంగా సగటు పాఠకునికి అర్ధమయ్యేలా చేయడానికి శాయశక్తులా ప్రయత్నించడం జరిగింది. అయినప్పటికీ, మానవ ప్రక్రియ ఏదయినా లోపాలకు అతీతంగా వుండదు. కాబట్టి దీని అనువాదం, డిటిపి, కంపోజింగ్‌లలో ఎక్కడైనా తప్పులు దొర్లివుంటే వాటిని ప్రకాశకులకు తెలియజేయమని పాఠకులకు సవినయంగా మనవి చేస్తున్నాను. తద్వారా, రాబోయే ఎడిషన్లలో వాటిని సరిదిద్దవచ్చు.

ఆఖరిగా – అల్ ఇదారతుల్ ఇస్లామియ మరియు వ్యక్తిగతంగా నేను, జనాబ్ ముహమ్మద్ ఖలీలుర్ రహ్మాన్ గారికి, జనాబ్ అబూ సూఫ్యాన్ ముహమ్మద్ ఆరిఫుద్దీన్ గారికి, జనాబ్ అబ్దుల్ వకీల్ గారికి, అలాగే ఈ పుస్తక ముద్రణ నిమిత్తం ప్రత్యక్షంగా, పరోక్షంగా సహాయపడిన వారందరికీ మా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాం.

వీరందరి మరియు వీరితోపాటు సంస్థ నిర్వాహకుల నిరంతర కృషిని దయతో స్వీకరించి, దీనికిగాను వారికి ఇహపరలోకాల్లో ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించమని నేను అల్లాహ్‌ను వేడుకొంటున్నాను.

వస్సలాము అలైకుమ్ వ రహ్మాతుల్లాహి వ బరకాతుహు.

**మౌలానా అబుల్ కలాం రియాజి**

**అల్ ఇదారతుల్ ఇస్లామియ**

కొత్తగూడెం.

# విషయ సూచిక

**ముందుమాట** 1

**మొహర్రం మాసపు ఖుత్బాలు** **15**

1) మొహ(ర్రం నెల మరియు ఆషూరా దినం 16

2) సహాబాల (ప్రవక్త సహచరులు) మహత్యం 39

3) మదీనాకు వలస (హి(జ్రత్) 66

**సఫర్ మాసపు ఖుత్బాలు** **98**

1) సఫర్ నెల మరియు దుశ్శకునాలు 99

**రబీ ఉల్ అవ్వల్ మాసపు ఖుత్బాలు** **111**

1) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మహత్యం, అద్భుతాలు ... 112

2) షరీయత్తు(ధర్మశాస్త్ర)పరంగా మిలాదున్నబీ ఉత్సవానికి గల విలువ 144

3) అనుచర సమాజం (ఉమ్మత్) పై దైవప్రవక్త హక్కులు 172

4) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి అత్యుత్తమ గుణగణాలు... 203

**రజబ్ మాసపు ఖుత్బాలు** **230**

1) రజబ్ మాసపు కొత్త పోకడ(బిద్దత్)లు 231

2) ఇస్రా వ మేరాజ్ 251

3) మేరాజ్ కానుక – నమాజు 283

**షాబాన్ మాసపు ఖుత్బాలు** **310**

1) షాబాన్ నెల – విశేషాలు, ఆదేశాలు 311

2) అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం 330

**రమజాన్ మాసపు ఖుత్బాలు** **364**

1) శుభప్రద రమజాన్ మాసం – పుణ్యాల వసంతం 365

2) దివ్య ఖుర్‌ఆన్ మహత్యం 388

3) తౌబా మరియు అస్తగ్‌ఫార్ – ప్రయోజనాలు, ఫలాలు 414

4) రమాజన్ మాసపు ఆఖరి పది రోజులు 443

**షవ్వాల్ మాసపు ఖుత్బాలు**

1) ఈదుల్ ఫితర్ ఖుత్బా 460

**జిల్‌ఖాదా మాసపు ఖుత్బాలు** **483**

1) హరమైన్ షరీఫైన్ మహత్యాలు 484

2) హజ్ మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదలు–1 514

3) హజ్ మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదలు–2 540

**జిల్ హిజ్జ మాసపు ఖుత్బాలు** **565**

1) జిల్ హిజ్జ మొదటి పది రోజుల మహత్యాలు మరియు ఆచరణలు 566

2) ఈదుల్ అజ్హా ఖుత్బా 590

3) హజ్జతుల్ విదా ఖుత్బా–1 616

4) హజ్జతుల్ విదా ఖుత్బా–2 639

*బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం*

## ముందుమాట

**అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్, వస్సలాతు వస్సలాము అలా అష్రఫుల్ అంబియాయి వల్ ముర్సలీన్ వ అలా ఆలిహి వస్సహాబిహి అజ్మయీన్. వమన్ తబా అహుమ్ ఇహ్సాన ఇలా యౌమిద్దీన్, వ బాద్!**

వారంలోని రోజులలో అన్నిటికన్నా శ్రేష్ఠమైన రోజు శుక్రవారం. గతించిన అనుచర సమాజాలన్నింటికీ దీని శుభాల నుండి దూరంగా వుంచి అల్లాహ్ కేవలం ఈ అనుచర సమాజానికి (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం అనుచర సమాజం) ప్రత్యేకంగా అనుగ్రహించాడు, దీని వైపునకు ఈ సమాజాన్ని మరలించడం తోపాటు దీని శుభాలను కూడా ఈ అనుచర సమాజానికి ప్రసాదించాడు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుక్రవారం రోజును అన్నింటికన్నా ఉత్తమమైన రోజుగా నిర్ధారించారు.

అబూ హురైరా (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ఉద్బోధించారు: "సూర్యుడు ఉదయించే దినాలలో అన్నింటికన్నా శ్రేష్ఠమైన దినం శుక్రవారం. ఈ రోజే ఆదం (అలైహిస్సలాం)ను సృష్టించడం జరిగింది మరియు ఈ రోజే ఆయనను భూమిపైకి పంపడం జరిగింది. ఈ రోజే ఆయన పశ్చాత్తాపం స్వీకరించబడింది మరియు ఈ రోజే ఆయన మరణించడం జరిగింది. ఈ రోజే ప్రళయం సంభవిస్తుంది. కేవలం మానవులూ, జిన్నాతులు తప్ప ప్రతి జంతువూ శుక్రవారం నాడు తెల్లవారుజాము మొదలుకొని సూర్యోదయం వరకు ప్రళయం గూర్చి భయపడుతూ దాని కోసం నిరీక్షిస్తూ ఉంటుంది. శుక్రవారం ఒక ఘడియ వస్తుంది. ఖచ్చితంగా ఆ ఘడియలోనే ముస్లిమైన దైవదాసుడెవరైనా నమాజు చదువుతూ అల్లాహ్‌ను ఏదైనా విషయం నిమిత్తం వేడుకుంటే అల్లాహ్, అతడు కోరుకున్న దానిని అతడికి అనుగ్రహిస్తాడు."

*(అబూదావూద్ : 1046, సహీ–అల్‌బానీ)*

ఇంతేగాక ఒక హదీసులోనైతే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)

శుక్రవారం రోజును పండుగ దినంగా నిర్ధారించారు.

ఇబ్నె అబ్బాస్ (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "నిస్సందేహంగా ఈ రోజు పండుగ రోజు. అల్లాహ్ దీనిని కేవలం ముస్లింల కోసం (పండుగ దినంగా) ఖరారు చేశాడు. కనుక ఎవరైనా శుక్రవారం నమాజుకోసం వచ్చినపుడు స్నానం చేయాలి మరియు సవాసన కలిగి వుంటే దానిని తప్పకుండా పూసుకోవాలి. మిస్వాక్ చేయడం మీకు తప్పనిసరి." *(ఇబ్నెమాజా : 1098, సహీ – అల్‌బానీ)*

మరో హదీసులో ప్రియ దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) శుక్రవారం దినాన్ని అన్ని దినాల నాయకురాలిగా ఖరారు చేసి, దీనిని ఈదుల్ ఫిత్ర్ (రమజాన్ పండుగ) మరియు ఈదుల్ అజ్హా (బక్రీద్ పండుగ) రోజులకన్నా శ్రేష్టమైనదిగా అభివర్ణించారు.

అబూ లుబాబ బిన్ అబ్దుల్ మన్‌జర్ కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా ప్రవచించారు:

నిస్సందేహంగా శుక్రవారం, అన్ని దినాలకు నాయకురాలు మరియు అల్లాహ్ వద్ద అన్నింటికన్నా శ్రేష్టమవడమేగాక ఈదుల్ అజ్హా మరియు ఈదుల్ ఫిత్ర్ కన్నా ఉత్తమమైనది. దీనికి ఐదు ప్రత్యేకతలు వున్నాయి.

మొదటిది : అల్లాహ్ ఈ రోజే ఆదమ్ (అలైహిస్సలాం)ను సృష్టించాడు.

రెండవది : ఈ రోజే అల్లాహ్ ఆయన్ను భూమిపైకి పంపాడు.

మూడవది : ఈ రోజే అల్లాహ్ ఆయనకు మరణం ఇచ్చాడు.

నాల్గవది : ఈ రోజు నందు ఒక ఘడియ వుంది. ఆ ఘడియలో దాసుడెవరైనా అల్లాహ్‌ను దేనికొరకైనా వేడుకుంటే, అల్లాహ్ అతడి కోరికను తీరుస్తాడు. అయితే ఆ కోరిక నిషిద్ధ కోరిక అయి వుండకూడదు.

ఐదవది : ఈ రోజే ప్రళయం కూడా సంభవిస్తుంది.

అల్లాహ్‌కు దగ్గరగా వుండే దైవదూతలు, భూమ్యాకాశాలు, గాలి, పర్వతాలు, సముద్రాలు సమస్తమూ శుక్రవారం దినాన్ని గూర్చి భయపడతాయి. *(ఇబ్నెమాజా : 1084, సహీ–అల్‌బానీ)*

పైన వివరించబడ్డ హదీసులలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుక్రవారం దినపు ప్రాధాన్యత, గొప్పతనాలతోపాటు దాని ప్రత్యేకతలను కూడా వివరించారు. క్లుప్తంగా అవి ఇవి:

1) శుక్రవారం నాడు అల్లాహ్ ఆదమ్ (అలైహిస్సలాం) ను సృష్టించాడు.

2) ఈ రోజే ఆయనను స్వర్గంలో ప్రవేశింపజేశాడు.

3) ఈ రోజే ఆయనను భూమిపైకి పంపాడు.

4) ఈ రోజే ఆయన పశ్చాత్తాపం స్వీకరించబడింది.

5) ఈ రోజే ఆయన మరణించారు.

6) ఈ రోజు నందే తప్పకుండా దుఆ స్వీకరించబడే ఒక ఘడియ ఉంది.

7) ఈ రోజే శంఖం పూరించబడుతుంది మరియు ప్రళయం సంభవిస్తుంది.

శుక్రవారం నాడు అన్నింటికన్నా ముఖ్యమైన ఆరాధన 'జుమా నమాజు'. ఇది– దీని కోసం అర్హులైన ప్రతి ఒక్కరిపై ప్రత్యేకమైన విధిగా వున్నది. ఇది 'తప్పనిసరి' కావడం అనేది దివ్య ఖుర్ఆన్ ద్వారా నిరూపించబడి వుంది. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِذَا نُوْدِيَ لِلصَّلٰوةِ مِنْ يَّوْمِ الْجُمُعَةِ فَاسْعَوْا اِلٰى ذِكْرِ اللّٰهِ وَ ذَرُوا الْبَيْعَ ط

**"విశ్వాసులారా! శుక్రవారం నాడు నమాజుకై పిలిచినప్పుడు, అల్లాహ్ సంస్మరణ వైపునకు పరుగెత్తండి. క్రయవిక్రయాలను వదలిపెట్టండి. మీరు గ్రహించగలిగితే, ఇదే మీకు అత్యంత శ్రేయస్కరమైది."**

***(జుమా:9)***

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దీనిని నెరవేర్చమని ఆదేశించారు. తారిఖ్ బిన్ షిహాబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉపదేశించారు: "జుమా నమాజు సామూహికంగా నెరవేర్చుడం సత్యం మరియు (అర్హుడైన) ప్రతి ముస్లింపై తప్పనిసరి, కేవలం నలుగురు వ్యక్తులకు తప్ప – ఒకరి ఆధీనంలో వున్న బానిస, స్త్రీ, పిల్లవాడు మరియు వ్యాధిగ్రస్తుడు." *(అబూదావూద్ : 1067, సహీ – అల్‌బానీ)*

జుమా నమాజును షరీయత్తు పరమైన కారణమేదీ లేకుండా వదిలిపెట్టే

వ్యక్తులను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గట్టిగా హెచ్చరించారు:

ఇబ్నె ఉమర్ మరియు అబూ హురైరా (రజి అల్లాహు అన్హుమ్) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ విధంగా హెచ్చరించారు: ప్రజలు జుమా నమాజును విడిచిపెట్టడం మానుకోవాలి, అలా కాని పక్షంలో, అల్లాహ్ వారి హృదయాలపై ముద్ర వేసేస్తాడు. తదుపరి వారు అజాగ్రత్తపరులలో చేరిపోతారు. *(ముస్లిం : 865)*

అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జుమా నమాజు విడిచిపెట్టే వారిని గూర్చి ఈ విధంగా సెల విచ్చారు: నమాజు చేయించడానికి ఒక వ్యక్తిని నియమించి, తదుపరి, జుమా నమాజుకోసం (మస్జిద్‌కు) రాని వారిని, వారి ఇండ్లతో సహా తగలబెట్టేయాలని నా మనసు కోరుకొంటోంది. *(ముస్లిం : 652)*

ప్రియ పాఠకులారా! పై హదీసుల ద్వారా రూఢీ అయిన విషయం ఏమి టంటే – శుక్రవారం నాటి ముఖ్యమైన పని జుమా నమాజు చేయడం. ఈ నమాజుకు ముందు జుమా ఖుత్బా (ప్రసంగం) కూడా అంతే ముఖ్యమైనది. కారణం– దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి శుక్రవారం నాడు జుమా నమాజుకు పూర్వం ఖుత్బా ఇచ్చేవారు. ధార్మిక పండితుల దృష్టిలో కూడా జుమా నమాజు నెరవేరడానికి 'ఖుత్బా' ఒక షరతుగా వుంది. ఈ కారణంగా జుమా ఖుత్బా యొక్క ప్రాముఖ్యత మరియు ఔన్నత్యం మనం ఊహించుకోవచ్చు.

ఇస్లాం ఆరంభ దశలో జుమా ఖుత్బా కేవలం ఖలీఫాలు (నాయకులు) మరియు వివిధ పట్టణాలలో వారిచే నియమించబడ్డ ప్రతినిధుల వరకే పరిమితమై వుండేది. కేవలం వారే లేదా వారిచే నియమించబడ్డ వారే ఖుత్బా ఇచ్చేవారు. ప్రజల, ఈ ప్రతి వారపు ధార్మిక సమావేశం కొన్ని ప్రత్యేకమైన మస్జిద్‌లలో మాత్రమే నిర్వహించబడేది. కానీ, ఇస్లామీయ విజయాల పరంపర పెరుగుతున్న కొద్దీ జుమా ఖుత్బా ఇచ్చే మసీదుల సంఖ్య కూడా పెరుగుతూ పోయింది. మాషాఅల్లాహ్! ప్రస్తుతం అయితే, ఒకే పట్టణంలో, వందల కొద్దీ మసీదులలో వక్తలు జుమా ఖుత్బా ఇస్తున్నారు మరియు వేలకొద్దీ ప్రజలు వారి ఖుత్బాలను వినడానికి హాజరవుతున్నారు. వేరే ఇతర ధార్మిక సమావేశాలకైతే

ప్రజలను సమీకరించాల్సి వస్తుంది కానీ, జుమా ఖుత్బా కోసం మరియు జుమా నమాజు కోసమైతే స్వయంగా ప్రజలే మసీదుకు చేరుకుంటారు. ఈ కారణాల మూలంగా ఈ ప్రసంగాలు, హితబోధలు అనేవి సత్యం వైపునకు ఆహ్వానించ డానికి, ధార్మిక బోధనలకు, ప్రవచనాల కొరకు ఒక అత్యుత్తమ అవకాశంగా ప్రతివారం వున్నాయి. ప్రజల విశ్వాసాలు, ఆచరణలను చక్క దిద్దడంతో పాటు వారి మనస్సుల ప్రక్షాళన, గుణగణాల పరిశుద్ధత, సామాజిక, రాజకీయ వ్యవహారాలను సరిదిద్దుకోడానికి ఒక చక్కటి అవకాశం ఇచ్చి వున్నాయి.

ఒకవేళ వక్తలు తమ ప్రసంగాల ద్వారా కేవలం దివ్య గ్రంథం (ఖుర్ఆన్) మరియు సున్నత్‌ల ద్వారా నిరూపించబడ్డ విషయాలనే ప్రజలకు చేరవేస్తూ – మింబర్ (ప్రసంగ వేదిక) పై నిలబడేవారు చేయాల్సింది కూడా ఇదే – గ్రంథం మరియు సున్నత్‌లకు విరుద్ధంగా వున్న విషయాలు, బలహీన, అసత్య ఉల్లేఖనాలపై ఆధారపడ్డ విషయాలను వదలిపెడుతూ, దానితోపాటు ప్రసంగ వేదిక ప్రతిష్ఠను నిలబెడుతూనే కేవలం స్వచ్ఛమైన ధార్మిక హితబోధ చేస్తూ, ప్రసంగ వేదిక గౌరవార్థం పనికిమాలిన విషయాలు, కట్టుకథలు, అసత్య విషయాల జోలికి పోకుండా, ప్రజలకు ప్రయోజనం చేకూర్చే విషయాలను చిత్తశుద్ధితో, అల్లాహ్ బోధనల సంపూర్ణ ప్రేరణతో కేవలం దిద్దుబాటు (ఇస్లాహ్) మరియు శిక్షణలపైనే తమ మరియు శ్రోతల దృష్టిని కేంద్రీకరింపజేస్తే, వారి ఈ ప్రసంగాల ద్వారా తప్పకుండా ఉమ్మత్ (అనుచర సమాజం) లో విప్లవం వచ్చే అవకాశం ఉంది.

ఇలా, ప్రస్తుతం ముస్లిములు చిక్కుకొని వున్న తప్పుడు విశ్వాసాలు, చెడు ఆచరణల నుండి వారిని బయటకు తీయాల్సిన బాధ్యతను (ఇన్షా అల్లాహ్) చాలా చక్కగా నిర్వర్తించవచ్చు.

శుక్రవారపు ఖుత్బా కోసం పూర్తి హోంవర్క్ చేసి, ఖుర్ఆన్, హదీసుల పటిష్ఠ ఆధారాలతో పాటు, ప్రవక్త సహచరులు మరియు సలఫుస్సాలిహీన్‌ల వాస్తవిక ప్రామాణిక సంఘటనలను వివరిస్తూ, నిరాధార, కల్పిత విషయాలు, కట్టుకథల నుండి దూరంగా వుండే వక్తలు మాషాఅల్లాహ్! ప్రస్తుతం కూడా వున్నారు. వారి ఉద్దేశ్యం కేవలం – ప్రజలకు జ్ఞాన ప్రబోధన, వారి శిక్షణ, విశ్వాస ఆచరణలలో దిద్దుబాటు మరియు ఆత్మశుద్ధి తప్ప మరేదీ వుండదు. వారు పూర్తి సంవత్సర కాలంలో రాబోయే విషయాలు, వేర్వేరు పరిస్థితులు,

సంఘటనలు మరియు శ్రోతల మానసిక పరిస్థితులను దృష్టిలో వుంచుకొని ప్రయోజనకరమైన ప్రసంగాన్ని చేస్తారు. సంస్మరణ, హితబోధ, ప్రబోధనా కార్యాలను వారు ఎంతో వివేకంతో, ఉత్తమ రీతిలో నిర్వర్తిస్తూ, తప్పుడు దృష్టికోణాలను కూడా ఎంత ఉత్తమంగా ఖండిస్తారంటే, దానిలో ప్రామాణిక ఆధారాల బలము మరియు పటిష్ఠత ఉంటుంది. ఈ సంపూర్ణ కార్యసాధనలో వారు కేవలం అల్లాహ్ సంతృప్తినీ మరియు పుణ్యఫలాన్నీ ఆశిస్తుంటారు.

అల్లాహ్ వారికి ఉత్తమ ప్రతిఫలాన్ని ప్రసాదించుగాక!

ఇక, ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న ఈ కార్యాన్ని నిర్వర్తించడానికి కనీసం అర్హత కూడా లేని, లేదా అర్హత వున్నప్పటికీ, తమ బాధ్యత పట్ల అశ్రద్ధ చూపుతూ, దీనిని కేవలం ఒక రొటీన్ పనిగా తలచి, నిర్వర్తించే వక్తలను గూర్చి ఏమనాలి?

ప్రస్తుత సమయంలో భారత ఉపఖండంలో శుక్రవారం ఖుత్బాలిచ్చే మెజారిటీ వక్తల్లో ఈ క్రింది గుణాలను మనం వీక్షించవచ్చు:

1) కొంతమంది వక్తలు – ఖుత్బాలను, ఏ మాత్రం సన్నద్ధం కాకుండా ఇస్తారు. వారిలో చాలా మంది కేవలం కట్టుకథలు చెబుతూ వుంటారు. ప్రయోజనకరమైన ప్రసంగం చాలా తక్కువగా చేస్తారు.

నాకు జ్ఞాపకం ఉంది – నేనొకసారి ఒక వ్యక్తి ప్రసంగం వినే ఉద్దేశ్యంతో, అతని వెనుక నమాజు చదివే నిమిత్తం శుక్రవారం నమాజు కోసం వెళ్ళాను. అతను మంచి ఖుత్బా ఇస్తాడని, దాని ద్వారా నేను ప్రయోజనం పొందగలిగే అవకాశం దొరికిందని నేను ఊహించాను. కానీ, అతని ప్రసంగం నాకు అత్యంత నిరాశనే మిగిల్చింది. పూర్తి ప్రసంగంలో అతను దివ్య ఖుర్ఆన్ లోని ఒక్క ఆయతుగానీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఒక్క హదీసు గానీ ప్రస్తావించలేదు. కేవలం పనికిమాలిన విషయాలు చెప్పి ఖుత్బా సమయాన్ని పూర్తి చేశాడు.

2) కొంతమంది వక్తలు బలహీన హదీసులే కాదు, నిరాధార, కల్పిత, తప్పుడు హదీసులను కూడా వివరిస్తూ ఉంటారు. వాస్తవానికి వీటి అవసరం ఏ మాత్రం లేకుండా చేసే ప్రామాణిక హదీసులు ఎన్నో వున్నాయి వివరించడానికి.

3) చాలా మంది వక్తలకు తమ ప్రసంగాల్లో ఏ విషయం గురించి వివరించాలో కూడా తెలిసి వుండదు. ఆ విషయం వివరణకు గాను ఏయే అంశాలను ప్రస్తావించాలో కూడా తెలిసి వుండదు. అందుకే వారు ఒక క్రమమైన పద్ధతి ప్రకారం ప్రసంగించరు. ప్రారంభంలో ఒక విషయం గురించి వివరించడం మొదలుపెట్టి దాన్నుండి ఎంత దూరం వెళ్ళిపోతారంటే – ప్రసంగం ముగించే ముందు వారికి గుర్తొస్తుంది వారే విషయం గురించి మాట్లాడడం మొదలుపెట్టారో! చివరికి ఏ విషయంలోకి ప్రవేశించారో!

నేనొకసారి ముల్తాన్ (పాకిస్తాన్) లోని ఓ ముఖ్యమైన మసీదులో శుక్రవారం నమాజు కోసం హాజరయ్యాను. వక్తగారు ప్రసంగం ఆరంభంలోనే "గత రెండు  శుక్రవారాల ప్రసంగం మాదిరిగానే ఈ రోజు కూడా నూహ్ అలైహిస్సలాం గాథ వివరించబడుతుంది" అని సెలవిచ్చారు. ఇక ప్రసంగం ప్రారంభమయ్యాక ఆయన గారు అసలు విషయం నుండి చాలా దూరం వెళ్ళిపోయారు. ప్రసంగం ఎంతో ఉద్వేగంతో కూడుకొని వుంది. ప్రసంగిస్తూ చెమటలో తడిసిపోయారు. దాదాపు గంటసేపు, పనికిరాని ఆ మాటా, ఈ మాటా వల్లిస్తూ వుండి పోయారు. చివరికి 'వచ్చే శుక్రవారం కూడా ఈ విషయమే వివరించ బడుతుంది' అని ప్రకటించారు.

నేనీ విషయాన్ని ఓ జ్ఞాన సంపన్న స్నేహితుని ముందు ప్రస్తావిస్తే, దానికతను స్పందిస్తూ–నూహ్ అలైహిస్సలాం 950 సంవత్సరాలు బోధనా కార్యాన్ని నిర్వర్తించారు. మరి అలాంటప్పుడు ఆయన బోధనలు ఒకటి రెండు ప్రసంగాల్లో ఎలా పూర్తవుతాయి? అని చమత్కరించారు.

4) కొంతమంది వక్తలు, బజారులో లభ్యమయ్యే ప్రసిద్ధ వక్తల ప్రసంగాలకు సంబంధించిన పుస్తకాలు తమ దగ్గర పెట్టుకుంటారు. వాటిని చదివి, వాటిలో వున్న విషయాలనే తమ ప్రసంగాలలోనూ వివరిస్తారు. అంతేగాని, వాస్తవిక మరియు ప్రామాణిక గ్రంథాల వైపునకు మరలి వాటి సహాయం తీసుకొని సన్నద్ధం కారు.

ఇవేకాక, ఇతరుల కంట పడకుండా వుండలేని ఇంకా ఎన్నో ఇతర గుణాలు న్నాయి. బహుశా, ఈ కారణాలవల్లే చాలా మంది వక్తల ప్రసంగాల ప్రభావం అంతగా వుండదు మరియు శుక్రవారపు ఖుత్బా ద్వారా చేకూరాల్సిన ప్రయోజనం ప్రజలకు చేకూరదు.

పై విషయాలను దృష్టిలో వుంచుకొనే, భారతీయ ఉపఖండంలో వేయి కన్నా ఎక్కువ బోధకులకు సహాయం చేసే 'జమియతుల్ ఇహ్యా ఉల్ తరాసుల్ ఇస్లామీ' (కువైట్) సంస్థ ఉపసంఘమైన 'లిజన్నతుల్ ఖారిహాతుల్ హిందియ' నిర్వాహకులు, కనీసం ఈ బోధకుల మార్గదర్శకత్వం నిమిత్తం పూర్తి సంవత్సర కాలానికి సంబంధించిన ప్రసంగాలను, పూర్తిగా జ్ఞాన పూరితంగా తయారు చేయదలచారు. తద్వారా, వక్తలు, రొటీన్ పద్ధతికి భిన్నంగా ప్రసంగాలు చేస్తూ వారి బోధనలను ఎంతో సార్థకంగా వ్యాపింపజేయవచ్చు.

ఈ మహత్తర కార్యాన్ని నిర్వాహకులు కొన్ని సంవత్సరాల క్రితం నా భుజస్కందాలపై వేశారు మరియు దీనితోపాటు నాకుకొన్ని మార్గదర్శక సూత్రాలను కూడా సూచించారు. వాటిలో ముఖ్యమైనవి ఇవి:

1) అన్నింటికన్నా ముందు పూర్తి సంవత్సర కాలానికి సంబంధించిన విషయాలపై ప్రసంగాలు తయారు చేసి, దానిని ఒక సంపుటంలో పొందుపరచాలి. తదుపరి ఇతర విషయాలపై వేర్వేరు సంపుటాలు తయారు చేయాలి మరియు ప్రతి సంపుటంలో కనీసం 25 ప్రసంగాలు ఉండాలి.

2) ప్రతి ప్రసంగం ఆరంభంలో దానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను పేర్కొనాలి. తద్వారా వక్తకు – ఏ విషయానికి సంబంధించిన ఏ అంశాన్ని ప్రస్తావించాలి? అన్న విషయం ముందే మనసులో వుండాలి. ప్రతి అంశానికి సంబంధించిన దివ్యగ్రంథం, సున్నత్‌ల జ్ఞాన పూరిత ఆధారాలు పేర్కొనాలి.

3) ప్రసంగ విషయానికి సంబంధించిన దివ్య ఖుర్ఆన్ ఆయతులతోపాటు కేవలం ప్రామాణిక హదీసులనే సంగ్రహించాలి మరియు బలహీన, కాల్పనిక హదీసుల నుండి దూరంగా వుండాలి.

4) ఈ ప్రసంగాల ద్వారా వక్తలు, బోధకులకు శిక్షణ ఇవ్వాలి. తద్వారా వారు శుక్రవారపు ఖుత్బా కోసం ఒక విషయాన్ని ఎంపిక చేసుకొని, దానిపైనే ప్రసంగించాలి. ఆ విషయానికి సంబంధించిన ముఖ్యమైన అంశాలనే దృష్టిలో వుంచుకోగలగాలి మరియు వాటినే ఒక క్రమమైన పద్ధతిలో ప్రజల ముందు ప్రస్తావించగలగాలి. ప్రసగించేటప్పుడు, బలహీన, కాల్పనిక హదీసులకు దూరంగా ఉండగలగాలి.

నేనీ మహత్తర కార్యాలను నిర్వహించడానికి ముందైతే ఒప్పుకున్నాను గానీ, ఈ పని ఎంతో కష్టతరమైనదని, నేననుకున్నంత సులభం కాదని నాకు తర్వాత తెలిసి పోయింది. అయినప్పటికీ, పై మార్గదర్శక సూత్రాలను దృష్టిలో వుంచుకొని 'బిస్మిల్లాహ్' పలికి పని ప్రారంభించాను. "లిజన్నహ్"లో నా బాధ్యతల దృష్ట్యా నేనీ పనిని పూర్తి ఏకాగ్రతతో నిర్వహించలేకపోయాను. మొదటి నుంచి ఆఖరి వరకు ఎన్నో అడ్డంకులు ఎదురయ్యాయి."లిజన్నహ్"లోని బోధకులకు సంబంధించిన ఆఫీసు పనులు అడ్డం రాసాగాయి. అంతేకాక ఇతర పుస్తకాల అనువాదాలు మరియు బోధనా వ్యాసాల సంగ్రహణ కార్యాలు కూడా నిర్వహించబడుతూ వుండేవి.

ఆఖరికి, అల్లాహ్ కృపానుగ్రహాల మూలంగా 50 ప్రసంగాలు కలిగిన రెండు సంపుటాలు ముద్రణ కోసం తయారు చేయబడ్డాయి. అల్‌హమ్దు లిల్లాహి అలా జాలిక.

## "జాదుల్ ఖతీబ్" నందు మా దృక్పథం

1) నేనొక మంచి వక్తను కానని నాకు తెలుసు. అందుకే నేను ప్రసంగ విషయాలకు సంబంధించి వీలైనంత ఎక్కువగా జ్ఞాన సామగ్రిని సమకూర్చడానికి ప్రయత్నించాను. తద్వారా వక్తలు – ఆ సామగ్రి నుండి తమకిష్టమైన దానిని ఎన్నుకోగలగాలని.

2) కొందరు వక్తలు, ఈ పుస్తకం తీరు ప్రసంగ తీరులా లేదని భావించవచ్చు. నేను కూడా వారి ఈ అభిప్రాయంతో ఏకీభవించగలను. కానీ, అసలు విషయం ఏమిటంటే – పుస్తక సంకలన ఉద్దేశ్యం, వక్తలకు ప్రసంగం తీరును నేర్పడం కాదు. అసలు ఉద్దేశ్యం ఏమిటంటే– వక్తలకు జ్ఞానపూరిత సామగ్రిని సమకూర్చడం. తద్వారా వక్తలు, తమదైన శైలిలో దానిని ప్రస్తావించడం. అందుకే దీని పేరు 'జాదుల్ ఖతీబ్' (బోధకుల సామగ్రి) అని నిర్ణయించడం జరిగింది.

3) ఈ ముఖ్యమైన పనిని ఆరంభించినప్పుడు నేను మొదట – ప్రతి ప్రసంగం 10 పేజీలకు తక్కువ కాకుండా 15 పేజీల కన్నా ఎక్కువగా కాకుండా వుండాలని భావించాను. కానీ తర్వాత, దానిపై నిలకడగా వుండలేక

పోయాను మరియు ప్రసంగాలు కూడా చాలా పొడుగైపోయాయి. అయినప్పటికీ దీనిని నేను ఒక కోణం దృష్ట్యా వ్యర్థమని భావించలేదు. అదేమిటంటే – భారత్, పాకిస్తాన్‌లలో సాధారణంగా వక్తలు ఇచ్చే ప్రసంగాలు కొంచెం పొడుగే వుంటాయి. అందుకే వక్తలు ఈ సామగ్రిని ఒకటికన్నా ఎక్కువ ప్రసంగాల కోసం విభజించుకొని ఎన్నో శుక్రవారాలు ప్రసంగించవచ్చు.

4) శుక్రవారం నాడు రెండు ఖుత్బాలు వుంటాయి. కాబట్టి ప్రతి ప్రసంగానికి మొదటి ఖుత్బా, రెండవ ఖుత్బా అని రెండు భాగాలుగా విభజించడం జరిగింది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ కూడా ఇదే. ఆయన రెండు ఖుత్బాలు ఇచ్చేవారు మరియు రెండిట్లోనూ హితబోధ చేసేవారు.

5) మొదటి సంపుటంలో ప్రసంగాలు, సంవత్సర కాలానికి సంబంధించినవిగా ప్రత్యేకించబడగా, రెండవ సంపుటంలో వేరే ఇతర విషయాలకు సంబంధించిన ప్రసంగాలు చేర్చబడ్డాయి.

మొదటి సంపుటంలో గల విషయాల వివరాలు ఇలా వున్నాయి.

## మొహర్రం నెల :

1) మొహర్రం నెల మరియు ఆషూరా దినం.

2) సహాబాల (ప్రవక్త సహచరులు) మహత్యం.

3) మదీనాకు వలస (హిజ్రత్).

మొహర్రం నెలలో –ఈ నెల గురించి మరియు ఆషూరా దినం గూర్చి శుక్రవారం ఖుత్బా ఇవ్వడం తప్పనిసరి. ఇక ప్రవక్త సహచరుల మహత్యం విషయాని కొస్తే – పాఠకులకు తెలిసే వుంటుంది – కొంతమంది ఈ నెలలో ప్రవక్త సహచరులను లక్ష్యంగా చేసుకుంటారు. అందుకే ఈ నెలలో ఈ విషయాన్ని చేర్చడం జరిగింది. హిజ్రత్ (వలస) వంటి మహత్తర సంఘటన 'రబీ ఉల్ అవ్వల్' నెలలో సంభవించి నప్పటికీ, హిజ్రీ శకం ఆరంభం మొహర్రం నెలతో అవుతుంది గనక ఈ విషయాన్ని కూడా దీనిలో చేర్చడం జరిగింది.

## సఫర్ నెల :

1) సఫర్ నెల మరియు దుశ్శకునాలు.

## రబీ ఉల్ అవ్వల్ నెల:

1) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మహత్యం, అధ్భుతాలు మరియు ప్రత్యేకతలు.
2) మిలాదున్నబీ ఉత్సవం మరియు షరీయత్తులో దాని స్థానం.
3) అనుచర సమాజం (ఉమ్మత్) పై దైవప్రవక్త హక్కులు.
4) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి అత్యుత్తమ గుణగణాలు, నడవడిక.

## రజబ్ నెల :

1) రజబ్ నెలకు సంబంధించిన నూతనాచారాలు (బిద్దత్‌లు).
2) మేరాజ్ యాత్ర.
3) మేరాజ్ బహుమతి.... ఐదు పూటల నమాజు.

మేరాజ్ సంఘటన – ఒక అన్వేషణ ప్రకారం ఇది రబీఉల్ అవ్వల్ నెలలో జరిగిందని చెప్పబడినప్పటికీ, ఇది రజబ్ నెలలో సంబంధించిందన్న విషయం బాగా ప్రాచుర్యం పొందడం వల్ల ఈ విషయాన్ని ఈ నెల ప్రసంగాల్లో చేర్చడం జరిగింది. మరి నమాజ్, మేరాజ్ బహుమతి గనుక దీనిని గూర్చి మేరాజ్ ప్రసంగం తర్వాత ప్రస్తావించడం ఎంతో శ్రేయస్కరం.

## షాబాన్ నెల:

1) షాబాన్ నెల మహత్యం మరియు దీనికి సంబంధించిన ఆజ్ఞలు
2) అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం మరియు జకాత్

మొదటి ఖుత్బాలో షాబాన్ నెల మహత్యంతోపాటు, షాబాన్ నెల 15వ రాత్రికి సంబంధించి కొన్ని ముఖ్యమైన విషయాలు చేర్చబడ్డాయి. చాలా మంది సాధారణంగా, ప్రతి సంవత్సరం విధిగా వుండే జకాత్‌ను షాబాన్ ఆఖర్లో లేక

రమజాన్ ఆరంభంలో లెక్కిస్తారు గనక సదఖా (దానం) మరియు జకాత్ విషయాన్ని ఈ నెలలో చేర్చడం సబబుగా అనిపించింది.

## శుభప్రద రమజాన్ నెల:

1) పవిత్ర రమజాన్ నెల పుణ్యాల వసంతం

2) దివ్య ఖుర్‌ఆన్ మహాత్యం

3) తౌబా మరియు అస్తగ్ఫార్

4) రమాజన్ మాసపు ఆఖరి పది రోజులు

## షవ్వాల్ నెల:

1) ఈదుల్ ఫితర్ ఖుత్బా

## జిల్‌ఖాదా నెల:

1) పవిత్ర హరమైన్ షరీఫైన్ మహత్యం

2) హజ్ మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదలు–1

3) హజ్ మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదలు–2

భారత్, పాకిస్తాన్‌లలో హజ్ యాత్రికులు జిల్ ఖాదా నెలలోనే మక్కాకు ప్రయాణమవుతారు గనక ఈ నెలలో హజ్‌కు సంబంధించిన విషయాలపైనే ప్రసంగించడం శ్రేయస్కరం.

## జిల్ హిజ్జ నెల:

1) జిల్ హిజ్జ నెల మొదటి పది రోజుల మహత్యం

2) ఈదుల్ అజ్హా ఖుత్బా

3) హజ్జతుల్ విదా ఖుత్బా–1

4) హజ్జతుల్ విదా ఖుత్బా–2

హజ్జతుల్ విదాలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎన్నో ముఖ్యమైన విషయాలను గూర్చి ప్రసంగించారు కనుక ఈదుల్ అజ్హా పండుగ

తర్వాత ఈ ఖుత్బా గురించి సవివరంగా ప్రస్తావించడం ఎంతో సబబు. అందుకే మేము ఈ ఖుత్బాను రెండు శుక్రవారాల విషయంగా చేశాము.

6) ప్రతి ఖుత్బా ఆరంభంలో దీనికి సంబంధించిన ముఖ్యమైన అంశాలను ప్రస్తావించడం జరిగింది. తద్వారా వక్తకు ప్రసంగం ఆరంభం నుండే తను చర్చించాల్సిన విషయాలు తెలిసివుంటాయి.

7) ప్రతి ఖుత్బా యందు చేర్చబడిన జ్ఞాన సామగ్రి సహజంగానే దివ్య ఖుర్ఆన్, హదీసులు మరియు వాస్తవిక సంఘటనలపై ఆధారపడి వుంది.

8) దివ్య ఖుర్ఆన్ ఆయతుల అనువాదం పలు అనువాదాలను ముందుంచి చేయ బడింది. ఉదాహరణకు మౌలానా ముహమ్మద్ జూనాగఢీ (రహిమహుల్లాహ్), మౌలానా అబ్దుర్రహ్మాన్ కైలానీ (రహిమహుల్లాహ్) మరియు డాక్టర్ లుక్మాన్ సలఫీ గార్ల అనువాదాలు.

9) కేవలం ప్రామాణిక హదీసులనే ప్రస్తావించాలని నేను అన్ని విధాలుగా ప్రయత్నించాను. దానికనుగుణంగా ఎక్కువ హదీసులు 'సహీహైన్' (బుఖారీ, ముస్లిం) మరియు సుననె అర్బాల నుండి సంగ్రహించబడ్డాయి.

ఒకవేళ ఏదైనా హదీసు సహీహైన్ లేదా వాటిలో ఏ ఒక్క దానిలో వున్నా దాని ఆధారం ఇచ్చి ఊరుకోవడం జరిగింది మరియు దాని పూర్తి విశ్లేషణ ఇవ్వబడలేదు. ఒకవేళ సుననె అర్బా లోని ఏదైనా సునన్‌లో వుంటే ఆ హదీసుకు ఖరారు చేసిన ప్రామాణికతను ప్రస్తావించడం జరిగింది.

నా దగ్గర వున్న సుననె అర్బా గ్రంథాలు 'మక్తబా అల్ మారూఫ్' ద్వారా ముద్రించబడ్డవి. వీటిలో ప్రతి హదీసుకు షేఖ్ అల్‌బానీ గారి ప్రామాణికత చేర్చబడి వుంది. అందుకే నేనెక్కడైనా ఈ గ్రంథాల ఆధారం ఇస్తే దాని తర్వాత 'సహీ–అల్‌బానీ' అని లేదా 'హసన్–అల్‌బానీ' అని పేర్కొన్నాను. దీని ఉద్దేశ్యం "గ్రంథాల అన్వేషణలో ఇమామ్ అల్‌బానీ ఆ హదీసును సహీ లేదా హసన్ గా ఖరారు చేశారు" అని చెప్పడం తప్ప మరొకటి కాదు. అలాగే హదీసు సుననె అర్బాలో కాకుండా వేరే గ్రంథాలలో వుంటే వేర్వేరు పుస్తకాల నుండి తీసుకొని ప్రస్తావించడం జరిగింది. అలా అని, నేనీ పుస్తకంలో కేవలం షేఖ్ అల్‌బానీ, సహీ లేదా హసన్

అని నిర్ధారించిన హదీసులనే చేర్చలేదు. ఎందుకంటే కొన్నిసార్లు ఒక హదీసు షేఖ్ అల్‌బానీ దృష్టిలో బలహీనమైనదై ఉంటుంది, కానీ, కొంతమంది ముందు తరాల సజ్జనులు దాని ప్రామాణికతను నిర్ధారించి వుంటారు. అందుకే మీకీ పుస్తకంలో షేఖ్ అల్‌బానీ గారి ప్రమాణికత పేర్కొనబడని కొన్ని హదీసులు (అవి చాలా తక్కువ) కూడా దొరుకుతాయి.

10) ఇన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ, ఇదొక మానవ ప్రయత్నమే కనుక ఇందులో తప్పులు కూడా దొర్లే అవకాశముంది. ఒకవేళ ఇందులో ఏదైనా సరైన విషయం వుంటే అది అల్లాహ్ అనుగ్రహం మూలంగానే వుంది మరియు ఏదైనా తప్పు దొర్లి వుంటే నా వైపు నుండి మరియు షైతాన్ వైపు నుండి జరిగింది. దీనికి గాను నేను అల్లాహ్‌ను క్షమించమని వేడుకుంటున్నాను మరియు ఈ ప్రయత్నాన్ని స్వీకరించమని కోరుకుంటున్నాను. ఆమీన్.

ఈ ఖుత్బాలు, సహజంగానే, వక్తలు, బోధకులు మరియు జ్ఞానుల చేతుల్లోకి వచ్చినపుడు, ఈ పుస్తకంలో దొర్లిన తప్పులు ఏవైనా (ముద్రణ పరంగా కానీ లేదా జ్ఞానపరంగా కానీ) వుంటే, వాటిని గూర్చి నాకు తెలియజేసే వారికి కృతజ్ఞుడిగా వుంటాను. తద్వారా రాబోయే ఎడిషన్లలో వాటిని సరిదిద్దే అవకాశముంది.

వ జజాకుముల్లా ఖైరా!

# మొహర్రం మాసపు ఖుత్బాలు

1) మొహర్రం నెల మరియు ఆషూరా దినం – మహత్యం మరియు ఆదేశాలు.

2) సహాబా (ప్రవక్త సహచరులు)ల మహత్యం

3) మదీనాకు వలస (హిజ్రత్) – దాని సంఘటనలు

# మొహర్రం నెల మరియు ఆషూరా దినం

## ముఖ్యమైన అంశాలు

1) మొహర్రం మాసం ప్రాధాన్యత
2) నాలుగు నిషిద్ధ మాసాలు మరియు వాటి ప్రత్యేక ఆదేశాలు
3) దుష్కార్యాల ప్రభావాలు
4) మొహర్రం నెలలో శోక గీతాలాపన (నోహా) మరియు హాహాకారాలు (మాతం) చేయడం.
5) హుస్సేన్ (రజి అల్లాహు అన్హు) వీర మరణం
6) మొహర్రం మాసం మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులు
7) మొహర్రం మాసంలో ఉపవాసం ప్రాధాన్యత
8) చరిత్రలో ఆషూరా దినం ప్రాధాన్యత
9) ఆషూరా దినపు ఉపవాసం ప్రాధాన్యత మరియు మహత్యం

## మొదటి ఖుత్బా

ప్రియమైన శ్రోతలారా! మొహర్రం మాసం ఒక మహోన్నతమైన పవిత్ర మాసం. ఇది హిజ్రీ సంవత్సరపు మొదటి మాసం అవడమే గాక, నిషేధిత నాలుగు మాసాల్లో ఒకటి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

اِنَّ عِدَّةَ الشُّهُوْرِ عِنْدَ اللّٰهِ اثْنَا عَشَرَ شَهْرًا فِيْ كِتٰبِ اللّٰهِ يَوْمَ خَلَقَ السَّمٰوٰتِ وَ الْاَرْضَ
مِنْهَآ اَرْبَعَةٌ حُرُمٌ ؕ ذٰلِكَ الدِّيْنُ الْقَيِّمُ ۙ فَلَا تَظْلِمُوْا فِيْهِنَّ اَنْفُسَكُمْ

**"యథార్థం ఏమిటంటే, ఆకాశాన్నీ భూమినీ అల్లాహ్ సృష్టించినప్పటి నుండీ, మాసాల సంఖ్య అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. వాటిలో నాలుగు నిషిద్ధ మాసాలు. ఇదే సరైన ధర్మం. కనుక ఈ నాలుగు మాసాల్లో మీకు మీరు అన్యాయం చేసుకోకండి."** *(తౌబా: 36)*

అంటే – భూమ్యాకాశాలు సృష్టించబడినప్పటి నుండి అల్లాహ్ దృష్టిలో సంవత్సరపు మాసాల సంఖ్య పన్నెండు మాత్రమే. అందులో నాలుగు మాసాలు నిషిద్ధ మాసాలు.

మరి ఆ నిషిద్ధ మాసాలు ఏవి?

దీనికి సంబంధించిన ఒక హదీసు వినండి!

అబూ బక్ర (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"సంవత్సరం పన్నెండు మాసాలు కలిగి వుంది. వీటిలో నాలుగు నిషిద్ధ మైనవి. వాటిలో మూడు మాసాలు ఒకదాని తర్వాత మరొకటి వస్తాయి. అవి జిల్ ఖాదా, జిల్ హిజ్జ మరియు మొహర్రం మాసాలు కాగా నాల్గవది జమాదిస్సానీ మరియు షాబాన్ మాసాల మధ్య వచ్చే రజబ్ మాసం."

*(సహీ బుఖారీ, తఫ్సీర్– బాబ్ సూరహ్ తౌబా)*

మూడు మాసాలేమో ఒకదాని తర్వాత మరొకటి. నాల్గవది ఒంటరిది. దీనిలో దాగివున్న మర్మం ఏమిటి?

హాఫిజ్ ఇబ్నె కసీర్ దీనిలోగల మర్మాన్ని గూర్చి ఇలా వివరించారు:

హజ్ మాసానికి ముందు వచ్చే జిల్ ఖాదా మాసంలో వారు (అప్పటి ప్రజలు) యుద్ధం చేయడాన్ని పరిత్యజించేవారు. తదుపరి జిల్‌హిజ్జ మాసంలో హజ్ చేసేవారు. ఆ తర్వాత, ప్రజలు శాంతియుతంగా తమ తమ ప్రదేశాలకు వెళ్ళగలిగేందుకుగాను ఆ తర్వాతి నెల కూడా నిషిద్ధం గావించబడింది. తదుపరి, సంవత్సరపు మధ్య కాలంలో ఇంకో నెల నిషిద్ధం గావించబడింది. తద్వారా ప్రజలు ఉమ్రాహ్ మరియు బైతుల్లాహ్ దర్శనానికి శాంతియుతంగా వెళ్ళి రాగలగడానికి. *(తఫ్సీర్ ఇబ్నె కసీర్ : 2/468)*

ప్రియ శ్రోతలారా!

అల్లాహ్ ఈ ఆయతులో నిషిద్ధ మాసాలను గూర్చి వివరించిన తర్వాత "ఈ మాసాలలో మీరు అన్యాయం చేసుకోకండి" అని సెలవిచ్చాడు. అన్యాయం, దౌర్జన్యం అనేవి సంవత్సరం పొడుగునా వారించబడినప్పటికీ ఈ నాలుగు మాసాల గౌరవ, పవిత్రతల దృష్ట్యా అల్లాహ్ ప్రత్యేకంగా వీటిలో తమ ప్రాణాలపై దౌర్జన్యం చేసుకోవడాన్ని వారించాడు.

ఈ అన్యాయం, దౌర్జన్యం అంటే అర్థం ఏమిటి?

దీని ఒక అర్థం ఏమిటంటే – 'ఈ మాసాలలో యుద్ధాలు, ఒకర్నొకరు చంపుకోవడాలు చేయకండి' అని.

దీన్ని సమర్థిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَسْئَلُوْنَكَ عَنِ الشَّهْرِ الْحَرَامِ قِتَالٍ فِيْهِ ۭ قُلْ قِتَالٌ فِيْهِ كَبِيْرٌ

**"నిషిద్ధ మాసంలో యుద్ధం చేయడాన్ని గురించి ప్రజలు నిన్ను అడుగుతారు. వారికిలా సమాధానం చెప్పు : ఆ మాసంలో యుద్ధం చెయ్యటం మహాపాపమే."** ***(బఖర : 217)***

అజ్ఞానపు కాలంలో కూడా ప్రజలు ఈ నాలుగు మాసాలను నిషిద్ధమైనవిగా భావించి వాటిలో యుద్ధాలు చేయడాన్ని విడనాడేవారు. తదుపరి ఇస్లాం కూడా వాటి పవిత్రతను యధావిధిగా వుంచి, వాటిలో యుద్ధం చేయడాన్ని మహాపాపంగా ఖరారు చేసింది.

ఇక దౌర్జన్యం యొక్క అర్థం ఏమిటంటే – ప్రత్యేకంగా ఈ నాలుగు మాసాలలో మీరు అల్లాహ్ అవిధేయతకు దూరంగా వుండండి. ఎందుకంటే, వీటిలో 'అవిధేయత పాపం' ఎన్నో రెట్లు పెరిగిపోతుంది.

హాఫిజ్ ఇబ్నె కసీర్– ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఇలా ఉల్లేఖించారు: అల్లాహ్, దౌర్జన్యాన్ని సంవత్సరపు పన్నెండు మాసాల్లోనూ నిషేధించాడు. తదుపరి నాలుగు మాసాలను వాటిలో ప్రత్యేకంగా ఖరారు చేశాడు. ఎందుకంటే – వీటిలో చెడు, అవిధేయతల పాపం పెరుగుతుంది మరియు మంచి, సదాచరణల పుణ్యం కూడా ఎన్నో రెట్లు పెరుగుతుంది.

ఇమామ్ ఖతాదా (రహిమహుల్లాహ్) అల్లాహ్ ఆదేశం – "ఈ మాసాలలో మీరు దౌర్జన్యం చేసుకోకండి." గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా వివరించారు:

దౌర్జన్యపు పాపం ఎల్లప్పుడూ ఎక్కువగా వున్నప్పటికీ ప్రత్యేకంగా నిషిద్ధ మాసాలలో దీని పాపం మరియు బరువు ఇతర మాసాలలో కన్నా ఎన్నో రెట్లు పెరిగిపోతుంది.

దైవదూతలలో కొందరిని ప్రత్యేకంగా సందేశహరులుగా, గ్రంథాల్లో దివ్య ఖుర్ఆన్‌ను, యావత్ భూమిలో మసీదులను, అలాగే మాసాలలో రమజాన్

నెలను నిషిద్ధ మాసాలతోపాటు ఎన్నుకున్నట్లే, దినాలలో శుక్రవారాన్నీ, రాత్రుల్లో లైలతుల్ ఖద్ర్‌ను అల్లాహ్ ఎన్నుకున్నట్లే, ఏ మాసంలో పాప ఫలాన్ని అధికంగా చేయాలో మరియు దేనికి గొప్పతనం ప్రసాదించాలో పూర్తిగా అతని ఇష్టం. అందుకే, అల్లాహ్ దేన్నైతే గొప్పదిగా భావించాడో మీరు కూడా దానిని గొప్పదిగా భావించండి. *(తఫ్సీర్ ఇబ్నె కసీర్–2/468)*

ముస్లిం సోదరులారా!

సంవత్సరం పొడుగునా, ప్రత్యేకించి ఈ నాలుగు మాసాల్లో మనం అల్లాహ్ అవిధేయత నుండి దూరంగా వుండాలి మరియు పాపకార్యాలను త్యజించాలి. ఎందుకంటే – అవిధేయత మరియు పాపకార్యాల మూలంగా హృదయాలకు తప్పుపట్టుతుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

كَلَّا ۖ بَلْ ۜ رَانَ عَلَىٰ قُلُوبِهِم مَّا كَانُوا يَكْسِبُونَ ۝

**“ఎంతమాత్రంకాదు, అసలు వారి హృదయాలకు వారి దుష్కార్యాల తుప్పు పట్టింది.”** ***(ముతఫ్ఫిఫీన్ : 14)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు:

విశ్వాసి ఏదైనా దుష్కార్యం చేసినప్పుడు అతని హృదయంలో ఒక నల్లటి మచ్చ ఏర్పడుతుంది. తదుపరి, ఒకవేళ అతను పశ్చాత్తాపం చెంది, ఆ దుష్కార్యాన్ని త్యజించి, క్షమించమని (అల్లాహ్‌ను) వేడుకుంటే, అతని హృదయాన్ని శుభ్రం చేయడం జరుగుతుంది. ఒకవేళ అతను ఒక దుష్కార్యం తర్వాత మరో దుష్కార్యాన్ని చేస్తూ పోతూ వుంటే, అతని హృదయంలోని నల్లటి మచ్చ పెరుగుతూ పోయి చివరికి పూర్తి హృదయాన్ని ఆక్రమించు కుంటుంది.

దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ సెలవిచ్చిన – “వారి హృదయాలకు వారి దుష్కార్యాల తుప్పు పట్టింది” అన్న దానికి వివరణ ఇదే.

*(తిర్మిజి : 3334 – హసన్ సహీ, ఇబ్నెమాజా:4244, హసన్ – అల్‌బానీ)*

బాగా గుర్తుంచుకోండి!

దుష్కార్యాల మూలంగా జీవితం ఎంతో మనో వ్యథతో గడుస్తూ

వుంటుంది మరియు వాస్తవిక సుఖశాంతులు మనిషికి కరువైపోతాయి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَنۡ اَعۡرَضَ عَنۡ ذِكۡرِىۡ فَاِنَّ لَهٗ مَعِيۡشَةً ضَنۡكًا وَّنَحۡشُرُهٗ يَوۡمَ الۡقِيٰمَةِ اَعۡمٰى ﴿124﴾
قَالَ رَبِّ لِمَ حَشَرۡتَنِىۡۤ اَعۡمٰى وَقَدۡ كُنۡتُ بَصِيۡرًا ﴿125﴾ قَالَ كَذٰلِكَ اَتَتۡكَ اٰيٰتُنَا فَنَسِيۡتَهَا ۚ
وَكَذٰلِكَ الۡيَوۡمَ تُنۡسٰى ﴿126﴾

**"నా జ్ఞాపిక (సంస్మరణము)కు విముఖుడైన వానికి ప్రపంచంలోజీవితం ఇరుకవుతుంది. ప్రళయం నాడు మేము అతనిని అంధుడుగా లేపుతాము. అప్పుడు అతడు– ప్రభూ! ప్రపంచంలో నేను చూడగలవాణ్ణి కదా! నన్ను ఇక్కడ అంధునిగా ఎందుకు లేపావు? అని అడుగుతాడు. అల్లాహ్ ఇలా సెలవిస్తాడు: మా ఆయతులు నీ వద్దకు వచ్చినప్పుడు నీవు వాటిని విస్మరించావు. అదే విధంగా ఈనాడు నీవు విస్మరించబడుతున్నావు."**

*(తాహా : 124–126)*

అంటే – దైవధర్మానికి దూరంగా వుంటూ, దివ్య ఖుర్ఆన్ ఆయతులు పఠించకుండా, వాటికనుగుణంగా ఆచరించకుండా వున్న కారణానికి గాను నలువైపుల నుండి అతని జీవితం ఇరుకైపోతుంది. జీవనోపాధి పుష్కలంగా వున్నప్పటికీ, వాస్తవిక సంతృప్తి మరియు సుఖశాంతులు కరువైపోతాయి. మరణానంతరం సమాధి కూడా ఇరుకైపోతుంది. తదుపరి సమాధి జీవితం కూడా అత్యంత ఘోర కష్టాల్లో గడుస్తుంది. చివరికి ప్రళయం నాడు లేపబడినప్పుడు అతను దృష్టిపరంగా మరియు బుద్ధిపరంగా రెండిట్లోనూ అంధుడిగా లేపబడుతాడు.

అల్లాహ్ వీటి నుండి మనల్ని రక్షించుగాక!

దుష్కార్యాలు, పాపాల మూలంగా ప్రసాదించబడ్డ అనుగ్రహాలు కూడా లాక్కోబడతాయి మరియు రాబోయే అనుగ్రహాలు కూడా ఆపివేయబడతాయి. మన తల్లిదండ్రులు ఆదమ్ (అలైహిస్సలాం) మరియు హవ్వా (అలైహిస్సలాం)ల విషయంలో కూడా – వారి ఒక సాధారణ తప్పు కారణంగా వారిని స్వర్గపు అనుగ్రహాల నుండి దూరం చేయడం జరిగింది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَقُلْنَا يَٰٓـَٔادَمُ اسْكُنْ أَنتَ وَزَوْجُكَ الْجَنَّةَ وَكُلَا مِنْهَا رَغَدًا حَيْثُ شِئْتُمَا وَلَا تَقْرَبَا هَٰذِهِ
الشَّجَرَةَ فَتَكُونَا مِنَ الظَّٰلِمِينَ ﴿35﴾ فَأَزَلَّهُمَا الشَّيْطَٰنُ عَنْهَا فَأَخْرَجَهُمَا مِمَّا كَانَا فِيهِ

**"మేము ఆదమ్‌తో ఇలా అన్నాము: నీవూ నీ భార్య యిద్దరూ కలిసి స్వర్గంలో నివసించండి. ఇక్కడ మీరు మీకు ఇష్టమైన దానిని యథేచ్ఛగా తినండి. కానీ ఈ చెట్టు దరిదాపులకు పోవద్దు. ఒకవేళ పోతే, మీరు అతిక్రమణదారులలో కలిసిపోతారు. చివరికి షైతాను వారిద్దరినీ ఆ చెట్టు వైపునకు ఆకర్షించి మా ఆజ్ఞాపాలనం నుండి దూరం చేశాడు. వారిని వారు వుంటూ వున్న స్థితి నుండి తొలగించివేశాడు."**

*(బఖర : 35-36)*

ఇలాగే, దుష్కార్యాల మూలంగా కలిగే దుష్ఫలితాలను గురించి తెలియ జేస్తూ ఇలా సెలవిచ్చాడు:

أَلَمْ يَرَوْا كَمْ أَهْلَكْنَا مِن قَبْلِهِم مِّن قَرْنٍ مَّكَّنَّٰهُمْ فِي الْأَرْضِ مَا لَمْ نُمَكِّن لَّكُمْ
وَأَرْسَلْنَا السَّمَآءَ عَلَيْهِم مِّدْرَارًا وَجَعَلْنَا الْأَنْهَٰرَ تَجْرِي مِن تَحْتِهِمْ فَأَهْلَكْنَٰهُم
بِذُنُوبِهِمْ وَأَنشَأْنَا مِنۢ بَعْدِهِمْ قَرْنًا ءَاخَرِينَ ﴿٦﴾

**"ఏమిటీ, మేము వీళ్ళకు పూర్వం ఎన్ని జాతులను నాశనం చేశామో మీరు చూడలేదా? ప్రపంచంలో మీకు ప్రసాదించని బలాన్ని మేము ఆ జాతులకు ప్రసాదించాము. వారికోసం మేము ధారాపాతంగా వర్షాన్ని కురిపించాము. వారికోసం క్రింద కాలువలు ప్రవహింపజేశాము. కానీ, వారి పాపాల మూలంగా మేము వారిని తుదముట్టించాం. వారి తర్వాత ఇతర జాతులను ప్రభవింపజేశాము." *(అన్ ఆమ్ : 6)***

ఈ ఆయత్‌పై కాస్త దృష్టి సారించండి! అల్లాహ్ సెలవిచ్చిందేమిటంటే – గత అనుచర సమాజాలకు మీ కన్నా ఎక్కువగా బలాధిక్యతలను ప్రసాదించి ఎన్నో విధాలుగా అనుగ్రహించడం జరిగింది. కానీ వారు కృతఘ్నులైన కారణంగా ఆ అనుగ్రహాలన్నీ వారి నుండి లాక్కోబడటమే గాక వారిని నాశనం కూడా చేయడం జరిగింది. ఒకవేళ మీరు కూడా ఇప్పుడు అదే పద్ధతి అవలంబిస్తే

మిమ్మల్ని నాశనం చేయడం మాకేమైనా కష్టమని అనుకొంటున్నారా? అని.

అందుకే, మనం అల్లాహ్ ప్రసాదించిన ఎన్నో అనుగ్రహాలకు గాను ఎల్లప్పుడూ కృతజ్ఞులై వుండాలి. దాని ఒక్కగా నొక్క స్వరూపం ఏమిటంటే – మనం అల్లాహ్‌కు విధేయులైన దాసులుగా మారాలి మరియు అవిధేయతకు దూరంగా వుండాలి.

ప్రియ శ్రోతలారా!

ఈ ప్రసంగం ఆరంభంలో మేము – అల్లాహ్ ప్రత్యేకంగా నిషిద్ధ మాసాల్లో తమ ప్రాణాలపై దౌర్జన్యం చేయడాన్ని నిషేధించడాని సెలవిచ్చివున్నాం. మొహర్రం మాసాన్ని దృష్టిలో వుంచుకొని ఇక్కడ రెండు విషయాలను గురించి వివరించడం తప్పనిసరి.

## 1) మొహర్రం నెల మరియు శోక గీతాలాపన

మీకు తెలిసే వుంటుంది– చాలా మంది మొహర్రం నెలలో, దు:ఖ సూచిత దుస్తులు ధరించి శోక గీతాలాపన చేస్తూ, ఏడ్పులు, పెడబొబ్బలు పెడుతూ ఛాతీని బాదుకోవడం చేస్తూ వుంటారు.

మా దృష్టిలో ఇది కూడా నిషేధించబడ్డ దౌర్జన్యపు ఒక రూపమే. ఈ కార్యాలనుద్దేశించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా సెలవిచ్చారు:

"అజ్ఞానకాలం నాటి నాలుగు ఆచరణలను ఈ అనుచర సమాజం విడనాడడానికి సిద్ధంగా ఉండదు. తమ వంశంపై గర్వపడడం, ఇతరుల వంశాన్ని తక్కువగా భావించడం, నక్షత్రాల ద్వారా అదృష్టాన్ని తెలుసుకోవడం (లేదా వాటి ద్వారా వర్షాన్ని అర్థించడం) మరియు శోకగీతాలాపనలు చేయడం."

*(సహీ ముస్లిం – అల్ జనాయెజ్ : 936)*

ఇంకా ఈ విధంగా కూడా ఉద్బోధించారు:

"శోక గీతాలాపన చేసే స్త్రీ తన మరణానికి ముందు గనక తౌబా (పశ్చాత్తాపం) చెందకపోతే, ప్రళయం రోజు తన శరీరంపై గజ్జి, దురద వ్యాపించి వుండగా, గంధకపు వస్త్రాలు ధరించి వున్న స్థితిలో లేపబడుతుంది."

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే – శోక గీతాలాపనలు వగైరా... చేయడం అనేవి అజ్ఞానపు చేష్టలు మరియు ఇస్లాంతో వీటికేమాత్రం సంబంధం లేదు. అందుకే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శోకగీతాలాపన ... వగైరా...లాంటి పనులు చేసే వ్యక్తితో తనకే మాత్రం సంబంధం లేదని ప్రకటిస్తూ ఇలా పేర్కొన్నారు:

"తన చెంపలను బాదుకొనేవాడు, వస్త్రాలను చింపుకొనేవాడు, అజ్ఞాన కాలపు కార్యాలను గూర్చి ఘనంగా చర్చించేవాడు, కష్ట సమయాల్లో వినాశనాన్ని, మరణాన్ని కోరుకునేవాడు మాలోని వాడు కాడు."

*(సహీ బుఖారీ – అల్ జనాయెజ్ : 1294)*

అబూ దర్ద బిన్ అబూ మూసా అష్అరీ (రజి అల్లాహుఅన్హు) కథనం : అబూ మూసా అష్అరీ ఓసారి తీవ్ర అనారోగ్యానికి గురై మూర్ఛపోయినట్లు అయిపోయారు. ఆయన తల ఆయన సతీమణుల్లో ఒకరి ఒడిలో వుంది. (ఈ స్థితిని చూసి) అమె పెద్దగా ఏడ్వడం ఆరంభించింది. కానీ ఆయన మాత్రం ఆమెకు జవాబు ఇవ్వలేకపోయారు. కాసేపటికి, కాస్త కుదుటపడ్డాక, ఆమె నిర్వాకం చూసి ఇలా సెలవిచ్చారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విముక్తి ప్రకటించుకున్న ప్రతి వ్యక్తితో నేను కూడా విముక్తుణ్ణి. నిస్సందేహంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టే, దు:ఖ, విచార ఘడియల్లో తల గొరికించుకునే మరియు వస్త్రాలు చింపుకొనే స్త్రీ నుండి విముక్తిని ప్రకటించుకున్నారు.

*(సహీ బుఖారీ – అల్ జనాయెజ్ : 1296, ముస్లిం : 1167)*

ఈ హదీసుల ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడం, ఛాతీని బాదుకోవడం.... లాంటి పనులు పూర్తిగా నిషేధించబడ్డాయి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ పనులను, వీటిలో లిప్తమైవున్న వారిని గూర్చి తనను తాను పూర్తిగా విముక్తుడిగా, ఏ మాత్రం సంబంధం లేని వానిగా ప్రకటించుకున్నారు.

కనుక ముస్లిములందరూ ఇలాంటి దుష్కార్యాలను గూర్చి జాగ్రత్తపడాలి. మరియు (ఒకవేళ లిప్తమై వుంటే) వెంటనే వీటిని మన:పూర్వకంగా త్యజించాలి.

ప్రియ శ్రోతలారా!

మొహర్రం మాసంలో శోక గీతాలాపన మరియు ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడం అనేవి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి మనవడు హుస్సేన్ (రజి అల్లాహు అన్హు) వీర మరణం దృష్ట్యా దుఃఖంలో చేస్తూ వుంటారు.

ఆయన వీరమరణంపై దుఃఖించని, విచారపడని వ్యక్తి ఎవరున్నారు చెప్పండి? నిశ్చయంగా ప్రతి ముస్లింకు ఈ విషయంలో దుఃఖం కలుగుతుంది. కానీ, ప్రతి దుఃఖ, విచార ఘడియల్లో ఎలాగైతే సహనం పాటించాలో హుస్సేన్ (రజి అల్లాహు అన్హు) వీరమరణంపై కూడా అదే విధంగా సంయమనం పాటించాలి. అంతేగాని, శోక గీతాలాపన, ఛాతీని బాదుకోవడం, ఏడ్పులు పెడబొబ్బలు పెట్టడం వంటి అజ్ఞానపు చేష్టలు మాత్రం చేయకూడదు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَ لَنَبْلُوَنَّكُمْ بِشَيْءٍ مِّنَ الْخَوْفِ وَ الْجُوْعِ وَ نَقْصٍ مِّنَ الْاَمْوَالِ وَ الْاَنْفُسِ وَ الثَّمَرٰتِ
وَبَشِّرِ الصّٰبِرِيْنَ ﴿۱۵۵﴾ الَّذِيْنَ اِذَآ اَصَابَتْهُمْ مُّصِيْبَةٌ قَالُوْٓا اِنَّا لِلّٰهِ وَ اِنَّآ اِلَيْهِ رٰجِعُوْنَ ﴿۱۵۶﴾
اُولٰٓئِكَ عَلَيْهِمْ صَلَوٰتٌ مِّنْ رَّبِّهِمْ وَ رَحْمَةٌ وَ اُولٰٓئِكَ هُمُ الْمُهْتَدُوْنَ ﴿۱۵۷﴾

**"భయ ప్రమాదాలకు, ఆకలి బాధకు, ధన ప్రాణ ఆదాయాల నష్టానికి గురి చేసి మేము మిమ్మల్ని తప్పకుండా పరీక్షిస్తాము. ఈ పరిస్థితులలో మన:స్థయిర్యంతో వుండేవారు, కష్టకాలం దాపురించినపుడు 'మేమంతా అల్లాహ్‌కే చెందిన వారము, అల్లాహ్ వైపునకే మరలిపోవలసినవారము' అని అనేవారికి శుభవార్తలు తెలుపు. వారిపై వారి ప్రభువు దయానుగ్రహాలు, కారుణ్యం వున్నాయి. సన్మార్గాన్ని పొందిన వారు కూడా వీరే."**

***(బఖర : 155-157)***

సహనం పాటించే వారికి అల్లాహ్ లెక్కలేనంతగా అనుగ్రహిస్తాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاسِعَةٌ ط اِنَّمَا يُوَفَّى الصّٰبِرُوْنَ اَجْرَهُمْ بِغَيْرِ حِسَابٍ ⑩

**"సహనం వహించే వారికి లెక్కలేనంత పుణ్యఫలం ప్రసాదించ బడుతుంది."** *(జుమర్ : 10)*

హుస్సేన్ (రజి అల్లాహు అన్హు) ఒక విశిష్టమైన సహాబి (దైవ ప్రవక్త (స) సహచరుడు) అవడంలో ఏ మాత్రం సందేహం లేదు. ఆయన మహత్యం గురించి చెప్పాలంటే –ఆయన దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి చిన్న మరియు ప్రియ కూతురైన ఫాతిమా (రజి అల్లాహు అన్హ) పుత్రులు అన్న ఒక్క విషయమే చాలు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఆయన మరియు హసన్ (రజి అల్లాహు అన్హు) అంటే వల్ల మాలిన ప్రేమాభిమానాలు వుండేవి.

అతా బిన్ యసార్ (రహిమహుల్లాహ్) కథనం: ఒక సహాబీ (ప్రవక్త సహచరుడు) నాకు తెలియజేసిన విషయమేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హసన్ మరియు హుస్సేన్ (రజి అల్లాహు అన్హుమ్)లను తన ఛాతీతో హత్తుకొని ఇలా అన్నారు: ఓ అల్లాహ్! వీరిద్దరినీ నేను ప్రేమిస్తు న్నాను. కనుక నీవు కూడా వీరిని ప్రేమించు.

*(ముస్నద్ అహ్మద్ – 38వ సంపుటం – 211 పేజీ, నెం. 23133 – సహీ పరంపరతో, తిర్మిజి – బరా బిన్ ఆజిబ్ ఉల్లేఖనం –3782, అస్సహీహ అల్‌బానీ : 2789)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇంటి నుండి బయలుదేరి మా వద్దకు విచ్చేశారు. ఆయనతో పాటు హసన్, హుస్సేన్ (రజి అల్లాహు అన్హుమ్)లు కూడా వున్నారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఓసారి ఒకర్ని ముద్దాడితే మరోసారి ఇంకొకర్ని ముద్దాడేవారు. ఇదిచూసి ఓ వ్యక్తి ఇలా ప్రశ్నించాడు: ఓ దైవప్రవక్తా! మీరు వారిని ప్రేమిస్తారా? దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్పందిస్తూ– ఎవరైతే వీరిని ప్రేమిస్తారో వారు నన్ను ప్రేమించినట్లు. ఇక ఎవరైతే వీరి పట్ల ద్వేషం కలిగి ఉంటారో వారు నా పట్ల కూడా ద్వేషం కలిగి వున్నట్లే.

*(అహ్మద్: 15వ సంపుటం, 42వ పేజీ, నెం.9673 మరియు 13వ సంపుటం, 26వ పేజీ, నెం.: 7876, ఇబ్నెమాజా సంక్షిప్తం : 143, హసన్ –అల్‌బానీ)*

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఇద్దరు మనువళ్ళను ఎంత గాఢంగా ప్రేమించే వారంటే – తన ప్రసంగాన్ని సయితం ఆపి వారిని

లేపడానికి మింబర్ దిగి వచ్చి వారిని లేపి, తిరిగి మింబర్ (వేదిక) పైకి వెళ్ళి తన ప్రసంగాన్ని పూర్తి చేసేవారు.

బరీరా (రజి అల్లాహు అన్హు) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఓసారి ప్రసంగిస్తున్నారు. ఈ తరుణంలో హసన్, హుస్సేన్ (రజి అల్లాహు అన్హుమ్)లు అక్కడికి విచ్చేశారు, వారు ఎరుపు రంగు చొక్కాలు ధరించి వున్నారు. వాటిలో వారు మాటిమాటికీ జారుతూ వున్నారు. ఇది గమనించిన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మింబర్ నుండి క్రిందికి దిగి ప్రసంగం ఆపేశారు. వారిద్దరినీ లేపి తన ఒడిలో కూర్చోబెట్టు కున్నారు. తదుపరి వారిని తీసుకొని మింబర్‌పై ఎక్కారు. తిరిగి మాట్లాడుతూ – "అల్లాహ్ సత్యం పలికాడు. నిశ్చయంగా మీ సంపద మరియు మీ సంతానం మీకొక పరీక్ష. నేను వారి స్థితిని చూసి ఆగలేకపోయాను." అని పలికి తదుపరి తన ప్రసంగాన్ని పూర్తిచేశారు.
*(అబూ దావూద్ : 1109, నసాయి : 1413, ఇబ్నెమాజా : 3600, సహీ – అల్‌బానీ)*

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు)తో – ఇహ్రాం స్థితిలో ఎవరైనా ఒక ఈగను చంపితే, దాని గురించి ఆదేశం ఏమిటి? అని అడగబడింది. దానికాయన ఇలా జవాబిచ్చారు: ఇరాక్ వాసులు ఈగను గూర్చి ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి వారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మనవడి హంతకులు! దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన మనవళ్ళ గురించి ఇలా సెలవిచ్చారు. "వీరిద్దరూ (హసన్, హుస్సేన్‌లు) ఈ ప్రపంచంలో నా రెండు పుష్పాలు." *(సహీ బుఖారీ : 3753, 5994)*

సునన్ తిర్మిజి లో ఈ హదీసు పదాలు ఇలా వున్నాయి:

ఇరాక్ వాసుల్లోని ఓ వ్యక్తి అబ్దుల్లా బిన్ ఉమర్ (రజిఅల్లాహు అన్హు)తో –దోమ రక్తం బట్టలపై అంటుకుంటే దాని గురించిన ఆదేశం ఏమిటి? అని ప్రశ్నించాడు. దానికాయన ఇలా బదులిచ్చారు. ఈ వ్యక్తిని చూడండి! ఇతను దోమ రక్తాన్ని గూర్చి ప్రశ్నిస్తున్నాడు: వాస్తవానికి వీరు (ఇరాక్ వాసులు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ప్రాణమైన ప్రియ మనవడిని హత్య చేశారు. నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నోట ఇలా

సెలవిస్తుండగా విన్నాను: "నిశ్చయంగా హసన్, హుస్సేన్‌లు ఈ లోకంలో నా రెండు పుష్పాలు." *(తిర్మిజి : 377, సహీ –అల్‌బానీ)*

హుజైఫా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: నిశ్చయంగా ఈ దైవదూత (మొదటిసారి) ఈ రాత్రే భూమిపైకి విచ్చేశాడు. గతంలో ఎప్పుడూ తను భూమిపైకి రాలేదు. అతను అల్లాహ్‌తో, నన్ను కలవాలని విన్నవించుకోగా, అల్లాహ్ తనకు ఈ శుభవార్తలు నాకిమ్మని చెప్పి పంపించాడు. అవేమిటంటే – ఫాతిమా (రజి అల్లాహు అన్హా) స్వర్గంలో స్త్రీల నాయకురాలిగా వుంటుంది మరియు హసన్, హుస్సేన్‌లు స్వర్గంలో యువకులకు నాయకులుగా వుంటారు.

*(తిర్మిజి: 3781, సహీ – అల్‌బానీ)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: హుస్సేన్ బిన్ అలీ (రజి అల్లాహు అన్హు) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను ఎక్కువగా పోలి వుండేవారు.

*(సహీ బుఖారీ : 3748)*

ప్రియ శ్రోతలారా!

ఈ హదీసులన్నింటిలోనూ, హసన్, హుస్సేన్ (రజి అల్లాహు అన్హుమ్)ల మహత్యం వివరించబడింది. ఈ హదీసులను దృష్టిలో వుంచుకొనే మేము వీరిద్దరిని ప్రేమిస్తాము మరియు వీరిని ప్రేమించడం విశ్వాసంలో అంతర్భాగం అని తలుస్తాము. అంతేగాక, హుస్సేన్ (రజిఅల్లాహు అన్హు) వీరమరణం ఒక దురదృష్టకరమైన, విచారకరమైన సంఘటన అని స్వీకరిస్తాం. కానీ, మేము దీని కోసం, శోకగీతాలాపన చేయడం, ఏడ్పులు పెడబొబ్బలు పెట్టడం, ఛాతీని బాదుకోవడం లాంటి చర్యలు చేయడాన్ని అనుచితంగానూ, నిషేధంగానూ భావిస్తాము. ఎందుకంటే – ఇంతకు ముందు వివరించినట్లు, స్వయంగా మన ప్రియ దైవప్రవక్తే (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలాంటి చర్యలను నిషేధించారు. కనుక, ఈ సంఘటనపై కేవలం సహనం పాటించడం మినహా మనకు వేరే మార్గం లేదు.

గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే– హుస్సేన్ (రజి అల్లాహు అన్హు) వీరమరణం గూర్చి జిబ్రాయీల్ (అలైహిస్సలాం) ముందే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు సూచించి వున్నారు.

ఉమ్మె సలమా (రజిఅల్లాహు అన్హా) కథనం : ఓసారి జిబ్రయీల్ (అలైహి స్సలాం) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు విచ్చేశారు. ఆ సమయంలో హుస్సేన్ (రజిఅల్లాహు అన్హు) నా దగ్గర వున్నారు. అకస్మాత్తుగా ఆయన ఏడ్వడం ప్రారంభించారు. నేనాయన్ని వదిలిపెట్టగా, ఆయన తిన్నగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికెళ్ళి కూర్చున్నారు. జిబ్రయీల్ (అలైహిస్సలాం) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో : ఓ ముహమ్మద్! మీరితన్ని ప్రేమిస్తారా? అని అడిగారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'అవునని' జవాబిచ్చారు. జిబ్రయీల్ (అలైహిస్సలాం) మాట్లాడుతూ : నిశ్చయంగా మీ అనుచర సమాజం అతి త్వరలో ఇతణ్ణి హత్య చేస్తుంది. మీరు కోరుకుంటే అతను హత్య చేయబడే స్థలం యొక్క మట్టిని మీకు చూపిస్తాను. తదుపరి ఆయన దానిని చూపించారు. అదే 'కర్బలా' అనే స్థలం.

*(అఖ్రజ అహ్మద్ ఫీ ఫజాయెల్ సహాబా - హసన్ పరంపరతో, 2వ సంపుటం, 782 పేజీ, నెం.1391)*

కనుక మేము, హుస్సేన్ (రజి అల్లాహు అన్హు) వీరమరణాన్ని అల్లాహ్ యొక్క విధి వ్రాత అని నమ్ముతాము. ఇలాగే హుస్సేన్ (రజిఅల్లాహు అన్హు) తండ్రి అయిన అలీ (రజిఅల్లాహు అన్హు) కూడా అల్లాహ్ విధి వ్రాత ప్రకారం వీరమరణం పొందారు. ఆయనైతే హిజ్రీ శకం 40వ సంవత్సరంలో రమజాన్ 17వ తేదీ నాడు, శుక్రవారం తెల్లవారుఝామున ఫజర్ నమాజు కోసం వెళు తుండగా వీరమరణం పొందారు!

ఇదే విధంగా, ఆయనకు ముందు, ఉస్మాన్ (రజిఅల్లాహు అన్హు)ను కూడా కొంతమంది దుర్మార్గులు కలిసి అతి భయంకరంగా తుదముట్టించారు. ఆయన హి.శ. 36వ సంవత్సరంలో జిల్‌హిజ్జ మాసపు, ఖుర్బానీ దినాలలో అమరగతులయ్యారు. ఆయన కన్నా ముందు, ఉమర్ (రజిఅల్లాహు అన్హు) కూడా ఫజర్ నమాజులో దివ్య ఖుర్ఆన్ పఠిస్తూ వీరమరణం పొందారు. వీరందరూ నిస్సందేహంగా హుస్సేన్ (రజి అల్లాహు అన్హు) కన్నా ఉత్తములు మరియు వీరి వీరమరణ వృత్తాంతాలు కూడా అత్యంత భయంకరంగా, విచారకరంగా వున్నాయి. కానీ ఈ సంఘటనలన్నింటిపై మనం "ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్" అని అనడం తప్ప ఇంకేం చేయగలం!

## 2) మొహర్రం మాసం మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులు

మొహర్రం మాసంలో ప్రత్యేకించి జరిగే దౌర్జన్యాలలో ఒకటి ఏమిటంటే – దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) శిష్యులైన సహాబాల గురించి చెడుగా పలకడం మరియు వారిని తిట్టి పోయడం. వాస్తవానికి ప్రవక్త సహచరులను గూర్చి చెడు పలకడం, వారిని దుర్భాషలాడడం అనేవి పూర్తిగా నిషేధించ బడ్డాయి.

ప్రవక్త సహచరులను గూర్చి 'అహ్లె సున్నత్ వల్ జమాత్' యొక్క విశ్వాసాన్ని గూర్చి వివరిస్తూ ఇమామ్ తహావి (రహిమహుల్లాహ్) ఇలా సెలవిచ్చారు: మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులను ప్రేమిస్తాము మరియు వారిని ప్రేమించడంలో ఏ ఒక్కరి విషయంలో కూడా అతిశయోక్తిని ప్రదర్శించము. అంతేగాక, ఏ ఒక్కరితో విముక్తిని కూడా ప్రకటించుకోము. సహాబాలను ద్వేషించే ప్రతి వ్యక్తినీ, వారిని చెడుగా చిత్రీకరించే ప్రతి ఒక్కరినీ మేము కూడా ద్వేషిస్తాము. మేమైతే సహాబాలను మంచి తలంపుతో స్మరించు కుంటాము. వారిని ప్రేమిచండం ధర్మం, విశ్వాసం మరియు ఎహ్సాన్‌లలో ఓ ముఖ్యభాగం అనీ మరియు వారిని ద్వేషించడం, తిరస్కారానికి (కుఫ్ర్), కాపట్యానికి (నిఫాక్) మరియు అవిధేయతలకు చిహ్నామని భావిస్తాము.

*(షరహ్ అఖీదా తహావియ : 467 పేజీ)*

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ సహాబాల మహత్యాన్ని గూర్చి వివరించిన తర్వాత – తిరస్కారులకు (అవిశ్వాసులకు) సహాబాల పట్ల అసహ్యం కలుగుతుంది మరియు ఎల్లప్పుడూ వారి గురించి (మనస్సుల్లో) ద్వేషాగ్ని రగులుకొని వుంటుంది అని సెలవిచ్చాడు.

అంటే – సహాబాలను అసహ్యించుకోవటం, వారి పట్ల ద్వేషభావం కలిగి వుండడం తిరస్కారుల ప్రవృత్తి అన్న మాట. ముస్లిములది కాదు.

దివ్య ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

مُحَمَّدٌ رَّسُولُ اللهِ ۚ وَالَّذِينَ مَعَهُ أَشِدَّاءُ عَلَى الْكُفَّارِ رُحَمَاءُ بَيْنَهُمْ تَرٰهُمْ رُكَّعًا
سُجَّدًا يَبْتَغُونَ فَضْلًا مِّنَ اللهِ وَرِضْوَانًا ۖ سِيمَاهُمْ فِي وُجُوهِهِم مِّنْ أَثَرِ السُّجُودِ ۚ

ذٰلِكَ مَثَلُهُمۡ فِى التَّوۡرٰٮةِ ۖۛۚ وَمَثَلُهُمۡ فِى الۡاِنۡجِيۡلِ ۛۚ كَزَرۡعٍ اَخۡرَجَ شَطْئَـهٗ فَاٰزَرَهٗ فَاسۡتَغۡلَظَ فَاسۡتَوٰى عَلٰى سُوۡقِهٖ يُعۡجِبُ الزُّرَّاعَ لِيَـغِيۡظَ بِهِمُ الۡكُفَّارَ ‌ؕ وَعَدَ اللّٰهُ الَّذِيۡنَ اٰمَنُوۡا وَعَمِلُوا الصّٰلِحٰتِ مِنۡهُمۡ مَّغۡفِرَةً وَّاَجۡرًا عَظِيۡمًا (29)

"ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త. ఆయన వెంట వున్నవారు అవిశ్వాసుల పట్ల కఠినులుగానూ, పరస్పరం కరుణామయులుగానూ వుంటారు. దైవకృపను, దైవప్రసన్నతను చూరగొనే ప్రయత్నంలో వారు (దైవ సన్నిధిలో) వినమ్రులై వంగటాన్ని, సాష్టాంగపడటాన్నీ నీవు చూస్తావు. వారి సాష్టాంగ ప్రణామాల ప్రత్యేక ప్రభావం వారి ముఖార విందాలపై తొణికిసలాడుతూ ఉంటుంది. వీరికి సంబంధించిన ఈ ఉపమానమే తౌరాతులో వుంది. ఇంజీలులో (కూడా వీరి ఉపమానం వుంది. అది ఒక పంట పొలం వంటిది. అది తన మొలకను మొలకెత్తించింది. తరువాత దానిని బలపరిచింది. ఆ తర్వాత అది లావు అయ్యింది. ఆ పైన అది తన కాండంపై నిటారుగా నిలబడింది. రైతులను అలరించ సాగింది. వారి ద్వారా అవిశ్వాసులను మరింత ఉడికించాలని. వారిలో విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి మన్నింపును, గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేసివున్నాడు." *(ఫతహ్ : 29)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా తన సహచరుల గురించి దుర్భాషలాడడం నుండి గట్టిగా వారించారు.

ఆయన ఇలా ఉద్బోధించారు: నా సహచరులను దుర్భాషలాడకండి. నా ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆ శక్తివంతుని సాక్షి! మీలో ఎవరైనా ఉహద్ పర్వతమంత బంగారం దానం చేసినా సరే అది వీరి (సహచరులు) ఒక ముద్ద్ లేదా అర ముద్ద్‌కు కూడా సమానం కాలేదు. *(ముద్ద్ అంటే ఒక రకమైన కొలత)*

*(సహీ బుఖారీ: ఫజాయెల్ అస్‌హాబున్నబీ : 3673, సహీ ముస్లిం : ఫజాయెల్ సహాబా : 254)*

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా అంటూ వుండేవారు : ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులను గూర్చి చెడుగా

అనకండి. ఎందుకంటే – (దైవప్రవక్తతో) వారు నిలబడ్డ ఒక్క క్షణం అయినా మీ పూర్తి జీవితపు ఆచరణలకన్నా ఉత్తమమైనది. *(ఇబ్నెమాజా : ఫజాయెల్ అస్‌హాబున్నబీ : 162, సహీ ఇబ్నెమాజా లిల్ అల్‌బానీ : 1/132-133)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా అంటూ వుండేవారు: మీరు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులను దుర్భాష లాడకండి. ఎందుకంటే – దైవప్రవక్త సహచరులలో ఎవరైనా ఒక్క క్షణం ఆయనతో నిలబడితే– ఆ ఒక్క క్షణం కూడా మీ 40 సంవత్సరాల ఆచరణల కన్నా ఉత్తమమైనది. *(ఇబ్నెబత్తా, సహీ అల్‌బానీ ఫీ తఖ్రీజ్ షరహ్ అఖీదా తహావియా -469 పేజీ)*

అల్లాహ్ మనందరినీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులను ప్రేమించే మరియు వారిని గౌరవించే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## రెండవ ఖుత్బా

ప్రియ శ్రోతలారా!

గత ప్రసంగంలో మేము–మొహర్రం మాసం, నిషేధిత నాలుగు మాసాల్లో ఒకటి అనీ, మరియు ఈ నెలలో ప్రత్యేకించి దౌర్జన్యం చేయడాన్ని (అంటే అల్లాహ్‌కు అవిధేయత చూపడాన్ని) అల్లాహ్ నిషేధించాడని వివరించి వున్నాం.

కనుక మనం అల్లాహ్ అవిధేయతకు దూరంగా వుంటూ దానితోపాటు ఈ మాసంలో వీలైనంత ఎక్కువగా సత్కార్యాలు చేస్తూ ఉండాలి. ప్రత్యేకించి ఐచ్ఛిక ఉపవాసాలు ఎక్కువగా వుండాలి. ఎందుకంటే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: "రమజాన్ తర్వాత అన్నింటి కన్నా శ్రేష్టమైన ఉపవాసాలు, అల్లాహ్ మాసమైన మొహర్రం నెల ఉపవాసాలు మరియు ఫర్జ్ నమాజ్ తర్వాత శ్రేష్టమైన నమాజ్ రాత్రి నమాజ్ (తహజ్జుద్ నమాజ్)."

*(సహీ ముస్లిం : కితాబుల్ సౌమ్: 1136)*

ప్రత్యేకించి, ఆషూరా రోజు, 10వ మొహర్రం నాడు ఉపవాసం తప్పని సరిగా వుండాలి. ఎందుకంటే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కాలో ఉన్నంత వరకు నిరాటంకంగా ఈ రోజు ఉపవాసం ఉండేవారు. తదుపరి, మదీనాకు విచ్చేసిన తర్వాత, అక్కడ కూడా తను ఈ

రోజు ఉపవాసం వుండి తన సహచరులకు కూడా దీని గూర్చి ఆదేశించేవారు. ఆ తర్వాత రమజాన్ మాసపు ఉపవాసాలు ఫర్జ్ (విధి) అయ్యాక ఆయన ఇలా సెలవిచ్చారు:

"మీలో ఇష్టమైన వారు ఈ రోజు ఉపవాసం వుండవచ్చు. ఇష్టంలేని వారు అవసరంలేదు."

ఈ విషయం గురించి కొన్ని హదీసులు వినండి:

1) ఇబ్నె అబ్బాస్ (రజిఅల్లాహు అన్హు) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను ఆషూరా దినం మరియు రమజాన్ మాసం తప్ప, మరే దినానికీ ఇంకో దినంపై ప్రాధాన్యత యిచ్చి ఆ రోజు ఉపవాసం పాటించాలని నిర్ణయించుకోవడాన్ని చూడలేదు.

*(సహీ బుఖారీ : సౌమ్ : 2006, సహీ ముస్లిం : 1132)*

అంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) రమజాన్ మాసం మినహా యిస్తే ఇతర దినాలలో ఆషూరా దినానికి ఎంత ప్రాధాన్యత ఇచ్చేవారో అంత ప్రాధాన్యత మరే దినానికీ ఇచ్చేవారుకారు.

2) ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం : అజ్ఞాన కాలంలో ఖురైషులు ఆషూరా దినం నాడు ఉపవాసం వుండేవారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఆ రోజు ఉపవాసం వుండేవారు. తదుపరి ఆయన మదీనా కు విచ్చేసిన తర్వాత కూడా ఆ రోజు ఉపవాసం పాటించేవారు మరియు తన సహచరులకు కూడా దీని గురించి ఆదేశించేవారు. ఆ తర్వాత రమజాన్ మాసపు ఉపవాసాలు ఫర్జ్ అయ్యాయి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (ఆషూరా దినపు ఉపవాసం) నిర్ణయాన్ని ప్రజలపై వదిలేస్తూ ఇలా సెలవిచ్చారు: మీలో ఇష్టమైవారు ఆ రోజు ఉపవాసం వుండవచ్చు ఇష్టంలేని వారు త్యజించ వచ్చు."

*(సహీ బుఖారీ : సౌమ్: 2001, 2003 సహీ ముస్లిం : సియ్యామ్: 1125)*

3) రబీ బిన్తె ముఅజ్ (రజిఅల్లాహు అన్హా) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనా చుట్టుప్రక్కల నివసించే బస్తీలలో "ఆషూరా దినం నాడు ఉపవాసం వుండండి" అన్న సందేశాన్ని పంపించారు. ఈ మేరకు,

స్వయంగా మేము కూడా ఆ రోజు ఉపవాసం వుండేవాళ్ళం మరియు మా చిన్న పిల్లల చేత కూడా ఉపవాసం పాటింపజేసేవాళ్ళం. ఒకవేళ పిల్లలు భోజనం కోసం అల్లరి చేస్తే మేము వారికి ఇఫ్తార్ సమయం వరకు కాలం వెళ్ళబుచ్చటానికి ఆటబొమ్మలను ఇచ్చి శాంతింపజేసేవాళ్ళం. *(సహీ ముస్లిం : 1136)*

4) అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనాకు విచ్చేసిన తర్వాత, 'యూదులు ఆషూరా దినం నాడు ఉపవాసం ఉండడం' చూసి వారితో - మీరెందుకు ఈ దినం నాడు ఉపవాసం పాటిస్తారు? అని అడిగారు. వారు ఆయనతో- 'ఈ రోజు ఎంతో విశిష్టమైనది. ఈ రోజే అల్లాహ్, మూసా (అలైహిస్సలాం) మరియు ఆయన సహచరులకు (ఫిరౌన్ నుండి) ముక్తిని ప్రసాదించాడు. అందుకే, మూసా (అలైహిస్సలాం) అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకుగాను ఈ రోజే ఉపవాసం వుండేవారు. అందుకే మేము కూడా ఈ రోజు ఉపవాసం పాటిస్తాము' అని అన్నారు.

ఇది విని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మూసా (అలైహిస్సలాం)కు (మీకన్నా) మేము దగ్గరి వాళ్ళం."

తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయంగా తాను కూడా ఈ రోజు ఉపవాసం వుండేవారు మరియు తన సహచరులకు కూడా దీని గురించే ఆదేశించారు.

*(సహీ బుఖారీ : సౌమ్ : 2004 సహీ ముస్లిం : 113)*

## ఆషూరా దినం ప్రాముఖ్యత - గతించిన కాలంలో

గతించిన కాలంలో ఆషూరా దినం ప్రాముఖ్యత ఏ విధంగా వుండేది? ఈ విషయంలో చాలా విషయాలు ప్రసిద్ధి గాంచాయి. కానీ, ప్రమాణిక ఉల్లేఖనాల ద్వారా మనకు తెలిసే విషయమేమిటంటే - అల్లాహ్ ఈ రోజే మూసా (అలైహిస్సలాం) మరియు ఆయన అనుచర సమాజమైన బనీ ఇస్రాయీల్‌కు ముక్తిని ప్రసాదించాడు మరియు ఫిరౌన్, అతడి జాతిని సముద్రంలో ముంచి వేశాడు. ఈ కారణంగానే యూదులు ఈ రోజు ఉపవాసం వుండేవారు.

ఇంతకు ముందు వివరించిన ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు)

ఉల్లేఖనం ద్వారా – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముస్లిములకు కూడా ఈ రోజు ఉపవాసం పాటించమని ఆదేశించారని మనం తెలుసుకున్నాం.

అబూ మూసా (రజిఅల్లాహు అన్హు) కథనం : యూదులు ఆషూరా దినాన్ని పండుగ దినంగా భావించేవారు మరియు ఖైబర్ వాసులు (యూదులు) ఆ రోజు ప్రత్యేకంగా తమ స్త్రీలకు ఆభరణాలు వగైరా॥ ధరింపజేసి సంతోషంగా గడిపేవారు. అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“మీరు ఆ రోజు ఉపవాసం ఉండండి.”

*(సహీ బుఖారీ : 2005, సహీ ముస్లిం : 1131)*

ఇక, మూసా(అలైహిస్సలాం) మరియు బనీ ఇస్రాయీల్‌ల ముక్తి వృత్తాంతం మరియు ఫిరౌన్ మూక సముద్రంలో ముంచి వేయబడడం – ఇదంతా దివ్య ఖుర్ఆన్‌లో సవివరంగా వుంది.

అదే విధంగా, ప్రామాణిక ఉల్లేఖనాల ద్వారా, ముందు వివరించబడిన ఆయెషా (రజి అల్లాహు అన్హా) ఉల్లేఖనం ప్రకారం తెలిసిన మరో విషయం ఏమిటంటే – అజ్ఞాన కాలంలో కూడా ప్రజలు ఈ రోజును (ఆషూరా దినం) గౌరవించేవారు.

ఇవి తప్ప మరే విషయం కూడా (ఈ దినపు ప్రాముఖ్యతను గూర్చి) ప్రామాణికంగా ధృవీకరించబడిలేదు.

## సందేహ నివారణ

ముస్నద్ అహ్మద్ లోని ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది:

“నూహ్ (అలైహిస్సలాం) పడవ జూదీ పర్వతంపై ఆగిన దినమే ఆషూరా దినం. కనుక నూహ్ (అలైహిస్సలాం) కృతజ్ఞతా పూర్వకంగా ఆరోజు ఉపవాసం పాటించారు.”

కానీ, ఈ ఉల్లేఖనంలో ‘అబ్దుల్ సమద్ బిన్ హబీబ్’ అనే ఒక బలహీన ఉల్లేఖకుడు వున్నాడు మరియు రెండవ ఉల్లేఖకుడు షబీల్ బిన్ ఔఫ్ – ఒక అపరిచిత (మజ్‌హూల్) ఉల్లేఖకుడు.

*(ముస్నద్ అహ్మద్ – 14వ సంపుటం, 335 పేజీ, నెం. 8717)*

ఇదే విధంగా, తబ్రానీ యొక్క ఉల్లేఖనంలో ఇలా ఉంది:

“ఆషూరా దినం నాడు అల్లాహ్, ఆదమ్ (అలైహిస్సలాం) పశ్చాత్తాపాన్ని స్వీకరించాడు. అలాగే యూనుస్ (అలైహిస్సలాం) పట్టణానికి చెందిన ప్రజలపై కూడా అల్లాహ్ ప్రత్యేకంగా దృష్టి సారించాడు మరియు ఈ రోజే ఇబ్రాహీం (అలైహిస్సలాం) జన్మించారు.”

కానీ, దీని పరంపర గురించి హాఫిజ్ హైషిమి గారి కథనం ఏమిటంటే – దీనిలో ‘అబ్దుల్ గఫూర్’ అనే ఒక ఉల్లేఖకుడు వున్నాడు. అతడు (హదీసువేత్తల దృష్టిలో) త్యజించబడినవాడు. (మత్రూక్).

*(మజ్మ ఉజ్జవాయిద్ : 3వ సంపుటం, 188 పేజీ)*

## ఆషూరా దినపు ఉపవాసం శ్రేష్టత

అబూ ఖతాదా (రజి అల్లాహు అన్హు) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో ఆషూరా దినపు ఉపవాసం గురించి ప్రశ్నించగా ఆయన ఇలా సెలవిచ్చారు:

“గడిచిన సంవత్సరపు కాలపు పాపాలను తుడిచివేస్తుంది.”

*(సహీ ముస్లిం: 1162)*

ఈ హదీసును దృష్టిలో వుంచుకొని ప్రతి ముస్లిం, ఆషూరా దినం నాడు ఉపవాసం ఉండాలి మరియు ఇంత భారీగా పుణ్యఫలం పొందగలిగే అవకాశం దొరికినప్పుడు చేజేతులా దానిని జారవిడుచుకోకూడదు.

కానీ, ఎంత దౌర్భాగ్యకరమైన పరిస్థితో చూడండి! ఈ కాలంలో (ధర్మం గురించి) కొలమానాలే పూర్తిగా మారిపొయ్యాయి. ప్రజలు ఈ రోజును గురించి ఎన్నో క్రొత్త ఆచారాలు (బిద్అత్‌లు) సృష్టించుకున్నారు. సున్నత్ బిద్అత్‌గా మారిపోయింది మరియు బిద్అత్‌ను సున్నత్‌గా భావించడం జరుగుతోంది!

ఈ రోజున ఉపవాసం వుండి, సంవత్సర కాలపు పాపాలను క్షమింప జేసుకోగల సువర్ణావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిపోయి ప్రజలు ఈ దినాన్ని త్రాగడానికి, తినడానికని భావించుకున్నారు. ఈ విధంగా, తినడంపై, త్రాగడంపై దృష్టి కేంద్రీకరించడం జరుగుతుంది. తదనుగుణంగా ప్రత్యేక వంటలు తయారు చేయబడతాయి. పాలు, మంచినీళ్ళ కేంద్రాలను ఏర్పాటు

చేయడం జరుగుతుంది మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్‌ను అపహాస్యం చేయడం జరుగుతుంది.

మరి ఇవన్నీ హుస్సేన్ (రజి అల్లాహు అన్హు) వీర మరణంపై దు:ఖానికి సూచనా లేక సంబరానికి సూచనా? అన్నది అర్థం కావడంలేదు!

## ఆషూరా దినపు ఉపవాసంలో యూదులను వ్యతిరేకించడం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఏదైనా విషయంలో అల్లాహ్ తరపు నుండి ఆజ్ఞ ఇవ్వబడకపోతే, అలాంటి పరిస్థితిలో ఆయన గ్రంథ ప్రజల కనుగుణంగా వ్యవహరించడానికి ఇష్టపడేవారు.

సహీ బుఖారీలో ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఈ విషయం నిరూపించబడి వుంది. *(సహీ బుఖారీ : 5917, ఇఖ్తిజా సిరాతుల్ ముస్తఖీమ్ – 1వ సంపుటం, 466 పేజీ)*

చివరికి, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) కు, గ్రంథ ప్రజలను వ్యతిరేకించమని మరియు వారికనుగుణంగా వ్యవహరించరాదని ఆదేశం ఇవ్వబడింది.

అందుకే, యూదులు మరియు క్రైస్తవులు కూడా 10వ మొహర్రం నాడు ఉపవాసం ఉంటారని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు తెలియజేయ బడినప్పుడు, ఆయన వారిని వ్యతిరేకించడానికి నిర్ణయించుకున్నారు.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజిఅల్లాహు అన్హు) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆషూరా దినం నాడు ఉపవాసం వుండి, తన సహచరులకు కూడా దీని గురించి ఆదేశించినపుడు – "ఆ రోజును యూదులు, క్రైస్తవులు గౌరవిస్తారు" అని ఆయనకు చెప్పబడింది.

దీనిపై ఆయన ఇలా సెలవిచ్చారు: వచ్చే సంవత్సరం ఇన్షాఅల్లాహ్ (అల్లాహ్ తలిస్తే) మనం 9వ మొహర్రం నాడు కూడా ఉపవాసం ఉందాం.

కానీ తర్వాతి సంవత్సరం (ఆషూరా దినం) రావడానికి ముందే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ లోకం విడిచి వెళ్ళిపోయారు.

*(సహీ ముస్లిం – కితాబ్ సియ్యామ్ : 1134)*

ఆషూరా దినపు ఉపవాసంలో యూదులు, క్రైస్తవులను వ్యతిరేకించడం ఎలా? ఈ హదీసు ద్వారా, ఆషూరా దినపు ఉపవాసంలో యూదులు, క్రైస్తవులను వ్యతిరేకించడానికి మొహర్రం 10వ తేదీతోపాటు 9న కూడా ఉపవాసం ఉండాలన్న విషయం తెలిసింది.

ఇబ్నె అబ్బాస్ (రజిఅల్లాహు అన్హు) అభిమతం కూడా ఇదే. దీనికను గుణంగా ఆయన ఇలా ఉల్లేఖించారు:

యూదులను వ్యతిరేకించండి, మొహర్రం 9,10 తేదీలలో ఉపవాసం పాటించండి. *(ముస్నద్ అబ్దుర్రజ్జాఖ్: 7839 బైహఖి : 4వ సంపుటం, 287 పేజీ – సహీ పరంపరతో)*

అంతేగాక, ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన మరో ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు: మీరు ఆషూరా దినం నాడు ఉపవాసం ఉండండి మరియు యూదులను వ్యతిరేకించండి. (అందుకే అదనంగా) దానికి ఒకరోజు ముందుగా గానీ లేక ఒక రోజు తర్వాత గానీ ఉపవాసం పాటించండి.

*(ముస్నద్ అహ్మద్ : 1వ సంపుటం : 241 పేజీ)*

అహ్మద్ షాకిర్ దీనిని ప్రామాణికమైనదని ఖరారు చేశారు. మరికొంత మంది పండితులు దీని పరంపరలోని ఇద్దరు ఉల్లేఖకులు – ముహమ్మద్ బిన్ ఇబ్రాహీం బిన్ అబీ లైలా మరియు దావూద్ బిన్ అలీ – కారణంగా దీనిని బలహీనమైనదిగా ఖరారు చేశారు. కారణం ఈ ఇద్దరు ఉల్లేఖకులపై హదీసువేత్తలు రిమార్కులు చేసి ఉన్నారు.)

ఈ హదీసును దృష్టిలో వుంచుకొని కొందరు పండితుల కథనం ఏమిటంటే – ఒకవేళ ఎవరైనా మొహర్రం 9న ఉపవాసం వుండలేకపోతే, మొహర్రం 10న ఉపవాసం పాటించిన తర్వాత యూదులు, క్రైస్తవులను వ్యతిరేకించడానికి మొహర్రం 11న కూడా ఉపవాసం ఉండాలి.

ఈ హదీసుకు సంబంధించిన మరో ఉల్లేఖనంలో పదాలు ఇలా వున్నాయి: "మొహర్రం 10వ తేదీకి ఒక రోజు ముందు కూడా ఉపవాసం వుండండి మరియు ఒక రోజు తర్వాత కూడా."

*(హైషిమి కథనం : అహ్మద్, బజ్జార్ ఆధారంగా, మజ్మ ఉజ్జవాయిద్ : 3వ సంపుటం, 188 పేజీ, జయీఫ్ అల్ జామె : 3506)*

అందుకే, బహుశా ఈ ఉల్లేఖనాన్ని దృష్టిలో వుంచుకొనే అల్లామా ఇబ్నె ఖయ్యూం (రహిమహుల్లాహ్) మరియు హాఫిజ్ ఇబ్నె హజర్ (రహిమహుల్లాహ్) అనేదేమిటంటే–

ఆషూరా దినపు ఉపవాసం గురించి మూడు దర్జాలు వున్నాయి. అన్నింటికన్నా అల్ప దర్జా(స్థాయి) ఏమిటంటే– కేవలం మొహర్రం 10 నాడు ఉపవాసం ఉండడం, దానికన్నా ఉన్నతమైన దర్జా ఏమిటంటే – దీనితోపాటు మొహర్రం 9న కూడా ఉపవాసం వుండడం మరియు దానికన్నా ఉన్నతమైన దర్జా ఏమిటంటే – ఈ రెండు రోజులతోపాటు మొహర్రం 11వ తేదీనాడు కూడా ఉపవాసం వుండడం.

ఎందుకంటే ఈ మాసంలో ఎంత ఎక్కువగా ఉపవాసాలుంటే, పుణ్యఫలం కూడా అంతే ఎక్కువగా దొరుకుతుంది – వాస్తవం అల్లాహ్‌కే తెలుసు.
*(జాదుల్ మిఆద్ –2వ సంపుటం –72 పేజీ, ఫతహుల్‌బారి – 4వ సంపుటం–289 పేజీ)*

ఆఖరుగా అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే –

ఆయన మనందరికీ నిషేధిత మాసాలను గౌరవించి, వాటిలో మరియు ఇతర మాసాల్లో కూడా ఆయన అవిధేయతకు దూరంగా వుండే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

# దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాచరుల మహాత్యం

## ఖుత్బాయందలి ముఖ్యాంశాలు

1) సహాబీ పరిచయం.
2) దివ్య ఖుర్ఆన్ వెలుగులో సహాబాల మహత్యం.
3) హదీసుల వెలుగులో సహాబాల మహత్యం.
4) అన్సారీ సహాబాల మహత్యం.
5) బదర్ వాసుల (బదర్ యుద్ధంలో పాల్గొన్నవారి) మహత్యం.
6) ఉహద్ వాసుల మహత్యం.
7) బైతె రిజ్వాన్ లో పాలుపంచుకున్న సహాబాల మహత్యం.
8) సహాబాల గురించి 'అహ్లె సున్నత్ వల్ జమాత్' విశ్వాసము.

## మొదటి ఖుత్బా

ముస్లిం సహోదరులారా!

నేటి ప్రసంగంలో మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబా (సహచరులు)ల మహత్యం మరియు గొప్పతనాలను గూర్చి వివరిస్తాము.

❖ స్వయంగా అల్లాహ్ తన ఆఖరి గ్రంథం దివ్య ఖుర్ఆన్‌లో ప్రశంసించిన సహాబాలు, అంతేగాక, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎన్నో హదీసులలో తన సహచరులను గూర్చి కొనియాడారు.

❖ అందరికన్నా ముందుగా దైవవాణి (వహీ) ద్వారా సంబోధించబడ్డ సహాబాలు.

❖ మన ప్రియ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను తమ కళ్ళతో దర్శించి, ఆయన ఆదేశాలను స్వయంగా తమ చెవులతో విన్న సహాబాలు.

❖ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఒక్కొక్క సున్నత్‌ను గుర్తుం చుకొని ఈ అనుచర సమాజానికి చేరవేసిన సహాబాలు.

❖ ఇస్లాం ధర్మం నిమిత్తం తమ సర్వస్వాన్నీ, తమ ప్రాణాలను సయితం ధారపోసిన మరియు (అల్లాహ్, ఆయన ప్రవక్త) విధేయతలో ఆదర్శంగా నిలిచిన సహాబాలు. వారి ఆదర్శాలు లోకమున్నంత వరకు చదవబడుతూ, వినబడుతూ వుంటాయి.

సహాబాల మహత్యం, గొప్పతనాలను గూర్చి వివరించడానికి ముందు 'సహాబీ' అంటే ఎవరు? అన్న దానిని గూర్చి వివరించాలనుకుంటున్నాం. హాఫిజ్ ఇబ్నె హజర్ (రహిమహుల్లాహ్) 'సహాబీ' ని గూర్చి వివరిస్తూ సహాబీ అంటే – విశ్వాసపు స్థితిలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను కలిసి, చివరికి ఇస్లాం ధర్మం పైనే మరణించిన వ్యక్తి. తదుపరి దీనిని గూర్చి విపులంగా వివరిస్తూ హాఫిజ్ ఇబ్నె హజర్ ఇలా సెలవిచ్చారు : ఈ నిర్వచనం రీత్యా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దైవదౌత్యాన్ని విశ్వసించి, ఆయనను కలిసి, ఆపై ఇస్లాం ధర్మంపైనే స్థిరంగా వుండి, అదే స్థితిలో మరణించిన ప్రతి వ్యక్తి 'సహాబీ' అనబడతాడు. అతను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో గడిపిన వ్యవధి తక్కువైనా, ఎక్కువైనా ఫరవాలేదు. ఇంకా అతను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా ఏ విషయమైనా ఉల్లేఖించినా, ఉల్లేఖించకపోయినా, ఆయనతోపాటు ఏదైనా యుద్ధంలో పాల్గొన్నా, పాల్గొనకపోయినా ఫర్వాలేదు. ఒకవేళ అతను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తన కళ్ళతో చూసినా, లేక గ్రుడ్డివాడైన కారణంగా తన కళ్ళతో ఆయన్ను వీక్షించలేకపోయినా ఫర్వాలేదు. ఈ అన్ని స్థితులలో కూడా అతను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబీ అని అనబడతాడు. కానీ విశ్వసించిన తర్వాత, తిరిగి అవిశ్వాసం వైపునకు మరలిపోయిన వ్యక్తి మాత్రం 'సహాబీ'గా గుర్తించబడడు.

*(అల్ ఇసాబఫీ మారిఫతుస్సహాబా : 1 సంపుటం, 7–8 పేజీలు)*

'సహాబీ' అంటే ఎవరో మనకు తెలిసన తర్వాత, ఇక రండి, దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ వీరిని ఎలా చిత్రీకరించాడో మరియు ఎలా ప్రశంసించాడో చూద్దాం.

وَالسّٰبِقُوْنَ الْاَوَّلُوْنَ مِنَ الْمُهٰجِرِيْنَ وَالْاَنْصَارِ وَالَّذِيْنَ اتَّبَعُوْهُمْ

بِإِحۡسَٰنٖ رَّضِيَ ٱللَّهُ عَنۡهُمۡ وَرَضُواْ عَنۡهُ وَأَعَدَّ لَهُمۡ جَنَّٰتٖ تَجۡرِي
تَحۡتَهَا ٱلۡأَنۡهَٰرُ خَٰلِدِينَ فِيهَآ أَبَدٗاۚ ذَٰلِكَ ٱلۡفَوۡزُ ٱلۡعَظِيمُ ١٠٠

**1) "ముహాజిర్లలో, అన్సారులలో ప్రప్రథమంగా ముందంజ వేసిన వారి తోనూ, తర్వాత, చిత్తశుద్ధితో వారిని అనుసరించిన వారితోనూ అల్లాహ్ ప్రసన్ను డయ్యాడు. వారు అల్లాహ్ పట్ల ప్రసన్నులయ్యారు. క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గ) వనాలను అల్లాహ్ వారి కొరకు సిద్ధం చేసి వుంచాడు. వాటిలో వారు కలకాలం ఉంటారు. గొప్ప సాఫల్యం కూడా అదే."** *(తౌబా : 100)*

ఈ ఆయతులో అల్లాహ్ మూడు రకాల మనుషులను గూర్చి వివరించాడు.

1) ముహాజిర్లు – అల్లాహ్ ధర్మం కోసం తమ పూర్వీకుల ప్రదేశాన్ని, తమ సంపదను వదిలి మదీనాకు వలస వెళ్ళిన వారు.

2) మదీనా అన్సారులు– దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మరియు ముహాజిర్ సహాబాలను మన:పూర్వకంగా సహాయం చేసే నిమిత్తం తమ సర్వస్వాన్ని ధారపోసిన వారు.

అల్లాహ్ వీరి (ముహాజిర్లు, అన్సారులు)లో హిజ్రత్ (వలస) చేయడంలో, విశ్వసించడంలో ముందంజ వేసిన వారిని గూర్చి వివరించాడు. అంటే – అందరికన్నా ముందు హిజ్రత్ చేసి మరియు అందరికన్నా ముందు విశ్వసించి, ఇతరుల కోసం ఆదర్శప్రాయంగా నిలిచినవారు.

3) ఇలా (ధర్మం విషయంలో) ముందంజ వేసిన వారిని పూర్తి చిత్తశుద్ధితో మరియు ప్రేమతో అనుసరించి వారి అడుగుజాడల్లో నడిచినవారు. వీరిలో సహాబాల తర్వాత వచ్చినవారు, తాబయీలు మరియు ప్రళయం వరకు రాబోయే వారందరూ – ఎవరైతే వారిని (ముందంజ వేసిన వారిని) సత్యానికి కొలమానంగా భావించి వారిని అనుసరిస్తారో – చేరివున్నారు.

మూడు రకాల వ్యక్తులను గూర్చి వివరించిన తర్వాత అల్లాహ్ వీరికి రెండు శుభవార్తలను వినిపించాడు.

ఒకటేమో – అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు. అంటే – వారి పొరపాట్లను మన్నించడంతోపాటు వారి సత్కార్యాలను స్వీకరించాడు.

రెండవది – వారి కోసం స్వర్గాలను తయారుచేశాడు. వాటిలో వారు ఎల్లప్పుడూ ఉండగలరు మరియు వాటి అనుగ్రహాలను ఆస్వాదించగలరు.

ముహమ్మద్ బిన్ కాబ్ అల్ ఖుర్తుబీ ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ సహాబాలందరినీ మన్నించాడు మరియు తన గ్రంథంలో వారి కోసం స్వర్గాన్ని 'తప్పనిసరి' (వాజిబ్)గా ఖరారు చేశాడు. వారిలోని పుణ్యాత్ముల కొరకూ మరియు పొరపాటుదారులకు కూడా. తదుపరి ఆయన దివ్య ఖుర్ఆన్‌లోని ఈ ఆయతే (తౌబా:100) పఠించారు. ఆ తర్వాత ఇలా అన్నారు:

దీనిలో అల్లాహ్, సహాబాల పట్ల ప్రసన్నుడవడం మరియు వారికోసం స్వర్గ ప్రకటన గురించి వివరించాడు. ఈ విధంగా, వారిని అనుసరించే వారి కోసం కూడా ఇవే బహుమానాలు వున్నాయి. కానీ షరతు ఏమిటంటే– వారిని పూర్తి చిత్తశుద్ధితో, ప్రేమతో అనుసరించాలి. *(అద్దరుల్ మన్షూర్ : 4/272)*

2) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

لَقَدْ تَّابَ اللّٰهُ عَلَى النَّبِيِّ وَ الْمُهٰجِرِيْنَ وَ الْاَنْصَارِ الَّذِيْنَ اتَّبَعُوْهُ فِيْ سَاعَةِ الْعُسْرَةِ مِنْۢ بَعْدِ مَا كَادَ يَزِيْغُ قُلُوْبُ فَرِيْقٍ مِّنْهُمْ ثُمَّ تَابَ عَلَيْهِمْ ؕ اِنَّهٗ بِهِمْ رَءُوْفٌ رَّحِيْمٌ ﴿۱۱۷﴾

**"ప్రవక్త వైపునకూ, కష్టకాలంలో ప్రవక్తను వెన్నంటి వున్న ముహాజిర్లు, అన్సారుల వైపుకూ అల్లాహ్ (దయాభావంతో) మరలాడు. వారిలో కొందరి హృదయాలు తడబాటుకు లోనైనప్పుడు, ఆ తరువాత ఆయన వారి పొరపాటును మన్నించాడు. నిశ్చయంగా ఆయన వారి యెడల వాత్సల్యం కలవాడు, కరుణామయుడు."** *(తౌబా: 117)*

ఈ ఆయత్‌లో అల్లాహ్ ప్రత్యేకంగా – కష్టకాలంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు తోడుగా నిలిచిన ముహాజిర్ మరియు అన్సారీ సహాబాలను ప్రశంసించాడు. ఇక్కడ కష్టకాలం అంటే – తబూక్ యుద్ధ సమయం. ఆ సమయంలో పరిస్థితులు ఎంత దుర్భరంగా తయారయ్యాయంటే – సహాబాలకు

తినడానికేం దొరకలేదు సరికదా త్రాగడానికి కనీసం మంచినీళ్ళు కూడా లభ్యం కాలేదు. ఎండ తీవ్రత కూడా విపరీతంగా వుంది. (యుద్ధంలో) పాల్గొన్న వారు ఎక్కువ మంది కాగా వారి కోసం ప్రయాణ సాధనాలు మాత్రం తక్కువగా వున్నాయి. అయినప్పటికీ ఇలాంటి విపత్కర పరిస్థితులలోనూ సహాబాలు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను వీడలేదు మరియు ప్రతి కష్టాన్ని ఓర్పుతో సహించారు.

ఉమర్ (రజి అల్లాహు అన్హు)ను ఈ 'కష్టకాలం'ను గూర్చి అడిగినప్పుడు ఆయన ఇలా వివరించారు:

మేం తీవ్రమైన ఎండలో బయలుదేరాం. దారిలో దాహం వేసి ఒక చోట ఆగాం. దాహం తీవ్రత వల్ల మా గొంతులు మా నుండి వేరైపోతాయా అన్న అనుభూతి కలిగింది. పరిస్థితి ఎలా తయారయ్యిందంటే – మాలో ఎవరైనా ఒంటెను జిబహ్ చేస్తే, దాని పేడను పిండి, దాని నుండి వచ్చే నీటిని అతను త్రాగేవాడు. పరిస్థితి ఇంకా విషమించే సరికి, (ఇక ఆగలేక) అబూబక్ర్ (రజిఅల్లాహు అన్హు) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో – 'ఓ దైవ ప్రవక్తా! అల్లాహ్ మీ ప్రార్థనను స్వీకరిస్తాడు. కనుక మీరు మా కోసం ప్రార్థించండి' అని విన్నవించుకున్నారు.

దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (ప్రార్థన నిమిత్తం) చేతులెత్తారు. ఇంకా చేతుల్ని క్రిందికి దించకముందే మాపై మేఘాలు క్రమ్ముకున్నాయి మరియు వర్షం ప్రారంభమైంది. సహాబాలందరూ తమ పాత్రలను నింపుకున్నారు. తదుపరి మేమంతా అక్కణ్ణుండి బయలుదేరాం. అప్పుడు తెలిసింది – వర్షం కేవలం మేము ఆగిన చోటే కురిసింది అని.

*(తఫ్సీర్ ఖుర్తుబీ : 8 / 279 & తఫ్సీర్ ఇబ్నె కసీర్ : 2 / 522)*

ఖతాదా (రజి అల్లాహు అన్హు) కథనం : తబూక్ యుద్ధ ప్రయాణంలో అన్నపానీయాల కొరత ఎంత తీవ్రంగా పరిణమించిందంటే – ఒక ఖర్జూరాన్ని రెండు భాగాలు చేసి ఇద్దరు సహాబాలు పంచుకొనేవారు మరియు దాహం తీవ్రత మూలంగా, దాహం తీర్చుకోవడానికి సహాబాలు ఒకే ఖర్జూరాన్ని మాటి మాటికీ నమలసాగారు.

కాగా, అబూ హురైరా, అబూ సయీద్ (రజి అల్లాహు అన్హుమ్)లు ఇలా సెలవిచ్చారు: మేము తబూక్ యుద్ధంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ

సల్లం) వెంట వున్నాం. ఈలోగా ప్రజలు తీవ్ర ఆకలిబాధకు గురై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను – ఓ దైవప్రవక్తా! మీరు గనక మాకు అనుమతి ఇస్తే మా ఒంటెలను జిబహ్ చేసుకుంటాము అని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారికి అనుమతి ఇచ్చేశారు. కానీ, ఉమర్ (రజిఅల్లాహు అన్హు) వచ్చి ఆయనతో ఇలా అన్నారు: ఓ దైవప్రవక్తా! వీరొకవేళ ఒంటెలను జిబహ్ చేసేస్తే మనకు ప్రయాణ సాధనాలు తగ్గిపోతాయి. అలా కాక, మీరు వీరి దగ్గర వున్న ఆహారాన్ని ఒక్క చోట జమ చేయమని వీరికాదేశించి తదుపరి (దానిలో) శుభం కొరకు మీరు అల్లాహ్‌ను ప్రార్థిస్తే బాగుంటుందేమో! దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనికి 'సరే' అన్నారు. తర్వాత, ఒక దుప్పటిని ఆయన, నేలపై పరచమని ఆదేశించి ప్రజలతో –"మీ దగ్గర (తినడానికి) వున్న వస్తువేదైనా సరే తెచ్చి ఈ దుప్పటి మీద వుంచండి" అని పురమాయించారు.

ఇలా, ఓ వ్యక్తి వచ్చి గుప్పెడు యవలు(జౌ) దాంట్లో వేస్తే, మరో వ్యక్తి వచ్చి గుప్పెడు ఖర్జూరాలు దాంట్లో వేసేవాడు. ఇంకో వ్యక్తి వచ్చి యవలు(జౌ) రొట్టె యొక్క చిన్న ముక్కను దాంట్లో చేర్చేవాడు. ఇలా, దుప్పటిలో కొంత ఆహార సామగ్రి తయారయ్యింది. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (దానిలో) శుభం కోసం అల్లాహ్‌ను ప్రార్థించి ప్రజలతో ఇలా అన్నారు: ఇప్పుడు మీరు దీనిలో నుండి తీసుకొని తినండి. సైనిక బలమంతా తమ తమ పళ్ళాలతో ఆహారం నింపుకొని కడుపునిండా భుజించారు.

అప్పుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రకటించారు: "అల్లాహ్ తప్ప మరొక ఆరాధ్యదైవం లేదు మరియు నేను అల్లాహ్ ప్రవక్తను అని నేను సాక్ష్యమిస్తున్నాను. ఇక ఏ వ్యక్తి అయినా వీటిని గూర్చి ఏ మాత్రం సంశయం లేకుండా ఈ రెండు సాక్ష్యాలతో గనక అల్లాహ్‌ను కలిస్తే అల్లాహ్ అతణ్ణి తప్పకుండా స్వర్గంలో ప్రవేశింపజేస్తాడు".

*(ముస్నద్ అహ్మద్ : 3/11, నెం.11090, సహీ ముస్లిం : కితాబుల్ ఈమాన్ : 44)*

ప్రియ శ్రోతలారా!

తబూక్ యుద్ధ సమయంలో సహాబాలు ఎదుర్కొన్న విపత్కర పరిస్థితులను గూర్చి ఇంత విపులంగా చర్చించడంలోగల ఉద్దేశ్యమేమిటంటే – సహాబాలు

ఎంత పటిష్టమైన విశ్వాసం కలిగి వున్నారో మరియు ఎలాంటి సహన స్థయిర్యాలు కలిగివున్నారో మరియు ఇస్లాం ధర్మం కోసం వారు ఎలాంటి కష్టాలను ఎదుర్కొన్నారో మనం గ్రహించగలగడానికి. అందుకే అల్లాహ్ వారిపై ప్రత్యేకంగా దృష్టి సారించాడు మరియు తన దివ్యగ్రంథంలో "నేను వారిపట్ల ప్రసన్నుణ్ణి అయ్యాను, వారు నా పట్ల ప్రసన్నులయ్యారు" అని ప్రకటించాడు.

3) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قُلِ الْحَمْدُ لِلّٰهِ وَسَلٰمٌ عَلٰى عِبَادِهِ الَّذِيْنَ اصْطَفٰى ۭ آٰللّٰهُ خَيْرٌ اَمَّا يُشْرِكُوْنَ (59)

**"(ఓ ప్రవక్తా!) ఇలా చెప్పు: ప్రశంసలన్నీ అల్లాహ్‌కే శోభిస్తాయి. ఆయన ఎన్నుకున్న దాసులపై శాంతి కురియుగాక!"** *(నమ్ల్ : 59)*

ఈ ఆయత్‌లో అల్లాహ్, శాంతిని కురిపించి తనకు ప్రియమైన వారుగా ఖరారు చేసిన దాసులు ఎవరంటే– ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ప్రకారం వారు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కోసం ఎన్నుకోబడిన సహాబాలు.

ఇమామ్ ఇబ్నె జరీర్ అత్తబరీ (రహిమహుల్లాహ్) కథనం: అల్లాహ్ చే ఎన్నుకోబడిన దాసులు అంటే – అల్లాహ్ తన ప్రవక్త కొరకు ఎన్నుకున్న వారు మరియు ఆయనకు సహచరులుగా, మంత్రులుగా (సలహాదారులు) చేయబడిన వారు.

*(జామె అల్ బయాన్ : 2/20, మిన్హాహుజుస్సున్నహ్ లి ఇబ్నె తైమియా:1/156)*

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం: "ఏ వ్యక్తి అయినా (ఎవరినైనా) అనుసరించాలనుకొంటే – అతను – ఈ లోకం విడిచిపోయిన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాల సున్నత్‌పై నడవాలి. ఈ అనుచర సమాజపు అత్యుత్తమ వ్యక్తులు వారు. అందరికన్నా ఎక్కువగా పవిత్ర హృదయులు, ధార్మిక పరిజ్ఞానం కలవారు మరియు అందరికన్నా తక్కువగా మొహమాట పడేవారు. అల్లాహ్ వారిని తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు తోడుగా మరియు తన ధర్మాన్ని రాబోయే తరాల వారికి చేర వేయడానికి ఎన్నుకున్నాడు. కనుక, మీరందరూ వారి గుణగణాలను మరియు పద్ధతులనే స్వీకరించండి. ఎందుకంటే వారు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు సహచరులుగా, రుజమార్గంపై నడిచే వారుగా వున్నారు".

*(హులియా అల్ ఔలియా : 1/305–306)*

అలాగే, అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం: అల్లాహ్ తన దాసుల హృదయాల్లోకి తొంగిచూడగా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) హృదయాన్ని అందరికన్నా ఉత్తమమైనదిగా కనుగొన్నాడు. అందుకే ఆయనను తన కోసం ఎన్నుకొని దైవదౌత్యాన్ని ప్రసాదించాడు. తదుపరి, మళ్ళీ తన దాసుల హృదయాల్లోకి తొంగిచూడగా సహాబాల హృదయాలను అందరి కన్నా శ్రేష్టమైనవిగా కనుగొన్నాడు. అందుకే వారికి తన ప్రవక్త యొక్క మంత్రి మండలి దర్జాను ప్రసాదించాడు.

*(అల్ ముస్నద్:1/379, షరహుస్సున్నహ్ :1/214)*

(4) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

مُحَمَّدٌ رَّسُولُ اللّٰهِ ۚ وَالَّذِيْنَ مَعَهٗۤ اَشِدَّآءُ عَلَى الْكُفَّارِ رُحَمَآءُ بَيْنَهُمْ تَرٰىهُمْ رُكَّعًا
سُجَّدًا يَّبْتَغُوْنَ فَضْلًا مِّنَ اللّٰهِ وَرِضْوَانًا ۫ سِيْمَاهُمْ فِيْ وُجُوْهِهِمْ مِّنْ اَثَرِ السُّجُوْدِ ؕ
ذٰلِكَ مَثَلُهُمْ فِي التَّوْرٰىةِ ۛۚ وَمَثَلُهُمْ فِي الْاِنْجِيْلِ ۛ۫ كَزَرْعٍ اَخْرَجَ شَطْـَٔهٗ فَاٰزَرَهٗ فَاسْتَغْلَظَ
فَاسْتَوٰى عَلٰى سُوْقِهٖ يُعْجِبُ الزُّرَّاعَ لِيَغِيْظَ بِهِمُ الْكُفَّارَ ؕ وَعَدَ اللّٰهُ الَّذِيْنَ اٰمَنُوْا
وَعَمِلُوا الصّٰلِحٰتِ مِنْهُمْ مَّغْفِرَةً وَّاَجْرًا عَظِيْمًا ۠ (29)

"ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త. ఆయన వెంట వున్నవారు అవిశ్వాసుల పట్ల కఠినులుగానూ, పరస్పరం కరుణామయులుగానూ వుంటారు. దైవకృపను, దైవప్రసన్నతను చూరగొనే ప్రయత్నంలో వారు (దైవ సన్నిధిలో) వినమ్రులై వంగటాన్ని, సాష్టాంగపడటాన్నీ నీవు చూస్తావు. వారి సాష్టాంగ ప్రణామాల ప్రత్యేక ప్రభావం వారి ముఖార విందాలపై తొణికిసలాడుతూ ఉంటుంది. వీరికి సంబంధించిన ఈ ఉపమానమే తౌరాతులో వుంది. ఇంజీలులో (కూడా వీరి ఉపమానం వుంది. అది ఒక పంట పొలం వంటిది. అది తన మొలకను మొలకెత్తించింది. తరువాత దానిని బలపరిచింది. ఆ తర్వాత అది లావు అయ్యింది. ఆ పైన అది తన కాండంపై నిటారుగా నిలబడింది. రైతులను అలరించ సాగింది. వారి ద్వారా అవిశ్వాసులను మరింత ఉడికించాలని. వారిలో విశ్వసించి సత్కార్యాలు చేసిన వారికి మన్నింపును, గొప్ప ప్రతిఫలాన్ని ప్రసాదిస్తానని అల్లాహ్ వాగ్దానం చేసివున్నాడు." *(ఫతహ్ : 29)*

ఈ ఆయత్‌లో అల్లాహ్ సహాబాల ఎన్నో గుణగణాలను తెలియజేశాడు:

1) వారు అవిశ్వాసులపై కఠినులుగా వుంటారు.

2) పరస్పరం కరుణామయులుగా వుంటారు.

3) రుకూ, సజ్దాల స్థితిలో వుంటారు.

4) అల్లాహ్ కృపను, ఆయన ప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యం కలిగి వుంటారు.

5) వారి సజ్దాల మూలంగా వారి ముఖాలపై ప్రత్యేక ప్రభావం వుంటుంది.

6) వారికి లభించిన ఖ్యాతి ఎలాంటిదంటే – వారి ఖ్యాతి మరియు మహత్యాలను గురించిన వర్ణన గత ఆకాశ గ్రంథాలలో కూడా లభిస్తుంది.

7) వారి ఉపమానం – ఆరంభంలో బలహీనంగా వుండి తర్వాత బలం చేకూర్చుకున్న ఒక పంట పొలం లాంటిది. ఇదే విధంగా సహాబాలు కూడా ఆరంభంలో బలహీనులుగా వున్నారు. తర్వాత బలాఢ్యులుగా తయారయ్యారు. వారి ప్రభావం క్రమేపీ పెరుగుతూ పోయినందువల్ల అవిశ్వాసులు వారిని ద్వేషించుకొనే వారు మరియు వారి గురించి భయభ్రాంతులకు లోనయ్యేవారు.

ఇలాంటి గుణ విశేషాలు కలిగి వుండడంతోపాటు, విశ్వాసము, సదాచరణలతో తమను తాము సింగారించుకున్న సహాబాలకు క్షమాపణను, గొప్ప ప్రతిఫలాన్ని ఇస్తానని అల్లాహ్ వాగ్దానం చేశాడు.

హాఫిజ్ ఇబ్నె కసీర్ (రహిమహుల్లాహ్) ఈ ఆయత్‌ను విశ్లేషిస్తూ – ఒక వ్యక్తి గనక నమాజ్ చదివే వాడయితే, అందులోనూ ప్రత్యేకంగా తహజ్జుద్ నమాజును సైతం చదివేవాడయితే, దాని ప్రభావం మూలంగా అతని ముఖం ప్రకాశిస్తూ వుంటుంది అని చెప్పడానికి ఎన్నో ఉదాహరణలను ఉల్లేఖించారు. ఒకవేళ అతని అంతరంగం పవిత్రంగా మారితే, అల్లాహ్ అతని బాహ్యాన్ని సయితం అందంగా రూపుదిద్దుతాడు. తద్వారా అతను ప్రజలలో ప్రియమైన వాడైపోతాడు. తదుపరి హాఫిజ్ ఇబ్నె కసీర్ (రహిమహుల్లాహ్) ఇలా పేర్కొన్నారు: సహాబాల సంకల్పంలో చిత్తశుద్ధి వుండేది మరియు ఆచరణలు కూడా మంచిగా వుండేవి. అందుకే వారిని చూసిన వారెవరైనా, వారి వ్యక్తిత్వంతో, గుణగణాలతో తప్పకుండా ప్రభావితులయ్యేవారు.

ఇమామ్ మాలిక్ ఇలా సెలవిచ్చారు: నా వద్దకు ఈ విషయం చేరింది. సిరియాను జయించిన సహాబాలను (అక్కడి) క్రైస్తవులు చూసినప్పుడు అప్రయత్నంగా వారి నోటి నుండి ఈ మాటలు వచ్చేవి: అల్లాహ్ సాక్షి! వీరు (సహాబాలు) మా హవారీల (సహాయకులు) కన్నా ఉత్తములు. నిస్సందేహంగా వారు తమ మాటల్లో సత్యవంతులు. ఎందుకంటే – ఈ అనుచర సమాజపు గొప్పతనం మునుపటి గ్రంథాల్లో తెలియజేయబడింది. ఈ అనుచర సమాజపు శ్రేష్టమైన వ్యక్తులు సహాబాలే మరి. *(తఫ్సీర్ ఇబ్నె కసీర్ : 4 / 261)*

ప్రియ శ్రోతలారా!

సహాబాల మహత్యం, శ్రేష్టతల గురించి మేము కేవలం నాలుగు ఆయతులు మరియు వాటి క్లుప్త విశ్లేషణ వివరించాం. వాస్తవానికి దివ్యఖుర్ఆన్ వారి మహత్యాలతో, సువర్ణనలతో నిండి వుంది. కానీ మేము క్లుప్తంగా వివరించి ముందుకు సాగుతున్నాం. ఇక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నోట – గర్వించదగ్గ ఆయన శిష్యుల సువర్ణనను విందాం.

1) అబూ మూసా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రవచించారు: నక్షత్రాలు ఆకాశానికి సురక్షిత కవచం లాంటివి. అందుకే నక్షత్రాలు రాలిపోయిన తర్వాత ఆకాశం కూడా – దానికి వాగ్దానించబడినట్లు – మిగిలి వుండదు. నేను నా సహాబాలకు సురక్షిత కవచనాన్ని. నేను మరణించాక, నా సహాబాలపై – వారికి వాగ్దానించ బడిన సమయం వచ్చేస్తుంది. అలాగే నా సహాబాలు ఈ అనుచర సమాజానికి సురక్షిత కవచం వంటివారు. అందుకే నా సహాబాలు మృతి చెందాక నా అనుచర సమాజంపై దానికి వాగ్దానించబడిన విషయం అవతరిస్తుంది.

*(సహీ ముస్లిం : కితాబ్ ఫజాయెల్ సహాబా: 2531)*

ఇమామ్ నవవీ (రహిమహుల్లాహ్) ఈ హదీసును విశ్లేషిస్తూ ఇలా పేర్కొన్నారు: నక్షత్రాలు మిగిలి వున్నంత వరకు ఆకాశం కూడా మిగిలి ఉంది. ప్రళయానికి ముందు నక్షత్రాలు కాంతి హీనమై పడిపోయినప్పుడు ఆకాశం కూడా బ్రద్దలైపోతుంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉనికి ఆయన సహాబాల

కొరకు సురక్షిత కవచంగా వుండేది. ఆయన మరణించిన వెంటనే సహాబాలపై పరీక్షల విలయం తాండవించింది. అలాగే, సహాబాల ఉనికి ఈ అనుచర సమాజానికి సురక్షిత కవచంగా వుండేది. వారు నిర్యాణం చెందిన వెంటనే ఈ అనుచర సమాజంపై ఉపద్రవాలు విరుచుకుపడ్డాయి. క్రొత్త ఆచారాలు (బిద్అత్‌లు) వెలుగు చూసాయి మరియు (వీటి కారణంగా) ఈ అనుచర సమాజం చెల్లా చెదురై పోయింది. *(షరహ్ ముస్లిం – నవవీ : 16/83)*

2) అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో – అందరికన్నా శ్రేష్టమైన ప్రజలు ఎవరు? అని ప్రశ్నించబడింది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – నా తరం వారు (అందరికన్నా శ్రేష్టులు), తదుపరి వారి తర్వాత వచ్చేవారు, తదుపరి వారి తర్వాత వచ్చేవారు అని సెలవిచ్చారు. *(సహీ బుఖారీ : కితాబుల్ షహాదత్ : 2652, సహీ ముస్లిం: కితాబుల్ ఫజాయెల్ సహాబా : 2533)*

3) అబూ సయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్భోదించారు: "నా సహచరులను తిట్టకండి (దుర్భాషలాడకండి). నా ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆ శక్తి స్వరూపని సాక్షి! మీరొకవేళ ఉహద్ పర్వతమంత బంగారం (అల్లాహ్ మార్గంలో) ఖర్చు చేసినా, వారి ఒక 'ముద్ద్'కే కాదు, అర ముద్ద్‌కు కూడా సమానం కాజాలదు." *(సహీ బుఖారీ : 2541, 3673. సహీ ముస్లిం : 2540)*

దీని అర్థం ఏమిటంటే – సహాబాల తర్వాతి వారు ఖర్చు చేసే ఎంతో ధనం కన్నా, ఒక సహాబీ కటిక బీదరికంలో కూడా కొద్దో గొప్పో అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసింది అల్లాహ్ వద్ద ఎక్కువ పవిత్రతకు మరియు పుణ్యఫలానికి యోగ్యమైనది.

4) అబ్దుర్రహ్మాన్ అల్ జహనీ (రజిఅల్లాహు అన్హు) కథనం: మేమొకసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్ద కూర్చొని వున్నాం. అకస్మాత్తుగా ఇద్దరు రౌతులు అక్కడికి విచ్చేసి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గర కూర్చున్నారు. వారిలో ఒకడు బైత్ (ప్రమాణం) చేయదలిచి తన చేతిని ముందుకు చాపి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో ఇలా అడిగాడు– ఓ దైవప్రవక్తా! మిమ్మల్ని చూసి, (తదుపరి) విశ్వసించి, ధృవీకరించి, మిమ్మల్ని

అనుసరించే వ్యక్తి గురించి మీ అభిప్రాయమేమిటి? దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ: అతని కొరకు 'తూబా' (స్వర్గంలోని ఒక రకమైన చెట్టు పేరు) వుంది అని అన్నారు. (ఇది విని) ఆ వ్యక్తి ప్రమాణం చేసి వెనక్కు జరిగాడు. తర్వాత రెండో వ్యక్తి ముందుకు వచ్చి ప్రమాణం (బైత్) చేయదలిచి మొదటి వ్యక్తి అడిగిన ప్రశ్నే అడిగాడు. దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈసారి కూడా– అతని కొరకు తూబా వుంది, తదుపరి అతని కొరకు తూబా వుంది అని అన్నారు.

*(ముస్నద్ అహ్మద్ : 17388, తబ్రానీ : 22/742, బజ్జార్ : 2769 (కషఫుల్ ఇస్తార్), మజ్మఉజ్జవాయిద్ : 1/18, హసన్ పరంపరతో)*

సహాబాల మహత్యం గురించి ఎన్నో హదీసులు, హదీసు గ్రంథాల్లో లభ్యమవుతాయి. పైగా, షేఖుల్ ఇస్లామ్ ఇబ్నె తైమియా (రహిమహుల్లాహ్) కథనం ఏమిటంటే – సహాబాల మహత్యం, ప్రశంసల గురించి, అలాగే, వారి తరానికి ఇతర తరాలపై గల ఔన్నత్యం గురించి వచ్చిన హదీసులు 'మషూర్'. (ఎంతో ప్రాచుర్యం పొందిన) స్థాయికే కాదు, ముతవాతిర్ (ఎంతోమంది ఉల్లేఖించిన) స్థాయికి చేరి వున్నాయి. అందుకే వారిలో (సహాబాలలో) చెడుగులను, దోషాలను వెలికితీయడం వాస్తవానికి దివ్య ఖుర్ఆన్ మరియు సున్నత్‌లలో దోషాలను వెలికి తీయడమే అవుతుంది. *(మజ్మూఆ ఫతావా : 4/430)*

ఈ మహత్యాలు దాదాపు సహాబాలందరి కొరకు వున్నాయి. అయితే కొన్ని ప్రత్యేక మహత్యాలు మాత్రం కొందరు ప్రత్యేక సహాబాల కోసమే వున్నాయి. వాటిలో కొన్నింటిని గూర్చి మేము మీకు వివరించదలిచాం.

## 1) మదీనా అన్సారుల మహత్యం

మదీనా అన్సారులను గూర్చి వివరిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِينَ تَبَوَّءُو الدَّارَ وَالْإِيمَانَ مِن قَبْلِهِمْ يُحِبُّونَ مَنْ هَاجَرَ إِلَيْهِمْ وَلَا يَجِدُونَ فِي صُدُورِهِمْ حَاجَةً مِّمَّا أُوتُوا وَيُؤْثِرُونَ عَلَىٰ أَنفُسِهِمْ وَلَوْ كَانَ بِهِمْ خَصَاصَةٌ ۚ وَمَن يُوقَ شُحَّ نَفْسِهِ فَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ ⑨

"ఇకపోతే, వీరి కంటే (ముహాజిర్లు) ముందే ఈ ప్రదేశం (మదీనా)లో

**స్థానికులుగా వుండి (ముహాజిర్ల రాకకు పూర్వమే) విశ్వసించి వున్న వారు (వారికి కూడా ఈ సొమ్ము వర్తిస్తుంది). వారు ఇల్లూ, వాకిలిని వదిలి తమ వైపునకు వలసవచ్చే ముహాజిర్లను ప్రేమిస్తారు. వారికి ఏమి ఇవ్వబడినా, దానిపై తమ ఆంతర్యాలలో ఏ కాస్త అసూయను కూడా రానివ్వరు. తాము అమిత అవసరంలో వున్నప్పటికీ తమపై వారికే ప్రాధాన్యత ఇస్తారు. వాస్తవానికి తమ స్వార్థప్రియత్వం (పేరాశ) నుండి రక్షించబడిన వారే కృతార్థులు.”** ***(హష్ర్ : 9)***

ఈ ఆయత్‌లో అల్లాహ్, మదీనా అన్సారుల కొన్ని గుణగణాలను వివరించాడు మరియు వారిని గూర్చి “మక్కా ముహాజిర్లు మదీనాకు రావడానికి ముందే వీరు విశ్వసించారు” అని సాక్ష్యం ఇచ్చాడు. వారిలో పరోపకారం, త్యాగ గుణం ఎంతగా వుండేదంటే – హిజ్రత్ చేసి మదీనాకు వచ్చిన సహచరులను వారు మనస్ఫూర్తిగా ప్రేమించేవారు. ఒకవేళ యుద్ధ ప్రాప్తిలో ఏదైనా ముహాజిర్లకు ఇవ్వబడితే, దానిపై తమ హృదయాలలో ఏ మాత్రం అసూయ కలిగి వుండే వారు కారు. స్వయానా తమ ఇళ్ళల్లో కటిక బీదరిక స్థితి వున్నప్పటికీ తమపై మరియు తమ అవసరాలపై వారికి (ముహాజిర్లకు), వారి అవసరాలకు ప్రాధాన్యత ఇచ్చి, ఎల్ల వేళలా వారిని కనిపెట్టుకొని వుండేవారు.

మదీనా అన్సారుల పరోపకార గుణం, త్యాగ నిరతిని గూర్చిన ఎన్నో ఉదాహరణలు లభ్యమై వున్నప్పటికీ, మేమిక్కడ కేవలం రెండు ఉదాహరణలను ప్రస్తావించదలిచాం.

1) అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికొచ్చి (మరో ఉల్లేఖనంలో ఆ వ్యక్తి స్వయానా అబూ హురైరానే అని వుంది) ఓ దైవ ప్రవక్తా! నేను ఆకలితో వున్నాను! అని విన్నవించుకున్నాడు. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సతీమణుల ఇళ్ళల్లో దర్యాప్తు గావించారు కానీ, అక్కడ ఏమీ లభించలేదు.

(మరో ఉల్లేఖనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సతీమణులలో ఒక్కొక్కరి ఇంట్లో దర్యాప్తు గావించారు. ప్రతి ఇంటి నుండి, ‘మా దగ్గర కేవలం నీళ్ళు తప్ప మరేదీ తినడానికి లేదు’ అన్న జవాబు వచ్చింది)

తదుపరి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహచరులతో ఇలా అడిగారు: ఇతణ్ణి ఆతిథ్యమిచ్చే వారెవరైనా వున్నారా? అల్లాహ్ అతడి స్థితిపై కరుణించుగాక! దీనిపై ఒక అన్సారీ సహాబీ (అబూ తల్హా) ఓ దైవప్రవక్తా! 'నేనితనికి ఆతిథ్యమిస్తాను' అని అన్నారు. తదుపరి ఆ అతిథిని తీసుకొని తన ఇంటికి వచ్చి, భార్యతో–'ఈ వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతిథి. కనుక తినడానికి నీ దగ్గర వున్నదాన్ని ఇతనికి పెట్టు మరియు ఇతణ్ణి ఆదరించు' అని అన్నారు. ఆమె జవాబిస్తూ –'అల్లాహ్ సాక్షి! నా దగ్గర కేవలం పిల్లలకు సరిపడ భోజనం మాత్రమే వుంది' అని అంది. దీనిపై అబూ తల్హా –'అలాగైతే ఓ పని చేయి, పిల్లలు భోజనం కోసం అడిగినప్పుడు (వారిని ఎలాగోలా బుజ్జగించి) పడుకోబెట్టు. మేమిద్దరం (నేను, అతిథి) భోజనానికి కూర్చున్నప్పుడు నువ్వు లాంతరును ఆర్పేయి. ఇలా ఈ రాత్రి మనమిద్దరం ఏమీ తినకుండానే పడుకొందాం' (మరియు మన అతిథి తినగలుగుతాడు) అని అన్నారు.

(మరో ఉల్లేఖనంలో ఇలా ఉంది: ఉమ్మె సులైమ్ (రజి అల్లాహు అన్హా) లాంతరును బాగు చేస్తున్నట్లు చేసి దాన్ని ఆర్పేసారు. ఇలా వారిద్దరు (భార్యా భర్తలు) తమ అతిథి ముందు వారు కూడా భోజనం చేస్తున్నట్లు నటించారు. కానీ వాస్తవానికి వారు భోజనం చేయలేదు. రాత్రంతా ఆకలితోనే వున్నారు)

మరుసటి రోజు ఉదయం అబూ తల్హా (రజి అల్లాహు అన్హు) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి రాగానే, దైవప్రవక్త – ఫలానా పురుషుడు మరియు ఫలానా స్త్రీని చూసి అల్లాహ్ ఎంతగానో సంతోషించాడు లేదా వారిని చూసి నవ్వాడు అని పలికారు.

తదుపరి అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు: "తాము స్వయంగా అగత్యపరులైనప్పటికీ, తమపై ఇతరులకే ప్రాధాన్యత ఇస్తారు". *(హష్ర్ : 9)*

*(సహీ బుఖారీ:కితాబుత్తఫ్సీర్:4889, 3798 సహీ ముస్లిం : 2054)*

2) అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం : అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి అల్లాహు అన్హు) (హిజ్రత్ చేసి) మా దగ్గరకి (మదీనా) వచ్చేసినప్పుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయన మరియు సంపన్నుడిగా వున్న సాద్ బిన్ రబియ (రజి అల్లాహు అన్హు) ల మధ్య సోదర బాంధవ్యాన్ని నెలకొల్పారు. దీనిపై సాద్ బిన్ రబియ, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్

తో ఇలా అన్నారు: నేను అన్సారులలో అందరికన్నా ధనవంతుణ్ణి. ఈ విషయం అన్సారులందరికీ తెలుసు. నేను నా సంపదను రెండు భాగాలుగా చేస్తాను. ఓ భాగం నా కోసం మరియు ఓ భాగం మీ కోసం. అంతేగాక, నాకు ఇద్దరు భార్యలు కూడా వున్నారు. వారిద్దరిలో మీకు ఎవరు నచ్చితే నేనామెకు విడాకులిచ్చేస్తాను. ఆమె తన ఇద్దత్ గడువు పూర్తి చేసుకున్నాక మీరామెను వివాహం చేసుకోండి. దీనిపై అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ స్పందిస్తూ : అల్లాహ్ మీ ఇంటి వారిలో, మీ సంపదలో శుభాన్ని ప్రసాదించుగాక! అని ప్రార్థించారు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం : ఆ తర్వాత అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ నెయ్యి మరియు పనీర్ లకు యజమాని అయిపోయారు. తదుపరి కొద్దికాలం తర్వాతే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఓసారి ఆయన (వస్త్రాలు) పై పసుపు మేనిమి ఛాయలు వుండడం చూసి “ఇదేమిటి” అని అడిగారు. ఆయన జవాబిస్తూ – ‘నేనొక విత్తనం బరువంత బంగారం ఇచ్చి ఒక అన్సారీ స్త్రీని వివాహం చేసుకున్నాను’ అని అన్నారు.

దానిపై, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి “మరి నీవు వలీమా విందు చేయి, కనీసం ఒక మేకపోతును జిబహ్ చేసి అయినా సరే” అని హితబోధ చేశారు.

*(సహీ బుఖారీ : 3780, 3781)*

ఈ రెండు సంఘటనలు, మదీనా అన్సారుల పరోపకార గుణం మరియు వారి త్యాగనిరతిని గూర్చి సాక్ష్యమిస్తున్నాయి. ఇవిగాక, వీరి విశిష్టతలను గూర్చిన మరిన్ని హదీసులు వినండి:

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఒకవేళ అన్సారులు గనక ఓ లోయలో నడుస్తూ ఉంటే (మరియు ఇతరులు వేరే లోయలో నడుస్తూ వుంటే) నేను కూడా అన్సారుల లోయలో నడుస్తాను. ఒకవేళ హిజ్రత్ వుండి వుండకపోతే నేను కూడా అన్సారులలో ఒకడిగా అయి వుండేవాణ్ణి.

*(సహీ బుఖారీ : 3779)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం : మక్కా విజయం నాడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖురైష్ ప్రజలకు యుద్ధ ప్రాప్తి (మాలె గనీమత్)ని

ఇవ్వడం చూసి అన్సారులు “అల్లాహ్ సాక్షి! ఇదెంతో ఆశ్చర్యకరమైన విషయం! మా కరవాలాల ద్వారా ఇంకా ఖురైష్ రక్తం ప్రవహిస్తూనే వుంది. అయినా, మా సొమ్ము (యుద్ధప్రాప్తి) కూడా వారికే ఇవ్వబడుతోంది!” అని అనసాగారు.

ఈ విషయం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వరకు చేరగా, ఆయన అన్సారులను పిలిచి, “నాకు మీ దగ్గర్నుండి చేరిన విషయం ఏమిటి?” అని అడిగారు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: వారు (అన్సారులు) అబద్ధం పలికేవారు కారు. అందుకే వారు దైవప్రవక్తతో, “మీ దగ్గరికి చేరిన విషయం నిస్సందేహంగా మేము పలికినదే” అని స్వీకరించారు. దీనిపై, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రజలు తమ ఇళ్ళకు యుద్ధ ప్రాప్తిని తీసికెళితే, మీరేమో స్వయంగా దైవప్రవక్తను మీ ఇళ్ళకు తీసుకెళ్ళడం మీ కిష్టం లేదా? ఒకవేళ అన్సారులు ఏదైనా లోయలో నడుస్తూ వుంటే (మరియు ఇతరులు వేరే లోయలో నడుస్తూ వుంటే) నేను కూడా అన్సారుల లోయలో నడుస్తాను. *(సహీ బుఖారీ :3778, సహీ ముస్లిం :1059)*

అనస్ (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒక అన్సారీ స్త్రీ తన పిల్లవాడితో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి రాగా ఆయన ఆ స్త్రీ తో సంభాషించారు. తదుపరి ఆమెతో: నా ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆ శక్తిమంతుని సాక్షి! ఇతరులందరి కన్నా మీరు (అన్సారులు) నాకు ఎక్కువ ప్రియులు అని అన్నారు.

*(సహీ బుఖారీ : 3786, సహీ ముస్లిం : 2509)*

ఇలాగే, అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం కందకం (యుద్ధం) రోజు మదీనా అన్సారులు ఇలా పలుకుతూ వున్నారు:

“ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చేతులపై, మరణించే వరకు అల్లాహ్ మార్గంలో జిహాద్ చేస్తామని ప్రమాణం చేసిన వారము మేమే.”

దీనికి జవాబుగా – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా అంటూ వున్నారు: “ఓ అల్లాహ్! పరలోక జీవితమే అసలైన జీవితం. అన్సారులు, ముహాజిర్లకు గౌరవ ఔన్నత్యాలను ప్రసాదించు.” *(సహీ బుఖారీ : 3796)*

## 2) బద్ర్ వాసుల విశిష్టత

హాతిబ్ బిన్ అబీ బలా (రజిఅల్లాహు అన్హు) వృత్తాంతం చివర్లో ఇలా ఉంది: ఉమర్ (రజి అల్లాహు అన్హు) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో – హాతిబ్ అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు, విశ్వాసుల పట్ల కృతఘ్నత చూపాడు. కనుక మీరు అనుమతిస్తే నేనతని శిరస్సును శరీరం నుండి వేరు చేస్తాను అని అడగగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"బహుశా అల్లాహ్ బద్ర్‌వాసులపై (కారుణ్యంతో) దృష్టి సారించాడు. తిరిగి ఇలా సెలవిచ్చాడు: మీ ఇష్టం వచ్చింది చేస్తూ ఉండండి, నేను మిమ్మల్ని క్షమించాను. మరోఉల్లేఖనంలో ఇలా ఉంది: మీ కోసం స్వర్గం తప్పని సరి (వాజిబ్)అయిపోయింది". *(సహీ బుఖారీ : 3007, సహీ ముస్లిం : 2494)*

రఫా బిన్ రాఫె అల్ జర్ఖీ బద్ర్‌వాసులలోని వారైన తన తండ్రి ద్వారా ఇలా ఉల్లేఖించారు: జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఓసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికి విచ్చేసి, ఆయనతో: మీ దృష్టిలో బద్ర్‌వాసుల స్థాయి ఎంతటిది? అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ: '(నా దృష్టిలో) వారు యావత్తు ముస్లిములందరిలోకెల్లా ఉత్తములు' అని అన్నారు. దీనిపై జిబ్రయీల్ (అలైహిస్సలాం) మాట్లాడుతూ: "అలాగే దైవదూతలలో కూడా, బద్ర్ యుద్ధంలో పాల్గొన్న దైవదూతలు అందరికన్నా శ్రేష్టులు" అని అన్నారు. *(సహీ బుఖారీ : 3992)*

## 3) ఉహద్ వాసుల విశిష్టత

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: మీ సహోదరులు ఉహద్ యుద్ధంలో షహీదులయినపుడు అల్లాహ్ వారి ఆత్మలను పచ్చరంగు కలిగిన పక్షుల శరీరాలలో ప్రవశింపజేశాడు. అవి స్వర్గంలోని కాలువల వద్దకు వెళ్ళి, అక్కడి ఫలాలను భుజించి తిరిగి అర్ష్ క్రింద వ్రేలాడబడి వున్న బంగారపు లాంతర్ల వైపునకు వచ్చేస్తాయి. తమ నిద్రాహారాలలో వారు పూర్తి ఆనందాన్ని ఆస్వాదించాక ఇలా అనడం ప్రారంభించారు: 'మేం స్వర్గంలో జీవించి వున్నాం, మాకు ఆహారం ప్రసాదించబడుతుంది' అన్న విషయాన్ని మా సహోదరులకు ఎవరు చేరవేస్తారు? తద్వారా వారు జిహాద్ నుండి ముఖం త్రిప్పుకోకుండా

వుండడానికి మరియు యుద్ధ సమయంలో రణరంగం నుండి పారిపోకుండా వుండగలగడానికి. దీనిపై అల్లాహ్ వారితో ఇలా అన్నాడు– మీ తరఫునుండి నేను వారికి ఈ విషయాన్ని చేరవేస్తాను. తదుపరి అల్లాహ్ ఈ ఆయత్‌ను అవతరింపజేశాడు:

وَ لَا تَحۡسَبَنَّ الَّذِیۡنَ قُتِلُوۡا فِیۡ سَبِیۡلِ اللّٰہِ اَمۡوَاتًا ؕ
بَلۡ اَحۡیَآءٌ عِنۡدَ رَبِّہِمۡ یُرۡزَقُوۡنَ ﴿۱۶۹﴾

**"అల్లాహ్ మార్గంలో చంపబడిన వారిని మృతులు అని అనకండి. వాస్తవానికి వారు సజీవులు. తమ ప్రభువు వద్ద జీవికను పొందు తున్నారు... "** ***(ఆలి ఇమ్రాన్ : 169)***

*(అబూ దావూద్ : 2520, ముస్నద్ అహ్మద్ : 2384, హసన్ – అల్‌బానీ, సహీ అబూదావూద్ : 2199)*

## 4) రిజ్వాన్ ప్రమాణం (బైతె రిజ్వాన్)లో పాలుపంచుకొన్న సహాబాల విశిష్టత

హుదైబియా ప్రాంతంలో రిజ్వాన్ ప్రమాణం (బైతె రిజ్వాన్) నందు పాలు పంచుకొని, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చేతులపై ప్రమాణం చేసిన సహాబాల గురించి అల్లాహ్ ' సూరహ్ ఫతహ్'లోని ఎన్నో ఆయతులలో ప్రశంసించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

لَقَدۡ رَضِیَ اللّٰہُ عَنِ الۡمُؤۡمِنِیۡنَ اِذۡ یُبَایِعُوۡنَکَ تَحۡتَ الشَّجَرَۃِ فَعَلِمَ مَا فِیۡ قُلُوۡبِہِمۡ فَاَنۡزَلَ السَّکِیۡنَۃَ
عَلَیۡہِمۡ وَ اَثَابَہُمۡ فَتۡحًا قَرِیۡبًا ﴿18﴾ وَّ مَغَانِمَ کَثِیۡرَۃً یَّاۡخُذُوۡنَہَا ؕ وَ کَانَ اللّٰہُ عَزِیۡزًا حَکِیۡمًا ﴿19﴾

**"(ఓ ప్రవక్తా!) విశ్వాసులు చెట్టు క్రింద నీతో (విధేయతా) ప్రమాణం చేస్తూ వున్నప్పుడు అల్లాహ్ వారి పట్ల ప్రసన్ను దయ్యాడు. వారి హృదయాలలో వున్న దానిని ఆయన తెలుసుకున్నాడు. అందువల్ల వారిపై ప్రశాంత స్థితిని అవతరింపజేశాడు. ఇంకా సమీపంలోనే లభించే విజయాన్ని కూడా అనుగ్రహించాడు. ఇంకా ఎన్నో విజయసొత్తులను**

**కూడా! వాటిని వారు స్వంతం చేసుకుంటారు. అల్లాహ్ అపార శక్తి సంపన్నుడు, వివేక సంపన్నుడు.”** ***(ఫతహ్ : 18 - 19)***

అంతేగాక, జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హుదైబియా రోజు మాతో ఇలా అన్నారు: ఈ రోజు మీరు యావత్ భూభాగంలో నివసించే మనుష్యులందరి కన్నా ఉత్తములు. ఆ రోజు మేము మొత్తం 1400 మంది వున్నాం”

*(సహీ బుఖారీ: 4154, సహీ ముస్లిం : కితాబుల్ అమారా : 1856)*

ఉమ్మె బషీర్ (రజి అల్లాహు అన్హ) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఈ వృక్షం క్రింద (నాతో) ప్రమాణం చేసిన వృక్షవాసులలో ఎవ్వరు కూడా ఇన్షా అల్లాహ్ (దైవం తలిస్తే) నరకంలోకి వెళ్ళరు. *(సహీ ముస్లిం : కితాబుల్ ఫజాయెల్ సహాబా : 2496)*

ఈ హదీసులో “ఇన్షాల్లాహ్” అన్న పదం కేవలం మర్యాద పూర్వకంగా (అల్లాహ్ యెడల) గౌరవ సూచకంగా వాడబడినదే తప్పా వారిలో ఏ సహబీ కూడా నరకంలోకి వెళ్ళడు అన్న విషయం మాత్రం పూర్తిగా సత్యం.

*(నవవీ - షరహ్ ముస్లిం: 60-85)*

ఈ హదీసులే కాకుండా, ఖలీఫాలలో ప్రతి ఒక్కరి విశిష్టతలను గూర్చి, అలాగే ఇతర సహాబాల విశిష్టతలను తెలియజేసే హదీసులు ఎన్నో హదీసు గ్రంథాల్లో నిక్షిప్తమై వున్నాయి. వాటన్నింటిని వివరించడానికి ఇక్కడ అవకాశం లేదు. ఆఖరిగా -

అల్లాహ్ మనల్నందరినీ పూర్తి చిత్తశుద్ధితో, ప్రేమతో సహాబాలను అనుసరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## రెండవ ఖుత్బా

మొదటి ఖుత్బాలో మేము ఏ సహాబాల విశిష్టతలను, ప్రత్యేకతలను గూర్చి వివరించామో వారిని గూర్చి మన విశ్వాసం ఎలా వుండాలి? మరియు ఈ విషయంలో అహ్లెసున్నత్ వల్ జమాత్ విశ్వాసం ఎలా ఉండేది? రండి - వీటిని గూర్చి తెలుసుకుందాం.

(1) సహాబాలను ప్రేమించడం మరియు వారి కోసం ప్రార్థించడం వాజిబ్ (తప్పనిసరి).

అహ్లె సున్నత్ వల్ జమాత్ విశ్వాసం ఏమిటంటే – సహాబాలను ప్రేమించటం తప్పనిసరి, వారి కోసం ప్రార్థించటం అవశ్యము మరియు వారి యెడల ద్వేష భావం కలిగి వుండడం నిషేధం. ఎందుకంటే – అల్లాహ్ వారికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సాన్నిధ్యాన్ని ప్రసాదించడంతోపాటు తన ధర్మ సహాయం నిమిత్తం ఆయనతోపాటు జిహాద్ కొరకు ఎన్నుకున్నాడు.

సూరహ్ హష్ర్‌లో అల్లాహ్ ముహాజిర్లు మరియు అన్సార్లను గురించి వివరించిన తర్వాత ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِيْنَ جَآءُوْ مِنْۢ بَعْدِهِمْ يَقُوْلُوْنَ رَبَّنَا اغْفِرْ لَنَا وَلِاِخْوَانِنَا الَّذِيْنَ سَبَقُوْنَا بِالْاِيْمَانِ وَلَا تَجْعَلْ فِيْ قُلُوْبِنَا غِلًّا لِّلَّذِيْنَ اٰمَنُوْا رَبَّنَآ اِنَّكَ رَءُوْفٌ رَّحِيْمٌ ﴿10﴾

**“వారి తర్వాత వచ్చిన వారు (వారికీ ఈ సొమ్ము వర్తిస్తుంది), వారిలా వేడుకుంటారు: మా ప్రభూ! మమ్మల్ని క్షమించు, మా కన్నా ముందు విశ్వసించిన మా సోదరులను కూడా క్షమించు. విశ్వాసుల యెడల మా హృదయాలలో ఎలాంటి ద్వేష భావాన్నీ కలిగించకు. మా ప్రభూ! నిశ్చయంగా నీవు మృదుస్వభావం కలిగిన వాడవు, కనికరించేవాడవు.”** ***(హష్ర్: 10)***

సహాబాలను ప్రేమించడం తప్పనిసరి అని అనడానికి ఈ ఆయత్ ఒక చక్కటి నిదర్శనం. ఎందుకంటే – అల్లాహ్ – సహాబాల తర్వాత వచ్చే వారిని కూడా ‘ఫై’ సొమ్ము (శత్రువుతో తలపడకుండానే ప్రాప్తమయిన సొమ్ము)కు అర్హులుగా నిర్ణయించాడు. కానీ, దీని కోసం విధించిన ఒక షరతు ఏమిటంటే – వారు సహాబాలను ప్రేమించే వారై వుండాలి. ఈ కారణం మూలంగానే ఇమామ్ మాలిక్ దృష్టిలో సహాబాల పట్ల ద్వేష భావం కలిగి వుండేవారు ‘ఫై’ సొమ్ముకు అర్హులు కారు. *(అల్ జామె అల్ కలామ్ అల్ ఖుర్ఆన్ : 18/32)*

ఈ ఆయతునుద్దేశించి ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహాబాల మన్నింపు కోసం ప్రార్థించమని ప్రజలకు

ఆజ్ఞాపించబడింది. కానీ ప్రజలు మాత్రం వారి గురించి చెడుగా పలకడం ఆరంభించారు. *(సహీ ముస్లిం : 3022)*

బరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్సారీలనుద్దేశించి ఇలా సెలవిచ్చారు: కేవలం నిజమైన విశ్వాసులే వీరిని ప్రేమించగలుగుతారు. వీరిని ద్వేషించేవాడు కపట విశ్వాసే అవుతాడు. వారిని ప్రేమించేవారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. వారిని ద్వేషించే వారిని అల్లాహ్ ద్వేషిస్తాడు.

*(సహీ బుఖారీ : 3783, సహీ ముస్లిం : కితాబుల్ ఈమాన్ : 75)*

కనుక తెలిసిందేమిటంటే – విశ్వాసుల లక్షణం ఏమిటంటే – వారు సహాబాలను ప్రేమిస్తారు, వారి కోసం ప్రార్థిస్తారు మరియు తమ హృదయాలను వారిని ద్వేషించడం నుండి పవిత్రంగా వుంచుతారు.

ఇమామ్ అబూ జాఫర్ అత్తహావీ (రహిమహుల్లాహ్) సహాబాలను గూర్చి అహ్లె సున్నత్ వల్ జమాత్ విశ్వాసాన్ని వివరిస్తూ ఇలా సెలవిచ్చారు:

"మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులను ప్రేమిస్తాము, వారిని ప్రేమించడంలో ఏ ఒక్కరి విషయంలో కూడా అతిశయోక్తిని ప్రదర్శించము. అంతేగాక, ఏ ఒక్కరితో విముక్తిని కూడా ప్రకటించుకోము. సహాబాలను ద్వేషించే ప్రతి వ్యక్తినీ, వారిని చెడుగా చిత్రీకరించే ప్రతి ఒక్కరినీ మేము కూడా ద్వేషిస్తాము. మేమైతే సహాబాలను మంచి తలంపుతో స్మరించు కుంటాము. వారిని ప్రేమించడం ధర్మం, విశ్వాసం మరియు ఎహ్సాన్ లలో ఓ ముఖ్య భాగం అనీ మరియు వారిని ద్వేషించడం, తిరస్కారానికి (కుఫ్ర్), కాపట్యానికి (నిఫాక్) మరియు అవిధేయతలకు చిహ్నామని భావిస్తాము."

*(షరహ్ అఖీదా తహావియ : 467 పేజీ)*

షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియా (రహిమహుల్లాహ్) ఇలా సెలవిచ్చారు: అహ్లె సున్నత్ వల్ జమాత్ నిబంధనలలో ఒక నిబంధన ఏమిటంటే – వారు తమ హృదయాలను సహాబాల ద్వేషం నుండి మరియు తమ నాలుకలను వారి దోషాలను వెలికితీయడం నుండి సురక్షితంగా వుంచుతారు.

## 2) అహ్లె సున్నత్ వల్ జమాత్ సహాబాల కోసం స్వర్గాన్ని గూర్చిన సాక్ష్యం ఇస్తారు

మేము ఈ ఖుత్బా ఆరంభంలో సూరహ్ తౌబా, ఆయత్ నెం.100 ద్వారా – అల్లాహ్ ముహాజిర్లు, అన్సారులు మరియు వారిని అనుసరించేవారి పట్ల ప్రసన్నుడైన విషయం మరియు వారి కొరకు స్వర్గాన్ని గూర్చి వాగ్దానం చేసిన విషయం నిరూపించాము. అందుకే అహ్లె సున్నత్ వల్ జమాత్ సహాబాలందరికోసం స్వర్గాన్ని గూర్చిన సాక్ష్యమిస్తారు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రత్యేకంగా పేర్లు తీసుకొని 'స్వర్గవాసులు' అని ఖరారుచేసిన సహాబాలను కూడా అహ్లె సున్నత్ వల్ జమాత్ స్వర్గాన్ని గూర్చిన సాక్ష్యం ఇస్తారు.

ఉదాహరణకు – 'అష్రా ముబష్షరా' (శుభవార్త పొందిన పది మంది) గురించి ఇలా సెలవిచ్చారు:

"అబూ బక్ర్ స్వర్గంలో వున్నారు. ఉమర్ స్వర్గంలో వున్నారు, ఉస్మాన్ స్వర్గంలో వున్నారు. అలీ స్వర్గంలో వున్నారు. తల్హా స్వర్గంలో వున్నారు, జుబైర్ స్వర్గంలో వున్నారు. అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ స్వర్గంలో వున్నారు. సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ స్వర్గంలో వున్నారు. సయీద్ బిన్ జుబైర్ స్వర్గంలో వున్నారు మరియు అబూ ఉబైదా బిన్ జర్రాహ్(రజి అల్లాహు అన్హుమ్) స్వర్గంలో వున్నారు."

*(తిర్మిజి, ముస్నద్ అహ్మద్, సహీ ఉల్ జామె లిల్ అల్బానీ : 50)*

ఇలాగే, ఇంకా ఎంతో మంది సహాబాల పేర్లు తీసుకొని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారిని స్వర్గవాసులుగా ఖరారు చేశారు. అయితే, కేవలం కొంతమంది పేర్లు తీసుకోవడం వల్ల మిగతా సహాబాలు స్వర్గవాసులు కారు అని భావించరాదు. వాస్తవానికి కొంతమంది పేర్లు తీసుకోవడం అనేది సహాబాలలో వారి విశిష్టతకు నిదర్శనం మాత్రమే. ఎందుకంటే– సహాబాలందరి కోసం అల్లాహ్ స్వర్గాన్ని గూర్చి వాగ్దానం చేసిన విషయాన్ని మేము దివ్య ఖుర్ఆన్ ద్వారా ముందే నిరూపించి వున్నాం.

## 3) సహాబాలందరూ విశ్వాసపాత్రులు మరియు నమ్మదగినవారు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَا كَانَ اللَّهُ لِيُضِيعَ إِيمَانَكُمْ ۚ إِنَّ اللَّهَ بِالنَّاسِ لَرَءُوفٌ رَّحِيمٌ (143)

**"అదే విధంగా మేము మిమ్మల్ని ఒక న్యాయశీల సమాజం (ఉత్తమమైన) (ఉమ్మతే వసత్)గా చేశాము. మీరు ప్రజలపై సాక్షులుగా, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మీపై సాక్షిగా ఉండటం కోసం."**

***(బఖర : 143)***

"ఉమ్మతే వసత్" అంటే అత్యధిక విశ్లేషకులు "ఉత్తమమైన, అన్నిటికన్నా శ్రేష్టమైన, విశ్వాసపాత్రమైన, నమ్మదగిన సమాజం" అని విశ్లేషించారు.

*(తఫ్సీర్ జామె అల్ బయాన్ : 2/7, తఫ్సీర్ అల్ ఖుర్తుబీ : 2/153, తఫ్సీర్ ఇబ్నె కసీర్ : 1/335)*

ఈ ఆయత్‌లో ప్రప్రథమంగా సంబోధించబడ్డవారు – ధర్మ ప్రచార బాధ్యత మోపబడిన సహాబాలే. ఈ విషయాన్నే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

كُنتُمْ خَيْرَ أُمَّةٍ أُخْرِجَتْ لِلنَّاسِ تَأْمُرُونَ بِالْمَعْرُوفِ وَتَنْهَوْنَ عَنِ الْمُنكَرِ وَتُؤْمِنُونَ بِاللَّهِ

**"మానవుల కోసం ఉనికిలోకి తీసుకురాబడిన శ్రేష్ట సమాజం మీరు. మీరు మంచి విషయాలకై ఆజ్ఞాపిస్తారు, చెడు నుండి ఆపుతారు. ఇంకా మీరు అల్లాహ్‌ను విశ్వసిస్తారు."** ***(ఆలి ఇమ్రాన్:110)***

అంతేగాక, హజ్జతుల్ విదా (వీడ్కోలు హజ్) సందర్భంగా, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాల పెద్ద సమూహాన్ని ఉద్దేశించి: "జాగ్రత్త! మీలో ఇక్కడ వున్నవారు, ఇక్కడ లేని వారికి ధర్మాన్ని చేరవేయండి!" అని పలికారు. *(సహీ బుఖారీ : 105, సహీ ముస్లిం : కితాబుల్ ఫసామ : 1679)*

ఈ ఆయత్ మరియు హదీసుల ద్వారా రూఢి అయిన విషయమేమిటంటే – సహాబాలు అమానతుదారులు, విశ్వాసపాత్రులు, మరియు నమ్మదగినవారు. అందుకే వారిపై ఎంతో ముఖ్యమైన ధర్మ ప్రచార బాధ్యతలు మోపబడ్డాయి. ఒకవేళ వారిలో ఈ గుణగణాలు వుండకపోతే, ఈ బాధ్యతలు మోపబడి వుండేవి కావు.

అంతేకాక, అల్లాహ్ – “న్యాయశీల సమాజం” అని అన్న తర్వాత “ప్రజలపై సాక్షులుగా వుంటారు” అని తెలియజేశాడు. అంటే దీని అర్థం – అల్లాహ్ వద్ద వారి సాక్ష్యం స్వీకరించబడుతుంది అన్నమాట. ఇది కూడా వారు న్యాయశీలురు, విశ్వాసపాత్రులు మరియు నమ్మదగిన వారు కావడానికి ఒక నిదర్శనం. అలాకాని పక్షంలో, వారి సాక్ష్యం కూడా స్వీకరించబడి వుండేది కాదు!!

ఇమామ్ ఖుర్తుబీ (రహిమహుల్లాహ్) సూరహ్ ఫతహ్ యొక్క ఆఖరి ఆయత్ “ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త, ఆయన వెంట వున్నవారు అవిశ్వాసుల పట్ల కఠినులుగానూ, పరస్పరం కరుణామయులుగానూ వుంటారు.....” గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా సెలవిచ్చారు:

“సహాబా లందరూ న్యాయశీలురు, విశ్వాసపాత్రులు మరియు నమ్మదగిన వారు. అల్లాహ్ మిత్రులు మరియు ఆయన ప్రియతమ దాసులు. అల్లాహ్ సృష్టిలో దైవప్రవక్తలు, సందేశహరుల తర్వాత అందరికన్నా శ్రేష్టులు. ఇదే అహ్లె సున్నత్ వల్ జమాత్ ఇమాముల అభిమతం. కానీ, ఓ వర్గం ఈ వాదన సరైనది కాదు అని అంటూ, “ సహాబాలు కూడా సాధారణ మనుష్యుల లాంటి వారే, కనుక వారి విశ్వాస పాత్రతను గూర్చి కూడా తప్పనిసరిగా చర్చించాలి” అని అంటుంది.

కానీ, వీరి తర్కం సరైనది కాదు. ఎందుకంటే – స్వయంగా అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడైన విషయాన్ని ప్రకటించి, వారి కోసం స్వర్గం మరియు మన్నింపుల వాగ్దానం చేసివున్నాడు. *(తఫ్సీర్ అల్ ఖుర్తుబీ : 16/399)*

## 4) నలుగురు ఖలీఫాలు –అబూ బక్ర్, తర్వాత ఉమర్, తర్వాత ఉస్మాన్, తర్వాత అలీ (రజి అల్లాహు అన్హుమ్)

సహాబాలందరిలో ఉత్తమమైన సహాబీ అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు). మొట్టమొదటి ఖలీఫా కూడా ఆయనే. అహ్లె సున్నత్ వల్ జమాత్ ఈ విషయంలో ఏకాభిప్రాయం కలిగివున్నారు. ఆయనకు దొరికిన ఈ అధికారం స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఎన్నో హదీసుల ద్వారా గ్రహించ బడింది.

అదెలా అంటే – తన జీవితపు ఆఖరి రోజుల్లో అనారోగ్య స్థితికి గురైనప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రజలకు నమాజ్

చేయించమని అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు)కే ఆజ్ఞాపించారు. మరి ఏ వ్యక్తి అయితే ఆయన (దైవ ప్రవక్త ) జీవితంలోనే ఇమామ్ అవడానికి అర్హుడయ్యాడో, ఆయన మరణం తర్వాత కూడా ఖలీఫా (ఉత్తరాధికారి) అవడానికి అందరికన్నా ఎక్కువ అర్హుడు అన్న విషయానికి ఇదొక చక్కటి నిదర్శనం.

అంతేకాక, సహీ బుఖారీలో జుబైర్ బిన్ మతామ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒక స్త్రీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వస్తే, ఆయన ఆ స్త్రీ ని మళ్ళీ (మరో సమయంలో తర్వాత) రమ్మని ఆజ్ఞాపించారు. దీనిపై ఆ స్త్రీ : ఒకవేళ నేను వచ్చినపుడు మీరే గనక లేకపోతే? అని అడిగింది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ: “ఒకవేళ నేను లేకపోతే అబూ బక్ర్ దగ్గరికెళ్ళు” అని అన్నారు. *(సహీ బుఖారీ : 3659)*

ఖిలాఫత్ కొరకు మొట్టమొదటి హక్కుదారులు అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) అని అనడానికి ఈ హదీసు ఒక స్పష్టమైన ప్రమాణం.

ఈ విషయాన్ని గ్రహించే, “సఖీఫా బనూ సాగ” సమ్మేళనంలో పాల్గొన్న ముహాజిర్లు మరియు అన్సారులందరూ అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) వద్ద బైత్ (ప్రమాణం) చేశారు. ఈ విషయమే సహీ బుఖారీలో ఉల్లేఖించబడింది. *(సహీ బుఖారీ : 3668)*

ఇదే విధంగా, అహ్లె సున్నత్ వల్ జమాత్ ఉమ్మడి విశ్వాసం ఏమిటంటే – అబూ బక్ర్ తర్వాత రెండవ ఖలీఫా ఉమర్, తదుపరి మూడవ ఖలీఫా ఉస్మాన్, ఆ తర్వాత నాల్గవ ఖలీఫా అలీ (రజి అల్లాహు అన్హుమ్).

*(అఖీదా అహ్లె సున్నత్ వల్ జమాత్ ఫీ సహాబా : 2/514)*

## 5) సహాబాలను గూర్చి చెడుగా పలకడం నిషేధించబడింది

అహ్లె సున్నత్ వల్ జమాత్ దృష్టిలో సహాబాలను గూర్చి చెడుగా పలకడం, వారిని దుర్భాషలాడడం నిషేధించబడింది. ఈ నిషేధం దివ్య ఖుర్ఆన్ మరియు హదీసుల ఎన్నో ఆధారాల ద్వారా నిరూపించబడింది:

1. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِيْنَ يُؤْذُوْنَ الْمُؤْمِنِيْنَ وَالْمُؤْمِنٰتِ بِغَيْرِ مَا اكْتَسَبُوْا فَقَدِ احْتَمَلُوْا بُهْتَانًا وَّاِثْمًا مُّبِيْنًا ﴿58﴾

**“తప్పు చేయని విశ్వాసులైన పురుషులను, విశ్వాసులైన స్త్రీలను వేధించేవారు (చాలా పెద్ద) అభాండాన్ని, స్పష్టమైన పాప భారాన్ని మోసిన వారవుతారు.” *(అహ్‌జాబ్ : 58)***

ఈ ఆయత్‌లో “విశ్వాసులను” గూర్చి వివరించబడింది. మరి ఈ అనుచర సమాజపు ప్రప్రథమ విశ్వాసులు సహాబాలే. వారిని తూలనాడడం ద్వారా బాధించడం అనేది దివ్య ఖుర్ఆన్ భాషలో ‘అభాండమూ మరియు మహా పాపమూను.’

2. ఖుత్బా ఆరంభంలో మేము వివరించిన, సూరహ్ ఫతహ్‌లోని ఆఖరి ఆయత్ “ముహమ్మద్ అల్లాహ్ ప్రవక్త.----” దీనిలో సహాబాల పట్ల ద్వేష భావం కలిగి వుండడం, వారిని గూర్చి చెడుగా పలకడం అనేవి ముస్లిములకు శోభించదు అని అనడానికి ఇదొక చక్కటి నిదర్శనం. ఎందుకంటే – ఇలా చేయడం అవిశ్వాసుల పని కాబట్టి.

3. సహాబాల శ్రేష్టతను గూర్చిన కొన్ని హదీసులను మేము మొదటి ఖుత్బాలో వివరించాము. దానిలో ఒక హదీసు అబూ సయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించింది. దీని ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాలను గూర్చి దుర్భాషలాడటాన్ని (గట్టిగా) వారించారు.

వారిని తూలనాడడం నిషేధించబడింది అని అనడానికి ఇదొక స్పష్టమైన ప్రమాణం.

4. ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: సహాబాలను తూలనాడే వ్యక్తిపై అల్లాహ్ శాపం, దైవదూతల శాపం మరియు యావత్ ప్రజల శాపం అవతరించుగాక! *(తబ్రానీ – అల్ కబీర్ & అస్సహీహా–అల్‌బానీ : 234)*

ఈ హదీసులో – సహాబాలను దుర్భాషలాడే మరియు వారి పట్ల క్రోధాన్ని కలిగి వున్న వ్యక్తిని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శాపగ్రస్తుడిగా ఖరారు చేశారు. మరి ఈ కార్యాలలో నిమగ్నమై వున్నవారు స్వయంగా తామే ఆలోచించుకోవాలి – వారిని గూర్చి దైవప్రవక్త ఏమని నిర్ణయించారో!!

5. జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఆయెషా (రజి అల్లాహు

అన్హు)తో ఇలా అనబడింది: ప్రజలు దైవప్రవక్త సహాబాలను గూర్చి చెడుగా పలుకుతున్నారు. చివరికి అబూ బక్ర్, ఉమర్ (రజి అల్లాహు అన్హుమ్)లను కూడా వదల్లేదు! దీనిపై ఆయెషా (రజి అల్లాహు అన్హా) స్పందిస్తూ : మీరు దీనికి ఆశ్చర్యపడుతున్నారా? వాస్తవానికి వారి ఆచరణ సమాప్తమయ్యింది. కానీ, అల్లాహ్ ఇష్టపడిందేమిటంటే వారి (పుణ్య) ప్రతిఫలం మాత్రం సమాప్తం కాకూడదు. *(జామె అల్ ఉసూల్ : 9/408)*

ఈ ఆధారాలన్నింటి ద్వారా స్పష్టమైన విషయమేమిటంటే – సహాబాల విషయంలో మన హృదయాలను వారిని ద్వేషించడం నుండి పరిశుద్ధంగా వుంచడం మరియు మన నాలుకలను వారిని గూర్చి చెడు పలకడంనుండి సురక్షితంగా వుంచడం అనేది ఒక ఆవశ్యకమైన విషయం.

అలా కాని పక్షంలో, ఈ విషయం గుర్తుంచుకోవాలి!

సహాబాలను గూర్చి చెడు పలుకుతూ, వారి దోషాలను ఎత్తిచూపే వ్యక్తి వాస్తవానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దోషాలను ఎత్తి చూపుతాడు. ఎందుకంటే – స్వయంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారికి (సహాబాలకు) (స్వర్గపు) శుభవార్తలు ఇచ్చారు మరియు వారిని అమానుతుదారులు, విశ్వాసపాత్రులుగా ఖరారు చేశారు.

అంతేకాదు, ఆ వ్యక్తి వాస్తవానికి అల్లాహ్ పై కూడా వ్రేలెత్తి చూపుతాడు. కారణం – అల్లాహ్‌యే వారిని (సహాబాలను) తన ప్రవక్త (సహచరిత్వం) కోసం ఎన్నుకున్నాడు. వారిని తన ప్రసన్నతతో అనుగ్రహించాడు మరియు వారికి స్వర్గాన్ని గూర్చి వాగ్దానం చేశాడు.

అంతేకాదు, ఆ మాటకొస్తే, ఆ వ్యక్తి దైవధర్మంపైనే నిందమోపుతాడు. ఎందుకంటే – ఈ ధర్మాన్ని నకలు చేసినవారు ఈ సహాబాలే మరి. అందుకే సహాబాలలో దోషాలను ఎత్తి చూపడం అనేది ఎంతో గంభీరమైన విషయం. కనుక దీని నుండి వెంటనే పశ్చాత్తాపం చెందడం తప్పనిసరి.

అల్లాహ్ మనందరిరినీ – సహాబాలను నిజాయితీగా ప్రేమించే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

# మదీనా ప్రస్థానం (హిజ్రత్)

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1) హిజ్రత్ అర్థం
2) హిజ్రత్ విశిష్టత - దివ్య ఖుర్ఆన్ మరియు హదీసు వెలుగులో
3) హిజ్రత్ ఆదేశం ప్రళయం వరకు ఉంది.
4) మదీనాకు హిజ్రత్ : కారణాలు, వృత్తాంతాలు.

## మొదటి ఖుత్బా

ధార్మిక సహోదరులారా!

హిజ్రీ శకపు నూతన సంవత్సరపు ఆరంభాన్ని పురస్కరించుకొని, నేటి ప్రసంగంలో, ఎంతో ప్రాచుర్యం పొందిన "మదీనా ప్రస్థానం (హిజ్రత్)" వృత్తాంతాన్ని సమగ్రంగా వివరించడం సబబుగా అనిపిస్తోంది. ఎందుకంటే- ఈ సంఘటన ద్వారానే ఇస్లామీ శకం ఆరంభమైనది. కానీ, దీని వివరాల్లోకి వెళ్ళే ముందు అసలు హిజ్రత్ అంటే ఏమిటి? దివ్య ఖుర్ఆన్ మరియు హదీసులలో దీని గూర్చి వివరించబడ్డ విశిష్ఠతలు ఏమిటి? వీటిని గూర్చి తెలుసుకుందాం రండి.

హిజ్రత్ అంటే - 'అల్ హిజ్రహ్' హిజర్ నుండి వచ్చింది. దీని అర్థం 'వదలిపెట్టడం' అని.

అరబ్బులు ఇలా అనేవారు:

"ఫలానా జాతి ఒక ప్రదేశాన్ని వదిలి మరో ప్రదేశానికి వెళ్ళిపోయింది." ముహాజిర్ సహాబాలు కూడా మక్కా పట్టణాన్ని వదిలి మదీనాకు ప్రస్థానం గావించారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاهْجُرُوهُنَّ فِي الْمَضَاجِعِ

**"మరియు పడక గదులలో వారిని వదిలిపెట్టండి"** *(నిసా : 34)*

'అల్ హిజ్రత్' ను మెజారిటీ ఉలమాలు ధార్మికంగా ఇలా నిర్వచించారు:

"అవిశ్వాస భూభాగం (దారుల్ కుఫ్ర్) నుండి ఇస్లామీయ భూభాగం (దారుల్ ఇస్లామ్) వైపు మరలిరావడం".

అయితే, హాఫిజ్ ఇబ్నె హజర్ (రహిమహుల్లాహ్) దీని గురించి ఇలా వివరించారు:

"షరీయత్తు పరంగా 'హిజ్రత్' అంటే – అల్లాహ్ వారించిన ప్రతి కార్యాన్నీ విడిచిపెట్టడం."

బహుశా, హాఫిజ్ ఇబ్నె హజర్ (రహిమహుల్లాహ్) ఈ నిర్వచనాన్ని, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఈ హదీసు నుండి గ్రహించి వుండవచ్చు.

"అల్లాహ్ వారించిన కార్యాలను విడిచిపెట్టేవాడు ముహాజిర్"

*(బుఖారీ: 1/35, అల్ ఫతహ్)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే– 'హిజ్రత్' అన్న పదం – బాహ్యము మరియు అంతరంగం – ఈ రెండు రకాల హిజ్రత్‌లకు కూడా వర్తిస్తుంది.

అంతరంగ హిజ్రత్ లక్ష్యమేమిటంటే – మనిషి షైతాను మరియు స్వయంగా అతని మనస్సు ఎంతో ఆకర్షకంగా మలచి అతని ముందు ప్రవేశపెట్టే కార్యాలను త్యజించడం. ఇక, బాహ్య హిజ్రత్ లక్ష్యమేమిటంటే – మనిషి తన ధర్మాన్ని అవిశ్వాసం మరియు ఉపద్రవాల బారి నుండి కాపాడుకొనే నిమిత్తం ఇస్లామీయ బోధనలపై శాంతియుతంగా ఆచరించుకోగలిగే ప్రదేశానికి మరలి వెళ్ళడం. *(ఫతహుల్‌బారి : 1/54)*

ఇమామ్ అలాజ్ బిన్ అబ్దుస్సలామ్ (రహిమహుల్లాహ్) ఇలా సెలవిచ్చారు: హిజ్రత్ రెండు రకాలు – స్వదేశాన్ని విడిచిపెట్టడం మరియు పాపాలను, దౌర్జన్యాన్ని త్యజించడం. వీటిలో, రెండవ హిజ్రత్ ఉత్తమమైనది. ఎందుకంటే – దీని ద్వారా ఆ కరుణామయుడు (అల్లాహ్) సంతృప్తి చెందడమేకాక, మనస్సు మరియు షైతానుల దుష్ప్రేరణ కూడా తగ్గుతుంది.

## హిజ్రత్ విశిష్టతలు

హిజ్రత్ విశిష్టతలు మరియు దాని ద్వారా లభించే ప్రతిఫలాల వివరాలు దివ్య ఖుర్ఆన్ మరియు హదీసులలో లభ్యమవుతాయి. ముందుగా దివ్య ఖుర్ఆన్

లోని కొన్ని ఆయతులు వినండి.

**అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :**

فَاسْتَجَابَ لَهُمْ رَبُّهُمْ اَنِّيْ لَآ اُضِيْعُ عَمَلَ عَامِلٍ مِّنْكُمْ مِّنْ ذَكَرٍ
اَوْ اُنْثٰى ۚ بَعْضُكُمْ مِّنْۢ بَعْضٍ ۚ فَالَّذِيْنَ هَاجَرُوْا وَ اُخْرِجُوْا مِنْ
دِيَارِهِمْ وَ اُوْذُوْا فِيْ سَبِيْلِيْ وَ قٰتَلُوْا وَ قُتِلُوْا لَاُكَفِّرَنَّ عَنْهُمْ سَيِّاٰتِهِمْ
وَلَاُدْخِلَنَّهُمْ جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ ۚ ثَوَابًا مِّنْ عِنْدِ اللّٰهِ ۗ
وَاللّٰهُ عِنْدَهٗ حُسْنُ الثَّوَابِ ﴿١٩٥﴾

**1)** నా కొరకు తమ దేశాన్ని విడిచిపెట్టినవారు, నా మార్గంలో తమ గృహాల నుండి గెంటివేయబడినవారు, హింసించబడినవారు, నా కొరకు పోరాడి చంపబడిన వారు – అటువంటి వారి తప్పులన్నింటినీ నేను క్షమిస్తాను. క్రింద సెలయేళ్ళు ప్రవహించే ఉద్యాన వనాలలోకి వారిని ప్రవేశింపజేస్తాను. ఇది అల్లాహ్ వద్ద వారికి లభించే ప్రతిఫలం – ఉత్తమమైన ప్రతిఫలం అల్లాహ్ వద్దనే ఉంది. ***(ఆలి ఇమ్రాన్ : 195)***

اَلَّذِيْنَ اٰمَنُوْا وَ هَاجَرُوْا وَ جٰهَدُوْا فِيْ سَبِيْلِ اللّٰهِ بِاَمْوَالِهِمْ وَ اَنْفُسِهِمْ
اَعْظَمُ دَرَجَةً عِنْدَ اللّٰهِ ۗ وَ اُولٰٓئِكَ هُمُ الْفَآئِزُوْنَ ﴿٢٠﴾ يُبَشِّرُهُمْ رَبُّهُمْ
بِرَحْمَةٍ مِّنْهُ وَ رِضْوَانٍ وَّ جَنّٰتٍ لَّهُمْ فِيْهَا نَعِيْمٌ مُّقِيْمٌ ﴿٢١﴾
خٰلِدِيْنَ فِيْهَآ اَبَدًا ۗ اِنَّ اللّٰهَ عِنْدَهٗۤ اَجْرٌ عَظِيْمٌ ﴿٢٢﴾

**2)** "విశ్వసించి, అల్లాహ్ మార్గంలో ఇల్లూ వాకిలీ వదిలిపెట్టి, తమ ప్రాణాలతో, తమ సంపదలతో పోరాడిన వారి అంతస్తే ఆయన దృష్టిలో గొప్పది. అట్టివారే సఫలీకృతులు. వారి ప్రభువు వారికి తన కారుణ్యం, తన సంతోషాల శుభవార్తనూ, శాశ్వత భోగాల సామగ్రి గల స్వర్గవనాల శుభవార్తనూ ఇస్తున్నాడు. వాటిలో వారు సదా ఉంటారు. నిశ్చయంగా సేవలకు ప్రతిఫలం ఇవ్వటానికి అల్లాహ్ వద్ద ఎంతో ఉంది."

***(తౌబా : 20–22)***

وَالَّذِينَ هَاجَرُوا فِي اللَّهِ مِن بَعْدِ مَا ظُلِمُوا لَنُبَوِّئَنَّهُمْ فِي الدُّنْيَا حَسَنَةً ۖ
وَلَأَجْرُ الْآخِرَةِ أَكْبَرُ ۚ لَوْ كَانُوا يَعْلَمُونَ (41)

**3) "దౌర్జన్యాన్ని అనుభవించిన తరువాత అల్లాహ్ కోసం వలస పోయిన వారికి మేము ప్రపంచంలో తప్పకుండా మంచి నివాసాన్ని ఇస్తాము. పరలోక ప్రతిఫలమైతే ఇంతకంటే గొప్పగా ఉంటుంది. ఈ విషయం వారు తెలుసుకుంటే ఎంత బాగుండేదో!" *(నహ్ల్ : 41)***

ثُمَّ إِنَّ رَبَّكَ لِلَّذِينَ هَاجَرُوا مِن بَعْدِ مَا فُتِنُوا ثُمَّ جَاهَدُوا وَصَبَرُوا
إِنَّ رَبَّكَ مِن بَعْدِهَا لَغَفُورٌ رَّحِيمٌ (110)

**4) "(విశ్వసించిన కారణంగా) బాధలకు గురి చెయ్యబడినప్పుడు ఇల్లూ వాకిలీ విడిచి పెట్టినవారూ, వలసపోయినవారూ, దైవమార్గంలో కష్టాలను భరించినవారూ, సహనంతో వ్యవహరించినవారూ- వారికొరకు నీ ప్రభువు నిశ్చయంగా క్షమించేవాడుగా, కరుణించేవాడుగా ఉంటాడు." *(నహ్ల్ : 110)***

హాఫిజ్ ఇబ్నె కసీర్ (రహిమహుల్లాహ్) ఈ ఆయత్‌పై వ్యాఖ్యానిస్తూ ఇలా పేర్కొన్నారు: "మక్కాలో బలహీనులుగా, అల్పులుగా అంచనా వేయ బడ్డవారు వీరే. వారెన్నో పరీక్షలను ఎదుర్కొన్నారు. తదుపరి వారికి హిజ్రత్ ద్వారా ఉపద్రవాల నుండి ఉపశమనం పొందే అవకాశం దొరికింది. అందుకే వారు తమ కుటుంబీకులను, తమ సంపదను, అల్లాహ్ ప్రసన్నత మరియు ఆయన మన్నింపుల కోసం వదులుకొని మదీనాకు వచ్చి విశ్వాసులతో కలిసి పోయారు. ఆ తర్వాత వారు అవిశ్వాసులతో జిహాద్ చేశారు మరియు సహన స్థయిర్యాలను ప్రదర్శించారు. వారి గురించే, అల్లాహ్ సెలవిచ్చిందేమిటంటే- వారి అత్యుత్తమ ఆచరణల తర్వాత అల్లాహ్ తప్పకుండా వారి పాపాలను మన్నిస్తాడు మరియు ప్రళయదినం నాడు వారిని కరుణిస్తాడు."

*(తఫ్సీర్ ఇబ్నె కసీర్ : 2/777)*

5) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِينَ هَاجَرُوا فِي سَبِيلِ اللَّهِ ثُمَّ قُتِلُوا أَوْ مَاتُوا لَيَرْزُقَنَّهُمُ
اللَّهُ رِزْقًا حَسَنًا ۚ وَإِنَّ اللَّهَ لَهُوَ خَيْرُ الرَّازِقِينَ (58)

“ఎవరు అల్లాహ్ మార్గంలో వలసపోయారో, తరువాత చంపబడ్డారో లేక మరణించారో వారికి అల్లాహ్ మంచి ఉపాధిని ప్రసాదిస్తాడు. నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే ఉత్తమ ఉపాధి ప్రదాత.” *(హజ్ : 58)*

6) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَنْ يُّهَاجِرْ فِيْ سَبِيْلِ اللّٰهِ يَجِدْ فِي الْاَرْضِ مُرٰغَمًا كَثِيْرًا وَّسَعَةً ۭ وَمَنْ يَّخْرُجْ مِنْۢ بَيْتِهٖ مُهَاجِرًا اِلَى اللّٰهِ وَرَسُوْلِهٖ ثُمَّ يُدْرِكْهُ الْمَوْتُ فَقَدْ وَقَعَ اَجْرُهٗ عَلَي اللّٰهِ ۭ وَكَانَ اللّٰهُ غَفُوْرًا رَّحِيْمًا (100)

“అల్లాహ్ మార్గంలో వలసపోయేవాడు ఆశ్రయం పొందటానికి పుడమిలో కావలసినంత స్థలాన్నీ, బ్రతుకు తెరువుకు ఎక్కువ అవకాశాలనూ పొందుతాడు. అల్లాహ్ వైపునకు, ఆయన ప్రవక్త వైపునకు వలస పోవటానికి తన గృహం నుండి బయలుదేరి మార్గమధ్యంలోనే మరణించినవానికి విధిగా ప్రతిఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌దే. అల్లాహ్ క్షమాభిక్ష పెట్టేవాడు, కరుణించేవాడూను.” *(నిసా : 100)*

వ్యాఖ్యాతలు ఈ ఆయత్ గురించి వ్యాఖ్యానించిందేమిటంటే – దీనిలో హిజ్రత్ గురించి ప్రోత్సహించడం జరిగింది. అల్లాహ్ ప్రసన్నతను చూరగొనే ఉద్దేశ్యం రీత్యా హిజ్రత్ చేసే వ్యక్తికి అల్లాహ్ చేసిన వాగ్దానమేమిటంటే – తన ఇల్లూ వాకిలీ వదిలిన తర్వాత శాంతియుతంగా జీవించడానికి అతనికి పుడమిలో తప్పకుండా వేరే ఆశ్రయం దొరుకుతుంది. ఒకవేళ హిజ్రత్ ప్రయాణంలోనే గనక అతనికి మరణం సంభవిస్తే అల్లాహ్ తప్పకుండా అతనికి పుణ్యఫలం నుండి దూరం గావించడు. *(జామె అల్ బయాన్ తబరీ – 4/238)*

ఇక హిజ్రత్ మహత్యాన్ని గూర్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సెలవిచ్చిన కొన్ని హదీసులు వినండి:

1) అమ్ర్ బిన్ అల్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం – అల్లాహ్ ఆయన హృదయంలో ఇస్లాం పట్ల ప్రేమను కలుగజేసినపుడు, ఆయన దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి విచ్చేసి ఇలా అడిగారు: ఓ దైవప్రవక్తా! మీ చేయిని ముందుకు చాపండి. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతిని ముందుకు చాపగానే ఆయన తన చేతిని వెనక్కు

లాక్కున్నారు. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కారణం అడగ్గా, ఆయన – నేను ప్రమాణం చేసే ముందు ఒక షరతు పెట్టాలను కొంటున్నాను. అదేమిటంటే – అల్లాహ్ నా పాపాలను క్షమించాలి అని అన్నారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – నీకు తెలియదా? ఇస్లాం స్వీకారం గత పాపాలను సమాప్తం చేస్తుంది, హిజ్రత్ గత పొరపాట్లను తుడిచివేస్తుంది మరియు హజ్ గత లోటుపాట్లను క్షమించివేస్తుంది.

*(సహీ ముస్లిం : 121)*

2) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబూ ఫాతిమా (రజి అల్లాహు అన్హు)కు ఇలా ఉద్బోధించారు: నీవు హిజ్రత్ తప్పకుండా చేయి, ఎందుకంటే (పుణ్యఫలం రీత్యా) దానికి సమానమైన ఆచరణ ఏదియూ లేదు.

*(నసాయి, సహీ ఉల్‌జామె – అల్‌బానీ : 4045, అస్సహీహ : 1937)*

3) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం: “నన్ను విశ్వసించి, ఇస్లాం స్వీకరించి, తదుపరి హిజ్రత్ చేసిన వ్యక్తికి స్వర్గంలో అధమ స్థాయిలో, మధ్యస్థాయిలో మరియు ఉన్నత స్థాయిలో ఒక గృహాన్ని గూర్చిన గ్యారంటీ నేను ఇస్తాను.” *(నసాయి, సహీ ఉల్ జామె : 1465)*

4) అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, ఓసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనతో – నా అనుచర సమాజంలో అందరికన్నా ముందుగా స్వర్గంలోకి వెళ్ళే వ్యక్తులెవరో నీకు తెలుసా? అని అడిగారు. దీనిపై ఆయన – అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ బాగా తెలుసు అని అన్నారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ ఇలా అన్నారు: వారు ముహాజిర్లు అయి వుంటారు. ప్రళయం రోజు వారు స్వర్గ ద్వారాల వద్ద కొచ్చి వాటిని తెరవమని విజ్ఞప్తి చేస్తారు. స్వర్గ సంరక్షణ దూతలు వారితో – మీ కర్మల విచారణ పూర్తయ్యిందా? అని అడుగుతారు.

వారు జవాబిస్తూ – మా ఆచరణల్లో దేనిని గూర్చి విచారణ జరగుతుంది? “మేము జీవితాంతం ఖడ్గాలను భుజాలపై మోస్తూ అల్లాహ్ మార్గంలో శ్రమించేవారం. ఈ స్థితిలోనే మాకు మరణం సంభవించింది” అని వారు జవాబిస్తారు. తదుపరి వారి కోసం స్వర్గ ద్వారం తెరువబడుతుంది మరియు ఇతరులు స్వర్గంలోకి ప్రవేశించడానికి 40 సంవత్సరాల ముందే వారు దానిలోకి

ప్రవేశించి, మధ్యాహ్నం కునుకును (సయితం) ఆస్వాదిస్తారు. *(హాకిమ్:2/70, సహీ –బుఖారీ, ముస్లిం షరతులతో మరియు ఫికహ్ జహబీ)*

5) జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం తుఫైల్ బిన్ అమ్ర్ అద్దౌసీ (రజి అల్లాహు అన్హు) ఓసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి ఆయనతో – దౌస్ తెగవారి పటిష్ఠ కోటలోకి ఆయన (దైవప్రవక్త) సంరక్షణ నిమిత్తం వేంచేయమని విన్నవించుకున్నారు. కానీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విన్నపాన్ని తిరస్కరించారు. ఎందుకంటే – ఈ గౌరవం మదీనా అన్సారులకు దక్కాల్సి వుంది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హిజ్రత్ చేసి మదీనాకు రాగా, తుఫైల్ బిన్ అమ్ర్ అద్దౌసీ కూడా తన తెగకు చెందిన ఒక వ్యక్తితో కలిసి హిజ్రత్ చేసి మదీనాకు విచ్చేశారు. కానీ, మదీనా వాతావరణం వారికి సరిపోలేదు. తుఫైల్ (రజిఅల్లాహు అన్హు) సహచరుడు అనారోగ్యానికి గురై తీవ్ర విచారానికి లోనయ్యాడు. ఓ రోజు అకస్మాత్తుగా అతను పదునుగా వున్న తన ఆయుధంతో వ్రేళ్ళ కొనలను కోసుకున్నాడు. దీని వల్ల అతని చేతుల నుండి రక్తం కారసాగింది. తుదకు అతనికి మృత్యువు సంభవించింది.

ఆ తర్వాత తుఫైల్ (రజి అల్లాహు అన్హు) అతడిని ఒక రోజు కలలో చూడగా – అతడు మంచి రూపు రేఖలతో దర్శనమిచ్చాడు. కానీ, అతడి చేతులు మాత్రం కప్పబడి వున్నాయి. ఆయన, అతనితో – నీ ప్రభువు నీతో ఎలా వ్యవహరించాడు అని అడగ్గా, అతను జవాబిస్తూ – 'దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వైపునకు హిజ్రత్ చేసిన కారణంగా అల్లాహ్ నన్నుమన్నించాడు' అని అన్నాడు. ఆయన తిరిగి ప్రశ్నిస్తూ – మరైతే, నీ చేతులు కప్పబడి వుండడానికి కారణం ఏమిటి? అని అడిగారు. అతను జవాబిస్తూ – 'స్వయంగా నీ చేతులారా చెడగొట్టుకున్న వాటిని మేము సరిచేయం' అని నాకు చెప్పబడింది. అని అన్నారు.

తుఫైల్ బిన్ అమ్ర్ (రజి అల్లాహు అన్హు) ఈ కలను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముందు ప్రస్తావించగా, ఆయన – "ఓ అల్లాహ్! అతని చేతులను కూడా మన్నించు" అని ప్రార్థించారు.

*(సహీ ముస్లిం – కితాబుల్ ఈమాన్ : 116)*

6) అబూ సయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: బీద ముహాజిర్లు, ధనిక ముహాజిర్ల కన్నా 500 సంవత్సరాలు ముందుగా స్వర్గంలో ప్రవేశిస్తారు.

*(ఇబ్నెమాజా : 4123, సహీ ఇబ్నె మాజా – అల్‌బానీ : 3327)*

7) అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఓ రోజు మేమంతా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలో కూర్చొని వున్నాం. ఈ లోగా సూర్యోదయమయ్యింది. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రళయం రోజు నా అనుచర సమాజంలోని కొందరు సూర్యకాంతి లాంటి తేజస్సుతో వస్తారు. మేము ఓ దైవప్రవక్తా! వారెవరై వుంటారు? అని అడిగాము. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – 'బీద ముహాజిర్లు' అని అన్నారు.

*(అహ్మద్ : 2/177, 6609, అహ్మద్ షాకిర్ సహీ పరంపరతో)*

ప్రియ శ్రోతలారా!

ఇంతవరకూ మీరు, హిజ్రత్ మహత్యం గురించి దివ్య ఖుర్ఆన్ ఆయతులు మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసులు విన్నారు. వీటిద్వారా, అల్లాహ్ దృష్టిలో హిజ్రత్‌కు గల గౌరవౌన్నత్యాలు, ప్రాముఖ్యత మరియు ఇస్లాంలో దానికి గల స్థానం గురించి మీకు తెలిసిపోయి వుంటుంది.

## హిజ్రత్ ప్రళయం వరకు మిగిలి వుంది

హిజ్రత్ ఆదేశం మక్కా విజయం తర్వాత సమాప్తం కాలేదు. పైగా ఇది ప్రళయం వరకు మిగిలి వుంది మరియు జరుగుతూ ఉంటుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: పశ్చాత్తాప ద్వారం మూసి వేయబడనంత వరకు హిజ్రత్ సమాప్తం కాదు. సూర్యుడు పడమర నుంచి ఉదయించనంత వరకు పశ్చాత్తాప ద్వారం మూయబడదు. *(ముస్నద్ అహ్మద్ :4/99, అబూదావూద్ :2479, సహీ అబూదావూద్ : 2166)*

ఇక, "మక్కా విజయం తర్వాత హిజ్రత్ లేదు" అన్న హదీసు విషయానికొస్తే – దాని అసలు ఉద్దేశ్యమేమిటంటే – మక్కా జయించబడ్డ తర్వాత మక్కా నుండి మదీనాకు ప్రస్థానం చేయడంలో అర్థం వుండదు. అందుకే

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (మక్కా విజయం) తర్వాత హిజ్రత్‌ను వారించారు. అంతేగాని, దీని ద్వారా హిజ్రత్ సంపూర్ణంగా సమాప్తమయ్యింది అని అనుకోవడం పొరపాటు.

ఇమామ్ నవవీ (రహిమహుల్లాహ్) దీనికి గల మరో కారణాన్ని వివరిస్తూ ఇలా పేర్కొన్నారు: మక్కా విజయానికి పూర్వం హిజ్రత్‌కు గల విశిష్టత మరియు ఏ విధంగానయితే ముస్లిములు దౌర్జన్యాన్ని సహించి, కడు దీనావస్థలో హిజ్రత్ చేశారో ఆ విశిష్టత మక్కా విజయం తర్వాత సమాప్తమయ్యింది. ఎందుకంటే – మక్కా విజయం తర్వాత ఇస్లాం ప్రాబల్యం వహించింది మరియు ముస్లిములు కూడా పటిష్టంగా, బలాఢ్యులుగా మారిపోయారు. మక్కా విజయానికి పూర్వం మాత్రం వారు పీడితులుగానూ, అత్యంత బలహీనులు గానూ వుండేవారు.

అందుకే ఆ ప్రత్యేక విశిష్టత కలిగిన హిజ్రత్ మాత్రం మక్కా విజయం తర్వాత సమాప్తమయ్యింది. అంతేగాని, ఆదేశం రీత్యా, హిజ్రత్ ఆదేశం మిగిలివుంది మరియు ప్రళయం వరకూ వుంటుంది.

*(షరహ్ సహీ ముస్లిం : 13/8)*

## దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జీవితంలో హిజ్రత్

ఇస్లాం ప్రారంభ దశలో, ఇస్లాం స్వీకరించిన సహాబాలను మక్కావాసులు ఎంతో హింసించారు, పలు విధాలుగా శిక్షించారు. శిక్షలు కూడా ఎంత తీవ్ర స్థాయిలో వుండేవంటే – వాటిని గుర్తుకు తెచ్చుకుంటేనే వెంట్రుకలు నిక్కబొడుచుకుంటాయి మరియు హృదయం కంపిస్తుంది.

ముస్లిములు బలహీనులుగా వుండగా, అవిశ్వాసులు మాత్రం బలాఢ్యులుగా వున్నారు. బలహీన ముస్లిములు ఇస్లాం కోసం అన్నింటినీ సహించేవారు. చివరికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారికి హిజ్రత్ చేసే అనుమతి ఇచ్చారు. ఇలా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జీవితంలోనే మూడు హిజ్రత్ సంఘటనలు సంభవించాయి.

1) అబిసీనియా వైపునకు మొదటి హిజ్రత్ : ఇది దైవదౌత్యపు 5వ సంవత్సరంలో జరిగింది. 12 మంది పురుషులు, 4గురు స్త్రీలు కాలినడకన సముద్రపు ఒడ్డుకు చేరుకున్నారు. అక్కణ్ణుండి ఓ పడవను అద్దెకు తీసుకొని

అబిసీనియాకు ప్రయాణమయ్యారు. అక్కడ వారిని ప్రత్యేక అతిథులుగా వుంచడం జరిగింది. *(ఫతహుల్ బారీ : 7 /188)*

2) అబిసీనియా వైపునకు రెండవ హిజ్రత్ : మొదటిసారి అబిసీనియాకు హిజ్రత్ చేసిన వారికి – మక్కావాసులు ఇస్లాం స్వీకరంచారు అన్న వార్త అందింది. దీంతో వారిలో చాలా మంది మక్కాకు తిరిగి వచ్చారు. కానీ, అక్కడికొచ్చాక, ఆ వార్త నిజం కాదని వారికి తెలిసింది. అందుకే వారు మరియు వారితోపాటు ఇంకా ఎంతో మంది ముస్లిములు కలిసి మళ్ళీ అబిసీనియాకు తిరిగి హిజ్రత్ చేశారు. వీరి సంఖ్య 80 కన్నా ఎక్కువగానే ఉంది.

*(ఫతహుల్‌బారీ : 7/189)*

3) మదీనాకు హిజ్రత్ : మదీనా ప్రస్థానానికి సంబంధించిన సంఘటనలు ఎలాగైతే సంభవించాయో వాటి వరుస క్రమం ఇలా ఉంది:

## ఉఖ్బా ప్రదేశంలో మదీనా వాసుల మొదటి ప్రమాణం

హజ్ సమయాల్లో మక్కా పట్టణానికి తరలి వచ్చే వేర్వేరు తెగల వారితో కలిసి, వారిని ఇస్లాం వైపునకు పిలవడం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అలవాటు.

ఇలా దైవదౌత్యపు 11వ సంవత్సరంలో హజ్ సమయంలో యస్రిబ్ (మదీనా)వాసులలో 6 గురు ఇస్లాం స్వీకరించారు. తదుపరి, వీరు యస్రిబ్ తిరిగొచ్చాక అక్కడి వారికి ఇస్లాంను పరిచయం చేసి, దాని ప్రత్యేకతలను గూర్చి వివరించారు. దీని ఫలితంగా, మరుసటి సంవత్సరం – అంటే, దైవ దౌత్యపు 12వ సంవత్సరంలో మదీనా నుండి 12 మంది మక్కాకు వచ్చి, మినా లోని ఉఖ్బా ప్రదేశంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చేతులపై ప్రమాణం చేశారు.

ఈ ప్రమాణం గురించి ఈ 12 మందిలోనే ఒకరైన ఉబాదా బిన్ సామిత్ (రజి అల్లాహు అన్హు) ఇలా వివరించారు:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "రండి! వచ్చి (నా చేతుల మీదుగా) ఇలా ప్రమాణం చెయ్యండి! అల్లాహ్‌తో పాటు మరెవ్వరినీ (ఆయనకు) భాగస్వాములుగా చెయ్యము, దొంగతనం, వ్యభిచారానికి పాల్పడము, సంతానాన్ని హతమార్చము. (అమాయకులపై) నిందారోపణలు

చేయము మరియు మంచికి సంబంధించిన కార్యాలలో దైవప్రవక్తకు అవిధేయత చూపము. మీలో ఎవరైనా ఈ షరతులకనుగుణంగా ఆచరిస్తే అతనికి ప్రతిఫలం అల్లాహ్ వద్ద వుంది. ఇక ఎవరైనా ఈ షరతులలో దేనినైనా ఉల్లంఘించడం మూలంగా అతనికి గనక ఈ లోకంలోనే శిక్షపడితే, అది అతని పాలిట పాప పరిహారమవుతుంది. కానీ, ఒకవేళ (అల్లాహ్) అతని తప్పులను కప్పిపుచ్చితే, అతని వ్యవహారం ప్రళయం నాడు అల్లాహ్ వద్ద వుంటుంది. తను తలచుకుంటే అతణ్ణి శిక్షించనూ వచ్చు లేదా అతణ్ణి క్షమించనూవచ్చు."

తదుపరి మేమంతా ఆయన వద్ద ప్రమాణం చేశాము. ఈ ప్రమాణం తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 12 మందితో పాటు ముసైబ్ బిన్ ఆమిర్ (రజి అల్లాహు అన్హు)ను కూడా (ధర్మ ప్రచార నిమిత్తం) మదీనా పంపారు. ఆయనే ఇస్లాం యొక్క మొట్ట మొదటి సందేశప్రదాత. ఆయన మదీనా పట్టణానికి చేరుకున్న తర్వాత ఉస్అద్ బిన్ జరార (రజి అల్లాహు అన్హు) తో కలిసి ఉత్తమ రీతిలో ఇస్లాం సందేశాన్ని ప్రచారం చేయసాగారు. దీని పర్యవసానంగా చాలా మంది ఇస్లాం స్వీకరించసాగారు. ఆఖరికి, మదీనాలో, ఒక్క ముస్లిం కూడా లేని ఒక్క ఇల్లు కూడా మిగల్లేదు. ప్రతి ఇంట్లో కనీసం ఒక్కరైనా ఇస్లాం స్వీకరించారు.

వీరి ప్రచారానికి సంబంధించి చారిత్రక గ్రంథాలలో నిక్షిప్తమై వున్న అత్యంత ఆసక్తికరమైన సంఘటన – సాద్ బిన్ ముఆజ్, ఉసైద్ బిన్ హుజైర్ మరియు ఆయన మొత్తం తెగ బనీ (అబ్దుష్షహల్) ఇస్లాం స్వీకరించడం.

ముసైబ్ బిన్ ఆమిర్ (రజి అల్లాహు అన్హు) దాదాపు 1 సంవత్సరం వరకు మదీనాలో వుండి, నిరంతరం ఇస్లాం ప్రచారం చేయసాగారు. తదుపరి, దైవదౌత్యపు 13వ సంవత్సరంలో హజ్ కాలానికి ముందుగా, మక్కాకు తిరిగి వచ్చి, మదీనా వాసుల ఇస్లాం స్వీకారానికి సంబంధించిన శుభవార్తను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు తెలియజేశారు.

చివరికి ఆయన, ఉహద్ యుద్ధంలో వీరమరణం పొందారు. సహాబాల కథనం ప్రకారం ఆయనను ఖననం చేసే సమయంలో ఆయన శరీరాన్ని కప్పడానికి ఒక చిన్న దుప్పటి మాత్రమే వుంది. దానితో ఆయన తలను కప్పితే కాళ్ళు బహిర్గతం కాసాగాయి మరియు కాళ్ళను కప్పితే తల కనబడ సాగింది. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'అతని తలను దుప్పటితో

కప్పి, కాళ్ళను గడ్డితో కప్పి ఖననం చేయండి' అని ఆదేశించారు.

*(సహీ బుఖారీ : 1276, ముస్లిం : 940)*

## ఉఖ్బా ప్రదేశంలో మదీనా వాసుల రెండవ ప్రమాణం

దైవదౌత్యపు 13 సంవత్సరంలో, హజ్ కాలంలో, మదీనా వాసులలో దాదాపు 70కు పైగా ముస్లిములు హజ్ యాత్ర నిమిత్తం మక్కా విచ్చేశారు. వారి అంతర్యాలలో ఒకే ఒక ప్రశ్న తిరుగుతూ వుంది. అదేమిటంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా మక్కాలో ఎప్పటి వరకు కష్టాలకు గురి కావాలి?

అందుకే, వారికి మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు మధ్య రహస్యంగా 'ఖుర్బానీ దినాలలో, ఉఖ్బా ప్రదేశంలో సమావేశమవుదాం' అని ఒప్పందం కుదిరింది. తదనుగుణంగా, మదీనా వాసులలో 73 మంది పురుషులు, ఇద్దరు స్త్రీలు రాత్రి చీకట్లో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో సమావేశమయ్యారు. ఆ సమయంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు ఆయన బాబాయి అబ్బాస్ బిన్ ముత్తలిబ్ కూడా వున్నారు. ఆయన అప్పటి వరకు ఇంకా ఇస్లాం స్వీకరించలేదు. అందరికన్నా ముందుగా ఆయనే మాట్లాడడం ప్రారంభించారు.

ఓ ఖుజ్‌రుజ్ సమూహమా! దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్థాయి ఏమిటో మీకంతా తెలుసు. మేమెలా ఆయన్ను కాపాడుతున్నామో అది కూడా మీకు తెలుసు. ఆయన, తన జాతిలో గౌరవంగానూ మరియు తన పట్టణంలో అత్యంత సురక్షితంగానూ వున్నారు. కానీ, మీ దగ్గరికి రావాలని ఆయన కోరిక. అందుకే మీరు ఆయన్ను కాపాడుకోగలిగితే మంచిది. మీరు మీ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించాల్సి వుంటుంది. ఒకవేళ మీరు ఆయన్ను అగౌరవంపాలు చేయాలనుకొంటే, ఆయన్ను ఇక్కడే వదిలేయండి. కారణం, ఆయన తన జాతిలో ఇప్పటికీ సురక్షితంగా వున్నారు.

దీనిపై స్పందిస్తూ, కాబ్ (రజి అల్లాహు అన్హు) అత్యంత దృఢ నిశ్చయంతో ఇలా పలికారు: మేము మీ సంభాషణను విన్నాము. ఓ దైవప్రవక్తా! ఇక మీరే స్వయంగా నిర్ణయం తీసుకోండి.

ఆయన మాటలు – మదీనావాసులు, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గురించి తమ బాధ్యతను నిర్వర్తించడానికి పూర్తిగా కృత నిశ్చయంతో వున్నారు అని తెలియజేస్తున్నాయి.

తదుపరి, వారంత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చేతులపై ప్రమాణం చేశారు.

ప్రమాణానికి సంబంధించిన విషయాలను గూర్చి ముస్నద్ అహ్మద్‌లో జాబిర్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖనం ప్రకారం – సహాబాలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో – ఓ దైవప్రవక్తా! ఏ విషయాలపై మేము మీతో ప్రమాణం చేయాలని అడగ్గా, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా బదులిచ్చారు:

మీరు ఈ విషయాల్లో (నాతో) ప్రమాణం చేయండి:

1) చలాకీగా వున్నప్పుడు, సోమరితనం ఆవరించినప్పుడు – ఈ రెండు పరిస్థితులలో కూడా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాట వినాలి మరియు ఆయనకు విధేయత చూపాలి.

2) ధనవంతులుగా వున్నా, కటిక బీదరికంలో వున్నా – ఈ రెండు పరిస్థితుల్లోనూ (అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టాలి.

3) మంచిని బోధించాలి, చెడు నుండి నిరోధించాలి.

4) అల్లాహ్ కోసం (ఎల్లప్పుడూ) సర్వసన్నద్ధులై వుండాలి మరియు ఈ విషయంలో ఎగతాళి చేసే వారెవరినీ లెక్క చేయకూడదు.

5) నేను మీ దగ్గరకు వచ్చినపుడు మీరు నాకు సహాయపడాలి మరియు మీ భార్యా పిల్లలను సంరక్షించుకొనే విధంగా నన్ను కాపాడాలి. బాగా గుర్తుంచుకోండి! దీని ప్రతిఫలం మీ కొరకు స్వర్గం.

*(ముస్నద్ అహ్మద్ : 3/339 (14694), సహీ ఇబ్నె హిబ్బాన్: 15/745, హాకిమ్ : 2/681 (4251)*

ఆ తర్వాత ముస్లిములంతా ఒక్కొక్కరూ ప్రమాణం చేశారు. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారిలోని 12 మందిని, ఈ ఒప్పందాన్ని అమలు చేయడానికిగాను, నాయకులుగా నియమించారు.

# హిజ్రత్ ఆరంభము

ఉఖ్బా ప్రదేశంలో యస్రిబ్ (మదీనా)వాసుల రెండవ ప్రమాణం తర్వాత ముస్లిములు మదీనా ప్రస్థానం చేయడానికి మార్గం సుగమమైంది. ఎందుకంటే, యస్రిబ్ వాసులు ఇస్లాం ధర్మం నిమిత్తం తమ ధన ప్రాణ త్యాగాలకుసైతం సిద్ధమేనని ప్రమాణం చేసి వున్నారు మరియు దౌర్జన్యానికి గురై వున్న దైవప్రవక్త సహాబాలను అన్ని విధాలా ఆదుకోవాల్సిన బాధ్యతను కూడా తమ భుజస్కందాల పై వేసుకొని వున్నారు.

మక్కాలోని బాధిత ముస్లిం ప్రజానీకానికి ఒక శాంతీయుత ఇస్లామీయ ప్రదేశం గోచరించసాగింది. కానీ, అక్కడి వరకు చేరడం అంత సులువు కాదు. కారణం, మక్కా బహుదైవారాధకులు– ముస్లిములకు మక్కా వదిలి వెళ్ళడానికి అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారు. కానీ, అల్లాహ్ మాత్రం ముస్లిములను దౌర్జన్యం నుండి కాపాడి ఇస్లాంను ప్రాబల్యం వహించేలా చేయడానికి నిశ్చయించుకున్నాడు. చివరికి, అల్లాహ్ నిర్ణయించినట్లుగానే అయ్యింది. ముస్లిములు హిజ్రత్ చేయడం ప్రారంభించారు. తమ పూర్వీకుల ప్రదేశం, కుటుంబీకులు, సంపద, ఇల్లూ వాకిలి – అన్నింటినీ వదిలి మదీనాకు బయలుదేశారు. ముష్రిక్కులు, వారి మార్గంలో ఎన్నో రకాల ఆటంకాలను సృష్టించారు. అయినప్పటికీ, ముస్లిములు, ఎంతో ఓర్పుగా వాటిని ఎదుర్కొని ఒకరి తర్వాత మరొకరు హిజ్రత్ చేయసాగారు.

తత్ఫలితంగా, ఉఖ్బా ప్రమాణం జరిగిన కొంత కాలానికే మక్కా పట్టణం ముస్లిములు లేకుండా ఖాళీ అయిపోయింది. కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) , అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) మరియు ఆయన కుటుంబ సభ్యులు మరియు అలీ (రజి అల్లాహు అన్హు) మాత్రమే మక్కాలో వున్నారు. అలాగే ముష్రిక్కులు బలవంతంగా ఆపి వుంచిన ముస్లిములు కూడా అక్కడే వుండిపోయారు. *(జాదుల్ మిఆద్ : 2/52)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా హిజ్రత్ కొరకు సిద్ధంగా వున్నరు. కానీ, అల్లాహ్ అనుమతి కొరకు ఎదురు చూడసాగారు.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముస్లిములతో ఇలా సెలవిచ్చారు: మీరు హిజ్రత్ చేయాల్సిన

పట్టణాన్ని నాకు కలలో చూపించడం జరిగింది. దానిలో ఖర్జూరపు చెట్లు అధికంగా వున్నాయి. అది, రెండు నల్లటి రాతి ప్రదేశాల మధ్య వుంది. అందుకే, ముస్లిములలో అధికమంది మదీనాకు హిజ్రత్ చేశారు. చివరికి, అబిసీనియా వైపుకు హిజ్రత్ చేసిన ముస్లిములు కూడా తిరిగి మదీనాకు ప్రస్థానం గావించారు. అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) కూడా మదీనా ప్రస్థానానికి ఏర్పాట్లు చేసుకున్నారు. కానీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనతో – 'కొంచెం ఆగు, నాక్కూడా (హిజ్రత్ చేయడానికి) అనుమతి లభించవచ్చు' అని అన్నారు. దీనిపై అబూ బక్ర్ – నా తల్లిదండ్రులు మీకు సమర్పితం అవుగాక! ఇలా అని మీరు ఆశిస్తున్నారా? అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అవునని బదులిచ్చారు. అందుకే అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కలిసి హిజ్రత్ చేయడానికి అక్కడే ఆగిపోయారు. ఆయన రెండు వాహనాలను ప్రయాణ నిమిత్తం ఏర్పాటు చేసుకున్నారు. *(బుఖారీ : 2175, 3692, 5470)*

## జాదుల్ నద్వా యందు ఖురైషీయుల పార్లమెంటు సమావేశం

ముస్లిములంతా, ఒక్కొక్కరుగా, మక్కాపట్టణాన్ని వదిలి మదీనాకు ప్రస్థానం గావించడం చూసి ముష్రిక్కులు తీవ్రంగా కలత చెందారు. ఎందుకంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంతటి శ్రేష్టమైన వ్యక్తో మరియు ఆయన సహచరులు ఎంతటి సహన స్థయిర్యాలు కలవారో, ఆయన ఒక్క సైగపై వారంతా ఎలా తమ సర్వస్వాన్ని ధారపోయగలరో వారికి (ముష్రిక్కులకు) బాగా తెలిసి వుంది. అంతేగాక, భౌగోళికంగా మదీనా పట్టణానికి గల ప్రాధాన్యత కూడా వారికి తెలిసి వుంది. మదీనా వారి వ్యాపార మార్గ మధ్యలో వుండేది. ఒకవేళ మదీనా గనక ముస్లిముల కేంద్రంగా మారితే, వారి వ్యాపార బృందాలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తాయని భయపడసాగారు.

అందుకే, వీటన్నింటిని గూర్చి చర్చించడానికి ముష్రిక్కులు (జాదుల్ నద్వా యందు) ఒక చారిత్రాత్మక సమావేశం ఏర్పాటు చేశారు. దీనిలో ఖురైషీయుల అన్ని తెగల నాయకులు పాల్గొని, ఈ పరిస్థితులను అధిగమించడం ఎలా? అన్న దానిపై చర్చించారు.

ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో అబూ జహల్, జుబైర్ బిన్ మతామ్,

ఉత్బా, షైబా, అబుల్ జఖ్తరీ మరియు ఉమయ్యా బిన్ ఖలఫ్ లు ముఖ్యులు. ఈ సమావేశ కార్యక్రమం ఆరంభం కావడానికి ముందే ఇబ్లీస్ ఒక ముసలి నాయకుడి వేషంలో దారుల్ నద్వా ద్వారం వద్దకు వచ్చి నిలబడ్డాడు. ఖురైష్ సర్దారులు అతనితో – నీవెవరవు? అని అడిగారు. అతను జవాబిస్తూ – నేను నజద్‌వాసుల్లో ఒక నాయకుణ్ణి. మీరొక ముఖ్యమైన విషయ నిమిత్తం సమావేశమవుతున్నారని నాకు తెలిసింది. అందుకే నేను కూడా దీనిలో పాల్గొని ఏదైనా ముఖ్యమయిన సలహా మీకు ఇవ్వగలనేమో అని భావించాను అని అన్నాడు. వారతనికి అనుమతి ఇవ్వగా అతను లోపలికి వచ్చి కూర్చున్నాడు. సమావేశ కార్యక్రమం ఆరంభమైంది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన అనుయాయులకు వ్యతిరేకంగా పన్నాల్సిన వివిధ వ్యూహాలను గూర్చి చర్చించడం జరిగింది.

ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను నగర బహిష్కరణకు గురి చేయడం అనే వ్యూహం చర్చకు వచ్చింది. నజదీ నాయకుడు (ఇబ్లీస్) దీనిని తిరస్కరించాడు. తదుపరి, రెండవ వ్యూహంగా – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాళ్ళు చేతులు కట్టేసి, గదిలో (బందీగా) వుంచి తను మరణించే వరకు వేచి చూడాలి అన్న విషయం ప్రస్తావనకు వచ్చింది. ఇబ్లీస్ దీనిని గూడా తిరస్కరించాడు. చివరికి, అందరికన్నా దుర్మార్గుడైన అబూ జహల్ సమర్పించిన వ్యూహంతో, ఇబ్లీస్‌తో సహా అందరూ ఏకీభవించారు. అతను తన వ్యూహాన్ని గూర్చి చెబుతూ ఇలా పలికాడు: నా అభిప్రాయమేమిటంటే – మనం ప్రతి తెగ నుండి ఒక బలాఢ్యుడైన యువకుణ్ణి ఎన్నుకొందాం. వారందరికీ ఒక్కొక్క కరవాలాన్ని అప్పగిద్దాం. వారందరూ కలిసి అతని (దైవప్రవక్త) వద్దకు వెళ్ళి, ఒక్క ప్రయత్నంలోనే అతణ్ణి అంతమొందించాలి. ఇలా, అతని బారి నుండి మనం బయట పడవచ్చు. హత్యాపరాధం అన్ని తెగలకూ వ్యాపిస్తుంది మరియు అబ్దుమునాఫ్ సంతతి అన్ని తెగలతో యుద్ధం చేయలేక రక్తం పరిహారం కోసం తయారవుతారు. మన మందరం కలిసి దాన్ని చెల్లించేద్దాం.

నజదీ నాయకుడు (ఇబ్లీస్) కూడా ఈ వ్యూహాన్ని ఎంతో ప్రశంసించాడు. పార్లమెంటులోని మిగిలిన ప్రతినిధులంతా ఈ వ్యూహంపై తమ ఆమోద ముద్ర వేసి, దీనిని వెంటనే అమలు చేయాల్సిందిగా నిర్ణయించి, సమావేశాన్ని ముగించారు. *(సీరత్ ఇబ్నె హిషామ్: 1/480–482)*

# దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హిజ్రత్

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను హతమార్చాలన్న కుతంత్రము రూపుదిద్దుకున్న తర్వాత జిబ్రయీల్ (అలైహిస్సలాం) దైవప్రవక్త వద్దకు విచ్చేసి, ఈ విషయాన్ని తెలియజేసి, అల్లాహ్ మీకు హిజ్రత్ చేయడానికి అనుమతించాడు. అందుకే ఈ రోజు రాత్రి మీరు, మీ పడకపై పడుకోవద్దు అని హెచ్చరించారు. *(జాదుల్ మిఆద్ : 2/52)*

తదుపరి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) ఇంటికెళ్ళి, అక్కడే తన హిజ్రత్ కార్యక్రమాన్ని ఖరారు చేసుకున్నారు.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం: మేము మధ్యాహ్నం పూట అబూబక్ర్ ఇంట్లో వున్నాం. అకస్మాత్తుగా ఒకరు అబూబక్ర్‌తో – చూడండి! దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దుప్పటి కప్పుకొని వస్తున్నారు అని అన్నారు. సాధారణంగా, ఇంతకు ముందెప్పుడూ, దైవప్రవక్త ఈ సమయంలో మా దగ్గరికి రాలేదు. దీనిపై అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) – నా తల్లిదండ్రులు మీకై సమర్పితంగాను! మీరు తప్పకుండా ఏదో అత్యవసర పని మీదే, ఈ సమయంలో విచ్చేసి వుండాలి. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికొచ్చి, ఇంట్లో ప్రవేశానికి అనుమతి అడగ్గా, అబూబక్ర్ అనుమతి ఇచ్చారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) లోపలి కొచ్చి అబూ బక్ర్‌తో – మీ ఇంట్లో వున్న ఇతర వ్యక్తులను వేరే గదిలోకి పంపించి వేయండి అని అన్నారు. అబూ బక్ర్ – నా తల్లిదండ్రులు మీకై సమర్పితం ఓ దైవప్రవక్తా! ఇక్కడున్న వారంతా మీ ఇంటి వారే అని బదులివ్వగా, దైవప్రవక్త – నాకు హిజ్రత్ చేయడానికి అనుమతి ఇవ్వబడింది – అని అన్నారు. అబూ బక్ర్ – నా తల్లిదండ్రులు మీకై సమర్పితం! నేను కూడా మీతోపాటు హిజ్రత్ చేయనా? అని అడగ్గా, దైవప్రవక్త 'అవును' అని జవాబిచ్చారు. దీనిపై, అబూ బక్ర్ – అలాగైతే, ఈ రెండు వాహనాల్లో ఒకటి మీరు తీసుకోండి అన్నారు. దైవప్రవక్త – సరే, కాని దీని సొమ్మును నేను చెల్లిస్తాను అని జవాబిచ్చారు. ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం : తదుపరి, మేము వెంటనే ఇద్దరి ప్రయాణ సామగ్రిని సర్ది, ఒక సంచిలో వేశాం. అస్మా బిన్తె అబూ బక్ర్, తన (నడుముకు కట్టుకున్న)

వస్త్రంలోని కొంత భాగాన్ని చింపి, ఆ సంచి మూతిని మూసేసింది. అందుకే ఆమెను 'జాతుల్ నతాఖైన్' అని అనసాగారు. *(బుఖారీ : 2318, 3906)*

ఆ తర్వాత, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఇంటికొచ్చి, రాత్రి కోసం వేచి చూడసాగారు.

## దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇంటి ఘెరావ్

ఇటు, ఖురైషీయ దుర్మార్గులకు ఆ రోజంతా మనశ్శాంతి కరువయ్యింది. జాదుల్ నద్వ యందు తీసుకొన్న నిర్ణయాన్ని అమలు చేయడానికి రంగం సిద్ధం చేయసాగారు. చివరికి 11 మంది యువకులను ఎంపిక చేసారు. వారిలో అబూ జహల్, అబూ లహబ్ మరియు ఉమైయ్య బిన్ ఖలఫ్ లు కూడా వున్నారు. ఈ దుర్మార్గులంతా చీకటి పడగానే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇంటిని చుట్టుముట్టి, తదుపరి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిద్రపోగానే, ఆయనను మట్టుబెడదామని నిరీక్షించసాగారు. చివరికి, అర్థరాత్రి సమయం రాగానే, నిర్ణయాత్మకమైన ఆ ఘడియ వచ్చేసింది.

నేటి తర్వాత, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన అనుయాయుల ఉనికి ఇక ఏ మాత్రం మిగిలి వుండదని ఆ దుర్మార్గులు దృఢ నిశ్చయంతో వున్నారు.

కానీ, భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి మరియు తాను అనుకున్నది చేయగల సామర్థ్యం కలిగి వున్న ఆ అల్లాహ్ పై ఏ శక్తీ ప్రాబల్యం వహించలేదు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَإِذْ يَمْكُرُ بِكَ الَّذِينَ كَفَرُوا لِيُثْبِتُوكَ أَوْ يَقْتُلُوكَ أَوْ يُخْرِجُوكَ ۚ
وَيَمْكُرُونَ وَيَمْكُرُ اللَّهُ ۖ وَاللَّهُ خَيْرُ الْمَاكِرِينَ (30)

**"ఆ సమయం కూడా జ్ఞాపకం తెచ్చుకోదగ్గదే అప్పుడు సత్య తిరస్కారులు నీకు వ్యతిరేకంగా పన్నాగాలు పన్నుతూ వున్నారు, నిన్ను నిర్బంధించాలని లేదా నిన్ను హత్య చెయ్యాలని లేదా నిన్ను దేశం నుండి బహిష్కరించాలని. వారు తమ ఎత్తులు తాము వేస్తూ వున్నారు. అల్లాహ్ తన ఎత్తు తాను వేస్తూ వున్నాడు. అల్లాహ్ అందరి కంటే బాగా ఎత్తులు వేస్తాడు."**

*(అన్‌ఫాల్ : 30)*

ఈ నిర్ణయాత్మక ఘడియలో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అలీ బిన్ అబూ తాలిబ్ తో – 'నువ్వు నా దుప్పటి కప్పుకొని, నా పడకపై పడుకో, భయపడకు, నీకేమీ నష్టం వాటిల్లదు' అని అన్నారు.

*(సీరత్ ఇబ్నె హిషామ్ :1/483)*

ఆ తర్వాత, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇంటి నుండి బయటకు వచ్చారు. తన పడికిలిలో కొంత మట్టిని తీసుకొని (నిరీక్షిస్తున్న) ఆ దుర్మార్గుల శిరస్సులపై చల్లారు. అల్లాహ్ వారి చూసే శక్తిని లాక్కున్నాడు. తద్వారా, వారు ఆయన్ను చూడలేకపోయారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దివ్య ఖుర్ఆన్ లోని ఆయత్ – "మేము వారి ముందు ఒక గోడనూ, వారి వెనుక మరో గోడనూ నిలబెట్టాము. మేము వారిని (ఈ విధంగా) కప్పివేశాము, ఇక వారు చూడలేరు." (యాసీన్ :9) ను పఠిస్తూ వారి మధ్య నుండి వెళ్ళిపోయారు. *(జాదుల్ మిఆద్ : 3/46)*

తదుపరి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) ఇంటికెళ్ళారు. ఆయనను అక్కణ్ణుండి వెంట తీసుకొని, సౌర్ గుహ వద్దకు చేరుకున్నారు. సౌర్ గుహ మక్కా నుండి యమన్ వైపునకు పోయే దిశలో వుంది. మదీనా వెళ్ళే దిశలో లేదు. బహుశా, దీనిలో (సౌర్ గుహ వద్దకు రావడంలో) ఇమిడి వున్న మర్మం – ఖురైషీయ తిరస్కారులకు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హిజ్రత్ గురించి తెలిస్తే, తప్పకుండా, మదీనా వెళ్ళే మార్గాలను అన్వేషిస్తారు – అని కావచ్చు. అందుకే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముందు ప్రయాణంలోనే తన మార్గాన్ని మార్చు కున్నారు. తద్వారా, శత్రువులు ఆయనను అంత సులువుగా వెంబడించలేరు.

## దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు అబూ బక్ర్ (రజిఅల్లాహు అన్హు) సౌర్ గుహలో

ప్రయాణికులిరువురూ, రాత్రి చీకటిలో, అత్యంత కఠినమైన మరియు క్లిష్టమైన ప్రయాణాన్ని కొనసాగించి, సౌర్ గుహ వద్దకు చేరుకున్నారు. అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) ను గుహ బయటే వుండమని చెప్పి, స్వయంగా తనే ముందు లోపలికి ప్రవేశించి, దానిని

శుభ్రం చేశారు. దానిలో ఒకవైపు రంధ్రం వుండడం చూసి, తన దుప్పటిలో కొంత భాగాన్ని చింపి, దాన్ని మూసేశారు. మరో రెండు రంధ్రాలు కనబడితే, వాటిలో తన పాదాలను వుంచి తదుపరి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను లోపలికి రమ్మని పిలిచారు. దైవప్రవక్త లోపలికి ప్రవేశించి, గుహ సహవాసి అయిన అబూబక్ర్ (రజిఅల్లాహు అన్హు) ఒడిలో తల వుంచి నిద్రపోయారు. ఈ తరుణంలో, అబూ బక్ర్ కాలుకు ఏదో విషప్రాణి కాటేసింది. కానీ, ఆయన మాత్రం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విశ్రాంతికి ఆటంకం కలక్కూడదని తన కాళ్ళను ఏ మాత్రం కదపలేదు. కానీ (బాధవల్ల) ఆయన కన్నీళ్ళు మాత్రం ఆగలేకపోయాయి. వాటిలో కొన్ని చుక్కలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముఖారవిందంపై పడ్డాయి. దీంతో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మేల్కొన్నారు. తదుపరి, అబూబక్ర్‌తో – ఏడవడానికి కారణం అడగ్గా. ఆయన – 'నా తల్లిదండ్రులు మీకై సమర్పితంగాను! ఏదో విషప్రాణి నన్ను కాటేసింది' అని విన్నవించుకున్నారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) లేచి, విషప్రాణి కాటేసిన చోట తన ఉమ్మిని పూసారు. దీనితో ఆయన నొప్పి తగ్గిపోయింది.

*(అర్రహీఖుల్ మఖ్తూమ్ అరబీ : 164 పేజీ)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) సౌర్ కొండలో వున్న గుహ వద్దకు చేరుకున్నారు. దానిలో వారు మూడు రాత్రులు గడిపారు. రాత్రి (చీకటి పడ్డాక) వారి దగ్గరికి అబ్దుల్లా బిన్ అబూ బక్ర్ వెళ్ళేవారు. ఆయన బుద్ధి కుశలత, మంచి జ్ఞాపకశక్తి కలిగిన నవ యువకులు. రోజంతా ఖురైషీయులతో గడిపి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గురించి వినే వార్తలన్నింటినీ గుర్తుపెట్టుకొనేవారు. చీకటి పడ్డాక సౌర్ గుహకు చేరుకొని వాటిని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు వినిపించేవారు. సహరీ సమయంలో (ఉషోదయానికి ముందు) మళ్ళీ మక్కాకు తిరిగి వచ్చేసే వారు. ఖురైషీయులు మాత్రం ఆయన గురించి – ఈయన మక్కాలోనే రాత్రి గడిపారు – అని అనుకొనేవారు.

దీనితోపాటు, అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) బానిసైన ఆమిర్ బిన్ ఫహీరా పగలు మేకలను కాపుతూ, చీకటి పడే సమయంలో వాటిని సౌర్

గుహ వైపునకు మళ్ళించే వారు మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) , అబూ బక్ర్‌లకు పాలను సమర్పించేవారు. తిరిగి ఉషోదయానికి ముందే అక్కణ్ణుండి వెళ్ళిపోయేవారు. *(బుఖారీ : 3906)*

## ఖురైషీయులు సౌర్ గుహ ద్వారం వద్దకు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఇంటి నుండి బయలుదేరినప్పుడు, ఆయన ఇంటిని చుట్టుముట్టిన దుర్మార్గుల దగ్గర్నుండి ఒక వ్యక్తి వెళుతూ వారితో – మీరెవరి కోసం ఎదురు చూస్తున్నారు? అని ప్రశ్నించాడు. వారతనితో 'ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)' కోసం అని అన్నారు. దీనిపై అతను – అయితే మీరు పరాభవం పాలయ్యారు మరియు నష్టానికి గురయ్యారు. అల్లాహ్ సాక్షి! ఆయన మీ మధ్య నుండి వెళ్ళిపోయారు, ఆయనే మీ శిరస్సులపై మన్నుపోసి వెళ్ళారు. దీంతో వారు తమ శిరస్సులపై వున్న మట్టిని జాడిస్తూ లేచి నిలబడి (ఇంట్లోకి తొంగి) చూడగా అలీ (రజి అల్లాహు అన్హు) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మంచంపై పడుకొని వున్నారు. వారంతా ఉషోదయం వరకు నిరీక్షించారు. చివరికి అలీ (రజి అల్లాహు అన్హు) మేల్కొన్నారు. ఆ దుర్మార్గులు ఆయనతో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గురించి అడిగారు. ఆయన – 'నాకేమీ తెలియదు' అని జవాబిచ్చారు. దీంతో వారంతా అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) ఇంటికెళ్ళి తలుపు తట్టారు. అస్మా బిన్తె అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హ) తలుపు తెచిచారు. దుర్మార్గులు ఆమెతో అబూ బక్ర్ గురించి అడిగారు. ఆమె ఆయన గురించి 'నాకేమీ తెలియదు' అని వారికి జవాబిచ్చారు. దీనితో దుర్మారుడైన అబూ జహల్ (కోపంతో) ఆమె చెంపపై కొట్టగా, ఆమె చెవులకు ధరించిన ఆభరణం క్రింద పడింది. *(ఇబ్నె హిషామ్ : 1/487)*

దీని తర్వాత ఖురైషీయులు త్వరత్వరగా మక్కా నుండి బయటకు వెళ్ళే మార్గాలపై తమ నిఘా ను పెంచేశారు మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను సజీవంగా లేక మరణించిన స్థితిలో పట్టి తెచ్చిన వారికి వంద ఒంటెల పెద్ద బహుమానాన్ని ప్రకటించారు. *(బుఖారీ : 1/554)*

తదనుగుణంగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు)లను కొండలలో, లోయలలో, గుహల్లో మరియు

వీధుల్లో అత్యంత వేగంగా వెతకడం ఆరంభమైంది. వారిని వెతికే నిమిత్తం ప్రజలు గుర్రాలపై, ఒంటెలపై, చివరికి కాలినడకన నడుస్తూ అప్రమత్త మయ్యారు.

అటూ ఇటూ అన్వేషిస్తూ చివరికి వారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు అబూ బక్ర్‌లు దాగివున్న గుహ ద్వారం వద్దకు వచ్చేశారు. అబూ బక్ర్ (రజిఅల్లాహు అన్హు) కథనం: గుహలో నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్ద కూర్చొని వున్నాను. నేను తల పైకెత్తి చూడగానే అన్వేషకుల పాదాలు కనిపించసాగాయి.

“ఓ దైవ ప్రవక్తా! ఒకవేళ వీరిలో ఎవరైనా తన దృష్టిని క్రిందికి సారిస్తే తప్పకుండా మనల్ని చూడగలుగుతారు” అని నేను అన్నాను.

దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్పందిస్తూ– ఓ అబూబక్ర్! మూడవ వాడుగా వారి మధ్య అల్లాహ్ వున్న ఆ ఇద్దరి గురించి నీ అభిప్రాయం ఏమిటి? అని అన్నారు.

నిశ్చయంగా ఇది దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గావించిన ఒక అద్భుతం. శత్రువులు ఆయనకు కొద్ది అడుగుల దూరం వరకు వచ్చి కూడా ఆయనకేమీ నష్టం కలిగించలేక పోయారు మరియు నిరాశా నిస్పృహలతో వెనుతిరిగి వెళ్ళిపోయారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِلَّا تَنصُرُوهُ فَقَدْ نَصَرَهُ اللَّهُ إِذْ أَخْرَجَهُ الَّذِينَ كَفَرُوا ثَانِيَ اثْنَيْنِ إِذْ هُمَا فِي الْغَارِ إِذْ يَقُولُ لِصَاحِبِهِ لَا تَحْزَنْ إِنَّ اللَّهَ مَعَنَا ۖ فَأَنزَلَ اللَّهُ سَكِينَتَهُ عَلَيْهِ وَأَيَّدَهُ بِجُنُودٍ لَّمْ تَرَوْهَا وَجَعَلَ كَلِمَةَ الَّذِينَ كَفَرُوا السُّفْلَىٰ ۗ وَكَلِمَةُ اللَّهِ هِيَ الْعُلْيَا ۗ وَاللَّهُ عَزِيزٌ حَكِيمٌ (40)

**“అవిశ్వాసులు అతనిని బహిష్కరించినపుడూ, అతను కేవలం ఇద్దరిలో రెండోవాడుగా ఉన్నప్పుడూ, వారిద్దరూ గుహలో ఉన్నప్పుడూ, అతడు తన స్నేహితునితో, ‘విచారపడకు, అల్లాహ్ మనకు తోడుగా ఉన్నాడు’ అని అన్నప్పుడూ అల్లాహ్ అతనికి సహాయం చేశాడు. ఆ సమయంలో అల్లాహ్ అతనిపై తన తరఫునుండి మనశ్శాంతిని అవతరింపజేశాడు. అతనికి మీకు కానరాని దళాలతో సహాయపడ్డాడు. అవిశ్వాసుల మాటను**

**కించపరిచాడు. అల్లాహ్ మాట సర్వదా సర్వోత్కృష్టమైనదే! అల్లాహ్ మహాశక్తి సంపన్నుడూ, మహావివేకవంతుడూనూ.”** ***(తౌబా: 40)***

## మదీనా మార్గంలో

మక్కాలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు)లను వెతికే కార్యక్రమం కాస్త చల్లబడడంతో, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన మిత్రునితో కలిసి మదీనా వైపునకు వెళ్ళడానికి పూనుకొన్నారు. ఆ ప్రదేశంలోని మార్గాల గురించి బాగా తెలిసి వున్న అబ్దుల్లా బిన్ అరీఖా అల్లైసి – అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) ద్వారా (ప్రయాణానికి) సిద్ధం చేసి వుంచబడ్డ రెండు ఒంటెలను తీసుకొని, మదీనా ప్రయాణం ఆరంభమయ్యే సౌర్ గుహ వద్దకు రావాలని ముందుగానే నిర్ణయించబడింది. తదనుగుణంగా అతను మూడు రాత్రుల తర్వాత సౌర్ గుహకు చేరుకున్నాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) , అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు), ఆయన బానిస ఆమిర్ బిన్ ఫహీరా మరియు వీరికి దారి చూపే అబ్దుల్లా బిన్ అరీఖా లతో కూడిన సమూహము మదీనాకు ప్రయాణమైంది. ఈ ప్రయాణపు విశేషాలు సహీ బుఖారీలో ఉల్లేఖించబడ్డాయి.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనా వైపునకు బయలుదేరారు. ఆయన తన వాహనంపై తన వెనుక అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు)ను కూర్చోబెట్టుకుని వున్నారు. అబూ బక్ర్ ముసలివారు మరియు తేలిగ్గా గుర్తించబడేవారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (కొంచెం తక్కువ వయస్సు వారైనందువల్ల) యువకులుగా కనబడుతూ అంత తేలిగ్గా గుర్తించబడకుండా వున్నారు. (అందుకే) మార్గ మధ్యంలో ఎవరైనా తారసపడితే – ఓ అబూ బక్ర్! మీ ముందు కూర్చున్న ఈ వ్యక్తి ఎవరు? అని ప్రశ్నించేవారు. అబూ బక్ర్ జవాబిస్తూ – ‘ఈయన నాకు మార్గం చూపుతారు’ అని పలికేవారు.

వినేవారు – ఈయన బహుశా ప్రయాణానికి సంబంధించిన మార్గం చూపుతారు కాబోలు అని అనుకొనేవారు. కానీ, అబూ బక్ర్ ఉద్దేశ్యం – ఈయన మంచి వైపునకు మార్గం చూపేవారు అని అయి వుండేది. ప్రయాణం మధ్యలో, అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) వెనక్కు తిరిగి చూడగా, ఒక వ్యక్తి

గుర్రపు స్వారీ చేస్తూ, వారి వైపునకు రావడం గమనించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఈ విషయం తెలియజేశారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెనక్కు తిరిగి అతణ్ని శపిస్తూ – అల్లాహ్ అతణ్ని ఓటమిపాలు చేయుగాక! అని పలికారు. వెంటనే, అతడి గుర్రం అతణ్ని క్రింద పడవేసి అరవడం ప్రారంభించింది. ఆ వ్యక్తి – 'ఓ దైవ ప్రవక్తా! మీరు నాకు ఏదైనా ఆజ్ఞాపించండి' అని అన్నాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతనికి – 'ఇక్కడే వుండు మరియు ఎవరినీ మా వెంట రాకుండా చూడు' అని ఆజ్ఞాపించారు. ఆ వ్యక్తి దినం ఆరంభంలో దైవప్రవక్త శత్రువై వున్నాడు, కానీ సాయంత్రానికల్లా దైవప్రవక్త సంరక్షకుడిగా మారిపోయాడు. *(బుఖారీ: 3911)*

## సూరాఖా బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) వృత్తాంతం – ఆయన మాటల్లోనే

సహీ బుఖారీలో సురాఖా బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం: మా వద్దకు ఖురైషీయుల ప్రతినిధులెందరో వచ్చి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు)లను హత్య చేసిన వారికి లేదా సజీవంగా పట్టి ఇచ్చిన వారికి పెద్ద బహుమానం ప్రకటించబడిందన్న విషయం తెలియజేశారు.

ఓ రోజు నేను, మా తెగ బనీ ముద్‌లజ్‌కు చెందిన ఒక సమూహంలో కూర్చొని వున్నాను. ఇంతలో ఓ వ్యక్తి అక్కడి కొచ్చి ఇలా అన్నాడు – నేనిప్పుడే సముద్ర తీరం వెంబడి కొందరు వెళ్ళడం గమనించాను. బహుశా వారు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన సహాయకులు కావచ్చు. సూరాఖా బిన్ మాలిక్ కథనం: వారే అయి వుంటారని నేను వెంటనే గ్రహించాను. కానీ, ఆ వ్యక్తితో – 'బహుశా వారు వేరే ఇంకెవరైనా వుండి వుంటారు. బహుశా నువ్వు, ఇంతకు ముందే మా మధ్య నుండి వెళ్ళిన ఫలానా వ్యక్తులను చూసివుంటావు' అని అన్నాను.

తదుపరి, నేను ఆ సమూహంలో కొంతసేపు కూర్చున్నాను. ఆ తర్వాత లేచి ఇంటికొచ్చేశాను. ఇంటికొచ్చి, నా బానిస స్త్రీని – నా గుర్రం తీసుకెళ్ళి ఫలానా ఎత్తయిన ప్రదేశం వద్ద నిరీక్షించమని పురమాయించాను. తదుపరి నేను పరుగెత్తుకొంటూ ఆ ప్రదేశానికి చేరుకొని, గుర్రం తీసుకొని దానిపై

స్వారీ చేస్తూ వారి (ప్రవక్త సమూహం) దగ్గరికి చేరే సరికి నా గుర్రపు కాళ్ళు జారి క్రింద పడిపోయాను. నేను లేచి నిలబడి జ్యోతిష్యపు బాణాలు సంచి నుండి బయటకు తీసి –నేను వారికి నష్టం కలిగించగలనా లేదా అన్న విషయంపై లాటరీ వేసి పరీక్షించగా 'నష్టం కలిగించలేను' అని వచ్చింది.

అయినప్పటికీ, నేనా బాణాల నిర్ణయం పట్టించుకోకుండా గుర్రమెక్కి ముందుకు సాగాను. చివరికి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఎంత దగ్గరగా వెళ్ళానంటే– ఆయన ఖుర్ఆన్ పారాయణం నేను విన్నాను. కానీ, ఆయన మాత్రం వెనక్కు తిరిగి చూడలేదు. అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) మాత్రం మాటి మాటికీ వెనక్కు తిరిగి చూడడం ప్రారంభించారు. అకస్మాత్తుగా నా గుర్రపు పాదాలు భూమిలో ఇంకిపోయాయి మరియు నేను క్రింద పడిపోయి గుర్రాన్ని తిట్టడం ప్రారంభించాను. గుర్రం అతి కష్టంగా తన పాదాలను, నేల నుండి బయటకు తీసి నిలబడింది. దీంతో ఒక్కసారిగా దుమ్ము పైకి లేచింది. నేను మళ్ళీ లాటరీ వేశాను. మళ్ళీ అదే నిర్ణయం వచ్చింది. ఈసారి నేను వారిని శాంతియుత స్వరంతో పిలవగా వారు ఆగిపోయారు. నేను గుర్రంపై ప్రయాణించి వారి దగ్గరకు చేరుకున్నాను.

నాతో జరిగిన వ్యవహారాన్ని బట్టి చూస్తే, 'దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞ ఏదో ఒకరోజు తప్పకుండా ప్రాబల్యం పొందుతుంది' అన్న విషయం నా మనసుకు తట్టింది. నేను వారితో – మీ జాతి వారు మిమ్మల్ని చంపి లేదా బంధించి ఇచ్చిన వారికి బహుమానం ప్రకటించి వున్నారని చెప్పి, వారి సమాచారమంతా అందించి, ప్రయాణానికి కావాల్సిన సామగ్రిని ఇస్తానని విన్నవించుకోగా ఆయన (సున్నితంగా) తిరస్కరించారు. కేవలం – 'మా గురించి ఎవరికీ చెప్పకు' అని అన్నారు.

నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో – 'శాంతికి సంబంధించిన కొన్ని సూచనలను నాకు రాసివ్వండి' అని వేడుకోగా, ఆయన ఆమిర్ బిన్ ఫహీరాకు 'రాసివ్వమని' ఆజ్ఞాపించారు. తదుపరి ఆయన రంగుపూసిన ఒక చర్మపు ముక్కపై కొన్ని శాంతి వచనాలు రాసి ఇచ్చారు. ఆ తర్వాత వారు ముందుకు ప్రయాణమయ్యారు. *(బుఖారీ : 3906)*

# ఉమ్మె మాబిద్ గుడారం నందు

ఇమామ్ హాకిమ్ తన ముస్తద్రక్ నందు హిసామ్ బిన్ హుబైష్ బిన్ ఖవీలద్ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఇలా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కూడిన సమూహము ఉమ్మె మాబిద్ కు చెందిన రెండు గుడారాల వద్ద నుండి పోసాగింది. ఆ స్త్రీ ప్రయాణికులకు తినిపిస్తూ, త్రాగిస్తూ ఉండేది. హిజ్రత్ సమూహం ఉమ్మె మాబిద్‌తో – మాంసం మరియు ఖర్జూరాలు కొనే నిమిత్తం దర్యాప్తు చేయగా అక్కడ వారికేమీ లభించ లేదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కడ ఓ మేకను చూసి దాని గురించి ఉమ్మె మాబిద్‌ను అడగ్గా – ఆమె – ఇది ఎంతో అలసి వున్నందువల్ల మేకల గుంపుతో వెళ్ల లేక వెనుకబడిపోయింది అని అంది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెతో – ఈ మేక పాలిస్తుందా? అని అడగ్గా, ఆమె ఇది ఎంతో బలహీనంగా, చిక్కిపోయి వుంది అని జవాబిచ్చింది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెతో –నేను దీని పాలు పిండుకోనా? అని అనుమతి అడగ్గా, ఆమె (ఆశ్చర్యపడుతూ) నా తల్లిదండ్రులు మీకై సమర్పితంకాను! మీకొకవేళ దీని శరీరంలో పాలు కనిపిస్తే వాటిని మీరు పిండుకోవచ్చు అని అంది. తదుపరి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దాని స్థనాలను చేతులతో స్పర్శించి, 'బిస్మిల్లాహ్' అని పలికి, ఆపై అల్లాహ్‌ను వేడుకొని పాలు పిండడం ప్రారంభించారు. మేక స్థనాలు పాలతో నిండిపోయాయి. తదుపరి ఆయన ఉమ్మె మాబిద్ గిన్నెలో పాలు పిండసాగారు. కాసేపటికి గిన్నె నిండి పోయింది. ఆయన అందరికన్నా ముందుగా పాలను ఉమ్మె మాబిద్‌కు ఇచ్చారు. తర్వాత తన సహచరులకు, చివరికి తను కూడా కడుపు నిండా త్రాగారు.

మళ్ళీ రెండవసారి పిండారు. గిన్నె మళ్ళీ పాలతో నిండిపోయింది. ఆ తర్వాత ఆయన ప్రయాణం నిమిత్తం ముందుకు సాగిపోయారు.

*(ముస్తద్రక్ హాకిమ్ – కితాబుల్ హిజ్రత్ – 4333)*

అయితే ఈ ఉల్లేఖన పరంపర గురించి కొందరు హదీసువేత్తలు సందేహం వెలిబుచ్చారు. వాస్తవం అల్లాహ్‌కే తెలుసు.

## రెండవ ఖుత్బా

ప్రియ సోదరులారా!

మొదటి ఖుత్బాలో మీరు హిజ్రత్ విశిష్టతలు మరియు దానికి సంబంధించిన వృత్తాంతాలు వివరంగా తెలుసుకున్నారు. రండి! ఇక, మదీనాకు విచ్చేసినప్పుడు మదీనావాసులు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఎలా స్వాగతం పలికారో తెలుసుకుందాం!

## మదీనాలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు స్వాగతం

మదీనా వాసులు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రాకకోసం ఎంతగానో నిరీక్షించసాగారు. వారి ఉత్సాహాన్ని గూర్చి అమ్ర్ బిన్ జుబైర్ (రజి అల్లాహు అన్హు) ఏం సెలవిచ్చారో వినండి!

ఆయన కథనం ప్రకారం – మదీనాకు వెళ్ళే మార్గంలో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఆయనే తారసపడ్డారు. ఆయన ఒక వ్యాపార సమూహంతో కలిసి సిరియా నుండి తిరిగి వస్తున్నారు. జుబైర్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు అబూ బక్ర్‌లకు ఒక తెల్లటి వస్త్రాన్ని కానుకగా ఇచ్చారు.

ఇటు, మదీనా వాసులకు, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హిజ్రత్ విషయం తెలియగానే, వారు ప్రతి రోజు ఉదయం హిర్ర(ఒక ప్రదేశం) దగ్గరకు వచ్చి మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరిగే వరకు ఆయన కొరకు వేచి చూసేవారు. ఒక రోజు, ఎప్పటిలాగే ఎంతో సేపు ఎదురు చూసి తమ తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు. ఆ తర్వాత ఒక యువకుడు ఏదో పని నిమిత్తం ఒక ఎత్తయిన ప్రదేశం ఎక్కగా, అకస్మాత్తుగా అతనికి తెల్లని వస్త్రాలు ధరించి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) రావడం కనిపించింది. అతను వుండబట్టలేక పెద్దగా అరుస్తూ ఇలా ప్రకటించాడు– “ఓ అరబ్బు సమూహమా! ఇన్నాళ్ళుగా మీరు నిరీక్షిస్తున్న మీ పెద్ద మనిషి వచ్చేశాడు.”

ఇది విని ముస్లిములలో ఆనందోత్సాహాలు పెల్లుబికాయి. తమ ఆయుధాలు ధరించి వారంతా ‘హిర్ర’ వద్ద దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు స్వాగతం పలికారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

వారితో కలిసి అమ్ర్ బిన్ ఔఫ్ తెగ వద్దకు వచ్చి ఆగారు. ఆ రోజు రబీవుల్ అవ్వల్ నెల, సోమవారం. అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) అక్కడ నిలబడి, వచ్చే ప్రజానీకాన్ని స్వాగతించడం మొదలు పెట్టారు మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మౌనంగా అక్కడే కూర్చున్నారు. మదీనా వాసుల్లో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను అప్పటి వరకు చూడని వారు వచ్చి అబూ బక్ర్(రజి అల్లాహు అన్హు) కు సలాం చేసేవారు. ఈ లోగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఎండ తగులుతుండడం చూసి, ఆయన తన దుప్పటితో ఆయన (దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఎండతగలకుండా ఆపి వుంచారు. అప్పుడర్థమయ్యింది ప్రజలకు, ఆయన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అని.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అమ్ర్ బిన్ ఔఫ్ తెగ వద్ద 10 కన్నా ఎక్కువ రాత్రులు గడిపారు. ఈ అవధిలో ఆయన ఒక మస్జిద్ (ఖుబా) నిర్మించారు. దీని గురించి దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

لَمَسْجِدٌ اُسِّسَ عَلَى التَّقْوٰى مِنْ اَوَّلِ يَوْمٍ اَحَقُّ اَنْ تَقُوْمَ فِيْهِ ؕ

**"మొదటి రోజు నుండే భయభక్తులు ఆధారంగా స్థాపించబడిన మస్జిదే నీవు (ఆరాధన కొరకు) నిలబడటానికి తగినది."** ***(తౌబా : 108)***

దీనిలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజు చదివారు. తదుపరి తన వాహనంపై ఎక్కి ప్రజలతోపాటు బయలుదేరారు. చివరికి, నేడు మస్జిదె నబవి వున్న ప్రదేశంలో ఆయన వాహనం (ఒంటె) కూర్చుండి పోయింది.ఆ ప్రదేశంలో అప్పుడు కొందరు ముస్లిములు నమాజు చదువుతూ వుండేవారు. వాస్తవానికి ఆ భూమి సహైల్ మరియు సహల్ అనే ఇద్దరు అనాథలకు చెందినది. వారిద్దరూ ఉస్ అద్ బిన్ జరార (రజి అల్లాహు అన్హు) పర్యవేక్షణలో వుండేవారు. ఆ ప్రదేశాన్ని ఖర్జూరాలు ఎండబెట్టడానికి ఉపయోగించేవారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వాహనం ఆ స్థలంలో ఆగిన వెంటనే ఆయన, ఇన్షాఅల్లాహ్ ఇదే మా గమ్యస్థానం అని సెలవిచ్చారు. తదుపరి ఆయన ఆ ఇద్దరు అనాథ బాలురను పిలిచి, ఆ స్థలంలో మస్జిద్ నిర్మించదలిచి దాన్ని అమ్మివేయమని అడిగారు. వారిరువురూ – కాదు ఓ దైవప్రవక్తా! మేమా స్థలాన్ని మీకు సమర్పిస్తాం అని విన్నవించుకున్నారు.

కానీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దానిని ఉచితంగా తీసుకోకుండా, (పైకం చెల్లించి) కొన్నారు. తదుపరి ఆయన ఆ స్థలంలో మస్జిద్ నిర్మించారు. స్వయంగా తను కూడా దాని నిర్మాణంలో పాలుపంచుకున్నారు మరియు సహాబాలతోపాటు తను కూడా ఇటుకలు మోసి తీసుకువచ్చారు. *(బుఖారీ : 3906)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆ తర్వాత మదీనా దగ్గర (హిర్ర దగ్గర) ఆగి, మదీనా అన్సారులను పిలిపించారు. వారక్కడికి వచ్చి, దైవప్రవక్త మరయు అబూ బక్ర్‌లను కలిసి – 'మీరిరువురూ ఇప్పుడు పూర్తిగా సురక్షితులై వున్నారు. కనుక మీరిప్పుడు బయలుదేరవచ్చు. మీరిచ్చే ప్రతి ఆజ్ఞకు విధేయత చూపడం జరుగుతుంది' అని అన్నారు. అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు)లు వాహనం ఎక్కారు. మదీనా అన్సారులు వారితో పాటు నడవసాగారు.

ఇటు, మదీనా పట్టణంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చేరుకున్నారు అని ప్రకటన గావించబడింది. ప్రజలు గోడలపై, ఇంటి పైకప్పులపై, ఎక్కి ఎంతో ఉత్సాహంతో ఆయన్ను చూడడానికి నిరీక్షించసాగారు మరియు అమితానందంతో మాటిమాటికీ దైవప్రవక్త చేరుకున్నారు అని ఎలుగెత్తి చాటసాగారు.

ఇలా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నడుస్తూ, నడుస్తూ చివరికి అబూ అయ్యూబ్ (రజి అల్లాహు అన్హు) ఇంటి దగ్గరకు చేరుకొని క్రిందికి దిగారు. తదుపరి ఆయన – ఎవరి ఇల్లు దగ్గరగా వుంది? అని అడగ్గా అబూ అయ్యూబ్ అన్సారీ – ఓ దైవప్రవక్తా! నా ఇల్లు అందరికన్నా దగ్గరగా ఉంది, ఇటు చూడండి, ఇదే నా ఇల్లు మరియు ఇదే దీని ప్రవేశ ద్వారం అని విన్నవించుకున్నారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాట్లాడుతూ –"సరే అయితే, లోపలికి పదండి మరియు నా విశ్రాంతి కొరకు ఏర్పాటు చేయండి" అని అన్నారు.

ముస్తద్రక్ హాకిమ్‌లోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది: అబూ అయ్యూబ్ (రజి అల్లాహు అన్హు) ఇల్లు రెండు అంతస్తులు కలిగి వుండేది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయన ఇంటికి విచ్చేసినప్పుడు తను క్రింది అంతస్తులో వుండేవారు మరియు అబూ అయ్యూబ్ తన భార్యతో కలిసి పై అంతస్తులో వుండేవారు. దీనిపై ఆ భార్యాభర్తలిద్దరూ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు విచ్చేసి, దీనిపై తమ అయిష్టతను విన్నివించుకున్నారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారితో – “మా కోసం మరియు మా దగ్గరికి వచ్చిపోయే ప్రజల సౌకర్యం కోసం క్రింది భాగమే ఉత్తమమైనది” అని బదులిచ్చారు. *(హాకిమ్ : 5939)*

ఇటు, అబ్దుల్లా బిన్ సలామ్ ఆ సమయంలో ఖర్జూరపు తోటలో పండ్లు ఏరుతూ వున్నారు. (దైవప్రవక్త విచ్చేసిన వార్త విని) గబగబా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి చేరుకొని ఆయన సంభాషణ విని ఇలా పలికారు: మీరు దైవ సందేశహరులని, సత్యం తీసుకొని వచ్చారని నేను సాక్ష్యమిస్తున్నాను. నేను యూదుల నాయకుణ్ణని మరియు యూదుల నాయకుడి పుత్రుడినని యూదులకు తెలుసు మరియు నేనొక గొప్పయూద పండితుణ్ణని మరియు ఒక గొప్ప యూద పండితుని పుత్రుణ్ణని కూడా వారికి తెలుసు. కనుక, మీరు వారిని పిలిపించి, నా ఇస్లాం స్వీకరణ వార్త వారికి తెలియడానికి ముందు, వారిని నా గురించి ప్రశ్నించండి. ఎందుకంటే నా ఇస్లాం స్వీకరణ వార్త విన్నాక వారు నా గురించి నిజం పలుకరు అని అన్నారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యూదులను పిలిచి ఇలా సెలవిచ్చారు: ఓ యూదుల సమూహమా! అల్లాహ్‌కు భయపడండి. తను తప్ప మరో ఆరాధ్యదైవం లేని అల్లాహ్ సాక్షి! నేను దైవ సందేశహరుణ్ణని మరియు మీ వద్దకు సత్యం తీసుకొని వచ్చానని మీకు ఖచ్చితంగా తెలుసు. కనుక మీరంతా ఇస్లాం స్వీకరించండి.

యూదులు జవాబిస్తూ – మేము ఈ విషయాన్ని (ముహమ్మద్ ప్రవక్త గురించి) ఎరుగము అని పలికారు. దైవప్రవక్త ఇలా అడిగారు: ఒక విషయం చెప్పండి, మీలో అబ్దుల్లా బిన్ సలామ్ ఎటువంటి వారు?

యూదులు : ఆయన మా నాయకులు మరియు ఒక నాయకుని పుత్రులు. మాలో అందరికన్నా గొప్ప పండితులు మరియు గొప్ప పండితుల కుమారులు.

దైవ ప్రవక్త: ఒకవేళ ఆయన ఇస్లాం స్వీకరిస్తే–అప్పుడు మీ అభిప్రాయ మేమిటి?

యూదులు: అలా ఎప్పటికీ జరుగదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ ప్రశ్నే రెండు సార్లు అడిగారు. యూదులు ప్రతిసారీ ఇదే విధంగా జవాబిచ్చారు. అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబ్దుల్లా బిన్ సలామ్ (రజి అల్లాహు అన్హు)తో – 'మీరిప్పుడు ముందుకు రండి' అని పిలిచారు. ఆయన యూదుల ముందుకు వచ్చి ఇలా పలికారు: ఓ యూదుల సమూహమా! అల్లాహ్‌కు భయపడండి. తను తప్ప వేరే ఆరాధ్యుడు లేని ఆ అల్లాహ్ సాక్షిగా! ఈయన దైవ సందేశహరులని, మీ వద్దకు సత్యం తీసుకు వచ్చారని మీకు తెలుసు. దీనిపై యూదులు జవాబిస్తూ – నువ్వు అసత్యం పలుకుతున్నావు అని అన్నారు. తదుపరి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యూదులను వెళ్ళి పొమ్మని ఆదేశించారు. *(బుఖారీ : 3911)*

బరా బిన్ ఆజిబ్ (రజి అల్లాహు అన్హు) కథనం : ముహాజిర్లలో మొట్ట మొదట ముసైబ్ బిన్ ఆమిర్, అబ్దుల్లా ఉమ్మె మఖ్తూమ్ (రజి అల్లాహు అన్హుమ్)లు మా దగ్గరికి విచ్చేశారు. వీరిద్దరూ ప్రజలకు దివ్య ఖుర్‌ఆన్ నేర్పేవారు. ఆ తర్వాత అమ్మార్ (రజి అల్లాహు అన్హు), తదుపరి బిలాల్ మరియు సాద్ (రజి అల్లాహు అన్హుమ్)లు విచ్చేశారు. ఆ తర్వాత ఉమర్ (రజి అల్లాహు అన్హు) 40 మంది ప్రయాణికులతో కలిసి విచ్చేశారు. తదుపరి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విచ్చేశారు. అప్పుడు ప్రజల్లో నేను చూసిందేమిటంటే – వారి ముఖాల్లో వ్యక్తమైన ఆనందం మరెప్పుడూ కూడా వ్యక్తం కాలేదు. అందరూ – ఆఖరికి స్త్రీలు, పిల్లలు మరియు బానిస స్త్రీలు సైతం 'దైవప్రవక్త' విచ్చేశారు అని అంటూ తిరగసాగారు. *(బుఖారీ : 3925)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనాలో అడుగుపెట్టిన రోజు చూశాను. ఆ రోజు ఎంత అందంగా మరియు కాంతివంతంగా ఉందంటే అలాంటి రోజును నేను మరెప్పుడూ

చూడలేదు. అలాగే, నేను ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించిన దినాన్ని కూడా చూశాను. ఆ దినం ఎంత బాధాకరంగా వున్నదంటే అలాంటి చీకటి దినాన్ని మరెప్పుడూ చూడలేదు.

*(దారిమి : 1/61, ముస్నద్ అహ్మద్ : 1311– సహీ)*

ప్రియ శ్రోతలారా! హిజ్రత్‌కు సంబంధించిన విశేషాలను మీరు సవివరంగా విన్నారు. వాటిలో మనకు గుణపాఠాన్ని నేర్పే ఎన్నో విషయాలు వున్నాయి. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఏమిటంటే – అల్లాహ్ దాసులు అల్లాహ్‌కు విధేయత చూపి, ఆయన ధర్మానికి సహాయపడుతూ, ఆయన మార్గంలో ఎదురయ్యే కష్టాలకు గాను సహనం పాటిస్తారో, అలాంటి వారిని అల్లాహ్ కూడా కష్టకాలంలో ఒంటరిగా వదిలివెయ్యడు. పైగా వారికి తోడుగా వుంటాడు మరియు వారిని ఆ కష్టాల నుండి గట్టెక్కే మార్గాలను తెరుస్తాడు. దైవప్రవక్త మరియు ఆయన సహచరులకు సహాపడినట్లు. వారిని మక్కావాసుల దౌర్జన్యాల నుండి కాపాడి మదీనా లాంటి శాంతియుత ప్రదేశంలో వసింప జేశాడు.

హిజ్రత్ సంఘటన అనేది నిస్సందేహంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జీవితంలో ఒక ముఖ్యమైన ఘటన. ఆ తర్వాతే ఆయన నాయకత్వంలో ఒక ఇస్లామీయ రాజ్యం ఉనికిలోకి వచ్చింది. ఆ తర్వాతే, అల్లాహ్, తిరస్కారులతో యుద్ధం చేయమని ఆదేశించాడు. దాని ఫలితంగా సత్యాసత్యాల్లో వ్యత్యాసం ప్రస్ఫుటం కాసాగింది. ఆ తర్వాత అల్లాహ్ తన ప్రవక్తతో చేసిన వాగ్దానా లన్నింటినీ సంపూర్ణం గావించాడు మరియు ఇస్లామ్‌కు ప్రాబల్యం, ఆధిక్యతలను ప్రసాదించాడు.

హిజ్రత్ సంఘటన ప్రాముఖ్యతను దృష్టిలో వుంచుకొనే, ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇస్లామీయ క్యాలండర్‌ను ఈ సంఘటన నుండే ప్రారంభించారు. కానీ, దురదృష్టవశాత్తూ నేడు ముస్లిములు తమ ఇస్లామీయ క్యాలండర్‌నే మరిచి పోయారు మరియు ముస్లిమేతర క్యాలండర్‌కు ప్రాముఖ్యత ఇవ్వడం ప్రారంభించారు. అల్లాహ్ మనందరి స్థితిపై కరుణించుగాక! ఆమీన్!

# సఫర్ మాసపు ఖుత్బాలు

## 1. సఫర్ మాసం మరియు దుశ్శకునాలు

# సఫర్ మాసం మరియు దుశ్శకునాలు

### ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1) లాభనష్టాల అధికారం కలవాడు ఎవరు?
2) సఫర్ మాసం వగైరా లలో దుశ్శకునం పాటించడం.
3) నక్షత్రాల ద్వారా (గ్రహాల ద్వారా) అదృష్టాన్ని తెలుసుకోవడం.
4) మాంత్రికుల వద్దకు వెళ్ళడం.
5) విచారణ లేకుండానే స్వర్గంలోకి ప్రవేశించే వారి గుణగణాలు

## మొదటి ఖుత్బా

ఇస్లామీయ సోదరులారా!

లాభనష్టాల అధికారం కేవలం అల్లాహ్‌కే వుందని ప్రతి ముస్లిం మనస్ఫూర్తిగా విశ్వసించాలి. అతనికి తప్ప మరెవరికీ ఈ అధికారం లేదు. ఏ 'వలీ' దగ్గరా లేదు, ఏ 'బుజుర్గ్' దగ్గరా లేదు. ఏ 'పీర్', 'ముర్షద్' దగ్గరా లేదు. ఏ ప్రవక్త దగ్గరా లేదు. చివరికి ప్రవక్తలలో శ్రేష్ఠులు, ఆదమ్ సంతతికి నాయకులు మరియు ప్రవక్తల ఇమామ్ అయిన ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) కు కూడా. ఇతరులకు లాభనష్టాలు చేకూర్చడం అటుంచి, స్వయానా తమకు కలిగే లాభనష్టాలపై సయితం వారు అధికారం కలిగిలేరు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قُلْ لَّآ اَمْلِكُ لِنَفْسِيْ نَفْعًا وَّلَا ضَرًّا اِلَّا مَا شَآءَ اللّٰهُ ۗ وَلَوْ كُنْتُ اَعْلَمُ الْغَيْبَ لَاسْتَكْثَرْتُ مِنَ
الْخَيْرِ ۛ وَمَا مَسَّنِيَ السُّوْٓءُ ۛ اِنْ اَنَا اِلَّا نَذِيْرٌ وَّبَشِيْرٌ لِّقَوْمٍ يُّؤْمِنُوْنَ ﴿188﴾

**"ప్రవక్తా! వారితో ఇలా అను: నాకు సంబంధించిన లాభనష్టాలపై నాకు ఏ అధికారమూ లేదు. అల్లాహ్ కోరింది మాత్రమే అవుతుంది. నాకే గనక అగోచర విషయ జ్ఞానం వున్నట్లయితే, నేను ఎన్నో ప్రయోజనాలను నా కొరకు పొంది ఉండేవాణ్ణి. నాకు ఎన్నటికీ ఏ నష్టమూ వాటిల్లేదికాదు. నేను నా మాటను నమ్మేవారి కొరకు కేవలం హెచ్చరిక చేసేవాణ్ణి మాత్రమే, శుభవార్త వినిపించేవాణ్ణి మాత్రమే." *(ఆరాఫ్ : 188)***

ఈ ఆయతుపై దృష్టి సారిస్తే తెలిసేదేమిటంటే –

స్వయానా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) తనకు కలిగే లాభనష్టాలపై అధికారం కలిగి లేకపోతే – మరి ఆయన కన్నా తక్కువ స్థాయి గల వలీ గానీ, బుజుర్గ్ గానీ, పీర్ గానీ– ఎవరి సమాధులనయితే ప్రజలు గట్టిగా నమ్మి సందర్శిస్తుంటారో– ఈ అధికారాన్ని ఎలా కలిగి వుంటారు? తమకు ప్రయోజనం చేకూర్చే మరియు నష్టాన్ని కలిగించే వారుగా ప్రజలు తలపోసే వారి గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلَئِن سَأَلْتَهُم مَّنْ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ لَيَقُولُنَّ اللَّهُ ۚ قُلْ أَفَرَأَيْتُم مَّا تَدْعُونَ مِن دُونِ
اللَّهِ إِنْ أَرَادَنِيَ اللَّهُ بِضُرٍّ هَلْ هُنَّ كَاشِفَاتُ ضُرِّهِ أَوْ أَرَادَنِي بِرَحْمَةٍ هَلْ هُنَّ مُمْسِكَاتُ رَحْمَتِهِ ۚ
قُلْ حَسْبِيَ اللَّهُ ۖ عَلَيْهِ يَتَوَكَّلُ الْمُتَوَكِّلُونَ ﴿38﴾

**"వారిని ఇలా అడుగు: ఒకవేళ అల్లాహ్ నాకేదైనా నష్టాన్ని కలిగించగోరితే, మీరు అల్లాహ్‌ను కాదని వేడుకొనే ఆరాధ్యులు, ఆయన కలిగించే నష్టం నుండి నన్ను కాపాడగలరా? లేదా అల్లాహ్ నాపై కనికరం చూపగోరితే, వారు ఆయన కారుణ్యాన్ని అడ్డుకోగలరా? మీ అభిప్రాయం ఏమిటి? కనుక వారితో ఇలా అను, నాకు అల్లాహ్ ఒక్కడే చాలు, నమ్ముకునేవారు ఆయననే నమ్ముకుంటారు."** ***(జుమర్ : 38)***

ఈ ఆయత్‌లో అల్లాహ్ ఇలా ఛాలెంజ్ చేస్తున్నాడు: దైవేతరులెవరి దగ్గరైనా లాభనష్టాల అధికారం గనక వుంటే – అల్లాహ్ నష్టం కలిగించదలచిన వాడిని, తను, ఆ నష్టం కలగకుండా కాపాడ మనండి మరియు అల్లాహ్ ప్రయోజనం చేకూర్చదలచిన వాడికి ఆ ప్రయోజనం కలగకుండా ఆపమనండి.

అంటే – వారలా చేయలేరు. మరి వారలా చేయలేరంటే – దాని అర్థం వారికి లాభనష్టాల అధికారం లేదు అని.

అలాగే, అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

مَّا يَفْتَحِ اللَّهُ لِلنَّاسِ مِن رَّحْمَةٍ فَلَا مُمْسِكَ لَهَا ۖ وَمَا يُمْسِكْ فَلَا مُرْسِلَ لَهُ مِن بَعْدِهِ ۚ
وَهُوَ الْعَزِيزُ الْحَكِيمُ ﴿2﴾

**"అల్లాహ్ ప్రజల కొరకు ఏ కారుణ్య ద్వారాన్ని తెరచినా, దానిని అడ్డుకొనే**

**వాడెవ్వడూలేదు. ఆయన మూసివేసిన దానిని అల్లాహ్ తరువాత మళ్ళీ తెరిచేవాడూ ఎవ్వడూ లేడు. ఆయన శక్తిమంతుడు, వివేచన కలవాడు.”**
***(ఫాతిర్: 2)***

అందుకే, అల్లాహ్– తనను తప్ప ఇతరులను వేడుకోవడం నుండి వారించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**وَلَا تَدْعُ مِنْ دُوْنِ اللّٰهِ مَا لَا يَنْفَعُكَ وَلَا يَضُرُّكَ ۚ فَاِنْ فَعَلْتَ فَاِنَّكَ اِذًا مِّنَ الظّٰلِمِيْنَ ﴿106﴾**
**وَاِنْ يَّمْسَسْكَ اللّٰهُ بِضُرٍّ فَلَا كَاشِفَ لَهٗۤ اِلَّا هُوَ ۚ وَاِنْ يُّرِدْكَ بِخَيْرٍ فَلَا رَآدَّ لِفَضْلِهٖ ؕ يُصِيْبُ بِهٖ**
**مَنْ يَّشَآءُ مِنْ عِبَادِهٖ ؕ وَهُوَ الْغَفُوْرُ الرَّحِيْمُ ﴿107﴾**

**“అల్లాహ్‌ను వదలి నీకు నష్టాన్ని గానీ లాభాన్ని గానీ కలిగించలేని ఏ శక్తినీ వేడుకోకు. ఒకవేళ అలా చేస్తే నీవూ దుర్మార్గుడవై పోతావు. అల్లాహ్ గనక నిన్ను ఏదైనా ఆపదకు గురిచేస్తే స్వయంగా ఆయన తప్ప ఆ ఆపదను తొలగించేవారు ఎవ్వరూ లేరు. ఇంకా, ఆయన గనక నీ విషయంలో ఏదైనా మేలు చెయ్యాలని సంకల్పిస్తే, ఆయన అనుగ్రహాన్ని మళ్ళించేవాడు కూడా ఎవ్వడూ లేడు. ఆయన తన దాసులలో తాను కోరిన వారికి తన అనుగ్రహాన్ని ప్రసాదిస్తాడు. ఆయన క్షమించేవాడూ, కరుణించేవాడూను.”** *(యూనుస్ : 106 –107)*

ఈ ఆయతులలో అల్లాహ్ – దైవేతరులెవరికీ లాభనష్టాల అధికారం లేదు, వారిని వేడుకోవడాన్ని వారిస్తూ, ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)! ఒకవేళ నీవు గనక ఇలా చేస్తే (అల్లాహ్ శరణు) నీవు కూడా దుర్మార్గులలో కలసి పోతావు – అని సెలవియ్యడంతోపాటు, తన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఆయన నష్టం కలిగించదలిస్తే దాన్ని ఆపగలిగే వాడెవడూ లేడు మరియు ఒకవేళ తన కృపతో ఆయన దేన్నయినా ప్రసాదిస్తే ఆయన అనుగ్రహాన్ని కూడా ఎవరూ అడ్డుకోలేరు అని సెలవిచ్చాడు.

దీనితో – రుజువయ్యిందేమిటంటే – ఈ అధికారాలు కేవలం అల్లాహ్‌కే వున్నాయి.

కాస్త ఆలోచించండి!

మరి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు అల్లాహ్ తప్ప మరెవ్వరూ నష్టం కలిగించలేనప్పుడు, సాధారణ ముస్లిములకు అల్లాహ్ తప్ప మరెవరు నష్టం కలిగించగలరు?

అందుకే, దైవేతరులెవరైనా సరే, వారితో లాభనష్టాలను ఆశించకూడదు.

ఎందుకంటే – దైవేతరుల గురించి –తన సంకల్పంతో, అధికారంతో ఎవరికైనా తను కోరుకున్న నష్టం కలిగించగలడు – అని భావించడం పెద్ద షిర్క్ (షిర్కె అక్బర్).

అందుకే ఇబ్రాహీం (అలైహిస్సలాం) ఇలా సెలవిచ్చి వున్నారు:

وَلَآ أَخَافُ مَا تُشْرِكُونَ بِهِۦٓ إِلَّآ أَن يَشَآءَ رَبِّى شَيْـًٔا ۗ وَسِعَ رَبِّى كُلَّ شَىْءٍ عِلْمًا ۗ أَفَلَا تَتَذَكَّرُونَ ﴿٨٠﴾
وَكَيْفَ أَخَافُ مَآ أَشْرَكْتُمْ وَلَا تَخَافُونَ أَنَّكُمْ أَشْرَكْتُم بِٱللَّهِ مَا لَمْ يُنَزِّلْ بِهِۦ عَلَيْكُمْ سُلْطَـٰنًا

**“(అల్లాహ్‌కు వ్యతిరేకంగా) మీరు నిలబెట్టిన భాగస్వాములకు నేను భయపడను. అయితే నా ప్రభువు ఏదైనా కోరితే అది తప్పకుండా జరుగుతుంది. నా ప్రభువు జ్ఞానం ప్రతి దానినీ ఆవరించి వున్నది. మీరు స్పృహలోకి రారా? నేను అసలు మీరు నిలబెట్టే భాగస్వాములకు ఎందుకు భయపడాలి? వాటి విషయంలో అల్లాహ్ మీపై ఏ ప్రమాణాన్నీ అవతరింపజేయనప్పటికీ వాటిని మీరు ఆయన తోపాటు దైవత్వంలో భాగస్వాములుగా చేస్తూ భయపడనప్పుడు.”** *(అన్ఆమ్ : 80–81)*

ఈ ఆయతుల ద్వారా తెలిసిందేమిటంటే –

పీర్లు, ఫకీర్లు, బుజుర్గ్‌లలో ఎవరిని గురించి కూడా (వారేదో చేసేస్తారని) భయాందోళనలకు గురి కాకూడదు. అల్లాహ్ అభీష్టానికి వ్యతిరేకంగా ఎవరు కూడా ఏ మాత్రం నష్టం కలిగించలేరు. ఇలాంటి భయాందోళనలు కేవలం అల్లాహ్ పట్ల కలిగి వుండాలి. కారణం – తన సంకల్పానికి అనుగుణంగా ఎవరికైనా నష్టం కలిగించే శక్తి సామర్థ్యాలు కేవలం ఆయనకే ఉన్నాయి కాబట్టి. ఒకవేళ అల్లాహ్ సంకల్పించకుంటే ప్రపంచంలోని ఏ వలీ, బుజుర్గ్, పీర్ లేదా సజ్జాదా నషీన్ అయినా ఏ మాత్రం నష్టం కలిగించలేడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قُلْ لَّنْ يُّصِيْبَنَآ اِلَّا مَا كَتَبَ اللّٰهُ لَنَا ۚ هُوَ مَوْلٰىنَا ۚ وَعَلَى اللّٰهِ فَلْيَتَوَكَّلِ الْمُؤْمِنُوْنَ ﴿51﴾

**"వారితో ఇలా అను: అల్లాహ్ మాకొరకు వ్రాసి వుంచింది తప్ప మాకు ఏదీ (చెడుగానీ, మంచిగానీ) ఏ మాత్రం కలుగదు. అల్లాహ్ యే మా సంరక్షకుడు. విశ్వసించేవారు ఆయననే నమ్ముకోవాలి."** *(తౌబా : 51)*

అలాగే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"యావత్ మానవజాతి ఏకమై నీకేదైనా ప్రయోజనం చేకూర్చాలన్నా- ఇదివరకే నీ అదృష్టంలో అల్లాహ్ వ్రాసిపెట్టి వున్నంత వరకే ప్రయోజనం చేకూర్చ గలదు. అలాగే, యావత్తు మానవజాతి ఏకమై నీకేదైనా కీడు కలిగించాలనుకొన్నా – అది కూడా, ఇదివరకే నీ అదృష్టంలో అల్లాహ్ వ్రాసిపెట్టినంతవరకే కీడు తలపెట్టగలదు అని దృఢంగా విశ్వసించు."

*(తిర్మిజి : 2516, సహీ ఉల్ జామె : 7957)*

ఇస్లామీయ సోదరులారా!

లాభనష్టాల గురించి వుండాల్సిన మూల విశ్వాసం గురించి మేమెందుకు వివరించామంటే –

ఈ మాసం సఫర్ మాసం. దీనిని ఎంతో మంది అపశకునపు మాసంగా మరియు ఈ నెలలో ఏదైనా కొత్త కార్యాన్ని ఆరంభించడం మంచిది కాదని భావిస్తారు. ఎందుకంటే – వారి విశ్వాసమేమిటంటే – ఈ నెలలో ఆరంభించ బడ్డ కార్యాల్లో శుభాలు వుండవు. తద్వారా చివరికి అవి సంపూర్ణం కూడా కావు. అంటే వారు– 'ఈ మాసంలో కేవలం నష్టాలే వాటిల్లుతాయి' అని భయపడుతుంటారు.

కానీ, ఖుర్ఆన్, హదీసుల వెలుగులో మేం చర్చించిన విశ్వాసంతో పోలిస్తే – ఒక నెలను ప్రత్యేకంగా అపశకునంగా భావించి దానిలో కొత్త కార్యమేదైనా ప్రారంభించడానికి భయపడడం అనేది పూర్తిగా విరుద్ధంగా వుంది.

అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు:

"ఏ వ్యాధి అయినా అంటువ్యాధి కాజాలదు, అపశకునం పాటించడం

కూడా మంచిది కాదు మరియు ఏదైనా పక్షిని దుశ్శకునంగా భావించడం అనేది తగదు. అలాగే సఫర్ మాసాన్ని అపశకునంగా తీసుకోవడం కూడా సరికాదు.” *(బుఖారీ:5717, ముస్లిం : 2220)*

అందుకే, ముస్లిములు ఇలాంటి అజ్ఞానపు విశ్వాసాలను కలిగి వుండ కూడదు. దీనికి విరుద్ధంగా, లాభనష్టాలను చేకూర్చడం అనేది అల్లాహ్ చేతుల్లోనే వుందని, ఆయనపైనే పూర్తిగా నమ్మకం కలిగి వుండాలి. లాభనష్టాలు ఏ మాసంతో కూడా ఏ విధమైన సంబంధం కలిగి లేవు.

## అపశకునం అంటే ఏమిటి?

అపశకునం అంటే – ఒక వ్యక్తి ఏదైనా కార్యాన్ని నిర్దిష్ఠంగా చేయడానికి సంకల్పించుకొని, కేవలం ఏదో ఒక దానిని చూసిన లేక ఏదైనా మాట విన్న కారణంగా ఆ కార్యాన్ని చేయడం మానుకోవడం. అజ్ఞానకాలంలో ఎవరైనా ప్రయాణ నిమిత్తం తన ఇంటి నుండి బయలుదేరడానికి సంకల్పించుకున్నప్పుడు ఒక పక్షిని ఎగురవేసి చూసేవారు. ఒకవేళ అది కుడివైపునకు ఎగిరితే తన ప్రయాణాన్ని కానిచ్చేవారు. ఒకవేళ అది ఎడమవైపునకు ఎగిరితే దానిని అపశకునంగా భావించి తన ప్రయాణాన్ని విరమించుకునేవారు.

షరీయత్తు ఇలాంటి దుశ్శకునాలను వారించింది. అంతేకాదు, దుశ్శకునాలు పాటించడాన్ని, జ్యోతిష్యం తెలుసుకోవడాన్ని ‘షిర్క్’ అని నిర్ధారించింది. ఎందుకంటే ఇలా చేసే వ్యక్తి అల్లాహ్‌పై నమ్మకం వుంచకుండా ఏ మాత్రం నిజం లేని విషయాలపై నమ్మకం కలిగి వుంటాడు.

అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

“దుశ్శకునం కారణంగా ఎవరైనా ఏదైనా కార్యాన్ని త్యజిస్తే నిశ్చయంగా అతను షిర్క్‌కు పాల్పడినట్లే.” *(సహీ ఉల్ జామె లిల్ అల్‌బానీ : 6264)*

కొంతమంది, ఏదో ఒక వ్యక్తిని అపశకునంగా భావిస్తారు. ఉదాహరణకు – ఉదయం తన వ్యాపార నిమిత్తం బయలుదేరే సమయంలో ఎవరైనా బీదవాడు లేక బిచ్చగాడు ఎదురొస్తే ఇలా అంటారు: వీడు ప్రొద్దున్నే ఎదురయ్యాడు, ఇక ఈ రోజు మూడినట్లే! లేక – ఇంట్లో ఏదైనా నష్టం వాటిల్లితే ఇలా అంటారు:

ఇదంతా ఈ అపశకున స్త్రీ మూలంగానే జరిగింది లేదా తన సంతానం లోనే ఎవర్నో అపశకునంగా భావించి వీటంతటికి కారణం ఇతనే అని అంటారు.

కానీ – ఇలా ఒక వ్యక్తిని దుశ్శకునంగా భావించడం సరైనది కాదు. దివ్య ఖుర్ఆన్‌లో అల్లాహ్ గడిచిన అనుచర సమాజాల వృత్తాంతాలను వివరిస్తూ 'వారు తమ ప్రవక్తలను అపశకునంగా భావించి తమకు జరిగే నష్టాలకు అతనే కారకుడు అనేవారు' అన్న విషయాన్ని తెలియజేశాడు.

ఉదాహరణకు మూసా (అలైహిస్సలాం) జాతి గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**فَإِذَا جَاءَتْهُمُ الْحَسَنَةُ قَالُوا لَنَا هَٰذِهِ ۖ وَإِن تُصِبْهُمْ سَيِّئَةٌ يَطَّيَّرُوا بِمُوسَىٰ وَمَن مَّعَهُ ۗ أَلَا إِنَّمَا طَائِرُهُمْ عِندَ اللَّهِ وَلَٰكِنَّ أَكْثَرَهُمْ لَا يَعْلَمُونَ (131)**

**"వారి పరిస్థితి ఎలా ఉండేదంటే, మంచి కాలం వచ్చినప్పుడు వారు, మేము దీనికే అర్హులం అని అనేవారు. గడ్డుకాలం వచ్చినప్పుడు వారు మూసాను, అతని సహచరులనూ తమకు అపశకునంగా పేర్కొనేవారు. అసలు వాస్తవానికి వారి అపశకునం అల్లాహ్ చేతులలో వుంది. కానీ వారిలో చాలా మంది జ్ఞానహీనులు".** ***(ఆరాఫ్ : 131)***

అలాగే, ఇతర అనుచర సమాజాల గురించి తెలుపుతూ – వారు కూడా తమ ప్రవక్తలను, వారితోపాటు విశ్వసించిన వారని అపశకునంగా భావించి దుశ్శకునం పాటించేవారు – అన్న విషయం తెలియజేశాడు. చెప్పొచ్చేదేమిటంటే – తనకు వాటిల్లే నష్టానికి ఎవరినైనా అపశకునంగా భావించి దుశ్శకునం పాటించడం ఏ విశ్వాసికి తగదు. పైగా, నష్టం వాటిల్లడానికి ముందే "అల్లాహ్ ఆజ్ఞకు విరుద్ధంగా ఏ నష్టమూ వాటిల్లదు" అన్న విషయాన్ని దృఢంగా విశ్వసించాలి. అంతేగాక, నష్టం వాటిల్లిన తర్వాత కూడా అతను ఇలా పలకాలి– ఇదంతా అల్లాహ్ తరఫు నుండి వ్రాసిపెట్టి వుంది. కనుక సంభవించి వుండాల్సిందే.

కొంతమంది నక్షత్రాల ద్వారా జ్యోతిష్యాన్ని తెలుసుకుని తద్వారా శకునాలను పాటిస్తారు.

ఉదాహరణకు – ఒక వ్యక్తినుద్దేశించి – నీది ఫలానా నక్షత్రం మరియు

ప్రస్తుతం దాని కదలిక (గ్రహచారం) అంత బాగాలేదు. అందుకే ప్రస్తుతం నీవు ఏ వ్యాపారం ప్రారంభించినా నష్టాన్ని చవి చూస్తావు లేక ఒకవేళ ఇప్పుడు నీవు వివాహం చేసుకుంటే దానిలో శుభమేమీ వుండదు – అని అనడం.

వాస్తవానికి ఒకరి అదృష్టం, అతని భవిష్యత్తు విషయాలకూ మరియు నక్షత్రాలకూ ఎలాంటి సంబంధమూ లేదు.

అందుకే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: అజ్ఞాన కాలం నాటి కార్యాలలో నాలుగింటిని నా అనుచర సమాజం త్యజించడానికి సిద్ధపడదు. జాతి, తెగల ఆధారంగా గర్వపడడం, వంశాన్ని కించపరచడం, నక్షత్రాల ద్వారా అదృష్టానికి సంబంధించిన విషయాలు తెలుసుకోవడం (లేదా నక్షత్రాల ద్వారా వర్షాన్ని అర్థించడం) మరియు (మరణ సందర్భాలలో) ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడం. *(ముస్లిం : 934)*

ఈ హదీసులో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నక్షత్రాల ద్వారా అదృష్టాన్ని పరికించడాన్ని అజ్ఞానపు చేష్టగా అభివర్ణించారు. అంటే – ఇస్లామ్‌తో దానికేమాత్రం సంబంధం లేదన్నమాట. అందుకే ముస్లిములు దీని నుండి దూరంగా వుండాలి.

అలాగే, జైద్ బిన్ ఖాలిద్ అల్ జహమీ (రజి అల్లాహు అన్హు) కథనం : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు హుదైబియాలో రాత్రి కురిసిన వర్షం అనంతరం ప్రాతఃకాలపు నమాజ్ (ఫజ్ర్ నమాజ్) చేయించారు. తదుపరి ఇలా సెలవిచ్చారు:

నేడు మీ ప్రభువు ఏమని సెలవిచ్చాడో మీకు తెలుసా?

దీనిపై సహచరులు – అల్లాహ్‌కూ ఆయన ప్రవక్తకూ బాగా తెలుసు అని విన్నవించుకున్నారు.

దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వివరిస్తూ ఇలా అన్నారు:

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'నేడు నా దాసులలో కొందరు విశ్వాస స్థితిలో లేవగా మరికొందరు అవిశ్వాస స్థితిలో లేచారు.'

ఎవరైతే – అల్లాహ్ అనుగ్రహం, కారుణ్యం వల్ల వర్షం కురిసింది అని పలికారో, వారు నన్ను విశ్వసించి, నక్షత్రాల (ప్రభావాన్ని)ను తిరస్కరించారు.

ఇక ఎవరైతే – ఫలానా నక్షత్ర ప్రభావం మూలంగా వర్షం కురిసింది అని పలికారో, వారు నన్ను తిరస్కరించి నక్షత్రాలను విశ్వసించారు.

*(బుఖారీ : 846, ముస్లిం : 71)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే – ఏ వ్యక్తి అయినా వాతావరణ పరిస్థితులలో నక్షత్రాల ప్రభావం వుంటుందని భావిస్తే అతను అల్లాహ్‌ను తిరస్కరించేవాడు. అలాగే, ఒక వ్యక్తి అదృష్టంలో నక్షత్రాల ప్రభావం వుంటుందని భావించేవాడు కూడా అల్లాహ్‌ను తిరస్కరించేవాడు.

మాంత్రికులను, జ్యోతిష్యులను గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చాలా క్షుణ్ణంగా వివరిస్తూ చెప్పిందేమిటంటే – ఇస్లామ్‌తో, ముస్లిములతో వారికే మాత్రం సంబంధంలేదు.

అలాగే – వారి దగ్గరికెళ్ళి, తమ సమస్యలను వారి ముందుంచి, నక్షత్రాలు వగైరాల ద్వారా వాటి పరిష్కారాన్ని పొందగోరే వారు కూడా (అంటే వీరికి కూడా ఇస్లామ్‌తో, ముస్లిములతో ఏ మాత్రం సంబంధం లేదు).

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) కథనం : అపశకునం పాటించేవాడు, ఎవరికోసమైతే అపశకునం పాటించబడిందో, (తాంత్రిక విద్య ద్వారా) జ్యోతిష్యం చెప్పేవాడు, ఎవరికోసమైతే జ్యోతిష్యం చెప్పబడిందో, చేతబడి చేసేవాడు, ఎవరికోసమైతే చేతబడి చెయ్యబడిందో... అలాంటి వారు మాలోని వారు కారు. *(అస్సహీహా : 2195)*

అందుకే, వారి వద్దకు పోవడం, వారి నుండి అదృష్టానికి సంబంధించిన విషయాలను గురించి ప్రశ్నించడం, అనేది పూర్తిగా నిషేధం మరియు పెద్ద షిర్క్. అలాగే, నక్షత్రాల ద్వారా, అరచేతి గీతల ద్వారా అదృష్టాన్ని తెలుసుకోవడం కూడా నిషేధం మరియు షిర్క్.

ఇలాంటి వారి వద్దకు వెళ్లి వారిని ప్రశ్నించటం ఎంత పెద్ద నేరమంటే – ఇలా చేసే వారి నలభై రోజుల నమాజ్ అల్లాహ్ వద్ద స్వీకరించబడదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కథనం : ఎవరైనా ఏ జ్యోతిష్యుని, మాంత్రికుని వద్దకెళ్ళి అతణ్ణి దేని గురించైనా ప్రశ్నిస్తే, అతని 40 రోజుల రాత్రి నమాజ్ స్వీకరించబడదు.

*(ముస్లిం : 223, సహీ ఉల్ జామె లిల్ అల్‌బానీ : 5940)*

అలాగే, వారి వద్ద కెళ్ళి వారిని ప్రశ్నించేవాడు, వారు సెలవిచ్చిన దాన్ని (సత్యమని) నిర్ధారించేవాడు ఎలాంటి వాడంటే – అతను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)పై అవతరించిన షరీయత్తును తిరస్కరించాడు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కథనం : ఎవరైనా ఏ జ్యోతిష్యుని (భవిష్యత్ జ్ఞానం కలవాడని చెప్పుకునేవాడు) వద్దకెళ్ళి, అతని మాటలను నిర్ధారిస్తే, అతను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)పై అవతరించిన అల్లాహ్ ధర్మాన్ని తిరస్కరించాడు. *(సహీ ఉల్ జామె లిల్ అల్‌బానీ : 5939)*

అందుకే – ఇలాంటి వారి వద్దకెళ్ళి మన ధర్మంతో బేరమాడకూడదు. ధర్మాన్ని పరిరక్షించుకునే నిమిత్తం ఇలాంటి వారి వద్దకు వెళ్ళకుండా వుండడం మరియు వారినేమీ ప్రశ్నించకుండా వుండడం ఎంతో ముఖ్యం. పైగా – అన్ని విషయాల్లో అల్లాహ్‌పై సంపూర్ణంగా నమ్మకం కలిగి వుండాలి మరియు లాభనష్టాల అధికారి కేవలం అల్లాహ్‌యే అని విశ్వసించాలి. ఇస్లామీయ విశ్వాసాలకు సంబంధించిన అతి ముఖ్యమైన విషయం ఇది. కానీ, (దురదృష్టవశాత్తూ) నేడు చాలామంది ముస్లిములు దీన్నుండి వైదొలిగారు.

అల్లాహ్ అందరికీ సన్మార్గాన్ని ప్రసాదించుగాక మరియు మనల్ని మన విశ్వాస ఆచరణలలో ఒకర్నొకరు సరిదిద్దుకునే సద్బుద్ధిని ప్రసాదించుగాక! (ఆమీన్)

## రెండవ ఖుత్బా

ప్రియ సోదరులారా!

అల్లాహ్‌పైనే సంపూర్ణంగా నమ్మకం వుంచడం మరియు కేవలం అతణ్ణే లాభనష్టాల స్వామి అని భావించడం – ఇది ఎంత పెద్ద ఆచరణ అంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కర్మల విచారణ లేకుండానే స్వర్గంలో ప్రవేశించే వ్యక్తుల్లో – మంత్రించి ఊదించుకోవడానికి ఇతరుల వద్దకు వెళ్ళకుండా, తనే స్వయంగా దివ్య ఖుర్ఆన్ ఆయతులతో, సున్నత్‌లో ప్రస్తావించబడ్డ దుఆలను పఠించి తనపై ఊదుకునేవాడు, అపశకునం పాటించనివాడు మరియు కేవలం అల్లాహ్ పైనే నమ్మకం కలిగి వుండేవాడు – లను కూడా చేర్చారు.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

నాకు గత సమాజాలను చూపించడం జరిగింది. తద్వారా, నేను చూసిందేమింటంటే – ఒక ప్రవక్తను చూడగా ఆయనతో కేవలం కొంతమంది (10 కన్నా తక్కువ) వున్నారు. మరో ప్రవక్తతో కేవలం ఒక్కరే వున్నారు. ఇంకో ప్రవక్తతో ఒక్కరు కూడా లేరు. తదుపరి, అకస్మాత్తుగా నాకో పెద్ద సమూహం గోచరించింది. బహుశా ఇది నా అనుచర సమాజం అని నేను భావించాను. కానీ ఇది మూసా (అలైహిస్సలాం) మరియు ఆయన అనుచర సమాజం అని నాతో చెప్పబడింది. తదుపరి, నాతో – ఇటువైపు చూడండి అని చెప్పబడింది. నేను చూడగా ఒక పెద్ద జన సమూహం కనబడింది. తదుపరి నాకు మళ్ళీ మరోవైపు చూడమని చెప్పబడింది. నేను అటువైపు చూడగా మరోపెద్ద జన సమూహం కనబడింది. తదుపరి నాతో ఇలా చెప్పబడింది: ఇది మీ అనుచర సమాజం. వీరిలో 70 వేల మంది కర్మల విచారణ లేకుండానే స్వర్గంలో ప్రవేశిస్తారు.

తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) లేచి నిలబడి తన గృహంలోకి వెళ్ళిపోయారు.

ఆ తర్వాత ప్రజలు (సహచరులు) ఆ 70 వేల మంది ఎవరై వుంటారబ్బా అన్న విషయంపై తర్జన భర్జన చేసుకోసాగారు. దీనిపై కొందరు బహుశా వారు ఇస్లామ్ స్థితిలోనే జన్మించిన వారు, తద్వారా ఎప్పుడూ షిర్క్‌కు పాల్పడని వారు కావచ్చు అని అనగా, మరి కొందరు మరో అభిప్రాయాన్ని వెలిబుచ్చారు.

ఈలోగా అకస్మాత్తుగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బయటకు విచ్చేశారు. రాగానే వారితో – 'మీరు ఏ విషయం గురించి చర్చిస్తున్నారు' అని అడిగారు. సహచరులు జవాబిస్తూ – మేము, కర్మల విచారణ లేకుండానే స్వర్గంలో ప్రవేశించే 70 వేల మంది ఎవరై వుంటారా? అన్న విషయం గురించి చర్చిస్తున్నాం అని విన్నవించుకున్నారు. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వివరిస్తూ – వీరు ఎవరంటే – వారు స్వయంగా మంత్రించి ఊదుకోరు మరియు ఇతరులతో మంత్రించి ఊదుకోరు, అపశకునం పాటించరు మరియు కేవలం తమ ప్రభువు (అల్లాహ్) పైనే నమ్మకం కలిగి వుంటారు అని అన్నారు.

ఇది విని అక్కాషా బిన్ మహ్సన్ (రజి అల్లాహు అన్హు) నిలబడి ఓ దైవప్రవక్తా! నన్ను కూడా ఆ (70 వేల) సమూహంలో చేర్చమని అల్లాహ్‌ను ప్రార్థించండి అని విన్నవించుకున్నారు.

దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – నీవు వారిలోనే వుంటావు అని అన్నారు. ఇంతలో మరో వ్యక్తి లేచి నిలబడి ఇలా పలికాడు: అల్లాహ్ నన్ను కూడా చేర్చమని నా కోసం ప్రార్థించండి.

దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్పందిస్తూ – అక్కాషా నీ కన్నా ముందుకెళ్ళిపోయాడు అని పలికారు.

*(బుఖారీ : 3410, 5705, 5752, ముస్లిం : 220)*

ముస్లిం లో వివరించబడ్డ ఇమ్రాన్ బిన్ హుస్సేన్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ 70 వేల మంది గుణగణాలను ఇలా వివరించారు:

వారు మంత్రించి ఊదించుకోరు, అపశకునం పాటించరు, శరీరాన్ని అగ్నితో వాతలు పెట్టుకోరు మరియు కేవలం తమ ప్రభువు (అల్లాహ్) పైనే నమ్మకం కలిగి వుంటారు. *(ముస్లిం : 218)*

మరి మనక్కూడా అల్లాహ్ ఈ 70 వేల మందిలో చేర్చాలంటే– హదీసులో సెలవిచ్చినట్లు మనం కూడా ఈ మహోత్తర గుణాలను అలవర్చుకోవలసి వుంటుంది.

అల్లాహ్ మనక్కూడా ఈ సద్బుద్ధిని ప్రసాదించుగాక!

నేటి ఖుత్బాను మేము ఈ దుఆతో ముగిస్తున్నాం.

“అల్లాహ్ మనందరినీ రుజుమార్గంపై నడిచే సద్బుద్ధిని ప్రసాదించుగాక! (ఆమీన్)

# రబీ ఉల్ అవ్వల్ మాసపు ఖుత్బాలు

1) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మహత్యము, అద్భుతాలు మరియు ప్రత్యేకతలు

2) షరీయత్తు దృష్టిలో మిలాద్ వేడుకల విలువ

3) అనుచర సమాజం (ఉమ్మత్)పై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హక్కులు.

4) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సుగుణాలు మరియు నడవడిక

# దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

# మహత్యము, అద్భుతాలు మరియు ప్రత్యేకతలు

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు:

1) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మహత్యం
2) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి పలు అద్భుతాలు
3) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రత్యేకతలు

## మొదటి ఖుత్బా

ఇస్లామీయ సహోదరులారా!

దైవప్రవక్తలలో శ్రేష్టులయిన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇస్మాయీల్ బిన్ ఇబ్రాహీం (అలైహిస్సలాం) వంశంలో జన్మించారు. ఆయన అల్లాహ్ దాసులు మరియు అంతిమ దైవప్రవక్త. ప్రళయం వరకు రాబోయే మానవులందరి కోసం ఆయనను ప్రవక్తగా చేసి పంపడం జరిగింది. ఆయన రాకతో దైవప్రవక్తల పరంపర సమాప్తమయ్యింది. ఆయన ఇతర ప్రవక్తలపై విశిష్టత మరియు ఆధిక్యతను పొందివున్నారు. ఇలాగే ఆయన ఉమ్మత్ స్థాయి కూడా ఇతర ఉమ్మత్ (అనుచర సమాజం)ల కన్నా ఎక్కువగా వుంది. ఆయన విధేయతను అల్లాహ్ తప్పనిసరి చేశాడు. ఆయనకు గల ప్రత్యేకతలు ఇతర ప్రవక్తలకు లేవు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని రండి! మన ప్రియ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి మహత్యం, ఆయన అద్భుతాలు మరియు కొన్ని ప్రత్యేకతలను గూర్చి తెలుసుకొందాం.

## దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్థాయి మరియు ఆయన విశిష్టత

### 1) శ్రేష్ట వంశము

తన వంశము (కుటుంబం) రీత్యా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంతో ఉన్నత స్థానం కలిగి వున్నారు.

ఈ విషయాన్నే వాయిలా బిన్ అసఖా (రజి అల్లాహు అన్హు), దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా ఇలా ఉల్లేఖించారు:

"నిస్సందేహంగా అల్లాహ్, ఇస్మాయీల్ (అలైహిస్సలాం) సంతానంలో 'కనాన' ను ఎన్నుకున్నాడు. తదుపరి 'కనాన' నుండి ఖురైష్‌ను, వారి నుండి బనూ హాషిమ్ ను ఎన్నుకున్నాడు. బనూ హాషిమ్ నుండి నన్ను ఎన్నుకున్నాడు."

*(సహీ ముస్లిం : 2276)*

ఇలాగే, రోము చక్రవర్తి (హెరిక్లెస్), అబూసుఫ్యాన్ (అప్పటి వరకు ఆయన ఇంకా ముస్లిం కాలేదు)ను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వంశావళిని గూర్చి అడగ్గా – ఆయన జవాబిస్తూ, "అతను మాలో ఎంతో ఉన్నతమైన వంశానికి చెందిన వ్యక్తి" అని అన్నారు. దీనిపై హెరిక్లెస్ స్పందిస్తూ – దైవప్రవక్తలు (సాధారణంగా) తమ జాతుల్లోని ఉన్నత వంశానికే చెందినవారై వుంటారు అని అన్నాడు. *(సహీ బుఖారీ : 7, సహీ ముస్లిం : 1773)*

## 2) మానవాళి కొరకు గొప్ప కటాక్షం

వాస్తవానికి మానవాళిపై అల్లాహ్ ఉపకారాలు లెక్కలేనంతగా వున్నాయి. కానీ వాటిలో అన్నింటి కన్నా ప్రత్యేక ఉపకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆగమనం. ఈ విషయాన్ని అల్లాహ్ దివ్య ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

**لَقَدْ مَنَّ اللَّهُ عَلَى الْمُؤْمِنِينَ إِذْ بَعَثَ فِيهِمْ رَسُولًا مِّنْ أَنفُسِهِمْ يَتْلُو عَلَيْهِمْ آيَاتِهِ وَيُزَكِّيهِمْ وَيُعَلِّمُهُمُ الْكِتَابَ وَالْحِكْمَةَ وَإِن كَانُوا مِن قَبْلُ لَفِي ضَلَالٍ مُّبِينٍ ﴿164﴾**

**"అల్లాహ్ విశ్వాసులకు చేసిన మహోపకారం ఏమిటంటే – ఆయన, వారిలోనుండే ఒక ప్రవక్తను ఎన్నుకొని వారి వద్దకు పంపాడు. అతడు వారికి ఆయన వాక్యాలను చదివి వినిపిస్తాడు, వారిని పరిశుద్ధుల్ని చేస్తాడు. వారికి గ్రంథజ్ఞానాన్ని, వివేకాన్ని బోధిస్తాడు. నిశ్చయంగా అంతకు ముందు వాళ్ళు స్పష్టమైన అపమార్గానికి లోనై వున్నారు."**

***(ఆలి ఇమ్రాన్ : 164)***

ఈ ఆయత్‌లో అల్లాహ్ సెలవిచ్చినట్లు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి

వ సల్లం)కు దైవదౌత్య బాధ్యతలు అప్పగించబడ్డ సమయంలో మానవ జాతి స్పష్టమైన అపమార్గానికి లోనై అజ్ఞానపు అంధకార లోయలలో కొట్టుమిట్టాడు తోంది. ఈ తరుణంలో అల్లాహ్ వారి వద్దకు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను పంపి, వారిని అంధకారం నుండి బయటకు తీసి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా వారిని రుజుమార్గం వైపునకు దారి చూపాడు. ఇలా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సర్వ మానవాళి కొరకు ఒక కారుణ్యంగా వున్నారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَآ أَرْسَلْنَٰكَ إِلَّا رَحْمَةً لِّلْعَٰلَمِينَ ﴿107﴾

**"మేము నిన్ను సమస్త లోకవాసుల కోసం కారుణ్యంగా చేసి పంపాము."**
***(అంబియా : 107)***

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రజలారా! నేను ప్రజల కొరకు (అల్లాహ్ తరఫు నుండి) బహుమానంగా పంపబడిన కారుణ్యాన్ని.
*(హాకిమ్: 1/91 – సహీ)*

## 3) వెలుగును విరజిమ్మే దీపం

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అల్లాహ్ 'వెలుగును విరజిమ్మే దీపం' గా ఖరారు చేశాడు. దీపం ద్వారా అంధకారం దూరమైనట్లే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా షిర్క్ (బహుదైవారాధన) మరియు కుఫ్ర్ (దైవ తిరస్కారం)ల అంధకారాలు దూరమవుతాయి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَٰٓأَيُّهَا ٱلنَّبِيُّ إِنَّآ أَرْسَلْنَٰكَ شَٰهِدًا وَمُبَشِّرًا وَنَذِيرًا ﴿45﴾ وَدَاعِيًا إِلَى ٱللَّهِ بِإِذْنِهِۦ وَسِرَاجًا مُّنِيرًا ﴿46﴾

**"ఓ ప్రవక్తా! మేమే నిన్ను (ప్రవక్తగా ఎన్నుకొని)సాక్ష్యమిచ్చే వానిగా, శుభవార్తలు వినిపించే వానిగా, హెచ్చరించే వానిగా చేసి పంపాము. ఇంకా, అల్లాహ్ ఆజ్ఞచే ఆయన వైపునకు పిలిచేవానిగా, వెలుగును విరజిమ్మే దీపంగా (చేసి పంపాము)".** ***(అహ్జాబ్ : 45-46)***

## 4) దయామయులు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచర సమాజానికి ఎంతో దయామయులు. అల్లాహ్ ఆయన గుణాలలో కొన్నిటిని గూర్చి వివరిస్తూ ఇలా సెలవిచ్చాడు:

لَقَدْ جَاءَكُمْ رَسُولٌ مِّنْ أَنفُسِكُمْ عَزِيزٌ عَلَيْهِ مَا عَنِتُّمْ حَرِيصٌ عَلَيْكُم بِالْمُؤْمِنِينَ رَءُوفٌ رَّحِيمٌ ﴿128﴾

**"మీ దగ్గరకు స్వయంగా మీలోనుంచే ఒక ప్రవక్త వచ్చాడు. మీకు కష్టం కలిగించే ప్రతీదీ అతనికి బాధ కలిగిస్తుంది. అతను మీ మేలును ఎంతగానో కోరుకుంటాడు. విశ్వాసుల యెడల అతను వాత్సల్యం కలవాడు, దయామయుడు."** ***(తౌబా : 128)***

ఈ ఆయత్‌లో అల్లాహ్, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి నాలుగు ఉత్తమ గుణాలను గూర్చి వివరించాడు.

**మొదటిది:** ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక మనిషి.

ఇంకో ఆయత్‌లో ఇలా సెలవిచ్చాడు:

قُلْ إِنَّمَا أَنَا بَشَرٌ مِّثْلُكُمْ يُوحَىٰ إِلَيَّ أَنَّمَا إِلَٰهُكُمْ إِلَٰهٌ وَاحِدٌ

**"(ఓ ప్రవక్తా!) వారికిలా చెప్పు: నేనూ మీలాంటి మానవ మాత్రుణ్ణే. (కాకపోతే) 'మీ అందరి ఆరాధ్యదైవం ఒకే ఆరాధ్యదైవం' అన్న సందేశం (వహీ) నా వద్దకు పంపబడుతుంది."** ***(కహఫ్: 110)***

ఇంకా, ఇలా సెలవిచ్చాడు:

قُلْ سُبْحَانَ رَبِّي هَلْ كُنتُ إِلَّا بَشَرًا رَّسُولًا ﴿93﴾

**"(ఓ ప్రవక్తా)! వారికి చెప్పు: నా ప్రభువు పవిత్రుడు. నేను ప్రవక్తగా పంపబడిన ఒక మానవమాత్రుణ్ణి మాత్రమే."** ***(బనీ ఇస్రాయీల్ : 93)***

**రెండవది:** మీకు కలిగే ప్రతి కష్టమూ ఆయనకు బాధ కలిగిస్తుంది. అందుకే ఆయన, ధర్మంలో సరళతను, సౌలభ్యాన్ని కోరుకునే వారు మరియు ఉమ్మత్‌కు కష్టం కలుగుతుందేమో అని ఊహించిన విషయాలను విడిచి పెట్టేవారు. దీని గురించి ఎన్నో ఉదాహరణలు వున్నాయి. వాటిలో ఒకటి – మేరాజ్ యాత్రలో అల్లాహ్ 50 నమాజులను విధిగా ఖరారు చేసినప్పుడు,

ఆయన అల్లాహ్‌తో, దీని తగ్గింపుకై విన్నవించుకున్నారు. తత్ఫలితంగా కేవలం 5 నమాజులు విధిగా వుండిపోయాయి. రెండవది – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తరావీహ్ నమాజును మూడు రాత్రులు సామూహికంగా పాటించారు. నాలుగవ రాత్రి దాన్ని త్యజించి ఇలా సెలవిచ్చారు: ఇది (తరావీహ్ నమాజు) మీపై విధి (ఫర్జ్)గా ఖరారు చేయబడుతుందేమోనన్న అనుమానం నాకు కలిగింది.

**మూడవది**: ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఒకవేళ నాకు, ఉమ్మత్ కష్టానికి గురవుతుందేమో అన్న అనుమానం కలగకపోయుంటే నేను ఉమ్మత్‌కు, ప్రతి నమాజుకు పూర్వం మిస్వాక్ చేయమని ఆదేశించే వాడిని."

ఈ మూడు ఉదాహరణలు (ఇవేగాక ఇలాంటి ఎన్నో ఉదాహరణలు) ద్వారా రూఢీ అయ్యే విషయం ఏమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు తన ఉమ్మత్ కష్టాలకు గురికావడం అస్సలు ఇష్టంలేదు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా కూడా సెలవిచ్చారు:

"నిశ్చయంగా ధర్మం సులభతరమైనది. ధర్మం లో కష్టం కలుగ జేసుకొనే వాడు తన శక్తికి మించి ఆరాధించడానికి ప్రయత్నిస్తాడు. కానీ, ధర్మం అతనిపై ప్రాబల్యం వహిస్తుంది. అందుకే మీరు మధ్యేమార్గాన్ని అనుసరించండి. ఒకవేళ ఏ ఆరాధన అయినా సంపూర్ణంగా చేయలేకపోతే, కనీసం దాని దరిదాపుల వరకైనా తప్పనిసరిగా చేయండి. ఆరాధనా ప్రతిఫలాన్ని గూర్చి సంతోషించండి. ఉదయం, సాయంత్రం మరియు రాత్రి చివరి ఘడియల్లో అల్లాహ్‌ను ఆరాధించి ఆయన సహాయాన్ని అర్థించండి." *(సహీ బుఖారీ : 39)*

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం), ముఆజ్, అబూ మూసా అష్‌అరీ (రజి అల్లాహు అన్హుమ్)లను ఇస్లామ్ సందేశ ప్రచార నిమిత్తం యమన్ వైపునకు పంపేటప్పుడు ఇలా ఉపదేశించారు:

"ప్రజలకు సౌలభ్యం కలుగజేయండి, వారిని కష్టాలకు, బాధలకు గురి చెయ్యకండి. వారికి శుభవార్తలు యివ్వండి. ధర్మం పట్ల (వారిలో) ద్వేషాన్ని కలుగజేయకండి. ఇద్దరూ కలిసిమెలిసి శ్రమించండి. విభేధాలకు గురి కాకండి.
*(సహీ బుఖారీ : 3038)*

## మూడవ గుణం ఏమిటంటే:

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– మీ సన్మార్గం, ఇహపరలోక ప్రయోజనాలను కాంక్షిస్తారు మరియు మీరు నరకంలోకి వెళ్ళడం ఆయనకు సుతరామూ ఇష్టం లేదు. అందుకే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నిశ్చయంగా, ప్రజలు మరియు నన్ను గురించిన ఉదాహరణ ఎలాంటి వ్యక్తి లాంటిదంటే – ఆ వ్యక్తి అగ్ని రాజేసాడు. అది తన పరిసరాలన్నింటినీ ప్రకాశవంతం చేయగా–ఆ అగ్నిలోకే దీపం పురుగులు, ఇతర కీటకాలు దూకుతుంటాయి. అగ్నిరాజేసిన వ్యక్తి మటుకు, వాటిని మంటల్లో పడకుండా దూరంగా తరుముతూ వుంటాడు. కానీ, అవి మాత్రం అతనిపై ప్రాబల్యం పొంది అగ్నిలోకి దూకుతాయి. ఇలా, నేను కూడా మీ నడుం పట్టి మిమ్మల్ని నరకాగ్ని నుండి దూరంగా లాగుతాను. కానీ, (మీరుమాత్రం నన్ను వదిలించుకొని) బలవంతంగా పోయి నరకాగ్నిలోకి ప్రవేశిస్తారు.

*(సహీ బుఖారీ : 6483, సహీ ముస్లిం : 2284)*

## నాల్గవ గుణం ఏమిటంటే:

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అత్యంత దయామయులు. ఈ విషయంలో కూడా ఎన్నో ఉదాహరణలను పేర్కొనవచ్చు. ఇక్కడ మేము కేవలం మూడింటితో సరిపెడుతున్నాం:

1) అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నేను నమాజ్ కోసం నిలబడినప్పుడు నా సంకల్పం దానిని పొడిగించాలని వుంటుంది. కానీ ఏదైనా పిల్లవాడి ఏడుపు వినగానే నమాజ్‌ను సంక్షిప్తం చేసేస్తాను. ఎందుకంటే – పిల్లవాడి ఏడుపు మూలంగా అతని తల్లి గాబరా పడుతుందని నాకు తెలుసు."

*(సహీ బుఖారీ : 709, సహీ ముస్లిం : 470)*

2) ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం, కొంత మంది పల్లెవాసులు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికొచ్చి – మీరు

మీ పిల్లలను ముద్దాడుతారా? అని అడిగా. దైవప్రవక్త మరియు ఆయన సహచరులు 'అవును' అని బదులిచ్చారు. దీనిపై వారు – 'అల్లాహ్ సాక్షి! మేము మా పిల్లలను ముద్దాడము' అని పలికారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్పందిస్తూ : అల్లాహ్ ఒకవేళ మీ హృదయాల్లో నుండి కారుణ్యాన్ని లాక్కుంటే దానికి నేనేం చేయను? అని అన్నారు.

*(సహీ బుఖారీ : 5998, సహీ ముస్లిం : 2317)*

3) అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), ఇబ్రాహీం (అలైహిస్సలాం) గురించి అల్లాహ్ అవతరింప జేసిన ఆయత్ "నా ప్రభూ! అవి (విగ్రహాలు) ఎంతో మందిని పెడదారి పట్టించాయి. కనుక నన్ను అనుసరించిన వాడే నావాడు, కానీ ఎవడైనా అవిధేయత చూపితే నువ్వు అమితంగా క్షమించేవాడవు, కనికరించేవాడవు." (ఇబ్రాహీం : 36)

మరియు ఈసా (అలైహిస్సలాం) గురించి అవతరింపజేసిన ఆయత్ – "ఒకవేళ నీవు వారిని శిక్షించినట్లయితే, వారు నీ దాసులు. నీవు గనక వారిని క్షమించినట్లయితే నిశ్చయంగా నీవు సర్వాధిక్యుడవు, వివేచనాపరుడవు." (మాయిదా : 118) లను పఠించి, తదుపరి తన చేతులను పైకెత్తి ఇలా ప్రార్థించారు:

"ఓ అల్లాహ్! నా అనుచర సమాజం, నా అనుచర సమాజం!" తదుపరి ఏడ్వడం ప్రారంభించారు.

దీనిపై అల్లాహ్, జిబ్రయీల్ (అలైహిస్సలాం)తో : ఓ జిబ్రాయీల్! వెళ్ళు – వెళ్ళి, ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అడుగు, ఎందుకు ఏడుస్తున్నారో?అని ఆదేశించాడు. వాస్తవానికి నీ ప్రభువుకు బాగా తెలుసు, ఆయన ఎందుకు ఏడుస్తున్నారో. జిబ్రయీల్ (అలైహిస్సలాం) వచ్చి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను 'మీరెందుకు ఏడుస్తున్నారు?' అని అడిగారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనకు అంతా వివరించారు. అది తీసుకొని జిబ్రయీల్ (అలైహిస్సలాం) అల్లాహ్‌కు తెలియజేశారు. వాస్తవానికి అల్లాహ్‌కు అంతా తెలుసు. దీనిపై అల్లాహ్, జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)వద్దకు ఈ సందేశం ఇచ్చి పంపించాడు.

"మేము మీకు మీ అనుచరసమాజం విషయంలో సంతృప్తి పరుస్తాం మరియు మీకు కష్టాన్ని కలుగజేయం." *(సహీ ముస్లిం : 346)*

ఈ మూడు హదీసులు, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ఎంతో దయామయులు అని అనడానికి ప్రబల నిదర్శనం.

## 5) తౌరాత్ మరియు ఇంజీల్‌లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గుణగణాల వివరణ

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి గుణ విశేషాలు కేవలం దివ్య ఖుర్‌ఆన్ లోనే కాదు, తౌరాత్, ఇంజీల్‌లో కూడా ఆయనను ప్రశంసించడం జరిగింది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

الَّذِينَ يَتَّبِعُونَ الرَّسُولَ النَّبِيَّ الْأُمِّيَّ الَّذِي يَجِدُونَهُ مَكْتُوبًا عِندَهُمْ فِي التَّوْرَاةِ
وَالْإِنجِيلِ يَأْمُرُهُم بِالْمَعْرُوفِ وَيَنْهَاهُمْ عَنِ الْمُنكَرِ وَيُحِلُّ لَهُمُ الطَّيِّبَاتِ وَيُحَرِّمُ عَلَيْهِمُ
الْخَبَائِثَ وَيَضَعُ عَنْهُمْ إِصْرَهُمْ وَالْأَغْلَالَ الَّتِي كَانَتْ عَلَيْهِمْ ۚ فَالَّذِينَ آمَنُوا بِهِ وَعَزَّرُوهُ
وَنَصَرُوهُ وَاتَّبَعُوا النُّورَ الَّذِي أُنزِلَ مَعَهُ ۙ أُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ (157)

**"ఈ సందేశహరుణ్ణీ, నిరక్షరాసి అయిన ఈ ప్రవక్తను అనుసరించేవారు (కరుణించబడతారు). అతని ప్రస్తావన వారికి తమ వద్ద ఉన్న తౌరాతు, ఇంజీలు గ్రంథాలలో లిఖితపూర్వంగా లభిస్తుంది. ఆ ప్రవక్త మంచిని చెయ్యమని వారికి ఆదేశిస్తాడు, చెడుల నుంచి వారిస్తాడు. పరిశుద్ధ వస్తువులను ధర్మసమ్మతంగా ప్రకటిస్తాడు. అశుద్ధమైన వాటిని నిషిద్ధంగా ఖరారు చేస్తాడు. వారిపై వున్న బరువులను దించుతాడు. వారికి వేయబడి వున్న సంకెళ్ళను (విప్పుతాడు). కనుక ఎవరు ఈ ప్రవక్తను విశ్వసించి అతనికి సహాయకులుగా నిలుస్తారో, తోడ్పాటునందిస్తారో, ఇంకా ఆయనతో పాటు పంపడిన జ్యోతిని అనుసరిస్తారో వారే సాఫల్యం పొందేవారు."** ***(ఆరాఫ్ : 157)***

## 6) ఇబ్రాహీం (అలైహిస్సలాం) ప్రార్థన మరియు ఈసా (అలైహిస్సలాం) ఇచ్చిన శుభవార్తల ఫలితము

ఇబ్రాహీం (అలైహిస్సలాం) ప్రార్థన మరియు ఈసా (అలైహిస్సలాం)

ఇచ్చిన శుభవార్తల ఫలితమే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆగమనం. దీని గురించి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నేను ఇబ్రాహీం (అలైహిస్సలాం) ప్రార్థనను మరియు అందరికన్నా ఆఖరుగా నా ఆగమనాన్ని గూర్చి ఈసా (అలైహిస్సలాం) శుభవార్త నందించారు.." *(సహీ ఉల్ జామె అల్‌బానీ : 1463)*

ఇబ్రాహీం (అలైహిస్సలాం) కాబా నిర్మాణం పూర్తి చేసిన తర్వాత ఎన్నో ప్రార్థనలు చేశారు. వాటిలో ఒకటి ఇది:

رَبَّنَا وَابْعَثْ فِيهِمْ رَسُولًا مِّنْهُمْ يَتْلُوا عَلَيْهِمْ اٰيٰتِكَ وَيُعَلِّمُهُمُ الْكِتٰبَ وَالْحِكْمَةَ وَيُزَكِّيهِمْ ؕ
اِنَّكَ اَنْتَ الْعَزِيزُ الْحَكِيمُ ﴿129﴾

**"ఓ మా ప్రభూ! నీ వాక్యాలను వారికి చదివి వినిపించే, గ్రంథజ్ఞానాన్ని నేర్పించే, విజ్ఞతా వివేచనలను విడమరిచి చెప్పే, వారిని పరిశుద్ధ పరచే ఒక ప్రవక్తను స్వయంగా వారి జాతి నుంచే వారిలో ప్రభవింపజెయ్యి. నిస్సందేహంగా నీవు సర్వాధికుడవు, వివేకవంతుడువు."** ***(బఖర : 129)***

ఇబ్రాహీం (అలైహిస్సలాం) గారి ఈ ప్రార్థనను అల్లాహ్ స్వీకరించి, ఇస్మాయీల్ (అలైహిస్సలాం) సంతానం (వంశం)లో ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను ప్రభవింపజేశాడు.

ఇక, ఈసా (అలైహిస్సలాం) గారిచ్చిన శుభవార్తను గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاِذْ قَالَ عِيسَى ابْنُ مَرْيَمَ يٰبَنِيٓ اِسْرَآءِيلَ اِنِّي رَسُولُ اللّٰهِ اِلَيْكُمْ مُّصَدِّقًا لِّمَا بَيْنَ يَدَيَّ مِنَ التَّوْرٰىةِ
وَمُبَشِّرًا بِرَسُولٍ يَّاْتِي مِنْ بَعْدِي اسْمُهٗٓ اَحْمَدُ ؕ فَلَمَّا جَآءَهُمْ بِالْبَيِّنٰتِ قَالُوا هٰذَا سِحْرٌ مُّبِينٌ ﴿6﴾

**"మర్యమ్ కుమారుడైన ఈసా, (తన జాతి వారితో) ఓ ఇస్రాయీలు సంతతివారలారా! నేను మీ వైపునకు అల్లాహ్ తరపున పంపబడిన ప్రవక్తను. నాకు పూర్వం వచ్చిన తౌరాతు గ్రంథాన్ని ధృవపరుస్తున్నాను మరియు నా తరువాత రాబోయే ఒక ప్రవక్తను గూర్చి శుభవార్తను ఇస్తున్నాను. అతని పేరు 'అహ్మద్' అని చెప్పినప్పటి సంగతి (కూడా స్మరించదగినదే)."** ***(సఫ్ : 6)***

## ఒక కవి ఎంత చక్కగా వర్ణించాడో!

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈసా (అలైహిస్సలాం) గారి శుభవార్త, కలీముల్లాహ్ మూసా (అలైహిస్సలాం) గారి హితోపదేశం, ఇబ్రాహీం (అలైహిస్సలాం) కాబా వద్ద చేసిన ప్రార్థన. ఇలా పూర్వకాలం నుండి ప్రవక్తలు, సందేశహరులందరూ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను గురించి శుభవార్త ఇస్తూనే వచ్చారు.

## 7) అల్లాహ్ సంస్మరణం తో పాటు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్మరణం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు అల్లాహ్ ఎంతో ఉన్నతమైన స్థానాన్ని ప్రసాదించాడు. అందుకే, అల్లాహ్‌ను స్మరించేటప్పుడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్మరణం కూడా వస్తుంది. సద్వచన (కలిమా) సాక్ష్యం, అజాన్, ఇఖామత్, ఖుత్బా, తషహ్హుద్ మరియు ఇతర ఎన్నో సందర్భాల్లో అల్లాహ్ పేరుతోపాటు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) పేరు కూడా తీసుకోబడుతుంది. దైవప్రవక్తలు, దైవదూతలలో కూడా అల్లాహ్ ఆయనకు ఔన్నత్యాన్ని ప్రసాదించాడు. ఇహపరలోకాల్లో కూడా ఆయన పేరును చర్చించాడు.

ఇవన్నీ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) గొప్పతనానికి, ఔన్నత్యానికీ నిదర్శనాలు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

أَلَمْ نَشْرَحْ لَكَ صَدْرَكَ ① وَوَضَعْنَا عَنكَ وِزْرَكَ ② الَّذِي أَنقَضَ ظَهْرَكَ ③
وَرَفَعْنَا لَكَ ذِكْرَكَ ④

**"(ఓ ముహమ్మద్)! ఏమిటి, మేము నీ హృదయాన్ని నీ కోసం తెరవలేదా? ఇంకా నీ మీది నుంచి నీ భారాన్ని కూడా మేము దించేశాము. అది నీ వీపును విరిచేస్తూ వుండేది. ఇంకా – మేము నీ కీర్తిని ఉన్నతం చేశాము."**

***(అష్ షరహ్ : 1-4)***

హుస్సాన్ (రజి అల్లాహు అన్హు) ఎంత గొప్పగా వర్ణించారో!

అల్లాహ్, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పేరును తన పేరుతో జత చేసేశాడు. ఇక, ముఅజ్జిన్ (అజాన్ పలికే వ్యక్తి) (ప్రతిరోజూ) ఐదు సార్లు అజాన్ పలుకుతూ “అష్హదు” అని అంటాడు మరియు అల్లాహ్ తన పేరుతోపాటు ఆయన పేరును కలిపాడు, తద్వారా ఆయన్ను గౌరవించాలని. అందుకే అర్ష్ వాసుడు (అల్లాహ్) ‘మహ్మూద్’ అయితే, ఈయన ‘ముహమ్మద్’ (సల్లల్లాహు అలైహి వ సల్లం).

## 8) దైవ ప్రవక్తల వాగ్దానం

అల్లాహ్, దైవ ప్రవక్తలందరితో – ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను విశ్వసించాలని, ఆయనను బలపరిచి, సహాయపడాలని వాగ్దానం తీసుకున్నాడు. అందుకే, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను, ఒకవేళ, వారి కాలంలో ప్రభవింపజేసి వుంటే, వారిక్కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత చూపడం తప్ప మరో మార్గం వుండేది కాదు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاِذْ اَخَذَ اللّٰهُ مِيْثَاقَ النَّبِيّٖنَ لَمَآ اٰتَيْتُكُمْ مِّنْ كِتٰبٍ وَّحِكْمَةٍ ثُمَّ جَآءَكُمْ رَسُوْلٌ مُّصَدِّقٌ
لِّمَا مَعَكُمْ لَتُؤْمِنُنَّ بِهٖ وَلَتَنْصُرُنَّهٗ ؕ قَالَ ءَاَقْرَرْتُمْ وَاَخَذْتُمْ عَلٰى ذٰلِكُمْ اِصْرِىْ ؕ قَالُوْٓا اَقْرَرْنَا ؕ
قَالَ فَاشْهَدُوْا وَاَنَا مَعَكُمْ مِّنَ الشّٰهِدِيْنَ (81) فَمَنْ تَوَلّٰى بَعْدَ ذٰلِكَ فَاُولٰٓئِكَ هُمُ الْفٰسِقُوْنَ (82)

**“అల్లాహ్ (తన) ప్రవక్తల నుండి వాగ్దానం తీసుకున్నప్పుడు, మేము మీకు గ్రంథాన్ని, వివేకాన్ని ఇచ్చిన తరువాత, మీ వద్ద వున్న దాన్ని సత్యమని ధృవీకరించే ప్రవక్త మీ వద్దకు వస్తే మీరు తప్పకుండా అతణ్ణి విశ్వసించాలి, అతనికి సహాయపడాలి అని చెప్పాడు. తర్వాత ఆయన – ఈ విషయాన్ని మీరు ఒప్పుకుంటారా? నేను మీపై మోపిన బాధ్యతను స్వీకరిస్తున్నారా? అని ప్రశ్నించగా, ‘మేము ఒప్పుకుంటున్నాము’ అని అందరూ అన్నారు. ‘మరయితే దీనికి మీరు సాక్షులుగా వుండండి, మీతోపాటు నేను కూడా సాక్షిగా వుంటాను’ అని అల్లాహ్ అన్నాడు. దీని తర్వాత కూడా, ఎవరు తిరిగిపోతారో వారే పరమ అవిధేయులు.”**

***(ఆలి ఇమ్రాన్ : 81 – 82)***

ఈ వాగ్దానం ద్వారానే, అల్లాహ్ ఇతర ప్రవక్తలపై ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఔన్నత్యాన్ని నిరూపించాడు.

## మేరాజ్ అద్భుతము

అల్లాహ్, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు, ఇస్రా మరియు మేరాజ్ లాంటి మహత్తరమైన అద్భుతాన్ని ప్రసాదించాడు. ఎందుకంటే, దీని ద్వారా కూడా అల్లాహ్, ఇతర ప్రవక్తలపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఔన్నత్యాన్ని నిరూపించదలిచాడు. తదనుగుణంగా, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అఖ్సా మసీదులో దైవప్రవక్తల సమూహానికి (నమాజ్ నిమిత్తం) నాయకత్వం వహించారు. తదుపరి, ఆయన్ను ఆకాశాలపైకి, అల్లాహ్ కోరుకున్నంత వరకు తీసుకెళ్ళడం జరిగింది. ఈ శుభ ప్రయాణంలో ఆయనకు (గత) దైవప్రవక్తలతో పరిచయం చేయించడం జరిగింది. స్వర్గంలో విహరింప జేయడం జరిగింది. ఆయనపై 5 పూటల నమాజు విధిగా విధించబడ్డాయి.....

ఈ ప్రయాణమంతా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) గొప్పతనాన్ని, ప్రత్యేకతను, ఆయన ఔన్నత్యాన్ని సూచిస్తుంది.

## దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గావించిన కొన్ని అద్భుతాలు

తన స్థానాన్నీ, ఔన్నత్యాన్ని సూచించే ఎన్నో అద్భుతాలను అల్లాహ్ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ప్రసాదించాడు. వాటిలో అన్నింటి కన్నా ప్రధానమైన అద్భుతం – తనలోని సరళత, వక్తృత్వత, సమగ్రతల దృష్ట్యా సాహిత్యకారులు మరియు వాక్చతురులందరికీ ఒక సవాలును విసిరే గ్రంథం దివ్య ఖుర్ఆన్. అందుకే, యావత్తు మానవులు, జిన్నాతులు, – అందరూ కలిసినా, ప్రళయం వరకు దీని లాంటి ఒక్క సూరా కూడా రచించి తీసుకురాలేరు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قُل لَّئِنِ اجْتَمَعَتِ الْإِنسُ وَالْجِنُّ عَلَىٰ أَن يَأْتُوا بِمِثْلِ هَٰذَا الْقُرْآنِ
لَا يَأْتُونَ بِمِثْلِهِ وَلَوْ كَانَ بَعْضُهُمْ لِبَعْضٍ ظَهِيرًا ﴿88﴾

**"వారికి చెప్పు! ఒకవేళ సమస్త మానవులు, యావత్తు జిన్నులు కలిసి ఈ ఖుర్ఆన్ లాంటి గ్రంథాన్ని తేదలచినా - వారు పరస్పరం తోడ్పాటు అందజేసుకున్నా, ఇటువంటి దానిని తీసుకురావడం వారికి సాధ్యం కాని పని."** ***(బనీ ఇస్రాయీల్ : 88)***

ఇదేగాక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గావించిన మరికొన్ని అద్భుతాలు కూడా వినండి:

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఓసారి, నమాజ్ కొరకు వేళకాగా, మస్జిద్‌కు దగ్గరగా (ఇల్లు) వున్న వారు తమ ఇండ్లకు వెళ్ళి వుజూ చేసుకున్నారు. కానీ, వుజూ చేయకుండా చాలా మంది వుండిపోయారు. వుజూ కోసం వారి వద్ద నీళ్ళు లేవు. (ఆ సమయంలో) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు ఒక రాతి పాత్రను తీసుకురావడం జరిగింది. దానిలో కొంచెం నీరు వుంది. ఆయన దానిలో తన చేతిని వేయడానికి ప్రయత్నించారు. కానీ, పాత్ర చిన్నగా వున్నందువల్ల వేయలేకపోయారు. అందుకే, ఆయన తన వ్రేళ్ళను జతచేసి దానిలో వేశారు. తదుపరి (అక్కడున్న) వారంతా వుజూ చేసుకున్నారు. 'వారు ఎంతమంది వున్నారు?' అని అడగ్గా, ఆయన '80 మంది' అని జవాబిచ్చారు. *(సహీ బుఖారీ : 3575, సహీ ముస్లిం : 2279)*

❖ ఇలాంటిదే మరో అద్భుతం గురించి అనస్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన సహచరులు (ఓసారి) 'జోరా' వద్ద వున్నారు. 'జోరా', మదీనాలోని బజారులో మస్జిద్‌కు దగ్గరగా వున్న ఒక ప్రదేశం పేరు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నీళ్ళున్న ఒక పాత్రను తెప్పించారు. తదుపరి ఆయన తన చేతిని ఆ పాత్రలో వుంచారు. ఆయన వ్రేళ్ళ మధ్య భాగాల నుండి నీళ్ళు ఉబికి రావడం ప్రారంభమైంది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరులంతా వుజూ చేసుకున్నారు. హదీసు ఉల్లేఖకులు (ఖతాదా) ఇలా సెలవిచ్చారు: నేను అనస్ (రజి అల్లాహు అన్హు) తో - వారెంత మంది వున్నారని ప్రశ్నించాను. ఆయన జవాబిస్తూ - దాదాపు 300 మంది అని అన్నారు.

*(సహీ బుఖారీ : 3572, సహీ ముస్లిం : 2279)*

❖ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం,

హుదైబియా దినం నాడు ప్రజలకు తీవ్రమైన దాహం కలిగింది. కానీ, వారి దగ్గర త్రాగడానికి నీళ్ళు లేవు. కేవలం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముందు ఒక నీళ్ళ పాత్ర వుంది. వాటితో ఆయన వుజూ చేయడం ప్రారంభించారు. ఈ స్థితిని చూసి ప్రజలు గాబరా పడుతూ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు విచ్చేశారు. ఆయన వారితో – ఏమయ్యింది మీకు? అని అడిగారు. 'ప్రస్తుతం మా వద్ద త్రాగడానికి నీరు బొత్తిగా లేదు, కేవలం మీ దగ్గర వున్న పాత్రలో వున్న నీరే వుంది' అని వారు విన్నవించుకున్నారు. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతిని ఆ పాత్రలోనికి పోనిచ్చారు. ఫలితంగా ఆయన వ్రేళ్ళ మధ్య నుండి ఊటల్లాగా నీళ్ళు ఉబికి రావడం ప్రారంభమైంది. మేమంతా ఆ నీటితో వుజూ చేశాం. హదీసు ఉల్లేఖకులు, జాబిర్ బిన్ అబ్దుల్లాతో – అప్పుడు మీరు ఎంత మంది వున్నారు? అని అడగ్గా, ఆయన జవాబిస్తూ – ఒకవేళ మేం ఆ రోజు లక్షమంది వున్నా నీళ్ళు సరిపోయేవి, కాని మేమారోజు 1500 మంది దాకా వున్నాం.

*(సహీ బుఖారీ : 3576)*

❖ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం: మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గావించే అద్భుతాలను (మా కొరకు) శుభప్రదమని తలచే వాళ్ళం, మీరు మాత్రం అవి కేవలం తిరస్కారులను భయపెట్టేందుకే జరిగేవి అని అనుకొంటున్నారు. ఓసారి మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి ప్రయాణంలో వున్నాం. మా వద్ద నీరు కొంచెం మాత్రమే మిగిలి వుంది. (ఇది చూసి) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – 'ఆ మిగిలి వున్న నీటిని తీసుకురండి' అని పురమాయించారు. సహచరులు ఆ నీటి పాత్రను తీసుకొచ్చారు. ఆయన, తన చేతిని దానిలోకి పోనిచ్చి, తదుపరి ఇలా అన్నారు: రండి! శుభప్రదమైన నీటి వైపుకు, శుభం మాత్రం అల్లాహ్ తరఫు నుండే వుంటుంది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వ్రేళ్ళ మధ్య నుండి నీళ్ళు ఉబికి రావడం నా కళ్ళారా చూశాను. ఒక్కోసారి మేము భోజనం చేసేటప్పుడు దానిలో సంస్మరణ (తస్బీహ్) శబ్దాన్ని వినేవారం.

*(సహీ బుఖారీ : 3579)*

❖ అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం : ఓసారి అబూ

తల్హా (రజి అల్లాహు అన్హు) ఉమ్మె సులైమ్‌తో : నేనీ రోజు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కంఠంలో బలహీనతను గమనించాను. బహుశా ఇది ఆకలి మూలంగా కావచ్చు. మరి నీ దగ్గర తినడానికేమైనా వుందా? అని అడిగారు. 'వుంది' అని ఆమె జవాబిచ్చి, కొన్ని యవల (జౌ) రొట్టెలను తీసారు. తదుపరి వాటిని దుప్పటిలో ఒక భాగంలో కట్టి, దాన్ని నా చేతిలో పెట్టి, మిగతా భాగాన్ని నాపై కప్పి, నన్ను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు పంపించారు. నేను మస్జిద్ వద్దకు వెళ్ళగా, అక్కడ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తోపాటు మరికొంతమంది వుండడం చూసి అక్కడకు వెళ్ళి (నిశ్శబ్దంగా) నిలబడ్డాను. ఇది చూసి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాతో – నిన్ను అబూ తల్హా పంపించారా? అని అడిగారు. నేను అవునన్నాను. ఆయన తిరిగి – భోజనం ఇచ్చి పంపించారా? అని అడిగారు. నేను అవునని జవాబిచ్చాను. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కడున్న వారందరితో – లేచి నిలబడండి, తదుపరి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) , అందరినీ తీసుకొని నడవడం ప్రారంభించారు. నేను గలగబా నడుస్తూ వారికన్నా ముందుగా అబూ తల్హా వద్దకొచ్చి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన సహచరుల రాకను గూర్చి చెప్పాను. వెంటనే అబూ తల్హా – ఓ ఉమ్మె సులైమ్! దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రజలను తీసుకొని వచ్చేశారు, కానీ మన దగ్గర వారికి తినిపించడానికి ఏమీలేదుగా మరి! అని అన్నారు.

ఉమ్మె సులైమ్ జవాబిస్తూ – 'అల్లాహ్‌కు ఆయన ప్రవక్తకూ (మన స్థితిని గూర్చి) బాగా తెలుసు' అని అన్నారు. తదుపరి అబూ తల్హా (రజి అల్లాహు అన్హు)వెళ్ళి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు స్వాగతం పలికి ఆయనను ఇతర సహచరులతో సహా అందరినీ తన ఇంటికి తీసుకువచ్చారు. (సహీ ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఇలా ఉంది: అబూ తల్హా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో : ఓ దైవ ప్రవక్తా! భోజనం కొంచెం మాత్రమే వుంది అని విన్నవించుకోగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనతో – (తినడానికి) ఏముందో అదే తీసుకురండి, అల్లాహ్ దానిలో శుభాన్ని ప్రసాదిస్తాడు అని అన్నారు.

ఇంట్లోకి ప్రవేశించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – 'ఓ

ఉమ్మె సులైమ్! తినడానికి (నీ వద్ద) ఏముందో అది తీసుకురా' అని అన్నారు. దీనిపై ఉమ్మె సులైమ్, ఆ రొట్టెలనే తీసుకు వచ్చారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదేశానుసారం వాటిని ముక్కలుగా చేయడం జరిగింది. ఉమ్మె సులైమ్ వాటి మీద నెయ్యి పోశారు. ఆ నెయ్యే అప్పుడు కూర లాగా వుంది. తదుపరి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వాటిపై అల్లాహ్ తలచింది పఠించారు. (సహీ ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది: ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ రొట్టె ముక్కలపై తన చేతిని వుంచి శుభం కొరకు ప్రార్థించారు)

ఆ తర్వాత, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – పది మందిని లోపలికి వచ్చే అనుమతి యివ్వండి అని (అబూ తల్హాతో) అన్నారు. ఆయన 10 మందిని లోపలికి పంపించారు. (సహీ ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది: బిస్మిల్లాహ్ పఠించి తినడం ప్రారంభించండి) వారంతా కడుపు నిండా భుజించి, లేచి బయటకు వెళ్ళారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – మరో 10 మందిని లోపలికి వచ్చే అనుమతి యివ్వండి అని అన్నారు. ఆయన మరో 10 మందిని లోపలికి పంపించారు. వారు కూడా కడుపు నిండా భుజించి బయటకు వెళ్ళారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మళ్ళీ 10 మందిని లోపలి కొచ్చే అనుమతి యివ్వండి అని అన్నారు. ఆయన మరో 10 మందిని లోపలికి పంపించారు. వారు కూడా కడుపునిండా భుజించి బయటకు వెళ్ళిపోయారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మళ్ళీ – మరో 10 మందిని లోపలికొచ్చే అనుమతి యివ్వండి అని అన్నారు. ఆయన మరో 10 మందిని లోపలికి పంపించారు. ఇలా, అక్కడున్న వారంత కడుపునిండా భుజించారు. ఆ సమయంలో వారంతా దాదాపు 70 నుండి 80 దాకా వున్నారు. (సహీ ముస్లింలోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది: (అందరూ భుజించిన తర్వాత, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) , ఇంట్లో మిగిలిన వారితో కలిసి భోజనం చేసారు. ఇంకా భోజనం మిగిలి ఉంటే, ఇరుగు పొరుగు వారికి పంపించడం జరిగింది.

*(సహీ బుఖారీ : 3578, సహీ ముస్లిం : 2040)*

❖ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం : కందకం త్రవ్వే రోజుల్లో, నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను ఆకలితో

వుండడం గమనించాను. (వెంటనే) నా భార్య దగ్గరికొచ్చి – నీ దగ్గర తినడానికేమైనా ఉందా? ఎందుకంటే – ఆకలి మూలంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చతికిలబడడం నేను గమనించాను! అని అన్నారు. వెంటనే ఆమె ఒక సంచి తీసింది. దాంట్లో ఒక సా (దాదాపు 2.5 కేజీలు) యవలు(జౌ) వున్నాయి. అంతేగాక, మా దగ్గర ఒక మేకపిల్ల కూడా వుంది. దానిని నేను జిబహ్ చేశాను. నా భార్య పిండి రుబ్బడం పూర్తి చేసి నా వద్దకొచ్చింది. నేనీలోగా మాంసాన్ని ముక్కలుగా కోసి వంట గిన్నెలో వేసి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికెళ్ళాను. వెళ్ళేటప్పుడు నా భార్య నాతో – '(భోజనం తక్కువగా వుంది కనుక) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన సహచరుల ముందు నన్ను అవమానం పాలు చేయవద్దు' అని అంది. దీనిపై, నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికెళ్ళి, మెల్లగా (ఎవ్వరూ వినకుండా) – 'ఓ దైవప్రవక్తా! నా దగ్గర ఒక మేక పిల్ల వుండేది. దానిని నేను జిబహ్ చేశాను. నా భార్య ఒక 'సా' పిండిని తయారు చేసింది. కనుక మీరు, మీ సహచరులలో కొంతమందిని తీసుకొని మా ఇంటికి (భోజనానికి) విచ్చేయండి' అని అన్నాను. ఇది విని, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బిగ్గరగా – 'ఓ కందకం వాసులారా! నిశ్చయంగా జాబిర్ మీ కొరకు భోజనం తయారు చేశారు. కనుక మీరంతా పదండి' అని పలికారు.

తదుపరి నా వైపు తిరిగి – 'నేను వచ్చేంత వరకు వంట గిన్నెను పొయ్యి మీద నుండి క్రిందకు దించవద్దు మరియు రొట్టెలు తయారుచేయడం ప్రారంభించ కూడదు' అని అన్నారు.

నేను తిరిగి ఇంటికొచ్చేశాను. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ప్రజలను వెంటబెట్టుకొని వచ్చారు. నేను తిన్నగా నా భార్య దగ్గరకి వెళ్ళగా, ఆమె నాతో – 'ఈ రోజు మీరే నవ్వుల పాలు అవుతారు' అని అంది. నేనామెతో – 'నేను నువ్వు చెప్పినట్లే చేశాను' అని అన్నాను. తదుపరి నేను పిండిని తీసుకొని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికొచ్చాను. ఆయన తన ఉమ్మిని దానిలో కలిపి శుభం కొరకు ప్రార్థించారు. తిరిగి మా వంట గిన్నె వైపుకు వచ్చి, దానిలో కూడా తన ఉమ్మిని కలిపి, శుభం కొరకు ప్రార్థించి ఇలా సెలవిచ్చారు. "మీతోపాటు రొట్టెలు చేయడానికి మరో స్త్రీని పిలుచుకోండి, మీ గిన్నె నుండి కూరను ప్లేట్లలో వేస్తూ ఉండండి, కానీ కూర

గిన్నె మాత్రం (పొయ్యి మీద నుండి) క్రిందకు దించకండి.” ప్రజలు వేయి మంది దాకా వున్నారు. నేను ప్రమాణం చేసి మరీ చెబుతున్నా – అక్కడున్న వారంతా భోంచేశారు, అయినా ఇంకా భోజనం మిగిలి వుంది. వారు వెళ్ళిపోయేటప్పుడు కూడా వంటగిన్నెలో కూర అలాగే ఉడుకుతూ ఉంది మరియు రొట్టెలు కూడా చేస్తూనే ఉన్నారు. (అంటే కూర కూడా తగ్గలేదు, పిండి కూడా తగ్గలేదు) *(సహీ బుఖారీ : 3070, సహీ ముస్లిం : 2039)*

❖ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుక్రవారం నాడు (ఖుత్బా ఇచ్చే నిమిత్తం) ఒక ఖర్జూరపు చెట్టు (కాండము)ను ఆనుకొని నిలబడే వారు. ఒక అన్సారీ స్త్రీయో లేక పురుషుడో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో – మేము మీ కోసం ఒక మింబర్ (వేదిక)ను తయారు చేయవచ్చా? అని అడిగారు. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ‘ఒకవేళ మీకిష్టమయితే అలాగే (కానివ్వండి)’ అని అన్నారు. తదుపరి, వారు ఆయన కొరకు ఒక మింబర్‌ను తయారు చేశారు. మరుసటి శుక్రవారం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుత్బా ఇవ్వదలిచి, ఆ మింబర్ వైపునకు నడిచారు. కానీ, ఆ ఖర్జూరపు చెట్టు(కాండం) చిన్న పిల్లవాడిలా ఏడ్వడం ప్రారంభించింది. ఇది చూసి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) క్రిందికి దిగి దాన్ని హత్తుకున్నారు. తదుపరి దాన్ని నచ్చజెప్పేటప్పుడు, పిల్లవాడికి వెక్కిళ్ళు వచ్చినట్లు దానికి కూడా వెక్కిళ్ళు రాసాగాయి. తదుపరి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు : ఇది ఏడ్వడానికి కారణం – ఇంత వరకూ వింటూ వస్తున్న (నా) ఖుత్బాను ఇక మీదట వినలేదని.

*(సహీ బుఖారీ : 3584)*

❖జాబిర్ బిన్ సమురు (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: నిశ్చయంగా, దైవదౌత్యానికి ముందు మక్కాలో నాకు సలాం చేసే రాయి నాకు తెలుసు. ఇప్పుడు కూడా నేను దాన్ని గుర్తిస్తాను. *(సహీ ముస్లిం:2277)*

మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి కొన్ని మహత్యాలను, అద్భుతాలను మాత్రమే వివరించాం. ఎందుకంటే – ఈ సంక్షిప్త ఖుత్బాలో, ఆయన మహత్యాలను, అద్భుతాలను పూర్తిగా వివరించడం సాధ్యం కాదు.

(ఆఖరుగా) అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే – ఆయన మనందరినీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఔన్నత్యాన్ని గుర్తించగలిగే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

## రెండవ ఖుత్బా

ప్రియ సోదరులారా! మన ప్రియతమ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శ్రేష్టత, ఔన్నత్యాలను గురించి విన్న తర్వాత ఇక ఆయన ప్రత్యేతలను గూర్చి కూడా తెలుసుకుందాం.

### దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రత్యేకతలు

దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఇవ్వబడ్డ ప్రత్యేకతలు ఇతరులెవ్వరికీ ఇవ్వబడలేదు. వాటిలో కొన్నింటిని గూర్చి మనం తెలుసుకుందాం.

## 1) ఆఖరి ప్రవక్త

ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రళయం వరకు రాబోయే ప్రజలందరి కొరకు నియమించబడ్డ దైవప్రవక్త మరియు సందేశహరులు. ఆయన తర్వాత ఇక ఏ ప్రవక్తా రాడు. కనుక ఆయనే సమస్త మానవ జాతికి రుజుమార్గం చూపించేవారు మరియు మార్గదర్శకులూను.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَآ أَرْسَلْنَٰكَ إِلَّا كَآفَّةً لِّلنَّاسِ بَشِيرًا وَنَذِيرًا وَلَٰكِنَّ أَكْثَرَ ٱلنَّاسِ لَا يَعْلَمُونَ ﴿٢٨﴾

**“(ఓ ముహమ్మద్)! మేము నిన్ను సమస్త జనులకు శుభవార్తను అందజేసే వానిగా, హెచ్చరించేవానిగా చేసి పంపాము. అయితే జనులలో అధికులకు ఈ విషయం తెలియదు.”** ***(సబా : 28)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

قُلْ يَٰٓأَيُّهَا ٱلنَّاسُ إِنِّى رَسُولُ ٱللَّهِ إِلَيْكُمْ جَمِيعًا

**“(ఓ ముహమ్మద్)! వారికి చెప్పు: ఓ ప్రజలారా! నేను భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి అయిన అల్లాహ్ తరపున మీ అందరి వద్దకు పంపబడిన ప్రవక్తను.”** ***(ఆరాఫ్ : 158)***

మరోచోట ఇలా సెలవిచ్చాడు:

مَا كَانَ مُحَمَّدٌ أَبَآ أَحَدٍ مِّن رِّجَالِكُمْ وَلَٰكِن رَّسُولَ اللَّهِ وَخَاتَمَ النَّبِيِّينَ ۗ وَكَانَ اللَّهُ بِكُلِّ شَيْءٍ عَلِيمًا ﴿٤٠﴾

**"(ప్రజలారా)! ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) మీ మగవారిలో ఎవరికీ తండ్రి కారు. అయితే ఆయన అల్లాహ్ యొక్క సందేశహరులు. ప్రవక్తల పరంపరను సమాప్తం చేసే (చివరి)వారు."** ***(అహ్జాబ్ : 40)***

అంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తోనే దైవప్రవక్తల పరంపర సమాప్తం చేయబడింది. ఇక ఆయన తర్వాత – 'నేను దైవప్రవక్తను' అని ఎవరు చాటిచెప్పుకున్నా అతడు అబద్ధాల కోరుగా పరిగణించబడతాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: నన్నూ, నాకు పూర్వం వచ్చిన ప్రవక్తలను ఈ విధంగా పోల్చవచ్చు. ఒక వ్యక్తి ఒక ఇల్లు కట్టించాడు. దాన్ని అన్ని విధాలా తీర్చిదిద్దాడు. కానీ ఓ మూలలో ఒక ఇటుక పట్టేంత ఖాళీ వదలిపెట్టాడు. ప్రజలు ఆ ఇంటిని నలువైపులా తిరిగి చూసి "(ఇంత అందమైన ఇంటికి) ఇక్కడ ఇటుక ఎందుకు పెట్టలేదు?" అని ఆశ్చర్యపోయారు. కనుక, ఆ ఆఖరి ఇటుకను నేనే. ఈ విధంగా నేను (అందరి కన్నా చివరిగా వచ్చిన) అంతిమ దైవప్రవక్తను.

*(బుఖారీ : 3535, ముస్లిం : 2286)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే – దైవదౌత్య గృహంలో ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆఖరి ఇటుక వంటివారు మరియు ఆయన ఆగమనం తర్వాత ఈ గృహంలో ఇక ఎలాంటి హెచ్చుకు అవకాశం లేదు.

## 2) ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) అనుచర సమాజం అందరి కన్నా ఉత్తమ సమాజం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అనుచర సమాజం (ఉమ్మత్) గడచిన అన్ని సమాజాల కాన్న ఉత్తమమైనది మరియు శ్రేష్టమైనది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَكَذَٰلِكَ جَعَلْنَاكُمْ أُمَّةً وَسَطًا لِّتَكُونُوا شُهَدَاءَ عَلَى النَّاسِ وَيَكُونَ الرَّسُولُ عَلَيْكُمْ شَهِيدًا

**"అదే విధంగా మేము మిమ్మల్ని ఒక న్యాయశీల సమాజం (ఉమ్మతే వసత్)గా చేశాము. మీరు ప్రజలపై సాక్షులుగా, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మీపై సాక్షిగా ఉండటం కోసం (మేమిలా చేశాము)."**

***(బఖర : 143)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

كُنْتُمْ خَيْرَ أُمَّةٍ أُخْرِجَتْ لِلنَّاسِ تَأْمُرُوْنَ بِالْمَعْرُوْفِ وَ تَنْهَوْنَ عَنِ الْمُنْكَرِ وَ تُؤْمِنُوْنَ بِاللهِ

**"మానవుల కోసం ఉనికిలోనికి తీసుకురాబడిన శ్రేష్ట సమాజం మీరు. మీరు మంచి విషయాలకై ఆజ్ఞాపిస్తారు, చెడు నుండి ఆపుతారు, ఇంకా మీరు అల్లాహ్‌ను విశ్వసిస్తారు."** ***(ఆలి ఇమ్రాన్ : 110)***

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: మీ గడువు కాలం, గడిచిన అనుచర సమాజాల గడువు కాలంతో పోలిస్తే అస్ర్ నమాజు, సూర్యాస్తమయాల మధ్యగల గడువు లాంటిది. ఇక, యూదులు, క్రైస్తవులు మరియు మీ పోలిక ఎలాంటిదంటే – ఒక వ్యక్తి కొంతమంది పనివాళ్ళను తీసుకొచ్చి ఇలా అడిగినట్లు: సూర్యోదయం నుండి మధ్యాహ్నం వరకు ఒక ఖీరాత్(ఒక కొలత) కోసం ఎవరు పనిచేస్తారు? యూదులు ఒక ఖీరాత్ కోసం ఉదయం నుండి మధ్యాహ్నం వరకు పని చేశారు. తదుపరి అతను – మధ్యాహ్నం నుండి అస్ర్ వేళ వరకు ఒక ఖీరాత్ కోసం ఎవరు పని చేస్తారు అని అడగ్గా, క్రైస్తవులు మధ్యాహ్నం నుండి అస్ర్ వేళ వరకు ఒక ఖీరాత్ కోసం పనిచేశారు. ఆ తర్వాత అతను అస్ర్ నుండి సూర్యాస్తమయం వరకు రెండు ఖీరాత్‌ల కోసం ఎవరు పని చేస్తారు? అని అడిగాడు.

(దీని గురించి ) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వివరిస్తూ – బాగా వినండి! అస్ర్ నమాజు మొదలుకుని సూర్యాస్తమయం వరకు రెండు ఖీరాత్ కోసం పని చేసింది మీరే. బాగా గుర్తుంచుకోండి! మీకు లభించే పుణ్యఫలం రెండు రెట్లు. దీనిపై యూదులు మరియు క్రైస్తవులు ఆగ్రహంతో – మేము (సమయపరంగా) ఎక్కువగా శ్రమించినప్పటికీ మాకు తక్కువ ఫలం లభించింది అని అడగ్గా, అల్లాహ్ జవాబిస్తూ – మీ మీద నేనేమైనా దౌర్జన్యం

చేశానా లేక మీ హక్కును హరించానా? అని అడిగాడు. దానికి వారు – లేదు అని జవాబిచ్చారు. తదుపరి అల్లాహ్ –(వాస్తవమేమిటంటే) ఇది నా అనుగ్రహం. నేను కోరిన వారికి దీనిని ప్రసాదిస్తాను అని వివరించాడు. *(బుఖారీ : 3459)*

## 3) ఆరు ప్రత్యేకతలు

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ప్రత్యేకతలలో కొన్నింటిని గూర్చి ఇలా వివరించారు: ఇతర ప్రవక్తలతో పోల్చితే నాకు ఆరు విషయాలలో శ్రేష్టత ఇవ్వబడింది. అందులో మొదటిది – నాకు సమగ్రవచనాలు యివ్వ బడ్డాయి. రెండవది – నాకు గాంభీర్యత మరియు ప్రాబల్యాల ద్వారా సహాయం చేయబడింది. మూడవది – నా కోసం యుద్ధప్రాప్తి (మాలె గనీమత్) ధర్మసమ్మతం (హలాల్) చేయబడింది. నాల్గవది – భూమి యావత్తూ నా కోసం పరిశుద్ధం మరియు ప్రార్థనా స్థలం (మస్జిద్)గా చేయబడింది. ఐదవది – నేను యావత్ మానవాళి కోసం ప్రవక్తగా చేసి పంపబడ్డాను. ఆరవది – నా ద్వారా దైవప్రవక్తల పరంపర సమాప్తం చేయబడింది. *(ముస్లిం : 523)*

మరో ఉల్లేఖనంలో ఇలా వివరించారు:

“నాకు పూర్వం ఏ దైవప్రవక్తకూ ప్రసాదించబడని ఐదు ప్రత్యేతలు నాకు ప్రసాదించబడ్డాయి. (1) ఇతర దైవప్రవక్తలందరూ తమ తమ జాతుల కోసమే ప్రత్యేకించబడగా నేను మాత్రం (యావత్ మానవాళి కోసం) ప్రతి నల్ల, తెల్ల వారి కోసం పంపబడ్డాను. (2) నా కోసం యుద్ధప్రాప్తి ధర్మసమ్మతం చేయ బడింది, నాకు పూర్వం ఏ ప్రవక్తకూ ఇది ధర్మసమ్మతం చేయబడలేదు. (3) నా కోసం భూమి యావత్తూ పరిశుద్ధంగానూ, ప్రార్థనా స్థలం (మస్జిద్) గానూ చేయబడింది. కనుక, ఏ ప్రదేశంలో వున్నా, నమాజు వేళ అయితే అక్కడే నమాజు చేసుకోవాలి. (4) నేను శత్రువు నుండి ఒక నెల ప్రయాణపు దూరంలో వున్నప్పటికీ అల్లాహ్ నాకు సంబంధించిన భయ ప్రాబల్యాలను అతని హృదయంలో కలగుజేస్తాడు. (అంటే నేనంటే భయపడేలా చేస్తాడు) (5) ప్రళయం రోజు) నాకు సిఫారసు చేసే అనుమతి లభించింది.

*(బుఖారీ:438, ముస్లిం: 521)*

## 4) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు గల ప్రత్యేకతల్లో వున్న మరో విషయం ఏమిటంటే–

ఆయనపై అసత్యం పలకడం. అంటే – ఏదైనా అసత్య విషయాన్ని లేదా ఆచరణను ఆయన వైపుకు మళ్ళించడం (అంటే – ఆయన చెప్పారని లేదా చేశారని చెప్పడం) మహా నేరం మరియు పెద్ద పాపం. అందుకే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: నా (పేరు) మీద అసత్యం పలకడం ఇతరుల వైపు నుండి అసత్యం పలకడం లాగా కాదు. ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా నా (పేరు) మీద అసత్యం పలుకుతాడో అతను తన నివాసాన్ని నరకంలో ఏర్పాటు చేసుకోవాలి. *(బుఖారీ : 1291; ముస్లిం : 4)*

అందుకే– ఏదైనా హదీసును ఆయన వైపునకు మళ్ళించేటప్పుడు, దాని గురించి పరిశోధించడం తప్పనిసరి. ఒకవేళ అది ప్రామాణిక పరంపరతో రుజువు చేయబడితే, అప్పుడు దానిని ఉల్లేఖించవచ్చు. లేకపోతే దానిని ఉల్లేఖించకుండా ఊరుకోవాలి. ప్రత్యేకంగా ఈ రోజుల్లో అయితే దీని ప్రాధాన్యత ఇంకా పెరిగి పోయింది. ఎందుకంటే – కాల్పనిక, అసత్య హదీసులు ప్రజల నోళ్ళలో సర్వసాధారణమై పోయాయి. పరిస్థితి ఎంతగా దిగజారిందంటే – మిడి మిడి జ్ఞానం కలవాళ్ళు – ఆచరణల మహత్యం, ఔన్నత్యాల విషయంలో బలహీన, కాల్పనిక హదీసులను సయితం వివరించడం సబబే అని తలపోస్తూ వాటిని పబ్లిగ్గా అందరి ముందు ఉత్సాహంతో ఉల్లేఖిస్తుంటారు.

## 5) పాప రహితులు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పాప రహితులు మరియు దైవదౌత్యం, సందేశ ప్రచారం –ఈ కార్యాలలో పొరపాట్ల నుండి పరిశుద్ధులు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالنَّجْمِ إِذَا هَوَىٰ ① مَا ضَلَّ صَاحِبُكُمْ وَمَا غَوَىٰ ② وَمَا يَنطِقُ عَنِ الْهَوَىٰ ③ إِنْ هُوَ إِلَّا وَحْيٌ يُوحَىٰ ④

**“క్రింద పడేటప్పటి నక్షత్రం సాక్షిగా! మీ సహచరుడు (అయిన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)) దారి తప్పనూ లేదు, పెడదారి పట్టనూ లేదు. అతను తన మనోవాంఛల ప్రకారం మాట్లాడటమూ లేదు. అది (అతను మాట్లాడేదంతా) అతని వద్దకు పంపబడే దైవవాణి (వహీ) తప్ప మరేమీ కాదు.”** *(నజ్మ్ : 1–4)*

ఈ ఆయత్ ద్వారా తెలిసిందేమింటే– దైవప్రవక్త (సల్లం) దైవ దౌత్య బాధ్యత నిర్వహణలో పాప రహితులు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా ప్రామాణికంగా నిరూపించబడ్డ ఉల్లేఖనాలన్నీ కూడా దైవవాణే (వహీ) మరియు ఖుర్ఆన్ అనుసరణ ఎంత ముఖ్యమో వీటి అనుసరణ కూడా అంతే ముఖ్యం.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం : నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నోట విన్న ప్రతి హదీసునూ జ్ఞాపకముంచుకోవడానికి గాను వ్రాసుకొనే వాణ్ణి. దీనికి, ఖురైష్ జాతివారు నన్ను వారిస్తూ – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నోట విన్న ప్రతి మాటనూ వ్రాస్తున్నావా? వాస్తవానికి ఆయన మానవమాత్రులు. కోపంలో, సంతోషంలో – రెండు స్థితుల్లోనూ సంభాషిస్తుంటారు – అని హితవు పలికారు. దానితో నేను వ్రాయడం మానేశాను. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర ఈ విషయమై ప్రస్తావించాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన చేతి వ్రేలితో నోటి వైపునకు సైగచేస్తూ – వ్రాస్తూ వుండు! నా ప్రాణం ఎవరి చేతిలో వుందో ఆ దైవం సాక్షిగా! దీని నుండి సత్యం తప్ప మరేదీ రాదు– అని ఉద్భోదించారు. *(అహ్మద్ :6510, 6802, అబూ దావూద్: 3646)*

## 6) ప్రళయ దినానికి సంబంధించిన దైవప్రవక్త (సల్లం) ప్రత్యేకతలు

వీటికి సంబంధించిన కొన్ని హదీసులు విందాం.

1. అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రళయం రోజు నేను యావత్ ఆదం సంతతికి నాయకుడిగా వుంటాను. అందరికన్నా ముందుగా నా సమాధి తెరువబడుతుంది. అందరికన్నా ముందుగా నేను సిఫారసు చేస్తాను మరియు అందరికన్నా ముందుగా నా సిఫారసు స్వీకరించబడుతుంది. *(ముస్లిం : 2278)*

2. అబూ సయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రళయం రోజు నేను యావత్ ఆదం సంతతికి నాయకుడిగా వుంటాను, దీనికి నేను గర్వించను. నా చేతిలోనే 'అల్‌హమ్ద్'(స్తోత్రం) జెండా వుంటుంది, దీనికి

కూడా నేను గర్వించను. ఆ రోజు ఆదమ్ (అలైహిస్సలాం) మరియు ఇతర ప్రవక్తలందరూ నా జెండా క్రింద గుమిగూడుతారు. అందరికన్నా ముందు నేను సిఫారసు చేస్తాను మరియు అందరి కన్నా ముందు నా సిఫారసు స్వీకరించబడుతుంది, దీనికి కూడా నేను గర్వించను.

*(సహీఉల్ జామె : 1468)*

3. అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రళయం రోజు ఇతర ప్రవక్తల అనుయాయుల కన్నా నా అనుయాయులు ఎక్కువ సంఖ్యలో వుంటారు మరియు అందరికన్నా ముందుగా నేనే స్వర్గ ద్వారాన్ని తట్టుతాను.

*(ముస్లిం : 196)*

## 7) మఖామె మహమూద్.... హష్ర్ వాసులందరి కొరకు సిఫారసు

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

ప్రళయ దినాన నేను యావత్తు మానవులకు నాయకుణ్ణవుతాను. ఇది ఎలా అవుతుందో మీకు తెలుసా? ప్రళయ దినాన భూత, భవిష్యత్, వర్తమాన కాలాల మానవులంతా ఒకే మైదానంలో సమీకరించబడతారు. (ఆ మైదానం చదునుగా వుండటం వల్ల) పిలిచేవాడి పిలుపును అందరూ వినగలుగుతారు. అలాగే చూసేవారు అందరినీ చూడగలుగుతారు. సూర్యుడు అతి దగ్గరగా వస్తాడు. (దాంతో ఒకవైపు తీక్షణమైన ఎండ, ఉక్కపోతల వల్ల, మరో వైపు ఇసుక పోస్తే రాలనంత అత్యధిక జనాభా కారణంగా) మానవులు తీవ్రమైన ఆందోళనతో ఉక్కిరిబిక్కిరి అవుతుంటారు. పరిస్థితి చాలా దుర్భరంగా ఉంటుంది.

ఆ స్థితిలో వారు పరస్పరం మాట్లాడుకుంటూ, “సోదరులారా! మనం ఎలాంటి ఆపదలో చిక్కుకున్నామో గమనించారా?” అని అంటారు. కొందరు “ఎందుకు గమనించలేదు? మనల్ని గురించి మన ప్రభువు దగ్గర సిఫారసు చేసే వారెవరైనా దొరుకుతారేమో వెతుకుదాం పదండి” అని అంటారు. మరికొందరు ఆ తర్వాత పరస్పరం సంప్రదించుకుని ఆదం (అలైహిస్సలాం) దగ్గరికి వెళ్ళాలని నిర్ణయించుకుంటారు.

నిర్ణయం ప్రకారం అందరూ ఆదం (అలైహిస్సలాం) దగ్గరకు వెళ్ళి –

"(మహానుభావా!) మీరు మానవులందరికీ తండ్రి. దేవుడు మిమ్మల్ని తన స్వహస్తాలతో తయారుచేసి, మీ శరీరంలో తన ఆత్మను ఊదాడు. అంతేగాక దైవదూతలందర్నీ మీ ముందు మోకరిల్లమని ఆదేశించాడు. అందువల్ల మీరు (దయచేసి) మీ ప్రభువు దగ్గర మా గురించి కాస్త సిఫారసు చేయండి. మా పరిస్థితి చూడండి, మేమెలాంటి ఆపదలో చిక్కుకున్నామో! పరిస్థితి ఇలాగే వుంటే చివరికి మా గతేం కాను?" అని అంటారు.

దానికి, ఆదం (అలైహిస్సలాం) సమాధానమిస్తూ – "ఈ రోజు నా ప్రభువు ఇదివరకు ఎన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడై వున్నాడు, ఇక ముందు కూడా ఎన్నడూ ఇంత ఉగ్రుడయిపోడు. అదీగాక, (నా వల్ల ఒక పొరపాటు జరిగి పోయింది) ఆయన నన్ను ఒక ప్రత్యేక వృక్షం దగ్గరికి వెళ్ళకూడదని ఆజ్ఞాపించాడు. కానీ, నేనా ఆజ్ఞను పాటించలేక పోయాను. నేనిప్పుడు స్వయంగా నా పరిస్థితి పట్ల ఆందోళన పడుతున్నాను. అందువల్ల మీరు మరొకరి దగ్గరికి వెళ్ళండి. మీరు నూహ్ (అలైహిస్సలాం) దగ్గరకు వెళ్ళండి. (నా దృష్టిలో ఆయన ఈ పని చేయగల సమర్థులు)" అని అంటారు.

అప్పుడు మానవులంతా నూహ్ (అలైహిస్సలాం) దగ్గరకు వెళ్ళి, "ఓ నూహ్! మీరు యావత్ ప్రపంచంలో మొట్టమొదటి సందేశహరులు. అల్లాహ్ మీకు 'కృతజ్ఞుడైన దాసుడు' అని బిరుదు ఇచ్చాడు. అందువల్ల మీరు (దయచేసి) దేవుని సన్నిధిలో మా గురించి కాస్త సిఫారసు చేయండి. మేమెలా ఆపదలో పడిపోయామో చూస్తున్నారు కదా మీరు?" అని అంటారు.

దానికి నూహ్ (అలైహిస్సలాం) – "ఈ రోజు నా ప్రభువు ఇదివరకెన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడై వున్నాడు. ఇకముందు కూడా ఎన్నడూ ఇంత ఉగ్రుడయిపోడు. అదీగాక (నా వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది). నేను నా జాతి ప్రజలను (తొందరపడి) శపించాను (తత్ఫలితంగా వారంతా సర్వనాశన మయ్యారు). ఏమైనప్పటికీ నేనిప్పుడు స్వయంగా నా పరిస్థితి పట్ల ఆందోళన పడుతున్నాను. అందువల్ల మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. మీరు ఇబ్రాహీం సమర్థులు)" అని అంటారు.

ప్రజలు అక్కడి నుండి ఇబ్రాహీం(అలైహిస్సలాం) దగ్గరికి వెళ్ళి – "ఓ ఇబ్రాహీం! మీరు దేవుని ప్రవక్త. యావత్ ప్రపంచములోనే దేవునికి (ప్రాణ) స్నేహితులు. కనుక మీరు (దయచేసి) మా గురించి దేవునికి సిఫారసు చేయండి.

చూస్తున్నారు కదా మా స్థితి, మేమెలా ఆపదలో చిక్కుకున్నామో?" అని అంటారు.

అది విని ఇబ్రాహీం (అలైహిస్సలాం) – "ఈ రోజు నా ప్రభువు ఇదివరకెన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడై ఉన్నాడు. ఇకముందు కూడా ఎన్నడూ ఇంత ఉగ్రుడయిపోడు. అదీగాక (నా వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది). నేను మూడు సందర్భాలలో అబద్ధమాడాను. ఏమైనా, నేనిప్పుడు స్వయంగా నా పరిస్థితి ఏమవుతుందోనని ఆందోళన పడుతున్నాను. అందువల్ల, మీరు మరొకరి దగ్గరకు వెళ్ళండి. మీరు మూసా (అలైహిస్సలాం)దగ్గరికి వెళ్ళండి. (ఆయన ఈ పని చేయగల సమర్థులు)" అని అంటారు.

దాంతో ప్రజలు అక్కడి నుండి మూసా (అలైహిస్సలాం) దగ్గరకు వెళ్ళి – "ఓ మూసా! మీరు దేవుని సందేశహరులు. దేవుడు మీతో ప్రత్యక్షంగా సంభాషించి, మిమ్మల్ని ప్రత్యేక ప్రవక్తగా నియమించాడు. దీనికి తోడు ఆయన మీకు మానవులందర్లో అత్యధిక గౌరవోన్నతులను ప్రసాదించాడు. అందువల్ల మీరు (దయచేసి) మా గురించి దేవుని దగ్గర సిఫారసు చేయండి. మా పరిస్థితి చూడండి, మేమెలా ఆపదలో పడి సతమతమవుతున్నామో!" అని అంటారు.

మూసా (అలైహిస్సలాం) ఈ మాటలు విని – "ఈ రోజు నా ప్రభువు ఇదివరకెన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడయి వున్నాడు, ఇకముందు ఎన్నడూ ఇంత ఉగ్రుడయిపోడు. అదీగాక (నా వల్ల ఒక పొరపాటు జరిగిపోయింది) నాకెలాంటి ఆజ్ఞ లభించకపోయినా నేనొక వ్యక్తిని (తొందరపడి) హతమార్చాను. దీని కారణంగా నేనిప్పుడు స్వయంగా నా పరిస్థితి ఏమవుతుందోనని ఆందోళన పడుతున్నాను. అందువల్ల మీరు మరొకరి దగ్గరికి వెళ్ళండి. మీరు ఈసా (అలైహిస్సలాం) దగ్గరికి వెళ్ళండి. (ఆయన మీ పని చేసి పెట్టవచ్చు)" అని అంటారు.

ప్రజలు (ఉసూరుమంటూ) అక్కడి నుండి ఈసా (అలైహిస్సలాం) దగ్గరకు వెళ్ళి – "ఓ ఈసా! మీరు దేవుని ప్రవక్త, దైవ వచనం కూడా. దేవుడు దాన్ని మర్యమ్ వైపుకు వదిలేశాడు. మీరు దేవుని ఆత్మ(గా) కూడా (ప్రసిద్ధి చెందారు). మీరు శిశు దశ లోనే తల్లి ఒడి నుండి ప్రజలతో మాట్లాడారు. కనుక మీరు (దయచేసి) మా గురించి కాస్త దేవుని దగ్గర సిఫారసు చేయండి. చూస్తున్నారు కదా మా పరిస్థితి, మేమెలా ఆపదలో పడి సతమతమవుతున్నామో?" అని అంటారు.

దీనికి ఈసా (అలైహిస్సలాం) సమాధానమిస్తూ– “సోదరులారా! ఈరోజు నా ప్రభువు ఇదివరకెన్నడూ లేనంత ఆగ్రహోదగ్రుడై ఉన్నాడు. ఇకముందు ఎప్పుడూ ఇంత ఉగ్రుడయిపోడు.” అని అంటారు. ఈసా (అలైహిస్సలాం) తానేదైనా తప్పు చేసినట్లు ఇక్కడ ఎలాంటి ప్రస్తావన చేయరు. “(ఈ పరిస్థితిలో నేను మీకు ఎలాంటి సహాయం చేయలేను) స్వయంగా నేను నా పరిస్థితి ఏమవుతుందోనని భయపడి పోతున్నాను. మీరు మరొకరి దగ్గరికి వెళ్ళండి. మీరు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరికి వెళ్ళండి. (ఆయనే మీకు సహాయం చేయగల సమర్థులు)” అని మాత్రమే అంటారు.

ఈ మాటలు విని ప్రజలు (నిరాశతో) అక్కడి నుండి బయలుదేరి నా దగ్గరకు వస్తారు. “ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)! మీరు అల్లాహ్ ప్రవక్త. దైవప్రవక్తలందరిలోకెల్లా కట్ట కడపటి వారు. దేవుడు మీ వెనుకటి, మునుపటి తప్పులన్నీ క్షమించేశాడు. కనుక (దయచేసి ) మీరు మా గురించి దేవుని దగ్గర సిఫారసు చేయండి. చూస్తున్నారు కదా మా పరిస్థితి, మేమెలా ఆపదలో చిక్కుకుని సతమతమవుతున్నామో?” అని అంటారు.

అప్పుడు నేను బయలుదేరి దైవసింహాసనం దగ్గరకు చేరుకుంటాను. అక్కడ నా ప్రభువు ముందు సాష్టాంగపడతాను. అప్పుడు దేవుడు, స్తోత్రం కోసం కొన్ని విశేష వచనాలు నా మనసులో నాటుతాడు. అలాంటి స్తోత్ర వచనాలు ఇదివరకెన్నడూ ఎవరికీ నేర్పి వుండడు. ఆ తర్వాత దేవుడు నన్ను సంభోదిస్తూ – “ముహమ్మద్! తలపైకెత్తు, నీవు అడగదలుచుకున్నదేమిటో అడుగు, నీ కోరిక తీరుస్తాను. ఏదైనా సిఫారసు చెయ్యాలనుకుంటే చెయ్యి, నేను నీ సిఫారసును ఆమోదిస్తాను.” అని అంటాడు.

నేను తలపైకెత్తి – ‘ప్రభూ! నా అనుచర సమాజం; ప్రభూ! నా అనుచర సమాజం పాపాల్ని మన్నించు. ప్రభూ! నా అనుచర సమాజాన్ని నరకాగ్ని నుండి కాపాడు.” అని అంటాను. దానికి దేవుడు – “ముహమ్మద్! వెళ్ళు, వెళ్ళి నీ అనుచర సమాజంలోని న్యాయ విచారణ పరిధి నుండి మినహాయించ బడిన వారందరినీ తీసుకుని, కుడివైపు ద్వారం గుండా స్వర్గం లోపలికి పంపించుకో. వారు ఇతర ద్వారాల గుండా కూడా రాకపోకలు నిరభ్యంతరంగా సాగించుకోవచ్చు” అని సమాధానమిస్తాడు.

ఆ తర్వాత దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రమాణం చేస్తూ –

“నా ప్రాణం ఎవరి అధీనంలో వుందో ఆ దేవుని సాక్షి! మక్కా, హుమైర ల మధ్య లేదా మక్కా, బస్రా ల మధ్య ఎంత దూరం వుంటుందో స్వర్గంలోని ఒక ద్వారం వెడల్పు అంత దూరం ఉంటుంది” అని వివరించారు.

*(బుఖారీ : 7412, ముస్లిం : 194)*

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం : ప్రళయం రోజు ప్రజలు తమ మోకాళ్ళపై పడి వుంటారు. ప్రతి అనుచర సమాజం తన ప్రవక్త వెనుకకు వెళ్ళి – ఓ ఫలానా! (మా గురించి) సిఫారసు చేయి, ఓ ఫలానా! (మా గురించి) సిఫారసు చేయి అని వేడుకుంటూ వుంటుంది. చివరికి ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం)ను సిఫారసు చేయమని చెప్పబడుతుంది. అల్లాహ్ ఆయనను ‘మఖామె మహమూద్’పై కూర్చోబెట్టేది ఆ రోజే. *(బుఖారీ : 4718)*

అబూ సయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ....... ప్రజలు మూడుసార్లు మిక్కిలి భయాందోళనలకు గురవుతారు. వాళ్ళు ఆదమ్ (అలైహిస్సలాం) దగ్గరకు వచ్చి ఇలా అంటారు: మీరు మా అందరికీ తండ్రి. మీరు మా అందరి కోసం మీ ప్రభువు దగ్గర సిఫారసు చేయండి. దీనిపై ఆయన – “నేను చేసిన ఒక్క పాపానికి గాను నన్ను (స్వర్గం నుండి) భూమి మీదకు పంపడం జరిగింది. మీరంతా నూహ్ (అలైహిస్సలాం) దగ్గరకి వెళ్ళండి” అని అంటారు. (దీనితో వారంతా నూహ్ (అలైహిస్సలాం) దగ్గరికెళ్ళి సిఫారసు కొరకు వేడుకుంటారు. కానీ) ఆయన – నేను భూలోకవాసులను శపించిన కారణంగా వారిని నాశనం చేయడం జరిగింది. కనుక మీరు ఇబ్రాహీం (అలైహిస్సలాం) దగ్గరికి వెళ్ళండి – అని అంటారు. దీనికి వారు ఇబ్రాహీం (అలైహిస్సలాం) దగ్గరకు వస్తారు. (మరియు సిఫారసు చేయమని విన్నవించుకుంటారు). ఆయన –‘నేను మూడుసార్లు అబద్ధమాడాను. కనుక మీరు మూసా (అలైహిస్సలాం) దగ్గరికి వెళ్ళండి’ అని అంటారు. దీనితో వారంతా మూసా (అలైహిస్సలాం) దగ్గరికి వస్తారు. కానీ, ఆయన– నేనొక ప్రాణాన్ని హత్య చేశాను. కనుక మీరంతా ఈసా(అలైహిస్సలాం) దగ్గరికి వెళ్ళండి అని అంటారు. దీనితో, వారంతా ఈసా (అలైహిస్సలాం) దగ్గరికి వస్తారు. కానీ ఆయన – అల్లాహ్‌ను వదిలి నన్ను ఆరాధించడం జరిగింది. కనుక మీరు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)

దగ్గరికి వెళ్ళండి అని అంటారు. దీనికి వారంతా నా దగ్గరకు వస్తారు. తదుపరి నేను వారితో కలిసి బయలుదేరుతాను.

ఇబ్నె జదాన్ కథనం : అనస్ (రజి అల్లాహు అన్హు) ఇలా పలికారు: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను చూస్తూనే వున్నాను. ఆయన ఇలా వివరించసాగారు –నేను స్వర్గ ద్వారం దగ్గరికెళ్లి దాని తలుపు తట్టుతాను. ఎవరు? అని ప్రశ్నించబడుతుంది. ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అని సమాధానం ఇవ్వబడుతుంది. దీనితో, వారు నా కోసం స్వర్గద్వారం తెరిచి, నాకు స్వాగతం పలుకుతారు. తదుపరి నేను అల్లాహ్ ముందు సాష్టాంగపడతాను (సజ్దా చేస్తాను). (ఆ సమయంలో) అల్లాహ్ నా మనస్సులో (ఆయన) పవిత్రతను, స్తోత్రానికి సంబంధించిన వచనాలను నాటుతాడు. (ఆ వచనాలతో నేను ఆయన స్తోత్రం చేస్తాను). తదుపరి నాతో ఇలా అనబడుతుంది – మీ తలను పైకెత్తండి మరియు అడగండి, మీకు ఇవ్వబడు తుంది. సిఫారసు చేయండి, మీ సిఫారసు స్వీకరించబడుతుంది మరియు మాట్లాడండి, మీ మాట వినడం జరుగుతుంది. దివ్య ఖుర్ఆన్ లోని ఆయత్ ––"త్వరలోనే నీ ప్రభువు నిన్ను మఖామె మహమూద్ (ప్రశంసాత్మకమైన స్థానానికి) చేరుస్తాడు." (బనీ ఇస్రాయీల్ : 79) లో అల్లాహ్ వివరించిన 'మఖామె మహమూద్' ఇదే. *(తిర్మిజి : 3148 – సహీ అల్‌బానీ)*

## ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సిఫారసుకు ఎక్కువ అర్హులు ఎవరు?

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో నేను – ప్రజలలో ప్రళయం రోజు మీ సిఫారసు భాగ్యాన్ని పొందే అత్యంత అదృష్టంవంతుడెవరు? అని అడిగాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – ఓ అబూ హురైరా! ఈ విషయం గురించి నువ్వే అడుగుతావని నేను నమ్మకంగా వున్నాను. ఎందుకంటే, ( నా నుండి) హదీసులు వినడానికి నువ్వు ఎల్లప్పుడూ ఆతృతతో వుంటావు. (కనుక) విను! ఎవరైతే హృదయాంతరాల నుండి (పైపైన కాదు) లా ఇలాహ ఇల్లల్లాహ్ పలుకుతారో వారు ప్రళయం రోజు నా సిఫారసుకు ఎక్కువ హక్కుదారులు అవుతారు. *(బుఖారీ: 99, 6570)*

## 8) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సరస్సు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు గల ఇంకో ప్రత్యేకత ఏమి టంటే–ప్రళయం రోజు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు కౌసర్ సరస్సు ప్రసాదించబడుతుంది. దీనితో ఆయన తన అనుచర సమాజానికి నీళ్ళు త్రాగిస్తారు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం : ఒకరోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాతో కూర్చొని వున్నారు. అకస్మాత్తుగా ఆయన మీద నిద్ర మత్తు లాంటిది ఆవరించసాగింది. (దైవవాణి అవతరించ సాగింది). కాసేపటికి ఆయన నవ్వుతూ తలపైకెత్తారు. తదుపరి ఇలా సెలవిచ్చారు: ఇప్పుడే నా మీద ఒక సూరా అవతరించింది అని ఆయన ఇలా పఠించారు – “అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో – నిశ్చయంగా మేము నీకు కౌసర్ (సరస్సును, మరెన్నో వరాల)ను ప్రసాదించాము. కాబట్టి నువ్వు నీ ప్రభువు కోసమే నమాజు చెయ్యి, ఖుర్బానీ యివ్వు. ముమ్మాటికీ నీ శత్రువే నామరూపాల్లేకుండా పోయేవాడు.”*(కౌసర్ : 1-3)*

తదుపరి ఆయన – కౌసర్ అంటే ఏమిటో మీకు తెలుసా? అని అడిగారు. ‘అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ బాగా తెలుసు’ అని మేము బదులిచ్చాం. ఆయన వివరిస్తూ – అల్లాహ్ నాకు వాగ్దానం చేసిన ఒక కాలువ యిది. దీనిలో ఎంతో మంచి దాగి వుంది. ఇది ఎలాంటి సరస్సు అంటే –ప్రళయం రోజు నా అనుచర సమాజానికి చెందిన వారంతా ఇక్కడికి వస్తారు. దాని గిన్నెల సంఖ్య నక్షత్రాల సంఖ్యతో సమానం. కొందరిని (అక్కడి నుండి) వెనక్కు నెట్టడం జరుగుతుంది. నేనప్పుడు – ఓ నా ప్రభూ! వీరు నా అనుచర సమాజం వారే! అని పలుకుతాను. సమాధానంగా నాతో – మీ తదనంతరం, ధర్మంలో ఎలాంటి క్రొత్త విషయాలు వీరు ప్రవేశపెట్టారో మీకు తెలియదు – అని అనబడుతుంది. *(ముస్లిం : 400)*

అబూజర్ (రజి అల్లాహు అన్హు) కథనం : దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో నేను (కౌసర్) సరస్సు యొక్క గిన్నెల గురించి అడిగాను. దాని కాయన – ఎవరి చేతుల్లో నా ప్రాణం వుందో ఆ శక్తిమంతుని సాక్షి! దాని గిన్నెలు – చీకటి రాత్రిలో ఆకాశంలో మేఘాలేవీ లేనప్పుడు కనిపించే

నక్షత్రాల కన్నా ఎక్కువగా వున్నాయి. అవే స్వర్గపు గిన్నెలు. వాటితో త్రాగిన వ్యక్తికి ఇక ఎప్పటికీ దాహం వేయదు. దానిలో రెండు స్వర్గపు పిల్ల కాలువలు (నీటి ధారలు) పారుతూ వుంటాయి. ఒక్కసారి ఆ నీటిని త్రాగిన వ్యక్తికి ఇక ఎప్పుడూ దాహం వేయదు. దాని వెడల్పు, దాని పొడవుతో సమానంగా వుంది. అమాన్ మరియు ఈలా (ప్రదేశాలు)ల మధ్య వున్న దూరం అంత. దాని నీరు పాలకన్నా తెలుపుగా మరియు తేనె కన్నా తియ్యగా వుంటుంది.

*(ముస్లిం : 2300)*

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: నా కొలను (సరస్సు) ఒక మాసపు ప్రయాణమంత పొడవుగా ఉంది. దాని అంచులు (హద్దులు) సమానంగా వున్నాయి. (అంటే దాని కొలతలు సమానంగా వున్నాయి). దాని నీరు వెండి కన్నా తెలుపుగా, దాని సువాసన కస్తూరి సువాసన కన్నా ఎక్కువగా వుంది.దాని గిన్నెలు ఆకాశ నక్షత్రాల లాగా చాలా ఎక్కువగా వున్నాయి. అక్కడికి వచ్చిన వ్యక్తి, ఒక్కసారి దాని(గిన్నె) తో త్రాగితే ఇక ఎప్పుడూ దాహోర్తుడిగా వుండడు. *(బుఖారీ : 6579, ముస్లిం : 2292)*

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు. అల్ కౌసర్ అనేది స్వర్గంలోని ఒక సెలయేరు (కాలువ). దాని అంచులు (హద్దులు) బంగారంతో, అది ప్రవహించే దారి ముత్యాలు మరియు యాఖూత్ (ఒక విధమైన రాయి)లతో వుంది. దాని మట్టి కస్తూరి కన్నా ఎక్కువ పరిమళం కలిగి ఉంది. దాని నీరు తేనె కన్నా తియ్యగా, మంచు కన్నా ఎక్కువ తెలుపుగా ఉంది.

*(తిర్మిజి : 3361; సహీ –అల్‌బానీ)*

ఇవండీ! దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు సంబంధించిన కొన్ని ప్రత్యేకతలు.

చివరిగా అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే – ప్రళయం రోజు ఆయన మనందరికీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చేతుల మీదుగా కౌసర్ సరస్సు నీళ్ళు మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సిఫారసును ప్రసాదించుగాక! ఆమీన్.

### షరీయత్తు (ధర్మశాస్త్ర) పరంగా

# మిలాదున్నబి ఉత్సవానికి గల విలువ

**ప్రముఖ అంశాలు:**

1) సహాబాల ఆచరణల వెలుగులో ఖుర్ఆన్ మరియు హదీసుల అవగాహన.

2) ధార్మిక పరంగా మిలాదున్నబీ (దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జన్మదినం) ఉత్సవానికున్న విలువ.

3) మూడు ముఖ్య నియమాలు

4) ధర్మంలో 'బిద్దతే హసన' (మంచి క్రొత్త పోకడ) యొక్క అస్తిత్వం వుందా?

5) మిలాదున్నబీని జరుపుకొనే వారి ఆధారాలు మరియు వాటి జవాబులు.

ఇస్లామీయ సహోదరులారా!

ఒక ముస్లిం యొక్క సాఫల్యత అనేది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత చూపడంలోనే వుంది. దివ్య ఖుర్ఆన్ మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసులలో అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) వివరించిన విషయాలను అనుసరిస్తూ, వాటి తిరస్కరణ, అవిధేయతలకు ఎల్లప్పుడూ దూరంగా వుండాలి.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

وَمَنْ يُّطِعِ اللّٰهَ وَرَسُوْلَهٗ يُدْخِلْهُ جَنّٰتٍ تَجْرِيْ مِنْ تَحْتِهَا الْاَنْهٰرُ خٰلِدِيْنَ فِيْهَا ۭ
وَذٰلِكَ الْفَوْزُ الْعَظِيْمُ ⑬ وَمَنْ يَّعْصِ اللّٰهَ وَرَسُوْلَهٗ وَيَتَعَدَّ حُدُوْدَهٗ يُدْخِلْهُ نَارًا خَالِدًا
فِيْهَا ۠ وَلَهٗ عَذَابٌ مُّهِيْنٌ ⑭

**"అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త యెడల విధేయత చూపే వారికి అల్లాహ్ క్రింద కాలువలు ప్రవహించే (స్వర్గం) వనాలలో ప్రవేశం కల్పిస్తాడు. వాటిలో వారు కలకాలం వుంటారు. గొప్ప విజయం అంటే ఇదే. ఎవడు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త యెడల అవిధేయుడై, ఆయన నిర్ధారించిన హద్దులను మీరిపోతాడో వాడిని ఆయన నరకాగ్నిలో**

**పడవేస్తాడు. వాడందులో ఎల్లకాలం పడి వుంటాడు. అవమానకరమైన శిక్ష అలాంటి వారి కోసమే వుంది.”** ***(నిసా:13- 14)***

పై ఆయతులపై ఒక్కసారి దృష్టి సారించండి. వీటిలో అల్లాహ్ – విధేయత చూపుతూ తనను అనుసరించే వారికి స్వర్గపు శుభవార్తనూ, దీనికి వ్యతిరేకంగా అవిధేయత చూపి తనను తిరస్కరించే వారికి నరక శిక్షను గూర్చి తెలియజేశాడు. అందుకే ప్రతి ముస్లిం తన హృదయంలో తొంగి చూసి, తనే మార్గంలో పయనిస్తున్నాడో విశ్లేషించుకోవాలి. స్వర్గానికి తీసుకెళ్ళే మార్గంలోనా లేక (అల్లాహ్ శరణు) నరకంలోకి తీసుకెళ్ళే మార్గంలోనా అని. అల్లాహ్‌కు విధేయత ఎలా సాధ్యమవుతుంది? అతనికి విధేయత అనేది – దివ్య ఖుర్ఆన్‌ను చదవడం, నేర్పించడం ద్వారా మరియు దాని (ఆజ్ఞల)పై దృష్టి సారించి, దానినే మన జీవితపు కొలమానంగా నిర్ధారించడం ద్వారా సాధ్యమవుతుంది.

ఇక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు విధేయత ఎలా సాధ్యమవుతుంది?

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసులను చదివి, వాటి ప్రకారం ఆచరించడం ద్వారా సాధ్యమవుతుంది. విశ్వాసాలైనా, ఆరాధనలైనా, ఇతర వ్యవహారాలైనా, సుగుణాలైనా – ప్రతి విషయంలోనూ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అనుసరించాలి.

ఆయన పరిశుద్ధ జీవిత చరిత్రను చదవాలి మరియు ఆచరణ రీత్యా దానిని మన జీవితాలలో ప్రతిబింబింపజేయడానికి ప్రయత్నించాలి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత చూపడం వాస్తవానికి అల్లాహ్‌కు విధేయత చూపడమేనన్న విషయం అందరికి తెలిసిందే. ఎందుకంటే అల్లాహ్‌యే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మన కోసం ఆదర్శంగా చేసి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అడుగుజాడల్లో నడవమని మనల్ని ఆదేశించాడు.

ఇంకో విషయమేమిటంటే – ఇహపరలోకాల సాఫల్యం అనేది అల్లాహ్, ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత చూపుతూ ఖుర్ఆన్ మరియు హదీసుల ప్రకారం ఆచరించడం ద్వారానే సాధ్యం అన్న విషయం సుస్పష్టం. కానీ, ఇక్కడ జనించే ప్రశ్న ఏమిటంటే – ఈ విషయంలో మనం

ఎవరిని కొలమానంగా భావించాలి? ఎవరిని ఆదర్శంగా తీసుకోవాలి? అని.

ఎవరినైతే స్వయంగా అల్లాహ్‌యే కొలమానంగా, ఆదర్శంగా ఖరారు చేశాడో వారినే మనం కొలమానంగా, ఆదర్శంగా చేసుకోవాల్సి వుంటుంది. వారెవరంటే –దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను స్వయంగా దర్శించి, ఆయన్ను విశ్వసించిన ఈ అనుచర సమాజపు మొట్టమొదటి ముస్లిములు. ఎవరినైతే అల్లాహ్ స్వర్గపు శుభవార్త నందించి 'తాను సంతృప్తి చెందాను' అని ప్రకటించాడో, ఎవరినైతే తన ప్రియతమ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కొరకు ఎన్నిక చేసి ఆయన నోటి ద్వారా అల్లాహ్ గ్రంథాన్ని మరియు హదీసులను వినే సౌభాగ్యాన్ని కలుగజేశాడో వారు... అంటే.. సహాబాలు (ప్రవక్త సహచరులు).

❖ ఆ సహాబాల విశ్వాసాన్ని అల్లాహ్ ఇతరుల కోసం కొలమానంగా ఖరారు చేశాడు. (దీనికి సంబంధించి) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَإِنْ آمَنُوا بِمِثْلِ مَا آمَنتُم بِهِ فَقَدِ اهْتَدَوا ۖ وَّإِن تَوَلَّوْا فَإِنَّمَا هُمْ فِي شِقَاقٍ

**"ఒకవేళ వారు కూడా మీరు (సహాబాలు) విశ్వసించినట్లే విశ్వసిస్తే, సన్మార్గం పొందగలరు. విముఖత గనక చూపితే వారు వైర భావానికి లోనై ఉన్నారన్నది సుస్పష్టం."** ***(బఖర : 137)***

❖ ఆ సహాబాల మార్గం వదలి ఇతర మార్గాలపై నడిచే వారికి అల్లాహ్ నరక శిక్షను గురించి హెచ్చరించాడు.

(దీనికి సంబంధించి) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَن يُشَاقِقِ الرَّسُولَ مِن بَعْدِ مَا تَبَيَّنَ لَهُ الْهُدَىٰ وَيَتَّبِعْ غَيْرَ سَبِيلِ الْمُؤْمِنِينَ نُوَلِّهِ
مَا تَوَلَّىٰ وَنُصْلِهِ جَهَنَّمَ ۖ وَسَاءَتْ مَصِيرًا ﴿115﴾

**"తనకు రుజుమార్గం (సన్మార్గం) విశదమైనప్పటికీ ఎవరైనా ప్రవక్తకు వ్యతిరేకంగా పోతే, విశ్వాసుల మార్గాన్ని వీడి ఇతర మార్గాన్ని అనుసరిస్తే, మేమతన్ని అతను మరలిన వైపునకే మరల్చుతాము. కడకు అతణ్ణి నరకంలో పడవేస్తాము. అది అత్యంత చెడ్డ నివాసం."** ***(నిసా : 115)***

ఈ ఆయత్‌లో 'విశ్వాసుల మార్గం' అంటే 'సహాబాల మార్గం' అని

అర్థం. ఎందుకంటే – దివ్య ఖుర్ఆన్ అవతరించే సమయంలో కేవలం సహాబాలే విశ్వాసులుగా ఉన్నారు.

ఈ సంక్షిప్త వివరణ ద్వారా తెలిసిందేమిటంటే – ముస్లిములు తమ క్రియాశీలక జీవితాల్లో ఖుర్ఆన్ మరియు హదీసులనే తమ ముందు వుంచాలి. ఈ విషయంలో – సహాబాల ఆచరణల ద్వారా మార్గదర్శకత్వం పొందుతూ ఖుర్ఆన్, హదీసులపై వారు ఆచరించినట్లుగానే ఆచరించాలి. ఎందుకంటే– అల్లాహ్ వారినే సత్యానికి ప్రామాణికంగా / కొలమానంగా ఖరారు చేశాడు.

ప్రత్యేకంగా, విభేదాల విషయంలోనైతే – ఖుర్ఆన్, హదీసులు, సహాబాల ఆచరణ వెలుగులోనే వీటిని పరిష్కరించుకోవాలి. అంతిమ నిర్ణయం– తమ కోరికలు లేదా కొన్ని ప్రత్యేక దృష్టి కోణాలతో కాకుండా, కేవలం ఖుర్ఆన్ మరియు హదీసుల ప్రకారం తీసుకోవాలి. ఖుర్ఆన్ మరియు హదీసుల ఆధారాలు లభించాక సహాబాలు ఏ విధంగానైతే వాటి ముందు తల వంచేవారో, ఖచ్చితమైన ఆధారాలు దొరికిన తర్వాత వ్యర్థంగా / మూర్ఖంగా వాదించడం ధర్మయుక్తం కాదని వారెలాగైతే భావించేవారో మనం కూడా అలాగే ఆచరిస్తూ ఖుర్ఆన్ మరియు హదీసుల ముందు శిరస్సులు వంచేయాలి. (అంటే మనస్ఫూర్తిగా వాటిని స్వీకరించి ఆచరించాలి).

విభేదాల పరిష్కారానికి గాను అల్లాహ్ తన ఆఖరి గ్రంథంలో ఈ పద్ధతినే నిర్దేశించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**يَاَيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اَطِيْعُوا اللّٰهَ وَاَطِيْعُوا الرَّسُوْلَ وَ اُولِي الْاَمْرِ مِنْكُمْ ۚ فَاِنْ تَنَازَعْتُمْ فِيْ شَيْءٍ فَرُدُّوْهُ اِلَى اللّٰهِ وَ الرَّسُوْلِ اِنْ كُنْتُمْ تُؤْمِنُوْنَ بِاللّٰهِ وَ الْيَوْمِ الْاٰخِرِ ؕ ذٰلِكَ خَيْرٌ وَّ اَحْسَنُ تَاْوِيْلًا ﴿59﴾**

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి, ప్రవక్తకు విధేయత చూపండి మరియు మీలోని అధికారులకు కూడా. ఆపైన ఏ విషయంలోనైనా మీ మధ్య వివాదం తలెత్తితే దానిని అల్లాహ్ మరియు ప్రవక్త వైపునకు మరల్చండి. మీకు నిజంగా అల్లాహ్‌పై, అంతిమ దినంపై విశ్వాసం ఉన్నట్లయితే ఇదే మేలైన పద్ధతి. పరిణామం రీత్యా కూడా ఇదే అన్నింటి కంటే ఉత్తమమైనది." *(నిసా : 59)***

ఈ ఆయత్‌లో "ఫీ షయ్యిన్" అనేది నామవాచకం మరియు "ఒకవేళ విభేదాలు తలెత్తితే" అన్న షరతు తర్వాత వచ్చింది.

అరబ్బీ భాషలో ఎక్కడైనా ఈ పద్ధతి గనక అవలంబిస్తే, దానితో సాధారణ విషయాలకు కూడా ప్రయోజనం చేకూరుతుంది. దీని అర్థం ఏమిటంటే- ధార్మిక పరమైన ముఖ్యాంశాలు మరియు వాటి వివరణలకు సంబంధించిన విషయాలన్నింటిలోనూ ఎప్పుడైనా విభేదాలు తలెత్తితే, వాటి పరిష్కారం కోసం ఖుర్ఆన్, సున్నత్‌లను సంప్రదించాలి. ఒకవేళ అన్ని విభేదాల పరిష్కారం, ఖుర్ఆన్ మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్‌లలో లేకుండా వుంటే, అల్లాహ్ ఎప్పుడు కూడా 'వాటి వైపునకు మళ్ళించండి' అని సెలవిచ్చి వుండేవాడు కాదు.

ఇలాగే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఈ విషయాన్ని చక్కగా విడమర్చి చెప్పారు.

"నేను మీకు అల్లాహ్‌కు భయపడడం గురించి, అమీర్ (నాయకుడు)కు విధేయత చూపడం గురించి గట్టిగా ఆజ్ఞాపిస్తున్నాను. ఒకవేళ అతను (అమీర్) నల్లజాతికి చెందిన బానిసైనా సరే. (బాగా గుర్తుంచుకోండి)! నా తదనంతరం జీవించి వుండేవారు ఉమ్మత్‌లో ఎన్నో విభేదాలను చూస్తారు. అలాంటి పరిస్థితుల్లో మీరు నా సున్నత్‌లపై ఆచరించడాన్ని అనివార్యం చేసుకోండి మరియు సన్మార్గ గాములైనా ఖలీఫాల పద్ధతిని పట్టుకోండి. వాటితో అతుక్కుపోండి, వాటిని దంతాలతో అదిమి వుంచండి. ఇంకా ధర్మంలో సృష్టించబడిన కొంగ్రొత్త విషయాలకు (బిద్అత్‌లకు) దూరంగా వుండండి. ఎందుకంటే ధర్మంలో సృష్టించబడిన ప్రతి క్రొత్త విషయం బిద్అత్ అవుతుంది మరియు ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతకు ఆనవాలు." *(అబూదావూద్ : 4607, సహీ-అల్‌బానీ)*

నిసా సూరా ఆయత్ మరియు అబూదావూద్‌లోని ఈ సహీ హదీసు - ఈ రెండింటినీ ముందుంచితే - ఇంతకు ముందు మేము వివరించిన - 'అన్ని విభేదాల పరిష్కరణ విషయంలో ఖుర్ఆన్, హదీసులను సంప్రదించడం తప్పనిసరి' - అన్న విషయానికి సంపూర్ణ బలం చేకూరుతుంది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వసీయతు ప్రకారం, ముస్లిములందరూ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ మరియు సన్మార్గం పొందిన ఖలీఫాల

సున్నత్‌లను గట్టిగా పట్టుకున్నప్పుడే విభేదాలన్నీ దూరమవుతాయి. ఒకవేళ ప్రతి వ్యక్తీ తన కోరికలకు లేదా కొన్ని ప్రత్యేక దృష్టి కోణాలకే అతుక్కుపోతే ఖచ్చితంగా విభేదాలు ఎప్పుడూ అంతం కావు. పైగా అవి రోజు రోజుకూ పెరుగుతూ పోతాయి. (దురదృష్టవశాత్తూ) నేడు ముస్లిముల పరిస్థితి కూడా ఇలానే ఉంది.

మీరు కొంచెం ఈ హదీసుపై దృష్టి సారించండి!

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముందుగా – తన సున్నత్ మరియు సన్మార్గగాములైన ఖలీఫాల పద్ధతిని గూర్చి వివరించారు. తదుపరి, క్రొత్త పోకడలు ఆరంభించడాన్ని వారిస్తూ, ప్రతి క్రొత్త ఆచరణను బిద్అత్ మరియు మార్గభ్రష్టతగా ఖరారు చేశారు. దీని ద్వారా తెలిసిందేమిటంటే – ఒకవేళ ముస్లిములు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పద్ధతి మరియు ఖలీఫాల పద్ధతిని విడనాడితే వారు ధర్మంలో క్రొత్త పోకడలల్లో (ఆచారాల్లో) మునిగిపోయి సన్మార్గం నుండి దూరంగా వెళ్ళిపోతారు.

నేడు ముస్లిముల పరిస్థితి ఇలాగే తయారయ్యింది.

వల్లాహుల్ ముస్తాన్ – అల్లాహ్‌యే మనల్ని రక్షించేవాడు!

విభేదాలకు లోనయిన విషయాల్లో ఒక ప్రధానమైన విషయం – రబీ ఉల్ అవ్వల్ మాసపు 12వ తారీఖును మిలాదున్నబీ (దైవప్రవక్త జన్మదినోత్సవం) జరుపుకోవడం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని చాలా మంది ముస్లిములు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుభ పుట్టుకకు సూచనగా ప్రతియేడు రబీ ఉల్ అవ్వల్ మాసపు 12వ తేదీన మిలాదున్నబీ పేరుతో సంబరాలు జరుపుకుంటూ ఉంటారు. కట్టడాలను (ఇండ్లు, మసీదులు, దర్గాలు వగైరా....) దీపాలతో, జెండాలతో అలంకరిస్తారు. నాత్ (ధార్మిక కవిత్వం)ల పఠన నిమిత్తం ప్రత్యేక శిబిరాలు నిర్వహించబడతాయి. కొన్ని దేశాల్లోనయితే ప్రత్యేకంగా ఈ రోజు ప్రభుత్వపరంగా సెలవు ప్రకటించబడుతుంది.

ఖుర్ఆన్ మరియు హదీసులను గూర్చి మేము ఇంతకు ముందు ఇచ్చిన వివరణను దృష్టిలో పెట్టుకుని – ఖుర్ఆన్, హదీసులలో మిలాదున్నబీ ఉత్సవానికి సంబంధించి ఏవైనా ఆధారాలు వున్నాయా? అన్న విషయాన్ని పరిశీలించాలి. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన జన్మదినాన్ని

పండుగగా ఎప్పుడైనా జరుపుకున్నారా? లేక దాన్ని ప్రోత్సహించారా? సన్మార్గ గాములైన ఖలీఫాలలో ఎవరైనా తమ పరిపాలనా కాలంలో ఈ జన్మదినానికి సూచనగా ఉత్సవం జరుపుకున్నారా? మొట్టమొదటి శ్రేష్ఠ తరం (సహాబాల తరం) నందు ఈ పండుగ అస్తిత్వం వుందా?

ఒకవేళ ఖుర్ఆన్, హదీసులు మరియు మొదటి శ్రేష్ఠ తరం చరిత్రను పూర్తి నిజాయితీతో గనక పరిశీలిస్తే ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇలా లభిస్తుంది:

- ఖుర్ఆన్, హదీసుల్లో మిలాదున్నబీ ఉత్సవానికి ఆధారమేదీ లేదు.
- దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన జన్మదినాన్ని ఎప్పుడూ జరుపుకో లేదు మరియు దానిని ప్రోత్సహించనూ లేదు.
- ఆ తర్వాత, సన్మార్గగాములైన ఖలీఫాలలో ఎవ్వరు కూడా తమ పరిపాలనా కాలంలో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుభపుట్టుకకు సూచనగా ఈ దినాన్ని ప్రభుత్వపరంగా కానీ, ప్రైవేటు పరంగా (వ్యక్తిగతంగా) కానీ ఉత్సవంగా జరుపుకోలేదు. ఈ దినాన్ని పండుగ దినంగా కూడా ఖరారు చేయలేదు. మరి చూడబోతే, వారు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అత్యధికంగా ప్రేమించేవారు. కనుక, వారు అలా చెయ్యాలని అనుకొని వుంటే అతి సులభంగా ఈ పని చేయగలిగే వారు. కారణం, అప్పుడు ప్రభుత్వం వారి చేతుల్లోనే వుంది.
- అన్నింటికన్నా శ్రేష్ఠమైన కాలం–అంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖరారు చేసిన సహాబాలు, తాబయీలు, తబా తాబయీల కాలం – ఈ కాలంలో కూడా ప్రజలలో మిలాదున్నబీకి సంబంధించిన ఆలోచనే లేదు మరియు దానిని వారు ఉత్సవంగా కూడా జరుపుకొనేవారు కాదు.

దానితోపాటు, ఈ అనుచర సమాజపు సుప్రసిద్ధ ఉలమాల (ధార్మిక పండితులు) వద్ద కూడా ఈ పండుగకు సంబధించి ఆలోచనే లేదు. వారు కూడా దీనిని ఎప్పుడూ పండగ గా జరుపుకోలేదు. తమ శిష్యులకు కూడా వారు దీనిని గురించి బోధించలేదు.

## మిలాదున్నబీ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆవిష్కరణ కర్త

మిలాదున్నబీ ఉత్సవాన్ని మొట్టమొదట అబూ సయీద్ కబూరీ బిన్ అబుల్ హసన్ అలీ బిన్ ముహమ్మద్ ఉర్ఫ్ అల్ మలికుల్ ఆజమ్ ముజఫ్ఫరుద్దీన్, ఇర్బిల్ (మౌసల్), మరణం. 18 రమజాన్ 630 హి. శ. ప్రారంభించాడు. ఈ ఉత్సవానికి సంబంధించిన శిబిరాల్లో లెక్కలేనంత డబ్బు ఖర్చు చేసేవాడు. నృత్యంతో పాటు పాటల కచేరీలు కూడా ఏర్పాటు చేసేవాడు.

మౌలానా రషీద్ అహ్మద్ గంగోహి ఇలా తెలియజేశారు:

చరిత్రకారులు వివరించిన విషయాలేమిటంటే- ఈ రాజు నాట్య కారులను, గాయకులను సమీకరించి సంగీత వాయిద్యాలతో పాటలు వింటూ, తను కూడా నృత్యం చేసేవాడు. ఇలాంటి వ్యక్తి యొక్క విశ్వాస లేమి మరియు మార్గభ్రష్టతల్లో ఎలాంటి సందేహం లేదు. (పరిస్థితి ఇదైనపుడు అతని ఈ ఆచరణను మరియు అతని మాటలను ఎలా నమ్మగలం?

*(ఫతావా రషీదియా : 132 పేజీ)*

ఆయన (రషీద్ అహ్మద్ గంగోహి) ఇంకా ఇలా తెలియజేస్తున్నారు:

ఈ దురాచరణ మరియు బిద్అత్ యొక్క సంక్షిప్త స్వరూపం ఎలా ఉండేదంటే- ఈ మిలాదున్నబీ ఉత్సవ శిబిరాల నిమిత్తం కలపతో, విశాలమైన 20 గుడారాలు నిర్మించేవాడు. ప్రతి గుడారంలో ఐదు అంతస్తులండేవి. సఫర్ నెల ప్రారంభం నుంచే వాటిని అలంకరించి, ప్రతి అంతస్తులో, గాయకుల, కవుల, నాట్యకారుల ఒక్కో సమూహాన్ని కూర్చోబెట్టేవాడు. స్వయానా ముజఫ్ఫరుద్దీన్ రాజు తన మంత్రులతో, చుట్టుప్రక్కల వాళ్ళతో కలిసి ప్రతి రోజూ సాయంత్రం వేళ ఈ గుడారాల్లోకి వెళ్ళి, నాట్య గాన ప్రదర్శనను తిలకించేవాడు, తను కూడా వారితో కలిసి నృత్యం చేసేవాడు. తదుపరి, తన గుడారంలో రాత్రంతా ఈ పనుల్లోనే గడిపేవాడు. మిలాదున్నబీకి సరిగ్గా రెండు రోజులు ముందుగా ఒంటెలు, ఆవులు మరియు మేకలను ఒక మైదానంలో జిబహ్ చేసి జన సమూహం కొరకు రకరకాల వంటకాలను సిద్ధం చేయించే వాడు. ఇక మిలాదున్నబీ రోజు రాత్రివేళ తన కోటలో ప్రత్యేక నాట్యగాన కార్యక్రమాలు నిర్వహించేవాడు. *(ఫతావా రషీదియా : 132 పేజీ)*

ఇదండీ వాడి ఆవిష్కరణ. ఇక దీని (మిలాదున్నబీ) ఆచరణ కొరకు ఫత్వా జారీ చేసిన వ్యక్తి పేరు అబుల్ ఖత్తాబ్ ఉమర్ బిన్ అబుల్ హసన్ అల్ మారూఫ్ బాబిన్ వహియత కల్బి (మరణం 633 హి.).

హాఫిజ్ ఇబ్నె హజర్ (రహిమహుల్లాహ్) ఇలా తెలియజేశారు: ఇబ్నె నజ్జార్ ఇలా సెలవిచ్చారు – ఇతడు పచ్చి అబద్ధాల కోరు, బలహీన ఉల్లేఖకుడు అని నిర్ధారించడంలో అందరూ ఏకీభవించారు.

*(లిసానుల్ మీజాన్ : 2వ సంపుటం, 259 పేజీ)*

'అతడు – ధార్మిక పండితులు, సలఫుస్సాలిహీన్‌ల గురించి చెడుగా మాట్లాడే వాడు. నోటి దురుసుతనం కూడా ఎక్కువ. అత్యంత మూర్ఖుడు మరియు గర్విష్టి. ధార్మిక వ్యవహారాలలో అత్యంత అశ్రద్ధ చూపేవాడు.'

*(లిసానుల్ మీజాన్ : 2వ సంపుటం, 296 పేజీ)*

ఇతనే, ఇర్బిల్ రాజును మిలాదున్నబీ ఉత్సవాలు జరుపుతుండడం చూసి, దాని ఆచరణ నిమిత్తం ఫత్వా (ధార్మిక తీర్పు) జారీ చేయడమే గాక, వాటి వివరాలను సేకరించి 'అత్తన్వీర్ ఫీ మౌలిద్ అస్సిరాజుల్ మునీర్' అనే పుస్తకాన్ని రచించాడు. తదుపరి ఈ పుస్తకాన్ని ఇర్బిల్ రాజుకు బహూకరించగా అతడు ఇతనికి 1000 నాణాలు బహూకరించాడు.

*(వఫియాత్ అల్ అయ్యాన్ లి ఇబ్నె ఖల్‌కాన్ : 3వ సంపుటం, 449 పేజీ)*

ఈ వాస్తవాలన్నింటి ద్వారా తెలిసిందేమిటంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జననాన్ని పురస్కరించుకొని ఉత్సవాలు జరుపుకోవడం అనేది ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరణం తర్వాత దాదాపు 600 సంవత్సరాల తర్వాత ప్రారంభమైంది.

మీరు కొంచెం గమనించండి!

మిలాదున్నబీ ఉత్సవానికి ఆధారం – ఖురానులోగానీ, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహచరుల ఆచరణలోగానీ, సలఫుస్సాలిహీన్‌ల జీవిత కాలంలో గానీ దొరకదు. ధార్మిక పండితులు కూడా ఎవరూ దీనిని సమర్థించలేదు. మరి అలాంటప్పుడు నేటి ముస్లిములు ఈ ఉత్సవంపై ఎందుకంత పట్టుదలతో వున్నారు? ఏ విశ్వాస ప్రేమానురాగాలను (ఈ ఉత్సవానికి) సాకుగా

నేటి ముస్లిములు చూపిస్తున్నారో ఆ ప్రేమాభిమానాలు గతించిన సజ్జనులకు లేవా?

ఒకవేళ వుంటే - నిశ్చయంగా వీరికన్నా ఎక్కువ ప్రేమాభిమానాలు కలిగి ఉండేవారు, వాళ్ళెందుకు ఈ ఉత్సవాన్ని జరుపుకోలేదు?

ఇక్కడ మరో ముఖ్యమైన విషయం కూడా ఉంది. అదేమిటంటే- ఆరాధనలో భాగంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దేనినైతే ఆచరించలేదో అది ఎట్టిపరిస్థితుల్లోనూ ధర్మంలో భాగం కాజాలదు. అంతేకాక, దానిని ధర్మంలో భాగమని తలపోసి, పుణ్యఫలాపేక్షతో ఆచరించడం, ఏ ముస్లిముకూ శోభించదు.

ఉదాహరణకు - దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజు, జనాజా (అంత్యక్రియలు) నమాజులకు అజాన్ చేయించలేదు. సహాబాల కాలంలో కూడా దీని అస్తిత్వం లేదు. కనుక ప్రళయం వరకు కూడా దీనిని ధర్మంలో ఒక భాగమని తలంచడం ఏ ముస్లిముకూ ధర్మయుక్తం కాదు.

దీనికి కారణం ఏమిటి?

అజాన్‌లో అల్లాహ్ స్మరణ లేదా? నిశ్చయంగా అజాన్ - అల్లాహ్ గొప్పతనం మరియు ఔన్నత్యాలతో నిండి వుంది. కానీ, పండుగ నమాజుకు, జనాజా నమాజుకు ముందు దీనిని పలకడం ధర్మశాస్త్రములో లేదు.

అలాగే మిలాదున్నబీ ఉత్సవం కూడా. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయానా ఎప్పుడూ దీనిని జరపలేదు. సన్మార్గం పొందిన ఖలీఫాలు కూడా దీనిని ఆచరించలేదు. అలాంటప్పుడు దీనిని ధర్మంలో అంతర్భాగం అనీ, ఒక సదాచరణ అని తలపోయడం ఎంత మాత్రం సమంజసం కాదు. అందుకే హుజైఫా (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చేవారు:

"సహాబాలు చేయని ఏ ఆరాధనా కార్యాన్నైనా మీరు ఆరాధనగా భావించి ఆచరించకండి."

*(హుజ్జతున్నబీ (సల్లల్లాహు అలైహి వ సల్లం)లిల్ అల్‌బానీ - 100 పేజీ)*

"మీరు కేవలం విధేయతే చూపండి. (ధర్మంలో) కొంగ్రొత్త విషయాలు ఆవిష్కరించకండి. ఎందుకంటే - దీని నుండి మీరు రక్షించబడ్డారు. మీరు కేవలం మొదటి నుండి (సహాబాల కాలంలో) వున్న ఆజ్ఞలనే గట్టిగా పట్టుకోండి."

ఇప్పటి వరకూ ఆధారాలతో సహా చర్చించిన విషయాలు ఒక సున్నితమైన, నీతిమంతుడైన వ్యక్తికి – మిలాదున్నబీ ఆచారానికి ధర్మంలో ఏ విధమైన స్థానం లేదు – అని తెలియడానికి చాలు. అయినా, దీని గురించి మరింత విపులంగా అర్థం చేసుకోవడానికి – యావత్తు ముస్లిములు ఏకాభిప్రాయం కలిగివున్న కొన్ని ఆదర్శాలు మీ ముందు వివరించాలనుకొంటున్నాం. వీటి ద్వారా కూడా, మిలాదున్నబీ ఆచార మనేది ధర్మంలో ప్రవేశింపజేయబడ్డ ఒక క్రొత్త పోకడ (బిద్అత్) అని ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

## 1) ఇస్లాం ఒక పరిపూర్ణ ధర్మం

ఇస్లాం విశిష్టతలలో ఒక విశిష్టత ఏమిటంటే – ఇదొక పరిపూర్ణ ధర్మం. జీవితంలో అన్ని రంగాలలో ఎదురయ్యే సమస్యలన్నింటికీ దీనిలో స్పష్టమైన ఆదేశాలు వున్నాయి. దీని రూపకర్త (అల్లాహ్) దీనిలో ఏ విధమైన హెచ్చుతగ్గులు చేయడానికి అవకాశం ఇవ్వలేదు. కానీ, దురదృష్టవశాత్తూ, నేడు ముస్లిములు ఆధారాలతో సహా స్థాపించబడ్డ ఆచరణలను విస్మరించి, ఆధారాలు లేని కొంగ్రొత్త ఆచారాలను ధర్మంలో చేర్చి, వాటినే వాస్తవిక ధార్మిక ఆచరణలని తల పోస్తున్నారు. వాస్తవానికి ఇస్లాం ఒక సంపూర్ణ ధర్మమై, దీని ఉపదేశాలు చాలా స్పష్టంగా, యావత్ ప్రపంచానికి తెలిసేలా, చిరస్థాయిగా నిలిచి వున్నప్పుడు, దీనిలోకి నూతన విషయాలు చేర్చి, వాటిని ధర్మం యొక్క అంతర్భాగంగా భావించడం ఎలా ధర్మ సమ్మతమవుతుంది?

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

اَلْيَوْمَ اَكْمَلْتُ لَكُمْ دِيْنَكُمْ وَاَتْمَمْتُ عَلَيْكُمْ نِعْمَتِيْ وَرَضِيْتُ لَكُمُ الْاِسْلَامَ دِيْنًا

**"ఈ రోజు మీ కొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా, ఇస్లాంను మీ ధర్మంగా సమ్మతించి ఆమోదించాను."** ***(మాయిద : 3)***

ఇలా, మన ధర్మాన్ని పరిపూర్ణం గావించి అల్లాహ్ మనపై ఎంతగానో అనుగ్రహించాడు. ఒకవేళ తను దీనిని అసంపూర్ణంగా వదలివేస్తే, ప్రతి వ్యక్తీ తనకు తగ్గట్టుగా దీనిలో హెచ్చుతగ్గులు చేసుకొనేవాడు. తత్ఫలితంగా, ధర్మం ప్రజల చేతుల్లో ఒక ఆటబొమ్మగా అయిపోయేది.

సహీహైన్ (రెండు ప్రామాణిక హదీసు గ్రంథాలైన బుఖారీ, ముస్లిం) లోని ఒక హదీసు ద్వారా గూడా అల్లాహ్ యొక్క ఈ మహోన్నత అనుగ్రహానికి గల విలువ, ప్రాధాన్యత అర్థమవుతుంది.

ఉమర్ (రజి అల్లాహు అన్హు) పరిపాలనా కాలంలో ఒక యూద పండితుడు ఆయన దగ్గరికి వచ్చి ఇలా విన్నవించుకున్నాడు: ఓ విశ్వాసుల నాయకా (అమీరుల్ మోమినీన్)! అల్లాహ్ గ్రంథం (దివ్య ఖుర్ఆన్)లో ఒక ఆయత్ వుంది. ఒకవేళ అది మాపై (యూదులపై) గనక అవతరించి వుంటే, అది అవతరించిన దినాన్ని మేము పండుగ దినంగా జరుపుకొనేవాళ్ళం. దీనిపై ఉమర్ (రజి అల్లాహు అన్హు) అతనితో – ఆ ఆయత్ ఏది? అని ప్రశ్నించారు. అతనిలా జవాబిచ్చాడు:"ఈ రోజు మీ కొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా, ఇస్లాంను మీ ధర్మంగా సమ్మతించి ఆమోదించాను." *(మాయిద : 3)*

ఇది విని, ఉమర్ (రజి అల్లాహు అన్హు) అతనికి ఇలా జవాబిచ్చారు: ఈ ఆయత్ పండుగ రోజే అవతరించింది. ఆ సమయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అరాఫాత్ మైదానంలో వున్నారు మరియు ఆ రోజు శుక్రవారం. *(బుఖారీ : 45, 3017)*

మరి, ఆ యూద పండితుడు – 'ఒకవేళ ఈ ఆయత్ మాపై అవతరించి వుంటే మేము ఆ రోజును పండుగ దినంగా జరుపుకొనేవాళ్ళం' అని ఎందుకు అడిగాడు? ఎందుకంటే, ధర్మ పరిపూర్ణత యొక్క విలువ మరియు ప్రాధాన్యత అతనికి తెలుసు కాబట్టి. కానీ, నేటి ముస్లిములలో చాలా మందికి దీని విలువ తెలియని కారణంగా ఎన్నో క్రొత్త ఆచారాల్లో (బిద్అత్) మునిగిపోయి, వాటిని ధర్మంలో అంతర్భాగమని తలపోస్తున్నారు. వాస్తవానికి వీటికి (క్రొత్త ఆచారాలు) ధర్మంతో ఎలాంటి సంబంధమూ లేదు.

## 2) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రతి మంచి విషయం గూర్చి సెలవిచ్చి వున్నారు.

ఈ పరిపూర్ణ ధర్మాన్ని అల్లాహ్, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)పై అవతరింపజేశాడని, దానిని ఆయన(సల్లల్లాహు అలైహి వసల్లం)యధావిధిగా దాని సంపూర్ణ రూపంలో తన అనుచర సమాజానికి చేరవేశారని ప్రతి వ్యక్తికీ తెలుసు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్‌కు దగ్గరగా చేసే, నరకం నుండి దూరం గావించే ప్రతి విషయాన్ని నేను మీకు ఆజ్ఞాపించి వున్నాను. అలాగే, నరకానికి దగ్గరగా చేర్చే, అల్లాహ్ నుండి దూరం గావించే ప్రతి విషయం నుండి నేను మిమ్మల్ని వారించాను."*(హుజ్జతున్నబీ (సల్లల్లాహు అలైహి వసల్లం) లిల్ అల్‌బానీ : 103 పేజీ)*

"స్వర్గానికి దగ్గరగా చేర్చే, నరకం నుండి దూరం గావించే ప్రతి విషయం మీకు వివరించబడింది." *(అస్సహీహ లిల్ అల్‌బానీ : 1803)*

అలాగే, ఇలా కూడా సెలవిచ్చారు: "అల్లాహ్, ఏ కార్యాలను చేయమని మీకు ఆదేశించాడో నేను కూడా ఆ కార్యాలను గురించి మీకు ఆజ్ఞాపించాను. అలాగే, అల్లాహ్, ఏ కార్యాలను (మీ కోసం) నిషేధించాడో నేను కూడా వాటి నుంచి మిమ్మల్ని వారించాను." *(అల్ మర్జఅ అస్సాబిఖ్)*

ఈ హదీసుల ద్వారా తెలిసిందేమింటే – మంచికి సంబంధించిన ఏ విషయమైనా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన అనుచర సమాజానికి చేరవేయకుండా లేరు, అలాగే చెడుకు సంబంధించిన ఏ విషయం గురించైనా తన అనుచర సమాజానికి వారించకుండా లేరు.

కనుక, ఈ విషయాలన్నీ తెలిసిన తర్వాత మనం తేలిగ్గా ఈ నిర్ణయానికి రావచ్చు. అదేమిటంటే – ప్రజల దృష్టిలో మంచి కార్యంగా తలచబడే ప్రతి కార్యమూ – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దాని గురించి ఆజ్ఞాపించడం గానీ, స్వయంగా ఆచరించడం గానీ చేయనంత వరకు (ధర్మం దృష్టిలో) మంచి కార్యం కాజాలదు. అలాగే, చెడు కార్యం విషయంలో కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దానిని వారించనంత వరకు అది చెడుగా భావించబడదు.

అంటే – ఏది మంచీ, ఏది చెడు అని నిర్ధారించడానికి కొలమానం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం). అంతేగాని ఒకరి ఇష్టాయిష్టాలు కావు, ఎవరి ఇష్టం వచ్చినట్లు వాళ్ళు ధర్మంలో తమ ఇష్ట ప్రకారం మంచి కార్యాలు చేర్చడానికి మరియు చెడు పనులుగా ఖరారు చేయడానికి.

ఇంకో విషయం కూడా ఆలోచించదగ్గదే –

క్రొత్త ఆచారాలను(బిద్‌అత్) ఆవిష్కరించి, వాటిని ధర్మంలో ప్రవేశపెట్టడం ద్వారా – 'దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ధర్మాన్ని పూర్తిగా చేరవేయలేదు, కొన్ని మంచి కార్యాలు ఆయన మరియు తొలుత ఆయనను విశ్వసించిన వారు వదిలిపెట్టారు, కనుక ధర్మంలో ఇప్పటికీ కొన్ని హెచ్చుతగ్గులు చేసుకోవడానికి అవకాశం వుంది'– అన్న అనుమానం రాదా?

తప్పకుండా వస్తుంది.

అందుకే ఇమామ్ మాలిక్ (రహిమహుల్లాహ్) ఇలా సెలవిచ్చారు: ఎవరైనా ఇస్లాంలో ఒక క్రొత్త ఆచారాన్ని (బిద్‌అత్) ప్రవేశపెట్టి, దానిని మంచి కార్యంగా భావించాడంటే – అతను –దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన దౌత్య బాధ్యత (దైవధర్మాన్ని చేరవేయడం)ను సరిగా నెరవేర్చలేదు (అంటే ధర్మాన్ని పూర్తిగా చేరవేయ లేదు) అని నిర్ధారించిన వాడైపోతాడు. మీరు అల్లాహ్ ఇచ్చిన ఈ ఆజ్ఞను చదువుకోండి – "ఈ రోజు మీ కొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా, ఇస్లాం ను మీ ధర్మంగా సమ్మతించి ఆమోదించాను." (మాయిద : 3)

తదుపరి ఇమామ్ మాలిక్ (రహిమహుల్లాహ్) ఇలా సెలవిచ్చారు: ఈ అనుచర సమాజపు (ఉమ్మత్) మొదటి తరాల ప్రజలు వేటి ద్వారానైతే రుజువర్తనులు అయ్యారో (సన్మార్గం పొందారో), దీని ఆఖరి తరాల ప్రజలు కూడా వాటితోనే రుజువర్తనులు కాగలరు (సన్మార్గం పొందగలరు). ఏ ఆచరణయితే అప్పుడు ధర్మంలో అంతర్భాగంగా లేదో అది నేడు కూడా ధర్మంలో భాగం కాలేదు.

ఇమామ్ మాలిక్ (రహిమహుల్లాహ్) ప్రవచనం –**'ఏ ఆచరణయితే అప్పుడు ధర్మంలో భాగంగా లేదో అది ఇప్పుడు కూడా ధర్మంలో భాగం కాలేదు'–**ను ప్రజలు ప్రళయం వరకు తమ ముందుంచాలి. ప్రతి ధార్మిక విషయానికి ఆధారాన్ని ఖుర్‌ఆన్ మరియు మొదటి మూడు తరాల సజ్జనుల (సలఫుస్సాలిహీన్) ఆచరణలో అన్వేషించాలి. ఒకవేళ వీటిలో ఆధారం దొరికితే, దానిపై ఆచరించాలి. ఒకవేళ దొరక్కపోతే, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ధర్మంగా భావించకూడదు.

## 3) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అందరి కన్నా ఎక్కువ దైవభీతి పరులు మరియు ఉపాసకులు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అందరికన్నా ఎక్కువ దైవభీతి పరులు మరియు అత్యుత్తమ దైవ ఉపాసకులన్న వాస్తవాన్ని ఎవరూ తిరస్కరించరు. అందుకే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా నిరూపించ బడిన ఆరాధనలనే ఆచరణలో పెట్టాలి. క్రొత్త విషయాలను (బిద్అత్) ధర్మంలో చేర్చి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మించిపోయే ధైర్యం చేయకూడదు.

సహీహైన్ (బుఖారీ, ముస్లిం గ్రంథాలు)లో అనస్ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఇలా ఉల్లేఖించబడింది: కొందరు వ్యక్తులు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆరాధనలను గూర్చి తెలుసుకొనే నిమిత్తం ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకూ మరియు ఆయన సతీమణుల వద్దకు పోయి అడిగారు. వారికి దీని గురించి తెలియజేయబడింది. దీనిని (దైవ ప్రవక్త ఆరాధన) వారు స్వల్పమని భావించి తమదైన రీతిలో స్పందిస్తూ, ఇలా అనసాగారు : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో మనకు పోలికేంటి? ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) గడిచిన మరియు (భవిష్యత్తులో) జరుగబోయే పాపాలన్నింటినీ అల్లాహ్ క్షమించి వున్నాడు! తదుపరి, వారిలో ఒకరు – ఇక నుండి నేను రాత్రిళ్ళు ఎల్లప్పుడూ మేల్కొనే వుంటాను (రాత్రిళ్ళు ఆరాధనలో గడుపుతాను) అని, రెండో వ్యక్తి – నేను ఎల్లప్పుడూ ఉపవాసం పాటిస్తాను, దానిని విరమించను అని, మూడో వ్యక్తి – నేను స్త్రీలతో దూరంగా వుంటాను, ఎప్పటికీ వివాహం చేసుకోను అని అన్నారు.

వారి ఈ మాటలు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు చేరగా, ఆయన వారి వద్దకు వెళ్ళి – ఇలా, ఇలా పలికింది మీరేనా? అని అడిగి నిర్ధారించుకొని, తదుపరి వారికి ఇలా హితోపదేశం చేశారు: మీ అందరిలోకెల్లా నేను అత్యధికంగా అల్లాహ్‌కు భయపడేవాణ్ణి మరియు అందరికన్నా ఎక్కువ దైవభీతిపరుడను అన్న విషయాన్ని మీరు తెలుసుకోవాలి. మరి నేను ఉపవాసం కూడా వుంటాను మరియు దానిని విరమిస్తాను కూడా. రాత్రిళ్ళు మేల్కొని వుంటాను మరియు నిద్రిస్తాను కూడా. నేను స్త్రీలను వివాహం కూడా చేసుకున్నాను. కనుక, ఎవరైనా నా పద్ధతికి భిన్నంగా వ్యవహరిస్తే

అతను నాలోని వాడు కాదు. *(బుఖారీ : 5063, ముస్లిం : 1401)*

ఈ హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముందుగా తన స్థాయిని గూర్చి వివరిస్తూ – తను అందరికన్నా ఎక్కువ దైవభీతిపరులని, దైవ ఉపాసకులని తెలియజేశారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన పద్ధతిని గూర్చి వివరించారు. ఆ తర్వాత – ఇక నా పద్ధతి (సున్నత్)ను వదలిపెట్టి మరొక క్రొత్త పద్ధతిని ఆచరణలో పెట్టే వారితో నాకే మాత్రం సంబంధం లేదు – అని ప్రకటించారు.

దీనిద్వారా తెలిసిందేమిటంటే – కేవలం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా నిరూపించబడిన ఆరాధనలనే ఆచరించాలి, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా నిరూపించబడని ఆచరణలను ఆరాధనగా నిర్ధారించ కూడదు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మనకు, ధర్మంలో హెచ్చుతగ్గులు చేసుకోవడానికి ఏ మాత్రం అవకాశం కల్పించలేదని మరియు ధర్మంలో క్రొత్త ఆచారాలు సృష్టించడం, దానిని ఆచరణలో పెట్టడం పూర్తిగా హరాం (నిషిద్ధం) అని గ్రహించడానికి మనకు ఈ మూడు నియమాలు చాలు.

కనుక ఈ మూడు నియమాలను ఆధారంగా చేసుకొని మేము చెప్పేదేమిటంటే – మిలాదున్నబీ సంప్రదాయానికి షరీఅత్ (ధర్మశాస్త్రం)లో ఏ విలువా లేదు మరియు ధర్మంలో ఇది అంతర్భాగం కూడా కాదు. ఒకవేళ ధర్మంలో ఇది భాగమై వుంటే, దివ్య ఖుర్ఆన్, హదీసులు మరియు సహాబాల ఆచరణలో మనకు ఆధారం తప్పకుండా లభించి వుండేది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా తన అనుచర సమాజానికి ఈదుల్ ఫిత్ర్, ఈదుల్ అజ్హా పండుగల గురించి వివరించినట్లు దీని గురించి కూడా తప్పకుండా వివరించి వుండేవారు.

## దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను శ్లాఘించడంలో మితిమీరడం

ఒకవేళ మిలాదున్నబీని మరో కోణం నుండి ఆలోచించి, అవలోకనం చేస్తే ఇది– బిద్అత్ (క్రొత్తపోకడ) అవడమేగాక, ఎన్నో చెడులను తన ఒడిలో

దాచుకొని వుంది. ఉదాహరణకు – (పరదా సంస్కారాన్ని పెడచెవిన పెట్టి) స్త్రీ పురుషులందరూ ఒకేచోట గుమిగూడడం, సంగీత వాయిద్యాల వాడకం, తబల, డోలు వాయిద్యాల తాళానికి యువకులు చేసే నృత్యం మరియు ఇలాంటి ఎన్నో చెడులు దీనిలో వున్నాయి. మరి చూడబోతే, మిలాద్ పేరుతో పుణ్య కార్యమని తలపోసి ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తారు. అంతేకాక, ఈ శిబిరాల్లో అన్నింటికన్నా పెద్ద పాపాన్ని (షిర్క్) సయితం చేస్తుండడం మనం వీక్షించవచ్చు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను శ్లాఘించడంలో మితిమీరి ప్రవర్తిస్తారు. దైవేతరులను అర్థిస్తూ వారి సహాయం కోరడం జరుగుతుంది.

'దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు అగోచర విషయాలు సయితం తెలుసు' అని బాహాటంగా ప్రకటించడం జరుగుతుంది. వాస్తవానికి ఈ గుణం కేవలం అల్లాహ్‌కు మాత్రమే ప్రత్యేకం.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ధర్మంలో మితిమీరకుండా జాగ్రత్త పడండి. గతించిన వారు దీని ద్వారానే నాశన మయ్యారు." *(నసాయి : 3057, ఇబ్నె మాజా : 3029, సహీ–అల్‌బానీ)*

అలాగే, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా కూడా ఉద్బోధించారు: క్రైస్తవులు ఇబ్నె మర్యమ్ (ఈసా అలైహిస్సలాం)ను శ్లాఘించడంలో హద్దులు మీరినట్లు మీరు నన్ను శ్లాఘించడంలో హద్దులు మీరకండి. నిశ్చయంగా నేనొక దైవదాసుణ్ణి. కనుక మీరు నన్ను అల్లాహ్ దాసుడినని, ఆయన ప్రవక్త అని మాత్రమే అనండి." *(బుఖారీ : 3445)*

## దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) విచ్చేయడం

మిలాదున్నబీ జరుపుకొనే వారు భావించేదేమిటంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వయంగా (వారి దగ్గరికి) విచ్చేస్తారు, అందుకే, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)కు సలాము పలికి స్వాగతించడానికి వారు నిలబడి వుంటారు.

వాస్తవానికి ఇదొక పెద్ద అసత్యం మరియు అజ్ఞానము. ఎందుకంటే –దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణించారు. ఆయన ఆత్మ 'ఆలా ఇల్లియ్యీన్ దారుల్ కిరామ' నందు తన ప్రభువు వద్ద వుంది. ప్రళయం రోజు

వరకు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సమాధి నుండి బయటకు రాలేరు.

దీని గురించి అల్లాహ్ మోమినూన్ సూరాలో ఇలా సెలవిచ్చాడు:

ثُمَّ إِنَّكُم بَعْدَ ذَٰلِكَ لَمَيِّتُونَ ۝ ثُمَّ إِنَّكُمْ يَوْمَ الْقِيَامَةِ تُبْعَثُونَ ۝

**"తుదపరి మీరు మరణిస్తారు. ఆ తర్వాత మీరు ప్రళయం రోజు లేపబడ తారు."** ***(మోమినూన్ : 15-16)***

అలాగే, అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ప్రళయం రోజు నేను ఆదమ్ సంతతికి నాయకుడిగా వుంటాను. అందరి కన్నా ముందుగా నా సమాధి తెరవడం జరుగుతుంది. అందరి కన్నా ముందుగా నేను సిఫారసు చేస్తాను మరియు అందరి కన్నా ముందుగా నా సిఫారసు స్వీకరించబడుతుంది."

*(ముస్లిం : 2278)*

## ధర్మంలో బిద్దతె హసన (మంచి నూతనాచారం) అస్తిత్వం వుందా?

కొంతమంది భావించేదేమిటంటే – మిలాదున్నబీ ఒక బిద్అత్ (క్రొత్త ఆచారం) అయినప్పటికీ చెడు బిద్అత్ కాదు, మంచి బిద్అత్ (బిద్దతె హసన). కానీ, మా విశ్వాసమేమిటంటే – ధర్మంలో చేర్చబడే ప్రతి క్రొత్త పోకడ కూడా చెడు బిద్అత్ మరియు మార్గభ్రష్టతే. బయటికి అది ఎంత పుణ్య కార్యంగా కనిపించినా సరే.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తను ఇచ్చే ప్రతి 'ఖుత్బా-ఏ-హాజత్' నందు ఇలా సెలవిచ్చేవారు: "దైవస్తోత్రం తర్వాత! నిశ్చయంగా అన్నింటికన్నా ఉత్తమ గ్రంథం అల్లాహ్ గ్రంథం (దివ్య ఖుర్ఆన్), అన్నింటికన్నా ఉత్తమ పద్ధతి ముహమ్మద్ (సల్లలల్లాహు అలైహి వసల్లం) పద్ధతి, అన్నింటికన్నా చెడ్డ విషయాలు ధర్మంలో క్రొత్తగా చేర్చబడే ఆచారాలు (బిద్ఆత్) మరియు ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతకు ఆనవాలు." *(ముస్లిం : 867)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే– అల్లాహ్ గ్రంథం (ఖుర్ఆన్) మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్‌ల ద్వారా ఆధారం

దొరకని, ధర్మంలో సృష్టించబడే ఏ కార్యమైనా అది అత్యంత చెడ్డ కార్యము. అది ప్రజల దృష్టిలో ఎంత మంచిదైనా సరే. ధర్మంలో సృష్టించబడ్డ ప్రతి క్రొత్త కార్యమూ బిద్అత్ మరియు ప్రతి బిద్అత్ మార్గభ్రష్టత.

కొంచెం ఆలోచించండి! ఒకవేళ మంచి కార్యం పేరుతో ధర్మంలో ఏదైనా క్రొత్త ఆచరణను సృష్టించడం ధర్మయుక్తమై వుంటే – మరి రాత్రిళ్ళు జాగారం చేస్తానని, ఎల్లప్పుడూ ఉపవాసముంటానని, ఎప్పుడూ స్త్రీలను వివాహమాడనని గట్టిగా సంకల్పించుకున్న ఆ ముగ్గురు వ్యక్తుల్ని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎందుకు మందలించి వుండేవారు? వారు సంకల్పించుకున్నది మంచి కార్యాలనుద్దేశించి కాదా? ఆ ముగ్గురిలో ఎవరైనా చెడు కార్యం తలంపు కలిగి వున్నారా?

మరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారిని గట్టిగా ఎందుకు మందలించారు? నిస్సందేహంగా వారు మంచి కార్యాల నిమిత్తమే సంకల్పించు కున్నారు. కానీ, వాటిని ఆచరించే పద్ధతులు, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పద్ధతులకు భిన్నంగా వున్నాయి, తద్వారా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మించిపోయే ప్రయత్నం జరుగుతూ వుంది. దీని ద్వారా, రుజువైనదేమిటంటే – 'బిద్దతె హసన' లాంటి ఏ విషయమూ ఇస్లాంలో లేదు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పద్ధతి (సున్నత్) ద్వారా ఆధారం లభించనంత వరకు (బయటికి కనిపించే) ఏ మంచి కార్యమైనా మంచిదని పిలవబడదు మరియు ధర్మంలో భాగం కూడా కాజాలదు.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఎవరైనా మా ధర్మంలో లేని క్రొత్త ఆచరణను ధర్మంలో ప్రవేశపెడితే అది తిరస్కరించబడుతుంది."

*(బుఖారీ : 2697, ముస్లిం : 1718)*

ముస్లిం లోని మరొక ఉల్లేఖనంలో పదాలు ఇలా వున్నాయి: "ఎవరైనా మేము ఆజ్ఞాపించని క్రొత్త ఆచరణను గనక పాటిస్తే అది తిరస్కరించబడుతుంది."

ఈ హదీసు ద్వారా గూడా – ధర్మంలో సృష్టించబడే ప్రతి క్రొత్త ఆచరణ, పద్ధతి తిరస్కరించబడతాయి, అవి ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకార యోగ్యం కావు – అన్న విషయాలు బోధపడతాయి.

ఓసారి అబూ మూసా అష్అరీ (రజి అల్లాహు అన్హు), అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) ఇంటికి విచ్చేసి ఆయనతో : 'నేనిప్పుడే మస్జిద్‌లో ఒక విషయం చూశాను, దానిని నేను సరైనదిగా భావించడంలేదు. వాస్తవానికి, అల్‌హమ్దులిల్లాహ్ నేను మంచినే చూశాను' అని అన్నారు.

దీనిపై ఆయన– మీరు చూసిందేమిటి? అని అడిగారు.

అబూ మూసా (రజి అల్లాహు అన్హు) జవాబిస్తూ – మీరు స్వయంగా మస్జిద్‌కు వెళితే మీకే తెలుస్తుంది. నేను మస్జిద్‌లో కొందరిని చూశాను. వారు వలాయాకారాల్లో కూర్చొని నమాజు కోసం నిరీక్షిస్తున్నారు. వారి చేతుల్లో కంకర్రాళ్ళు వున్నాయి. ప్రతి వలయంలో ఓ వ్యక్తి, మిగతా వారితో, మీరు 100 సార్లు అల్లాహు అక్బర్ పలకండి అని అంటే వారు 100 సార్లు అల్లాహు అక్బర్ అని పఠిస్తారు. తదుపరి అతను వారితో, మీరు 100 సార్లు లా ఇలాహ ఇల్లల్లాహ్ పలకండి అని అంటే వారు 100 సార్లు లా ఇలాహ ఇల్లల్లాహ్ పఠిస్తారు. ఆ తరువాత అతను, ఇప్పుడు మీరు 100 సార్లు సుబహానల్లాహ్ పలకండి అని అంటే వారు 100 సార్లు సుబహానల్లాహ్ అని పఠిస్తారు! – అని వివరించారు.

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) ఆయనతో – ఇదంతా చూసి మీరు వారితో ఏమన్నారని అడిగారు.

ఆయన ఇలా జవాబిచ్చారు : ముందుగా మీ అభిప్రాయం తెలుసుకుందామని నేను వారితో ఏమీ అనలేదు.

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) ఆయనతో –(ఈ కంకర్రాళ్ళపై) మీరు మీ పాపాలను లెక్కించండి (పుణ్యాలు కాదు), మీ పుణ్యాలేవీ వృధా కావని నేను గ్యారంటీ ఇస్తాను – అని మీరు వారికి ఆజ్ఞాపించలేదా? అనడిగారు.

తదుపరి, అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) మస్జిద్‌కు విచ్చేసి, వలయాకారంలో వున్న ఒక సమూహం దగ్గరికెళ్ళి – మీరు చేస్తున్నదేమిటి? అని అడిగారు. వారు ఆయనతో – ఓ అబూ అబ్దుర్రహ్మాన్! ఇవి కంకర్రాళ్ళు, వీటి ద్వారా మేము అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహ్ మరియు సుబ్‌హానల్లాహ్ తస్బీహ్‌లను లెక్కిస్తున్నాం! అని జవాబిచ్చారు.

అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి అల్లాహుఅన్హు) వారితో– మీరు వీటిపై మీ పాపాలను లెక్కించండి, మీ పుణ్యాలేవీ వృధా కావని నేను గ్యారంటీ ఇస్తాను, అని పలికి, తదుపరి ఇలా సెలవిచ్చారు: ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజమా! మీ పాడుగాను! ఇంత త్వరగా మార్గభ్రష్టత వైపునకు నడవడం మొదలు పెట్టారా? ఇంకా మీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సహచరులు పెద్ద సంఖ్యలో (మీ మధ్యే) వున్నారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బట్టలు కూడా పాతబడలేదు, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) (వాడిన) పాత్రలు కూడా విరగలేదు.

నా ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆ అల్లాహ్ సాక్షిగా! మీరు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మార్గం కన్నా ఉత్తమమైన మార్గం పైన వున్నారని అనుకొంటున్నారా? లేదా మార్గభ్రష్టత ద్వారాలు తెరుస్తున్నారా?

దీనిపై వారు – ఓ అబూ అబ్దుర్రహ్మాన్! అల్లాహ్ సాక్షి! మేము దీని (ఈ ఆచరణ) ద్వారా మంచినే కాంక్షించాం అని విన్నవించుకోగా, ఆయన వారితో– ఎంతోమంది మంచిని కాంక్షిస్తారు, కానీ దానిని పొందలేరు, అని జవాబిచ్చారు. *(సిల్ సిలహ్ అహదీస్ అస్సహీహ: 2005)*

కొంచెం ఆలోచించండి!

తస్బీహ్‌లను పఠించడం చెడు ఆచరణనా? నిశ్చయంగా కాదు. అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి అల్లాహు అన్హు) కూడా వారిని తస్బీహ్‌లను పఠించినందుకు మందలించలేదు. ఆయన మాటల్లో కోపానికి, కరకు దనానికి కారణం, వారు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్, సహాబాల పద్ధతికి భిన్నంగా తస్బీహ్‌లను పఠిస్తుండడం. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు సహాబాలు కంకర్రాళ్ళతో కాక తమ కుడిచేతి వ్రేళ్ళతో తస్బీహ్‌లు లెక్కించేవారు. అంతేగాక, వారు వలయాకారంలో కూర్చొని సామూహికంగా కాక ఒక్కొక్కరూ వ్యక్తిగతంగా పఠించేవారు.

కానీ, వీరి ఆచరణ (వలయాకారంలో కూర్చొని తస్బీహ్‌లు లెక్కించడం) ప్రజల దృష్టిలో సత్కార్యంగా కనిపించినప్పటికీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్‌కు విరుద్ధంగా వుంది. అందుకే, అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి అల్లాహు అన్హు) వారితో కరకుగా వ్యవహరించారు. కొత్త ఆచరణ

అయితేనేం? మంచిదేగా అని ఆయన అనలేదు, పైగా దానిని మార్గభ్రష్టత ద్వారంతో పోల్చారు.

దీని ద్వారా రూఢీ అయిన విషయమేమింటే – ధర్మంలో ఏ విధమైన 'బిద్దతె హసన' లేదు. ప్రతి బిద్అత్ కూడా చెడ్డదే మరియు మార్గభ్రష్టతే.

## మిలాదున్నబీ (సల్లల్లాహు అలైహి వసల్లం) జరుపుకునే వారి కొన్ని ఆధారాలు మరియు వాటి జవాబులు

మిలాద్‌ను నిర్వహించేవారు సాధారణంగా 5 ఆధారాలు ఇస్తూ వుంటారు.

1) మిలాద్ అనేది ఒక వార్షిక జ్ఞాపిక. దీనిని జరుపుకోవడం ద్వారా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మీద ప్రేమ పెరుగుతుంది.

దీని సమాధానం ఏమిటంటే – ప్రతి రోజూ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను పలుమార్లు గుర్తుకు తెచ్చుకోని ముస్లిమెవరైనా వుంటే, అతను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను గుర్తు చేసుకుని ఆయనపై వున్న ప్రేమను వ్యక్తం చేసుకోవడానికి గాను ఇలాంటి వార్షిక, నెలవారీ జ్ఞాపిక సదస్సులు నిర్వహించవచ్చు. కానీ, ఒక ముస్లిం, రేయింబవళ్ళలో ఎన్నోసార్లు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను జ్ఞాపకం చేసుకుని, ఆయనపై దరూద్, సలాములు పంపుతూ వుంటే – అలాంటి వ్యక్తికి ఇదే ఉద్దేశ్యం కొరకు వార్షిక సదస్సులు నిర్వహించడం అనేది ఒక అర్థరహిత విషయం కాదా?

2) మిలాద్‌లో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) శరీరాకృతి, శీల సద్గుణాలు మరియు ఆయన వంశం గురించి తగినంత జ్ఞానం సముపార్జించు కోవచ్చు.

ఈ ఆధారానికి జవాబు ఏమిటంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సద్గుణాలు మరియు శ్రేష్టతలను సంవత్సరానికి ఒకసారి వింటే సరిపోదు. ఎందుకంటే, ఆయన జీవిత చరిత్ర ఎలాంటిదంటే – దాని గురించి సంవత్సరం పొడుగునా వింటూ, నేర్చుకుంటూ వుండడం తప్పనిసరి మరియు వదిలిపెట్టలేని విషయమూను.

3) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పుట్టుకపై సంతోషం వ్యక్తం చేయడం అనేది విశ్వాసానికి సూచన.

ఈ ఆధారానికి అసలు అర్థమే లేదు. ఎందుకంటే – ఇక్కడ ఉదయించే ప్రశ్న ఏమిటంటే – సంతోషానికి కారణం దైవప్రవక్తా? లేక ఆయన జన్మించిన దినమా?

ఒకవేళ సంతోషానికి కారణం ఆయనే (సల్లల్లాహు అలైహి వ సల్లం) అయితే, ఆ సంతోషం ఎల్లప్పుడూ వుండాలి గాని ఒక రోజు కోసం ప్రత్యేకం కాకూడదు. ఒకవేళ సంతోషమనేది ఆ దినం కోసమైతే, ఆయన మరణించింది కూడా అదే రోజు! మరి తమ ప్రియతమ వ్యక్తి మరణంపై సంబరం జరుపుకోవడం ఏ తెలివిని సూచిస్తుంది?

4) మీలాద్ రోజు ప్రజలకు అన్నం పెడతారు, దీనిలో ఎంతో పుణ్యం వుంది.

ఈ ఆధారమైతే అన్నింటికన్నా బలహీనమైనది. ఎందుకంటే – అన్నం పెట్టడాన్ని ప్రోత్సహించేది పూర్తి సంవత్సరానికి గాని, ఒక ప్రత్యేక రోజు కోసం కాదు.

5) మీలాద్ లో దివ్య ఖుర్ఆన్ను పఠించడం జరుగుతుంది మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పై దరూద్, సలాములు పంపడం జరుగుతుంది.

ఈ ఆధారం కూడా పై నాలుగు ఆధారాల లాగా అసత్యమే. ఎందుకంటే – దివ్య ఖుర్ఆన్ను పఠించడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)పై దరూద్, సలాములు పంపడానికి ఒకచోట సమావేశం కావడం–స్వయానా ఇదే ఒక బిద్అత్ (కొత్త ఆచరణ). అలాగే పాటల లాగా రాగాలు తీస్తూ దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం)ను శ్లాఘించే కవిత్వాలు పఠించడం, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను శ్లాఘించడంలో మితిమీరడం కూడా తప్పే.

ఈ ఐదు ఆధారాలు ఈ కారణం వల్ల కూడా సరిపోవు. అదేమిటంటే – ఒకవేళ వీటిని సరైనవని స్వీకరిస్తే, అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా (అల్లాహ్ శరణు) తప్పిదం జరిగిపోయింది మరియు ఆయన తన జన్మదినం నాడు ఈ విషయాల వైపునకు (ప్రజల) ధ్యానాన్ని మరల్చలేదు. కనుక, ఆ లోటును ఈ మిలాద్ జరుపుకొనే వారు భర్తీ చేస్తున్నారన్న విషయం నిర్ధారించబడుతుంది!!

## మీలాద్ ను సరైనదని నిర్ధారించే వారి కొన్ని బలహీన సందేహాలు

1) ఒక సంఘటన ఉల్లేఖించబడుతూ వుంటుంది: దురదృష్టవంతుడైన అబూ లహబ్‌ను కలలో చూడడం జరిగింది. అతని యోగక్షేమాలను గూర్చి విచారించగా అతను–అగ్ని శిక్షలో పడి వున్నాను, అయినప్పటికీ ప్రతి సోమవారం, శిక్ష కొంచెం తగ్గించబడుతూ వుంటుంది మరియు తన రెండు వ్రేళ్ళ మధ్య నుండి వ్రేళ్ళ పైభాగాన్ని చూపుతూ, తను ఇంత నీళ్ళను పీల్చుకుంటానని చెప్పి, దానికి కారణం – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జనన శుభవార్తను తన బానిసరాలు 'సోయెబా' అందించినప్పుడు తను ఆనందంలో ఆ బానిసరాలికి స్వేచ్ఛను ప్రసాదించడం అని అన్నాడు.

దీని సమాధానం ఏమిటంటే –

1) ఒకరి కల ద్వారా షరీయత్తు (ధర్మశాస్త్రం) ఆజ్ఞ నిర్ధారించబడదు.

2) రెండవది – ఈ ఉల్లేఖనం ముర్సల్ (హదీసు పరంపరలో దైవప్రవక్త, తాబయీల మధ్య సహాబీ పేరు లేని ఉల్లేఖనం) అయిన కారణంగా దీనిని ఆధారంగా స్వీకరించలేం.

3) మూడవది – అవిశ్వాసి (కాఫిర్) గనక అవిశ్వాస స్థితిలో మరణిస్తే, అతని ఏ మంచి కార్యానికైనా పుణ్యఫలం లభించదు అన్న విషయంలో సలఫ్ (మొదటి తరాల సజ్జనులు) మరియు ఖలఫ్ (తర్వాతి తరాల సజ్జనులు)ల మధ్య ఏకాభిప్రాయం వుంది.

4) నాల్గవది – అబూ లహబ్ సంతోషమనేది సహజ సిద్ధంగా కలిగిన సంతోషం, ఆరాధనా పరమైనది కాదు మరియు సంతోషమనేది అల్లాహ్ కొరకు కాకపోతే దానికి పుణ్యం లభించదు.

5) ఐదవది – ఒక విశ్వాసి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జననంపై ఎల్లప్పుడూ సంతోషంగా వుండాలి. దాని కోసం కేవలం ఆయన జన్మ దినాన్ని ప్రత్యేకించుకోవడం సరైనది కాదు.

2) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అఖీఖా స్వయంగా చేసుకున్నారని ఉల్లేఖించబడుతుంది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తాతగారు కూడా ఆయన అఖీఖా చేశారు మరియు అఖీఖా రెండు సార్లు

చేసుకోరు కనుక వాస్తవానికి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన జననానికి గాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపడానికే అఖీఖా చేసుకున్నారు. అందుకే ఆయన అనుచర సమాజం కూడా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జన్మదినం నాడు ప్రత్యేకంగా భోజనం ఏర్పాట్లు చేయాలి.

దీని జవాబు ఏమిటంటే–

1) ఇదొక బలహీన ఉల్లేఖనం మరియు ఇమామ్ నవవీ (రహిమహుల్లాహ్) దీనిని అసత్యమైనదిగా ఖరారు చేశారు.

*(మజ్మూఅ లిన్నవవీ – 8వ సంపుటం – 431 పేజీ)*

2) ఒకవేళ దీనిని ప్రామాణికమైనదని ఒప్పుకున్నా – దీనిలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అఖీఖాను తన జననానికి కృతజ్ఞతగా చేశారని ఎక్కడుంది? ఇది కేవలం ఒక అనుమానమే మరియు అనుమానానికి (సత్యం ముందు) ఏ మాత్రం విలువ వుండదు.

**"సత్యం ముందు అనుమానాలు ఏ మాత్రం పనికిరావు." (నజ్మ్ : 28)**

3) ఇక దీని మూడవ జవాబు ఏమిటంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కేవలం ఒక్కసారే అఖీఖా చేసుకున్నారు, ప్రతి సంవత్సరమూ చేయలేదు కదా! మరి మీలాద్ జరుపుకునే వాళ్ళు ప్రతి యేటా దీనిని (మిలాద్)ను జరుపుకుంటున్నారు!

3) సహీ (ప్రామాణిక) హదీసులో ఇలా వుంది – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆషూరా రోజు ఉపవాసం వుండి, దాని గురించి ఆజ్ఞాపించారు కూడా. దాని గురించి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అడిగినప్పుడు, ఆయన ఇలా వివరించారు: ఇదొక మంచి రోజు, ఈ రోజు అల్లాహ్, మూసా (అలైహిస్సలాం) మరియు బనీ ఇస్రాయీల్‌కు ఫిరౌన్ బారి నుండి రక్షించాడు..... (అసంపూర్ణ హదీస్). మూసా (అలైహిస్సలాం) మరియు బనీ ఇస్రాయీల్‌ను ఫిరౌన్ బారి నుండి దొరికిన ముక్తికి కృతజ్ఞతగా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆ రోజు ఉపవాసముండి దాని గురించి ఆజ్ఞాపించారు. మరి మేము కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జన్మదినాన్ని ఉపవాస దినం కాక, తినే త్రాగే, సంబరాలు జరుపుకునే దినంగా చేసుకుందాం.

ఎంత విచిత్రమైన మాట ఇది?

అసలీ రోజు మనం కూడా (ప్రవక్తలాగే) ఉపవాసముండి, భోజన ఏర్పాట్లు చేయడాన్ని, డప్పుల ద్వారా సంబరాలు జరుపుకోవడాన్ని త్యజించాల్సింది. అలాంటిది, సంబరాలు జరుపుకొని భోజన ఏర్పాట్లు చేసి అల్లాహ్ కృతజ్ఞతలు తెలుపుతారా? (అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలిపే పద్ధతి ఇదేనా?)

4) సహీ హదీసులో ఇలా వుంది – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి సోమవారం, గురువారం నాడు ఉపవాసముండి దాని కారణాన్ని ఇలా వివరించారు – సోమవారం నాడే నేను జన్మించాను మరియు ఈ రోజే ప్రవక్తగా నియమించబడ్డాను.... (అసంపూర్ణ హదీస్)

దీని సమాధానం ఏమిటంటే –

1) తన జననాన్ని పురస్కరించుకొని స్వయానా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అవలంబించిన కృతజ్ఞతా విధానాన్నే మనం కూడా అవలం బించాలి.

2) రెండవది – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన జన్మదినమైన రబీఉల్ అవ్వల్ 12వ తారీఖు నాడు ఉపవాసముండలేదు, ప్రతి నెలా నాలుగైదు సార్లు విచ్చేసే సోమవారం నాడు వున్నారు. ఈ కారణంగా – రబీ ఉల్ అవ్వల్ 12వ తారీఖును ఒక ఆచరణ నిమిత్తం ప్రత్యేకించుకుని ప్రతివారం విచ్చేసే సోమవారాన్ని వదిలేయడం వాస్తవానికి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను సరిదిద్దడమే అవుతుంది. దీనిని ఏ ముస్లిమయినా ఊహించగలడా?

3) మూడవది – మరి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తన జననానికి గాను కృతజ్ఞతా పూర్వకంగా ఉపవాసం పాటించినప్పుడు, దానితోపాటు – మిలాదీలలో కానవచ్చే జన సమూహాల సమీకరణ, కవిత్వం, పాటల కచేరీలు, ప్రత్యేక వంటకాల ఏర్పాట్లు .....– లాంటివి కూడా చేశారా?

## ఇస్లామీయ పండుగలు

మిలాద్ జరుపుకొనే వాళ్ళు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుభ పుట్టుకను 'పర్వదినం'గా ఖరారు చేస్తారు. కానీ ఈ అనుచర సమాజపు మొదటి తరం నుండే ముస్లిములలో ప్రతి యేటా కేవలం రెండే పండుగలు చెలామణిలో వున్నాయి.

ఈ విషయాన్నే అనస్ (రజి అల్లాహు అన్హు) ఇలా ఉల్లేఖించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనాకు విచ్చేసినపుడు అక్కడి ప్రజలకు సంవత్సరంలో రెండు రోజులు (పండుగల నిమిత్తం) నిర్ధారించబడి వుండేవి. ఆ రెండు రోజుల్లో వాళ్ళు ఆడుతూ (సంబరాలు జరుపుకొంటూ) వుండేవారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారితో – ఈ రోజులు ఎలాంటివి? అని అడిగారు. వారు –అజ్ఞాన కాలం నుండి మేమీ రోజుల్లో ఆడుతూ, సంబరాలు జరుపుకొంటూ వస్తున్నాం అని జవాబిచ్చారు. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు – అల్లాహ్ మీకు ఈ రెండు దినాలకు బదులుగా ఎంతో ఉన్నతమైన మరో రెండు దినాలు అనుగ్రహించాడు. అవి 'ఈద్ ఉల్ ఫిత్ర్' మరియు 'ఈదుల్ అజ్హా ' దినాలు.

*(నసాయి : 1556, సహీ – అల్‌బానీ)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే – ఇస్లామీయ పండుగల లాగా జరుపుకోవడానికి షరీయత్తులో గల పండుగల సంఖ్య కేవలం రెండు మాత్రమే. అవి అల్లాహ్ ద్వారా నిర్ధారించబడ్డవి. వీటితోపాటు శుక్రవారాన్ని కూడా 'వారపు పండుగ'గా ఖరారు చేయడం జరిగింది.

ఈ విషయాన్నే ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా ఇలా ఉల్లేఖించారు: నిశ్చయంగా ఈ రోజు పండుగ దినం. అల్లాహ్ దీనిని కేవలం ముస్లిముల కొరకు (పండుగ దినంగా) చేశాడు. కనుక, జుమా నమాజు కొరకు వచ్చే వ్యక్తి స్నానం చేయాలి మరియు సువాసన వుంటే దాన్ని పూసుకొని మరీ రావాలి. మిస్వాక్ చేయడం మీకు తప్పనిసరి.

*(ఇబ్నె మాజా : 1098, సహీ – అల్‌బానీ)*

ఆఖరిగా మేము అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే – ఆయన మనల్ని సత్యాన్ని గ్రహించి దాని కనుగుణంగా ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

## రెండవ ఖుత్బా

ప్రియ శ్రోతలారా!

ఖుర్ఆన్, హదీసులు మరియు సహాబాల ఆచరణ ద్వారా ఆధారం లభించని క్రొత్త ఆచరణలను ధర్మంలో చేర్చడం ఎంతో ప్రమాదకరమైన విషయం.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఓసారి నిలబడి చేసిన హితబోధలో ఇలా కూడా ఉద్బోధించారు: "జాగ్రత్త! నా అనుచర సమాజానికి చెందిన కొందరిని ప్రళయం రోజు తీసుకురావడం జరుగుతుంది. వారిని ఎడమ వైపునకు (నరకాగ్నిలోకి) నెట్టివేయడం జరుగుతుంది. నేనప్పుడు – ఓ నా ప్రభువా! వారు నా (అనుచర సమాజం) వారే అని అంటాను. అప్పుడు నాతో ఇలా అనబడుతుంది – మీ (మరణం) తర్వాత వీళ్ళు ఏ యే క్రొత్త ఆచరణలను ధర్మంలో ప్రవేశపెట్టారో మీకు తెలియదు!" *(బుఖారీ : 6526, ముస్లిం : 2860)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: నా అనుయాయుల్లో కొందరిని (ప్రళయం నాడు) (కౌసర్) సరస్సు వద్దకు ఖచ్చితంగా తేవడం జరుగుతుంది. నేను వారిని గుర్తు పట్టేసరికి వారిని నా నుండి దూరంగా నెట్టేయడం జరుగుతుంది. నేనప్పుడు – వీరు నా అనుయాయులే అని అంటాను. అప్పుడు నాతో – మీ (మరణం) అనంతరం ఏయే క్రొత్త ఆచారాలను వీరు ధర్మంలో ప్రవేశపెట్టారో మీకు తెలియదు అని చెప్పబడుతుంది. *(బుఖారీ :6582)*

దీని ద్వారా రూఢీ అయిన విషయం ఏమిటంటే– ధర్మంలో క్రొత్త ఆచారాలు (బిద్అత్) ప్రవేశపెట్టే వారిని ప్రళయం నాడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చేతుల మీదుగా కౌసర్ సరస్సు నీరు త్రాగడం నుండి దూరంగా వుంచడం జరుగుతుంది. అందుకే ప్రతి ముస్లింపై విధిగా వున్న విషయమేమిటంటే – తను క్రొత్త ఆచారాలను (బిద్అత్) విడనాడి, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్‌ను అనుసరించాలి. సంతోషం, దుఃఖం – ఈ రెండు సమయాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్‌ను త్యజించకూడదు. దీనిలోనే ఎంతో మేలు, శుభం ఉంది. అల్లాహ్ మనందరికీ సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

### అనుచర సమాజం (ఉమ్మత్)పై

# దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హక్కులు

### ఖుత్బా లోని ముఖ్యాంశాలు:

తన అనుచర సమాజం (ఉమ్మత్)పై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హక్కులు:

1) అల్లాహ్ దాసుడిగా మరియు ప్రవక్తగా విశ్వసించడం.

2) తగిన విధంగా గౌరవించడం.

3) అల్లాహ్ తర్వాత, అత్యధికంగా ప్రేమించడం.

4) ఆదర్శాలను, సద్గుణాలను ఆచరించడం.

5) విధేయత చూపడం.

6) అభిప్రాయ భేదాలలో న్యాయనిర్ణేతగా స్వీకరించడం.

7) ఖుర్ఆన్ మరియు హదీసులకనుగుణంగా ఆచరించడం.

8) అత్యధికంగా దరూద్ పఠించడం.

గడిచిన జుమా ఖుత్బాలో, మేము ప్రవక్తల నాయకుడైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) స్థాయి, మహత్యం, అద్భుతాలు మరియు ఆయన ప్రత్యేకతలలో కొన్నింటిని గూర్చి వివరించాము. మరి ఇన్ని ప్రత్యేకతలు కలిగిన ప్రవక్తకు తన అనుచర సమాజం (ఉమ్మత్)పై ఉన్న హక్కులేంటి? రండి, ఖురాను మరియు హదీసుల వెలుగులో ఆ హక్కుల గురించి నేటి జుమా ఖుత్బాలో తెలుసుకుందాం.

### (1) అల్లాహ్ దాసుడిగా మరియు ప్రవక్తగా విశ్వసించడం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు తన అనుచర సమాజంపై వున్న మొట్టమొదటి హక్కు ఏమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అల్లాహ్ దాసుడిగా మరియు ఆఖరి ప్రవక్తగా విశ్వసించడం. ఈ విషయాన్నే ప్రతి ముస్లిం 'అల్లాహ్ తప్ప మరొక నిజమైన ఆరాధ్యుడెవ్వడూ లేడు మరియు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయన దాసులు మరియు ప్రవక్త' అని సాక్ష్యమిస్తూ స్వీకరిస్తాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَاٰمِنُوْا بِاللّٰهِ وَ رَسُوْلِهٖ وَ النُّوْرِ الَّذِيْۤ اَنْزَلْنَا ؕ وَاللّٰهُ بِمَا تَعْمَلُوْنَ خَبِيْرٌ ۝8

**"కాబట్టి మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను, మేము అవతరింపజేసిన జ్యోతి (ఖురాను)ని విశ్వసించండి. మీరు చేసే ప్రతి పనినీ అల్లాహ్ కనిపెట్టుకుని ఉన్నాడు"** ***(తగాబున్ : 8)***

అలాగే, ఇలా కూడా సెలవిచ్చాడు :

قُلْ يٰۤاَيُّهَا النَّاسُ اِنِّيْ رَسُوْلُ اللّٰهِ اِلَيْكُمْ جَمِيْعَا ا۟لَّذِيْ لَهٗ مُلْكُ السَّمٰوٰتِ وَالْاَرْضِ ۚ
لَاۤ اِلٰهَ اِلَّا هُوَ يُحْيٖ وَيُمِيْتُ ۪ فَاٰمِنُوْا بِاللّٰهِ وَ رَسُوْلِهِ النَّبِيِّ الْاُمِّيِّ الَّذِيْ يُؤْمِنُ
بِاللّٰهِ وَكَلِمٰتِهٖ وَاتَّبِعُوْهُ لَعَلَّكُمْ تَهْتَدُوْنَ ۝158

**"(ఓ ముహమ్మద్!) వారికి చెప్పు - ప్రజలారా! నేను భూమ్యాకాశాల సామ్రాజ్యానికి అధిపతి అయిన అల్లాహ్ తరఫున మీ అందరి వద్దకు పంపబడిన ప్రవక్తను. ఆయన తప్ప మరో ఆరాధ్యుడు లేడు. ఆయనే బ్రతికించేవాడు, ఆయనే మరణాన్ని ఇచ్చేవాడు. కనుక అల్లాహ్‌ను విశ్వసించండి. సందేశహరుడు, నిరక్షరాసి అయిన ఆయన ప్రవక్తను గూడా విశ్వసించండి - ఆ ప్రవక్త అల్లాహ్‌ను, ఆయన ఆదేశాలను విశ్వసిస్తాడు. అతణ్ణి అనుసరించండి. తద్వారా మీరు సన్మార్గం పొందుతారు".** ***(ఆరాఫ్ : 158)***

కనుక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దౌత్యాన్ని విశ్వసించి, ఆయన తెచ్చిన ధర్మాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించడం తప్పనిసరి. దీని పైనే ప్రతి వ్యక్తి సాఫల్యత, ముక్తి ఆధారపడి ఉన్నాయి. ఇక్కడ గుర్తుంచుకోవలసిన మరో విషయమేమిటంటే - దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తనను చూసి విశ్వసించిన వారికి ఒక్కసారి మరియు తనను చూడకుండా విశ్వసించిన వారికి ఏడు సార్లు శుభవార్తను వినిపించారు.

దీని గురించి అబూ ఉమామ (రజి అల్లాహు అన్హు), దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ఇలా ఉల్లేఖించారు: "నన్ను చూసి విశ్వసించిన వారికి శుభవార్త వుంది. అలాగే నన్ను చూడకుండా విశ్వసించిన వారికి ఏడు సార్లు శుభవార్త వుంది." *(అస్సహీహ లిల్ అల్‌బానీ : 1241)*

ఇక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)నూ, ఆయన షరీయత్తు (ధర్మ శాస్త్రం)నూ విశ్వసించని వ్యక్తి నిశ్చయంగా నరకవాసి.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు - ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆయన (అల్లాహ్) సాక్షిగా! ఈ అనుచర సమాజపు వ్యక్తి యూదుడైనా, క్రైస్తవుడైనా నా గురించి విని, తదుపరి నాకివ్వబడిన షరీయత్తును విశ్వసించకుండా చనిపోతే అతను ఖచ్చితంగా నరకవాసుల్లో ఒకడవుతాడు." *(ముస్లిం: 153)*

ఇక్కడ తెలియాల్సిన మరో విషయం ఏమిటంటే - ప్రియతమ దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మేము అల్లాహ్ దాసులు అని ఎందుకంటామంటే - స్వయానా అల్లాహ్ యే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తన దాసుడు అని ఖరారు చేశాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

سُبْحٰنَ الَّذِيْٓ اَسْرٰى بِعَبْدِهٖ لَيْلًا مِّنَ الْمَسْجِدِ الْحَرَامِ اِلَى الْمَسْجِدِ الْاَقْصَا

**"తన దాసుణ్ని రాత్రికి రాత్రే మస్జిదె హరామ్ నుండి మస్జిదె అఖ్సా వరకు తీసుకు పోయిన అల్లాహ్ పరిశుద్ధుడు"** ***(బనీ ఇస్రాయీల్ : 1)***

స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా తన గురించి ఇలాగే సెలవిచ్చారు: "నేనొక అల్లాహ్ దాసుణ్ణి. కనుక మీరు కూడా నన్ను అల్లాహ్ దాసులు మరియు ఆయన ప్రవక్త అని మాత్రమే అనండి." *(బుఖారీ)*

కనుక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు అల్లాహ్ ఇచ్చిన స్థాయి మరియు స్వయానా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన గురించి చెప్పుకున్న స్థాయినే మనం కూడా ఇవ్వాల్సి ఉంటుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను 'అల్లాహ్ దాసులు' అని నమ్మినప్పుడే ఆయన మరియు అల్లాహ్‌ల మధ్య గల తేడా బహిర్గతమవుతుంది. తద్వారా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను శ్లాఘించడంలో మితిమీరి ఆయనను అల్లాహ్ స్థాయికి చేర్చే వారిని వ్యతిరేకించినట్లు కూడా అవుతుంది.

## (2) తగిన విధంగా గౌరవించడం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఈ ఉమ్మత్‌పై గల రెండవ హక్కు ఏమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తగు విధంగా ఆదరించాలి మరియు హృదయ పూర్వకంగా గౌరవించాలి. అందుకే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) బ్రతికున్నప్పుడు సహాబాలకు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను పేరు పెట్టి పిలవడం నుండి, ఆయన సమక్షంలో బిగ్గరగా మాట్లాడుకోవడం గురించి గట్టిగా వారించడం జరిగింది మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తగు విధంగా గౌరవించాలని గట్టిగా తాకీదు చేయబడింది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

لَا تَجْعَلُوْا دُعَآءَ الرَّسُوْلِ بَيْنَكُمْ كَدُعَآءِ بَعْضِكُمْ بَعْضًا ط

**"మీరు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)పిలుపును, మీలో ఒండొకరిని పిలుచుకునే మామూలు పిలుపులా అనుకోకండి"**

***(నూర్: 63)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

يَآيُّهَا الَّذِيْنَ اٰمَنُوْا لَا تَرْفَعُوْٓا اَصْوَاتَكُمْ فَوْقَ صَوْتِ النَّبِيِّ وَلَا تَجْهَرُوْا لَهٗ
بِالْقَوْلِ كَجَهْرِ بَعْضِكُمْ لِبَعْضٍ اَنْ تَحْبَطَ اَعْمَالُكُمْ وَاَنْتُمْ لَا تَشْعُرُوْنَ ②

**"ఓ విశ్వాసులారా! మీ కంఠ స్వరాలను ప్రవక్త కంఠ స్వరం కంటే పైన (హెచ్చుగా) ఉంచకండి. మీరు పరస్పరం బిగ్గరగా మాట్లాడుకొనే విధంగా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో బిగ్గరగా మాట్లాడకండి. దీని వల్ల మీ కర్మలన్నీ వ్యర్థమై పోవచ్చు. ఆ సంగతి మీకు తెలియను కూడా తెలియదు"** ***(హుజురాత్ : 2)***

ఈ ఆయత్ అవతరించిన సందర్భాన్ని గురించి అబ్దుల్లా బిన్ జుబైర్ (రజి అల్లాహు అన్హు) ఇలా తెలియజేశారు: బనూ తమీమ్ వర్గానికి చెందిన ఒక సమూహము ఓసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు విచ్చేసినప్పుడు, అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో – మీరు ఖాఖ బిన్ మాబద్ (రజి అల్లాహు అన్హు)ను వీరికి

అమీర్ (నాయకుడు)గా నియమించండని విన్నవించుకోగా, ఉమర్ (రజి అల్లాహు అన్హు) – వద్దు, మీరు అఖ్రా బిన్ హాబిస్ (రజి అల్లాహు అన్హు)ను అమీర్‌గా నియమిస్తే బాగుంటుందని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో విన్నవించుకున్నారు. దీనిపై, అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) మాట్లాడుతూ – మీరెప్పుడూ నన్ను వ్యతిరేకిస్తూనే వుంటారు అని అన్నారు.

ఉమర్ (రజి అల్లాహు అన్హు) జవాబిస్తూ – నా ఉద్దేశ్యం మిమ్మల్ని వ్యతిరేకించడం కాదు అని అన్నారు. తదుపరి ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి ఇద్దరి కంఠస్వరాలు పెరిగాయి. ఈ సందర్భంలోనే అల్లాహ్ “ఓ విశ్వాసులారా! మీ కంఠ స్వరాలను ప్రవక్త కంఠ స్వరం కంటే పైన (హెచ్చుగా) ఉంచకండి....” అన్న ఆయత్‌ను అవతరింపజేశాడు.

ఇబ్నె జుబైర్ (రజి అల్లాహు అన్హు) కథనం – ఈ ఆయత్ అవతరించిన తర్వాత ఉమర్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో ఎంత తగ్గు స్వరంలో మాట్లాడే వారంటే, స్వయానా దైవ ప్రవక్తే (ఆయన మాటలు వినబడని కారణంగా) ఆయనను తిరిగి అడిగి తెలుసుకునే వారు. *(బుఖారీ : 4845, 4847)*

సాబిత్ బిన్ ఖైస్ (రజి అల్లాహు అన్హు) గొంతు సహజ సిద్ధంగా హెచ్చు స్వరంతో వుండేది. దీని గురించి అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) ఇలా తెలియజేశారు: ఈ ఆయతు (హుజురాత్ : 2) అవతరించిన తర్వాత ఆయన (సాబిత్ బిన్ ఖైస్) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో రావడం మానేశారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ఆయనను గూర్చి దర్యాప్తు చేయగా ఒక వ్యక్తి – ఓ దైవ ప్రవక్తా! మీరనుమతిస్తే నేను వెళ్ళి అతన్ని గూర్చి తెలుసుకొని వస్తాను అని అన్నాడు. (సహీహ్ ముస్లిం లోని ఉల్లేఖనంలో సాబిత్ బిన్ ఖైస్ (రజి అల్లాహు అన్హు) వివరాలను తెలుసుకొస్తానని వెళ్లిన వ్యక్తి సాద్ బిన్ ముఆజ్ (రజి అల్లాహు అన్హు) అని ఆయన సాబిత్ బిన్ ఖైస్ (రజి అల్లాహు అన్హు)కు పొరుగువారు అని వుంది).

తదుపరి ఆ వ్యక్తి సాబిత్ బిన్ ఖైస్ (రజి అల్లాహు అన్హు) వద్దకు వచ్చి చూస్తే, ఆయన తన ఇంట్లో తలవంచుకుని (బాధపడుతూ అయోమయంలో) కూర్చుని వున్నారు. ఆ వ్యక్తి ఆయనతో – మీకేమైంది? అని అడగ్గా, ఆయన

జవాబిస్తూ – నా పరిస్థితి చాలా క్లిష్టంగా వుంది. కారణం, నా గొంతు దైవ ప్రవక్త  గొంతు కన్నా హెచ్చుగా వుంది.

అందుకే నా ఆచరణ వ్యర్థమై పోయింది మరియు నేనిప్పుడు నరకవాసుల్లో చేరిపోయాను అని బాధగా అన్నారు. ఇది విని, ఆ వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరకొచ్చి జరిగిందంతా చెప్పేశాడు. తదుపరి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆ వ్యక్తిని తిరిగి ఆయన వద్దకు పంపిస్తూ –'మీరు నరకవాసుల్లోని వారు కారు, స్వర్గవాసుల్లోని వారు అన్న శుభవార్తను ఆయనకు అందించు' అని పురమాయించారు. *(బుఖారీ: 4846, ముస్లిం:119)*

ఈ రెండు సంఘటనల ద్వారా మనకు – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను సహాబాలు ఎంతగా గౌరవించే వారో మరియు ఆయన గౌరవౌన్నత్యాలను కాపాడడానికి గాను ఆయన సమక్షంలో తమ కంఠస్వరాల గురించి ఎంతగా జాగ్రత్త పడేవారో అన్న విషయాలు తెలుస్తాయి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గౌరవౌన్నత్యాలను కాపాడే వారిని గురించి అల్లాహ్ ఇలా శుభవార్తను అందజేశాడు:

**فَالَّذِينَ آمَنُوا بِهِ وَعَزَّرُوهُ وَنَصَرُوهُ وَاتَّبَعُوا النُّورَ الَّذِي أُنزِلَ مَعَهُ ۙ أُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ**

**"కనుక ఎవరు ఈ ప్రవక్తను విశ్వసించి, అతనికి ఆదరువుగా నిలుస్తారో, గౌరవించి తోడ్పాటునందిస్తారో, ఇంకా అతనితో పాటు పంపబడిన జ్యోతిని అనుసరిస్తారో వారే సాఫల్యం పొందేవారు"  *(ఆరాఫ్: 157)***

అలాగే ఇలా కూడా సెలవిచ్చాడు:

**إِنَّا أَرْسَلْنَاكَ شَاهِدًا وَمُبَشِّرًا وَنَذِيرًا ⑧ لِّتُؤْمِنُوا بِاللَّهِ وَرَسُولِهِ وَتُعَزِّرُوهُ وَتُوَقِّرُوهُ وَتُسَبِّحُوهُ بُكْرَةً وَأَصِيلًا ⑨**

**"(ఓ ప్రవక్తా!) నిశ్చయంగా మేము నిన్ను సాక్ష్యమిచ్చేవానిగా,శుభవార్తను వినిపించేవానిగా, హెచ్చరించేవానిగా చేసి పంపాము. (ఓ ముస్లిము లారా!) మీరు అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను విశ్వసించటానికి, అతనికి తోడ్పడటానికి, అతన్ని గౌరవించటానికి, ఉదయం సాయంత్రం అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ వుండడానికి గాను (మేము ఈ ఏర్పాటు చేశాము)." *(ఫతహ్ : 8-9)***

సహాబాలు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఏ విధంగా గౌరవించి, అభిమానించేవారో – దీని ఒక ఉదాహరణ మనకు హుదైబియా ఒప్పందం సంఘటనలో కానవస్తుంది.

ఉర్వా బిన్ మస్ఊద్ సఖఫీ (రజి అల్లాహు అన్హు) మక్కా నుండి ముష్రిక్కుల ప్రతినిధిగా (ఆ సమయంలో తను ఇంకా ముష్రిక్ గానే ఉన్నారు) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరికి వచ్చి, తిరిగి ఖురైషుల వద్దకు వెళ్ళిన తరువాత ఇలా పలికారు: ఓ నా జాతి ప్రజలారా! అల్లాహ్ సాక్షి! నేను ఇప్పటి వరకు పెద్ద రాజులను కలుసుకున్నాను. ఖైసర్, కిస్రా, నజ్జాషీ లాంటి మహారాజులను కూడా చూశాను. కానీ అల్లాహ్ సాక్షి! ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఆయన సహచరులు గౌరవించినట్లుగా ఏ మహారాజునూ అతని సహచరులు గౌరవించడం నేను చూడలేదు. అల్లాహ్ సాక్షి! ఒకవేళ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖాండ్రించి ఉమ్మేసినా, ఆయన నోటి నుంచి వెలువడే కఫం (తెమడ) కూడా (నేల మీద పడకుండా) ఆయన సహచరుల్లోని ఒకరి అరచేతిలో పడుతుంది. దానినతడు తన ముఖానికీ, ఇతర శరీరానికి రాసుకుంటాడు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏదైనా ఆజ్ఞ ఇస్తే, వెంటనే వారు దానిని పాటిస్తారు. ఆయన వుజూ చేస్తే, వారిలో ప్రతి ఒక్కడూ ఎలాగైనా ఆ నీటిని పొందడానికి ప్రయత్నిస్తాడు. ఆయన సంభాషిస్తున్నప్పుడు ఆయన సహచరులు నిశ్శబ్దంగా దానిని వింటారు. ఆయన గౌరవార్థం వారు ఆయన కళ్ళ వైపు సూటిగా కూడా చూడరు.

*(సహీహ్ బుఖారీ : 2731, 2732)*

ఇస్లామీయ సోదరులారా! ఈ విషయాలు గుర్తుంచుకోండి!

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తగు విధంగా గౌరవించడంలో ఇమిడి వున్న ప్రత్యేక ఆవశ్యకతలేమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచర సమాజానికి చేరవేసిన ధర్మాన్ని సంపూర్ణంగా భావించి దానిలో హెచ్చుతగ్గులు చేయడం సరికాదని విశ్వసించడం. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞాపించిన విషయాలపై ఆచరిస్తూ ఆయన వారించిన విషయాలకు దూరంగా వుండడం. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రియ సున్నత్‌ను బ్రతికించడం, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తౌహీద్ (ఏకేశ్వరారాధన) సందేశాన్ని ప్రచారం చేయడం, షిర్క్ మరియు బిద్అత్‌లకు

వ్యతిరేకంగా శ్రమించడం, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) గుణగణాలను అలవర్చుకోవడం మరియు తప్పుడు, కాల్పనిక విషయాలను ఆయన వైపునకు మరల్చకుండా వుండడం.

విషయానికనుగుణంగా, దృష్టిలో గట్టిగా వుంచుకోవాల్సిన మరో ముఖ్య విషయమేమిటంటే, – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను గౌరవించడంలో అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిర్ణయించిన హద్దులను దాటకూడదు. ఎందుకుంటే ఆ హద్దులు దాటని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గౌరవమే అసలైనది, యుక్తమైనది మరియు విశ్వాసంలో అంతర్భాగమూను. అంతేగానీ, ఆ హద్దులను అతిక్రమించడం ఎంతమాత్రం సరికాదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్భోధించారు:“క్రైస్తవులు ఈసా బిన్ మర్యమ్ (అలైహిస్సలాం)ను ప్రశంసించడంలో హద్దులు మీరినట్లుగా మీరు నన్ను పొగడడంలో మితిమీరకండి. నేను కేవలం దాసుణ్ణి. కనుక మీరు నన్ను అల్లాహ్ దాసులు మరియు ఆయన ప్రవక్త అని అనండి.” *(బుఖారీ)*

ఈ హదీసు ద్వారా నిరూపించబడ్డ విషయమేమిటంటే – కేవలం అల్లాహ్‌కు మాత్రమే చెందిన అధికారాలను, ఉదా॥ అవసరాలను తీర్చేవాడు, కష్టాల నుండి గట్టెక్కించేవాడు, సహాయకుడు వగైరా...... ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఆపాదించడం పూర్తిగా నిషిద్ధమే (హరామ్) గాక, ఆయనను తగువిధంగా గౌరవించడంలో ఏర్పరచబడ్డ హద్దులను అతిక్రమించడమే అవుతుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**قُلْ لَّآ اَمْلِكُ لِنَفْسِىْ نَفْعًا وَّلَا ضَرًّا اِلَّا مَا شَآءَ اللّٰهُ ؕ وَلَوْ كُنْتُ اَعْلَمُ الْغَيْبَ لَاسْتَكْثَرْتُ مِنَ**
**الْخَيْرِ ۛۚ وَمَا مَسَّنِىَ السُّوْٓءُ ۛؕ اِنْ اَنَا اِلَّا نَذِيْرٌ وَّبَشِيْرٌ لِّقَوْمٍ يُّؤْمِنُوْنَ ﴿188﴾**

**“(ఓ ప్రవక్తా! వారికి ఇలా) చెప్పు – అల్లాహ్ తలచినంత మాత్రమే తప్ప నేను సైతం నా కోసం లాభం కానీ, నష్టం గానీ చేకూర్చుకొనే అధికారం నాకు లేదు. నాకే గనక అగోచర విషయాలు తెలిసివుంటే నేనెన్నో ప్రయోజనాలు పొంది వుండే వాణ్ణి, నాకు ఏ నష్టమూ వాటిల్లేది**

**కాదు. నిజానికి నేను విశ్వసించే వారికి హెచ్చరించే వాణ్ణి, శుభవార్తలు అందజేసేవాణ్ణి మాత్రమే." *(ఆరాఫ్ : 188)***

قُلْ لَّآ اَقُوْلُ لَكُمْ عِنْدِيْ خَزَآىِٕنُ اللّٰهِ وَلَآ اَعْلَمُ الْغَيْبَ وَلَآ اَقُوْلُ لَكُمْ اِنِّيْ مَلَكٌ ۚ اِنْ اَتَّبِعُ اِلَّا
مَا يُوْحٰٓى اِلَيَّ ؕ قُلْ هَلْ يَسْتَوِي الْاَعْمٰى وَالْبَصِيْرُ ؕ اَفَلَا تَتَفَكَّرُوْنَ ﴿50﴾

**"ఓ ప్రవక్తా! వారికిలా చెప్పేయి - నా వద్ద అల్లాహ్ నిక్షేపాలు (ఖజానాలు) వున్నాయని నేను మీతో చెప్పటం లేదు. నా వద్ద అగోచర జ్ఞానం కూడా లేదు. నేను దైవదూతనని కూడా మీతో అనడం లేదు. నాపై అవతరించబడే వహీని మాత్రమే నేను అనుసరిస్తున్నాను. (ఓ ప్రవక్తా) వారిని అడుగు - గ్రుడ్డివాడు, కళ్ళున్నవాడూ - ఇద్దరూ సమానులేనా? మీరు ఈ మాత్రం ఆలోచించలేరా?" *(అన్అమ్: 50)***

## (3) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రేమించడం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యొక్క మూడవ హక్కు ఏమిటంటే - అల్లాహ్ తర్వాత అందరి కన్నా ఎక్కువగా ఆయననే ప్రేమించాలి మరియు అలాంటి ప్రేమ అల్లాహ్ సృష్టితాలలో ఎవరితోనూ ఉండకూడదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా ప్రవచించారు: "ఏ వ్యక్తిలోనయినా ఈ మూడు గుణాలు వుంటే అతను వాటి ద్వారా విశ్వాస మాధుర్యాన్నీ, తియ్యదనాన్ని ఆస్వాదించ గలుగుతాడు. వాటిలో మొదటిది - అల్లాహ్‌నూ ఆయన ప్రవక్తనూ అందరికన్నా ఎక్కువగా ప్రేమించడం.

రెండవది - కేవలం అల్లాహ్‌ను సంతృప్తి పరచడానికే ఇతరులను ప్రేమించడం. ఇక మూడవది –నరకాగ్నిలోకి ప్రవేశించడానికి ఎంతగా అయిష్టపడతాడో, (విశ్వసించిన తర్వాత) తిరస్కారం (కుఫ్ర్) వైపునకు మరలడానిక్కూడా అంతే అయిష్ట పడడం". *(బుఖారీ: 16, ముస్లిం : 43)*

"తమ సంతానం కన్నా, తమ తల్లిదండ్రుల కన్నా మరియు ఇతరులందరి కన్నా నన్ను ఎక్కువగా ప్రేమించనంత వరకూ మీలో ఎవరు కూడా విశ్వాసులు కాజాలరు". *(బుఖారీ : 15, ముస్లిం : 44)*

అంతే కాదు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తమ ప్రాణం కన్నా ఎక్కువగా ప్రేమించడం తప్పనిసరి.

అబ్దుల్లా బిన్ హిషామ్ (రజి అల్లాహు అన్హు) కథనం: మేమొక సారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెంట ఉన్నాం. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉమర్ (రజి అల్లాహు అన్హు) చేతులు పట్టుకొని ఉన్నారు. ఇంతలో, ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఓ దైవ ప్రవక్తా! మీరు నాకు నా ప్రాణం తప్ప ఇతర (ప్రాపంచిక) వస్తువులన్నింటి కన్నా ప్రియమైన వారు – అని పలికారు.

దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్పందిస్తూ – కాదు! నా ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆ శక్తిమంతుని సాక్షి! మీ ప్రాణం కన్నా ఎక్కువగా నేను మీకు ప్రియం కావాలి అని అన్నారు.

ఉమర్ (రజి అల్లాహు అన్హు) మాట్లాడుతూ – అల్లాహ్ సాక్షి! మీరిప్పుడు నాకు నా ప్రాణం కన్నా ప్రియులు అని పలికారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – ఇప్పుడు మాట కుదిరింది అని అన్నారు. *(బుఖారీ : 6632)*

గుర్తుంచుకోవాల్సిన విషయమేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మీది నిజమైన ప్రేమ యొక్క ఆచరణా స్వరూపం ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞలను పాటిస్తూ ఆయనకు విధేయత చూపడం ద్వారానే సాధ్యమవుతుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**قُلْ إِن كُنتُمْ تُحِبُّونَ اللَّهَ فَاتَّبِعُونِي يُحْبِبْكُمُ اللَّهُ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ ۗ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ ﴿31﴾**

**"(ఓ ప్రవక్తా!) వారికిలా చెప్పు– మీకు నిజంగానే అల్లాహ్ పట్ల ప్రేమ ఉంటే మీరు నన్ను అనుసరించండి. (తత్ఫలితంగా) అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు, మీ పాపాలను మన్నిస్తాడు. ఆయన అమితంగా క్షమించే వాడు, అపారంగా కనికరించేవాడు." *(ఆలి ఇమ్రాన్ :31)***

ఈ ఆయతు ద్వారా రుజువైనదేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో ప్రేమకు (అసలైన) కొలమానం ఆయనకు విధేయత చూపి ఆయన్ను అనుసరిచడం. ఇక ఏ వ్యక్తి అయినా తను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రేమిస్తున్నానని వాదిస్తూ, ఆయన (సల్లల్లాహు

అలైహి వ సల్లం) సున్నత్ ను కూడా అనుసరిస్తుంటాడో అతను తన వాదనలో సత్యవంతుడని అనుకోవచ్చు. కానీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రేమిస్తున్నాని కేవలం వాదిస్తూ, ఆయన సున్నత్‌ను అనుసరించకపోతే అతను తన వాదనలో అసత్యుడని నిర్ధారించుకోవాలి. దీనిపై ఒక కవి చాలా చక్కగా సెలవిచ్చాడు:

"మీరు అల్లాహ్‌కు విధేయత చూపుతారు మరియు అతణ్ణి ప్రేమిస్తామని కూడా వాదిస్తారు! మీ జీవితం సాక్షి! ఇదెంతో విచిత్రమైన విషయం. ఒకవేళ మీ ప్రేమ నిజమైనదై వుంటే మీరు ఆయనకు విధేయత చూపి వుండేవారు. ఎందుకంటే ప్రేమించేవాడు తన ప్రేమికునికి విధేయుడిగా వుంటాడు".

సహాబాలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఎంతో ఎక్కువగా ప్రేమించేవారు. ఆయెషా (రజి అల్లాహు అన్హ) ఉల్లేఖించిన ఈ సంఘటన ద్వారా మనం దీనిని గ్రహించవచ్చు. ఆమె కథనం: ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికొచ్చి ఇలా విన్నవించుకున్నాడు – ఓ దైవ ప్రవక్తా! మీరు నాకు నా ప్రాణం కన్నా, నా సంతానం కన్నా ప్రియమైనవారు. నేను ఇంట్లో వున్నప్పుడు మిమ్మల్ని గుర్తు తెచ్చుకుంటాను. మీరు గుర్తు రాగానే ఓపిక పట్టలేక మీ దగ్గరికొచ్చి మిమ్మల్ని దర్శించుకుంటాను. ఇక నేను నా మృత్యువును మరియు మీ మృత్యువును గుర్తుకు తెచ్చుకున్నప్పుడు – మీరు స్వర్గంలోకి ప్రవేశించినప్పుడు మిమ్మల్ని ప్రవక్తలతో (ఉన్నత స్థానాలలోకి) పంపడం జరుగుతుంది, ఒకవేళ నేను స్వర్గంలోకి ప్రవేశింపజేయబడితే అక్కడ మీ దర్శన భాగ్యం కలుగుతుందో లేదో! అన్న సంశయంలో వున్నాను.

దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏమీ మాట్లాడలేదు. ఇలోగా జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఈ ఆయత్‌ను తీసుకుని అవతరించారు–

وَمَنْ يُّطِعِ اللّٰهَ وَالرَّسُوْلَ فَاُولٰٓئِكَ مَعَ الَّذِيْنَ اَنْعَمَ اللّٰهُ عَلَيْهِمْ مِّنَ النَّبِيّٖنَ وَالصِّدِّيْقِيْنَ
وَالشُّهَدَآءِ وَالصّٰلِحِيْنَ ۚ وَحَسُنَ اُولٰٓئِكَ رَفِيْقًا ﴿69﴾

**"ఎవరైతే అల్లాహ్‌కు, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత కనబరుస్తారో వారే అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్యసంధులతోనూ, షహీదులతోనూ, సద్వర్తనులతోనూ ఉంటారు. ఎంత మంచి స్నేహితులు వీరు". *(నిసా : 69)***(*తబ్రాని–అస్సగీర్, అల్ ఔసత్*)

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విధేయత, ఆయన సున్నత్‌ను అనుసరించడమే ఆయనపై వున్న నిజమైన ప్రేమకు తార్కాణం. ఈ కారణం వల్లే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రేమించే వారికి ప్రళయం రోజు ఆయన సాన్నిధ్యం దొరుకుతుంది. ఎందుకంటే – ఆ సహచరుడు (సహాబీ) స్వర్గంలో తను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను దర్శించలేనేమోనన్న అనుమానాన్ని వ్యక్తం చేసినప్పుడు దానికి జవాబుగా అల్లాహ్ – ఒకవేళ మీరు అల్లాహ్‌కూ, ఆయన ప్రవక్తకూ విధేయత చూపితే మీకు దైవ ప్రవక్తల సాన్నిధ్యం తప్పకుండా దొరుకుతుంది అని సెలవిచ్చాడు. కేవలం ప్రేమిస్తున్నామని వాదిస్తే సరిపోదు, దాని కనుగుణంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అనుసరిస్తూ ఆయనకు విధేయత చూపడం కూడా తప్పనిసరి అని అనడానికి ఒక తార్కాణం.

## (4) అత్యుత్తమ ఆదర్శం (ఉస్వ -ఏ- హసన)పై ఆచరించడం

తన అనుచర సమాజం (ఉమ్మత్)పై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు గల నాలుగవ హక్కు ఏమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అత్యుత్తమ ఆదర్శంగా విశ్వసించి, ప్రతి విషయంలోనూ, జీవితానికి సంబంధించిన అన్ని వ్యవహారాల్లోనూ ఆయనను అనుసరించాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**“నిశ్చయంగా దైవప్రవక్తలో మీ కొరకు అత్యుత్తమ ఆదర్శం వుంది – అల్లాహ్ పట్ల అంతిమ దినం పట్ల ఆశ కలిగివుండి, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే ప్రతి ఒక్కరి కొరకు”.** ***(అహ్‌జాబ్ : 21)***

ఈ ఆయత్ ద్వారా తెలిసిందేమిటంటే – ఈ రెండు గుణాలు తనలో కలిగివున్న వ్యక్తే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ఆదర్శాలను స్వీకరిస్తాడు. అందులో మొదటిది– ప్రళయం రోజు అల్లాహ్‌తో ముఖాముఖి కలవడంపై నమ్మకం కలిగి వుంటాడు. రెండవది – అల్లాహ్‌ను అత్యధికంగా స్మరిస్తాడు.

కాని (దురదృష్టవశాత్తూ) నేటి ముస్లిములలో చాలా మంది ఈ గుణాలను త్యజించి వున్నారు. అందుకే వారి హృదయాల్లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదర్శానికి ఏ మాత్రం ప్రాముఖ్యత లేదు. దీనికి వ్యతిరేకంగా వారు

ఇతరులెందరినో తమకు ఆదర్శంగా భావించి వారి ఆచరణలను, అభిప్రాయాలనే గ్రుడ్డిగా తమ కోసం తలమానికంగా చేసుకున్నారు. వలాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్!

కానీ, సహాబాలు మాత్రం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అత్యుత్తమ ఆదర్శవంతులుగా భావించి తమ మాటలు, చేతలు – అన్ని విషయాలలోనూ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)నే అనుసరించేవారు. కేవలం ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కొరకే ప్రత్యేకించబడిన ఆచరణను వదిలిపెట్టేవారు. దానిక్కారణం వారు, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను హృదయపూర్వకంగా ఇష్టపడేవారు మరియు నిజమైన ప్రేమ కలిగి వుండే వారు.

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఓ సారి బంగారపు ఉంగరాన్ని ధరిస్తే, (ఇది చూసి) ప్రజలు కూడా బంగారపు ఉంగరాన్ని ధరించారు. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– నేను బంగారపు ఉంగరాన్ని ధరించి వున్నాను అని చెప్పి, ఆ తర్వాత దానిని తీసేసి – ఇక నేను దీనిని ఎప్పుడూ ధరించను అని అన్నారు. దీనిపై అందరూ తమ బంగారపు ఉంగరాలను తీసేశారు.

*(బుఖారీ : 7298, ముస్లిం : 2061)*

కనుక, మనం కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అత్యుత్తమ ఆదర్శవంతులుగా భావించి ఆయనను సంపూర్ణంగా అనుసరించాలి.

విశ్వాసాలు, ఆరాధనా విషయాలైనా, నైతికత, సత్ప్రవర్తన విషయాలైనా, ఇతర వ్యవహారాలైనా, జీవితానికి సంబంధించిన ఏ రంగంలోనయినా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అడుగు జాడల్లోనే నడవాలి. కానీ, దురదృష్ట వశాత్తూ నేడు మనం – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను విశ్వసించి ఆయనను ప్రేమిస్తునామని వాదించేవారి దైనందిన కార్యకలాపాలపై ఒక్కసారి దృష్టి సారిస్తే–వీరి కార్యకలాపాలకూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కార్యకలాపాలకు భూమ్యాకాశాల వ్యత్యాసం వుందన్న విషయం స్పష్టమవుతుంది.

విశ్వాసాల విషయానికికొస్తే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కేవలం అల్లాహ్‌నే ప్రార్థిస్తూ, అతణ్ణే అవసరాలు తీర్చేవాడుగా, కష్టాల

నుండి గట్టెక్కించే వాడుగా నమ్మేవారు. దీనికి భిన్నంగా నేటి ముస్లిములలో అత్యధికులు దైవేతరులను తమ అవసరాలు తీర్చి కష్టాల నుండి గట్టెక్కించేవారుగా భావించి వారిని వేడుకుంటున్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – లాభ నష్టాల అధికారం కేవలం అల్లాహ్‌కే వుందని విశ్వసించేవారు. కానీ నేటి ముస్లిములలో చాలా మంది, మరణించిన పుణ్య పురుషులు, సజ్జనుల వద్ద ఈ అధికారాలున్నాయని భావించి వారి నుండి లాభాన్ని ఆశిస్తూ, వారంటే భయపడు తుంటారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సమాధిని సజ్దాల నిలయం (మస్జిద్)గా మార్చడాన్ని గట్టిగా వారించి, ఇలా చేసేవారిని శపించివుండగా, నేటి ముస్లిములు పుణ్యపురుషుల సమాధులను 'మజార్ల' లాగా తీర్చిదిద్ది తమ అవసరాలు తీర్చుకోవడానికి వీటి వైపునకు మరలుతున్నారు....

ఇక ఆరాధనల విషయాని కొస్తే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చివరి ఘడియల వరకు నమాజును స్థాపించగా నేటి ముస్లిములలో చాలా మంది ఐదు పూటల నమాజును ఆచరించరు మరియు 'హయ్యా అలస్సలాహ్, హయ్యా అలల్ ఫలాహ్' శబ్దం విని మస్జిద్‌కు రారు. ఒకవేళ మస్జిద్‌కు వచ్చినా, అందులో చాలా మంది తమ ఇష్ట ప్రకారం లేదా తమ అభిమతం (మస్లక్) ప్రకారం నమాజులు చదువుతారు. వాస్తవానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఆజ్ఞాపించివున్నారు – **'నన్నెలాగైతే నమాజు చేస్తుండగా చూశారో, మీరు కూడా అలాగే నమాజ్ చేయండి.'** మరి మన ఇష్ట ప్రకారం లేదా అభిమతం ప్రకారం (అల్లాహ్‌ను) ఆరాధించం జరుగుతుంటే ఇక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదర్శాల అనుసరణ ఎక్కడ మిగిలి వుంటుంది....!!

అలాగే, సుగుణాలు, సత్ప్రవర్తనల విషయానికొస్తే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంతో ప్రేమ ఆప్యాయతలను కనబరుస్తూ అందరితోనూ కలసిపోయేవారు మరియు ముస్లిములందరితోనూ చక్కగా ప్రవర్తించేవారు. కానీ నేటి ముస్లిములు గర్వాహంకారాలను ప్రదర్శిస్తూ ముస్లిం సహోదరులతో చెడ్డగా ప్రవర్తిస్తూ దర్శనమిస్తున్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇతరుల్ని క్షమించి వారికి హితబోధ చేసేవారు. చెడు విషయాల నుండి స్వయంగా దూరంగా ఉంటూ ఇతరులక్కూడా వీటి గురించి వారించే

వారు. కానీ, నేటి ముస్లిములు మాత్రం చిన్న చిన్న విషయాల మీద కూడా ఇతరులతో గొడవకు దిగి దర్భాషలాడుతున్నారు!

ఇక వ్యవహారాల విషయానికొస్తే – ప్రియ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మోసం, దగా, ఇతరుల సొమ్ము కాజేయడం – వంటి వాటి నుండి గట్టిగా వారించేవారు. కానీ నేడు పరిస్థితి ఎలా వుందంటే – మోసం, దగా మరియు ఇతరుల సొమ్ము కాజేయడం వంటి చెడు కార్యాలు ముస్లిముల గుర్తింపు చిహ్నాలుగా అయిపోయాయి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హలాల్ (ధర్మయుక్తమైన) సంపాదన గురించి ఆజ్ఞాపించి హరామ్ (నిషిద్ధ) సంపాదన గురించి గట్టిగా వారించేవారు.కానీ, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను విశ్వసించే నేటి ముస్లిములు హరామ్, హలాల్ ల మధ్య వ్యత్యాసం చూపకుండా రెండు పద్ధతుల్లోనూ ధనాన్ని అర్జిస్తూ, అర్జించిన ధనాన్ని వడ్డీలిచ్చే బ్యాంకులలో జమ చేస్తూ దర్పనమిస్తున్నారు!

చెప్పొచ్చేదేమిటంటే– జీవితానికి సంబంధించిన ప్రతి రంగంలోనూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదర్శాలను వదలిపెట్టడం జరిగింది, వాటి స్థానంలో ఇతర జాతుల పద్ధతులు ఆచరణ యోగ్యమైన ఆదర్శపద్ధతులుగా పేరుగాంచాయి.

చివరికి వస్త్రధారణ మరియు వ్యవహార శైలి విషయాల్లో కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆదర్శాలు నేడు లోపాలు, దోషాలుగా తయారయి పోయాయి. ఇక ఎవరైనా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)(ను అనుసరిస్తూ) ఆయన లాంటి వస్త్ర ధారణ, వ్యవహార శైలి పాటించడానికి ప్రయత్నిస్తాడో, అతణ్ణి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రేమిస్తున్నామని వాదించేవారే చెడ్డ చెడ్డ పేర్లతో పిలుస్తూ జన సమూహాల మధ్య దైవ ప్రవక్త సున్నత్‌ను పరిహసిస్తూ దర్పనమిస్తుంటారు....!! ఇన్నాలిల్లాహి వ ఇన్నా ఇలైహి రాజిఊన్!

## (5) విధేయత

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యొక్క ఐదవ హక్కు ఏమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత చూపడం మరియు

ఆయన అవిధేయతకు దూరంగా వుండడం. ఎందుకంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) విధేయత (వాస్తవానికి) అల్లాహ్ విధేయత మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అవిధేయత, అల్లాహ్ అవిధేయతే. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు చెందిన ఈ హక్కును గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَأَطِيعُوا اللَّهَ وَأَطِيعُوا الرَّسُولَ وَاحْذَرُوا ۚ فَإِن تَوَلَّيْتُمْ فَاعْلَمُوا أَنَّمَا عَلَىٰ رَسُولِنَا الْبَلَاغُ الْمُبِينُ

**"అల్లాహ్‌కు విధేయత చూపండి, ఆయన ప్రవక్తకు విధేయత చూపండి. (చెడుల పట్ల) కడు జాగ్రత్తగా వుండండి. ఒకవేళ మీరు గనక విముఖత చూపితే, మా ప్రవక్త పై వున్న బాధ్యతల్లా స్పష్టంగా విషయాన్ని అంద జేయడం వరకే నని తెలుసుకోండి."** ***(మాయిదా : 92)***

ఇంకా, ఇలా సెలవిచ్చాడు:

مَّن يُطِعِ الرَّسُولَ فَقَدْ أَطَاعَ اللَّهَ ۖ وَمَن تَوَلَّىٰ فَمَا أَرْسَلْنَاكَ عَلَيْهِمْ حَفِيظًا (80)

**"ప్రవక్తకు విధేయత చూపినవాడు అల్లాహ్‌కు విధేయత చూపినట్లే".** ***(నిసా : 80)***

ఈ ఆయతులో అల్లాహ్, ప్రవక్త విధేయతను తన విధేయతగా ఖరారు చేశాడు. ఇదే విషయాన్ని ఈ హదీసు కూడా సమర్థిస్తుంది:

ఫాతిమా బిన్తె ఖైస్ (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం ఆమె భర్త అబూ అమ్ర్ బిన్ హఫ్స్ (రజి అల్లాహు అన్హు) ఓ సారి ఇంటి నుండి బయటకు వెళ్ళివున్నారు. ఈ తరుణంలోనే ఆయన ఆఖరి (మూడవ) తలాఖు ఇచ్చేశారు. తదుపరి ఆయన ప్రతినిధి (అయ్యాష్ బిన్ అబీ రబీయ రజి అల్లాహు అన్హు)ని తలాఖ్ నామా (విడాకుల పత్రం)తో పాటు ఐదు 'సా' ల యవలు(జౌ) ఇచ్చి ఆమె దగ్గరికి పంపారు. కానీ, ఆమెకు ఈ విషయం నచ్చలేదు. (ముస్లిం లోని ఒక ఉల్లేఖనం ప్రకారం ఆమె ఇలా అడిగారు – నా కోసం ఇంత తక్కువ ఆహార పదార్థాలా?) దీనిపై ఆయన ప్రతినిధి జవాబిస్తూ – అల్లాహ్ సాక్షి! మా దగ్గర మీ కోసం ఇంత కన్నా ఏమీ లేదు అని అన్నారు. దీనిపై ఆమె నేరుగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు వచ్చి విషయమంతా తెలియజేశారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ –

వాస్తవానికి వారు నీకు ఎంతో కొంత ఆహార ధాన్యాలు ఇవ్వాలన్న నియమం ఏమీ లేదు అని అన్నారు.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు ఇద్దత్ గడువు గడిపే నిమిత్తం ఉమ్మె షరీక్ (రజి అల్లాహు అన్హ) ఇంటికి పంపించేశారు. ఆ తర్వాత మళ్ళీ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు ఇలా సెలవిచ్చారు– ఉమ్మె షరీక్ (రజి అల్లాహు అన్హ) ఇంటికి సహాబాలు తరచూ వస్తూ పోతుంటారు. కనుక నువ్వు ఉమ్మె మఖ్తూమ్ (రజి అల్లాహు అన్హు) ఇంట్లో ఇద్దత్ వ్యవధి గడుపు, ఎందుకంటే ఆయన అంధులు కావడం వల్ల నీవు నీ అదనపు వస్త్రాలు తొలగించు కొనే అవకాశం వుంటుంది. ఇద్దత్ గడువు పూర్తయ్యాక నాకు కబురు పంపు.

ఫాతిమా బిన్తె ఖైస్ (రజి అల్లాహు అన్హ) ఇలా వివరించారు – నా ఇద్దత్ గడువు పూర్తయ్యాక నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు – నా వద్దకు ముఆవియా బిన్ అబూ సుఫ్యాన్ (రజి అల్లాహు అన్హు) మరియు అబూ జహమ్ (రజి అల్లాహు అన్హు) లు పెళ్ళి ప్రస్తావన తీసుకొని వచ్చారు – అన్న విషయం చెప్పాను. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – అబూ జహమ్ (రజి అల్లాహు అన్హు) విషయానికొస్తే – అతనేమో కర్రను భుజాల మీద నుండి దించనే దించడు (అంటే ఆయన కఠిన మనస్కులు), ఇక ముఆవియా (రజి అల్లాహు అన్హు) విషయానికొస్తే –ఆయన కటిక బీదవాడు, ఆయన వద్ద ఏమీ లేదు. కనుక నువ్వు ఉసామా బిన్ జైద్ (రజి అల్లాహు అన్హు)ను వివాహం చేసుకో అని చెప్పారు.

ఫాతిమా (రజి అల్లాహు అన్హ) కథనం – నాకు ఉసామా అంటే ఇష్టం లేదు. కానీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాత్రం మళ్ళీ నన్ను ఉసామా (రజి అల్లాహు అన్హు) నే వివాహమాడు అని ఆజ్ఞాపించారు.

ముస్లింలోని ఒక ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు ఇలా ఉద్బోధించారు – అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)విధేయతే నీకు ఉత్తమం.

తదుపరి నేను ఆయన్ను పెళ్ళి చేసుకున్నాను. నిజంగానే, అల్లాహ్ మా వివాహబంధంలో ఎంతటి మంచిని, శుభాన్ని వుంచాడంటే– ఆ కాలంలో వున్న ఇతర స్త్రీలు నన్ను చూసి ఈర్ష్య చెందేవారు. *(ముస్లిం : 1480)*

ఈ సంఘటన ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విధేయత లోనే మంచి, శుభాలు ఇమిడి వున్నాయి మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విధేయత వాస్తవానికి అల్లాహ్ విధేయత ఎందుకంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫాతిమా (రజి అల్లాహు అన్హ)కు ఉసామా (రజి అల్లాహు అన్హు)ను వివాహం చేసుకోమని ఇచ్చిన ఆజ్ఞకు సంబంధించి అల్లాహ్ దివ్య ఖురానులో ఏ ఆయతునూ అవతరింపజేయ లేదు. అయినప్పటికీ దానిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త విధేయతే నీ కోసం ఉత్తమం అని ప్రస్తావించారు. కనుక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విధేయత వాస్తవానికి అల్లాహ్ విధేయతే అని అనడానికి ఇదొక చక్కటి ఆధారం.

తనకు విధేయత చూపమని అల్లాహ్ తన దాసులకు ఎక్కడైతే సెలవిచ్చాడో అక్కడే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు కూడా విధేయత చూపమని ఆజ్ఞాపించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا أَطِيعُوا اللَّهَ وَأَطِيعُوا الرَّسُولَ وَلَا تُبْطِلُوا أَعْمَالَكُمْ ﴿33﴾

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి. ప్రవక్త చెప్పినట్లు వినండి. (అవిధేయత చూపి) మీ కర్మలను పాడు చేసుకోకండి."**

***(ముహమ్మద్ : 33)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اسْتَجِيبُوا لِلَّهِ وَلِلرَّسُولِ إِذَا دَعَاكُمْ لِمَا يُحْيِيكُمْ ۖ وَاعْلَمُوا أَنَّ اللَّهَ يَحُولُ
بَيْنَ الْمَرْءِ وَقَلْبِهِ وَأَنَّهُ إِلَيْهِ تُحْشَرُونَ ﴿24﴾

**"ఓ విశ్వాసులారా! మీకు జీవితాన్నిచ్చే వస్తువు వైపునకు ప్రవక్త మిమ్మల్ని పిలిచినప్పుడు మీరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త పిలుపుకు అనుకూలంగా స్పందించండి. అల్లాహ్ మనిషికీ – అతని మనసుకూ మధ్య అడ్డుగా వస్తాడనీ, మీరంతా ఆయన వద్దకే సమీకరించబడతారన్న సంగతినీ తెలుసుకోండి".** ***(అన్‌ఫాల్ : 24)***

నేనొకసారి మస్జిద్‌లో నమాజు చదువుతుండగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అటువైపు నుండి వెళుతూ నన్ను పిలిచారు. నేను నమాజు పూర్తి చేసి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు వెళ్ళగా, ఆయన నాతో– (నేను పిలవగానే) నా వద్దకు రానీయకుండా ఏ విషయం నిన్ను ఆపి వుంచింది? అని అడిగారు.

“నేను నమాజు చదువుతూ వున్నాను దైవ ప్రవక్తా!” అని విన్నవించు కున్నాను. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హితబోధ చేస్తూ ఇలా అన్నారు – “ఓ విశ్వాసులారా! మీకు జీవితాన్నిచ్చే వస్తువు వైపునకు ప్రవక్త మిమ్మల్ని పిలిచినప్పుడు మీరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త పిలుపుకు అనుకూలంగా స్పందించండి” అని అల్లాహ్ సెలవీయలేదా?

*(బుఖారీ: 4647, 4703)*

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَآ ءَاتَىٰكُمُ ٱلرَّسُولُ فَخُذُوهُ وَمَا نَهَىٰكُمْ عَنْهُ فَٱنتَهُوا۟ ۚ وَٱتَّقُوا۟ ٱللَّهَ ۖ إِنَّ ٱللَّهَ شَدِيدُ ٱلْعِقَابِ ⑦

**“దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీకు ఇచ్చిన దానిని (సంతోషంగా) పుచ్చుకోండి. ఆయన ఏ విషయం నుండైనా మిమ్మల్ని వారిస్తే దానిని వదిలిపెట్టండి”.** ***(హష్ర్ : 7)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞ అనేది షరీయత్తు పరమైన ఆధారము మరియు తప్పనిసరిగా అనుసరణీయము అని అనడానికి ఈ ఆయతు ఒక నిదర్శనం.

అలాగే, ఈ హదీసు కూడా దీనిని సమర్థిస్తుంది:

“పచ్చబొట్లు పొడిచే, పొడిపించుకొనే, సౌందర్యం నిమిత్తం తమ ముఖాలపై వెంట్రుకలు తొలగించుకొనే మరియు తమ దంతాల మధ్య ఎడబాటు కలిగించుకోవడం ద్వారా సృష్టిలో మార్పులు చేసే స్త్రీలను అల్లాహ్ శపించాడు.”

ఈ హదీసు అసద్ తెగకు చెందిన ఉమ్మె యాఖూబ్ అని పిలువబడే ఒక స్త్రీ వద్దకు చేరింది.

తదుపరి ఆమె, అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి అల్లాహు అన్హు) దగ్గరి కొచ్చి ఇలా అడిగింది – మీరు ఫలానా, ఫలానా స్త్రీలను శపించారని నాకు తెలిసింది.

ఆయన జవాబిస్తూ – అల్లాహ్ గ్రంథం శపించిన వారినీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శపించిన వారిని నేనెందుకు శపించకూడదు? అని అడిగారు.

ఉమ్మె యాఖూబ్: నేను దివ్య ఖురానును సంపూర్ణంగా చదివాను. కానీ మీరు చెప్పే విషయం నాకెక్కడా గోచరించలేదే?

అబ్దుల్లా బిన్ మస్వూద్: ఒకవేళ నీవు ఖురానును పూర్తిగా చదివివుంటే నీకు ఖచ్చితంగా ఈ విషయం తెలిసేది. నీవు "దైవ ప్రవక్త మీకు యిచ్చిన దానిని (సంతోషంగా) తీసుకోండి. ఆయన ఏ విషయం నుండైనా మిమ్మల్ని వారిస్తే దానిని వదిలిపెట్టండి" అన్న ఆయతు చదవ లేదా?

ఉమ్మె యాఖూబ్: ఎందుకు చదవలేదు? (చదివాను)

అబ్దుల్లా బిన్ మస్వూద్: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ పనుల నుండి వారించారు మరి.

ఉమ్మె యాఖూబ్: మరి మీ భార్య ఈ పనులు చేస్తోందిగా!

అబ్దుల్లా బిన్ మస్వూద్: ఓసారి వెళ్ళి చూడు.

తదుపరి ఆమె వాళ్ళింటికి వెళ్ళి చూడగా అక్కడ ఆమెకు అలాంటి విషయమేదీ కనబడలేదు.

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) మాట్లాడుతూ – ఒక వేళ నా భార్య ఈ పనులలో గనక లిప్తమై వుంటే, నేనామె దగ్గరిక్కూడా వెళ్ళే వాణ్ణి కాదు. *(బుఖారీ : 4886, ముస్లిం : 2125)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు : కేవలం తిరస్కరించిన వారు తప్ప నా అనుచర సమాజానికి చెందిన వారంతా స్వర్గంలోకి వెళతారు. దీనిపై సహాబాలు స్పందిస్తూ – తిరస్కరించే వారు ఎవరు దైవ ప్రవక్తా! అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – నాకు విధేయత చూపిన వాడు స్వర్గంలోకి ప్రవేశిస్తాడు. నాకు అవిధేయత చూపినవాడు (స్వర్గాన్ని) తిరస్కరించాడు అని హితవు పలికారు. *(బుఖారీ: 7280)*

## సహాబాలు మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విధేయత

సహాబాల హృదయాల్లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విధేయత, ఆజ్ఞాపాలనల పట్ల గాఢంగా నూరిపోయబడింది. దీనికి సంబంధించిన కొన్ని సంఘటనలకు మీ ముందు వుంచాలనుకుంటున్నాం.

(1) అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తి చేతిలో బంగారపు ఉంగరం చూసి దానిని తీసి పడేసారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– 'మీలో ఎవరైనా నరక జ్వాలను చేతిలో పెట్టుకోవడానికి యిష్టపడతారా?' అని అడిగారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కణ్ణుంచి వెళ్ళిపోయిన తర్వాత ఆ వ్యక్తితో – 'నీ వుంగరాన్ని తీసుకుని ఇతర ప్రయోజనం పొందు' అని అనబడింది. దీనిపై ఆ వ్యక్తి జవాబిస్తూ – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయంగా దానిని తీసి విసిరేశారు. అల్లాహ్ సాక్షి! నేనిక యెప్పుడూ దానిని తీసుకోను – అని అన్నాడు. *(ముస్లిం : 2090)*

(2) ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి అల్లాహు అన్హు) కథనం: ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు – 'నిస్సందేహంగా, మీ తాతముత్తాతల పేర్లతో ప్రమాణం చేయడాన్ని అల్లాహ్ మీ కోసం వారించాడు.'

ఈ హదీసును ఉల్లేఖించిన తర్వాత ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిస్తున్నారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నోట–అల్లాహ్ ఈ విషయాన్ని వారించాడు – అని విన్న తర్వాత నేనెప్పుడూ ఇలా ప్రమాణం చేయ లేదు. అంటే నా పేరుతో గానీ లేదా ఇతరుల పేర్లతో గానీ!

*(ముస్లిం : 1646)*

(3) అబ్దుల్లా బిన్ ఆమిర్ బిన్ రబియా కథనం: ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి అల్లాహు అన్హు) ఓ సారి సిరియా వైపునకు వెళుతూ 'సరగ్' అనే ప్రదేశానికి చేరుకొనే సరిగి అక్కడ ఆయనకు – సిరియాలో అంటు వ్యాధి వ్యాపించింది అన్న వార్త అందింది. దీనిపై అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి అల్లాహు అన్హు)

స్పందిస్తూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారని చెప్పారు – 'మీరెప్పుడైనా ఏ దేశంలోనైనా అంటు వ్యాధి వ్యాపించిందని తెలుసుకుంటే అక్కడికి వెళ్ళకండి. కానీ, ఒకవేళ మీరు వున్న ప్రదేశంలో గనక అంటువ్యాధి వ్యాపిస్తే అక్కడనుండి పారిపోవడానికి యత్నించకండి.'

ఈ హదీసు విన్న తర్వాత ఉమర్ (రజి అల్లాహు అన్హు) సిరియా వెళ్ళకుండా, 'సరగ్' నుండే తిరిగి వెళ్ళిపోయారు.

*(బుఖారీ : 5730, ముస్లిం : 2219)*

ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఎప్పుడైనా తన అభిప్రాయానికి విరుద్ధంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసు వింటే, వెంటనే తన అభిప్రా యాన్ని వదిలిపెట్టి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసు కనుగుణంగా తీర్పు చేసేవారు.

దీనికి సంబంధించి– యహ్యా బిన్ సయీద్ బిన్ అల్ ముసయ్యిబ్ కథనం: ఉమర్ (రజి అల్లాహు అన్హు) చేతి వ్రేళ్ళ రక్త శుల్కానికి సంబంధించి ఇలా తీర్పు చేశారు – బొటన వ్రేలి రక్తశుల్కం 15 ఒంటెలు, దాని ప్రక్క వ్రేలు మరియు మధ్య వ్రేలికి గాను రక్త శుల్కం 10 ఒంటెలు, దాని ప్రక్క వేలి రక్త శుల్కం 9 ఒంటెలు మరియు చిన్ని వ్రేలు రక్త శుల్కం 6 ఒంటెలు. దీని తర్వాత ఆయనకు ఉమర్ బిన్ హజమ్ కుటుంబ గ్రంథంలో – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అన్ని చేతి వ్రేళ్ళ రక్త శుల్కం 10 ఒంటెలుగా నిర్ధారించారు – అన్న హదీసు లభ్యమవడం చూసి తన నిర్ణయాన్ని మార్చు కున్నారు. *(అర్రిసాల లిల్ ఇమామ్ అష్షాఫయీ – 422పేజి)*

(4) ఉమర్ (రజి అల్లాహు అన్హు) హజ్రె అస్వద్ (కాబా గోడలో అమర్చబడిన స్వర్గపు రాయి)ను ముద్దాడిన తర్వాత ఇలా సెలవిచ్చారు: 'జాగ్రత్త! నీవు కేవలం ఒక రాయివి మాత్రమే మరియు (ఇతరులకు) లాభనష్టాలేవీ చేకూర్చలేవు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిన్ను ముద్దాడుతుండగా నేను చూసి వుండక పోతే, నేనెప్పుడూ నిన్ను ముద్దాడే వాణ్ణి కాను.'

తదుపరి ఇంకా ఇలా సెలవిచ్చారు: 'మనమిప్పుడు రమల్ (కాబా గృహ ప్రదక్షిణలో మొదటి మూడు ప్రదక్షిణలు పురుషులు వేగంగా నడవడం) ఎందుకు చేయాలి? వాస్తవానికి ముష్రిక్కుల ముందు మా బలాన్ని ప్రదర్శించే నిమిత్తం

అప్పుడలా చేసేవాళ్ళం. ఇప్పుడు అల్లాహ్ వారిని నాశం చేసేశాడు. అయినా సరే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన జీవితంలో ఆచరించిన దానిని వదిలి పెట్టడానికి మేమే మాత్రం ఇష్టపడం.'

*(బుఖారీ : 1605, ముస్లిం : 1270)*

## (6) అభిప్రాయ భేదాలలో న్యాయనిర్ణేతలు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు తన ఉమ్మత్ (అనుచర సమాజం) పై వున్న ఆరవ హక్కు ఏమిటంటే – సమస్త వ్యాజ్యాలు, అభిప్రాయ భేదాల విషయంలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసులను న్యాయ నిర్ణేతలుగా స్వీకరించి వాటిని శిరసావహించి వాటికి వ్యతిరేకంగా ఇతరుల అభిప్రాయాలకూ, దృక్పథాలకూ ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వక పోవడం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

**فَلَا وَرَبِّكَ لَا يُؤْمِنُونَ حَتّٰى يُحَكِّمُوكَ فِيمَا شَجَرَ بَيْنَهُمْ ثُمَّ لَا يَجِدُوا فِيٓ اَنْفُسِهِمْ حَرَجًا مِّمَّا قَضَيْتَ وَيُسَلِّمُوا تَسْلِيمًا ﴿65﴾**

**"(ఓ దైవ ప్రవక్తా )! నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర వివాదాలన్నింటిలోనూ నిన్ను తీర్పరిగా చేసుకోనంత వరకూ, తదుపరి, నీవు వారి మధ్య చేసిన తీర్పు పట్ల వారు తమ మనసులలో ఎలాంటి సంకోచానికి, అసంతృప్తికీ ఆస్కారం యివ్వకుండా మనస్ఫూర్తిగా శిరసావహించనంత వరకూ – వారు విశ్వాసులు కాజాలరు". *(నిసా : 65)***

ఉర్వా బిన్ జుబైర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఆయన తండ్రి జుబైర్ (రజి అల్లాహు అన్హు)కు ఒక అన్సారీ సహచరునితో (సాబిత్ బిన్ ఖైస్ రజి అల్లాహు అన్హు) హిరా ప్రాంతంలో వున్న ఒక కాలువ విషయంలో గొడవ జరిగింది. అన్సారీ సోదరుడు తన తోట కోసం నీళ్ళను వదిలిపెట్టమని వేడుకోగా జుబైర్ (రజి అల్లాహు అన్హు) తిరస్కరించారు. యిద్దరూ తమ వ్యాజ్యాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు తీసుకొచ్చారు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాట్లాడుతూ – ఓ జుబైర్ ! నీవు నీ పొలానికి నీళ్ళు పట్టుకున్నాక నీ ప్రక్క వాడి తోటకు నీళ్ళను వదిలేయి అని అన్నారు. దీనిపై అన్సారీ సహచరుడు కోపగించుకొని – ఓ దైవ ప్రవక్తా! అతను మీ మేనత్త కుమారుడనే కదా మీరలా చేసింది అని అన్నాడు. ఇది విని

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముఖం రంగు మారిపోయింది. ఆయన మాట్లాడుతూ– ఓ జుబైర్! నీ పొలానికి నీళ్ళు పట్టు. పొలం అంతా నిండనంత వరకు నీళ్ళను వదలకు అని ఆజ్ఞాపించారు.

జుబైర్ (రజి అల్లాహు అన్హు) కథనం : దివ్య ఖుర్ఆన్‌లోని – "కాదు, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)! నీ ప్రభువు సాక్షిగా! వారు తమ పరస్పర విభేదాల విషయంలో నిన్ను న్యాయ నిర్ణేతగా స్వీకరించనంత వరకు, ఇంకా నీవు ఏ నిర్ణయం చేసినా దానిని గురించి వారి మనస్సులలో కూడా ఏ మాత్రం సంకోచం లేకుండా దానిని యథాతథంగా శిరసావహించనంత వరకూ వారు నిజమైన విశ్వాసులు కాలేరు" అన్న దైవ సూక్తి ఈ సందర్భంలోనే అవతరించిందని నా అభిప్రాయం.

*(సహీహ్ బుఖారీ : 2336, సహీహ్ ముస్లిం : 2357)*

సహీహ్ బుఖారీలోని మరో ఉల్లేఖనం ప్రకారం ఒక వ్యక్తి అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) తో హజ్రె అస్వద్ (కాబా గోడలో అమర్చబడిన స్వర్గపు రాయి)ను తాకడం గురించి ప్రశ్నించాడు. ఆయన జవాబిస్తూ – నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను దీనిని తాకి, ముద్దాడుతుండగా చూశాను అని అన్నారు.

ఆ వ్యక్తి : అంటే ఒకవేళ (ప్రజల) గుంపులో ఇరుక్కుపోయినప్పటికీ దానిని తాకాలని మీ అభిప్రాయమా? మరియు ప్రజలు నాపై ప్రాబల్యం వహించినా దానిని నేను తాకాలని మీ అభిప్రాయమా?

అబ్దుల్లా బిన్ ఉమర్: నీవు "మీ అభిప్రాయమా?" అని అంటున్నావే, ఈ మాటను యమన్ (ఒక దేశం పేరు) లో విడిచి పెట్టిరా. నాకు కేవలం తెలిసిందేమిటంటే, నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను హజ్రె అస్వద్‌ను తాకి, దానిని ముద్దాడగా చూశాను. *(బుఖారీ : 1611)*

దీని ద్వారా తెలిసిందేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)సున్నత్ గురించి తెలిసిన తర్వాత ఇక ఎవరి అభిప్రాయానికీ ఏ మాత్రం విలువ వుండదు. ఆ అభిప్రాయం సహాబీది అయినా సరే!

కానీ, ఎంత దురదృష్టకరమైన పరిస్థితి! నేటి కాలంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పవిత్ర సున్నతులను వివరించే ప్రామాణిక

హదీసులు వినిపించినప్పటికీ, వాటికి వ్యతిరేకంగా తమ తమ ఇమాముల, ఉలమాల అభిప్రాయాలను వ్యక్త పరిచే ఎంతో మంది నేడు వున్నారు!

వాస్తవానికి ఇది ఎంత పెద్ద ధైర్యమంటే – దీని గురించి ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) అల్లాహ్ శిక్ష అవతరణకు కారణం కావచ్చన్న సందేహం వెలిబుచ్చారు.

ఇమామ్ ఇబ్నె అబ్దుల్ బర్ర్ (రహిమహుల్లాహ్), ఉర్వా ద్వారా ఉల్లేఖించిన దాని ప్రకారం – ఆయన (ఉర్వా) ఇబ్నె అబ్బాస్‌తో – మీరు అల్లాహ్‌తో భయపడరా? హజ్ తమత్తుకు అనుమతిస్తున్నారు అని అడిగారు.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ : ఓ ఉర్వా! నీవు నీ తల్లిని అడుగు.

ఉర్వా: అబూ బక్ర్ మరియు ఉమర్ (రజి అల్లాహు అన్హుమ్)లు హజ్ తమత్తు చేయలేదు.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ : అల్లాహ్ సాక్షి! అల్లాహ్ శిక్ష అవతరిస్తే గానీ మీరు దారికి రారు అని అనిపిస్తోంది. మేము మీకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసును వినిపిస్తుంటే, దానికి వ్యతిరేకంగా మీరు అబూ బక్ర్ మరియు ఉమర్ (రజి అల్లాహు అన్హుమ్) ల గురించి మాట్లాడుతున్నారు.

మరో ఉల్లేఖనంలో ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు: అతి త్వరలోనే వారు నాశనమైపోతారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారని నేను చెబుతుంటే, అబూ బక్ర్ మరియు ఉమర్ (రజి అల్లాహు అన్హుమ్)లు (ఇలా చేసారు) అని వీరు చెబుతున్నారు.
*(సహీహ్ జామెఉల్ బయానుల్ ఇల్మ్ వ ఫజ్లిహి లి ఇబ్నె అబ్దుల్ బర్ర్ – అబుల్ ఇష్‌బాల్–525వ పేజీ)*

## దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసును వ్యతిరేకించే వారిపై సహాబాల కఠిన ప్రవర్తన

(1) సాలిమ్ బిన్ అబ్దుల్లా కథనం ప్రకారం అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఓ సారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసును ఇలా ఉల్లేఖించారు– ‘ఒకవేళ మీ (ఇంటి) స్త్రీలు మిమ్మల్ని మస్జిద్‌కు వెళ్ళడానికి అనుమతి అడిగితే మీరు వారిని నిరాకరించకండి.’

ఇది విని అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కుమారుడు బిలాల్ బిన్ అబ్దుల్లా – 'అల్లాహ్ సాక్షి! మేమైతే తప్పకుండా వారిని (స్త్రీలను) అడ్డుకుంటాం' అని అన్నారు. ఇది విని అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) అతని వైపునకు తిరిగి అతణ్ణి చాలా చీవాట్లు పెట్టారు. ఆయన ఇంతగా చీవాట్లు పెట్టడం నేనెప్పుడూ చూడలేదు. తదుపరి ఆయన ఇలా సెలవిచ్చారు – 'నేను మీకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసును వినిపిస్తుంటే నువ్వేమో అల్లాహ్ సాక్షి, మేం తప్పకుండా స్త్రీలను అడ్డుకుంటాం అని చెబుతావా?' *(ముస్లిం : 442)*

మరొక ఉల్లేఖనం ప్రకారం అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసును ఇలా ఉల్లేఖించారు – 'స్త్రీలను రాత్రి పూట మసీదులకు వెళ్ళడానికి అనుమతిస్తూ వుండండి.' ఇది విని ఆయన కుమారుడైన వాఖిద్ ఇలా అన్నాడు – మరైతే వారు దీనిని తమ చెడు చేష్టలకు అనువుగా చేసుకుంటారు!

దీనిపై అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) అతని రొమ్ముపై గుద్ది ఇలా సెలవిచ్చారు – 'నేను మీకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసును వినిపిస్తుంటే నీవేమో కాదని అంటావు.' *(ముస్లిం)*

ఈ హదీసు ప్రయోజనాలను గురించి వివరిస్తూ ఇమామ్ నవవీ (రహిమహుల్లాహ్) ఇలా పేర్కొన్నారు:

ఈ హదీసు ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – ఏ వ్యక్తి అయినా సున్నత్ పట్ల అయిష్టత వ్యక్తం చేసి దానికి వ్యతిరేకంగా దాని స్థానంలో తన అభిప్రాయాన్ని వ్యక్తపరిస్తే అలాంటి వ్యక్తిని శిక్షించవచ్చు. అలాగే, తెలిసిన మరో విషయమేమిటంటే, తను పెద్దవాడైనప్పటికీ, తండ్రి తన కుమారుణ్ణి శిక్షించవచ్చు. *(షరహ్ అన్నవవీ ముస్లిం)*

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన ఈ హదీసు కారణంగానే ఉమర్ (రజి అల్లాహు అన్హు) – తాను కఠిన మనస్కులైనప్పటికీ తన భార్యలను మసీదులకు వెళ్ళకుండా అడ్డుకునేవారు కారు. దీనిని గూర్చి ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) స్వయంగా సెలవిచ్చిన దాని ప్రకారం – ఉమర్ (రజి

అల్లాహు అన్హు) సతీమణుల్లో ఒకరు ఇషా మరియు ఫజ్ర్ నమాజులను మసీదుకు వెళ్ళి జమాత్‌తో కలిసి చదివేవారు. దీని గురించి ఆమెతో – మీరు మసీదుకు వచ్చి ఎందుకు నమాజు చదువుతున్నారు? ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఎంతో ఆత్మాభిమానం కలవారని మరియు ఈ విషయాన్ని ఇష్ట పడరని మీకు తెలుసుగా? అని ప్రశ్నించబడింది. దీనిపై ఆమె – మరైతే ఆయన నన్ను ఎందుకు వారించడం లేదు? అని అడిగారు. ఆమెకు జవాబిస్తూ – “మీరు అల్లాహ్ దాసీలను మసీదులకు వెళ్ళకుండా అడ్డుకోకండి” అన్న దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞ ఉమర్ (రజి అల్లాహు అన్హు)కు, మిమ్మల్ని వారించకుండా ఆపుతోంది – అని అనబడింది. *(బుఖారీ : 900)*

దీని ద్వారా తెలిసిందేమిటంటే – ఉమర్ (రజి అల్లాహు అన్హు) స్వతహాగా తన సతీమణులు మసీదుకు వెళ్ళడాన్ని ఇష్టపడనప్పటికీ, ఆయన వారిని వారించలేదు. దీనికి కారణం ఏమిటి? కేవలం ఆయన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హదీసు ‘మీరు అల్లాహ్ దాసీలను మసీదులకు వెళ్ళకుండా అడ్డుకోకండి’ను విని వుండడం. ఈ కారణం వల్లే ఆయన తన సతీమణులను మసీదులకు వెళ్లకుండా అడ్డుకొనే వారు కారు.

(2) అబ్దుల్లా బిన్ బరీరా కథనం ప్రకారం అబ్దుల్లా బిన్ ముగ్‌ఫిర్ (రజి అల్లాహు అన్హు) ఒక వ్యక్తి (ఆయన బంధువు)ని చిన్న కంకర్రాళ్ళను లేపి విసురుతుండడం చూసి అతనితో – ఇలా చేయకు, ఎందుకంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనిని వారిస్తూ లేదా అయిష్టత వ్యక్తం చేస్తూ ఇలా సెలవిచ్చారు: ఇలా చేసి జంతువులను వేటాడనూ లేము మరియు శత్రువుపై ప్రాబల్యం కూడా వహించలేం. దీని ద్వారా ఒకరి దంతాలు విరగ్గొట్టవచ్చు లేదా కండ్లు పగల గొట్టవచ్చు.

తదుపరి అబ్దుల్లా బిన్ ముగ్‌ఫిర్ (రజి అల్లాహు అన్హు) ఆ వ్యక్తిని మరో సారి మునుపటిలాగానే కంకర్రాళ్ళు విసిరివేస్తుండడం చూసి ఇలా అన్నారు – ‘నేను నీకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనిని వారించారు లేదా అయిష్టత వ్యక్తం చేశారన్న హదీసు విన్పించినా నువ్వు ఈ పనిని మానుకోలేదు. కనుక నేను ఇక ఇంత...ఇంత కాలం వరకు నీతో మాట్లాడను పో.’

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది – నేను నీతో ఇక ఎప్పుడూ మాట్లాడను.

*(బుఖారీ : 5479, ముస్లిం: 1954)*

అల్లాహ్‌ను ప్రార్థించేదేమిటంటే – ఆయన మనందరికీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసులను గౌరవించి, వాటిని అనుసరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్ !!

## రెండవ ఖుత్బా

## (7) ఖురాను మరియు హదీసులపై ఆచరణ

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఈ ఉమ్మత్‌పై వున్న ఏడవ హక్కు ఏమిటంటే– ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన మరణానికి పూర్వం తన ఉమ్మత్ (అనుచర సమాజం)కు ఇచ్చి వెళ్ళిన రెండు వస్తువులను బాగా అధ్యయనం చేయాలి మరియు వాటి ద్వారానే సమస్త ఇస్లామీయ బోధనలను గ్రహించాలి. అవి దివ్య ఖురాను మరియు ప్రామాణికంగా నిర్ధారించ బడ్డ సున్నతులు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు:“నేను మీ మధ్య రెండు వస్తువులు వదిలి వెళుతున్నాను. వీటి తర్వాత (ఒకవేళ మీరు గనక వీటిని గట్టిగా పట్టుకొంటే) మీరెప్పుడూ మార్గ భ్రష్టులు కాలేరు. వాటిలో ఒకటి అల్లాహ్ గ్రంథం (దివ్య ఖురాను) కాగా రెండవది నా సున్నతు. కౌసర్ సరస్సు వద్ద నా దగ్గరకు వచ్చే వరకు ఈ రెండు (ఖురాను, సున్నత్)ఎప్పుడూ వేరు కాజాలవు.” *(సహీ ఉల్ జామె : 2937)*

కనుక ప్రతి ఒక్కరిపై విధిగా వున్న విషయమేమిటంటే – ధార్మిక విషయాలన్నింటినీ దివ్య ఖురాను మరియు ప్రామాణిక హదీసుల నుండి సంగ్రహించాలి. అప్పుడే వారు మార్గభ్రష్టులు కాకుండా సన్మార్గంలో నడవ గలుగుతారు.

## (8) అధికంగా దరూద్ పఠనం

ఉమ్మత్ (అనుచర సమాజం)పై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు గల ఎనిమిదవ హక్కు ఏమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)పై అధికంగా దరూద్ పఠించాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ اللَّهَ وَمَلَائِكَتَهُ يُصَلُّونَ عَلَى النَّبِيِّ ۚ يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا صَلُّوا عَلَيْهِ وَسَلِّمُوا تَسْلِيمًا ﴿٥٦﴾

**"నిశ్చయంగా అల్లాహ్, ఆయన దూతలు కూడా దైవప్రవక్త పై కారుణ్యాన్ని (దరూద్) పంపిస్తున్నారు. ఓ విశ్వాసులారా! మీరుకూడా అతనిపై దరూద్ పంపండి. అత్యధికంగా అతనికి సలాములు పంపుతూ వుండండి".**

***(అహ్జాబ్ :56)***

ఈ ఆయతు అవతరించిన తర్వాత సహాబాలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో – ఓ దైవ ప్రవక్తా! సలామ్ చేసే పద్ధతి మాకు తెలుసు. మరి మీపై దరూద్ ఎలా పంపాలి? అని అడిగారు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారితో – మీరు ఇలా పలకండి అని అన్నారు: **"అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మద్, వ అలా ఆలి ముహమ్మద్, కమా సల్లైత అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్. అల్లాహుమ్మ బారిక్ అలా ముహమ్మద్, వ అలా ఆలి ముహమ్మద్, కమా బారక్త అలా ఇబ్రాహీమ వ అలా ఆలి ఇబ్రాహీమ ఇన్నక హమీదుమ్మజీద్."** *(బుఖారీ : 3370)*

అన్నింటి కన్నా శ్రేష్ఠమైన దరూద్ ఇదే. దీనినే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహాబాలకు నేర్పించారు. దరూద్ యొక్క అత్యంత శుభకర పదజాలం కూడా ఇదే. ఎందుకంటే ఈ పదాలు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నోటి నుండి వెలువడ్డాయి. మరి చూడబోతే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాట్లాడదేదంతా వహీ (దైవ వాణి) అయివుంటుంది. దానికి విరుద్ధంగా ఆయన ఎప్పుడూ మాట్లాడరు.

ప్రామాణిక (సహీ) హదీసులలో ఈ దరూద్‌పై ఉల్లేఖించబడ్డ పదజాలంలో దేనితోనైనా మనం దరూద్ పఠించవచ్చు.

దరూద్ పంపడం వలన కలిగే ప్రయోజనాలు ఎన్నో హదీసులలో ఉల్లేఖించబడ్డాయి. ఇక్కడ మేము కొన్నింటిని వివరిస్తున్నాం:

(1) అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:" ఏ వ్యక్తి అయినా నాపై ఒక్కసారి దరూద్ పంపుతే, అల్లాహ్ అతనిపై 10 కారుణ్యాలు అవతరింప జేస్తాడు." *(ముస్లిం : 409)*

(2) అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “ఏ వ్యక్తి అయినా నాపై ఒక్కసారి దరూద్ పంపితే, అల్లాహ్ అతనిపై 10 కారుణ్యాలు అవతరింపజేస్తాడు, 10 పాపాలు తుడిచేస్తాడు మరియు పది స్థానాలు పైకి లేపుతాడు.”

*(సహీ ఉల్ జామె: 6359)*

(3) అబూ దర్దా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:“ఏ వ్యక్తి అయినా ఉదయం 10 సార్లు మరియు సాయంత్రం 10 సార్లు నాపై దరూద్ పంపిస్తాడో అతనికి ప్రళయం రోజు నా సిఫారసు భాగ్యం లభిస్తుంది.”

*(సహీ ఉల్ జామె : 6357)*

కనుక వీలైనంత ఎక్కువగా దరూద్‌ను పఠిస్తూ వుండాలి.

ఉబై బిన్ కాబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఆయన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో ఓ దైవ ప్రవక్తా! నేను మీపై అధికంగా దరూద్ పఠిస్తూ వుంటాను. మీపై నేను ఎంత దరూద్ పఠించాలి? దీనిపై మీ అభిప్రాయమేమిటి? అని అడిగారు. ఆయన జవాబిస్తూ – ‘నీ ఇష్టమొచ్చినంత’ అని అన్నారు.

ఉబై బిన్ కాబ్ (రజి అల్లాహు అన్హు) : నాల్గవ భాగం (పఠించనా)?

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) : నీ ఇష్టమైనంతగా, కానీ దీని కన్నా ఎక్కువగా పఠించగలిగితే అది నీకే మేలు.

ఉబై బిన్ కాబ్ (రజి అల్లాహు అన్హు): సగ భాగం (పఠించనా)?

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం): నీ ఇష్టమైనంతగా, కానీ దీని కాన్నా ఎక్కువగా పఠించగలిగితే అది నీకే శ్రేయస్కరం.

ఉబై బిన్ కాబ్ : మూడింట రెండు వంతులు?

దైవప్రవక్త : నీ ఇష్టమైనంతగా, కానీ దీని కన్నా ఎక్కువగా పఠించగలిగితే అది నీకే మేలు.

ఉబై బిన్ కాబ్ : (సంపూర్ణంగా) మీపై దరూద్‌నే పఠిస్తూ వుంటే?

దైవ ప్రవక్త : అప్పుడు మీ కష్టాలు దూరం కావడానికి ఇది (ఈ ఆచరణ) చాలు మరియు (దీని వల్ల) మీ పాపాలన్ని క్షమించబడతాయి.

*(తిర్మిజీ: 2456, సహీహ్ – అల్‌బానీ)*

ఆఖరిగా అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే – ఆయన మనల్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హక్కులన్నింటినీ నెరవేర్చే , ఆయనకు విధేయత చూపే, ఆయనను ప్రేమించే సద్బుద్ధిని ప్రసాదించుగాక మరియు ప్రళయం రోజు ఆయన సిఫారసు మరియు ఆయన చేతుల మీదుగా కౌసర్ సరస్సు నీటిని సేవించగలిగే మహా భాగ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్!

# దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అత్యుత్తమ గుణగణాలు

## ఖుత్బాయందలి ముఖ్యాంశాలు:

(1) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అత్యుత్తమ గుణగణాల గురించి ఖురాన్ మరియు తౌరాత్ గ్రంథాల సాక్ష్యం.

(2) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గుణగణాలను గూర్చి అనేక మంది సహాబాల సాక్ష్యం.

(3) అత్యుత్తమ గుణగణాల నమూనాలు.

ఇస్లామీయ సహోదరులారా!

నేటి జుమా ఖుత్బా యొక్క అంశం – "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అత్యుత్తమ గుణగణాలు".

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గుణగణాల్ని చర్చించే ముందు మనమందరం ఒక విషయాన్ని బాగా గుర్తుంచుకోవాలి. అదేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లాహ్ యొక్క ప్రవక్త అవడంతో పాటు దైవప్రవక్త లందరికీ నాయకులు (ఇమామ్). ప్రవక్త పాలనా పోషణలు స్వయంగా అల్లాహ్ చూస్తాడు. ఇలా అతణ్ణి, నిత్యం పరిశుద్ధం చేస్తూ గుణగణాల్లో, నైతికతలో అందరికన్నా ఉత్తముడిగా, ఆదర్శవంతునిగా తీర్చిదిద్దుతాడు. ప్రవక్త సంరక్షకుడు స్వయానా అల్లాహ్ కనుక దివ్య ఖురాన్‌లో రెండు విషయాలపై ఒట్టేసి మరీ ఆయన ప్రవక్తల నాయకులైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గుణగణాలను గూర్చి సాక్ష్యమిచ్చాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

نٓ وَالْقَلَمِ وَمَا يَسْطُرُوْنَ ① مَآ اَنْتَ بِنِعْمَةِ رَبِّكَ بِمَجْنُوْنٍ ②
وَاِنَّ لَكَ لَاَجْرًا غَيْرَ مَمْنُوْنٍ ③ وَاِنَّكَ لَعَلٰى خُلُقٍ عَظِيْمٍ ④

**"నూన్– కలము సాక్షిగా! వారు (దైవదూతలు) వ్రాసే సాక్షిగా! (ఓ ముహమ్మద్)! నీ ప్రభువు అనుగ్రహం వల్ల నీవు పిచ్చివాడవు కాదు.**

**నిశ్చయంగా నీకు ఎన్నటికీ తరగని పుణ్యఫలం లభిస్తుంది. ఇంకా నీవు నైతికంగా అత్యున్నత స్థానంలో వున్నావు".** ***(ఖలమ్ : 1-4)***

ప్రవక్త ఎల్లప్పుడూ దైవ వాణి (వహీ)ని అనుసరిస్తాడు. కనుక ఆ దైవవాణే వాస్తవానికి అతని నైతికత, గుణగణాలు అయివుంటాయి. అందుకే ఓ సారి ఆయెషా (రజి అల్లాహు అన్హా)తో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గుణగణాల గురించి అడగ్గా ఆమె జవాబిస్తూ - ఆయన గుణగణాలు స్వయానా దివ్య ఖురానే అని అన్నారు. *(ముస్నద్ అహ్మద్ - సహీఉల్ అర్నావూత్)*

అంటే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దివ్య ఖురానుకు ఆచరణా ప్రతిబింబము అన్నమాట.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గుణగణాల సాక్ష్యం కేవలం ఖురానులోనే కాదు, మునపటి ఆకాశ గ్రంథాలలో కూడా లభ్యమై వుంది.

అతా బిన్ యసార్ (రహిమహుల్లాహ్) కథనం: "నేనొక సారి అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు)ను కలిసి ఆయనతో - తౌరాత్‌లో వివరించబడ్డ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గుణగణాలను గూర్చి వివరించండి- అని అడిగాను. ఆయన జవాబిస్తూ - సరే, అల్లాహ్ సాక్షి! దివ్య ఖురానులో వివరించబడ్డ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కొన్ని గుణగణాలే తౌరాత్ లోనూ వివరించబడ్డాయి.

దివ్య ఖురాన్‌లో ఇలా వుంది: 'ఓ ప్రవక్తా! మేము నిన్ను సాక్షిగా, శుభవార్తాహరుడిగా, భయపెట్టేవాడిగా చేసి పంపాము.' తౌరాత్‌లో కూడా ఈ గుణగణాలు వివరించబడ్డాయి. వీటితో పాటు తౌరాత్‌లో ఇంకా-ఆయన అరబ్బుల కోసం కోటగా వుంటారని, ఆయన నా(అల్లాహ్)దాసులు మరియు ప్రవక్త అని, ఆయన పేరు 'ముతవక్కల్' (అల్లాహ్‌పై నమ్మకం వుంచేవాడు) అని నేను పెట్టాను - అని వుంది. ఇంకా ఆయన గుణగణాల్లో ఇవి కూడా వివరించబడ్డాయి - ఆయన దుర్గుణులు, కఠినులు కారు మరియు బజార్లలో గొంతెత్తి సంభాషించరు. చెడును చెడుతో సమాధానం ఇవ్వకుండా, దానిని ఉపేక్షించి క్షమిస్తారు అని వివరించారు. *(బుఖారీ : 4838)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అత్యుత్తమ గుణగణాలను గూర్చి దివ్య ఖురాను మరియు తౌరాత్ గ్రంథాల సాక్ష్యం తర్వాత మరి కొందరి సాక్ష్యం కూడా వినండి!

## ఖదీజా (రజి అల్లాహు అన్హ) సాక్ష్యం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)పై మొదటి వహీ (దైవ వాణి) అవతరించినప్పుడు ఆయన ఎంతగానో గాబరా పడి త్వరత్వరగా ఇంటికి చేరుకొని–నాకైతే నా ప్రాణానిక్కూడా ముప్పు వుందనిపిస్తోంది అని అనగానే ఖదీజా (రజి అల్లాహు అన్హ) (ఆయనకు ధైర్యం చెబుతూ) ఇలా అన్నారు – అలా ఎప్పటికీ జరగదు – మీకు శుభవార్తే. అల్లాహ్ సాక్షి ! అల్లాహ్ మిమ్మల్ని అవమానం పాలు చేయడు. అల్లాహ్ సాక్షి! మీరు బంధుత్వ సంబంధాలు నెలకొల్పుతారు, సత్యం పలుకుతారు, ఇతరుల భారాన్ని మోస్తారు, అగత్యం కలవారికి సహాయపడతారు, ఆతిథ్యమిస్తారు మరియు సత్యవంతులకు తోడ్పడతారు. *(బుఖారీ, కితాబ్ బద్'యల్ వహీ, ముస్లిం : 16)*

## అవిశ్వాస ఖురైషీయుల సాక్ష్యం

దైవ దౌత్య బాధ్యత లభించడానికి పూర్వం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రజలలో 'సాదిఖుల్ అమీన్" (సత్యసంధులు మరియు అమానతుదారులు) అని ప్రసిద్ధిగాంచి వున్నారు. అంటే – ప్రజలు ఆయనను – ఎల్లప్పుడూ సత్యం పలికే వారు మరియు అమానతులను కాపాడేవారు అని స్వీకరించి వున్నారు.

తదుపరి దైవ దౌత్య బాధ్యత ఇవ్వబడ్డాక, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)పై – 'మీ దగ్గరి బంధువులను భయపెట్టు' అన్న ఆయతు అవతరించాక, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సఫా కొండపైకెక్కి ఖురైషీయులను పిలిచారు. వాళ్ళు అక్కడికి చేరుకోగానే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారి నుద్దేశించి ఇలా అడిగారు –

"ఈ కొండ వెనుక వైపు నుండి ఒక అశ్విక దళం మీపై దండెత్తడానికి సిద్ధంగా వుందని నేనొకవేళ మీతో చెబితే దాన్ని మీరు నమ్ముతారా? దీనిపై వారంతా ముక్త కంఠంతో – మేము ఎల్లప్పుడూ మిమ్మల్ని సత్యం పలుకుతూనే చూశాము – అని అన్నారు. *(బుఖారీ : 4770)*

హుదైబియా ఒప్పందం తరుణంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రోమ్ చక్రవర్తి (హెరిక్లెస్) కి ఇస్లాం స్వీకరించమని ఆహ్వానిస్తూ లేఖ వ్రాశారు. ఆ సమయంలో అబూ సుఫ్యాన్ బిన్ హర్బ్ నాయకత్వంలో

ఖురైషీయుల ఒక సమూహము రోమ్‌లో వుంది. హెరిక్లెస్ రాజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) లేఖను చదవడానికి ముందుగా అబూ సుఫ్యాన్ మరియు ఆయన సమూహానికి చెందిన ఇతర వ్యక్తులను తన దర్బారుకు పిలిపించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గురించి కొన్ని ప్రశ్నలు వేశాడు. అబూ సుఫ్యాన్ అప్పటి వరకు ముస్లిం కాకపోయినప్పటికీ ఎంతో నిజాయితీగా హెరిక్లిస్ రాజుకు జవాబిచ్చారు.

అతను అడిగిన ప్రశ్నలలో ఒక ప్రశ్న ఏమిటంటే – దైవ దౌత్య ప్రకటనకు పూర్వం మీరెప్పుడైనా ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అసత్యమాడినట్లు, ఆయనపై నింద మోపారా?అని. దీనికి అబూ సుఫ్యాన్ 'లేదు' అని జవాబిచ్చారు. తదుపరి అతను–ఆయన (దైవప్రవక్త) మీకు ఏ విషయాల గురించి ఆజ్ఞాపిస్తున్నారు? అని అడిగాడు. అబూ సుఫ్యాన్ జవాబిస్తూ – ఆయన మమ్మల్ని ఒకే అల్లాహ్‌ను ఆరాధించమని, ఆయనకు భాగస్వాములు కల్పించవద్దని, పూర్వీకుల (అజ్ఞానపు) మాటలను త్యజించమని ఆజ్ఞాపిస్తున్నారు. ఇంకా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు నమాజు చదవమని, సత్యం పలకమని, శీలాన్ని కాపాడుకోమని మరియు బంధుత్వ సంబంధాలు కాపాడుకోమని ఆజ్ఞాపిస్తున్నారు.

అన్ని ప్రశ్నలకు జవాబులు విన్న తర్వాత వాటిని విశ్లేషిస్తూ హెరిక్లెస్ ఇలా వ్యాఖ్యానించాడు– దైవ దౌత్య ప్రకటనకు పూర్వం అతను అసత్యమాడలేదు కనుక, ప్రజల విషయంలో అసత్యమాడని వారు అల్లాహ్ విషయంలో అసత్యమాడలేరు అన్న నమ్మకం నాకుంది. ఇక మీరు చెప్పినట్లు – ఆయన మీకు ఒకే అల్లాహ్‌ను ఆరాధించమని, ఆయనకు భాగస్వాములు కల్పించవద్దని, ఇంకా మీకు నమాజ్ చదవమని, సత్యం పలకమని, శీలాన్ని కాపాడుకోమని మరియు బంధుత్వ సంబంధాలు కాపాడుకోమని ఆజ్ఞాపిస్తున్నారని మీరంటున్నారే – ఒకవేళ ఇదే కనుక సత్యం అయితే, అతి త్వరలోనే ఆయన తప్పకుండా ఈ రాచరికపు సింహాసనాన్ని అధిష్ఠించడం ఖాయం. అలాంటి వ్యక్తి త్వరలోనే రాబోతున్నాడని నాకు నమ్మకం వుండేది. కానీ, ఆయన మీలో అవతరిస్తారని నాకు తెలియదు. నేనొక వేళ ఆయనను చేరుకోగలిగితే దాని కోసం తప్పకుండా ప్రయత్నిస్తాను మరియు ఒకవేళ ఆయన్ను చేరుకొంటే ఆయన పాదాలు కడిగి శుభ్రం చేస్తాను. *(బుఖారీ: 7, ముస్లిం : 1773)*

ఇదే విధంగా సాయిబ్ అల్ మఖ్జూమీ (రజి అల్లాహు అన్హు) కథనం: నేనొక సారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి రాగా ప్రజలు నన్ను పొగుడ్తూ నా గురించి చర్చించడం మొదలు పెట్టారు. దీనికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ–'ఇతని గురించి మీ కన్నా నాకు బాగా తెలుసు' అని అన్నారు. అప్పుడు నేను –'నా తల్లిదండ్రులు మీకు అర్పితమవుగాక!' మీరు సత్యం పలికారు. మీరు (అజ్ఞాన కాలంలో) నాతో పాటు (వ్యాపారంలో) పాలు పంచుకునేవారు. మీరు చాలా మంచి భాగస్వామి. మీరు నన్ను వ్యతిరేకించే వారు కూడా కాదు, నాతో గొడవపడేవారు కూడా కాదు' అని అన్నారు.

*(అబూదావూద్ :4836, ఇబ్నెమాజ : 2287,సహీహ్ – అల్‌బానీ)*

ఇమామ్ ఖత్తాబీ ఈ హదీసుపై వ్యాఖ్యానిస్తూ ఇలా వివరించారు: హదీసులో సాయిబ్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యొక్క వ్యవహారాల్లో మెతక వైఖరి మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) అత్యుత్తమ సుగుణాలను ప్రస్తావించారు. *(ముఆలిముస్సునన్)*

## అబ్దుల్లా బిన్ సలామ్ (రజి అల్లాహు అన్హు) సాక్ష్యం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హిజ్రత్ చేసి మదీనా విచ్చేసినప్పుడు అబ్దుల్లా బిన్ సలామ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజలకు ఇలా బోధిస్తూ వున్నారు: మీరు సలాం ను వ్యాపింపజేయండి, అన్నం తినిపించండి, బంధుత్వ సత్సంబంధాలు నెలకొల్పండి మరియు ప్రజలు నిద్రపోయే సమయంలో (రాత్రి) మీరు నమాజు చేయండి– ఇలా శాంతియుతంగా మీరు స్వర్గంలోకి ప్రవేశించగలుగుతారు.

*(తిర్మిజీ : 2485, ఇబ్నె మాజ : 1334, సహీహ్ – అల్‌బానీ)*

## అనస్ (రజి అల్లాహు అన్హు) సాక్ష్యం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు 10 సం॥లు సేవ చేసిన అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎప్పుడూ కోపగించుకొనేవారు కాదు, పిచ్చిపిచ్చిగా మాట్లాడేవారు కాదు మరియు

శపించేవారు కూడా కాదు. ఎప్పుడైనా ఎవరినైనా కోప్పడాల్సి వస్తే కేవలం ఇలా అనేవారు – ఇతనికేమయ్యింది? ఇతని మొహానికి మన్నుతగల!

*(బుఖారీ : 6031)*

అలాగే ఆయన ఇలా కూడా సెలవిచ్చారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అందరి కాన్నా ఉత్తమమైన గుణగణాలు కలిగి వున్నారు. ఒకరోజు నన్ను ఏదో పని నిమిత్తం పురమాయించగా నేను లోలోపల ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞను శిరసావహించి వెళ్ళడానికి నిశ్చయించుకొని, పైకి మాత్రం నేను వెళ్ళనని చెప్పేశాను. ఆ తర్వాత నేను వెళుతూ వుండగా దారిలో కొంత మంది పిల్లలు ఆడుతూ కనిపించారు. (దీనితో నేను కూడా వారితో కలిసిపోయాను). అకస్మాత్తుగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అక్కడికి విచ్చేసి వెనుక వైపు నుండి నా మెడను పట్టుకున్నారు. నేను ఆయన వైపు తిరిగి చూస్తే ఆయన నవ్వుతూ – ప్రియమైన ఓ అనస్ ! నేను ఆజ్ఞాపించిన వద్దకు నీవు వెళ్ళావా? అని అడిగారు. నేను జవాబిస్తూ – ఇప్పుడే వెళు తున్నాను ఓ దైవ ప్రవక్తా! అని చెప్పి అక్కణ్ణుండి బయలుదేరాను.

*(ముస్లిం – కితాబుల్ ఫజాయెల్)*

## అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి అల్లాహు అన్హు) సాక్ష్యం

అబ్దుల్లా బిన్ అమ్ర్(రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వ్యర్థ సంభాషణ చేసేవారు కాదు, దాని కోసం ప్రయత్నించే వారు కూడా కాదు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెవిచ్చేవారు– మీలో సద్గుణాల రీత్యా ఉత్తముడెవరో అతనే అందరికన్నా శ్రేష్ఠుడు.

*(బుఖారీ: 6035, ముస్లిం: 2321)*

## సఫియా బిన్తె హై (రజి అల్లాహు అన్హా) సాక్ష్యం

ఈమె దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రియ సతీమణుల్లో ఒకరు మరియు విశ్వాసుల మాతృమూర్తి. తను ఇలా తెలియజేశారు: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కన్నా ఎక్కువ సద్గుణ సంపన్నుణ్ణి చూడలేదు.

*(హాఫిజ్ ఇబ్నె హజర్ ఫతహుల్‌బారీ–6/575 నందు ఇలా పేర్కొన్నారు–తబ్రానీ తన ఔసత్ నందు దీనిని విశ్లేషించి హసన్ గా ఖరారు చేశారు)*

ఇలా, దివ్య ఖురాన్ మరియు తౌరాత్ సాక్ష్యాలతో పాటు మేము చర్చించిన సాక్ష్యులలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ప్రేమించే వారూ వున్నారు, ఆయనను ద్వేషించేవారూ వున్నారు, ఆయన ఇంటి వారూ వున్నారు మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) సేవకులూ వున్నారు.

ఇలా అందరూ – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నైతికత, గుణగణాల్లో అత్యున్నత స్థానంలో వున్నారని సాక్ష్యమిచ్చారు.

## దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సద్గుణాల్లోని కొన్ని అంశాలు

### (1) దాతృత్వము

❖ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఎప్పుడైనా ఏ వస్తువు గురించైనా అడిగితే ఆ ప్రశ్నించే వాడిని ఎప్పుడూ 'కుదరదు' అని అనలేదు (అంటే నిరాకరించలేదు).

*(బుఖారీ : 6034, ముస్లిం : 2311)*

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) "ఇస్లాం స్వీకరణ" అన్న షరతుపై ఏదడిగినా ఇచ్చేసేవారు. ఒకసారి ఓ వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు రాగా అతనికి – రెండు కొండల మధ్య గల ఖాళీ ప్రదేశాన్ని నింపగలిగేటన్ని మేకలు ఇచ్చేశారు. తదుపరి ఆ వ్యక్తి తన బస్తీ వాసుల దగ్గరికొచ్చి ఇలా ప్రకటించాడు – ఓ నా బస్తీవాసులారా! మీరంతా ఇస్లాం స్వీకరించండి. ఎందుకంటే ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బీదరికానికి ఏమాత్రం భయడకుండా దానం చేస్తారు. *(ముస్లిం : 2312)*

❖ అలాగే ఆయన (అనస్ రజిఅల్లాహు అన్హు) ఈ విధంగా కూడా ఉల్లేఖించారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఏ వస్తువు గురించైనా అడిగితే – ఆయన దానిని ఇచ్చేసే వారు లేదా మౌనం వహించేవారు.

*(అహ్మద్, ఇబ్నె హిబ్బాన్)*

❖ సహీహ్ ముస్లింలో ఇబ్నె షిహాబ్ అజ్జొహరీ ద్వారా ఇలా ఉల్లేఖించబడింది: మక్కా విజయం తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సహచరులను వెంటపెట్టుకొని హునైన్ చేరుకున్నారు. అక్కడ అవిశ్వాసులతో జరిగిన యుద్ధం అనంతరం అల్లాహ్ తన ధర్మానికి మరియు ముస్లిములకు ఆధిపత్యాన్ని ప్రసాదించాడు. ఆ రోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సఫ్వాన్ బిన్ ఉమయ్యకు 100 పశువులు ఇచ్చారు. తదుపరి మరో వంద, ఆ తర్వాత మరో వంద ఇచ్చారు.

ఇబ్నె షిహాబ్ కథనం: నాతో సయీద్ బిన్ అల్ ముసైబ్ – తనకు సఫ్వాన్ ఇలా చెప్పారని వివరించారు – అల్లాహ్ సాక్షి! దైవ ప్రవక్త (సల్లల్లాహు

అలైహి వసల్లం)ను నేను అత్యధికంగా ద్వేషించే సమయంలో ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) నాకింతగా ఇచ్చారు. తదుపరి ఇంకా, ఇంకా యిస్తూనే పోయారు. చివరికి ఆయన నాకు అందరికన్నా ప్రియులైపోయారు.

*(ముస్లిం : 2313)*

❖ సహల్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు కథనం): ఓ సారి ఒక స్త్రీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు ఓ దుప్పటి తీసుకొచ్చి – ఓ దైవ ప్రవక్తా ! ఇది మీరు ధరించడానికి అని చెప్పింది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దానిని స్వీకరించి, ఆయనకు అవసరం ఉన్నందున వెంటనే దానిని తొడుక్కున్నారు. ఆ తర్వాత సహాబాలలో ఓ వ్యక్తి దైవప్రవక్త ఆ దుప్పటి ని ధరించి ఉండటం చూసి ఆయనతో ఓ దైవప్రపక్తా! ఈ దుప్పటి చాలా బాగుంది. దీనిని మీరు నాకు తొడిగించరూ? అని అడిగాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'అలాగే' అని చెప్పి దుప్పటిని అతనికిచ్చేశారు. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అక్కడి నుంచి వెళ్ళిపోయాక, ఇతర సహాబాలు ఆ వ్యక్తిని దెప్పిపొడుస్తూ – నువ్వు చేసిందేమీ బాగా లేదు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఈ దుప్పటి అవసరం వుంది అన్న విషయం నీకు బాగా తెలుసు, అందుకే ఆయన దానిని స్వీకరించారన్న విషయం కూడా తెలుసు, అయినప్పటికీ నీవు ఆయన దగ్గర అడుక్కున్నావు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఏ వస్తువైనా అడిగితే ఆయన దానిని తన వద్ద వుంచుకోకుండా ఇచ్చేస్తారని నీకు తెలుసుగా! అని అన్నారు.

దీనిపై ఆ సహచరుడు – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ దుప్పటిని ధరించి వుండడం చూసి నేను దీనిలో శుభాన్ని ఆశించాను. తద్వారా దీనిని నేను నా కఫన్ వస్త్రం లాగా ఉపయోగించుకోగలనేమో! అని వివరించాడు. *(బుఖారీ : 6036)*

ఈ హదీసు ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కేవలం తన అవసరాలు తీరిన తర్వాత మిగిలిన వస్తువులనే కాదు, తనకు అవసరమున్న వస్తువులను కూడా ఇతరులకు ఇచ్చేసేవారు.

ఇదండీ! ప్రవక్తలకు నాయకుడైన (ఇమామ్) ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సద్గుణం!

ఇక మన పరిస్థితి ఎలా వుందంటే – మనకు అవసరమున్న వస్తువులు కాదు సరికదా మన అవసరాలు తీరిన తర్వాత మిగిలిన వస్తువులను కూడా మనం ఇతరులకు ఇవ్వడానికి సిద్ధంగా లేము!

## (2) వినయ విధేయత, అణకువలు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మానవ సంతతిలో అందరికన్నా శ్రేష్ఠులు మరియు దైవ ప్రవక్తలకు నాయకులు కూడా. ఇంత పెద్ద హొదాపై వున్నప్పటికీ ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంతో మెత్తని మనస్కులు మరియు మృదుభాషి.

తన సహాబాలతో కలిసి మెలిసి పోయేవారు. ఎల్లప్పుడూ వారికి దగ్గరగా వుండేవారు. సహాబాలు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)వద్దకు రావాలంటే, ఆపడానికి మధ్యలో ఎవరూ వుండేవారు కాదు. పైగా, ఏ వ్యక్తి అయినా, ఎప్పుడైనా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను నేరుగా కలుసుకోగలగే వాడు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఒకసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర కూర్చుని వుండగా, అదే సమయంలో ఓ దైవ దూత ఆకాశం నుండి (వారి వద్దకు) రావడం చూసి ఇలా అన్నారు – ఈ దైవదూత, తాను పుట్టినప్పటి నుండి ఇప్పటి వరకు (భూమి మీదకు) అవతరించలేదు. ఆ దైవ దూత వారి వద్ద కొచ్చి ఇలా పలికాడు – ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం)! మీరు 'రాచరికపు ప్రవక్త' కావాలని కోరుకుంటున్నారా? లేక 'దాస్యపు ప్రవక్త' కావాలని కోరుకుంటున్నారా? అని అడిగి రమ్మని అల్లాహ్ నన్ను పంపించాడు. దీనిపై జిబ్రయీల్ (అలైహిస్సలాం) స్పందిస్తూ – (ఓ దైవ ప్రక్తా!) మీ ప్రభువు కొరకు గౌరవ మర్యాదలను పాటించండి అని హితవు పలికారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – లేదు, నేను దాస్యపు ప్రవక్తగానే వుండాలను కుంటున్నాను అని అన్నారు.

*(అస్సహీహ లిల్ అల్‌బానీ: 1002, సహీహ్ అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్ : 3280)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విధంగా ప్రార్థించేవారు: –'ఓ అల్లాహ్! నన్ను బీదవాని గానే బ్రతికించి వుంచు మరియు బీద స్థితిలోనే మృత్యువును ప్రసాదించు, ప్రళయం రోజు బీదవారితోనే నన్ను లేపు'.

ఒకసారి ఆయెషా (రజి అల్లాహు అన్హ) – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను ఈ దుఆ పఠిస్తూ వుండడం చూసి – ఇలా ఎందుకు (ప్రార్థిస్తున్నారు)? అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ– నిశ్చయంగా వాళ్ళు (బీదవారు) ధనవంతులకన్న 40 సం॥ ముందుగా స్వర్గంలోకి ప్రవేశిస్తారు అని వివరించారు. తదుపరి ఆయన – ఓ ఆయెషా బీదవారిని ఒట్టి చేతులతో ఎప్పుడూ తిరిగి పంపకు, కనీసం సగం ఖర్జూర పండైనా సరే ఇచ్చి పంపు. ఓ ఆయెషా! నువ్వు బీద వారిని ప్రేమిస్తూ వుండు, వారితో సన్నిహితంగా మెలుగు. ఇలా చేస్తే, ప్రళయం రోజు అల్లాహ్ కూడా నీకు తన సాన్నిహిత్యాన్ని ప్రసాదిస్తాడు.

*(తిర్మిజీ : 2352 – సహీహ్ లిల్ అల్‌బానీ)*

వీటన్నింటి ద్వారా – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎలా గౌరవ, మర్యాదలను పాటించేవారో మనకు తెలుస్తుంది.

అందుకే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) పాటించిన గౌరవ మర్యాదలకు సంబంధించిన మరికొన్ని ఉదాహరణలను మనమిప్పుడు పరిశీలిద్దాం!

❖ సహల్ బిన్ హనీఫ్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నిస్సహాయ ముస్లిముల దగ్గరికి వచ్చేవారు, వారితో సంభాషించేవారు, వారిలో వ్యాధిగ్రస్తులైన వారిని పరామర్శించేవారు, ఎవరైనా మరణిస్తే జనాజా నమాజు చేసేవారు మరియు వారి అంత్యక్రియలకు కూడా హాజరయ్యేవారు. *(అస్సహీహ లిల్ అల్‌బానీ: : 2112)*

❖ అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) పిల్లల మధ్యనుండి వెళ్ళితే వారికి సలాం చేసి ఇలా అనేవారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఇలాగే చేసేవారు. *(బుఖారీ : 6247)*

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అన్సారీలను కలుసుకోవడానికి వెళ్ళేవారు. వారి పిల్లలకు సలాం చేసేవారు, వారి తలపై చేతులను నిమిరేవారు.

*(సహీఉల్ జామె : 4947)*

❖ అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం: మదీనాకు

చెందిన బానిసరాళ్ళలో ఒకామె దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరికొచ్చేది. ఆయన చేతులను పట్టుకొని తాను కోరిన చోటికి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తీసుకెళ్ళేది (మరియు ఆయనతో సంభాషించేది).

*(బుఖారీ : 6072)*

❖ అలాగే ఆయన (అనస్ బిన్ మాలిక్) ఈ విధంగా కూడా తెలియజేశారు: మతిస్థిమితం సరిగ్గా లేని ఒక స్త్రీ ఓ సారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి, ఆయనతో – ఓ దైవ ప్రవక్తా! నాకు మీతో ఒక పని వుంది అని చెప్పింది. దీనిపై ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – ఓ ఫలానా స్త్రీ! చూడు! నేను నీ అవసరం తీర్చడానికి గాను, నన్ను ఏ వీధిలోకి తీసుకెళ్ళాలన్నా నిస్సంకోచంగా తీసుకెళ్ళు అని అన్నారు. తదుపరి ఆ స్త్రీతో పాటు బయలుదేరి వెళ్ళి ఆమె అవసరాన్ని తీర్చారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం). *(ముస్లిం : 2326)*

సునన్ అబూ దావూద్‌లో పదాలు ఇలా వున్నాయి:

ఓ ఉమ్మె ఫలానా! నువ్వు వీధిలోని ఏ మూల కూర్చోవాలన్నా కూర్చొని మాట్లాడు. తద్వారా నేను కూడా నీ దగ్గర కూర్చొని నీ మాటలు వినగలుగుతాను. తదుపరి ఆమె కూర్చొంది. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా అక్కడే కూర్చొన్నారు. ఆపై ఆ స్త్రీ తన అవసరం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు తెలియజేసింది. *(అబూ దావూద్ : 4818)*

కాస్త ఆలోచించండి! ఆ స్త్రీ మతి స్థిమితం సరిగ్గా లేదు. ఈ కారణంగా సమాజంలో ఆమెకు విలువేమీ లేదు. అయినప్పటికీ, తనకు అవసరం కలిగినప్పుడు నేరుగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చింది. పీ.ఏ గానీ, సెక్రెటరీను గానీ కలిసి అపాయింట్ మెంట్ తీసుకొని వచ్చేవిధంగా రాలేదు. (అంటే వీటి అవసరం లేకుండా నేరుగా వచ్చేసింది). ఆ తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా ఆమెను గౌరవించి, మర్యాదగా ఓ ఉమ్మె ఫలానా! అని సంబోధించి, నిర్భయంగా, నిస్సంకోచంగా తన అవసరాన్ని ఆయన ముందుంచడానికి గాను ఏకాంతంలో ఆయనతో మాట్లాడడానికి అవకాశం కల్పించారు.

ఇవండీ దైవప్రవక్తల నాయకుడైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) వినయవిధేయతలు మరియు గౌరవ మర్యాదలు!

మరి ఈ రోజు మన స్థితి ఎలావుందంటే – మనలో ఎవరైనా ఏదైనా సాధారణ హోదాలో కూర్చొని వున్నా సరే, అతను తనకు, తన అవసరం వున్న వారికి మధ్య సెక్రెటరీ వగైరా లాంటి మనుషులను నియమించి వుంచుతాడు. ఆ సెక్రటరీ ఆ అవసరం కలవారిని తన 'సార్' గారితో నేరుగా కలవనివ్వడు. గంటల కొద్దీ, కొన్నిసార్లు రోజుల కొద్దీ వేచి చూసిన తర్వాత కలవనిస్తాడు. ఇంకొన్ని సార్లైతే లంచం యిస్తే గానీ సార్ గారిని కలవనివ్వడు. అవసరం కలవారిని వదిలేయండి – ఆ సార్ దగ్గర పని చేసే ఉద్యోగులు సైతం ఆయన ముందు మాట్లాడడానికి భయపడుతూ వుంటారు.

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రాత:కాలపు (ఫజర్) నమాజు ముగించిన తర్వాత మదీనా సేవకులు కుండలలో నీటిని నింపి ఆయన వద్దకు తీసుకొచ్చేవారు. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) (శుభం కోసం) ఆ కుండలలోకి తన చేతులను ముంచేవారు. చలికాలంలో కొన్ని సార్లు నీళ్ళు చాలా చల్లగా వుండేవి. అయినప్పటికీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆ కుండల్లో తన చేతిని ముంచేవారు. *(ముస్లిం : 2324)*

❖ అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నేల మీద కూర్చొనేవారు, నేలపైనే కూర్చొని భుజించేవారు, మేకలను కట్టేసేవారు, యవల(జౌ) రొట్టె భుజించే నిమిత్తం ఒక బానిస ఆహ్వానాన్ని సైతం స్వీకరించేవారు.

*(తబ్రానీ ఫీ మోజమిల్ కబీర్, సహీహ్ అల్‌బానీ ఫీ అస్సహీహ : 2125)*

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: సహాబాలకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కన్నా ప్రియమైన వారెవ్వరూ లేరు. అయినప్పటికీ, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)ను చూసినప్పుడు వారు నిలబడేవారు కాదు. కారణం తనను చూసి ఇతరులు నిలబడడాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇష్ట పడరన్న విషయం వారిని తెలుసు.

*(తిర్మిజీ : 2754, సహీహ్– అల్‌బానీ)*

ప్రవక్తల నాయకుడైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సద్గుణాలు ఇవి. తనను చూసి ఇతరులు నిలబడడం ఆయనకు అస్సలు ఇష్టముండేది

కాదు. కానీ, నేడు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)ను విశ్వసించే వారిలోని ఏ అధికారి క్రిందనైనా పని చేసే ఉద్యోగులు లేదా అధ్యాపకుని ముందు విద్యార్థులు వారిని చూసి గనక నిలబడక పోతే ఆ "సారు" గారి ముఖం రంగు మారిపోతుంది. తదుపరి ఆ ఉద్యోగులకూ, విద్యార్థులకూ ఇక మూడినట్లే! అంటే, వారిష్టపడేదేమిటంటే – వారిని చూసి ఇతరులు నిలబడాలి మరియు సెల్యూట్ కొట్టాలి. ఎంతో మంది ప్రవర్తనను, ఇలా మార్చి వేసిన ఈ దుర్గుణం నాశనం గాను! మరి చూడబోతే – ఏ వ్యక్తిలోనయినా ఆవగింజంత గర్వమున్నా అతను స్వర్గంలోనికి ప్రవేశించలేడు అని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చి వున్నారు.

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మక్కా విజయం నాడు మక్కాలోనికి ప్రవేశించేటప్పుడు ఆయనలోని వినయవిధేయతలు, అణకువ ఎంతగా బహిర్గతమయ్యాయంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన వాహనంపై ఎంతగా వంగి కూర్చున్నారంటే – ఆయన గడ్డం జీను (ఒంటెపై ఇద్దరు కూర్చుండుటకు అనుకూలమైన పల్లము)కు తగులుతూ వుంది. *(ముస్తద్రక్ హాకిం – సహీహ్)*

అంటే ఆరోజు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) గర్వాతిశయంతో, విజయోత్సాహంతో కాకుండా, ఎంతో వినమ్రతతో, అణకువతో మక్కా లోనికి ప్రవేశించారు.

## (3) కనికరించే మనస్తత్వం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కారుణ్యమూర్తులు, మెత్తని మనస్కులు. ఇతరుల కోసం పరితపించే మనస్తత్వం ఆయనది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَبِمَا رَحْمَةٍ مِّنَ اللَّهِ لِنتَ لَهُمْ ۖ وَلَوْ كُنتَ فَظًّا غَلِيظَ الْقَلْبِ لَانفَضُّوا مِنْ حَوْلِكَ ۖ
فَاعْفُ عَنْهُمْ وَاسْتَغْفِرْ لَهُمْ وَشَاوِرْهُمْ فِي الْأَمْرِ

**"(ఓ ప్రవక్తా!) అల్లాహ్ దయ వల్లనే నీవు వారి యెడల మృదుమనస్కుడవయ్యావు. ఒకవేళ నువ్వే గనక కర్కశుడవు, కఠిన మనస్కుడవు అయివుంటే వారంతా నీ దగ్గరి నుంచి వెళ్ళిపోయేవారు. కనుక నీవు**

**వారి పట్ల మన్నింపుల వైఖరిని అవలంబించు. వారి క్షమాపణ కోసం (దైవాన్ని) వేడుకో. కార్య నిర్వహణలో వారిని సంప్రదిస్తూ వుండు.”**

***(ఆలి ఇమ్రాన్ : 159)***

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సద్గుణాలకు సంబంధించిన ఎన్నో ఉదాహరణలు హదీసు గ్రంథాల్లో నిక్షిప్తమై వున్నాయి.

❖ మాలిక్ బిన్ హువైరిస్ (రజి అల్లాహు అన్హు) కథనం: సమవయస్కులైన మేము కొంత మంది యువకులం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి విచ్చేసి ఆయన వద్ద 20 రాత్రిళ్ళు గడిపాం. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– మేము మా ఇంటి వారిని కలుసుకోవాలని కోరుకుంటున్నామేమో అని భావించి మా ఇంటి వారి గురించి మాతో అడిగారు. మేమంతా ఆయనకు చెప్పేశాము.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంతో మృదు మనస్కులు, కనికరించే వారు కావడంతో మాతో ఇలా అన్నారు: మీరంతా మీ ఇంటి వారి దగ్గరకు వెళ్ళిపోండి. (మీరు నేర్చుకున్నదంతా) వారిక్కూడా నేర్పించండి. నా ఆజ్ఞలను వారి దాకా చేరవేయండి. నన్నెలాగైతే నమాజు చేస్తూ చూసారో అలాగే మీరు కూడా నమాజు చేయండి. నమాజు సమయం కాగానే మీలో ఒక వ్యక్తి అజాన్ పలకాలి మరియు మీలో పెద్ద వయస్కుడు నమాజు చేయించాలి. *(బుఖారీ : 6008, ముస్లిం : 674)*

❖ అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: ఓసారి ఓ పల్లెటూరి వ్యక్తి మస్జిద్‌లోని ఒక మూలలో మూత్ర విసర్జన చేయడం ప్రారంభించ గానే జనాలు అతణ్ణి కొట్టడానికి అతనిపై ఎగబడ్డారు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు – అతణ్ణి వదిలేయండి, ఒక బక్కెట్‌లో నీళ్ళు తెచ్చి అక్కడ కుమ్మరించండి. నిస్సందేహంగా మీ అందరినీ (విషయాలను) తేలిగ్గా చేసేవారుగా చేసి పంపడం జరిగింది. కఠినంగా చేసేవారుగా చేసి కాదు. *(బుఖారీ: 6126)*

❖ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: నేను నమాజు చేయడానికి నిలబడినప్పుడు నా సంకల్పం నమాజును పొడిగించి చదవాలని వుంటుంది. కానీ ఏదైనా పిల్లవాడి ఏడుపు వినగానే నేను నమాజును

సంక్షిప్తం చేస్తాను. ఎందుకంటే ఆ పిల్లవాడి ఏడుపు మూలంగా అతని తల్లి ఎంతో వ్యాకుల పడుతుందని నాకు తెలుసు. *(బుఖారీ: 709, ముస్లిం : 470)*

❖ అబూ మస్వూద్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఓ వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికొచ్చి ఇలా విన్నవించుకున్నాడు – నేను తెల్లవారు జాము(ఫజర్) నమాజు కోసం ఆలస్యంగా వెళతాను, ఎందుకంటే ఫలానా ఇమాము మాకు నమాజ్‌ను ఎంతో పొడుగ్గా చేసి చదివిస్తారు. ఇది విని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంత కోపంతో ఉద్బోధించారంటే– అంత కోపంతో ఉద్బోధించడం నేనెప్పుడూ చూడలేదు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ఉద్బోధించారు – ప్రజలారా! మీలో (ధర్మంపట్ల) ద్వేష భావం కలిగించేవారు కొందరున్నారు. అందుకే (చెబుతున్నా) మీలో ఎవరైతే నమాజు చదివిస్తారో వారు నమాజును సంక్షిప్తంగా (తేలిగ్గా చేసి) చదివించాలి. ఎందుకంటే నమాజు చదివే వారిలో వృద్ధులు, వ్యాధిగ్రస్తులు మరియు అత్యవసర పనుల కోసం త్వరగా బయటికెళ్ళే వాళ్ళు వుంటారు.

*(బుఖారీ : 702, 6110, ముస్లిం: 466)*

**గమనిక:** నమాజును సంక్షిప్తంగా చేయడమంటే రుకూ, సజ్దాలు త్వరత్వరగా చేయడం ఎంతమాత్రం కాదు. కేవలం ఖురాను పఠనాన్ని సంక్షిప్తం చేయాలి. రుకూ, సజ్దాలు మాత్రం ప్రశాంతంగా చేయాలి. (అనువాదకుడు)

❖ ముఆవియా బిన్ హక్మ్ సల్మీ (రజి అల్లాహు అన్హు) కథనం: నేనొకసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెనుక నమాజు చేస్తుండగా ఒక వ్యక్తి తుమ్మాడు. నేను 'యర్‌హముకల్లాహ్' అని పలికాను. దీంతో జనాలు నా పైపు కోపంగా చూడడం మొదలు పెట్టారు. నేను – మా అమ్మకు నేను కనపడకుండా వుండగాక! మీ అందరికీ ఏమైందీ? ఎందుకలా నా వైపు చూస్తున్నారు? అని అన్నాను. తదుపరి వారంతా తమ తొడలపై కొడుతూ నన్ను నిశ్శబ్దంగా వుండమన్నారు. నేనది గ్రహించి మౌనంగా వుండిపోయాను.

తదుపరి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజు ముగించారు. నా తల్లిదండ్రులు ఆయనకు సమర్పితమవుగాక! ఆయనకు ముందూ, ఆయన తరువాత కూడా ఆయనలాగా బోధించే వ్యక్తిని నేను చూడలేదు. ఆయన నన్ను ఏమాత్రం కోపగించుకోలేదు, కొట్టలేదు, చెడుగా మాట్లాడలేదు పైగా

ఇలా హితోపదేశం చేసారు – నిస్సందేహంగా నమాజ్ ఎలాంటి ఆరాధన అంటే, దీనిలో ఇతరులతో సంభాషించడం సరైనది కాదు. దీనిలో కేవలం తస్బీహ్, తక్బీర్ మరియు దివ్య ఖురాను పఠనం లు వున్నాయి. *(ముస్లిం:537)*

## (4) క్షమాగుణం, సహనం

ప్రియప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) క్షమాగుణాన్ని, సహనాన్ని ఎంత గానో కలిగి వుండేవారు. ఏ వ్యక్తి అయినా ఆయనకు కష్టం కలిగిస్తే దానికి ఆయన ఓర్పు వహించేవారు, కష్టం కలిగించిన వ్యక్తిని మన్నించేవారు. వీటి గురించిన ఎన్నో ఉదాహరణలు వున్నాయి.

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం:నేనొకసారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో వున్నాను. ఆయన, అంచులు దృఢంగా వున్న ఒక నజ్రానీ దుప్పటి ధరించి వున్నారు. ఇంతలో ఓ పల్లెటూరు వ్యక్తి నేరుగా వచ్చి ఆయన దుప్పటిని పట్టుకొని గట్టిగా లాగాడు. దీనితో (దుప్పటి రాపిడి మూలంగా) ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మెడపై గుర్తులు ఏర్పడ్డాయి. తదుపరి అతను (ఆ పల్లెటూరి వ్యక్తి ) ఇలా అన్నాడు – ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)! అల్లాహ్ మీకిచ్చిన సంపద నుండి నాక్కూడా ఇవ్వమని ఆజ్ఞాపించండి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) (అతని నిర్వాకానికిగాను ఏమాత్రం కోపగించుకోకుండా) అతని వైపు ప్రేమతోచూసి నవ్వుతూ అతనికి సంపదనివ్వమని ఆజ్ఞాపించారు. *(బుఖారీ : 3149, ముస్లిం : 1057)*

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: నేను 8 సం॥ల వయస్సు నుండి 10 సం॥లు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలో ఆయనకు సేవ చేస్తూ గడిపాను. ఈ వ్యవధిలో నా చేత్తో ఏదైనా వస్తువు పాడయిపోయినా, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎప్పుడూ నన్ను విసుక్కోలేదు. ఒకవేళ ఆయన ఇంట్లో వారెవరైనా నన్ను విసుక్కుంటున్నట్లు చూస్తే – అతణ్ణి వదిలేయి, ఏ విషయ నిర్ణయమైతే అయిపోయిందో అది ఎట్టి పరిస్థితుల్లోనూ అయి తీరుతుంది అని అనేవారు. *(ముసన్నిఫ్ అబ్దుర్రజ్జాఖ్, అబూ నయీమ్ – అల్ హులియా, సహీహ్ – అల్‌బానీ)*

❖ జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఒకసారి మేమంతా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి నజద్ వైపుకు యుద్ధానికి వెళ్ళాం. తదుపరి మేమంతా ముళ్ళ చెట్లు ఎక్కువగా వున్న ఒక ప్రదేశంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను కలుసుకున్నాం. ఆపై, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక చెట్టు క్రింద తన వాహనం నుండి దిగి తన ఖడ్గాన్ని ఆ చెట్టు కొమ్మకు వ్రేలాడదీసి నిద్రపోయారు. సహాబాలు కూడా అటూ ఇటూ, ఎవరికెక్కడ నీడ దొరికితే అక్కడ విశ్రమించారు.

ఆ తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకిలా తెలియజేశారు – నేను నిద్రపోతున్న సమయంలో ఒక వ్యక్తి నా దగ్గరకొచ్చి నా ఖడ్గాన్ని ఎత్తి పట్టుకున్నాడు. అకస్మాత్తుగా నేను మేల్కొని చూడగా అతనా ఖడ్గంతో నాపై దాడి చేయడానికి సిద్ధపడి, నాతో – (ఇప్పుడు) నా నుండి మిమ్మల్ని ఎవరు రక్షిస్తారు? అని అడిగాడు. అయినప్పటికీ నేనతనితో – (నా ప్రభువు) అల్లాహ్‌యే రక్షిస్తాడు అని చెప్పాను. దీనితో అతను ఖడ్గాన్ని దాని ఒరలోకి పెట్టేశాడు. అదిగో చూడండి! అతనే ఆ వ్యక్తి.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతడిని ఏవిధంగానూ శిక్షించలేదు. అంటే అతడిని క్షమించేశారు. *(బుఖారీ : 2910, 4139 – ముస్లిం : 843)*

❖ ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు ఓసారి కొంత మంది యూదులు వచ్చి 'అస్సాము అలైకుం' (మీకు మృత్యువు దాపురించుగాక!) అని పలికారు. నేను వారి మాటలను గ్రహించి వెంటనే – 'అలైకుముస్సాము వల్లానత్' (మీపై మరణం, మరణశాపం రెండూ అంతరించుగాక!) అని పలికాను. దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాతో – ఓ ఆయెషా! కాస్త ఆగు (మృదుత్వాన్ని ప్రదర్శించు), ఎందుకంటే – అల్లాహ్ ఎల్లప్పుడూ మృదుత్వాన్నే ఇష్టపడతాడు అని హితవు పలికారు. తదుపరి ఆయెషా (రజి అల్లాహు అన్హా) – ఓ దైవ ప్రవక్తా! వారేం పలికారో మీరు వినలేదా? అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – నా జవాబు నువ్వు వినలేదా? నేను 'వ అలైకుమ్' (మీపై కూడా) అని పలికి వారి మాటలను వారికే తిరిగిచ్చేశాను అని అన్నారు. *(బుఖారీ : 6256, ముస్లిం : 2165)*

ఈ హదీసుపై కాస్త దృష్టి సారించండి!

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యూదుల పరుష సంభాషణకు ఓర్పు వహించారు. వారి సంభాషణకు అనుగుణంగా అవసరమైనంతవరకే వారికి జవాబిచ్చారు. అంతకుమించి వారిని పల్లెత్తు మాట కూడా అనలేదు. ఇదీ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహన గుణం మరియు మృదుత్వం.

అంతేగాక ఆయెషా (రజి అల్లాహు అన్హా)కు వారి (యూదుల) విషయంలో మృదుత్వాన్ని ప్రదర్శిచమని ఆజ్ఞాపించారు.

దీని ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – యూదుల విషయంలోనే మృదుత్వాన్ని ప్రదర్శించాలన్న ఆజ్ఞ ఇవ్వబడితే, మరి తోటి ముస్లిం సోదరులు దీనికి ఎక్కువగా అర్హులు!

## (5) ప్రజలతో కలిసిపోవడం, చిరునవ్వుతో పలకరించడం

❖ జరీర్(రజి అల్లాహు అన్హు) కథనం: నేను ఇస్లాం స్వీకరించిన నాటి నుండి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్నెప్పుడు కూడా వారి ఇంట్లోకి రావడానికి నిరాకరిచలేదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నన్నెప్పుడు చూసినా నవ్వుతూ వుండేవారు.

*(బుఖారీ : 3035, ముస్లిం : 2475)*

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఏ వ్యక్తి అయినా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చెవిలో ఎప్పుడైనా గుసగుసలాడుతుండగా, అతను దూరంగా జరగడానికి ముందే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) (అతడి నుండి) దూరం జరగడాన్ని నేనెప్పుడూ చూడలేదు.

అలాగే, ఎప్పుడైనా ఏ వ్యక్తి అయినా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) చేయి పట్టుకోగా ఆ వ్యక్తి వదలడానికి ముందే ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ వ్యక్తి చేయిని వదిలేయడం నేనెప్పుడూ చూడలేదు.

*(అబూ దావూద్ : 4794, హసన్ – అల్‌బానీ)*

ప్రజలతో కలిసిపోవడానికి, వారితో సంభాషించడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ వైఖరి అవలంబించేవారు. తన ఇంటికి రావడానికి ఎవరినీ నిరాకరించేవారు కాదు. తన సహచరులకు దగ్గరగా

వుండేవారు, ఎల్లప్పుడూ వారిని పరామర్శిస్తూ వారిలో ఆత్మీయతానుభూతిని కలుగజేసేవారు. వారి కష్టాల్లో పాలుపంచుకొనేవారు.

❖ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం: మా తండ్రి (అబ్దుల్లా బిన్ హరాం) గారు చనిపోయినప్పుడు ఆయనపై పెద్ద మొత్తంలో అప్పు వుంది. రుణ దాతలతో మాట్లాడి ఆ అప్పులో కొంత భాగం విడిచిపెట్టమని చెప్పండని నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విన్నవించుకున్నాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విషయంపై వారితో మాట్లాడగా, వారు 'ససేమీరా' అని అన్నారు. (అంటే అప్పులో కొంత భాగం వదిలి పెట్టడానికి ఒప్పుకోలేదు). దీనితో దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) నన్ను ఖర్జూర తోటలోకి వెళ్లి వాటిని ఒక్కో రకం ఖర్జూరాలను వేర్వేరు కుప్పలుగా పేర్చు అని ఆజ్ఞాపించారు. నేను ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆజ్ఞను పాటిస్తూ అలాగే చేశాను. తదుపరి నేనాయనకు కబురు పంపగా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) విచ్చేసి, తోట మధ్యలో కూర్చొని నన్నిలా ఆజ్ఞాపించారు – ఇప్పుడు నువ్వు రుణదాతలలో ఒక్కొక్కరికి వారి అప్పుకు అనుగుణంగా ఖర్జూర ఫలాలను ఇవ్వడం ప్రారంభించు – ఇలా నేను వారొక్కొక్కరికీ ఖర్జూర ఫలాలను ఇస్తూ పోయాను. చివరికి అందరి అప్పు తీరి పోయింది, అయినప్పటికీ ఖర్జూర ఫలాలు ఏమాత్రం తగ్గకుండా మొదట వున్నట్లుగానే వున్నాయి. (అంటే దాంట్లో ఎవ్వరూ తీసుకోలేదా అన్నట్లు).

*(బుఖారీ : 2127, 2405)*

బుఖారీ లోని మరో ఉల్లేఖనంలో ఇలా వుంది:

జాబిర్ (రజి అల్లాహు అన్హు) తండ్రి ఉహద్ రోజు అమరగతులయి నప్పుడు ఆయనపై రుణ భారం వుంది. రుణదాతలు అదేపనిగా తమ రుణాన్ని గూర్చి అడగసాగారు. జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం – నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి ఆయనతో – మీరు రుణదాతలతో మాట్లాడి వారి రుణానికి బదులుగా మా తోటలోని ఫలాలన్నీ తీసుకొని, మిగిలిన రుణాన్ని మన్నించి, మా తండ్రి గారిని క్షమించమని నచ్చజెప్పండని విన్నవించుకున్నాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారితో మాట్లాడగా వారు దీనిని తిరస్కరించారు.

దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో ఇలా అన్నారు – రేపు ఉదయం నీ తోటలో నా కోసం వేచి చూస్తుండు.

మరుసటి రోజు ప్రొద్దున్నే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తోటలోకి విచ్చేశారు. తోట చుట్టూ ఒకసారి తిరిగి దాని ఫలాలలో శుభం కోసం ప్రార్థించారు.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం – ఆ తర్వాత నేను చెట్ల నుండి ఫలాలను కోసి రుణదాతలకు వారి రుణానికనుగుణంగా వాటిని పంచి పెట్టాను. ఆ తర్వాత కూడా ఎన్నో ఫలాలు మిగిలిపోయాయి. *(బుఖారీ : 2395)*

## (6) ఇంటి వారితో మంచిగా మెలగడం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇంటి బయట కూడా సామాన్య ప్రజానీకంతో సత్ప్రవర్తన కలిగి వుండేవారు, అలాగే ఇంటి లోపల తన ఇంటి వారితో కూడా మంచిగా మెలిగేవారు. వారి పట్ల ప్రేమ కనబరిచేవారు, వారి హక్కుల పట్ల శ్రద్ధ వహించేవారు, ఇంటి పనుల్లో వారికి సహాయపడేవారు.

ఆయెషా (రజి అల్లాహు అన్హా)ను – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంట్లో ఏం చేస్తూ వుండేవారు? అని అడగ్గా ఆమె ఇలా తెలియజేశారు – ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఇంటి వారి సేవ చేసేవారు. నమాజు వేళ కాగానే దాని కోసం లేచి నిలబడేవారు. *(బుఖారీ : 6039)*

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది – ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన (చిరిగిన) బట్టలను కుట్టుకొనేవారు, బూట్లకు అతుకు వేసుకునేవారు, ఇతరులు తమ ఇండ్లల్లో చేసే పనులన్నీ ఆయన చేసేవారు.

*(ఇబ్నె హిబ్బాన్ – సహీహ్)*

## (7) బానిసల పట్ల సత్ప్రవర్తన

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు 10 సం॥లు సేవ చేశాను. ఈ వ్యవధిలో ఆయన ఎప్పుడూ నన్ను 'ఉఫ్' అని కూడా అనలేదు. అదెందుకు చేశావ్? ఇదెందుకు చేయలేదు? అని కూడా అడగలేదు. *(బుఖారీ : 6038, ముస్లిం : 2309)*

❖ ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు

అలైహి వ సల్లం) ఎవరిపైన గూడా ఎప్పుడూ చేయి చేసుకోలేదు. స్త్రీలపై మరియు బానిసలపై కూడా చేయి చేసుకోలేదు. అల్లాహ్ మార్గంలో జిహాద్ చేస్తున్నప్పటి పరిస్థితి వేరు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)కు కష్టాన్ని కలిగించిన వారిపై కూడా పగ తీర్చుకోలేదు. అల్లాహ్ నిషేధించిన వాటిని త్యజించని తరుణంలో కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసం తప్పకుండా పగ తీర్చుకొనేవారు. *(ముస్లిం : 2328)*

## (8) పిల్లల పట్ల ప్రేమ, వాత్సల్యము

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పిల్లల పట్ల ఎంతో దయామయులు, వారిని ఎంత గానో ప్రేమించేవారు, వారిని తన ఒళ్ళో కూర్చొబెట్టుకొనేవారు.

❖ అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కన్నా ఎక్కువగా ఎవరినీ కూడా పిల్లల పట్ల దయ చూపడం చూడలేదు.

ఇంకా ఆయన ఇలా సెలవిచ్చారు: ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) కుమారులు ఇబ్రాహీం, మదీనాలోని ఒక వీధి (అనాలీ)లోని ఒక స్త్రీ వద్ద పాలు త్రాగుతుండేవారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనను కలుసుకొనే నిమిత్తం అక్కడికి వెళ్లేవారు. మేము కూడా ఆయనతోపాటు కలిసి వెళ్ళే వాళ్ళం. పాలు త్రాగించే స్త్రీ భర్త కమ్మరి పని చేసేవాడు కావడంతో వారి ఇంట్లో పొగ క్రమ్ముకొని వుండేది. అయినప్పటికీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతని వద్దకు వెళ్ళే వారు. పిల్ల వాణ్ణి ఎత్తుకొని ముద్దాడేవారు. తదుపరి అక్కణ్ణుంచి తిరిగి వచ్చేసేవారు.

ఆయన (ఇబ్రాహీం) మరణిచినప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు – నిస్సందేహంగా ఇబ్రాహీం నా కుమారుడు మరియు పాలు త్రాగే వయస్సులోనే మృతి చెందాడు. ఇప్పుడతనికి స్వర్గంలో పాలు త్రాగించేవారు ఇద్దరు వున్నారు. వారిరువురూ అతని పాల వ్యవధిని పూర్తి చేస్తారు. *(ముస్లిం : 2316)*

సహీహైన్ (బుఖారీ మరియు ముస్లిం గ్రంథాలు) లోని మరో ఉల్లేఖనంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన కుమారులు ఇబ్రాహీం మరణించిన

సందర్భంగా ఇలా పలికారని వుంది: కళ్ళలోంచి కన్నీళ్ళు పారుతున్నాయి, హృదయం విచారంతో నిండుకొంది, అయినప్పటికీ నా నోటి నుండి అల్లాహ్ యిష్టపడే మాటలే వస్తాయి. అల్లాహ్ సాక్షి! ఓ ఇబ్రాహీం! నీ వియోగం మాకు అత్యంత విచారాన్ని మిగిల్చింది. *(బుఖారీ : 1303, ముస్లిం : 2315)*

❖ అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఓ సారి హసన్ బిన్ అలీ (రజి అల్లాహు అన్హు)ను ముద్దాడారు. ఆ సమయంలో ఉఖ్రా బిన్ హాబిస్ (రజి అల్లాహు అన్హు) అక్కడే కూర్చొని వున్నారు. ఇది చూసి ఆయన నాకు పది మంది సంతానం. కానీ నేనెప్పుడూ వారిని ముద్దాడలేదు అని అన్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయన వైపునకు తిరిగి 'ఇతరులను కరుణించని వాడు, తను కూడా కరుణించబడడు' అని హితవు పలికారు.

*(బుఖారీ : 5997, ముస్లిం : 2318)*

## (9) హక్కుల చెల్లింపు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రజల హక్కులను నెరవేర్చేవారు. ఒకవేళ ఎవరి దగ్గర్నుండైనా ఏదైనా వస్తువు అప్పుగా తీసుకుంటే దానిని తీర్చేటప్పుడు దాని కన్నా శ్రేష్ఠమైన వస్తువును అతనికి ఇచ్చేవారు మరియు అతని కోసం ప్రార్థించేవారు. ఒక్కోసారి ఎవరి వద్దనైనా ఏదైనా వస్తువును కొంటే, దాని పైకం చెల్లించేవారు, ఆ తర్వాత ఆ (కొన్న) వస్తువు కూడా అతనికే తిరిగి ఇచ్చేసేవారు.

❖ అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: ఒక వ్యక్తి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరకు – తను అప్పుగా ఇచ్చిన ఒక ఒంటె గురించి అడగడానికి వచ్చి కర్కశంగా సంభాషించాడు. సహాబాలు ఆగ్రహంతో ఆ వ్యక్తి వైపునకు మరలుతుండడం చూసి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారితో – అతణ్ణి వదిలేయండి, ఎందుకంటే హక్కుదారుడు (గట్టిగా) మాట్లాడవచ్చు. అని చెప్పి అతనికి అతనిచ్చిన ఒంటెలాంటి ఒంటె ఇచ్చి పంపండి అని పురమాయించారు. దీనిపై సహాబాలు – ఓ దైవ ప్రవక్తా! మాకు అలాంటి ఒంటె దొరకలేదు. దాని కన్నా శ్రేష్ఠమైన ఒంటె దొరికింది అని అన్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – అతనికి

అదే ఇచ్చివేయండి. ఎందుకంటే – చెల్లింపు విషయంలో ఉత్తమంగా వ్యవహరించేవారే మీలో శ్రేష్ఠులు అని హితవు పలికారు.

*(బుఖారీ : 2306, ముస్లిం : 1601)*

❖ అబ్దుల్లా బిన్ అబీ రబియా (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నా దగ్గర 40 వేలు అప్పు తీసుకున్నారు. తదుపరి ఆయన వద్దకు సొమ్ము వచ్చాక నా రుణాన్ని తీర్చేశారు మరియు ఇలా సెలవిచ్చారు–'నీ ఇంటి వారిలో, నీ సంపదలో అల్లాహ్ శుభాన్ని వుంచు గాక! నిస్సందేహంగా రుణానికి ప్రతి ఏమిటంటే – రుణ గ్రహీత రుణదాతకు కృతజ్ఞతలు తెలియజేయాలి మరియు అతని రుణాన్ని తిరిగి చెల్లించాలి.'

*(నసాయి : 4683, హసన్ – అల్‌బానీ)*

❖ జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం: ఒకసారి నేను మక్కా నుండి మదీనాకు ఒంటెపై తిరుగు ప్రయాణం చేస్తుండగా అది బాగా అలిసిపోయింది. అది చూసి నేను దానిని (అక్కడే) వదిలేద్దామనుకున్నాను. కానీ ఇంతలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నా వెనుక నుండి విచ్చేసి, నా కొరకు ప్రార్థించి దానిపై కొట్టారు. వెంటనే అది అంత వరకూ నడవని విధంగా చకచకా నడవసాగింది. కాసేపటికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాతో – ఇప్పుడు నీ ఒంటె ఎలా వుంది? అని అడిగారు. నేనాయనతో – ఇది మునపటి కన్న ఇప్పుడు బాగుంది, మీ శుభ ప్రభావం దానిపై పడింది అని అన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాతో – దీనిని నాకు అమ్మేయి అని అనగా, నేను – లేదండి, ఇది మీ కోసం (కానుక) అని బదులిచ్చాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాతో మళ్ళీ ఇలా అడిగారు – వద్దు, దీనిని నాకు అమ్మేయి. నేను మళ్ళీ – లేదండి, ఇది మీకు కానుక అని జవాబిచ్చాను. ఆయన మూడోసారి నాతో – వద్దు, దీనిని నాకు అమ్మేయి అని అడిగారు. దీనిపై నేను ఆయనతో – సరే మంచిది, నేనొక వ్యక్తికి కొన్ని దిర్హములు చెల్లించాల్సి వుంది. మీరు నా తరఫు నుండి ఆ పైకాన్ని ఆ వ్యక్తికి చెల్లించి ఈ ఒంటెను తీసుకోండి. కానీ నేను మదీనా వెళ్ళాకే ఈ ఒంటెను మీకప్పగిస్తాను అని విన్నవించుకున్నాను. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) దాని పైకాన్ని నాకు చెల్లించారు.

ముస్లిం లోని ఒక ఉల్లేఖనంలో ఇలా వుంది: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బిలాల్ (రజి అల్లాహు అన్హు) కు ఇలా ఆజ్ఞాపించారు – ఇతనికి ఒక ఊఖియా (కొలత) బంగారమివ్వు, కొంచెం ఎక్కువగానే యివ్వు. తదనుగుణంగా ఆయన (బిలాల్) నాకు ఒక ఊఖియా మరియు మరో ఖిరాత్ (కొలత) ఇచ్చారు.

తదుపరి నేను వెళ్లిపోయాక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నన్ను తిరిగి పిలిపించి ఇలా సెలవిచ్చారు – (ఒంటె) పైకం కూడా నీదే, ఒంటె కూడా నీదే.

మరో ఉల్లేఖనంలో ఇలా సెలవిచ్చారని వుంది – నీ ఒంటెను కూడా తీసుకో, దిర్హములను కూడా. రెండు కూడా నీవే.

*(బుఖారీ: 2718, ముస్లిం : 715)*

## (10) హాస్యము మరియు మానసిక ఉల్లాసము

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అప్పుడప్పుడూ మనసును ఉత్సాహ పరిచే నిమిత్తం హాస్యమాడుతూ తమాషాగా మాట్లాడేవారు.

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్ను – ఓ రెండు చెవుల వాడా! అని పిలిచారు. అంటే అయనతో ఇలా హాస్యమాడారు.

*(అబూ దావూద్ : 5002, తిర్మిజీ : 1992, సహీహ్ –అల్‌బానీ)*

ఆయనే ఇలా ఉల్లేఖించారు: పల్లెటూరి వ్యక్తుల్లో 'జాహిర్' అనే ఒక వ్యక్తి వుండేవాడు. అతను పల్లెటూరి నుండి ఏదో ఒక వస్తువు తెచ్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు కానుకగా ఇచ్చేవాడు. అతను తిరుగు ప్రయాణమయ్యేటప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతనికి ఎంతో కొంత సామగ్రిని ఇచ్చి పంపుతూ ఇలా అంటుండేవారు – నిశ్చయంగా జాహిర్ మా పల్లెటూరి వాసి మరియు మేము అతని పట్టణవాసులం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతణ్ణి ఎంతగానో ప్రేమించే వారు. మరి చూడబోతే అతను పొట్టివాడు మరియు అంత అందంగా కూడా వుండేవాడు కాదు. ఒకరోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతని

వద్దకు విచ్చేశారు. ఆ సమయంలో అతను ఆయన(సల్లల్లాహు అలైహి వసల్లం) సామగ్రిని అమ్ముతున్నాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతడి వెనుక నుంచి అతణ్ణి తన బాహువుల్లో తీసుకున్నారు. అతను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను చూడలేక పోయాడు. నన్ను వదిలి పెట్టండి, ఎవరు మీరు? అని అంటూ వెను తిరిగి చూడగా అతనికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కనిపించారు. ఆయన ఛాతీ ఇతని వీపుకు తగిలి వుండడం చూసి అతను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నుండి విడిపించు కోవడానికి ఏమాత్రం ప్రయత్నించలేదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అడగడం ప్రారంభిం చారు – ఈ బానిసను ఎవరు కొంటారు?

అతను జవాబిస్తూ– ఓ దైవ ప్రవక్తా! అలాగైతే మీరు నన్ను చాలా చౌకగా పొందగలరు! అన్నాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ–కానీ అల్లాహ్ దృష్టిలో నువ్వు చౌకవు కావు అని అన్నారు లేదా ఇలా జవాబిచ్చారు – కానీ అల్లాహ్ దృష్టిలో నువ్వు అత్యంత ఖరీదైన వాడవు.

*(అహ్మద్ – సహీహ్)*

❖ అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఓ వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో తనకొక వాహనాన్ని సమకూర్చమని విన్నవించుకున్నాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతనితో – నేను నీకు ఆడ ఒంటె కన్న పిల్లనిస్తాను అని అన్నారు. దీనికా వ్యక్తి – ఆడ ఒంటె కనిన పిల్లతో నేనేం చేయగలను! అని అడిగాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మగ ఒంటెను కూడా ఆడ ఒంటె కంటుంది అని జవాబిచ్చారు.

*(అబూ దావూద్ : 4998, తిర్మిజీ : 1991, సహీహ్ అల్‌బానీ)*

ఇవన్నీ కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సద్గుణాలకు సంబంధించిన కొన్ని అంశాలు. మనందరం కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉత్తమ నడవడికను అలవర్చుకొని, ఆయన పద్ధతులను, అత్యుత్తమ సద్గుణాలను ఆచరణలో పెట్టడానికి ప్రయత్నిస్తూ వుండాలి.

అల్లాహ్ మనందరికీ ఈ సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## రెండవ ఖుత్బా

ముస్లిములందరిపై అనివార్యంగా వున్న విషయం ఏమిటంటే – వారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి పరిశుద్ధ జీవితం వెలుగులో తమ విశ్వాసాలు, ఆచరణలను సరిదిద్దుకొంటూ తమ ప్రవర్తనను, వ్యవహారశైలిని దానికనుగుణంగా మార్చుకోవాలి. ఎందుకంటే – ప్రళయం రోజు మనిషి ఆచరణల తూకం వేయబడినప్పుడు, ఏకదైవారాధన (తౌహీద్) విశ్వాసం తర్వాత పళ్ళెంలో అధిక భారం తూకే వస్తువు అతని సత్ప్రవర్తనే.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రళయం రోజు త్రాసులో అన్నిటికన్నా భారంగా తూకేది మనిషి సత్ప్రవర్తనే.

*(అహ్మద్, ఇబ్నె హిబ్బాన్ – సహీహ్)*

అల్లాహ్ మనందరినీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి సద్గుణాలను అలవర్చుకొనే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!!

# రజబ్ మాసపు ఖుత్బాలు

1) రజబ్ మాసపు క్రొత్త పోకడ (బిద్అత్)లు

2) ఇస్రా వ మేరాజ్

3) మేరాజ్ కానుక.....నమాజ్

# రజబ్ మాసపు క్రొత్త పోకడ (బిద్‌అత్)లు

## ఖుత్బా యొక్క ముఖ్యాంశాలు:

1) రజబ్ మాసం నిషేధిత మాసాల్లో ఒకటి

2) రజబ్ మాసంలోని కొన్ని బిద్‌అత్(కొత్తపోకడ)లు

3) సలాతుల్ రగాయిబ్ (4) రజబ్ మాసంలో ప్రత్యేక ఉపవాసాలు

5) రజబ్ మాసపు 27వ రాత్రి ఆరాధన లేదా మరుసటి దినపు ఉపవాసం

6) రజబ్ మాసంలో ఉమ్రా చేయడం ఉత్తమమా?

7) రజబ్ కే కుండే (రజబ్ మాసపు నైవేద్య వంటకాలు)

ఇస్లామీయ సోదరులారా! నిషేధిత నాలుగు మాసాల్లో రజబ్ మాసం కూడా ఒకటి.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

**إِنَّ عِدَّةَ الشُّهُورِ عِندَ اللَّهِ اثْنَا عَشَرَ شَهْرًا فِي كِتَابِ اللَّهِ يَوْمَ خَلَقَ السَّمَاوَاتِ وَالْأَرْضَ مِنْهَا أَرْبَعَةٌ حُرُمٌ ۚ ذَٰلِكَ الدِّينُ الْقَيِّمُ ۚ فَلَا تَظْلِمُوا فِيهِنَّ أَنفُسَكُمْ**

**"నిశ్చయంగా నెలల సంఖ్య అల్లాహ్ దగ్గర - అల్లాహ్ గ్రంథంలో పన్నెండు మాత్రమే. ఆయన ఆకాశాలను, భూమిని సృష్టించిన రోజు నుంచీ (ఈ లెక్క ఇలాగే సాగుతోంది). వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి (గౌరవప్రదమైనవి). ఇదే సరైన ధర్మం. కాబట్టి ఈ మాసాలలో మీకు మీరు అన్యాయం చేసుకోకండి."** ***(తౌబా: 36)***

అంటే మొదట్నుంచి అల్లాహ్ దృష్టిలో మాసాల సంఖ్య పన్నెండు. అందులో నాలుగు నెలలు నిషేధిత మాసాలు.

ఈ నాలుగు నిషిద్ధ మాసాలు ఏవి?

దీని వివరణ మనకు సహీహ్ బుఖారీ లోని ఒక హదీసు ద్వారా తెలుస్తుంది.

అబూ బక్ర (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ఒక సం॥ పన్నెండు నెలలు కలిగి వుంది.

వీటిలో నాలుగు మాసాలు నిషిద్ధమైనవి. వీటిలో మూడేమో ఒకదాని తర్వాత మరొకటి వచ్చేవి. అవేమంటే – జిల్ ఖాదా, జిల్ హిజ్జ మరియు ముహర్రం. ఇక నాల్గవది జమాదిస్సానీ మరియు షాబాన్ నెలల మధ్య వచ్చే రజబ్ –ఏ– ముజిర్. *(బుఖారీ – తౌబా సూరహ్ తఫ్సీర్)*

ఈ హదీసులో రజబ్ మాసాన్ని 'ముజిర్' తెగతో జోడించి చెప్పబడింది. కారణం ఏమిటంటే – ఇతర తెగల కన్నా ఈ తెగ రజబ్ మాసాన్ని ఎక్కువగా గౌరవిస్తూ మితి మీరి ప్రవర్తించేది.

ప్రియులారా! ఇంతకు ముందు పేర్కొన్న – నాలుగు నిషిద్ధ మాసాలను గూర్చి తెలిపే తౌబా సూరాలోని ఆయతును అల్లాహ్ వివరించాక (ప్రత్యేకంగా) "మీపై మీరు దౌర్జన్యం చేసుకోకండి" అని ఆజ్ఞాపించాడు.

దౌర్జన్యం విషయానికొస్తే అది సం॥ పొడుగునా, ఎల్లవేళలా వారించ బడింది. కానీ, ఈ నాలుగు మాసాల్లో – వాటి గౌరవాన్ని, పవిత్రతను దృష్టిలో వుంచుకొని అల్లాహ్ ప్రత్యేకంగా, 'దౌర్జన్యం చేసుకోకండి' అని వారించాడు.

ఇక్కడ "దౌర్జన్యం" అంటే అర్థం ఏమిటి?

ఒక అర్థం ఏమిటంటే – ఈ మాసాల్లో యుద్ధాలు, ఒకర్నొకరు చంపుకోడాలు చేయకండి అని.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَسْـَٔلُونَكَ عَنِ الشَّهْرِ الْحَرَامِ قِتَالٍ فِيهِ ۖ قُلْ قِتَالٌ فِيهِ كَبِيرٌ

**"నిషిద్ధ మాసాల్లో యుద్ధం చెయ్యటం గురించి ప్రజలు నిన్ను అడుగుతున్నారు. నువ్వు వారికిలా చెప్పు – ఈ మాసాలలో యుద్ధం చెయ్యటం మహాపరాధం."** ***(బఖర : 217)***

అజ్ఞాన కాలంలో కూడా ప్రజలు ఈ నాలుగు మాసాల నిషేధాన్ని గుర్తించి వాటిలో యుద్ధాలు, గొడవలకు స్వస్తి పలికేవారు. అరబ్బీభాషలో 'రజబ్' అన్న పదం 'తర్జీబ్' నుండి వచ్చింది. దీని అర్థం 'గౌరవించడం' అని కూడా. ఈ మాసాన్ని 'రజబ్' అని పిలవడానికి కారణం అరబ్బులు ఈ మాసాన్ని గౌరవించేవారు. ఈ మాసంలో విగ్రహాల పేరు మీద జంతువులు బలి ఇచ్చేవారు. ఈ ఆచారాన్ని 'అతీరా' అని పిలిచేవారు. తదుపరి ఇస్లాం

వచ్చాక అది కూడా వీటి గౌరవాన్ని, పవిత్రతను యధావిధిగా వుంచి వీటిలో గొడవ పడడాన్ని పెద్దపాపంగా ఖరారు చేసింది. కానీ, రజబ్ మాసంలో తలపెట్టే 'అతీరా' కార్యాన్ని పూర్తిగా నిషేధించింది.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఇస్లాంలో 'ఫరఅ' లేదు మరియు 'అతీరా' కూడా లేదు." *(బుఖారీ : 5473, ముస్లిం :1976)*

'ఫరఅ' అంటే–అజ్ఞాన కాలంలో ప్రజలు విగ్రహాల కొరకు జిబహ్ చేసే (బలి ఇచ్చే) ఒంటె, ఆవు మరియు మేకలకు మొదటి కాన్పులో జన్మించిన పిల్లలు.

ఇక 'అతీరా' అంటే – రజబ్ మాసంలో ప్రజలు తమ విగ్రహాల కొరకు బలి ఇచ్చే పశువులు. ఈ ఆచారాన్ని 'రజబియా' అని కూడా పిలిచేవారు.

ప్రియ సోదరులారా! ఈ హదీసు ద్వారా రూఢీ అయ్యే ఇంకో విషయమేమిటంటే – దైవేతరుల కోసం జంతువులు బలియివ్వడం నిషిద్ధం మరియు ఇస్లాం నుంచి బహిష్కరణకు గురిచేసే పెద్ద షిర్క్.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"మీ కొరకు నిషేధించబడిన వస్తువులు ఇవి: మృత పశువు, రక్తం, పంది మాంసం, అల్లాహ్ పేరు గాక యితరుల పేరు ఉచ్చరించవడినది, గొంతు పిసకబడటం వల్ల మృతి చెందిన పశువు, దెబ్బ తగిలి చనిపోయిన పశువు, ఎత్తయిన స్థలం నుంచి క్రింద పడి చనిపోయినది లేక కొమ్ము తగలడం వల్ల చనిపోయినది, క్రూర మృగాలు చీల్చి తినగా చనిపోయిన పశువు (ఇవన్నీ మీకు హరామ్ గావించబడ్డాయి) కానీ ఒకవేళ మీరు 'జిబహ్' చేస్తే అది మీ కొరకు నిషిద్ధం కాదు. అలాగే ఆస్థానాల వద్ద బలి యిచ్చినవి కూడా నిషిద్ధమే. అదేవిధంగా బాణాల ప్రయోగం ద్వారా అదృష్టాన్ని పరీక్షించు కోవడం కూడా నిషిద్ధమే. ఇవన్నీ అత్యంత నీచమైన పాపకార్యాలు."** ***(మాయిద : 3)***

ఈ ఆయతులో 'మా ఉహిల్ల లిగైరిల్లాహ్' అని పేర్కొని దైవేతరుల కోసం బలియిచ్చే అన్ని జంతువులను నిషిద్ధం చేయడం జరిగింది. అలాగే 'వమా జుబిహ అలన్నుసుబ్' అని పేర్కొని షిర్క్‌కు కేంద్రంగా మారిన అస్థానాల

వద్ద, దర్బార్ల, మజార్ల వద్ద జిబహ్ చెయ్యబడే జంతువులన్నీ నిషేధించడం జరిగింది.

పైగా ఇస్లాంలో నైతే – షిర్క్ జరిగే స్థలాల్లో, అల్లాహ్ పేరు ఉచ్చరించి జిబహ్ చేసినప్పటికీ అలాంటి పశువులు కూడా హరామ్ గావించబడ్డాయి. (ఎందుకంటే– షిర్క్ జరిగే స్థలాల్లో అల్లాహ్ పేరు ఉచ్చరించి జిబహ్ చేసినప్పటికీ సంకల్పం మాత్రం ఆ దైవేతరుణ్ణి సంతృప్తి పరచడమే వుంటుంది – అనువాదకుడు)

సాబిత్ బిన్ జిహాక్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఒక వ్యక్తి 'బవానా' అనే స్థలంలో ఒంటెను జిబహ్ చేస్తాడని మొక్కుబడి చేసుకున్నాడు. తదుపరి, అతను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చి, (విషయం వివరించి) నేను నా మొక్కుబడిని తీర్చుకోనా? అని అడిగాడు.

దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనితో – అక్కడ అజ్ఞాన కాలంలో ఏ విగ్రహమైనా పూజింపబడేదా? అని అడిగారు.

అతను 'లేదండి' అని జవాబిచ్చాడు.

దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనితో – నీవు మ్రొక్కుబడిని తీర్చుకో. ఎందుకంటే అల్లాహ్‌కు అవిధేయత చూపడానికి మ్రొక్కుబడి తీర్చుకోవద్దు. అలాగే తనకు స్థోమత లేని (తను చేయలేని) మ్రొక్కుబడిని కూడా తీర్చుకోవద్దు. (అబూ దావూద్ – సహీహ్ అల్‌బానీ)

ఈ హదీసు ద్వారా రుజువైన విషయమేమంటే – ఉర్సులాంటి ఉత్సవాలు జరిగే స్థలాలలో, దైవేతరులు పూజింపబడే స్థలాల్లో అల్లాహ్ పేరు ఉచ్చరించి కూడా పశువులను జిబహ్ చేయకూడదు మరియు అలాంటి స్థలాల్లో ఎలాంటి మ్రొక్కుబడిని తీర్చుకోకూడదు.

ఎందుకంటే – బవానా అనే స్థలంలో ఒంటెను జిబహ్ చేసి తన మ్రొక్కుబడిని తీర్చుకోవడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అనుమతి అడిగిన ఆ సహాబి ఉద్దేశ్యం నిస్సందేహంగా అల్లాహ్ పేరుతో జిబహ్ చెయ్యాలనే అయినప్పటికీ, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనికి – అక్కడ ఏదైనా విగ్రహం పూజింపబడేదా? అక్కడ ఉర్సు /మేళాలు లాంటి వేమన్నా జరుగుతాయా లాంటి పలు ప్రశ్నలు వేసి, అక్కడ ఇలాంటి పనులేవీ

జరగడం లేవు అని నిర్ధారించుకున్న తర్వాతే అతనికి తన మ్రొక్కుబడిని తీర్చుకొనే అనుమతి ఇచ్చారు.

ఒకవేళ అక్కడ దైవేతరులెవరైనా పూజింపబడుతూ వుంటే లేదా అక్కడ ఉర్సు వగైరా ఉత్సవాలు జరుగుతూ వుంటే ఖచ్చితంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుమతి ఇచ్చేవారు కాదు.

దీని ద్వారా బోధ పడిందేమిటంటే – ఇలాంటి స్థలాల్లో అల్లాహ్ పేరు ఉచ్చరించి కూడా పశువులను జిబహ్ చెయ్యకూడదు. కనుక ముస్లిములందరూ ఇలాంటి పనుల నుండి శాశ్వతంగా దూరంగా వుండాలి.

ఇస్లామీయ సోదరులారా!

అల్లాహ్ ఆజ్ఞ – 'మీపై దౌర్జన్యం చేసుకోకండి' –లో 'దౌర్జన్యం' అంటే మరో అర్థమేమిటంటే – మీరు ప్రత్యేకించి ఈ నాలుగు మాసాల్లో అల్లాహ్ అవిధేయతకు దూరంగా వుండండి. ఎందుకంటే ఈ వ్యవధిలో అల్లాహ్ అవిధేయత వల్ల దొరికే పాపఫలం ఎన్నో రెట్లు అధికమవుతుంది.

హాఫిజ్ ఇబ్నె కసీర్ రహిమహుల్లాహ్, ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఇలా ఉల్లేఖించారు: దౌర్జన్యాన్ని అల్లాహ్ సంవత్సరంలోని పన్నెండు నెలలూ నిషేధించాడు. తదుపరి వాటిలోని నాలుగు నెలలను 'ప్రత్యేకం' చేశాడు. ఎందుకంటే – వీటిలో (నాలుగు మాసాల్లో) చెడు మరియు అవిధేయతల పాపఫలం అధికమవుతుంది మరియు మంచి, సదాచరణల పుణ్యఫలం పెరుగుతుంది.

ఇమామ్ ఖతాదా రహిమహుల్లాహ్ – 'మీపై మీరు దౌర్జన్యం చేసుకోకండి' గురించి ఇలా వివరించారు: నిషిద్ధ మాసాల్లో దౌర్జన్య పాపం, దాని భారం ఇతర మాసాల కంటే ఎన్నో రెట్లు పెరిగిపోతుంది. వాస్తవానికి దౌర్జన్య పాపఫలం ఎల్లప్పుడూ అధికంగానే వుంటుంది. కానీ, అల్లాహ్ తన ఇష్ట ప్రకారం ఏ మాసంలోనైనా దౌర్జన్య పాపఫలాన్ని అధికం చేయవచ్చు. ఇదెలాగంటే – దైవ దూతల్నుండి అల్లాహ్, సందేశం చేరవేసే దూతల్ని ఎన్నుకొన్నాడు. గ్రంథాలలో, ఖురానును ఎన్నుకున్నాడు. యావత్ భూమిలో మసీదులను ఎన్నుకొన్నాడు. ఇలాగే మాసాల్లో రమజాన్ మాసాన్ని, నాలుగు నిషిద్ధ మాసాలను ఎన్నుకొన్నాడు, దినాలలో శుక్రవారాన్ని ఎన్నుకున్నాడు మరియు రాత్రిళ్ళలో

లైలతుల్ ఖద్ర్‌ను ఎన్నుకొన్నాడు. అల్లాహ్ తన ఇష్ట ప్రకారం దీనికైనా ఘనతను ప్రసాదించగలడు. కనుక అల్లాహ్ ఘనతను ప్రసాదించిన దానికి మీరు కూడా ఘనమైనదని భావించండి. *(తఫ్సీర్ ఇబ్నె కసీర్ : 2/468)*

ఈ సంక్షిప్త వివరణ సారమేమిటంటే – రజబ్ నెల నిషిద్ధ మాసాల్లో ఒకటి. కనుక దీని గౌరవప్రతిష్ఠతలను యథావిధిగా వుంచుతూ ప్రత్యేకించి ఈ నెలలో పాపకార్యాలకు దూరంగా వుండాలి. కానీ, నేడు కొందరు ముస్లిముల పరిస్థితి ఎలా వుందంటే – ఈ మాసంలో వారు ఎన్నో క్రొత్త ఆచారాల (బిద్అత్) ను సృష్టించుకున్నారు. వాటిని (బిద్అత్‌ల ను) వారు గొప్పసదాచరణలనీ, ధర్మంలో అంతర్భాగమని భావించి ఆచరిస్తున్నారు. మరి చూడబోతే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన 'ఖుత్బా –ఏ హాజత్' లో ఇలా సెలవిచ్చారు: "(దైవ) స్తోత్రం తర్వాత! నిశ్చయంగా అత్యుత్తమ వాక్కు అల్లాహ్ గ్రంథం, అత్యుత్తమ పద్ధతి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) పద్ధతి. అన్నింటి కన్నా చెడ్డ కార్యాలేమిటంటే ధర్మంలో క్రొత్తగా సృష్టించబడే ఆచారాలు(బిద్అత్‌లు) మరియు ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతకు ఆనవాలు." *(ముస్లిం : 867)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకార్త దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా మా ఈ ధర్మంలో లేని క్రొత్త పోకడ (బిద్అత్)ను ప్రవేశపెడితే అది రద్దు గావించబడుతుంది (స్వీకరించ బడదు)." *(బుఖారీ : 2697, ముస్లిం : 1718)*

ముస్లిం లోని మరొక ఉల్లేఖనంలో పదాలు ఇలా వున్నాయి:"ఏ వ్యక్తి అయినా మేము ఆజ్ఞాపించని క్రొత్త ఆచరణను పాటిస్తే అది (దైవ సమక్షంలో) తిరస్కరించబడుతుంది."

ఈ హదీసుల ద్వారా తెలిసేదేమిటంటే – ధర్మంలో ప్రతి క్రొత్త పోకడ బిద్అత్ మరియు ప్రతి క్రొత్త ఆచారం తిరస్కరించబడుతుంది. (స్వీకరించబడదు)

ఇక మనం రజబ్ మాసంలో సృష్టించబడ్డ కొన్ని బిద్అత్‌లను గూర్చి చర్చించుకుందాం.

## 1) సలాతుర్రగాయిబ్

రజబ్ మాసంలో ఒక బిద్అత్ 'సలాతుర్రగాయిబ్' పేరుతో ప్రజల్లో

ప్రసిద్ధిగాంచి వుంది. ప్రజలు తమ వైపు నుంచి సృష్టించి, దానిని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఆపాదించిన దీని స్వరూపాన్ని ముందు మీకు వివరిస్తాం. తదుపరి దీని గురించి ముహద్దిసీన్ (హదీసువేత్తలు)ల అభిప్రాయాలు మీ ముందుంచుతాం.

'సలాతుర్రగాయిబ్' గురించి వివరించబడే హదీసులో మొదట్లో ఇలా వుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: రజబ్ అల్లాహ్ మాసం, షాబాన్ నా మాసం మరియు రమజాన్ నా ఉమ్మత్ మాసం. తదుపరి, ఆ హదీసులో రజబ్ మాసపు కొన్ని విశిష్ఠతలు చెప్పబడిన తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారని ఆయన వైపునకు కొన్ని విషయాలు ఆపాదించబడ్డాయి. అవేమిటంటే – ఏ వ్యక్తి అయినా రజబ్ మాసపు మొదటి గురువారం నాడు ఉపవాసముండి, శుక్రవారం రాత్రి మగ్రిబ్, ఇషాల మధ్య రెండు, రెండు రకాతుల చొప్పున 12 రకాత్‌లు –ప్రతి రకాతులో ఫాతిహా సూరా తర్వాత మూడు సార్లు ఖద్ర్ సూరా, 12 సార్లు ఇఖ్లాస్ సూరా– చదివి, నమాజు పూర్తయిన తర్వాత 70సార్లు 'అల్లాహుమ్మ సల్లి అలా ముహమ్మదున్నబీ ఉల్ ఉమ్మీ వ అలా ఆలిహి' అని దరూద్ పఠించి, ఆ తర్వాత సజ్దాలోకి వెళ్ళి 70 సార్లు – 'సుబ్బూహు ఖుద్దూసు రబ్బుల్ మలాయికతి వర్రూహు' అని పఠించి, తదుపరి తలపై కెత్తి 'రబ్బిగ్ఫిర్ వర్‌హమ్ వతజావజ్ అమ్మా తాలమ్ ఇన్నక అన్తల్ అజీజుల్ అజీమ్' అని 70 సార్లు ప్రార్థించి, తదుపరి రెండవ సజ్దాలోకి వెళ్ళి ఇలానే చేసి, ఆ తర్వాత అతను అల్లాహ్‌ను ఏది కోరినా అది ప్రసాదించబడుతుంది.

ఈ కాల్పనిక, తప్పుడు హదీసు గురించి హదీసువేత్తల వివరణలు ఇలా వున్నాయి :

1) ఇబ్నుల్ జౌజి రహిమహుల్లాహ్ ఈ హదీసును 'అల్ మౌజుఆత్' నందు పేర్కొని ఆ తర్వాత ఇలా వివరించారు: ఈ హదీసు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పేరుతో (క్రొత్తగా) సృష్టించబడింది. హదీసు వేత్తలు – అబద్దాలకోరుగా పేరుగాంచిన 'ఇబ్నె జహజమ్' ను దీని వెనుక కుట్ర దారుడుగా ఖరారు చేశారు. నేను, మా షేఖ్ అబ్దుల్ వహాబ్ అల్ హాఫిజ్ నోటితో విన్నదేమిటంటే – దీని ఉల్లేఖకులు అపరిచితులు.

స్వయంగా నేను కూడా ఎన్నో గ్రంథాలను తిరగేసాను, కానీ వీరి గురించి నాకు ఏ మాత్రం సమాచారం దొరకలేదు.

*(అల్ మౌజుఆత్ : 2వ సంపుటం– 438 పేజి)*

ఇమామ్ జహబీ, ఇబ్నుల్ జౌజి మాటలకు అదనంగా ఈ మాట కూడా జోడించి పేర్కొన్నారు: ఈ హదీసును ఉల్లేఖించినవారు బహుశా పుట్టనే లేదేమో! *(తల్ఖీస్ అల్ మౌజుఆత్ : 247వ పేజి)*

అలాగే, ఇబ్నుల్ జౌజి 'అస్సలాతుల్ అర్ఫియ' గురించి కాల్పనిక హదీసును పేర్కొని ఆ తర్వాత ఇలా వివరించారు: ఈ హదీసు ఒక కాల్పనిక, తప్పుడు హదీసు అవడంలో ఏమాత్రం అనుమానం లేదు. దీనిలోని చాలా మంది ఉల్లేఖకులు అపరిచితులు (మజ్హూల్) మరియు కొందరైతే అతి బలహీన ఉల్లేఖకులు. ఈ స్థితిలో ఈ హదీసును దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ఉల్లేఖించడం అసంభవం. మేము ఎంతో మందిని ఈ నమాజును చదువుతుండగా చూశాం. తక్కువ వ్యవధి కల్గిన రాత్రుళ్ళలో వీరు ఈ నమాజును చదివి నిద్రపోతారు. దీనితో వీరి ఫజర్ నమాజు నెరవేరదు. పైగా, మసీదులకు చెందిన అజ్ఞాన ఇమాములు, ఈ నమాజును మరియు ఇలాగే 'సలాతుర్రగాయిబ్' ను కేవలం ప్రజలను సమీకరించడానికి మరియు దీని ద్వారా ప్రత్యేక హోదా పొందడానికి సాధనంగా చేసుకున్నారు. కథలు చెప్పేవారు సైతం తమ సమూహాల్లో ఈ నమాజును గురించే వివరిస్తూ వుంటారు. వాస్తవానికి ఇవన్నీ సత్యానికి చాలా దూరంగా వున్నాయి. *(అల్ మౌజుఆత్ : 2వ సంపుటం, 440–443 పేజీలు)*

2) ఇబ్నె రజబ్ ఇలా పేర్కొన్నారు: రజబ్ మాసంలో మొదటి శుక్రవారం రాత్రి చదివే 'సలాతుర్రగాయిబ్' గురించి ఉల్లేఖించబడ్డ హదీసులన్నీ కాల్పనిక, తప్పుడు హదీసులు. మెజారిటీ ఉలమాల దృష్టిలో ఇది నాల్గవ శతాబ్దం తర్వాత ఉద్భవించిన ఒక బిద్అత్.

*(లతాయిఫుల్ మారిఫ్ ఫీమాలిమవాసిముల్ ఆమ్ మినల్ వజాయిఫ్–123 పేజి)*

3) ఇమామ్ నవవీ ఇలా పేర్కొన్నారు: 'సలాతుర్రగాయిబ్'గా పేరు గాంచి, రజబ్ నెల మొదటి రాత్రి మగ్రిబ్ – ఇషా ల మధ్య 12 రకాతులుగా

చదవబడే నమాజు మరియు షాబాన్ నెల 15వ రాత్రి 100 రకాతులుగా చదవబడే నమాజ్ – ఈ రెండు నమాజులు ఎంతో నీచమైన బిద్అత్. కనుక 'ఖువ్వతుల్ ఖులూబ్' మరియు 'ఇహ్యా ఉలూమిద్దీన్' లాంటి గ్రంథాల్లో వీటి వివరణ చూసి మోసానికి గురికావద్దు. అంతేగాక, వాటికి సంబంధించి ఉల్లేఖించబడ్డ హదీసులను చూసి మోసపోవద్దు. ఎందుకంటే – అవన్నీ పూర్తిగా అసత్యం గనుక. *(అల్ మజ్మూఅ లిన్నవవీ : 3వ సంపుటం, 379పేజీ)*

4) ముహమ్మద్ బిన్ తాహిర్ అల్ హిందీ ఇలా పేర్కొన్నారు:

'సలాతుర్రగాయిబ్' ఏమాత్రం సందేహం లేని కాల్పనిక, అసత్య ఆచరణ. *(తజ్కిరతుల్ మౌజుఆత్: 44వ పేజీ)*

5) ఇమామ్ షౌకానీ ఇలా వివరించారు: ఈ హదీసును కాల్పనిక తప్పుడు హదీసని నిర్ధారించడంలో హదీసువేత్తలందరూ ఏకీభవించారు. ఇది కాల్పనికమవడంలో హదీసు విషయ పరిజ్ఞానం స్వల్పంగా వున్న వారికి సైతం ఏమాత్రం సందేహం లేదు. ఫీరోజాబాదీ మరియు మఖ్దిసీలు కూడా – హదీసువేత్తలందరి దృష్టిలో ఈ హదీసు ఒక కాల్పనిక, తప్పుడు హదీసు – అని స్పష్టం చేశారు.

6) మౌలానా అబ్దుల్ హై లక్నోవీ ఇలా పేర్కొన్నారు: సలాతుర్రగాయిబ్ కు సంబంధించిన హదీసు ఒక కాల్పనిక, తప్పుడు హదీసు. ఈ విషయంలో హదీసువేత్తలందరూ లేదా మెజారిటీ హదీసు వేత్తల మధ్య ఏకాభిప్రాయం వుంది. కనుక, దీనిని వ్యతిరేకించే వారిని ఏ మాత్రం నమ్మలేం. వారెవరైనా కావచ్చు. *(అల్ ఆసారుల్ మర్ఫూఅ : 74వ పేజీ)*

వీరితోపాటు సుయూతీ, ఇబ్నె ఇరాక్ మరియు అల్ కర్మి మొ॥వారు కూడా దీనిని మౌజుఆత్ (కాల్పనికమైనవి)లో చేర్చారు.
*(అల్ లఆలి అల్ మస్నూఅ : 2వ సంపుటం, 47వ పేజి, తన్జిహుష్షరియ : 2వ సంపుటం, 90వ పేజీ, అల్ ఫవాయెదుల్ మౌజుఅ: 72 పేజీ)*

## (2) రజబ్ ప్రత్యేక ఉపవాసాలు

రజబ్ మాసంలో (ప్రజలు) సృష్టించుకున్న బిద్అత్‌లలో మరో బిద్అత్ ఏమిటంటే – ఈ మాసంలో ఉపవాసాలకు ప్రత్యేక శ్రేష్ఠతలను కల్పించుకొని, ప్రత్యేకంగా ఉపవాసాలుండడం. వాస్తవానికి ఈ మాసంలో ఉపవాసాల గురించి

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ప్రామాణికంగా ఏదీ నిరూపించబడలేదు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా ఈ మాసంలో ప్రత్యేకించి ఉపవాసాలు వుండేవారన్న విషయం కూడా నిర్ధారించబడిలేదు.

అల్లామా ఇబ్నుల్ జౌజి రహిమహుల్లాహ్, ఇమామ్ సాజీ అల్ హాఫిజ్ ద్వారా ఇలా ఉల్లేఖించారు: ఇమామ్ అబ్దుల్లా అల్ అన్సారీ రజబ్ మాసంలో ఉపవాసాలు వుండేవారు కాదు మరియు దీనిపై ఆయన ఇలా చెప్పేవారు – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా రజబ్ మాసపు శ్రేష్ఠత గురించి లేదా దీనిలో ఉపవాసాల శ్రేష్ఠత గురించి ఏదీ నిరూపించబడి లేదు. (అల్ మౌజుఆత్ : *2వ సంపుటం, 578-579 పేజీలు*)

హాఫిజ్ ఇబ్నె హజర్ రహిమహుల్లాహ్ ఇలా పేర్కొన్నారు: రజబ్ మాసం శ్రేష్ఠత లేదా దీనిలో ఉపవాసాల శ్రేష్ఠత లేదా దీనిలో ప్రత్యేక దినపు ఉపవాస శ్రేష్ఠత లేదా ప్రత్యేక రాత్రి జాగారపు శ్రేష్ఠత – వీటి గురించి ఒక్క సహీహ్ హదీసు (ప్రామాణిక హదీసు) కూడా ఉల్లేఖించబడిలేదు. నాకు ముందు ఇదే విషయాన్ని ఇమామ్ అబూ ఇస్మాయిల్ అల్ హరవీ కూడా సెలవిచ్చారు. తదుపరి ఆయన ఇలా పేర్కొన్నారు:

రజబ్ శ్రేష్ఠత లేదా దాని ఉపవాసాల శ్రేష్ఠత లేదా దానిలో ఏదైనా ప్రత్యేక దినపు ఉపవాస శ్రేష్ఠతల గురించి స్పష్టంగా ఉల్లేఖించబడ్డ హదీసులను పరిశీలిస్తే అవి రెండు రకాలుగా కనిపిస్తాయి. అవి బలహీనమైనవి లేదా కాల్పనికమైనవి (తప్పుడు హదీసులు).

ఇమామ్ షౌకానీ – అలీ బిన్ ఇబ్రాహీం అల్ అతార్ ద్వారా ఇలా ఉల్లేఖించారు: రజబ్ ఉపవాసాల గురించి ఉల్లేఖించబడ్డ విషయాలన్నీ కాల్పనికమైనవి, బలహీనమైనవి మరియు ఏ ఆధారం లేనివి.

*(అల్ ఫవాయెదుల్ మజ్మూఆ : 392వ పేజీ)*

మరి ఒక్క హదీసు కూడా ప్రామాణికంగా నిరూపించబడిలేనప్పుడు, కేవలం కాల్పనిక, తప్పుడు హదీసులను ఆధారంగా చేసుకొని రజబ్ మాసంలో ఉపవాసాలకు ప్రత్యేక శ్రేష్ఠతను కల్పించడం ఏమాత్రం సరైనది కాదు.

రజబ్ మాసంలోని ఉపవాసాల శ్రేష్టతను గురించి ఉల్లేఖిచబడే ఒక కాల్పనిక, తప్పుడు హదీసు ఇది: రజబ్ మాసం ఎంతో మహోన్నతమైన

మాసం. ఏ వ్యక్తి అయినా దీనిలో ఒక రోజు ఉపవాసముంటే, అల్లాహ్ అతని కోసం 1000 సం॥ల ఉపవాసాలు లిఖిస్తాడు. ఎవరైన రెండు రోజులు ఉపవాసముంటే, అల్లాహ్ అతని కోసం 2000 సం॥ల ఉపవాసాలు లిఖిస్తాడు. ఎవరైనా మూడు రోజులు ఉపవాసముంటే, అల్లాహ్ అతని కొరకు 3000 సం॥ల ఉపవాసాలు లిఖిస్తాడు. ఎవరైనా ఏడు రోజులు ఉపవాసముంటే, అతని కొరకు నరకద్వారాలు మూసివేయబడతాయి. అతను ఏ ద్వారం గుండా అయినా స్వర్గంలోకి ప్రవేశించవచ్చు. ఎవరైనా 15 రోజులు ఉపవాసముంటే, అతని చెడులను (పాపాలను) పుణ్యాలుగా మార్చడం జరుగుతుంది మరియు ప్రకటన చేసే వాడొకడు ఆకాశం నుండి – అల్లాహ్ నిన్ను క్షమించేశాడు, ఇక క్రొత్తగా నువ్వు నీ ఆచరణలను ప్రారంభించవచ్చు అని ప్రకటన చేస్తాడు. ఎవరైనా వీటి కన్నా ఎక్కువ రోజులు ఉపవాసముంటే, అల్లాహ్ అతనికి ఇంకా ఎక్కువగా అనుగ్రహిస్తాడు.

ఈ హదీసును ఇబ్నుల్ జౌజి 'అల్ మౌజుఆత్' లో ఉల్లేఖించారు. అలాగే జహబీ కూడా దీనిలో ఇద్దరు ఉల్లేఖకులు (అలీ బిన్ యజీద్ మరియు హారూన్ బిన్ అన్తర) పట్ల ఆక్షేపణ చూపి దీనిని మౌజుఆత్ (కాల్పనికమైనవి)లో చేర్చారు.

సుయూతీ కూడా వీరిద్దరి వివరణతో ఏకీభవించారు. ఇబ్నె ఇరాక్ అయితే మరో ఉల్లేఖకుడు (ఇస్హాఖ్ బిన్ ఇబ్రాహీం అల్ ఖతలీ) పట్ల ఆక్షేపణ తెలుపుతూ ఈ కాల్పనిక హదీసుకు అసలు రూపకర్త ఇతనే అని హాఫిజ్ ఇబ్నె హజర్ నిర్ధారించి, నిస్సందేహంగా ఇదొక కాల్పనిక, తప్పుడు హదీసని ఖరారు చేశారని వివరించారు. *(అల్ మౌజుఆత్ :2వ సంపుటం, 578–579పేజీలు, తల్ఖీస్ అల్ మౌజుఆత్ : 277 పేజీ, అల్ లాలి :2వ సంపుటం, 97–98 పేజీలు, తన్జీహుష్షరీయ : 2వ సంపుటం, 152 పేజీ)*

అలాగే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సెలవిచ్చారని ఈ హదీసు కూడా ఉల్లేఖించబడుతూ వుంటుంది: ఎవరైనా రజబ్‌లో ఒక రోజు ఉపవాసముండి, దానిలో 4 రకాతుల నమాజును – మొదటి రకాతులో 100 సార్లు ఆయతుల్ కుర్సీ, రెండవ రకాతులో 100 సార్లు ఇఖ్లాస్ సూరా – చదివితే, స్వర్గంలో అతని నివాసం చూపనంత వరకు అతనికి మరణం రాదు.

దీని గురించి ఇబ్నుల్ జౌజి ఇలా పేర్కొన్నారు :

ఇది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పేరు మీద సృష్టించబడ్డ హదీసు. దాదాపు దీని ఉల్లేఖకులందరూ అపరిచితులే.

*(అల్ మౌజుఆత్ : 2వ సంపుటం, 435వ పేజి)*

ఇలాగే రజబ్ ఉపవాసాల గురించి మరో హదీసు కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఆపాదించబడుతూ వుంటుంది.

అదేమిటంటే– ఎవరైనా రజబ్‌లో మూడు రోజులు ఉపవాసముంటే, అల్లాహ్ అతనికి పూర్తి నెల ఉపవాసాల పుణ్యాన్ని లిఖిస్తాడు. ఎవరైనా 15 రోజులు ఉపవాసముంటే, అల్లాహ్ అతని పట్ల తన సంతృప్తిని లిఖిస్తాడు. ఎవరికైతే అల్లాహ్ తన సంతృప్తిని లిఖిస్తాడో అతన్ని శిక్షించడు. ఇక ఎవరైనా నెల మొత్తం ఉపవాసముంటే అతని నుండి తేలికపాటి లెక్క తీసుకోబడుతుంది.

దీని గురించి ఇబ్నుల్ జౌజి ఇలా వివరించారు: ఈ హదీసు ప్రామాణికమైనది కాదు. ఎందుకంటే దీని ప్రారంభంలో 'అబాన్' అనే ఒక ఉల్లేఖకుడు వున్నాడు. ఇతని గురించి షేబా ఇలా సెలవిచ్చారు– నేను 'అబాన్' నుండి (హదీసులు) ఉల్లేఖించడం కన్నా వ్యభిచారం చేయడమే ఉత్తమమని భావిస్తాను. *(అల్ మౌజుఆత్: 2వ సంపుటం, 579 పేజీ)*

రజబ్ మాసాన్ని పురస్కరించుకొని మింబర్లు, వేదికల నుండి వినిపించబడే లేదా పుస్తక రూపంలో ముద్రించబడే ఈ హదీసులే కాక ఇలాంటి ఎన్నో ఇతర హదీసులున్నాయి. మరిచూడబోతే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చి వున్నారు: "ఎవరైనా ఉద్దేశ్యపూర్వకంగా నాపై అబద్ధమాడితే తన నివాసం, నరకమని అతను గట్టిగా నమ్మాలి."

*(బుఖారీ:1291, ముస్లిం :4)*

ఈ హదీసు ముతవాతిర్ (అనేక ప్రామాణిక పరంపరల ద్వారా ఉల్లేఖించ బడిన) హదీసు. 98 మంది సహాబాలు దీనిని ఉల్లేఖించారని ఇబ్నుల్ జౌజి పేర్కొన్నారు.

ఇబ్నుస్సలామ్ కొంత మంది హదీసువేత్తల ద్వారా – దీనిని 62 సహాబాలు ఉల్లేఖించారని పేర్కొన్నారు. వీరిలో 'అష్రయే ముబష్షిరా' (తమ జీవితంలోనే దైవ ప్రవక్త ద్వారా స్వర్గ శుభవార్త పొందిన పది మంది సహాబాలు) కూడా

వున్నారు. ముల్లా అలీ ఖారీ సుయూతీ ద్వారా ఉల్లేఖించినదేమిటంటే – ఇది 100 కన్నా ఎక్కువ సహాబాల ద్వారా ఉల్లేఖించబడింది.

అందుకే ఇమామ్ నవవీ ఇలా సెలవిచ్చారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పేరుతో అబద్ధాలు సృష్టించడం హరామ్ మరియు ఘోరమైన పాపాలలో అతి ఘోరమైనది. ఘోరమైన (పెద్ద) చెడు కార్యాలలో అత్యంత ఘోరమైన చెడు కార్యం. (ఇలా అబద్ధాలు సృష్టించడం) ఇస్లామీయ ఆజ్ఞలు, ప్రోత్సహించే మరియు భయపెట్టే విషయాలలో ఏ విషయంలోనైనా కావచ్చు. దీనిపై ముస్లిములందరి మధ్య ఏకాభిప్రాయం వుంది. కేవలం 'కరామియ' వర్గం తప్ప. ఇదొక బిద్అతీ వర్గం.

*(షరహ్ సహీహ్ ముస్లిం: 1వ సంపుటం, 67వ పేజీ)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన పేరుతో హదీసులు సృష్టించడాన్ని చాలా గట్టిగా వారించి, అతని నివాసం నరకమని హెచ్చరించారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:"నాపై అబద్ధాన్ని సృష్టించకండి. ఎందుకంటే, నాపై అబద్ధాలు సృష్టించేవాడు తప్పకుండా నరకంలోకి ప్రవేశిస్తాడు." *(బుఖారీ : 106)*

"ఎవరైతే నేను చెప్పని విషయాన్ని నాకు ఆపాదిస్తాడో, అతని నివాస స్థలం నరకం". *(బుఖారీ : 109)*

## కాల్పనిక, తప్పుడు హదీసులను ఉల్లేఖించడం కూడా హరామ్

కాల్పనిక తప్పుడు హదీసుల వాస్తవిక స్థాయి గురించి వివరించకుండా – అంటే ఇది కాల్పనిక హదీసు అని గట్టిగా చెప్పకుండానే–దానిని ఉల్లేఖించడం అంటే, ఆ కాల్పనిక హదీసును స్వయంగా సృష్టించినట్లే అవుతుంది. ఇలా చేసేవాళ్ళు (కాల్పనిక హదీసును సృష్టించినవాడు మరియు దానిని ఉల్లేఖించినవాడు) ఇద్దరూ దాని చెడు పర్యవసాన శ్రేణిలోకి వచ్చేస్తారు (అంటే – ఉద్దేశ్యపూర్వకంగా ఒక కాల్పనిక, తప్పుడు హదీసును సృష్టించి మొట్టమొదటగా దానిని ఉల్లేఖించిన వాడు ఎంతటి పాపాత్ముడవుతాడో, దాని వాస్తవిక స్థితిని స్పష్టంగా వివరించకుండా దానిని తదుపరి ఉల్లేఖించినవాడు కూడా అంతే పాపాత్ముడవుతాడు).

ఈ విషయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చాలా స్పష్టంగా

సెలవిచ్చివున్నారు: ఏ వ్యక్తి అయినా – ఒక హదీసును, ఇది కాల్పనిక, తప్పుడు హదీసని తెలిసిన తర్వాత కూడా దానిని ఉల్లేఖిస్తాడో– అతను కూడా అసత్యవాదులలో ఒకడిగా పరిగణించబడతాడు. *(ముస్లిం : ముఖద్దమ)*

ఈ కారణం వల్లనే, హదీసు వేత్తలందరూ ముక్తకంఠంతో, కాల్పనిక తప్పుడు హదీసులు ఉల్లేఖించడాన్ని హరామ్‌గా ఖరారు చేశారు. ఆ హదీసులు (ఇస్లామీయ) ఆజ్ఞలు, వ్యవహారాలకు సంబంధించినవి కానివ్వండి లేదా ప్రోత్సహించే, భయపెట్టే విషయాలకు సంబంధించినవి కానివ్వండి.

ఈ విషయంలో ఖతీబుల్ బగ్దాదీ ఇలా పేర్కొన్నారు: హదీసువేత్త (ముహద్దిస్)పై తప్పనిసరి (విధి)గా వున్న విషయమేమిటంటే – అతను కాల్పనిక, తప్పుడు హదీసులలో దేనిని కూడా ఉల్లేఖించకూడదు. ఇక యెవరైనా ఈ పని చేస్తే అతను మహాపరాధానికి పాల్పడినవాడై అసత్యవంతుల సమూహంలో చేరిపోతాడు. *(ఫత్‌హుల్ ముగైస్ అస్సఖావీ: 1వ సంపుటం,275వ పేజీ)*

ఇమామ్ నవవీ ఇలా పేర్కొన్నారు: ఏ వ్యక్తి అయినా – ఒక హదీసు గురించి, ఇది కాల్పనిక తప్పుడు హదీసని తెలిసినా లేదా దాని గురించి ఎక్కువ అనుమానం కలిగినా–దాని వాస్తవిక స్థితి– అంటే ఇది కాల్పనిక హదీసు అని స్పష్టంగా చెప్పకుండా– ఆ హదీసును ఉల్లేఖించడం హరామ్ మరియు (ఇలా చేసినవాడు) దాని చెడు పర్యవసానశ్రేణిలోకి వచ్చేస్తాడు, తదుపరి అతను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)పై అసత్యం పలికే వారి సమూహంలో చేరిపోతాడు.

అందుకే రజబ్ మాసం లేదా ఇతర మాసాల గురించి వచ్చిన కాల్పనిక హదీసులను (ప్రజలలో) ఉల్లేఖించకుండా జాగ్రత్తపడాలి మరియు ఈ కాల్పనిక, తప్పుడు హదీసుల వాస్తవికతను వివరించి ప్రజలను ఈ విషయంలో జాగ్రత్త పడేలా చేయాలి.

## (3) రజబ్ నెల 27వ రాత్రి ఆరాధన మరియు మరుసటి రోజు ఉపవాసం

ప్రజల్లో నేడు బాగా ప్రసిద్ధి గాంచి వున్న ఒక విషయమేమింటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు చెందిన 'ఇస్రా వ మేరాజ్' (మేరాజ్ యాత్ర) అద్భుతం రజబ్ నెల 27వ రాత్రి జరిగింది అని. అందుకే వారు ఈ

రాత్రి ప్రత్యేకంగా ఆరాధన చేసి మరుసటి రోజు ఉపవాసముండడం ఎంతో అభిలషణీయం అని అనుకుంటారు!

ఈ విషయంలో తెలుసుకోవాల్సిన మొట్టమొదటి విషయమేమిటంటే– 'ఇస్రా వ మేరాజ్' తేదీ గురించి (ఇస్లామీయ) విద్వాసుల మధ్య ఎన్నో అభిప్రాయ భేదాలున్నాయి.

హాఫిజ్ ఇబ్నె హజర్ రహిమహుల్లాహ్ 'ఫత్హుల్ బారీ –షరహ్ సహీహ్ బుఖారీ' నందు దీని గురించి పదికి పైగా వేర్వేరు వచనాలను సంగ్రహించారు. దీనిలో ఒక వచనం ఏమిటంటే – ఇది హిజ్రత్ (మదీనా ప్రస్థానం)కు 1 సం॥ ముందుగా (రబీఉల్ అవ్వల్ మాసం, దైవ దౌత్యపు 12వ సం॥ ) జరిగింది. ఇది ఇబ్నె సాద్ వగైరా॥ల వచనం. ఇదే మాటను ఇమామ్ నవవీ కూడా పూర్తి నమ్మకంతో అన్నారు. ఇబ్నె హజమ్ అయితే దీనిని 'ఇజ్మా' (ఏకాభిప్రాయం)గా ఖరారు చేశారు. కానీ దీనిని 'ఇజ్మా' అనడం సరైనది కాదు. వీరితో పాటు ఇబ్నె అబీ అజల్ ఇజ్ హనఫీ కూడా ఈ తేదీనే (అంటే హిజ్రత్కు 1 సం॥ ముందు) పూర్తి నమ్మకంతో పేర్కొన్నారు.

*(షరహ్ అఖీదా తహావియా : 224 పేజీ)*

రెండవ వచనం ఏమిటంటే – ఇది (మేరాజ్ యాత్ర) హిజ్రత్కు 8 నెలలు ముందు (రజబ్ నెల, దైవదౌత్యపు 12వ సం॥) జరిగింది. ఇక మూడవ మాట ఏమిటంటే – ఇది హిజ్రత్కు 6 నెలలు ముందుగా జరిగింది. నాల్గవ మాట ఏమిటంటే – ఇది హిజ్రత్కు 11 నెలలు ముందుగా జరిగింది. ఇలా ఒక్కొక్కరు ఒక్కోవిధంగా సెలవిచ్చారు.

*(ఫత్హుల్ బారీ : 7వ సంపుటం, 257పేజీ)*

మౌలానా సఫీవుర్ రహ్మాన్ ముబారక్పూరీ రహిమహుల్లాహ్ ఈ కాలపు తన ప్రసిద్ధ గ్రంథం 'అర్రహీఖుల్ మఖ్తూమ్' లో జీవిత చరిత్ర కారుల ఆరు వచనాలను సంగ్రహించారు. దానిలో ఒకటి అల్లామా మన్సూర్ పూరీ రహిమహుల్లాహ్ నుండి సంగ్రహించారు. అదేమిటంటే– ఈ సంఘటన దైవ దౌత్యపు 10వ యేట రజబ్ నెల 27న జరిగింది. కానీ ఆయనే దీనిని సత్యమని నమ్మడానికి తిరస్కరించారు. ఎందుంటే – ఖదీజా (రజిఅల్లాహు అన్హా) ఐదు

పూటల నమాజ్ విధి(ఫర్జ్)గా నిర్ణయించబడడానికి ముందు, అంటే దైవదౌత్యపు 10వ యేట రమజాన్ మాసంలో మరణించారు. మరి ఐదు పూటల నమాజ్ అయితే మేరాజ్ యాత్రలో విధిగా నిర్ణయించబడింది. అందుకే ఆయన దృష్టిలో మేరాజ్ యాత్ర ఆమె నిర్యాణం తరువాత జరిగి వుండాలి, ముందుగా కాదు. ఈ ప్రాతిపదిక మీదనే ఆయన (ఖదీజా (రజి అల్లాహు అన్హ) నిర్యాణానికి) ముందుగా ఈ సంఘటన జరిగిందని పేర్కొన్న మరో రెండు వచనాలను కూడా సరైనవి కావని నిర్ధారించారు.

ఇక మిగిలిన మూడు వచనాలు (దైవదౌత్యపు 12వ యేట రమజాన్ మాసం నందు, దైవ దౌత్యపు 13వ యేట ముహర్రం మాసం నందు, దైవ దౌత్యపు 13వ యేట రబీఉల్ అవ్వల్ మాసం నందు) విషయాని కొస్తే, ఆయన వీటిలో ఒకదాని మీద మరో దానికి ప్రాధాన్యత ఇవ్వడానికి ఆధారమేదీ లభ్యం కాలేదు అని సెలవిచ్చారు. ఇక దీని గురించి ఆయన మాటల్లో చెప్పా లంటే – ఇస్రా సూర అవతరణ పూర్వపరాలను దృష్టిలో పెట్టుకుని పరిశీలిస్తే ఈ సంఘటన (దైవ ప్రవక్త) మక్కా జీవితం ఆఖరి దశలో జరిగింది.

*(అర్రహీఖుల్ మఖ్తూమ్ : 197వ పేజీ)*

ఇలా, సత్యానికి దగ్గరగా వుందని మాకనిపించే విషయమేమిటంటే– ఎంతో మహోన్నతమైన ఈ సంఘటన, హిజ్రత్‌కు 1 సం॥ ముందు రబీఉల్ అవ్వల్ మాసం, దైవదౌత్యపు 12వ యేట జరిగింది. దీనికి ఆధారం– ఇమామ్ జుహ్రి మరియు ఇమామ్ ఉర్వా బిన్ జుబైర్‌ల ఈ మాట – హిజ్రత్‌కు 1 సం॥ ముందు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను బైతుల్ మఖ్దిస్ వైపునకు యాత్రగావించడం జరిగింది.

వారి ఈ మాటను మూసా బిన్ ఉఖ్బా తన 'మగాజీ' అను గ్రంథంలో పేర్కొన్నారు. ఈయన సహీహైన్ (బుఖారీ, ముస్లిం గ్రంథాలు) లోని హదీసుల ఉల్లేఖకులు కూడా.

ఆయన గ్రంథం గురించి ఇబ్నె మయీన్ ఇలా సెలవిచ్చారు: చారిత్రక గ్రంథాలలో మూసా బిన్ ఉఖ్బా – తను జుహ్రీ నుండి ఉల్లేఖించి సంగ్రహించిన గ్రంథం సత్య గ్రంథాలలో ఒకటి. ఇలాగే ఇమామ్ మాలిక్ రహిమహుల్లాహ్

మరియు ఇమామ్ అహ్మద్ రహిమహుల్లాహ్‌లు కూడా దీని ప్రామాణికతను నిర్ధారించారు.
*(సహీ ఉతీరతున్నబవియ– 1వ సంపుటం, 274వ పేజీ, అస్సీరతున్నబవియ ఫీ జాఅల్ మసాదిరుల్ అస్లియ - 1వ సంపుటం, 269వ పేజీ)*

ఇదే మాటకు హాఫిజ్ అబ్దుల్‌గనీ అల్ మఖ్‌దిసి కూడా తన చారిత్రక గ్రంథంలో ప్రాధాన్యమిచ్చినట్లు హాఫిజ్ ఇబ్నె కసీర్ రహిమహుల్లాహ్ పేర్కొన్నారు.
*(అల్ బదాయ వన్నిహాయ– 3వ సంపుటం, 109వ పేజీ)*

బహుశా హాఫిజ్ ఇబ్నుల్ ఖయ్యూం రహిమహుల్లాహ్ కూడా దీని వైపునకే మ్రొగ్గుచూపారు. కారణం, ఆయన తన 'జాదుల్ మిఆద్' నందు జుహ్రీ గారి ఈ మాటను అన్నింటి కన్నా ముందుగా పేర్కొన్నారు. దీనితో పాటు ఆయన ఇబ్నె అబ్దుల్ బర్ర్ గారి–ఈ సంఘటన హిజ్రత్‌కు 1 సం॥ 2 నెలల ముందుగా జరిగింది– అన్నమాటను పేర్కొన్నారు.
*(జాదుల్ మిఆద్–3వ సంపుటం, 37వ పేజీ)*

కనుక (పై విషయాలన్నింటి ద్వారా తెలిసిందేమిటంటే) నేడు సామాన్య ప్రజానీకంలో బాగా ప్రాచుర్యం పొంది వున్న - 'ఈ సంఘటన రజబ్ నెల 27వ రాత్రి జరిగింది' అన్న విషయం సరైనది కాదు. ఎందుకంటే ఈ విషయం ఒక్క ప్రామాణిక ఉల్లేఖనం ద్వారా కూడా నిర్ధారించబడలేదు.

ఇక రెండో విషయమేమిటంటే - ఒకవేళ ఇది నిజమని ఒప్పుకున్నా, అంటే ఈ రాత్రే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు మేరాజ్ చేయించబడిందని ఒప్పుకున్నా, దీనిలో ప్రత్యేకంగా ఆరాధించి, దాని మరుసటి రోజు ఉపవాసముండాలన్న విషయం ఎక్కడుంది?

ఈ విషయంలో మా దృష్టికోణం చాలా స్పష్టంగా వుంది. అదేమి టంటే–ఒకవేళ స్వయానా మన ప్రియ దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ రాత్రి ప్రత్యేకంగా ఆరాధించివుంటే దానిని మనం కూడా తప్పకుండా చేయాలి. ఒకవేళ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) చెయ్యకపోతే మనం కూడా చేయకూడదు. అంతేగాక, కనీసం ఈ సంఘటన తర్వాత సహాబాలు ఈ రాత్రి ప్రత్యేకంగా ఆరాధించివుంటే దానికి సంబంధించిన ఆధారాలు మాకు సమర్పిస్తే, మేము కూడా వారి అడుగుజాడల్లో నడుస్తూ

ఈ రాత్రి ప్రత్యేకంగా ఆరాధిస్తాం. కానీ, ఒకవేళ దీని ఆధారాలు లేకపోతే - నిస్సందేహంగా లేవు - మరి ఈ కాల్పనిక తప్పుడు ఆచారాలకు స్వస్తి పలికి వాస్తవిక ధర్మానికనుగుణంగా ఆచరించాలి.

ఇక మూడవ విషయమేమిటంటే - 27వ రాత్రి ఆరాధన లేదా 27 నాటి ఉపవాసం శ్రేష్ఠతల గూర్చి వివరించబడే విషయాలన్నీ అసత్యాలు, వాటిలో ఏమాత్రం వాస్తవం లేదు.

మౌలానా అబ్దుల్ హై లక్నోవీ ఇలా పేర్కొన్నారు: భారతీయ ఉపఖండంలో పేరుగాంచిన - 'షబే మేరాజ్ రోజు ఉపవాసం ఉండడం 1000 ఉపవాసాలతో సమానం'- అన్న మాటలో ఏ మాత్రం వాస్తవం లేదు.

*(అల్ ఆసారుల్ మర్ఫూఅ : 77వ పేజీ)*

ఆఖరిగా అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే - ఆయన మనందరినీ సరైన ధర్మం ప్రకారం ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక! మరియు మన అంతం కూడా దీనిపైనే అగు గాక! మనందరికీ ఆయన బిద్అత్‌లు సృష్టించడం లేదా సృష్టించబడిన బిద్అత్‌లపై ఆచరించడం వంటి విషయాల నుండి దూరంగా వుండే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!!

## రెండవ ఖుత్బా

రజబ్ లోని బిద్అత్ లను పురస్కరించుకొని ఈ మాటలు కూడా వినండి! కొంత మంది ఈ నెలలో ఉమ్రా చేయడం ఉత్తమమని భావిస్తారు. వాళ్ళ ఈ తలంపు ఎందుకోసం సరైనది కాదంటే - దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా ఈ నెలలో ఉమ్రా ప్రత్యేకత గురించి ఏమాత్రం నిరూపించ బడిలేదు. అలాగే ఆయన స్వయానా ఈ నెలలో ఉమ్రా చేసినట్లు ఆధారాలు కూడా లేవు.

ఉర్వా బిన్ జుబైర్ కథనం: నేను మరియు ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఆయెషా (రజి అల్లాహు అన్హా) కుటీరం ముందు కూర్చొని వున్నాం. నేను ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) తో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రజబ్ నెలలో ఉమ్రా చేసారా? అని అడిగాను. దానికాయన - అవునని జవాబిచ్చారు. తదుపరి నేనీ విషయం ఆయెషా (రజి అల్లాహు అన్హా) కు తెలుపగా ఆమె- ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) ను అల్లాహ్ క్షమిం

చుగాక! అల్లాహ్ సాక్షి! దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రజబ్ నెలలో ఉమ్రా ఎప్పుడూ చేయలేదు. మరి చూడబోతే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎప్పుడు ఉమ్రా చేయడానికి వెళ్ళినా ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఆయనకు తోడుగా వుండేవారు. (అయినప్పటికీ ఆయన ఈ విషయం మరిచిపోయారు!)

ఆయెషా (రజి అల్లాహు అన్హా) ఈ మాటలంటున్నప్పుడు ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కూడా ఆమె మాటలు విన్నారు. అయినప్పటికీ ఆయన మౌనంగా వుండిపోయారు. (అంటే ఆమె మాటలను ఖండించలేదు.)

*(ముస్లిం:1225, నసాయి :4222, ఇబ్నె మాజ: 2998, సహీహ్ అల్‌బానీ)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాలుగు ఉమ్రాలు చేశారు. అవన్నీ జిల్ ఖాదా నెలలో చేసినవే. కేవలం ఒకటి తప్ప. అది ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్ తో కలిపి చేశారు. మొదటి ఉమ్రా హుదైబియా నుండి జిల్ ఖాదా నెలలో, రెండవ ఉమ్రా దాని తరువాత సం॥ జిల్ ఖాదా నెలలోనే, మూడవది హునైన్ యుద్ధ ప్రాప్తి పంపకం చేసిన 'జుఅరానా' అనే ప్రదేశం నుండి, అది కూడా జిల్ ఖాదా నెలలోనే. ఇక నాల్గవ ఉమ్రా ఆయన హజ్ తో కలిపి చేశారు.

*(బుఖారీ: 1778, 1780, ముస్లిం : 1253)*

దీని ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రజబ్ మాసంలో ఉమ్రా ఎప్పుడూ చేయలేదు. కనుక ఈ నెలలో ఉమ్రా చేయడం ఉత్తమం అని భావించడం సరైనది కాదు.

## రజబ్ లోని నైవేద్య వంటకాలు (రజబ్ కే కుండే)

రజబ్ నెలలో ఆచరించే మరో బిద్అత్ కూడా వుంది. అదేమిటంటే – ఇమామ్ జాఫర్ సాదిక్ రహిమహుల్లాహ్ పేరుతో నైవేద్య వంటకాలు (రజబ్ కే కుండే) చేయడం. భారతదేశానికి చెందిన ఒక వ్యక్తి "దాస్తానే అజీబ్" పేరుతో ఒక కథను ప్రచురించాడని చెబుతూ వుంటారు. దానిలో అతను జాఫర్ సాదిక్ రహిమహుల్లాహ్ ఇలా సెలవిచ్చారని పేర్కొన్నాడు – ఏ వ్యక్తి అయినా రజబ్ 22వ తేదీ నాడు, నా నైవేద్యం పేరుతో వంటకాలు (కుండే) చేసి, నా ద్వారా తన అవసరాన్ని వేడుకుంటే అది తప్పకుండా నెరవేరుతుంది.

ఒకవేళ నెరవేరకపోతే ప్రళయం రోజు నా కొంగు వుంటుంది మరియు అతని చేయి. (అంటే నా కొంగు పట్టుకుని అతను స్వర్గంలో వెళ్తాడు)

కాస్త ఆలోచించండి!

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నిర్యాణం తర్వాత 1400 సం॥ల తర్వాత సృష్టించబడిన ఆచారం ధర్మం యొక్క అంతర్భాగం కాగలదా?

ఇమామ్ జాఫర్ సాదిక్ గారి వసీయతు వెలుగులోకి రావడానికి 1400 సం॥ పట్టిందా? ఇమామ్ జాఫర్ రహిమహుల్లాహ్ లాంటి మహోన్నత వ్యక్తి తన పేరు మీద వంటకాలు చేసి నైవేద్యం పెట్టి మ్రొక్కుబడి తీర్చుకోమని వసీయతు చేయగలరా? మరి చూడబోతే – దైవేతరుల కొరకు మ్రొక్కుబడి చేసుకోవడం పూర్తిగా హరామ్! ఎందుకంటే – మ్రొక్కుబడి ఒక ఆరాధన – మరియు సమస్త ఆరాధనలు కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించడం తప్పనిసరి. కనుక, ఇమామ్ జాఫర్ సాదిక్ లాంటి మహోన్నత వ్యక్తి నుండి – షిర్క్ కలిగి వున్న ఇలాంటి ఆచరణ చేయమని వసీయతు చేశారని భావించడం ఊహకందని విషయం.

మరి కొంచెం (లోతుగా) ఆలోచించండి! రజబ్ 22వ తారీఖుతో ఇమామ్ జాఫర్ సాదిక్ రహిమహుల్లాహ్‌కు గల సంబంధం ఏమిటి?

ఆ రోజు ఆయన జన్మించనూ లేదు మరియు మరణించనూ లేదు!

అసలు విషయం ఏమిటంటే – ఆరోజు ముఆవియా (రజి అల్లాహు అన్హు) మరణించారు. ఆయన గురించి చెడుగా మాట్లాడేవారు, తాము స్వయంగా కల్పించిన–ఈ రోజు నైవేద్యం వంటకాలు చేయండి – అన్న విషయాన్ని ఇమామ్ జాఫర్ సాదిక్ రహిమహుల్లాహ్‌కు ఆపాదించారు.

ఏది ఏమైనా ఇదొక అసత్యపు కట్టుకథ. కనుక ముస్లిములందరూ ఈ దురాచారం నుండి దూరంగా వుండాలి.

అల్లాహ్ మనందరినీ తౌహీద్ (ఏక దైవారాధన)పై నిలకడగా వుంచుగాక! మరియు బహుదైవారాధన విశ్వాసాలు మరియు దృష్టి కోణాల నుండి దూరంగా వుండే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

# ఇస్రా వ మేరాజ్

## ఖుత్బాలోని ముఖ్యాంశాలు

1) ఇస్రా వ మేరాజ్ ప్రాముఖ్యత.

2) ఇస్రా వ మేరాజ్ తారీఖు.

3) ఇస్రా వ మేరాజ్ లోని సంఘటనలు.

4) ఇస్రా వ మేరాజ్ ఉద్దేశ్యము.

ఇస్లామీయ సోదరులారా!

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు అల్లాహ్ ఎన్నో అద్భుతాలను ప్రసాదించాడు. వాటిలో ఒక ముఖ్యమైన అద్భుతం – ఇస్రా వ మేరాజ్. ఈ అద్భుతంలో రెండు ముఖ్యమైన భాగాలు వున్నాయి. ఒక భాగం – ఇస్రా అని పిలువబడే 'మస్జిదుల్ హరామ్' నుండి 'మస్జిదె అఖ్సా' వరకు సాగిన ప్రయాణానికి సంబంధించినది. ఇక రెండవ భాగం – 'మస్జిదె అఖ్సా' నుండి ఆకాశాల కన్నా పైకి, అల్లాహ్ కోరుకున్నంత వరకు సాగిన ప్రయాణం. దీనిలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు స్వర్గ నరకాలతో పాటు, ఎన్నో అల్లాహ్ సూచనలు చూపించడం జరిగింది, ఎన్నో ప్రవక్తలను పరిచయం చేయడం జరిగింది మరియు 5 పూటల నమాజ్ విధి (ఫర్జ్)గా చేయబడ్డాయి – దీనినే 'మేరాజ్' అని పిలుస్తారు.

మేరాజ్ సంఘటన గురించి అహ్లుస్సున్నహ్ వల్ జమాఅత్ విశ్వాస మేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మెలకువగావున్న స్థితిలో, శరీర సమీతంగా తనకు 'ఇస్రా వ మేరాజ్' చేయించడం జరిగింది. అంతేగానీ, నిద్రలో, ఆత్మరూపంలో కాదు.

ఇమామ్ తహావీ రహిమహుల్లాహ్ ఇలా పేర్కొన్నారు : మేరాజ్ అనేది సత్యం. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మెలకువ స్థితిలో, శరీర సమేతంగా సంచరింపజేయడం జరిగింది మరియు ఆకాశాల వరకూ, ఇంకా వాటికన్నా పైకి అల్లాహ్ కోరుకున్నంత వరకు తీసుకెళ్ళడం జరిగింది. అక్కడ

అల్లాహ్ తాను కోరుకున్నట్లుగా ఆయనను గౌరవించి, తాను కోరుకున్నదానిని ఆయనకు 'వహీ' చేశాడు.

'ఇస్రా' గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

سُبْحٰنَ الَّذِیْۤ اَسْرٰی بِعَبْدِهٖ لَیْلًا مِّنَ الْمَسْجِدِ الْحَرَامِ اِلَی الْمَسْجِدِ الْاَقْصَا الَّذِیْ بٰرَكْنَا حَوْلَهٗ لِنُرِیَهٗ مِنْ اٰیٰتِنَا ؕ اِنَّهٗ هُوَ السَّمِیْعُ الْبَصِیْرُ ①

**"తన దాసుణ్ణి రాత్రికి రాత్రే మస్జిదుల్ హరామ్ నుండి మస్జిదె అఖ్సా వరకు తీసుకునిపోయిన అల్లాహ్ పరిశుద్ధుడు. దాని పరిసరాలను మేము శుభవంతం చేశాము. ఎందుకంటే మేమతనికి మా (శక్తి సామర్థ్యాలకు సంబంధించిన) కొన్ని సూచనలను చూపదలిచాము. నిశ్చయంగా అల్లాహ్ మాత్రమే బాగా వినేవాడు, చూసేవాడు."** ***(బనీ ఇస్రాయీల్ :1)***

ఈ ఆయత్ 'సుబ్హాన' అన్న పదంతో అల్లాహ్ ప్రారంభించాడు. దీని శాబ్దిక అర్థం ఏమిటంటే – ఆయన (అల్లాహ్) అన్ని లోపాలకు అతీతుడు. కానీ, అరబ్బీ భాషలో దీనిని 'ఆశ్చర్యాన్ని' వెలిబుచ్చే సందర్భాలలో కూడా ఉపయోగిస్తారు. ఇక్కడ కూడా అల్లాహ్ శక్తిసామర్థ్యాలకు గాను ఆశ్చర్యం ప్రకటించబడుతోంది – ఆ శక్తిసామర్థ్యాలు ఏమిటంటే – అల్లాహ్ తన దాసుణ్ణి, ఆ రోజుల్లో 40 రేయింబవళ్ళలో పూర్తి చేయగలిగే ప్రయాణాన్ని రాత్రికి రాత్రే పూర్తి చేయించాడు. దీనిని వెల్లడించిన శైలి కూడా – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు మెలకువతో, శరీర సమేతంగా మేరాజ్ చేయించడం జరిగిందని నిరూపిస్తోంది. ఎందుకంటే – ఒకవేళ నిద్ర స్థితిలో, ఆత్మరూపంలో ఈ ప్రయాణం జరిగి వుంటే, దాని కోసం 'సుబ్హాన' పదాన్ని ఉపయోగించి ఆశ్చర్యం ప్రకటించాల్సిన అవసరం వుండేది కాదు.

ఇదేగాక, అల్లాహ్ దీనిలో అబ్ద్ (దాసుడు) పదాన్ని వాడాడు. అంటే ఆయన దాసుణ్ణి సంచారం గావించాడు. ఈ పదం కూడా ఆత్మ, శరీరం – రెండింటినీ కలిపి వాడబడుతుంది. కేవలం ఆత్మ కోసం కాదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు కలలో కాకుండా మెలకువతో శరీర సమేతంగా మేరాజ్ యాత్ర చేయించి గౌరవించడం జరిగిందనడానికి ఇది రెండవ ఆధారం.

ఇక దీని మూడవ ఆధారం ఏమిటంటే – ఒకవేళ 'ఇస్రా వ మేరాజ్' సంఘటన కలలో జరిగివుంటే, మరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన కలను జనాలకు వివరించినప్పుడు వారు దానిని (నమ్మకుండా) తిరస్కరించేవారు కాదు.

కనుక మక్కా అవిశ్వాసుల తిరస్కరణ ద్వారా మనకు తెలిసిందేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారితో తన కలను వివరించలేదు, వారితో స్పష్టంగా – తనకు మెలకువ స్థితిలో, శరీర సమేతంగా 'ఇస్రా వ మేరాజ్' చేయించడం జరిగిందని చెప్పారు.

అందుకే వారు– మక్కా నుండి ఏలియా (బైతుల్ మఖ్దిస్)కు మేము 40 రేయింబవళ్ళలో పూర్తి చేసే యాత్రను ఈయన రాత్రికి రాత్రే అక్కడికెళ్ళి తిరిగి వచ్చేశారు! అని ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను పరిహసించారు.

హాఫిజ్ ఇబ్నె కసీర్ రహిమహుల్లాహ్ ఇలా పేర్కొన్నారు:

ముందు వారు, వెనుక వారిలో మెజారిటీ విద్వాంసుల అభిమత మేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు ఆత్మ మరియు శరీరంతో కలిపి 'ఇస్రా' యాత్ర చేయించడం జరిగింది. మేరాజ్ యాత్రలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వాహనంపై కూర్చోవడం, పైకి వెళ్ళడం మొ॥న విషయాలు కూడా చాలా స్పష్టంగా ఈ విషయాన్ని తెలియజేస్తున్నాయి.

*(అల్ బదాయా వన్నిహాయ –3వ సంపుటం, 113–114 పేజీలు)*

ఈ ఆయతును పురస్కరించుకొని మరో విషయం కూడా తెలుసుకోండి!

'మున్కిరీనె హదీస్' (సత్యానికి దూరంగా వున్న ఒక వర్గం) 'ఇస్రా వ మేరాజ్' అద్భుతాన్ని ఒక సామాన్య కథలాగా ఖరారు చేస్తూ, ఈ ఆయతులో మస్జిదె అఖ్సా అంటే మస్జిదె నబవీ అని, ఇక్కడ హిజ్రత్ గురించి సూచించడం జరిగిందని చెబుతూ వుంటారు!

ఇది వారి స్పష్టమైన అజ్ఞానానికి నిదర్శనం. ఎందుకంటే – హిజ్రత్ అనేది రాత్రిలోని కొంత భాగంలో పూర్తి కాలేదు. దానికెన్నో రోజులు పట్టాయి. దాని ఆరంభం రాత్రి వేళ కాకుండా మిట్ట మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా వున్న సమయంలో అయ్యింది. అంతేగాక, ఆ సమయంలో మస్జిదె నబవీ

అస్తిత్వం ఇంకా లేదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హిజ్రత్ చేసి మదీనాకు చేరుకున్న తర్వాత దానిని నిర్మించారు. దీనితో పాటు ఈ సూరా మక్కీ సూరా (మక్కా కాలంలో అవతరించబడిన సూరా), మదనీ సూరా కాదు. అందుకే దీనిని – మక్కా కాలంలో జరిగిన సంఘటన లాగానే అర్థం చేసుకోవాలి. మదీనా కాలంలో నిర్మించబడిన మస్జిద్ గురించి మక్కీ సూరాలో ఎలా వస్తుంది?

*(తఫ్సీర్ మౌలానా అబ్దుర్రహ్మాన్ కీలానీ)*

ఇక మరో ప్రశ్న ఏమిటంటే – 'ఇస్రా వ మేరాజ్' సంఘటన ఎప్పుడు జరిగింది?

ఈ విషయంలో (ఇస్లామీయ) విద్వాంసుల మధ్య ఎన్నో అభిప్రాయ భేదాలున్నాయి.

హాఫిజ్ ఇబ్నె హజర్ రహిమహుల్లాహ్ 'ఫత్హుల్ బారీ – షరహ్ బుఖారీ' నందు దీని గురించి పదికి పైగా వేర్వేరు వచనాలను సంగ్రహించారు. దీనిలో ఒక వచనం ఏమిటంటే – ఇది హిజ్రత్ (మదీనా ప్రస్థానం) కు 1 సం॥ ముందుగా (రబీఉల్ అవ్వల్ మాసం, దైవ దౌత్యపు 12 సం॥) జరిగింది. ఇది ఇబ్నె సాద్ వగైరా॥ల వచనం. ఇదేమాటను ఇమామ్ నవవీ కూడా పూర్తి నమ్మకంతో అన్నారు. ఇబ్నె హజమ్ అయితే దీనిని ఇజ్మా (ఏకాభిప్రాయం)గా ఖరారు చేశారు. కానీ దీనిని ఇజ్మా అనడం సరైనది కాదు. వీరితో పాటు ఇబ్నె అబీ అజిల్ ఇజ్ హనఫీ కూడా ఈ తేదీనే (అంటే హిజ్రత్‌కు 1 సం॥ ముందు) పూర్తి నమ్మకంతో పేర్కొన్నారు. *(షరహ్ అఖీదా తహావియ : 224 పేజీ)*

రెండవ వచనం ఏమిటంటే – ఇది (మేరాజ్ యాత్ర) హిజ్రత్‌కు 8 నెలలు ముందు (రజబ్ నెల, దైవ దౌత్యపు 12 వ సం॥) జరిగింది. ఇక మూడవ మాట ఏమిటంటే – ఇది హిజ్రత్‌కు 6 నెలలు ముందుగా జరిగింది. నాల్గవ మాట ఏమిటంటే – ఇది హిజ్రత్‌కు 11 నెలలు ముందుగా జరిగింది. ఇలా ఒక్కొక్కరు ఒక్కో విధంగా సెలవిచ్చారు.

*(ఫత్హుల్ బారీ: 7వ సంపుటం, 257వ పేజీ)*

మౌలానా సఫీవుర్ రహ్మాన్ ముబారక్ పూరీ రహిమహుల్లాహ్ ఈ కాలపు తన ప్రసిద్ధ గ్రంథం 'అర్రహీఖుల్ మఖ్తూమ్' లో జీవిత చరిత్రకారుల ఆరు వచనాలను సంగ్రహించారు. దానిలో ఒకటి అల్లామా మన్సూర్‌పూరీ

రహిమహుల్లాహ్ నుండి సంగ్రహించారు. అదేమిటంటే – ఈ సంఘటన దైవ దౌత్యపు 10వ యేట రజబ్ నెల 27న జరిగింది. కానీ ఆయనే దీనిని సత్యమని నమ్మడానికి తిరస్కరించారు. ఎందుకంటే – ఖదీజా (రజి అల్లాహు అన్హా) ఐదు పూటల నమాజ్ విధి (ఫర్జ్) గా నిర్ణయించబడడానికి ముందే అంటే, దైవ దౌత్యపు 10వ యేట రమజాన్ మాసంలో మరణించారు. మరి ఐదు పూటల నమాజ్ అయితే మేరాజ్ యాత్రలో విధిగా నిర్ణయించబడింది. అందుకే ఆయన దృష్టిలో మేరాజ్ యాత్ర ఆమె నిర్యాణం తరువాత జరిగి వుండాలి, ముందుగా కాదు. ఈ ప్రాతిపదిక మీదనే ఆయన (ఖదీజా (రజి అల్లాహు అన్హా) నిర్యాణానికి) ముందుగా ఈ సంఘటన జరిగిందని పేర్కొన్న మరో రెండు వచనాలను కూడా సరైనవి కావని నిర్ధారించారు.

ఇక మిగిలిన మూడు వచనాలు (దైవ దౌత్యపు 12వ యేట రమజాన్ మాసం నందు, దైవ దౌత్యపు 13వ యేట ముహర్రమ్ మాసం నందు, దైవదౌత్యపు 13వ యేట రబీఉల్ అవ్వల్ మాసం నందు) విషయానికొస్తే, ఆయన – వీటిలో ఒకదాని మీద మరో దానికి ప్రాధాన్యత ఇవ్వడానికి ఆధారమేదీ లభ్యం కాలేదు అని సెలవిచ్చారు. ఇక దీని గురించి ఆయన మాటల్లో చెప్పాలంటే – ఇస్రా సూర అవతరణ పూర్వాపరాలను దృష్టిలో పెట్టుకుని పరిశీలిస్తే ఈ సంఘటన (దైవ ప్రవక్త) మక్కా జీవితం ఆఖరి దశలో జరిగింది.

*(అర్రహీఖుల్ మఖ్తూమ్: 197వ పేజీ)*

ఇలా, సత్యానికి దగ్గరగా వుందని మా కనిపించే విషయమేమిటంటే – ఎంతో మహోన్నతమైన ఈ సంఘటన, హిజ్రత్‌కు 1 సం॥ ముందు రబీవుల్ అవ్వల్ మాసం, దైవ దౌత్యపు 12వ యేడు నందు జరిగింది. దీనికి ఆధారం – ఇమామ్ జుహ్రి మరియు ఇమామ్ ఉర్వా బిన్ జుబైర్‌ల ఈ మాట – హిజ్రత్ కు 1 సం॥ ముందు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను బైతుల్ మఖ్దిస్ వైపునకు యాత్ర గావించడం జరిగింది.

‘ఇస్రా వ మేరాజ్’ అద్భుతం గురించి ముందు మాటగా కొన్ని విషయాలు వివరించాక, ఇక అసలు సంఘటన లోకి వద్దాం.

వాస్తవమేమిటంటే – ఈ మహోన్నతమైన సంఘటన గురించి సహీహైన్ మరియు ఇతర హదీసు గ్రంథాల్లో దాదాపు 25 మంది సహాబాల ద్వారా

ఉల్లేఖించబడ్డ ఎన్నో హదీసులు వున్నాయి. ఒకవేళ ఎవరైనా, కేవలం ఒకటి రెండు హదీసులు మాత్రమే తన ముందుంచుకుంటే అతను ఖచ్చితంగా ఈ సంఘటనను గూర్చి పూర్తిగా తెలుసుకోలేడు.

ఎందుకంటే – ఏ ఒక్క హదీసులోనూ దీనిని గూర్చి సంపూర్ణంగా ఉల్లేఖించబడలేదు. అదీగాక, వీటిలో కొన్ని ప్రామాణికమైనవైతే మరి కొన్ని బలహీన మరియు స్వీకరించలేని హదీసులు కూడా వున్నాయి.

కనుక, కేవలం ప్రామాణిక హదీసుల వెలుగులోనే ఈ అద్భుతానికి సంబంధించిన వివరాలు (మీకు) వివరించడానికి మేం ప్రయత్నిస్తాం.

వల్లాహు వలీ ఉత్తౌఫీఖ్ (కేవలం అల్లాహ్ యే సద్బుద్ధిని ప్రసాదిస్తాడు)

## ఛాతీని తెరవడం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

నేను మక్కాలో మా ఇంట్లో నిద్రపోతున్నాను. (హాఫిజ్ ఇబ్నె హజర్, తబ్రానీ నుండి ఉల్లేఖించిన మరో ఉల్లేఖనం ప్రకారం ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ రాత్రి ఉమ్మె హానీ (రజి అల్లాహు అన్హా) ఇంట్లో వున్నారు. మరి ఆ ఇంటిని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఇల్లని ఎందుకన్నట్లు? ఎందుకంటే (ఆ రోజుల్లో) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అక్కడే నివాసముండేవారు)

(ఈలోగా) ఇంటి పైకప్పు తొలగించబడింది. (ఆపై) జిబ్రయీల్ (అలైహిస్సలాం) అవతరించి నన్ను కాబా గృహం దగ్గర 'హతీమ్' (కాబా ప్రక్కన గల ఖాళీ స్థలం, అయినప్పటికీ ఇది కూడా కాబాలోని అంతార్భగమే) వద్దకు తీసుకొచ్చారు. (అక్కడ నేను కొంత సేపు విశ్రాంతి తీసుకున్నాను) నాకు కునుకు రాసాగింది. పూర్తిగా నిద్రపోని లేదా పూర్తిగా మేల్కొని లేని స్థితిలో నేనున్నానప్పుడు. ఈ లోగా పలికేవారెవరో ఇలా పలికారు – ముగ్గురిలో ఒక్కడు, ఇద్దరు (హమ్జా, జాఫర్) వ్యక్తుల మధ్యవున్నవాడు (ఇతనే ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం). తదుపరి నన్ను లేపి (జమ్‌జమ్ వైపునకు) తీసుకెళ్ళడం జరిగింది. అక్కడ విశ్వాసం, వివేకంతో నింపివున్న ఒక బంగారపు

పాత్ర తేబడింది. తదుపరి నా ఛాతీని నాభిక్రింది వెంట్రుకల వరకు కోసి, నా హృదయాన్ని బయటికి తీసి, దానిని జమ్‌జమ్ నీటితో కడిగి, దానిలో విశ్వాసం (ఈమాన్) మరియు వివేకాలను నింపి దానిని తిరిగి యథావిధిగా పెట్టేసి మూసివేయడం జరిగింది. *(బుఖారీ : 349, 3207, 3887, ముస్లిం :164)*

హృదయం తెరవడాన్ని గురించి వివరించిన ఈ సంఘటన ప్రామాణిక హదీసులలో వుంది. కనుక దీనిని అనుమానించడానికి ఏమాత్రం ఆస్కారం లేదు. అయినా ఇలా జరగడం మొదటిసారేం కాదు. ఇంతకు ముందు కూడా కనీసం రెండు సార్లు ఇలా జరిగింది. మొదటి సారి – బాల్యంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హలీమా సాదియా ఇంట్లో పోషింపబడుతున్నప్పుడు. రెండవ సారి – దైవ దౌత్యం ప్రసాదించబడినప్పుడు. ఈ విషయాన్ని హాఫిజ్ ఇబ్నె హజర్ 'ఫత్‌హుల్ బారీ' యందు వివరించారు. బహుశా ఇలా చేయడంలో గల మర్మం – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు రాబోయే రోజుల్లో సంభవించే సంఘటనల కోసం తయారు చెయ్యడం కావచ్చు. వాస్తవం అల్లాహ్‌కే తెలుసు.

## ఇస్రా ఆరంభము

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

తదుపరి నా దగ్గరికి 'బురాఖ్' అని పిలువబడే ఒక తెల్ల రంగు జంతువు తీసుకురావడం జరిగింది. అది గాడిద కన్నా పెద్దది, కంచర గాడిద కన్నా చిన్నదిగా వుంది. దాని ఒక్క అడుగు అది చూడగలిగే హద్దు వరకు పోయేది. నన్ను దానిపై కూర్చోబెట్టడం జరిగింది. *(ముస్లిం: 164)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: 'ఇస్రా' రాత్రి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు బురాఖ్‌ను– ముక్కుత్రాడు, జీను వేయబడివున్న స్థితిలో తీసుకురావడం జరిగింది. అది కాస్త అల్లరి చేస్తుండడంతో జిబ్రయీల్ (అలైహి స్సలాం) దానితో – ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ముందు అల్లరి చేస్తున్నావా? వాస్తవానికి అల్లాహ్ దృష్టిలో ఆయన కన్నా నీకు ప్రియమైన రౌతు మరొకరు లేరు. ఇది వినగానే దానికి ముచ్చెమటలు పోసాయి.

*(తిర్మిజీ : 313, సహీహ్ – అల్‌బానీ)*

# బైతుల్ మఖ్దిస్

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

తదుపరి నేను బురాఖ్ ఎక్కి బైతుల్ మఖ్దిస్ చేరుకున్నాను. (ఆ తర్వాత నేను క్రిందికి దిగి) నా వాహనాన్ని గత ప్రవక్తలు కట్టేసిన చోటే కట్టేసి, ఆ తర్వాత మసీదు లోపలికి వెళ్ళి అందులో 2 రకాతులు నమాజ్ చదివాను.

*(ముస్లిం : 162)*

షేఖ్ అల్‌బానీ రహిమహుల్లాహ్ 'సహీహ్ గా ఖరారు చేసిన ఇబ్నె జరీర్ ఉల్లేఖనంలో ఈ పదాలు వున్నాయి: నేను ప్రవక్తలకు నమాజ్ చేయించాను.

*(అల్ ఇస్రా వల్ మేరాజ్ : 14)*

ఇక్కడ రెండు మూడు విషయాలు ఎంతో గమనించదగ్గవి:

అందులో మొదటిది – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మస్జిదుల్ హరామ్ నుండి మస్జిదె అఖ్సాకు తేవడం జరిగింది. అక్కడ ఆయన రెండు రకాతులు నమాజ్ చేశారు. దీని ద్వారా – మస్జిదె అఖ్సా ఒక మహత్యం గల మసీదని, నమాజ్ చేసే సంకల్పంతో అక్కడికి ప్రయాణం చేయవచ్చని తెలిసింది.

దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఇలా సెలవిచ్చివున్నారు: పుణ్య ఫలాపేక్షతో కేవలం మూడు మస్జిదుల వైపునకు ప్రయాణం చేయవచ్చు. అవి మస్జిదుల్ హరామ్, మస్జిదె అఖ్సా మరియు నా ఈ మస్జిద్ (మస్జిదె నబవి). *(బుఖారీ : 1188, ముస్లిం: 1397)*

ఇది (మస్జిదె అఖ్సా) ఎలాంటిదంటే – అల్లాహ్ వాక్కు ప్రకారం దాని పరిసరాలు సైతం శుభవంతమైనవైతే, ఇక దాని శుభాన్ని గురించి ఏం చెప్పాలి!

ఈ మస్జిదే ముస్లిముల కొరకు మొదటి ఖిబ్లాగా వుండేది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు ఆయనను విశ్వసించిన సహాబాలు మదీనాకు వలస (హిజ్రత్) వెళ్ళిన తర్వాత 16 లేదా 17 నెలల వరకు దీని వైపునకు తిరిగే నమాజు చేసేవారు. కనుక ఈ మస్జిద్ ఎంతో మహోన్నతమైనది. కానీ, ఎంతో దురదృష్టకరమైన విషయమేమిటంటే – నేడు ఈ మస్జిద్ ప్రతి రోజూ దాని నిషేధితాలనూ, పవిత్రతనూ ఉల్లంఘించే యూదుల ఆధీనంలో వుంది. స్వయానా బైతుల్ మఖ్దిస్ మరియు పాలస్తీనాకు చెందిన ముస్లిములు

సైతం అక్కడ నమాజు చదవడానికి ఎంతగానో శ్రమించాల్సి వస్తోంది. ఎన్నో హద్దులను దాటి, అపవిత్ర యూదుల స్వీయ షరతులను అంగీకరించిన తర్వాతే వారికి మస్జిదె అఖ్సా గుమ్మం త్రొక్కే అవకాశం దొరుకుతుంది.

ఈ పరిస్థితుల్లో ఇతర ఇస్లామీ దేశాల వాళ్ళు అక్కడికెళ్ళి నమాజ్ చేయాలని ఆలోచించగలరా! మేము అల్లాహ్‌ను వేడుకునేదేమిటంటే – ఆయన ఈ మస్జిద్‌ను – దౌర్జన్యపరులు, ఆక్రమణదారులైన యూదుల ఆధీనం నుండి స్వేచ్ఛను ప్రసాదించడం ద్వారా మన క్కూడా దానిలో నమాజు చదివే అవకాశం కల్పించుగాక! ఆమీన్!!

ఇక రెండవ విషయమేమిటంటే– మస్జిదె అఖ్సాలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాయకత్వం (ఇమామత్)లో దైవ ప్రవక్తలు, సందేశహరులు నమాజు చదివారు. దీని ద్వారా తెలిసిందేమిటంటే –మన ప్రియప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇతర దైవప్రవక్తలు, సందేశహరులందరి కన్నా శ్రేష్ఠులు. అందుకే ఆయన సమక్షంలో ఇతరులెవరూ నాయకులు (ఇమామ్) కాలేరు. కేవలం ఆయనే (దానికి అర్హులు).

దీని ద్వారా తెలిసే మరో విషయమేమిటంటే– దైవ ప్రవక్తలందరి ధర్మం ఒక్కటే. అది ఇస్లాం ధర్మం. ఈ ధర్మమే అల్లాహ్‌కు ఇష్టమైనది.

అల్లాహ్ సెలవిచ్చాడు:

وَمَنْ يَّبْتَغِ غَيْرَ الْاِسْلَامِ دِيْنًا فَلَنْ يُّقْبَلَ مِنْهُ ۚ وَهُوَ فِي الْاٰخِرَةِ مِنَ الْخٰسِرِيْنَ ﴿85﴾

**"ఎవరైనా ఇస్లాం ను కాకుండా మరో ధర్మాన్ని అన్వేషిస్తే అతని ధర్మం స్వీకరించబడదు. అలాంటి వ్యక్తి పరలోకంలో నష్టపోయిన వారిలో చేరిపోతాడు".** ***(ఆలి ఇమ్రాన్: 85)***

దీని ద్వారా తెలిసే మరో విషయం ఏమిటంటే – ఆఖరి ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు దైవదౌత్యం లభించాక ఇక ఆయనే 'ఇమామె ఆజమ్' (ప్రధాన నాయకులు) మరియు ఆయన ధర్మశాస్త్ర (షరీయత్తు) అనుసరణే తప్పనిసరి. ఆయనపై అవతరించిన గ్రంథమే సన్మార్గానికి మూలం.

కనుక, దీనిని (ఖురాన్) వదిలి ఇతర గ్రంథాలను – ఉదా॥ తౌరాత్, ఇన్జీలు (గ్రంథాలను) సన్మార్గానికి మూలంగా భావించడం మార్గభ్రష్టతే.

ఇక మూడో విషయమేమిటంటే– బైతుల్ మఖ్దిస్ లో దైవ ప్రవక్తలందరూ ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వ సల్లం) నాయకత్వంలో నమాజు చదివిన సంఘటన గురించి – ఇది మేరాజ్‌కు ముందు జరిగిందా లేక తర్వాతనా? అన్న విషయంలో ధార్మిక పండితులు మధ్య అభిప్రాయ భేదాలున్నాయి.

హాఫిజ్ ఇబ్నె కసీర్ రహిమహుల్లాహ్ తన 'తఫ్సీర్' లో మరియు బాగా ప్రాచుర్యం పొందిన 'అల్ బదాయ వన్నిహాయ'లో వెలిబుచ్చిన దృష్టి కోణమేమిటంటే–దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మేరాజ్ నుండి తిరుగు ప్రయాణ మైనప్పుడు ఇతర ప్రవక్తలు కూడా ఆయనతో పాటు వచ్చి బైతుల్ మఖ్దిస్‌లో ఆయన వెనుక నమాజు చేశారు. బహుశా ఇది ఆ రోజు ఫజర్ నమాజు కావచ్చు.

ఇక వేరే ఇతర అన్వేషకుల దృష్టి కోణం ఏమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు మేరాజ్ యాత్ర ఆరంభంలోనే ప్రవక్తలకు నాయకత్వం (ఇమామత్) వహించే భాగ్యాన్ని ప్రసాదించడం జరిగింది. వీరిలో (ఈ దృష్టి కోణం కలిగిన వారిలో) హాఫిజ్ ఇబ్నుల్ ఖయ్యూం, హాపిజ్ ఇబ్నె హజర్, ఇబ్నె అజిల్ ఇజ్ హనఫీలు ముఖ్యులు. మేము ఇబ్నె జరీర్ ద్వారా వివరించిన ఉల్లేఖనం, ఈ దృష్టి కోణానికి బలాన్ని చేకూరుస్తుంది. వాస్తవం అల్లాహ్‌కే తెలుసు. *(జాదుల్ మిఆద్ : 3వ సంపుటం, 30వ పేజీ, ఫత్‌హుల్ బారీ. 7వ సంపుటం, 256వ పేజీ, షరహ్ అఖీదా తహావియ : 224వ పేజీ)*

## అతిథి మర్యాదలు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

తదుపరి నేను (మస్జిదె అఖ్సా నుండి) బయటి కొచ్చాక జిబ్రయీల్ (అలైహిస్సలాం) నా ముందు రెండు పాత్రలుంచారు. ఒకదానిలో మద్యం మరియు రెండో దానిలో పాలు వున్నాయి. నేను పాలను ఇష్ట పడడం చూసి జిబ్రయీల్ (అలైహిస్సలాం) నాతో మీరు 'సహజత్వాన్ని' (ఫిత్‌రత్) ఇష్టపడ్డారు అని అన్నారు.

దీని ద్వారా తెలిసిందేమిటంటే – ఇస్లామ్ సహజ (ప్రకృతి) ధర్మం. ఎందుకంటే పాలు స్వచ్ఛమైనవి (దానిలో కల్తీ వుండదు), కానీ మద్యాన్ని

మాత్రం ద్రాక్ష పళ్ళు వగైరాలను మార్చి తయారు చేస్తారు. అంతేగాక, మద్యం మనిషి యొక్క బుద్ధిమాంద్యాలను కూడా మార్చేస్తుంది, వాటిని కప్పేస్తుంది. పాలు మాత్రం మనిషి పుట్టుక నుంచే అతని స్వభావంలో ఇమిడి వుంది.

## మేరాజ్

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

తదుపరి మేము (నేను, జిబ్రయీల్ అలైహిస్సలాం) ప్రయాణం చేస్తూ ప్రాపంచిక ఆకాశం వరకు చేరుకున్నాం. *(ముస్లిం : 164)*

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది: తదుపరి జిబ్రయీల్ (అలైహిస్సలాం) నన్ను ప్రాపంచిక ఆకాశం వైపునకు తీసుకెళ్ళారు. *(ముస్లిమ్ : 162)*

ఇంకో ఉల్లేఖనంలో ఇలా వుంది: తదుపరి జిబ్రయీల్ (అలైహిస్సలాం) నా చేయి పట్టుకొని నన్ను ప్రాపంచిక ఆకాశం వైపునకు తీసుకెళ్ళారు.
*(బుఖారీ : 349, ముస్లిం : 163)*

ఈ మూడు ఉల్లేఖనాలు ప్రామాణికమైనవి. వీటి ద్వారా స్పష్టంగా తెలిసిందేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం) సహాయంతో పైకి వెళ్ళారు. హాఫిజ్ ఇబ్నె హజర్ 'ఫత్‌హుల్ బారీ'లో సంగ్రహించిన కొన్ని ఉల్లేఖనాల ద్వారా – ఒక అందమైన నిచ్చెన (ఆకాశం వైపునకు) ఏర్పాటు చేయబడగా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) దాని సహాయంతో పైకి వెళ్లారని తెలుస్తుంది. వాస్తవం అల్లాహ్‌కే తెలుసు.
*(ఫత్‌హుల్ బారీ: 7వ సంపుటం, 264వ పేజి)*

## మొదటి ఆకాశం పైన

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

జిబ్రయీల్ (అలైహిస్సలాం) తలుపు తట్టారు. ఎవరు మీరు? అని అడగడం జరిగింది.

ఆయన – 'జిబ్రయీల్' అని అన్నారు. మీతో పాటు ఎవరున్నారు? అని అడగడం జరిగింది. ఆయన – ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అని చెప్పారు. ఆయనను పిలవడం జరిగిందా? అని అడగబడింది. ఆయన –

అవును, ఆయనను పిలవడం జరిగింది. అని అన్నారు. (అలాగైతే) ఆయనకు సుస్వాగతం, ఆయన రాక శుభకరమగుగాక! అని అనడం జరిగింది.

తదుపరి, ఆకాశ ద్వారం తెరువబడింది. మేము మొదటి ఆకాశం పైకి వెళ్ళి, ఆదమ్ (అలైహిస్సలాం) సమీపం నుండి వెళ్లసాగాం. జిబ్రయీల్ (అలైహిస్సలాం) నాతో – ఈయన మీ తండ్రి గారు, వీరికి సలాం చేయండి అని చెప్పారు. నేనాయనకు సలాం చేశాను. ఆయన దానికి జవాబిచ్చి ఇలా అన్నారు – మంచి కుమారునికి, మంచి ప్రవక్తకు సుస్వాగతం. తదుపరి ఆయన నా కోసం మంచిని కాంక్షిస్తూ దుఆ చేశారు. ఆయన ఇరు వైపులా కొన్ని నీడలుండడం నేను చూశాను. ఆయన (ఆదమ్ అలైహిస్సలాం) తన కుడి వైపునకు చూసినప్పుడు నవ్వుతున్నారు మరియు ఎడవ వైపునకు చూసినప్పుడు ఏడుస్తారు. దీని గురించి నేను జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను అడగ్గా ఆయన జవాబిస్తూ– ఆయనకు ఇరు వైపున వున్నవి ఆయన సంతానం ఆత్మలు. కుడి వైపున్నవి స్వర్గ వాసుల ఆత్మలు మరియు ఎడమ వైపువి నరకవాసుల ఆత్మలు. అందుకే ఆయన కుడి వైపు చూసినప్పుడు ఆనందంతో పొంగి పోతారు మరియు ఎడవ వైపు చూసినప్పుడు బాధపడి ఏడుస్తారు.

*(బుఖారీ: 349, ముస్లిం: 163)*

## రెండవ ఆకాశం పైన

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం)తో పాటు రెండవ ఆకాశానికి చేరుకోగా, మొదటి ఆకాశం లాగానే జిబ్రయీల్ (అలైహిస్సలాం) తలుపు తట్టారు. ప్రశ్నలూ, సమాధానాలు పూర్తయ్యాక ద్వారం తెరువబడింది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు స్వాగతం పలుకబడింది. – ఇక్కడ ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈసా (అలైహిస్సలాం)ను ఆయన పిన తల్లి కొడుకైన యహ్యా (అలైహిస్సలాం)ను కలవడం జరిగింది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారికి సలాం చేశారు. వారు కూడా జవాబిచ్చి, స్వాగతం పలికారు మరియు ఆయన కోసం ప్రార్థించారు.

## మూడవ ఆకాశం పైన

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మూడవ ఆకాశానికి చేరుకోగా, మొదటి ఆకాశం లాగే జిబ్రయీల్ (అలైహిస్సలాం) తలుపు తట్టారు.

ద్వారాపాలకులతో సంభాషించిన తర్వాత ద్వారం తెరువబడింది. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)కు స్వాగతం పలుకబడింది. ఈ ఆకాశంపైన జిబ్రయీల్ (అలైహిస్సలాం) యూసుఫ్ (అలైహిస్సలాం)తో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు పరిచయం చేశారు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) యూసుఫ్ (అలైహిస్సలాం) కు సలాం చేశారు. ఆయన జవాబిచ్చి, స్వాగతం పలికి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కోసం దుఆ చేశారు.

ఆయన గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: నేను చూసిందేమిటంటే సగం సౌందర్యం యూసుఫ్ (అలైహిస్సలాం) కు ఇవ్వబడింది. *(ముస్లిం : 162)*

## నాల్గవ ఆకాశం పైన

తదుపరి నాల్గవ ఆకాశంపైన గూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు మొదటి ఆకాశంలాగే స్వాగతం లభించింది. ఈ ఆకాశంపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఇద్రీస్ (అలైహిస్సలాం)ను పరిచయం చేయడం జరిగింది. ఆయన దైవ ప్రవక్తకు మంచి సోదరా, మంచి ప్రవక్తా! అని స్వాగతం పలికి ఆయన కోసం దుఆ చేశారు.

## ఐదవ ఆకాశం పైన

తదుపరి ఐదవ ఆకాశంపైన గూడా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఎంతో సంతోషంతో స్వాగతం లభించింది. ఇక్కడ ఆయనకు హారూన్ (అలైహిస్సలాం) పరిచయం చేయబడ్డారు. ఆయన కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు స్వాగతం పలికి, మంచి సోదరుడు, మంచి ప్రవక్త కోసం దుఆ చేశారు.

## ఆరవ ఆకాశం పైన

తదుపరి జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఆరవ ఆకాశానికి తీసుకెళ్ళారు. అక్కడ కూడా ఆయనకు మొదటి ఆకాశాల లాగా ఘనస్వాగతం లభించింది. తదుపరి మూసా (అలైహిస్సలాం)ను పరిచయం చేయడం జరిగింది. ఆయన కూడా ఇతర ప్రవక్తల లాగ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను సాదరంగా స్వాగతం పలికి ఆయన కోసం దుఆ చేశారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

నేను ముందు సాగబోతున్నప్పుడు మూసా (అలైహిస్సలాం) ఏడ్వడం మొదలుపెట్టారు. మీరెందుకు ఏడుస్తున్నారు? అని ఆయనను అడగడం జరిగింది. ఆయన జవాబిస్తూ – ఓ నా ప్రభూ! ఈ అందమైన యువకుణ్ణి నీవు నా తర్వాత (దైవ దౌత్యం నిమిత్తం) పంపావు. ఈయన అనుచర సమాజపు (ఉమ్మత్) ప్రజలు నా ఉమ్మత్ ప్రజల కన్నా ఎక్కువగా స్వర్గంలో ప్రవేశిస్తారు!

## ఏడవ ఆకాశం పైన

తదుపరి జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఏడవ ఆకాశానికి తీసుకెళ్ళారు. అక్కడ కూడా మొదటి ఆకాశాల లాగ ఘనస్వాగతం లభించింది. అక్కడ ఆయనకు ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను పరిచయం చేయడం జరిగింది. ఆయన కూడా ఇతర ప్రవక్తల లాగా సాదరంగా ఆహ్వానం పలికి మంచి ప్రవక్తకు స్వాగతం పలికారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు:

ఇబ్రాహీం (అలైహిస్సలాం) 'బైతుల్ మామూర్' ను ఆనుకొని కూర్చొని వున్నారు. అక్కడికి ప్రతి రోజూ 70,000 దైవదూతలు ప్రవేశిస్తారు.(ఒక సారి వచ్చి వెళ్ళాక) వారికి మరోసారి రావడానికి అవకాశం వుండదు.

*(ముస్లిం: 162)*

అయితే, సహీహ్ బుఖారీలో ఇలా వుంది: అల్ బైతుల్ మామూర్‌లో ప్రతిరోజూ 70,000 దైవ దూతలు నమాజు చదువుతారు. (ఒక సారి వచ్చి) వారు తిరిగి వెళ్ళాక ఇక ప్రళయం రోజు వరకు వారు తిరిగి రాలేరు.

*(బుఖారీ: 3207)*

ఖతాదా ఇలా అంటున్నారు : దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారని మాకు చెప్పబడింది – అల్ బైతుల్ మామూర్ అనేది కాబాకు సమాంతరంగా ఆకాశంలో వున్న ఒక మస్జిద్. అది ఒకవేళ క్రింద పడితే కాబా గృహం మీద పడుతుంది.

అలీ (రజి అల్లాహు అన్హు)ను 'అల్ బైతుల్ మామూర్' గురించి అడగ్గా ఆయన ఇలా సెలవిచ్చారు: అది బైతుల్లాహ్ (కాబా గృహం)కు సమాంతరంగా ఆకాశంలో వున్న అల్లాహ్ గృహం. భూమి మీద కాబా గృహానికి వున్న పవిత్రతే

ఆకాశంలో దానికి వుంది. (ఈ రెండు ఉల్లేఖనాలు హాఫిజ్ ఇబ్నె హజర్ 'ఫత్‌హుల్ బారీ' లో సంగ్రహించారు. *(ఫత్‌హుల్ బారీ – 6వ సంపుటం, 379వ పేజీ)*

## అతిథి మర్యాదలు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

తదుపరి నా ముందు మూడు పాత్రలు వుంచబడ్డాయి. ఒక దాంట్లో మద్యం, మరో దాంట్లో పాలు, ఇంకో దానిలో తేనె వున్నాయి. నేను పాల గిన్నెను త్రాగాను. దీనిపై జిబ్రయీల్ (అలైహిస్సలాం) నాతో – మీరు మరియు మీ అనుచర సమాజం ప్రజలు (ఉమ్మత్) 'సహజత్వం' పై వున్నారు.

*(బుఖారీ : 3887, ముస్లిం : 5610)*

సహీహైన్ లోని మరో ఉల్లేఖనంలో పాలు మరియు మద్యం గురించి మాత్రమే ప్రస్తావించబడింది. దానిలో అదనంగా ఈ పదాలు కూడా వున్నాయి – జాగ్రత్త! ఒకవేళ మీరు మద్యం గిన్నెను ఎత్తివుంటే, మీ ఉమ్మత్ ప్రజలు మార్గ భ్రష్టులై పోయేవారు.

## సిద్రతుల్ ముంతహా

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు:

తదుపరి నన్ను ఇంకా పైకి 'సిద్రతుల్ ముంతహా' వైపునకు తీసుకెళ్ళడం జరిగింది. (నేను దానిపై క్షుణ్ణంగా దృష్టి సారించి చూడగా) దాని ఆకులు ఏనుగు చెవుల లాగా మరియు దాని ఫలాలు 'హిజ్ర్' ప్రాంతపు కుండలలాగా కనిపించాయి. తదుపరి అల్లాహ్ ఆజ్ఞననుసరించి ఏదో వస్తువు దానిని కప్పివేయగా అది ఎంత అందంగా తయారయిందంటే అల్లాహ్ సృష్టితాలలో ఎవరు కూడా దాని సౌందర్యాన్ని వర్ణించలేరు. దాని మొదళ్ళ నుండి (వేర్ల భాగం) నాలుగు కాలువలున్నాయి. రెండు గోచరించేవి, మరో రెండు అగోచరమైనవి. (వీటి గురించి) నేను జిబ్రయీల్ (అలైహిస్సలాం) ను అడగ్గా ఆయన – రెండు అగోచర కాలువలు స్వర్గంలో వున్నాయి మరియు గోచరమైన కాలువలు 'ఫరాత్' మరియు 'నైలు' అని పలికారు.

*(బుఖారీ : 3207, 3887, ముస్లిం : 162, 164)*

సహీహ్ ముస్లింలోని మరో ఉల్లేఖనంలో ఇలా వుంది: 'సిద్రతుల్ ముంతహా' ఎలాంటి ప్రదేశమంటే – భూమి నుండి పైకి లేపబడే వస్తువు ఇక్కడికే తేబడి

స్వీకరించడం జరుగుతుంది. అలాగే పై నుంచి క్రిందికి దించబడే వస్తువు కూడా ఇక్కడికే తేబడి స్వీకరించడం జరుగుతుంది. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) 'ఇజ్‌యగ్‌షస్సిద్రత మాయగ్‌షా'ను విశ్లేషిస్తూ – దానిని బంగారపు సీతాకోకచిలుకలు కప్పివేస్తాయి అని వివరించారు.

*(ముస్లిం : 173)*

## జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను (అసలు ఆకారంలో) చూడడం

'సిద్రతుల్ మున్తహా' వద్ద దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను ఆయన అసలు ఆకారంలో రెండవ సారి చూశారు. (దీని గురించి) అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلَقَدْ رَآهُ نَزْلَةً أُخْرَىٰ ○ عِندَ سِدْرَةِ الْمُنتَهَىٰ ○ عِندَهَا جَنَّةُ الْمَأْوَىٰ ○ إِذْ يَغْشَى
السِّدْرَةَ مَا يَغْشَىٰ ○ مَا زَاغَ الْبَصَرُ وَمَا طَغَىٰ ○ لَقَدْ رَأَىٰ مِنْ آيَاتِ رَبِّهِ الْكُبْرَىٰ ○

**"ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) అతణ్ణి (జిబ్రయీల్ అలైహిస్సలాం) ను మరో సందర్భంలో కూడా చూసి ఉన్నాడు. సిద్రతుల్ మున్తహా దగ్గర. అక్కడే 'జన్నతుల్ మావా' కూడా వుంది. అప్పుడు సిద్రాను ఆవరించే వస్తువేదో ఆవరిస్తూ వుంది. (అతని)చూపు తప్పిపోనూ లేదు. హద్దు దాటి పోనూ లేదు. నిస్సందేహంగా అతను తన ప్రభువు యొక్క గొప్ప సూచనలు (కొన్నింటిని) తిలకించాడు."** ***(నజ్మ్ : 13-18)***

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) "వలఖద్ రఆహు నజ్లతన్ ఉఖ్రా" గురించి విశ్లేషిస్తూ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీని గూర్చి ఇలా సెలవిచ్చారని వివరించారు – నేను (దైవ ప్రవక్త) జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను సిద్రతుల్ మున్తహా వద్ద (అతని అసలు ఆకారంలో) చూడగా (ఆయనకు) 600 రెక్కలున్నాయి.

ఇలాగే, ఆయెషా (రజి అల్లాహు అన్హా) మరియు అబూ హురైరా (రజి అల్లాహు అన్హు)లు గూడా 'వలఖద్ రఆహు నజ్లతన్ ఉఖ్రా' గురించి ఇలాగే విశ్లేషిస్తూ దీని అర్థం జిబ్రయీల్ (అలైహిస్సలాం) అని వివరించారు.

*(ముస్లిం : 175, 176)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను మొదటి సారి (ఆయన అసలు ఆకారంలో) తన దైవ దౌత్యపు ఆరంభ దశలో చూసారు. దీని గూర్చి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "మరి అతను సమీపించ సాగాడు.... అలా అలా వాలుతూ వచ్చాడు. చివరికి అతను రెండు ధనస్సులంత దూరాన లేక అంత కన్నా తక్కువ దూరంలో వుండి పోయాడు." *(నజ్మ్ : 8-9)*

## స్వర్గ విహారం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు :

తదుపరి నన్ను స్వర్గంలో ప్రవేశింపజేయడం జరిగింది. (నేను దాన్ని క్షుణ్ణంగా పరిశీలించగా) దానిలో ఎంతో ఉత్తమమైన ముత్యాల కుటీరాలు వున్నాయి, దాని మట్టి కస్తూరిది. *(బుఖారీ : 349, ముస్లిం : 163)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంకా ఇలా కూడా వివరించారు: నేను స్వర్గంలో విహరిస్తూ, రెండు వైపులా ముత్యాల కుటీరాలు గల ఒక కాలువ వద్దకు చేరుకున్నాను. నేను జిబ్రయీల్ (అలైహిస్సలాం)తో – ఇదేమిటి? అని అడగ్గా, ఆయన జవాబిస్తూ – ఇది అల్లాహ్ మీకు ప్రసాదించిన కౌసర్ కాలువ అని వివరించారు. నేను దాని లోకి చేతితో కొట్టి చూడగా దాని మట్టి కస్తూరిది. *(బుఖారీ : 6581, అహ్మద్)*

## కలం నడిచే శబ్దం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

తదుపరి నన్ను ఇంకా పైకి తీసుకెళ్ళడం జరిగింది. అక్కడ నేను కలములు నడుస్తున్న శబ్దాన్ని విన్నాను. *(బుఖారీ : 349, ముస్లిం : 163)*

అంటే – అల్లాహ్ నిర్ణయాలను, ఆజ్ఞలను దైవదూతలు లిఖించే ప్రదేశం వరకు నన్ను తీసుకెళ్ళడం జరిగింది.

## దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మేరాజ్ రాత్రి అల్లాహ్‌ను చూశారా?

ఇబ్నె అజల్ ఇజ్ హనఫీ రహిమహుల్లాహ్ ఇలా వివరించారు :

'తమ కళ్ళతో ఈ ప్రపంచంలో అల్లాహ్‌ను ఎవ్వరూ చూడలేరు' అన్న విషయంలో అనుచర సమాజం (ఉమ్మత్) ఏకాభిప్రాయంతో వుంది. దీనిపై ఎలాంటి భేదాభిప్రాయం లేదు. కేవలం మన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విషయంలో మాత్రం భేదాభిప్రాయం వుంది. వీరిలో కొందరు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లాహ్‌ను చూశారన్న దానితో విభేదించగా మరి కొందరు దానిని స్వీకరించారు. *(షరహ్ అఖీదా తహావియ-196వ పేజీ)*

తదుపరి ఆయన ఖాజీ ఇయ్యాజ్ ద్వారా ప్రస్తావించిన దేమిటంటే – ఈ విషయంలో స్వయానా సహాబాల మధ్య సైతం భేదాభిప్రాయాలు వున్నాయి. ఆయెషా (రజి అల్లాహు అన్హా), అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) మరియు అబూ హురైరా (రజి అల్లాహు అన్హు)లు దీనితో విభేదించగా అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఆయన దీనిని స్వీకరించారని ఉల్లేఖించబడింది.

ఖాజీ ఇయ్యాజ్ కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ను చూశారనడానికి స్పష్టమైన ఆధారం ఒక్కటి కూడా లేదు. కేవలం నజ్మ్ సూరాలోని రెండు ఆయతులు తప్ప. కానీ వీటి విశ్లేషణలో కూడా భేదాభిప్రాయాలు వున్నాయి.

ప్రియ సోదరులారా!

ఈ భేదాభిప్రాయాన్ని దాని చోటనే వుండనివ్వండి. కానీ స్పష్టమైన, ప్రమాణికమైన ఆధారాల ద్వారా తెలిసేదేమిటంటే – మేరాజ్ రాత్రి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లాహ్‌ను చూడలేదు.

వాటిలో కొన్ని ఆధారాలు ఇవి:

(1) మస్రూఖ్ కథనం: నేను ఆయెషా (రజి అల్లాహు అన్హా) వద్ద కూర్చొని వుండగా, ఆమె నాతో ఇలా అన్నారు – ఓ అబూ ఆయెషా! (ఇది మస్రూఖ్ కునియత్ (మారు పేరు) మూడు విషయాలున్నాయి – వీటిపై ఎవరైనా తన వైపు నుండి ఏదైనా మాట్లాడితే అతను అల్లాహ్ పై అభాండం మోపినవాడవుతాడు. నేనామెతో–ఆ విషయాలు ఏవి? అని అడగ్గా, ఆమె జవాబిస్తూ– ఎవరైనా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ను చూసారు అని అంటే అతను అల్లాహ్‌పై పెద్ద అభాండం మోపాడు అని అన్నారు. మస్రూఖ్ కథనం

– తలగడను ఆనుకొని కూర్చొని వున్న నేను ఆయెషా (రజి అల్లాహు అన్హా) మాటలు విని నిటారుగా కూర్చున్నాను. తదుపరి ఆమెతో – ఓ విశ్వాసుల మాతృమూర్తి! నాకు మాట్లాడడానికి అనుమతించండి.

అల్లాహ్ (ఖురానులో)

**وَلَقَدْ رَاٰهُ بِالْاُفُقِ الْمُبِيْنِ ۝**

**“అతనా సందేహహరుణ్ణి స్పష్టమైన గగనతలంపై చూసి వున్నాడు”.**

***(తక్వీర్ : 23)***

**وَلَقَدْ رَاٰهُ نَزْلَةً اُخْرٰى ۝**

**“ఆయన, అతణ్ణి మరో సందర్భంలో కూడా చూనివున్నాడు”**

***(నజ్మ్: 13)***

అని సెలవిచ్చాడుగా మరి? అని అడిగాను.

ఆమె ఇలా వివరించారు – వీటి గురించి అందరి కన్నా ముందుగా నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అడిగాను. ఆయన జవాబిస్తూ – అది జిబ్రయీల్ (అలైహిస్సలాం) గురించి వచ్చిన ప్రస్తావన. నేనాయనను ఆయన అసలు రూపంలో రెండు సార్లు చూశాను. (ఈ విషయమే ఖురానులో ప్రస్తావించబడింది) అని వివరించారు.

తదుపరి ఆయెషా (రజి అల్లాహు అన్హా) నాతో – నువ్వు “ఎవరి చూపులు కూడా ఆయన్ని అందుకోజాలవు. ఆయన మాత్రం అందరి చూపులను అందుకో గలడు. ఆయన సూక్ష్మ దృష్టి కలవాడు, సర్వమూ తెలిసినవాడు” (అన్ఆమ్ : 103) అన్న అల్లాహ్ ఆజ్ఞ వినలేదా అని అడిగారు. తదుపరి ఆమె – “ఏ మానవ మాత్రునితోనూ, అల్లాహ్ (నేరుగా) సంభాషించడం అనేది జరగదు. అయితే వహీ ద్వారా లేదా తెర వెనుక నుంచీ లేదా ఒక దూతను పంపటం ద్వారా (ఇది సంభవమే). మరి ఆ దూత అల్లాహ్ ఆజ్ఞననుసరించి అల్లాహ్ కోరిన సందేశాన్ని (వహీ రూపంలో) అందజేస్తాడు. నిశ్చయంగా ఆయన మహోన్నతుడు, వివేకవంతుడు” (అష్ షూరా : 51) అన్న అల్లాహ్ వాక్కును కూడా నువ్వు వినలేదా అని అడిగారు.... *(ముస్లిం : 177)*

సహీహ్ బుఖారీలోని ఉల్లేఖనం ప్రకారం – మస్రూఖ్, ఆయెషా (రజి అల్లాహు అన్హ)ను ఇలా అడిగారు – ఓ మాతృమూర్తి! ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ప్రభువును చూశారా?

ఆమె జవాబిస్తూ –ఈ ప్రశ్న విని నా రోమాలు నిక్కబొడుచుకున్నాయి. నేను నీకు మూడు విషయాలు చెబుతున్నా. వీటి గురించి ఎవరైనా (తమ వైపు నుండి) ఏదైనా చెబితే అతను అబద్ధాలగోరుడు, అందులో మొదటి విషయం – నీతో ఎవరైనా – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అల్లాహ్‌ను చూశారని చెబితే అతను పచ్చి అబద్ధాల గోరుడు..... *(బుఖారీ : 4855)*

(2) అబూ జర్ (రజి అల్లాహు అన్హు) కథనం: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను మీరు మీ ప్రభువును చూశారా? అని అడిగాను. ఆయన జవాబిస్తూ – ఆయన సర్వం కాంతిమయం, నేనాయనను ఎలా చూడగలను? అని వివరించారు. *(ముస్లిం : 178)*

(3) అబూ మూసా (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా మధ్య నిలబడి ఐదు విషయాలు వివరించారు. నిశ్చయంగా అల్లాహ్‌కు నిద్ర రాదు. ఆయన మహత్యానికి, గొప్ప తనానికి – నిద్రపోవడం అనుచితమైనది. ఆయన త్రాసును క్రిందికి దించుతాడు మరియు పైకి లేపుతాడు. రాత్రి ఆచరణ (రాబోయే) పగటి ఆచరణ కన్నా ముందుగా ఆయన వైపునకు లేపబడుతుంది. అలాగే పగటి ఆచరణ (రాబోయే) రాత్రి ఆచరణ కన్నా ముందుగా పైకి తీసుకెళ్ళడం జరుగుతుంది. ఆయన ముందు కాంతి (తెరలాగ) అడ్డుగా వుంది. ఆయన గనక దానిని తొలగిస్తే ఆయన ముఖ తేజస్సు సృష్టితాలన్నింటినీ కాల్చి బూడిద చేసేస్తుంది. *(ముస్లిం : 179)*

ఈ ఆధారాలన్నింటి ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – తన కళ్ళతో ఈ ప్రపంచంలో అల్లాహ్‌ను చూడడం ఏ వ్యక్తికీ సాధ్యం కాదు. ప్రవక్తకు కూడా. దీనికి సంబంధించిన మరో ఆధారం – మూసా (అలైహిస్సలాం) వృత్తాంతం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلَمَّا جَاءَ مُوسَىٰ لِمِيقَاتِنَا وَكَلَّمَهُ رَبُّهُ قَالَ رَبِّ أَرِنِي أَنظُرْ إِلَيْكَ ۚ قَالَ لَن تَرَانِي وَلَٰكِنِ
انظُرْ إِلَى الْجَبَلِ فَإِنِ اسْتَقَرَّ مَكَانَهُ فَسَوْفَ تَرَانِي ۚ فَلَمَّا تَجَلَّىٰ رَبُّهُ لِلْجَبَلِ جَعَلَهُ دَكًّا وَخَرَّ
مُوسَىٰ صَعِقًا ۚ فَلَمَّا أَفَاقَ قَالَ سُبْحَانَكَ تُبْتُ إِلَيْكَ وَأَنَا أَوَّلُ الْمُؤْمِنِينَ ﴿143﴾

**"మేము నిర్ధారించిన సమయానికి మూసా (అలైహిస్సలాం) వచ్చి, అతని ప్రభువు అతనితో సంభాషించిన తర్వాత అతను - నా ప్రభూ! నాకు నీ దర్శనం కలిగించు. నేను ఓ సారి నిన్ను చూస్తాను అని విన్నవించుకోగా, ఎట్టి పరిస్థితులలోనూ నువ్వు నన్ను చూడలేవు. అయితే అదిగో! ఆ కొండవైపు దృష్టి సారించు. అది గనక యథాస్థితిలో ఉండగలిగితే నువ్వు కూడా నన్ను చూడగలుగుతావు అని ఆయన సెలవిచ్చాడు. ఆ తరువాత అతని ప్రభువు తేజస్సు ఆ కొండపై ప్రసరించగానే ఆ తేజస్సు దానిని తుత్తునియలు చేసేసింది. మూసా స్పృహ తప్పి పడిపోయాడు. స్పృహలోకి రాగానే- (ప్రభూ) నీవు పరమ పవిత్రుడవు. నేను నీ సన్నిధిలో పశ్చాత్తాప పడుతున్నాను. అందరికన్నా ముందు నేనే నిన్ను విశ్వసిస్తున్నాను అని మనవి చేసుకున్నాడు". *(ఆరాఫ్: 143)***

ఇక నజ్మ్ సూరాలోని రెండు ఆయతుల - "మరి అతను సమీపించసాగాడు...అలా అలా వాలుతూ వచ్చాడు. చివరికి అతను రెండు ధనస్సులంత దూరాన లేక అంత కన్నా తక్కువ దూరాన ఉండిపోయాడు. తరువాత అతడు దైవదాసునికి అందజేయవలసిన సందేశాన్ని అందజేశాడు" (నజ్మ్ : 8-10)ల విషయానికొస్తే, వీటిని విశ్లేషిస్తూ సహీహైన్ (బుఖారీ, ముస్లిం)లో ఆయెషా (రజి అల్లాహు అన్హా) మరియు అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి అల్లాహు అన్హు)లు వీటి అర్థం - దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను చూడడం అని వివరించారు.

*(బుఖారీ : 3232,3235, ముస్లిం : 174, 177)*

అయితే, ప్రళయం రోజు మాత్రం అల్లాహ్ విశ్వాసులకు తన దర్శన భాగ్యం కలుగజేస్తాడు. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وُجُوهٌ يَوْمَئِذٍ نَاضِرَةٌ ۝ إِلَىٰ رَبِّهَا نَاظِرَةٌ ۝

**"ఆ రోజు ఎన్నో ముఖాలు (ఆహ్లాదకరంగా) తాజాగా వుంటాయి. తమ ప్రభువు వైపు చూస్తూ వుంటాయి". *(ఖియామహ్ : 22, 23)***

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: కొందరు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఇలా అడిగారు - ఓ దైవ ప్రవక్తా ! ప్రళయం రోజు మేము అల్లాహ్‌ను చూడగలుగుతామా? దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి

వసల్లం) జవాబిస్తూ–14వ తేదీ రాత్రి చంద్రుణ్ణి చూడడంలో మీకేమైనా కష్టం కలుగుతుందా? అని అడిగారు. వాళ్ళు–లేదు అని అన్నారు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)– మేఘాలు లేనప్పుడు సూర్యుని (కనిపించే) విషయంలో మీకేమైనా అనుమానం వుందా? అని అడిగారు. సహాబాలు–లేదు అని జవాబిచ్చారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – ఇలాగే మీరు కూడా మీ ప్రభువును చూడగలుగుతారు అని వివరించారు.

*(బుఖారీ: 806, ముస్లిం : 182)*

సుహైబ్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు – స్వర్గవాసులందరూ స్వర్గంలో ప్రవేశించాక అల్లాహ్ వారినుద్దేశించి– మీకు ఇంకా ఏమైనా కావాలా? అని అడుగుతాడు. వారు – నువ్వు మా ముఖాలను ప్రకాశ వంతం చేయలేదా? మమ్మల్నందరినీ నరకాగ్ని నుండి విముక్తి ప్రసాదించి స్వర్గంలోకి ప్రవేశింపజేయలేదా? (మాకు ఇంత కన్నా ఇంకేం కావాలి?) అని జవాబిస్తారు. తదుపరి అల్లాహ్ తన ముందు అడ్డుగా వున్న తెరను తొలగిస్తాడు. ఆపై వారికి (స్వర్గవాసులకు) తన ప్రభువును దర్శించడం కన్నా ప్రియమైనదేదీ వుండదు. *(ముస్లిం : 181)*

అల్లాహ్ మనందరికీ స్వర్గంలో ప్రవేశింపజేసి మనక్కూడా తన దర్శన భాగ్యం కలుగుజేయుగాక!

ఇలా (మొత్తం చర్చ ద్వారా ) మనకు తెలిసిందేమిటంటే – జిబ్రయీల్ (అలైహిస్సలాం) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను సిద్రతుల్ మున్తహాను దాటి అల్లాహ్ ఆజ్ఞలను, నిర్ణయాలను వ్రాస్తున్న కలముల చప్పుడు వినబడే ప్రదేశం వరకు తీసుకెళ్ళారు.

## మేరాజ్ కానుక

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు :

తదుపరి అల్లాహ్ తాను వహీ చేయదలుచుకున్నది నావైపునకు వహీ చేశాడు మరియు 50 నమాజులు విధిగా చేశాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు: నేను తిరిగి వస్తూ మూసా (అలైహిస్సలాం) దగ్గరికి చేరుకున్నాను. ఆయన నన్ను – మీ

ప్రభువు మీ ఉమ్మత్‌పై దేనిని విధిగా చేశాడు? అని అడిగారు. నేను జవాబిస్తూ– రేయింబవళ్ళలో 50 నమాజులు అని అన్నాను. ఆయన– మీరు తిరిగి మీ ప్రభువు వద్దకెళ్ళి వీటిలో తగ్గింపు కోసం అడగండి, ఎందుకంటే మీ ఉమ్మత్ దీనిని ఆచరించే శక్తి కలిగి వుండదు. నేను బనీ ఇస్రాయీల్‌ను పరీక్షించి వున్నాను అని అన్నారు. దీనితో నేను తిరిగి నా ప్రభువు వైపుకు వెళ్ళి – ఓ నా ప్రభూ! నా ఉమ్మత్‌పై (ఈ విధిని) కాస్త తగ్గించు అని వేడుకున్నాను. దీనిపై అల్లాహ్ 5 నమాజులు తగ్గించాడు. తదుపరి నేను మూసా (అలైహిస్సలాం) దగ్గరికి చేరుకోగానే ఆయన – ఏమయ్యింది? అని నన్ను అడిగారు. నేను – అల్లాహ్ 5 నమాజులు తగ్గించాడు అని చెప్పాను. ఆయన నాతో – మీ ఉమ్మత్ దీనిని కూడా ఆచరణలో పెట్టే శక్తి కలిగి వుండదు, మీరు మళ్ళీ వెళ్ళి తగ్గింపు కోసం అడగండి అని అన్నారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు:

నేను నా ప్రభువు వైపుకు, మూసా (అలైహిస్సలాం)కు మధ్య పలుమార్లు రావడం, పోవడం జరిగింది. ప్రతీసారీ అల్లాహ్ 5 నమాజులు తగ్గిస్తూ పోయాడు. చివరికి అల్లాహ్ నాతో – ఓ ముహమ్మద్ ! ఇక రేయింబవళ్ళలో ప్రతి రోజూ 5 నమాజులు వున్నాయి. ప్రతి నమాజ్ 10 నమాజులతో సమానం అంటే (సంఖ్యా పరంగా 5 నమాజులైనప్పటికీ పుణ్యపరంగా మాత్రం(50 నమాజులు. *(ముస్లిం : 162)*

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది – అల్లాహ్ పదేసి చొప్పున నమాజులు తగ్గిస్తూ పోయి చివరిగా 5 నమాజులు తగ్గించి చివరికి 5 నమాజులు వుంచాడు. ఆ సమయంలో కూడా మూసా (అలైహిస్సలాం) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను (అల్లాహ్ వైపుకు) వెళ్ళి మరిన్ని నమాజులు తగ్గించమని కోరండని చెప్పారు. దానికి నేను – ఇప్పుడైతే (తగ్గించమని అడగడానికి) నాక్కూడా సిగ్గేస్తుంది. నేను దీనికి సంతృప్తి చెంది, శిరసావహిస్తున్నాను అని అన్నాను. దీనితో కేకవేసే వారొకరు కేకవేసి ఇలా పలికారు – నేను నా ఆజ్ఞను జారీ చేశాను మరియు నా దాసులకు (నమాజులను) తగ్గించాను. ఒక్క పుణ్యానికి గాను నేను వారికి అలాంటివే 10 పుణ్యాలు ఇస్తాను. *(బుఖారీ : 3207)*

ఇస్లామీయ సోదరులారా! రేయింబవళ్ళలోని 5 నమాజులు మేరాజ్ కానుక. ఈ అద్భుత సంఘటన (మేరాజ్) ద్వారా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఔన్నత్యముతో పాటు నమాజుల ప్రాముఖ్యత మరియు విధిత్వం కూడా రుజువవుతుంది. దివ్య ఖురాన్‌లో అల్లాహ్ విశ్వాసులకు నమాజును క్రమం తప్పకుండా స్థాపిస్తూ వుండమని మాటి మాటికీ తాకీదు చేశాడు. నమాజును త్యజించిన వారికి, సోమరితనంతో దానిని నెరవేర్చని వారికి నరక శిక్షను గురించి ప్రస్తావించాడు.

నస్అలుల్లాహుల్ అఫ్వ వ ఆఫియ

మన ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)పై దైవాజ్ఞలన్నీ ఈ భూమి మీదే అవతరించి విధిగా గావించబడ్డాయి. నమాజ్ మాత్రం ఆకాశాలపైన విధిగా గావించబడింది. స్వయంగా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా జీవితాంతం నమాజ్ చదివి, తన ఉమ్మత్‌కు ఆఖరి వసీయతుగా నమాజ్‌ను క్రమం తప్పకుండా పాటిస్తూ వుండండని, మీ ఆధీనంలో వున్న వారి హక్కులను నెరవేర్చండి – అనే ఉద్బోధించారు.

అందుకే, ప్రతి ముస్లిం – మేరాజ్ సంఘటన ద్వారా తన విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసుకొని, ఈ మేరాజ్ కానుక (నమాజ్) విధిత్వాన్ని హృదయ పూర్వకంగా గుర్తించి క్రమం తప్పకుండా దానిని ఆచరణలో పెడుతూ వుండాలి. ఎందుకంటే – దీనిలో కంటి చలువ, హృదయ ప్రశాంతత ఇమిడి వున్నాయి. అల్లాహ్‌ను స్తుతించడానికి ఇదొక గొప్ప మాధ్యమం. అందుకే దీనిని 'ఉమ్ముల్ ఇబాదాత్' (ఆరాధనల తల్లి) అని మరియు 'విశ్వాసి మేరాజ్' అని అంటారు.

## అల్లాహ్ యొక్క మరో అనుగ్రహం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు: నమాజుల విధిత్వంతోపాటు ఈ విషయం కూడా నా వైపునకు వహీ చేయబడింది. ఎవరైనా ఏదైనా మంచి పనిని చేయాలని సంకల్పించుకొని తదుపరి దానిని ఆచరించలేకపోతే, అతనికి (అతని సంకల్పానికి ప్రతిఫలంగా) ఒక పుణ్యం లభించబడుతుంది. ఒకవేళ అతను దానిని ఆచరణలో పెడితే అప్పుడు అతనికి 10 పుణ్యాలు లిఖించబడతాయి. అలాగే, ఎవరైనా ఏదైనా చెడు పని చేయాలని సంకల్పించుకొని తదుపరి దానిని ఆచరణలో పెట్టకపోతే అతనికి ఏ పాపం

లిఖించబడదు. ఒకవేళ అతను దానిని ఆచరణలో కూడా పెడితే అప్పుడు అతనికి ఒక పాపం లిఖించబడుతుంది. *(ముస్లిం : 162)*

## మూడు బహుమతులు

అబ్దుల్లాహ్ బిన్ మస్వూద్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు మూడు బహుమతులు ఇవ్వబడ్డాయి.

(1) ఐదు నమాజులు (2) బఖర సూరా ఆఖరి రెండు ఆయతులు (3) ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉమ్మత్ (అనుచర సమాజం)లో షిర్క్ చేయని ప్రతి వ్యక్తి పెద్దపాపాలు క్షమించబడ్డాయి.

మొదటి బహుమతి – ఐదు నమాజులు. దీని గురించి మేము ఇంతకు ముందే క్లుప్తంగా వివరించాం. ఇక రెండవ బహుమతి – బఖర సూరా యొక్క ఆఖరి రెండు ఆయతులు – వీటి మహత్యం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయినా రాత్రి బఖర సూరా యొక్క ఆఖరి రెండు ఆయత్‌లు పఠిస్తే అవి ఆ రాత్రికి (అతని కోసం) సరిపోతాయి. *(బుఖారీ, ముస్లిం)*

ఇక మూడవ బహుమతి – ఏకదైవారాధన (తౌహీద్)పై మరణించిన ప్రతి వ్యక్తి పెద్ద పాపాలు క్షమించబడుట. దీని అర్థం ఏమిటంటే – అల్లాహ్ తాను తలుచుకొంటే అతణ్ణి ఏ మాత్రం శిక్షించకుండా క్షమిస్తాడు లేదా అతని పెద్ద పాపాల మేరకు అతణ్ణి శిక్షించి తదుపరి నరకం నుండి బయటకు తీసి స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు. కొంత మంది అవిధేయ ఏకదైవారాధకుల గురించి అహ్లెసున్నత్ వల్ జమాఅత్ విశ్వాసం ఇదే. దీనికి సంబంధించి స్పష్టమైన ఆధారాలు వున్నాయి.

## కొన్ని ప్రత్యేక సంఘటనలు

(1) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

నన్ను విహరింపజేయబడిన రాత్రి (మేరాజ్) నాకు అత్యుత్తమ సువాసన అనుభూతి కలిగింది. నేను– ఓ జిబ్రయీల్! ఈ ఉత్తమ సువాసన ఏంటి? అని అడిగాను. ఆయన – ఇది ఫిరౌన్ కూతురికి జడవేసిన స్త్రీ మరియు ఆమె సంతానం సువాసన అని అన్నారు. నేను – దాని వృత్తాంతం ఏమిటి? అని అడిగాను.

ఆయన– ఆమె ఒక రోజు ఫిరౌన్ కూతురికి జడవేస్తుండగా, ఆమె చేతి నుండి దువ్వెన జారి క్రింద పడింది. దీనిపై ఆమె 'బిస్మిల్లాహ్' అని పలికింది. ఫిరౌన్ కూతురు – మా నాన్నా? అని అడిగింది.

ఆ స్త్రీ – కాదు, ఆయన అల్లాహ్, నీ తండ్రికి కూడా ప్రభువు (ఆయనే) అని అంది.

ఫిరౌను కూతురు – (మరైతే) ఈ విషయం మా నాన్నకు చేరవేయనా? అని అంది.

ఆ స్త్రీ – అలాగే, చేరవేయి అని అంది.

తదుపరి ఫిరౌను కూతురు ఈ విషయాన్ని ఫిరౌనుకు చేరవేసింది. ఫిరౌను ఆ స్త్రీని పిలిచి– నేను తప్ప నీకు మరో ప్రభువు వున్నాడా? అని అడిగాడు. ఆమె – అవును (వున్నాడు) ఆయనే అల్లాహ్. ఆయన నాకూ, నీకూ ప్రభువు. ఇది విని (ఆగ్రహంతో) ఫిరౌను – ఒక పెద్ద రాగి పాత్రలో నూనె వేడి చేయమని ఆజ్ఞాపించాడు. తదుపరి ఆమెను, ఆమె సంతానాన్ని దానిలో వేయమని ఆదేశించాడు. దీనిపై ఆ స్త్రీ అతనితో – నా దొక విన్నపం! అంది.

అతను – ఏమిటది అని అడిగాడు.

ఆమె – మరణించాక నా ఎముకలు, నా సంతానం ఎముకలు – అన్నింటినీ ఒకే చోట కలిపి పూడ్చిపెట్టు అని అంది.

అతను – సరే మంచిది అని అన్నాడు.

తదుపరి అతని ఆదేశం మేరకు–ఆమె సంతానాన్ని ఒక్కొక్కరిగా, సలసల కాగుతున్న నూనెలో వేయడం జరిగింది. చివరికి పాలు త్రాగే చిన్న పిల్లవాడి వంతు వచ్చింది. ఇది చూసి ఆమె కొంచెం అధైర్యపడి, వెనక్కు జరగడం చూసి ఆ పాలు త్రాగే పిల్లవాడు ఇలా పలికాడు – అమ్మా! (నూనెలోకి)దూకేయ్! ఎందుకంటే ఇహలోక శిక్ష పరలోక శిక్ష కన్నా తక్కువ. ఇది విని ఆమె కూడా (దానిలోకి) దూకేసింది. *(అహ్మద్, ఇబ్నె హిబ్బాన్, అల్బానీ– ఇస్రావ మేరాజ్)*

(2) అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఇస్రా వ మేరాజ్ రాత్రి నేను ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను కలిసాను. ఆయన నాతో – ఓ

ముహమ్మద్ ! మీ అనుచర సమాజానికి నా తరఫు నుండి సలాములు తెలియ జేయండి మరియు స్వర్గపు మట్టి ఎంతో ఉన్నతమైనదని, దాని నీళ్ళు ఎంతో తియ్యగాను, దాని నేల పూర్తిగా సమతలం (చదునైన మైదానం) గానూ వుందని మరియు 'సుబ్‌హానల్లాహి, వల్ హమ్దులిల్లాహి వలాయిలాహ ఇల్లల్లాహు అల్లాహు అక్బర్' (స్మరణ) ద్వారా దానిలో వృక్షారోపణం చేయవచ్చుని కూడా తెలియజేయండి. *(తిర్మిజీ : 3462, సహీహ్ – అల్‌బానీ)*

(3) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు:

నా ప్రభువు నాకు మేరాజ్ చేయించినప్పుడు నేను – రాగితో చేయబడిన గోర్లు కలిగివుండి, వాటితో తమ ముఖాన్ని, ఛాతీని పీక్కుంటున్న కొందరు వ్యక్తుల సమీపం నుండి పోతూ – ఓ జిబ్రయీల్! వీళ్లెవరు? అని అడగ్గా, ఆయన – వీళ్ళు ఇతరుల మాంసం తినేవారు (చాడీలు చెప్పేవారు) మరియు ఇతరుల మాన, మర్యాదల గురించి చెడుగా మాట్లాడేవారు అని అన్నారు. *(అల్బానీ – ఇస్రా వ మేరాజ్, అహ్మద్)*

(4) అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు: మేరాజ్ రాత్రి నేను – కొంత మంది పెదాలను అగ్ని కత్తెరతో కత్తిరించడం చూసి – ఓ జిబ్రయీల్! ఎవరు వీళ్ళు? అని అడగ్గా – ఆయన – వీళ్ళు మీ అనుచర సమాజంలోని వక్తలు. వీరు ప్రజలకైతే మంచిని గూర్చి బోధిస్తారు కానీ స్వయంగా వారు మాత్రం మరిచిపోతుండేవారు. మరి చూడబోతే వారు అల్లాహ్ గ్రంథాన్ని కూడా పారాయణం చేస్తారు. అయినప్పటికీ వీరికి బుద్ధి లేదా? *(అల్బానీ – ఇస్రా వ మేరాజ్, అహ్మద్, అల్ బగవీ)*

ఇవన్నీ ప్రామాణిక పరంపరలతో ఉల్లేఖించబడిన ఇస్రా వ మేరాజ్ అద్భుతానికి సంబంధించిన సంఘటనలు. మేము యథాతథంగా వీటిని మీకు వివరించాము.

అల్లాహ్ మనందరినీ ఎంతో మహోన్నతమైన ఈ అద్భుతం మరియు దీనిలో ప్రస్తావించబడిన అగోచర విషయాలన్నింటినీ విశ్వసించి, వాటి ఉద్దేశ్యాలను పరిపూర్ణం చేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

## రెండవ ఖుత్బా

హాఫిజ్ ఇబ్నె కసీర్ రహిమహుల్లాహ్ తన 'తఫ్సీర్' లో ఇలా ప్రస్తావించారు: దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) మేరాజ్ నుంచి తిరుగు ప్రయాణమైనప్పుడు, ఇతర ప్రవక్తలు కూడా ఆయనతో పాటు వచ్చి బైతుల్ మఖ్దిస్‌లో ఆయన వెనుక నమాజ్ చేశారు. బహుశా అది ఆరోజు ఫజర్ నమాజు కావచ్చు......

తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బైతుల్ మఖ్దిస్ నుండి బయలు దేరి బురాఖ్‌పై ఎక్కి ప్రయాణం చేసి సూర్యోదయానికి ముందుగా చీకటిలోనే మక్కా చేరుకున్నారు. *(తఫ్సీర్ ఇబ్నె కసీర్ :3వ సంపుటం, 32వ పేజీ)*

బహుశా ఆయన ఆధారం – సహీహ్ ముస్లింలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వివరించిన ఈ హదీసు కావచ్చు:

"నన్ను నేను పరికించి చూసుకోగా నేను ప్రవక్తల సమూహంలో వున్నాను. అకస్మాత్తుగా నేను మూసా (అలైహిస్సలాం)ను నిలబడి నమాజ్ చేస్తుండడం చూశాను. (నేనాయనను నిశితంగా పరిశీలించి చూస్తే) ఆయన సన్నగా, ఉంగరాల జుట్టుతో షనూఅ తెగ వారిలాగా కనిపించారు. తదుపరి నేను ఈసా (అలైహిస్సలాం)ను కూడా నలబడి నమాజ్‌చేస్తుండడం చూశాను. ఆయనకు దగ్గరిగా పోలివున్నవారు ఉర్వా బిన్ మస్ఊద్ అస్సఖఫీ. మళ్ళీ నేను – ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను కూడా నిలబడి నమాజ్ చేయడం చూశాను. ఆయనకు దగ్గరిగా పోలివున్న వారు మీ ఈ సహచరులే (అంటే స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నమాట)".

*(ముస్లిం : 172)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'ఇస్రా వ మేరాజ్' తర్వాత మక్కాకు తిరిగి వస్తున్నప్పుడు ఖురైషీయుల ఒక సమూహం నుండి వెళ్ళారు. ఆ సమూహానికి చెందిన ఒక ఒంటె అదృశ్యమయ్యింది. (దారి తప్పింది). దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కా అవిశ్వాసులకు ఆ సమూహం గురించి మరియు దాని ఆగమన సమయం గురించి ముందే తెలియజేయగా

ఆయన చెప్పినట్లే జరిగింది. అయినప్పటికీ అవిశ్వాసులు ఈ మహెూన్నత సంఘటనను విశ్వసించడానికి తిరస్కరించారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు : నన్ను విహరింపజేయడం జరిగిన రాత్రి నాటి సూర్యోదయానికి నేను మక్కాలో వున్నాను. ఈ విషయమై ప్రజలు నన్ను తిరస్కరిస్తారేమో అని ఆందోళనకు గురయ్యాను.

అందుకే నేను జనాలతో వేరయిపోయి ఒంటరిగా విచార వదనంతో కూర్చొనివున్నాను. ఇదే తరుణంలో అల్లాహ్ శత్రువు అబూ జహల్ నా సమీపం నుండి వెళుతూ, నన్ను చూసి, నా దగ్గరి కొచ్చి కూర్చొని వేళాకోళంగా – ఇవ్వాళ ఏమైనా కొత్త విషయం వుందా? అని అడిగాడు.

నేను – వుంది అని అన్నాను.

అతను – ఏమిటది అని అడిగాడు.

నేను – గత రాత్రి నన్ను విహరింపజేయడం జరిగింది అని అన్నాను.

అతను – ఎక్కడికి అని అడిగాడు.

నేను – బైతుల్ మఖ్దిస్ అని అన్నాను.

అతను – అక్కడ విహరించి ఉదయం వరకు మా దగ్గరికొచ్చాడా వచ్చేశారా? అని అడిగాడు.

నేను – అవును అని అన్నాను.

నా జాతి వారిని నా ముందుకు తీసుకొచ్చినప్పుడు ఈ విషయం వారి ముందుంచడానికి బహుశా నేను తిరస్కరిస్తానేమో అని భావించి అతను నా మాటను తిరస్కరించలేదు. అందుకే ఇలా అన్నాడు – ఒకవేళ మీ జాతి వారిని మీ వద్దకు తీసుకొస్తే వారి ముందు కూడా ఈ విషయం చెప్పండి.

నేను – సరే అన్నాను.

తదుపరి అతడు బనూ కాబ్ బిన్ లూయీని పిలిచాడు. వారంతా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర గుమిగూడారు.

అబూ జహల్ – మీరు నాకు చెప్పిన విషయాన్నే మీ జాతి వారికి కూడా వినిపించండి అని అన్నాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) - గత రాత్రి నన్ను విహరింపజేయడం జరిగింది అని అన్నారు.

ప్రజలు - ఎక్కడికి అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) - బైతుల్ మఖ్దిస్ అని అన్నారు.

ప్రజలు - మరైతే ఉదయాన్నే మీరు మా మధ్య వున్నారు?

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) - అవును అని అన్నారు.

దీనిపై కొందరు చప్పట్లు కొట్టడం ప్రారంభించగా మరి కొందరు ఆశ్చర్యచకితులై తల పట్టుకున్నారు. తదుపరి వారు - మీరు మస్జిదె అఖ్సా గురించి వివరించగలరా? అది ఎలా వుంది? అని అడిగారు. వారిలో కొందరు (గతంలో) మస్జిదె అఖ్సాకు ప్రయాణం చేసి, దానిని దర్శించి వున్నారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు: నేను మస్జిదె అఖ్సా గురించి - అది ఇలా వుంది, అలా వుంది అని వివరించే సమయంలో దానికి సంబంధించిన కొన్ని విషయాలలో నాకు సందేహం కలిగింది. ఈలోగా నేను చూసిందేమిటంటే మస్జిదె అఖ్సాను అఖీల్ ఇంటికి దగ్గరగా తెచ్చి నిలబెట్టడం జరిగింది. నేను నా కళ్ళతో దాని వైపు చూస్తూ దాని గురించి వివరించసాగాను. ఆఖరికి వాళ్ళంతా - అల్లాహ్ సాక్షిగా! మస్జిదె అఖ్సాకు సంబంధించినంత వరకు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ విషయంలోనూ అసత్యం పలకలేదు అని ఒప్పుకున్నారు.

*(అహ్మద్, నసాయి, అస్సహీహా : 3021)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

నేను కాబా యొక్క హతీమ్‌లో వుండగా ఖురైషీయులు నన్ను ఇస్రా సంఘటన గురించి ప్రశ్నిస్తూ బైతుల్ మఖ్దిస్ గురించి నేను మరిచిపోయిన విషయాలు అడిగారు. ఆ రోజు ఆందోళనకు గురైనట్లు నేనెప్పుడూ ఆందోళనకు గురికాలేదు. ఈ లోగా అల్లాహ్ యే బైతుల్ మఖ్దిస్‌ను నా ముందుకు తీసుకొచ్చి నిలబెట్టాడు. ఆ తర్వాత వాళ్ళడిగిన ప్రశ్నలకు నేను బైతుల్ మఖ్దిస్‌ను చూస్తూ జవాబిచ్చుకుంటూ పోయాను. *(ముస్లిం : 172)*

ఖురైషీయుల పరిస్థితి ఇలా వుంది.

కానీ ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)ను విశ్వసించిన వారి పరిస్థితి ఎలా వుందంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ఈ సంఘటనను విని వెంటనే వారు దానిని (సత్యమని) నిర్ధారించారు.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఖురైషీయులలో కొంత మంది అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) దగ్గరికొచ్చి ఆయనతో ఇలా అన్నారు – ఒకే రాత్రి బైతుల్ మఖ్దిస్ వెళ్ళి తిరిగి మక్కాకు వచ్చేశానని మీ సహచరుడు వాదించడాన్ని మీరు ఒప్పుకుంటారా? అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) వారితో– నిజంగానే ఆయన ఇలా చెప్పారా? అని అడిగారు. వాళ్ళు – అవును, నిజంగానే ఇలా చెప్పారు అని అన్నారు.

అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) – అలా అయితే (ఆయనే గనక చెప్పి వుంటే) ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) సత్యం పలికారు అని జవాబిచ్చారు.

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది: అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) వారికిలా జవాబిచ్చారు – "(బైతుల్ మఖ్దిసే కాదు) అంత కన్నా దూరంగా వున్న విషయాలను, ఆకాశం నుండి వహీ అవతరించిందని ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇచ్చే సమాచారాన్ని సైతం నేను (సత్యమని) నిర్ధారిస్తాను" అందుకే ఆయనను సిద్దీఖ్ (సత్యవంతుడు) అని పిలవడం జరిగింది.

*(దలాయలున్నబవియ లిల్ బైహఖీ, ఇస్రా వ మేరాజ్– అల్‌బానీ –60,61 పేజీలు – సహీహ్)*

ఇస్లామీయ సోదరులారా!

ఆఖరుగా ఈ అద్భుత సంఘటన వెనుక గల ముఖ్యమైన ఉద్దేశ్యాలలో కొన్నింటిని గూర్చి క్లుప్తంగా తెలుసుకుందాం.

(1) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఈ అద్భుతం ప్రసాదించబడిన సమయంలో ఆయన సతీమణి ఖదీజా (రజి అల్లాహు అన్హా) మరియు బాబాయి అబూ తాలిబ్‌లు మరణించిన కారణంతో ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంతో దు:ఖంలో వున్నారు. అంతేగాక, తాయిఫ్ వాసుల దుష్ప్రవర్తన కూడా ఆయన మనస్సును కలచివేసింది. అలాంటి సమయంలో ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)కు 'ఇస్రా వ మేరాజ్' ద్వారా ఉపశమనం

కలిగించబడింది. భూలోక వాసులు మీ పట్ల దురుసుగా ప్రవర్తించినా ఆకాశవాసులు మాత్రం మీకు ఘనస్వాగతం పలుకుతారన్న భావాన్ని ఆయనకు కలుగజేయడం జరిగింది.

(2) బైతుల్ మఖ్దిస్‌లో (నమాజులో) ప్రవక్తలందరికీ ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) వెనుక నిలబెట్టడం ద్వారా ఆయన శ్రేష్ఠత నిరూపించబడింది.

(దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సమక్షంలో ఇతర ప్రవక్తలందరూ ముఖ్తదీలుగా మారి ఆయనను అనుసరించారు. కానీ, నేటి ముస్లిములలో కొందరు ఆచరణ రీత్యా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)ను అనుసరించడం మాని ఆయన ఉమ్మత్‌కు చెందిన కొందరు ఇమాములను అనుసరించడం కడు శోచనీయం!–అనువాదకుడు)

(3) ఛాతీని తెరవడం ద్వారా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) విశ్వాసాన్ని మరింతగా పెంచి, దానిని తాజాగా, మరింత బలోపేతం చేయడం జరిగింది.

(4) ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఆకాశాలపైకి తీసుకెళ్ళి అల్లాహ్ యొక్క మహోన్నత సూచనలను చూపించడం జరిగింది. స్వర్గంలో విహరింపజేయడం జరిగింది. నరక శిక్షను అనుభవిస్తున్న వారిని చూపించడం జరిగింది. సిద్రతుల్ మున్తహా వగైరా॥లను దర్శింపజేయడం జరిగింది. నిశ్చయంగా ఇలాంటి అగోచర విషయాల పట్ల (ఈ యాత్ర) ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)లో దృఢ నమ్మకం కలిగేలా చేసింది.

(5) ఈ మహోన్నత యాత్రలో అల్లాహ్ రేయింబవళ్ళలో 5 నమాజులు విధిగా చేయడం–ఇస్లాం మౌలికాంశాలలో దీనికి గల ప్రాధాన్యతను సూచిస్తుంది.

అల్లాహ్ మనందరికీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అద్భుతాలన్నింటినీ విశ్వసించే సద్బుద్ధిని ప్రసాదించుగాక! మరియు ప్రళయం రోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సిఫారసు మరియు ఆయన చేతుల మీదుగా కౌసర్ సరస్సు నీళ్ళు త్రాగే భాగ్యాలను ప్రసాదించుగాక! ఆమీన్!

వ ఆఖిరుద్దావానా అనిల్ హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్.

# మేరాజ్ కానుక.....నమాజ్

## (కంటి చలువ మరియు హృదయ ప్రశాంతత)

### ఖుత్బా యందలి ముఖ్యాంశాలు:

1) నమాజ్ విధిగా గావించబడడం.

2) నమాజ్ ప్రాధాన్యత.

3) నమాజ్ మహత్యం.

4) నమాజ్‌ను త్యజించేవారి శిక్ష మరియు దాని ఆజ్ఞ.

ఇస్లామీయ సోదరులారా!

ఈ రోజు జుమా ఖుత్బాలో (ఇన్షాఅల్లాహ్) అల్లాహ్ సామీప్యం పొందడానికి అన్నింటికన్నా గొప్ప మాధ్యమం, కంటి చలువ మరియు హృదయ ప్రశాంతత అయిన ఒక (ముఖ్యమైన) ఆచరణ గురించి తెలుసుకుందాం. ఒకవేళ ఏ ముస్లిమ్ అయినా ప్రాపంచిక ఆందోళనలకు, దు:ఖానికి గురై నిరుత్సాహ స్థితిలో ఈ ఆచరణ నిమిత్తం అల్లాహ్ ముందు నిలబడితే అతని ఆందోళన, దు:ఖాల భారం తగ్గి అతనికి అసలైన హృదయ ప్రశాంతత లభిస్తుంది. ఆ ఆచరణ పేరు నమాజ్. అల్లాహ్ దీనిని అర్హత కలిగిన ప్రతి ముస్లిమ్‌పై విధిగా ఖరారు చేశాడు.

విధిగా చేయబడిన ఆచరణలన్నీ ఈ భూమి మీదే విధిగా గావించబడగా, నమాజ్‌ను మాత్రం అల్లాహ్ తన ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను తన వైపునకు పిలిచి, ఆకాశాలపై తాను అనుకొన్న చోట దానిని విధి (ఫర్జ్)గా చేయడం దీని ప్రాముఖ్యత, ప్రాధాన్యతలను సూచిస్తుంది.

మేరాజ్ సంఘటనను గూర్చి చెబుతూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు:

......తదుపరి అల్లాహ్ తాను వహీ చేయదలుచుకున్నది నావైపుకు వహీ చేశాడు. ఇంకా రేయింబవళ్ళలో 50 నమాజులు విధిగా చేశాడు. తదుపరి నేను మూసా (అలైహిస్సలాం) వైపుకు దిగొచ్చే సరికి ఆయన నాతో – మీ ప్రభువు దేనిని విధిగా చేశాడు? అని అడిగారు.

నేను – 50 నమాజులు అని  అన్నాను.

ఆయన – మీరు మీ ప్రభువు వైపుకు తిరిగి వెళ్ళి దీనిని తగ్గించమని కోరండి. ఎందుకంటే మీ అనుచర సమాజం 50 నమాజులు చదివే శక్తి సామర్థ్యాలు కలిగి వుండదు. నేను బనీ ఇస్రాయీల్‌ను  పరికించి, పరీక్షించి వున్నాను.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు: నేను నా ప్రభువు వైపుకు తిరిగి వెళ్లి –  నా ప్రభూ ! నా ఉమ్మత్‌పై (ఈ విధిని) కాస్త తగ్గించు అని  వేడుకున్నాను. దీనిపై అల్లాహ్ 5 నమాజులు తగ్గించాడు. తదుపరి నేను  మళ్ళీ  మూసా (అలైహిస్సలాం) దగ్గరికి చేరుకోగానే ఆయన – ఏమయ్యింది? అని నన్ను  అడిగారు. నేను – అల్లాహ్ 5 నమాజులు తగ్గించాడు  అని చెప్పాను.

ఆయన నాతో – మీ ఉమ్మత్ దీనిని కూడా ఆచరణలో పెట్టే శక్తి కలిగి వుండదు. మీరు మళ్ళీ వెళ్ళి తగ్గింపు కోసం అడగండి అని అన్నారు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా వివరించారు : నేను నా  ప్రభువుకూ, మూసా (అలైహిస్సలాం)కు మధ్య పలుమార్లు రావడం, పోవడం జరిగింది. ప్రతిసారీ అల్లాహ్ 5 నమాజులు తగ్గిస్తూ పోయి చివరికి నాతో – ఓ ముహమ్మద్! ఇక రేయింబవళ్ళలో ప్రతి రోజూ 5 నమాజులు వున్నాయి. ప్రతి నమాజ్‌కు (పుణ్యం) పది రెట్లు. ఇలా (ప్రతిఫలం రీత్యా) ఇవి 50 నమాజులు.

*(బుఖారీ : 7517, ముస్లిం  : 162)*

50 నమాజులను 5కు తగ్గించి అల్లాహ్ తన ప్రియతమ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అనుచర సమాజం (ఉమ్మత్)పై ప్రత్యేకంగా అనుగ్రహించాడు. (సంఖ్యాపరంగా) నమాజులు తగ్గినప్పటికీ పుణ్యఫలం రీత్యా అవి 50కు సమానమే. అందుకే అల్లాహ్ ప్రసాదించిన ఈ ప్రత్యేక అనుగ్రహానికి గాను మనం కూడా ఆయనకు ధన్యవాదాలు తెలియజేయాలి. ఆయనకు ధన్యవాదాలు తెలియజేయడమెలా అంటే మనం 5 పూటల నమాజులను విధిగా పాటిస్తూ వుండాలి. అందులో ఎలాంటి సోమరితనాన్ని ప్రదర్శించకూడదు.

## నమాజ్ ప్రాముఖ్యత

దివ్య ఖురాన్‌లో అల్లాహ్ నమాజ్ గురించి మాటిమాటికి, పలు రీతుల్లో

ప్రస్తావించాడు.

❖ ఒక చోట దీనిని గూర్చి ఆదేశిస్తూ ఇలా సెలవిచ్చాడు:

وَاَقِيْمُوا الصَّلٰوةَ وَاٰتُوا الزَّكٰوةَ وَارْكَعُوْا مَعَ الرّٰكِعِيْنَ ۝

**"మీరు నమాజులను నెలకొల్పండి, జకాతును ఇవ్వండి, (నా సన్నిధిలో) రుకూ చేసే వారితోపాటు మీరూ రుకూ చేయండి".** ***(బఖర : 43)***

అలాగే ఇలా కూడా సెలవిచ్చాడు:

وَمَآ اُمِرُوْٓا اِلَّا لِيَعْبُدُوا اللّٰهَ مُخْلِصِيْنَ لَهُ الدِّيْنَ ۙ۬ حُنَفَآءَ وَيُقِيْمُوا الصَّلٰوةَ
وَيُؤْتُوا الزَّكٰوةَ وَذٰلِكَ دِيْنُ الْقَيِّمَةِ ۝ؕ

**"వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించు కోవాలనీ, ఏకాగ్రచిత్తులై - నమాజును నెలకొల్పాలనీ, జకాత్ ఇస్తూ వుండాలని మాత్రమే వారికి ఆదేశించబడింది. ఇదే స్థిరమైన సవ్యమైన ధర్మం".** ***(బయ్యినహ్ : 5)***

ఈ ఆయత్‌లలో అల్లాహ్ నమాజ్‌ను నెలకొల్పమని ఆదేశించాడు. దీని అర్థం ఏమిటంటే - దానిని ఎల్లప్పుడూ క్రమం తప్పకుండా దాని షరతులు, మౌలికాంశాలు, తప్పనిసరి విషయాలను దృష్టిలో వుంచుకొని నెలకొల్పుతూ వుండాలి. షరీయత్తు పరమైన కారణమేదీ లేకుండా ఒక్క నమాజు కూడా త్యజించకూడదు.

మరోచోట అల్లాహ్ నమాజులను కాపాడు కాపాడుకోమని ఆజ్ఞాపిస్తూ ఇలా సెలవిచ్చాడు:

حٰفِظُوْا عَلَى الصَّلَوٰتِ وَالصَّلٰوةِ الْوُسْطٰى ۗ وَقُوْمُوْا لِلّٰهِ قٰنِتِيْنَ ۝238

**"నమాజులను కాపాడుకోండి, ముఖ్యంగా మధ్యలో వున్న నమాజును. అల్లాహ్ సమక్షంలో వినమ్రులై వుండండి".** ***(బఖర : 238)***

ఈ ఆయత్‌లో అల్లాహ్ నమాజులను కాపాడుకోమని అంటే క్రమం తప్పకుండా చదువుతూ వుండమని ఆదేశించాడు. ముఖ్యంగా మధ్యలో వున్న నమాజు అంటే అస్ర్ నమాజును కాపాడుకోమని ఆజ్ఞాపించాడు.

కనుక ముస్లిములందరూ క్రమం తప్పకుండా నమాజులు చదువుతూ వుండాలి మరి!

❖ ఇంకో చోట అల్లాహ్ నమాజ్‌ను క్రమం తప్పకుండా నెలకొల్పమని మరియు తమ ఇంటి వారికి కూడా దీని గురించి ఆజ్ఞాపించమని ఆదేశిస్తూ ఇలా సెలవిచ్చాడు:

وَأْمُرْ أَهْلَكَ بِالصَّلٰوةِ وَاصْطَبِرْ عَلَيْهَا ۖ لَا نَسْـَٔلُكَ رِزْقًا ۖ
نَحْنُ نَرْزُقُكَ ۗ وَالْعَاقِبَةُ لِلتَّقْوٰى ﴿132﴾

**“నీ యింటి వారికి నమాజు గురించి తాకీదు చెయ్యి. నువ్వు సైతం దానిపై స్థిరంగా వుండు. మేము నీనుంచి ఉపాధిని అడగడం లేదు. పైగా మేమే నీకు ఉపాధిని ఇస్తున్నాము. చివరికి మంచి జరిగేది భయభక్తులు (కలవారి)కే”. *(తాహా : 132)***

❖ అల్లాహ్ నమాజ్‌ను క్రమం తప్పకుండా నెలకొల్పమని కేవలం ఆజ్ఞ మాత్రమే యివ్వలేదు. దానిని పాటించే వారికే స్వర్గంలో గౌరవ సత్కారాలు లభిస్తాయని శుభవార్తను యిచ్చాడు. దీని గురించి అల్లాహ్ ఇలా సెల విచ్చాడు:

إِلَّا الْمُصَلِّينَ ۙ﴿﴾ الَّذِينَ هُمْ عَلٰى صَلَاتِهِمْ دَآئِمُونَ ۙ﴿﴾
أُولٰٓئِكَ فِي جَنّٰتٍ مُّكْرَمُونَ ﴿﴾

**“కానీ నమాజు చేసే వారు మాత్రం అలాంటి వారు కారు. వారు తమ నమాజుల (వ్యవస్థ)పై నిత్యం కొనసాగుతారు......ఇంకా వారు తమ నమాజులను కాపాడుతారు. ఇలాంటి వారే స్వర్గవనాలలో సగౌరవంగా వుండేవారు. *(మఆరిజ్: 22-35)***

❖ అలాగే ఇంకొక చోట నమాజ్‌ను క్రమంతప్పకుండా నెలకొల్పేవారికి జన్నతుల్ ఫిర్‌దౌస్(స్వర్గపు అత్యున్నత అంతస్తు)కు వారసులుగా ఖరారు చేస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قَدْ أَفْلَحَ الْمُؤْمِنُونَ ﴿1﴾ الَّذِينَ هُمْ فِي صَلَاتِهِمْ خٰشِعُونَ ﴿2﴾ وَالَّذِينَ هُمْ عَنِ
اللَّغْوِ مُعْرِضُونَ ﴿3﴾ وَالَّذِينَ هُمْ لِلزَّكٰوةِ فٰعِلُونَ ﴿4﴾ وَالَّذِينَ هُمْ لِفُرُوجِهِمْ حٰفِظُونَ

إِلَّا عَلَىٰ أَزْوَاجِهِمْ أَوْ مَا مَلَكَتْ أَيْمَانُهُمْ فَإِنَّهُمْ غَيْرُ مَلُومِينَ ﴿6﴾ فَمَنِ ابْتَغَىٰ وَرَاءَ ذَٰلِكَ فَأُولَٰئِكَ
هُمُ الْعَادُونَ ﴿7﴾ وَالَّذِينَ هُمْ لِأَمَانَاتِهِمْ وَعَهْدِهِمْ رَاعُونَ ﴿8﴾ وَالَّذِينَ هُمْ عَلَىٰ صَلَوَاتِهِمْ
يُحَافِظُونَ ﴿9﴾ أُولَٰئِكَ هُمُ الْوَارِثُونَ ﴿10﴾ الَّذِينَ يَرِثُونَ الْفِرْدَوْسَ هُمْ فِيهَا خَالِدُونَ ﴿11﴾

"నిశ్చయంగా విశ్వాసులు సాఫల్యం పొందారు. వారు ఎలాంటి వారంటే – తమ నమాజులలో వారు అణకువ కలిగి వుంటారు. వారు పనికి మాలిన వాటిని పట్టించుకోరు. వారు (తమపై విధించిన) జకాతు విధానాన్ని పాటిస్తారు. వారు తమ మర్మస్థానాలను కాపాడుకుంటారు. అయితే తమ భార్యల, (షరీయతు ప్రకారం) తమ యాజమాన్యంలోకి వచ్చిన బానిసరాళ్ళ విషయంలో మటుకు వారిపై ఎలాంటి నింద లేదు. కానీ ఎవరైనా దీనికి మించి మరేదైనా కోరితే వారు హద్దు మీరిన వారవుతారు. వారు తమ అప్పగింతల, వాగ్దానాల పట్ల కడు అప్రమత్తంగా ఉంటారు. వారు తమ నమాజులను పరిరక్షిస్తూ వుంటారు. ఇలాంటి వారే వారసులు. (స్వర్గంలోని) ఫిర్దౌస్ ప్రదేశానికి వారు వారసులవుతారు. వారక్కడ కలకాలం వుంటారు". *(మూమినూన్ 1-11)*

❖ మరో చోట అల్లాహ్ నమాజ్ నెలకొల్పేవారికి శుభవార్తను అందజేస్తూ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ الَّذِينَ آمَنُوا وَعَمِلُوا الصَّالِحَاتِ وَأَقَامُوا الصَّلَاةَ وَآتَوُا الزَّكَاةَ لَهُمْ أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ
وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ ﴿277﴾

"విశ్వసించి (సున్నత్ ప్రకారం) సత్కార్యాలు చేసేవారికి, నమాజులు నెలకొల్పేవారికి, జకాతు చెల్లించే వారికి తమ ప్రభువు వద్ద పుణ్యఫలం వుంది. వారికెలాంటి భయం కానీ, చీకూ చింత గానీ వుండవు".

*(బఖర: 277)*

❖ ఇంకోచోట అల్లాహ్ నిజమైన విశ్వాసుల గుణగణాలను వివరిస్తూ నమాజ్ నెలకొల్పడం గురించి ఇలా ప్రస్తావించాడు:

إِنَّمَا الْمُؤْمِنُونَ الَّذِينَ إِذَا ذُكِرَ اللَّهُ وَجِلَتْ قُلُوبُهُمْ وَإِذَا تُلِيَتْ عَلَيْهِمْ آيَاتُهُ زَادَتْهُمْ إِيمَانًا

وَّعَلٰی رَبِّهِمْ يَتَوَكَّلُوْنَ ۝٢ الَّذِيْنَ يُقِيْمُوْنَ الصَّلٰوةَ وَمِمَّا رَزَقْنٰهُمْ يُنْفِقُوْنَ ۝٣ اُولٰٓئِكَ هُمُ الْمُؤْمِنُوْنَ حَقًّا ۭ لَهُمْ دَرَجٰتٌ عِنْدَ رَبِّهِمْ وَمَغْفِرَةٌ وَّرِزْقٌ كَرِيْمٌ ۝٤

**"నిజమైన విశ్వాసులు ఎటువంటి వారంటే – అల్లాహ్ ప్రస్తావన రాగానే వారి హృదయాలు భయంతో వణకుతాయి. అల్లాహ్ ఆయతులు వారి ముందు పఠింపబడినప్పుడు, అవి వారి విశ్వాసాన్ని మరింత వృద్ధి చేస్తాయి. వారు తమ ప్రభువునే నమ్ముకుంటారు. వారు నమాజును నెలకొల్పుతారు. మేము వారికి ప్రసాదించిన దానిలో నుంచి (మా మార్గంలో) ఖర్చుపెడతారు. నిజమైన విశ్వాసులంటే వీరే. వీరి కొరకు వీరి ప్రభువు వద్ద ఉన్నత స్థానాలు వున్నాయి. మన్నింపు వుంది. గౌరవప్రదమైన ఆహారం వుంది."** ***(అన్ఫాల్ : 2-4)***

❖ మరో చోట భయభక్తులు కలవారి లక్షణాలను పురస్కరించుకొని నమాజ్ నెలకొల్పేవారిని సన్మార్గగాములుగా, సాఫల్యం పొందిన వారుగా ఖరారు చేస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

الٓمّٓ ۝١ ذٰلِكَ الْكِتٰبُ لَا رَيْبَ ۛ فِيْهِ ۛ هُدًى لِّلْمُتَّقِيْنَ ۝٢ الَّذِيْنَ يُؤْمِنُوْنَ بِالْغَيْبِ وَ يُقِيْمُوْنَ الصَّلٰوةَ وَمِمَّا رَزَقْنٰهُمْ يُنْفِقُوْنَ ۝٣ وَالَّذِيْنَ يُؤْمِنُوْنَ بِمَآ اُنْزِلَ اِلَيْكَ وَمَآ اُنْزِلَ مِنْ قَبْلِكَ ۚ وَبِالْاٰخِرَةِ هُمْ يُوْقِنُوْنَ ۝٤ اُولٰٓئِكَ عَلٰى هُدًى مِّنْ رَّبِّهِمْ ۗ وَاُولٰٓئِكَ هُمُ الْمُفْلِحُوْنَ ۝٥

**"అలిఫ్ లామ్ మీమ్, ఈ గ్రంథం ( అల్లాహ్ గ్రంథం అన్న విషయం)లో ఎంత మాత్రం సందేహం లేదు. భయభక్తులు కలవారికి ఇది సన్మార్గం చూపుతుంది. వారు అగోచర విషయాలను విశ్వసిస్తారు, నమాజును నెలకొల్పుతారు. ఇంకా మేము ప్రసాదించిన దానిలో (సంపదలో)నుంచి ఖర్చుపెడతారు. మేము నీ వైపునకు (అంటే ప్రవక్త వైపునకు) అవతరింపజేసిన దానినీ, నీకు పూర్వం అవతరింపజేసిన వాటినీ వారు విశ్వసిస్తారు. పరలోకం పట్ల కూడా వారు దృఢ నమ్మకం కలిగి వుంటారు. ఇలాంటి వారే తమ ప్రభువు తరఫు నుంచి వచ్చిన సన్మార్గాన వున్నారు. సాఫల్యాన్ని పొందేవారు వీరే."** ***(బఖర : 1-5)***

❖ ఇంకో చోట వినమ్రులయ్యే వారి లక్షణాలను పురస్కరించుకొని నమాజ్ నెలకొల్పేవారి గురించి ప్రస్తావిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلِكُلِّ أُمَّةٍ جَعَلْنَا مَنسَكًا لِّيَذْكُرُوا اسْمَ اللَّهِ عَلَىٰ مَا رَزَقَهُم مِّن بَهِيمَةِ الْأَنْعَامِ ۗ فَإِلَٰهُكُمْ إِلَٰهٌ وَاحِدٌ فَلَهُ أَسْلِمُوا ۗ وَبَشِّرِ الْمُخْبِتِينَ (34) الَّذِينَ إِذَا ذُكِرَ اللَّهُ وَجِلَتْ قُلُوبُهُمْ وَالصَّابِرِينَ عَلَىٰ مَا أَصَابَهُمْ وَالْمُقِيمِي الصَّلَاةِ وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ (35)

**"మీ ఆరాధ్య దేవుడు ఒకే ఆరాధ్యదేవుడని తెలుసుకోండి. కాబట్టి మీరు ఆయన ఆజ్ఞలనే శిరసావహించండి. (కనుక ఓ ముహమ్మద్!) వినమ్రులైన వారికి శుభవార్తను వినిపించు. (వారిలోని సుగుణం ఏమిటంటే) అల్లాహ్ నామం స్మరించినప్పుడు వారి హృదయాలు వణుకుతాయి. తమపై ఏ ఆపద వచ్చినా వారు ఓర్పు వహిస్తారు. నమాజులను నెలకొల్పుతారు. మేము వారికి ప్రసాదించిన దానిలో నుంచి (మా మార్గంలో) ఖర్చు చేస్తూ వుంటారు". *(హజ్ : 34-35)***

ఈ ఆయత్ ద్వారా తెలిసిందేమిటటంటే – వినమ్రత, అణకువకు గల అవసరం ఏమిటంటే, మనిషి అల్లాహ్ ఆదేశానుసారం ఐదు నమాజులు క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ నెలకొల్పుతూ వుండాలి. ఒకవేళ అతను నమాజుల పట్ల అశ్రద్ధగానీ, సోమరితనం గానీ చూపిస్తే, అతను తనకు తాను అల్లాహ్ ఆజ్ఞ కన్నా గొప్ప వాడిగా అనుకొంటున్నాడు. మరిచూస్తే, ఇది కూడా గర్వానికి సూచనే. ఎందుకంటే, అల్లాహ్ ఆదేశం ముందు తలవంచడానికి బదులు, తన ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తూ తన ఇష్టానుసారం నమాజు చదువుతాడు. ఇలాంటి గర్వం ఎవరి మనస్సులోనైనా ఆవగింజంత వున్నా సరే, అతను స్వర్గంలోకి ప్రవేశించలేడు.

అల్లాహ్ దృష్టిలో నమాజ్‌కు ఎంత ప్రాముఖ్యత వుందటే నమాజ్‌ను అల్లాహ్ 'విశ్వాసం' అని ఖరారు చేస్తూ ఇలా సెలవిచ్చాడు:

وَكَذَٰلِكَ جَعَلْنَاكُمْ أُمَّةً وَسَطًا لِّتَكُونُوا شُهَدَاءَ عَلَى النَّاسِ
وَيَكُونَ الرَّسُولُ عَلَيْكُمْ شَهِيدًا

**"అల్లాహ్ మీ విశ్వాసాన్ని వృథా కానివ్వడు. నిశ్చయంగా అల్లాహ్ (తన దాసులైన) మానవుల పట్ల అమితమైన వాత్సల్యం కలవాడు! పరమ కృపాశీలుడు". *(బఖర: 143)***

ఖిబ్లా మార్పుకు ముందు ఎవరైతే బైతుల్ మఖ్‌దిస్ వైపునకు తిరిగి నమాజ్ చేసారో వారి గురించి ప్రస్తావిస్తూ అల్లాహ్ – మేము మీ విశ్వాసాన్ని అంటే ఖిబ్లా మార్పునకు ముందు బైతుల్ మఖ్‌దిస్ వైపునకు తిరిగి మీరు చదివిన నమాజులను వృథా కానివ్వము అని సెలవిచ్చాడు.

ఇక్కడ నమాజ్‌ను విశ్వాసం (ఈమాన్) లాగా ఖరారు చేయడం ద్వారా దీనికి గల మహత్యం, ప్రాముఖ్యత అర్థమవుతాయి.

నమాజ్ ప్రాముఖ్యత గూర్చి మేము కొన్ని ఆయతులు ప్రస్తావించాం. అలాంటివి ఇంకా చాలా వున్నాయి. ఇస్లాంలోని మౌలికాంశాలలో నమాజ్ గురించి దివ్య ఖురాన్‌లో అన్నింటి కన్నా ఎక్కువ సార్లు ప్రస్తావించబడింది. అందుకే ముస్లిములందరూ దీనిని విధిగా క్రమం తప్పకుండా పాటిస్తూ వుండాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ దీనిని త్యజించకూడదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా నమాజ్ ప్రాధాన్యత గురించి నొక్కి వక్కాణిస్తూ నమాజ్ నెలకొల్పడాన్ని, అంటే క్రమం తప్పకుండా నమాజును చదవడాన్ని ఇస్లాం మూలస్థంబాలలో ఒకటిగా మరియు మూలవిధిగా ఖరారు చేశారు.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“ఇస్లాం ధర్మ పునాది 5 మౌలికాంశాలపై ఆధారపడి వుంది. (అవేమిటంటే) అల్లాహ్ తప్ప మరో నిజమైన ఆరాధ్యదైవం లేదని, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయన దాసులు మరియు ప్రవక్త అని సాక్ష్యమివ్వడం, నమాజ్ నెలకొల్పడం, జకాత్ చెల్లించడం, హజ్ నిర్వర్తించడం మరియు రమజాన్ మాసంలో ఉపవాసాలుండడం.” *(బుఖారీ, ముస్లిం)*

అందుకే సహాబాలలో ఎవరైనా బైత్ (ప్రమాణం) చేయడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్ద కొస్తే, ఆయన వారితో – ఐదు నమాజులను క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ చదువుతూ వుంటాను అని కూడా ప్రమాణం చేయించేవారు.

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం:

నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్ద బైత్ చేసినప్పుడు –

నమాజులను క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ నెలకొల్పుతూ వుంటానని, జకాత్ ఇస్తూ వుంటానని, ప్రతి ముస్లిం శ్రేయోభిలాషి (మంచిని కాంక్షించేవాడి)గా వుంటానని ప్రమాణం చేశాను. *(బుఖారీ : 524, ముస్లిం : 56)*

నమాజ్ ఔన్నత్యాన్ని, ప్రాధాన్యతలను దృష్టిలో వుంచుకొని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఉమ్మత్‌కు నమాజ్ గురించే ఆఖరి వసీయతు చేశారు. దీని గురించి ఉమ్మె సలమా (రజి అల్లాహు అన్హా) ఇలా వివరించారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరణించడానికి ముందు వ్యాధిగ్రస్తులై వున్నప్పుడు మాటిమాటికీ ఇలా ఉద్బోధించారు – క్రమం తప్పకుండా నమాజ్ చదువుతూ వుండండి, (మీ స్వాధీనంలోని) బానిసల(సేవకుల) హక్కులను నెరవేర్చండి.

ఉమ్మె సలమా (రజి అల్లాహు అన్హా) కథనం: ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ మాటలు మాటిమాటికి ఉచ్చరిస్తూ పోయారు. చివరికి వ్యాధి తీవ్రరూపం దాల్చడంతో ఆయన ఉచ్చరించడం (మాట్లాడడం) కష్టమైపోయింది. *(ఇబ్నె మాజ: 1625, సహీహ్ – అల్‌బానీ)*

అలీ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (నోటి నుంచి వెలువడ్డ) ఆఖరి మాట ఇది: నమాజ్ నెలకొల్పుతూ వుండండి, బానిసల (సేవకుల) హక్కులు నెరవేర్చండి. *(ఇబ్నె మాజ: 2698, సహీహ్ –అల్‌బానీ)*

అందుకే ముస్లింలందరూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆఖరి వసీయతుపై ఆచరిస్తూ ఐదు నమాజులను క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ నెలకొల్పుతూ వుండాలి. దానిలో ఏమాత్రం ఏమరుపాటుకు గురికాకూడదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముఆజ్ బిన్ జబల్ (రజి అల్లాహు అన్హు) ను యమన్ వైపుకు పంపుతూ ఇలా హితబోధ చేశారు: నువ్వు గ్రంథ ప్రజలు గల ప్రాంతానికి వెళుతున్నావు. అందుకే మొట్టమొదట వారిని – లా ఇలాహ ఇల్లల్లాహ్ ముహమ్మదుర్రసూలుల్లాహ్ గురించి సాక్ష్యమివ్వ డానికి ఆహ్వానించు. ఒకవేళ వారు నీ మాట ఒప్పుకుంటే, తదుపరి వారికి – అల్లాహ్ మీపై రేయింబవళ్ళలో 5 నమాజులు విధిగా చేశాడని చెప్పు. దీనిని కూడా వారు స్వీకరిస్తే, తదుపరి వారికి – అల్లాహ్ మీపై జకాత్‌ను విధిగా

చేశాడని చెప్పు. అది (జకాత్) మీలోని ధనవంతుల నుండి వసూలు చేసి (మీలోని) బీదవారికి అప్పగించబడుతుంది. ఒకవేళ వాళ్ళు ఈ విషయంలో కూడా నీకు విధేయత చూపితే, వారి దగ్గరి శ్రేష్ట వస్తువుల జోలికి పోవద్దు. అలాగే పీడితుల ఆర్తనాదానిక్కూడా దూరంగా వుండు. ఎందుకంటే పీడితుల ఆర్తనాదానికి, అల్లాహ్ కు మధ్య ఏ తెర అడ్డుగా వుండదు.

*(బుఖారీ : 1496, ముస్లిం : 19)*

తల్హా బిన్ ఉబైదుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం:

నజద్ వాసుల్లోని ఒక వ్యక్తి – అతని జుట్టు చిందరవందరగా వుంది, అతని గుసగుసలైతే వినవచ్చు గానీ, అతను పలికేది అర్థం కాకుండా వుంది – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికొచ్చాడు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)కు దగ్గరగా వచ్చి అకస్మాత్తుగా ఇస్లాం గురించి అడగడం మొదలుపెట్టాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – రేయింబవళ్ళలో 5 పూటలు నమాజ్ నెలకొల్పాలి అని అన్నారు.

ఆ వ్యక్తి – ఇవి కాకుండా ఇంకా వేరే నమాజులు ఏమైనా విధిగా చదవాలా? అని అడిగాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – లేదు, కానీ నీవు స్వచ్ఛందంగా (నఫిల్ నమాజులు)చదువుకోవచ్చు అన్నారు.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – ఇంకా రమజాన్ మాసంలో ఉపవాసాలు కూడా వుండాలి అని అన్నారు.

ఆ వ్యక్తి – ఇవి కాక, ఇంకా వేరే ఉపవాసాలు ఏవైనా విధిగా పాటించాలా? అని అడిగాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – లేదు, కానీ నీవు స్వచ్ఛందంగా (నఫిల్ ఉపవాసాలు) వుండవచ్చు అని అన్నారు.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనికి జకాత్ విధిత్వము గురించి వివరించారు.

అతను – ఇదిగాక, ఇంకా ఏవైనా నా సంపదలో నుంచి విధిగా చెల్లించాలా? అని అడిగాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – లేదు, కానీ నీవు స్వచ్ఛందంగా దానం చేయవచ్చు అని అన్నారు.

ఆ వ్యక్తి తిరిగి వెళుతూ ఇలా అన్నాడు – అల్లాహ్ సాక్షి! నేను వీటిలో (ఈ ఆదేశాలలో) ఏ మాత్రం పెంచనూ, తగ్గించను (అంటే యథావిధిగా ఆచరిస్తాను). దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ఒకవేళ ఇతను తాను చెప్పినట్లు చేస్తూపోతే – తప్పకుండా సాఫల్యం పొందుతాడు అని అన్నారు. *(బుఖారీ : 46, ముస్లిం : 11)*

ఈ హదీసు ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – ఇస్లాం స్వీకరణ తర్వాత ఈ సత్య ధర్మం యొక్క అన్నిటికన్నా ప్రముఖ విధి రేయింబవళ్ళలోని 5 నమాజులు. కానీ దురదృష్టవశాత్తూ ఇస్లాం ధర్మంతో తమను జోడించుకొనే (ముస్లిములని చెప్పుకునే) చాలా మంది నేడు దీని మొట్టమొదటి మరియు ఎంతో ప్రాముఖ్యమైన విధి విషయంలోనే ఏమరుపాటుకు గురైవున్నారు. స్వయానా తమకు తాము దీని గురించి పట్టించుకోరు, తమ సంతానానిక్కూడా దీని గురించి బోధించరు. మరి చూడబోతే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 10 సం॥ల పిల్లవాడికి ఒకవేళ అతను నమాజు చదవకపోతే – శిక్షించమని ఆజ్ఞాపించి వున్నారు.

“మీ పిల్లలు 7 సం॥ల వయస్సుకు వచ్చినప్పుడు వారికి నమాజ్ గురించి ఆదేశించండి, వారు 10 సం॥లకు చేరుకున్నప్పుడు (నమాజ్ చదవకపోతే) వారిని శిక్షించండి.”

*(అహ్మద్, సహీహుల్ జామె – అల్‌బానీ : 5868)*

కనుక మనం కూడా క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ నమాజులు చదువుతూ వుండాలి మరియు మన పిల్లలకు కూడా బాల్యం నుంచే దానిని అలవాటు చేయాలి. తద్వారా వాళ్ళు పెరిగి పెద్దయ్యాక కూడా ఈ ప్రముఖమైన విధిని సక్రమంగా నిర్వర్తించగలుగుతారు.

ఒక హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) క్రమం తప్పకుండా నమాజ్ చదివే వారికి అల్లాహ్ అతనికి తప్పకుండా స్వర్గంలోకి ప్రవేశింప జేస్తానని వాగ్దానం చేశాడు – అన్న శుభవార్తను అందజేశారు.

ఉబాదా బిన్ సామిత్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ తన దాసులపై 5 నమాజులు విధి (ఫర్జ్)గా చేశాడు. ఇక ఎవరైనా ఈ నమాజులలో దేనిని కూడా తేలిగ్గా తీసుకొని విడిచిపెట్టకుండా, సక్రమంగా నెలకొల్పాడో, అతనికి అల్లాహ్ చేసిన వాగ్దానమేమిటంటే – ఆయన ఆ వ్యక్తిని తప్పకుండా స్వర్గంలోకి ప్రవేశింపజేస్తాడు. ఒకవేళ ఎవరైనా ఇలా చేయకపోతే – అతనికి ఏ విధమైన వాగ్దానం లేదు. అల్లాహ్ తలచుకుంటే అతణ్ణి శిక్షించనూ వచ్చు లేదా (అతణ్ణి క్షమించి) స్వర్గంలోకి ప్రవేశింపజేయనూ వచ్చు.

*(అబూ దావూద్: 142, సహీహ్ – అల్‌బానీ)*

ఒక హదీసులో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నమాజ్‌ను ధర్మం యొక్క మూల స్థంభం లాగా ఖరారు చేశారు. స్తంభం లేకపోతే ఏ కట్టడం కూడా నిలువలేదు. అలాగే నమాజ్ చదవకపోతే ధర్మం కూడా మిగిలి వుండదు!

ముఆజ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఒక విషయానికి ఇస్లాం వేరు (లాంటిది). దాని స్తంభం నమాజ్ కాగా జిహాద్ దాని శిఖరం.

*(తిర్మిజీ : 2616, ఇబ్నె మాజ : 3973, సహీహ్ – అల్‌బానీ)*

ఈ కారణంగానే, ప్రళయం రోజు అన్నింటికన్నా ముందుగా, నమాజ్ విషయంలో లెక్క తీసుకోబడుతుంది. ఒకవేళ దాసుడెవరైనా దానిలో సఫలీకృతుడైతే మిగతా విషయాల్లో కూడా సఫలుడౌతాడు. ఒకవేళ నమాజు లెక్కలో సాఫల్యం పొందలేకపోతే మిగతా విషయాల్లో కూడా సాఫల్యం పొందలేడు.

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రళయం రోజు దాసునితో అన్నింటికన్నా ముందుగా నమాజు విషయంలో లెక్క తీసుకోబడుతుంది. అది గనక సరిగా తేలితే మిగతా ఆచరణలు కూడా సరిగా తేలుతాయి. ఒకవేళ నమాజ్ సరిగా లేకపోతే మిగతా ఆచరణలు కూడా సరిగ్గా తేలవు.

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది:

అతని నమాజ్‌ను పరికించడం జరుగుతుంది. అది గనక సవ్యంగా వుంటే అతను సఫలీకృతుడవుతాడు, ఒకవేళ అది సవ్యంగా లేకపోతే, అతను

అగౌరవపరచబడి నష్టపోయేవారిలో చేరిపోతాడు.

*(తబ్రానీ - ఔసత్, అస్సహీహా : 1358)*

## నమాజు మహత్యాలు

(1) నమాజ్ సిగ్గు మాలినతనం నుంచి, చెడు విషయాల నుంచి ఆపుతుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

اُتْلُ مَآ اُوْحِيَ اِلَيْكَ مِنَ الْكِتٰبِ وَاَقِمِ الصَّلٰوةَ ۭ اِنَّ الصَّلٰوةَ تَنْهٰى عَنِ الْفَحْشَاۗءِ وَالْمُنْكَرِ ۭ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ ۭ وَاللّٰهُ يَعْلَمُ مَا تَصْنَعُوْنَ ﴿45﴾

**"(ఓ ప్రవక్తా!) నీ వైపునకు పంపబడిన (వహీ చేయబడిన) గ్రంథాన్ని పారాయణం చేస్తూ వుండు. నమాజును నెలకొల్పు. నిశ్చయంగా నమాజ్ సిగ్గుమాలిన తనం నుంచి, చెడు విషయాల నుంచి ఆపుతుంది. నిశ్చయంగా అల్లాహ్ స్మరణ చాలా గొప్ప విషయం (అన్న సంగతి మరువరాదు). మీరు చేసేదంతా అల్లాహ్‌కు తెలుసు". *(అన్‌కబూత్ : 45)***

(2) (సద్వచనాల) సాక్ష్యం తరువాత అన్నిటి కన్నా ఉత్తమ ఆచరణ నమాజ్.

అబ్దుల్లాహ్ బిన్ మస్‌ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను - అల్లాహ్‌కు అన్నింటికన్నా ప్రియమైన ఆచరణ ఏది? అని అడిగాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)- సమయం ప్రకారం నమాజు చదవడం అని అన్నారు.

నేను - ఆ తరువాత? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)- తల్లిదండ్రులతో మంచిగా మెలగడం అని అన్నారు.

నేను - ఆ తర్వాత? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) - అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయడం అని అన్నారు. *(బుఖారీ:5970, ముస్లిం: 85)*

(3) నమాజ్ చిన్న పాపాలను కడిగేస్తుంది. ఒకవేళ పెద్ద పాపాలకు దూరంగా వుంటే గనక, ఐదు పూటల నమాజు వాటి మధ్య జరిగే చిన్న పాపాలకు పరిహారం (కఫ్ఫారా) అవుతుంది.

❖ అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఒకవేళ మీలో ఎవరి గుమ్మం ముందైనా ఒక కాలువ ప్రవహిస్తూ వుండి, దానిలో అతను ప్రతి రోజూ 5 సార్లు స్నానం చేస్తూ వుంటే అతని ఒంటి మీద మురికి ఏమైనా మిగిలి వుంటుందా? అని అడిగారు. అందరూ – వుండదు, ఏ మాత్రం వుండదని అన్నారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – ఐదు నమాజుల ఉదాహరణ కూడా ఇలాంటిదే. అల్లాహ్ వీటి ద్వారా పాపాలను కడిగేస్తాడు. *(బుఖారీ, ముస్లిం)*

❖ అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఐదు పూటల నమాజ్, ఒక శుక్రవారం తదుపరి శుక్రవారం వరకు, ఒక రమజాన్ మాసం తదుపరి రమజాన్ మాసం వరకు – మధ్యలో జరిగే చిన్న పాపాల కోసం పరిహారం (కఫ్ఫారా) అవుతాయి. షరతు ఏమిటంటే – పెద్ద పాపాలకు దూరంగా వుండాలి". *(ముస్లిం: 233)*

❖ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

ఒక ముస్లిం ఎవరైనా మంచిగా వుజూ చేసి, తదుపరి నమాజ్ చేస్తే, అల్లాహ్ ఆ నమాజ్‌కు మరియు దాని తర్వాత రాబోయే నమాజ్‌కు మధ్య జరిగే అతని చిన్న పాపాలను క్షమిస్తాడు. *(ముస్లిం : 227)*

❖ ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

ఏదైనా ఫర్జ్ నమాజ్ కోసం సమయం ఆసన్నమయినప్పుడు, ముస్లిం ఎవరైనా దాని కోసం మంచిగా వుజూ చేసి, దానిలో ప్రశాంతతను పాటించి తదుపరి వినమ్రతతో ప్రశాంతంగా రుకూ చేస్తే ఆ నమాజ్ అతని గత పాపాలకు పరిహారం అవుతుంది. కానీ షరతు ఏమిటంటే – అతను పెద్ద పాపాలకు దూరంగా వుండాలి. ఈ శ్రేష్ఠత ప్రళయం వరకూ వుంది. *(ముస్లిం : 228)*

❖ అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

మీరు (పాపాలలో) మండుతున్నారు, మీరు (పాపాలలో) మండుతున్నారు. తదుపరి మీరు ఫజర్ నమాజ్ చదివితే, అది వాటిని (అంటే మీ పాపాలను) కడిగేస్తుంది. ఆ తర్వాత మీరు మళ్ళీ (పాపాలలో) మండుతారు, మీరు మళ్ళీ (పాపాలలో) మండుతారు. తదుపరి మీరు జొహర్ నమాజ్ చదివితే అది వాటిని (మీ పాపాలను) కడిగేస్తుంది. ఆ తర్వాత మీరు మళ్ళీ (పాపాలలో) మండుతారు, మీరు మళ్ళీ (పాపాలలో) మండుతారు. తదుపరి మీరు అస్ర్ నమాజ్ చదివితే అది వాటిని (మీ పాపాలను) కడిగేస్తుంది. ఆ తర్వాత మీరు మళ్ళీ (పాపాలలో) మండుతారు, మీరు మళ్ళీ (పాపాలలో) మండుతారు. తదుపరి మీరు మగ్రిబ్ నమాజ్ చదివితే అది వాటిని (మీ పాపాలను) కడిగేస్తుంది. ఆ తర్వాత మీరు మళ్ళీ (పాపాలలో) మండుతారు. మీరు మళ్ళీ (పాపాలలో) మండుతారు. తదుపరి మీరు ఇషా నమాజ్ చదవితే అది వాటిని (మీ పాపాలను) కడిగేస్తుంది. ఇలా మీరు నిద్రకు ఉపక్రమించినప్పుడు మీపై ఏ పాపం లిఖించబడి వుండదు. ఈ స్థితిలోనే మీరు నిద్రలేస్తారు.

*(తబ్రానీ – సహీహ్ అల్బానీ, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 357)*

❖ సల్మాన్ ఫార్సీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: నిశ్చయంగా ఒక ముస్లిం నమాజు చదవడం ప్రారంభించినప్పుడు అతని పాపాలు అతని తలపైకి ఎత్తబడతాయి. తదుపరి అతను సజ్దా చేసినప్పుడు అతని పాపాలు క్రిందికి పడిపోతాయి. ఇలా అతను నమాజు పూర్తి చేసేసరికి అతని మొత్తం పాపాలు క్రింద పడిపోతాయి.

*(తబ్రానీ – సహీహ్ అల్బానీ, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్: 362)*

❖ అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం:

నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గర కూర్చొని వుండగా ఒక వ్యక్తి ఆయన దగ్గరికొచ్చి – ఓ దైవ ప్రవక్తా! నాతో ఒక పాపం

జరిగిపోయింది. దానికి శిక్ష తప్పనిసరి. కనుక మీరు నన్ను (దీనికిగాను) శిక్షించండి అని వేడుకున్నాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనికి – ఏం పాపం చేశావు, ఎలా చేశావు అని ఏమీ అడగలేదు. ఈ లోగా నమాజువేళ అయ్యేసరికి అతను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో పాటు నమాజు చదివాడు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరికొచ్చి మళ్ళీ అదేమాట పలికాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతనితో – మాతో పాటు నువ్వు నమాజు చదవలేదా? అని అడిగారు. అతను – చదివానండి అని అన్నాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) – వెళ్ళు, అల్లాహ్ నీ పాపాలను క్షమించేశాడు అని చెప్పారు. *(బుఖారీ : 6823, ముస్లిం : 2765)*

(4) నమాజ్ చదివే వారికి నమాజ్, పరలోకంలో వారికి కాంతి ప్రసాదించబడడానికి కారణభూతమవుతుంది.

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయినా క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ నమాజ్ చదువుతూ వుంటే – ఆ నమాజ్ అతనికి కాంతి మరియు ఆధారం (లాగా వుంటుంది). ప్రళయం రోజు సాఫల్యానికి కారణభూతమవుతుంది. ఇక ఏ వ్యక్తి అయినా ఎల్లప్పుడూ నమాజ్ చదవకపోతే అతనికి కాంతి వుండదు, ఆధారమూ ఉండదు. ప్రళయం రోజు సాఫల్యానికి కారణభూతం కూడా కాలేదు. ప్రళయం రోజు అతను ఖారూన్, ఫిరౌన్, హామాన్ మరియు ఉబై బిన్ ఖలఫ్ (లాంటి దురదృష్టవంతు)లతో వుంటాడు. *(అహ్మద్ : 2/169, దారిమి : 2/301, సహీహ్ –అల్‌బానీ)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: చీకట్లలో మసీదులకు నడిచి వచ్చే (తరలివచ్చే) వారికి – ప్రళయం రోజు సంపూర్ణంగా కాంతి ప్రసాదించబడుతుంది– అన్న శుభవార్తను అందించండి.

*(అబూ దావూద్: 561, తిర్మిజీ : 223, సహీహ్ –అల్‌బానీ)*

(5) నమాజు కోసం నడిచి వెళితే ఒక్కో అడుగుకు ప్రతిగా పాపాలు క్షమించబడతాయి మరియు దర్జాలు పెంచబడతాయి.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయినా తన ఇంట్లో వుజూ చేసుకొని, కేవలం అల్లాహ్ విధిత్వాలలోని ఒక ప్రముఖ విధిని నిర్వర్తించాలన్న (నమాజ్ చదవాలన్న) ఉద్దేశ్యంతో ఇంటి నుంచి బయలు దేరి అల్లాహ్ గృహాల్లో (మసీదులు) ఒక గృహం వైపునకు వెళితే, అతను వేసే రెండు అడుగుల్లో ఒక అడుగు అతని పాపాన్ని తుడిచి వేస్తుంది, మరో అడుగు అతని ఒక దర్జా (స్థాయి)ని పెంచుతుంది. *(ముస్లిం : 666)*

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది:

ఒకవేళ మీలో ఎవరైనా బాగా వుజూ చేసుకొని, (నమాజు నిమిత్తం) మస్జిద్‌కు వెళితే, అతని కుడి కాలు లేవగానే అల్లాహ్ అతని కొరకు ఒక పుణ్యాన్ని లిఖిస్తాడు మరియు అతని ఎడమ కాలు క్రింద వుంచగానే అల్లాహ్ అతని ఒక పాపాన్ని తుడిచేస్తాడు. *(అబూ దావూద్: 563)*

(6) నమాజ్ చదివేవాడు మస్జిద్‌కు వెళ్ళిన ప్రతి సారి అతని కోసం స్వర్గంలో అతిథి ఏర్పాట్లు చేయబడతాయి.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయినా ఉదయం గానీ, సాయంత్రం గానీ మస్జిద్‌కు వెళితే, అల్లాహ్ అతని కోసం స్వర్గంలో అతిథి ఏర్పాట్లు చేయిస్తాడు. అతను ఉదయం, సాయంత్రం ఎప్పుడు వెళ్ళినా సరే– (ఈ ఏర్పాటు వుంటుంది). *(బుఖారీ : 662, ముస్లిం: 669)*

(7) నమాజు చదివే వారి కోసం దైవ దూతలు సైతం ప్రార్థిస్తారు.

మనిషికి సామూహిక నమాజు ద్వారా దొరికే పుణ్యం – ఒంటరిగా లేక బజారులో చదివే నమాజు పుణ్యం కన్నా 20 రెట్ల కంటే అధికంగా వుంటుంది. ఇక ఎవరైనా బాగా వుజూ చేసుకొని, కేవలం నమాజ్ చదవాలన్న సంకల్పంతో మస్జిద్‌కు వస్తే అతను వేసే ఒక్కో అడుగుకు గాను అతని ఒక దర్జా పెంచబడుతుంది మరియు ఒక పాపం తుడిచివేయబడుతుంది. ఇలా మస్జిద్‌కు వచ్చి నమాజు కోసం వేచి చూస్తున్నంత వరకూ అతను నమాజులో వున్నట్లే. (అంటే నమాజు పుణ్యం దొరుకుతూ వుంటుంది.)

అతను జాయెనమాజ్ (నమాజు కోసం ఉపయోగించబడే వస్త్రం) మీద కూర్చొని వున్నంత వరకు దైవ దూతలు అతని కోసం ప్రార్థిస్తూ ఇలా అంటూ వుంటారు – 'ఓ అల్లాహ్! ఇతణ్ణి కరుణించు, ఇతణ్ణి క్షమించు, ఓ అల్లాహ్! ఇతని పశ్చాత్తాపాన్ని స్వీకరించు. అతను ఇతరులకు కష్టం కలిగించనంత వరకూ లేదా అతని వుజూ భంగం కానంత వరకూ వారు ఇలా అతని కోసం ప్రార్థిస్తూ వుంటారు.' *(బుఖారీ : 2119, ముస్లిం: 649)*

(8) నమాజ్ చదివే వానికి ఇహ్రాం ధరించిన వానిలాగా పుణ్యం దొరుకుతుంది.

అబూ ఉమామ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయినా తన ఇంటి నుండి వుజూ చేసి ఫర్జ్ నమాజ్ కోసం వెళతాడో అతనికి ఇహ్రాం ధరించిన వ్యక్తికి దొరికే పుణ్యం దొరుకుతుంది. *(అబూ దావూద్ :558, హసన్ – అల్‌బానీ)*

(9) నమాజ్ పాపాల మంటను చల్లారుస్తుంది.

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: నిశ్చయంగా అల్లాహ్ ఒక దైవదూతను నియమించాడు. అతను ప్రతి నమాజు సమయంలో ఇలా ప్రకటిస్తూ వుంటాడు – ఓ ఆదం సంతానమా! నిలబడండి, (నిలబడి) పాపాల ద్వారా మీరు మండించుకున్న మంటను చల్లార్చుకోండి!

*(తబ్రానీ, హసన్ –అల్‌బానీ, సహీహ్ అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్ : 358)*

(10) ఐదు నమాజులను క్రమం తప్పకుండా నెలకొల్పేవాడు సత్యసంధుల (సిద్దీఖ్) మరియు షహీదుల కోవకు చెందినవాడు.

అమ్ర్ బిన్ మర్ర అల్ జహమి (రజి అల్లాహు అన్హు) కథనం:

ఒక వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధి కొచ్చి, ఓ దైవ ప్రవక్తా! ఒకవేళ సద్వచనాల సాక్ష్యం ఇచ్చి, దీనితో పాటు ఐదు నమాజులు (క్రమం తప్పకుండా) చదువుతూ, జకాత్ చెల్లిస్తూ, రమజాన్ మాసపు ఉపవాసాలు పాటిస్తూ, దాని రాత్రిళ్ళలో నిలబడుతూ (అంటే నమాజు చేస్తూ) వుంటే నేను ఏ సమూహంలో వుంటాను? దీనికి మీ అభిప్రాయం ఏమిటి?

అని అడిగాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నువ్వు సత్యసంధుల, షహీదుల సమూహంలో వుంటావు అని జవాబిచ్చారు. *(బజ్జార్, ఇబ్నె ఖుజైమా, ఇబ్నె హిబ్బాన్, సహీహ్- అల్బానీ, సహీహ్ అత్తర్గీబ్ వత్తర్హీబ్ : 361)*

(11) నమాజ్ కంటి చలువ మరియు హృదయ ప్రశాంతత (మనశ్శాంతి).

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: నాకు ఈ ప్రపంచంలోని రెండు వస్తువులు ప్రియమైనవి. స్త్రీలు మరియు సువాసన. నా కంటి చలువ నమాజ్ యందు వుంచబడింది. *(అహ్మద్, నసాయి, సహీహ్- అల్బానీ)*

## ఉద్దేశ్యపూర్వకంగా నమాజ్ త్యజించడం కుఫ్ర్ మరియు దాని శిక్ష ఎంతో ఘోరమైనది.

రండి, ఇక నమాజులను వృథా చేసే వారి గురించి, వాటిని నెలకొల్పడంలో అశ్రద్ధ చూపే వారి గురించి, వాటిని తమ ఇష్ట ప్రకారం (అసలు సమయాన్ని వదిలేసి) నెలకొల్పే వారి గురించి, వాటిని పూర్తిగా త్యజించిన వారి గురించి అల్లాహ్ ఏమని సెలవిచ్చాడో తెలుసుకుందాం.

❖ నమాజులను వృథా చేసేవారికి అల్లాహ్ నరక శిక్షను గురించి హెచ్చరించాడు:

> **"ఆ తరువాత కొందరు అనర్హులు వచ్చి, నమాజులను వృథా చేశారు, తమ మనో వాంఛలను అనుసరించసాగారు. తమకు కలిగిన నష్టం గురించి వారు ముమ్మందు చూసుకుంటారు. (లేదా నరకంలోని ఒక లోయ 'గై' లో స్థలం పొందుతారు)".** ***(మర్యమ్: 59)***

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) 'గై' గురించి ఇలా వివరించారు: అది నరకంలోని ఒక నది. దాని రుచి ఎంతో చెడుగానూ, దాని లోతు ఎంతో ఎక్కువగానూ వుంటుంది.

*(కితాబుస్సలాత్ - ఇబ్నుల్ ఖయ్యూం - 40 పేజీ)*

❖ నమాజులను, వాటి నిర్ణీత వేళల్లో కాకుండా తమ ఇష్టప్రకారం చదివేవారి పర్యవసానం గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَوَيْلٌ لِّلْمُصَلِّيْنَ ۝ الَّذِيْنَ هُمْ عَنْ صَلَاتِهِمْ سَاهُوْنَ ۝

**"ఆ నమాజీలకు వినాశం తప్పదు. (వైల్ అనే నరక స్థానం వారి కొరకు వున్నది) (ఎందుకంటే) వారు తమ నమాజుల పట్ల అశ్రద్ధ వహిస్తారు."**
***(మాఊన్ : 2-5)***

ఈ ఆయతులలో అల్లాహ్ కొందరు నమాజీలకు వినాశం (లేదా నరకంలోని ఒక లోయ) గురించి హెచ్చరించాడు. వారెలాంటి నమాజీలంటే – నమాజులు చదువుతారు, కానీ వాటి నిర్ధారిత వేళలను పట్టించుకోకుండా, తమ ఇష్టం వచ్చినప్పుడు చదువుతారు. ఓ సారి నిర్ణీత వేళలో చదివితే మరోసారి తమ ఇష్టప్రకారం చదువుతారు.

కనుక, ఇలా నమాజులను ఆలస్యంగా (నిర్ణీత సమయాల్లో కాకుండా) చేయడాన్ని అలవాటుగా చేసుకున్నవారు, ఈ ఆయత్‌ల ద్వారా గుణపాఠం నేర్చుకోవాలి. ప్రత్యేకించి ఫజర్, జొహర్ మరియు అసర్ నమాజులు. వీటిని వారు వాటి ఆఖరి సమయంలో లేదా ఒక్కోసారి సమయం దాటి పోయాక చదువుతూ వుంటారు!

❖ ప్రళయం రోజు నమాజును త్యజించిన వారి పర్యవసానం గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فِيْ جَنّٰتٍ ۛ يَتَسَآءَلُوْنَ ۝ عَنِ الْمُجْرِمِيْنَ ۝ مَا سَلَكَكُمْ فِيْ سَقَرَ ۝
قَالُوْا لَمْ نَكُ مِنَ الْمُصَلِّيْنَ ۝

**"వారు (స్వర్గ) వనాలలో (కూర్చొని) అడుగుతూ వుంటారు, అపరాధుల గురించి. ఇంతకీ ఏ విషయం మిమ్మల్ని నరకానికి తీసుకువచ్చింది? (అని ప్రశ్నిస్తారు). వారిలా సమాధానమిస్తారు- మేము నమాజు చేసేవారము కాము."** ***(ముద్దస్సిర్ : 40-43)***

ఈ ఆయతులలో అల్లాహ్ తెలియజేసిందేమిటంటే స్వర్గవాసులు నరకవాసులతో – ఏ ఆచరణ మిమ్మల్ని నరకంలోకి చేర్చింది? అని అడుగుతారు. దానికి వారు తమ మొదటి నేరంగా మేము నమాజులు చదవలేదు అని అంటారు.

దీని ద్వారా రూఢీ అయినదేమిటంటే – నమాజు చదవకపోవడం నరకానికి చేర్చే ఆచరణ. వల్ ఇయాజు బిల్లాహ్.

❖ అల్లాహ్ – నమాజులను నెలకొల్పడంలో బద్ధకంగా వ్యవహరించడాన్ని మునాఫిక్ (కపట విశ్వాసులు)ల కొన్ని లక్షణాలను వివరిస్తూ (దీనిని కూడా) ఉదహరించాడు:

إِنَّ الْمُنَٰفِقِينَ يُخَٰدِعُونَ اللَّهَ وَهُوَ خَٰدِعُهُمْ وَإِذَا قَامُوٓا إِلَى الصَّلَوٰةِ قَامُوا كُسَالَىٰ يُرَآءُونَ النَّاسَ وَلَا يَذْكُرُونَ اللَّهَ إِلَّا قَلِيلًا ۝

**“నిశ్చయంగా కపటులు అల్లాహ్‌ను మోసం చేయాలని చూస్తున్నారు. అయితే అల్లాహ్ వీరి మోసానికి శిక్ష విధించనున్నాడు. వారు నమాజు కోసం నిలబడినప్పుడు ఎంతో బద్ధకంతో, కేవలం జనాలకు చూపించే ఉద్దేశ్యంతో నిలబడతారు. ఏదో నామమాత్రంగా దైవాన్ని స్మరిస్తారు.”**

***(నిసా : 142)***

ఇంత వరకూ మేము వివరించిన ఆయతులలో, నమాజు చదవని వారికి, దానిని నెలకొల్పడంలో అశ్రద్ధ చూపేవారికి గట్టిగా హెచ్చరించడం జరిగింది. ఎందుకంటే ఉద్దేశ్యపూర్వకంగా నమాజును వదలిపెట్టడం కుఫ్ర్ (అవిశ్వాసం).

దీని గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: మనిషి మరియు కుఫ్ర్ కు మధ్య తేడా నమాజును త్యజించడం.

*(అహ్మద్, ముస్లిం)*

సునన్ తిర్మిజీ లోని ఉల్లేఖనంలో పదాలు ఇలా వున్నాయి:

కుఫ్ర్ (అవిశ్వాసం) మరియు ఈమాన్ (విశ్వాసం) మధ్య తేడా నమాజును వదలిపెట్టడం. *(తిర్మిజీ : 2618, సహీహ్ –అల్‌బానీ)*

అబూ మూసా అష్అరీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: మన మరియు వారి (అవిశ్వాసుల) మధ్య గల ఒప్పందం నమాజ్. అందుకే ఎవరైతే దానిని విడిచిపెడతాడో అతను కుఫ్ర్ చేశాడు.

*(తిర్మిజీ : 2621, ఇబ్నె మాజ : 1079, సహీహ్–అల్‌బానీ)*

ఇమామ్ అబూ అబ్దుల్లాహ్ అల్ మర్వజీ రహిమహుల్లాహ్ ఇలా సెలవిచ్చారు:

అల్లాహ్ నమాజ్‌ను త్యజించడంపై గట్టిగా హెచ్చరించాడు మరియు తన ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నోట – నమాజు త్యజించినవాడు విశ్వాసం (ఈమాన్) నుండి వైదొలుగుతాడని తాకీదు చేయించాడు. ఇలా కుఫ్ర్ మరియు ఈమాన్‌ల మధ్య నమాజును తప్ప దాసుల ఏ ఇతర ఆచరణలను కూడా సూచన లాగా సెలవీయలేదు. అంటే ఈ రెండింటి మధ్య బేధం గుర్తించడానికి నమాజ్ నే సూచనగా చేయడం జరిగింది.

*(తాజీమ్ ఖద్రుస్సలాత్ లిల్ మర్వజి– 1వ సంపుటం, 132వ పేజీ)*

అబ్దుల్లా బిన్ షఖీఖ్ అల్ అఖీలి (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాలు నమాజును తప్ప వేరే ఇతర ఏ ఆచరణలు వదిలిపెట్టినా దానిని కుఫ్ర్ అని భావించేవారు కాదు. *(తిర్మిజీ, హాకిమ్, సహీహ్– అల్‌బానీ, సహీహ అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్ : 565)*

ఇమామ్ మున్జరి రహిమహుల్లాహ్ ఇలా వివరించారు:

సహాబాలు మరియు వారి తర్వాత వచ్చిన సలఫుస్సాలిహీన్‌ల ఒక సమూహం కలిగివున్న దృష్టి కోణం ఏమిటంటే – ఉద్దేశ్యపూర్వకంగా నమాజును దాని సమయం గడిచిపోయేంత వరకు విడిచి పెట్టేవాడు అవిశ్వాసి (కాఫిర్). వీరిలో ప్రముఖులు– ఉమర్ బిన్ ఖత్తాబ్, అబ్దుల్లా బిన్ మస్‌ఊద్, అబ్దుల్లా బిన్ అబ్బాస్, ముఆజ్ బిన్ జబల్, జాబిర్ బిన్ అబ్దుల్లా, అబూ దర్దా (రజి అల్లాహు అన్హుమ్). వీరితో పాటు ఇమాములలో – అహ్మద్ బిన్ హంబల్, ఇస్‌హాఖ్ బిన్ రాహ్‌వియ, అబ్దుల్లా బిన్ ముబారక్, నఖీ, హకం బిన్ ఉతైబా, అయ్యూబ్ సఖ్తియానీ, అబూ దావూద్ తియాల్సి, అబూ బక్ర్ బిన్ అబీ షైబా మరియు జహీర్ బిన్ హర్బ్ వగైరాలు ప్రముఖులు.

*(అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్: 1వ సంపుటం, 386వ పేజీ)*

ఈ ఆధారాలన్నింటి ద్వారా రుజువైనదేమిటంటే – ఉద్దేశ్యపూర్వకంగా నమాజు వదిలిపెట్టడం కుఫ్ర్. సహాబాలు కూడా దీనిని కుఫ్ర్ అనే భావించేవారు. అందుకే దీనిని త్యజించిన వారికి మేము ముందుగా వివరించినట్లు అల్లాహ్ తీవ్రమైన శిక్షను గురించి హెచ్చరించాడు.

ముఆజ్ బిన్ జబల్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఒక వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికొచ్చి – ఓ దైవ ప్రవక్తా! ఒకవేళ నేను ఆచరిస్తే గనక నన్ను స్వర్గానికి తీసుకెళ్ళే ఆచరణ(ల) గురించి తెలియజేయండి అని  విన్నవించుకున్నాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) – నిన్ను ఎలా శిక్షించినా లేదా అగ్నిలో మండించినా అల్లాహ్‌తో మాత్రం షిర్క్ చేయకు. నీ సంపద నుండి, నీ ప్రతి వస్తువు నుండి నిన్ను గెంటేసినా నువ్వు మాత్రం నీ తల్లిదండ్రులకు విధేయత చూపు. ఉద్దేశ్యపూర్వకంగా నమాజ్‌ను ఎప్పుడూ విడిచి పెట్టకు. ఎందుకంటే ఉద్దేశ్యపూర్వకంగా దీనిని వదిలేసే వాడి బాధ్యత నుండి అల్లాహ్ ముక్తుడవుతాడు.

*(తబ్రానీ, సహీహ్– అల్‌బానీ, సహీహ్ అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్ : 569)*

ఈ తాకీదునే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ముఆజ్ బిన్ జబల్ (రజి అల్లాహు అన్హు) మరియు ఉమ్మె ఐమన్ (రజి అల్లాహు అన్హా) లకు చేసారు.

ఫర్జ్ నమాజు వేళలో నిద్రించే వ్యక్తికి విధించే శిక్ష గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కలలో చూసివున్నారు. దీని గురించి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా తెలియజేశారు:

సముర బిన్ జున్దుబ్ (రజి అల్లాహు అన్హు) కథనం –

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నమాజు ముగించాక మా వైపునకు తిరిగి – మీలో ఎవరైనా ఈ రోజు రాత్రి ఏమైనా కల చూశారా? అని అడిగేవారు. ఒకవేళ ఎవరైనా చూసివుంటే అతను దాని గురించి చెప్పగా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దాని గూఢార్థాన్ని వివరించేవారు. ఇలా, అలవాటు ప్రకారం ఒక రోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇదే విషయం అడగగా మేము – లేదు, మేమెవ్వరం చూడలేదండి అని జవాబిచ్చాం. దీనిపై ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)– కానీ నేను ఈ రోజు రాత్రి కల చూశాను. అదేమిటంటే – ఇద్దరు వ్యక్తులు నా వద్దకొచ్చారు. నన్ను లేపి, పదండి అని అన్నారు. నేను వారితో పాటు నడుస్తూ వెళ్ళాను. ఇలా మేము

ఒక వ్యక్తి దగ్గరి కొచ్చాం. అతను పెడతల (తల వెనుక భాగం) ఆధారంగా తిన్నగా పడివున్నాడు. అతని దగ్గర మరో వ్యక్తి నిలబడి ఒక రాయితో అతని తలను చితక్కొడుతున్నాడు. అతను రాయితో కొట్టగానే రాయి కొద్ది దూరం పోతుంది. అతను ఆ రాయిని మళ్ళీ తీసుకొచ్చేలోపల ఇతని తల మళ్ళీ యధాస్థితికి వచ్చేస్తుంది. తదుపరి మళ్ళీ అతను రాయితో బాదుతాడు. నేనా ఇద్దరు వ్యక్తులతో – సుబ్‌హానల్లాహ్! ఈ ఇద్దరు వ్యక్తులు ఎవరు? అని అడిగాను.

వాళ్ళు నాతో – 'ముందుకెళదాం' అని అన్నారు. ఇలా మేము ముందుకు సాగాం..... ఆతర్వాత వాళ్ళు నాతో – ఇక తల చితక్కొట్టబడిన మొదటి వ్యక్తి గురించి చెప్పాలంటే అతను దివ్య ఖురాను చదివేవాడు, కానీ దానిపై ఆచరించేవాడు కాదు మరియు ఫర్జ్ నమాజు వేళలో నిద్రిస్తూ వుండేవాడు అని అన్నారు. *(బుఖారీ : 7047)*

ఇమామ్ ఇబ్నుల్ ఖయ్యూం రహిమహుల్లాహ్ ఇలా పేర్కొన్నారు : ఉద్దేశ్యపూర్వకంగా నమాజు విడిచిపెట్టడం పెద్ద పాపాల్లో ఒకటన్న విషయంలో ముస్లిముల మధ్య ఎలాంటి భేదాభిప్రాయం లేదు. దీని పాపం అల్లాహ్ దృష్టిలో – చంపడం, సంపద దోచుకోవడం, వ్యభిచారం మరియు మద్యపానం సేవించడం – కన్నా ఎక్కువ. నమాజును త్యజించినవాడు అల్లాహ్ అయిష్టతకు, శిక్షకు మరియు ఇహపరలోకాల్లో అవమానానికి గురై వుంటాడు.

ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి అల్లాహు అన్హు) తన ఆచరణలను వ్రాసేవారు. ఆయన ఇలా అనేవారు– నా దృష్టిలో మీ ముఖ్యమైన పని నమాజ్ చదవడం. ఎందుకంటే దానిని కాపాడుకున్నవాడు తన ధర్మాన్ని కాపాడుకుంటాడు. ఇక దానిని వృధా చేసుకున్నవాడు ఇతర ఇస్లామీయ విధులను వృధా చేసుకుంటాడు. నమాజును త్యజించిన వాడికి ఇస్లాంతో ఏవిధమైన సంబంధం లేదు.

*(కితాబుస్సలాత్ – ఇబ్నుల్ ఖయ్యూం : 21, 22 పేజీలు)*

అల్లాహ్ మనందరికీ ఇస్లామీయ విధుల్లో అతి ముఖ్యమైన ఈ విధిని నిర్వర్తించే మరియు దీనిని సక్రమంగా ఎల్లప్పుడు కాపాడే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!!

# రెండవ ఖుత్బా

ప్రియతమ సోదరులారా!

మొదటి ఖుత్బాలో మీరు మేరాజ్ కానుకైన 5 నమాజుల విధిత్వము, ప్రాముఖ్యత మరియు మహత్యాల గురించి ఖురాన్, హదీసుల వెలుగులో కొన్ని విషయాలు విన్నారు. అంతేగాక ఉద్దేశ్యపూర్వకంగా నమాజ్ విడిచిపెట్టడం పెద్దపాపం అని దానికి విధించబడే శిక్ష గురించి కూడా విన్నారు.

ఇక ఈ రోజు మనం సామాన్య ముస్లిం ప్రజానీకం పరిస్థితి ఒకసారి చూస్తే మనకు తెలిసే దేమిటంటే – ఎంతో మంది ముస్లిములు దీని గురించి అశ్రద్ధకు లోనైవున్నారు. ఇలా, వీరు ఎంతో ప్రమాదకరమైన దారిలో పయనిస్తున్నారు. వాళ్ళు వెంటనే పశ్చాత్తాపపడి అల్లాహ్‌ను సంతృప్తి పరచడానికి ప్రయత్నించాలి. నమాజుల గురించి మరీ అశ్రద్ధ చేయకుండా తమ ఇష్టానుసారం ఒకసారి చదివి మరోసారి విడిచిపెట్టేవారు, ఒక్కోసారి అన్ని నమాజులు చదివి ఇంకోసారి, ఒక నమాజు చదివి మరొకటి వదిలిపెట్టేవారు, ఒకసారి సమయం ప్రకారం చదివి మరోసారి సమయం దాటి పోయాక చదివేవారు, ఒకసారి మస్జిద్‌కు వెళ్ళి సామూహిక నమాజ్ చేసి మరోసారి షరీయత్తు పరమైన కారణమేదీ లేకుండానే తమ ఇంట్లో నమాజు చదివేవారు– ఇలాంటి వారు కూడా తమ నడవడికను మార్చుకోవాలి. వారిపై విధిగా వున్న దేమిటంటే వారు అన్ని నమాజులు సామూహికంగా వాటి ఆరంభ సమయంలోనే చదవాలి.

ఎంతో మంది ముస్లిములు ఇతర నమాజులన్నీ సమయం ప్రకారం చదివి, వారి ఫజ్ర్ నమాజు మాత్రం వారి పడకలపై వృధా కావడం మనం చూస్తూ వుంటాం. అలాగే వారి అసర్ నమాజు కూడా (వృథా అవుతుంది). మరి చూడబోతే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ రెండు నమాజులను (ఫజ్ర్ మరియు అసర్) క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ నెలకొల్పేవారికి స్వర్గపు శుభవార్తను ఇచ్చివున్నారు.

అబూ మూసా అష్అరీ (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయినా

రెండు చల్లటి (వేళల) నమాజులను (ఫజర్ మరియు అస్ర్) చదువుతూ వుంటాడో అతను స్వర్గంలో ప్రవేశిస్తాడు. *(బుఖారీ : 574, ముస్లిం : 635)*

"సూర్యోదయానికి ముందు, సూర్యాస్తమయానికి ముందు నమాజు చదివే వ్యక్తి (ఫజ్ర్, అస్ర్ నమాజులు) నరకంలోకి అస్సలు వెళ్ళడు (అంటే స్వర్గంలోకి వెళతాడు)". *(ముస్లిం : 634)*

అంటే – ఫజర్ మరియు అసర్ నమాజులను క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ నెలకొల్పే వ్యక్తి అన్నమాట.

ఇక ఫజర్ నమాజు సమయంలో నిద్రపోయే వ్యక్తి గురించి – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కల గురించి మేము మొదటి ఖుత్బాలో వివరించనట్లు – అతని తల ను రాయితో చితక్కొట్టడం జరుగుతూ వుండడాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చూశారని తెలుసుకున్నాం. వల్ ఇయాజిబిల్లాహ్.

ఇక అసర్ నమాజు విషయాని కొస్తే, దీనిని వదలిపెట్టేవారి గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

అసర్ నమాజ్ చదవని వ్యక్తి–అతని ఇంటివారు, అతని సంపద లాక్కోబడినట్లే. *(బుఖారీ : 552, ముస్లిం : 626)*

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది:

అసర్ నమాజు వదిలిపెట్టే వ్యక్తి ఆచరణలన్నీ వృథా అయిపోతాయి. *(బుఖారీ : 553)*

మరి కొంత మంది ఇషా మరియు ఫజర్ నమాజుల విషయంలో అశ్రద్ధ చూపుతారు. మరి చూడబోతే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కపట విశ్వాసుల గురించి చెబుతూ – ఇషా మరియు ఫజర్ నమాజులు వారికి అత్యంత భారంగా వుంటాయి అని సెలవిచ్చారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: నిశ్చయంగా కపట విశ్వాసులకు అన్నింటికన్నా భారమైన నమాజులు, ఫజర్ మరియు ఇషా నమాజులు –

ఒకవేళ వారికి వీటి (ఈ రెండు నమాజుల) పుణ్యం గనక తెలిస్తే, వీటి కోసం మోకాళ్ళపై రావాల్సి వచ్చినా, తప్పకుండా వచ్చేవారు.....

*(బుఖారీ : 644, ముస్లిం : 651)*

కనుక, ఒక (నిజమైన) విశ్వాసికి – ఈ నమాజులను భారంగా తలచి, వీటి పట్ల అశ్రద్ధ చూపడం ఎంత మాత్రం శోభించదు. పైగా వీటిని అల్లాహ్ సాన్నిధ్యం పొందడానికి ఒక మాధ్యమంగా, మోక్షానికి ఒక కారణంగా భావించి సక్రమంగా ఎల్లప్పుడూ నెలకొల్పుతూ వుండాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاسْتَعِينُوا بِالصَّبْرِ وَالصَّلٰوةِ ۚ وَإِنَّهَا لَكَبِيرَةٌ إِلَّا عَلَى الْخٰشِعِينَ ۝

الَّذِينَ يَظُنُّونَ أَنَّهُم مُّلٰقُوا رَبِّهِمْ وَأَنَّهُمْ إِلَيْهِ رٰجِعُونَ ۝

**"మీరు సహనం ద్వారా నమాజు ద్వారా సహాయం అర్థించండి. నిశ్చయంగా ఇది కష్టమైన పనే. కాని (అల్లాహ్‌కు) భయపడేవారికి (ఇది సులువైన పని). (ఎందుకంటే) ఎట్టకేలకు తాము తమ ప్రభువును కలుసుకోవాల్సి వుందనీ, ఆయన వైపునకే మరలిపోవలసి ఉందనీ వారు నమ్ముతారు."** ***(బఖర : 45-46)***

అల్లాహ్ మనందరినీ ఆయనపై పూర్తిగా నమ్మకముంచి, తౌహీద్ తర్వాత అతి ముఖ్య ఇస్లామీయ విధి (నమాజ్)ని సంపూర్ణంగా ఎల్లప్పుడూ నెలకొల్పే, వినయవిధేయతలు చూపేవారిలో చేర్చుగాక! ఆమీన్!!

# షాబాన్ మాసపు ఖుత్బాలు

1) షాబాన్ నెల – విశేషాలు, ఆదేశాలు

2) అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం

# షాబాన్ నెల - విశేషాలు, ఆదేశాలు

## ఖుత్బాయందలి ముఖ్యాంశాలు :

1) ఒక రాత్రిని ఆరాధన కోసం ప్రత్యేకం చేసుకోవడం సరికాదు.

2) షాబాన్ నెల ఉపవాసాల మహత్యం.

3) షాబాన్ నెల 15వ రాత్రి మహత్యం.

4) షబే బరాత్ గురించిన తప్పుడు మరియు కాల్పనిక హదీసులు.

5) షబే బరాత్ లో ఏం చెయ్యాలి?

6) షాబాన్ 15వ రాత్రి నిర్ణయాలు తీసుకోబడే రాత్రినా?

## మొదటి ఖుత్బా

ఇస్లామీయ సోదరులారా!

అల్లాహ్ జిన్నాతులను, మానవులను తన ఆరాధన కోసం సృష్టించాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

وَمَا خَلَقْتُ الْجِنَّ وَالْإِنسَ إِلَّا لِيَعْبُدُونِ ۝

**"నేను జిన్నాతులను, మానవులను సృష్టించింది వారు నన్ను ఆరాధించటానికి మాత్రమే".** ***(జారియాత్ : 56)***

కానీ, ఆరాధన కోసం జీవితంలోని ఒక ప్రత్యేక కాలాన్ని లేదా ప్రత్యేక సంవత్సరాన్ని, లేదా ప్రత్యేక మాసాన్ని లేదా ప్రత్యేక వారాన్ని లేదా ప్రత్యేక దినాన్ని లేదా ప్రత్యేక రాత్రిని నిర్ణయించుకొని మిగతా జీవితమంతా (అల్లాహ్) ఆరాధన పట్ల అశ్రద్ధ చూపడం సరికాదు.

మానవ పుట్టుక అసలు ఉద్దేశ్యమే అల్లాహ్‌ను ఆరాధించడం కాబట్టి (ఆరాధనకు)యోగ్యమైన వయస్సు నుండి జీవితపు ఆఖరి క్షణాల వరకు గూడా అల్లాహ్‌ను ఆరాధిస్తూ గడపాలి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

فَسَبِّحْ بِحَمْدِ رَبِّكَ وَكُن مِّنَ السَّاجِدِينَ ۝ وَاعْبُدْ رَبَّكَ حَتَّىٰ يَأْتِيَكَ الْيَقِينُ ۝

**“నీ ప్రభువు పవిత్రతను కొనియాడుతూ అతన్ని స్తుతిస్తూ వుండు. సాష్టాంగ పడేవారిలో చేరిపో. నిశ్చయమైనది (అనగా మరణం) వచ్చే వరకు. నీ ప్రభువును ఆరాధిస్తూ వుండు”. *(హిజ్ర్ : 98 - 99)***

అందుకే, ఎవరైతే తన జీవిత అసలు లక్ష్యం (అల్లాహ్‌ను) ఆరాధించటం అని భావిస్తాడో అతనే సఫలీకృతుడు. అలాకాక, ఎవరైతే తన జీవిత లక్ష్యాన్ని కేవలం తన కోసం, తన ఇంటి వారికోసం ఇహలోకపు తళుకుబెళుకులు సమకూర్చుకోవడంగా భావిస్తాడో అతను ఎట్టి పరిస్థితుల్లోనూ సాఫల్యం పొంద లేడు.

నేడు పరిస్థితి ఎలా వుందంటే - ఒకటేమో, ముస్లిం సమాజంలోని అధికులు అల్లాహ్ ఆరాధన పట్ల అశ్రద్ధ చూపివున్నారు. దీనికితోడు, వారికి కొంత మంది - ఒక సం॥లో రెండు సార్లు రాత్రి జాగారం చేసి, మూడు నాలుగు రోజులు ఉపవాసముంటే, ఈ ఆరాధన వారి మోక్షానికి, ఇహపరలోకాల సాఫల్యానికి సరిపోతుంది - అని మాయమాటలు చెప్పి వారినింకా భ్రష్టు పట్టించారు.

కాని, వాస్తవానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం), ఆరాధన కోసం ఒక రాత్రిని ప్రత్యేకించుకోవడాన్ని (గట్టిగా) వారించారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “రాత్రిళ్లు నిలబడడం (నమాజు చేయడం)లో కేవలం శుక్రవారం రాత్రిని మరియు ఉపవాసం వుండడానికి శుక్రవారాన్ని ప్రత్యేకించుకోకండి. ఒకవేళ ఎవరైనా ఉపవాసముంటూ, మధ్యలో శుక్రవారం వస్తే అది వేరే విషయం”. *(ముస్లిం : 1144)*

అందుకే, ఏదైనా రాత్రిని ఆరాధన కొరకు ప్రత్యేకించు కోవడం సరైనదైతే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) శుక్రవారం రాత్రి ఆరాధన కోసం ప్రత్యేకించుకోవడానికి అనుమతి ఇచ్చి వుండేవారు. ఎందుకంటే - మొత్తం వారంలోని రాత్రిళ్ళలో శుక్రవారం రాత్రి ఉత్తమమైనది. అయినప్పటికీ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనిని వారించారు. దీని ద్వారా తెలిసేదేమిటంటే - సంవత్సరంలో కేవలం ఒకటి రెండు రాత్రులు ఆరాధనలో గడిపి మిగతా సంవత్సరమంతా దీని పట్ల అశ్రద్ధ చూపడం ఎంతమాత్రం సరికాదు.

స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అలవాటు కూడా ఇదే. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సంవత్సరంలోని ప్రతి రాత్రీ ఆరాధించేవారు. పైగా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితపు ప్రతి క్షణం ఆరాధనలోనే గడిచేది. కనుక మనం కూడా మన జీవితాన్ని ప్రతి క్షణం అల్లాహ్ ఆరాధనలో గడిపేందుకు ప్రయత్నించాలి. ఇది ఎలా సాధ్యపడుతుందంటే – మనం వేసే ప్రతి అడుగు అల్లాహ్ సంకల్పాని కనుగుణంగా వుండాలి. చేసే ప్రతి కార్యం ఆయన మెప్పు కోసం వుండాలి.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రాత్రిళ్ళు నమాజులో ఎంత (సుదీర్ఘంగా) నిలబడేవారంటే ఆయన కాళ్ళలో పగుళ్ళు ఏర్పడేవి. నేను – ఓ దైవ ప్రవక్తా! మీరు ఇలా ఎందుకు చేస్తారు (ఎందుకింతగా కష్టపడతారు)? అల్లాహ్ మీ మునుపటి మరియు రాబోయో తప్పిదాలను మన్నించేశాడుగా అని అనేదాన్ని. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో – (అల్లాహ్ నాకు ప్రసాదించిన దానికిగాను) నేను కృతజ్ఞుడైన దాసుడు కాకూడదా! అని అనేవారు.

*(బుఖారీ : 4837, ముస్లిం : 2820)*

ముగైరా (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రాత్రిళ్ళు (నమాజులో) ఎంత సుదీర్ఘంగా నిలబడేవారంటే ఆయన కాళ్ళు వాచిపోయేవి. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)తో ఇలా అనబడింది: అల్లాహ్ మీ మునుపటి మరియు రాబోయే తప్పిదాలను మన్నించేశాడు. అయినప్పటికీ మీరు ఇంత సుదీర్ఘంగా ఎందుకు నిలబడతారు? ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – నేను కృతజ్ఞుడైన దాసుణ్ణి కాకూడదు మరి! అని అన్నారు .

*(బుఖారీ : 4836, ముస్లిం : 2819)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎల్లప్పటి అలవాటేమిటంటే – ఆయన రాత్రిళ్ళు సుదీర్ఘంగా ఖియాం చేసేవారు. దీనితో ఆయన కాళ్ళలో పగుళ్ళు ఏర్పడేవి లేదా వాపు వచ్చేది. అంతేగానీ సంవత్సరంలో కేవలం రెండు మూడు రోజులు ఇలా చేసేవారు కాదు. మరి జీవితం గడపడానికి ఉత్తమ పద్ధతి కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పద్ధతే.

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) శుక్రవారం ఖుత్బా యందు ఇలా సెలవిచ్చేవారు – స్తోత్రం తర్వాత, (బాగా గుర్తుంచుకోండి!) అన్నిటికన్నా ఉత్తమమైన వాక్కు అల్లాహ్ గ్రంథము, అన్నిటి కన్నా ఉత్తమ పద్ధతి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) పద్ధతి, అన్నింటి కన్నా చెడు కార్యం (ధర్మంలో) క్రొత్తగా ఆవిష్కరించబడేది మరియు ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతే.

*(ముస్లిం : 867)*

దీని ద్వారా తెలిసిందేమిటంటే – అల్లాహ్ గ్రంథం మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ లే అసలు ధర్మం. ఇక వీటికి విరుద్ధంగా ధర్మంలో క్రొత్తగా సృష్టించబడే ప్రతి కార్యం అత్యంత చెడు కార్యమే, అది ప్రజల దృష్టిలో ఎంత గొప్పదైనా సరే. దీని ద్వారా తెలిసిన మరో విషయమేమిటంటే – అల్లాహ్ గ్రంథం మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్ ద్వారా ఆధారం దొరకని కార్యం బిద్అత్ మరియు ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతకు ఆనవాలు. ధర్మంలో 'బిద్దతే హసన' అన్న బిద్అత్ ఏదీ లేదు. బిద్అత్‌లన్నీ మార్గభ్రష్టతే మరియు వీటిని ఆచరించే వారిని అవి మార్గభ్రష్టులుగా చేసేస్తాయి.

## షాబాన్ నెల మరియు ఉపవాసాల మహత్యం

షాబాన్ నెలలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రమజాన్ తప్ప, ఇతర మాసాల కన్నా ఎక్కువగా ఉపవాసాలుండేవారు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిస్తూ వుండేవారు: ఈ నెలలో సత్కార్యాలు పైకి లేపబడతాయి. మరి నా ఆచరణలు (నా) ఉపవాస స్థితిలో పైకి లేపబడటాన్ని నేను ఇష్టపడతాను.

అయినప్పటికీ, ఈ నెలను నాలుగు నిషిద్ధ మాసాలలో చేర్చడం సరైనది కాదు. ఆ మాసాల్లో యుద్ధాలు, హత్యలు రక్తం చిందించడం నిషేధం కాబడ్డాయి.

అందరు విశ్లేషకులు, హదీసు వేత్తలు మరియు విద్వాంసుల ఏకాభిప్రాయం ఏమిటంటే – ఆ నాలుగు నిషిద్ధ మాసాలు – జిల్ ఖాదా, జిల్ హిజ్జ, ముహర్రమ్ మరియు రజబ్‌లు. ఏ విశ్లేషకుడు కూడా షాబాన్ నెలను నిషిద్ధ మాసాల్లో చేర్చలేదు.

ఈ యావత్ నెలలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రత్యేకంగా పాటించిన ఆరాధన ఉపవాసమే. అది కూడా పూర్తి నెల పాటించారు అంతేగాని ఏదో ఒక రోజు ప్రత్యేకంగా కాదు. ఏదో ఒక రోజు ఉపవాసపు శ్రేష్ఠత కూడా వివరించలేదు.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నిరంతరంగా (ఏమాత్రం విడిచిపెట్టకుండా) ఉపవాసాలు వుండేవారు. ఆయన ఉపవాసాన్ని ఇక వదలరేమో అని మేము అనుకునేవాళ్ళం. అలాగే ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒకవేళ ఉపవాసం వదిలేస్తే చాలా రోజుల దాకా మానేసేవారు. చివరికి మాకు – ఆయన ఉపవాసం వుండరేమో అని అనిపించేది. నేను ఆయన్ని – రమజాన్ తప్ప మరే నెలలోనూ పూర్తిగా ఉవవాసముండడం చూడలేదు. నేను ఆయన్ని – షాబాన్ నెల కన్నా ఎక్కువగా మరే నెలలోనూ ఉపవాసాలుండడం చూడలేదు. *(బుఖారీ, ముస్లిం)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) ఇలా కూడా సెలవిచ్చారు:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఉపవాసాల కోసం అన్నిటి కన్నా ప్రియమైన నెల షాబాన్ నెల, తదుపరి ఆయన(సల్లల్లాహు అలైహి వసల్లం) రమజాన్ ఉపవాసాలు వుండేవారు. *(అబూ దావూద్: 2431, సహీహ్ –అల్‌బానీ)*

అలాగే, ఆమె ఇలా కూడా సెలవిచ్చారు: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను షాబాన్ నెలలో కన్నా ఎక్కువగా ఏ నెలలోనూ ఉపవాసాలుండగా చూడలేదు. ఆయన దానిలో (షాబాన్ నెలలో) కొద్ది రోజులు తప్ప అన్ని రోజులు ఉపవాసముండేవారు, పైగా ఆయన దానిలో పూర్తిగానే ఉపవాసముండేవారు. *(తిర్మిజీ : 736, సహీహ్– అల్‌బానీ)*

అంతేగాక, ఉమ్మె సలమా (రజి అల్లాహు అన్హా) కథనం:

నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను రెండు నెలలు నిరంతరంగా ఉపవాసముండడం చూడలేదు. కేవలం షాబాన్ మరియు రమజాన్ నెలల్లో తప్ప. *(తిర్మిజీ : 736, సహీహ్– అల్‌బానీ)*

## షాబాన్ నెలలో ఎక్కువగా ఉపవాసముండడంలో దాగి వున్న మర్మం

ఉసామా బిన్ జైద్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను – నేను మిమ్మల్ని షాబాన్ నెలలో ఉపవాసమున్నంతగా మరే నెలలోనూ చూడలేదు (కారణం ఏమిటి?) అని అడిగారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – రజబ్ మరియు రమజాన్ నెలల మధ్య ప్రజలు ఉపవాసాల గురించి అశ్రద్ధ చూపే నెల ఇది. మరి చూడబోతే, ఈ నెలలోనే ఆచరణలు అల్లాహ్ వైపునకు లేపబడతాయి. మరి నా ఆచరణలు (నేను) ఉపవాసం వున్న స్థితిలో పైకి లేపబడటాన్ని నేను ఇష్ట పడతాను అని అన్నారు.

ఈ హదీసులన్నింటి ద్వారా తెలిసిన విషయమేమిటంటే – ఈ నెలలో అధికంగా ఉపవాసాలు ఉండాలి.

## షబే బరాత్ గురించి ఏది సత్యం? ఏది అసత్యం?

షాబాన్ నెలలో ఉపవాసాల మహత్యం గురించి తెలుసుకున్నాక ఉదయించే ఒక ప్రశ్న ఏమిటంటే – ఈ నెల 15వ తారీఖు ప్రాముఖ్యత ఏమిటి మరి?

వాస్తవం ఏమిటంటే – సత్యాసత్యాల గురించి ఏమాత్రం పట్టించుకో కుండా ఏ 3,4 విశిష్ఠ రాత్రుల గురించి వివరించడం జరుగుతూ వుంటుందో, వాటిలో షాబాన్ నెల 15వ తారీఖు రాత్రి కూడా ఒకటి. సాధారణంగా దీనిని 'షబే బరాత్' అని అంటూ వుంటారు.

ఈ రాత్రి గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఈ ప్రవచనం ప్రామాణిక పరంపరతో ఉల్లేఖించబడింది:

అల్లాహ్ – షాబాన్ నెల 15వ తేదీ రాత్రి తన సృష్టితాల వైపునకు (దయతో) చూస్తాడు. తదుపరి బహుదైవారాధకుడు (ముష్రిక్) మరియు అసూయా పరుడు తప్ప మిగతా సృష్టితాలను అందరినీ క్షమిస్తాడు.

*(తిర్మిజి, ఇబ్నె హిబ్బాన్, బైహఖీ)*

ఈ కాలపు హదీసువేత్త అయిన షేఖ్ అల్‌బానీ రహిమహుల్లాహ్ ఈ హదీసుకు సంబంధించిన వేర్వేరు పరంపరలు పేర్కొన్న తర్వాత ఇలా

వివరించారు:"దీని సారాంశం ఏమిటంటే – ఈ హదీసు దీని వేర్వేరు పరంపరలతో కలిసి నిస్సందేహంగా ప్రామాణికమైనది (సహీహ్)."

*(అస్సహీహా : 1144)*

మరో ఉల్లేఖనంలో పదాలు ఇలా వున్నాయి:

నిశ్చయంగా అల్లాహ్, షాబాన్ నెల 15వ తేదీ రాత్రి దాసులపై కరుణతో (దయతో) చూస్తాడు. నిజమైన విశ్వాసులు (మోమిన్)ను క్షమిస్తాడు, అవిశ్వాసులకు గడువు ఇస్తాడు మరియు అసూయాపరులను వారి మనసులను అసూయ నుండి శుద్ధి చేసుకొనే వరకు వదిలేస్తాడు.

*(సహీహుల్ జామె లిల్ అల్బానీ : 1898)*

ప్రియతమ సోదరులారా!

షాబాన్ 15వ తేదీ రాత్రి మహత్యాన్ని వివరించే ఒకే ఒక్క ప్రామాణిక హదీసు ఇది. ఇది తప్ప సాధారణంగా ఈ రాత్రి మహత్యాన్ని గురించి ధార్మిక సమ్మేళనాల్లో, పత్రికల్లో వివరించబడే హదీసులన్నీ అత్యంత బలహీనమైనవేకాక, కాల్పనికమైనవి కూడా. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) షరీయతు ఇలాంటి పనికిమాలిన మాటల నుండి ఎంతో పరిశుద్ధంగా వుంది.

షబే బరాత్‌ను పురస్కరించుకొని సాధారణంగా పేర్కొనబడే బలహీన, కాల్పనిక హదీసులలో కొన్ని ఇవి:

(1) "షాబాన్ నా మాసం మరియు రమజాన్ అల్లాహ్ మాసం"

*(జయీఫుల్ జామె – అల్బానీ : 3402, మౌజూ)*

దీనిని అల్బానీ రహిమహుల్లాహ్ కాల్పనికమైనది (మౌజూ)గా ఖరారు చేశారు.

(2) పేర్కొనబడే మరో ఉల్లేఖనం ఏమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక రాత్రి ఆయెషా (రజి అల్లాహు అన్హా) ఇంట్లో వున్నారు. అకస్మాత్తుగా ఆయన అక్కణ్ణుంచి బయలుదేరారు. ఆయెషా (రజి అల్లాహు అన్హా) కూడా ఆయన వెనుకనే వెళ్ళిచూస్తే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) బఖీ (మదీనా స్మశాన వాటిక)లో వున్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆమెను చూసి – (ఓ ఆయెషా!) అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నీపై దౌర్జన్యం చేస్తారని శంకించావా?

అని అడిగారు. ఆమె – ఓ దైవ ప్రవక్తా! బహుశా మీరు మీ సతీమణులలో, ఎవరో ఒకరి ఇంటికి వెళ్ళారన్న అనుమానం కలిగింది అని అన్నారు. దీనిపై ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)– నిశ్చయంగా అల్లాహ్, షాబాన్ 15వ రాత్రి ఇహలోకపు ఆకాశానికి విచ్చేస్తాడు – తదుపరి 'బనూ కల్బ్' తెగ మేకల వెంట్రుకలకు సరిసమానంగా మానవులను క్షమిస్తాడు.

*(తిర్మిజి: 739, ఇబ్నె మాజ : 1389, జయీఫ్– అల్‌బానీ)*

ఇతర ఇమాములతోపాటు స్వయానా ఇమామ్ తిర్మిజి కూడా ఈ హదీసును ఉల్లేఖించిన తర్వాత దీని బలహీనత ను సూచించారు. పైగా ఆయన ఇమామ్ బుఖారీ ద్వారా – ఆయన దీనిని బలహీనమైనదని అనేవారని – ఉల్లేఖించారు.

ఇక్కడ తెలుసుకోవాల్సిన ఒక విషయమేమిటంటే –

ఆయెషా (రజి అల్లాహు అన్హ) వివరించిన వృత్తాంతము – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బఖీ వెళ్ళి అక్కడి వారి కోసం ప్రార్థించడం– మాత్రం ప్రామాణికమైనది. సహీహ్ ముస్లిం వగైరా॥ గ్రంథాల్లో దీని గురించి వివరంగా వుంది. కానీ, దానిలో షాబాన్ నెల 15వ తేదీ రాత్రి గురించి ఏ మాత్రం లేదు. ఆ ప్రామాణికమైన పూర్తి వృత్తాంతం ఇలా వుంది–

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఓ రాత్రి నా ఇంట్లో వున్నారు. తను కప్పుకొని వున్న దుప్పటిని, బూట్లను ఆయన తీసి ఆయన తలకు దగ్గరగా పెట్టారు. ఆయన ధరించివున్న దుప్పటి లోని కొంత భాగాన్ని పరుపుపై వేసి నడుంవాల్చారు. ఇలా కొంత సమయం దాటాక నేను నిద్రపోయానని ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) భావించి మెల్లగా తన దుప్పటిని తీసుకొని, బూట్లు ధరించి, తలుపు తెరిచి బయటికి వెళ్ళి తలుపును మెల్లగా మూసేశారు.

తదుపరి నేను లేచాను. నా శిరస్త్రాణం తలపై ధరించి, ఓణీ కప్పుకొని, దుప్పటి మడుచుకొని నేను కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) వెనుక వెళ్ళాను. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) బఖీ లోకి వెళ్ళారు. అక్కడ చాలా సేపు నిలబడివున్నారు. ఈ తరుణంలో మూడు సార్లు తన చేతుల్ని (దుఆ కోసం) పైకెత్తారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెను తిరగగా, నేను కూడా తిరిగాను. ఆయన త్వరత్వరగా నడుస్తే, నేను కూడా

త్వరత్వరగా నడుస్తూ, ఆయన మెల్లగా పరుగెత్తితే నేను కూడా మెల్లగా పరుగెత్తుతూ, ఆయన వేగంగా పరుగెత్తితే నేను కూడా వేగంగా పరుగెత్తుతూ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కన్నా ముందుగా ఇంటికి వచ్చేశాను. కాసేపటికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా విచ్చేశారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ఓ ఆయెషా! ఏమయ్యింది నీకు, నీ శ్వాస ఎందుకు పెరిగి వుంది? అని అడిగారు. నేను – (అబ్బే) అలాంటి దేమీ లేదు అని అన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – స్వయంగా నీవైనా చెప్పు, లేదా అన్నీ తెలిసినవాడు, అత్యంత సూక్ష్మగ్రాహి అయిన అల్లాహ్ నాకంతా చెప్పేస్తాడు అని అన్నారు.

నేను – నా తల్లిదండ్రులు మీకు అర్పితం! అని తదుపరి ఆయన కంతా వివరించాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – నాకు ముందుగా ఒక ఛాయ కదలడం నేను చూశాను. ఆ ఛాయ నీదా? అని అన్నారు. నేను – అవును అని అన్నాను.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అర చేత్తో నా ఛాతీ మీద కొట్టారు. దీనికి నాకు కాస్త నొప్పి కలిగింది – తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నీపై దౌర్జన్యం చేస్తారని నీ అభిప్రాయమా? అని అన్నారు.

నేను (నా మనస్సులో) అనుకున్నాను – జనాలు ఎంతగా దాచిపెట్టినా అల్లాహ్ మాత్రం అన్నీ తెలిసినవాడు, వాస్తవానికి అల్లాహ్ సమస్తం ఎరిగినవాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు: నువ్వు నన్ను చూసిన సమయంలో జిబ్రయీల్ (అలైహిస్సలాం) నా దగ్గరి కొచ్చారు, ఆయన నీకు కనపడకుండా మెల్లగా నన్ను పిలిచారు. నేను కూడా నీకు కనపడకుండా మెల్లగా జవాబిచ్చాను. నువ్వు లోదుస్తులు తీసి వుండడంతో ఆయన లోపలికి రాలేక పోయారు. నేనేమో నీవు నిద్రపోయావని భావించాను.

అందుకే నిన్ను లేపడం మంచిది కాదని భావించాను. అదిగాక నేను లేకపోవడం మూలంగా నువ్వు భయపడతావేమో అని అనుకున్నాను. (ఈ లోగా) జిబ్రయీల్ (అలైహిస్సలాం) నాతో – 'మీరు బఖీ దగ్గరికి వచ్చి బఖీ వాసుల మన్నింపు కోసం ప్రార్థించమని మీ ప్రభువు ఆజ్ఞాపించాడు' అని అన్నారు.

నేను (ఆయెషా రజి అల్లాహు అన్హా) – నేను వారి కోసం ఏమని ప్రార్థించనూ అని అడిగాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – నువ్వు ఈ విధంగా పలుకు అని అన్నారు : "అస్సలాము అలా అహ్లిద్దియారి మినల్ మోమినీన వల్ ముస్లిమీన్, వ యర్‌హముల్లాహుల్ ముస్తఖ్‌దిమీన మిన్నా వల్ ముస్త ఆఖిరీన్, వ ఇన్నా ఇన్షాఅల్లాహు బికుమ్ లలాహికూన్".

*(ముస్లిం : 974)*

కనుక రుజువైనదేమిటంటే – బఖీ వృత్తాంతానికీ, షాబాన్ నెల 15వ తేదీ రాత్రికి ఏ విధమైన సంబంధం లేదు. దీని గురించి ఒక్క సహీహ్ హదీసులో కూడా వివరించబడలేదు. అందుకే బలహీన (జయీఫ్) హదీసులను ఆధారంగా చేసుకొని ఈ రాత్రిగానీ, దాని తర్వాత రోజు గానీ స్మశానానికి వెళ్ళడం సున్నత్ అని విశ్వాసముంచడం సరైనది కాదు.

(3) షాబాన్ నెల 15వ తేదీ రాత్రి మీరు (ఆరాధనలో) నిలబడండి (జాగారణ చేయండి) మరియు మరుసటి రోజు ఉపవాసం ఉండండి. ఎందుకంటే – ఆ రోజు (షాబాన్ 15వ తేదీ) సాయంత్రం కాగానే అల్లాహ్ ఇహలోక ఆకాశంపైకి వచ్చి ఇలా ప్రకటిస్తాడు– ఎవరైనా మన్నింపు కోరుకొనే వారున్నారా? వారిని నేను మన్నిస్తాను. ఎవరైనా ఉపాధి కోరుకొనే వారున్నారా? నేను వారికి ఉపాధి ప్రసాదిస్తాను. ఎవరైనా వ్యాధిగ్రస్తులై వున్నారా? వారికి నేను ఆరోగ్యాన్ని ప్రసాదిస్తాను. ఎవరైనా (ఏదైనా) అడిగే వారున్నారా? వారికది నేను ప్రసాదిస్తాను. ఎవరైనా.....ఎవరైనా......ఇలా ఫజర్ సమయం వరకూ (ప్రకటిస్తూనే వుంటాడు) *(జయీఫ్ అల్ జామె – అల్‌బానీ : 602. మౌజూ)*

ఈ హదీసు కూడా కాల్పనిక, తప్పుడు హదీసు.

దీనికి విరుద్ధంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా ప్రామాణికంగా ఉల్లేఖించబడిన ఈ హదీసును వివరిస్తూ వుండాలి.

"ఎంతో శుభవంతుడైన మన ప్రభువు ప్రతి రాత్రి మూడింట ఒక వంతు మిగిలి వున్నప్పుడు ఇహలోకపు ఆకాశంపైకి అవతరిస్తాడు. తదుపరి ఇలా ప్రకటిస్తాడు – నన్ను ప్రార్థించేవారు ఎవరున్నారు? నేను వారి ప్రార్థనలను స్వీకరిస్తాను. నన్ను ఏదైనా (కావాలని) అడిగేవారు ఎవరున్నారు? నేను వారికది ప్రసాదిస్తాను. నా మన్నింపు కోరుకొనేవారు ఎవరున్నారు? నేను వారిని మన్నిస్తాను".

ముస్లిం లోని మరొక ఉల్లేఖనంలో అదనంగా ఇలా వుంది – ఇలా (ఈ ప్రకటన) ఫజర్ వేళ వరకు కొనసాగుతూనే వుంటుంది.

*(బుఖారీ : 1145, 6321, 7494 ముస్లిం : 758)*

ఈ హదీసు ద్వారా – ప్రతి రాత్రికీ ఈ మహత్యం ఉందని తెలుస్తుంది. మరలాంటప్పుడు దీనిని కేవలం షాబాన్ నెల 15వ రాత్రికి ప్రత్యేకించడం తప్పు మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పై అభాండం మోపడమే అవుతుంది.

(4) అలీ (రజి అల్లాహు అన్హు) హదీసు: దీనిలో ఆయన వివరించిన దేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) షాబాన్ నెల 15వ రాత్రి 14 రకాతులు చదివారు. తదుపరి ఆయన కొన్ని సూరాలను పఠించారు. ఆ తర్వాత ఇలా సెలవిచ్చారు – నేను చేసినట్లే ఎవరైనా చేస్తే (ఇలాగే ఆచరిస్తే) స్వీకరించబడిన 20 హజ్‌లు మరియు 20 సం॥ల ఉపవాసాలకు లభించే అంత పుణ్యం లభిస్తుంది.

ఇబ్నుల్ జౌజి ఈ హదీసును అల్ మౌజుఆత్'లో సంగ్రహించి దీనిపై ఇలా వ్యాఖ్యానించారు: ఈ హదీసు కూడా కాల్పనికమైనది. దీని పరంపర కూడా అత్యంత చెడ్డగా వుంది. *(అల్ మౌజుఆత్ : 2వ సంపుటం, 445వ పేజి)*

ఇమామ్ సుయూతీ ఇలా వివరించారు: ఈ హదీసును బైహఖీ 'షోబుల్ ఈమాన్' లో ఉల్లేఖించారు. దాదాపుగా ఇది కాల్పనికమైన తప్పుడు హదీసు.

*(తన్జీఉష్షరియ లి ఇబ్నె ఇరాక్ : 2వ సంపుటం, 94వ పేజీ)*

(5) సలాతుల్ అల్ఫియ– దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అలీ (రజి అల్లాహు అన్హు)కు ఇలా వివరించారు:

ఏ వ్యక్తి అయినా ఈ రాత్రి 100 రకాతుల నమాజులు చదివి – ప్రతి రకాతులో ఫాతిహా సూరా తర్వాత ఇఖ్లాస్ సూరా 10 సార్లు చదివితే – అల్లాహ్ అతని కోరికలన్నింటినీ నెరవేరుస్తాడు. ఒకవేళ 'లౌహె మహ్ఫూజ్' లో అతను దురదృష్టవంతుడని వ్రాయబడివున్నప్పటికీ, అల్లాహ్ దానిని చెరిపేసి అదృష్టవంతుడని వ్రాస్తాడు......మరియు రాబోయే 1 సం॥ పాటు అతని పాపాలను లిఖించడం జరగదు.

“అల్ మౌజుఆత్”లో ఇబ్నుల్ జౌజి ఈ హదీసును గూర్చి ఎన్నో పరంపరలను పేర్కొన్న తర్వాత ఇలా వివరించారు :

ఈ హదీసు ఒక కాల్పనిక, తప్పుడు హదీసు అవడంలో ఏమాత్రం సందేహం లేదు. దీనిలోని చాలా మంది ఉల్లేఖకులు అపరిచితులు మరియు కొందరైతే అతి బలహీన ఉల్లేఖకులు. ఈ స్థితిలో ఈ హదీసును దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా ఉల్లేఖించడం అసంభవం. మేము ఎంతో మందిని ఈ నమాజును చదువుతుండగా చూశాం. తక్కువ వ్యవధి కలిగిన రాత్రుళ్ళలో వీరు ఈ నమాజ్‌ను చదివి నిద్రపోతారు. దీనితో వీరి ఫజర్ నమాజు నెరవేరదు. పైగా, మసీదులకు చెందిన అజ్ఞాన ఇమాములు ఈ నమాజును మరియు ఇలాగే ‘సలాతుర్రగాయిబ్’ ను కేవలం ప్రజలను సమీకరించడానికి మరియు దీని ద్వారా (ఏదైనా) ప్రత్యేక హోదా పొందడానికి సాధనంగా చేసుకున్నారు. కథలు చెప్పేవారు సైతం తమ సమూహాల్లో ఈ నమాజును గూర్చే వివరిస్తూ వుంటారు. వాస్తవానికి ఇవన్నీ సత్యానికి చాలా దూరంగా వున్నాయి. *(అల్ మౌజుఆత్ : 2వ సంపుటం, 440-443 పేజీలు)*

ఇమామ్ నవవీ ఇలా సెలవిచ్చారు: ‘సలాతుర్రగాయిబ్’ గా పేరుగాంచి, రజబ్ నెల మొదటి రాత్రి మగ్రిబ్ – ఇషాల మధ్య 12 రకాతులుగా చదవబడే నమాజ్ మరియు షాబాన్ నెల 15వ రాత్రి 100 రకాతులుగా చదవబడే నమాజ్– ఈ రెండు నమాజులు ఎంతో నీచమైన బిద్అత్‌లు. కనుక ‘ఖువ్వతుల్ ఖులూబ్’ మరియు ‘ఇహ్యా ఉలూమిద్దీన్’ లాంటి గ్రంథాల్లో వీటి వివరణ చూసి మోసానికి గురికావద్దు. అంతేగాక, వీటికి సంబంధించి ఉల్లేఖించబడ్డ హదీసులను చూసి మోసపోవద్దు. ఎందుకంటే – అవన్నీ పూర్తిగా అసత్యం గనుక. *(అల్ మజ్మూఅ లిన్నవవీ : 3వ సంపుటం, 379వ పేజీ)*

ఇమామ్ షౌకానీ ఇలా వివరించారు : ఇదొక కాల్పనిక తప్పుడు హదీసు. దీనిలో వచ్చిన పుణ్యానికి సంబంధించిన పదజాలం ద్వారా (ఇదొక కాల్పనిక హదీసని) స్పష్టంగా తెలుస్తుంది. (అంతేగాక) బుద్ధి జ్ఞానాలున్న ఏ ఒక్కరు కూడా దీని కాల్పనికతను గూర్చి సందేహించరు. పైగా దీని ఉల్లేఖకులు గూడా అపరిచితులు. *(ఫవాయెద్ అల్ మజ్మూఅ : 53వ పేజీ)*

ఆయన ఇంకా ఇలా వివరించారు:

ధార్మిక పరిజ్ఞానులు, విశ్లేషకుల ఒక సమూహం – ఉదా॥కు 'ఇహ్యా' గ్రంథకర్త – ఈ హదీసు విషయంలో పొరపాటుకు లోనయ్యింది. వాస్తవానికి– షాబాన్ నెల 15వ రాత్రి గురించి వివిధ పరంపరలతో ఉల్లేఖించబడ్డ హదీసులన్నీ కాల్పనిక, తప్పుడు హదీసులే. *(అల్ ఫవాయిదుల్ మజ్మూఅ : 53వ పేజీ)*

ముల్లా అలీ ఖారీ ఈ హదీసు గురించి వ్యాఖ్యానిస్తూ ఇలా పేర్కొన్నారు: ఈ నమాజు గురించి బలహీన, కాల్పనిక హదీసులు తప్ప మరేమీ ఉల్లేఖించబడలేదు. అందుకే 'ఖువ్వతుల్ ఖులూబ్', 'ఇహ్యా ఉలూమిద్దీన్' గ్రంథకర్తలు దీనిని సంగ్రహించడం గురించి మీరు మోసానికి గురి కావద్దు.

ఇంకా ఆయన ఇలా కూడా వివరించారు :

ఈ బిద్అత్ నమాజ్ మొట్టమొదటగా 448 హి.శ.లో బైతుల్ మఖ్దిస్ నందు సృష్టించబడింది. అగ్ని పూజారులు కొందరు ఇస్లాం స్వీకరించారప్పుడు. వాళ్ళు ముస్లిములతో కలసి నమాజు చేసేటప్పుడు తమ ముందు అగ్నిని మండించేవారు. ఇలా వాళ్ళు ముస్లిములను కూడా సంతృప్తి పరచేవారు మరియు తమ భ్రష్ట విశ్వాసాలపై కూడా ఆచరించేవారు. వీళ్ళు సలాతుల్ అల్ఫియ నమాజును కూడా ఆవిష్కరించారు. షాబాన్ నెల 15వ రాత్రి వాళ్ళు నమాజు చదువుతూ తమ ముందు అగ్ని మండించేవారు. దీని ద్వారా వారి ఉద్దేశ్యం – అగ్ని ముందు ఎక్కువ సేపు గౌరవంగా నిలవడడం. ఇంకా ఈ అగ్నిని ఆసరాగా చేసుకొని దీని ముసుగులో ఎన్నో చెడు పనులు చేసేవారు. దీనితో ఆ సమయంలోని సజ్జనులు–వీళ్ళు భూమిలోకి దిగద్రొక్కబడతారేమో అని భయపడ్డారు. అందుకే వారు –ఈ బిద్అత్ ఆచరించబడుతున్న ప్రదేశం వదిలి దూరంగా వెళ్ళిపోయారు. అంతేగాక, దీని ముసుగులో వారు ఎన్నో నిషేధ కార్యాలను కూడా చేసేవారు.

*(తొహ్ఫతుల్ అహ్వజి– 3వ సంపుటం, 165వ పేజీ)*

ఎంతో బాధాకరమైన విషయమేమిటంటే అగ్నిపూజారుల ద్వారా హిజ్రీ 5వ శతాబ్దంలో ఆవిష్కరించబడి, దాని మహత్యం గురించి కాల్పనిక హదీసులు సృష్టించబడ్డ నమాజును ఈ రోజు ముస్లిములు షాబాన్ నెల 15వ రాత్రి ప్రత్యేకంగా నెలకొల్పుతారు మరియు ఎంతో జోరుగా ఈ తప్పుడు హదీసులను వివరిస్తారు.

ఈ హదీసు మరియు దీని లాంటి మరెన్నో హదీసులు నిస్సందేహంగా అతి బలహీన మరియు కాల్పనిక హదీసులు. ఇమాములలో ఉదా॥కు షౌకానీ, ఇబ్నుల్ జౌజి, ఇబ్నె హిబ్బాన్, ఖుర్తుబీ, సుయూతీ మొ॥ వారు ఈ ఉల్లేఖనా లన్నింటినీ నమ్మదగ్గవి కావని ఖరారు చేశారు. మరిన్ని వివరాల కోసం- అల్ ఫవాయద్ అల్ మజ్మూఅ, అల్ మౌజుఅత్ అల్ కుబ్ర, తఫ్సీర్ అల్ ఖుర్తుబీ, అల్ అల్లాలి అల్ మస్నూఅ లను చూడవచ్చు.

కనుక, (ధర్మ) ప్రచార క్షేత్రంలో వున్నవారు- పరంపరల రీత్యా ప్రామాణి కంగా లేని ఈ (కాల్పనిక) ఉల్లేఖనాలను (ఇతరులకు) వివరించడం నుండి మరియు ముద్రించి పంచి పెట్టడం నుండి దూరంగా వుండాలి.

ఏదైనా హదీసును (ఇతరులకు) వివరించడానికి ముందు, దాని పరం పరను గూర్చి అన్వేషించడం ఖచ్చితంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసుకు సేవ చేయడమే అవుతుంది. అలా కాని పక్షంలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఈ హెచ్చరిక ఎల్లప్పుడూ గుర్తుపెట్టు కోవాలి:

"ఎవరైనా, నేను చెప్పని మాటను నాకు ఆపాదిస్తే, అతను తన నివాసాన్ని నరకంలో ఏర్పరచుకోవాలి". *(బుఖారీ : 109)*

## షబే బరాత్‌లో ఏం చేయాలి?

ఇప్పుడు ఉదయించే ప్రశ్న ఏమిటంటే-షాబాన్ 15వ తేదీ రాత్రి మహ త్యాన్ని గురించి ఉల్లేఖించబడ్డ ప్రామాణిక హదీసు - "అల్లాహ్ షాబాన్ 15వ రాత్రి తన సృష్టితాల వైపు (దయతో) చూస్తాడు. తదుపరి బహుదైవారాధకుడు, అసూయపరులను తప్ప మిగతా అందరినీ క్షమిస్తాడు"- లో సమావేశాలు ఏర్పాటు చేయడం గురించి వుందా? లేక ఏదైనా ప్రత్యేక ఆరాధన గురించి వుందా? లేదా ఈ హదీసులో దీపాలు వెలిగించి, బాణసంచా కాల్చమని వచ్చిందా? ఈ ప్రశ్నలకు జవాబు - పనికిమాలిన, కాల్పనిక ఉల్లేఖనాలను విడిచి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి స్వచ్ఛమైన షరీయతుపై విశ్వాసం వుంచే ప్రతి ఒక్కడూ ఇవ్వగలడు. ఈ హదీసును న్యాయంగా గనక పరిశీలిస్తే విశదమయ్యే విషయమేమిటంటే- ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనిలో ఎలాంటి సమావేశం గురించి గానీ, ప్రత్యేక ఆరాధన గురించి

గానీ, దీపాలంకరణ చేసి బాణసంచా కాల్చడం గురించి గానీ ప్రస్తావించలేదు. పైగా ప్రస్తావించింది కేవలం ఏమిటంటే –అల్లాహ్ యొక్క సువిశాల మన్నింపు గురించి. తమ విశ్వాసంలో షిర్క్‌ను చేర్చనివారు, స్వీయ శతృత్వ కారణంతో తోటి ముస్లిం పట్ల ఈర్ష్య, అసూయ కలిగి వుండని వాళ్లు దీనికి అర్హులు.

అందుకే, ఈ రాత్రిలోని సువిశాల మన్నింపు యొక్క అర్హత పొందాలంటే– మనిషి ముందుగా తన విశ్వాసాన్ని సరిచేసుకోవాలి. లాభ నష్టాల యజమాని కేవలం అల్లాహ్‌యే అని గట్టిగా విశ్వసించాలి. కష్టాలను తీర్చేవాడు కూడా కేవలం ఆయనే అని విశ్వసించి కేవలం ఆయనపైనే నమ్మకం వుంచాలి. తమ ఆశలు నెరవేర్చే కేంద్రంగా దర్బారులను, మజార్లను కాక కేవలం అల్లాహ్‌ను చేసుకోవాలి. పీర్లకు, సన్యాసులకు భయపడకుండా కేవలం అల్లాహ్‌కే భయ పడాలి. మ్రొక్కుబడులు కూడా కేవలం అల్లాహ్‌తోనే చేసుకోవాలి. ఆయనను తప్ప మరెవరినీ వేడుకోకూడదు. దీనితోపాటు, తోటి ముస్లిముల పట్ల ఈర్ష్య, అసూయలను వదిలి హృదయాన్ని శుభ్రం చేసుకోవాలి. మనిషి సాఫల్యానికి ఇవి ఎంతో అవసరమైన విషయాలు. ఇక దీపాలంకరణ చేసి బాణసంచా కాల్చడమైతే వృధా ఖర్చే. కనుక మన ధర్మం వారించిన ఈ విషయం నుండి గూడా దూరంగా వుండడం తప్పనిసరి.

ఎంతో దురదృష్టకరమైన విషయం ఏమిటంటే – షాబాన్ 15వ తేదీ రాత్రి మహత్యం గురించి ప్రస్తావిస్తూ ప్రత్యేకంగా వివరించినదేమిటంటే – ముష్రిక్ మరియు అసూయపరులను అల్లాహ్ క్షమించడు. వారు తప్ప మిగతా అందరిని ఆయన క్షమిస్తాడు.

మరి ఈ రోజును ఎంతో మంది ప్రత్యేకంగా జరుపుకొంటారు. షబే బరాత్‌ను పురస్కరించుకొని సమావేశాలు నిర్వహించ బడతాయి, వాటిలో ఈ రాత్రి మహత్యం గురించి కాల్పనిక, తప్పుడు హదీసులు వివరించడంతోపాటు, 'నాత్' పఠించేవారు మరియు వక్తలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను వేడుకుంటారు. సహాయం కోసం ఆయనను అర్థిస్తారు. ఒక్కమాటలో చెప్పాలంటే – బాహాటంగా షిర్క్ చేస్తూ 'అల్లాహ్ క్షమాపణ'పై ఆశపెట్టుకుంటారు!

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసుకు ఆచరణ రీత్యా పరిహాసమాడబడుతుంది. మరి చూస్తే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)

చాలా స్పష్టంగా – ముష్రిక్‌ను క్షమించడం జరుగదు అని సెలవిచ్చివున్నారు. అయినప్పటికీ (షిర్క్ చేస్తూ) ఈ రాత్రి – నరకాగ్ని నుండి స్వేచ్ఛ పొందడానికి అనుమతి లభించిందని అనుకుంటారు.

ఎంత విచిత్ర పరిస్థితి ఇది! షిర్క్ నుండి పూర్తిగా పశ్చాత్తాప పడాల్సింది పోయి దీనిని క్రియాత్మకంగా ఆచరణలో పెట్టి దీని వైపునకు ప్రజలను ఆహ్వానించడం జరుగుతుంది!

## షబే బరాత్ 'మన్నింపు రాత్రి' అయితే మరి దానిలో ఎందుకు ఆరాధించ కూడదు?

ఎవరైనా ఇలా ప్రశ్నించవచ్చు– ఈ రాత్రి మన్నింపుల రాత్రి అని స్వయంగా రుజువు చేశారు. మరి ఈ రాత్రి ప్రత్యేకంగా ఆరాధిస్తే వచ్చిన నష్టమేంటి?

దీనికి మా జవాబు ఏమిటంటే– దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అల్లాహ్ మనకోసం ఆదర్శవంతునిగా ఖరారు చేశాడు. దీని అర్థం ఏమిటంటే– మనం ప్రతి రంగంలోనూ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అడుగుజాడల్లో నడుస్తూ ఆయనను అనుసరించాలి. అందుకే ఏ సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ ఆరాధన చేశారు అన్న విషయం చూడాలి. ఇలా, మనం హదీసు గ్రంథాలు మరియు ఆయన జీవిత చరిత్రను వివరించే గ్రంథాలను తిరగేస్తే మనకు తెలిసే విషయం ఏమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ రాత్రి ప్రత్యేకంగా ఏమీ ఆరాధించలేదు, ప్రత్యేకంగా దీనిని జరుపుకోలేదు, సహాబాలను గూడా దీని గూర్చి ప్రోత్సహించలేదు.

అందుకే, మన ప్రియతమ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనిని చేయలేదు కాబట్టి మనం కూడా చేయకూడదు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనిని (ఈ రాత్రిని ఉత్సవంగా) జరుపుకోలేదు కాబట్టి మనం కూడా జరుపుకోకూడదు.

హాఫిజ్ ఇబ్నె రజబ్ ఇలా పేర్కొన్నారు: షాబాన్ 15వ రాత్రి ఖియాం మహత్యం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు సహాబాల ద్వారా ఏదియూ (ప్రామాణికంగా) నిర్ధారించబడలేదు. *(లతాయిఫుల్ మారిఫ్)*

ఇమామ్ అబూ బక్ర్ తర్‌తూషీ, జైద్ బిన్ అస్లం(తాబయీ) ద్వారా ఇలా ఉల్లేఖించారు: మేము మా గురువులనూ, ధార్మిక పరిజ్ఞానులనూ షాబాన్ 15వ రాత్రి వైపునకు గానీ, మక్‌హూల్ వివరించిన హదీసు వైపునకు గానీ మ్రొగ్గు చూపడం చూడలేదు. అంతేగాక వారు ఈ రాత్రి ఔన్నత్యం వేరే రాత్రుల కన్నా ఎక్కువైనదని కూడా విశ్వసించేవారు కాదు.

ఇబ్నె అబీ మలైకాకు ఓసారి– జియాద్ అనే కథలు చెప్పేవాడొకడు ప్రజలతో ఈ రాత్రి ప్రతిఫలం లైలతుల్ ఖద్ర్ ప్రతిఫలానికి సమానం అని చెబుతూ వుంటాడు – అని చెప్పబడింది. దీనికి ఆయన– నేను గనక వాడి ద్వారా ఈ మాట వింటే, నా చేతిలో కర్ర గనక వుంటే వాణ్ణి తప్పకుండా శిక్షిస్తాను అని అన్నారు. *(అల్ హవాదిస్ వల్ దిద్అ)*

చర్చ సారాంశమేమిటంటే – షాబాన్ నెల 15వ రాత్రి ఆరాధన మహత్యం గురించి ఏదియూ (ప్రామాణికంగా) నిర్ధారించబడలేదు. దీని గురించి వివరించబడే విషయాలన్నీ అసత్యాలు మరియు కల్పితమైనవి.

ఆలోచించదగ్గ మరో విషయమేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) షాబాన్ 15వ రాత్రి మహత్యం గురించి–"అల్లాహ్ తన దాసులపై ప్రత్యేకంగా దృష్టి సారించి ముష్రిక్ మరియు అసూయపరులను తప్ప అందరినీ క్షమిస్తాడు"– అని ఏదైతే సెలవీయబడిందో, అదే మహత్యం సోమవారం మరియు గురు వారాలకు గూడా ఇవ్వబడింది. దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

ప్రతి సోమ మరియు గురువారాల్లో స్వర్గపు ద్వారాలు తెరవబడతాయి. తదుపరి షిర్క్ చేయని, తన సోదరుని పట్ల ఈర్ష్య, అసూయ కలిగి వుండని ప్రతి వ్యక్తిని క్షమించడం జరుగుతుంది. తమ మధ్య ఈర్ష్య, అసూయ కలిగివున్న ఇద్దరు వ్యక్తులు సంధి చేసుకొనే వరకు వారికి వ్యవధి నివ్వడం జరుగుతుంది. *(ముస్లిం : 2565)*

కనుక షాబాన్ నెల 15వ తేదీ రాత్రి మన్నింపు హదీసును – ప్రత్యేకంగా ఈ రాత్రిని (ఉత్సవంగా) జరుపుకోవడానికి, సమావేశాలు ఏర్పాటు చేయడానికి, ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి ఆధారంగా చేయలేం. ఒకవేళ ఈ కార్యాలన్నింటికీ దానిని (ఆ హదీసును) ఆధారంగా తీసుకుంటే మరి అలాంటి మహత్యమే సోమ, గురువారాలకు కూడా ఇవ్వబడింది. కనుక, షబే బరాత్‌ను జరుపుకొనే

వారు సోమ, గురువారాలను కూడా ప్రత్యేకంగా జరుపుకుంటారా మరి? ఆ రోజుల్లో కూడా ప్రత్యేకంగా సమావేశాలు ఏర్పాటు చేస్తారా?

అల్లాహ్ మనందరినీ క్షమించుగాక! మనందరినీ సత్యాన్ని అర్థం చేసుకొని దానికనుగుణంగా ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక! మరియు అసత్యం నుండి దూరంగా వుండే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!!

## రెండవ ఖుత్బా

## షాబాన్ 15వ తేదీ రాత్రి నిర్ణయాలు తీసుకొనబడే రాత్రినా?

షబే బరాత్ జరుపుకొనే వారు ఈ రాత్రిని నిర్ణయాలు గైకొనబడే రాత్రిగా భావిస్తారు. దానికి ఆధారంగా ఈ ఆయత్‌ను తీసుకుంటారు:

إِنَّآ أَنزَلْنَٰهُ فِى لَيْلَةٍ مُّبَٰرَكَةٍ ۚ إِنَّا كُنَّا مُنذِرِينَ ۝ فِيهَا يُفْرَقُ كُلُّ أَمْرٍ حَكِيمٍ ۝

**"నిశ్చయంగా మేము దీనిని (ఖురాన్‌ను) శుభప్రదమైన రాత్రి యందు అవతరింపజేశాము. నిస్సందేహంగా మేము హెచ్చరిక చేసేవాళ్ళము. ఆ రాత్రి యందే కీలకమైన ప్రతి ఉత్తర్వు జారీ చేయబడుతుంది".**

***(దుఖాన్ : 3-4)***

అల్లాహ్ యొక్క ఈ ఆదేశంలో 'శుభప్రదమైన రాత్రి' గురించి వివరించబడింది. దీనిలో దివ్య ఖురాన్ అవతరింపజేయబడడంతో పాటు సం॥ అంతా జరగబోయే సంఘటనల గురించి నిర్ణయాలు తీసుకోబడతాయి. ఇక చూడాల్సిన విషయం ఏమిటంటే –ఆ శుభప్రదమైన రాత్రి అంటే ఏ రాత్రి? అని.

ఒకవేళ మనం, మన సంకల్పానికనుగుణంగా ఖురాన్‌ను విశ్లేషించడం వదిలిపెట్టి, స్వయంగా ఖురాన్‌లోనే దాని విశ్లేషణను అన్వేషిస్తే ఈ ప్రశ్నకు సమాధానం మనకు దొరుకుతుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّآ أَنزَلْنَٰهُ فِى لَيْلَةِ ٱلْقَدْرِ ۝

**" నిశ్చయంగా మేము దీనిని (ఖురాన్ ను) 'లైలతుల్ ఖద్ర్' (ఘనమైన రాత్రి) యందు అవతరింపజేశాము".** ***(ఖద్ర్ : 1)***

దీని ద్వారా – శుభప్రదమైన రాత్రి అంటే 'లైలతుల్ ఖద్ర్'అని తెలుస్తుంది. ఇది రమజాన్ నెలలోని ఆఖరి పది రోజుల్లోని బేసి సంఖ్యల రాత్రుల్లో వస్తుంది.

అదేరాత్రి మనిషి జీవితం, మరణం, జీవనోపాధి తదితర అంశాలను గురించి నిర్ణయాలు తీసుకోబడతాయి.

'శుభప్రదమైన రాత్రి' గురించి అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు), ఖతాదా, ముజాహిద్, హసన్ మొ॥వారు కూడా ఇలాగే విశ్లేషించారు. ఈ విశ్లేషణనే విద్వాంసులందరూ సరైన విశ్లేషణగా ఖరారు చేశారు.

*(తఫ్సీర్ ఖుర్తుబీ : 8వ సంపుటం,, 432-433 పేజీలు)*

ఇమామ్ అబూ బక్ర్ ఇబ్నుల్ అరబీ ఇలా పేర్కొన్నారు: ధార్మిక పండితుల దృష్టిలో 'శుభప్రదమైన రాత్రి' అంటే 'లైలతుల్ ఖద్ర్' అని అర్థం. కానీ కొందరి దృష్టిలో మాత్రం ఇది షాబాన్ నెల15వ రాత్రి. కానీ ఇది అసత్యం. ఎందుకంటే అల్లాహ్ తన సత్య గ్రంథంలో – 'రమజాను నెల ఖురాన్ అవతరింపజేయబడిన నెల' అని వివరించి తదుపరి, ఈ నెలలోని 'లైలతుల్ ఖద్ర్'ను ఖురాన్ అవతరించిన రాత్రిగా ఖరారు చేశాడు. ఇక దీనిని (ఈ సత్యాన్ని) వదిలిపెట్టి ఎవరైనా, శుభప్రదమైన రాత్రి అంటే లైలతుల్ ఖద్ర్ కాక మరో రాత్రి అని అంటే – అతను అల్లాహ్‌పై పెద్ద అభాండం మోపినట్లే. షాబాన్ 15వ రాత్రి మహత్యం గురించి లేదా ఆ రాత్రి నిర్ణయాలు తీసుకోబడతాయి– అన్న దాని గురించి వచ్చిన హదీసులన్నీ అత్యంత బలహీనమైనవి.కనుక వీటి జోలికి పోకండి. *(అహ్‌కాముల్ ఖురాన్, ఇబ్నుల్ అరబీ:4వ సంపుటం,106వపేజీ)*

ఇమామ్ ఇబ్నె కసీర్ ఇలా పేర్కొన్నారు : 'శుభప్రదమైన రాత్రి' మరియు 'నిర్ణయాలు తీసుకోబడే రాత్రి' అంటే లైలతుల్ ఖద్ర్ అని అర్థం. ఇక ఎవరైనా, ఇక్రమా చెప్పినట్లు–దీని అర్థం షాబాన్ 15వ రాత్రి – అని అంటే అది సరైనది కాదు. ఎందుకంటే స్వయంగా ఖురాన్ ద్వారానే 'ఈ రాత్రి రమజాన్ నెలలో వస్తుంది' అని రూఢీ అవుతుంది.

*( తఫ్సీర్ ఇబ్నె కసీర్ : 4వ సంపుటం, 163వ పేజీ)*

కనుక షాబాన్ 15వ రాత్రిని నిర్ణయాలు తీసుకోబడే రాత్రిగా ఖరారు చేయడం ఎంతమాత్రం సరికాదు, దానికేమాత్రం విలువ లేదు.

ఆఖరుగా అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే – ఆయన మనందరినీ ఆయన విధేయతకు కట్టుబడి, ఆయన అవిధేయతకు దూరంగా వుండే సద్బుద్ధిని ప్రసాదించుగాక! మరియు మన అంతం 'తౌహీద్ మరియు సత్కార్యాలపై' కలుగజేయుగాక! ఆమీన్!

# అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1) ఖురాను హదీసుల వెలుగులో అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం ప్రాధాన్యత.
2) అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం – మహత్యం మరియు లాభాలు.
3) అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం– కొన్ని మహత్తరమైన ఉదాహరణలు.
4) అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం – మర్యాదలు.
5) అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం – కొన్ని రూపాలు.
6) దానాల ద్వారా లభించిన పుణ్యాన్ని వ్యర్థం చేసే కొన్ని కార్యాలు.
7) జకాత్ విధిత్వము –దాని అంశాలు.

## మొదటి ఖుత్బా

ఇస్లామీయ సోదరులారా!

అల్లాహ్ యే తన దాసులకు సంపదను ప్రసాదిస్తాడు. కొందరికి ఎక్కువ గానూ, కొందరికి తక్కువగానూ. తదుపరి ఆ సంపద నుండి ఖర్చు చేయమని ఆజ్ఞాపిస్తాడు. అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయమని ప్రోత్సహిస్తాడు, పిసినారి తనాన్ని వారిస్తాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

مَثَلُ الَّذِينَ يُنفِقُونَ أَمْوَالَهُمْ فِي سَبِيلِ اللَّهِ كَمَثَلِ حَبَّةٍ أَنبَتَتْ سَبْعَ سَنَابِلَ فِي
كُلِّ سُنبُلَةٍ مِّائَةُ حَبَّةٍ ۗ وَاللَّهُ يُضَاعِفُ لِمَن يَشَاءُ ۗ وَاللَّهُ وَاسِعٌ عَلِيمٌ (261)

**"అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చు చేసేవారి ఉపమానం ఇలా వుంటుంది : ఒక విత్తనాన్ని నాటగా అది మొలకెత్తి అందులో నుంచి ఏడు వెన్నులు పుట్టుకొస్తాయి. ప్రతి వెన్నులోనూ నూరేసి గింజలు వుంటాయి. ఇదే విధంగా అల్లాహ్ తాను కోరిన వారికి సమృద్ధి వొసగు తాడు. అల్లాహ్ పుష్కలంగా ప్రసాదించేవాడు, ప్రతీదీ తెలిసినవాడు".**

***(బఖర: 261)***

ఈ ఆయత్ ద్వారా తెలిసేదేమిటంటే – మీరు అల్లాహ్ మార్గంలో ఒక రూపాయి ఖర్చు పెట్టడం 700 రూపాయలు ఖర్చు పెట్టడంలాగా అన్నమాట.

అంటే – అల్లాహ్ మీకు దాని పుణ్యాన్ని 700 రెట్లు లేదా అంతకన్నా ఎక్కువగా చేసి ప్రసాదిస్తాడు.

ఒకవేళ ఒక ధనవంతుడు ఒక వ్యక్తితో– నువ్వు ఈ రోజు ఫలానా వ్యక్తికి 100 రూపాయలిస్తే రేపు నేను నీకు 700 రూపాయలు ఇస్తాను– అని అంటే అతను 100 రూపాయలు ఇవ్వడానికి తటపటాయిస్తాడా? లేక నిరాకరించడానికి సాకులు వెతుకుతాడా? ఖచ్చితంగా అలా చెయ్యడు. ఎందుకంటే దీనికి బదులుగా రేపు అతనికి 100 రూపాయలు కాదు, ఏకంగా 700 రూపాయలు దొరుకుతాయి. మరైతే ఆ శుభప్రదమైన శక్తిమంతుని (అల్లాహ్) గురించి మీ అభిప్రాయమేమిటి మరి? యావత్ ఖజానాల తాళం చెవులు ఆయన వద్దనే వున్నాయి. ఆయన తన దాసులపై అనంత కరుణామయుడు మరియు అపార కృపాశీలుడూను. తన వాగ్దానంలో సత్యవంతుడు. మరి ఆయనే స్వయంగా – నా మార్గంలో ఖర్చు చేయండి, దానికి బదులుగా 700 రెట్లు అధికంగా పుణ్యఫలం ఇస్తానని సెలవిచ్చినప్పుడు, ఆయన ఈ పని చేయడానికి శక్తి కలిగి లేడా? మరి మనం ఆయన ఆజ్ఞప్రకారం ఆయన మార్గంలో ఖర్చు చేయకూడదూ! మరి చూడబోతే ఆయన ఇలా సెలవిచ్చి వున్నాడు:

وَاَقْرِضُوا اللّٰهَ قَرْضًا حَسَنًا ؕ وَمَا تُقَدِّمُوْا لِاَنْفُسِكُمْ مِّنْ خَيْرٍ تَجِدُوْهُ عِنْدَ اللّٰهِ هُوَ خَيْرًا وَّاَعْظَمَ اَجْرًا ؕ

**"మీరు మీ కోసం ఏ మంచి (పుణ్యకార్యాన్ని) ముందుగా పంపినా, దానిని అల్లాహ్ దగ్గర అత్యుత్తమ పుణ్యఫలం రూపంలో అత్యధికంగా పొందుతారు". *(ముజ్జమ్మిల్: 20)***

మరో ఆయత్‌లో అల్లాహ్ పగలూ, రాత్రి (అల్లాహ్ మార్గంలో) ఖర్చు చేసేవారికి శుభవార్తనిస్తూ ఇలా సెలవిచ్చాడు:

اَلَّذِيْنَ يُنْفِقُوْنَ اَمْوَالَهُمْ بِالَّيْلِ وَالنَّهَارِ سِرًّا وَّعَلَانِيَةً فَلَهُمْ اَجْرُهُمْ عِنْدَ رَبِّهِمْ ۚ
وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُوْنَ ﴿274﴾

**"ఎవరైతే తమ సిరిసంపదలను రేయింబవళ్ళు రహస్యంగానూ, బహిరంగంగానూ ఖర్చు చేస్తారో వారి కొరకు వారి ప్రభువు వద్ద(గొప్ప) పుణ్యఫలం వుంది. వారికెలాంటి భయంగానీ, దు:ఖంగానీ ఉండదు".**

***(బఖర: 274)***

మరొక చోటైతే అల్లాహ్ తన సంపదలోని ప్రియతమ వస్తువును అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయనంత వరకు ఎవరు కూడా పుణ్యఫలస్థాయికి చేరుకోలేడు – అని స్పష్టం చేసాడు. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

لَنْ تَنَالُوا الْبِرَّ حَتّٰى تُنْفِقُوْا مِمَّا تُحِبُّوْنَ ؕ۬ وَمَا تُنْفِقُوْا مِنْ شَیْءٍ فَاِنَّ اللّٰهَ بِهٖ عَلِیْمٌ ﴿۹۲﴾

**“మీకు ప్రియాతి ప్రియమైన వస్తువుల నుండి మీరు(అల్లాహ్ మార్గంలో) ఖర్చు పెట్టనంతవరకు మీరు పుణ్యస్థాయికి చేరుకోలేరు. మీరు ఖర్చు పెట్టేదంతా అల్లాహ్‌కు తెలుసు”.** ***(ఆలి ఇమ్రాన్ : 92)***

ఈ ఆయత్ అవతరించాక సహాబాలు, అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం గురించి చక్కటి ఉదాహరణలు సమర్పించారు. వీటిలో ఒకటి అబూతల్హా సమర్పించినది–

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం :

అబూ తల్హా (రజి అల్లాహు అన్హు) మదీనా అన్సారులలో అందరికన్నా ధనవంతులు. తన సంపదలో ఆయనకు అత్యంత ప్రియమైనది మస్జిదె నబవి ముందు వున్న ఖర్జూరపు తోట. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తరచూ అక్కడికి వెళుతుండేవారు, దానిలోని నీళ్ళను త్రాగేవారు. “మీకు ప్రియాతి ప్రియమైన వస్తువుల నుండి అల్లాహ్ మార్గంలో.....” అన్న ఆయత్ అవతరించాక అబూ తల్హా (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికొచ్చి, ఓ దైవ ప్రవక్తా! అల్లాహ్ తన గ్రంథంలో– ‘మీకు ప్రియాతి ప్రియమైన వస్తువులను అల్లాహ్ మార్గంలో.....’ అని ఆజ్ఞాపించాడు. మరి నా ఖర్జూరపు తోట నాకు ఎంతో ప్రియమైనది. కనుక నేను దీనిని అల్లాహ్ కోసం దానం చేస్తున్నాను. దీని పుణ్యఫలాన్ని అల్లాహ్ నుండే ఆశిస్తున్నాను మరియు దానిని అల్లాహ్ వద్ద నిల్వ చేసుకోవాలనుకుంటున్నాను. అందుకే దీనిని మీరు మీ యిష్ట ప్రకారం ఖర్చు చేయండి అని విన్నవించుకున్నారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ‘చాలా మంచిది, ఇదెంతో లాభదాయకమైన సంపద, ఇదెంతో లాభదాయకమైన సంపద’ అని అన్నారు.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ‘నువ్వు చెప్పినదంతా నేను విన్నాను. కానీ నా ఉద్దేశ్యం (సలహా) ఏమిటంటే–దీనిని (తోటను) నువ్వు నీ బంధువులకు పంచిపెట్టు’ అని చెప్పారు. దీనితో, ఆయన ఆ తోటను

తన బంధువులకు, బాబాయి కొడుకులకూ పంచిపెట్టారు.

*(బుఖారీ: 2318, ముస్లిం : 998)*

మరో చోట అల్లాహ్– తన మార్గంలో ఖర్చు పెట్టకుండా పిసినారితనాన్ని ప్రదర్శించేవారిని హెచ్చరిస్తూ అలాంటి వారిని తుదముట్టించి, వారి స్థానంలో పిసినారితనం చూపకుండా ఖర్చు చేసేవారిని తీసుకువస్తానని ఆజ్ఞాపించాడు:

هَٰٓأَنتُمْ هَٰٓؤُلَآءِ تُدْعَوْنَ لِتُنفِقُوا۟ فِى سَبِيلِ ٱللَّهِ فَمِنكُم مَّن يَبْخَلُ ۖ وَمَن يَبْخَلْ فَإِنَّمَا يَبْخَلُ عَن نَّفْسِهِۦ ۚ وَٱللَّهُ ٱلْغَنِىُّ وَأَنتُمُ ٱلْفُقَرَآءُ ۚ وَإِن تَتَوَلَّوْا۟ يَسْتَبْدِلْ قَوْمًا غَيْرَكُمْ ثُمَّ لَا يَكُونُوٓا۟ أَمْثَٰلَكُم ﴿38﴾

**"ఇదిగో! అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయండని పిలిచినప్పుడు కొందరు పిసినారులుగా వ్యవహరిస్తున్నారు. ఎవరయితే పిసినారితనం వహిస్తున్నాడో అతను తన పట్లనే పిసినారితనం వహిస్తున్నాడు. అల్లాహ్ సంపన్నుడు (అక్కర లేనివాడు). మీరేమో పేదలు (ఆయన పై ఆధార పడినవారు). ఒకవేళ మీరు గనక మరలిపోతే – ఆయన మీ బదులు మీ స్థానంలో మరో జాతివారిని తీసుకువస్తాడు. మరి వారు మీలాంటి వారై వుండరు".** ***(ముహమ్మద్ : 38)***

'సబా' సూరాలో అల్లాహ్ – మీరు ఎక్కువగా గానీ, తక్కువగా గానీ ఏం ఖర్చు చేసినా సరే–దానికిగాను అత్యంత మేలైన ఉపాధి ప్రదాత అయిన అల్లాహ్ మీకు దాని స్థానంలో మరింత ఎక్కువగా ప్రసాదిస్తాడని సెలవిచ్చాడు:

وَمَآ أَنفَقْتُم مِّن شَىْءٍ فَهُوَ يُخْلِفُهُۥ ۖ وَهُوَ خَيْرُ ٱلرَّٰزِقِينَ ﴿﴾

**"(అల్లాహ్ మార్గంలో) మీరు ఏది ఖర్చు చేసినా ఆయన దానికి (సంపూర్ణ) ప్రతిఫలం ఇస్తాడు. ఆయన అందరికన్నా ఉత్తమ ఉపాధి ప్రదాత".**

***(సబా:39)***

కనుక, ఏ వ్యక్తి అయినా, అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తూ – ఇలా చేస్తూవుంటే నా సంపద తగ్గిపోతుంది – అని ఆలోచించకూడదు. పైగా అల్లాహ్ ఆదేశాలపై పూర్తిగా నమ్మకం వుంచి, దీనికి బదులుగా మరింత ఉత్తమ ఉపాధిని ఆయన తనకు ప్రసాదిస్తాడని గట్టిగా నమ్మి ఖర్చు చేయాలి.

ఈ ఆయత్‌లన్నింటి సారాంశమేమిటంటే – అల్లాహ్ మనల్ని – తన మార్గంలో ఖర్చు పెట్టమని ప్రోత్సహించాడు. దీని ద్వారా కలిగే ప్రయోజనం, దొరికే పుణ్యఫలం వైపునకు మన దృష్టిని ఆకర్షింపజేసాడు.

దీనికనుగుణంగా, స్వయానా దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా చాలా ఎక్కువగా(అల్లాహ్ మార్గంలో) ఖర్చు చేసేవారు, ఇతరులకు కూడా దీని గురించి ప్రోత్సహించేవారు మరియు పిసినారితనాన్ని ఖండించేవారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రతిరోజూ ఉదయం ఇద్దరు దైవ దూతలు అవతరిస్తారు. అందులో ఒకతను ఇలా ప్రార్థిస్తాడు– ఓ అల్లాహ్! ఖర్చుచేసేవారికి మరింతగా ప్రసాదించు. ఇంకో అతను ఇలా ప్రార్థిస్తాడు – ఓ అల్లాహ్! ఖర్చు చేయని వారి సంపదను నాశనం చెయ్యి.

*(బుఖారీ : 1442, ముస్లిం : 1010)*

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఇద్దరు వ్యక్తుల ఆచరణలపై అసూయ చెందవచ్చు. ఇందులో ఒకరేమో – అల్లాహ్ అతనికి ఖురాన్ ఇవ్వగా దానిని అతను రేయింబవళ్ళు పఠించేవాడు. మరొకరెవరంటే – అల్లాహ్ అతనికి సంపదను ప్రసాదించగా అతను దానిని ఆయన మార్గంలో ఖర్చుచేసేవాడు. *(బుఖారీ: 5025, ముస్లిం:815)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే – అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం – అసూయ పడగలిగే ఆచరణ.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు "ఓ ఆదమ్ సంతానమా! నువ్వు ఖర్చు చేయి, నీపై (నేను) గూడా ఖర్చు చేస్తూ వుంటాను." *(బుఖారీ : 4684, ముస్లిం:993)*

## అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం ఎంతో లాభదాయకమైన వర్తకం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ الَّذِينَ يَتْلُونَ كِتَٰبَ اللَّهِ وَأَقَامُوا الصَّلَوٰةَ وَأَنفَقُوا مِمَّا رَزَقْنَٰهُمْ سِرًّا وَعَلَانِيَةً يَرْجُونَ
تِجَٰرَةً لَّن تَبُورَ ﴿29﴾ لِيُوَفِّيَهُمْ أُجُورَهُمْ وَيَزِيدَهُم مِّن فَضْلِهِ ۚ إِنَّهُ غَفُورٌ شَكُورٌ ﴿30﴾

**"దైవ గ్రంథాన్ని పఠిస్తూ నమాజు నెలకొల్పేవారు, మేము ప్రసాదించిన దానిలోనుంచి గోప్యంగానూ, బహిరంగంగానూ ఖర్చు చేసేవారు**

**ఎన్నటికీ నష్టం కలుగని వర్తకాన్ని ఆశిస్తున్నారు. వారికి వారి ప్రతిఫలాలు (అల్లాహ్) పూర్తిగా యివ్వటానికి, తన కృపతో ఆయన వారికి మరింతగా ప్రసాదించ టానికి గాను (వారు ఈ విధానాన్ని అవలంబిస్తున్నారు). నిశ్చయంగా ఆయన అమితంగా క్షమించేవాడు, సన్మానించేవాడు".**

***(ఫాతిర్ : 29–30)***

ఈ ఆయత్ ద్వారా తెలిసిందేమిటంటే –అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం ఎలాంటి వర్తకం అంటే– దీంట్లో ఎల్లప్పుడూ లాభమే చేకూరుతుంది, నష్టం ఎప్పుడూ కలుగదు. అంటే– సంపదలో శుభం కలుగుతుంది మరియు ఉపాధి ద్వారాలు మరింతగా తెరువబడతాయి.

అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

إِن تُقْرِضُوا اللَّهَ قَرْضًا حَسَنًا يُضَاعِفْهُ لَكُمْ وَيَغْفِرْ لَكُمْ ۚ وَاللَّهُ شَكُورٌ حَلِيمٌ (17)

**"మీరు గనక అల్లాహ్ కు మంచి రుణం ఇస్తే (అంటే అల్లాహ్ మార్గంలో ఖర్చుపెడితే) దాన్ని ఆయన మీ కొరకు పెంచుతూ పోతాడు. మీ పాపాలను కూడా క్షమిస్తాడు. అల్లాహ్ (తన దాసుల సేవలను) గుర్తించేవాడు, సహనశీలుడు".** ***(తగాబున్: 17)***

ఈ ఆయత్‌లో అల్లాహ్ – తన మార్గంలో ఖర్చుచేయడాన్ని – తనకు ఇచ్చే మంచి రుణం అని ఖరారు చేశాడు. మరి చూస్తే సంపద యొక్క అసలు యజమాని అల్లాహ్‌యే. ఆయన తాను తలచుకున్న వారికి ఎక్కువగాను, తాను తలచినవారికి తక్కువగాను ప్రసాదిస్తాడు.

సంపదను దాని అసలు యజమానికి తిరిగి ఇవ్వడం రుణం అనిపించుకోదు. కానీ అల్లాహ్ కృప చూడండీ! దీనిని ఆయన 'మంచి రుణం'గా ఖరారు చేసి దాన్ని ఎన్నో రెట్లు పెంచుతాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَمْحَقُ اللَّهُ الرِّبَا وَيُرْبِي الصَّدَقَاتِ ۗ وَاللَّهُ لَا يُحِبُّ كُلَّ كَفَّارٍ أَثِيمٍ (276)

**"అల్లాహ్ వడ్డీని హరింపజేశాడు, దాన ధర్మాలను పెంచుతాడు. మేలును మరిచేవారిని, పాపిష్టులను అల్లాహ్ ఎంత మాత్రం ప్రేమించడు".**

***(బఖర: 276)***

అల్లాహ్– దానాలను ఎలా పెంచుతాడు?– దీని వివరణ మనకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసు ద్వారా తెలుస్తుంది.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “ఏ వ్యక్తి అయినా తన ధర్మయుక్త (హలాల్) సంపాదన నుండి ఒక ఖర్జూరపు పండుకు సమానంగా దానం చేస్తే – అల్లాహ్ హలాల్ సంపాదనే స్వీకరిస్తాడు– అల్లాహ్ దానిని తన కుడి చేత్తో స్వీకరిస్తాడు. తదుపరి మీరు మీ దూడను పెంచినట్లు ఆయన దానిని పెంచుతాడు. చివరికి అది (దానం) ఒక కొండ లాగా అవుతుంది”.

*(బుఖారీ:1410, ముస్లిం:1014)*

అల్లాహు అక్బర్! మన సృష్టికర్త, యజమాని అయిన అల్లాహ్ ఎంత ఉదారుడో చూడండి! ఒక ఖర్జూరపు పండుతో సమానంగా వున్న దానాన్ని ఎంతగా పెంచుతాడంటే, అదొక కొండలాగా అవుతుంది! సుబ్హానల్లాహి వబిహమ్దిహీ.

ఈ ఆయత్‌లు మరియు హదీసుల ద్వారా తెలిసిందేమిటంటే – అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం వల్ల సంపద వృద్ధి చెందుతుంది మరియు ఎంతో లాభం చేకూరుతుంది. అందుకే అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టేవారు – తమ సంపద తరిగిపోతుందని ఎప్పుడూ భావించకూడదు. పైగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఈ ప్రవచనంపై గట్టి నమ్మకం కలిగి వుండాలి. “దానం సంపదను తగ్గించదు, పైగా దానిలో వృద్ధి కలుగజేస్తుంది”. *(ముస్లిం: 2588)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బిలాల్ (రజి అల్లాహు అన్హు)తో ఇలా చెప్పారు: “ఓ బిలాల్! నువ్వు ఖర్చు చేస్తూ వుండు. అర్ష్ వాని (అల్లాహ్) తరఫు నుండి తగ్గుదల భయం పెట్టుకోకు”. *(అస్సహీహ లిల్ అల్‌బానీ: 2661)*

## దానం ప్రళయం రోజు మనిషికి నీడనిస్తుంది

ప్రళయం రోజు అల్లాహ్ మొత్తం ఆదమ్ సంతతిని ఒకచోట సమీకరించి నప్పుడు – ఈ రోజు కొన్ని వేల మైళ్ళ దూరంలో వున్న సూర్యుడు ఆ రోజు కేవలం ఒక మైలు దూరంలో వుంటాడు – మనుష్యులకు వారి వారి ఆచరణల కనుగుణంగా చెమట పడుతుంది. ఒకరి చెమట అతని చీలమండ వరకు, మరొకరి చెమట అతని మోకాళ్ళ వరకు, ఇంకొకరి చెమట అతని పొట్ట

వరకు, మరొకరి చెమట అతని నోటి దాకా వుంటుంది. ఆ రోజు దానం చేసే వ్యక్తి తన దానం నీడలో వుంటాడు. దీని గూర్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ప్రతి వ్యక్తి తన దానం నీడలో వుంటాడు – మానవులందరి మధ్య నిర్ణయం జరిగేంత వరకు".

ఇక దాన ధర్మాలను గోప్యంగా చేసేవాడు అల్లాహ్ యొక్క అర్ష్ నీడలో వుంటాడు. దీని గూర్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు : "ఏడు రకాల వ్యక్తులను అల్లాహ్ తన (అర్ష్) నీడలో వుంచుతాడు. ఆ రోజు దాని నీడ తప్ప మరే నీడా వుండదు...వారిలో ఒక వ్యక్తి ఎవరంటే – అతను ఎంత గోప్యంగా దానం చేస్తాడంటే, తన కుడి చేత్తో ఖర్చు చేసేది అతని ఎడమ చేతికి కూడా తెలియకుండా వుంటుంది".

*(బుఖారీ:1423, ముస్లిం:1031)*

మరి మనం కూడా ప్రళయ దినపు వేడి మరియు ఆ దినపు చెమట నుండి తప్పించుకోవాలంటే వీలైనంత ఎక్కువగా దానధర్మాలు చేయాలి. ప్రత్యేకించి గోప్యంగా చేయాలి. తద్వారా ఎవరికీ తెలియకుండా కూడా వుంటుంది మరియు అర్ష్ నీడ కూడా దొరుకుతుంది.

## దైవదూతలు సాగునీరు అందిస్తారు

అవును, నిజమండీ! దాన ధర్మాలు చేసే వ్యక్తి సంపద ఎంతో శుభప్రద మైనది. ఆ వ్యక్తి తోటలకు దైవదూతలు సాగునీరు అందిస్తారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు:

ఒక వ్యక్తి ఎడారి ప్రాంతం గుండా పోతుండగా, మేఘాల్లోంచి – 'ఫలానా వ్యక్తి తోటకు నీళ్ళివ్వు' అన్న శబ్దం విన్నాడు. తదుపరి ఆ మేఘం ఓ వైపునకు మరలి నల్లటి రాతి ప్రదేశంపై వర్షం కురిపించింది. అక్కడ వున్న ఒక కాలువ ఆ వర్షపు నీటిని తనలో సమీకరించుకుంది. ఈ వ్యక్తి ఆ నీటిని చూస్తూ (కాలువ వెంబడి) నడుస్తూ పోయాడు. అకస్మాత్తుగా అతను ఒక వ్యక్తిని ఒక

తోటలో నిలబడి పారతో నీళ్ల ప్రవాహాన్ని తోట వైపునకు మళ్ళించడం చూశాడు. ఈ వ్యక్తి అతనితో– ఓ అల్లాహ్ దాసుడా! మీపేరేమిటి?అని అడగ్గా, అతను తన పేరు చెప్పాడు. అతను చెప్పిన పేరు, మేఘాల్లో తను విన్న పేరు ఒకటే. తదుపరి ఆ తోటలోని వ్యక్తి ఇతనితో – మీరు నా పేరు ఎందుకడిగారు? అని ప్రశ్నించాడు.

అతను– నేను మేఘాలలో ఒక శబ్దం విన్నాను. ఆ మేఘాలే ఈ నీటిని ఇక్కడి దాకా తీసుకొచ్చాయి. ఆ శబ్దం– 'ఫలానా వ్యక్తి తోటకు నీళ్ళివ్వు' అని అంటూ మీ పేరే చెప్పింది. మరి మీరు ఈ తోటలో (ప్రత్యేకంగా) ఏం చేస్తారో కాస్త సెలవిస్తారా? అని అడిగాడు.

తోటలోని వ్యక్తి జవాబిస్తూ– మీరు నాకు విషయం మొత్తం చెప్పారు కాబట్టి నేను కూడా మీకు అసలు విషయం చెబుతాను. అదేమిటంటే, ఈ తోటలో పండ్లు కాసిన తర్వాత నేను వాటిని మూడు భాగాలుగా చేస్తాను. దానిలో ఒక భాగం దానం చేస్తాను, మరొక భాగం నేనూ, నా పిల్లలు తింటాం మరియు మూడో భాగాన్ని మళ్ళీ ఈ తోటలోనే మళ్ళిస్తాను. (అంటే తదుపరి పంట కోసం గింజల లాగా ఉపయోగిస్తాను). *(ముస్లిం: 2984)*

## అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టడం వల్ల మంచి, శుభకర ద్వారాలు తెరుచు కోబడతాయి మరియు ఇతర వ్యవహారాలన్నీ తేలికవుతాయి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَاَمَّا مَنْ اَعْطٰى وَاتَّقٰى ۙ وَصَدَّقَ بِالْحُسْنٰى ۙ فَسَنُيَسِّرُهٗ لِلْيُسْرٰى ؕ

وَاَمَّا مَنْۢ بَخِلَ وَاسْتَغْنٰى ۙ وَكَذَّبَ بِالْحُسْنٰى ۙ فَسَنُيَسِّرُهٗ لِلْعُسْرٰى ؕ

وَمَا يُغْنِىْ عَنْهُ مَالُهٗۤ اِذَا تَرَدّٰى ؕ

**"ఎవరైతే (అల్లాహ్ మార్గంలో) ఇచ్చాడో, (తన ప్రభువుకు) భయపడుతూ వున్నాడో, ఇంకా సత్పరిణామాన్ని సత్యమని ధృవపరిచాడో, అతనికి మేము సులువైన మార్గపు సౌకర్యం వొసగుతాము. మరెవరైతే పిసినారిగా తయారై, నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శించాడో, సత్పరిణామాన్ని త్రోసిపుచ్చాడో,**

**అతనికి మేము కఠిన (దుర్) మార్గసామగ్రిని సమకూరుస్తాము. అతను పడిపోయే సమయంలో అతని ధనం అతనికే విధంగానూ పనికిరాదు".**

***(లైల్:5-11)***

ఈ ఆయతుల ద్వారా తెలిసిందేమిటంటే – అల్లాహ్ మార్గంలో ఖర్చు చేయడం వల్ల– ఖర్చుచేసే వ్యక్తి ముందు, మంచి, శుభకర ద్వారాలు తెరవబడ తాయి మరియు అతని సమస్త వ్యవహారాలు– ఇహలోకం పరలోకానికి సంబంధించినవన్నీ – తేలిక చేయబడతాయి.

దీనికి విరుద్ధంగా, మనిషి పిసినారి తనాన్ని ప్రదర్శించి అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టకపోతే అతని ముందు మంచి, శుభకర ద్వారాలు మూసుకోబడతాయి మరియు అతని సమస్త వ్యవహారాలు కఠినతరం చేయబడతాయి.

## అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టడం ద్వారా మనస్సు పరిశుద్ధమవుతుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

خُذْ مِنْ اَمْوَالِهِمْ صَدَقَةً تُطَهِّرُهُمْ وَتُزَكِّيْهِمْ بِهَا وَصَلِّ عَلَيْهِمْ ۭ اِنَّ صَلٰوتَكَ سَكَنٌ لَّهُمْ ۭ وَاللّٰهُ سَمِيْعٌ عَلِيْمٌ ۝

**"(ఓ ప్రవక్తా!) నువ్వు వారిని పరిశుద్ధ పరచటానికీ, వారిని తీర్చిదిద్దటానికి వారి సంపదల నుంచి దానాలను తీసుకో. వారి బాగోగుల కోసం ప్రార్థించు. నిస్సందేహంగా నీ ప్రార్థన (దుఆ) వల్ల వారికి శాంతి లభిస్తుంది. అల్లాహ్ అంతా వినేవాడు, అన్నీ తెలిసినవాడు".**

***(తౌబా :103)***

ఈ ఆయతు ద్వారా తెలిసిందేమిటంటే –

దానధర్మాల వల్ల మూడు ప్రయోజనాలు చేకూరుతాయి.

మొదటిది – మనిషి పాపాల నుండి పరిశుద్ధుడౌతాడు.

రెండవది – (దాన ధర్మాల తర్వాత) మిగిలిన సంపద కూడా పరిశుద్ధమవు తుంది.

మూడవది– ఖర్చు చేసేవారి మనస్సు–ధనసంపదల మీద ప్రేమ, ఆశ, పిసినారి తనం లాంటి వ్యాధుల నుండి పరిశుద్ధంగా వుంటుంది.

## అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టడం-సమాధిలోని అగ్నిని చల్లారుస్తుంది

ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:"నిస్సందేహంగా దాన ధర్మాలు చేసే వారికి - వారి దానాలు వారి సమాధిలోని వేడిని చల్లారుస్తాయి మరియు నిజమైన విశ్వాసి (మోమిన్) ప్రళయం రోజు తన దానధర్మాల నీడలో వుంటాడు". *(అస్సహీహ అల్బానీ: 4384)*

## అల్లాహ్మార్గంలో ఖర్చుపెట్టడం గురించి కొన్ని చక్కటి ఉదాహరణలు

అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం - దీని మహత్యం, ప్రయోజనాలు, ప్రతిఫలాల గురించి వివరించాక ఇక మేము దీనికి సంబంధిచిన కొన్ని చక్కటి ఉదాహరణలను మీకు వివరిస్తాం. "చక్కటి ఉదాహరణలు" గురించి మాట్లాడడం మొదలు పెడితే మన మనస్సులోకి వచ్చే మొట్టమొదటి వ్యక్తి దైవప్రవక్తల నాయకులైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం). ఎందుకంటే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంతో ఉదారులు మరియు దానశీలురు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఒక వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో - రెండు కొండల మధ్య గల ఖాళీ ప్రదేశాన్ని నింపగలిగే అన్ని మేకలను అడిగాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతనికి తను అడిగినట్లే ఇచ్చేశారు. తదుపరి ఆ వ్యక్తి తన జాతి వద్దకు వెళ్ళి వారితో ఇలా అన్నాడు - ఓ నా జాతి వారలారా! మీరంతా ఇస్లాం స్వీకరించండి. ఎందుకంటే, అల్లాహ్ సాక్షి! ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) బీదరికం, కటిక దరిద్ర భయం లేని వ్యక్తి లాగా ఇస్తారు. *(ముస్లిం: 2312)*

ఉఖ్బా బిన్ హారిస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

నేను (ఓ సారి) మదీనాలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెనుక అసర్ నమాజ్ చదివాను. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) నమాజు ముగించగానే, వెంటనే లేచి ప్రజలను దాటుకొంటూ తన సతీమణులలోని ఒకరి ఇంటికి వెళ్ళారు. ప్రజలు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తొందర పాటును చూసి కాస్త ఆందోళన చెందారు. కాసేపయ్యాక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బయటి కొచ్చారు. తన తొందరపాటు పట్ల ప్రజలు ఆందోళన చెందారని గమనించి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు:

నేను నమాజులో వున్నప్పుడు, నా దగ్గర దానం చేయబడ్డ ఒక బంగారం ముద్ద వుందన్న విషయం గుర్తుకొచ్చింది. రాత్రి అయ్యేంత వరకు అది మా ఇంట్లోనే వుండిపోతుందేమోనని నేను శంకించాను. అందుకే నేను త్వరత్వరగా వెళ్ళి దానిని దానం చేయమని ఆజ్ఞాపించి వచ్చాను.

*(బుఖారీ: 851, 1221, 1430)*

ఇక సహాబాల విషయానికొస్తే, వారుకూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అడుగుజాడల్లో నడుస్తూ అల్లాహ్ మార్గంలో ఎంతో అధికంగా ఖర్చుపెట్టేవారు.

ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి అల్లాహు అన్హు) కథనం:

ఒకరోజు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మమ్మల్ని దానం చేయమని ఆజ్ఞాపించారు. అదృష్టవశాత్తూ ఆ రోజు నా దగ్గర కొంత ధనం వుంది. నేను మనసులో ఇలా అనుకున్నాను – ఈ రోజు అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు)ను మించిపోవడానికి ఒక మంచి అవకాశం. ఇలా అనుకొని నా దగ్గరున్న ధనంలో సగం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికి తీసుకొచ్చాను. ఆయన నాతో – మీ ఇంటి వారికి ఏం మిగిల్చి వచ్చారు? అని అడిగారు. నేను– ఇక్కడికి ఎంతైతే తీసుకొచ్చానో, అంతే ధనం ఇంటి వారి కోసం కూడా మిగిల్చి వచ్చాను అని అన్నాను. తదుపరి అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) తన మొత్తం ధనాన్ని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలో సమర్పించారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – మీ ఇంటి వారికి ఏం మిగిల్చి వచ్చారు? అని అడిగారు. ఆయన (అబూ బక్ర్) జవాబిస్తూ– నేను వారి కోసం అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను మిగిల్చి వచ్చాను అని అన్నారు. అప్పుడు (మనసులో) నేననుకున్నాను– అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు)ను నేనెప్పుడూ మించిపోలేను అని.

*(అబూదావూద్:1678, హసన్ – అల్‌బానీ)*

అబ్దుర్రహ్మాన్ బిన్ సమురః (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (జైషుల్ ఉస్రా) అంటే అత్యంత కష్టకాలపు సైనిక దళాన్ని తబూక్ యుద్ధం కోసం సిద్ధం కమ్మని ఆజ్ఞాపించగా, ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి అల్లాహు అన్హు) ఒక వస్త్రంలో వెయ్యి దీనారులు

తీసుకొని వచ్చి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జోలె లో కుమ్మరించారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వాటిని తన చేత్తో పైకి క్రిందికి కదుపుతూ పలుమార్లు ఇలా అన్నారు: ఈ రోజు నుంచి ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ ఏమి చేసినా అతనికి నష్టమేమీ వాటిల్లదు.

*(ముస్నద్ అహ్మద్, తిర్మిజీ, హసన్ –అల్‌బానీ)*

ఉమ్మె దర్దా (రజి అల్లాహు అన్హ) కథనం:

నేనొకసారి ఆయెషా (రజి అల్లాహు అన్హ) సన్నిధికి లక్ష దిర్హములు తీసుకొని వెళ్ళాను. ఆరోజు ఆమె ఉపవాసంతో వున్నారు. ఆ మొత్తం ధనాన్ని ఆమె పంచి పెట్టారు. దీనిపై నేను మీరు మొత్తం ధనాన్ని పంచి పెట్టేశారు, ఒకవేళ మీరు కోరుకుంటే కనీసం ఒక దిర్హం మీ కోసం వుంచుకొని, దానితో కొంత మాంసం కొనుక్కొని, దాని ద్వారా ఇఫ్తార్ సమయంలో భుజించగలిగే వారు అని అన్నాను. ఆమె జవాబిస్తూ– ఒకవేళ నువ్వు నన్ను ముందుగానే గుర్తు చేసి వుంటే నేను ఇలాగే చేసేదాన్ని అని అన్నారు.

*(తబఖాత్ ఇబ్నె సాద్: 8వ సంపుటం, 53వ పేజీ)*

ఇలాంటి సంఘటనలు ఎన్నో వున్నాయి. మేము కేవలం మూడు సంఘటనలు వివరించాం. వీటి ద్వారా తెలిసిందేమిటంటే– సహాబాలు, అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడంలో ఒకర్నొకరు మించిపోవడానికి ప్రయత్నించేవారు. ఎంత మనస్ఫూర్తిగా వారు ఖర్చుపెట్టేవారంటే ఈ విషయంలో వారు తమ ఇంటి వారిని సైతం మరిచిపోయేవారు.

## అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం – వివిధ రకాల పద్ధతులు

అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడానికి ఎన్నో పద్ధతులు వున్నాయి. వాటిలో కొన్ని ఇవి:

## 1) మస్జిద్‌లను నిర్మించడం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَيَعْبُدُونَ مِن دُونِ اللَّهِ مَا لَا يَضُرُّهُمْ وَلَا يَنفَعُهُمْ وَيَقُولُونَ هَٰؤُلَاءِ شُفَعَاؤُنَا عِندَ اللَّهِ ۚ
قُلْ أَتُنَبِّئُونَ اللَّهَ بِمَا لَا يَعْلَمُ فِي السَّمَاوَاتِ وَلَا فِي الْأَرْضِ ۚ سُبْحَانَهُ وَتَعَالَىٰ عَمَّا يُشْرِكُونَ ○

**“అల్లాహ్‌ను, అంతిమ దినాన్ని విశ్వసిస్తూ, నమాజులను నెలకొల్పుతూ, జకాత్‌ను విధిగా చెల్లిస్తూ అల్లాహ్‌కు తప్ప వేరొకరికి భయపడని వారు మాత్రమే అల్లాహ్ మస్జిద్‌ల నిర్వహణకు తగినవారు. సన్మార్గ భాగ్యం పొందినవారు వీరేనని ఆశించవచ్చు”.** ***(తౌబా:18)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: “ఏ వ్యక్తి అయినా అల్లాహ్ కోసం, కేవలం ఆయన మెప్పు పొందడానికి మస్జిద్‌ను నిర్మిస్తే, అల్లాహ్ అతని కోసం స్వర్గంలో గృహం నిర్మిస్తాడు”. *(బుఖారీ: 450, ముస్లిం:533)*

## 2) ప్రయోజనకరమైన జ్ఞానాన్ని ముద్రించి పంచడం, వ్యాపింపజేయడం

అబూ దర్దా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ‘మనిషి మరణించాక మూడు విషయాలు తప్ప మిగతా ఆచరణలతో అతనికి సంబంధం తెగిపోతుంది. ఆ మూడు విషయాలు ఏవంటే– “ సదఖ–ఏ–జారియా, ప్రయోజనకరమైన జ్ఞానం మరియు అతని కోసం ప్రార్థించే అతని మంచి సంతానం”. *(ముస్లిం:1631)*

ప్రయోజనకరమైన జ్ఞానాన్ని ముద్రించి వ్యాపింపజేయడంలో పలు రకాలుగా పాలు పంచుకోవచ్చు. ఉదా॥కు ఖురాను, హదీసులను బోధించడం, ప్రసంగాలు, శుక్రవారపు ఖుత్బాల ద్వారా ప్రజలకు షరీయత్తు ఆదేశాలు, ఇస్లామీయ మర్యాదలను విశదపరచడం, ధార్మిక గ్రంథాలను ముద్రించచడం, ఖురాను, హదీసుల ప్రసంగాలను రికార్డు చేసి పంచిపెట్టడం, ధార్మిక విద్యనభ్యసించే విద్యార్థులకు పుస్తకాలు సమకూర్చడం, మస్జిద్‌లలో ఖురాను దానం చేయడం వగైరా॥వంటి కార్యాలు.

## 3) అనాథల బాగోగుల బాధ్యత తీసుకోవడం

సహల్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “నేను మరియు అనాథల బాగోగుల బాధ్యత తీసుకున్నవాడు స్వర్గంలో ఈ రెండు వేళ్ళలాగా వుంటాం”. అంటే చూపుడు వ్రేలు మరియు మధ్య వ్రేలు లాగా. *(బుఖారీ : 6005)*

## 4) అల్లాహ్ మార్గంలో జిహాద్ కోసం ఖర్చుపెట్టడం

జైద్ బిన్ ఖాలిద్ అల్ జహమి (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా ఒక ముజాహిద్‌కు ధన పరంగా సన్నద్ధం చేసి యుద్ధానికి పంపడం, స్వయంగా తను యుద్ధంలో పాల్గొన్న దానితో సమానం" *(బుఖారీ:2843, ముస్లిం:1895)*

## 5) నిరుపేదలకు అన్నం పెట్టడం మరియు వారికి సహాయపడడం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَيُطْعِمُونَ الطَّعَامَ عَلَىٰ حُبِّهِ مِسْكِينًا وَيَتِيمًا وَأَسِيرًا ۝

**"అల్లాహ్ ప్రీతి కోసం నిరుపేదలకు, అనాథలకు, ఖైదీలకు అన్నం పెడుతుంటారు".** ***(దహ్ర్:8)***

వితంతువులకు, అగత్యపరులకు సహాయపడుతూ వారి కోసం ఖర్చు చేసేవాడు అల్లాహ్ మార్గంలో జిహాద్ చేసే వ్యక్తిలాంటి వాడు.

సఫ్వాన్ బిన్ సులైమ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"వితంతువుల కోసం మరియు నిరుపేదల కోసం ఖర్చు చేసే వ్యక్తి (పుణ్యఫలం రీత్యా) అల్లాహ్ మార్గంలో జిహాద్ చేసే వ్యక్తి లేదా ప్రతి రోజూ పగలు ఉపవాసముండి రాత్రి ఖియామ్ చేసే వ్యక్తి లాంటివాడు".

*(బుఖారీ:6006)*

## 6) ఉపవాసం వున్న వారికి ఇఫ్తార్ చేయించడం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఎవరైనా ఉపవాసం వున్న వ్యక్తికి ఇఫ్తార్ చేయిస్తే అతనిక్కూడా ఉపవాసం ఉన్న వారికి దొరికినంతగా పుణ్యఫలం దొరుకుతుంది. ఉపవాసం వున్న వారి పుణ్యఫలంతో ఎలాంటి తగ్గింపు రాదు".

*(తిర్మిజి, నసాయి, ఇబ్నె మాజ, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్:1078)*

# అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టడం ద్వారా దొరికే పుణ్యఫలాన్ని వృథా చేసే కార్యాలు

(1) ప్రదర్శనాబుద్ధి (2) ఉపకారాన్ని చాటుకోవడం

ఎవరైనా అల్లాహ్ మెప్పు కోసం కాకుండా (ప్రదర్శనాబుద్ధితో) కేవలం ప్రజలకు చూపించి తద్వారా వారి పొగడ్తలు, ప్రశంసలు అందుకోవాలన్న ఉద్దేశ్యంతో ఖర్చుచేస్తే అతని ఈ ఉద్దేశ్యం అతని పుణ్యఫలాన్ని వృథా చేసేస్తుంది.

అలాగే ఎవరైనా ఎవరికైనా దానం చేసిన లేదా అతని కోసం ఖర్చుపెట్టిన తర్వాత అతని వద్ద తన ఉపకారాన్ని చాటుకుంటే లేదా ప్రజల ముందు అతణ్ణి అగౌరవపరచి, అతని మనస్సును నొప్పిస్తే – అతని పుణ్యఫలం కూడా వృథా అయిపోతుంది.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تُبْطِلُوا صَدَقَاتِكُم بِالْمَنِّ وَالْأَذَىٰ كَالَّذِي يُنفِقُ مَالَهُ رِئَاءَ النَّاسِ وَلَا
يُؤْمِنُ بِاللَّهِ وَالْيَوْمِ الْآخِرِ ۖ فَمَثَلُهُ كَمَثَلِ صَفْوَانٍ عَلَيْهِ تُرَابٌ فَأَصَابَهُ وَابِلٌ فَتَرَكَهُ صَلْدًا ۖ لَّا يَقْدِرُونَ
عَلَىٰ شَيْءٍ مِّمَّا كَسَبُوا ۗ وَاللَّهُ لَا يَهْدِي الْقَوْمَ الْكَافِرِينَ (264) وَمَثَلُ الَّذِينَ يُنفِقُونَ أَمْوَالَهُمُ
ابْتِغَاءَ مَرْضَاتِ اللَّهِ وَتَثْبِيتًا مِّنْ أَنفُسِهِمْ كَمَثَلِ جَنَّةٍ بِرَبْوَةٍ أَصَابَهَا وَابِلٌ فَآتَتْ أُكُلَهَا
ضِعْفَيْنِ فَإِن لَّمْ يُصِبْهَا وَابِلٌ فَطَلٌّ ۗ وَاللَّهُ بِمَا تَعْمَلُونَ بَصِيرٌ (265)

**“ఓ విశ్వాసులారా! తన ధనాన్ని పరుల మెప్పుకోసం ఖర్చు చేస్తూ, అల్లాహ్‌ను గానీ, అంతిమ దినాన్ని గానీ విశ్వసించని వ్యక్తి మాదిరిగా మీరు మీ ఉపకారాన్ని చాటుకొని (గ్రహీతల) మనస్సులను నొప్పించి మీ దాన ధర్మాలను వృథా చేసుకోకండి. అతని ఉపమానం కొద్దిగా మట్టి పేరుకొని వున్న నున్నని రాతిబండ వంటిది. దానిపై భారీ వర్షం కురిసి, ఆ మట్టి కాస్తా కొట్టు కొని పోయి, కటిక రాయి మాత్రమే మిగులుతుంది. ఈ ప్రదర్శనాకారులకు తాము చేసుకున్న దానిలో నుంచి ఏమీ ప్రాప్తించదు. అల్లాహ్ సత్యతిరస్కారులకు సన్మార్గం చూపడు. ఇక దైవప్రసన్నతను చూరగొనే తపనతో, దృఢనమ్మకంతో తమ సంపదను ఖర్చుపెట్టేవారి ఉపమానం మెరక ప్రాంతంలో ఉన్న తోట వంటిది.**

**భారీ వర్షం కురిస్తే అది రెట్టింపు పంటను ఇస్తుంది. ఇకవేళ దానిపై పెద్ద వర్షం పడకుండా, కేవలం వానజల్లు కురిసినా సరిపోతుంది. అల్లాహ్ మీ పనులన్నింటినీ చూస్తూనే వున్నాడు".** ***(బఖర: 264, 265)***

ఈ ఆయత్‌లలో అల్లాహ్–ఉపకారాన్నిచాటుకుంటూ, గ్రహీతల మనస్సును నొప్పించి మన దానధర్మాలను వృథా చేసుకోవడాన్ని (గట్టిగా) వారించాడు. దీని ద్వారా తెలిసిందేమిటంటే – ఈ రెండు విషయాల ద్వారా దానధర్మాల పుణ్యఫలం వృథా అయిపోతుంది.

తదుపరి అల్లాహ్– ప్రదర్శనా బుద్ధితో దానం చేసేవారు మరియు కేవలం అల్లాహ్ మెప్పుకోసం ఖర్చుచేసే వారి వేర్వేరు ఉపమానాలు వివరించాడు.

ప్రదర్శనాబుద్ధితో ఖర్చుచేసే వారి ఆచరణను అల్లాహ్ – నున్నని రాతి బండపై పేరుకొనివున్న కొద్ది పాటి మట్టిలాగా పోల్చాడు. తదుపరి, ఆ రాతి బండపై భారీ వర్షం కురవగానే ఆ మట్టి కాస్త కొట్టుకుపోయి కేవలం రాతి బండ మాత్రమే మిగిలినట్లు అతనికూడా ఏమీ దొరకదు.

ఇక చిత్తశుద్ధితో ఖర్చుచేసే వారి ఆచరణను అల్లాహ్ – మెరకప్రాంతపు తోటతో పోల్చాడు. ఒకవేళ భారీ వర్షం కురిస్తే అది రెట్టింపు పంటను ఇస్తుంది. అలా కాకా, చిన్న వానజల్లు కురిసినా దాని కది సరిపోతుంది. అలాగే దాన ధర్మాలను కూడా చిత్తశుద్ధితో, కేవలం అల్లాహ్ మెప్పుకోసం చేస్తే దాని పుణ్యఫలం ఎన్నో రెట్లు పెరుగుతుంది.

అందుకే గోప్యంగా చేసే దాన ధర్మాలు బహిరంగంగా చేసే వాటి కన్నా ఉత్తమమైనవి. ఎందుకంటే గోప్యంగా చేసే దాన ధర్మాలలో చిత్తశుద్ధి ఎక్కువగా వుంటుంది. ప్రదర్శనాబుద్ధికి కూడా ఇది దూరంగా వుంటుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِن تُبْدُوا الصَّدَقَاتِ فَنِعِمَّا هِيَ ۖ وَإِن تُخْفُوهَا وَتُؤْتُوهَا الْفُقَرَاءَ فَهُوَ خَيْرٌ لَّكُمْ ۚ وَيُكَفِّرُ
عَنكُم مِّن سَيِّئَاتِكُمْ ۗ وَاللَّهُ بِمَا تَعْمَلُونَ خَبِيرٌ ○

**"ఒకవేళ మీరు బహిరంగంగా దాన ధర్మాలు చేసినా మంచిదే, కానీ గోప్యంగా నిరుపేదలకు ఇస్తే అది మీ కొరకు ఉత్తమం. (దీని వల్ల) అల్లాహ్ మీ పాపాలను తుడిచిపెడతాడు. అల్లాహ్‌కు మీరు చేసేదంతా తెలుసు".** ***(బఖర : 271)***

'గోప్యంగా చేయబడే దానం అల్లాహ్ ఆగ్రహాన్ని చల్లారుస్తుంది.'
*(అస్సహీహా లిల్ అల్‌బానీ : 1908)*

ఖర్చుపెట్టడం గురించి కొన్ని మర్యాదలు నేర్పుతూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

لَيْسَ عَلَيْكَ هُدَاهُمْ وَلَٰكِنَّ اللَّهَ يَهْدِي مَن يَشَاءُ ۗ وَمَا تُنفِقُوا مِنْ خَيْرٍ فَلِأَنفُسِكُمْ ۚ
وَمَا تُنفِقُونَ إِلَّا ابْتِغَاءَ وَجْهِ اللَّهِ ۚ وَمَا تُنفِقُوا مِنْ خَيْرٍ يُوَفَّ إِلَيْكُمْ وَأَنتُمْ لَا تُظْلَمُونَ (272)
لِلْفُقَرَاءِ الَّذِينَ أُحْصِرُوا فِي سَبِيلِ اللَّهِ لَا يَسْتَطِيعُونَ ضَرْبًا فِي الْأَرْضِ يَحْسَبُهُمُ
الْجَاهِلُ أَغْنِيَاءَ مِنَ التَّعَفُّفِ تَعْرِفُهُم بِسِيمَاهُمْ لَا يَسْأَلُونَ النَّاسَ إِلْحَافًا ۗ وَمَا
تُنفِقُوا مِنْ خَيْرٍ فَإِنَّ اللَّهَ بِهِ عَلِيمٌ (273)

"(ఓ విశ్వాసులారా!) మీరు అల్లాహ్ మార్గంలో ఏ మంచి వస్తువును ఖర్చుచేసినా, దాని లాభాన్ని స్వయంగా మీరే పొందుతారు. కాకపోతే మీరు కేవలం అల్లాహ్ ప్రసన్నత కోసమే ఖర్చు చేయాలి. మీరు ఎంత ఖర్చు చేసినా దాని పూర్తి ప్రతిఫలం మీకు ఇవ్వబడుతుంది. మీకు ఎంత మాత్రం అన్యాయం జరుగదు. అల్లాహ్ మార్గంలో నిమగ్నులైన కారణంగా, (బ్రతుకు తెరువు కోసం) భూమిలో సంచరించే వీలులేని నిరుపేదలు వాస్తవానికి మీ ధన సహాయానికి అర్హులు. వారి నిజస్థితిని గురించి తెలియనివారు, (ఆత్మాభిమానం వల్ల) వారు ఎవరినీ అడగక పోవడంచూసి, వారిని అవసరాలు లేనివారుగా తలపోస్తారు. మీరు వారి వాలకాన్ని చూసి వాస్తవస్థితిని ఊహించవచ్చు. తమకు సహాయం చెయ్యమంటూ వారు ప్రజల వెంట పడరు. (అటువంటి త్యాగధనుల సహాయార్థం) మీరు ఎంత సొమ్ము వెచ్చించినా, నిశ్చయంగా దాని గురించి అల్లాహ్‌కు తెలుసు". *(బఖర: 272, 273)*

ఇక ఉపకారాన్ని చాటుకుంటూ, గ్రహీతల మనస్సు నొప్పించే విషయాని కొస్తే- ఈ రెండింటి నుండి దూరంగా వుండి ఖర్చు చేసేవారికే అల్లాహ్ పుణ్యఫలం వాగ్దానం చేశాడు. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

الَّذِينَ يُنفِقُونَ أَمْوَالَهُمْ فِي سَبِيلِ اللَّهِ ثُمَّ لَا يُتْبِعُونَ مَا أَنفَقُوا مَنًّا وَلَا أَذًى ۙ لَّهُمْ
أَجْرُهُمْ عِندَ رَبِّهِمْ وَلَا خَوْفٌ عَلَيْهِمْ وَلَا هُمْ يَحْزَنُونَ (262)

**"ఎవరైతే అల్లాహ్ మార్గంలో తమ ధనాన్ని ఖర్చు చేసిన తరువాత తమ దాతృత్వాన్ని మాటిమాటికీ చాటుతూ ఉండకుండా, (గ్రహీతల మనస్సును) నొప్పించకుండా జాగ్రత్తపడతారో, వారి ప్రతిఫలం వారి ప్రభువు వద్ద ఉంటుంది. వారికెలాంటి భీతిగానీ, దు:ఖంగానీ ఉండదు".** ***(బఖర: 262)***

ఉపకారాన్ని చాటుకోవడం ఎంత పెద్ద పాపమో, మీరు ఈ హదీసు ద్వారా గ్రహించవచ్చు.

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ప్రళయం రోజు అల్లాహ్ ముగ్గురు వ్యక్తుల వైపు కన్నెత్తి కూడా చూడడు. తల్లిదండ్రుల అవిధేయుడు (వారి పట్ల చెడుగా వ్యవహరించేవాడు), ఎల్లప్పుడూ సారాయి త్రాగేవాడు మరియు ఉపకారాన్ని చాటుకొనేవాడు. ముగ్గురు వ్యక్తులు స్వర్గంలోకి ప్రవేశించలేరు– తల్లిదండ్రుల అవిధేయుడు, వారి మనస్సు నొప్పించేవాడు, దయ్యూస్ (తన ఇంట్లో అశ్లీల కార్యాలు జరుగుతున్నప్పటికీ చూసి మౌనంగా వుండేవాడు) మరియు మగవారి శైలిని అలవర్చుకొని వారిని అనుకరించే స్త్రీ".

*(నసాయీ, బజ్జార్, హాకిమ్, సహీహ్ అత్తర్‌గీబ్ వత్తర్‌హీబ్:2511)*

## 3) నాసిరకం వస్తువులను దానం చెయ్యడం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓا۟ أَنفِقُوا۟ مِن طَيِّبَٰتِ مَا كَسَبْتُمْ وَمِمَّآ أَخْرَجْنَا لَكُم مِّنَ ٱلْأَرْضِ ۖ وَلَا تَيَمَّمُوا۟
ٱلْخَبِيثَ مِنْهُ تُنفِقُونَ وَلَسْتُم بِـَٔاخِذِيهِ إِلَّآ أَن تُغْمِضُوا۟ فِيهِ ۚ وَٱعْلَمُوٓا۟ أَنَّ ٱللَّهَ غَنِىٌّ حَمِيدٌ (267)

**"ఓ విశ్వసించిన వారలారా! ధర్మ సమ్మతమైన మీ సంపాదనలో నుంచి, మేము మీ కోసం నేల నుంచి ఉత్పత్తి చేసిన వస్తువులలో నుంచి ఖర్చు చేయండి. వాటిలోని చెడు (నాసిరకం) వస్తువులను ఖర్చుపెట్టే సంకల్పం చేసుకోకండి – మీరు స్వయంగా కూడా వాటిని తీసుకోరు, ఒకవేళ కళ్ళు మూసుకుని వుంటే అది వేరే విషయం. అల్లాహ్ అక్కర లేనివాడు, సమస్త స్తోత్రములకు అర్హుడని తెలుసుకోండి".** ***(బఖర: 267)***

## 4) దాన ధర్మాలను తిరిగి తీసుకోవడం

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "తను చేసిన దానాన్ని తిరిగి తీసుకొనే వ్యక్తి – కడుపు నిండా భుజించి, తదుపరి వాంతి చేసుకొని, మళ్ళీ దానిని నాకే కుక్కలాంటి వాడు." *(అస్సహీహ అల్‌బానీ : 1699)*

ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి అల్లాహు అన్హు) కథనం:

నేకొన వ్యక్తికి జిహాద్ నిమిత్తం ఒక గుర్రాన్ని ఇవ్వగా దాన్ని అతను పోగొట్టుకున్నాడు. తదుపరి నేను – ఒకవేళ ఆ గుర్రం గనక దొరికితే మళ్ళీ దానిని కొనాలని సంకల్పించుకున్నాను. గుర్రం దొరికిన వ్యక్తి దానిని తక్కువ ధరకే అమ్మ వచ్చని నేననుకున్నాను. ఈ విషయం నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్ద ప్రస్తావించగా, ఆయన నాతో – దానిని కొనకు మరియు నీ దానాన్ని తిరిగి తీసుకోకు. ఒకవేళ నీకది ఒక దిర్హంలో దొరికినా సరే. ఎందుకంటే తన దానాన్ని తిరిగి తీసుకొనేవాడు – తన వాంతిని తానే నాకే కుక్క లాంటివాడు అని వివరించారు. *(బుఖారీ: 2623, ముస్లిం: 1620)*

అందుకే అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టేవారు తమ దాన ధర్మాలను వృథా చేసే ఈ కార్యాలన్నింటి నుంచి దూరంగా వుండాలి. అల్లాహ్ మనందరినీ తన మార్గంలో ఖర్చు చేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక! మరియు మన దాన ధర్మాలను స్వీకరించుగాక!

## రెండవ ఖుత్బా

మొదటి ఖుత్బాలో మేము దానధర్మాల మహత్యం, ప్రయోజనాలు మరియు వాటికి సంబంధించిన ఆదేశాల గురించి వివరించాము. ఇక ఇది కూడా తెలుసుకోండి – దాన ధర్మాలలో అత్యంత ప్రముఖమైన దానం జకాత్ చెల్లింపు.

## జకాత్ పరిచయం

అరబీ భాషలో 'జకాత్' పదాన్ని 'పరిశుద్ధత', 'పెరుగుదల' మరియు 'శుభప్రదం' అన్న అర్థాలలో వాడతారు. ఇక షరీయతు పరంగా 'జకాత్' అంటే – ఒక ప్రత్యేక సంపద నుంచి ప్రత్యేక భాగాన్ని తీసి ప్రత్యేక మనుషులకు ఇచ్చేది. దీనిని జకాత్ అని ఎందుకంటారంటే – ఇది చెల్లించే వారి మనస్సు

పరిశుద్ధమవుతుంది, దీనితో పాటు అతని సంపద కూడా పరిశుద్ధపరచబడి శుభ్రంగా అవుతుంది.

గుర్తుంచుకోవాల్సిన విషయమేమిటంటే – జకాత్ కొరకు ఖురాన్ మరియు సున్నత్‌లో 'దానం' అన్న పదం కూడా వచ్చింది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

خُذْ مِنْ اَمْوَالِهِمْ صَدَقَةً تُطَهِّرُهُمْ وَتُزَكِّيْهِمْ بِهَا وَصَلِّ عَلَيْهِمْ ؕ

**"ఓ ప్రవక్తా!) నువ్వు వారిని పరిశుద్ధ పరచడానికీ, వారిని తీర్చిదిద్దడానికీ వారి సంపదల నుంచి దానాలను తీసుకో".** ***(తౌబా: 103)***

## జకాత్ ప్రాముఖ్యత

1) ఇస్లాం ఆధారపడి వున్న ఐదు మౌలిక అంశాలలో జకాత్ కూడా ఒకటి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఇస్లాం పునాది 5 మౌలిక అంశాలపై ఆధారపడివుంది. అల్లాహ్ తప్ప మరో (నిజమైన) ఆరాధ్యుడెవ్వరూ లేరని, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయన దాసులు మరియు ప్రవక్త అని సాక్ష్యమివ్వడం, నమాజు నెలకొల్పడం, జకాత్ చెల్లించడం...." *(బుఖారీ, ముస్లిం)*

2) జకాత్ అల్లాహ్ కారుణ్యం పొందడానికి సాధనం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

مَنْ اَشَآءُ ۚ وَرَحْمَتِيْ وَسِعَتْ كُلَّ شَيْءٍ ؕ فَسَاَكْتُبُهَا لِلَّذِيْنَ يَتَّقُوْنَ وَيُؤْتُوْنَ الزَّكٰوةَ
وَالَّذِيْنَ هُمْ بِاٰيٰتِنَا يُؤْمِنُوْنَ ﴿156﴾

**"నా కారుణ్యం అన్ని వస్తువులనూ ఆవరించివుంది. భయభక్తుల వైఖరిని అవలంబిస్తూ, జకాత్‌ను చెల్లిస్తూ, మా ఆయత్‌లను విశ్వసించేవారి పేర ఈ కారుణ్యాన్ని తప్పకుండా వ్రాస్తాను."** ***(ఆరాఫ్:156)***

3) జకాత్–ఇస్లామీయ సోదర భావానికి ఒక షరతు.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَاِنْ تَابُوْا وَاَقَامُوا الصَّلٰوةَ وَاٰتَوُا الزَّكٰوةَ فَاِخْوَانُكُمْ فِي الدِّيْنِ ؕ

**"ఇప్పటికైనా వారు పశ్చాత్తాపం చెంది, నమాజును నెలకొల్పుతూ, జకాత్‌ను విధిగా చెల్లించటం మొదలుపెడితే వారు మీ ధార్మిక సోదరులే".**

***(తౌబా:11)***

4) ముస్లిం సమాజంలో సర్వసాధారణంగా వుండాల్సిన అలవాట్లలో జకాత్ కూడా ఒకటి.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالْمُؤْمِنُوْنَ وَالْمُؤْمِنٰتُ بَعْضُهُمْ اَوْلِيَآءُ بَعْضٍ ۘ يَاْمُرُوْنَ بِالْمَعْرُوْفِ وَيَنْهَوْنَ عَنِ الْمُنْكَرِ وَيُقِيْمُوْنَ الصَّلٰوةَ وَيُؤْتُوْنَ الزَّكٰوةَ

**"విశ్వాసులైన పురుషులూ, విశ్వాసులైన స్త్రీలూ – వారంతా ఒండొకరికి మిత్రులుగా (సహాయకులుగా, చేదోడువాదోడుగా) ఉంటారు. వారు మంచిని గురించి ఆజ్ఞాపిస్తారు, చెడుల నుంచి వారిస్తారు. నమాజులను నెలకొల్పుతారు, జకాత్‌ను చెల్లిస్తారు".** ***(తౌబా : 71)***

5) జన్నతుల్ ఫిర్‌దౌస్‌కు వారసులయ్యే విశ్వాసుల లక్షణాలలో జకాత్ చెల్లించడం కూడా ఒకటి.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِيْنَ هُمْ لِلزَّكٰوةِ فٰعِلُوْنَ ۙ

**"వారు (తమపై విధించబడిన) జకాతు విధానాన్ని పాటిస్తారు".**

***(మూమినూన్:4)***

6) అబూ అయ్యూబ్ (రజి అల్లాహు అన్హు) కథనం:

ఒక వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో – నన్ను స్వర్గంలోకి చేర్చే ఆచరణ గురించి చెప్పండి, తద్వారా నేను దానిని ఆచరించి స్వర్గంలోకి వెళ్ళగలుగుతాను అని అడిగాడు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – " కేవలం అల్లాహ్‌ను ఆరాధిస్తూ వుండు, ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ చేర్చకు, ఫర్జ్ నమాజును ఎల్లప్పుడూ నెలకొల్పుతూవుండు, జకాత్ చెల్లిస్తూ వుండు, బంధుత్వ సంబంధాలను కాపాడుతూ వుండు" అని వివరించారు. *(బుఖారీ, ముస్లిం)*

7) జకాత్ చెల్లించడం ద్వారా సంపద వృద్ధి చెందుతుంది, శుభ ప్రదమవుతుంది, ఆపద, విపత్తుల నుండి సురక్షితంగా వుంటుంది.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَآ ءَاتَيْتُم مِّن رِّبًا لِّيَرْبُوَا۟ فِىٓ أَمْوَٰلِ ٱلنَّاسِ فَلَا يَرْبُوا۟ عِندَ ٱللَّهِ ۖ وَمَآ ءَاتَيْتُم مِّن زَكَوٰةٍ تُرِيدُونَ وَجْهَ ٱللَّهِ فَأُو۟لَٰٓئِكَ هُمُ ٱلْمُضْعِفُونَ ﴿39﴾

**"ప్రజల సొమ్ములో చేరి వృద్ధి చెందుతుందన్న ఉద్దేశ్యంతో మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృష్టిలో ఎంత మాత్రం వృద్ధి చెందదు. అయితే అల్లాహ్ ముఖాన్ని చూసేందుకు (ప్రసన్నతను చూరగొనేందుకు) మీరు జకాతు దానం ఇచ్చినట్లయితే – అలాంటి వారే (తమ సంపదలను) ఎన్నో రెట్లు వృద్ధి పరుచుకున్నవారవుతారు".** ***(రూమ్: 39)***

## జకాత్ ప్రయోజనాలు

1) ఉపాధి పంపిణీని అల్లాహ్ తన వద్ద ఉంచుకున్నాడు. తన ఇష్ట ప్రకారం కొందరికి ఎక్కువగానూ, కొందరికి తక్కువగానూ ఇవ్వడానికి. కానీ, ధనవంతులకు మాత్రం ఆయన జకాత్ చెల్లించమని, దానధర్మాలు చేస్తూ ఖర్చు పెట్టమని ఆదేశించాడు. తద్వారా అడిగే ఆవశ్యకత లేకుండానే నిరుపేదలకు, వారి అవసరాలు తీర్చుకోవడానికి ఎంతో కొంత దొరుకుతూ వుండడానికి. ఇక నిరుపేదలకు, ఆయన – సహనం మరియు కృతజ్ఞత లాంటి విశేషగుణాలను అలవర్చుకోమని ఆజ్ఞాపించాడు. ఇలా ఇరువురూ పుణ్యఫలానికి హక్కుదారు లవుతారు. ధనవంతులు ఖర్చు పెట్టడం ద్వారా మరియు నిరుపేదలు సహనం మరియు కృతజ్ఞతలు చూపడం ద్వారా.

2) ఇస్లామీయ ఆర్థిక వ్యవస్థ విశేషమేమిటంటే – ఒకవేళ చిత్తశుద్ధితో గనక దానిని అమలు పరిస్తే, సందప కేవలం కొంతమంది దగ్గర కేంద్రీకృతం కాకుండా సమాజంలోని ప్రజలందరి మధ్య తిరుగుతూ వుంటుంది. దీనికి విరుద్ధంగా ఇతర ఆర్థిక వ్యవస్థలలో సమాజంలోని కొందరు వ్యక్తులైతే భోగభాగ్యాలతో జీవిస్తుంటారు, కానీ వారి చుట్టు ప్రక్కల వుండేవారు మాత్రం పేదరికంలో కొట్టుమిట్టాడుతుంటారు. ఇదెంతో దౌర్జన్యకరమైన విషయం. (అందుకే) సమాజంలోని ఆర్థిక సమతూకాన్ని యథావిధిగా వుంచి, సామాజిక

దౌర్జన్య ద్వారాన్ని మూసివేయడానికి అల్లాహ్ జకాత్‌ను విధిగా చేసి, దానధర్మాల గురించి ప్రోత్సహించాడు. తద్వారా సమాజంలో ప్రజలందరూ ధన సంపదల ద్వారా ప్రయోజనం పొందగలుగుతారు.

3) జకాత్‌ను చెల్లించడం ద్వారా ధనవంతులు, నిరుపేదల మధ్య ప్రేమానురాగాలు జన్మిస్తాయి. దీనితో సమాజం అసూయ, ద్వేషం, స్వార్థం లాంటి రోగాల నుండి పరిశుద్ధమవుతుంది. జకాత్ చెల్లించే వారిలో దాతృత్వం, దయ, సానుభూతి మరియు జకాత్ పుచ్చుకొనేవారిలో కృతజ్ఞత, వినయ విధేయతలు లాంటి విశేషగుణాలు జన్మిస్తాయి. అంటే జకాత్ వ్యవస్థ సమాజంలో నైతిక విలువల ఉన్నతికి దోహదపడుతుంది.

4) గత చరిత్ర ఈ విషయం గురించి సాక్ష్యంగా వుంది:

సజ్జనులైన ఖలీఫాల పరిపాలనా కాలంలో జకాత్‌ను ప్రభుత్వం తరఫు నుండి సేకరించి నిరుపేదలకు పంచడం జరిగేది. దీని ఫలితంగా ఎలాంటి పరిస్థితి ఏర్పడిందంటే – (జకాత్ ఇవ్వడానికి) నిరుపేదలను వెతికినప్పటికీ (జకాత్ పుచ్చుకోవడానికి) సమాజంలో నిరుపేదలెవరూ దొరికేవారు కాదు. దీనితో – జకాత్‌ను ధనాగారం (బైతుల్‌మాల్)లో జమ చేసేవారు. తదుపరి దానిని ముస్లిం సమాజ శ్రేయస్సు కోసం ఖర్చు చేసేవారు. దీని ద్వారా రూఢీ అయినదేమిటంటే – ఇస్లామీయ జకాత్ వ్యవస్థ ద్వారా సమాజంలో పేదరికం నిర్మూలించబడుతుంది. కేవలం షరతు ఏమిటంటే – దానిని పూర్తి చిత్తశద్ధితో, నిజాయితీతో స్థాపించాలి.

5) ఒకవేళ ధనవంతులు జకాత్ చెల్లించకపోతే, సమాజంలోని నిరుపేదలు హీనభావానికి లోనై, ధనవంతుల పట్ల వారి హృదయాల్లో శత్రుత్వ భావన పెరగవచ్చు. తద్వారా వారు తమ అవసరాలు తీర్చుకోవడానికి దొంగ తనాలు, దోపిడీల వంటి నేరాలు చేయడం ప్రారంభించవచ్చు. ఇలా సమాజంలో అశాంతి, చట్టాలేవీ లేని(పని చేయని) భయానక పరిస్థితి ఏర్పడుతుంది. దీనికి విరుద్ధంగా, ఇస్లామీయ జకాత్ వ్యవస్థ ఇలాంటి నేరాల ద్వారాలను మూసివేసి సమాజంలో శాంతి భద్రతల గ్యారంటీని సమకూరుస్తుంది.

6) సంపద అనేది అల్లాహ్ అనుగ్రహాలలో ఒకటి కనుక దీనికిగాను అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలపడం తప్పనిసరి. దాని ఒకే ఒక స్వరూపం ఏమిటంటే ఆ సంపద నుండి జకాత్‌ను చెల్లించడం.

అంతేకాక–అల్లాహ్ అనుగ్రహాలకు గాను కృతజ్ఞతలు తెలిపితే ఆ అనుగ్రహాలు ఇంకా వృద్ధి చెందుతాయన్న విషయం తెలిసిందే.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

لَئِن شَكَرْتُمْ لَأَزِيدَنَّكُمْ

**“మీరు గనక కృతజ్ఞులుగా మెలిగితే, నేను మీకు మరింత అధికంగా అనుగ్రహిస్తాను”.** ***(ఇబ్రాహీం:7)***

## జకాత్ చెల్లించని వాని పరిణామం

ఇంతకుముందే వివరించినట్లు జకాత్ ఒక విధి మరియు ఇస్లాం మౌలిక అంశాలలో ఒకటి. ఇక ఏ వ్యక్తి అయినా దీని విధిత్వాన్ని నిరాకరిస్తే సత్య తిరస్కారుడైపోయి, మరణదండనకు అర్హుడైపోతాడు. ఈ కారణంగానే, అబూ బక్ర్ సిద్దీఖ్ (రజి అల్లాహు అన్హు) – తాను ఖలీఫా అయ్యాక జకాత్ చెల్లించడానికి నిరాకరించిన వారికి విరుద్ధంగా యుద్ధ ప్రకటన చేస్తూ ఇలా అన్నారు:

“అల్లాహ్ సాక్షి! ఎవరైనా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు (జకాత్ రూపంలో) ఒక్క త్రాడు ఇచ్చి వున్నా ఒకవేళ వారు దానిని నాకు (జకాత్ రూపంలో) సమర్పించకపోతే, వారితో నేను యుద్ధం చేస్తాను” *(బుఖారీ: 7284, ముస్లిం:20)*

ఇక ఏ వ్యక్తి అయినా జకాత్ విధిత్వాన్ని విశ్వసించినప్పటికీ దానిని చెల్లించడో, అతని పర్యవసానం గురించి ఒక ఆయతు మరియు ఒక హదీసును వినండి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِينَ يَكْنِزُونَ الذَّهَبَ وَالْفِضَّةَ وَلَا يُنفِقُونَهَا فِي سَبِيلِ اللَّهِ فَبَشِّرْهُم بِعَذَابٍ أَلِيمٍ ۝ يَوْمَ يُحْمَىٰ عَلَيْهَا فِي نَارِ جَهَنَّمَ فَتُكْوَىٰ بِهَا جِبَاهُهُمْ وَجُنُوبُهُمْ وَظُهُورُهُمْ ۖ هَٰذَا مَا كَنَزْتُمْ لِأَنفُسِكُمْ فَذُوقُوا مَا كُنتُمْ تَكْنِزُونَ ۝

**“ఎవరు వెండి, బంగారాలను పోగుచేస్తూ వాటిని అల్లాహ్ మార్గంలో ఖర్చు పెట్టడం లేదో వారికి బాధాకరమైన శిక్ష వుందన్న శుభవార్త**

**వినిపించు. ఏ రోజున ఈ ఖజానాను నరకాగ్నిలో కాల్చి దానితో వారి నొసటిపై, పార్శ్వాలపై, వీపులపై వాతలు వేయడం జరుగుతుందో అప్పుడు, ఇది మీరు మీ కోసం సమీకరించినది. కాబట్టి ఇప్పుడు మీ ఖజానా రుచి చూడండి (అని వారితో అనబడుతుంది)". *(తౌబా: 34,35)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ ఎవరికైతే సంపదను అనుగ్రహించాడో, అతను తన సంపద నుండి జకాత్ చెల్లించకపోతే – ప్రళయం రోజు అతని సంపద అత్యంత విష సర్పం రూపంలో అతని వద్దకు వస్తుంది. దాని కళ్ళపై భాగంలో రెండు నల్లని మచ్చలుంటాయి. అది అతని మెడలో సంకెళ్ళ లాగా చుట్టుకొని పోయి, అతని దవడలను పట్టుకొని ఇలా అంటుంది – నేను నీ సంపదను, నేను నీ ఖజానాను....." *(బుఖారీ:1403)*

## ఏయే వస్తువులపై జకాత్ విధిగా చెల్లించాలి?

ఇస్లాంలో ఏయే వస్తువులపై జకాత్ విధిగా వున్నదో, వాటికి సంబంధించిన కొన్ని వివరాలు ఇవి:

## 1) బంగారము/ వెండి మరియు నగదు డబ్బు

బంగారము/ వెండిలో జకాత్ విధిగా వుంది. కేవలం షరతు ఏమిటంటే, దాని పరిమాణం నిర్ణయించబడ్డ పరిమితికి సమానంగా లేక అధికంగా వుండి, ఒకరి స్వాధీనంలో ఒక సం॥ దాకా వున్నప్పుడు. బంగారము పరిమితి 85 గ్రాములు. కాగా వెండి పరిమితి 595 గ్రాములు ఒకవేళ బంగారం 85 గ్రాముల కన్నా, వెండి 595 గ్రాముల కన్నా తక్కువగా ఉన్న పక్షంలో వాటిపై జకాత్ విధిగా వుండదు. ఒకవేళ వీటి పరిమాణం పరిమితికి సమానంగా లేక అధికంగా వున్నప్పటికీ, 1 సం॥ గడువు కాలం పూర్తవకపోతే వీటిపై జకాత్ విధిగా వుండదు. రెండు షరతులు పూర్తయినప్పుడు జకాత్‌ను లెక్కకట్టే విధానం ఏమిటంటే – అన్నిటి కన్నా ముందుగా దీని బరువును లెక్క పెట్టాలి. తదుపరి మార్కెట్ ధర ప్రకారం వీటి మొత్తం బరువు విలువ లెక్కపెట్టాలి. ఆ తర్వాత దాని 2.5 శాతం (40వ భాగం) విలువను జకాత్ సంకల్పంతో చెల్లించాలి.

వివరణ (1): బంగారం/ వెండి ముద్ద రూపంలో వున్నా లేక నగల రూపంలో వున్నా – రెండు పరిస్థితుల్లోనూ జకాత్ చెల్లించడం విధి.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహ్ అన్హు) కథనం: ఒక స్త్రీ తన కూతుర్ని వెంట బెట్టుకొని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చింది. ఆమె కూతురు బంగారు గాజులు ధరించి వుండడం చూసి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెతో – నువ్వు వీటి జకాత్ చెల్లిస్తావా? అని అడిగారు. ఆ స్త్రీ – లేదు అని అంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ప్రళయం రోజు అల్లాహ్ నీకు వీటికి బదులుగా అగ్ని గాజులు తొడిగించడం నీకిష్టమేనా? అని అన్నారు. ఆమె వెంటనే వాటిని తీసి నేలపై విసిరి– ఇవి అల్లాహ్, ఆయన ప్రవక్త కొరకు అని అంది. *(అబూ దావూద్:1563, నసాయి:2479, సహీహ్ –అల్‌బానీ)*

వివరణ (2) : కరెన్సీ నోట్లు – రియాల్, దీనార్, రూపాయి లేదా డాలర్...ఇవన్నీ బంగారం/ వెండికి సంబంధించిన ఆజ్ఞల క్రిందికే వస్తాయి.. అందుకే ఎవరి వద్దనైనా వెండి పరిమితి విలువకు సమానంగా లేదా అధికంగా కరెన్సీ వుండి, దానిపై 1 సం॥ గడువు కాలం పూర్తయితే దానిపై జకాత్ విధిగా అవుతుంది.

వివరణ (3) : అప్పుగా ఇచ్చివున్న డబ్బుపై జకాత్‌కు సంబంధించి రెండు స్వరూపాలున్నాయి. – వీటిలో మొదటిది – రుణగ్రహీత రుణం చెల్లించ డానికి అంగీకరిస్తాడు. త్వరగా కానీ, ఆలస్యంగా గానీ రుణంగా తీసుకున్న మొత్తాన్ని చెల్లించగలిగే సామర్థ్యం కూడా కలిగి వుంటాడు. ఈ పరిస్థితిలో రుణంగా ఇచ్చిన డబ్బుపై జకాత్‌ను రుణ దాత చెల్లించాల్సి వుంటుంది. దాని పద్ధతి ఏమిటంటే–1 సం॥ గడువు కాలం పూర్తయ్యాక తన వద్ద నున్న ధనాన్ని లెక్కించేటప్పుడు, దానితోపాటు రుణంగా ఇచ్చి వున్న డబ్బును కూడా కలిపి ఆ మొత్తం నుండి రెండున్నర శాతాన్ని జకాత్ రూపంలో తీసి చెల్లించాల్సి వుంటుంది.

ఇక రెండవ స్వరూపం ఏమిటంటే – రుణగ్రహీత రుణం చెల్లించడానికి నిరాకరిస్తాడు. కోర్టు ద్వారా కూడా ఆ ధనాన్ని పొందటం అంత తేలిక కాదు లేదా రుణ గ్రహీత రుణం చెల్లించడానికైతే అంగీకరిస్తాడు కానీ తన మాటను నిలబెట్టుకోకుండా వాగ్దాన భంగం చేస్తూ వుంటాడు లేదా అతని ఆర్థిక స్థితి

అంత బాగా లేదు – ఈ పరిస్థితిలో రుణంగా ఇచ్చివున్న డబ్బుపై జకాత్ విధిగా వుండదు. కానీ, ఒకవేళ రుణ గ్రహీత రుణాన్ని తిరిగి చెల్లిస్తే దాని నుండి గత ఒక సంIIపు జకాత్ చెల్లించాలి.

వివరణ (4) : ఒక వ్యక్తి దగ్గర జకాత్ పరిమితి అంత ధనం వుంది. అది బంగారం/వెండి రూపంలో గానీ లేదా నగదు రూపంలో గానీ లేదా మరేదైనా రూపంలో గానీ. కానీ అతను స్వయాన రుణగ్రస్తుడు. ఒకవేళ జకాత్ చెల్లిస్తే అతని ఆర్థిక స్థితి మరింత భారంగా తయారయ్యే ప్రమాదముంది. ఇలాంటి పరిస్థితిలో అతనిపై జకాత్ విధిగా వుండదు. కానీ, ఒకవేళ రుణం తీర్చిన తర్వాత కూడా అతని వద్ద జకాత్ పరిమితి అంత ధనం వుండి, దానిపై 1 సంII గడువు కాలం పూర్తయితే అప్పుడు దాని నుండి రెండున్నర శాతం తీసి జకాత్ రూపంలో చెల్లించాల్సి వుంటుంది.

వివరణ (5) : ఏదైనా కంపనీ షేర్లను వ్యాపార నిమిత్తం కొని వుంటే, దానిపై 1 సంII గడువు కాలం పూర్తయితే వాటి జకాత్‌ను చెల్లించాల్సి వుంటుంది. ఒకవేళ కంపనీయే స్వయంగా తన భాగస్వాముల షేర్లన్నింటి జకాత్‌ను చెల్లిస్తే సరి, లేకపోతే భాగస్వాములందరూ తమ తమ షేర్ల నుండి జకాత్‌ను చెల్లించాల్సి వుంటుంది.

వివరణ (6) : జకాత్ కేవలం స్వచ్ఛమైన బంగారం/వెండిపై విధిగా వుంది. అందుకే ఒకవేళ వాటిలో ఇతర లోహాలు కలిసివుంటే వాటి బరువును తీసేసిన తరువాత స్వచ్ఛమైన బంగారం/ వెండి గనక జకాత్ పరిమితికి చేరుకోకపోతే వాటిపై జకాత్ వుండదు.

## 2) వ్యాపార సామగ్రి

జకాత్ విధిగా అయ్యే రెండవ వస్తువు వ్యాపార సామగ్రి. అంటే – వ్యాపార నిమిత్తం కొనబడే వస్తువులన్నీ అన్నమాట. అవి లోకల్ మార్కెట్ల నుండి కొన్నవి కావచ్చు లేదా బయటి మార్కెట్ల నుంచి కొన్నవి కావచ్చు. తమ అవసరాల కోసం కొనే వస్తువులు ఈ పరిధిలోకి రావు. ఉదాIIకు ఇల్లు, బండి, భూమి మొIIవి, వీటి మీద జకాత్ విధిగా వుండదు. అలాగే పరిశ్రమలకు సంబంధించిన యంత్రాలు, పనిముట్లు, స్టోర్లు, వాటిలోని అల్మారాలు, ఆఫీసు

ఫర్నీచర్....వీటిలో జకాత్ వుండదు. ఈ వస్తువులన్నీ ఒకేచోట ఉంచబడతాయి. వీటిని అమ్మాలన్న ఉద్దేశ్యం వుండదు.

## వ్యాపార సామగ్రిపై జకాత్ చెల్లించే విధానం

1 సం॥ గడువు ముగిసిన తర్వాత వ్యాపారస్తుడు (కంపనీ కూడా కావచ్చు) తన వద్దనున్న యావత్ వ్యాపార సామగ్రి యొక్క మార్కెట్ విలువను లెక్కించి, దానితోపాటు తన వద్ద నగదుగా వున్న సొమ్మును కలిపి, దాని నుండి అప్పుగా ఏమైనా చెల్లించాల్సి వుంటే దానిని తీసివేసి, అలాగే వ్యక్తిగతంగా తను ఏమైనా అప్పు తీసుకొని వుంటే దానిని కూడా తీసి వేసి మిగిలిన మొత్తం విలువ నుండి రెండున్నర శాతం తీసి జకాత్ రూపంలో చెల్లించాలి.

వివరణ: యంత్రాలు, పనిముట్ల అసలు ధరపై జకాత్ లేదు. కానీ, వాటి ద్వారా వచ్చే ఆదాయం గనక జకాత్ పరిమితికి చేరుకొని, దానిపై 1 సం॥ గడువు కాలం పూర్తయితే దానిపై జకాత్ విధిగా వుంటుంది. ఈ ఆదేశమే అద్దెకిచ్చిన ఇండ్లకు, దుకాణాలకు, వాహనాలకూ వర్తిస్తుంది. వీటి అసలు ధరపై జకాత్ వుండదు. కేవలం వాటి ద్వారా వచ్చిన అద్దె మీదనే వుంది. అది కూడా జకాత్ పరిమితికి చేరుకొని 1 సం॥ గడువు పూర్తయితే దానిలో రెండున్నర శాతం జకాత్‌గా చెల్లించాల్సి వుంటుంది. అంతేగాక, ఈ వస్తువులపై కట్టే పన్ను మరియు వీటి బాగోగుల కోసం అయ్యే ఖర్చు వాటి ద్వారా వచ్చిన సంపాదన నుండి తీసివేయాలి. ఒకవేళ ఈ వస్తువుల యజమానికి వీటి మినహా మరో జీవనోపాధి మార్గం లేకపోతే, తన భార్యాపిల్లల కయ్యే ఖర్చును కూడా దీనిలోనుంచి తీసేసి మిగిలిన డబ్బు నుండి జకాత్ చెల్లించాలి.

## 3) పశువులు

విధిగా జకాత్ చెల్లించాల్సిన పశువులు ఇవి: ఒంటె, ఆవు/ గేదెలు మరియు మేకలు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి దగ్గరైనా ఒంటెలు లేదా ఆవులు లేదా మేకలు వుండి అతను వాటి జకాత్ చెల్లించకపోతే ప్రళయం రోజు అవి భారీ కాయంతో, ఎంతో పెద్దగా చేసి తీసుకురాబడతాయి. తదుపరి అతణ్ణి తమ కాళ్ళతో త్రొక్కుతూ కొమ్ములతో పొడుస్తాయి. అవన్నీ అతని మీది నుంచి (తొక్కుతూ, పొడుస్తూ) వెళ్ళిపోయాక,

మళ్ళీ మొదటి దానిని పిలవడం జరుగుతుంది. ఇలా ప్రజలందరి నిర్ణయం జరిగేదాక, అతనితో ఇలానే వ్యవహరించడం జరుగుతుంది. *(బుఖారీ: 1460)*

పశువులలో జకాత్ కోసం నాలుగు షరతులు వున్నాయి.

**మొదటిది**–అవి జకాత్ పరిమితికి చేరుకోవాలి. ఒంటెల పరిమితి కనీసం 5 ఒంటెలు. ఆవులు/ గేదెల పరిమితి 30 మరియు మేకల పరిమితి 40.

**రెండవది** – ఆ పశువులు ఒక వ్యక్తి స్వాధీనంలో 1 సం॥ దాకా వుండాలి.

**మూడవది** – సంవత్సరంలో అధిక భాగం ఆ పశువులు స్వయంగా మేస్తూ, వాటి యజమానికి సం॥లో ఎక్కువ భాగం వాటి ఆహారాన్ని కొనాల్సిన అవసరం వుండకూడదు.

**నాల్గవది**– ఈ పశువులు వ్యవసాయానికి లేదా ఏవైనా బరువులు మోయటానికి ఉపయోగించకుండా వుండాలి.

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన ఒక విషయం ఏమిటంటే– ఏవైనా పశువులను వ్యాపార నిమిత్తం కొనుగోలు చేస్తే, వాటిపై జకాత్ – వ్యాపార వస్తువులపై జకాత్ తీసినట్లు–వాటి ధర ప్రకారం చెల్లించాలి, అంతేగానీ వాటి సంఖ్య ప్రకారం కాదు.

**నోట్ :** పశువుల పరిమితి గురించి మరిన్ని వివరాలను హదీసు మరియు ఫికహ్ గ్రంథాలలో చూడవచ్చు.

## 4) భూ ఉత్పత్తులు

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا أَنفِقُوا مِن طَيِّبَاتِ مَا كَسَبْتُمْ وَمِمَّا أَخْرَجْنَا لَكُم مِّنَ الْأَرْضِ

**"ఓ విశ్వసించినవారలారా! ధర్మ సమ్మతమైన మీ సంపాదనలో నుంచి, మేము మీ కోసం నేల నుంచి ఉత్పత్తి చేసిన వస్తువులలో నుంచి ఖర్చు చేయండి".** ***(బఖర : 267)***

ఈ ఆయతు ద్వారా రూఢీ అయినదేమిటంటే – భూ ఉత్పత్తులు ఉదా॥ గోధుమలు, జొన్నలు, బియ్యం, ఖర్జూరాలు, ద్రాక్ష మరియు జైతూన్...లలో

జకాత్ విధిగా వుంది. ఈ విషయంలో ఉమ్మత్ (అనుచర సమాజం)లో ఏకాభిప్రాయం (ఇజ్మా) వుంది.

## భూ ఉత్పత్తుల జకాత్ పరిమితి

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఐదు వసఖ్ల కన్నా తక్కువ దానిలో జకాత్ లేదు". *(బుఖారీ:1405, ముస్లిం: 979)*

ఐదు వసఖ్ల పరిమాణాన్ని నేటి కొలతతో పోలిస్తే 653 కేజీలు అవుతుంది. ఇలా ఏ భూ ఉత్పత్తి అయినా 653 కేజీల కన్నా తక్కువగా వుంటే దానిపై జకాత్ విధిగా వుండదు. కొందరు విద్వాంసులు ఈ పరిమాణాన్ని 630 కేజీలని ప్రస్తావించారు.

## భూ ఉత్పత్తులలో ఎంత భాగం జకాత్గా చెల్లించాలి?

దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ ఉత్పత్తులైతే వర్షం నీటి ద్వారా లేదా కాలువ నీటి ద్వారా లేదా తమంతట తామే భూమి లోపలి నీటిని ఉపయోగించుకోవడం ద్వారా పండించబడ్డాయో వాటిలో పదవ భాగం మరియు ఏ ఉత్పత్తులైతే యంత్రాలను పయోగించి నీళ్ళు పట్టడం ద్వారా కష్టపడి నీళ్ళు పట్టడం ద్వారా పండించ బడ్డాయో వాటిలో 20వ భాగం (జకాత్ తీయాలి)". *(బుఖారీ: 1483)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే – వర్షం నీరు, కాలువల నీటితో పండించబడ్డ ఉత్పత్తులలో పదవ భాగం మరియు యంత్రాల ద్వారా నీళ్ళు పట్టి పండించిన ఉత్పత్తులలో 20వ భాగాన్ని జకాత్ రూపంలో చెల్లించాలి.

వివరణ (1): భూ ఉత్పత్తుల కోసం 1 సం॥ గడువు కాలం లేదు. పంట పండి, చేతికొచ్చిన వెంటనే జకాత్ చెల్లించాలి.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَآتُوا حَقَّهُ يَوْمَ حَصَادِهِ

**"పంట కోసే రోజున తప్పనిసరిగా చెల్లించవలసిన దాని హక్కును చెల్లించండి".** ***(అన్ఆమ్: 141)***

వివరణ(2): ఎప్పటికప్పుడు తాజాగా ఉపయోగించే పండ్లలో,

కూరగాయల్లో జకాత్ లేదు. ఒకవేళ వాటితో వ్యాపారంచేస్తే అది వేరే విషయం. అప్పుడు (వ్యాపారం చేస్తే గనక) వాటి విలువ జకాత్ పరిమితికి చేరుకొని, తదుపరి సం॥ కాలం గడువు పూర్తయితే దాని నుండి రెండున్నర శాతం జకాత్ చెల్లించాల్సి వుంటుంది.

## జకాత్ హక్కు దారులు

జకాత్‌కు సంబంధించిన వివరాల నేపథ్యంలో, దీనిని స్వీకరించగలిగే హక్కుదారులెవరో కూడా తెలుసుకోండి.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّمَا الصَّدَقَٰتُ لِلْفُقَرَآءِ وَالْمَسَٰكِينِ وَالْعَٰمِلِينَ عَلَيْهَا وَالْمُؤَلَّفَةِ قُلُوبُهُمْ وَفِي الرِّقَابِ
وَالْغَٰرِمِينَ وَفِي سَبِيلِ اللَّهِ وَابْنِ السَّبِيلِ ۖ فَرِيضَةً مِّنَ اللَّهِ ۗ

**"దానాలను కేవలం నిరుపేదల కొరకూ, అభాగ్యజీవుల కొరకు, వాటి వసూళ్ళ కోసం నియమితులైన వారి కొరకు, హృదయాలను ఆకట్టుకోవలసివున్న వారి కొరకు, మెడలను విడిపించడానికి, రుణగ్రస్తుల కొరకూ, అల్లాహ్ మార్గం కొరకూ, బాటసారుల కొరకూ వెచ్చించాలి. ఇది అల్లాహ్ తరఫున నిర్ణయించబడిన ఒక విధి. అల్లాహ్ మహాజ్ఞాని, మహావివేకి".**
***(తౌబా : 60)***

ఈ ఆయత్ ద్వారా తెలిసిందేమిటంటే – జకాత్ స్వీకరించడానికి అర్హులు ఈ ఎనిమిది మందే. వీరు తప్ప, మిగతా ఏ వ్యవహారంలోనూ జకాత్ సొమ్ము వెచ్చించకూడదు. ఈ ఎనిమిది మందిలో కూడా అందరిపై తప్పకుండా ఖర్చు చేయాలన్న నియమం ఏదీ లేదు. ఈ ఎనిమిది మందిలో ఎవరు ఎక్కువ అవసరం కలిగివున్నారో వారిపై ఖర్చు చేయవచ్చు.

1) మరియు (2) – నిరుపేదలు, అభాగ్య జీవులంటే – అవసరాలు తీరని వారు, అంటే వారి దగ్గర తమ భార్యాపిల్లల అవసరాలను తీర్చడానికి సైతం డబ్బు వుండదు. అలాంటి వారికి గరిష్టంగా 1 సం॥ పాటు తమ అవసరాలు తీర్చుకొనగలిగేటంత జకాత్ చెల్లించవచ్చు.

3) 'అల్ ఆమిలీన అలైహి' అంటే – జకాత్ సేకరణకు మరియు అర్హులైన వారికి దాని పంపిణీకి గాను నియుక్తులైన వారు. వారికి కూడా ఈ జకాత్

నిధుల నుండి జీతం లాగా లేదా పింఛను లాగా వారి బాధ్యతకు అను గుణంగా ఇవ్వవచ్చు. వారు స్వతహాగా ధనవంతులైనాసరే.

4) 'అల్ ముఅల్లఫతి ఖులూబుహుమ్' అంటే – క్రొత్తగా ఇస్లాం స్వీకరించిన బలహీన విశ్వాసులూ, ముస్లిములవుతారని ఆశవున్న వాళ్ళు లేదా డబ్బిచ్చిన కారణంగా తమ బస్తీ వారిని, ప్రదేశం వారిని ముస్లిములపై దాడి చేయకుండా నిరోధిస్తారని నమ్మకం వున్న అవిశ్వాసులు అని అర్థం.

5) 'వఫిర్రిఖాబ్' అంటే – బానిసలకు వారి యజమాని నుండి విడిపించి స్వేచ్ఛను ప్రసాదించటం.

6) రుణాన్ని తిరిగి చెల్లించలేని రుణగ్రస్తుడు. అతనికి జకాత్ నిధులు చెల్లించవచ్చు. కానీ షరతు ఏమిటంటే – అతను తీసుకున్న రుణం ధర్మయుక్త కార్యం నిమిత్తం అయివుండాలి. అలాగే (ధర్మయుక్త) చిట్టీల డబ్బు చెల్లించే స్థితిలో లేనివారు, వ్యాపారంలో అత్యంత నష్టాన్ని చవిచూసినవారు – వీరికి గూడా జకాత్ చెల్లించవచ్చు.

7) ఫీసబీలిల్లాహ్ – అంటే – జిహాద్ మరియు అల్లాహ్ సంతృప్తికి కారణమయ్యే ఇతర ధార్మిక ఉద్దేశ్యాల కొరకు అని అర్థం.

ఉదా॥కు ధార్మిక పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు జకాత్ సొమ్ము ఖర్చు పెట్టవచ్చు. (విద్యార్థులు నిరుపేదలైతే వారి కోసం జకాత్ సొమ్ము ఖర్చు పెట్టవచ్చు. కాని ఒకవేళ ఏ విద్యార్థి అయిన ధనవంతుడయితే, అతని కోసం జకాత్ సొమ్ము ఖర్చు పెట్టకూడదు–అనువాదకుడు)

8) ఏదైనా ఉచిత కార్యం నిమిత్తం ప్రయాణం చేసే బాటసారి. ఒకవేళ అతని ప్రయాణ సామగ్రి అంతా అయిపోయి, ప్రయాణపు అవసరాలు తీర్చుకోలేని స్థితిలో వుంటే అతని అవసరానికి తగ్గట్లు జకాత్ సొమ్మును అతనికి ఇవ్వవచ్చు.

నోట్ (1) : ఒకవేళ జకాత్ హక్కుదారులు మన దగ్గరి బంధువులలో లభ్యమైతే వారికి జకాత్ చెల్లిస్తే రెండు రెట్ల పుణ్యం దొరుకుతుంది.

సల్మాన్ బిన్ ఆమిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త

(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఒకవేళ నిరుపేదకు ఇస్తే అది దానం అవుతుంది. అదే ఒకవేళ బంధువుకిస్తే అది దానంగానూ మరియు బంధుత్వాన్ని నెలకొల్పినట్లు గానూ అవుతుంది".

*(నసాయి:2582, తిర్మిజి:658, సహీహ్ –అల్‌బానీ)*

నోట్ (2):

తమ భార్యాపిల్లలకూ, తల్లిదండ్రులకూ జకాత్ ఇవ్వకూడదు. ఒకవేళ సోదరులు, అక్క చెల్లెళ్ళలో ఎవరైనా అవసరాలు తీరని వారుంటే వారికి జకాత్ ఇవ్వడం ద్వారా రెండు రెట్లు పుణ్యం దొరుకుతుంది. అలాగే ధనవంతులకు, కష్టపడి సంపాదించే ఆరోగ్యవంతులు, పాపాత్ములు, దుర్మార్గులు మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంటి వారికి కూడా జకాత్ ఇవ్వకూడదు.

ఆఖరుగా అల్లాహ్‌ను వేడుకొనేదేమంటే – ఆయన మనందరికీ జకాత్ చెల్లించే మరియు అల్లాహ్ మార్గంలో ఖర్చు చేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!!

# రమజాన్ మాసపు ఖుత్బాలు

(1) శుభప్రద రమజాన్ మాసం....పుణ్యాల వసంతం.
(2) దివ్య ఖురాను మహత్యం.
(3) తౌబా మరియు అస్తగ్‌ఫార్.....ప్రయోజనాలు, ఫలాలు.
(4) శుభప్రద రమజాన్ మాసపు ఆఖరి 10 రోజులు.

# శుభప్రద రమజాన్ మాసం - పుణ్యాల వసంతం.

## ఖుత్బా యందలి ముఖ్య అంశాలు

1) రమజాన్ మాసాన్ని పొందడం గొప్పవరం.
2) రమజాన్ మాసపు ప్రత్యేకతలు.
3) రమజాన్ మాసంలో తప్పనిసరి ఆచరణలు – ఉపవాసం మరియు దానిమహత్యం, ఖియాం, దాన ధర్మాలు, దివ్య ఖురాన్ పఠనం, దుఆలు, జిక్ర్ (స్మరణ), అస్తగ్‌ఫార్.
4) ఉపవాసం మర్యాదలు.

## మొదటి ఖుత్బా

ఇస్లామీయ సోదరులారా!

అల్లాహ్ అనుగ్రహం మరియు కృప వల్ల శుభప్రద రమజాన్ మాసం ఆరంభమైనది. అందుకే మనమంతా మరోసారి మన జీవితంలో ఈ శుభప్రద మాసాన్ని ప్రసాదించినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపాలి. ఇది ఎలాంటి మాసమంటే – అల్లాహ్ దానిలో స్వర్గపు ద్వారాలు తెరుస్తాడు, నరక ద్వారాలను మూసివేస్తాడు, మానవులను ఇతర రోజుల్లోలాగా భ్రష్టు పట్టించకుండా షైతానును బంధిస్తాడు. ఇంకా, ఈ నెలలోనే అల్లాహ్ అత్యధికంగా తన దాసులను నరకాగ్ని నుండి విముక్తి అనే బహుమతిని ప్రసాదిస్తాడు, దీనిలోనే ఆయన తన దాసులను మన్నించి వారి పశ్చాత్తాపాన్ని, ప్రార్థనలను స్వీకరిస్తాడు. ......అందుకే ఇలాంటి మహత్తరమైన మాసాన్ని పొందటం నిజంగా అల్లాహ్ ప్రసాదించిన గొప్పవరం. ఈ మాసపు ప్రాధాన్యత, ఔన్నత్యాలను మనం సలఫుస్సాలిహీన్ (మొదటి మూడు తరాల సజ్జనులు)ల ఆచరణను బట్టి అంచనా వేయవచ్చు. వారు ఇలా ప్రార్థించేవారు: ఓ అల్లాహ్! మాకు శుభప్రద రమజాన్ మాసాన్ని ప్రసాదించు. తదుపరి రమజాన్ మాసం గడిచాక వాళ్ళు ఇలా ప్రార్థించే వారు – ఓ అల్లాహ్ ఈ నెలలో మేము చేసిన ఆరాధనలను స్వీకరించు. ఎందుకంటే–ఈ నెల ఎంత ముఖ్యమైనదో వారికి తెలుసు కాబట్టి.

*(లతాయెఫుల్ మారిఫ్: 280వ పేజీ)*

అందుకే మనం కూడా ఈ మాసపు విశిష్టతను అర్థం చేసుకొని, దీనిలోని శుభాల ద్వారా ప్రయోజనం పొందాలి.

తల్హా బిన్ ఉబైదుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం:

ఇద్దరు వ్యక్తులు ఒకేసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించారు. తదుపరి అందులో ఒక వ్యక్తి ఎక్కువగా ఆరాధనలు చేసేవాడు, అల్లాహ్‌మార్గంలో యుద్ధం చేస్తూ వీరమరణం పొందాడు. ఇక రెండో వ్యక్తి, మొదటి వ్యక్తి కన్నా తక్కువగా ఆరాధించేవాడు, మొదటి వ్యక్తి మరణించిన 1 సం॥ తర్వాత మరణించాడు.

తల్హా (రజి అల్లాహు అన్హు) కథనం:

ఈ రెండవ వ్యక్తి, వీరమరణం పొందిన మొదటి వ్యక్తి కన్నా ముందుగా స్వర్గంలో ప్రవేశించడం నేను కలలో చూశాను. మరుసటి రోజు ఉదయం ఈ కలను నేను ప్రజల ముందు ప్రస్తావించగా వీరు దీనిపై ఆశ్చర్యానికి లోనయ్యారు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు: ఆ రెండవ వ్యక్తి, మొదటి వ్యక్తి మరణించాక 1 సం॥ పాటు బ్రతికి లేడా? దానిలో అతను రమజాన్ మాసాన్ని పొందాడు, దాని ఉపవాసాలు పాటించాడు మరియు 1 సం॥ పాటు నమాజులు (అదనంగా) చదివాడు. అందుకే వీరిద్దరి మధ్య (స్వర్గంలో) దూరం– భూమ్యాకాశాల మధ్య వున్న దూరమంత వుంది. *(సహీ ఉల్ జామె అస్సగీర్ లిల్ అల్‌బానీ : 1316)*

ఈ హదీసుపై కాస్త దృష్టి సారించండి!

ఇద్దరు వ్యక్తులు ఒకేసారి ఇస్లాం స్వీకరించారు. అందులో మొదటి వ్యక్తి రెండవ వ్యక్తి కన్నా ఎక్కువగా ఆరాధించేవాడు మరియు వీరమరణం పొందాడు.

ఇక రెండవ వ్యక్తి – మొదటి వ్యక్తి కన్నా తక్కువగా ఆరాధించేవాడు మరియు సహజ మరణం పొందాడు. మరి ఇతను మొదటి వ్యక్తి కన్నా ముందుగా స్వర్గంలోకి ఎలా ప్రవేశిచగలిగాడు?

దానికి కారణం ఏమిటంటే – ఇతను మొదటి వ్యక్తి వీరమరణం పొందాక 1 సం॥ పాటు బ్రతికి వున్నాడు. ఈ వ్యవధిలో ఇతనికి రమజాన్ మాసం ప్రాప్తించింది. అందులో ఇతను ఉపవాసాలు వున్నాడు మరియు సం॥ అంతా నమాజులు చదివాడు. ఇలా, ఉపవాసాలు మరియు నమాజుల కారణంగా

వీర మరణం పొందిన వాని కన్నా ముందుగా స్వర్గంలో ప్రవేశించాడు....దీని ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – శుభప్రద రమజాన్ మాసాన్ని పొంది, దానిలో ఉపవాసాలు పాటించడం అనేది అల్లాహ్ ఇచ్చే గొప్పవరం.

మీరు ఓ విషయం ఆలోచించండి!

మన స్నేహితులలో, బంధువులలో ఎంతో మంది గత రమజాన్ మాసంలో మనతో కలిసివున్నారు. కానీ ఈ రమజాన్ మాసం రావడానికి ముందే వారు లోకం విడిచి వెళ్ళిపోయారు.వారికి ఈ శుభప్రదమాసం ప్రాప్తం కాలేదు.

కానీ మనకు అల్లాహ్ – జీవితాన్ని మరియు ఆరోగ్యాన్నిచ్చి దానితోపాటు శుభప్రదమైన ఈ మాసాన్ని కూడా ప్రసాదించాడు. తద్వారా మనం చిత్త శుద్ధితో మన పాపాలకు గాను పశ్చాత్తాపం చెంది మన సృష్టికర్త, యజమాని అయిన అల్లాహ్‌ను సంతృప్తి పరచుకోవచ్చు....మరి ఇది అల్లాహ్ మనకు ప్రసాదించిన గొప్పవరం కాదా?

అలాగే – ఈ రమజాన్ మన జీవితపు ఆఖరి రమజాన్ కూడా కావచ్చు. మరుసటి రమజాన్ వచ్చే వరకు మనం కూడా ఈ లోకం విడిచి వెళ్ళిపోవచ్చు! అందుకే (అల్లాహ్ ప్రసాదించిన) ఈ సువర్ణావకాశాన్ని సద్వినియోగ పరుచుకొని దాని శుభాలను ప్రోగు చేసుకోవడానికి ఎల్లప్పుడూ ప్రయత్నిస్తూ వుండాలి.

ఈ కారణం చేతనే – రమజాన్ మాసం ఆరంభం కాగానే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాలకు – దీని రాకను గూర్చిన శుభవార్త ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేసేవారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ మాసపు రాక గురించి శుభవార్త ఇస్తూ ఇలా సెలవిచ్చారు: “మీ దగ్గరికి రమజాన్ మాసం వచ్చేసింది. ఇదెంతో శుభప్రదమైనది. అల్లాహ్ దీని ఉపవాసాలను మీపై విధిగా చేశాడు. దీనిలో (ఈ మాసంలో) స్వర్గపు ద్వారాలు తెరవబడతాయి మరియు నరక ద్వారాలు మూసి వేయబడతాయి. తలబిరుసు షైతానులు బంధించి వేయబడతారు. దీనిలో అల్లాహ్ రాత్రి ఒకటి వుంది. అది 1000 నెలల కన్నా శ్రేష్టమైనది. ఇక ఏ వ్యక్తి అయినా దానిలోని ‘మంచి’ని పొందలేక పోతే అతనే అసలైన దౌర్భాగ్యుడు”. *(నసాయి:2106, సహీహుల్ జామె అస్సగీర్ లిల్ అల్‌బానీ:55)*

## రమజాన్ మాసపు ప్రత్యేకతలు

ఈ మాసానికి ఎన్నో ప్రత్యేకతలు వున్నాయి. ఈ కారణం వల్లే ఇది ఇతర మాసాలపై ఔన్నత్యాన్ని కలిగివుంది. దీని కొన్ని ప్రత్యేకతలు ఇవి:

### 1) దివ్య ఖురాను అవతరణ

అల్లాహ్– ఆకాశ గ్రంథాలలో అన్నింటి కన్నా ఉత్తమమైన గ్రంథాన్ని (ఖురాను) అన్నింటికన్నా శ్రేష్ఠమైన మాసంలో (రమజాన్ మాసం) అవతరింప జేశాడు. అంతేకాక, ఈ శుభప్రదమాసంలోని శ్రేష్ఠమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) యందు దీనిని 'లౌహె మహ్ఫూజ్' నుండి ఒక్కసారిగా ఇహలోకపు ఆకాశంపైకి అవతరింపజేసి 'బైతుల్ ఇజ్జ' (మొదటి ఆకాశం లోని ఒక ప్రదేశం) నందు పొందుపరచాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

شَهۡرُ رَمَضَانَ الَّذِیۡۤ اُنۡزِلَ فِیۡهِ الۡقُرۡاٰنُ هُدًی لِّلنَّاسِ وَ بَیِّنٰتٍ مِّنَ الۡهُدٰی وَ الۡفُرۡقَانِ ۚ

**"రమజాన్ నెల – ఖురాను అవతరింపజేయ బడిన నెల. అది మానవు లందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు, సత్యా సత్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు ఉన్నాయి". *(బఖర:185)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

اِنَّاۤ اَنۡزَلۡنٰهُ فِیۡ لَیۡلَةِ الۡقَدۡرِ ۝

**"నిశ్చయంగా మేము దీనిని (ఈ ఖురానును) ఘనమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) యందు అవతరింపజేశాము". *(ఖద్ర్: 1)***

### 2) నరకాగ్ని నుండి విముక్తి

ఈ మాసపు రెండో విశిష్టత ఏమిటంటే, అల్లాహ్ – ఈ మాసంలో ఎంతో మంది దాసులను నరకాగ్ని నుండి విముక్తి కలిగిస్తాడు.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా అల్లాహ్ ప్రతి ఇఫ్తార్ సమయంలో ఎంతో మందిని నరకాగ్ని నుండి విముక్తుల్ని చేస్తాడు. ఇలా ప్రతి రోజూచేస్తాడు". *(ఇబ్నె మాజ:1643, సహీహుల్ జామె అస్సగీర్, అల్బానీ:2170)*

అబూ సయీద్ ఖుద్రీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా అల్లాహ్ - (రమజాన్ మాసంలో) ప్రతి రోజూ, ప్రతి రాత్రి ఎంతో మందిని నరకాగ్ని నుండి విముక్తుల్ని చేస్తాడు మరియు ప్రతి రోజూ, ప్రతి రాత్రి ముస్లిం యొక్క ఒక ప్రార్థన (దుఆ) స్వీకరించబడుతుంది".

*(బజ్జార్, సహీహ్ అత్తర్గీబ్ వ తర్హీబ్ లిల్ అల్బానీ: 1002)*

ఈ హదీసులను, దృష్టిలో వుంచుకొని మనం కూడా అల్లాహ్ను- తను ఈ మాసంలో నరకాగ్ని నుండి విముక్తుల్ని చేసే అదృష్టవంతులలో మనల్నికూడా చేర్చుమని ప్రత్యేకంగా ప్రార్థించాలి. ఎందుకంటే అసలైన సాఫల్యం ఇదే మరి.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَمَنْ زُحْزِحَ عَنِ النَّارِ وَأُدْخِلَ الْجَنَّةَ فَقَدْ فَازَ ۗ وَمَا الْحَيٰوةُ الدُّنْيَآ إِلَّا مَتَاعُ الْغُرُورِ ◯

**"అప్పుడు ఎవడు నరకాగ్ని నుండి కాపాడబడి, స్వర్గంలో ప్రవేశం కల్పించబడతాడో అతడు నిశ్చయంగా సఫలీకృతుడయ్యాడు".**

***(ఆలి ఇమ్రాన్ : 185)***

(3) స్వర్గ ద్వారాలు తెరవబడటం.

(4) నరక ద్వారాలు మూసివేయబడటం.

(5) తలబిరుసు షైతానులు బంధించి వేయబడటం.

ఈ మూడు ఆదేశాలు రమజాన్ మాసపు ప్రత్యేకతలలోనివి.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "రమజాన్ మాసపు మొదటి రాత్రి రాగానే షైతానులను, తలబిరుసు జిన్నాతులను బంధించి వేయడం జరుగుతుంది. నరక ద్వారాలు మూసివేయబడతాయి. దాని ఏ ద్వారమూ తెరచి వుండదు. స్వర్గ ద్వారాలు తెరవబడతాయి. దానిలో ఏ ద్వారమూ మూయబడి వుండదు. ప్రకటన చేసేవాడొకడు ఇలా ప్రకటిస్తాడు - ఓ మంచిని కాంక్షించేవాడా! ముందుకు సాగిపో. ఓ చెడును కాంక్షించేవాడా! ఇకనైనా ఆగిపో".

*(తిర్మిజి, ఇబ్నె మాజ, సహీహ్ అత్తర్గీబ్ వ తర్హీబ్ లిల్ అల్బానీ: 998)*

## 6) ఒక్క రాత్రి....వెయ్యి నెలల కన్నా మేలైనది.

రమజాన్ మాసపు ప్రత్యేకతల్లో గల మరో ప్రత్యేకత ఏమిటంటే - దీనిలో 1000 నెలల కన్నా మేలైన ఒక రాత్రి వుంది. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"ఘనమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) వేయి నెలలకన్నా మేలైనది".** ***(ఖద్ర్:3)***

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం: "రమజాన్ మాసం ఆరంభం కాగానే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు - నిశ్చయంగా ఈ మాసం మీ దగ్గరికి వచ్చేసింది. దీనిలో వేయి నెలలకన్నా మేలైన ఒక రాత్రి వుంది. ఇక ఏ వ్యక్తి అయినా దానిని పొందలేకపోతే అతను యావత్ మేలును కోల్పోయాడు. వాస్తవానికి దీని 'మేలు'ను నిజమైన దురదృష్ట వంతుడే కోల్పోతాడు".

*(ఇబ్నెమాజ: 1644, సహీహ్ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్: 1000)*

## (7) రమజాన్ మాసంలో ఉమ్రా, హజ్ తో సమానం

ఎంతో మహోన్నతమైన ఈ మాసపు ఏడో ప్రత్యేకత ఏమిటంటే - దీనిలో ఉమ్రా చేయడం హజ్ తో సమానం.

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక అన్సారీ స్త్రీతో - "రమజాన్ మాసం విచ్చేస్తే, దానిలో నువ్వు ఉమ్రా చెయ్యి. ఎందుకంటే దీనిలో (రమజాన్ మాసం) ఉమ్రా చేయడం హజ్ తో సమానం".

*(బుఖారీ: 1782, ముస్లిం: 1256)*

మరో ఉల్లేఖనంలో ఈ హదీసు పదాలు ఇలా వున్నాయి: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) 'ఉమ్మె సనాన్' అని పిలువబడే ఒక అన్సారీ స్త్రీతో-'నువ్వు మాతో కలిసి హజ్ ఎందుకు చేయలేదు?' అని అడిగారు. దాని కామె, వాహనం లేదన్న కారణాన్ని వెలిబుచ్చింది. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)- మరైతే రమజాన్ మాసంలో ఉమ్రా చేయడం, నాతో చేసే హజ్‌కు 'బదులు'. అంటే- ఏ వ్యక్తి అయినా నాతో (దైవ ప్రవక్త) పాటు హజ్ చేయలేకపోతే, అప్పుడతను రమజాన్ మాసంలో గనక ఉమ్రా చేస్తే అది నాతోపాటు హజ్ చేసినట్లుగా అవుతుంది అని వివరించారు.

# రమజాన్ మాసంలోని తప్పనిసరి ఆచరణలు

రమజాన్ మాసపు కొన్ని ప్రత్యేకతలు గురించి వివరించాక, ఇక ఈ నెలలో పాటించమని ప్రత్యేకంగా ఆజ్ఞాపించబడ్డ ఆచరణల గురించి వివరిస్తాం.

## 1) ఉపవాసం

రమజాన్ మాసంలోని ప్రత్యేక ఆచరణలలో అతి విశిష్టమైనది ఉపవాసం. ఎందుకంటే, దీని ఉపవాసాలను అల్లాహ్, అర్హులైన ప్రతి ఒక్కరిపై విధిగా ఖరారు చేశాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا كُتِبَ عَلَى الَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ ۝

**"ఓ విశ్వసించిన వారలారా! ఉపవాసాలుండటం మీపై విధిగా నిర్ణయించ బడింది. మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించ బడింది. దీని వల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం వుంది."**

***(బఖర : 183)***

దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ మాసపు ఉపవాసాలను ఇస్లాం మౌలికాంశాలలో ఒక మౌలిక అంశంగా ఖరారు చేశారు. దీని గురించి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఇస్లాం పునాది ఐదు విషయాలపై వుంది. (అవేమంటే) లా ఇలాహ ఇల్లల్లాహ్, వ అన్న ముహమ్మదన్ అబ్దుహూ వ రసూలుహ్ అని సాక్ష్యమివ్వడం, నమాజ్ నెలకొల్పటం, జకాత్ చెల్లించడం, బైతుల్లాహ్ హజ్ చేయటం మరియు రమజాన్ మాసపు ఉపవాసాలుండటం". *(బుఖారీ, ముస్లిం)*

ఈ ఆధారాల ద్వారా తెలిసిందేమిటంటే – రమజాన్ మాసపు ఉపవాసాలు అర్హులైన ప్రతి వ్యక్తిపై విధిగా చేయబడ్డాయి. వ్యాధిగ్రస్తులకు, ప్రయాణికులకు సడలింపు వుంది. ఒకవేళ వారు వ్యాధి, ప్రయాణాల మూలంగా ఈ నెలలో ఉపవాసాలు వుండలేకపోతే, వాటిని తరువాతి నెలలలో పూర్తి చేయాలి. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَمَن شَهِدَ مِنكُمُ الشَّهْرَ فَلْيَصُمْهُ

**"మీలో వ్యాధిగ్రస్తులుగానో, ప్రయాణికులుగానో ఉన్నవారు ఆ ఉపవాసాల లెక్క - ఇతర దినాలలో పూర్తిచేసుకోవాలి". *(బఖర : 184)***

## ఉపవాసం మహత్యాలు

దివ్య ఖురాను మరియు హదీసులలో ఉపవాసం మహత్యాలు ఎన్నో వివరించబడ్డాయి.

మరి మీరు కూడా ఆ మహత్యాల గురించి శ్రద్ధగా వినండి!

## 1) మన్నింపు మరియు గొప్ప పుణ్యఫలం వాగ్దానం

అల్లాహ్ - ఉపవాసం పాటించేవారికి మన్నింపు మరియు గొప్ప పుణ్యఫలం యొక్క వాగ్దానం చేశాడు.

**إِنَّ الْمُسْلِمِينَ وَالْمُسْلِمَاتِ وَالْمُؤْمِنِينَ وَالْمُؤْمِنَاتِ وَالْقَانِتِينَ وَالْقَانِتَاتِ وَالصَّادِقِينَ وَالصَّادِقَاتِ**
**وَالصَّابِرِينَ وَالصَّابِرَاتِ وَالْخَاشِعِينَ وَالْخَاشِعَاتِ وَالْمُتَصَدِّقِينَ وَالْمُتَصَدِّقَاتِ وَالصَّائِمِينَ وَالصَّائِمَاتِ**
**وَالْحَافِظِينَ فُرُوجَهُمْ وَالْحَافِظَاتِ وَالذَّاكِرِينَ اللَّهَ كَثِيرًا وَالذَّاكِرَاتِ أَعَدَّ اللَّهُ لَهُم مَّغْفِرَةً وَأَجْرًا عَظِيمًا ○**

**"నిశ్చయంగా ముస్లిం పురుషులు - ముస్లిం స్త్రీలు, విశ్వాసులైన పురుషులు - విశ్వాసులైన స్త్రీలు, విధేయులైన పురుషులు - విధేయులైన స్త్రీలు, సత్యసంధులైన పురుషులు- సత్యసంధులైన స్త్రీలు, సహనశీలురైన పురుషులు- సహన శీలురైన స్త్రీలు, అణకువ గల పురుషులు- అణకువ గల స్త్రీలు, ఉపవాసం ఉండే పురుషులు- ఉపవాసం ఉండే స్త్రీలు, తమ మర్మాంగాలను కాపాడుకొనే పురుషులు- కాపాడుకొనే స్త్రీలు, అల్లాహ్‌ను అత్యధికంగా స్మరించే పురుషులు- స్మరించే స్త్రీలు - వీరందరి కోసం అల్లాహ్ (విస్తృతమైన) మన్నింపును, గొప్ప పుణ్యఫలాన్ని సిద్ధం చేసి వుంచాడు". *(అహ్‌జాబ్: 35)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఎవరైనా విశ్వాసంతో మరియు పుణ్యఫలాపేక్షతో రమజాన్ మాసంలో ఉపవాసాలుంటే, అతని గత పాపాలు మన్నించబడతాయి". *(బుఖారీ, ముస్లిం)*

'ఈమానవ్ వ ఇహ్తిసాబన్' అంటే - స్వచ్ఛమైన సంకల్పంతో, పూర్తి నమ్మకంతో, కేవలం అల్లాహ్‌ను సంతృప్తి పరచడానికి, దాని పుణ్య ఫలాన్ని

పొందటానికి, మన:పూర్వక సంతోషంతో, ఉపవాసాలను భారంగా అనుకో కుండా, రమజాన్ మాసపు వ్యవధిని అదృష్టంగా భావించి ఉపవాసాలుండడం అన్నమాట.

ఈ అనుభూతితో ఉపవాసాలుంటే అతని గత పాపాలు క్షమించ బడతాయి.

## 2) ఉపవాసం పుణ్యఫలం కేవలం అల్లాహ్‌కే తెలుసు

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఆదం సంతతి ప్రతి (సత్) కార్యం ఎన్నో రెట్లు పెంచబడుతుంది. ఒక సత్కార్యానికి 10 నుండి 700 రెట్ల వరకు పుణ్యఫలం పెంచబడుతుంది. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు – కేవలం ఉపవాసం తప్ప. ఎందుకంటే అది కేవలం నాకోసం (ప్రత్యేకం), కనుక నేనే దీని ప్రతిఫలం ఇస్తాను. ఎందుకంటే నా మూలంగా అతను తన కోరికలను, అన్నపానీయాలను త్యజిస్తాడు.

'కేవలం ఉపవాసం తప్ప. ఎందుకంటే అది నా కోసం'. అంటే – ఒక విశ్వాసి మిగతా ఆచరణలు – ఉదా॥ నమాజ్, దానధర్మాలు, స్మరణ వగైరా॥లు (ఇతరులకు) కానవస్తాయి మరియు దైవదూతలు వాటిని నోట్ కూడా చేసు కుంటారు. కానీ, ఉపవాసం ఎలాంటి ఆచరణ అంటే – అది బయటికి కనిపిం చదు, కేవలం ఒక్క సంకల్పంతోనే మనిషి ఉపవాస స్థితిలోకి వెళ్ళిపోతాడు. మరి సంకల్పం జ్ఞానం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ వుండదు. చివరికి దైవదూత లకు కూడా వుండదు. అందుకే అల్లాహ్ దీని గురించి – ఉపవాసం నా కోసం మరియు నేనే దీనికి తగిన ప్రతిఫలం ఇస్తాను అని సెలవిచ్చాడు.

అబూ ఉమామా (రజి అల్లాహు అన్హు) కథనం: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి – ఓ దైవ ప్రవక్తా! ఆచరించడానికి నాకేదైనా ఆజ్ఞాపించండి, మరో ఉల్లేఖనంలో ఇలా వుంది– నాకు ప్రయోజనం చేకూర్చే ఆచరణ గూర్చి తెలియజేయండి, ఇంకో ఉల్లేఖనంలో ఇలా వుంది– నన్ను స్వర్గానికి చేర్చే ఆచరణ గూర్చి తెలపండి అని విన్నవించుకున్నాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – నువ్వు ఉపవాసం వుండు. దానికి సమానంగా ఏ ఆచరణ కూడా లేదు అని హితబోధ చేసారు.

*(నసాయి: 222, ఇబ్నె ఖుజైమా:1893, అస్సహీహా:1937)*

అంటే – కోరికల్ని అదుపులో ఉంచి, చెడు వైపునకు ప్రేరేపించే మనసు మరియు షైతానుకు విరుద్ధంగా పోరాటం చేయడానికి మరియు పుణ్యఫలం రీత్యా ఉపవాసానికి సమానమైన ఆచరణ ఏదీ లేదు.

ఉపవాసం పుణ్యఫలం ఎంతో ఎక్కువగా వుండి దాని జ్ఞానం కేవలం అల్లాహ్‌కే వుంది కనుక ఉపవాసం పాటించే వాడు ప్రళయం నాడు అల్లాహ్‌ను కలసినప్పుడు, తనకు దొరికిన పుణ్యఫలానికి గాను ఎంతో సంతోషిస్తాడు.

దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఉపవాసం పాటించే వాడు రెండు సార్లు సంతోషం చెందుతాడు. మొదటి సారి ఇఫ్తార్ సమయంలో, ఇక రెండవసారి అల్లాహ్‌ను కలుసుకున్న సమయంలో." *(బుఖారీ:1904, ముస్లిం: 1151)*

## 3) ఉపవాసం డాలు వంటిది

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఉపవాసం డాలు వంటిది. (అందుకే) మీలో ఎవరైనా ఉపవాసస్థితిలో వుంటే అనుచిత మాటలు మాట్లాడ కండి, గొడవలు, పోట్లాటల నుండి దూరంగా వుండండి, ఒకవేళ ఏ వ్యక్తి అయినా మీతో దుర్భాషలాడితే అతనితో – నేను ఉపవాసంలో వున్నాను అని చెప్పేయండి". *(బుఖారీ, 1904, ముస్లిం: 1151)*

ఉపవాసం 'డాలు' వంటిది అంటే– ఇది కోరికల్ని అదుపులో వుంచు తుంది. పాపాల నుండి నిరోధిస్తుంది, అలాగే నరకాగ్ని నుండి రక్షిస్తుంది.

దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "యుద్ధంలో రక్షణ కొరకు ఉపయోగించే డాలు (రక్షణ కవచం)లాగే ఉపవాసం కూడా నరకాగ్నికి విరుద్ధంగా డాలు వంటిది".

*(నసాయి : 2231, ఇబ్నెమాజ: 1639, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్:982)*

## 4) అల్ రియ్యాన్ ద్వారం

స్వర్గంలోని ఒక ద్వారం పేరు 'అల్ రియ్యాన్'. ఈ ద్వారం కేవలం ఉపవాసం పాటించేవారి కొరకు ప్రత్యేకించబడింది.

సహల్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త

(సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా స్వర్గంలో ఒక ద్వారం వుంది. దాని పేరు 'అల్ రియ్యాన్'. ప్రళయం రోజు ఈ ద్వారం గుండా కేవలం ఉపవాసం పాటించినవారు ప్రవేశిస్తారు. వీరు తప్ప ఇతరులెవరూ దీని గుండా ప్రవేశించరు. ఇలా ఎలుగెత్తి చాటడం జరుగుతుంది– ఉపవాసం పాటించిన వారు ఎక్కడున్నారు? అప్పుడు వారంతా నిలబడతారు. వారు తప్ప ఇతరులెవరూ ఆ ద్వారం గుండా స్వర్గంలోకి ప్రవేశించలేరు. ఇలా ఉపవాసం పాటించిన వారంతా స్వర్గంలోకి వెళ్ళిపోయాక ఆ ద్వారాన్ని మూసివేయడం జరుగుతుంది". *(బుఖారీ:1896, ముస్లిం:1152)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఏ వ్యక్తి అయినా అల్లాహ్ మార్గంలో (ఏమిచ్చినా ఎల్లప్పుడూ ఒకటిగా కాకుండా జతగా) ఖర్చు పెడతాడో అతణ్ణి స్వర్గపు ద్వారాల నుండి కేకవేస్తూ ఇలా పిలవడం జరుగుతుంది – ఓ అల్లాహ్ దాసుడా! (ఈ ద్వారం) నీ కొరకు మేలైనది. ఇలా, నమాజ్ చదివేవారిని 'బాబుస్సలాత్' నుండి, అల్లాహ్ మార్గంలో పోరాడే యోధులను 'బాబుల్ జిహాద్' నుండి, ఉపవాసం పాటించిన వారిని 'బాబుర్రియాన్' నుండి మరియు దానధర్మాలు చేసేవారిని 'బాబుస్సదఖ' నుండి పిలవడం జరుగుతుంది.

దీనిపై అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు)– ఓ దైవ ప్రవక్తా! నా తల్లిదండ్రులు మీ కర్పితం అవుగాక! ఏ వ్యక్తికైనా ఒకవేళ అన్ని ద్వారాల నుండి పిలవడం జరిగితే అతనికి ఇంకా ఏం కావాలి? మరి అలాంటి అదృష్ట వంతులు కూడా ఎవరైనా వుంటారా? అని అడిగారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – అవును, వుంటారు. మీరు వారిలోనే (ఆ అదృష్టవంతులలోనే) వుంటారని నేను ఆశిస్తున్నాను అని పలికారు.

*(బుఖారీ:1897, ముస్లిం:1027)*

## (5) ఉపవాసం సిఫారసు చేస్తుంది

ప్రళయం రోజు ఉపవాసం, తనను పాటించే వారి కొరకు సిఫారసు చేస్తుంది మరియు దాని సిఫారసు స్వీకరించబడుతుంది. దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఉపవాసం మరియు ఖురాన్ –ఈ రెండూ, దాసుల కొరకు ప్రళయం రోజు సిఫారసు చేస్తాయి.

ఉపవాసం ఇలా అంటుంది. ఓ నా ప్రభూ! నేను ఇతణ్ణి అన్నపానీయాల నుండి, కోరికల నుండి ఆపి వుంచాను. అందుకే ఇతని కొరకు నా సిఫారసు స్వీకరించు. అలాగే దివ్య ఖురాన్ ఇలా అంటుంది – నేను ఇతణ్ణి రాత్రిళ్ళు నిద్ర నుండి ఆపి వుంచాను. అందుకే ఇతని కొరకు నా సిఫారసు స్వీకరించు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు – తదుపరి ఇద్దరి సిఫారసు స్వీకరించ బడుతుంది.”

*(అహ్మద్, హాకిమ్, సహీహ్ అత్తర్గీబ్ వ తర్హీబ్: 984)*

## 6) ఉపవాసముండే వ్యక్తి నుండి వెలువడే వాసన అల్లాహ్ దృష్టిలో కస్తూరి కన్నా మంచిది.

అవునండీ! ఉపవాసముండే వ్యక్తి నోటి నుండి వెలువడే వాసన అల్లాహ్ దృష్టిలో కస్తూరి కన్నా మంచిది. దీని గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: “ఎవరి చేతుల్లో ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రాణముందో, ఆ శక్తిమంతుని సాక్షి! ఉపవాసముండే వ్యక్తి నోటి నుండి వెలువడే వాసన అల్లాహ్ వద్ద కస్తూరి సువాసన కన్నా ఎంతో మంచిది”.

*(బుఖారీ:1904:, ముస్లిం:1151)*

## 7) ఉపవాస స్థితిలో మరణిస్తే నేరుగా స్వర్గ ప్రవేశం

హుజైఫా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “ఎవరైనా ‘లాఇలాహ ఇల్లల్లాహ్’ పఠించి దానిపైనే అతనికి మరణం సంభవిస్తే అతను నేరుగా స్వర్గంలోకి వెళ్తాడు, అలాగే ఏ వ్యక్తి అయినా అల్లాహ్ మెప్పు కొరకు ఒక రోజు ఉపవాసం ఉండి, ఈ స్థితిలోనే అతనికి మరణం సంభవిస్తే అతను కూడా నేరుగా స్వర్గంలోకి వెళతాడు. ఇంకా, ఏ వ్యక్తి అయినా అల్లాహ్ మెప్పు కొరకు దానం చేస్తే ఆ సమయంలోనే అతనికి మరణం సంభవిస్తే అతను కూడా నేరుగా స్వర్గంలోకి వెళతాడు” *(అహ్మద్:23324, సహీహ్ అత్తర్గీబ్ వ తర్హీబ్:985)*

## 8) ఉపవాసం – స్వర్గానికి తీసుకెళ్ళే ఆచరణలల్లో ఒకటి

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: ఒక పల్లెటూరి వ్యక్తి, దైవ

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికొచ్చి ఇలా అడిగాడు– ఓ దైవ ప్రవక్తా! నాకు స్వర్గానికి తీసుకెళ్ళే విషయం గూర్చి చెప్పండి?

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – నువ్వు అల్లాహ్‌ను ఆరాధించు. ఆయనతోపాటు ఇతరులెవరినీ భాగస్వాములుగా చేర్చకు. ఫర్జ్ నమాజులను నెలకొల్పు, ఫర్జ్ జకాత్‌ను చెల్లించు మరియు రమజాన్ మాసపు ఉపవాసాలు పాటించు – అని హితబోధ చేశారు.

ఇది విని ఆ పల్లెటూరి వ్యక్తి – నా ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆ శక్తిమంతుని సాక్షి! ఇక నేను ఎల్లప్పుడూ దీని కన్నా ఎక్కువగా గానీ, తక్కువగా గానీ చేయను అని పలికాడు. తదుపరి అతను వెళ్ళిపోయాక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ‘ ఎవరైనా స్వర్గవాసుల్లో ఎవరినైనా చూడాలనుకుంటే అతణ్ణి చూడండి’ అని అన్నారు. *(బుఖారీ:1397, ముస్లిం:14)*

## ఉపవాసం పాటించనివారి పరిణామం

శుభప్రద రమజాన్ మాసపు ప్రత్యేకతలు, ఉపవాసం మహాత్యాల గురించి విన్నాక ఇక రండి, షరీయత్తు పరమైన అడ్డంకి ఏమీ లేకుండా ఉపవాసం పాటించకపోవడం ఎంత పాపమో మరియు దాని శిక్ష ఏమిటో –వీటి గురించి కూడా కాస్త తెలుసుకోండి.

అబూ ఉమామ బాహిలి (రజి అల్లాహు అన్హు) కథనం: నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను ఇలా సెలవిస్తుండగా విన్నాను – “నేను నిద్రపోతున్నాను. కలలో ఇద్దరు వ్యక్తులు నా వద్ద కొచ్చి, నా ప్రక్కలను పట్టి నన్ను లేపి, ఎక్కడానికి ఎంతోకష్టంగా వున్న ఒక కొండ వద్దకు నన్ను తీసుకెళ్ళి దానిని ఎక్కమని చెప్పారు. నేను వారితో – ‘నేను దీనిపైకి ఎక్కలేను’ అని అన్నాను. దీనిపై వారు, ‘మేము నీకోసం దీనిని తేలికగా చేస్తాం’ అన్నారు.

తదుపరి నేను ఆ కొండ ఎక్కుతూ దాని శిఖరానికి చేరుకున్నాను. అక్కడ నేను అరిచే, పెడబొబ్బలు పెట్టే ధ్వనులు విన్నాను. నేను వారితో, ఈ అరుపులు ఏమిటి? అని అడిగాను. వారు, ఇవి నరకవాసుల అరుపులు అన్నారు. తదుపరి నన్ను వారు ముందుకు తీసుకెళ్ళారు. అక్కడ నేను కొందరిని, తలక్రిందులుగా వ్రేలాడదీయబడి, దవడలు చీల్చబడగా రక్తం కారుతుండడం చూసి, ఎవరు వీరు? అని అడిగాను. ‘ఉపవాస కాలంలో వీరు (దానిని

పాటించకుండా) తినే వారు, త్రాగేవారు' అని జవాబు ఇవ్వబడింది.

*(ఇబ్నె ఖుజైమా,ఇబ్నె హిబ్బాన్, సహీహ్ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్:1005)*

## 2) రమజాన్ మాసపు ఖియాం (తరావీహ్ నమాజ్)

శుభప్రద రమజాన్ మాసంలో ప్రత్యేకంగా తాకీదు చేయబడిన ఆచరణలలో, దీని ఖియాం – అంటే తరావీహ్ నమాజ్ కూడా ఒకటి.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ ఖియాం గురించి ఎంతగానో ప్రోత్సహించడమే కాక దీని గురించి గట్టిగా ఆజ్ఞాపించేవారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా విశ్వాసంతో, అల్లాహ్ మెప్పు పొందాలన్న ఉద్దేశ్యంతో రమజాన్ మాసంలో ఖియాం చేస్తే అతని గత పాపాలు క్షమించబడతాయి''.

*(బుఖారీ:37, 2008, ముస్లిం:759)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం: ఒక రాత్రి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అర్ధ రాత్రి సమయంలో మస్జిద్‌కు వెళ్ళి నమాజ్ చదివారు. ప్రజలు కూడా ఆయన నాయకత్వంలో నమాజు చదివారు. తెల్లవారిన తరువాత (ఈ నమాజ్ గురించి) ఒకరికొకరు చెప్పుకున్నారు. ఇలా మరుసటి రాత్రి, మొదటి రాత్రి కన్నా ఎక్కువగా ప్రజలు గుమిగూడారు మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వెనుక నమాజ్ చేశారు. తెల్లవారిన తరువాత వీళ్ళు మరింత మందికి ఈ విషయం చెప్పారు. ఇక మూడో రాత్రి వచ్చేసరికి (నమాజ్ చేయడానికి వచ్చిన) ప్రజల సంఖ్య బాగా పెరిగి పోయింది. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మస్జిద్ వద్దకు రాగా వారు ఆయన వెనుక నమాజ్ చేశారు. ఇలా నాలుగవ రాత్రి వచ్చే సరికి (నమాజ్ కోసం) ఎంత మంది వచ్చారంటే (వారి ముందు) మస్జిద్ చిన్నదిగా కనిపించసాగింది. కానీ ఆ రాత్రి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫజర్ నమాజ్ అజాన్ అయ్యేంత వరకు మస్జిద్‌కు వెళ్ళలేదు. తదుపరి ఆయన ఫజర్ నమాజ్ చేయించి, ప్రజల వైపు తిరిగి 'ఖుత్బా మస్నూన' పఠించి ఇలా సెలవిచ్చారు – ప్రజలారా! రాత్రి మీరు మస్జిద్‌లో వున్నారన్న సంగతి నాకు తెలియకుండా లేదు. కానీ (నేను మస్జిద్‌కు రాకపోవడానికి కారణమేమిటంటే) ఈ నమాజ్

మీ పై ఫర్జ్ (విధి) గావించబడి, తదుపరి మీరు దానిని ఆచరించడానికి కష్టపడతారేమో అని నాకు అనుమానం కలిగింది. *(బుఖారీ:2012, ముస్లిం:761)*

ఇక తరావీహ్ నమాజ్ రకాతుల విషయానికి కొస్తే వాటికి సంబంధించిన కొన్ని హదీసులను వినండి.

(1) సహీహ్ బుఖారీలో ఇలా ఉల్లేఖించబడింది – అబూ సల్మా బిన్ అబ్దుర్రహ్మాన్, ఆయెషా (రజి అల్లాహు అన్హా)ను ఇలా అడిగారు: రమజాన్ మాసంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ ఎలా వుండేది?

ఆమె జవాబిస్తూ– దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) రమజాన్ మాసంలోగానీ, ఇతర మాసాల్లో గానీ 11 రకాతుల కన్నా ఎక్కువగా చదివేవారు కాదు అని వివరించారు. *(బుఖారీ:2013, ముస్లిం:738)*

(2) జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాకు రమజాన్‌లో 8 రకాతులు మరియు వితర్ నమాజు చేయించారు. మరుసటి రోజు రాత్రి మేమంతా మస్జిద్‌లో గుమిగూడి ఆయన(సల్లల్లాహు అలైహి వ సల్లం) బయటికొస్తారన్న నమ్మకంతో వేచి చూశాం. కానీ మేము తెల్లవారేదాక అలానే వేచి చూడాల్సి వచ్చింది. దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ముందు ప్రస్తావించగా ఆయన, ఈ వితర్ మీపై విధి (ఫర్జ్)గావించబడతుందేమోనని నేను సందేహించాను అని వివరించారు.

*(సహీహ్ ఇబ్నె ఖుజైమా:170, ఇబ్నె హిబ్బాన్:2409, 2415, అబూ యాలా:3/336 హసన్ –అల్‌బానీ)*

(3) ఇమామ్ మాలిక్, సాయిబ్ బిన్ యజీద్ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఇలా ఉల్లేఖించారు: ఉమర్ (రజి అల్లాహు అన్హు) , ఉబై బిన్ కాబ్ (రజి అల్లాహు అన్హు) మరియు తమీమ్ దారీ (రజి అల్లాహు అన్హు) లకు 11 రకాతులు చదివించమని ఆజ్ఞాపించారు.

*(ముఅత్తా : 1/73, ఇబ్నె అబీ షైబా:2/1391)*

ఈ హదీసుల ద్వారా తెలిసిందేమిటంటే –

1) రమజాన్ మరియు ఇతర మాసాల్లోని రాత్రులలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) చదివింది 11 రకాతులే.

2) ఈ 11 రకాతులనే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహాబాలకు సామూహికంగా చేయించారు.

3) తదుపరి, ఉమర్ (రజి అల్లాహు అన్హు) కూడా తరావీహ్ నిమిత్తం ప్రజలను సమీకరించి, ఉబై బిన్ కాబ్ (రజి అల్లాహు అన్హు) మరియు తమీమ్ దారీ (రజి అల్లాహు అన్హు) లకు 11 రకాతులే చేయించమని ఆజ్ఞాపించారు.

## తరావీహ్ నమాజే రమజాన్ మాసంలో తహజ్జుద్ నమాజు

అబూ జర్ (రజి అల్లాహు అన్హు) కథనం: మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో పాటు రమజాన్ మాసపు ఉపవాసాలున్నాం. ఈ వ్యవధిలో కేవలం ఏడు రోజులు మిగిలివున్నంత వరకు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మాకు ఖియాం చేయించలేదు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) 23వ రాత్రి ఖియాం చేయగా మేము కూడా ఆయనతో పాటు ఖియాం చేశాం. దీనిలో ఆయన మూడింట ఒక వంతు రాత్రి గడిచే వరకు సుదీర్ఘంగా (ఖురాన్) పారాయణం చేశారు. తదుపరి 24వ రాత్రి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మాతో ఖియాం చేయలేదు. ఆ తర్వాత 25వ రాత్రి అర్ధరాత్రి గడిచే వరకు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాతో ఖియాం చేశారు. దీనితో నేను – ఓ దైవ ప్రవక్తా! మీరు ఈ రోజు రాత్రంతా ఖియాం చేస్తే బాగుండేది! అని అన్నాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – ఏ వ్యక్తి అయినా – ఇమామ్ తన ఖియాం పూర్తి చేసుకొనే వరకు, అతనితోపాటు ఖియాం చేస్తే అతనికి రాత్రంతా ఖియాం చేసినంత పుణ్యఫలం లిఖించబడుతుంది అని వివరించారు. తదుపరి 26వ రాత్రి గడిచిపోయింది. ఆ రాత్రి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాతో ఖియాం చేయలేదు. ఆ తర్వాత 27వ రాత్రి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాతోపాటు ఖియాం చేశారు. తన సతీమణులకు కూడా (మస్జిద్‌కు) తీసుకొచ్చారు. (ఆ రాత్రి) ఆయన ఎంత సుదీర్ఘంగా ఖియాం చేసారంటే – సహరీ సమయం గడిచిపోతుందేమోనని మాకు అనుమానం కలిగింది.

*(తిర్మిజి:806, అబూదావూద్:1375, నసాయి:1605, ఇబ్నె మాజ:1327, సహీహ్ – అల్‌బానీ)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి

వ సల్లం) రమజాన్ మాసంలో తరావీహ్ తోనే సరిపెట్టుకొనేవారు. దాని తర్వాత తహజ్జుద్ చదవలేదు. ఎందుకంటే, సహరీ సమయం వరకు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తరావీహ్ నమాజ్ చేయిస్తూనే వున్నారు. ఒకవేళ దీనిలో, తహజ్జుద్ నమాజ్‌లో ఏదైనా తేడా వుంటే లేదా రెండు నమాజులు వేర్వేరు అయివుంటే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తరావీహ్ నమాజు తర్వాత తహజ్జుద్ నమాజు చదివేవారు. (కానీ అలా చేయలేదు). కనుక తేలిందేమిటంటే – తరావీహ్ నమాజే తహజ్జుద్ కూడాను.

ఇలా ఇతర మాసాల్లో తహజ్జుద్ నమాజుగా పిలువబడే నమాజు రమజాన్ మాసంలో తరావీహ్ నమాజుగా పిలువబడుతుంది. ఈ కారణం చేతనే హదీసు వేత్తలు ఆయెషా (రజి అల్లాహు అన్హా) హదీసును (మొదటి హదీసు) తరావీహ్ అధ్యాయంలో పేర్కొన్నారు.అందుకే దీనిని తహజ్జుద్ నమాజు అనుకొని, తదుపరి దీనిలో, తరావీహ్ నమాజులో తారతమ్యం చూపడం ఎంత మాత్రం సరికాదు.

## ఉమర్(రజి అల్లాహు అన్హు) 20 రకాతులు చేయించమని ఆదేశించారా?

మేము 'ముఅత్తా' మరియు 'ఇబ్నె అబి షైబా' లోని సాయిబ్ బిన్ యజీద్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖించిన హదీసు – ఉమర్ (రజి అల్లాహు అన్హు), ఉబై బిన్ కాబ్ (రజి అల్లాహు అన్హు) మరియు తమీమ్ దారీ (రజి అల్లాహు అన్హు)లకు 8 రకాతులు చదివించమని ఆజ్ఞాపించారు–ను మీకు వివరించాం. ఇమామ్ మాలిక్ ఈ హదీసును ఉల్లేఖించిన తర్వాత వెంటనే మరో హదీసును కూడా తీసుకొచ్చారు. దాని పదాలు ఇలా వున్నాయి:

యజీద్ బిన్ రూమాన్ కథనం: ప్రజలు ఉమర్ (రజి అల్లాహు అన్హు) పరిపాలనా కాలంలో, రమజాన్ మాసంలో 23 రకాతులు చదివేవారు.

*(ముఅత్తా: 1/73)*

కాని, ఇది పరంపర తెగిన (మున్‌ఖత) హదీసు, అంటే బలహీనమైనది, ఎందుకంటే దీని ఉల్లేఖకుడు యజీద్ బిన్ రూమాన్, ఉమర్ (రజి అల్లాహు అన్హు) పరిపాలనా కాలాన్ని అసలు పొందనేలేదు. (అంటే ఆ సమయంలో జన్మించనే లేదు).

ఒకవేళ దీనిని 'సహీహ్' అని భావించినా, రెండింటిలో మొదటి హదీసే సరైనది. ఎందుకంటే, దానిలో ఉమర్ (రజి అల్లాహు అన్హు) సహాబాలకు 11

రకాతులు చదివించమని ఆజ్ఞాపించారు. రెండవ దానిలో ప్రజలు ఉమర్ (రజి అల్లాహు అన్హు) పరిపాలనా కాలంలో 23 రకాతులు చదివేవారని ఉంది.

కనుక, ఉమర్ (రజి అల్లాహు అన్హు) దేని గురించైతే ఆజ్ఞాపించారో అదే సరైనది మరియు సున్నత్‌కు అనుగుణంగా వుంది.

## 3) దానధర్మాలు చేయటం, సత్కార్యాల్లో ఎక్కువగా పాలుపంచుకోవడం

శుభప్రదమైన రమజాన్ మాసంలో ఉపవాసం, ఖియాంలతో పాటు తమ శక్తి కొలది దాన ధర్మాలు కూడా చేయాలి. సత్కార్యాలు అధికంగా చేస్తూ వుండాలి. ఎందుకంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ శుభప్రదమాసంలో మంచికి సంబంధించిన అన్ని కార్యాల్లో అందరికన్నా ముందుండేవారు.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

“దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజలందరికన్నా ఎక్కువగా సత్కార్యాలు చేసేవారు. ఆయన, అన్నింటికన్నా ఎక్కువగా సత్కార్యాలను రమజాన్ మాసంలో చేసేవారు. జిబ్రయీల్ (అలైహిస్సలాం) వచ్చి ఆయనను కలిసేవారు. జిబ్రయీల్ (అలైహిస్సలాం) రమజాన్ మాసపు ప్రతి రాత్రి ఆయనను వచ్చి కలిసేవారు. అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనకు ఖురానును వినిపించేవారు. జిబ్రయీల్ (అలైహిస్సలాం)ను కలిసాక, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సుడిగాలి కన్నా వేగంగా సత్కార్యాల వైపునకు పరుగెత్తేవారు”. *(బుఖారీ:1902)*

(ఈ సత్కార్యాల్లో) ప్రత్యేకించి ఉపవాసం ఉండేవారి కొరకు ఇఫ్తార్ ఏర్పాట్లు తప్పనిసరిగా చేయాలి. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చి వున్నారు: “ఏ వ్యక్తి అయినా ఉపవాసం పాటించే వానికి ఇఫ్తార్ చేయిస్తే – ఉపవాసం ఉన్న వ్యక్తికి దొరికినంత పుణ్యం ఇతని క్కూడా దొరుకుతుంది. ఉపవాసం పాటించిన వ్యక్తికి లభించే పుణ్యఫలంలో ఏవిధమైన తగ్గింపు రాదు.”

*(తిర్మిజి, నసాయి, ఇబ్నె మాజ, సహీహ్ అత్తరగీబ్, వ తర్‌హీబ్:1078)*

## 4) దివ్య ఖురాన్ పఠనం

శుభప్రదమైన రమజాన్ మాసంలో ఎక్కువగా చేయాల్సిన సత్కార్యాలలో ఖురాను పఠనం కూడా ఒకటి. ఎందుకంటే, దివ్య ఖురాన్‌లో అల్లాహ్ ఉపవాసాల విధిత్వం గురించి వివరించాక, దానితోపాటే రమజాన్ మాసపు ఈ ప్రత్యేకతను కూడా వివరించాడు. అదేమిటంటే, ప్రజలకు సన్మార్గం చూపే దివ్య ఖురాన్ ఈ నెలలోనే అవతరించింది అని. దీని ద్వారా తెలిసేదేమిటంటే, దివ్య ఖురాన్‌కు, రమజాన్ మాసానికి మధ్య ఎంతో ప్రగాఢ సంబంధం వుంది. అందుకే ఈ నెలలో వీలైనంత ఎక్కువగా దివ్య ఖురాన్‌ను పఠించాలి. స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఈ నెలలో ఈ విషయంలో ఎంతో శ్రద్ధ చూపేవారు మరియు ఈ నెలలో ప్రతి రాత్రి జిబ్రయీల్ (అలైహిస్సలాం) కు ఖురాన్ వినిపించేవారు.

సహీహ్ బుఖారీ హదీసు ఆధారంగా మేమీ విషయాన్ని మీకు ముందే వినిపించాం. ఇక దివ్య ఖురాను మహత్యాలను గూర్చి చెప్పాలంటే దీని ప్రతి అక్షరానికి బదులుగా 10 పుణ్యాలు దొరుకుతాయి అన్న మహత్యమే చాలు.

అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా అల్లాహ్ గ్రంథం (ఖురాన్) నుండి ఒక్క అక్షరం చదివినా అతనికి ఒక పుణ్యం దొరుకుతుంది. ఒక పుణ్యం, దాని లాంటి పది పుణ్యాలకు సమానమవుతుంది. 'అలిఫ్ లామ్ మీమ్' ఒక అక్షరమని నేను చెప్పను. పైగా, 'అలిఫ్' ఒక అక్షరం, 'లామ్' రెండో అక్షరం, 'మీమ్' మూడో అక్షరం".

*(తిర్మిజి: 2910, సహీహ్ – అల్‌బానీ)*

గుర్తుంచుకోవాల్సిన విషయమేమిటంటే – దివ్య ఖురాను పారాయణం చేస్తున్నప్పుడు, పఠనంతో పాటు దాని గురించి ఆలోచన కూడా చేయాలి. దీనిని పఠించి, దాని గురించి ఆలోచించి, దానిని తమ జీవన శైలి లాగా మార్చుకోవడానికే ఈ గ్రంథం అంతరించింది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

كِتٰبٌ اَنْزَلْنٰهُ اِلَيْكَ مُبٰرَكٌ لِّيَدَّبَّرُوْٓا اٰيٰتِهٖ وَلِيَتَذَكَّرَ اُولُوا الْاَلْبَابِ ۝

**"ఇదొక శుభప్రదమైన గ్రంథం. ప్రజలు దీని వాక్యాలపై చింతన**

**చేసేటందుకు బుద్ధి జీవులు దీని ద్వారా గుణపాఠం నేర్చుకొనేందుకు మేము దీనిని నీవైపునకు పంపాము".** ***(సాద్:29)***

## 5) దుఆ, స్మరణ (జిక్ర్) మరియు అస్తగ్ఫార్

శుభప్రద రమజాన్ మాసంలోని ముఖ్యమైన ఆచరణలలో, ఉపవాసం పాటించిన వ్యవధిలో వీలైనంత ఎక్కువగా దుఆ, అస్తగ్ఫార్ మరియు అల్లాహ్ స్మరణ (జిక్ర్) చేయడం కూడా వుంది. ఎందుకంటే అల్లాహ్ వద్ద స్వీకరించబడే దుఆ లలో ఉపవాసం పాటించే వ్యక్తి దుఆ కూడా వుంది.

దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మూడు దుఆలు రద్దు గావించబడవు. (అవేమిటంటే) తన సంతానం కోసం తండ్రి చేసే దుఆ, ఉపవాసం పాటించే వ్యక్తి దుఆ మరియు ప్రయాణికుని దుఆ". *(సహీహుల్ జామె అస్సగీర్ లిల్ అల్‌బానీ: 3032)*

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది : "మూడు దుఆలు రద్దు గావించబడవు. ఉపవాసం పాటించే వ్యక్తి దుఆ, పీడితుని దుఆ మరియు ప్రయాణికుని దుఆ". *(సహీహుల్ జామె అస్సగీర్ లిల్ అల్‌బానీ: 3030)*

ప్రత్యేకించి,ఇఫ్తార్ సమయంలో తప్పనిసరిగా దుఆ చేయాలి. ఎందుకంటే, ఆ సమయం దుఆ స్వీకరించబడే సమయాల్లో ఒకటి. దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా ఉపవాసం పాటించే వ్యక్తి ఇఫ్తార్ సమయంలో చేసే దుఆలో, రద్దు గావించబడని ఒక దుఆ వుంటుంది". *(ఇబ్నె మాజ : 1753)*

అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే, ఆయన మనందరికీ ఈ మాసపు శుభాల ద్వారా ప్రయోజనం పొందే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!!

## రెండవ ఖుత్బా

మొదటి ఖుత్బాలో మేము శుభప్రదమైన రమజాన్ మాసపు ప్రాముఖ్యత, మహత్యం మరియు దానిలోని ప్రత్యేక ఆచరణలను గూర్చి వివరించాము. రండి! ఇక ఉపవాసానికి సంబంధించిన కొన్ని మర్యాదలు మరియు వివరాలు కూడా కాస్త వినండి!

## 1) ఉపవాసం సంకల్పం

ఫర్జ్ ఉపవాసాలకు సంకల్పం (నియ్యత్) ఫజర్ ఆరంభానికి ముందుగా చేసుకోవడం తప్పనిసరి. దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “ఎవరైనా ఫజర్ ఆరంభానికి ముందుగా ఉపవాస సంకల్పం చేసుకోకపోతే అతని ఉపవాసం నెరవేరదు”.

*(సహీహుల్ జామె అస్సగీర్ అల్‌బానీ:6534)*

కానీ నఫిల్ ఉపవాసం సంకల్పం మాత్రం ఫజర్ ఆరంభం తరువాత జొహర్ ముందు వరకు కూడా చేసుకోవచ్చు. కానీ షరతు ఏమిటంటే, ఫజర్ ఆరంభమైన తర్వాత ఏమీ తినకుండా, త్రాగకుండా వుండాలి.

గుర్తుంచుకోవలసిన విషయమేమిటంటే, సంకల్పం హృదయానికి సంబంధించినది. అందుకే ఉపవాస సంకల్పం హృదయంలోనే చేసుకోవాలి. ఇక సంకల్పం గురించి ఉచ్చరించబడే ‘వబి సౌమి గదిన్ నవైతు మిన్ షహ్‌రి రమజాన్’ అన్న పదాల గురించి చెప్పాలంటే, ఇవి ఏ హదీసు ద్వారా గూడా నిర్ధారించబడిలేవు.

## 2) సహ్‌రీ భుజించడం

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “సహ్‌రీ తినండి, ఎందుకంటే సహ్‌రీ భుజించడంలో శుభం వుంది”. *(బుఖారీ:1923, ముస్లిం:1095)*

మరో ఉల్లేఖనంలో ఇలా సెలవిచ్చారు: “సహ్‌రీ అంతా శుభకరమే అందుకే దానిని త్యజించకండి. కనీసం ఒక గుటక నీళ్ళు త్రాగి అయినా సరే (సహ్‌రీ చేయండి). ఎందుకంటే సహ్‌రీ భుజించే వారిపై అల్లాహ్ తన కారుణ్యాన్ని పంపుతాడు మరియు ఆయన దూతలు వారికోసం ప్రార్థిస్తారు”.

*(అహ్మద్, సహీహ్ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ అల్‌బానీ:1070)*

## సహ్‌రీ ఆలస్యంగా చేయడం ఉత్తమం

సహల్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు) కథనం: “నేను మా ఇంటి వారితో కలిసి సహ్‌రీ భుజించేవాణ్ణి. తదుపరి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి నమాజు చేయడానికి త్వరత్వరగా (మస్జిద్‌కు) వచ్చే వాణ్ణి”.

*(బుఖారీ: 1920)*

జైద్ బిన్ సాబిత్ (రజి అల్లాహు అన్హు) కథనం: మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తో కలిసి సహ్రీ తినే వాళ్ళం. తదుపరి ఆయన నమాజు వైపుకు వెళ్ళేవారు. అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: నేనిలా అడిగాను: అజాన్ మరియు సహ్రీల మధ్య ఎంత సమయం వుండేది? ఆయన జవాబిస్తూ, 50 ఆయతులు పఠంచగలిగే అంత అని అన్నారు.

*(బుఖారీ: 1921)*

ఒకవేళ రాత్రి ఉపవాసం సంకల్పం చేసుకొని నిద్రపోయి, సహ్రీ కోసం మేల్కోనకపోతే, ఇలాంటి స్థితిలో ఏమి తిని త్రాగకుండానే ఉపవాసం పూర్తి చేస్తే, ఆ ఉపవాసం నెరవేరుతుంది. ఒకవేళ స్నానం చేయాల్సిన పరిస్థితి వుండి, సహ్రీ కోసం సమయం తక్కువగా వుంటే, ఇలాంటి స్థితిలో వుజూ చేసి ముందుగా సహ్రీ భుజించాలి. తదుపరి స్నానం చేసి నమాజు చదవాలి. దీని గురించి, ఉమ్మె సలమా (రజి అల్లాహు అన్హ) మరియు ఆయెషా (రజి అల్లాహు అన్హ) లు ఇలా వివరించారు: “ఒక్కోసారి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (నిద్ర నుండి) మేల్కొన్నప్పుడు తన ఇంటి వారి మూలంగా ఆయన అపరిశుద్ధ స్థితిలో వుండేవారు. అప్పుడు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్నానం చేసేవారు మరియు ఆ దినపు ఉపవాసం కూడా పాటించేవారు.”

*(బుఖారీ: 1925)*

## 3) అసత్యం పలకడం, నిందలు మోపటం, చాడీలు చెప్పడం, దుర్భాషలాడటం మరియు శపించటం ఇలాంటి పనులకు దూరంగా వుండడం

ఉపవాసం ఉన్న సమయంలో ఈ విషయాలన్నింటికీ దూరంగా వుండడం తప్పనిసరి. దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “ఏ వ్యక్తి అయినా అసత్యం పలకడం, దానిపై ఆచరించడం త్యజించడో అలాంటి వ్యక్తి అన్నపానీయాలు వదులుకోవడం అల్లాహ్‌కు ఏమాత్రం అవసరం లేదు”. *(బుఖారీ:1903)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “ఉపవాసం అంటే కేవలం అన్నపానీయాలు త్యజించడం కాదు. పైగా ఉపవాసస్థితిలో సిగ్గుమాలిన పనులను

త్యజించడం కూడా దీనిలోని ఒక భాగమే. అందుకే (ఉపవాస స్థితిలో) మీతో ఎవరైనా దుర్భాషలాడితే లేదా అసభ్యంగా ప్రవర్తిస్తే మీరు ఇలా అనండి, నేనైతే ఉపవాస స్థితిలో వున్నాను, నేనైతే ఉపవాస స్థితి వున్నాను".

*(ఇబ్నె ఖుజైమా, ఇబ్నె హిబ్బాన్, సహీహ్ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ :1082)*

## 4) ఇఫ్తార్

సూర్యాస్తమయం కాగానే ఉపవాస విరమణ (ఇఫ్తార్) చేయాలి మరియు దానిలో ఆలస్యం చేయకూడదు. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ప్రజలు ఇఫ్తార్‌ను తొందరగా చేస్తున్నంత వరకు, మంచిని కలిగి వుంటారు". *(బుఖారీ: 1957, ముస్లిం:1098)*

తాజా ఖర్జూరాలతో ఇఫ్తార్ చేయడం మంచిది. ఒకవేళ తాజా ఖర్జూరాలు లభ్యం కాకాపోతే అలాంటి స్థితిలో పాత ఖర్జూరాలతో ఇఫ్తార్ చేసుకోవాలి. ఒకవేళ పాత ఖర్జూరాలు కూడా లభ్యం కాని స్థితిలో నీళ్ళతో ఇఫ్తార్ చేయవచ్చు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ (మగ్రిబ్)కు ముందు తాజా ఖర్జూరాలతో ఇఫ్తార్ చేసేవారు, ఒకవేళ తాజా ఖర్జూరాలు లభ్యం కాకపోతే, పాత ఖర్జూరాలతో (ఇఫ్తార్) చేసేవారు. ఒకవేళ పాత ఖర్జూరాలు కూడా లభ్యం కాకపోతే, కొన్ని నీళ్ళ గుటకల ద్వారా ఇఫ్తార్ పూర్తి చేసేవారు.

*(అబూ దావూద్:2356, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ :1077)*

## ఇఫ్తార్ దుఆ

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇఫ్తార్ ముగించాక ఇలా దుఆ చేసేవారు– "దాహం తీరింది, నరాలు చల్లబడ్డాయి (సేదతీరాయి), ఇన్షాఅల్లాహ్ పుణ్యఫలం కూడా నిర్ధారించబడింది". *(అబూ దావూద్: 2357, హసన్–అల్‌బానీ)*

ఆఖరుగా అల్లాహ్‌ను వేడుకొనేదేమంటే, ఆయన మనందరినీ ఈ శుభప్రదమైన మాసంలో వీలైనంత ఎక్కువగా తన ఆరాధన చేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక! మరియు తాను మన్నించి, నరకాగ్ని నుండి స్వేచ్ఛను ప్రసాదించే అదృష్టవంతులలో మనల్ని కూడా చేర్చుగాక! ఆమీన్!!

# దివ్య ఖుర్ఆన్ మహాత్మ్యాలు

## ఖుత్బాయందలి ముఖ్యాంశాలు

1) రమజాన్ మాసం మరియు దివ్య ఖురాన్.

2) దివ్య ఖురాన్ విశిష్టత మరియు ఔన్నత్యం.

3) దివ్య ఖురాన్ కొన్ని మహత్యాలు.

4) దివ్య ఖురాన్ ఎందుకు అవతరించబడింది?

5) దివ్య ఖురాన్ ప్రభావాలు.

6) దివ్య ఖురాన్‌ను గట్టిగా పట్టుకోమని ఆదేశం.

## మొదటి ఖుత్బా

ఇస్లామీయ సోదరులారా!

అల్లాహ్, ఆకాశ గ్రంథాలలో అన్నింటికన్నా ఉత్తమమైన గ్రంథాన్ని (ఖురాను) అన్నింటికన్నా శ్రేష్టమైన మాసంలో (రమజాన్ మాసం) అవతరింపజేశాడు. అంతేకాక, ఈ శుభప్రదమాసంలోని శ్రేష్టమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) యందు దీనిని 'లౌహె మహ్ఫూజ్' నుండి ఒక్కసారిగా ఇహలోకపు ఆకాశంపైకి అవతరింపజేసి 'బైతుల్ ఇజ్జ' (మొదటి ఆకాశంలోని ఒక ప్రదేశం) నందు పొందుపరిచాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

شَهْرُ رَمَضَانَ الَّذِيٓ أُنْزِلَ فِيْهِ الْقُرْاٰنُ هُدًى لِّلنَّاسِ وَبَيِّنٰتٍ مِّنَ الْهُدٰى وَالْفُرْقَانِ

**"రమజాన్ నెల, ఖురాను అవతరింపజేయబడిన నెల. ఇది మానవులందరికీ మార్గదర్శకం. అందులో సన్మార్గంతో పాటు, సత్కార్యాలను వేరుపరచే స్పష్టమైన నిదర్శనాలు వున్నాయి".** ***(బఖర:185)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

إِنَّآ أَنْزَلْنٰهُ فِيْ لَيْلَةِ الْقَدْرِ ۝

**"నిశ్చయంగా మేము దీనిని (ఈ ఖురానును) ఘనమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) నందు అవతరింపజేశాము."** ***(ఖద్ర్:1)***

దీని ద్వారా తెలిసిందేమిటంటే, దివ్య ఖురాన్‌కు రమజాన్ మాసంతో ప్రగాఢ సంబంధం వుంది. అందుకే ఈ మాసంలో వీలైనంత ఎక్కువగా దివ్య ఖురాన్ పారాయణం చెయ్యాలి.

స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా దీని గురించి తగు జాగ్రత్త వహించేవారు. శుభప్రద రమజాన్ మాసం ప్రతి రాత్రి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం)కు ఖురాన్ వినిపించేవారు.

సహీహ్ బుఖారీ లోని ఒక హదీసులో అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ఇలా వుంది: "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రజలందరి కన్నా ఎక్కువగా సత్కార్యాలు చేసేవారు. ఆయన, అన్నింటికన్నా ఎక్కువగా సత్కార్యాలను రమజాన్ మాసంలో చేసేవారు. జిబ్రయీల్ (అలైహిస్సలాం) వచ్చి ఆయనను కలిసేవారు. జిబ్రయీల్ (అలైహిస్సలాం) రమజాన్ మాసపు ప్రతి రాత్రి ఆయనను కలిసేవారు. అప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనకు ఖురాన్ ను వినిపించేవారు. జిబ్రయీల్ (అలైహిస్సలాం) ను కలిసాక, ఆయన(సల్లల్లాహు అలైహి వ సల్లం) సుడిగాలి కన్నా వేగంగా సత్కార్యాల వైపునకు పరుగెత్తేవారు". *(బుఖారీ: 1902)*

ఇక రండి! ఎంతో మహోన్నతమైన ఈ గ్రంథం మహత్యాలను విని మన విశ్వాసాన్ని మరింత తాజాగా చేసుకుందాం!

## దివ్య ఖురాన్ అల్లాహ్ వాక్కు

ప్రియమైన సోదరులారా!

దివ్య ఖురాన్ ఎంతో మహోన్నతమైన గ్రంథం. దీని ఔన్నత్యం గురించి చెప్పాలంటే కేవలం ఈ ఒక్క విషయం చాలు. అదేమిటంటే, దివ్య ఖురాన్ అల్లాహ్ తరఫు నుండి అవతరించబడిన, అతని స్పష్టమైన వాక్కు. స్వయానా అల్లాహ్ యే దీని ఔన్నత్యం గురించి వివిధ రకాలుగా సెలవిచ్చాడు:

وَاِنَّهٗ لَتَنْزِيْلُ رَبِّ الْعٰلَمِيْنَ ۝ نَزَلَ بِهِ الرُّوْحُ الْاَمِيْنُ ۝ عَلٰى قَلْبِكَ لِتَكُوْنَ مِنَ
الْمُنْذِرِيْنَ ۝ بِلِسَانٍ عَرَبِيٍّ مُّبِيْنٍ ۝ وَاِنَّهٗ لَفِيْ زُبُرِ الْاَوَّلِيْنَ ۝

**"నిశ్చయంగా ఇది (ఈ ఖురాన్) సకల లోకాల ప్రభువు అవతరింప**

**జేసినది. విశ్వసనీయుడైన దైవదూత దీనిని తీసుకొచ్చాడు. (ఓ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)! నువ్వు హెచ్చరించే వారిలోని వాడవు కావటానికి ఇది నీ హృదయంపై అవతరించింది. (ఇది సుస్పష్టమైన అరబీ భాషలో వుంది. పూర్వీకుల గ్రంథాలలో కూడా దీని (ఖురాన్) ప్రస్తావన ఉంది.” *(అష్ షూరా: 192-196)***

మరో చోట ఇలా సెలవిచ్చాడు :

تَبٰرَكَ الَّذِيْ نَزَّلَ الْفُرْقَانَ عَلٰى عَبْدِهٖ لِيَكُوْنَ لِلْعٰلَمِيْنَ نَذِيْرًا ۝

**“సమస్త లోకవాసులను హెచ్చరించే వానిగా ఉండటానికి గాను ఈ దాసునిపై గీటురాయిని అవతరింజేసిన అల్లాహ్ గొప్ప శుభకరుడు”. *(ఫుర్ఖాన్:1)***

మరోచోట నక్షత్రాలు రాలిపడటం పై ప్రమాణంచేసి ఈ గ్రంథాన్ని గౌరవ ప్రదమైన గ్రంథంగా ఖరారు చేస్తూ ఇలా సెలవిచ్చాడు:

فَلَآ اُقْسِمُ بِمَوٰقِعِ النُّجُوْمِ ۝ وَاِنَّهٗ لَقَسَمٌ لَّوْ تَعْلَمُوْنَ عَظِيْمٌ ۝ اِنَّهٗ لَقُرْاٰنٌ كَرِيْمٌ ۝
فِيْ كِتٰبٍ مَّكْنُوْنٍ ۝ لَّا يَمَسُّهٗٓ اِلَّا الْمُطَهَّرُوْنَ ۝ تَنْزِيْلٌ مِّنْ رَّبِّ الْعٰلَمِيْنَ ۝

**“అదికాదు, నక్షత్రాలు రాలి పడటం పై నేను ప్రమాణం చేస్తున్నాను. మీరు గనక తెలుసుకోగలిగితే ఇది చాలా పెద్ద ప్రమాణం. నిశ్చయంగా ఈ ఖుర్ఆన్ చాలా గౌరవప్రదమైనది. అదొక సురక్షితమైన గ్రంథంలో (నమోదై) వుంటుంది. పరిశుద్ధులు మాత్రమే దాన్ని ముట్టుకోగలరు. ఇది స్వర్గలోకాల ప్రభువు తరపున అవతరించింది.” *(వాఖిఅహ్: 75-80)***

అల్లాహ్ ఈ గ్రంథాన్ని ఒకచోట ‘అల్ కితాబుల్ ముబీన్,’ మరో చోట ‘అల్ కితాబుల్ హకీం’ ఇంకో చోట ‘తన్జీలుల్ కితాబి మినల్లాహిల్ అజీజిల్ హకీమ్’ అని, మరో చోట దీని ప్రమాణం చేసి ఇలా సెలవిచ్చాడు : ‘హామీమ్, వల్ కితాబిల్ ముబీన్, ఇన్నా అన్జల్నాహు ఖుర్ఆనన్ అరబియ్యన్ లఅల్లకుమ్ తాఖిలూన్’ అని మరో చోట, ‘యాసీన్ వల్ ఖురానిల్ హకీమ్’ అని, ఇంకో చోట ‘స్వాద్, వల్ ఖుర్ఆని జిజ్జిక్ర్’– ఇలా, అల్లాహ్ దాని వేర్వేరు గుణగణాలను వివరించి, వాటి ప్రమాణం చేసి దీని ఔన్నత్యాన్ని విశదపరిచాడు. తద్వారా,

దీనిని విశ్వసించే వాళ్ళు కూడా హృదయపూర్వకంగా దీని గౌరవోన్నత్యాలను గుర్తించి దానిని తమ జీవన శైలిగా చేసుకోవడానికి (ఇలా చేశాడు).

## దివ్య ఖుర్ఆన్ – పోలిక లేని గ్రంథం

దివ్య ఖుర్ఆన్ అల్లాహ్ గ్రంథాలలో అన్నింటి కన్నా శ్రేష్టమైనది. వక్తృత్వం మరియు సాహిత్యపరంగా ఈ గ్రంథం ఏమాత్రం పోలిక లేనిది. అందుకే ఈ గ్రంథం వాక్చాతుర్యులను, సాహితీ వేత్తలను, అందరూ కలిసి – కనీసం దీని లాంటి ఒక్క సూరానైనా (రచించి) తీసుకురమ్మని ఛాలెంజ్ చేస్తుంది. అంతేగాక, జిన్నాతులు, మానవులు– అందరూ ఏకమైనా ఇలాంటి ఖురాన్‌ను తీసుకురాలేరు అని బాహాటంగా ప్రకటిస్తుంది.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قُلْ لَّئِنِ اجْتَمَعَتِ الْاِنْسُ وَالْجِنُّ عَلٰٓى اَنْ يَّاْتُوْا بِمِثْلِ هٰذَا الْقُرْاٰنِ لَا يَاْتُوْنَ بِمِثْلِهٖ وَلَوْ كَانَ
بَعْضُهُمْ لِبَعْضٍ ظَهِيْرًا ۝

**"వారికి చెప్పు: ఒకవేళ సమస్త మానవులు, యావత్తు జిన్నాతులు అందరూ కలసి ఈ ఖురానులాంటి గ్రంథాన్ని తేదలచినా – వారు ఒకరికొకరు తోడ్పాటును అందజేసుకున్నా ఇటువంటి దానిని తీసుకురావటం వారి వల్ల కాని పని". *(బనీ ఇస్రాయీల్: 88)***

## దివ్య ఖుర్ఆన్ సన్మార్గాన్ని చూపిస్తుంది

దివ్య ఖుర్ఆన్ మనిషికి ఇహలోక, పరలోక సాఫల్యాల వైపునకు మార్గం చూపుతుంది. అతనికి స్వర్గం వైపునకు తీసుకెళ్లే స్పష్టమైన సన్మార్గాన్ని, రుజుమార్గాన్ని చూపిస్తుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

اِنَّ هٰذَا الْقُرْاٰنَ يَهْدِيْ لِلَّتِيْ هِيَ اَقْوَمُ وَيُبَشِّرُ الْمُؤْمِنِيْنَ الَّذِيْنَ يَعْمَلُوْنَ الصّٰلِحٰتِ اَنَّ لَهُمْ
اَجْرًا كَبِيْرًا ۝

**"నిశ్చయంగా ఈ ఖుర్ఆన్ అన్నింటికంటే సత్యమైన మార్గాన్ని చూపిస్తుంది. మంచి పనులు చేసే విశ్వాసులకు గొప్ప పుణ్యఫలం ఉందన్న శుభవార్తను ఇది వినిపిస్తుంది". *(బనీ ఇస్రాయీల్:9)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

قَدْ جَآءَكُمْ مِّنَ اللّٰهِ نُوْرٌ وَّكِتٰبٌ مُّبِيْنٌ ﴿15﴾ يَّهْدِيْ بِهِ اللّٰهُ مَنِ اتَّبَعَ رِضْوَانَهٗ سُبُلَ السَّلٰمِ وَيُخْرِجُهُمْ مِّنَ الظُّلُمٰتِ اِلَى النُّوْرِ بِاِذْنِهٖ وَيَهْدِيْهِمْ اِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ﴿﴾

"అల్లాహ్ తరఫు నుంచి మీ వద్దకు జ్యోతి వచ్చేసింది. అంటే స్పష్టమైన గ్రంథం వచ్చేసింది. దాని ద్వారా అల్లాహ్ తన ప్రసన్నతను అనుసరించే వారికి శాంతి మార్గాలను చూపుతాడు. తన అనుమతి మేరకు వారిని చీకట్లలో నుంచి వెలికి తీసి, కాంతి (వెలుగు) వైపునకు తీసుకువస్తాడు. రుజుమార్గం వైపునకు వారికి మార్గదర్శకత్వం వహిస్తాడు".

***(మాయిద: 15,16)***

## దివ్య ఖుర్ఆన్ అసత్యాల మిశ్రణ నుంచి అత్యంత పరిశుద్ధంగా చేయబడ్డ, అనుమానాలకు ఏ మాత్రం తావులేని గ్రంథం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

اِنَّ الَّذِيْنَ كَفَرُوْا بِالذِّكْرِ لَمَّا جَآءَهُمْ ۚ وَاِنَّهٗ لَكِتٰبٌ عَزِيْزٌ ﴿﴾ لَّا يَاْتِيْهِ الْبَاطِلُ مِنْۢ بَيْنِ يَدَيْهِ وَلَا مِنْ خَلْفِهٖ ۭ تَنْزِيْلٌ مِّنْ حَكِيْمٍ حَمِيْدٍ ﴿﴾

"తమ వద్దకు హితోపదేశం (ఖుర్ఆన్) వచ్చేసినప్పటికీ, దాన్ని త్రోసిపుచ్చిన వారు (కూడా మా నుండి దాగి లేరు). ఇదొక ప్రతిష్ఠాత్మకమైన గ్రంథం. అసత్యం దీని దరిదాపుల్లోకి కూడా – దీని ముందు నుండి గానీ, దీని వెనుక నుండి గానీ రాజాలదు. ఎందుకంటే ఇది మహా వివేకవంతుడు, ప్రశంసనీయుడైన అల్లాహ్ తరఫు నుండి అవతరింపజేయబడింది". ***(హామీమ్ అస్సజ్దహ్ : 41, 42)***

అలాగే, ఇలా సెలవిచ్చాడు:

ذٰلِكَ الْكِتٰبُ لَا رَيْبَ ۛ فِيْهِ

"ఈ గ్రంథం (అల్లాహ్ గ్రంథం అన్న విషయం)లో ఎంత మాత్రం సందేహం లేదు". ***(బఖర:2)***

## దివ్య ఖుర్‌ఆన్ సంరక్షణ బాధ్యతను అల్లాహ్ స్వయంగా తీసుకున్నాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّا نَحْنُ نَزَّلْنَا الذِّكْرَ وَإِنَّا لَهُ لَحَافِظُونَ ۝

**"(నిశ్చయంగా) మేమే ఈ ఖుర్‌ఆన్‌ను అవతరింపజేశాము. మరి మేమే దీనిని రక్షిస్తాము". *(హిజ్ర్: 9)***

ఇలా, అల్లాహ్ తన దాసుడైన జిబ్రయీల్ (అలైహిస్సలాం) ద్వారా ఖుర్‌ఆన్ ను అవతరింపజేసేవాడు. ఆయన (జిబ్రయీల్) ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చి దాని ఆయతులను పఠించి వినిపించేవారు. తాను వాటిని మరిచిపోతానేమోనన్న అనుమానంతో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), జిబ్రయీల్ (అలైహిస్సలాం) పఠించే సమయంలో, ఆయనతో పాటు పఠించడం మొదలు పెట్టేవారు.

దానిపై అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

لَا تُحَرِّكْ بِهِ لِسَانَكَ لِتَعْجَلَ بِهِ ۝ إِنَّ عَلَيْنَا جَمْعَهُ وَقُرْآنَهُ ۝ فَإِذَا قَرَأْنَاهُ فَاتَّبِعْ قُرْآنَهُ ۝ ثُمَّ إِنَّ عَلَيْنَا بَيَانَهُ ۝

**"ఓ దైవప్రవక్తా! నీవు ఖుర్‌ఆన్‌ను తొందరగా కంఠస్తం చేసుకోవడానికి నీ నాలుకను వేగంగా కదిలించకు. దీనిని సమకూర్చే, (నీ చేత) పారాయణం చేయించే బాధ్యత మాది. కాబట్టి మేము దీనిని పఠించాక, నువ్వు దీని పఠనాన్ని అనుసరించు. మరి దీనిని విడమరచి చెప్పే బాధ్యత కూడా మాపైనే వుంది". *(ఖియామహ్: 16–19)***

ఈ విధంగా దివ్య ఖుర్‌ఆన్, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హృదయ ఫలకంపై సురక్షితం కాబడేది. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జిబ్రయీల్ (అలైహిస్సలాం) దగ్గర దీని పున:పారాయణం చేసేవారు. దీని గురించి మేము ఈ ఖుత్బా ఆరంభంలోనే సహీహ్ బుఖారీ లోని ఒక హదీసు ద్వారా వివరించాం.

ఇలాగే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దివ్య ఖుర్ఆన్ ఆయతులను తన సహాబాలకు కూడా వినిపించేవారు. వారు కూడా వాటిని విన్న తరువాత తమ హృదయాల్లో నిక్షిప్తం చేసుకొనేవారు. అంతేకాక, సహాబాలలో ఈ దైవవాణి (వహీ)ని సంగ్రహించే బాధ్యతను అప్పగించి వారిని, దీనిని వ్రాసి పొందుపరచమని ఆదేశించేవారు కూడా.

ఇలా ఈ ఖుర్ఆన్ ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితంలోనే వ్రాయబడి వుంది మరియు సహాబాల హృదయాలలో కూడా నిక్షిప్తమై వుంది. తదుపరి అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) ఆదేశానుసారం జైద్ బిన్ సాబిత్ (రజి అల్లాహు అన్హు) వేర్వేరు వస్తువులపై లిఖించి వున్న ఖుర్ఆన్‌ను సమీకరించి, క్రమపద్ధతిలో లేని కొన్ని పుస్తకాల రూపంలో చేర్చారు. ఆ తర్వాత ఉస్మాన్ (రజి అల్లాహు అన్హు) – వేర్వేరు పుస్తకాల రూపంలో వున్న వాటిని ఒక గ్రంథం రూపంలో క్రమపద్ధతిలో చేర్చి తదుపరి దాని కాపీలను యావత్ ఇస్లామీయ ప్రదేశాలకు వ్యాపింప జేశారు. ఈ రోజు కూడా ప్రపంచంలోని అన్ని ప్రదేశాల్లోనూ ఈ ఖుర్ఆనే లభ్యమవుతుంది. (ప్రపంచ దేశాల్లోని) తూర్పు నుండి ఒక ఖుర్ఆన్‌ను, పడమర నుంచి మరో ఖుర్ఆనును నేడు తీసుకొని రెండింటిలోని తేడాను గనక ఎవరైనా చూడదలిస్తే పదాల తేడా అటుంచి, కనీసం ఒక అక్షరం తేడా కూడా అతను పొందలేడు. అంతేగాక, ఈ రోజు ప్రపంచంలో ఎంతో మంది ఖుర్ఆన్ కంఠస్తులు (హాఫిజ్‌లు) కూడా వున్నారు. ఖుర్ఆన్ కంఠస్తం కోసం ముస్లిములు చూపించే ఉత్సాహం, శ్రద్ధ, ప్రపంచంలోని ఏ ఇతర గ్రంథం విషయంలోనూ కనిపించదు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఖురాన్ కంఠస్తం చేయించడాన్ని ఎంతో గౌరవంగా భావిస్తారు. మస్జిద్‌లలో ఖుర్ఆన్ కంఠస్తం కొరకు ప్రత్యేక ఏర్పాట్లు చేయబడతాయి. రేయింబవళ్ళు అల్లాహ్ గృహాలలో దీని పారాయణం జరుగుతూ వుంటుంది మరియు కంఠస్తం కూడా చేయడం జరుగుతూ వుంటుంది. పిల్లలతో పాటు వయస్సు మీరిన పెద్దలు కూడా ఖుర్ఆన్ కంఠస్తులు (హాఫిజ్) కాకపోయినప్పటికీ, దానిని కంఠస్తం చేయడానికి ఉత్సాహ పడుతూ వుంటారు. ఇలా దివ్య ఖుర్ఆన్ పట్ల ముస్లిములు చూపే శ్రద్ధ మరియు ఉత్సాహం, అల్లాహ్ దీని సంరక్షణ బాధ్యతను తీసుకున్న దాని ఫలితమే. ఆయన తన దాసుల ద్వారానే దీనిని సంరక్షిస్తూ వుంటాడు.

## దివ్య ఖుర్ఆన్‌లో స్వస్థత వుంది.

అవునండీ! దివ్య ఖుర్ఆన్ – హృదయ విశ్వాస పరమైన రోగాలైన కుఫ్ర్, షిర్క్, కపటత్వం ల నుండి మరియు నైతిక రోగాలైన ఈర్ష్య, అసూయ, అత్యాశల నుండి స్వస్థత చేకూర్చుతుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا النَّاسُ قَدْ جَاءَتْكُمْ مَوْعِظَةٌ مِنْ رَبِّكُمْ وَشِفَاءٌ لِمَا فِي الصُّدُورِ وَهُدًى وَرَحْمَةٌ لِلْمُؤْمِنِينَ

**"ప్రజలారా! మీ ప్రభువు తరఫు నుంచి మీ దగ్గరకు హితోపదేశం వచ్చింది. అది హృదయాలలో ఉన్న వ్యాధుల నుంచి స్వస్థత నొసగేది, నమ్మే వారి కోసం మార్గదర్శకం, కారుణ్యం".** ***(యూనుస్: 57)***

అలాగే ఇలా సెలవిచ్చాడు:

قُلْ هُوَ لِلَّذِينَ آمَنُوا هُدًى وَشِفَاءٌ

**"(ఓ ప్రవక్తా!) నువ్వు వారికి ఇలా చెప్పు: ఇది విశ్వసించిన వారి కోసం మార్గదర్శిని, ఆరోగ్య ప్రదాయిని".** ***(హామీమ్ అస్సజ్దహ్:44)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

وَنُنَزِّلُ مِنَ الْقُرْآنِ مَا هُوَ شِفَاءٌ وَرَحْمَةٌ لِلْمُؤْمِنِينَ وَلَا يَزِيدُ الظَّالِمِينَ إِلَّا خَسَارًا ○

**"మేము అవతరింపజేసే ఈ ఖుర్ఆన్ విశ్వాసుల కొరకు ఆసాంతం స్వస్థత, కారుణ్య ప్రదాయిని. అయితే దుర్మార్గులకు (దీని వల్ల) నష్టం కలగటం తప్ప మరే వృద్ధీ జరుగదు".** ***(బనీ ఇస్రాయీల్:82)***

గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే, దివ్య ఖుర్ఆన్ హృదయ విశ్వాస, నైతిక పరమైన వ్యాధులకు స్వస్థత చేకూర్చడంతోపాటు శారీరక వ్యాధులకు కూడా చికిత్స. అందుకే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తను వ్యాధిగ్రస్తులైనప్పుడు ముఅవ్విజాత్ సురాలు పఠించి తనపై ఊదుకునే వారు.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వ్యాధిగ్రస్తులైనప్పుడు తనపై ముఅవ్విజాత్ సూరాలు పఠించి ఊదుకునేవారు. ఆయన వ్యాధి తీవ్రరూపం దాల్చినప్పుడు, నేను వాటిని

పఠించేదాన్ని. తదుపరి ఆయన చేతులను, శుభాన్ని ఆశిస్తూ, ఆయన శరీరంపై నిమిరేదాన్ని. *(బుఖారీ: 5016)*

ముఅవ్విజాత్ సూరాలు పఠించి ఊదడానికి ఈ హదీసు ఆధారం. ఇలాగే ఫాతిహా సూరా కూడా పఠించి వ్యాధిగ్రస్తులపై ఊదితే, అల్లాహ్ స్వస్థత చేకూరుస్తాడు.

అబూ సయీద్ ఖుద్రీ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాలలో కొందరు అరబ్బు జాతులలోని ఒక జాతి వద్దకు వెళ్ళగా వారు వీరికి ఆతిథ్యమివ్వలేదు. ఈలోగా, వారి నాయకునికి ఒక త్రేలు కుట్టింది. వాళ్ళు అతనికి అన్ని రకాల చికిత్సలు చేయించారు, కానీ ఏమాత్రం లాభం కలగలేదు. ఆఖరికి వాళ్ళు సహాబాల దగ్గరికి వచ్చి – మా నాయకునికి తేలు కాటేసింది. మీలో ఎవరైనా దీనికి చికిత్స చేసే వారున్నారా? అని అడిగారు. వారిలో (సహాబాలలో) ఒకరు – నేను మంత్రించి ఊదుతాను, కానీ మీరు మాకు ఆతిథ్యమే ఇవ్వలేదు, అందుకే మీరు మాకు పరిహారం చెల్లించనంత వరకు నేనీపని చేయను అని అన్నారు. ఆ ఊరివాళ్ళు – సరే, మేము మీకు కొన్ని మేకలను పరిహారం రూపంలో చెల్లిస్తాం అని అన్నారు.

తదుపరి ఆ సహాబీ అతని వద్దకెళ్ళి, అతనిపై ఫాతిహా సూరా పఠించి, తేలు కాటేసిన చోట కొద్దిగా ఉమ్మేసారు. దీనితో అతను పూర్తిగా స్వస్థత పొందాడు. ఆ వూరి వాళ్ళు కూడా మాట ప్రకారం వీరికి మేకలను ఇచ్చివేశారు.

ఆ తర్వాత, సహాబాలు ఒకరికొకరు, మేము ఈ మేకలను పంచుకుంటే ఎలా వుంటుంది? అని ప్రశ్నించుకోగా, మంత్రించి ఊదిన సహాబీ – లేదు, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికెళ్ళేంత వరకు వీటి గురించి మనమేమీ చేయకూడదు అని అన్నారు. తదుపరి వారంతా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికొచ్చి జరిగిన వృత్తాంతమంతా వివరించారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాట్లాడుతూ– ఫాతిహా సూరా మంత్రించి ఊదవచ్చని నీకెలా తెలుసు! అని అడిగి, నువ్వు సరిగా చేశావు. కనుక మీరు ఈ మేకలను పంచుకోండి మరియు దీనిలో నా వాటాను కూడా తీయండి అని అన్నారు. *(బుఖారీ: 2276, 5736)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే, వ్యాధిగ్రస్తులపై ఫాతిహా సూరా

పఠించి ఊదితే అల్లాహ్ ఆజ్ఞతో అతనికి స్వస్థత చేకూరుతుంది. కనుక దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఈ చికిత్స పద్ధతితో మనం కూడా ప్రయోజనం పొందాలి.

అల్లామా ఇబ్నుల్ ఖయ్యూం రహిమహుల్లాహ్ ఇలా పేర్కొన్నారు: (అల్లాహ్) దాసులెవరైనా ఫాతిహా సూరాతో తన వ్యాధికి చికిత్స గనక చేస్తూ వుంటే, ఎంతో ఆశ్చర్యకరమైన ప్రభావాన్ని అతను చూడగలగుతాడు. ఆయన ఇలా పేర్కొన్నారు– నేనొకసారి మక్కాలో కొన్ని రోజులు బస చేశాను. ఈ వ్యవధిలో నాకు వేర్వేరు వ్యాధులు సోకాయి. వీటి కోసం సరియైన డాక్టర్‌ను గానీ, చికిత్సను కానీ నేను పొందలేక పోయాను. దీనితో నేను ఫాతిహా సూరాతో చికిత్స చేయడం ప్రారంభించగా, ఎంతో ఆశ్చర్యకరమైన ప్రభావాన్ని (ఉపశమనాన్ని) పొందాను. తదుపరి నేను ఈ చికిత్స గురించి ఎంతోమందికి చెప్పాను. వాళ్ళు కూడా నొప్పి వగైరా లాంటి సమస్యలకు ఈ చికిత్సను పయోగించి, ఎంతో మంది స్వస్థత పొందారు.

*(అల్ జవాబుల్ కాఫీ:16వ పేజీ)*

ఇలా ఎందుక్కాదు మరి! ఫాతిహా సూరానే దివ్య ఖుర్ఆన్ యొక్క మహోన్నత సూరా అయినప్పుడు.

అబూ సయీద్ అల్ ముఆలి (రజి అల్లాహు అన్హు) కథనం: నేనొక సారి మస్జిద్‌లో నమాజ్ చదువుతూ వుండగా, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నా దగ్గరి నుండి వెళుతూ నన్ను పిలిచారు. కానీ నేను వెంటనే జవాబివ్వక, నమాజ్ పూర్తి చేసుకొని ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) దగ్గరికెళ్లాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) –నా దగ్గరికి రానీయకుండా ఏ విషయం నిన్ను ఆపి వుంచింది? అని అడిగారు. నేను, ఓ దైవప్రవక్తా! నేను నమాజ్ చదువుతూ వున్నాను అని విన్నవించుకున్నాను. దీనిపై ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – అల్లాహ్ ఇలా సెలవియ్యలేదా?

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا اسْتَجِيبُوا لِلَّهِ وَلِلرَّسُولِ

**"ఓ విశ్వాసులారా! మీకు జీవితాన్నిచ్చే వస్తువు వైపునకు ప్రవక్త మిమ్మల్ని పిలిచినప్పుడు మీరు అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త పిలుపుకు అనుకూలంగా స్పందించండి".** ***(అన్‌ఫాల్ : 24)***

తదుపరి ఆయన – నువ్వు మస్జిద్ నుండి బయటికెళ్ళే ముందు ఖుర్ఆన్ లోని మహోన్నత సూరా గురించి నీకు చెప్పనా? అని అన్నారు. (కాసేపటికి) మేము మస్జిద్ నుండి బయటికి రాబోతుండగా నేను, ఓ దైవప్రవక్తా! మీరు నాతో ఖుర్ఆన్ లోని మహోన్నత సూరా గురించి వివరిస్తానని చెప్పారు అన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) నాతో– "అది ఫాతిహా సూరా. దీని ఏడు ఆయతులు మాటిమాటికీ తిరగేయడం జరుగుతూ వుంటుంది. నాకివ్వబడిన ఖురాన్‌లోని మహోన్నతమైన సూరా ఇదే".

*(బుఖారీ: 4647, 5006)*

## దివ్య ఖుర్ఆన్ పారాయణం మహత్యం.

ఈ ప్రపంచంలో అత్యధికంగా పారాయణం చెయ్యబడి, దాని ప్రతి అక్షరానికి 10 పుణ్యాలు లభించే ఒకే ఒక్క అల్లాహ్ గ్రంథం దివ్య ఖుర్ఆన్.

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా అల్లాహ్ గ్రంథం (ఖుర్ఆన్) నుండి ఒక్క అక్షరం చదివినా అతనికి ఒక పుణ్యం దొరుకుతుంది. ఒక పుణ్యం, దానిలాంటి పది పుణ్యాలకు సమానమవుతుంది. 'అలిఫ్', 'లామ్', 'మీమ్' ఒక అక్షరమని నేను చెప్పను. పైగా 'అలిఫ్' ఒక అక్షరం 'లామ్' రెండో అక్షరం మరియు 'మీమ్' మూడో అక్షరం".

*(తిర్మిజి: 2910, సహీహ్ అల్‌బానీ)*

## దివ్య ఖుర్ఆన్ తనను పఠించే వారికి సిఫారసు చేస్తుంది.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "మీరు ఖుర్ఆన్ పారాయణం చేస్తూ వుండండి. ఎందుకంటే అది తనను పఠించేవారి కొరకు (మరియు ఆచరించే వారి కొరకు) ప్రళయం నాడు సిఫారసు చేస్తుంది". *(ముస్లిం:1337)*

## ఖుర్ఆన్ పారాయణం వల్ల షైతాన్ ఇంటి నుండి పారిపోతాడు

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మీరు మీ ఇండ్లను స్మశాన వాటికలుగా చేయకండి. నిశ్చయంగా బఖర సూరా పారాయణం చెయ్యబడే ఇంటి నుండి షైతాన్ పారిపోతాడు". *(ముస్లిం:780)*

## ఖుర్‌ఆన్‌ను నేర్పేవారు, నేర్చుకునేవారు అందరి కన్నా శ్రేష్ఠులు.

ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మీలో ఖుర్‌ఆన్‌ను స్వయంగా నేర్చుకొని, ఇతరులకు నేర్పేవారే అందరికన్నా శ్రేష్ఠమైనవారు". *(బుఖారీ : 5027)*

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది: "నిశ్చయంగా మీలో ఖుర్‌ఆన్‌ను స్వయంగా నేర్చుకొని, ఇతరులకు నేర్పేవారే ఉత్తమమైన వ్యక్తి".

*(బుఖారీ : 5028)*

నాఫె బిన్ అబ్దుల్ హారిస్ కథనం: నన్ను పవిత్ర మక్కాకు గవర్నర్‌గా నియమిస్తూ వచ్చిన ఉమర్ (రజి అల్లాహు అన్హు) ను ఓ సారి నేను 'అస్ఫాన్' (ప్రదేశం)లో కలిసాను. నేనాయనతో – ప్రస్తుతం మక్కా గవర్నర్‌గా మీరు ఎవరిని నియమించారు? అని అడగ్గా ఆయన 'ఇబ్నె అబజీ' అని అన్నారు. నేను, ఆయనెవరు? అని అడిగాను.

ఆయన–అతను నేను స్వేచ్ఛ ప్రసాదించిన ఒక బానిస అని అన్నారు.

నేను– స్వేచ్ఛ నొసగిన ఒక బానిసను మక్కా గవర్నర్‌గా నియమించారా? అని అడిగాను.

ఆయన– నిశ్చయంగా అతను ఖారీ (ఖుర్‌ఆన్‌ను దాని శైలిలో, మధురంగా పారాయణం చేసేవాడు) మరియు వారసత్వ విషయాల విద్వాంసుడు కూడా అని అన్నారు.

తదుపరి ఆయన, జాగ్రత్త! మీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చి వున్నారు : "నిశ్చయంగా అల్లాహ్ ఈ గ్రంథం ద్వారా కొందరిని శిఖరానికి చేర్చుతాడు మరియు కొందరిని అధోగతికి చేర్చుతాడు."

*(ముస్లిం: 817)*

## ఖుర్‌ఆన్ పారాయణం చేసి దాని ప్రకారం ఆచరించే వారు అల్లాహ్ ప్రత్యేక దాసులు

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా ప్రజలలో కొందరు అల్లాహ్ ప్రత్యేక దాసులు అని అనగా, సహాబాలు ఓ దైవ ప్రవక్తా! వాళ్ళు ఎవరు? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ: ఖుర్‌ఆన్‌ను పారాయణం చేసి దాని ప్రకారం ఆచరించే వారు అల్లాహ్ స్నేహితులు మరియు ప్రత్యేక దాసులు". *(ఇబ్నె మాజ : 215, సహీహ్ -అల్‌బానీ)*

## హాఫిజ్ – ఏ – ఖుర్‌ఆన్ (ఖుర్‌ఆన్ కంఠస్తం చేసినవారు) మహత్యం

దివ్య ఖుర్‌ఆన్ ఎలాంటి మహోన్నతమైన గ్రంథం అంటే, దీనిని కంఠస్తం చేసేవారు మరియు దీని ప్రకారం ఆచరించే వారికి కూడా ఎంతో ఔన్నత్యం ప్రసాదించ బడింది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఖుర్‌ఆన్ వారిని (ఖుర్‌ఆన్ కంఠస్తం చేసి దాని ప్రకారం ఆచరించేవారు) ఇలా అనబడుతుంది– ఖుర్‌ఆన్ పఠిస్తూ వుండు, (స్వర్గపు మెట్లను) ఎక్కుతూ వుండు, ఇహలోకంలో ఎలాగైతే ఆగి ఆగి సుమధురంగా పఠించేవాడివో, అలాగే ఇక్కడ కూడా పఠించు. (ఇలా పఠిస్తూ, ఎక్కుతూ) ఆఖరి ఆయత్ ఎక్కడైతే పఠిస్తావో అదే (స్వర్గంలో) నీ స్థానం.

*(అబూ దావూద్: 1464, తిర్మిజీ : 2914, హసన్ సహీహ్ అల్‌బానీ)*

అలాగే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా కూడా సెలవిచ్చారు: "(మీలో) ఏ వ్యక్తి అయినా ఖుర్‌ఆన్ నిపుణుడైతే (ఖుర్‌ఆన్ కంఠస్తం చేసి దానిని సుమధురంగా పారాయణం చేస్తూ దాని ప్రకారం ఆచరించేవాడు) అతను గౌరవనీయులైన దైవదూతలతో పాటు వుంటాడు. (అంటే ప్రళయం రోజు గౌరవనీయులైన దైవదూతలు వుండే స్థానాల్లో వారితో పాటు వుంటాడు)

ఏ వ్యక్తి అయినా ఖుర్‌ఆన్ పఠించబడడంలో కష్టాన్ని చవిచూస్తూ వుంటాడో అతనికి రెండు పుణ్యాలు వున్నాయి. అంటే, ఒక పుణ్యం పఠించినందుకు, మరో పుణ్యం, దానిని మాటిమాటికీ తిరగేసినందుకు. ఈ హదీసు అర్థం– బలహీన కంఠస్తునికి, బలమైన కంఠస్తునికన్నా ఎక్కువ పుణ్యం లభిస్తుంది అని ఎంత మాత్రం కాదు. బలమైన కంఠస్తులైతే ప్రళయం రోజు గౌరవనీయులైన దైవదూతలతో వుంటారు. ఇక వారి పుణ్యం ఫలం విషయానికొస్తే, అల్లాహ్ వారిని ఎంతగా అనుగ్రహిస్తాడో ఆయనకే తెలుసు.

## నమాజులో ఖుర్‌ఆన్ పారాయణం మహాత్యం

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:"మీరు మీ ఇంటికి తిరిగి వెళ్ళినప్పుడు అక్కడ మీకు మూడు గర్భవతులైన ఒంటెలు దొరకడం మీలో ఎవరు ఇష్టపడతారు? అని అడిగారు. మేము– అవునండి, (మేమంతా ఇష్ట పడతాము) అని అన్నాం. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)– మీలో ఏ వ్యక్తి అయినా నమాజులో మూడు ఆయతులు గనక పఠిస్తే, అవి అతనికి మూడు గర్భవతులైన (సూడి) ఒంటెలు దొరకడం కన్నా ఉత్తమం అని అన్నారు. *(ముస్లిం: 802)*

ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: మేమొకసారి 'సఫా' వద్ద కూర్చొని వుండగా, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కడికి విచ్చేశారు. ఆయన – మీలో ఎవరైనా, ప్రతి రోజూ ఉదయాన్నే 'బత్‌హాన్' లేదా 'అఖీఖ్' (ప్రదేశాలు) కు వెళ్లి అక్కణ్ణుంచి, దౌర్జన్యం, పాపం ఏమీ చేయకుండా రెండు బలమైన, ఆరోగ్యమైన ఒంటెలను తీసుకురావడానికి ఇష్టపడతారా? అని అడిగారు. మేమంతా, ఓ దైవప్రవక్తా! మేమంతా దానికి ఇష్టపడతాం అని అన్నాం.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాట్లాడుతూ – మరి మీలో ఎవరైనా ఉదయం పూట మస్జిద్‌కు వెళ్ళరా? వెళ్ళి అల్లాహ్ గ్రంథం నుండి రెండు ఆయతుల గురించి తెలుసుకొని దానిని పఠిస్తే ఇది అతనికి రెండు ఒంటెలకన్నా ఉత్తమమైనది. అలాగే మూడు ఆయతులు మూడు ఒంటెలకన్నా, నాలుగు ఆయతులు నాలుగు ఒంటెల కన్నా ఉత్తమమైనవి. అలాగే, ప్రతి ఆయత్ ఒక ఒంటెకన్నా ఉత్తమమైనది. *(ముస్లిం: 803)*

## నమాజ్‌లో ఎక్కువగా ఖుర్‌ఆన్ పారాయణం చేసే వ్యక్తిపై ఈర్ష్య పడవచ్చు

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "కేవలం ఇద్దరు వ్యక్తుల విషయంలోనే ఈర్ష్య చెందవచ్చు. అందులో ఒకరు ఎవరంటే, అల్లాహ్ అతనికి ఖుర్‌ఆన్ (కంఠస్తం చేసే సద్బుద్ధిని) ఇవ్వగా, దానిని రేయింబవళ్లూ పారాయణం

చేస్తూ ఖియాం చేస్తాడు (నమాజ్ చదువుతాడు). ఇక, రెండవ వ్యక్తి ఎవరంటే, అల్లాహ్ అతనికి సంపదను ప్రసాదించగా, దానిని రేయింబవళ్లూ (అల్లాహ్ మార్గంలో) ఖర్చు చేస్తూ వుంటాడు." *(బుఖారీ: 5025, ముస్లిం: 815)*

## ఖుర్ఆన్ పారాయణ సమయంలో అల్లాహ్ కారుణ్యం అవతరిస్తుంది

బరా (రజి అల్లాహు అన్హు) అ కథనం: ఒక వ్యక్తి కహఫ్ సూరా పారాయణం చేస్తున్నాడు. అతనికి దగ్గరగానే అతని గుర్రం రెండు త్రాళ్ళతో కట్టబడి వుంది. అకస్మాత్తుగా ఒక మేఘం వచ్చి అతనిపై కమ్మేసింది. తదుపరి అది కదులుతూ మెల్లగా అతని వైపునకు రాసాగింది. ఇది చూసి గుర్రం భయంతో ఎగరడం మొదలు పెట్టింది. తెల్లవారిన తర్వాత ఆ వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గరికొచ్చి జరిగిన వృత్తాంతమంతా వివరించాడు. ఇది విని, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)– అది అల్లాహ్ కారుణ్యం, ఖుర్ఆన్ కోసం అవతరించింది అని వివరించారు.

*(బుఖారీ: 5011, ముస్లిం: 795)*

ఇమామ్ నవవీ రహిమహుల్లాహ్ 'అల్ సకీనత్' గురించి వివరిస్తూ, ఇలా పేర్కొన్నారు: దీనికి ఎన్నో అర్థాలు వున్నాయి. అన్నింటి కన్నా మేలైనది ఇది – ఇది అల్లాహ్ యొక్క ఎలాంటి సృష్టితం అంటే, దీనిలో ఊరట, కారుణ్యం మరియు దైవదూతలు వుంటారు. అంటే, ఖుర్ఆన్ పారాయణం చేస్తున్నప్పుడు దైవదూతలు అల్లాహ్ కారుణ్యం తీసుకొని అవతరిస్తారు, తద్వారా పారాయణం చేసే వారికి ఒక ప్రత్యేకమైన ఊరట లభిస్తుంది.

ఉసైద్ బిన్ హుజైర్ (రజి అల్లాహు అన్హు) కథనం: నేనొక రాత్రి (నమాజ్ లో) బఖర సూరా పఠిస్తున్నాను. నాకు దగ్గరగా నా గుర్రం కట్టేసి వుంది. అకస్మాత్తుగా గుర్రం ఎగరడం ప్రారంభించింది. (ఇది చూసి) నేను మౌనంగా వున్నాను. నేను మౌనంగా వుండే సరికి అది కూడా శాంతించింది. తదుపరి నేను పారాయణాన్ని పున:ప్రారంభించగా, అది మొదటిలాగే మళ్ళీ ఎగరడం ప్రారంభించింది.

నేను మౌనం వహించగానే అది కూడా శాంతించింది. తిరిగి నేను ప్రారంభించగానే అది కూడా ఎగరడం ప్రారంభించింది. అటు, నా కొడుకు 'యహ్యా' కూడా అక్కడే (పడుకొని) వున్నాడు. అది (ఎగురుతూ) నా కొడుకును

త్రొక్కేస్తుందేమోనని నేను భయపడి వెంటనే సలాం త్రిప్పి (నమాజ్ ముగించి) కొడుకు వద్దకొచ్చి గుర్రాన్ని కొడుకు వద్ద నుండి దూరంగా చేసాను. తదుపరి నేను ఆకాశం వైపు చూడగా, గొడుగు లాగా ఒక వస్తువు కనిపించింది. దానిలో దీపాలలాగా వెలుగులు వున్నాయి. ఈ గొడుగు లాంటి వస్తువు మెల్లమెల్లగా ఆకాశం వైపునకు వెళుతూ నా కళ్ల నుండి కనుమరుగయ్యింది. తెల్లవారిన తర్వాత, నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వెళ్ళి జరిగిన వృత్తాంతమంతా వివరించాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ఓ ఇబ్నె హుజైర్! నువ్వు నీ పారాయణాన్ని ఆపకుండా వుంటే బాగుండేది అని అన్నారు.

నేను – ఓ దైవ ప్రవక్తా! నేను నా కొడుకు గురించి భయాందోళనకు గురయ్యాను. అందుకే త్వరగా నమాజ్ ముగించాను. తర్వాత నేను ఆకాశం వైపు చూసేసరికి ఒక గొడుగు లాంటి వస్తువు, దీపాలతో వెలుగుతూ వుంది మరియు మెల్లగా ఆకాశం వైపునకు వెళ్ళిపోయింది అని అన్నాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)–అవి దైవదూతలు. నీ కంఠస్వరాన్ని విని నీ దగ్గరికి విచ్చేశారు. ఒకవేళ నువ్వు పారాయణం ఆపకపోయివుంటే, తెల్లవారాక ఇతర ప్రజలు కూడా వాళ్ళను చూడగలిగేవారు. వారు (దైవదూతలు) ప్రజలకు కనబడకుండా దాక్కోలేక పోయేవారు.

*(బుఖారీ: 5018, ముస్లిం: 796)*

ఇవండీ, ఖుర్ఆన్‌కు సంబంధించిన కొన్ని మహత్యాలు.

ఇక తలెత్తే మరో ప్రశ్న ఏమిటంటే, ఈ మహోన్నతమైన గ్రంథాన్ని అల్లాహ్ ఎందుకు అవతరింపజేసాడు?

## ఖుర్ఆన్ ఎందుకు అవతరింపజేయబడింది?

(1) ఎందుకంటే, దీనిని విశ్వసించేవారు, దీని హక్కుకు అనుగుణంగానే దీనిని పారాయణం చెయ్యాలని.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

الَّذِينَ آتَيْنَاهُمُ الْكِتَابَ يَتْلُونَهُ حَقَّ تِلَاوَتِهِ أُولَٰئِكَ يُؤْمِنُونَ بِهِ ۗ وَمَن يَكْفُرْ بِهِ فَأُولَٰئِكَ
هُمُ الْخَاسِرُونَ ۝

**"మేము ఎవరికి గ్రంథం వొసగామో వారు దానిని పారాయణం చేయవలసిన రీతిలో పారాయణం చేస్తారు. (అంతేకాదు) వారు ఈ గ్రంథాన్ని విశ్వసిస్తారు. ఇక దీని పట్ల తిరస్కార వైఖరిని అవలంబించిన వారే నష్టపోయేది". *(బఖర: 121)***

పారాయణం హక్కు ఏమిటంటే – ఖుర్ఆన్ ను, అది ఎలాగైతే ఆకాశం నుండి అవతరించిందో, ఎలాగైతే జిబ్రయీల్ (అలైహిస్సలాం) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు వినిపించారో, ఎలాగైతే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహాబాలకు నేర్పారో అలాగే పారాయణం చెయ్యాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَقُرْآنًا فَرَقْنَاهُ لِتَقْرَأَهُ عَلَى النَّاسِ عَلَىٰ مُكْثٍ وَنَزَّلْنَاهُ تَنزِيلًا ○

**"నువ్వు నెమ్మది నెమ్మదిగా ప్రజలకు వినిపించడానికి వీలుగా మేము ఖుర్ఆను గ్రంథాన్ని కొద్దికొద్దిగా చేసి అవతరింపజేశాము. మేము దీనిని అంచెల వారీగా అవతరింపజేశాము". *(బనీ ఇస్రాయీల్:106)***

అలాగే ఇలా సెలవిచ్చాడు:

وَرَتِّلِ الْقُرْآنَ تَرْتِيلًا ○

**"ఖుర్ఆన్ ను మాత్రం బాగా, ఆగి ఆగి నింపాదిగా (స్పష్టంగా) పఠించు".**
***(ముజ్జమ్మిల్:4)***

అందుకే ఖుర్ఆన్ ను మెల్లమెల్లగా దాని పదాలను సరిగా ఉచ్చరిస్తూ పఠించాలి. పదాల ఉచ్చారణ సవ్యంగా వుండాలి. అలా కాని పక్షంలో పదాలు వేరయిపోయి వాటి అర్థం కూడా మారిపోతుంది. ఇలా ఖుర్ఆన్ ఆయతులకు వేరే అర్థాన్ని ఆపాదించినట్లవుతుంది. నమాజ్‌లో ప్రత్యేకించి, అది ఫర్జ్ నమాజ్ అయినా, నఫిల్ నమాజ్ అయినా, ఖుర్ఆన్‌ను మెల్లమెల్లగా పారాయణం చెయ్యాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఇలాగే మెల్లమెల్లగా పారాయణం చేసేవారు.

ఉమ్మె సలమా (రజి అల్లాహు అన్హా) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక్కో ఆయతును వేరు చేసి పఠించేవారు. 'అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్' అని పఠించి ఆగేవారు. 'అర్రహ్మానిర్రహీం' అని పఠించి మళ్ళీ

ఆగేవారు. తదుపరి 'మాలికి యౌమిద్దీన్' అని పఠించేవారు.

*(తిర్మిజి: 2927, అబూ దావూద్: 4001, సహీహ్ – అల్‌బానీ)*

ఖతాదా రహిమహుల్లాహ్ కథనం: అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు)ను – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖిరాత్ (పారాయణం) ఎలా వుండేది? అని అడగబడింది. ఆయన జవాబిస్తూ – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎంతో సాగదీసి పఠించేవారు. తదుపరి ఆయన 'బిస్మిల్లా హిర్రహ్మానిర్రహీమ్' చదివినప్పుడు, 'బిస్మిల్లాహ్' ను సాగదీసారు, 'అర్రహ్మాన్' ను కూడా సాగదీసారు మరియు 'అర్రహీం' ను కూడా సాగదీసి పఠించారు. అంటే ఈ పదాలలో 'దీర్ఘం' ఎక్కడ వచ్చినా అక్కడ సాగదీసి పఠించారు.

*(బుఖారీ: 5046)*

ఖుర్‌ఆన్ పారాయణాన్ని ఇలాగే సాగదీస్తూ సుమధుర కంఠంతో చేయాలి. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కూడా ఇలాగే పఠించేవారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ తన ప్రవక్త సుమధుర కంఠంతో ఖుర్‌ఆన్ పారాయణం చేస్తుండగా శ్రద్ధగా విన్నట్లు మరే విషయాన్నీ అంత శ్రద్ధగా వినడు". *(బుఖారీ: 5023, ముస్లిం: 792)*

దీని అర్థం ఏమిటంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కంఠస్వరం ఎంతో అందంగా వుండేది. ఆయన సుమధుర కంఠంతో ఖుర్‌ఆన్ పారాయణం చేసేవారు. ఈ హదీసులో ఖుర్‌ఆన్‌ను మాధుర్యంగా పఠించేవారి మహత్యం వివరించబడింది. అల్లాహ్ అతణ్ణి తన దగ్గరకు చేరుస్తాడు మరియు గొప్ప పుణ్య ఫలాన్ని ప్రసాదిస్తాడు.

అలాగే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా కూడా సెలవిచ్చారు: "మీరు ఖుర్‌ఆన్ ను మీ కంఠస్వరాల ద్వారా మరింతగా అలంకరించండి". *(అబూ దావూద్: 1468, సహీహ్ –అల్‌బానీ)*

పైగా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చివున్నారు: "ఖుర్‌ఆన్ ను సుమధుర కంఠంతో పారాయణం చెయ్యనివాడు మాలోని వాడు కాదు". *(బుఖారీ: 7527)*

అందుకే, మనిషి ఈ విషయంలో అశ్రద్ధ చూపకండా ఖుర్‌ఆన్‌ను సుమధుర కంఠంతో పారాయణం చెయ్యాలి.

(2) ఖుర్ఆన్ పారాయణంతో పాటు, దాని (ఆయతుల) వైపు దృష్టి సారించి, ఆలోచించాలి. ఎందుకంటే దీని అవతరణ ఉద్దేశ్యమే ఇది – దీనిని పఠించి తదుపరి దీనిపై ఆలోచించి ఆపై తమ జీవన శైలిని దీనికనుగుణంగా మార్చుకోవాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

كِتٰبٌ اَنْزَلْنٰهُ اِلَيْكَ مُبٰرَكٌ لِّيَدَّبَّرُوْٓا اٰيٰتِهٖ وَلِيَتَذَكَّرَ اُولُوا الْاَلْبَابِ ۝

**"ఇదొక శుభప్రదమైన గ్రంథం. ప్రజలు దీని వ్యాఖ్యలపై చింతన చేసేటందుకు, బుద్ధిజీవులు దీని ద్వారా గుణపాఠం నేర్చుకొనేందుకు మేము దీనిని నీ వైపునకు పంపాము". *(సాద్ : 29)***

అలాగే ఇలా సెలవిచ్చాడు:

اَفَلَا يَتَدَبَّرُوْنَ الْقُرْاٰنَ اَمْ عَلٰى قُلُوْبٍ اَقْفَالُهَا ۝

**"ఏమిటి, వారు ఖుర్ఆన్ గురించి లోతుగా ఆలోచించరా? లేక వారి హృదయాలపై తాళాలు పడివున్నాయా?". *(ముహమ్మద్: 24)***

అందుకే, మనపై విధి (ఫర్జ్)గా వున్న విషయమేమిటంటే, స్వయంగా మనం కూడా ఖుర్ఆన్ ను నేర్చుకొని మన సంతానానిక్కూడా దీనిని నేర్పించాలి. స్వయంగా కూడా దీనిపై ఆలోచన చేయాలి మరియు పిల్లలకు కూడా ఖుర్ఆన్ కంఠస్తం చేయించడంతో పాటు, దాని అనువాదాన్ని, విశ్లేషణను నేర్పించాలి. తద్వారా వారు గుణపాఠం నేర్చుకోగలరు. ఎందుకంటే, ఖుర్ఆన్ అనువాదం, విశ్లేషణ గురించి తెలియకుండా గుణపాఠాన్ని గ్రహించడం అసాధ్యం.

## దివ్య ఖుర్ఆన్ ప్రభావం

గుర్తుంచుకోవాల్సిన ఒక విషయమేమిటంటే, ఖుర్ఆన్ పారాయణం చేస్తూ, దీనిపై చింతన జరిపితే, ఇది పఠించే వారికి, దీనితో పాటు వినేవారికి ఎంతో ప్రభావం చూపుతుంది.

ఖుర్ఆన్ ప్రభావాన్ని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

اَللّٰهُ نَزَّلَ اَحْسَنَ الْحَدِيْثِ كِتٰبًا مُّتَشَابِهًا مَّثَانِيَ تَقْشَعِرُّ مِنْهُ جُلُوْدُ الَّذِيْنَ يَخْشَوْنَ رَبَّهُمْ ۚ ثُمَّ تَلِيْنُ جُلُوْدُهُمْ وَقُلُوْبُهُمْ اِلٰى ذِكْرِ اللّٰهِ ؕ ذٰلِكَ هُدَى اللّٰهِ يَهْدِيْ بِهٖ مَنْ يَّشَآءُ ؕ وَمَنْ يُّضْلِلِ اللّٰهُ فَمَا لَهٗ مِنْ هَادٍ ۝

**"అల్లాహ్ అత్యుత్తమమైన విషయాన్ని అవతరింపజేశాడు. అది పరస్పరం పోలిక కలిగి వుండే, పదే పదే పునరావృతం అవుతూ వుండే ఆయతులతో కూడిన గ్రంథం రూపంలో వుంది. దీని వల్ల తమ ప్రభువుకు భయపడే వారి శరీరాలపై రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ఆ తర్వాత వారి శరీరాలు హృదయాలు అల్లాహ్ స్మరణ పట్ల మెత్తబడి పోతాయి. ఇదీ అల్లాహ్ మార్గ దర్శకత్వం. దాని ద్వారా ఆయన తాను కోరిన వారిని సన్మార్గానికి తెస్తాడు. మరి అల్లాహ్ ఎవరిని మార్గం నుండి తప్పిస్తాడో అతనికి మార్గం చూపేవాడెవడూ వుండడు". *(జుమర్: 23)***

ఈ ఆయత్ ద్వారా తెలిసిందేమిటంటే – వాస్తవానికి ఎవరైతే అల్లాహ్‌కు భయపడతారో, ఎవరైతే ప్రశాంతంగా ఖుర్ఆన్ పారాయణం చేస్తూ దానిపై చింతన చేస్తారో, వారు ఖుర్ఆన్ పారాయణం చేస్తున్నప్పుడు వారి రోమాలు నిక్కబొడుచుకుంటాయి మరియు వారి హృదయాలు భయంతో కంపించి పోతాయి. తద్వారా వారికి అల్లాహ్ స్మరణ వైపునకు మరింత ప్రోత్సాహం దొరుకుతుంది.

అబ్దుల్లాహ్ బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఓ సారి నాతో – నాకు ఖుర్ఆన్ చదివి వినిపించు అని అన్నారు.

నేను–నేను మీకు చదివి వినిపించాలా? అది మీ పైనే అవతరించిందిగా? అన్నాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– నిజమే, కానీ ఇతరుల ద్వారా ఖుర్ఆన్ వినడం నేను ఇష్టపడతాను అని అన్నారు.

తదుపరి నేను నిసా సూరా పఠించడం మొదలు పెట్టను. చివరికి నేను '(ఓ ముహమ్మద్!) మేము ప్రతి సమాజం నుండి ఒక సాక్షిని తెచ్చి, వారిపై నిన్ను సాక్షిగా పెట్టినప్పుడు పరిస్థితి ఎలా వుంటుంది?' అన్న ఆయతుకు చేరుకుని, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను చూడగా ఆయన కళ్ళలో నీళ్ళు తిరుగుతున్నాయి. *(బుఖారీ: 4582, ముస్లిం: 800)*

ఖుర్ఆన్ ప్రభావం ఎంత తీవ్రంగా వుంటుందంటే, దీనిని గనక పర్వతంపై అవతరింపజేస్తే అది భయంతో తునాతునకలైపోతుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

لَوْ اَنْزَلْنَا هٰذَا الْقُرْاٰنَ عَلٰى جَبَلٍ لَّرَاَيْتَهٗ خَاشِعًا مُّتَصَدِّعًا مِّنْ خَشْيَةِ اللّٰهِ ؕ وَتِلْكَ الْاَمْثَالُ نَضْرِبُهَا لِلنَّاسِ لَعَلَّهُمْ يَتَفَكَّرُوْنَ ۝

**"ఒక వేళ మేము ఈ ఖుర్ఆన్‌ను ఏ పర్వతం మీదనో దింపివుంటే, అది అల్లాహ్ భీతితో అణగారి, తునాతునకలైపోవడటాన్ని నీవు చూసి వుండేవాడివి. ప్రజలు యోచన చేయడానికి గాను మేము ఈ దృష్టాంతాలను వారికి వివరిస్తున్నాము". *(హష్ర్:21)***

కానీ, నేడు మన హృదయాలు పాషాణం కన్నా కఠినమైపోయాయి. ఖుర్ఆన్ పారాయణం చేసిన తరువాత లేదా విన్న తరువాత అవి అల్లాహ్ భీతితో కంపించవు. తద్వారా అల్లాహ్ స్మరణ వైపునకు కూడా ఎక్కువగా మరలవు. అందుకే ఖుర్ఆన్ ప్రభావం మన పై అంతగా వుండదు. ఎన్నో సార్లు మనం ఖుర్ఆన్ సంపూర్ణంగా పారాయణం చేస్తాం, కానీ మన విశ్వాసంలో ఏ మాత్రం వృద్ధి జరుగదు. ఖుర్ఆన్ పారాయణం చేసినప్పటికీ అది ఖరారు చేసిన హద్దులకు లోబడి మనం ఉండం, పైగా హద్దులు మీరుతూ వుంటాము. ఖుర్ఆన్ పఠిస్తూ వుంటాం, కానీ దానికనుగుణంగా ఆచరించం. దాని పదాలనైతే ఉచ్చరిస్తాం కానీ దానిలో అల్లాహ్ నిషేధించిన విషయాలలో జాగ్రత్త వహించం. ఖుర్ఆన్‌లో గత కాలానికి చెందిన వేర్వేరు జాతుల వృత్తాంతాలు చదువుతాం. కానీ వాటి ద్వారా గుణపాఠం నేర్చుకోం!

మరి చూడబోతే, ఖుర్ఆన్ ప్రభావం ఎంత తీవ్రమైనదంటే దీని శత్రువులు కూడా దీని ప్రభావితులు కాకుండా వుండలేకపోయారు. ఇస్లాం స్వీకరణకు ముందు సహాబాలకు ఎదురైన సంఘటనలు దీనికి మంచి ఉదాహరణ. ఇస్లాం స్వీకరణకు ముందు వాళ్ళు దీనికి బద్ధ శత్రువులు. కానీ ఖుర్ఆన్‌ను విన్న తరువాత వారి హృదయాలు మెత్తబడి, తద్వారా వారు ఇస్లాం స్వీకరించారు.

ఉదాహరణకు, ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి అల్లాహు అన్హు) వృత్తాంతం. ఆయన మొదట్లో ఇస్లాంకు బద్ధ విరోధి. ఈ శత్రుత్వం తోనే ఆయన ఓ సారి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను హత్య చేసే నిమిత్తం ఇంటి నుండి బయలు దేరారు. దారిలో నయీమ్ బిన్ అబ్దుల్లా కలిశారు. ఆయన – ఓ ఉమర్! ఇవ్వాళ ఎక్కడికి బయలు దేరారు? అని అడిగారు. ఉమర్(రజి అల్లాహు అన్హు) – ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తుదముట్టించడానికి

అని జవాబిచ్చారు. ఆయన – ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను హత్య చేసి, బనూ హాషిం, బనూ జుహ్రా నుండి తప్పించుకోగలవా? అని అడిగారు. ఉమర్(రజి అల్లాహు అన్హు) – బహుశా నువ్వు కూడా ధర్మభ్రష్టుడైపోయావు అని అన్నారు. ఆయన – నేను నీకు దీని కన్నా ఆశ్చర్యం కలిగించే విషయాన్ని చెప్పనా? మీ అక్క మరియు బావ కూడా (నీ ప్రకారం) ధర్మభ్రష్టులైపోయారు. నీ ధర్మాన్ని త్యజించారు అని అన్నారు. ఉమర్(రజి అల్లాహు అన్హు) తిన్నగా వారి ఇంటికెళ్ళి చూస్తే ఆ సమయంలో ఖబ్బాబ్ (రజి అల్లాహు అన్హు) వారిద్దరికీ తాహా సూరా వినిపిస్తున్నారు. క్లుప్తంగా వివరించేదేమిటంటే, ఉమర్ (రజి అల్లాహు అన్హు) ముందుగా తన బావను కొట్టి తదుపరి తన అక్కను గాయపరిచారు. ఆ తర్వాత (తాను చేసిన పనికి) సిగ్గుపడి, మీరు చదివేది నాక్కూడా ఇవ్వండి, నేను కూడా చదువుతాను అని అడిగారు. ఆయన అక్క – నువ్వు అపరిశుద్ధుడివి. ముందు స్నానం చెయ్యి అని అంది. దీనిపై ఆయన స్నానం చేసి రాగానే ఆ పుస్తకాన్ని ఆయన చేతిలో పెట్టింది. ఉమర్ (రజి అల్లాహు అన్హు) తాహా సూరా పఠించడం మొదలు పెట్టారు. కేవలం, ఆరంభంలోని కొన్ని ఆయతులు పఠించగానే – ఇది ఎంతో గౌరవప్రదమైన వాక్కు! అని పలికారు. తదుపరి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి ఇస్లాం స్వీకరించారు.

*(అర్రహీఖుల్ మఖ్తూమ్: 102, 103 పేజీలు)*

ఇదండీ ఖుర్ఆన్ ప్రభావం!

ఇదే విధంగా, హిజ్రత్‌కు ముందు ముసైబ్ బిన్ ఉమైర్ (రజి అల్లాహు అన్హు) మదీనాలో ధార్మిక ప్రచార కార్యాన్ని చేపట్టి వున్నారు. ఓసారి ఆయన ఉస్అద్ బిన్ జరార (రజి అల్లాహు అన్హు) తో కలిసి సాద్ బిన్ ముఆజ్ మరియు ఉసైద్ బిన్ హుజైర్ దగ్గరికి వెళ్ళారు. వారిద్దరూ అప్పటి వరకు ఇస్లాం స్వీకరించలేదు. వారిద్దరూ ముసైబ్ బిన్ ఉమైర్ మరియు ఉస్అద్ బిన్ జరార లను హెచ్చరిస్తూ – మీరిద్దరూ ఇక్కణ్ణుంచి వెళ్ళిపోండి, లేకపోతే మేము మిమ్మల్ని తుదముట్టిస్తాం అని అన్నారు. దీనిపై, ముసైబ్ బిన్ ఉమైర్ (రజి అల్లాహు అన్హు) వారితో – ఒక్క సారి మా మాటను వినండి, ఒకవేళ మీకిష్టమైతే దానిని స్వీకరించండి, లేకపోతే మేము తిరిగి వెళ్ళిపోతాం అని అన్నారు. దీనికి వారు ఒప్పుకున్నారు. ముసైబ్ బిన్ ఉమైర్ (రజి అల్లాహు

అన్హు) వారికి ఇస్లాం గురించి వివరించారు. ఖుర్‌ఆన్ పఠించి వినిపించారు. చివరికి వారిద్దరూ ఇస్లాం స్వీకరించారు. దీనితో, వారి తెగల్లోని వారంతా ఇస్లాం స్వీకరించారు. *(అర్రహీఖుల్ మఖ్తూమ్: 144, 145 పేజీలు)*

ఇదేకాక, ఇలాంటి ఎన్నో ఉదాహరణలున్నాయి. ఈ ఖుర్‌ఆన్ తన శత్రువులను కూడా ఎంతగానో ప్రభావితం చేసిందని చెప్పటానికి. అందుకే ముస్లిములు కూడా, దీని వైపునకు తిరిగి, దీనిని పఠిస్తూ, దీనిపై చింతన చేస్తూ వుంటే వారు కూడా దీనితో ప్రభావితులు కావచ్చు. గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే, దృష్టితో పాటు మనస్సును కూడా కేంద్రీకరించి, పూర్తి శ్రద్ధతో, ఏకాగ్రతతో ఖుర్‌ఆన్ పఠించిన వ్యక్తి పైనే దాని ప్రభావం వుంటుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ فِي ذَٰلِكَ لَذِكْرَىٰ لِمَن كَانَ لَهُ قَلْبٌ أَوْ أَلْقَى السَّمْعَ وَهُوَ شَهِيدٌ ﴿37﴾

**"హృదయాన్ని కలిగి వుండి లేదా శ్రద్ధగా ఆలకించి, సావధానంగా మసలుకునే ప్రతి వ్యక్తికీ ఇందులో హితబోధ కలదు". *(ఖాఫ్: 37)***

(3) ఖుర్‌ఆన్ పారాయణం, దానిపై చింతన చేయడంతోపాటు దానికనుగుణంగా ఆచరిస్తూ మన జీవన శైలిని దానికనుగుణంగా మార్చుకొని, దాని వెలుగులో జీవితం కొనసాగించాలి. దీనిలో అల్లాహ్ ఇచ్చిన ఆదేశాలను పాటిస్తూ, ఆయన నిషేధించిన వాటికి దూరంగా వుండాలి. దీనిలో వివరించబడ్డ గత కాలానికి చెందిన జాతుల వృత్తాంతాలను చదివి, వాటి ద్వారా గుణపాఠం నేర్చుకొని, అల్లాహ్ అవిధేయతకు దూరంగా వుండాలి. దీనిలో నైతికత, సత్ప్రవర్తనకు సంబంధించి వివరించబడ్డ విషయాలకనుగుణంగా మనల్ని మనం సంస్కరించుకోవాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَهَٰذَا كِتَابٌ أَنزَلْنَاهُ مُبَارَكٌ فَاتَّبِعُوهُ وَاتَّقُوا لَعَلَّكُمْ تُرْحَمُونَ ﴿﴾

**"ఇది (ఈ ఖుర్‌ఆన్) మేము అవతరింపజేసిన ఒక శుభప్రదమైన గ్రంథం. కాబట్టి మీరు దీనిని అనుసరించండి. భయభక్తులతో మెలగండి. తద్వారా మీరు కరుణించబడే అవకాశం వుంది". *(అన్‌ఆమ్:155)***

అల్లాహ్ మనందరినీ ఖుర్‌ఆన్ ను ఆధారంగా చేసుకునే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## రెండవ ఖుత్బా

## అల్లాహ్ గ్రంథాన్ని గట్టిగా పట్టుకోమని ఆదేశం

అల్లాహ్ మనందరినీ ఖుర్‌ఆన్‌ను గట్టిగా పట్టుకోమని ప్రోత్సహిస్తూ దీనిని గట్టిగా పట్టుకొనే వారికి తన కారుణ్యంలోకి ప్రవేశింపజేసి, రుజుమార్గం వైపునకు మరలుస్తానని శుభవార్తనందించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَاَيُّهَا النَّاسُ قَدْ جَآءَكُمْ بُرْهَانٌ مِّنْ رَّبِّكُمْ وَ اَنْزَلْنَآ اِلَيْكُمْ نُوْرًا مُّبِيْنًا ○ فَاَمَّا الَّذِيْنَ
اٰمَنُوْا بِاللّٰهِ وَاعْتَصَمُوْا بِهٖ فَسَيُدْخِلُهُمْ فِيْ رَحْمَةٍ مِّنْهُ وَفَضْلٍ وَّيَهْدِيْهِمْ اِلَيْهِ صِرَاطًا مُّسْتَقِيْمًا ○

**“ఎవరు అల్లాహ్‌ను విశ్వసించి, ఆయనతో తమ సంబంధాన్ని పటిష్టం చేసుకుంటారో వారిని ఆయన తన కారుణ్యంలోకి, అనుగ్రహంలోకి తీసుకుంటాడు. వారికి తనవైపునకు తెచ్చే రుజుమార్గం చూపుతాడు”.**
***(నిసా: 174, 175)***

అలాగే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అరాఫాత్ మైదానంలో ‘హజ్జతుల్ విదా’ సందర్భంగా చేసిన ప్రసంగంలో వివరించిన ముఖ్యాంశాలలో – అల్లాహ్ గ్రంథాన్ని (ఖుర్‌ఆన్ ను) గట్టిగా పట్టుకోమని, తద్వారా మార్గభ్రష్టతకు దూరంగా వుండవచ్చున్న అంశం కూడా వుంది.

దీని గురించి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “(బాగా గుర్తుంచుకోండి!) నేను మీ మధ్య ఒకదాన్ని విడిచి వెళుతున్నాను. దానిని గనక మీరు గట్టిగా పట్టుకుంటే ఎప్పుడూ మార్గభ్రష్టుల్వరు. అదే అల్లాహ్ గ్రంథం”. *(ముస్లిం: 1218)*

మరో ఉల్లేఖనంలో పదాలు ఇలా వున్నాయి:“ప్రజలారా! నా మాటలను జాగ్రత్తగా వినండి. నిస్సందేహంగా నేను అల్లాహ్ ధర్మాన్ని మీ దాకా చేరవేసాను. మీ మధ్య నేను రెండింటిని విడిచి వెళుతున్నాను. ఒకవేళ మీరు గనక వాటిని గట్టిగా పట్టుకొంటే ఎప్పుడూ మార్గభ్రష్టులవ్వరూ. అవేమిటంటే, అల్లాహ్ గ్రంథం మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్”.
*(అస్సున్నహ్ లిల్ మరోజీ : 68వ పేజీ)*

దీని ద్వారా తెలిసిందేమిటంటే, అల్లాహ్ గ్రంథం మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ – ఈ రెండూ సన్మార్గానికి ఆధారాలు. వీటిని గనక గట్టిగా పట్టుకుంటే ఎల్లప్పుడూ మార్గభ్రష్టతకు దూరంగా వుండవచ్చు. అలాగే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా కూడా సెలవిచ్చారు : "ఈ ఖుర్ఆన్ ఒక బలమైన త్రాడు లాంటిది. దాని ఒక కొన అల్లాహ్ చేతిలో వుండి మరొక కొన మీ చేతుల్లో వుంది. కనుక, మీరు దీనిని గట్టిగా పట్టుకుంటే ఎప్పుడూ నాశనమవ్వరూ మరియు మార్గభ్రష్టులవ్వరు". *(అస్సహీహా: 713)*

## తల్హా కథనం:

నేను అబ్దుల్లా బిన్ అబూ ఊఫీ (రజి అల్లాహు అన్హు) ను – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వసీయతు (వీలునామా) ఏమైనా వ్రాశారా? అని అడిగాను. ఆయన – లేదు అని అన్నారు. నేను – ప్రజలకు వీలునామా వ్రాయడం విధిగా చేయబడింది, మరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వీలునామా వ్రాయలేదా? అని అడిగాను. దీనిపై ఆయన – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లాహ్ గ్రంథం గురించి మాత్రమే వసీయతు చేశారు అని అన్నారు. *(బుఖారీ: 5022)*

మరి ఇంత తీవ్రమైన హితబోధ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చేసినప్పటికీ, నేడు ఆయన అనుచర సమాజం ఖుర్ఆన్ నుండి దూరంగా వుండటం ఎంతో దురదృష్టకరమైన విషయం. ఎంతో మందికి అసలు ఖుర్ఆన్ చదవడమేరాదు. ఇక ఎవరైతే చదువుతారో వారు మొత్తం ఖుర్ఆన్ అటుంచి, ఫాతిహా సూరా అర్థం కూడా వివరించలేరు. (నేడు) ఖుర్ఆన్ కంఠస్తులైతే మాషా అల్లాహ్ చాలా మంది వున్నారు. కానీ, దానిపై ఆచరిస్తూ దానిని తమ జీవన శైలిగా మార్చుకున్నవారు చాలా తక్కువగా వున్నారు.

ముస్లిములారా!

ఖుర్ఆన్ విషయంలో మన వ్యవహార సరళిని మార్చుకొనే అవసరం నేడు ఎంతయినా వుంది. ఖుర్ఆన్‌ను నేర్చుకొని, చదివి, దానిపై చింతన

చేస్తూ, దాని ప్రకారం ఆచరించాలి. ఒకవేళ మనం మన వ్యవహార సరళిని గనక మార్చుకోకపోతే, ప్రళయం రోజు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లాహ్ ముందు మన గురించి ఇలా సెలవిస్తారు:

وَقَالَ الرَّسُولُ يَارَبِّ إِنَّ قَوْمِي اتَّخَذُوا هَٰذَا الْقُرْآنَ مَهْجُورًا ﴿٣٠﴾

**"నా ప్రభూ! నిశ్చయంగా నా జాతివారు ఈ ఖుర్ఆన్ ను వదలిపెట్టారు".**

***(ఫుర్ఖాన్ : 30)***

అల్లామా ఇబ్నుల్ ఖయ్యూం రహిమహుల్లాహ్ "వదిలిపెట్టడం"ను విశ్లేషిస్తూ ఇలా పేర్కొన్నారు: ఈ హిజ్ర్ (ఖుర్ఆన్ ను వదలిపెట్టడం) అనేది పలు రకాలుగా వుంటుంది. అందులో మొదటిది– ఖుర్ఆన్ ను ఏకాగ్రతతో విని, దానిని విశ్వసించకపోవడం. రెండవది, దానిని చదివి, విశ్వసించి, దాని ప్రకారం ఆచరించడాన్ని వదిలిపెట్టడం మరియు దీని హరామ్, హలాల్ హద్దుల వద్ద ఆగకపోవడం.

మూడవది, దీనిని న్యాయనిర్ణేతగా స్వీకరించకపోవడం మరియు ధార్మిక ప్రధానాంశాలు, వాటి శాఖల విషయంలో దీని ద్వారా తీర్పు పొందకపోవడం మరియు 'దీని ఆధారాలు కేవలం గ్రాంథికమైనవి, వాస్తవిక ప్రయోజనాన్ని అంతగా కలిగించవు' అన్న దృష్టి కోణం కలిగి వుండటం. నాలుగవది, దీనిపై చింతన చేయడం వదలిపెట్టడం, తద్వారా అల్లాహ్ చెప్పదలుచుకున్న దేమిటో తెలుసుకోవటానికి ప్రయత్నించకపోవటం.

ఐదవది, హృదయ వ్యాధులన్నింటినీ దీనితో చికిత్స చేయకుండా వదలిపెట్టడం. ఈ ఐదు రకాలు కూడా, అల్లాహ్ వాక్కు **"నిశ్చయంగా నా జాతి వారు ఈ ఖుర్ఆన్ ను వదలిపెట్టారు"** లో ఇమిడి వున్నాయి.

*(అల్ ఫవాయెద్: 82 పేజీ)*

ఆఖరుగా అల్లాహ్ ను వేడుకొనేదేమిటంటే – ఆయన మనందరికీ ఖుర్ఆన్ పారాయణం, దాని కంఠస్తంతో పాటు దానిపై చింతన చేసే సద్బుద్ధిని మరియు దాని ప్రకారం ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!!

# తౌబా మరియు అస్తగ్‌ఫార్ -ప్రయోజనాలు, ఫలాలు

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

(1) ఉత్తమ అపరాధి ఎవరు? (2) పాపభారం అనుభూతి (3) విశ్వాసులకు తౌబా (పశ్చాత్తాపం) గురించి ఆదేశం. (4) పశ్చాత్తాపం చెందటం దైవ ప్రవక్తల పద్ధతి. (5) అల్లాహ్ కారుణ్యం విశాలత. (6) పశ్చాత్తాపం స్వీకరించబడటానికి షరతులు. (7) తౌబా, అస్తగ్‌ఫార్ ఫలాలు.

ఇస్లామీయ సోదరులారా!

మనలో ప్రతి వ్యక్తి అపరాధే మరియు పాపం చేసేవాడే. కానీ అపరాధుల్లో ఉత్తమమైన అపరాధులు ఎవరంటే, అత్యధికంగా పశ్చాత్తాపం చెందేవారు, అల్లాహ్ వైపునకు మరలేవారు మరియు హృదయ పూర్వకంగా మన్నింపును వేడుకొనేవారు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “ఆదమ్ (అలైహిస్సలాం) సంతానమంతా అపరాధులే. కానీ వారిలో ఉత్తమమైన అపరాధులెవరంటే, అందరికన్నా ఎక్కువగా పశ్చాత్తాపం చెందేవారు. ”

*(తిర్మిజీ, 2499, ఇబ్నె మాజ: 4251, హసన్ –అల్‌బానీ)*

ఒక అపరాధి, తన పాపాల భారాన్ని అనుభూతి చెందినప్పుడే పశ్చాత్తాపం చెందుతాడు. ఇక నిజమైన విశ్వాసి ఎవరంటే, తన ద్వారా సృష్టికర్త అవిధేయత జరగగానే వెంటనే అతణ్ణి సంతృప్తి పరచడానికి ఉవ్విళ్లూరుతాడు మరియు క్షమాపణలు కోరుకుంటాడు.

అబ్దుల్లాహ్ బిన్ మస్‌వూద్ (రజి అల్లాహు అన్హు) ఇలా వివరించారు: ఒక విశ్వాసి తన పాపాల గురించి ఎలా అనుకుంటాడంటే తను ఒక కొండ క్రింది భాగంలో కూర్చొని వుండి, ఆ కొండ నాపై విరుచుకుపడుతుంది (అంటే నన్ను తుదముట్టిస్తుంది.

ఇక పాపాత్ముడు తన పాపాల గురించి ఎలా భావిస్తాడంటే, ఒక ఈగ

ఎగురుతూ వచ్చి తన ముక్కు మీద కూర్చోగా, తను చేత్తో సైగ చేయగానే అది లేచి వెళ్ళిపోయింది. *(బుఖారీ: 6308)*

ఇక మన పరిస్థితి ఎలా వుందంటే, మనం ఎన్నో పాపాలను చేస్తూ వుంటాం. కానీ వీటి ద్వారా అల్లాహ్ అవిధేయతకు ఒడిగడుతున్న విషయం కూడా గ్రహించం. అందుకే అతనికి క్షమాపణలు కోరుకొని, అతణ్ణి సంతృప్త పరచి, అతని శిక్ష నుండి తప్పించుకోవడానికి అంతగా ప్రయత్నించం.

ఎంతో మంది ముస్లిములు పెద్ద పాపాలు ఎన్నో చేస్తుంటారు. కానీ వీటి శిక్ష గురించి వారు ఏమాత్రం భయపడరు. ఉదాహరణకు దర్బారులు, మజార్ల వద్దకెళ్ళి సజ్దాలో పడిపోతారు, వారి పేరుతో మ్రొక్కుబడి చెల్లించు కుంటారు, వారిని తమ అవసరాలు తీర్చే వారిగా, కష్టాల నుండి గట్టెక్కించే వారుగా భావించి వేడుకుంటారు, వారిపై ప్రగాఢ నమ్మకం కలిగి వుంటారు లేదా వారిని అల్లాహ్ కోసం వసీలా (సాధనం)గా ఉపయోగించి వారిని వేడుకుంటారు....ఇవన్నీ చేస్తూ కూడా, ఈ షిర్క్ కార్యాల ద్వారా అల్లాహ్ అనుగ్రహాన్నీ, అయిష్టతను కొనితెచ్చుకుంటున్నామన్న విషయాన్ని సైతం గ్రహించరు. ఒకవేళ దురదృష్టవశాత్తూ ఈ స్థితిలోనే గనక మరణం సంభవిస్తే నేరుగా నరకంలోకి ప్రవేశిస్తారు. *(అల్లాహ్ శరణు).*

దీనికి విరుద్ధంగా వారు, తమ కార్యాల గురించి పూర్తిగా సంతృప్తులై కనిపిస్తారు. ఒకవేళ ముహిద్ (ఏకదైవారాధకుడు) ఎవరైనా వీరిని షిర్క్ గురించి హెచ్చరించి తౌహీద్ గురించి హితబోధ చేస్తే, వారు షిర్క్‌ను త్యజించి, హృదయ పూర్వకంగా పశ్చాత్తాపపడి, తౌహీద్‌ను స్వీకరించడానికి బదులుగా అతనితో దుర్భాషలాడి అతని ఉపదేశం నమ్మదగినది కాదు అని భావిస్తారు.

అలాగే ఎంతో మంది ముస్లిములు నేడు ఎన్నో బిద్అత్‌లలో ఎంతగా మునిగిపోయి వున్నారంటే, వాటిని ధర్మంలోని ఖచ్చితమైన అంతర్భాగాలు అని భావిస్తుంటారు. ఇక సున్నత్‌పై నడిచే వారెవరైనా వీరిని దీని గురించి హెచ్చరించి, ధర్మంలో క్రొత్తగా సృష్టించబడి, ఖుర్ఆన్ మరియు హదీసులు మరియు సహాబాల ఆచరణ ద్వారా ఆధారం లభించని ప్రతి ఆచరణ బిద్అత్ అని, ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతకు ఆనవాలు అని హితబోధ చేస్తే, పశ్చాత్తాపం చెందాల్సింది పోయి అతనితో– మేము చేసేది చెడు విషయమేమీ కాదు, పైగా ఇది సత్కార్యమే అని అంటూ వుంటారు. అంటే తమ బిద్అత్‌లపై వారు పూర్తిగా సంతృప్తులై

కనిపిస్తారు. వీటి ద్వారా వారు అల్లాహ్ సాన్నిధ్యానికి బదులుగా ఆయన అయిష్టతను కొని తెచ్చుకుంటున్నారన్న విషయం కూడా గ్రహించరు.

ఇక ప్రళయం రోజు వీరు కౌసర్ సరస్సు వైపునకు వెళుతూ వున్నప్పుడు, వీరిని లాగి వెనక్కి నెట్టడం జరుగుతుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వీరి గురించి – నా ధర్మం స్వరూపాన్ని మార్చిన వారు దూరంగా వెళ్ళిపోవాలి– అని అంటారు.

షిర్క్ మరియు బిద్అత్‌లతో పాటు ఇంకా ఎన్నో అపరాధాలు నేడు ముస్లిములలో దారుణంగా ప్రబలాయి. ముస్లిములు వాటికి ఎంతగా అలవాటు పడిపోయారంటే వాటిని నేడు అసలు పాపాలుగానే భావించరు. ఉదా॥కు ఐదు పూటలు నమాజ్ నెలకొల్పకపోవడం లేదా దానిలో అశ్రద్ధ చూపడం, ఫర్జ్ ఉపవాసాలు మరియు జకాత్‌ల నుండి దూరంగా వుండడం, స్థోమత వున్నప్పటికీ హజ్ యాత్రకు సాకులు వెతకడం, తల్లిదండ్రుల అవిధేయత, బంధువుల పట్ల అసభ్య ప్రవర్తన, ఇచ్చిపుచ్చుకొనే వ్యవహారాల్లో అబద్ధమాడడం, మోసం, దాగచేయడం, జూదమాడడం, లంచం తీసుకోవడం, వడ్డీ లావాదేవీలు కొనసాగించడం, ముస్లిముల పట్ల ఈర్ష్య కలిగి వుండడం, వారితో అసూయ చెందడం వగైరా....ఈ పాపాలన్నింటినీ మామూలుగా భావించి వీటిని చేస్తూ వుంటారు. ఒకవేళ ఎవరైనా ఇవన్నీ తప్పు అని భావించి వీటి పాపభారాన్ని గ్రహించి, అల్లాహ్ పట్టు మరియు అతని ఆగ్రహానికి భయపడి, అతని వైపునకు మరలి, అతనికి క్షమాపణలు కోరుకుని అతణ్ణి సంతృప్తి పరిచి, తనకు తాను సంస్కరించుకుంటే అది వేరే విషయం!

అనస్ (రజి అల్లాహు అన్హు) తన కాలపు ప్రజలలో ఇలా అనేవారు: "నిశ్చయంగా మీరు, మీ వెంట్రుకల కన్నా సన్నగా వున్నాయని (మామూలుగా) భావించే పనులు చేస్తున్నారు. కానీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో మేము వాటిని నాశనం చేసే (తుదముట్టించే) పాపాలుగా భావించేవాళ్ళం". *(బుఖారీ: 6492)*

ఇది సహాబాలు మరియు వారి ద్వారా సంస్కరించబడ్డబారు (తాబయీలు) బ్రతికున్న కాలం మాట. నిశ్చయంగా ఇది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరణం తర్వాత శ్రేష్టమైన కాలం. అప్పుడు పెద్దపాపాలు అసలు కనిపించేవే కావు, ఒకవేళ వున్నా అంతంత మాత్రమే. కానీ వీటినే నేడు

అసలు పాపాలుగానే పరిగణించడం లేదు. ఒకవేళ పరిగణించినా, వాటిని మామూలుగా పరిగణించి బాహాటంగా చేస్తున్నారు.

అనస్ (రజి అల్లాహు అన్హు) తన కాలంలో, మాములుగా ప్రజలు చేసే పాపాలను చూసి వారితో , మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో వీటిని నాశనం చేసే పాపాలుగా పరిగణించేవాళ్ళం అని అనేవారు. మరి ఆయనే గనక ఈ రోజు బ్రతికి వుండి, ప్రజలు– షిర్క్, బిద్అత్, వ్యభిచారం, దొంగతనాలు, హత్యలు, వడ్డీ లావాదేవీలు, అశ్లీలత లాంటి పాపాల్లో మునిగి వుండడం చూస్తే ఏమనేవారో!

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలం విషయానికొస్తే, ఆ కాలంలో ఏ ముస్లిం ద్వారానైనా ఏదైనా పెద్దపాపం జరిగిపోతే, వెంటనే పశ్చాత్తాపపడి, తనకు తానుగా శిక్ష కోసం సమర్పించుకోనంత వరకు శాంతించేవాడు కాడు, దీనికి సంబంధించిన మూడు సంఘటనలు మీకు వివరిస్తాం.

(1) ఇమ్రాన్ బిన్ హుసైన్ (రజి అల్లాహు అన్హు) కథనం: వ్యభిచరించిన కారణంగా గర్భం దాల్చిన 'జహీన' తెగకు చెందిన ఒక స్త్రీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి ఇలా అంది – ఓ దైవ ప్రవక్తా! నేను అల్లాహ్ విధించిన హద్దును కాలరాశాను. కనుక మీరు నాపై దానిని ఖాయం చేయండి (శిక్షించండి).

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమె సంరక్షకుణ్ణి పిలిచి, ఈమెను బాగా చూసుకో, ఈమె బిడ్డకు జన్మనిచ్చాక తిరిగి తీసుకురా అని చెప్పారు.

ఆ వ్యక్తి అలాగే చేశాడు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం), ఆమె వస్త్రాలను ఆమె శరీరానికి గట్టిగా చుట్టేసి, తదుపరి రజమ్ (రాళ్ళతో కొట్టి చంపడం) చేయమని ఆజ్ఞాపించారు. ఆమెను శిక్షించాక, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమె జనాజా నమాజు చేశారు. దీనిపై ఉమర్ (రజి అల్లాహు అన్హు), ఓ దైవప్రవక్తా! మీరు వ్యభిచరించిన ఒక స్త్రీ జనాజా నమాజ్ చేస్తారా?అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – ఆమె ఎంతగా పశ్చాత్తాపం చెందిందంటే, ఆమె పశ్చాత్తాపాన్ని గనక మదీనా వాసుల్లోని 70 మంది మధ్య పంపిణీ చేసినా అది వారికి సరిపోతుంది. ఆమె తన ప్రాణాన్నే

అల్లాహ్‌ను సంతృప్తి పరచడానికి ధారపోసింది. దీని కన్నా మెరుగైన పశ్చాత్తాపం ఏముంటుంది? అని అన్నారు. *(ముస్లిం:1696)*

(2) బరీరా (రజి అల్లాహు అన్హు) కథనం: మాయిజ్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చి ఇలా విన్నవించుకున్నారు – ఓ దైవ ప్రవక్తా! నన్ను పరిశుద్ధుణ్ణి చేయండి. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – నీ పాడు గాను, వెళ్ళి అల్లాహ్‌ను క్షమాపణ వేడుకో మరియు పశ్చాత్తాపపడు అని అన్నారు.

మాయిజ్ (రజి అల్లాహు అన్హు) కొద్దిదూరం వెళ్ళి, తిరిగొచ్చి మళ్ళీ ఇలా అడిగారు – ఓ దైవ ప్రవక్తా! నన్ను పరిశుద్ధుణ్ణి చేయండి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనకు మళ్ళీ ఇదే సమాధానం ఇచ్చారు. నాల్గవసారి ఆయన, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను మళ్ళీ వేడుకోగా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – నిన్ను ఏ విషయం నుండి పరిశుద్ధం చేయనూ? అని అడగ్గా, ఆయన – వ్యభిచారం నుండి అని అన్నారు.

తుదపరి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయన మానసిక పరిస్థితి గురించి ప్రజలలో విచారించారు. ప్రజలంతా – ఆయన మనో స్థితి బాగానే వుందని జవాబిచ్చారు, ఆ తరువాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – అతను ఏమైనా మద్యపానం చేసివున్నారా? అని అడిగారు. ప్రజల్లోంచి ఒక వ్యక్తి ఆయన వద్దకు వెళ్ళి ఆయన నోటి వాసన చూసి, ఆయన దగ్గర మద్యం వాసన రావడం లేదు అని సెలవిచ్చాడు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనతో, నువ్వు నిజంగానే వ్యభిచారానికి పాల్పడ్డావా? అని అడిగారు. ఆయన, అవునండి అని జవాబిచ్చారు.

దానితో, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనకు 'రజమ్' శిక్షను అమలు పరిచారు.

ఆ తర్వాత ప్రజలు రెండు వర్గాలుగా చీలిపోయారు. ఒక వర్గమేమో, మాయిజ్ నాశనమై పోయాడు, అతని పాపాలు అతణ్ణి చుట్టుముట్టాయి అని అనగా, రెండవ వర్గం, మాయిజ్ పశ్చాత్తాపం కన్నా మరెవరి పశ్చాత్తాపం కూడా మెరుగైనది కాదు. ఎందుకంటటే అతనే స్వయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికొచ్చి, ఆయన చేతిలో చెయ్యివేసి తనపై రాళ్ళు రువ్వే శిక్ష కోసం అభ్యర్థించారు అని అనుకొంది.

తదుపరి మూడు రోజులు గడిచాక, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాల సమూహం వద్దకు వచ్చి వారికి సలాం చేసీ కూర్చొని ఇలా సెలవిచ్చారు: మాయిజ్ కోసం మనింపు ప్రార్ధన చేయండి, దీనితో సహాబాలు –ఓ అల్లాహ్! మాయిజ్ క్షమించు అని వేడుకున్నారు. తదుపరి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ఆయన ఎంతగా పశ్చాత్తాపపడ్డారంటే ఆయన పశ్చాత్తాపాన్ని గనక ఒక వర్గంలో పంపిణీ చేస్తే అది వారికి సరిపోతుంది.

బరీరా (రజి అల్లాహు అన్హు) కథనం : తదుపరి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు గామిదీ తెగకు చెందిన ఒక స్త్రీ వచ్చి, ఓ దైవప్రవక్తా! నన్ను పరిశుద్ధం చేయండి అని వేడుకుంది. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – నీ పాడుగాను, వెళ్ళి అల్లాహ్‌ను క్షమించమని వేడుకో మరియు పశ్చాత్తాపపడు అని చెప్పారు.

ఆమె – మీరు నన్ను మాయిజ్‌ను పంపినట్లే పంపిస్తున్నారని నా కనిపిస్తోంది అని అంది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ఆయన (మాయిజ్) తో నీకేంటి సంబంధం? అని అడిగారు. ఆమె – ఆయన మూలం గానే నేను గర్భం దాల్చాను అంది.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ఓహో, ఆ స్త్రీ నువ్వేనా? అని అన్నారు.

ఆమె – అవునండీ అని అంది.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – (శిక్ష) ఇప్పుడే కాదు, బిడ్డ జన్మించాక అని అన్నారు.

బరీరా (రజి అల్లాహు అన్హు) కథనం: ఒక అన్సారీ సహాబీ, ఆమె బిడ్డకు జన్మనిచ్చే వరకు ఆమె సంరక్షణ బాధ్యతను తీసుకున్నారు. ఆ తర్వాత, ఆయన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికొచ్చి– ఆ స్త్రీ బిడ్డకు జన్మనిచ్చిందన్న విషయం తెలియజేశారు.

దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం): మేమిప్పుడే ఆమెపై 'రజమ్' శిక్షను అమలు పరచలేం. ఎందుకంటే ఆమె బిడ్డకు పాలు త్రాపించేవాడు ఎవడూ వుండడు కనుక అని అన్నారు.

దీనిపై ఒక అన్సారీ – ఆ పిల్లవాడి పాల బాధ్యత నాది అని చెప్పగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెపై రజమ్ శిక్షను అమలుపరిచారు.

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది: బిడ్డకు జన్మనిచ్చాక ఆ స్త్రీ వెంటనే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధికి వచ్చింది. తన పసికందును బట్టలో చుట్టి తనతోపాటు తీసుకొచ్చింది. ఇది చూసి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెతో– వెళ్ళు, వెళ్ళి నీ బిడ్డకు తను పాలు మానేసే వరకు పాలు త్రాగించు అని అన్నారు.

ఆ స్త్రీ అక్కడి నుండి వెళ్ళిపోయింది.

ఆ తర్వాత కొంత కాలం గడిచాక మరోసారి ఆమె (తనబిడ్డతో కలసి) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్దకు వచ్చింది. ఆ సమయంలో ఆమె బిడ్డ చేతిలో ఒక రొట్టె ముక్క వుంది. ఆమె – ఓ దైవ ప్రవక్తా! నా బిడ్డ పాలు మానేసాడు, అన్నం తినే స్థాయికి ఎదిగాడు అని అంది.

దీనితో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆ బిడ్డను ఒక ముస్లింకు అప్పగించి, ఆమెను, ఛాతీ వరకు భూమిలో దించి, రజమ్ శిక్షను అమలు పరచమని ఆదేశించారు. ప్రజలు ఇలాగే చేసారు. ఈ తరుణంలో ఖాలిద్ బిన్ వలీద్ (రజి అల్లాహు అన్హు) వచ్చి, ఒక రాయిని తీసుకుని ఆమె తలపై బాదారు. దీనితో ఆమె రక్తపు బొట్లు కొన్ని ఆయన ముఖంపై పడ్డాయి. ఆయన, ఆమె, గురించి చెడుగా మాట్లాడారు. దీనిని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) విని – ఖాలిద్! ఆగు! ఎవరి చేతుల్లో నా ప్రాణం వుందో ఆ శక్తిమంతుని సాక్షి! ఆమె ఎంతగా పశ్చాత్తాపం చెందిందంటే, అలాంటి పశ్చాత్తాపాన్ని పన్నులు వసూలు చేసే దౌర్జన్యుడు చేసినా అతణ్ణి కూడా క్షమించవేయడం జరుగుతుంది అని అన్నారు.

తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమె జనాజా నమాజు చేశారు. ఆ తర్వాత ఆమె ఖననం చేయబడింది. *(ముస్లిం: 1695)*

ఈ మూడు సంఘటనల ద్వారా తెలిసిందేమిటంటే, ఈ అనుచర సమాజపు ఆరంభకాలంలో అంటే అన్నింటి కన్నా శ్రేష్ఠమైన కాలంలో, ఒకవేళ ఏ ముస్లిం అయినా ఏదైనా పెద్ద పాపానికి ఒడిగడితే, అతను దానిని తనపై పెద్ద భారంగా తలపోసి, దాని నుండి పరిశుద్ధం కావడానికి తొందర పడేవాడు. ఇదీ అసలైన ముస్లిముల గుణ విశేషం మరి. తప్పు చేశాక వెంటనే హృదయ పూర్వకంగా పశ్చాత్తాప పడి, అల్లాహ్‌ను సంతృప్తి పరచడానికి తొందరపడతాడు.

త్వరత్వరగా ఎన్నో సత్కార్యాలు చేసి, పాపపు మరకలు కడిగి వేయనంత వరకు అతని మనసు కుదుటపడదు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَأَقِمِ الصَّلَوٰةَ طَرَفَيِ النَّهَارِ وَزُلَفًا مِّنَ اللَّيْلِ ۚ إِنَّ الْحَسَنَٰتِ يُذْهِبْنَ السَّيِّـَٔاتِ ۚ ذَٰلِكَ ذِكْرَىٰ لِلذَّٰكِرِينَ ﴿114﴾

**"నిశ్చయంగా పుణ్యకార్యాలు పాపకార్యాలను దూరం చేస్తాయి".** ***(హూద్: 114)***

మరి, పాపాకార్యాలకు తమ కర్మల చిట్టా నుండి దూరం చేయడానికి చేయబడే మొట్టమొదటి సత్కార్యం తౌబా (పశ్చాత్తాపం) మరియు అస్తగ్ఫార్ (మన్నింపు ప్రార్థన).

## విశ్వాసులకు తౌబా మరియు అస్తగ్ఫార్ గురించి ఆదేశం

అల్లాహ్, తన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు మన్నింపు ప్రార్థన గురించి ఆదేశించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاسْتَغْفِرِ اللَّهَ ۖ إِنَّ اللَّهَ كَانَ غَفُورًا رَّحِيمًا ﴿﴾

**"క్షమాభిక్షకై అల్లాహ్‌ను వేడుకో. నిస్సందేహంగా అల్లాహ్ క్షమించేవాడు, కనికరించేవాడు".** ***(నిసా:106)***

ఇలాగే అల్లాహ్; విశ్వాసులకు కూడా తౌబా చేయమని ఆదేశించాడు.

مَا يُخْفِينَ مِن زِينَتِهِنَّ ۚ وَتُوبُوا إِلَى اللَّهِ جَمِيعًا أَيُّهَ الْمُؤْمِنُونَ لَعَلَّكُمْ تُفْلِحُونَ ﴿31﴾

**"ముస్లిములారా! మీరంతా కలసి అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపం చెందండి. తద్వారా మీరు సాఫల్యం పొందవచ్చు".** ***(నూర్:31)***

అంటే, విశ్వాసులు గనక అల్లాహ్ వైపునకు మరలి, హృదయపూర్వకంగా అతణ్ణి క్షమించమని వేడుకుంటే, ఇహపరలోక సాఫల్యాలు వారికి సమకూరుతాయి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا تُوبُوا إِلَى اللَّهِ تَوْبَةً نَصُوحًا عَسَىٰ رَبُّكُمْ أَنْ يُكَفِّرَ عَنْكُمْ سَيِّئَاتِكُمْ وَيُدْخِلَكُمْ
جَنَّاتٍ تَجْرِي مِنْ تَحْتِهَا الْأَنْهَارُ يَوْمَ لَا يُخْزِي اللَّهُ النَّبِيَّ وَالَّذِينَ آمَنُوا مَعَهُ ۖ نُورُهُمْ يَسْعَىٰ
بَيْنَ أَيْدِيهِمْ وَبِأَيْمَانِهِمْ يَقُولُونَ رَبَّنَا أَتْمِمْ لَنَا نُورَنَا وَاغْفِرْ لَنَا ۖ إِنَّكَ عَلَىٰ كُلِّ شَيْءٍ قَدِيرٌ ﴿٨﴾

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్ వైపునకు పశ్చాత్తాపంతో మరలండి. నిష్కల్మషమైన పశ్చాత్తాప భావంతో! మీ ప్రభువు మీ పాపాలను మీ నుండి దూరం చేయవచ్చు. క్రింద సెలయేళ్ళు ప్రవహించే (స్వర్గ) వనాలలో మీకు ప్రవేశం కల్పించవచ్చు. ఆ రోజు అల్లాహ్ ప్రవక్తనూ, అతని వెంటనున్న విశ్వాసులను అవమానపరచడు. వారి కాంతి వారి ముందూ, వారి కుడి వైపూ పరుగెడుతూ వుంటుంది. అప్పుడు వారిలా వేడుకుంటూ వుంటారు– మా ప్రభూ! మా కాంతిని మా కొరకు పరిపూర్ణం గావించు. మమ్మల్ని క్షమించు. నిశ్చయంగా నీవు అన్నింటిపై అధికారం కలవాడవు". *(తహ్రీమ్:8)***

ఈ ఆయత్‌లో అల్లాహ్ నిష్కల్మష పశ్చాత్తాపం యొక్క నాలుగు ప్రయోజనాలు వివరించాడు.

మొదటిది – పాపాల మన్నింపు. రెండవది – క్రింద సెలయేళ్ళు ప్రవహించే స్వర్గ వనాలలో ప్రవేశం. మూడవది – ఆ రోజు ప్రవక్తను, అతని వెంటనున్న విశ్వాసులను అవమాన పరచడు. నాల్గవది – వారి కాంతి వారి ముందూ, వారి కుడి వైపూ పరుగెడుతూ వుంటుంది.

ఈ ఆయతులన్నింటి ద్వారా తెలిసిందేమిటంటే, విశ్వాసులు అల్లాహ్ ఆజ్ఞలకు బద్ధులు. వారు తమ పాపాలకు గాను పశ్చాత్తాపం చెందాలి మరియు ఆయన మన్నింపు వేడుకోవాలి.

తన మన్నింపును కోరుకొనే దాసులను ప్రశంసిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

الَّذِينَ يَقُولُونَ رَبَّنَا إِنَّنَا آمَنَّا فَاغْفِرْ لَنَا ذُنُوبَنَا وَقِنَا عَذَابَ النَّارِ ۝ الصَّابِرِينَ وَالصَّادِقِينَ
وَالْقَانِتِينَ وَالْمُنْفِقِينَ وَالْمُسْتَغْفِرِينَ بِالْأَسْحَارِ ۝

**"వారు ఇలా వేడుకుంటారు– మా ప్రభూ! మేము విశ్వసించాం. కనుక**

**మా పాపాలను క్షమించు. ఇంకా మమ్మల్ని అగ్ని శిక్ష నుండి కాపాడు. వారు ఓర్పు వహిస్తారు. ఎల్లప్పుడూ సత్యమే పలుకుతారు. విధేయత చూపుతారు. అల్లాహ్ మార్గంలో ఖర్చు చేస్తారు. రాత్రి చివరి భాగంలో క్షమాభిక్షకై వేడుకుంటారు".** ***(ఆలి ఇమ్రాన్:16-17)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ప్రజలారా! మీరు మీ ప్రభువు వైపునకు పశ్చాత్తాపంతో మరలండి. అల్లాహ్ సాక్షి! నేను రోజుకు 100 సార్లు అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాప పడతాను".

*(అహ్మద్ : 17880, ముస్లిం: 2702)*

ప్రవక్తల నాయకులైవుండి, అల్లాహ్ - తన గత, రాబోయే పాపాలన్నింటినీ క్షమించినప్పటికీ, స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రోజుకు 100 సార్లు పశ్చాత్తాప పడితే మరి ఆయన అనుచర సమాజం దాని కన్నా ఎక్కువగా పశ్చాత్తాప పడాలి.

## తౌబా చేయడం ప్రవక్తల పద్ధతి

అవునండీ! పశ్చాత్తాపం చెందడం దైవప్రవక్తల పద్ధతి. ఆదమ్ (అలైహిస్సలాం) మరియు ఆయన భార్య హవ్వాకు షైతాను ఉసిగొలిపినప్పుడు, తమకు వారించబడిన వృక్ష ఫలాల రుచి చూసినప్పుడు, తమ అపరాధాన్ని స్వీకరించి పశ్చాత్తాప పడుతూ వారు ఇలా వేడుకున్నారు:

قَالَا رَبَّنَا ظَلَمْنَآ اَنْفُسَنَا ۫ وَاِنْ لَّمْ تَغْفِرْ لَنَا وَتَرْحَمْنَا لَنَكُوْنَنَّ مِنَ الْخٰسِرِیْنَ ۝

**"మా ప్రభూ! మేము మా స్వయానికి ఎంతో అన్యాయం చేసుకున్నాము. ఇప్పుడు నీవు గనక మాకు క్షమాభిక్ష పెట్టి, మాపై దయ తలచకపోతే, నిశ్చయంగా మేము నష్టపోతాము".** ***(ఆరాఫ్: 23)***

నూహ్ (అలైహిస్సలాం) - తన కొడుకును తుఫాను నీటి అలలలో మునిగి పోవడం చూసి మనస్సులోని ఆప్యాయతతో ప్రభావితులై అల్లాహ్‌ను- 'నా కొడుకు నా ఇంటిలోని వాడు మరియు నీ వాగ్దానం సత్యమైనది, నీవు పాలకులలో కెల్లా గొప్ప పాలకుడవు' అని మొరపెట్టుకోగా, అల్లాహ్ ఆయనకు మందలిస్తూ- నీ కొడుకు విశ్వసించలేదు కాబట్టి నీ ఇంటిలోని వాడు కాజాలడని, నీకు తెలియని వాటి గురించి నన్ను అడిగి, అజ్ఞానులలో ఒకడివి కారాదని నేను నీకు ఉపదేశిస్తున్నాను అని సెలవిచ్చాడు.

అప్పుడు నూహ్ (అలైహిస్సలాం) వెంటనే అల్లాహ్‌కు క్షమాపణలు తెలుపుకుంటూ ఇలా వేడుకున్నారు:

رَبِّ اِنِّیْٓ اَعُوْذُ بِكَ اَنْ اَسْـَٔلَكَ مَا لَیْسَ لِیْ بِهٖ عِلْمٌ ؕ وَ اِلَّا تَغْفِرْ لِیْ وَ تَرْحَمْنِیْۤ اَكُنْ مِّنَ الْخٰسِرِیْنَ ﴿47﴾

**"నా ప్రభూ! నాకు తెలియని దాని గురించి నిన్ను అర్థించటం నుండి నీ శరణు వేడుతున్నాను. నీవు గనక నన్ను క్షమించి దయ తలచకపోతే నేను నష్టపోయేవారిలో చేరిపోతాను".** ***(హూద్: 47)***

అలాగే, మూసా (అలైహిస్సలాం) కూడా ఒక వ్యక్తిని కొట్టినప్పుడు, అతను చనిపోగానే వెంటనే ఆయన అల్లాహ్ వైపునకు మరలి, తన అపరాధాన్ని ఒప్పుకొని అల్లాహ్‌ను క్షమాభిక్షకై ఇలా వేడుకున్నారు:

رَبِّ اِنِّیْ ظَلَمْتُ نَفْسِیْ فَاغْفِرْ لِیْ

**"నా ప్రభూ! నాకు నేను అన్యాయం చేసుకున్నాను. నన్ను క్షమించు. అని మొరపెట్టుకున్నాడు. అప్పుడు అల్లాహ్ అతన్ని క్షమించాడు".** ***(ఖసస్:16)***

ఇక దావూద్ (అలైహిస్సలాం) పరీక్షింపబడినప్పుడు, నేను పరీక్షించ బడుతున్నానని ఆయన గ్రహించి, వెంటనే సాష్టాంగపడి, అల్లాహ్‌ను క్షమించమని వేడుకున్నారు.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు :

وَ ظَنَّ دَاوٗدُ اَنَّمَا فَتَنّٰهُ فَاسْتَغْفَرَ رَبَّهٗ وَ خَرَّ رَاكِعًا وَّ اَنَابَ ﴿﴾

**"మేము అతన్ని పరీక్షిస్తున్నామన్న సంగతి దావూదు గ్రహించాడు. మరి తన ప్రభువు క్షమాభిక్ష కోరసాగాడు. కడుదీనంగా మోకరిల్లాడు (ఏకాగ్రతతో తన ప్రభువు వైపునకు) మరలాడు".** ***(సాద్: 24)***

ఇలాగే, యూనుస్ (అలైహిస్సలాం) కూడా చేప కడుపులో, తన తప్పిదాన్ని ఒప్పుకొని క్షమించమని అల్లాహ్‌ను ఇలా వేడుకున్నారు:

لَّاۤ اِلٰهَ اِلَّاۤ اَنْتَ سُبْحٰنَكَ ۖۗ اِنِّیْ كُنْتُ مِنَ الظّٰلِمِیْنَ ﴿87﴾

**"అల్లాహ్! నీవు తప్ప మరో ఆరాధ్య దైవం లేదు. నీవు పవిత్రుడవు. నిజానికి నేనే దోషులలో చేరిన వాణ్ణి".** ***(అంబియా:87)***

ఇక, ప్రవక్తల నాయకులైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) విషయానికొస్తే, ఆయన ఎంతగా తౌబా మరియు అస్తగ్ఫార్ చేసేవారంటే– ఒకే సమావేశంలో సహాబాలు ఆయన నోటి నుండి 100 సార్లు ఈ దుఆను వినేవారు.

**“రబ్బిగ్ ఫిర్లీ వతుబ్ అలయ్య, ఇన్నక అంత తవ్వాబుల్ గఫూర్”**

“నా ప్రభూ! నన్ను మన్నించు, నా పశ్చాత్తాపం స్వీకరించు. నిస్సందేహంగా నీవే పశ్చాత్తాపం స్వీకరించేవాడివి మరియు క్షమించేవాడివి”.

*(అస్సహీహ : 556)*

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహచరులు అబూ బక్ర్ సిద్దీఖ్ (రజి అల్లాహు అన్హు) కు తౌబా మరియు అస్తగ్ఫార్ గురించ ఒక దుఆ నేర్పి దానిని ప్రతి నమాజులో చదవమని ఆదేశించారు: “ఓ అల్లాహ్! నాకు నేను అన్యాయం చేసుకున్నాను. నువ్వు తప్ప పాపాలను క్షమించేవారెవ్వరూ లేరు కనుక, దయతో నన్ను క్షమించు. నన్ను కరుణించు. నిస్సందేహంగా నీవే ఎక్కువగా క్షమించే వాడివి మరియు కరుణించే వాడివి.”

*(బుఖారీ: 834, ముస్లిం: 2705)*

మరో విషయమేమిటంటే – తౌబా, అస్తగ్ఫార్ చేయటం కేవలం దైవ ప్రవక్తల పద్ధతే కాదు. పైగా అల్లాహ్ దీనిని బుద్ధిమంతుల, విజ్ఞుల లక్షణంగా ఖరారు చేశాడు.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**إِنَّ فِي خَلْقِ السَّمَاوَاتِ وَالْأَرْضِ وَاخْتِلَافِ اللَّيْلِ وَالنَّهَارِ لَآيَاتٍ لِّأُولِي الْأَلْبَابِ ۝ الَّذِينَ**
**يَذْكُرُونَ اللَّهَ قِيَامًا وَقُعُودًا وَعَلَىٰ جُنُوبِهِمْ وَيَتَفَكَّرُونَ فِي خَلْقِ السَّمَاوَاتِ وَالْأَرْضِ رَبَّنَا**
**مَا خَلَقْتَ هَٰذَا بَاطِلًا سُبْحَانَكَ فَقِنَا عَذَابَ النَّارِ ۝ رَبَّنَا إِنَّكَ مَن تُدْخِلِ النَّارَ فَقَدْ**
**أَخْزَيْتَهُ ۖ وَمَا لِلظَّالِمِينَ مِنْ أَنصَارٍ ۝ رَبَّنَا إِنَّنَا سَمِعْنَا مُنَادِيًا يُنَادِي لِلْإِيمَانِ أَنْ**
**آمِنُوا بِرَبِّكُمْ فَآمَنَّا ۚ رَبَّنَا فَاغْفِرْ لَنَا ذُنُوبَنَا وَكَفِّرْ عَنَّا سَيِّئَاتِنَا وَتَوَفَّنَا مَعَ الْأَبْرَارِ ۝**

**“నిశ్చయంగా భూమ్యాకాశాల సృష్టిలో, రేయింబవళ్ళ రాకపోకలలో విజ్ఞులకు ఎన్నో సూచనలు ఉన్నాయి. వారు నిల్చుని, కూర్చుని, తమ పడకలపై ఒత్తిగిలి అల్లాహ్‌ను స్మరిస్తూ ఉంటారు. భూమ్యాకాశాల సృష్టి**

**గురించి యోచన చేస్తూ ఉంటారు. వారిలా అంటారు: మా ప్రభూ! నువ్వు ఈ సృష్టిని నిరర్థకంగా చేయలేదు. నువ్వు పవిత్రుడవు. మమ్మల్ని నరకాగ్ని శిక్ష నుండి కాపాడు. ఓ మా పోషకుడా! నువ్వెవరినైతే నరకాగ్నిలో పడవేస్తావో, వాణ్ణి నువ్వు పరాభవానికి, అవమానానికి గురి చేసినట్లే. యదార్థానికి దుర్మార్గులకు తోడ్పడే వారెవరూ ఉండరు. మా ప్రభూ! పిలిచే వాడొకడు విశ్వాసం (ఈమాన్) వైపునకు పిలవడం- ప్రజలారా! మీ ప్రభువును విశ్వసించండి అని పిలుపునివ్వటం మేము విన్నాము. అంతే! మేము విశ్వసించాము. కనుక ఓ ప్రభూ! మా పాపాలను క్షమించు. మా చెడుగులను మా నుంచి దూరం చెయ్యి. సజ్జనులతో పాటు మరణం వొసగు".** ***(ఆలి ఇమ్రాన్ : 190-193)***

## అల్లాహ్ ఎంతగానో క్షమించేవాడు మరియు కరుణించేవాడు

మనిషికి అల్లాహ్ వైపునకు మాటిమాటికి మరలి అతన్ని క్షమించమని వేడుకోవడానికి ప్రేరేపించే విషయమేమిటంటే, అల్లాహ్ ఎంతగానో క్షమించేవాడు, కరుణించేవాడు (గఫూరుర్రహీం) కనుక పశ్చాత్తాపాన్ని స్వీకరించేవాడూ మరియు పశ్చాత్తాపం చెందే వారిని ప్రేమించేవాడూను.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

ألم يعلموا أن الله هو يقبل التوبة عن عباده
ويأخذ الصدقات وأن الله هو التواب الرحيم ﴿104﴾

**"ఏమిటి, అల్లాహ్‌యే తన దాసుల పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడని, దాన ధర్మాలు ఆమోదిస్తాడని, పశ్చాత్తాపాన్ని అంగీకరించటంలోనూ, దయ చూపటంలోనూ అల్లాహ్‌యే మేటి అనీ వారికి తెలియదా?"**

***(తౌబా:104)***

అలాగే ఇలా కూడా సెలవిచ్చాడు:

وهو الذي يقبل التوبة عن عباده ويعفوا عن السيئات ويعلم ما تفعلون ۝
ويستجيب الذين آمنوا وعملوا الصالحات ويزيدهم من فضله ط

**"ఆయనే తన దాసుల పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు, వారి తప్పులను మన్నిస్తాడు. మీరు చేసేదంతా ఆయనకు తెలుసు. ఆయన విశ్వసించి**

**సదాచరణ చేసే వారి (విన్నపాల)ని వింటాడు. తన కృపతో వారికి మరింతగా అనుగ్రహిస్తాడు. మరి అవిశ్వాసులకేమో చాలా కఠిన శిక్ష పడుతుంది”.** ***(అష్ షూరా:25-26)***

❖ అల్లాహ్ తన కారుణ్యం మరియు పాపాల మన్నింపు గురించి ప్రస్తావించి, అపరాధులైనా తన దాసులను సంబోధిస్తూ – రండి, నాతో క్షమాభిక్ష కోరుకోండి. నేను మీ పాపాలన్నింటినీ క్షమిస్తాను అని ఆహ్వానించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قُلْ يٰعِبَادِيَ الَّذِيْنَ اَسْرَفُوْا عَلٰٓى اَنْفُسِهِمْ لَا تَقْنَطُوْا مِنْ رَّحْمَةِ اللّٰهِ ۭ اِنَّ اللّٰهَ يَغْفِرُ الذُّنُوْبَ جَمِيْعًا ۭ اِنَّهٗ هُوَ الْغَفُوْرُ الرَّحِيْمُ ○

**“(ఓ ప్రవక్తా! నా తరఫున వారికి ఇలా) చెప్పు: తమ ఆత్మలపై అన్యాయానికి ఒడిగట్టిన ఓ నా దాసులారా! మీరు అల్లాహ్ కారుణ్యం పట్ల నిరాశ చెందకండి. నిశ్చయంగా అల్లాహ్ పాపాలన్నింటినీ క్షమిస్తాడు. నిజంగా ఆయన అమితంగా క్షమించేవాడు, అపారంగా కరుణించే వాడు”.** ***(జుమర్:53)***

ఈ ఆయత్ అవతరించిన నేపథ్యం గురించి ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా వివరించారు– ముష్రిక్కులలో ఎంతో మంది ఎన్నో హత్యలు, వ్యభిచారాలు చేసివున్నారు. వారంతా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో – మీరు బోధించే విషయాలన్నీ బాగానే వున్నాయి. కానీ అల్లాహ్ వద్ద మా పశ్చాత్తాపం స్వీకరించబడుతుందా? అని అడిగారు. ఆ సందర్భంలో ఈ ఆయత్‌ను అల్లాహ్ అవతరింపజేశాడు.

*(తఫ్సీర్ ఖుర్తుబీ : 8వ సంపుటం, 228 పేజి)*

దీని ద్వారా తెలిసిందేమిటంటే– ఒకవేళ ముష్రిక్కులూ, హత్యలు, వ్యభిచారానికి పాల్పడినవారు కూడా హృదయపూర్వకంగా పశ్చాత్తాపం చెందితే, అల్లాహ్ వారిని కూడా క్షమిస్తాడని నమ్మకం కలిగించాడు. అలాంటిది, అల్లాహ్ ఏకత్వాన్ని స్వీకరించి, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను విశ్వసించిన ముస్లిములు అతని వైపునకు మరలి క్షమించమని వేడుకుంటే అల్లాహ్ ఖచ్చితంగా వారిని క్షమిస్తాడు.

పైగా – అల్లాహ్ ఈసా (అలైహిస్సలాం)ను అల్లాహ్ కొడుకుగా ఖరారు

చేసి, అల్లాహ్‌ను ముగ్గురిలో ఒక్కడుగా భావించే క్రైస్తవులకు కూడా తౌబా మరియు అస్తగ్‌ఫార్‌ను గురించి ప్రేరేపిస్తూ ఇలా సెలవిచ్చాడు:

لَقَدْ كَفَرَ الَّذِينَ قَالُوٓا إِنَّ اللَّهَ ثَالِثُ ثَلَٰثَةٍ ۘ وَمَا مِنْ إِلَٰهٍ إِلَّآ إِلَٰهٌ وَٰحِدٌ ۚ وَإِن لَّمْ يَنتَهُوا عَمَّا يَقُولُونَ لَيَمَسَّنَّ الَّذِينَ كَفَرُوا مِنْهُمْ عَذَابٌ أَلِيمٌ ﴿73﴾ أَفَلَا يَتُوبُونَ إِلَى اللَّهِ وَيَسْتَغْفِرُونَهُۥ ۚ وَاللَّهُ غَفُورٌ رَّحِيمٌ ﴿74﴾

**"అల్లాహ్ ముగ్గురిలో ఒక్కడు అని అన్నవారు కూడా ముమ్మాటికీ తిరస్కారానికి (కుఫ్ర్‌కు) పాల్పడినట్లే. వాస్తవానికి ఒక్కడైన అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యదైవం లేనే లేదు. ఒకవేళ వారు గనక తమ ఈ మాటలను మానుకోకపోతే, వారిలో తిరస్కార వైఖరిపై ఉండేవారికి బాధాకరమైన శిక్ష తప్పకుండా అంటుకుంటుంది. వారు అల్లాహ్ వైపునకు మరలరా? క్షమాపణ కోసం ఆయన్ని వేడుకోరా? అల్లాహ్ అపారంగా క్షమించేవాడు, అమితంగా కరుణించేవాడు కూడా".**

***(మాయిద : 73,74)***

❖ అల్లాహ్, అపరాధం చేసిన ప్రతి వ్యక్తికీ, అతను గనక అస్తగ్‌ఫార్ చేసి క్షమించమని వేడుకుంటే తను 'గఫూరుర్రహీం' అని అతన్ని క్షమిస్తానని నమ్మకం కలిగిస్తాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَن يَعْمَلْ سُوٓءًا أَوْ يَظْلِمْ نَفْسَهُۥ ثُمَّ يَسْتَغْفِرِ اللَّهَ يَجِدِ اللَّهَ غَفُورًا رَّحِيمًا ﴿﴾

**"ఎవరైనా ఏదైనా పాపకార్యం చేసి తనకు తాను అన్యాయం చేసుకొని, తదుపరి అల్లాహ్‌ను క్షమాభిక్షకై వేడుకుంటే నిశ్చయంగా అతను అల్లాహ్‌ను అత్యంత క్షమించేవాడిగా అనంతంగా కరుణించేవాడిగా పొందుతాడు."** ***(నిసా: 110)***

ఒక హదీసే ఖుదసీలో ఇలా సెలవియ్యబడింది: "ఓ ఆదం పుత్రుడా! నువ్వు గనక నన్నే వేడుకుంటూ, నన్నే నమ్ముకొని, నాతో సంబంధం పెట్టుకుంటే నీతో జరిగే పాపాలన్నింటినీ నేను క్షమిస్తాను. దీని గురించి నేను లెక్కచేయను. ఒకవేళ నీ పాపాలు ఆకాశం వరకు చేరుకున్నా, నువ్వు గనక నన్ను క్షమించమని వేడుకుంటే, నేను ఏ మాత్రం లెక్కచేయకుండా నీ పాపాలను క్షమించి వేస్తాను. ఒకవేళ నువ్వు భూమికి సమానంగా వున్న పాపాలను తీసుకొచ్చినా, షిర్క్

చేయని స్థితిలో గనక నన్ను కలిస్తే నేను కూడా నీకు అంతే మన్నింపును ప్రసాదిస్తాను". *(తిర్మిజి: 354, సహీహ్ – అల్‌బానీ)*

అబూ మూసా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:"నిశ్చయంగా అల్లాహ్ రాత్రి వేళ తన కారుణ్య చేతిని చాపుతాడు, తద్వారా పగటి పూట పాపంచేసిన వాడు తౌబా చేయడానికి. అలాగే పగలు కూడా తన కారుణ్యచేతిని చాపుతాడు, తద్వారా రాత్రి పూట పాపం చేసిన వాడు పశ్చాత్తాపం చెందడానికి. ఇలా సూర్యుడు పడమర దిక్కునుండి ఉదయించే వరకు కొనసాగుతూ వుంటుంది". *(ముస్లిం: 2759)*

❖ అల్లాహ్ తన దాసుని పశ్చాత్తాపంపై ఎంతగానో సంతోషిస్తాడు.

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ దాసుడు పశ్చాత్తాపం చెందినప్పుడు అల్లాహ్ ఆ వ్యక్తి కన్నా ఎక్కువగా సంతోషిస్తాడు– ఆ వ్యక్తి ఎవరంటే, అతను ఒక ఎడారి ప్రాంతంలో ప్రయాణం చేస్తుండగా అతని వాహనం తప్పిపోయింది. దాని మీదే అతని ప్రయాణ సామగ్రి, భోజన సామగ్రి వుంది. అతను అటూ ఇటూ వెతికి చివరికి అలసిపోయి నిరుత్సాహంతో (ఖచ్చితంగా తనకు ఇక మరణమే శరణ్యం అనుకొని) చెట్టు క్రింద విశ్రమించగా, అకస్మాత్తుగా అతని వాహనం అతని ముందుకొచ్చి నిలబడి, అతను దాని త్రాడు పట్టుకొని ఆనందంతో ఇలా పలికాడు – ఓ అల్లాహ్! నువ్వు నా దాసుడివి, నేను నీ ప్రభువును, అంటే అమితానందంలో అతను తప్పుగా పలికాడు. ఆ వ్యక్తి తన వాహనం దొరికినప్పుడు ఎంతగా సంతోషిం చాడో, తన దాసులెవరైనా పశ్చాత్తాపం చెందినప్పుడు అల్లాహ్ కూడా దాని కన్నా ఎక్కువగా సంతోషిస్తాడు. *(ముస్లిం: 2747)*

❖అల్లాహ్ పశ్చాత్తాపాన్ని ఎంతగా ఇష్టపడతాడంటే, ఆయన దాసులు గనక దానిని త్యజిస్తే, వారి స్థానంలో ఆయన పశ్చాత్తాపం చెందేవారిని తీసుకు వస్తాడు, తద్వారా వారిని క్షమించడానికి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఎవరి చేతుల్లో నా ప్రాణం వుందో ఆ శక్తిమంతునిసాక్షి! ఒకవేళ మీరు పాపాలు

గనక చేయకుండా (మరియు అల్లాహ్‌ను క్షమించమని వేడుకోకుండా) వుంటే, అల్లాహ్ మిమ్మల్ని తుదముట్టించి మీ స్థానంలో అల్లాహ్ మన్నింపు కోరేవారిని తీసుకువస్తాడు, తద్వారా తను వారిని క్షమించడానికి". *(ముస్లిం:2749)*

❖ ఒక్కోసారి అల్లాహ్ నిజమైన పశ్చాత్తాపం సంకల్పానికే మనిషిని మన్నించి వేస్తాడు.

అబూ సయిద్ ఖుద్రీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: మీకు ముందు గతించిన అనుచర సమాజాల్లోని ఒక వ్యక్తి 99 వ్యక్తులను హత్య చేసాడు. తుదపరి అతను ప్రపంచంలోని గొప్ప విద్వాంసుని గురించి అడగ్గా, అతనికి ఒక పండితుని గురించి తెలుపబడింది. దానితో ఆ వ్యక్తి అతని వద్ద కెళ్ళి, నేను 99 మందిని హత్య చేసాను, మరి నాకు పశ్చాత్తాపం చెందడానికి ఏమైనా అవకాశం వుందా? అని అడిగాడు. ఆ పండితుడు 'లేదు' అని అన్నాడు.

దీనితో ఆ వ్యక్తి ఆ పండితుణ్ని కూడా హత్య చేసి, తాను హత్య చేసిన సంఖ్య 100కు పెంచాడు. తదుపరి మళ్ళీ ఆ వ్యక్తి విద్వాంసుల గురించి అడగ్గా, అతనికి ఓ విద్వాంసుని గురించి తెలియజేయబడింది.

ఆ వ్యక్తి, ఆ విద్వాంసునితో – నేను 100 మందిని హత్య చేశాను. మరి నేను పశ్చాత్తాపం చెందడానికి ఏమైనా అవకాశం వుందా? అని అడిగాడు. ఆ విద్వాసుడు– 'వుంది', పశ్చాత్తాపానికీ, నీకూ మధ్య ఎవరు అడ్డు రాగలరు? నువ్వు ఒక్క పని చెయ్యి. ఫలానా ప్రదేశానికి వెళ్ళిపో, అక్కడి ప్రజలు అల్లాహ్‌ను ఆరాధిస్తారు. కనుక నువ్వు కూడా వారితో కలసి అల్లాహ్‌ను ఆరాధిస్తూ వుండు. చూడు! నీ ప్రదేశానికి మళ్ళీ తిరిగి రావడానికి ప్రయత్నించకు, ఎందుకంటే అక్కడ చెడు ప్రజలు నివసిస్తున్నారు.

దానితో అతను బయలుదేరి సగం దూరం వెళ్ళగానే మృతి చెందాడు. ఇతని గురించి కారుణ్య దేవదూతలు మరియు శిక్షించే దైవదూతల మధ్య గొడవ జరిగింది. కారుణ్య దైవదూతలు – ఇతను మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందడానికి బయలు దేరాడు, అల్లాహ్ వైపునకు మరలాడు అని అనగా, శిక్షించే దైవదూతలు– ఇతను తన జీవితంలో ఏ సత్కార్యమూ చేయలేదు అని అన్నారు. వీళ్ళిలా మాట్లాడుకుంటున్న తరుణంలోనే ఒక దైవదూత మానవా

కారంలో అక్కడి కొచ్చాడు. దీనితో వారంతా అతన్ని తమ న్యాయనిర్ణేతగా స్వీకరించారు. అతను – మీరు రెండు దూరాలను కొలవండి (ఆ వ్యక్తి ప్రయాణించింది మరియు ఇంకా ప్రయాణించాల్సినది).

ఇలా, అతను దేనికి దగ్గరగా వుంటే, దాని కనుగుణంగా అతని గమ్యస్థానాన్ని నిర్ణయించండి అని అన్నాడు. తదుపరి, వారు రెండు దూరాలను కొలవగా, ఆ వ్యక్తి ఇంకా ప్రయాణించాల్సిన దూరం తక్కువగా వచ్చింది. దీనితో అతని ఆత్మను కారుణ్య దైవదూతలు తీసుకెళ్ళారు.

*(బుఖారీ: 3470, ముస్లిం: 2766)*

సహీహ్ ముస్లిం లోని మరో ఉల్లేఖనంలో ఇలా వుంది:

"అల్లాహ్ – ఆ వ్యక్తి ప్రయాణం చేసివున్న భూమిని పెరగమని మరియు ఇంకా ప్రయాణం చేయాల్సి వున్న భూమిని తగ్గిపోమని ఆదేశించాడు".

కాస్త ఆలోచంచండి!

ఈ వ్యక్తి 100 మందిని హత్య చేసి వున్నాడు. తన జీవితంలో ఒక్క సత్కార్యం కూడా చేయలేదు. కానీ, మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందే సంకల్పంతో బయలు దేరాడు. అల్లాహ్ అతని సంకల్పానికనుగుణంగానే అతని పశ్చాత్తాపాన్ని స్వీకరించి, అతని ఆత్మను కారుణ్య దూతలకు అప్పగించాడు.

❖కేవలం మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందాలని సంకల్పించుకున్నప్పుడే కాకుండా, దాసుడు ఒకవైపు తన పాపాల గురించి చూస్తూ మరో వైపు హృదయంలో అల్లాహ్ శిక్షల గురించి భయాందోళనలు ప్రవేశిస్తే దానికి కూడా అల్లాహ్ అతన్ని క్షమిస్తాడు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఒక వ్యక్తి ఎన్నో పాపాలు చేసాడు, జీవితంలో ఒక్క సత్కార్యం కూడా చేయలేదు. అతని మరణ సమయం ఆసన్నమైనప్పుడు, తన కొడుకులను పిలిచి, నేను చనిపోయాక నన్ను కాల్చేయండి, తదుపరి నా బూడిదను సగం గాలిలో వదిలేయండి మరియు సగం సముద్రంలో వదిలేయండి. అల్లాహ్ సాక్షి! ఒకవేళ నా ప్రభువు గనక తలచుకుంటే నాకు, ఎవ్వరికీ విధించని శిక్షను విధిస్తాడు అని అన్నాడు.

ఆయన కొడుకులు అతను చెప్పినట్లే చేసారు. తదుపరి అల్లాహ్, ఆ

వ్యక్తి బూడిదను సమీకరించమని భూమినీ, సముద్రాన్ని ఆదేశించాడు. ఆ తర్వాత అతనికి జీవం పోసి అతనితో – నువ్వు ఇలా ఎందుకు చేశావు? అని అడిగాడు. అతను, నా ప్రభూ! కేవలం నీకు భయపడి నేనిలా చేసాను. ఇది నీకు బాగా తెలుసు అని విన్నవించుకున్నాడు. దీనితో అల్లాహ్ అతన్ని క్షమించి వేసాడు. *(బుఖారీ: 7506, ముస్లిం: 2755)*

❖అల్లాహ్ ఎంతటి 'గఫూరుర్రహీమ్' అంటే , చూడ్డానికి చిన్నగా అనిపించే సత్కార్యాలను చేసినా కూడా దాసులను ఇట్టే క్షమిస్తాడు. అబూ హురైరా (రజి అల్లాహుఅన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఒక వ్యక్తి ఓ దారి గుండా వెళుతున్నాడు, దారిలో అతనికి ఒక ముళ్ళ కొమ్మ కనబడింది. అతను దానిని దారి నుండి తొలగించాడు. అల్లాహ్ అతని (ఈ చిన్న ఆచరణ)ని గౌరవించి అతన్ని మన్నించాడు". *(బుఖారీ: 652, ముస్లిం: 1914)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఒక వ్యక్తి ఒక దారి గుండా వెళుతుండగా అతనికి ఎంతో దాహం వేసింది. అతనికి ఒక బావి కనిపించగా, అందులోకి దిగి తన దాహాన్ని తీర్చుకున్నాడు. బావి నుండి బయటి కొచ్చాక అతను – ఒక కుక్క దాహంతో తటపటాయిస్తూ మన్ను నాకడం గమనించి, (మనస్సులో)–దాహం నా పరిస్థితిని మార్చినట్టుగానే ఈ కుక్క పరిస్థితిని కూడా మార్చేసింది అని అనుకొని, మళ్ళీ బావిలో దిగి తన మేజోళ్ళలో నీళ్ళు నింపి, వాటిని తన నోటితో అదిమి పట్టి, బయటకు తీసుకొచ్చి కుక్కకు నీళ్ళు త్రాగించాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ దీనిని గౌరవించి, అతణ్ణి మన్నించాడు." *(బుఖారీ: 2363, ముస్లిం: 2244)*

సహీహైన్ లోని మరో ఉల్లేఖనంలో ఇలా వుంది:

వ్యభిచరించిన ఒక స్త్రీ – ఒక కుక్కను, మిక్కిలి ఎండగా వున్న ఒక రోజులో దాహం కొద్దీ ఒక బావి దగ్గర వెంపర్లాడడం చూసింది. ఆమె తన మేజోళ్ళను తీసి వాటి ద్వారా నీళ్ళను తీసి దానికి త్రాగించింది. ఆమె ఈ ఆచరణ మూలంగానే మన్నించబడింది. *(బుఖారీ: 3467, ముస్లిం: 2244)*

ఈ హదీసులన్నింటి ద్వారా తెలిసిందేమిటంటే, అల్లాహ్ ఎంతగానో గౌరవించేవాడు, అనంతంగా కరుణించేవాడు మరియు అమితంగా క్షమించే వాడు. తన దాసుల చిన్న చిన్న సత్కార్యాలకు కూడా వారిని క్షమించి వేస్తాడు. దీనికి సంబంధించి మరిన్ని హదీసులు వినండి!

(1) అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఒక దాసుడు ఒక పాపం చేశాడు, తదుపరి అతను ఇలా ప్రార్థించాడు. ఓ అల్లాహ్! నా పాపాన్ని క్షమించు.

దీనిపై అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు : "నా దాసుడు పాపానికి ఒడిగట్టాడు. తదుపరి అతని పాపాన్ని క్షమించే లేదా పట్టుకొనే ప్రభువు ఒకడు వున్నాడని గ్రహించాడు".

ఆ తర్వాత ఆ దాసుడు మరో పాపం చేసి, పశ్చాత్తాప పడుతూ ఇలా ప్రార్థించాడు– 'నా ప్రభువా! నా పాపాన్ని క్షమించు'.

దీనిపై అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: 'నా దాసుడు పాపానికి ఒడిగట్టాడు. తదుపరి అతని పాపాన్ని క్షమించి లేదా పట్టుకొనే ప్రభువు ఒకడు వున్నాడని గ్రహించాడు'.

ఆ తర్వాత ఆ దాసుడు ఇంకో పాపం చేసి, మన్నింపు కోసం ఇలా ప్రార్థించాడు : 'నా ప్రభువా! నా పాపాన్ని క్షమించు'.

దీనిపై అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: "నా దాసుడు పాపానికి ఒడిగట్టాడు. తదుపరి అతని పాపాన్ని క్షమించే లేదా పట్టుకొనే ప్రభువు ఒకడు వున్నాడని గ్రహించాడు. వెళ్ళు, వెళ్ళి నీకిష్టమైనది చేయి, నేను నిన్ను క్షమించేశాను".

*(బుఖారీ: 7507, ముస్లిం: 2758)*

దీని అర్థం ఏమిటంటే, ఒకవేళ మీరు మాటిమాటికీ పాపానికి ఒడిగడుతూ ప్రతి సారీ అల్లాహ్‌ను క్షమించమని వేడుకుంటూ వుంటే అల్లాహ్ మిమ్మల్ని క్షమిస్తూ వుంటాడు. అంటే అల్లాహ్ క్షమాపణకు తౌబా మరియు అస్తగ్ఫార్ షరతు అన్నమాట. అందుకే, ప్రతి ముస్లిం ఎల్లప్పుడూ మన్నించమని అల్లాహ్‌ను వేడుకుంటూ వుండాలి. తద్వారా అతను మరణించే సమయంలో అతను తన ప్రభువు ద్వారా క్షమించబడి వుండాలి.

(2) అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ

ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ప్రళయం నాడు అల్లాహ్ విశ్వాసిని తనకు దగ్గరగా రప్పించి, అతన్ని పరదాతో కప్పేసి తదుపరి అతని పాపాలను ఒప్పుకొనేలా చేసి ఇలా అడుగుతాడు, నువ్వు ఫలానా పాపానికి ఒడిగట్టావన్న విషయం నీకు తెలుసా? అతను – నిజమే నా ప్రభూ! (ఈ విషయం) నాకు తెలుసు అని విన్నవించుకుంటాడు.

దీనిపై అల్లాహ్ – ఇహలోకంలో కూడా నేను నీపై (పాపాలపై) పరదా వేసి వుంచాను మరియు ఈ రోజు కూడా నిన్ను క్షమిస్తున్నాను అని అంటాడు.

తదుపరి అతనికి పుణ్యాల కర్మల పత్రం ఇవ్వబడుతుంది. ఇక తిరస్కారులు, కపట విశ్వాసుల విషయానికొస్తే, వీరి గురించి విశ్వాసులందరి ముందు ఇలా ప్రకటించబడుతుంది– 'అల్లాహ్ పై అసత్యం పలికిన వారు వీళ్ళే!'.

*(బుఖారీ: 2441, ముస్లిం: 2768)*

## పశ్చాత్తాపం స్వీకరించబడటానికి షరతులు

ప్రియ సోదరులారా!

ఇది కూడా బాగా తెలుసుకోండి! నిజమైన పశ్చాత్తాపానికి కొన్ని షరతులు వున్నాయి. అవి నెరవేర్చుకుంటే అల్లాహ్ సన్నిధిలో పశ్చాత్తాపం స్వీకరించబడదు. ఆ షరతులు ఇవి:

1) చిత్తశుద్ధి – ఆరాధనలన్నింటి స్వీకరణకు కావాల్సిన మొదటి షరతు. కనుక పశ్చాత్తాపం చెందే వ్యక్తి కేవలం అల్లాహ్ సంతృప్తి కోసం పశ్చాత్తాపం చెందాలి. అంతేకానీ, ఏదైనా ప్రాపంచిక ప్రయోజనం కోసం కాకూడదు. ఎందుకంటే, ఒకవేళ అతను ఏదైనా ప్రాపంచిక ప్రయోజనాన్ని ఆశించి తౌబా చేస్తే, ఆ ప్రయోజనం తీరిపోగానే అల్లాహ్ ధర్మం నుండి ముఖం త్రిప్పుకుంటాడు. మరి ఇలాంటి పశ్చాత్తాపం అసత్య పశ్చాత్తాపం అనిపించుకుంటుంది, నిజమైన పశ్చాత్తాపం కాదు.

2) సిగ్గుతో తలవంచుకోవడం – అంటే పశ్చాత్తాపం చెందే వ్యక్తి తన పాపాలను ఒప్పుకొని, అల్లాహ్ ముందు సిగ్గుతో తలవంచుకొని, వినయాన్ని వ్యక్తం చేయాలి. ఎందుకంటే, తన పాపాన్ని ఒప్పుకొని, సిగ్గుతో కుమిలిపోతూ వినయ విధేయతలతో అల్లాహ్‌ను క్షమించమని వేడుకొనే వ్యక్తిని అల్లాహ్ ప్రేమిస్తాడు.

ఆయెషా (రజి అల్లాహు అన్హ)పై అభాండం మోపబడినప్పుడు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు ఇలా హితబోధ చేశారు: “ఓ ఆయెషా! నీకు సంబంధించిన ఒక విషయం నా దగ్గరికి చేరింది. ఒకవేళ నువ్వు ఏ పాపం ఎరుగక పోతే అల్లాహ్‌యే దీనిని బట్టబయలు చేస్తాడు. కానీ, ఒకవేళ నీవు నిజంగానే పాపానికి ఒడిగట్టితే మటుకు అల్లాహ్ క్షమాపణ వేడుకో మరియు ఆయన సన్నిధిలో పశ్చాత్తాప పడు. ఎందుకంటే దాసులెవరైనా తన పాపాన్ని ఒప్పుకొని తదుపరి పశ్చాత్తాపం చెందితే అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు”. *(ముస్లిం: 2770)*

3) పాపాలను త్యజించడం – అంటే పశ్చాత్తాపం చెందే వ్యక్తి పాపాన్ని త్యజించి అల్లాహ్‌ను క్షమించమని వేడుకోవాలి. అంతేగానీ, ఒకవైపు పాపాలు చేస్తూ మరో వైపు అల్లాహ్‌ను క్షమాపణకై వేడుకోకూడదు.

ఉదాహరణకు – ఒక వ్యక్తి మద్యాన్ని సేవిస్తూ ఒక్కో గుటక త్రాగుతూ, దానితో పాటు ‘అస్తగ్ఫిరుల్లాహ్’ అని స్మరిస్తూ వుండడం లేదా ఒక వ్యక్తి ఒక నిశ్చితమైన లాభాన్ని పొందాలన్న ఉద్దేశ్యంతో తన సొమ్మును వడ్డీ ఇచ్చే బ్యాంకుల్లో జమ చేసి, దీనిపై అల్లాహ్ క్షమాపణ కూడా వేడుకోవడం!

ఇలాంటి వ్యక్తుల పశ్చాత్తాపం స్వీకరించబడదు. పైగా ఇది అల్లాహ్‌తో పరిహాసమాడటమే. నోటితో అల్లాహ్ క్షమాపణ వేడుకుంటూ, ఏ కార్యాలపై క్షమాపణ వేడుకుంటున్నారో వాటినే ఆచరిస్తూ వుండడం.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహ్ అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “పాపాలను ఆచరిస్తూ, వాటిపై స్థిరంగా వుండి, వాటిని క్షమించమని అల్లాహ్‌ను వేడుకొనేవాడు తన ప్రభువుతో పరిహాసమాడుతున్న వ్యక్తి లాంటి వాడు”. *(అజ్జయిాఫా: 616)*

ఈ హదీసు, పరంపర రీత్యా బలహీనమైనప్పటికీ భావం రీత్యా సరైనది. అల్లాహ్ యొక్క ఈ ఆదేశం ద్వారా దీనికి బలం చేకూరుతుంది:

وَالَّذِينَ إِذَا فَعَلُوا فَاحِشَةً أَوْ ظَلَمُوا أَنفُسَهُمْ ذَكَرُوا اللَّهَ فَاسْتَغْفَرُوا لِذُنُوبِهِمْ وَمَن يَغْفِرُ الذُّنُوبَ إِلَّا اللَّهُ وَلَمْ يُصِرُّوا عَلَىٰ مَا فَعَلُوا وَهُمْ يَعْلَمُونَ

**“తమ ద్వారా ఏదైనా నీతి బాహ్యమైన పని జరిగిపోతే లేదా తమ ఆత్మలకు వారు ఏదైనా అన్యాయం చేసుకుంటే వెంటనే అల్లాహ్‌ను తలచుకుని,**

**తమ పాపాల క్షమాపణకై వేడుకుంటారు...నిజానికి అల్లాహ్ తప్ప పాపాలను క్షమించే వాడెవడున్నాడు? వారు తమ వల్ల జరిగింది తప్పు అని తెలిసినప్పుడు దానిపై హటం చెయ్యరు".** ***(ఆలి ఇమ్రాన్: 135)***

అంటే, వారి ద్వారా ఏదైనా పాపం జరిగిపోయినప్పుడు, అది చిన్నదైనా, పెద్దదైనా, వారు ఏ మాత్రం ఆలస్యం చేయకుండా అల్లాహ్‌ను, ఆయన శిక్షను గుర్తుకు తెచ్చుకొని వెంటనే ఆయనకు క్షమాభిక్షకై వేడుకుంటారు. ఎందుకంటే ఆయన తప్ప క్షమాభిక్షను వేడుకోవడానికి అర్హులెవరూ లేరు. వారు తమపాపాల గురించి మొండిగా వాదించరు, పైగా వాటిని త్యజించి తమ స్వీయ సంస్కరణ చేసుకుంటారు.

తదుపరి అల్లాహ్ వీరికి దొరకబోయే ప్రతి ఫలాన్ని గురించి వివరిస్తూ ఇలా సెలవిచ్చాడు:

**أُولَٰئِكَ جَزَاؤُهُم مَّغْفِرَةٌ مِّن رَّبِّهِمْ وَجَنَّاتٌ تَجْرِي مِن تَحْتِهَا الْأَنْهَارُ خَالِدِينَ فِيهَا ۚ وَنِعْمَ أَجْرُ الْعَامِلِينَ (136)**

**"తమ ప్రభువు తరఫు నుంచి క్షమాభిక్ష, క్రింద కాలువలు ప్రవహించే స్వర్గవనాలు ప్రతిఫలంగా లభించేది ఇటువంటి వారికే. వాటిలో వారు ఎల్లకాలం వుంటారు. ఈ సత్కార్యాలు చేసే వారికి లభించే పుణ్యఫలం ఎంత చక్కనిది".** ***(ఆలి ఇమ్రాన్: 136)***

అలాగే, ఇలా కూడా సెలవిచ్చాడు:

**ثُمَّ إِنَّ رَبَّكَ لِلَّذِينَ عَمِلُوا السُّوءَ بِجَهَالَةٍ ثُمَّ تَابُوا مِن بَعْدِ ذَٰلِكَ وَأَصْلَحُوا إِنَّ رَبَّكَ مِن بَعْدِهَا لَغَفُورٌ رَّحِيمٌ (119)**

**"మరి ఎవరైనా అజ్ఞానం వల్ల దురాగతాలకు పాల్పడి, ఆపైన పశ్చాత్తాపం చెందితే, దిద్దుబాటు కూడా చేసుకుంటే అప్పుడు నిశ్చయంగా నీ ప్రభువు అపారంగా క్షమించేవాడు, అమితంగా కనికరించేవాడు".** ***(నహల్: 119)***

ఈ ఆయతుల ద్వారా తెలిసిందేమిటంటే, పాపాలను వదిలిపెట్టి, స్వీయ సంస్కరణ చేసుకోవడం నిజమైన పశ్చాత్తాపానికి షరతులు. అందుకే ఫజైల్ బిన్ అయ్యాజ్ రహిమహుల్లాహ్, పాపాలను త్యజించకుండా చేసే అస్తగ్‌ఫార్‌ను

అబద్ధాలకోరుని పశ్చాత్తాపంగా ఖరారు చేస్తూ ఇలా అనేవారు: "పాపాలను త్యజించకుండా అస్తగ్‌ఫార్ చేయడం అనేది అసత్యవాదులు తౌబా చేయడం లాంటిది".

4) భవిష్యత్తులో అల్లాహ్ అవిధేయతకు దూరంగా వుంటామని గట్టిగా నిర్ధారించుకోవడం.

అంటే– పశ్చాత్తాపం చెందే వ్యక్తి, పశ్చాత్తాపం చెందేటప్పుడు, భవిష్యత్తులో ఇలాంటి పాపాలకు దూరంగా వుంటానని, అల్లాహ్ సన్నిధిలో గట్టిగా నిర్ధారించుకోవాలి. కేవలం నిర్ధారించుకోవడమే కాక, దీనిపై అల్లాహ్ సహాయాన్ని కూడా అర్థించాలి. ఎందుకంటే, ఆయన సద్బుద్ధిని ప్రసాదిస్తే తప్ప అతను ఏ చెడు నుండి కూడా దూరంగా వుండలేడు.

అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా ప్రార్థించేవారు: "ఓ అల్లాహ్! నేను నిన్ను–సత్కార్యాలు చేసే, చెడు కార్యాలను త్యజించే, బీదవారిని ప్రేమించే సద్బుద్ధిని ప్రసాదించమని అర్థిస్తున్నాను.(ఓ అల్లాహ్!) నన్ను క్షమించు, నాపై కరుణించు. ఒకవేళ నీవు ప్రజలను ఏదైనా పరీక్షకు గురిచేస్తే, నన్ను దాని నుండి తప్పించి మరణాన్ని కలుగజెయ్యి. నేను నీతో, నీ ప్రేమను, నిన్ను ప్రేమించేవారి ప్రేమను, నీకు దగ్గరగా చేర్చే ఆచరణలపై ప్రేమను అర్థిస్తున్నాను". *(తిర్మిజి: 3235, సహీహ్ – అల్‌బానీ)*

అలాగే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా కూడా ప్రార్థించేవారు: "ఓ అల్లాహ్! నువ్వు నన్ను అన్నింటి కన్నా గొప్ప సత్కార్యాలు చేసే మరియు అత్యుత్తమ నైతిక విలువలు, సత్ప్రవర్తన కలిగి వుండే సద్బుద్ధిని ప్రసాదించు. ఎందుకంటే నీవు తప్ప వీటిని ప్రసాదించే వారెవరూ లేరు. (ఓ అల్లాహ్!) నన్ను చెడు కార్యాల నుండి, చెడు గుణగణాల నుంచి కాపాడు. ఎందుకంటే నీవు తప్ప వాటి నుండి  కాపాడేవారు ఎవరూ లేరు".

*(నసాయి: 896, సహీహ్ –అల్‌బానీ)*

5) పశ్చాత్తాపం చెందే వ్యక్తి 'తౌబా ద్వారం' మూసివేయబడటానికి ముందుగా తౌబా చేయాలి.

మేము ఈ ఖుత్బా ఆరంభంలోనే ఈ విషయం వివరించాం. ఒక ముస్లిం ఏదైనా పాపానికి ఒడిగడితే, వెంటనే అతను అల్లాహ్ వైపునకు తిరిగి

మన్నించమని వేడుకోవాలి. తౌబా చేయడంలో ఆలస్యం చేయకూడదు. ఎందుకంటే, ఏ వ్యక్తి కూడా ఎప్పటి వరకు జీవించి వుంటాడో అన్న గ్యారంటీ లేదు. మరణం అతనికి ఎప్పుడైనా రావచ్చు. కనుక మరణానికి ముందే అల్లాహ్ శిక్షకు భయపడుతూ వెంటనే తౌబా చేసుకోవాలి. తౌబా ద్వారం అతని కోసం మూసి వేయబడ్డ తర్వాత తౌబా చేసి అల్లాహ్ అతని తౌబాను తిరస్కరించే పరిస్థితి ఎవరికీ రాకూడదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా అల్లాహ్ – దాసుని తౌబాను, అతని ప్రాణం గొంతుకలోకి వచ్చి ఆగే వరకు స్వీకరిస్తాడు". *(తిర్మిజి: 3537, సహీహ్ – అల్‌బానీ)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే,దాసునికి మృత్యుదూత కనిపిస్తూ, తుది శ్వాస గొంతుకలోకి వచ్చి ఆగే సమయంలో గనక తౌబా చేస్తే, దాని ద్వారా ఏ ప్రయోజనం వుండదు.

అచ్చంగా ఇదే విషయాన్ని ఖురాన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّمَا التَّوْبَةُ عَلَى اللَّهِ لِلَّذِينَ يَعْمَلُونَ السُّوءَ بِجَهَالَةٍ ثُمَّ يَتُوبُونَ مِن قَرِيبٍ فَأُولَٰئِكَ
يَتُوبُ اللَّهُ عَلَيْهِمْ ۗ وَكَانَ اللَّهُ عَلِيمًا حَكِيمًا ۝ وَلَيْسَتِ التَّوْبَةُ لِلَّذِينَ يَعْمَلُونَ السَّيِّئَاتِ
حَتَّىٰ إِذَا حَضَرَ أَحَدَهُمُ الْمَوْتُ قَالَ إِنِّي تُبْتُ الْآنَ وَلَا الَّذِينَ يَمُوتُونَ وَهُمْ كُفَّارٌ ۚ أُولَٰئِكَ
أَعْتَدْنَا لَهُمْ عَذَابًا أَلِيمًا ۝

**"అవివేకం వల్ల ఏదైనా చెడు కార్యానికి పాల్పడి, వెనువెంటనే తప్పు తెలుసుకొని పశ్చాత్తాపం చెందేవారి పశ్చాత్తాపాన్ని స్వీకరించే బాధ్యత మాత్రమే అల్లాహ్‌పై వుంది. అటువంటి వారి పశ్చాత్తాపాన్ని అల్లాహ్ సీకరిస్తాడు. అల్లాహ్ మహాజ్ఞాని, గొప్ప వివేకవంతుడు. నిరంతరం పాపకార్యాలకు పాల్పడుతూ, తీరా మరణ ఘడియలు సమీపించాక, 'ఇప్పుడు నేను పశ్చాత్తాప పడుతున్నాను' అని అనేవారి పశ్చాత్తాపం ఆమోదించబడదు. అలాగే అవిశ్వాసస్థితిలో ప్రాణం విడిచే వారి పశ్చాత్తాపం కూడా స్వీకరించబడదు. ఇలాంటి వారి కోసమే మేము వ్యధాభరితమైన శిక్షను సిద్ధం చేసివుంచాము". *(నిసా: 17, 18)***

ఈ కారణంగానే ఫిరౌను సముద్రంలో మునికిపోతూ పశ్చాత్తాపం చెంది

నప్పుడు, అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని తిరస్కరిస్తూ ఇలా జవాబిచ్చాడు:

آٰلْـٰٔنَ وَقَدْ عَصَيْتَ قَبْلُ وَكُنْتَ مِنَ الْمُفْسِدِيْنَ ﴿91﴾

**"ఇప్పుడా విశ్వసించేది?! ఇంతకు ముందు తలబిరుసు తనాన్ని ప్రదర్శిస్తూ, కల్లోల జనకులలో చేరి ఉండేవాడివి కదా!"** ***(యూనుస్: 91)***

సారాంశమేమింటే – పశ్చాత్తాపం స్వీకరించబడడానికి గల షరతులలో ఒక షరతు ఏమిటంటే, పశ్చాత్తాపం చెందే వ్యక్తి తౌబా (పశ్చాత్తాపం) ద్వారం మూసివేయబడడానికి ముందుగా పశ్చాత్తాపపడాలి.

దీని ఒక స్థితి ఏమిటంటే, మరణాన్ని తన కళ్ళ ముందు చూస్తూ ప్రాణం గొంతులోకి వచ్చి ఆగినప్పుడు. ఇక రెండవ స్థితి ఏమిటంటే, సూర్యుడు పడమర దిక్కున ఉదయించినప్పుడు. ప్రళయానికి ముందు సూర్యుడు పడమర దిక్కున ఉదయిస్తాడు. ఆ తర్వాత అల్లాహ్ ఎవరి పశ్చాత్తాపాన్ని కూడా ఆమోదించడు (స్వీకరించడు).

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా సూర్యుడు పడమర దిక్కున ఉదయించడానికి ముందుగా గనక పశ్చాత్తాపం చెందితే, అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని స్వీకరిస్తాడు". *(ముస్లిం: 2703)*

6) దాసుల హక్కులను నెరవేర్చటం

ఒకవేళ పాపాలు గనక దాసుల హక్కులతో ముడిపడి వుంటే, అవి క్షమించబడానికి షరతు ఏమిటంటే, ఆ హక్కులను నెరవేర్చాలి లేదా వారి ద్వారా వాటిని క్షమింపజేసుకోవాలి.

ఆఖరుగా అల్లాహ్‌ను వేడుకునేదేమిటంటే, ఆయన మనకు మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందే సద్బుద్ధిని ప్రసాదించుగాక! మరియు మనందరి పాపాలను మన్నించుగాక!

## రెండవ ఖుత్బా

అస్తగ్‌ఫార్ మరియు నిజమైన తౌబా ప్రయోజనాలు ఎన్నో వున్నాయి. వీటిలో కొన్నింటిని మీకు క్లుప్తంగా వివరిస్తాం:

1) తౌబా మరియు అస్తగ్‌ఫార్‌తో పాపపు మచ్చలు కడిగి వేయబడతాయి మరియు మనిషి పాపాల నుండి పరిశుద్ధుడవుతాడు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"విశ్వాసి ఏదైనా తప్పు చేస్తే అతని హృదయంలో ఒక నల్లటి మచ్చ ఏర్పడుతుంది. తదుపరి అతను పశ్చాత్తాపం చెంది, ఆ పాపకార్యాన్ని త్యజించి, మన్నించమని వేడుకుంటే అతని హృదయాన్ని శుభ్రం చేయడం జరుగుతుంది.

అలా కాక, అతను ఒక తప్పు తర్వాత మరో తప్పు చేస్తూ పోతే, నల్లటి మచ్చ కూడా పెరుగుతూ పోయి, చివరికి హృదయాన్నంతటినీ కప్పి వేస్తుంది. ఖుర్ఆన్‌లో అల్లాహ్ వివరించిన 'హృదయానికి త్రుప్పు పట్టడం' అంటే ఇదే".

*(తిర్మిజీ: 3334, ఇబ్నె మాజ: 4244, హసన్– అల్‌బానీ)*

2) కేవలం నల్లటి మచ్చలే కాదు, పశ్చాత్తాపం చెందే వ్యక్తి పాపాలను అల్లాహ్ పుణ్యాలుగా మారుస్తాడు. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِلَّا مَن تَابَ وَآمَنَ وَعَمِلَ عَمَلًا صَالِحًا فَأُولَٰئِكَ يُبَدِّلُ اللَّهُ سَيِّئَاتِهِمْ حَسَنَاتٍ ۗ وَكَانَ اللَّهُ غَفُورًا رَّحِيمًا ﴿٧٠﴾

**"అయితే (ఈ పాపకార్యాల తరువాత) ఎవరు పశ్చాత్తాపం చెంది, విశ్వసిస్తారో, సదాచరణ చేస్తారో, అలాంటి వారి పాపాలను అల్లాహ్ పుణ్యాలుగా మార్చి వేస్తాడు. అల్లాహ్ క్షమాభిక్ష పెట్టేవాడు. కరుణాకరుడు".** ***(ఫుర్ఖాన్: 70)***

3) ఎక్కువగా పశ్చాత్తాపం చెందే వ్యక్తి అల్లాహ్‌కు ప్రియమైనవాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ اللَّهَ يُحِبُّ التَّوَّابِينَ وَيُحِبُّ الْمُتَطَهِّرِينَ ○

**"అల్లాహ్ పశ్చాత్తాప పడేవారిని,పారిశుద్ధ్యాన్ని అవలంబించే వారిని ఇష్టపడతాడు".** ***(బఖర: 222)***

4) పశ్చాత్తాపం చెందే వారిని అల్లాహ్ ఇష్టపడతాడు. కాబట్టి వారికి సుఖసంతోషాలు కలుగు జేస్తాడు. వారికి సంతానాన్ని, సంపదను అనుగ్రహించి వారిపై తన కారుణ్యాన్ని అవతరింపజేస్తాడు. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَقُلْتُ اسْتَغْفِرُوا رَبَّكُمْ إِنَّهُ كَانَ غَفَّارًا ○ يُرْسِلِ السَّمَاءَ عَلَيْكُم مِّدْرَارًا ○
وَيُمْدِدْكُم بِأَمْوَالٍ وَبَنِينَ وَيَجْعَل لَّكُمْ جَنَّاتٍ وَيَجْعَل لَّكُمْ أَنْهَارًا ○

**"నేను (నూహ్ అలైహిస్సలాం) ఇలా అన్నాను–క్షమాపణకై మీరు మీ ప్రభువును వేడుకోండి. నిశ్చయంగా ఆయన అమితంగా క్షమించేవాడు. ఆయన ఆకాశం నుంచి మీపై ధారాపాతంగా వర్షం కురిపిస్తాడు. మీ సిరిసంపదల్లోనూ, పుత్ర సంతతి లోనూ వృద్ధిని కలుగజేస్తాడు. మీ కొరకు తోటలను ఉత్పన్నం చేస్తాడు. ఇంకా మీ కోసం కాలువలను ప్రవహింపజేస్తాడు".** ***(నూహ్: 10 – 12)***

5) అస్తగ్ఫార్ మూలంగా అల్లాహ్ తన శిక్షను ఆపుతాడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَا كَانَ اللّٰهُ مُعَذِّبَهُمْ وَهُمْ يَسْتَغْفِرُوْنَ ﴿33﴾

**"వారు క్షమాపణకై వేడుకుంటూ ఉండగా కూడా అల్లాహ్ వారిని శిక్షించడు".** ***(అన్‌ఫాల్: 33)***

6) తౌబా, అస్తగ్ఫార్ చేసే వారి కోసం దైవదూతలు కూడా ప్రార్థిస్తారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

اَلَّذِيْنَ يَحْمِلُوْنَ الْعَرْشَ وَمَنْ حَوْلَهٗ يُسَبِّحُوْنَ بِحَمْدِ رَبِّهِمْ وَيُؤْمِنُوْنَ بِهٖ وَيَسْتَغْفِرُوْنَ لِلَّذِيْنَ اٰمَنُوْا ۚ رَبَّنَا وَسِعْتَ كُلَّ شَيْءٍ رَّحْمَةً وَّعِلْمًا فَاغْفِرْ لِلَّذِيْنَ تَابُوْا وَاتَّبَعُوْا سَبِيْلَكَ وَقِهِمْ عَذَابَ الْجَحِيْمِ ﴿7﴾

**"అర్ష్ (అల్లాహ్ సింహాసనం)ను మోసేవారు, దాని చుట్టూ ఉన్నవారు (దైవదూతలు) స్తోత్ర సమేతంగా తమ ప్రభువు పవిత్రతను కొనియాడుతున్నారు. వారు ఆయన్ని విశ్వసిస్తున్నారు. విశ్వాసుల మన్నింపు కొరకు ప్రార్థిస్తూ వారు ఇలా అంటారు– మా ప్రభూ! నీవు ప్రతి వస్తువునూ నీ దయానుగ్రహంతో, పరిజ్ఞానంతో ఆవరించి వున్నావు. కనుక పశ్చాత్తాపం చెంది, నీ మార్గాన్ని అనుసరించిన వారిని నీవు క్షమించు. ఇంకా వారిని నరక శిక్ష నుంచి కూడా కాపాడు".** ***(మోమిన్: 7)***

(7) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి కర్మల పత్రంలో 'అస్తగ్ఫార్' అధికంగా వుందో, అతనికి శుభవార్త వుంది". *(సహీహుల్ జామె: 3930)*

అందుకే మనం కూడా మన కర్మల పత్రంలో ఎక్కువగా, ‘అస్తగ్‌ఫార్’ను లిఖింప జేసుకోవాలి. (అంటే ఎక్కువగా అస్తగ్‌ఫార్ చేస్తూ వుండాలి).

ఇక అస్తగ్‌ఫార్ గురించిన అత్యుత్తమ పదాలు ఏవంటే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ‘సయ్యదుల్‌అస్తగ్‌ఫార్’ గా ఖరారు చేసిన పదాలు. అవి ఇవి: “ఓ అల్లాహ్! నువ్వు నా ప్రభువు. నీవు తప్ప మరో నిజమైన ఆరాధ్య దైవం లేదు. నీవే నన్ను సృష్టించావు. నేను నీ దాసుణ్ణి మరియు నా శక్తి కొలది నీ వాగ్దానంపై వున్నాను. నేను చేసిన దాంట్లోని చెడు గురించి నీ శరణు కోరుతాను. నేను నీ అనుగ్రహాలను స్వీకరిస్తూ నా తప్పులను కూడా ఒప్పు కుంటాను. కనుక నన్ను క్షమించు. ఎందుకంటే, నీవు తప్ప పాపాలను క్షమించే వారెవ్వరూ లేరు”. *(బుఖారీ: 6306, 6323)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: “ఏ వ్యక్తి అయినా దీనిని పూర్తి నమ్మకంతో సాయంత్రం పూట పఠిస్తే, అదే రాత్రి గనక అతనికి మరణం సంభవిస్తే, అతను నేరుగా స్వర్గంలోకి వెళతాడు. అలాగే ఎవరైనా దీనిని పూర్తి నమ్మకంతో ఉదయం పూట పఠిస్తే, అదే రోజు గనక అతను మరణిస్తే అతను నేరుగా స్వర్గంలోకి వెళతాడు.”

దీనితో పాటు ఈ పదాలు కూడా ఎంతో ప్రయోజనకరమైనవి.

‘అస్తగ్‌ఫిరుల్లాహ్, అల్లజీ లా ఇలాహ ఇల్లాహు వల్ హయ్యుల్ ఖయ్యూం వ అతూబు ఇలైహి”.

దీని గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “ఏ వ్యక్తి అయినా ఈ దుఆ (తను తప్ప మరో నిజమైన ఆరాధ్య దైవం లేని అల్లాహ్‌ను క్షమాపణ కోరుతున్నాను. ఆయన సజీవుడు, అన్నింటికీ మూలాధారం, నేను ఆయన వైపునకు పశ్చాత్తాపంతో మరలుతాను)”ను గనక పఠిస్తే, ఒకవేళ అతను యుద్ధ మైదానం నుండి పారిపోయి వచ్చినప్పటికీ అతన్ని క్షమించడం జరుగుతుంది.

అల్లాహ్‌ను వేడుకునే దేమిటంటే, ఆయన మనందరినీ క్షమించుగాక! మరియు మన పశ్చాత్తాపాన్ని స్వీకరించుగాక! ఆమీన్!!

# రమజాన్ మాసపు ఆఖరి పది రోజులు

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1) ఆఖరి పది రోజులలో వీలైనంత ఎక్కువగా ఆరాధన చేయాలి.

2) ఏతెకాఫ్.

3) రాత్రి నమాజ్ (ఖియాముల్లైల్).

4) లైలతుల్ ఖద్ర్.

5) సదఖతుల్ ఫిత్ర్ (ఫిత్రా దానం).

6) పండుగ మర్యాదలు.

## మొదటి ఖుత్బా

ఇస్లామీయ సోదరులారా!

రమజాన్ మాసపు ఆఖరి పది రోజులు ఎంతో ముఖ్యమైనవి. ఎందుకంటే వీటిలో వెయ్యి నెలల ఆరాధన కన్నా శ్రేష్ఠమైన ఒక రాత్రి కూడా వుంది. అందుకే ఈ వ్యవధిలో వీలైనంత ఎక్కువగా ఆరాధించాలి, వీలైనంత ఎక్కువగా అల్లాహ్ సాన్నిధ్యం పొందడానికి ప్రయత్నించాలి, వీలైనంత ఎక్కువగా దుఆ చేయాలి మరియు తమ పాపాలకు గాను వీలైనంత ఎక్కువగా అల్లాహ్‌తో క్షమాపణ వేడుకుంటూ మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందాలి.

ఆయెషా (రజి అల్లాహ్‌ను అన్హా) కథనం: "(రమజాన్ మాసపు) ఆఖరి పది రోజులు ఆరంభం కాగానే, దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) రాత్రంతా జాగారం చేసేవారు, తన ఇంటి వారిని కూడా మేల్కొలిపే వారు, ప్రత్యేకంగా నడుంబిగించి ఎంతో ఎక్కువగా ఆరాధించేవారు".

*(బుఖారీ: 2024, ముస్లిం:1174)*

అలాగే, ఆయెషా (రజి అల్లాహు అన్హా) ఇలా కూడా సెలవిచ్చారు: "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆఖరి పది రోజుల్లో ఆరాధించినట్లు మరెప్పుడూ ఆరాధించేవారు కారు". *(ముస్లిం: 1175)*

కనుక, మనం కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)

ఆచరణను ముందుంచి ప్రత్యేకంగా నడుంబిగించి వీలైనంత ఎక్కువగా ఆరాధించాలి. ఎంతో శుభకరమైన ఈ వ్యవధిని ఏ మాత్రం వ్యర్థం చేయకుండా, దీని ప్రతిక్షణం ప్రయోజనం పొందటానికి ప్రయత్నించాలి.

## ఏతెకాఫ్

ఆఖరి పది రోజుల్లో వీలైనంత ఎక్కువగా ఆరాధించడానికి ఉత్తమమైన స్వరూపం ఏమిటంటే, వీటిని ఏతెకాఫ్‌లో గడపడం. ఎందుకంటే, ఏతెకాఫ్ ఉద్దేశ్యం ప్రాపంచిక వ్యవహారాల నుండి తెగత్రెంపులు చేసుకొని, పూర్తిగా అల్లాహ్ వైపునకు మరలి, ఆయనను సంతృప్తి పరచి, ఆయన సాన్నిధ్యం పొందటానికి మనస్సును కేంద్రీకరించడం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఈ పది రోజుల్లో ఏతెకాఫ్‌లో గడిపేవారు.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం: "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తాను మరణించే వరకు రమజాన్ మాసపు పది రోజులు ఏతెకాఫ్‌లో గడిపేవారు. ఆ తర్వాత ఆయన సతీమణులు ఏతెకాఫ్‌లో కూర్చునేవారు".

*(బుఖారీ: 2026, ముస్లిం: 1172)*

హజ్రత్ అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి రమజాన్‌లో 10 రోజులు ఏతెకాఫ్‌లో గడిపేవారు. కానీ, తాను మరణించిన సంవత్సరంలో 20 రోజులు ఏతెకాఫ్‌లో గడిపారు". *(బుఖారీ: 2044)*

అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్‌ను అనుసరిస్తూ ముస్లిములు కూడా ఆఖరి పది రోజులు ఏతెకాఫ్‌లో గడపాలి. తద్వారా ప్రాపంచిక వ్యవహారాల నుండి దూరంగా వుంటూ కేవలం అల్లాహ్ వైపునకు మనస్సును కేంద్రీకరించవచ్చు. ఎల్లప్పుడూ ఆయన స్మరణలో గడపవచ్చు, దివ్య ఖుర్ఆన్ పారాయణం చేస్తూ దాని గురించి ఆలోచించి హితబోధను స్వీకరించవచ్చు, తమ పాపాలకు గాను మనస్ఫూర్తిగా తౌబా చేయవచ్చు. మాటిమాటికీ అల్లాహ్ ముందు ఏడుస్తూ, కన్నీళ్ళు పెట్టుకొని ఇహపరలోకాల సాఫల్యం కొరకు అల్లాహ్‌ను అర్థించవచ్చు.

ఏతెకాఫ్ లో వున్న వ్యక్తి ప్రాపంచిక విషయాలు అటుంచి, ధార్మిక వ్యవహారాల నిమిత్తం కూడా బయటకు వెళ్ళకుండా వుండాలి. కేవలం అత్యవసర పరిస్థితుల్లో తప్ప.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం:"ఏతెకాఫ్ లో వున్న వ్యక్తికి సున్నత్ ఏమటంటే, అతను రోగులను పరామర్శించడానికి వెళ్ళకూడదు. జనాజా కోసం వెళ్ళకూడదు, భార్యను ముట్టుకోకూడదు మరియు సంభోగించకూడదు. కేవలం గత్యంతరం లేని పరిస్థితుల్లో తప్ప ఏ పని కోసం వెళ్ళకూడదు".

*(అబూ దావూద్ : 2473, సహీ– అల్‌బానీ)*

ఏతెకాఫ్ లో వున్నప్పుడు ఫర్జ్ ఆచరణలతో పాటు నఫిల్ ఆరాధనలు కూడా వీలైనంత ఎక్కువగా చేస్తూ వుండాలి.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు– ఏ వ్యక్తి అయినా నా మిత్రునితో శతృత్వం కలిగి వుంటాడో నేనతనితో యుద్ధ ప్రకటన చేస్తాను. నా దాసుడు తనపై విధి (ఫర్జ్) గా విధించబడిన వాటిని ఆచరిస్తూ నా సాన్నిధ్యాన్ని ఎక్కువగా పొందగలుగుతాడు. (అంటే ఫర్జ్‌ల ద్వారా నా సాన్నిధ్యాన్ని పొందడం నాకెంతో ఇష్టం). ఇంకా ఐచ్ఛిక (నఫిల్) ఆరాధనల ద్వారా కూడా నా సాన్నిధ్యాన్ని పొందుతూ వుంటాడు. చివరికి నేను అతన్ని ప్రేమిస్తాను. నేనతన్ని ప్రేమించడం మొదలు పెట్టాక, అతను వినే చెవినై పోతాను, అతను చూసే కళ్ళయిపోతాను, అతను పట్టుకొనే చెయ్యినైపోతాను, అతను నడిచే కాళ్ళయి పోతాను (అంటే అతని శరీర అవయవాలన్నిటినీ నా విధేయతకు అనుగుణంగా మార్చుతాను). తదుపరి అతను ఏ విషయం గురించి అయినా అర్థిస్తే నేనతనికి అనుగ్రహిస్తాను. ఒకవేళ అతను నా శరణు కోరుకుంటే నేనతనికి నా శరణు ప్రసాదిస్తాను.

*(బుఖారీ: 6502)*

అందుకే ఏతెకాఫ్ లో వున్నప్పుడు ఫర్జ్ నమాజులతో పాటు ప్రత్యేకించి నఫిల్ నమాజులు కూడా చదవాలి. అంతేకాక, ఏతెకాఫ్ లో లేని వ్యక్తులు కూడా ఈ పది రోజుల్లో వీలైనంత ఎక్కువగా నఫిల్ ఆరాధనలు చేయాలి.

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే– నఫిల్ నమాజులు

కూడా స్వయానా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా నిరూపించ బడిన వాటిని, ఉదా॥కు ఫర్జ్ నమాజుకు ముందు దాని తర్వాతి సున్నతులు, చాష్త్ నమాజు మరియు రాత్రి నమాజు వగైరా........లను చేయాలి.

ఉమ్మె హబీబా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఒక ముస్లిం దాసుడు ప్రతి రోజు అల్లాహ్ సంతృప్తి కొరకు 12 రకాతులు నఫిల్ (ఫర్జ్ కాదు) ఆచరిస్తాడో అల్లాహ్ అతని కోసం స్వర్గంలో ఒక గృహాన్ని నిర్మిస్తాడు లేదా అతని కోసం స్వర్గంలో ఒక ఇల్లు నిర్మించబడుతుంది".

ఈ హదీసును ఉల్లేఖించిన తర్వాత ఉమ్మె హబీబా (రజి అల్లాహు అన్హా) ఇలా సెలవిచ్చారు– 'నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నోటి నుండి ఈ 12 రకాతుల గురించి విన్నప్పట్నుండి ఎప్పుడూ వాటిని వదలలేదు'.

*(ముస్లిం: 728)*

ఈ 12 రకాతుల వివరణ సునన్ తిర్మిజీలో వుంది.

ఉమ్మె హబీబా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా రేయింబవళ్ళలో 12 రకాతులు గనక చదివితే అతని కోసం స్వర్గంలో ఒక ఇల్లు నిర్మించ బడుతుంది. జొహర్‌కు ముందు 4 మరియు తర్వాత 2, అలాగే మగ్రిబ్ తర్వాత 2, ఇషా తర్వాత 2 మరియు ఫజర్ కు ముందు 2 రకాతులు.

*(తిర్మిజి: 415, సహీహ్ – అల్‌బానీ)*

ఉమ్మె హబీబా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా కూడా సెలవిచ్చారు: 'ఏ వ్యక్తి అయినా జొహర్‌కు ముందు 4 రకాతులు మరియు తర్వాత 4 రకాతులు ఎల్లప్పుడూ క్రమం తప్పకుండా చేస్తూ వుంటాడో అల్లాహ్ అతనికి నరకాగ్నిని నిషేధం చేస్తాడు".

*(ముస్నద్ అహ్మద్ : 6/326, అబూ దావూద్ : 1269, తిర్మిజి: 427, నసాయి:1814 ఇబ్నె మాజా : 1160, సహీహ్ –అల్‌బానీ)*

అలాగే, ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "అసర్‌కు ముందు

నాలుగు రకాతులు చదివే వ్యక్తిపై అల్లాహ్ కరుణించుగాక!".

*(అబూ దావూద్: 1271, తిర్మిజి: 430, సహీహ్ –అల్‌బానీ)*

ఫర్జ్ కు ముందు, దాని తర్వాత సున్నతులతో పాటు చాష్త నమాజ్‌ను కూడా చదవాలి. దీని మహత్యం ఎంతో వుంది.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయిన ఫజర్ నమాజును సామూహికంగా ఆచరించి, ఆపై అక్కడే కూర్చొని సూర్యోదయం అయ్యే వరకు అల్లాహ్ స్మరణ చేస్తూ తదుపరి రెండు రకాతులు చదివితే అతనికి సంపూర్ణ హజ్ మరియు ఉమ్రాల పుణ్యం దొరుకుతుంది".

*(తిర్మిజి: 586, సహీహ్ –అల్‌బానీ)*

అలాగే, అబూజర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మీలో ప్రతి ఒక్కరూ, ప్రతి రోజు (మీ శరీరం లోని) కీళ్ళన్నింటికిగాను ఒక్కో దానం చేయడం తప్పనిసరి. ఇలా, ప్రతి 'సుబ్‌హానల్లాహ్' ఒక దానం, ప్రతి 'అల్‌హమ్దులిల్లాహ్' ఒక దానం, ప్రతి 'లాయిలాహ ఇల్లల్లాహ్' ఒక దానం, ప్రతి 'అల్లాహు అక్బర్' ఒక దానం. అలాగే మంచిని ఆజ్ఞాపించడం ఒక దానం, చెడు నుండి వారించడం ఒక దానం. ఇక చాష్త యొక్క 2 రకాతులు వీటన్నింటి (కీళ్ళ) తరఫు నుండి సరి పోతాయి." *(ముస్లిం: 720)*

బరీరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ప్రతి వ్యక్తికీ 360 కీళ్ళు వున్నాయి. (ప్రతి రోజూ) అతనిపై తప్పనిసరిగా వున్న విషయం ఏమిటంటే, ప్రతి యొక్క కీలుకు గాను ఒక దానం చేయాలి".

దీనిపై సహాబాలు, ఓ దైవ ప్రవక్తా! అంత శక్తి ఎవరికుంది? అని అడిగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – మస్జిద్‌లో వేయబడిన ఉమ్మిని పూడ్చేయండి, మార్గంలో అడ్డుగా వున్న వస్తువును తొలగించండి. ఒకవేళ మీకిది కుదరకపోతే, చాష్త యొక్క 2 రకాతులు వీటికై సరిపోయతాయి". *(అబూ దావూద్: 5242, సహీహ్ – అల్‌బానీ)*

## రాత్రి నమాజ్ (ఖియాముల్లైల్)

ఫర్జ్ కు ముందు మరియు తర్వాత సున్నత్‌లు, చాష్త్ నమాజుతో పాటు రాత్రి నమాజు గురించి కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా ఇలాగే చేసేవారు.

అబూజర్ (రజి అల్లాహు అన్హు) కథనం: మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో పాటు రమజాన్ మాసపు ఉపవాసాలున్నాం. ఈ వ్యవధిలో కేవలం ఏడు రోజులు మిగిలి వున్నంత వరకు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు ఖియాం చేయించలేదు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) 23వ రాత్రి ఖియాం చేయగా, మేము కూడా ఆయనతో పాటు ఖియాం చేశాం. దీనితో ఆయన మూడింట ఒక వంతు రాత్రి గడిచే వరకు సుదీర్ఘంగా (ఖురాన్) పారాయణం చేశారు. తదుపరి, 24వ రాత్రి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాతో ఖియాం చేయలేదు. ఆ తర్వాత 25వ రాత్రి, అర్థరాత్రి గడిచే వరకు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మాతో ఖియాం చేశారు. దీనితో నేను– ఓ దైవప్రవక్తా! మీరు ఈ రోజు రాత్రంతా ఖియాం చేస్తే బాగుండేది! అని అన్నాను.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ, 'ఏ వ్యక్తి అయినా, ఇమామ్ తన ఖియాం పూర్తి చేసుకొనే వరకు అతనితో పాటు ఖియాం చేస్తే అతనికి రాత్రంతా ఖియాం చేసినంత పుణ్యఫలం లిఖించబడుతుంది' అని వివరించారు. తదుపరి 26వ రాత్రి గడిచిపోయింది. ఆ రాత్రి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాతో ఖియాం చేయలేదు. ఆ తర్వాత 27వ రాత్రి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మాతో పాటు ఖియాం చేశారు. తన సతీమణులను కూడా (మస్జిద్‌కు) తీసుకొచ్చారు. (ఆ రాత్రి) ఆయన ఎంత సుదీర్ఘంగా ఖియాం చేసారంటే, సహరీ సమయం గడిచిపోతుందేమోనని మాకు అనుమానం కలిగింది.

*(తిర్మిజి: 806, అబూ దావూద్: 1375, నసాయి: 1605, ఇబ్నె మాజ: 1327, సహీహ్ –అల్‌బానీ)*

ఇలాగే, నోమాన్ బిన్ బషీర్ (రజి అల్లాహు అన్హు) కూడా ఇలా ఉల్లేఖించారు: "మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి

23వ రాత్రి మూడింట ఒక వంతు ఖియాం చేశాం. తదుపరి 25వ రాత్రి అర్ధరాత్రి వరకు చేశాం. ఇక 27వ రాత్రి ఎంత సుదీర్ఘంగా ఖియాం చేసామంటే–బహుశా ఈ రోజు సహరీ భుజించలేమేమో అని మాకు అనుమానం కలిగింది.

*(నసాయి:1606, సహీహ్ –అల్‌బానీ)*

గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, రాత్రి నమాజ్ (ఖియాముల్లైల్), అంటే ఏదైనా ప్రత్యేక నమాజు కాదు, తరావీహ్ నమాజు కూడా రాత్రి నమాజే. అందుకే ఆఖరి పది రోజులలో తరావీహ్ నమాజును సుదీర్ఘంగా చేయాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా సహాబాలకు 23, 25 మరియు 27వ రాత్రులలో సుదీర్ఘంగా నమాజు చేయించారు.

ఖుర్ఆన్ మరియు హదీసులలో రాత్రి నమాజు ఔన్నత్యాన్ని ఎంతగానో వివరించబడింది. దైవభీతి పరుల లక్షణాలను వివరిస్తూ అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు:

كَانُوا قَلِيلًا مِّنَ اللَّيْلِ مَا يَهْجَعُونَ ○ وَبِالْأَسْحَارِ هُمْ يَسْتَغْفِرُونَ ○

**"వారు రాత్రిపూట చాలా తక్కువగా నిద్రించేవారు. రాత్రి చివరి గడియలలో క్షమాపణకై (అల్లాహ్‌ను) వేడుకునేవారు".**

***(జారియాత్ : 17, 18)***

అలాగే ఇలా సెలవిచ్చాడు:

تَتَجَافَىٰ جُنُوبُهُمْ عَنِ الْمَضَاجِعِ يَدْعُونَ رَبَّهُمْ خَوْفًا وَطَمَعًا وَمِمَّا رَزَقْنَاهُمْ يُنفِقُونَ
فَلَا تَعْلَمُ نَفْسٌ مَّا أُخْفِيَ لَهُم مِّن قُرَّةِ أَعْيُنٍ جَزَاءً بِمَا كَانُوا يَعْمَلُونَ ○

**"వారి ప్రక్కలు వారి పడకల నుంచి వేరుగా వుంటాయి. వారు తమ ప్రభువును భయంతోనూ, ఆశతోనూ ప్రార్థిస్తారు. మేము వారికి ప్రసాదించిన దాని నుండి ఖర్చు పెడతారు. వారు చేసిన కర్మలకు ప్రతిఫలంగా, వారి కళ్ళకు చలువనిచ్చే ఎలాంటి సామగ్రిని మేము దాచి పెట్టామో (దాని గురించి) ఏ ప్రాణికీ తెలియదు".**

***(సజ్దా: 16, 17)***

అబ్దుల్లా బిన్ సలామ్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనా విచ్చేసినప్పుడు, ఆయన నోటి

నుంచి నేను విన్న మొట్టమొదటి హదీసు ఇది–“ప్రజలారా! సలామ్‌ను వ్యాపింపజేయండి, (ఆకలి గొన్న వారికి) అన్నం పెట్టండి, బంధుత్వాన్ని కొనసాగించండి, ప్రజలు నిద్రపోయే సమయంలో మీరు నమాజ్ చేయండి. (మీరు గనక ఇలా చేస్తే) ప్రశాంతంగా స్వర్గంలోకి ప్రవేశించవచ్చు”.

*(ఇబ్నెమాజ:1334, 3251,తిర్మిజీ: 2485,1984, అస్సహీహా: 569)*

అబూ మాలిక్ అష్అరీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “స్వర్గంలో – బయటి దృశ్యాలు లోపలి నుండి, లోని దృశ్యాలు బయటికి కనబడే ఎంతో ఉన్నతమైన గదులు వున్నాయి. అల్లాహ్ వీటిని అన్నం పెట్టే వాడికి, మృదువుగా మాట్లాడే వాడికి, ఏకధాటిగా ఉపవాసాలు పాటించే వాడికి, ప్రజలు నిద్రపోయే సమయంలో నమాజ్ చదివే వాడికి ప్రసాదిస్తాడు”.

*(అహ్మద్: 5/343, ఇబ్నె హిబ్బాన్: 641,తిర్మిజి: 2527, సహీహ్ ఉల్‌జామె: 2119)*

ఈ ఆయతులు మరియు హదీసులను దృష్టిలో వుంచుకొని ఆఖరి పది రోజుల్లో ప్రత్యేకంగా ఖియాం చెయ్యాలి. అంతేగాక, రాత్రి చివరి ఘడియలలో ప్రత్యేకించి ప్రార్థిస్తూ వుండాలి. ఎందుకంటే ప్రార్థనలు స్వీకరించబడే సమయం అది.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:“ఎంతో శుభవంతుడు, ఉన్నతుడూ అయిన మన ప్రభువు ప్రతి రాత్రి మూడింట ఒక వంతు మిగిలి వున్నప్పుడు భూలోకపు ఆకాశం వైపునకు అవతరిస్తాడు. తదుపరి ఇలా ప్రకటిస్తాడు– నన్ను ప్రార్థించేవారు ఎవరున్నారు? నేను వారి ప్రార్థనలను స్వీకరిస్తాను. నన్ను ఏదైనా (కావాలని) అడిగేవారు ఎవరున్నారు? నేను వారికది ప్రసాదిస్తాను. నా మన్నింపు కోరుకునేవారు ఎవరున్నారు? నేను వారిని మన్నిస్తాను.” *(బుఖారీ: 1145, 6321, 7494, ముస్లిం: 758)*

ముస్లిం లోని మరొక ఉల్లేఖనంలో అదనంగా ఇలా వుంది: ఇలా (ఈ ప్రకటన) ఫజర్ వేళ వరకు కొనసాగుతూనే వుంటుంది.

# లైలతుల్ ఖద్ర్

ఇస్లామీయ సోదరులారా!

రమజాన్ మాసపు ఆఖరి 10 రోజుల ప్రాధాన్యతకు గల మరో ముఖ్య కారణమేమిటంటే, వీటిలోనే 1000 నెలల ఆరాధన కన్నా శ్రేష్ఠమైన ఆరాధన గల రాత్రి వస్తుంది.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"నిశ్చయంగా మేము దీనిని (ఈ ఖుర్ఆన్ ను) ఘనమైన రాత్రి (లైలతుల్ ఖద్ర్) యందు అవతరింపజేశాము. ఘనమైన రాత్రి గురించి నువ్వేమను కున్నావు? ఘనమైన రాత్రి వెయ్యి నెలల కంటే కూడా మేలైనది. ఆ రాత్రి యందు దైవదూతలు, ఆత్మ (జిబ్రయీల్) తమ ప్రభువు ఉత్తర్వుపై సమస్త విషయాల (నిర్వహణ) నిమిత్తం (దివి నుంచి భువికి) దిగి వస్తారు. ఆ రాత్రి ఆసాంతం శాంతియుతమైనది- తెల్లవారే వరకూ (అది వుంటుంది)."** ***(ఖద్ర్ సూరా)***

ఈ ఆయతుల ద్వారా తెలిసిందేమిటంటే- లైలతుల్ ఖద్ర్ ఆరాధన వెయ్యి నెలలు, అంటే 83 సం॥ల 4 నెలల ఆరాధన కన్నా మేలైనది. ఒక్క రాత్రి ఆరాధనకు గాను 83 సం॥ల 4 నెలల ఆరాధన కన్నా ఎక్కువ పుణ్యఫలాన్ని ప్రసాదించడం అనేది నిస్సందేహంగా అల్లాహ్ ప్రసాదించిన మహానుగ్రహాలలో ఒకటి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా విశ్వాసి అయివుండి, పుణ్యఫలాన్ని ఆశిస్తూ లైలతుల్ ఖద్ర్‌లో ఖియాం చేస్తాడో అతని గత పాపాలు మన్నించబడతాయి".

*(బుఖారీ: 2014, ముస్లిం: 760)*

ఈ రాత్రి ఎప్పుడొస్తుంది? దీనికి సంబంధించి ఎన్నో హదీసులు ఉల్లేఖించబడ్డాయి. క్లుప్తంగా మేము కొన్నింటిని మీకు వివరిస్తాం.

అబూ సయీద్ ఖుద్రీ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్ల ల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ మాసంలో మధ్యలోని పదిరోజులు (11 నుండి 20 వరకు) ఏతెకాఫ్ లో కూర్చునేవారు. ఇలా 21వ తేదీ రాగానే ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మరియు ఆయనతో పాటు ఏతెకాఫ్ లో

కూర్చున్న వారు  తమ తమ ఇండ్లకు వెళ్ళిపోయేవారు. ఒకసారి ఇలాగే 21వ రాత్రి వచ్చింది. కానీ ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఏతెకాఫ్ లోనే కూర్చుని, ప్రజలను సంబోధిస్తూ అల్లాహ్ తలచిన ఉపదేశాన్ని, ఆజ్ఞలను వివరించారు.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: నేను ఈ మధ్యలోని 10 రోజులు ఏతెకాఫ్ లో గడిపాను. కానీ ఆఖరి 10 రోజులు ఏతెకాఫ్ లో  గడపడం  సరైనదని నా కనిపించింది. అందుకే నాతో పాటు ఏతెకాఫ్ లో కూర్చున్నవారు అలాగే ఏతెకాఫ్ ను పాటించండి. నాకు ఈ రాత్రి (లైలతుల్ ఖద్ర్) కలలో చూపించడం జరిగింది. ఆ  తర్వాత మరిపింప జేయడం జరిగింది. అందుకే మీరిక దానిని ఆఖరి పది రోజులలో అన్వేషించండి. వీటి బేసి సంఖ్యల రాత్రులలో దీనిని పొందటానికి ప్రయత్నించండి. నేనింకా (కలలో) – తడిగా  వున్న నేలపై నేను సజ్దా చేయడం చూశాను.

ఆ రోజు రాత్రి (21వ రాత్రి) ధారాపాతంగా వర్షం కురిసింది. చివరికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ చేసే స్థలం వద్ద కూడా పైకప్పు నుండి చినుకులు రాలిపడ్డాయి. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉదయం నమాజు ముగించాక ఆయన  నుదుటిపై మట్టి వుండడం నేను కళ్ళారా చూశాను. *(బుఖారీ: 2016, ముస్లిం: 1161)*

ఈ  హదీసు ద్వారా తెలిసిందేమిటంటే, దైవ ప్రవక్త  (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు ఈ  రాత్రిని గూర్చి వివరించడం జరిగింది, కానీ  తదుపరి దానిని మరిపింపజేయడం జరిగింది.

దీనికి గల  కారణం మరో హదీసులో వివరించబడింది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ రాత్రి గురించి సహాబాలకు వివరించడానికి వస్తున్నప్పుడు, ఇద్దరు ముస్లిములు (ఏదో విషయంలో) గొడవ పడుతున్నారు– ఈ తరుణంలోనే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు దీనికి సంబంధించిన జ్ఞానాన్ని మరిపింపజేయడం జరిగింది. *(బుఖారీ: 2023)*

బహుశా ఈ రాత్రిని మరిపింపజేయడం వెనుక మరొక మర్మం కూడా దాగి వుండవచ్చు. అదేమిటంటే, అల్లాహ్ దాసులు ఆయన సాన్నిధ్యాన్ని మరియు ఈ  రాత్రిని పొందడానికి వీలైనంత ఎక్కువగా ఆరాధించాలి అని – వాస్తవం అల్లాహ్ కే తెలుసు.

అలాగే, ఈ హదీసు ద్వారా తెలిసిన మరో విషయమేమిటంటే, లైలతుల్ ఖద్ర్ రమజాన్ మాసపు ఆఖరి పది రోజుల్లోని బేసి రాత్రులలో ఒక రాత్రి వస్తుంది. అలాగే, తెలిసిన ఇంకొక విషయమేమిటంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ఇది ఆఖరి పది రోజుల్లోని బేసి సంఖ్యల రాత్రులలో వస్తుందని ప్రకటించిన సం॥లో ఇది 21వ రాత్రి వచ్చింది. అలాగే ఈ హదీసు ద్వారా లైలతుల్ ఖద్ర్‌కు సంబంధించిన ఒక సూచన కూడా తెలిసింది. అదేమిటంటే, వర్షం కురవడం.

ఈ సూచన మరో హదీసు ద్వారా కూడా వివరించబడింది.

అబ్దుల్లా బిన్ అనీస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నాకు లైలతుల్ ఖద్ర్‌ను చూపించడం జరిగింది, తదుపరి మరిపింపజేయడం జరిగింది. దాని ఉదయం నేను తడి నేలలో సజ్దా చేయడం కలలో చూశాను". *(ముస్లిం: 1168)*

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాలలో కొందరు– లైలతుల్ ఖద్ర్ రమజాన్ మాసపు ఆఖరి 7 రోజుల్లో వుండడం కలలో చూశారు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మీ కలలన్నీ ఒకేలా వున్నాయని నేను భావిస్తున్నాను. అదేమిటంటే, ఈ రాత్రి ఆఖరి ఏడు రాత్రుల్లో ఒకటి. అందుకే మీలో ఎవరు ఈ రాత్రిని పొందగోరుతాడో అతను దీనిని ఆఖరి ఏడు రాత్రుల్లో పొందటానికి ప్రయత్నించాలి".

*(బుఖారీ: 2015, ముస్లిం: 1165)*

ఈ రెండు హదీసులూ మరియు వీటితోపాటు ఇతర ఎన్నో హదీసుల ద్వారా నిరూపించబడేదేమిటంటే, లైలతుల్ ఖద్ర్ రమజాన్ మాసపు ఆఖరి పది రోజుల్లోని బేసి సంఖ్యల రాత్రుల్లో వస్తుంది. మరి కొన్ని ఉల్లేఖనాల ద్వారా తెలిసిందేమిటంటే – ఈ బేసి రాత్రులలో, 27వ రాత్రి వచ్చే అవకాశం ఎక్కువగా వుంటుంది.

జర్ బిన్ హుబీష్ కథనం: నేను ఉబై బిన్ కాబ్ (రజి అల్లాహు అన్హు)తో – సంవత్సరమంతా ఖియాం చేసేవారే లైలతుల్ ఖద్ర్‌ను పొందగలుగుతారని ఇబ్నె మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) అన్నారని చెప్పాను. దీనిపై ఆయన, అల్లాహ్ ఆయనను కరుణించుగాక! బహుశా ఆయన ఉద్దేశ్యం, కేవలం ఒకే

రాత్రిని నమ్ముకొని వుండకపోవడం కావచ్చు. అంతేకానీ, ఈ రాత్రి రమజాన్ మాసంలో వస్తుందని ఆయనకు బాగా తెలుసు. అది కూడా ఆఖరి పది రోజుల్లో, 27వ రాత్రి. తదుపరి ఆయన ఒట్టు పెట్టుకొని మరీ ఇది 27వ రాత్రి వస్తుందని చెప్పారు.

జర్ బిన్ హబీష్ కథనం: నేను ఉబై బిన్ కాబ్ (రజి అల్లాహు అన్హు) తో, మీరు ఇలా ఖచ్చితంగా ఎలా చెప్పగలుగుతున్నారు అని అడిగాను. ఆయన జవాబిస్తూ- దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాకు వివరించిన దాని సూచన ఆధారంగానే నేనిది చెపుతున్నాను. ఆ సూచన ఏమిటంటే, ఆ రాత్రి గడిచాక మరుసటి రోజు ఉదయం సూర్యుడు, కిరణాల తీవ్రత లేకుండానే ఉదయిస్తాడు". *(ముస్లిం)*

ముఆవియా బిన్ అబూ సుఫ్యాన్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) లైలతుల్ ఖద్ర్ గురించి వివరిస్తూ ఇలా సెలవిచ్చారు: "లైలతుల్ ఖద్ర్ 27వ రాత్రి వుంటుంది".

*(అబూ దావూద్: 1386, సహీహ్-అల్‌బానీ)*

ఏది ఏమైనా, ఈ హదీసులన్నింటినీ పరికించడం ద్వారా తెలిసేదేమి టంటే, లైలతుల్ ఖద్ర్‌ను పొందడానికి, ఆఖరి పది రోజుల్లోని బేసి రాత్రులన్నింటి లోనూ ప్రయత్నం చేయాలి. ప్రత్యేకించి 27వ రాత్రి. ఈ రాత్రులలో వీలైనంత ఎక్కువగా ఈ దుఆ చేయాలి:

"ఓ అల్లాహ్! నిశ్చయంగా నీవు ఎంతగానో క్షమించేవాడివి, క్షమించడాన్ని ఇష్టపడేవాడివి. కనుక నన్ను కూడా క్షమించు".

ఎందుకంటే, ఆయెషా (రజి అల్లాహు అన్హా) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో - ఈ రాత్రి లైలతుల్ ఖద్ర్ రాత్రి అని నాకు గనక తెలిస్తే నేనేమని ప్రార్థించాలి అని అడిగినప్పుడు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు ఈ దుఆ నే పఠించమని చెప్పారు.

*(తిర్మిజి: 3513, ఇబ్నెమాజ : 385, సహీహ్ - అల్‌బానీ)*

అల్లాహ్‌ను వేడుకొనే దేమిటంటే, ఆయన మనందరికీ ఆఖరి పది రోజుల్లో వీలైనంత ఎక్కువగా ఆరాధించే మరియు లైలతుల్ ఖద్ర్‌ను పొందే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

# రెండవ ఖుత్బా

ఇస్లామీయ సోదరులారా!

ఈ శుభప్రద మాసపు ఆదేశాలలోని ఒక ఆదేశం ఏమిటంటే, ఈ నెల ముగియడానికి ముందు ఫిత్రా దానం చేయాలి. దీనిని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫర్జ్ (విధి)గా ఖరారు చేశారు.

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫిత్రా దానాన్ని ఫర్జ్ చేసారు. ఖర్జూరం లేదా యవలు(జౌ) ఒక 'సా' అంత. బానిస మీద, స్వతంత్రుని మీద, పురుషుని మీద, స్త్రీ మీద, ముస్లిములలోని ప్రతి చిన్నా పెద్ద–అందరిపై దీనిని ఫర్జ్‌గా ఖరారు చేశారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనిని, పండుగ నమాజు కోసం ప్రజలు బయలు దేరడానికి ముందుగా చెల్లించాలని ఆజ్ఞాపించారు.

*(బుఖారీ: 1503, ముస్లిం: 984)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫర్జ్ చేసిన ఫిత్రా దానం, తినే వస్తువులలో నుండి ఒక 'సా' అంత బరువు. ఒక 'సా' దాదాపు రెండున్నర కిలో గ్రాములు బరువు వుంటుంది.

సహాబాలు కూడా తినే వస్తువులలో నుండే ఫిత్రా దానాన్ని చెల్లించే వారు. దీని గురించి అబూ సయీద్ ఖుద్రీ (రజి అల్లాహు అన్హు)ఇలా సెలవిచ్చారు: "మేము ఫిత్రా దానం (ఇలా) చేసే వాళ్ళం– ఆహార ధాన్యాల ఒక సా లేదా యవలు(జౌ) ఒక 'సా' లేదా ఖర్జూరపు 'సా' లేదా పనీర్ 'సా' లేక కిస్మిస్ యొక్క ఒక 'సా'." *(బుఖారీ : 1506, ముస్లిం: 985)*

మరో ఉల్లేఖనంలో, అబూ సయీద్ ఖుద్రీ (రజి అల్లాహు అన్హు) పదాలు ఇలా వున్నాయి: "మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో 'ఈదుల్ ఫిత్ర్' నాడు తినే వస్తువుల నుండి ఒక 'సా', ఫిత్రా దానం చెల్లించేవాళ్ళం. ఆ సమయంలో మా భోజనం యవలు(జౌ), కిస్మిస్, పనీర్ మరియు ఖర్జూరంతో కూడుకుని వుండేది". *(బుఖారీ: 1510)*

అందుకే, ఫిత్రా దానం కేవలం తినే వస్తువులలో నుంచే చెల్లించాలి. ఉదా॥కు గోధుమలు మరియు బియ్యం వగైరా....

ఫిత్రా దానం వెనుక గల మర్మం ఏమిటంటే, దీని కారణంగా బీద

వారికి సైతం తినడానికి ఎంతో కొంత దొరుకుతుంది. అంతేకాక, ఉపవాస వ్యవధిలో తెలిసీ తెలియకుండా ఏవైనా అనవసర, చెడు విషయాల జోలికి పోయివున్నట్లయితే ఈ దానం దానికి పరిహారం (కఫ్ఫారా)గా మారుతుంది.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు: “దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫిత్రా దానాన్ని ఫర్జ్‌గా ఖరారు చేశారు. దీని ద్వారా ఉపవాసం పాటించిన వ్యక్తి – తాను ఈ వ్యవధిలో తెలిసీ తెలియకుండా చేసిన చెడు కార్యాల పాపఫలం నుంచి పరిశుద్ధుడవుతాడు. దీనితో పాటు బీదవారికి భోజనం కూడా దొరుకుతుంది.”

*(అబూ దావూద్: 1609, హసన్ – అల్‌బానీ)*

గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటటే, ఫిత్రా దానం పండుగ నమాజుకు ముందుగా చెల్లించాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విషయం గురించి ఆజ్ఞాపించి వున్నారు. దీనికి సంబంధించిన ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఉల్లేఖనాన్ని మేము ఇంతకు ముందే వివరించాం. దీనితో పాటు, ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు: “ఏ వ్యక్తి అయినా పండుగ నమాజుకు ముందుగా గనక చెల్లిస్తే అది స్వీకార యోగ్యమైన జకాత్ (ఫిత్రా దానం) అవుతుంది. అలా కాక, పండుగ నమాజు తర్వాత గనక దానిని చెల్లిస్తే, అది సాధారణ దానధర్మాలలో ఒకటవుతుంది.”

*(అబూ దావూద్: 1609, హసన్ – అల్‌బానీ)*

## పండుగ మర్యాదలు

ఈ శుభప్రద మాసం ముగింపు సందర్భంగా ఫిత్రాదానం చెల్లించడంతో పాటు వేరే ఇతర మర్యాదలను కూడా ముస్లిములు దృష్టిలో వుంచుకోవాలి.

**1) వీటిలో మొదటిది–** షవ్వాల్ నెలవంక కనబడగానే, ఆ రాత్రి మరియు పండుగ రోజు ఉదయం మాటిమాటికీ తక్బీర్లను పఠిస్తూ వుండాలి:

ఈ తక్బీర్ల ద్వారా వాస్తవానికి అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపబడతాయి. ఎందుకంటే, ఆయన ప్రసాదించిన సద్బుద్ధి కారణంగానే ఈ మాసమంతా ఉపవాసాలుండి, ఖుర్‌ఆన్ పారాయణం చేయగలిగాం. దుఆలు చేయగలిగాం. మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందగలిగాం మరియు ఇతర ఆరాధనలు చేయగలిగాం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يُرِيدُ اللَّهُ بِكُمُ الْيُسْرَ وَلَا يُرِيدُ بِكُمُ الْعُسْرَ وَلِتُكْمِلُوا الْعِدَّةَ وَلِتُكَبِّرُوا اللَّهَ عَلَىٰ مَا هَدَاكُمْ وَلَعَلَّكُمْ تَشْكُرُونَ ۝

**"అల్లాహ్ మీకు సౌలభ్యాన్ని సమకూర్చ దలుస్తున్నాడేగానీ మిమ్మల్ని కష్టపెట్టదలచడం లేదు. మీరు (ఉపవాసాల) నిర్ణీత సంఖ్యను పూర్తి చేసుకోవాలన్నదీ, తాను అనుగ్రహించిన సన్మార్గ భాగ్యానికి ప్రతిగా ఆయన గొప్పతనాన్ని కీర్తించి, తగు రీతిలో మీరు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవాలన్నిది అల్లాహ్ అభిలాష".** ***(బఖర: 185)***

**2) పండుగ నమాజుకు బయలుదేరడానికి ముందు స్నానం చేయాలి.**

(పరిశుభ్రమైన) ఉత్తమమైన దుస్తులు ధరించి, సువాసన పూసుకొని ఇంటి నుండి బయలుదేరాలి.

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) (పండుగ నమాజు నిమిత్తం) ఈద్‌గాహ్ కు వెళ్లడానికి ముందు స్నానం చేసేవారు. *(ముఅత్తా)*

**3) ఇంటినుండి బయలుదేరే ముందు బేసి సంఖ్యలో ఖర్జూర పండ్లను తినడం సున్నత్.**

అనస్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు: "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫితర్ పండుగ రోజు బేసి సంఖ్యలో కొన్ని ఖర్జూర పండ్లను తిన్న తర్వాతే (నమాజ్ కోసం) బయటికొచ్చేవారు". *(బుఖారీ: 953)*

**4) ఈద్‌గాహ్‌కు నడిచి వెళ్ళడం, తిరిగి నడిచి రావడం సున్నత్.**

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) మరియు సాద్ (రజి అల్లాహు అన్హు) ల కథనం: "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ (నమాజ్) కోసం నడిచి వెళ్ళేవారు, మళ్ళీ నడుచుకుంటూనే తిరిగొచ్చేవారు".
*(ఇబ్నెమాజ :1294,1295, హసన్ – అల్‌బానీ)*

**5) పండుగ నమాజ్ కోసం ఇంటి వారిని కూడా తీసుకెళ్ళాలి.**

ఎందుకంటే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్త్రీలను కూడా ఈద్‌గాహ్ కు వెళ్ళమని ఆజ్ఞాపించి ఉన్నారు. ఈ విషయం సహీహ్ బుఖారీ,

సహీహ్ ముస్లింలో ఉమ్మె అతియా (రజి అల్లాహు అన్హా) ఉల్లేఖించిన హదీసులో వుంది. చివరికి, రుతుస్రావంలో వున్న స్త్రీలకు కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ఇంటి నుండి బయలుదేరి, ఈద్‌గాహ్‌కు వెళ్ళి ప్రక్కన కూర్చోమని, ముస్లిముల దుఆ లలో పాలుపంచుకోమని ఆజ్ఞాపించారు.

*(బుఖారీ: 974, ముస్లిం: 890)*

**6) పండుగ నమాజు ఈద్‌గాహ్ లో చదవడం సున్నత్.**

అబూ సయీద్ ఖుద్రీ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫిత్ర్ మరియు ఈదుల్ అజ్‌హా నాడు ఈద్‌గాహ్ కు వెళ్ళేవారు. అన్నింటి కన్నా ముందుగా ఆయన పండుగ నమాజ్ చేయించేవారు. తదుపరి, తమ తమ స్థానాల్లో అలాగే కూర్చొని వున్న ప్రజల ముందుకు వచ్చేవారు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి హితబోధ చేసేవారు, వసీయతు చేసేవారు, ఆదేశించేవారు, ఒకవేళ ఏదైనా బృందాన్ని సాగనంపాల్సి వుంటే దానిపై నిర్ణయం తీసుకునేవారు. ఒకవేళ మరేదైనా ఆదేశాన్ని జారీ చేయాల్సి వస్తే దానిని జారీ చేసి తిరిగి వచ్చేవారు.

*(బుఖారీ:956, ముస్లిం: 889)*

**7)ఈద్‌గాహ్ కు వెళ్ళేటప్పుడు ఈ తక్బీర్లను మాటిమాటికీ పఠిస్తూ వుండాలి.**

**“అల్లాహుఅక్బర్, అల్లాహుఅక్బర్, అల్లాహుఅక్బర్, లాఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ అల్లాహుఅక్బర్ వలిల్లాహిల్ హమ్ద్”.**

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫిత్ర్ రోజు ఈద్‌గాహ్ కు వెళ్ళేటప్పుడు తక్బీర్లను పఠిస్తూ వెళ్ళేవారు. పండుగ నమాజు ముగించాక తక్బీర్లను పఠించేవారు కాదు. ఇలాగే ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇంటి నుండి బయలుదేరి ఈద్‌గాహ్ కు వెళుతున్నప్పుడు తక్బీర్లను పఠిస్తూ వెళ్ళేవారు. *(అస్సహీహ : 171)*

ఈద్‌గాహ్ కు చేరుకున్నాక, నమాజు కోసం ఇమామ్ పంక్తులను తిన్నగా చేసుకోమని ఆజ్ఞాపించనంత వరకు, తక్బీర్లను మాటిమాటికీ పఠిస్తూనే వుండాలి.

**8) పండుగ నమాజ్‌కు ముందుగానీ, తర్వాత గానీ ఏ నఫిల్ నమాజు కూడా లేదు.**

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: “నిశ్చయంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈదుల్ ఫిత్ర్ నాడు బయలుదేరి రెండు రకాతులు చేయించారు. దీనికి ముందు గానీ, తర్వాత గానీ ఎలాంటి నమాజ్ చేయలేదు”.

*(బుఖారీ:989, ముస్లిం:884)*

**9) పండుగ నమాజు కోసం అజాన్ మరియు ఇఖామత్‌లు లేవు.**

జాబిర్ బిన్ సమ్రా (రజి అల్లాహు అన్హు) కథనం: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కలసి ఎన్నోసార్లు పండుగల నమాజును అజాన్ మరియు ఇఖామత్‌లు లేకుండా చదివాను. *(ముస్లిం: 887)*

ఆఖరుగా అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే, ఆయన మనందరినీ ఈ శుభప్రద మాసపు ఉపవాసాలను పూర్తిచేసే సద్బుద్ధిని ప్రసాదించుగాక! మరియు వాటిని స్వీకరించుగాక! ఆమీన్!!

# ఈదుల్ ఫిత్ర్ ఖుత్బా

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1) పండుగ ఎవరి కోసం?

2) (ఉపవాసాల) నిర్ణీత సంఖ్య పూర్తయ్యాక అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపడం.

3) దుఆ స్వీకారము.

4) సదాచరణలపై స్థిరంగా వుంటూ అవిధేయతకు దూరంగా వుండడం.

5) పండుగ దినాల్లో ధర్మయుక్తమైన కార్యాలు.

6) పండుగ దినాల్లో  చెడు కార్యాలు చేయడం.

ఇస్లామీయ సోదరులారా!

ఈ రోజు ఈదుల్ ఫిత్ర్ రోజు. ఎంతో ఆనందకరమైన రోజు.

❖ఈ రోజు ఎవరికి ఆనందకరమైనదంటే– ఎవరైతే శుభప్రద రమజాన్ మాసపు ఉపవాసాలన్నింటినీ పాటించారో మరియు సరైన షరీయత్తు పరమైన కారణం లేకుండా వాటిని విడిచిపెట్టలేదో ఆ వ్యక్తికి.

ఎందుకంటే, అలాంటి వ్యక్తి గురించే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చి వున్నారు: "ఎవరైనా విశ్వాసస్థితిలో, అల్లాహ్ ద్వారా పుణ్యఫలాన్ని ఆశిస్తూ రమజాన్ మాసపు ఉపవాసాలు పాటిస్తారో, అతని గత పాపాలు క్షమించబడతాయి". *(బుఖారీ: ముస్లిం)*

❖ నిశ్చయంగా ఈ రోజు ఎవరికి ఆనందకరమైనదంటే– ఎవరైతే ఈ నెలలో ఉపవాసాలు పాటిస్తూ క్రమం తప్పకుండా తరావీహ్ నమాజ్ చదివారో ఆ వ్యక్తికి. ఎందుకంటే, అలాంటి వ్యక్తి  గురించే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఎవరైనా విశ్వాస స్థితిలో, అల్లాహ్ సంతృప్తిని ఆశిస్తూ రమజాన్ మాసంలో ఖియాం చేశారో, అతని గత పాపాలు మన్నించ బడతాయి. *(బుఖారీ: 37, 2008, ముస్లిం: 759)*

రమజాన్ ఉపవాసాలు పాటించి, దానిలో ఖియాం చేసిన అదృష్టవంతులైన నా ముస్లిం సోదరులారా! మన ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మీకు పాపాల మన్నింపును గురించిన శుభవార్త వినిపించేశారు. ఈ రోజు మీ

అందరికీ ఎంతో సంతోషకరమైన దినం. మీరు ఉపవాసాలన్నీ పాటించారు. దీనికి తోడు తరావీహ్ నమాజ్ కూడా చదివారు. అల్లాహ్ వీటన్నింటినీ స్వీకరించు గాక!

❖ఈ రోజు నిజంగానే ఎవరు సంతోషపడాలంటే – ఎవరైతే లైలతుల్ ఖద్ర్ ఆరాధన పుణ్యఫలాన్ని ఆశిస్తూ ఆఖరి పదిరోజుల బేసి రాత్రులలో ఎంతో శ్రమించి, ఈ రాత్రులలో ప్రత్యేకంగా ఖియాం చేసారో వారు (సంతోషపడాలి). ఎందుకంటే, వీరి గురించే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఎవరైనా విశ్వాస స్థితిలో, పుణ్యఫలాన్ని ఆశిస్తూ, లైలతుల్ ఖద్ర్‌లో ఖియాం చేశారో అతని గతపాపాలు క్షమించబడతాయి".

*(బుఖారీ: 2014, ముస్లిం: 760)*

❖ఈ రోజు నిజంగానే పండుగ రోజు ఎవరికంటే, ఎవరైతే రమజాన్ మాసంలో మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెంది, అల్లాహ్‌ను సంతృప్తి పరచారో (వారికే ఈ రోజు పండుగ రోజు).

❖ఈ రోజు నిజంగానే సంతోషకరమైన దినం ఎవరి కంటే, ఎవరైతే శుభప్రద రమజాన్ మాసాన్ని పొందారో మరియు దానిలో అల్లాహ్‌కు క్షమాపణలు వేడుకొని తమ పాపాలను మన్నింపజేసుకున్నారో (వారికి నిజంగానే ఈ దినం (సంతోషకరమైనది).

నిశ్చయంగా, అత్యంత దురదృష్టవంతుడెవరంటే, రమజాన్ లాంటి మహోన్నత మాసాన్ని పొంది కూడా తన పాపాలను మన్నింప జేసుకోలేక పోయాడో (అతనే అత్యంత దురదృష్టవంతుడు).

ఒక వ్యక్తి పండుగ రోజు విశ్వాసుల నాయకుడు (అమీరుల్ మోమినీన్) అలీ బిన్ అబూ తాలిబ్ (రజి అల్లాహు అన్హు) సన్నిధికి రాగా, ఆయన ఎండిన రొట్టెను జైతూన్‌తో కలిపి తింటూ వుండడం చూసాడు. అతను– ఓ విశ్వాసుల నాయకా! పండుగ రోజు మీరు ఈ ఎండిన రొట్టెను (భుజిస్తున్నారు)? అని అడిగాడు.

అలీ (రజి అల్లాహు అన్హు) జవాబిస్తూ – "ఓ ఫలానా వ్యక్తీ! పండుగ, మంచి బట్టలు తొడిగి, సరీద్ (మంచి ఆహారం) తినే వారిది కాదు. పైగా ఎవరి ఉపవాసాలు స్వీకరించబడ్డాయో, ఎవరి ఖియాముల్లైల్ ఆమోదించ

బడిందో, ఎవరి పాపాలు మన్నించబడ్డాయో మరియు ఎవరి శ్రమకు గౌరవం దక్కిందో వారిదే అసలైన పండుగ. మా కోసమైతే ఈ రోజూ పండుగే, రేపు కూడా పండుగే మరియు అల్లాహ్ అవిధేయతకు దూరంగా వున్న ప్రతి రోజూ పండుగే" అని అన్నారు.

అలాగే, ఉమర్ బిన్ అబ్దుల్ అజీజ్ రహిమహుల్లాహ్ ఇలా సెలవిచ్చారు: "పండుగ– ఉత్తమ వస్త్రాలు ధరించిన వారిది కాదు, పైగా ప్రళయదినం గురించి భయపడేవారిదే పండుగ".

ఇస్లామీయ సోదరులారా!

రమజాన్ మాసంలో అల్లాహ్ ఎవరికైతే ఉపవాసం పాటించే, ఖియాం చేసే, ఖుర్ఆన్ పారాయణం చేసే, దానధర్మాలు చేసే సద్బుద్ధిని ప్రసాదించాడో వారు ఈ రోజు అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకోవాలి. ఒకవేళ అల్లాహ్ వారికి సద్బుద్ధిని ప్రసాదించి వుండకపోతే, వారిదంతా చేయగలిగే వారు కారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يُرِيدُ اللَّهُ بِكُمُ الْيُسْرَ وَلَا يُرِيدُ بِكُمُ الْعُسْرَ وَلِتُكْمِلُوا الْعِدَّةَ وَلِتُكَبِّرُوا اللَّهَ عَلَىٰ مَا هَدَاكُمْ وَلَعَلَّكُمْ تَشْكُرُونَ ۝

**"అల్లాహ్ మిమ్మల్ని సౌలభ్యాన్ని సమకూర్చదలుస్తున్నాడే కాని మిమ్మల్ని కష్టపెట్టదలచడం లేదు. మీరు (ఉపవాసాల) నిర్ణీత సంఖ్యను పూర్తి చేసుకోవాలన్నదీ, తాను అనుగ్రహించిన సన్మార్గ భాగ్యానికి ప్రతిగా ఆయన గొప్పతనాన్ని కీర్తించి, తగురీతిలో మీరు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకోవాలన్నది అల్లాహ్ అభిలాష."** ***(బఖర: 185)***

దీనితో పాటు, ఆయన మన ఉపవాసాలను, మన ఖియాం ను మరియు ఇతర ఆరాధనలను స్వీకరించమని వేడుకుంటూ వుండాలి.

సలఫుస్సాలిహీన్ (గతించిన మొదటి మూడు తరాల సజ్జనులు) ఆరు నెలల దాకా ఇలా ప్రార్థించేవారు: ఓ అల్లాహ్! మాకు రమజాన్ మాసాన్ని పొందే అదృష్టాన్నివ్వు. తదుపరి రమజాన్ మాసం వెళ్ళిపోయాక వారు ఇలా ప్రార్థించేవారు: ఓ అల్లాహ్! ఈ నెలలో మేము చేసిన ఆరాధనలన్నింటినీ నీవు (దయతో) స్వీకరించు.

దివ్య ఖుర్ఆన్ లో అల్లాహ్ తన దాసుల లక్షణాలను వివరిస్తూ ఒక దాని గురించి ఇలా వివరించాడు: వారు ఆరాధనలు పాటించిన తర్వాత, అవి

అల్లాహ్ సన్నిధిలో తిరస్కరించబడతాయేమోనని భయపడుతూ వుంటారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ الَّذِينَ هُم مِّنْ خَشْيَةِ رَبِّهِم مُّشْفِقُونَ ۝ وَالَّذِينَ هُم بِآيَاتِ رَبِّهِمْ يُؤْمِنُونَ ۝ وَالَّذِينَ هُم بِرَبِّهِمْ لَا يُشْرِكُونَ ۝ وَالَّذِينَ يُؤْتُونَ مَا آتَوا وَّقُلُوبُهُمْ وَجِلَةٌ أَنَّهُمْ إِلَىٰ رَبِّهِمْ رَاجِعُونَ ۝ أُولَٰئِكَ يُسَارِعُونَ فِي الْخَيْرَاتِ وَهُمْ لَهَا سَابِقُونَ ۝

**"నిశ్చయంగా ఎవరు తమ ప్రభువు పట్ల భీతితో భయపడుతున్నారో, మరెవరు తమ ప్రభువు ఆయతులను విశ్వసిస్తున్నారో, ఎవరు తమ ప్రభువుకు సహవర్తులను కల్పించకుండా వుంటారో, ఇంకా (అల్లాహ్ మార్గంలో) ఇవ్వవలసిన దాన్ని ఇస్తూ కూడా, తమ ప్రభువు వద్దకు మరలిపోవలసి ఉందనే భావనతో ఎవరి హృదయాలు వణుకుతూ ఉంటాయో, వారే త్వరత్వరగా మంచి పనులు చేసుకుంటూ పోతున్న వారు. వాటి కోసం వారు పోటీపడతారు".** ***(మూమినూన్: 57-61)***

ఈ ఆయత్‌లలో అల్లాహ్ వివరించిన లక్షణాలను ముస్లిములందరూ అలవర్చుకోవాలి. వాటిలో ఒకటి, ఒకవైపు ఆరాధిస్తూ మరో వైపు ఆ ఆరాధన అల్లాహ్ సమక్షంలో రద్దు గావించబడుతుందేమోనని భయపడుతూ వుండాలి. ఈ భయంతోనే ఆయనతో, వాటిని దయతో స్వీకరించమని వేడుకుంటూ వుండాలి.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం ఆమె దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను- "(అల్లాహ్ మార్గంలో) ఇవ్వవలసిన దానిని ఇస్తూ కూడా, తమ ప్రభువు వద్దకు మరలిపోవలసి ఉందనే భావనతో ఎవరి హృదయాలు వణుకుతూ ఉండాయో" అన్న ఆయత్ గురించి ప్రశ్నిస్తూ, దీని అర్థం మద్యపానం, దొంగతనాలు చేసేవారా? అని అడిగారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – ఓ సిద్దీఖ్ కూతురా! నువ్వనుకుంటున్నట్లు వీళ్ళ గురించి కాదు ఇక్కడ చెప్పబడింది. ఇక్కడ చెప్పబడింది ఉపవాసాలుండి, నమాజ్‌చేస్తూ, దానధర్మాలు చేసే వారి గురించి. ఈ సత్కార్యాలు చేశాక వారు అవి అల్లాహ్ సమక్షంలో రద్దు గావించబడతాయేమోనని భయపడుతూ వుంటారు అని అన్నారు.

ప్రియ సోదరులారా!

కొంతమంది రమజాన్ మాసంలోనయితే బాగానే ఆరాధిస్తారు. ఐదు పూటల నమాజులను క్రమం తప్పకుండా నెలకొల్పుతారు. ఖుర్ఆన్ పారాయణం చేస్తారు, అల్లాహ్ స్మరణతో తమ పెదవులను తడిగా వుంచుతారు, దుఆలు చేస్తారు, దాన ధర్మాలలో అధికంగా పాలుపంచుకుంటారు.

కానీ, రమజాన్ మాసం వెళ్ళగానే ఈ సత్కార్యాల్లో ఎన్నింటినో త్యజిస్తారు. చివరికి ఐదు పూటల నమాజ్ విషయంలో కూడా అశ్రద్ధను, సోమరితనాన్ని కనబరుస్తారు. కానీ, ఈ వ్యవహార సరళి సరైనది కాదు. ఎందుకంటే, రమజాన్ మాసానికి ప్రభువైన అల్లాహ్యే షవ్వాల్ మరియు ఇతర మాసాలకు కూడా ప్రభువు.

రమజాన్ మాసంలో మనం ఏ అల్లాహ్‌ను ఆరాధిస్తామో, ఆ అల్లాహ్యే మనకు మరణం వచ్చే వరకూ ఆయనను ఆరాధిస్తూ వుండమని ఆజ్ఞాపించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"నీ ప్రభువు పవిత్రతను కొనియాడు. ఆయన్ను స్తుతిస్తూ వుండు. సాష్టాంగ పడేవారిలో చేరిపో. నిశ్చయమైనది (అనగా మరణం) వచ్చే వరకూ నీ ప్రభువును ఆరాధిస్తూ వుండు".** ***(హిజ్ర్: 98,99)***

ఈ ఆయత్‌లలో సంబోధించబడింది దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అయినప్పటికీ ఈ ఆజ్ఞ ఆయన అనుచర సమాజానికి కూడా వర్తిస్తుంది. అందుకే ముస్లిం సమాజమంతా అల్లాహ్ ఆరాధనలో స్థిరంగా వుంటూ రమజాన్ మాసం గడిచిపోయిన తర్వాత కూడా దాని నుండి ముఖం త్రిప్పుకోకూడదు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు, క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ చేసే ఆచరణ అంటేనే ఇష్టం.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్‌కు – ధర్మంలో క్రమం తప్పకుండా ఎల్లప్పుడూ పాటించే ఆచరణ అంటేనే ఇష్టం". *(బుఖారీ: 43, ముస్లిం: 785)*

సౌబాన్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం (సల్లల్లాహు అలైహి

వసల్లం) ఇలా సెలవిచ్చారు: "మీరు (ఆచరణలలో) నిలకడను పాటించండి. మీరు ఎంత ప్రయత్నించినా దాని శక్తి కలిగి వుండలేరు. మీ శ్రేష్టమైన ఆచరణ నమాజ్ చదవడం అని గట్టిగా నమ్మండి. ఎల్లప్పుడూ వుజూతో వుండేవాడే నిజమైన విశ్వాసి". *(ఇబ్నె మాజ: 277, సహీహ్ – అల్‌బానీ)*

తౌహీద్ మరియు సదాచరణలపై స్థిరంగా వుండే వారికి శుభవార్తలు తెలుపుతూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ الَّذِينَ قَالُوا رَبُّنَا اللَّهُ ثُمَّ اسْتَقَامُوا تَتَنَزَّلُ عَلَيْهِمُ الْمَلَٰئِكَةُ أَلَّا تَخَافُوا وَلَا تَحْزَنُوا
وَأَبْشِرُوا بِالْجَنَّةِ الَّتِي كُنتُمْ تُوعَدُونَ ۝ نَحْنُ أَوْلِيَاؤُكُمْ فِي الْحَيَوٰةِ الدُّنْيَا وَفِي الْآخِرَةِ ۖ وَلَكُمْ
فِيهَا مَا تَشْتَهِي أَنفُسُكُمْ وَلَكُمْ فِيهَا مَا تَدَّعُونَ ۝ نُزُلًا مِّنْ غَفُورٍ رَّحِيمٍ ۝

**"మా ప్రభువు అల్లాహ్ మాత్రమే అని పలికి, దానిపై స్థిరంగా వున్న వారి వద్దకు దైవదూతలు దిగి వచ్చి (ఇలా అంటూ వుంటారు) – మీరు భయపడకండి, దు:ఖించకండి. మీకు వాగ్దానం చేయబడిన స్వర్గలోకపు శుభవార్తను అందుకోండి. ప్రాపంచిక జీవితంలో కూడా మేము మీ నేస్తాలుగా వుంటూ వచ్చాము. పరలోకంలో కూడా ఉంటాము. మీ మనసు కోరినదల్లా, మీరు అడగినదల్లా అందులో మీకు లభిస్తుంది. క్షమాశీలి, దయాశీలి (అయిన అల్లాహ్) తరఫున లభించే ఆతిథ్యమిది".**
***(హామీమ్ అస్సజ్‌దహ్: 30–32)***

అందుకే తౌహీద్ మరియు సదాచరణల విషయంలో స్థిరంగా వుంటూ నిలకడను ప్రదర్శించాలి. దానితో పాటు ఇలా ప్రార్థిస్తూ కూడా వుండాలి:

رَبَّنَا لَا تُزِغْ قُلُوبَنَا بَعْدَ إِذْ هَدَيْتَنَا وَهَبْ لَنَا مِن لَّدُنكَ رَحْمَةً ۚ إِنَّكَ أَنتَ الْوَهَّابُ ۝

**"మా ప్రభూ! సన్మార్గ భాగ్యం ప్రసాదించిన తరువాత మా హృదయాలలో వక్రతను రానీయకు. నీ వద్ద నుంచి మాకు కారుణ్యాన్ని ప్రసాదించు. నిశ్చయంగా నీవే గొప్పదాతవు".** ***(ఆలి ఇమ్రాన్: 8)***

అలాగే ఈ దుఆ కూడా చేస్తూ వుండాలి: "ఓ హృదయాలను త్రిప్పేవాడా! నా హృదయాన్ని నీ ధర్మంపై నిలకడగా వుంచు". ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ దుఆను ఎక్కువగా చేసేవారు.

ఉమ్మె సలమా (రజి అల్లాహు అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నా దగ్గర వున్నప్పుడు ఎక్కువగా ఈ దుఆను చేసేవారు. నేనొకసారి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో – ఓ దైవప్రవక్తా! మీరు ఈ దుఆ ను ఎక్కువగా చదువుతూ వుంటారు. కారణం ఏమిటి? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ– ఓ ఉమ్మె సలమా! మనిషి హృదయం అల్లాహ్ యొక్క రెండు వ్రేళ్ళ మధ్య వుంది. ఇక ఎవరిని సన్మార్గంలో వుంచాలో, ఎవరిని మార్గభ్రష్టులుగా చేయాలో ఆయన ఇష్టం అని వివరించారు.

ప్రియ సోదరులారా!

సత్కార్యాల్లో నిలకడ అంటే – రమజాన్ మాసంలో ఎలాగైతే మీరు ఫర్జ్ ఆచరణలతో పాటు నఫిల్ ఆచరణలలో ఒకరినొకరు మించిపోవడానికి ప్రయత్నం చేసేవారో, అలాగే మిగతా మాసాల్లో కూడా వాటిని త్యజించకుండా చేస్తూ వుండాలి.

ఇలా, ఫర్జ్ ఆచరణలలో మొట్టమొదటిది రేయింబవళ్ళలోని ఐదు పూటల నమాజ్. వీటిని ఏమాత్రం అశ్రద్ధ చేయకుండా, ఎల్లప్పుడూ క్రమం తప్పకుండా 5 పూటలు, మస్జిద్‌లో సామూహికంగా చేస్తూ వుండాలి. ఎందుకంటే ప్రళయం రోజు ఆచరణలలో అన్నిటికన్నా ముందుగా లెక్కతీసుకోబడేది నమాజు గురించే.

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ప్రళయం రోజు అన్నింటికన్నా ముందుగా, దాసుని నమాజ్ గురించి లెక్క తీసుకోబడుతుంది. ఒకవేళ నమాజ్ సరిగా తేలితే, మిగతా ఆచరణలన్నీ సరిగా తేలుతాయి. ఒకవేళ నమాజ్ సరిగా తేలకపోతే మిగతా ఆచరణలు కూడా సరిగా తేలవు".

మరో ఉల్లేఖనంలో ఇలా సెలవిచ్చారు: "అతని నమాజ్ చూడబడుతుంది. అది గనక సరిగావుంటే అతను సఫలీకృతుడవుతాడు. ఒకవేళ అది సరిగా లేకపోతే అతను అవమాన పరచబడి నష్టపోతాడు".

*(తబ్రానీ– ఔసత్, అస్సహీహా: 1358)*

ఫర్జ్ నమాజులతో పాటు, రమజాన్ మాసంలో ఏ విధంగానైతే నఫిల్ నమాజులను చదివేవారో వాటిని కూడా పాటిస్తూ వుండాలి. ప్రత్యేకించి ఫర్జ్ నమాజ్‌కు ముందు మరియు తర్వాతి సున్నతులు, చాష్త్ నమాజు. అలాగే రమజాన్ మాసంలో తరావీహ్ రూపంలో చదివే రాత్రి నమాజు. దీనిని కూడా త్యజించకుండా పాటిస్తూ వుండాలి. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ నమాజు ప్రయోజనాలను వివరిస్తూ ఇలా సెలవిచ్చారు: “మీరు రాత్రి నమాజును (ఖియాం) తప్పకుండా చేస్తూ వుండండి. ఎందుకంటే, ఇది మీకు ముందు గతించిన సజ్జనుల పద్ధతి. రాత్రి ఖియాం అల్లాహ్‌కు దగ్గరగా చేరుస్తుంది. పాపాలను తుడిచేస్తుంది, చెడు కార్యాల నుంచి ఆపుతుంది, శారీరక వ్యాధులను నిరోధిస్తుంది”.

*(అహ్మద్, తిర్మిజీ, సహీహ్ ఉల్ జామె లిల్ అల్‌బానీ: 4079)*

రమజాన్ మాసంలో ఎలాగైతే ఫర్జ్ ఉపవాసాలు పాటించారో అలాగే రమజాన్ తర్వాత నఫిల్ ఉపవాసాలు పాటించండి. ఎందుకంటే ప్రళయం రోజు ఫర్జ్ ఆచరణలలో ఏదైనా కొరత ఏర్పడితే దానిని నఫిల్ ఆచరణలద్వారా పూర్తి చేయడం జరుగుతుంది. ఇక నఫిల్ ఉపవాసాల్లో ప్రత్యేకించి షవ్వాల్ మాసపు ఆరు ఉపవాసాలు వున్నాయి. వీటి గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: “ఏ వ్యక్తి అయినా రమజాన్ మాసపు ఉపవాసాలుండి, తదుపరి షవ్వాల్ మాసంలో గనక 6 రోజులు ఉపవాసం వుంటే అతను సంవత్సరమంతా ఉపవాసం ఉన్నట్లే”. *(ముస్లిం: 1164)*

రమజాన్ మాసపు ఉపవాసాలు మరియు షవ్వాల్ మాసపు ఆరు ఉప వాసాలను కలిపి పూర్తి సం॥పు ఉపవాసాలుగా ఎందుకు ఖరారు చేయబడిం దంటే– ఒక పుణ్యం అల్లాహ్ వద్ద పది పుణ్యాలకు సమానం. ఇలా రమజాన్ మాసపు ఉపవాసాలు 10 నెలల ఉపవాసాలకు సమానం. అలాగే షవ్వాల్ మాసపు 6 రోజుల ఉపవాసం, 60 రోజులు (2 నెలలు) ఉపవాసానికి సమానం. వీటితో పాటు, వారంలోని ప్రతి సోమవారం మరియు గురువారాల్లో ఉపవాసముండడం కూడా సున్నత్. దాని మహత్యం గురించి కూడా వివరించబడింది. దీనితో పాటు ప్రతి నెలా, ‘అయ్యామె బీజ్’ (13, 14, 15

వ రోజులు) లలో కూడా ఉపవాసముండడం ఉత్తమం. ఈ రోజుల్లో ఉపవాసం ఉండడం గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబూ హురైరా (రజి అల్లాహు అన్హు)కు ప్రత్యేకించి వసీయతు చేసి వున్నారు.

రమజాన్ మాసంలో ఎలాగైతే ఖుర్ఆన్ పారాయణం చేసేవారో అదే విధంగా మిగతా రోజుల్లో కూడా దానిని వదలిపెట్టకుండా కొనసాగించాలి. ఒక విషయం గుర్తుంచుకోండి!

ఖుర్ఆన్ పారాయణం, దానిపై ఆలోచించడం, దాని ప్రకారం ఆచరణ – వీటిని వదలిపెట్టే వారికి వ్యతిరేకంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రళయం రోజు ఫిర్యాదు చేస్తూ ఇలా సెలవిస్తారు:

وَقَالَ الرَّسُولُ يَٰرَبِّ إِنَّ قَوْمِى ٱتَّخَذُوا۟ هَٰذَا ٱلْقُرْءَانَ مَهْجُورًا ○

**"అప్పుడు దైవ ప్రవక్త, నా ప్రభూ! నిశ్చయంగా నా జాతి వారు ఈ ఖుర్ఆన్‌ను వదిలిపెట్టారు అని పలుకుతాడు". *(ఫుర్ఖాన్: 30)***

అందుకే ఆ దినపు అవమానం నుండి తప్పించుకోవాలంటే, ఖుర్ఆన్ ను మన జీవనశైలిగా మార్చుకొని, దాని పారాయణం చేస్తూ, దాని గురించి ఆలోచిస్తూ దాని ప్రకారం ఎల్లప్పుడూ ఆచరిస్తూ వుండాలి.

ఇస్లామీయ సోదరులారా!

కొంతమంది రమజాన్ మాసం గడిచాక, ఆరాధనలను త్యజించడంతో పాటు రమజాన్ కు ముందు వారు చేస్తూ వున్న చెడు కార్యాలను మళ్ళీ చేయడం మొదలు పెడతారు. ఇది కూడా ఎంతో అపాయకరమైన విషయం. అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు:

فَٱسْتَقِمْ كَمَآ أُمِرْتَ وَمَن تَابَ مَعَكَ وَلَا تَطْغَوْا۟ ۚ إِنَّهُۥ بِمَا تَعْمَلُونَ بَصِيرٌ ○

**"(ఓ ముహమ్మద్!) నీకు ఆజ్ఞాపించబడినట్లుగా నువ్వు, నీతోపాటు (పశ్చాత్తాప భావంతో) మరలివచ్చిన వారూ గట్టిగా (స్థిరంగా) నిలబడి ఉండండి. హద్దు మీరకండి. నిస్సందేహంగా అల్లాహ్ మీ కర్మలన్నింటినీ చూస్తున్నాడు". *(హూద్: 112)***

ఈ ఆయత్‌లో అల్లాహ్ – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు

మరియు ఆయనతో పాటు పశ్చాత్తాపం చెందిన విశ్వాసులకు అల్లాహ్ ధర్మంపై స్థిరంగా వుండమని ఆజ్ఞాపించాడు. తదుపరి విశ్వాసులకు, ధర్మంపై స్థిరంగా వుండకుండా ముఖం త్రిప్పుకొని, అల్లాహ్ అవిధేయతకు ఒడిగడుతూ తలబిరుసులుగా మారిపోవడాన్ని గట్టిగా వారించాడు. అంతేగాక, వారిని– అల్లాహ్ మిమ్మల్ని చూడటం లేదని అనుకోకండి, పైగా అతను మీ ప్రతి కదలి కనూ, కర్మలన్నింటినీ చూస్తున్నాడు – అని హెచ్చరించాడు.

ప్రియ సోదరులారా!

రమజాన్ మాసం తర్వాత చెడు కార్యాల వైపునకు తిరిగి మరలడం – రమజాన్ మాసంలో మీరు ఎన్నో సార్లు అల్లాహ్‌తో చేసిన వాగ్దానానికి విరుద్ధం. రమజాన్ మాసంలో మీరు మాటిమాటికి అల్లాహ్ వైపునకు తిరుగుతూ ఆయనతో – మళ్ళీ మేము చెడు కార్యాల వైపునకు మరలమని గట్టిగా వాగ్దానం చేస్తున్నాం. నీ ఆదేశాలకనుగుణంగా ఆచరిస్తూ అవిధేయతకు దూరంగా వుంటాం అని వేడుకున్నారు.

అందుకే, అల్లాహ్‌తో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చండి! మరియు సన్మార్గంపై స్థిరంగా వుండండి!

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**وَاَوْفُوْا بِعَهْدِ اللّٰهِ اِذَا عٰهَدْتُّمْ وَلَا تَنْقُضُوا الْاَيْمَانَ بَعْدَ تَوْكِيْدِهَا وَقَدْ جَعَلْتُمُ اللّٰهَ عَلَيْكُمْ كَفِيْلًا ؕ اِنَّ اللّٰهَ يَعْلَمُ مَا تَفْعَلُوْنَ ﴿91﴾**

**"మీరు పరస్పరం ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు అల్లాహ్‌కు ఇచ్చిన మాటను నిలుపుకోండి. ప్రమాణాలను ఖరారు చేసుకున్న మీదట భంగ పరచకండి. (ఎందుకంటే) మీరు అల్లాహ్‌ను మీ సాక్షిగా చేసుకున్నారు. నిశ్చయంగా మీరు చేసేదంతా ఆయనకు తెలుసు". *(నహ్ల్: 91)***

బాగా గుర్తుంచుకోండి!

సత్కార్యాల తర్వాత చెడు వైపునకు మరలడం, తదుపరి మనస్ఫూర్తిగా పశ్చాత్తాప పడకపోవడం–తమ సత్కార్యాలను చేజేతులా వ్యర్థం చేసున్నట్లే. మరి తమ కష్టాన్ని తానే నీరు గార్చి, తన శ్రమను తానే మట్టిలో కలిపే వ్యక్తి బుద్ధిమంతుడు (తెలివైనవాడు) కాలేడు.

అందుకే అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلَا تَكُونُوا كَالَّتِي نَقَضَتْ غَزْلَهَا مِنۢ بَعْدِ قُوَّةٍ أَنكَٰثًا

**"తన నూలును గట్టిగా వడికిన తర్వాత, తనే స్వయంగా ముక్కలు ముక్కలుగా త్రెంచి వేసిన స్త్రీ మాదిరిగా అయిపోకండి". *(నహ్ల్: 92)***

అంటే ఒక స్త్రీ రాత్రంతా కష్టపడి నూలు వడికింది, తదుపరి తనే తన చేతులతో దానిని ముక్కలు ముక్కలుగా త్రెంచేసింది. ఆమెనెవరైనా తెలివైనదని అంటారా?

అందరూ ఆమెను మూర్ఖురాలు అనే అంటారు.

అందుకే అల్లాహ్ తన దాసులను – ఆ స్త్రీ లాగా మారి, చెడు కార్యాలలోకి దిగి తమ పుణ్యాలను తన చేతులతోనే వృథా చేసుకోవడాన్ని గట్టిగా వారించాడు.

అల్లాహ్ మనందరినీ చెడు కార్యాల నుండి దూరంగా వుండే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

# పండుగ రోజుల్లో వినోదం

పండుగ రోజుల్లో వినోదం సరైనదే. కానీ షరతు ఏమిటంటే, దీనిలో షరీయత్తుకు విరుద్ధంగా ఏ కార్యం జరగకూడదు. అందుకే, ముస్లిములందరూ ఈ తరుణంలో తమ ఇంటి వారిని, బంధువులను, మిత్రులను కలిసి షరీయత్తు హద్దులకు లోబడి అనందం వ్యక్తం చేయాలి.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం:

అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) నా దగ్గరికి విచ్చేశారు. ఆ సమయంలో అన్సారీ యువతులలోని ఇద్దరు యువతులు 'బుఆస్' దినం నాడు అన్సారీలు చదివిన కవితలు పాడుతున్నారు.వాస్తవానికి వారు పాటలు పాడే వాళ్ళు కారు. కానీ ఆ రోజు పండుగ రోజు.

అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇంట్లోనే షైతాను మాట మారుమ్రోగుతుందా? అని అడిగారు. దానిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ –'ఓ అబూ బక్ర్! ప్రతి జాతికి ఒక పండుగ వుంటుంది. మరి ఈ రోజు మన పండుగ' అని అన్నారు.

*(బుఖారీ: 454, ముస్లిం: 892)*

సహీహ్ ముస్లింలోని మరో ఉల్లేఖనంలో, ఆయెషా (రజి అల్లాహు అన్హా) ఇలా వివరించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'మినా'లో వున్న రోజుల్లో అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) ఆయన వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఇద్దరు యువతులు డప్పు వాయిస్తూ పాడుతున్నారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దుప్పటి కొప్పుకొని నడుంవాల్చి వున్నారు. అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) (ఆ యువతులను) కోపగించుకున్నారు. దీనితో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ముఖాన్ని దుప్పటి నుంచి బయటకు తీసి–ఓ అబూ బక్ర్! వారిని వదలిపెట్టండి (అంటే పాడుకోనివ్వండి), ఎందుకంటే ఈ రోజులు పండుగ రోజులు' అని హితవు పలికారు.

అలాగే, ఆయెషా (రజి అల్లాహు అన్హా) ఇలా వివరించారు: పండుగరోజు కొందరు నల్లజాతీయులు మస్జిద్‌కు వచ్చారు మరియు (యుద్ధానికి ఉపయోగించే) ఆయుధాలతో ఆటను ప్రదర్శించసాగారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నా కుటీరం యొక్క ద్వారం వద్ద కొచ్చి స్వయంగా దీనిని

వీక్షిస్తూ నన్ను కూడా పిలిచారు. నేను రాగానే ఆయన తన దుప్పటిని ద్వారానికి అడ్డుగా పెట్టారు. తద్వారా నేను పరదాలో వుంటూ వారి ఆటను వీక్షించవచ్చు అని.

ఇలా నేను ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) భుజంపై నా తలపెట్టి వారి ఆటను వీక్షించాను. తదుపరి నేను అలసిపోవడం చూసి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాతో–ఇక చాలా? అని అడిగారు. నేను– అవును అని అన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – సరే, నువ్వు లోపలికి వెళ్ళిపో అని అన్నారు. *(బుఖారీ: 454, ముస్లిం: 892)*

ఈ హదీసుల ద్వారా తెలిసిందేమిటంటే, పండుగ రోజుల్లో వినోదం ధర్మసమ్మతమే. కానీ వినోదం పేరుతో సంగీతం, పాటలు వినడం, టీవీలలో సినిమా హాళ్ళలో సినిమాలు, నాటకాలు చూడడం మాత్రం సరైనది కాదు.

ఎందుకంటే పాటలు మరియు సంగీతం వాయిద్యాలు అన్నీ నిషేధం. ఖాళీ సమయాన్ని ఇలాంటి విషయాల్లో గడపడం మహా పాపం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**وَمِنَ النَّاسِ مَن يَشْتَرِي لَهْوَ الْحَدِيثِ لِيُضِلَّ عَن سَبِيلِ اللَّهِ بِغَيْرِ عِلْمٍ وَيَتَّخِذَهَا هُزُوًا ۚ أُولَٰئِكَ لَهُمْ عَذَابٌ مُّهِينٌ ⑥ وَإِذَا تُتْلَىٰ عَلَيْهِ آيَاتُنَا وَلَّىٰ مُسْتَكْبِرًا كَأَن لَّمْ يَسْمَعْهَا كَأَنَّ فِي أُذُنَيْهِ وَقْرًا ۖ فَبَشِّرْهُ بِعَذَابٍ أَلِيمٍ ⑦**

**"జ్ఞానంతో నిమిత్తం లేకుండానే ప్రజలను అల్లాహ్ మార్గం నుంచి తప్పించడానికి, దాన్ని వేళాకోళం చేయడానికి మనసును వశీకరించే విషయాలను కొనుగోలు చేసేవాడు కూడా మనుషుల్లో వున్నాడు. పరాభవం పాలు చేసే శిక్ష వున్నది ఇలాంటి వారి కోసమే. వాడి ముందు మా వాక్యాలను చదివి వినిపించినప్పుడు వాడు అహంకారంతో, తాను వాటిని అసలు వినే లేదన్నట్లుగా, తన రెండు చెవులలోనూ చెవుడు వున్నట్లుగా ముఖం త్రిప్పుకుని పోతాడు. కాబట్టి నువ్వు వాడికి వ్యధాభరితమైన శిక్ష యొక్క శుభవార్తను వినిపించు".**

***(లుఖ్మాన్: 6,7)***

ఈ ఆయత్‌లో 'లహ్‌వల్ హదీస్' అంటే పాటలు మరియు సంగీతం అని అర్థం. ఎంతోమంది సహాబాలు దీని అర్థాన్ని ఇలాగే వివరించారు. అబ్దుల్లా బిన్ మస్‌వూద్ (రజి అల్లాహు అన్హు) అయితే ప్రమాణం చేసి మరీ 'లహ్‌వల్ హదీస్' అంటే 'పాటలు' అని అర్థం అని అన్నారు.

ఇక ఎవరైనా, పాటలు వింటూ, వినిపిస్తూ, సంగీత నాట్య కార్యక్రమాలలో పాలుపంచుకుంటాడో లేదా ఇంట్లో కూర్చుని ఈ కార్యక్రమాలను వీక్షిస్తుంటాడో అలాంటి వ్యక్తికి ఈ ఆయత్‌లో వివరించినట్లు వ్యథాభరితమైన శిక్ష వుంది. వల్ ఇయాజ్ బిల్లాహ్!

అలాగే, అబూ మాలిక్ అష్‌అరీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నా అనుచర సమాజంలోని కొందరు తప్పకుండా మద్యపానం చేస్తారు. మద్యం పేరును మార్చుకుంటారు. వారి తలల వద్ద సంగీత వాయిద్యాలు వాయించబడతాయి, పాటలు పాడే యువతులు పాడుతూ వుంటారు. అల్లాహ్ వారిని భూమిలోకి దిగత్రొక్కుతాడు మరియు వీరిలో ఎంతో మందిని కోతులుగానూ, పందులు గానూ చేసేస్తాడు". *(ఇబ్నెమాజ : 4020, సహీహ్ – అల్‌బానీ)*

ఈ హదీసులో, నాట్యం మరియు ఇతర కార్యక్రమాలలో పాలుపంచుకునే వారికి లేదా వీటిని టీవీ, కంప్యూటర్లలో వీక్షించే వారికి స్పష్టమైన హెచ్చరిక వుంది.

అబూ ఆమిర్ లేదా అబూ మాలిక్ అష్‌అరీ(రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా నా ఉమ్మత్ (అనుచర సమాజం)లో – వ్యభిచారం, సిల్కు వస్త్రాలు, మద్యం మరియు సంగీతాన్ని హలాల్ (ధర్మసమ్మతం) అని భావించేవారు వస్తారు". *(బుఖారీ: 5590)*

ఈ హదీసులో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) – ఈ నాలుగు విషయాలను హలాల్ చేసుకొనే వారు వస్తారని భవిష్యవాణి చేశారు. వాస్తవానికి ఈ నాలుగు విషయాలు ఇస్లామ్‌లో హరామ్ (నిషేధం).

ఈ రోజుల్లో వీటిని హలాల్‌గా చేసుకున్న వారు ఎంతో మంది వున్నారు.

ఇక పాటల విషయానికొస్తే, దీనిని పాపకార్యమని అనుకోకపోవడమే కాకుండా, నేటి సోకాల్డ్ నాగరికులు దీని ధర్మయుక్తత (హలాల్)పై ఫత్వాలు (ధార్మికతీర్పులు) కూడా జారీ చేసేస్తారు. ఏ ఆధారమూ లేకుండా కేవలం మనుష్యుల అభిరుచులు మరియు తమ కోరికలను పూర్తి చేయడానికి వారిలా చేస్తారు.

అంతేకాక, దీని కోసం వీరు– కొందరు విద్యావంతుల బలహీన ప్రవచనాలను ఆసరాగా తీసుకుని, ఇబ్నెమాజ్ ను గ్రుడ్డిగా అనుసరిస్తూ సహీహ్ బుఖారీ లోని ఈ హదీసును బలహీనమైనదని నిరూపించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు.

మరి చూడబోతే, పాటలు మరియు నాట్యం హరాం అన్న విషయంలో ఇమాములందరూ ఏకాభిప్రాయం కలిగి వున్నారు.

వీటి నిషేధం గురించి మేము వివరించిన ఆధారాలు ఒక బుద్ధిమంతునికి సరిపోతాయి. వీటితో పాటు మరో ఆధారం మీ ముందు వుంచుతాను. దీని ప్రకారం డోలు వగైరాలు నిషేధించబడ్డాయి అని స్పష్టంగా తెలుస్తుంది.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా అల్లాహ్ మీపై మద్యం, జూదం, డోలును నిషేధం చేశాడు మరియు ఆయన ఇలా కూడా సెలవిచ్చారు– మత్తు కలిగించే ప్రతి వస్తువూ హరామ్".

*(అబూ దావూద్: 3696, సహీహ్ – అల్‌బానీ)*

ఈ స్పష్టమైన ఆధారాలతో, ఎవరి మనసులోనూ ఏ విధమైన అనుమానం ఇక మిగిలి వుండకూడదు. అందరూ పాటలు మరియు సంగీతం హరామ్ (నిషేధం) అని గట్టిగా నమ్మాలి.

కానీ దురదృష్టవశాత్తూ నేడు ఆ సోకాల్డ్ నాగరికుల ఫత్వాలను ఆధారంగా చేసుకొని సంగీతాన్ని కొందరు మనస్సును సంతృప్తి పరిచే, ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకొనే సాధనంగా భావిస్తున్నారు. మరి చూడబోతే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)– సంగీత వాయిద్యాలు వ్యాపించినప్పుడు, పాటలు సర్వసాధారణమై పోయినప్పుడు, మద్యపానాన్ని హలాల్‌గా భావించినప్పుడు

అల్లాహ్ యొక్క వ్యధాభరితమైన శిక్ష అవతరిస్తుందని భవిష్యవాణి చేసి వున్నారు.

సహల్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ప్రళయానికి ముందు ఆఖరి కాలంలో జనాలను భూమిలోకి దిగత్రొక్క బడ వేయడం జరుగుతుంది. వారిపై రాళ్ళవర్షం కురిపించబడుతుంది, వారి స్వరూపాలు మార్చివేయబడతాయి".

'ఇలా ఎప్పుడు జరుగుతుంది?' అని ఆయనతో అడగబడింది.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – "సంగీత వాయిద్యాలు వ్యాపించబడినప్పుడు, పాటలు పాడే యువతులు సర్వసాధారణమైపోయినప్పుడు, మద్యాన్ని హలాల్‌గా భావించినప్పుడు" అని అన్నారు.

*(సహీఉల్ జామె లిల్ అల్‌బానీ: 3665)*

ఇస్లామీయ సోదరులారా!

పాటలూ, వాయిద్యం – ఇవి ఎలా సరైనవి కాగలగుతాయి?

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వీటిని శపించబడ్డ విషయాలుగా ఖరారు చేశారు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "రెండు శబ్దాలు ఇహలోకంలోనూ, పర లోకంలోనూ శపించబడ్డాయి. సంతోషపడే సమయంలో పాటల శబ్దం మరియు దు:ఖ సమయంలో (గొంతు చించుకొని) ఏడిచే శబ్దం".

*(సహీహ్ ఉల్ జామె లిల్ అల్‌బానీ : 3695)*

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) ప్రకారం –పాట కపటత్వాన్ని కలిగిస్తుంది.

'నీరు పంటను మొలకెత్తించినట్లే, పాట కపటత్వాన్ని మొలకెత్తిస్తుంది'.

చెప్పొచ్చే సారాంశం ఏమిటంటే, పండుగ రోజుల్లో తప్పకుండా ఆనందాన్ని వ్యక్తం చేయండి. కానీ మేము వివరించిన ఆధారాలను దృష్టిలో వుంచుకొని పాటలు, సంగీతం వంటి విషయాలకు దూరంగా వుండడం ఎంతైనా అవసరం.

# పండుగ రోజుల్లో చేయబడే కొన్ని చెడు కార్యాలు

పండుగ దినాలలో ప్రత్యేకించి కొన్ని చెడులు కానవస్తాయి. వాటి గురించి కూడా వివరించడం ఎంతైనా అవసరం. ఆ చెడు కార్యాలలో కొన్ని ఇవి:

## 1) వస్త్రాలను చీలమండ క్రింది వరకు వ్రేలాడదీయడం, గర్వం, గొప్ప తనాన్ని ప్రదర్శించడం.

పండుగ రోజుల్లో ఎంతో మంది ధరించే వస్త్రాలు చీలమండ క్రింది వరకు వ్రేలాడుతూ వుంటాయి. మరి చూడబోతే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) దీని గురించి ఇలా సెలవిచ్చారు: "మూడు రకాల వ్యక్తులతో అల్లాహ్ ప్రళయం నాడు ఏ మాత్రం సంభాషించడు, వారి వైపు కన్నెత్తి కూడా చూడడు, వారిని పరిశుద్ధ పరచడు. వారి కోసం వ్యధాభరితమైన శిక్ష వుంటుంది".

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ మాటను మూడుసార్లు పలికారు. అబూజర్ (రజి అల్లాహు అన్హు) – నిశ్చయంగా వారు పరాభవం పాలు చేయబడి, ఎంతగానో నష్టపోతారు. ఓ దైవప్రవక్తా! వాళ్ళుఎవరు? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – తన లుంగీ / ప్యాంట్‌ని క్రిందికి వ్రేలాడదీసేవాడు, సహాయం చేసి దెప్పిపొడిచేవాడు, అసత్య ప్రమాణం చేసి (సరుకులు) అమ్మేవాడు అని అన్నారు. *(ముస్లిం: 106)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం: ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "చీలమండ క్రింద వుండే వస్త్రం నరకాగ్నిలో వుంటుంది". *(బుఖారీ: 5787)*

ఈ రెండు హదీసుల ద్వారా తెలిసిందేమిటంటే – వస్త్రాలను చీలమండ క్రిందికి వ్రేలాడ దీయడం హరామ్ మరియు మహా పాపం.

అందుకే ఏ వస్త్రమైనా చీలమండ క్రిందికి వ్రేలాడదీయబడి వుంటే – అది షల్వార్ దైనా, దుప్పటి అయినా, పైజామాదైనా, ప్యాంటుదైనా (లుంగీదైనా), దానిని చీలమండ పై వరకే వుండాలి. దీనితోపాటు గర్వం కూడా కలిగి వుంటే అలాంటప్పుడు ఇది మరింత పెద్ద పాపకార్యం అవుతుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "ఒక వ్యక్తి తన లుంగీని (క్రింది వరకు వ్రేలాడ దీసి) ఈడ్చుతున్నాడు. అల్లాహ్ అతన్ని భూమిలోకి దిగ్రతొక్కాడు. ఇలా అతను ప్రళయం వరకు భూ గర్భంలోకి పోతూనే వుంటాడు". *(బుఖారీ: 5790)*

మరో ఉల్లేఖనంలో ఈ హదీసు పదాలు ఇలా వున్నాయి: "ఒక వ్యక్తి తన పొడుగాటి వెంట్రుకలను దువ్వుకొని, అందమైన వస్త్రాలు ధరించి, నిక్కుతూ వెళుతూ గర్వాతిశయానికి లోనై వున్నాడు. ఈ తరుణంలోనే అకస్మాత్తుగా అల్లాహ్ అతన్ని భూమిలోకి దిగ్రతొక్కాడు. ఇలా అతను ప్రళయం వరకు భూ గర్భంలోకి పోతూనే వుంటాడు". *(బుఖారీ: 5789, ముస్లిం: 2088)*

మరి చూడబోతే, అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**وَلَا تُصَعِّرْ خَدَّكَ لِلنَّاسِ وَلَا تَمْشِ فِي الْأَرْضِ مَرَحًا ۖ إِنَّ اللَّهَ لَا يُحِبُّ كُلَّ مُخْتَالٍ فَخُورٍ ﴿18﴾**

**"జనుల ముందు (గర్వంతో) మొహం త్రిప్పుకొని మాట్లాడకు. భూమిపై నిక్కుతూ నడవకు. ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్ డాబులు చెప్పుకునే గర్విష్టిని ఇష్టపడడు". *(లుఖ్మాన్: 18)***

'గర్వం' ఎంత పెద్ద అపరాధమంటే, ఒకవేళ ఎవరి మనసులోనైనా ఆవగింజంత గర్వం వున్నా అతను గనక తౌబా చేయకుండా మరణిస్తే స్వర్గంలోకి ప్రవేశించలేడు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"హృదయంలో ఆవగింజంత గర్వం వున్నా, ఆ వ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించ లేడు".

దీనిపై ఓ వ్యక్తి– ఓ దైవప్రవక్తా! నిశ్చయంగా ఒక వ్యక్తి తన బట్టలు, బూట్లు అందంగా వుండాలని కోరుకుంటాడు. (మరి ఇది కూడా గర్వానికి సూచనేనా?) అని అడిగాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – నిశ్చయంగా అల్లాహ్ సౌందర్యవంతుడు, సౌందర్యాన్ని ఇష్టపడతాడు. (వాస్తవానికి) గర్వం అంటే – సత్యాన్ని త్రోసిపుచ్చడం మరియు ఇతరులను అల్పులుగా భావించడం అని వివరించారు. *(ముస్లిం: 91)*

అందుకే, పండుగ దినాల ఆనందోత్సాహంలో డాబులు, గర్వం మిళితం కాకూడదు. పైగా, ప్రజలతో చిరునవ్వుతో, వినయవిధేయతలతో కలవాలి మరియు ఇంటివారితో, బంధువులతో, మిత్రులతో మన ప్రేమను, ఆనందాన్ని పంచుకోవాలి.

## 2) గడ్డం గొరికించుకోవడం లేదా దానిని చిన్నదిగా చేసుకోవడం.

ఎంతోమంది సాధారణంగా గడ్డాన్ని గొరికించుకోవడమో లేదా దానిని చిన్నదిగా కత్తిరించుకోవడమో చేస్తుంటారు. పండుగ రోజుల్లో అయితే దీనిని ప్రత్యేకించి చేస్తూ వుంటారు.

కానీ వాస్తవానికి ఇలా చేయడం హరామ్.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "మీరు ముష్రిక్కులను (బహుదైరాధకులు) వ్యతిరేకిస్తూ వుండండి, గడ్డాలను పెంచండి. మరియు మీసాన్ని కత్తిరించండి". *(బుఖారీ: 5892, 5893, ముస్లిం: 259)*

మరో ఉల్లేఖనంలో ఇలా సెలవిచ్చారు: "మీరు మీసాన్ని కత్తిరించండి, గడ్డాన్ని పొడిగించండి, అగ్ని పూజారులను వ్యతిరేకించండి". *(ముస్లిం: 260)*

కానీ, నేడు చాలా మంది ముస్లిములు, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)గారి ఈ ఆదేశాలకు పూర్తి విరుద్ధంగా మీసాలను పెద్దవిగా చేసి గడ్డాన్ని పూర్తిగా గొరికించుకోవడమో లేదా చిన్నగా కత్తిరించు కోవడమో చేస్తున్నారు.

ఇలా వారు ముష్రిక్కులకు, అగ్ని పూజారులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి వాళ్ళను వ్యతిరేకించమని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞాపించి వున్నారు.

## 3) పరాయి స్త్రీలతో కరచాలనం చేయడం.

ఎంతో మంది, ప్రత్యేకించి పండుగ రోజుల్లో ఇతరుల ఇళ్ళకు వెళ్లినప్పుడు అక్కడ పరాయి స్త్రీ తో కరచాలనం చేస్తూ శుభాకాంక్షలు తెలుపుతారు. మరి చూడబోతే, మన ధర్మం అపరిచిత (పరాయి) స్త్రీలతో కరచాలనం చేయడానికి అనుమతించదు.

మాఖిల్ బిన్ యసార్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త

(సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మీతో ఏ వ్యక్తికైనా అతని తలపై ఇనుప సూదితో కొడుతూ వుంటే – ఇది అతనికి– తనకు ధర్మ సమ్మతం కాని స్త్రీని ముట్టుకోవడం కన్నా మేలైనది". *(అస్సహీహా : 226)*

అందుకే, మన ప్రియప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) స్త్రీలతో 'బైత్' (ప్రమాణం) తీసుకున్నప్పుడు కేవలం నోటితో తీసుకున్నారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ స్త్రీ తోనూ కరచాలనం చేయలేదు. *(ముస్లిం: 1866)*

**4) పరాయి స్త్రీలతో ఏకాంతంలో సంభాషించడం.**

ప్రత్యేకించి, పండుగ రోజుల్లో ఎంతో మంది పరాయి స్త్రీలతో ఏకాంతంలో సంభాషిస్తూ వుంటారు. కానీ, మన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) దీనిని వారించి వున్నారు.

ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "మీరు (పరాయి) స్త్రీల వద్దకు వెళ్ళడం నుండి దూరంగా వుండండి".

దీనిపై ఒక అన్సారీ – ఓ దైవ ప్రవక్తా! మరి మీరు భర్త సోదరుని (మరిది) వద్దకు వెళ్ళడం గురించి ఏమంటారు? అని అడిగాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – మరిది అయితే మృత్యువు (లాంటివాడు) అని వివరించారు. *(బుఖారీ: 5232, ముస్లిం: 2083)*

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:"మీలో ఏ వ్యక్తి కూడా ఇతర స్త్రీ తో ఏకాంతంలో సంభాషించకండి. ఒకవేళ ఆమెతో పాటు ఎవరైనా 'మహ్రమ్' వుంటే అది వేరే విషయం. అలాగే ఏ స్త్రీ అయినా 'మహ్రమ్' లేకుండా ప్రయాణం చేయకూడదు". *(బుఖారీ: 2862, ముస్లిం: 1341)*

**5) స్త్రీలు పరదా (బురఖా) లేకుండా తిరగడం.**

ప్రత్యేకించి పండుగ రోజుల్లో ఎంతో మంది స్త్రీలు పరదా లేకుండా బయటికొస్తారు. అందంగా సింగారించుకొని బజార్లలో, మార్కెట్లలో, పార్కులలో వస్తూ పోతూ ఎంతో మందిని పరీక్షకు గురి చేస్తారు.

మరి చూడబోతే, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీని నుండి గట్టిగా వారించారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**"మీరు మీ ఇండ్లల్లోనే ఆగి వుండండి. పూర్వపు అజ్ఞానకాలంలో మాదిరిగా మీ సింగారాన్ని చూపిస్తూ తిరగకండి".** ***(అహ్జాబ్: 33)***

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "స్త్రీ– సతర్ (దాచిపెట్టే వస్తువు)లాంటిది. అందుకే ఆమె ఇంటి నుండి బయలుదేరినప్పుడు షైతాను ఆమెను కనిపెడుతూ వుంటాడు. ఆమె తన ఇంట్లో వున్నప్పుడు అల్లాహ్ కారుణ్యానికి అత్యంత సమీపంలో వుంటుంది".

*(ఇబ్నె హిబ్బాన్: 5599, తిర్మిజి: 1773, మిష్కాత్: 3109)*

పరదా పాటించకుండా, పలుచటి వస్త్రాలు ధరించి ఇండ్ల నుండి బయటి కొచ్చే స్త్రీలను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – వారు స్వర్గంలో ప్రవేశించలేరు అని గట్టిగా హెచ్చరించారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"రెండు రకాల నరకవాసులను నేను చూడలేదు. అందులో ఒకరు ఎవరంటే ఆవుల తోకల్లాంటి కొరడాలతో ప్రజలను గెదిమేవారు. ఇక రెండవ వారు ఎవరంటే, వస్త్రాలు ధరించినప్పటికీ నగ్నంగా కనబడే స్త్రీలు. ప్రజల మనస్సులను తమ వైపుకు ఆకర్షింపజేస్తూ గర్వంతో నిక్కుతూ నడుస్తారు. వారి శిరస్సులు ఒంటెల మూపురము లాగా ఒక వైపునకు వంగి వుంటాయి. ఇలాంటి స్త్రీలు స్వర్గంలోకి ప్రవేశించలేరు. స్వర్గపు సువాసన సైతం పొందలేరు. వాస్తవానికి స్వర్గపు సువాసన చాలా దూరం నుండి వస్తూ వుంటుంది".

*(ముస్లిం: 2128)*

అలాగే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా కూడా సెలవిచ్చారు: "ఏ స్త్రీ అయినా తన సువాసనను అనుభవింప చేయాలన్న ఉద్దేశ్యంతో కొందరి దగ్గరి నుంచి వెళితే, అలాంటి స్త్రీ అశ్లీల (చెడు నడత గల) స్త్రీ."

## 6) బంధువులు, బీదవారి హక్కులను దృష్టిలో వుంచుకోవడం.

పండుగ రోజుల్లో ఎంతో మంది బాగా తింటారు. అందమైన వస్త్రాలు ధరిస్తారు మరియు తమ సంతోషాన్ని వ్యక్తం కూడా చేస్తారు. కానీ తమ బంధువులనూ, బీదవారినీ మరిచిపోతారు. కానీ ఇస్లాం మనకు – మన సంతోషాలలో బంధువులనూ, బీదవారిని కూడా చేర్చడాన్ని ప్రోత్సహిస్తుంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "మీరు మీ కోసం ఇష్టపడేదే, మీ సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకు (పరిపూర్ణ) విశ్వాసులు కాలేరు". *(బుఖారీ: 13, ముస్లిం: 45)*

బంధుత్వాన్ని నెరవేర్చటం గురించి అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా తన ఉపాధిలో వృద్ధి మరియు దాని అంతం (మరణం)లో ఆలస్యం కావాలనుకుంటే, అతను బంధుత్వాన్ని నెరవేర్చాలి".
*(బుఖారీ: 5986, ముస్లిం: 2557)*

బంధుత్వాన్ని నెరవేర్చటం గురించి చాలా మంది ఏమనుకుంటారంటే, ఒకవేళ వారి బంధువులు దానిని నెరవేర్చితే తాము కూడా దానిని నెరవేర్చాలి. కానీ, ఈ దృక్పథం సరైనది కాదు.

బంధుత్వాన్ని నెరవేర్చటం యొక్క సరైన దృక్పథం ఏమిటంటే, ఒకవేళ బంధువు, బంధుత్వాన్ని నెరవేర్చకపోయినా తను మాత్రం దానిని నెరవేర్చాలి. ఒకవేళ వారు చెడుగా ప్రవర్తిస్తే, వారితో మంచిగా ప్రవర్తించాలి. ఒకవేళ వారు ఇవ్వకపోయినా వారికి ఇస్తూ వుండాలి. ఒక్కమాటలో చెప్పాలంటే, బంధువు, బంధుత్వాన్ని నెరవేర్చినా, నెరవేర్చకపోయినా, రెండు పరిస్థితుల్లోనూ మనిషి తన శాయశక్తులా తన బంధువుతో బంధుత్వాన్ని నెరవేరుస్తూ వుండాలి.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "బంధుత్వాన్ని నెరవేర్చేవాడంటే ఒకరు నెరవేర్చిన దానికి బదులుగా నెరవేర్చేవాడు కాదు. పైగా బంధుత్వాన్ని నెరవేర్చే వాడంటే – ఒకరు నెరవేర్చకపోయినా తను మాత్రం బంధుత్వాన్ని నెరవేర్చుతూ వుండేవాడు". *(బుఖారీ: 5991)*

అందుకే, పండుగ సంతోషాలలో బంధువులను, బీద వారిని కూడా చేర్చుతూ వుండాలి.

ఇస్లామీయ సోదరులారా!

ఆఖరుగా మీకు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఒక సున్నత్‌ను గుర్తుకు తెప్పిస్తాం. అదేమిటంటే, పండుగ నమాజు అనంతరం దారిని మార్చి తిరిగి వెళ్ళడం.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం:

"దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ రోజు (నమాజ్ కోసం) బయటి కొచ్చినప్పుడు ఒక దారిలో వెళ్ళేవారు, తదుపరి (నమాజు అనంతరం) వేరే దారిలో తిరిగి వచ్చేవారు". *(తిర్మిజి : 541, సహీహ్ – అల్‌బానీ)*

అందుకే, ఏ దారిలోనైతే వచ్చారో ఆ దారిలో కాకుండా వేరేదారిలో తిరిగి వెళ్ళండి మరియు పండుగ సంతోషాలలో ఒకరినొకరు చేర్చండి. కలిసినప్పుడు ఒకరినొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుతూ 'తఖబ్బలల్లాహు మిన్నా వ మిన్క' అన్న పదాలతో ఆరాధనల స్వీకరణకు గాను ఒకరినొకరు దుఆలు చేసుకోండి. సహాబాలు కూడా ఇలాగే చేసేవారు.

జుబైర్ బిన్ నఫీర్ కథనం:

"దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాలు పండుగ రోజు కలిసినప్పుడు, ఒకరినొకరు ఇలా అనేవారు – తఖబ్బలల్లాహు మ మిన్నా వ మిన్క (అల్లాహ్ మీవి మరియు మావి (సదాచరణలను) స్వీకరించుగాక)!"

అల్లాహ్ మనందరి ఆరాధనలను స్వీకరించుగాక! మరియు వాటిని, మన కోసం పరలోకపు నిల్వగా చేయుగాక! ఆమీన్!!

# జిల్ ఖాదా మాసపు ఖుత్బాలు

1) హరమైన్ షరీఫైన్  మహత్యాలు

2) హజ్ ఆచారాలు, మర్యాదలు - 1

3) హజ్ ఆచారాలు, మర్యాదలు - 2

# హరమైన్ షరీఫైన్ మహాత్యాలు

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

- మక్కా ముకర్రమ మహాత్యాలు
- మదీనా మునవ్వర మహాత్యాలు

## మొదటి ఖుత్బా

ఇస్లామీయ సోదరులారా!

ఎందరో అదృష్టవంతులు ఈ రోజుల్లో బైతుల్లాహ్ హజ్ (అల్లాహ్ గృహం సందర్శన) యాత్రను పురస్కరించుకొని బిజీగా వున్నారు. అల్లాహ్ వారందరికీ మరియు మనందరికీ ఆమోదయోగ్యమయ్యే హజ్‌ను అనుగ్రహించుగాక! మరియు మాటిమాటికి (పలుసార్లు) హరమైన్ షరీఫైన్ (మక్కా, మదీనాల) సందర్శన అవకాశాన్ని కలిగించుగాక! ఆమీన్!!

నేటి ఖుత్బాలో ఇన్షా అల్లాహ్ మేము హరమైన్ షరీఫైన్‌ల కొన్ని మహాత్యాలు వివరిస్తాం. కాగా, రాబోయే శుక్రవారం ఖుత్బాలో హజ్ విధిత్వము, దాని మహాత్యాలు, విశేషాలను క్షుణ్ణంగా వివరిస్తాం.

అన్నిటి కన్నా ముందుగా మేము పవిత్ర మక్కా పట్టణ మహాత్యాలను గురించి వివరిస్తాం. ఎందుకంటే, హజ్ యాత్రలోని ఆచారాలన్నీ మక్కా ముకర్రమ లోనే ఆచరించబడతాయి. పవిత్ర మక్కా పట్టణం యావత్ భూభాగంలో అన్నిటికన్నా శ్రేష్ఠమైన పట్టణం. ఈ పట్టణమే అల్లాహ్‌కు అన్నిటికన్నా ప్రియ మైనది. అందుకే అల్లాహ్, అందరికన్నా శ్రేష్ఠమైన తన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను ఈ పట్టణంలోనే పుట్టించాడు మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)కు ఇక్కడే దైవదౌత్యాన్ని అనుగ్రహించాడు.

అల్లాహ్ ఈ పట్టణం ప్రాధాన్యత, మహాత్యాన్ని దృష్టిలో వుంచుకొని దీని పేరుతో ప్రమాణం చేశాడు.

وَهٰذَا الْبَلَدِ الْاَمِيْنِ ﴿3﴾

**"శాంతియుతమైన ఈ నగరం (మక్కా) సాక్షిగా!". *(తీన్:3)***

لَآ اُقْسِمُ بِهٰذَا الْبَلَدِ ﴿1﴾

**"ఈ నగరం (మక్కా) తోడుగా (నేను చెబుతున్నాను)!". *(బలద్:1)***

అబ్దుల్లా బిన్ అదీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఆయన, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను 'అల్ హజ్వర' అనే ప్రదేశంలో నిలబడి (మక్కా పట్టణాన్ని సంబోధిస్తూ) ఇలా సెలవీయడం చూశారు– 'అల్లాహ్ సాక్షి! నువ్వు అల్లాహ్ యొక్క శ్రేష్ఠమైన మరియు ఆయనకు అత్యంత ప్రియమైన భూభాగానివి. ఒకవేళ నన్ను నీ నుండి బయటికి తీసి వుండకపోతే, నేను ఎప్పుడూ నిన్ను వదిలే వాణ్ణి కాను'. *(తిర్మిజి: 3925, సహీహ్ –అల్‌బానీ)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పవిత్ర మక్కా పట్టణాన్ని సంబోధిస్తూ ఇలా సెలవిచ్చారు: "నువ్వు ఎంత చక్కటి పట్టణానివి మరియు నాకెంత ప్రియమైన దానివి! ఒకవేళ నా జాతి గనక, నిన్ను వదిలి పెట్టడానికి నన్ను బలవంత పెట్టి వుండకపోతే, నేను నీ వద్ద తప్ప మరే భూభాగంలోనూ ప్రశాంతత పోందేవాణ్ణి కాదు". *(తిర్మిజి: 3926, సహీహ్ –అల్‌బానీ)*

## ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) ప్రార్థన

పవిత్ర మక్కా పట్టణం గురించి ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) చేసిన ప్రార్థన (దుఆ)ను అల్లాహ్ ఖుర్‌ఆన్ లో ఇలా వివరించాడు:

وَاِذْ قَالَ اِبْرٰهِيْمُ رَبِّ اجْعَلْ هٰذَا الْبَلَدَ اٰمِنًا وَّاجْنُبْنِيْ وَبَنِيَّ اَنْ نَّعْبُدَ الْاَصْنَامَ ﴿35﴾ رَبِّ اِنَّهُنَّ
اَضْلَلْنَ كَثِيْرًا مِّنَ النَّاسِ ۚ فَمَنْ تَبِعَنِيْ فَاِنَّهٗ مِنِّيْ ۚ وَمَنْ عَصَانِيْ فَاِنَّكَ غَفُوْرٌ رَّحِيْمٌ ﴿36﴾ رَبَّنَآ
اِنِّيْٓ اَسْكَنْتُ مِنْ ذُرِّيَّتِيْ بِوَادٍ غَيْرِ ذِيْ زَرْعٍ عِنْدَ بَيْتِكَ الْمُحَرَّمِ ۙ رَبَّنَا لِيُقِيْمُوا الصَّلٰوةَ فَاجْعَلْ اَفْـِٕدَةً
مِّنَ النَّاسِ تَهْوِيْٓ اِلَيْهِمْ وَارْزُقْهُمْ مِّنَ الثَّمَرٰتِ لَعَلَّهُمْ يَشْكُرُوْنَ ﴿37﴾

**"ఇబ్రాహీమ్ ఇలా వేడుకున్నాడు: నా ప్రభూ! ఈ నగరాన్ని శాంతిభద్రతల**

**నగరంగా చేయి. నన్నూ, నా సంతానాన్నీ విగ్రహ పూజ నుంచి కాపాడు. నా ప్రభూ! అవి ఎంతో మందిని పెడదారి పట్టించాయి. కనుక నన్ను అనుసరించిన వాడే నా వాడు. కానీ ఎవరైనా నాకు అవిధేయత చూపితే నువ్వు అమితంగా క్షమించేవాడవు, కనికరించేవాడవు. మా ప్రభూ! నా సంతానంలో కొందరిని పంటలు పండని కటిక లోయలో, నీ పవిత్ర గృహం వద్ద వసింపజేశాను. మా ప్రభూ! వారు నమాజును నెలకొల్పేందుకు (ఇక్కడ వదలిపెట్టాను) కనుక ప్రజలలో కొందరి మనసులు వారివైపు మొగ్గేలా చేయి. వారికి తినటానికి పండ్లు, ఫలాలను ప్రసాదించు- వారు కృతజ్ఞులుగా మెలిగేందుకు". *(ఇబ్రాహీమ్: 35-37)***

ఈ ఆయత్‌లో అల్లాహ్, ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) - మక్కా నగరాన్ని శాంతి భద్రతల నగరంగా చేయమని ప్రార్థించారని తెలియజేశాడు.

దానికి కారణం ఏమిటంటే, శాంతి వున్నప్పుడే, ప్రశాంతంగా అల్లాహ్‌ను ఆరాధించడం సాధ్యమవుతుంది. ఒకవేళ శాంతి లేకుండా ఎల్లప్పుడూ భయాందోళనలు, అరాచక పరిస్థితులు నెలకొని వుంటే ఆరాధనలో ఏకాగ్రత లోపిస్తుంది.

తదుపరి, ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) దుఆ చేస్తూ సెలవిచ్చిందేమిటంటే, ఆయన సంతానంలో కొందరిని వృక్ష, జల వనరులు లేని ఎడారి లోయలో వసింపజేశారు. తద్వారా వారు నమాజు నెలకొల్పవచ్చుని- కనుక ఓ అల్లాహ్ ప్రజలలో కొందరి మనసులను వారి వైపునకు మొగ్గేలా చేయి. బహుశా ఈ దుఆ ఫలితమే కావచ్చు, దాదాపు ప్రతి ముస్లిం హృదయంలో ఈ పట్టణం గురించి ప్రేమ వుంది మరియు ప్రతి ముస్లిం మాటిమాటికీ దీనిని సందర్శించ డానికి ఇష్టపడుతుంటాడు. ఇక్కడ మీకు సహీహ్ బుఖారీలోని ఒక సుదీర్ఘ హదీసును వివరించడం ఉచితమని పిస్తోంది. దానిలో ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) తన సంతానంలో కొందరిని మక్కా ముకర్రమ ఎలా తెచ్చి వసింపజేశారు అన్న దాని గురించి వివరంగా ఉల్లేఖించబడింది. మరైతే ఆ హదీసును వినండి!

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం :

"స్త్రీలలో మొదటి సారిగా వడ్డాణం ఉపయోగించినవారు హాజిరా. తద్వారా సారా కు ఆమె గురించి తెలియకుండా ఉండటానికి. ఇబ్రాహీమ్

(అలైహిస్సలాం) హాజిరా ను, ఆమె కొడుకు ఇస్మాయీల్ (అలైహిస్సలాం)ను అక్కడి నుండి తీసుకెళ్ళారు. ఆ సమయంలో హాజిరా, ఇస్మాయీల్ (అలైహిస్సలాం) కు పాలుపడుతుండేవారు. ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) వారిద్దరినీ బైతుల్లాహ్ దగ్గర ఎత్తైన స్థలం వద్ద నేడు జమ్‌జమ్ నీళ్ళు వున్న చోట, ఒక పెద్ద వృక్షం క్రింద కూర్చో బెట్టారు. ఆ సమయంలో అక్కడ ఒక్క మనిషి కూడా లేదు, నీటి సౌకర్యం కూడా లేదు. ఆయన వారికి ఖర్జూరాలు కలిగిన ఒక సంచి మరియు నీళ్ళు కలిగిన ఒక తోలు సంచి ఇచ్చి వెళ్ళసాగారు. హాజిరా ఆయన వెనుకనే వస్తూ ఇలా అడిగారు: ఓ ఇబ్రాహీమ్! మమ్మల్ని ఏ మాత్రం జన సంచారం లేని, నీటి సౌకర్యం లేని లోయలో విడిచి వెళుతున్నారు? హాజిరా పలు సార్లు ఇలా అడిగారు, కానీ ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) కనీసం వెనక్కి తిరిగి కూడా చూడలేదు.

దీనితో ఆమె, మీకిలా చెయ్యమని అల్లాహ్ ఆజ్ఞాపించాడా? అని అడిగారు.

ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) జవాబిస్తూ 'అవును' అని అన్నారు.

ఆమె – అలాగా! (అయితే వెళ్ళండి), అల్లాహ్ మమ్మల్ని వృధా చేయడు అని చెప్పి తిరిగి వచ్చేసారు. ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) అక్కణ్ణుంచి బయలుదేరి ఒక ఇసుక దిబ్బ పైకి చేరుకున్నారు. అక్కడి నుండి ఆయన వారిని చూడలేరు. తదుపరి, ఆయన బైతుల్లాహ్ వైపు తిరిగి తన చేతులెత్తి ఇలా ప్రార్థించారు: "మా ప్రభూ! నా సంతానంలో కొందరిని పంటలు పండని కటిక లోయలో, నీ పవిత్ర గృహం వద్ద వసింపజేశాను...."

ఇటు హాజిరా, ఇస్మాయీల్ (అలైహిస్సలాం)కు పాటు పట్టి నీళ్ళు త్రాగిస్తూ వున్నారు. చివరికి ఆ నీళ్ళు అయిపోయాయి. దీనితో ఇద్దరూ దాహార్తులై పోయారు. పిల్లవాడు దాహంతో కొట్టుమిట్టాడడం ఆమె గమనించారు. పిల్లవాడి పరిస్థితి చూసి ఆమె చలించిపోయారు. చుట్టూ ఆమె దృష్టి సారించారు. సఫా కొండ ఆమెకు దగ్గరగా కనిపించింది. దీనితో ఆమె దాని పైకి ఎక్కి తదుపరి లోయలోకి దిగారు, తద్వారా జన సంచారం ఏదైనా కనబడుతుందేమో అని అటూ ఇటూ చూశారు. కానీ ఆమెకు ఎవరూ కనిపించలేదు. ఆమె సఫా కొండ నుండి దిగి లోయలోకి వచ్చేశారు. తన వస్త్రాన్ని కాస్త పైకి లేపి కష్టాల్లో

ఉన్న వ్యక్తి లాగా పరుగెత్తుతూ లోయను దాటి మర్వా కొండ పైకి వచ్చేశారు. తదుపరి దానిపై నిలబడి, జన సంచారం ఏమైనా కనబడుతుందేమో అని అటూ ఇటూ చూశారు. కానీ ఆమెకు అక్కడ కూడా ఎవరూ కనిపించలేదు. ఈ స్థితిలోనే ఆమె సఫా, మర్వాల మధ్య ఏడు సార్లు ప్రదక్షిణ చేశారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "అప్పటి నుంచే ప్రజలు సఫా, మర్వాల తవాఫ్ (ప్రదక్షిణ) ప్రారంభించారు".

ఆమె ఏడవ సారి పరుగెత్తుతూ, మర్వాపైకి ఎక్కినప్పుడు ఒక శబ్దాన్ని విన్నారు. ఆమె తన మనసులో – నిశ్శబ్దంగా వుండి ముందు ఆ మాటలు వినాలనుకొని మనసును అటువైపు కేంద్రీకరించారు. తదుపరి ఆమె – మేము నీ మాటలు విన్నాం, మాకు నీవేమైనా సహాయం చేయగలవా? అని అడిగారు. ఆ సమయంలో ఆమె జమ్‌జమ్ ఉన్న స్థానంలో ఒక దైవదూతను చూసారు. అతను తన కాలితో లేదా తన రెక్కతో భూమిని త్రవ్వగా దాని నుండి నీళ్ళు బయటకి వచ్చాయి. హాజిరా ఆ నీటిని నియంత్రించే ఉద్దేశ్యంతో చేతులతో అడ్డుకట్ట వేసి, తన వద్దనున్న తోలు సంచిని నీళ్ళతో నింపుకున్నారు. ఆమె చేతులలో నీళ్ళు నింపి బయటకు తీయగానే నీళ్ళు మరింత వేగంగా భూమి నుండి బయటికొచ్చేవి.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్, ఇస్మాయీల్ తల్లిపై కరుణించుగాక! ఆమె ఒకవేళ జమ్‌జమ్‌ను యధావిధిగా వదిలిపెట్టి వుంటే (లేదా ఇలా సెలవిచ్చారు) తన చేతులతో దానిని మాటిమాటికి తీసి వుండక పోతే జమ్‌జమ్ ఒక ప్రవహించే కాలువ లాగా వుండేది.

తదుపరి హాజిరా ఆ నీళ్ళు త్రాగారు మరియు పిల్లవాడికి పాలు పట్టారు. దైవదూత ఆమెతో – మీరు భయపడకండి, ఇక్కడ అల్లాహ్ గృహం వుంది. ఈ పిల్లవాడు మరియు ఇతని తండ్రి దానిని నిర్మిస్తారు. ప్రస్తుతం కాబా గృహం వున్న స్థలం ఆ సమయంలో నేల నుండి కొంత ఎత్తుగా వున్నది. వర్షపు నీరు దాని ఇరు ప్రక్కల నుండి ప్రవహించేది.

కొంత కాలం గడిచాక 'జుర్‌హుమ్' తెగవారు లేదా వారి కుటుంబీకులు (కదా అనబడే) మార్గం ద్వారా ప్రయాణిస్తూ అక్కడి నుండి వెళుతూ మక్కా

లోయలో బస చేశారు. అక్కడ ఒక పక్షి ఎగురుతూ వుండడం చూసి – ఈ పక్షి (సాధారణంగా) నీళ్ళున్న స్థలంలోనే తిరుగుతూ వుంటుంది. కానీ మనకీ ప్రదేశం గురించి బాగా తెలుసు, ఈ ప్రదేశంలో నీరు ఎక్కడా లభించదు అనుకొని ఎక్కడైనా నీరు లభిస్తుందేమో చూసి రమ్మని ఒక వ్యక్తిని పంపించారు. అతను నీళ్ళున్న ఆ స్థలాన్ని కనుక్కొని తిరిగి వెళ్ళి తన తెగ వారికి తెలియజేశాడు. దీనితో వారంతా అక్కడికి చేరుకున్నారు. హాజిరా నీళ్ళ వద్దే కూర్చుని వున్నారు. వాళ్ళు ఆమెను, మేమిక్కడ బస చేయడానికి మీరు అనుమతిస్తారా? అని అడిగారు. ఆమె –సరే, కాని ఈ నీటిపై మీకు ఏ విధమైన అధికారం ఉండదు అని జవాబిచ్చారు. వాళ్ళు సరే, మంచిది అని అన్నారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: ఇస్మాయీల్ (అలైహిస్సలాం) తల్లి కూడా మనషులు అక్కడ స్థిరపడాలనే కోరుకునేవారు. ఇలా వారంతా అక్కడ స్థిరపడ్డారు మరియు తమ కుటుంబీకులను కూడా పిలిపించుకున్నారు. దీనితో అక్కడ ఎన్నో ఇళ్ళు వెలిసాయి (నిర్మించబడ్డాయి). ఇటు ఇస్మాయీల్ (అలైహిస్సలాం) కూడా యౌవన దశకు చేరుకుని, వారి నుండే అరబీ భాషను నేర్చుకుని వాళ్ళ దృష్టిలో ఒక మంచి యువకుడిగా పేరు తెచ్చుకున్నారు. వాళ్ళు ఆయనను ప్రేమిస్తూ తమ కుటుంబంలోని ఒక యువతినిచ్చి ఆయనతో వివాహం జరిపించారు. ఆ తర్వాత ఆయన తల్లి (హాజిరా) మరణించారు.

ఒకసారి, ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) తన భార్యను, కుమారుణ్ణి చూడడానికి వచ్చారు. ఆ సమయంలో ఇస్మాయీల్ (అలైహిస్సలాం) ఇంట్లో లేరు. ఆయన, అతని భార్యతో అతని గురించి అడగ్గా ఆమె – ఉపాధి అన్వేషణలో బయటికి వెళ్ళారు అని అంది.

ఆయన – జీవితం ఎలా గడుస్తోంది? అని అడిగారు.

ఆమె – ఎంతో కష్టంగా గడుస్తోంది అని చెప్పి, కష్టాల గురించి ఆయనకు ఫిర్యాదు చేసింది.

ఆయన – నీ భర్త తిరగి వచ్చాక, నా సలాములు అతనికి అందజేయి మరియు తన ఇంటి గుమ్మాన్ని మార్చుకోమని చెప్పు అని చెప్పి వెళ్ళిపోయారు.

ఇస్మాయీల్ (అలైహిస్సలాం) తిరిగొచ్చి, తన ఇంటికి అతిథిగా ఎవరో వచ్చి వెళ్ళారని గ్రహించి, భార్యతో, ఇంటికెవరైనా వచ్చారా? అని అడిగారు. ఆమె – అవునండి, ఒక ముసలివాడు వచ్చి వెళ్ళాడు. మీ గురించి అడగ్గా, నేను అతనికి వివరించాను. తదుపరి ఆయన, జీవితం ఎలా గడుస్తుందని అడిగారు. అతి కష్టంగా గడుస్తోందని నేను చెప్పాను.

ఇస్మాయీల్ (అలైహిస్సలాం) – ఇంకేమైనా చెప్పారా అని అడిగారు.

ఆమె – మీకు సలాం చెప్పి, ఇంటి గుమ్మం మార్చుకోమని చెప్పారు అని అన్నారు.

ఇస్మాయీల్ (అలైహిస్సలాం) –ఆయన మా తండ్రి గారు. ఆయన నన్ను, నిన్ను వదులుకోమని ఆజ్ఞాపించారు. కనుక, నువ్వు మీ ఇంటి వారి వద్దకు వెళ్ళిపో అని అన్నారు.

తదుపరి ఆయన, ఆమెకు విడాకులిచ్చి వేరే యువతిని వివాహం చేసుకున్నారు.

ఆ తర్వాత, అల్లాహ్ తలచినంత కాలం ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) తన దేశంలోనే వుండిపోయారు. తదుపరి ఆయన మరోసారి ఇక్కడికి (మక్కా) రాగా, ఇస్మాయీల్ (అలైహిస్సలాం) అప్పుడు ఇంట్లో లేరు. ఆయన, అతని భార్యతో ఇస్మాయీల్ (అలైహిస్సలాం) గురించి ఆడిగారు.

ఆమె – జీవినోపాధి నిమిత్తం బయటకు వెళ్ళారు అని అన్నారు.

ఆయన – జీవితం ఎలా గడుస్తోంది, ఎలా వున్నారు అని అడిగారు.

ఆమె – అల్లాహ్ దయ వల్ల చాలా బాగా గడుస్తోంది అనిన్నారు.

ఆయన – ఏం తింటున్నారు అని అడిగారు.

ఆమె – మాంసం అన్నారు.

ఆయన – ఏం త్రాగుతున్నారు అని అడిగారు.

ఆమె – నీళ్ళు అని అన్నారు.

ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) ఇలా దుఆ చేశారు: ఓ అల్లాహ్! వీరి మాంసంలో, నీటిలో శుభాన్ని ప్రసాదించు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: ఆ రోజుల్లో మక్కాలో ఆహార ధాన్యాలు దొరికేవి

కావు. ఒకవేళ దొరికితే, ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) వాటిలో కూడా శుభాన్ని ప్రసాదించమని ప్రార్థించేవారు.

ఇక మక్కా తప్ప ఇతర ప్రదేశాల వారు కేవలం ఈ రెండు వస్తువులనే ఆహారంగా ఉపయోగిస్తే (ఆరోగ్య మరియు స్వభావ పరంగా) అవి వారికి సరిపోవు.

ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) (తన కోడలితో) ఇలా అన్నారు: నీ భర్త వచ్చాక నా సలాములు అతనికి అందజేయి మరియు ఇంటి గుమ్మం బాగుంది. దీనిని కాపాడుకోమని చెప్పు.

ఇస్మాయీల్ (అలైహిస్సలాం) వచ్చాక భార్యతో, ఈ రోజు ఇంటికెవరైనా వచ్చారా? అని అడిగారు. ఆమె – అవునండి, సంతోషంగా కనబడే ఒక ముసలివారు వచ్చారు. చాలా మంచి వ్యక్తి ఆయన. మీ గురించి అడగ్గా నేను చెప్పేసాను. ఇంకా మీ జీవితం ఎలా గడుస్తోందని అడిగారు. నేను, చాలా బాగా గడుస్తోందని చెప్పాను.

ఇస్మాయీల్ (అలైహిస్సలాం) ఇంకా ఏమైనా చెప్పారా? అని అడిగారు. ఆమె – అవునండి, మీకు సలామ్ చెప్పమన్నారు మరియు ఇంటి గుమ్మం చాలా బాగుంది, దీనిని కాపాడుకోమని చెప్పారు.

ఇస్మాయీల్ (అలైహిస్సలాం) – ఆయన మా నాన్న గారు, ఆయన నాకు, నిన్ను నా వద్దే వుంచుకోమని ఆజ్ఞాపించారు అని అన్నారు.

అల్లాహ్ తలచినంత కాలం గడిచాక ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) మళ్ళీ (మక్కా) విచ్చేశారు. ఆ సమయంలో ఇస్మాయీల్ (అలైహిస్సలాం) జమ్‌జమ్ వద్ద ఒక చెట్టు క్రింద కూర్చొని తన బాణాలను సరి చేసుకుంటున్నారు.

తన తండ్రిని చూసి ఎంతగానో సంతోషిస్తూ నిలబడ్డారు మరియు తండ్రీ కొడుకు లిద్దరూ గాఢంగా ఆలింగనం చేసుకున్నారు.

తదుపరి, ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) – ఓ ఇస్మాయీల్! అల్లాహ్ నాకు ఆజ్ఞాపించాడు. ఆ పనికి నువ్వు నాకు సహాయం చేస్తావా? అని అడిగారు. ఆయన, తప్పకుండా చేస్తాను అని అన్నారు.

ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) ఒక ఎత్తైన స్థలాన్ని చూపిస్తూ, ఇక్కడ ఒక గృహాన్ని నిర్మించమని అల్లాహ్ నాకు ఆజ్ఞాపించాడు అని అన్నారు.

ఇస్మాయీల్ (అలైహిస్సలాం) రాళ్ళు తీసుకొచ్చేవారు మరియు ఇబ్రాహీం (అలైహిస్సలాం) నిర్మాణం చేస్తూ వున్నారు. గోడలు ఎత్తుగా నిర్మించబడ్డాక, ఇస్మాయీల్ (అలైహిస్సలాం) ఒక రాయి (మఖామె ఇబ్రాహీమ్)ని తీసుకొచ్చి అక్కడ పెట్టారు. ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) ఆ రాయిపై ఎక్కి నిర్మాణం చేసేవారు మరియు ఇస్మాయీల్ (అలైహిస్సలాం) రాళ్ళు ఇస్తూ వుండేవారు. ఇద్దరూ ఇలా ప్రార్థించేవారు: 'మా ప్రభూ! మా సేవను స్వీకరించు. నీవు మాత్రమే సర్వం వినేవాడవు. సర్వం తెలిసిన వాడవు'(బఖర: 127).

*(బుఖారీ: 3364 క్లుప్తంగా)*

ఈ సుదీర్ఘ హదీసులో తెలియజేయబడినదేమిటంటే, ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) తన సంతానంలో కొందరిని మక్కా ముకర్రమ కు తీసుకొచ్చి బస చేయించారు. దీనితో పాటు తెలిసిన మరో విషయమేమిటంటే, ఆయన తన పుత్ర రత్నంతో కలసి కాబా గృహాన్ని నిర్మించారు. దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**وَيَسْتَفْتُونَكَ فِي النِّسَاءِ ۖ قُلِ اللَّهُ يُفْتِيكُمْ فِيهِنَّ وَمَا يُتْلَىٰ عَلَيْكُمْ فِي الْكِتَابِ فِي يَتَامَى النِّسَاءِ**
**اللَّاتِي لَا تُؤْتُونَهُنَّ مَا كُتِبَ لَهُنَّ وَتَرْغَبُونَ أَنْ تَنْكِحُوهُنَّ وَالْمُسْتَضْعَفِينَ مِنَ الْوِلْدَانِ وَأَنْ**
**تَقُومُوا لِلْيَتَامَىٰ بِالْقِسْطِ ۚ وَمَا تَفْعَلُوا مِنْ خَيْرٍ فَإِنَّ اللَّهَ كَانَ بِهِ عَلِيمًا ﴿127﴾**

**"ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం), ఇస్మాయీల్ (అలైహిస్సలాం) – ఇద్దరూ (కాబా) గృహ పునాదులను, గోడలనూ లేపుతూ ఇలా ప్రార్థించేవారు: మా ప్రభూ! మా సేవను స్వీకరించు. నీవు సర్వం వినేవాడవు, సర్వం తెలిసిన వాడవు". *(బఖర: 127)***

దీని ద్వారా తెలిసిందేమిటంటే, కాబా గృహాన్ని మొట్ట మొదటగా ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) మరియు ఇస్మాయీల్ (అలైహిస్సలాం)లు నిర్మించారు.

కొంత మంది విశ్లేషకులు అనేదేమిటంటే, దీనిని మొదటి సారి ఆదమ్

(అలైహిస్సలాం) నిర్మించారు. మరి కొంత మంది దీనిని మొదటి సారి దైవదూతలు నిర్మించగా, ఆదమ్ (అలైహిస్సలాం) దానిపై గోపురాన్ని నిర్మించారని, ఆ సమయంలో దైవదూతలు ఆయనతో, మేము మీ కన్నా ముందు ఈ గృహం తవాఫ్ చేసాము అని చెప్పారని.... పేర్కొన్నారు.

మరి కొంత మంది వివరించిందేమిటంటే, నూహ్ (అలైహిస్సలాం) పడవ కూడా 40 రోజుల వరకు దీని తవాఫ్ చేసింది.

కానీ, హాఫిజ్ ఇబ్నె కసీర్ రహిమహుల్లాహ్ ఇలా పేర్కొన్నారు: ఈ విషయాలన్నీ బనీ ఇస్రాయీల్ ద్వారా ఉల్లేఖించబడ్డాయి. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా–కాబా గృహం, ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం)కు ముందు కూడా వుండేది అని నిరూపించడానికి ఒక్క ప్రామాణిక ఉల్లేఖనం కూడా దొరకదు. *(ఖససుల్ అంబియా, ఇబ్నె కసీర్ : 157వ పేజీ)*

## కాబా గృహం అల్లాహ్ యొక్క మొదటి గృహం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**إِنَّ أَوَّلَ بَيْتٍ وُضِعَ لِلنَّاسِ لَلَّذِي بِبَكَّةَ مُبَارَكًا وَهُدًى لِّلْعَالَمِينَ (96) فِيهِ آيَاتٌ بَيِّنَاتٌ مَّقَامُ إِبْرَاهِيمَ ۖ وَمَن دَخَلَهُ كَانَ آمِنًا ۗ وَلِلَّهِ عَلَى النَّاسِ حِجُّ الْبَيْتِ مَنِ اسْتَطَاعَ إِلَيْهِ سَبِيلًا ۚ وَمَن كَفَرَ فَإِنَّ اللَّهَ غَنِيٌّ عَنِ الْعَالَمِينَ (97)**

**“నిశ్చయంగా మానవుల కొరకు ప్రప్రథమంగా ఖరారు చేయబడిన (అల్లాహ్) గృహం బక్కాలో (మక్కాలో) ఉన్నదే. అది శుభప్రదమైనది. సమస్త లోకాలకు మార్గదర్శకం కూడాను. అందులో స్పష్టమైన సూచనలున్నాయి. మఖామె ఇబ్రాహీమ్ (ఇబ్రాహీమ్ నిలబడిన స్థలం) ఉన్నది. అందులో ప్రవేశించినవాడు రక్షణ పొందుతాడు. అక్కడికి వెళ్ళే స్థోమత గలవారికి, ఆ గృహ (యాత్ర) హజ్ చేయటాన్ని అల్లాహ్ విధిగా చేశాడు. మరెవరైనా (ఈ ఆజ్ఞను శిరసావహించడానికి) నిరాకరిస్తే, అల్లాహ్‌కు సమస్తలోకవాసుల అవసరం ఎంతమాత్రం లేదు”.**

***(ఆలి ఇమ్రాన్ : 96-97)***

ఈ ఆయత్‌లలో అల్లాహ్, కాబా గృహం యొక్క 5 మహత్యాలను వివరించాడు:

1) కాబా గృహానికి – అల్లాహ్ యొక్క ప్రప్రథమ గృహం అనే గౌరవం ప్రాప్తమై వుంది.

అబూజర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఆయన, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను – ఈ భూమిపై నిర్మించబడిన మొట్టమొదటి మస్జిద్ ఏది? అని అడిగారు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – మస్జిదుల్ హరామ్ అని జవాబిచ్చారు.

ఆయన – ఆ తర్వాత? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – 'మస్జిదె అఖ్సా' అని అన్నారు.

ఆయన –ఈ రెండు మస్జిద్‌ల మధ్య ఎంత వ్యవధి ఉంది? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) – 40 సంవత్సరాలు అని అన్నారు.

*(బుఖారీ: 3366, 3425, ముస్లిం: 520)*

2) రెండవ మహత్యమేమిటంటే, ఈ గృహం ఎంతో శుభప్రదమైనది.

3) మూడవది – ఈ గృహం సమస్త లోకాలకు మార్గదర్శకం.

4) నాల్గవది – దీనిలో అల్లాహ్ సూచనలు ఎన్నో వున్నాయి (ఉదా॥కు జమ్‌జమ్ వగైరా)

అందులో ఒక సూచన 'మఖామె ఇబ్రాహీమ్'. ఇదొక రాయి. ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) దీనిపై నిలబడి కాబా గృహం గోడలను పైకెత్తారు(నిర్మించారు).

(5) ఐదవది – ఈ గృహంలోకి ప్రవేశించే వ్యక్తి శాంతిని పొందుతాడు.

## కాబా గృహం ఒక మహోన్నతమైన ఆరాధనా స్థలం

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاِذْ جَعَلْنَا الْبَيْتَ مَثَابَةً لِّلنَّاسِ وَاَمْنًا ؕ وَاتَّخِذُوْا مِنْ مَّقَامِ اِبْرٰهٖمَ مُصَلًّى ؕ وَعَهِدْنَآ اِلٰٓى اِبْرٰهٖمَ
وَاِسْمٰعِيْلَ اَنْ طَهِّرَا بَيْتِىَ لِلطَّآئِفِيْنَ وَالْعٰكِفِيْنَ وَالرُّكَّعِ السُّجُوْدِ ﴿125﴾

**"మేము ఈ గృహాన్ని (కాబా గృహాన్ని) మానవులందరి పుణ్యక్షేత్రంగానూ,**

**శాంతి నిలయం గానూ చేశాము. మీరు ఇబ్రాహీమ్ నిలబడిన ప్రదేశాన్ని నమాజు స్థలంగా చేసుకోండి. నా గృహాన్ని(సందర్శించి) ప్రదక్షిణ చేసే వారికోసం, అక్కడ ఏతెకాఫ్ పాటించే వారికోసం, రుకూ, సజ్దాలు చేసేవారి కోసం మీరు దానిని పరిశుభ్రంగా, పరిశుద్ధంగా ఉంచాలి".**
***(బఖర: 125)***

'మానవులందరి పుణ్యక్షేత్రం' అంటే – ఈ గృహం ప్రజలు మాటిమాటికీ సందర్శించి వెళ్ళే స్థలం అన్నమాట. ఇలా, ఉమ్రా మరియు హజ్‌ల సంకల్పంతో ప్రజలు ఎన్నో సార్లు ఈ గృహాన్ని సందర్శిస్తూ వుంటారు మరియు అల్లాహ్‌ను ఆరాధించి పుణ్య ఫలాన్ని కూడా పొందుతూ ఉంటారు.

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

جَعَلَ اللّٰهُ الْكَعْبَةَ الْبَيْتَ الْحَرَامَ قِيٰمًا لِّلنَّاسِ

**"గౌరవ ప్రద గృహమైన 'కాబా'ను అల్లాహ్ 'మానవ మనుగడ' సాధనంగా చేశాడు".** ***(మాయిద: 97)***

మౌలానా అబ్దుర్రహ్మాన్ కైలానీ రహిమహుల్లాహ్ ఈ ఆయతును విశ్లేషిస్తూ ఇలా పేర్కొన్నారు: 'మానవ మనుగడ' పదానికి మూడు వేర్వేరు అర్థాలు తీసుకోవచ్చు. ఆ మూడు అర్థాలు కూడా సరైనవే.

1) మానవులు అంటే – ఆ కాలంలోని మరియు దానికి ముందు, తర్వాత ప్రళయం వరకూ రాబోయే మానవులందరూ అని అర్థం.

ఈ అర్థాన్ని గనక తీసుకుంటే, తెలిసేదేమిటంటే, సమస్త లోకాల అస్తిత్వం కాబా గృహంపైనే ఆధారపడి వుంది. అంటే, కాబా గృహం మరియు దానిని గౌరవించే వారు వున్నంత వరకు ఈ లోకం మిగిలి ఉంటుంది. అల్లాహ్ ఈ లోకాన్ని అంతమొందించాలని భావించినప్పుడు ప్రప్రథమంగా ఈ గృహాన్ని భూమిపై నిర్మించినట్లే, ఇది (ఆకాశం)పైకి లేపబడుతుంది. ఇమామ్ బుఖారీ రహిమహుల్లాహ్ ఈ అర్థానికే ప్రాధాన్యత ఇచ్చారు మరియు ఈ ఆయతునే పురస్కరించుకొని ఈ హదీసు తీసుకొచ్చారు:

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త

(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "(ప్రళయానికి ముందు) చిన్న పిక్కలు కలిగిన ఒక (సాధారణ) నల్ల జాతీయుడు కాబాను కూల్చేస్తాడు".
*(బుఖారీ: 1591, 1596, ముస్లిం: 2909)*

ఈ హదీసు ద్వారా తెలిసే రెండో విషయం ఏమిటంటే, ఈ నల్లజాతీయుడి కన్నా ముందుగా ఎంతటి బలమైన, పటిష్టమైన శత్రువైనా, కాబా గృహాన్ని కూలగొట్టడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా అందులో సఫలీకృతుడు కాలేడు. అల్లాహ్, ఏనుగుల వారిని (అబ్రహ మరియు అతని సైన్యం) తుదముట్టించినట్లే, కాబా గృహాన్ని నష్టం కలిగించటానికి ప్రయత్నించే ప్రతి వ్యక్తిని లేదా జాతిని లేదా ప్రభుత్వాన్ని అంతమొందిస్తాడు.

2) మానవులు– దీని అర్థం 'అరబ్బులు' అని తీసుకుంటే అప్పుడు ఇలా అర్థం చేసుకోవచ్చు. అరబ్బులు నిషిద్ధ మాసాల్లో పూర్తి స్వేచ్ఛతో ప్రయాణం చేసేవారు. ప్రత్యేకించి, ఖుర్బానీ ఇచ్చే సంకల్పంతో ఖుర్బానీ పట్టాలు ధరింప జేసిన పశువులను తీసుకొని వేళ్ళేటప్పుడు. ఎందుకంటే, అరబ్బు జాతులన్నీ ఇలాంటి పశువులను గౌరవించేవి. వీటన్నిటికీ (ప్రశాంత వాతావరణానికి) కాబా గృహ పవిత్రతే మూల కారణం. హజ్ మరియు ఉమ్రా చేసేవారు, వ్యాపార బృందాలు మూడింట ఒక వంతు సంవత్సరం (4 నెలలు) ఎంతో ప్రశాంతంగా (ఏవిధమైన భయం లేకుండా) ప్రయాణించేవారు. ఇలా, కాబా గృహం యావత్ దేశపు నాగరిక, సామాజిక జీవితానికి ఆధారంగా నిలిచి వుంది.

3) మానవులు–ఒకవేళ దీని అర్థం 'మక్కా మరియు దాని చుట్టు ప్రక్కల వుండేవాళ్ళు' అని తీసుకుంటే, అప్పుడు ఇలా అర్థం చేసుకోవచ్చు: ఎడారి లోయలో వున్న కాబా గృహం, మక్కా మరియు దాని చుట్టు ప్రక్కల నివసించే వారికి జీవనోపాధిగా మారి వుంది. ప్రపంచ నలుమూలల నుండి హజ్ మరియు ఉమ్రాల కొరకు వచ్చే వారికి నివాసం, భోజనం మరియు రవాణా సౌకర్యాలను కలుగజేయడం ద్వారా ఇక్కడ నివసించేవారు సంవత్సరం మొత్తానికి సరిపోయేం తగా, పైగా అంతకన్నా ఎక్కువగానే సంపాదిస్తూ వుంటారు. అంతేకాక, వారికి ఇతర సామాజిక, రాజకీయాల ప్రయోజనాలు కూడా చేకూరుతున్నాయి.
*(తౌసీరుల్ ఖురాన్ : 1వ సంపుటం, 565వ పేజీ)*

## పవిత్ర మక్కాలో కీడును తలపెట్టాలను కొనే వారి కోసం తీవ్రమైన హెచ్చరిక

పవిత్ర మక్కా ముకర్రమ అల్లాహ్ దృష్టిలో ఎంత పవిత్రమైనది మరియు ప్రియమైనదంటే, దీనిలో కీడును లేదా అల్లరి చేయాలని కేవలం సంకల్పించుకుంటేనే అలాంటి వారికి అల్లాహ్ బాధాకరమైన శిక్షను గురించి హెచ్చరిక చేశాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ الَّذِينَ كَفَرُوا وَيَصُدُّونَ عَن سَبِيلِ اللَّهِ وَالْمَسْجِدِ الْحَرَامِ الَّذِي جَعَلْنَاهُ لِلنَّاسِ
سَوَاءً الْعَاكِفُ فِيهِ وَالْبَادِ ۚ وَمَن يُرِدْ فِيهِ بِإِلْحَادٍ بِظُلْمٍ نُّذِقْهُ مِنْ عَذَابٍ أَلِيمٍ ﴿٢٥﴾

**‘నిశ్చయంగా ఎవరయితే అవిశ్వాసానికి ఒడిగట్టి, అల్లాహ్ మార్గం నుండి, మస్జిదె హరామ్ నుండి (జనులను) అడ్డుకుంటున్నారో, ఇంకా అక్కడ అన్యాయంగా అడ్డదారులు తొక్కాలని ప్రయత్నిస్తున్నారో వారికి మేము బాధాకరమైన శిక్ష రుచి చూపిస్తాం. వాస్తవానికి మేము దానిని సర్వ మానవుల కోసం సమానంగా చేసి ఉన్నాము. స్థానికులకు, బయటి నుంచి వచ్చే వారికి కూడా (ఆ హక్కు సమానంగా వర్తిస్తుంది)”.**

***(హజ్: 25)***

## ఏనుగుల వారు మరియు కాబా గృహ సంరక్షణ.

యమన్ దేశపు గవర్నర్ (అబ్రహ) తన ఏనుగుల సైన్యంతో కాబా గృహంపై దాడి చేయడానికి వచ్చినప్పుడు, అల్లాహ్ తన గృహాన్ని రక్షించాడు మరియు దాడి చేసిన సైన్యాన్ని చిన్న చిన్న పక్షుల ద్వారా తుదముట్టించాడు. ఇది (ఈ సంఘటన) కూడా ఈ గృహం మహత్యానికి సూచనే.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

أَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِأَصْحَابِ الْفِيلِ ﴿١﴾ أَلَمْ يَجْعَلْ كَيْدَهُمْ فِي تَضْلِيلٍ ﴿٢﴾ وَأَرْسَلَ
عَلَيْهِمْ طَيْرًا أَبَابِيلَ ﴿٣﴾ تَرْمِيهِم بِحِجَارَةٍ مِّن سِجِّيلٍ ﴿٤﴾ فَجَعَلَهُمْ كَعَصْفٍ مَّأْكُولٍ ﴿٥﴾

**“ఏమిటి, నీ ప్రభువు ఏనుగుల వారి పట్ల వ్యవహరించిన తీరును నీవు**

**చూడలేదా? ఏమిటి, వాళ్ళ కుట్రను (ఆయన) భగ్నం చేయలేదా? వాళ్ళపై ఆయన గుంపులు గుంపులుగా పక్షులను పంపించాడు. అవి వారిపై మట్టితో తయారైన కంకర్రాళ్ళను కురిపించసాగాయి. ఎట్టకేలకు, ఆయన వారిని– తిని, (తొక్కివేసిన) తొక్కు మాదిరిగా చేసేశాడు".**

**(ఫీల్ సూరా)**

ఈ సంఘటన వివరాలు క్లుప్తంగా ఇవి:

యమన్ దేశంలో ఇథియోపియా వాసుల క్రైస్తవ ప్రభుత్వము స్థాపించబడి ఉండేది. అబ్రహ అనే వ్యక్తి దానికి గవర్నరుగా వుండేవాడు.

అతను బైతుల్లాహ్ యొక్క గౌరవం, ఔన్నత్యాన్ని చూసి అసూయ చెందే వాడు. అరబ్బు జగత్తులో కాబా గృహానికి గల స్థానం, 'సనా' పట్టణానికి కూడా వుండాలని కోరుకునేవాడు. తద్వారా కాబా గృహం కారణంగా మక్కా ఖురైషీయులకు లభిస్తున్న రాజకీయ, నాగరిక, వ్యాపార మరియు సామాజిక ప్రయోజనాలు అతని ప్రభుత్వానికి కూడా లభించాలని (అతని ఉద్దేశ్యం). ఈ ఉద్దేశ్యంతోనే అతను సనా పట్టణంలో ఒక అద్భుతమైన చర్చిని నిర్మించాడు. ఈ చర్చి చూడటానికి కాబా గృహం కన్నా ఎంతో గొప్పగా వుండేది. అయి నప్పటికీ ప్రజలు దీని వైపునకు మరల లేదు. పైగా ఒక రోజు దానిలో ఎవరో గుప్తంగా మలవిసర్జన చేశారు. దీనితో అతని (అబ్రహ)కి కాబా గృహంపై దాడి చేసి, దానిని తుదముట్టించడానికి సాకు దొరికింది. దీనితో అతను 60 వేల మందితో కూడుకున్న ఒక సైన్యాన్ని తయారు చేశాడు. ఈ సైన్యంలో 13 ఏనుగులు కూడా వున్నాయి. ఈ సైన్యం యమన్ నుండి బయలు దేరింది. మార్గంలో దానిని ఎదుర్కొన్న ప్రతి ఒక్కరూ ఓటమి పాలయ్యారు. చివరికి అతను మినా మరియు ముజ్దలిఫాల మధ్య 'ముహస్సిర్ లోయ'కు చేరుకొని అక్కడే బిడారాలు ఏర్పాటు చేసుకున్నాడు. అక్కడే కొంత లూటీ కూడా చేశాడు. ఆ రోజుల్లో అబ్దుల్ ముత్తలిబ్ (దైవప్రవక్త తాతగారు) కాబా గృహానికి 'ప్రధాన ముతవల్లీ' గా వుండేవారు. ఆయనకు చెందిన 200 ఒంటెలను కూడా అతను (అబ్రహ) స్వాధీన పరచుకున్నాడు. తదుపరి, అతను మక్కా వాసులకు, తను వారితో పోట్లాడడానికి రాలేదని, కేవలం కాబా గృహాన్ని కూల్చుడానికే వచ్చానని, మీతో చర్చలు జరపడానికి కూడా సిద్ధమేనని కబురు పంపాడు.

ఈ ఆహ్వానంపై, అబ్దుల్ ముత్తలిబ్ అతన్ని కలవడానికి వెళ్ళారు. వారిద్దరి మధ్య సంభాషణ ఇలా జరిగింది:

అబ్రహ : మీరేం కోరు కుంటున్నారు?

అబ్దుల్ ముత్తలిబ్: (మీరు స్వాధీనం చేసుకున్న) నా ఒంటెలు తిరిగి ఇచ్చేయమని కోరుకుంటున్నాను.

ఇది విని అబ్రహ ఆశ్చర్యానికి లోనయ్యాడు. ఎందుకంటే ఆయన కాబా గృహం గురించి ఏ మాత్రం మాట్లాడలేదు.

అబ్రహ: మీరు కాబా గృహం గురించి మాట్లాడుతారని నేను అనుకు న్నాను.

అబ్దుల్ ముత్తలిబ్: ఒంటెల యజమాని నేను కనుక నేను వాటి గురించి మాత్రమే మాట్లాడగలను. ఇక కాబా గృహం విషయానికి వస్తే దాని క్కూడా ఒక యజమాని వున్నాడు. ఆయనే దానిని రక్షిస్తాడు.

అబ్రహ ఒంటెలు తిరిగి అప్పజెప్పగా, అబ్దుల్ ముత్తలిబ్ వాటిని తీసుకుని వెళ్ళిపోయారు.

ఇటు, అబ్రహ (కాబా వైపుకు) అడుగులు వేయడానికి నిశ్చయించు కున్నాడు. కానీ, అన్నింటికన్నా ముందు, అబ్రహ ప్రయాణిస్తున్న ఏనుగు కాబా గృహం వైపునకు వెళ్ళడానికి తిరస్కరించింది. దాని శరీరాన్ని ఎన్నో బాణాలతో గ్రుచ్చినప్పటికీ అది మిగతా అన్ని దిక్కుల వైపుకైతే నడిచేది కానీ, కాబా గృహం వైపుకు వెళ్ళడానికి ససేమీరా అంది. ఈ తరుణంలో అల్లాహ్ సముద్రం వైపు నుండి పక్షులను గుంపులు గుంపులుగా ఆ ప్రదేశానికి పంపించాడు. ప్రతి పక్షి నోటిలో మరియు రెండు కాళ్ళలో ఒక్కో కంకర్రాయి వుంది. ఆ పక్షులు ఆ కంకర్రాళ్ళను అబ్రహా సైన్యంపై పడవేసి దానిని సర్వనాశనం చేసాయి. *(తఫ్సీర్ తైసీరుల్ ఖుర్ఆన్ మౌలానా అబ్దుర్రహ్మాన్ కైలానీ)*

## మక్కా ముకర్రమ పవిత్రత, నిషేధాలు

మక్కా ముకర్రమ ఎంతో పవిత్రమైన, నిషేధిత పట్టణం. అందుకే దీని పవిత్రతను కాపాడడం విధి. దీని నిషేధాలను దృష్టిలో వుంచుకొని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కా విజయం నాడు కొన్ని ప్రత్యేక ఆదేశాలను

జారీ చేస్తూ ఇలా సెలవిచ్చారు:“నిశ్చయంగా భూమ్యాకాశాలు సృష్టించబడినప్పటి నుండి అల్లాహ్ ఈ పట్టణాన్ని, నిషేధిత పట్టణంగా ఖరారు చేశాడు మరియు ప్రళయం వరకు దీనిని ఇలాగే వుంచుతాడు. నాకు ముందు, ఏ వ్యక్తికీ ఇక్కడ యుద్ధం చేసే అనుమతి లేదు. నాక్కూడా రోజులోని కొంత వ్యవధి వరకు మాత్రమే అనుమతించబడింది. తదుపరి ప్రళయం వరకు ఇది నిషేధిత పట్టణం గానే వుంటుంది. అందుకే ఇక్కడ వృక్షాలు నరకకూడదు. దీనిలోని జంతువులను వేటాడ కూడదు, దీనిలో క్రింద పడివున్న వస్తువును, దాని గురించి ప్రజలలో ప్రకటించాలనుకొనే వ్యక్తి మాత్రమే లేపాలి. దీనిలోని గడ్డి కోయకూడదు”.

దీనిపై అబ్బాస్ (రజి అల్లాహు అన్హు)– ఓ దైవ ప్రవక్తా! కేవలం ‘ఇజ్ఖర్’ గడ్డిని కోయడానికి అనుమతించండి. ఎందుకంటే దీని ద్వారా కంసాలివాళ్ళు మరియు కమ్మరి వాళ్ళు ప్రయోజనం పొందుతూ వుంటారు. అదేగాక, మక్కా వాసులు దీనిని తమ ఇళ్ళ కప్పులపై వాడుతూ వుంటారు అని అన్నారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జవాబిస్తూ – సరే, కేవలం ఇజ్ఖర్ గడ్డిని కోయడానికి మాత్రమే అనుమతి వుంది అని అన్నారు.

*(బుఖారీ: 1834, ముస్లిం: 1353)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే –

(1) మక్కా ముకర్రమలో యుద్ధం నిషేధించబడింది. పైగా అవసరం ఏమీ లేనప్పుడు ఆయుధాలు లేపడం కూడా వారించబడింది.

(2) మక్కా ముకర్రమ లో వృక్షాలు, మొక్కలు నరకడం మరియు గడ్డి కోయడం కూడా నిషిద్ధం. కొన్ని అవసరాల రీత్యా కేవలం ‘ఇజ్ఖర్’ గడ్డిని కోసే అనుమతి వుంది.

(3) మక్కా ముకర్రమ లో జంతువులు/ పక్షులను వేటాడటం నిషిద్ధం. అంతేకాదు, వాటిని గెదమడం కూడా నిషేధమే.

(4) మక్కా ముకర్రమ లో క్రింద పడివున్న వస్తువును లేపడం కూడా సరికాదు. ఎత్తేవాడు దాని గురించి ప్రకటించి తదుపరి దాని యజమాని వద్దకు చేర్చాలని సంకల్పిస్తే అది వేరే విషయం.

## బైతుల్లాహ్ తవాఫ్ (ప్రదక్షిణం) మహత్యం

యావత్ ప్రపంచంలో కేవలం కాబా గృహం తవాఫ్ మాత్రమే షరీయత్తు పరంగా ఉచితమైనది. అది తప్ప మరే గృహం (లేదా సమాధి) తవాఫ్ పూర్తిగా నిషిద్ధం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) బైతుల్లాహ్ యొక్క తవాఫ్ మహత్యం గురించి వివరిస్తూ ఇలా సెలవిచ్చారు: "(తవాఫ్ చేస్తున్నప్పుడు) వేసే ప్రతి అడుగుకుగాను 10 పుణ్యాలు లిఖించబడతాయి, 10 పాపాలు తొలగించబడతాయి మరియు 10 అంతస్థులు (స్థానాలు) పెంచబడతాయి.

*(అహ్మద్, సహీహ్ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ లిల్ అల్‌బానీ: 1139)*

## పుణ్యఫలాన్ని ఆశించి సందర్శించే మూడు మస్జిదులలో మస్జిదుల్ హరామ్ కూడా ఒకటి

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "పుణ్యఫలాన్ని ఆశించి కేవలం మూడు మస్జిదుల వైపునకు ప్రయాణం చేయవచ్చు. అవి – మస్జిదుల్ హరామ్, మస్జిదె అఖ్సా మరియు నా ఈ మస్జిద్ (మస్జిదె నబవి)".

*(బుఖారీ: 1188, ముస్లిం: 1397)*

ఈ హదీసు ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే, పుణ్యఫలాన్ని ఆశించి కేవలం ఈ మూడు మస్జిదుల వైపునకు మాత్రమే ప్రయాణం చేయవచ్చు. అంతే తప్ప మరే, ఇతర మస్జిద్ వైపునకు గానీ, మజార్ (సమాధి) వైపునకు గానీ పుణ్య ఫలాన్ని ఆశించి ప్రయాణం చేయడం షరీయత్తు పరంగా సరైనది కాదు.

## మస్జిదుల్ హరామ్ లో నమాజు మహత్యం

మస్జిదుల్ హరామ్‌లోని ఒక్క నమాజ్, ఇతర మస్జిదుల లక్ష నమాజుల కన్నా ఉత్తమమైనది.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "....మరియు మస్జిదుల్ హరామ్ లోని ఒక్క నమాజు, ఇతర మస్జిదుల లక్ష నమాజుల కన్నా ఉత్తమమైనది."

*(ఇబ్నె మాజా: 1406, అహ్మద్: 14735, 15306, సహీహ్– అల్‌బానీ)*

అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే, ఆయన మనందరినీ మాటిమాటికీ కాబా గృహాన్ని సందర్శించే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## రెండవ ఖుత్బా

మొదటి ఖుత్బాలో మేము మక్కా ముకర్రమ మహత్యాలను గూర్చి వివరించాము, రండి, ఇక మదీనా మునవ్వర మహత్యాలు కూడా వినండి!

మదీనా మునవ్వర – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన సహాబాలు హిజ్రత్ చేసిన నగరం. హిజ్రత్ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కడ 10 సం॥లు గడిపారు. ఈ వ్యవధిలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కడ మొట్టమొదటి ఇస్లామీయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి స్వయంగా దానిని పాలించారు. గొప్ప సహాబాలైన అబూ బక్ర్, ఉమర్, అలీ వగైరా......." (రజి అల్లాహు అన్హుమ్)లు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం)కు సలహాదారులుగా వున్నారు. మదీనా మునవ్వర నుంచే ఇస్లామీయ సైన్యాలు బయలుదేరి అల్లాహ్ కలిమ (సద్వచనం) ప్రాబల్యం నిమిత్తం తిరస్కారులతో (అవిశ్వాసులతో) యుద్ధాలు చేసేవారు. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మదీనాలో వున్న కాలంలోనే ధర్మానికి సంబంధించిన ఎక్కువ ఆదేశాలు అవతరించాయి. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) మరణం కూడా ఈ నగరంలోనే జరిగింది మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇక్కడే ఖననం చేయబడ్డారు.

# మదీనా మునవ్వర మహత్యాలు

## (1) మదీనా మునవ్వర పేర్లు

అజ్ఞాన కాలంలో దీనిని 'యస్రిబ్' అని పిలిచేవారు. మేము ఖుర్ఆన్ మరియు హదీసులలో ఈ మహోన్నత నగరం గురించి వచ్చిన పేర్లను మీకు వివరిస్తాం.

1) మదీనా. అల్లాహ్ ఈ శుభప్రద నగరం పేరును ఖుర్ఆన్‌లో ఇలా వివరించాడు:

مَا كَانَ لِأَهْلِ الْمَدِينَةِ وَمَنْ حَوْلَهُم مِّنَ الْأَعْرَابِ

"దైవప్రవక్తను విడిచి వెనుక ఉండిపోవడం మదీనాలో నివసించే వారికి......" *(తౌబా: 120)*

2) తౌబహ్. మదీనా మునవ్వర కు ఈ పేరు కూడా స్వయంగా అల్లాహ్‌యే పెట్టాడు.

జాబిర్ బిన్ సమురా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా మదీనా పేరును అల్లాహ్ 'తౌబహ్'గా పెట్టాడు". *(ముస్లిం: 1385)*

3) తయ్యబహ్. మదీనా మునవ్వర కు ఈ పేరు స్వయంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) పెట్టారు. జైద్ బిన్ సాబిత్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా ఇది (అంటే మదీనా మునవ్వర) తయ్యబహ్ (అంటే పవిత్రమైనది). వెండి త్రుప్పును కొలిమి ఎలా వేరు చేస్తుందో అపవిత్రాన్ని ఈ నగరం వేరు చేస్తుంది". *(బుఖారీ: 1884, ముస్లిం: 1384)*

4) అద్దార్. మదీనా మునవ్వర ను అల్లాహ్ ఈ పేరుతో ఖుర్ఆన్‌లో ప్రస్తావించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِينَ تَبَوَّءُو الدَّارَ وَالْإِيمَانَ مِن قَبْلِهِمْ يُحِبُّونَ مَنْ هَاجَرَ إِلَيْهِمْ وَلَا يَجِدُونَ فِي صُدُورِهِمْ حَاجَةً مِّمَّا أُوتُوا وَيُؤْثِرُونَ عَلَىٰ أَنفُسِهِمْ وَلَوْ كَانَ بِهِمْ خَصَاصَةٌ ۚ وَمَن يُوقَ شُحَّ نَفْسِهِ فَأُولَٰئِكَ هُمُ الْمُفْلِحُونَ ﴿٩﴾

**"వీరి కంటే ముందే అద్దార్ (మదీనా)లోనూ, విశ్వాసంలోనూ స్థానికులై ఉన్నవారు (వారికి కూడా ఈ సొమ్ము వర్తిస్తుంది); వారు ఇల్లూ వాకిలిని వదిలి తమ వైపునకు వలస వచ్చే ముహాజిర్లను ప్రేమిస్తారు. వారికి ఏమి ఇవ్వబడినా తమ అంతర్యాలలో ఏ కాస్త అసూయను కూడా రానివ్వరు. తాము అమిత అవసరంలో ఉన్నప్పటికీ తమపైన వారికే ప్రాధాన్యత నిస్తారు. వాస్తవానికి తమలోని స్వార్థ ప్రియత్వం (పేరాశ) నుండి రక్షించబడినవారే కృతార్థులు".** ***(హష్ర్: 9)***

ఈ ఆయతులో మదీనా మునవ్వర ను 'అద్దార్' అని పిలవడం జరిగింది. దీనిలో మదీనా వాసుల మహత్యాలు కూడా వివరించబడ్డాయి. తమ 'ముహాజిర్'

సహెూదరులు మదీనా మునవ్వర విచ్చేసినప్పుడు వారు ఎంతగానో సంతోషించి హృదయానికి హత్తుకున్నారు. వారక్కడ నివాసం ఏర్పాటు చేసుకోవడానికి ఎంతగా సహాయపడ్డారంటే, తమ సంపదలో, ఇళ్ళలో మరియు తోటలలో వారిని కూడా భాగస్వాములుగా చేసుకున్నారు. త్యాగానికి సంబంధించి ఎల్లప్పుడూ గుర్తుండిపోయే ఉదాహరణలు నెలకొల్పారు. మహత్తరమైన రెండు ఉదాహరణలు మీకు వివరిస్తాం.

(1) అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒక వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికొచ్చి ఇలా విన్నవించుకున్నాడు: ఓ దైవప్రవక్తా! నేను బాగా ఆకలితో వున్నాను. దానితో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన సతీమణుల వద్దకు కబురు పంపారు. కానీ వారి దగ్గర ఏమీ దొరకలేదు. (ముస్లింలోని ఉల్లేఖనంలో ఇలా వుంది – ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ఒక భార్య వద్దకు కబురు పంపగా ఆమె – మీకు సత్యాన్నిచ్చి పంపిన ఆ శక్తిమంతుని సాక్షి! నా దగ్గర నీళ్ళు తప్ప మరేమీ లేదు అని జవాబిచ్చారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) రెండో భార్య వద్దకు కబురు పంపగా ఆమె దగ్గర్నుండి కూడా ఇదే సమాధానం వచ్చింది. చివరికి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన భార్యలందరి వద్దకు కబురు పంపగా, అందరి దగ్గర్నుంచి – మా దగ్గర నీళ్ళు తప్ప మరే వస్తువూ లేదు అన్న సమాధానమే వచ్చింది).

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

‘ఈ రోజు రాత్రి ఆతిథ్యమిచ్చే వ్యక్తి ఎవరైనా వున్నారా? అల్లాహ్ అతన్ని కరుణించుగాక! అని అడిగారు. ఇది విని, ఒక అన్సారీ సహాబీ లేచి నిలబడి, ఓ దైవప్రవక్తా! నేనిస్తాను అని పలికి, ఆ వ్యక్తి (అతిథి)ని తన ఇంటికి తీసుకొని పోయి భార్యతో – ఇతను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతిథి, కనుక నీ వద్ద ఏ వస్తువు ఉన్నా ఇతనికి తినిపించు అని అన్నారు.

ఆమె – అల్లాహ్ సాక్షి! ఈ రోజు నా దగ్గర కేవలం పిల్లలకు సరిపోయేంత భోజనం మాత్రమే వుంది! అని అన్నారు.

అన్సారీ సహాబీ – (పిల్లలను ఎలాగోలా బుజ్జగిస్తూ) వాళ్ళు భోజనం అడిగినప్పుడు నిద్రపుచ్చు. మేమిదద్దరం (అతిథి మరియు నేను) భోజనం

చేస్తున్నప్పుడు నువ్వు కూడా వచ్చి (అతిథి ముందు భోంచేస్తున్నట్లు నటించి) తదుపరి దీపాన్ని సరి చేసే ఉద్దేశ్యంతో దానిని ఆర్పేయి. ఇలా ఈ రాత్రి మనమేమీ తినకుండా గడిపేద్దాం అని అన్నారు.

అతని భార్య ఇలాగే చేసింది. (వారిద్దరూ అలాగే కూర్చొని వున్నారు మరియు అతిథి మాత్రం భోజనం చేశాడు).

మరుసటి రోజు తెల్లారాక ఆ అన్సారీ సహాబీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి రాగా, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు– "ఫలానా పురుషుడు మరియు స్త్రీ పట్ల అల్లాహ్ ఎంతో సంతోషించాడు లేదా ఇలా సెలవిచ్చారు – అల్లాహ్ వారిని చూసి నవ్వాడు''.

ముస్లిం లోని ఉల్లేఖనంలో దీని పదాలు ఇలా వున్నాయి:

'నిన్న రాత్రి మీరు మీ అతిథి పట్ల ప్రవర్తించిన తీరు పట్ల అల్లాహ్ ఎంతో సంతోషించాడు. తదుపరి అల్లాహ్ ఈ ఆయతును అవతరింపజేశాడు. తాము అమిత అవసరంలో ఉన్నప్పటికీ తమపైన వారికే ప్రాధాన్యత నిస్తారు...'*(హష్ర్:9).* *(బుఖారీ: 4889, ముస్లిం: 2054)*

(2) అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం: అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి అల్లాహు అన్హు) (హిజ్రత్ చేసి) మా వద్దకు (మదీనాకు) రాగా, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆయన మరియు సాద్ బిన్ రబియా (రజి అల్లాహు అన్హు)లను సోదరులుగా ఖరారు చేశారు. సాద్ (రజి అల్లాహు అన్హు) ఎంతో ధనవంతులు. ఆయన (తన ముహాజిర్ సోదరులు అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్‌తో) ఇలా అన్నారు – మదీనా అన్సారులందరిలోనూ నేనెక్కువ ధనవంతుణ్ణని వారందరికీ తెలుసు. నేను కోరుకొనేదేమిటంటే, నా సంపదనంతా మనిద్దరి మధ్య రెండు భాగాలుగా చేస్తాను. అంతేకాక, నాకిద్దరు భార్యలున్నారు. వారిద్దరిలో మీకు మంచిగా తోచే ఆమెను నేను విడాకులు ఇస్తాను. ఇద్దత్ గడువు పూర్తి చేసాక మీరు ఆమెను వివాహం చేసుకోండి.

దీనిపై, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి అల్లాహు అన్హు) – అల్లాహ్ మీ ఇంటి వారిలో శుభాన్ని ప్రసాదించుగాక! అని అన్నారు. తదుపరి ఆయన, అన్నిటికన్నా విలువైన నెయ్యి, పనీర్‌లకు యజమాని అయిపోయారు. ఆ తర్వాత కొంత కాలానికి వివాహం కూడా చేసుకున్నారు. *(బుఖారీ: 3781)*

మదీనా అన్సారుల త్యాగనిరతికి ఈ రెండు వృత్తాంతాలు ఎంతో చక్కటి ఉదాహరణలు.

5) పటిష్ఠమైన కవచం.

మదీనా మునవ్వర పటిష్ఠమైన కవచం అని కూడా పిలువబడింది.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నేను కలలో చూసిందేమిటంటే, నేనొక పటిష్ఠమైన కవచం (కోట)లో వున్నాను. ఇలా కవచాన్ని మదీనాతో పోల్చారు". *(అహ్మద్: 2445, 14787)*

## (2) మదీనా మునవ్వర మహాత్యాలు.

### 1) మదీనా మునవ్వర పట్ల దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రేమ.

ప్రియ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన నగరాన్ని (మదీనా మునవ్వర) ఎంతగానో ప్రేమించేవారు.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం: మేము మదీనా మునవ్వరకు విచ్చేసినప్పుడు అక్కడ అంటు వ్యాధులు వ్యాపించి వున్నాయి. దీనితో, అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) మరియు బిలాల్ (రజి అల్లాహు అన్హు)లు వ్యాధిగ్రస్తులై పోయారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహాబాలు వ్యాధిగ్రస్తులవడం చూసి ఇలా ప్రార్థించారు: "ఓ అల్లాహ్! మేము మక్కాను ప్రేమించినట్లుగానే, మా హృదయాల్లో మదీనా ప్రేమను కలుగజేయి, పైగా దాని కన్నా ఎక్కువగా (ప్రేమ కలుగజేయి). ఓ అల్లాహ్! మా 'సా' మరియు 'ముద్ద్' (కొలతలు)లలో శుభాన్ని ప్రసాదించు. ఈ ప్రదేశాన్ని (మదీనా మునవ్వర) మా కోసం ఆరోగ్యమైన ప్రదేశంగా చెయ్యి మరియు వ్యాధులను 'జుహ్ఫా' (ఒక ప్రదేశం) వైపునకు మళ్ళించు". *(బుఖారీ: 1889, ముస్లిం: 1376)*

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రయాణం నుంచి మదీనా మునవ్వర తిరిగి వెళుతున్నప్పుడు దాని గోడలు కనిపించడం మొదలు పెట్టగానే, దాని మీది ప్రేమతో తన వాహనాన్ని వేగవంతం చేసేవారు. *(బుఖారీ: 1902, 1886)*

❖మదీనా అన్సారుల పట్ల దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రేమ.

1) అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం: ఒక అన్సారీ స్త్రీ తన పిల్లవాణ్ణి తీసుకుని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధికి వచ్చింది. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెతో సంభాషిస్తూ ఇలా సెలవిచ్చారు – "నా ప్రాణం ఎవరి చేతుల్లో వుందో ఆ శక్తిమంతుని సాక్షి! నాకు అందరికన్నా ఎక్కువ ప్రియులు మీరే". *(బుఖారీ: 3786)*

2) అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం: కందకం రోజు మదీనా అన్సారులు ఇలా అనసాగారు – జిహాద్ గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చేతులపై ప్రమాణం చేసిన వాళ్ళం మేము! మేమిక బ్రతికున్నంత వరకూ ఈ వాగ్దానం పై స్థిరంగా వుంటాం!

దీనిపై దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ : "ఓ అల్లాహ్! పరలోక జీవితం తప్ప మరో జీవితం లేదు. కనుక నువ్వు ముహాజిర్లు మరియు అన్సారుల ఔన్నత్యాన్ని పెంచు" అని ప్రార్థించారు. మరి కొన్ని ఉల్లేఖనాలలో– అన్సారులు మరియు ముహాజిర్లను మన్నించు అని రాగా, ఇంకా కొన్ని ఉల్లేఖనాలలో – అన్సారులు, ముహాజిర్లను (తగువిధంగా) బహుకరించు అని వచ్చింది. *(బుఖారీ: 3795,3796, ముస్లిం: 1805)*

3) అలాగే, అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, మక్కా విజయం నాడు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాలె గనీమత్ (యుద్ధ ప్రాప్తి) పంపిణీ చేశారు. దీనిపై మదీనా అన్సారులు అయిష్టతను వ్యక్తం చేయగా, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారికి ఇలా సెలవిచ్చారు: "ప్రజలు యుద్ధ ప్రాప్తిని తమ ఇళ్ళకు తీసుకెళుతున్నప్పుడు, మీరు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ను మీ ఇళ్ళకు తీసుకెళ్ళడం మీకిష్టం కాదా? (బాగా గుర్తుంచుకోండి!) ఒకవేళ ప్రజలంతా ఒక లోయలో వెళుతూ, అన్సారులు, మరో లోయలో వెళితే, నేను అన్సారులు వెళ్ళే లోయలో వెళతాను".

*(బుఖారీ: 3778, ముస్లిం: 1059)*

4) బరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "కేవలం విశ్వాసి మాత్రమే అన్సారులను ప్రేమిస్తాడు. వారిని ద్వేషించేవాడు కపట విశ్వాసి అయిఉంటాడు. వారిని

ప్రేమించే వారిని అల్లాహ్ ప్రేమిస్తాడు. వారిని ద్వేషించే వారిని అల్లాహ్ కూడా ద్వేషిస్తాడు". *(బుఖారీ: 3783, ముస్లిం: 75)*

## 2) మదీనా మునవ్వర పవిత్రత, నిషేధాలు

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మదీనా మునవ్వరను నిషేధిత, గౌరవించదగ్గ నగరంగా ఖరారు చేశారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా ఇబ్రాహీమ్ (అలైహిస్సలాం) మక్కా పట్టణాన్ని నిషేధిత పట్టణంగా ఖరారు చేసి మక్కా వాసుల కోసం ప్రార్థించారు. ఆయన మక్కా పట్టణాన్ని నిషేధిత పట్టణంగా ఖరారు చేసినట్లే నేను మదీనా నగరాన్ని నిషేధిత పట్టణంగా ఖరారు చేస్తున్నాను. ఇబ్రాహీం (అలైహిస్సలాం) మక్కా వాసుల శుభం కోసం ఎలాగైతే ప్రార్థించారో, నేను కూడా మదీనావాసుల కొలతలలో (సా మరియు ముద్ద్) దాని కన్నా రెట్టింపు శుభాన్ని ప్రసాదించమని ప్రార్థించాను".

*(బుఖారీ: 2129, ముస్లిం: 1360)*

ఈ హదీసు ద్వారా నిర్ధారించబడిన విషయాలేమిటంటే, మదీనా మునవ్వర ఒక నిషేధిత పవిత్ర నగరం మరియు ఇక్కడ మక్కా పట్టణం కన్నా రెట్టింపు శుభం ప్రాప్తిస్తుంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా ఇబ్రాహీం (అలైహిస్సలాం) మక్కా నగరాన్ని ఎలాగైతే నిషేధిత పట్టణంగా ఖరారు చేసారో, అలాగే నేను కూడా మదీనా మునవ్వరను నిషేధిత పట్టణంగా ఖరారు చేస్తున్నాను. దీని నిషేధ హద్దులు, నల్లటి రాళ్ళు కలిగిన రెండు మైదానాల మధ్య వున్నాయి. కనుక, దీనిలో వృక్షాలు నరకకూడదు, వేటాడకూడదు".

*(ముస్లిం: 1362)*

## 3) మదీనా మునవ్వర లో శుభం గురించి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రార్థన.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రార్థిస్తూ ఇలా అన్నారు: "ఓ అల్లాహ్! మదీనా మునవ్వర లో మక్కా పట్టణం కన్నా రెట్టింపు శుభాన్నివ్వు".

*(బుఖారీ: 1885, ముస్లిం: 1369)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు (పంట) మొదటి ఫలాన్ని తీసుకొచ్చినప్పుడు ఇలా ప్రార్థించేవారు: "ఓ అల్లాహ్! మా మదీనాలో శుభాన్ని ప్రసాదించు, మా ఫలాల్లో, మా 'సా' మరియు 'ముద్ద్' లలో శుభాన్ని ప్రసాదించు. ఒక శుభంతో పాటు మరొక శుభాన్ని (రెట్టింపు శుభాన్ని) ప్రసాదించు." *(ముస్లిం: 1373)*

## 4) మదీనా మునవ్వర లో నివాసం మహత్యం

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఒకవేళ వారు తెలుసుకోగలిగితే, మదీనా వారి కొరకు ఉత్తమమైనది. ఏ వ్యక్తి అయినా దీనిని పట్టించుకోకుండా దీని బయటకు వెళ్ళిపోతే, అల్లాహ్ అతని స్థానంలో అతని కన్నా ఉత్తమమైన వ్యక్తిని తీసుకువస్తాడు. ఏ వ్యక్తి అయినా ఆర్థికంగా క్లిష్ట పరిస్థితులు ఎదుర్కొంటున్నప్పటికీ, దీనిని తన నివాసంగా చేసుకుంటాడో అలాంటి వ్యక్తికి ప్రళయం నాడు నేను సిఫారసు చేస్తాను లేదా అతని గురించి సాక్ష్యమిస్తాను". *(ముస్లిం: 1363)*

## 5) మదీనా మునవ్వర లో మరణం మహత్యం

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా మదీనాలో (వచ్చి) మరణించగలిగే స్థోమత కలిగి వుంటాడో అతను తప్పకుండా ఇలా చేయాలి. ఎందుకంటే మదీనా మునవ్వరలో మరణించే వారి కోసం నేను సిఫారసు చేస్తాను".

*(అహ్మద్, తిర్మిజీ: 3917, ఇబ్నె మాజ, సహీహుల్ జామె అస్సగీర్: 6015)*

అంటే, ఏ వ్యక్తి అయినా, తన మరణం వచ్చే వరకు మదీనా మునవ్వరలో గడపగలిగే స్థోమత కలిగి ఉంటాడో అతను తప్పకుండా ఇలా చేయాలి. ఎందుకంటే, మదీనా మునవ్వరలో మరణించిన కారణంగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సిఫారసు భాగ్యానికి అతను నోచుకుంటాడు.

ఈ కారణం చేతనే ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా ప్రార్థించేవారు: "ఓ అల్లాహ్! నీ మార్గంలో వీర మరణాన్ని నాకు ప్రసాదించు. నాకు నీ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నగరంలో మరణం ఇవ్వు". *(బుఖారీ: 1890)*

### 6) మదీనా మునవ్వర లో విశ్వాసం (ఈమాన్) కుచించుకు పోవడం

ప్రళయానికి ముందు విశ్వాసం కుచించుకుపోయి మదీనా మునవ్వర లో వుండిపోతుంది.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా పాము తన పుట్టలోకి కుచించుకోయినట్లే, విశ్వాసం కూడా మదీనా వైపునకు కుచించుకు పోతుంది". *(బుఖారీ: 1876, ముస్లిం: 147)*

### 7) మదీనా మునవ్వర ప్రజలను ప్రక్షాళన చేస్తుంది

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఆయన దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)ను ఇలా సెలవిస్తుండగా విన్నారు: "నాకు ఒక బస్తీ గురించి (దాని వైపునకు హిజ్రత్ చేయమని) ఆజ్ఞాపించబడింది. అది ఇతర బస్తీలను తినేస్తుంది (అంటే అక్కడి నుండి బయలు దేరే సైన్యం ఇతర బస్తీలపై విజయం సాధిస్తుంది). ప్రజలు దానిని 'యస్రిబ్' అని పిలుస్తారు. వాస్తవానికి అది మదీనా. కొలిమి, త్రుప్పును ప్రక్షాళన చేసినట్లే అది కూడా ప్రజలను ప్రక్షాళన చేస్తుంది". *(బుఖారీ: 1871, ముస్లిం: 1382)*

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒక పల్లెటూరి వ్యక్తి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సన్నిధిలో హాజరై ఇస్లాంపై ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) వద్ద బైత్ (ప్రమాణం) చేశాడు. రెండవ రోజు అతను వచ్చేసరికి జ్వరంతో వున్నాడు. అతను – నా ప్రమాణం నాకు తిరిగి ఇచ్చేయండి అని అడిగాడు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనికి తిరస్కరించారు. అతను మూడు సార్లు దీని గురించి మొరపెట్టుకున్నాడు మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతిసారీ దానిని తిరస్కరిస్తూ పోయారు. దీనితో అతను మదీనా విడిచి వెళ్ళిపోయాడు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మాట్లాడుతూ– మదీనా కొలిమి లాంటిది. అది అపవిత్రత నుండి పవిత్రతను వేరు చేస్తుంది అని వివరించారు. *(బుఖారీ: 1883, ముస్లిం: 1383)*

ఈ హదీసు అర్థం ఏమిటంటే, మదీనాలో కేవలం చిత్తశుద్ధి కలిగిన విశ్వాసులు మాత్రమే వుండగలరు. తమ విశ్వాసంలో చిత్తశుద్ధి లోపించినవారు

అక్కడి నుండి వెళ్ళిపోతారు. *(షరహ్ ముస్లిం లిన్నవవీ)*

ఈ అర్థానికి మరో హదీసు ద్వారా కూడా బలం చేకూరుతుంది.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మదీనా వాసులారా! మీరు 'యౌముల్ ఖలాస్' ను గుర్తుకు తెచ్చుకోండి".

వాళ్ళు–యౌముల్ ఖలాస్ అంటే ఏమిటి? అని అడిగారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా వివరించారు:

"దజ్జాల్ వస్తాడు. వచ్చి 'జుబాబ్' అనే ప్రదేశంలో దిగుతాడు. తదుపరి మదీనాలోని ప్రతి ముష్రిక్ పురుషుడు, ప్రతి ముష్రిక్ స్త్రీ, ప్రతి తిరస్కార (కాఫిర్) పురుషుడు, ప్రతి తిరస్కార స్త్రీ, ప్రతి కపట విశ్వాస పురుషుడు, ప్రతి కపట విశ్వాస స్త్రీ, ప్రతి అశ్లీల పురుషుడు, ప్రతి అశ్లీల స్త్రీ, ఇలా అందరూ అతన్ని కలవడానికి వెళ్ళిపోతారు. కేవలం (చిత్తశుద్ధిగల) విశ్వాసులు మాత్రమే మదీనాలో వుండిపోతారు. ఆ దినమే 'యౌముల్ ఖలాస్' దినం".

*(తబ్రానీ – ఔసత్: 2186)*

## 8) మదీనా వాసులకు కీడు తలపెట్టాలని భావించే వారికి తీవ్రమైన హెచ్చరిక

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: 'ఏ వ్యక్తి అయినా మదీనా గురించి చెడుగా ఆలోచిస్తే, నీటిలో ఉప్పు కరిగే విధంగా అల్లాహ్ అతన్ని కరిగిస్తాడు". *(బుఖారీ: 1877, ముస్లిం: 1387)*

## 9) మదీనా మునవ్వర ఖర్జూరాల మహత్యం

ఇంతకు ముందు మేమొక హదీసును వివరించాం. దానిలో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనా మునవ్వర ఫలాలలో శుభాన్ని గురించి ప్రార్థించారు. ఆ ఫలాలలో ఖర్జూరాలు కూడా వున్నాయి.

దీనికి అదనంగా, సాద్ బిన్ అబీ వఖ్ఖాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా ఉదయం పూట నల్లటి రాళ్ళ రెండు మైదానాల మధ్య (మదీనా మునవ్వర)లోని ఖర్జూరాలలో ఏడింటిని గనక తింటే, ఆ రోజంతా అతనికి ఏ అపాయం జరుగదు". *(ముస్లిం: 2047)*

"ఏ వ్యక్తి అయినా ఉదయం పూట ఏడు 'అజ్వా' ఖర్జూరాలు గనక తింటే, ఆ రోజంతా అతనికి విషం ద్వారా గానీ, తాంత్రిక విద్య ద్వారా గానీ ఏ నష్టమూ వాటిల్లదు". *(బుఖారీ: 5445, ముస్లిం: 2047)*

## 10) మదీనా మునవ్వర లో దుష్కార్యానికి ఒడిగట్టేవానికి తీవ్రమైన హెచ్చరిక

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా దీని (మదీనా మునవ్వర)లో దుష్కార్యానికి ఒడిగడతాడో, అతనిపై అల్లాహ్, ఆయన దూతలు మరియు ప్రజలందరి శాపం పడుతుంది. ఇక ప్రళయం రోజు అల్లాహ్, అతని ఫర్జ్‌ను కూడా స్వీకరించడు, నఫిల్‌ను కూడా స్వీకరించడు. (దాని ఒక అర్థం ఏమిటంటే, అల్లాహ్ అతని పశ్చాత్తాపాన్ని కూడా స్వీకరించడు మరియు అతను ఇచ్చివున్న దానిని కూడా స్వీకరించడు).

## 11) ప్లేగు మరియు దజ్జాల్ నుండి మదీనా మునవ్వర సంరక్షణ

అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మసీహ్ దజ్జాల్ ప్రాబల్యం మదీనా మునవ్వర లో ప్రవేశించ లేదు. ఆ రోజు దానికి ఏడు ద్వారాలు వుంటాయి. ప్రతి ద్వారం లోనూ దైవదూతలు కాపలా కాస్తూ వుంటారు". *(బుఖారీ: 1879)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మదీనా మునవ్వర ద్వారాల వద్ద దైవదూతలు నియమించబడి వుంటారు. దీనిలోకి ప్లేగు వ్యాధి మరియు దజ్జాల్‌లు ప్రవేశించ లేరు". *(బుఖారీ: 1880)*

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "దజ్జాల్ ప్రతి నగరంలోకి ప్రవేశిస్తాడు. కేవలం మక్కా, మదీనాలు తప్ప. ఈ రెండు నగరాలలోని ప్రతి ద్వారం వద్ద దైవదూతలు బారులుగా నిలబడి వీటి కాపలా కాస్తుంటారు. తదుపరి మదీనా తన లోపల (నివాసం) వున్న వారితోపాటు మూడు సార్లు, కంపిస్తుంది. దీని ద్వారా అల్లాహ్ ప్రతి తిరస్కారిని, కపట విశ్వాసిని ఈ నగరం నుండి బయటికి పంపించేస్తాడు". *(బుఖారీ: 1881)*

మదీనా మునవ్వర లో అన్నిటి కన్నా ముఖ్యమైన ప్రదేశం 'మస్జిదె నబవి'.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయంగా దీని భూమిని కొన్నారు మరియు దీని పునాది కూడా స్వయంగా ఆయనే తన స్వహస్తాలతో వేసారు.

ఈ మస్జిద్ గురించి ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

لَمَسۡجِدٌ أُسِّسَ عَلَى ٱلتَّقۡوَىٰ مِنۡ أَوَّلِ يَوۡمٍ أَحَقُّ أَن تَقُومَ فِيهِۚ

**"తొలి నాటి నుంచే భయభక్తుల పునాదిపై నిర్మించబడిన మస్జిదు నువ్వు నిలబడటానికి అన్ని విధాలా తగినది".** ***(తౌబా: 108)***

అయితే, ఈ ఆయతులో వివరించబడిన మస్జిద్ గురించి అభిప్రాయ బేధాలు వున్నాయి. కొందరు దీనిని 'మస్జిదె నబవి' అని తీసుకుంటే, మరి కొంత మంది దీని అర్థం 'మస్జిదె ఖుబా' అని అన్నారు. కానీ, సహీహ్ ముస్లింలో అబూ సయీద్ ఖుద్రీ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఉల్లేఖించబడిన హదీసు ద్వారా తెలిసేదేమిటంటే, ఇది 'మస్జిదె నబవి' గురించే చెప్పబడింది.

*(సహీహ్ ముస్లిం: 1398)*

పుణ్య ఫలాన్ని ఆశిస్తూ షరీయత్తు పరంగా ప్రయాణం చేయగలిగే మూడు మస్జిద్‌లలో 'మస్జిదె నబవి' కూడా ఒకటి.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "పుణ్య ఫలాపేక్షతో కేవలం మూడు మస్జిద్‌ల వైపునకు ప్రయాణం చేయవచ్చు. అవి – 'మస్జిదుల్ హరామ్', 'మస్జిదె అఖ్సా' మరియు నా ఈ మస్జిద్ (మస్జిదె నబవీ). *(బుఖారీ: 1188, ముస్లిం: 1397)*

## మస్జిదె నబవిలో ఒక్క నమాజు మహత్యం

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నా ఈ మస్జిద్ (మస్జిదె నబవి) యొక్క ఒక్క నమాజ్, మస్జిదుల్ హరామ్ తప్ప ఇతర మస్జిదులలోని 1000 నమాజుల కన్నా ఉత్తమమైనది". *(బుఖారీ: 1190, ముస్లిం: 1394)*

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే, మస్జిదె నబవి లో ఒక్క నమాజు మహత్యం దీని కన్నా ఎక్కువగా ఉందని మరియు దీనితో పాటు దానిలో 40 నమాజుల మహత్యం గురించి ఉల్లేఖించబడిన హదీసులన్నీ పరంపరల రీత్యా బలహీనమైనవి.

# హజ్ మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదలు - 1

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1) హజ్ విధిత్వము మరియు ప్రాధాన్యత.

2) హజ్ మహత్యాలు.

3) ఉమ్రా ఆదేశాలు.

## మొదటి ఖుత్బా

గత శుక్రవారపు ఖుత్బాలో మేము హరమైన్ షరీఫైన్ మహత్యాలను ఖుర్ఆన్ మరియు హదీసుల వెలుగులో వివరించాం. హజ్ కాలాన్ని దృష్టిలో వుంచుకొని ఈ రోజు హజ్ విధిత్వము, ప్రాధాన్యత, దాని మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదల గురించి తెలుసుకుందాం.

అల్లాహ్‌ను వేడుకొనే దేమిటంటే, ఆయన మనందరినీ మాటిమాటికీ హరమైన్ షరీఫైన్‌లను సందర్శించే సౌభాగ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్!!

## హజ్ విధిత్వము మరియు ప్రాధాన్యత

హజ్ – ఇస్లాం మౌలికాంశాలలో ఒకటి.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఇస్లాం ధర్మం ఐదు మౌలికాంశాలపై ఆధారపడి వుంది. అల్లాహ్ తప్ప మరో నిజమైన ఆరాధ్యుడు ఎవ్వరూ లేరు మరియు ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయన దాసులు మరియు ప్రవక్త అని సాక్ష్యమివ్వడం, నమాజు నెలకొల్పడం, జకాత్ చెల్లించడం, బైతుల్లాహ్ హజ్ చేయడం మరియు రమజాన్ మాసపు ఉపవాసాలు పాటించడం". *(బుఖారీ, ముస్లిం)*

పూర్తి జీవితంలో, స్థోమత కల పురుషులకు, స్త్రీలకు కనీసం ఒక్క సారి హజ్ చేయడం విధిగా వుంది.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త

(సల్లల్లాహు అలైహి వ సల్లం) మాకు సంబోధిస్తూ ఇలా సెలవిచ్చారు:

"ప్రజలారా! మీ కోసం హజ్ విధిగా చేయబడింది. కనుక మీరు హజ్ చేయండి".

ఇది విని, ఒక వ్యక్తి– ఓ దైవ ప్రవక్తా! ప్రతి సంవత్సరం ఇది విధిగా వుందా? అని అడిగాడు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మౌనంగా వుండి పోయారు. అతను మూడుసార్లు ఇలానే ప్రశ్నించాడు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – ఒకవేళ నేను అవునని అని వుంటే, అప్పుడు మీకు ప్రతి యేడూ తప్పనిసరి అయిపోయేది. ఒకవేళ ఇలా జరిగితే మీరు దానిని నెరవేర్చే శక్తి కలిగి వుండేవారు కాదు". *(ముస్లిం: 1337)*

## హజ్ విధిత్వానికి గల షరతులు

హజ్ ఫర్జ్ కావడానికి ఐదు షరతులున్నాయి.

**1) ఇస్లాం:** అంటే, హజ్ కేవలం ముస్లిములపై విధిగా వుంది. కాఫిర్లపై విధిగా లేదు. ఒకవేళ కాఫిర్ (తిరస్కారి) ఎవరైనా హజ్ చేసినా సరిపోదు (అంటే స్వీకరించబడుదు). ఎందుకంటే, అతను హజ్‌కు ముందు (ఇస్లాం స్వీకరించి) ముస్లిం కావడం తప్పనిసరి. కనుక ఇస్లాం స్వీకరించాక అతను ఆర్థిక స్థోమత కలిగి వుంటే అప్పుడు అతనిపై హజ్ ఫర్జ్ అవుతుంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముఆజ్ (రజి అల్లాహు అన్హు) కు యమన్ వైపునకు పంపిస్తూ ఇలా హితబోధ చేసారు: "నువ్వు గ్రంథ ప్రజలు గల ప్రాంతానికి వెళుతున్నావు. అందుకే (అన్నిటికన్నా ముందుగా) వారికి లా ఇలాహ ఇల్లల్లాహ్, ముహమ్మదుర్రసూలుల్లాహ్ సాక్ష్యం వైపునకు ఆహ్వానించు. ఒకవేళ వారు నీ మాటను ఒప్పుకుంటే, వారికి అల్లాహ్ రేయింబవళ్ళలో ఐదు నమాజులు ఫర్జ్ చేసాడని చెప్పు....." *(బుఖారీ: 1496, ముస్లిం: 19)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే, అన్నిటి కన్నా ముందుగా ఇస్లాం స్వీకరణ తప్పనిసరి. దాని తర్వాతే ఇతర ఆదేశాలు వర్తిస్తాయి.

**2) బుద్ధి:** అంటే హజ్, బుద్ధి వివేకాలు కలవారిపైనే ఫర్జ్‌గా వుంది. బుద్ధి మందగించిన పిచ్చి వాళ్ళపై లేదు. పిచ్చివాళ్ళ గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (కర్మలు వ్రాసే) కలాలు లేపేయబడ్డాయి (వారి కర్మలు వ్రాయబడవు) అని వివరించారు.

**3) యౌవనం:** హజ్ విధిగా కావటానికి యౌవనం కూడా ఒక షరతే. ఎందుకంటే, చిన్న పిల్లలు దానికి బాధ్యులు కారు. కానీ చిన్న పిల్లలు హజ్ చేయవచ్చు.

దీని గురించి, ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు: ఒక స్త్రీ తన పిల్లవాణ్ణి ఎత్తి చూపిస్తూ, ఓ దైవ ప్రవక్తా! ఇతను హజ్ చేయవచ్చా? అని అడిగింది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ - చేయవచ్చు. (అతనితో పాటు) నీక్కూడా పుణ్యం దొరుకుతుంది అని అన్నారు".

*(ముస్లిం: 1336)*

కానీ ఈ హజ్, ఫర్జ్ హజ్ కు సరిపోదు, ఆ పిల్లవాడు యౌవన దశకు చేరుకున్న తర్వాత, ఒకవేళ ఆర్థిక స్థోమత గనక కలిగి వుంటే విధిగా వున్న హజ్ ను మరలా చేయాలి.

**(4) స్వేచ్ఛ:** అంటే హజ్ కేవలం స్వతంత్ర్య ముస్లిములపై విధిగా వుంది. బానిస ముస్లిములపై కాదు. బానిస ముస్లిం హజ్ చేయవచ్చు. కానీ ఆ హజ్, ఫర్జ్ హజ్ కు సరిపోదు. అతను స్వతంత్రుడయ్యాక, ఒకవేళ ఆర్థిక స్థోమత గనక కలిగివుంటే విధిగా వున్న హజ్ ను మరలా చేయాలి.

**(5) ఆర్థిక స్థోమత:** అంటే హజ్ చేయగలిగే శక్తి కలిగి వుండాలి. ఆర్థికంగా హజ్ ఖర్చులు భరించ గలిగే స్థోమత కలిగి వుండడంతో పాటు శారీరకంగా కూడా హజ్ ప్రయాణం చేయగలిగే స్థితిలో వుండాలి. హజ్ మార్గం శాంతియుతంగా వుండి, పరిస్థితులు చక్కబడ్డాక హజ్ రోజుల లోపు మక్కా ముకర్రమ కు చేరడం సాధ్యమైనప్పుడు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَلِلَّهِ عَلَى النَّاسِ حِجُّ الْبَيْتِ مَنِ اسْتَطَاعَ إِلَيْهِ سَبِيلًا

**"అక్కడికి వెళ్ళే స్థోమత గలవారికి ఆ గృహం (యాత్ర) హజ్ చేయడాన్ని అల్లాహ్ విధిగా చేశాడు".** ***(ఆలి ఇమ్రాన్ : 97)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను స్థోమత గురించి అడిగినప్పుడు ఇలా సెలవిచ్చారు- స్థోమత అంటే - (హజ్ యాత్రకు) కావాల్సిన ప్రయాణ సామగ్రి మరియు వాహనం కలిగి వున్నప్పుడు (వాహనానికి బదులు దాని ఖర్చులు భరించగలిగే సామర్థ్యం కలవాడు) అని అర్థం.

*(ఇబ్నె మాజ, సహీహ్ అత్తర్గీబ్ వ తర్హీబ్ - అల్బానీ: 1131)*

ఒకవేళ ఏ వ్యక్తి అయినా, ఆర్థిక స్థోమత కలిగివున్నప్పటికీ శారీరకంగా హజ్ ప్రయాణం చేయగలిగే స్థితిలో లేకపోతే, అతను తన తరపు నుండి – అంత కన్నా ముందుగానే తన హజ్ ను పూర్తి చేసుకున్న వ్యక్తిని, హజ్ చేయడానికి పంపించవచ్చు.

అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: 'హజ్జతుల్ విదా' లో 'ఖస్అమ్' తెగకు చెందిన ఒక స్త్రీ వచ్చి, ఓ దైవప్రవక్తా! నా తండ్రి గారిపై హజ్ విధిగా అయివుంది. కానీ ఆయన చాలా ముసలి వారైపోయారు మరియు వాహనంపై కూర్చో గలిగే స్థితిలో కూడా లేరు. ఈ స్థితిలో నేను ఆయన తరపు నుండి హజ్ చేయవచ్చా? అని అడిగింది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం): "తప్పకుండా, నువ్వు అతని తరపు నుండి హజ్ చేయవచ్చు" అని అన్నారు.

*(బుఖారీ: 1531, ముస్లిం: 1334)*

అలాగే, అబ్దుల్లా బిన్ అబ్బాస్ ( రజి అల్లాహు అన్హు) కథనం:

దైవప్రవక్త ( సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తిని – 'లబ్బైక అన్షుబ్రుమా' అని అనడం విని, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– షుబ్రుమా ఎవరు? అని అతన్ని అడిగారు. అతను – నా సోదరుడు (లేదా నా బంధువు) అని అన్నాడు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం). ఇది వరకు నువ్వు నీ హజ్‌ను పూర్తి చేసుకున్నావా? అని అడిగారు. అతను – లేదండి అని అన్నాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ముందు నీ తరపు నుండి హజ్ చేయి, ఆ తర్వాత షుబ్రుమా తరపు నుండి చేయవచ్చు అని అన్నారు.

*(అబూదావూద్ : 1811, ఇబ్నెమాజ:2903, సహీహ్– అల్‌బానీ)*

ఇక్కడ గుర్తుంచుకోవాల్సిన మరో విషయమేమింటే – స్త్రీలకు ఈ షరతులతో పాటు మరో షరతు కూడా నెరవేర్చాల్సి వుంటుంది. అదేమిటంటే – ఈ ప్రయాణంలో ఆమెతో పాటు ఎవరైనా 'మహ్రమ్' గానీ, ఆమె భర్త గానీ ఆమెకు తోడుగా వుండాలి. ఒకవేళ ఈ షరతును గనక నెరవేర్చలేకపోతే ఆమెపై హజ్ విధిగా వుండదు.

దైవ ప్రవక్త ( సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "తన మూడు రోజుల ప్రయాణాన్ని 'మహ్రమ్' లేకుండా కొనసాగించడం ఏ స్త్రీకి కూడా ధర్మసమ్మతం కాదు." *(బుఖారీ:1086, ముస్లిం:1338)*

ఇలా, ఈ షరతులన్నీ నెరవేర్చగలిగే సామర్థ్యం కలవారు వీలైనంత త్వరగా హజ్ చేసుకోవాలి. దానిని మరుసటి సంవత్సరం వరకు వాయిదా వేసుకో కూడదు. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "హజ్ చేసే  సంకల్పం వున్నవారు వీలైనంత త్వరగా దానిని చేసుకోవాలి. ఎందుకంటే, అతను వ్యాధిగ్రస్తుడవ్వ వచ్చు, అతని వస్తువేదైనా అదృశ్యం కావచ్చు లేదా అతనికి ఏదైనా అవసరం రావచ్చు."

*(అహ్మద్, ఇబ్నెమాజ, సహీ ఉల్ జామె అస్సగీర్: 6004, ఇర్వా: 990)*

ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా అనేవారు:

నా మనసు కోరుకొనే దేమిటంటే – ఈ నగరాలకు కొంత మందిని పంపించి వారి ద్వారా ఎవరి వద్ద ధనం వుంది? అయినా వారు హజ్ ఎందుకు చేయలేదు? అన్న వివరాలు సేకరించి, తదుపరి వారిపై జిజియా పన్ను విధించాలని. ఎందుకంటే, నిశ్చయంగా వారు ముస్లిములు కారు.

*(సహీహ్ – ఇబ్నె హజర్ ఫీ అల్ కబాయెర్)*

## హజ్ మహత్యాలు

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ యొక్క ఎన్నో మహత్యాలను వివరించారు. రండి! మీరు కూడా ఆ మహత్యాలను విని మీ విశ్వాసాన్ని తాజా చేసుకోండి.

### 1. స్వీకరించబడే హజ్‌కు పరిహారం స్వర్గమే.

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మబ్‌రూర్ హజ్ (స్వీకరించబడే హజ్) కు పరిహారం స్వర్గమే". *(బుఖారీ: 1773, ముస్లిం: 1349)*

స్వీకరించబడే హజ్ (మబ్‌రూర్ హజ్) అంటే – అల్లాహ్ అవిధేయతకు పాల్పడకుండా చేయబడే హజ్. దీని సూచన ఏమిటంటే – హజ్ తర్వాత హాజీ సత్కార్యాలను ఎక్కువగా చేస్తూ చెడు కార్యాల నుండి దూరంగా వుండాలి.

## 2. హజ్ పాపాలను తుడిచి వేస్తుంది.

అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం:" అల్లాహ్ నా హృదయంలో ఇస్లాం మీద ప్రేమ కలుగజేసినప్పుడు, నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సన్నిధిలో హాజరై – మీరు గనక మీ చేతులను ముందుకు చాపితే నేను మీదగ్గర బైత్ (ప్రమాణం) చేస్తాను అని విన్నవించుకున్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతులు ముందుకు చాపగానే నేను నా చేతిని వెనక్కు తీసుకున్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– అమ్ర్ ! ఏమైంది నీకు? అని అడిగారు.

నేను – నేనొక షరతు పెట్టాలను కుంటున్నాను అని అన్నాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ఏమిటా షరతు? అని అడిగారు.

నేను – నా షరతు ఏమిటంటే, అల్లాహ్ నా పాపాలను క్షమించాలి అని అన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): "నీకీ విషయం తెలియదా! ఇస్లాం (స్వీకరణ) గత పాపాలను తుడిచి వేస్తుంది, హిజ్రత్ గత పొరపాట్లను సమాప్తం చేస్తుంది మరియు హజ్ పాపాలలన్నింటినీ తుడిచి వేస్తుంది"అని వివరించారు. *(ముస్లిం: 121)*

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "హజ్ మరియు ఉమ్రాలను ఎల్లప్పుడూ చేస్తూ వుండండి. కొలిమి, త్రుప్పును తొలగించినట్లే ఈ రెండూ పేదరికాన్నీ, పాపాలను సమాప్తం చేస్తాయి."

*(తబ్రానీ, దారెఖుత్ని, అస్సహీహా : 1185)*

## 3. ఈమాన్ (విశ్వాసం) మరియు జిహాద్‌ల తర్వాత అన్నిటి కన్నా శ్రేష్ఠమైన ఆచరణ హజ్.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో – అన్నింటి కన్నా శ్రేష్టమైన ఆచరణ ఏది? అని అడగబడింది.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తను విశ్వసించడం అని అన్నారు. ఆ తర్వాత? అని అడగ్గా,

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) –జిహాద్ చేయడం అని అన్నారు. ఆ తర్వాత? అని అడగ్గా, ఆయన(సల్లల్లాహు అలైహి వ సల్లం) – మబ్రూర్ హజ్ ( స్వీకరించబడే హజ్ ) అని అన్నారు. *(బుఖారీ: 1519, ముస్లిం: 83)*

### 4. హజ్ – అన్నిటి కన్నా ఉత్తమ జిహాద్.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం: నేను, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో – ఓ దైవ ప్రవక్తా! అన్నిటి కన్నా ఉత్తమ ఆచరణ జిహాద్ అని మేము అనుకొంటూ వుంటాం. మరయితే మేము కూడా జిహాద్ చేయవచ్చా? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – అన్నిటి కన్నా ఉత్తమ జిహాద్ 'మబ్రూర్ హజ్' (స్వీకరించబడే హజ్) అని వివరించారు. *(బుఖారీ : 1520)*

### 5.వయసు మీరిన, బలహీన స్త్రీ యొక్క జిహాద్ – హజ్ మరియు ఉమ్రాలు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "వయసు మీరిన, బలహీన స్త్రీ యొక్క జిహాద్ – హజ్ మరియు ఉమ్రాలు." *( నసాయి, సహీ – అల్‌బానీ)*

### 6. హజ్ చేసే వాళ్ళు అల్లాహ్ అతిథులు మరియు వారి దుఆ స్వీకరించ బడుతుంది.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ మార్గంలో జిహాద్ చేసే వ్యక్తి, హజ్ చేసే వ్యక్తి మరియు ఉమ్రా చేసే వ్యక్తి – వీరంతా అల్లాహ్ అతిథులు. అల్లాహ్ ఆహ్వానంపై వీరంతా వచ్చారు. అందుకే వీరు అల్లాహ్‌ను అడిగేవన్నీ వీరికి అనుగ్రహించ బడతాయి."

*(ఇబ్నెమాజా, ఇబ్నెహిబ్బాన్, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్: 1108)*

### 7. హజ్ ప్రయాణం లో మరణిస్తే గనక మనిషి నేరుగా స్వర్గంలోకి వెళతాడు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ఏ వ్యక్తి అయినా హజ్

కోసం బయలుదేరి, మార్గంలోనే గనక మరణిస్తే, ప్రళయ దినం వరకు అతనికి హాజీ (హజ్ చేసే వ్యక్తి) కి దొరికే పుణ్యఫలం లిఖించబడుతుంది. అలాగే, ఏ వ్యక్తి అయినా ఉమ్రా కోసం బయలుదేరి మార్గం మధ్యలోనే మరణిస్తే అతనికి ప్రళయ దినం వరకు ఉమ్రా చేసే వ్యక్తి కి లభించే పుణ్యం లిఖించబడుతుంది."

*(అబూ యాలా, సహీ అత్తర్గీబ్ వ తర్హీబ్ : 1114)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: అరాఫాత్ మైదానంలో దైవ ప్రవక్త ( సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు గడిపిన ఓ వ్యక్తిని అతని ఒంటె అకస్మాత్తుగా క్రిందికి పడేసింది. దీనితో అతను మెడ విరిగి మరణించాడు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) : "అతనికి నీళ్ళు మరియు రేగాకులతో స్నానం చేయించండి. అతని రెండు దుప్పట్లతోనే అతనికి కఫన్ తొడిగించండి. అతని శిరస్సును మూయకండి. అతనికి సువాసన కూడా పూయకండి. ప్రళయం రోజు అతను 'తల్బియ' పఠిస్తున్న స్థితిలో లేపబడతాడు." *(బుఖారీ : 1849, 1850, ముస్లిం: 1206)*

## 8. హజ్ ఆచారాల మహత్యం – ఒక మహోన్నత హదీసు.

అబ్దుల్లా బిన్ ఉమర్ ( రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "మీరు బైతుల్లాహ్ (సందర్శన) గురించి సంకల్పించుకొని ఇంటి నుండి బయలు దేరినప్పుడు మీ వాహనం యొక్క ప్రతి అడుగుకు గాను అల్లాహ్ మీకొక పుణ్యాన్ని వ్రాస్తాడు మరియు ఒక పాపాన్ని క్షమిస్తాడు. మీరు అరాఫాత్ మైదానంలో గడిపేటప్పుడు అల్లాహ్, భూలోక ఆకాశంపైకి వచ్చి దైవదూతల ముందు, హజ్ చేసే వారి గురించి గర్విస్తూ ఇలా సెలవిస్తాడు – చూడండీ! వీరంతా నా దాసులు ఎంతో దూర దూరాల నుండి శ్రమ పడుతూ, దుమ్ము ధూళిలో లిప్తమై నా వద్ద కొచ్చారు. వీళ్ళు నా కారుణ్యాన్ని ఆశిస్తున్నారు, నా శిక్షకు భయపడుతున్నారు. (వాస్తవానికి వారు నన్ను చూడనే లేదు) ఒకవేళ వీరు నన్ను చూసివుంటే అప్పుడు వారి స్థితి ఎలావుండేది! తదుపరి, ఒకవేళ మీ పాపాలు – పొరలు పొరలుగా వుండే ఇసుక రేణువులంత వున్నా, ప్రాపంచిక దినాల సంఖ్యకు సమానంగా వున్నా, వర్షపు నీటి చినుకులకు సమానంగా వున్నా – ఆ పాపాలన్నిటినీ అల్లాహ్ కడిగేస్తాడు. మీరు 'జమ్రాత్' కు కంకరాళ్ళు

విసిరినప్పుడు దాని పుణ్యఫలాన్ని అల్లాహ్ మీకోసం ప్రోగు చేసి నిల్వ వుంచుతాడు. మీరు శిరోమండనం చేయించుకున్నప్పుడు మీ కోసం, మీ ఒక్క వెంట్రుకకు గాను ఓ పుణ్యాన్ని వ్రాస్తాడు. తదుపరి, తవాఫ్ చేసినప్పుడు మీ తల్లి గర్భం నుంచి మీరు పరిశుద్ధంగా పుట్టినట్లే పాపాలన్నింటి నుండి మీరు పరిశుద్ధులౌతారు." *(తబ్రానీ, సహీ ఉల్ జామె అస్సగీర్ – అల్‌బానీ : 1360)*

ఇదే హదీసు యొక్క మరొక ఉల్లేఖనంలో పదాలు ఇలా వున్నాయి: "మీరు బైతుల్లాహ్ (సందర్శన) గురించి సంకల్పించుకొని ఇంటి నుండి బయలుదేరినప్పుడు మీ వాహనం యొక్క ప్రతి అడుగుకు గాను అల్లాహ్ మీకొక పుణ్యాన్ని వ్రాస్తాడు మరియు ఒక పాపాన్ని క్షమిస్తాడు. తవాఫ్ తర్వాతి రెండు రకాతులు, ఇస్మాయీల్ (అలైహిస్సలాం) సంతానంలోని ఒక బానిసను విముక్తి కలిగించిన దానికి సమానం అవుతాయి మరియు సఫా, మర్వా ల మధ్య చేసే 'సయీ' 70 బానిసలను విముక్తి కలిగించిన దానికి సమానమవుతుంది.

అరాఫాత్ రోజు సాయంత్రం అల్లాహ్ భూలోక ఆకాశంపైకి వచ్చి మీ గురించి గర్విస్తూ ఇలా అంటాడు: "చూడండీ! వీరంతా నా దాసులు. ఎంతో దూర దూరాల నుండి శ్రమపడుతూ దుమ్ము, ధూళిలో లిప్తమై నా వద్ద కొచ్చారు. నా కారుణ్యాన్ని ఆశిస్తున్నారు." ఒక వేళ మీ పాపాలు – ఇసుక రేణువులకు సమానంగా వున్నా, వర్షపు నీటి చినుకులను సమానంగా వున్నా, సముద్రపు నురుగుకు సమానంగా వున్నా – ఆ పాపాలన్నిటినీ అల్లాహ్ క్షమించి వేస్తాడు.

**"నా దాసులారా! శ్రద్ధగా వినండి! మీరు ముజ్దలిఫ వైపుకు మరలిపోండి, నేను మిమ్మల్ని మరియు ఎవరి కోసమైతే మీరు ప్రార్థించారో వారందరినీ మన్నించేశాను." తదుపరి, మీరు 'జమ్రాత్' లో కంకరాళ్ళను విసురుతున్నప్పుడు, ప్రతి కంకర్రాయికి బదులుగా ఒక పెద్దపాపం (కబీరా గునాహ్) తుడుచి వేయబడుతుంది. మీరు ఖుర్బానీ చేసేటప్పుడు దాని పుణ్యఫలం మీ ప్రభువు వద్ద ప్రోగు చేసి నిల్వ వుంచబడుతుంది.** మీరు శిరోముండనం చేయించు కున్నప్పుడు ఒక్కో వెంట్రుకకు గాను మీకోసం ఒక పుణ్యం వ్రాస్తాడు మరియు ఒక పాపం తుడిచేస్తాడు. తదుపరి, మీరు తవాఫ్ చేస్తున్నప్పుడు మీ తల్లి

గర్భం నుండి మీరు పరిశుద్ధంగా పుట్టినట్లే పాపాలన్నింటి నుండి మీరు పరిశుద్ధు లౌతారు.

ఒక దైవ దూత వచ్చి, మీ భుజాల మధ్య చేయి వేసి ఇలా అంటాడు: వెళ్ళండి, వెళ్ళి మీ భవిష్యత్తు కోసం ఆచరించుకోండి. ఎందుకంటే మీ గత పాపాలన్నీ తుడిచివేయబడ్డాయి."

*(తబ్రానీ, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ లిల్ అల్‌బానీ: 1112)*

## హజ్ ప్రయాణానికి ముందు కొన్ని మర్యాదలు

1. హజ్ కు వెళ్ళే వ్యక్తి పై తప్పనిసరిగా వున్న విషయమేమిటంటే హజ్ మరియు ఉమ్రాలను అతను కేవలం అల్లాహ్ సంతృప్తి కోసం, ఆయన సాన్నిధ్యం కోసమే అని సంకల్పించుకోవాలి. ఎందుకంటే ప్రతి సత్కార్యం స్వీకరించ బడటానికి చిత్తశుద్ధి మొదటి షరతు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَآ أُمِرُوٓا۟ إِلَّا لِيَعْبُدُوا۟ ٱللَّهَ مُخْلِصِينَ لَهُ ٱلدِّينَ حُنَفَآءَ وَيُقِيمُوا۟ ٱلصَّلَوٰةَ وَيُؤْتُوا۟ ٱلزَّكَوٰةَ ۚ وَذَٰلِكَ دِينُ ٱلْقَيِّمَةِ ﴿5﴾

**"వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించు కోవాలనీ, ఏకాగ్ర చిత్తులై - నమాజును నెలకొల్పాలనీ, జకాత్ ఇస్తూ ఉండాలని మాత్రమే వారికి ఆదేశించబడింది. ఇదే స్థిరమైన, సవ్యమైన ధర్మం". *(బయ్యినహ్ : 5)***

2. హజ్ కు వేళ్ళే వ్యక్తి, హజ్ ఖర్చులను ధర్మయుక్త (హలాల్) సంపాదనతో సమకూర్చుకోవాలి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చి వున్నారు:

"ప్రజలారా! అల్లాహ్ ఎంతో పరిశుద్ధుడు. కనుక, కేవలం పరిశుద్ధ వస్తువునే స్వీకరిస్తాడు." తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక వ్యక్తి గురించి వివరించారు: "ఎంతో సుదీర్ఘంగా ప్రయాణం చేసి, దుమ్ము, దూళిలో లిప్తమై వున్న స్థితిలో (హజ్ కోసం వస్తాడు) మరియు ఆకాశం వైపుకు చేతులెత్తి - ఓ నా ప్రభువా! ఓ నా ప్రభువా! అని ప్రార్థిస్తాడు. వాస్తవానికి

అతని తినడం, అతని త్రాగడం, అతని దుస్తులు – అన్నీ అధర్మ సంపాదన లోనివి. అతని శరీరం కూడా అధర్మ ఆహారంతో పోషించబడింది. ఈ పరిస్థితిలో అతని దుఆ ఎలా స్వీకరించబడుతుంది?!” *(ముస్లిం:1014)*

ఈ హదీసును గూర్చి కాస్త ఆలోచించండి!

ఆ వ్యక్తి, దుఆ స్వీకరించబడడానికి ఎన్నో ప్రయత్నాలు చేశాడు. ప్రయాణం, దుమ్ము ధూళిలో లిప్తమైన స్థితి, అల్లాహ్ ముందు చేతులెత్తడం... వగైరా, కానీ, ఇన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ, అల్లాహ్ వద్ద అతని దుఆ అమోదయోగ్యం కాలేదు. దానికి కారణం – అతని తినడం, త్రాగడం, దుస్తులు వగైరా ॥ అన్నీ అక్రమ (అధర్మ) సంపాదనతో జరిగేవి. అందుకే ముస్లిములందరి, ప్రత్యేకించి హజ్ చేసే వారిపై తప్పనిసరిగా వున్న విషయమేమిటంటే – వారు అక్రమ సంపాదనకు దూరంగా వుండాలి మరియు హజ్ ఖర్చులు హలాల్ సంపాదన తోనే చేసుకోవాలి.

3. పాపాలన్నిటిపై చిత్తశుద్ధితో పశ్చాత్తాపం చెందాలి. ఒకవేళ అతనిపై, ఇతరుల హక్కు (అప్పు వగైరా) ఏదైనా వుంటే దానిని నెరవేర్చాలి. తన ఇంటివారిని – అల్లాహ్‌కు భయపడుతూ వుండమని బోధించాలి. ఒకవేళ ఏదైనా హక్కును నెరవేర్చలేకపోతే దాని గురించి, ఇంటి వారికి, దీని గురించి వసీయతు చేయాలి.

4. ఖుర్ఆన్ మరియు సున్నతుల వెలుగులో హజ్ మరియు ఉమ్రా పద్ధతులను, ఆచారాలను నేర్చుకోవాలి. కేవలం ఇతరుల ద్వారా వినే మాటలపైనే నమ్మకం పెట్టుకోకూడదు. ఎందుకంటే – ‘హజ్జతుల్ విదా’ (వీడ్కోలు హజ్) సందర్భంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చి వున్నారు: “మీరు హజ్ పద్ధతులను, ఆచారాలను (నానుండి) నేర్చుకోండి. బహుశా నేను ఈ హజ్ తర్వాత మరొక హజ్ చేయకపోవచ్చేమో!” *(ముస్లిం:1297)*

అందుకే, ఇతర ఆచరణలన్నింటికీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ ఎలాగైతే అవసరమో, హజ్ పద్ధతులు, ఆచారాలు కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ కు అనుగుణంగానే ఆచరించాలి.

## ప్రయాణ సమయంలో, హజ్ చేస్తున్నప్పుడు పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన మర్యాదలు

1. ఇహ్రాం గురించి సంకల్పించుకున్న తర్వాత నోటిని ప్రత్యేకంగా

జాగ్రత్త పరచుకోవాలి. అనవసరమైన వాటిని చర్చించ కూడదు, తన సహోదరులను కష్టపెట్టకూడదు మరియు వారితో మంచిగా మెలగాలి. తన ఖాళీ సమయాన్నంతటిని అల్లాహ్ విధేయతలో గడపాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

الْحَجُّ أَشْهُرٌ مَّعْلُومَاتٌ ۚ فَمَن فَرَضَ فِيهِنَّ الْحَجَّ فَلَا رَفَثَ وَلَا فُسُوقَ وَلَا جِدَالَ فِي الْحَجِّ ۗ
وَمَا تَفْعَلُوا مِنْ خَيْرٍ يَعْلَمْهُ اللَّهُ ۗ وَتَزَوَّدُوا فَإِنَّ خَيْرَ الزَّادِ التَّقْوَىٰ ۚ وَاتَّقُونِ يَا أُولِي الْأَلْبَابِ ﴿١٩٧﴾

**"హజ్ మాసాలు నిర్ధారితమై ఉన్నాయి. కనుక ఈ నిర్ణీత మాసాలలో హజ్‌ను తనకొరకు విధించుకున్న వ్యక్తి – హజ్ దినాలలో – కామక్రీడలకు, పాప కార్యాలకు, ఘర్షణలకు దూరంగా ఉండాలి. మీరు ఏ సత్కార్యం చేసినా దాని గురించి అల్లాహ్ కు తెలుసు. (హజ్ యాత్రకు బయలు దేరినప్పుడు) ప్రయాణ సామగ్రి (ఖర్చు) ని వెంట తీసుకెళ్ళండి. అయితే, అన్నింటి కంటే అత్యుత్తమ సామగ్రి దైవభీతి (అని బాగా గుర్తుంచుకోండి). కనుక ఓ బుద్ధిమంతులారా! నాకు భయపడుతూ వుండండి."** ***(బఖర:197)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఎవరైనా హజ్ చేసి, దానిలో చెడు విషయాలకు, అల్లాహ్ అవిధేయతకు గనక దూరంగా వుంటే అతను – తన తల్లి గర్భం నుంచి పుట్టిన స్థితిలో (పాపాలేవీ లేని పరిశుద్ధ స్థితిలో) తిరిగివెళ్తాడు."

*(బుఖారీ :1819, ముస్లిం:1350)*

2. హజ్ చేసే వారి రద్దీ ఎక్కువగా వుండే స్థితులు, ప్రత్యేకించి తవాఫ్, సయీ మరియు కంకర్రాళ్ళు విసిరే సమయాల్లో మీ మూలంగా ఇతరులకు కష్టం కలగకుండా చూసుకోవాలి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో – మంచి విశ్వాసి ఎవరు? అని అడగబడింది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – 'అందరికన్నా మంచి ముస్లిం ఎవరంటే – అతని నోటి ద్వారా, అతని చేతుల ద్వారా ఇతర ముస్లిములు సురక్షితంగా వుంటారు' అని వివరించారు.

*(బుఖారీ:11, ముస్లిం:42)*

ఒకవేళ, ఇతరుల మూలంగా మీకేమైనా కష్టం కలిగితే, ఘర్షణ పడకుండా, మన్నించి వేయండి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِينَ يَجْتَنِبُونَ كَبَائِرَ الْإِثْمِ وَالْفَوَاحِشَ وَإِذَا مَا غَضِبُوا هُمْ يَغْفِرُونَ ﴿37﴾

**"వారు (విశ్వాసులు) పెద్ద పెద్ద పాపాలకు, నీతిమాలిన చేష్టలకు దూరంగా ఉంటారు. కోపం వచ్చినప్పుడు (కూడా) క్షమిస్తారు."**

***(అష్షూరా:37)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

وَجَزَاءُ سَيِّئَةٍ سَيِّئَةٌ مِّثْلُهَا ۖ فَمَنْ عَفَا وَأَصْلَحَ فَأَجْرُهُ عَلَى اللَّهِ ۚ إِنَّهُ لَا يُحِبُّ الظَّالِمِينَ ﴿40﴾

**"అపకారానికి బదులు అటువంటి అపకారమే. కానీ ఎవరైనా (ప్రత్యర్థిని) క్షమించి, సయోధ్యకు వస్తే అతనికి పుణ్యఫలం ఇచ్చే బాధ్యత అల్లాహ్‌ది. ఎట్టి పరిస్థితుల్లోనూ అల్లాహ్ దుర్మార్గులను ప్రేమించడు."**

***(అష్షూరా:40)***

3. క్రమం తప్పకుండా సామూహిక నమాజు చేస్తుండాలి. దానిలో ఎలాంటి అశ్రద్ధ చూపకూడదు.

4. స్త్రీలు ఇతరుల (గైర్ మహ్రమ్) ముందు పరదా పాటించకుండా వుండకూడదు. పైగా వారి ముందు ఓణీలు, దుప్పట్లు, (బురఖాలు) వగైరా॥ లతో పరదా పాటించాలి.

హజ్ మహత్యాలు మరియు హజ్ ప్రయాణానికి సంబంధించిన కొన్ని మర్యాదలు వివరించిన తర్వాత, మేము 'హజ్ తమత్తు' కు సంబంధించిన ఆదేశాలను వివరిస్తాం. ఎందుకంటే – భారతదేశం, పాకిస్తాన్ ల నుండి హజ్ కోసం బయలుదేరే వారు సాధారణంగా 'హజ్ తమత్తు' నే చేస్తారు. 'హజ్ తమత్తు' ఏమిటంటే – హాజీ (హజ్ చేసే వ్యక్తి) తన దేశం నుండి బయలుదేరి వెళ్ళేటప్పుడు మీఖాత్ (ఇహ్రాం ధరించే స్థలం) కు చేరుకోగానే ఇహ్రాం దుస్తులు ధరించి అక్కడ కేవలం ఉమ్రా సంకల్పం చేసుకోవాలి. తదుపరి మక్కా ముకర్రమ చేరుకొని ఉమ్రా చేసుకోవాలి. ఆ తర్వాత ఇహ్రాం దుస్తులు విప్పేసి, నిషేదాజ్ఞల నుండి బయటికి వచ్చేయాలి. తదుపరి, జిల్ హిజ్జ 8వ తారీఖున, తను వుంటున్న

స్థలం నుండి మళ్ళీ ఇహ్రాం ధరించి, హజ్ సంకల్పం చేసుకొని మినా వైపుకు ప్రయాణమై, ఆ తర్వాత హజ్ ఆచారాలను పూర్తి చేసుకోవాలి.

కనుక, రండి! ముందుగా మేము ఉమ్రాకు సంబంధించిన ఆదేశాలను వివరిస్తున్నాం.

## ఉమ్రా ఆదేశాలు – పద్ధతి, ఆచారాలు

## 1) ఇహ్రాం

1. ఇహ్రాం అనేది హజ్ మరియు ఉమ్రాలకు సంబంధించిన మొదటి అంశం. అంటే – ఇహ్రాం దుస్తులు ధరించి, తల్బియా (లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్.....) పఠిస్తూ హజ్ మరియు ఉమ్రా ఆచారాలను ప్రారంభించడానికి సంకల్పించు కోవడం. ఇలా చేయడం ద్వారా అతను కొన్ని నిషేధాజ్ఞలను పాటించాల్సి వుంటుంది.

ఉమ్రా యొక్క ఇహ్రాం 'మీఖాత్' నుండి ప్రారంభమవుతుంది. ఒకవేళ ఇహ్రాం దుస్తులు ముందుగానే ధరిస్తే మీఖాత్ స్థలానికి చేరుకున్నాక సంకల్పం చేసుకోవాలి. ఇహ్రాం ధరించకుండా, మీఖాత్‌ను దాటి పోవడం నిషిద్ధం. ఒకవేళ ఎవరైనా ఇలా చేస్తే, అతను మీఖాత్‌కు తిరిగి వెళ్ళాలి లేదా మక్కా ముకర్రమ చేరుకున్నాక ఒక పశువును ఖుర్బానీ ఇవ్వాలి.

### మీఖాతులు

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనా వాసుల కోసం 'జుల్ హులైఫా' (అబియార్ అలీ) ను, సిరియా వాసుల కోసం 'జుహ్ఫా' ను, నజద్ వాసుల కోసం 'ఖర్నుల్ మనాజిల్' ను, యమన్ వాసుల కోసం 'యలమ్‌లమ్' ను మీఖాత్ స్థలాలుగా నిర్ధారించారు. ఈ స్థలాలు – ఆయా దేశస్థుల కోసం మరియు ఆ ప్రదేశాల మీదుగా ప్రయాణించే వారికోసం. ఇక, మీఖాతుల లోపల (మక్కా ముకర్రమ వైపు) నివాసముండే వారు, తమ ఇండ్ల నుంచే ఇహ్రాం సంకల్పం చేసుకోవాలి. ఇలా మక్కా వాసులు, మక్కా నుండే ఇహ్రాం సంకల్పం చేసుకోవాలి. *(బుఖారీ:1524, ముస్లిం:1181)*

2. ఇహ్రాం ధరించేటప్పుడు స్నానం చేయడం, పరిశుభ్రతను పాటించడం, సువాసన ఉపయోగించటం సున్నత్.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) ఇలా సెలవిచ్చారు: "నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఇహ్రాం నిమిత్తం, ఇహ్రాం దుస్తులు తొడిగించి సువాసన పూసే దాన్ని. అలాగే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) హలాల్ స్థితి లోకి వచ్చి (నిషేదాజ్ఞల నుండి బయటి కొచ్చాక) బైతుల్లాహ్ తవాఫ్ (ఇఫాజా తవాఫ్) కు ముందు కూడా ఆయనకు సువాసన పూసే దాన్ని."

*(బుఖారీ: 1539, ముస్లిం:1189)*

3. పురుషులు శుభ్రమైన తెల్లటి దుప్పట్లతో ఇహ్రాం కట్టుకోవాలి.

స్త్రీలు మాత్రం తమ సాధారణ దుస్తుల్లోనే ఇహ్రాం సంకల్పం చేసుకోవచ్చు. ఒకవేళ మీఖాత్ వద్ద స్త్రీ గనక అపరిశుద్ధ స్థితికి లోనయివుంటే, తను స్నానం చేసి ఆ తర్వాత ఇహ్రాం సంకల్పం చేసుకోవాలి.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) మరియు జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం అస్మా బిన్తె ఉమైస్ (రజి అల్లాహు అన్హ) (అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) భార్య) జుల్ హులైఫా లోని బేదా (ఒక స్థలం)లో (ముహమ్మద్ బిన్ అబూబక్ర్‌ను) జన్మ నిచ్చారు. తదుపరి ఆమె నిఫాస్ స్థితిలో వున్నారు. దీనితో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) కు – మీ భార్యకు, స్నానం చేసి ఆ తర్వాత ఇహ్రాం సంకల్పం చేసుకోమని చెప్పండి – అని ఆజ్ఞాపించారు.

*(ముస్లిం:1209,1210)*

4. ఇహ్రాం సంకల్పం ఈ పదాలతో చేసుకోవాలి:

"లబ్బైకల్లాహుమ్మ ఉమ్రతన్".

ఒకవేళ మార్గం మధ్యలో ఏదైనా అడ్డుగా తగిలే ప్రమాదముంటే అప్పుడు ఇలా కూడా ప్రార్థించవచ్చు. "ఓ అల్లాహ్! (మార్గం మధ్యలో) ఆపగలిగేదేదైనా నన్ను గనక ఆపేస్తే, అదే నా స్థానం అవుతుంది."

తదుపరి, తల్బియ పఠించడం మొదలుపెట్టి, తవాఫ్ ప్రారంభించేవరకు పఠిస్తూ వుండాలి.

తల్బియ పదాలు ఇవి:

**"లబ్బైె కల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక లాషరీ కలక లబ్బైక్, ఇన్నల్ హమ్ద, వన్నేమత, లకవల్ ముల్క్, లాషరీకలక."***(బుఖారీ:1549, ముస్లిం:1184)*

"నేను హాజరయ్యాను, ఓ అల్లాహ్! నేను హాజరయ్యాను, నీకు భాగస్వాములు ఎవరూ లేరు, నేను హాజరయ్యాను, నిశ్చయంగా సమస్త స్తోత్రాలు, అనుగ్రహాలు మరియు సామ్రాజ్యాధికారాలు నీకే చెందుతాయి. నీకు భాగస్వాములు ఎవరూ లేరు."

5. పురుషులు తల్బియ ను బిగ్గరగా పఠించడం ఉత్తమం.

ఎందుకంటే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన సహాబాలకు ఇలా ఆదేశించారు:

"నా వద్దకు జిబ్రయీల్ (అలైహిస్సలాం) వచ్చి –మీ సహాబాలకు, మీతో పాటు వున్న వారందరికీ 'తల్బియ' బిగ్గరగా పఠించమని ఆదేశించండి – అని నాకు ఆజ్ఞాపించారు."*(తిర్మిజి:829, అబూదావూద్:1814, సహీ – అల్‌బానీ)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తల్బియ పఠనం మహత్యాన్ని గూర్చి ఇలా సెలవిచ్చారు: "ఏ ముస్లిం అయినా తల్బియ పఠించేటప్పుడు, అతనికి ఇరువైపులా వున్న రాళ్ళు, చెట్లు మరియు ఇసుక రేణువులు కూడా తల్బియ పఠిస్తాయి." *(తిర్మిజి:828, సహీహ్–అల్‌బానీ)*

అబూహురైరా (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"తల్బియ పఠించే వారు ఎవరైనా తల్బియ పఠించేటప్పుడు అతనికి శుభవార్త ఇవ్వబడుతుంది. అలాగే, తక్బీర్ పలికే వారు తక్బీర్ పలికినప్పుడు అతనికి శుభవార్త ఇవ్వబడుతుంది. (ఇది విని) ఓ దైవ ప్రవక్తా! స్వర్గం యొక్క శుభవార్త ఇవ్వబడుతుందా? అని అడగ బడింది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అవును అని అన్నారు.

*(తబ్రానీ –ఔసత్, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 1137)*

**6. కొన్ని పొరపాట్లు.**

ఇహ్రాం ధరించకుండా మీఖాత్‌ను దాటిపోవడం, ఇహ్రాం ధరించగానే

కుడిభుజాన్ని నగ్నంగా చేసు కోవడం. వాస్తవానికి ఇలా 'ఖుద్దూమ్ తవాఫ్' లోనే చేయాలి. ప్రత్యేక శైలిలో రూపొందించబడ్డ బూట్లనే ధరించడం. (వాస్తవానికి చీలమండ కనబడే విధంగా ఏ రకమైన బూట్లు అయిన (చెప్పులు అయినా) ధరించవచ్చు). ఇహ్రాం ధరించాక వీలైనంత ఎక్కువగా అల్లాహ్ స్మరణ, అస్తగ్‌ఫార్ మరియు తల్బియ పఠించకుండా ప్రాపంచిక విషయాలలో నిమగ్నమై వుండడం. సామూహిక నమాజు పట్ల అశ్రద్ధ చూపడం. స్త్రీలు తమ భర్తలు లేదా మహ్‌రమ్ లేకుండా ప్రయాణం చెయ్యడం. ఇతరుల ముందు స్త్రీలు పరదా పాటించక పోవడం. ఇహ్రాం ధరించాక అందరితో కలిసి ఫోటోలు దిగడం....

**7. ఇహ్రాం స్థితిలో నిషేధాలు.**

ఇహ్రాం సంకల్పం చేసుకున్న తర్వాత కొన్ని విషయాలు నిషేధం అయిపోతాయి. శరీర భాగాల నుండి వెంట్రుకలను కత్తించడం లేదా పీకడం, గోర్లు కత్తిరించడం, సువాసన ఉపయోగించడం, భార్యతో సంభోగం లేదా ముద్దు పెట్టుకోవడం, చేతి తొడుగులు ధరించడం, వేటాడడం..... ఈ పనులన్నీ, పురుషులూ, స్త్రీలు – ఇద్దరికీ నిషేధం అయిపోతాయి. పురుషులకు, కుట్టబడిన వస్త్రాలు, తలను కప్పుకోవడం కూడా నిషేధమయి పోతాయి.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం ఒక వ్యక్తి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను – ఓ దైవప్రవక్తా! ఇహ్రాం స్థితిలోని వ్యక్తి ఎలాంటి దుస్తులు ధరించాలి? అని అడిగాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) – అతను షర్టు, తలపాగ, షల్వార్ (లేదా పైజామా) మరియు 'రేన్ కోట్' ధరించకూడదు. అలాగే సాక్సులు కూడా ధరించకూడదు. ఒకవేళ ఎవరికైనా బూట్లు దొరక్కపోతే సాక్సులు తొడగ వచ్చు, కానీ వాటిని చీలమండ క్రింది వరకు కత్తిరించాలి. జాఫ్రాను లేదా విరస్ (ఒక రకమైన గడ్డి) సువాసన లేదా వాటి రంగు పూయబడిన దుస్తులు ధరించకూడదు. స్త్రీ అయితే నిఖాబ్ (ముఖానికి అడ్డంగా వుండే బట్ట) కట్టు కోవడం హరామ్ అయి పోతుంది.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) గారి ఈ హదీసు యొక్క మరొక ఉల్లేఖనం ఆఖరిలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా

సెలవిచ్చారు:

"ఇహ్రాం స్త్రీ నిఖాబ్ కట్టు కోకూడదు, చేతి తొడుగులు కూడా ధరించ కూడదు." *(బుఖారీ:1838)*

కానీ, పర పురుషుల ముందు తను పరదా పాటించాల్సి వుంటుంది. బట్ట ఆమె ముఖానికి తగులుతూ వున్నప్పటికీ.

ఫాతిమా బిన్తె మున్‌జిర్ (రజి అల్లాహు అన్హా) కథనం:

"మేము ఇహ్రాం స్థితిలో అస్మా బిన్తె అబూబక్ర్ సిద్దీఖ్ తోపాటు మా ముఖాలను కప్పుకొనే వాళ్ళం."

అస్మా బిన్తె అబూబక్ర్ (రజి అల్లాహు అన్హా) కథనం:

"ఇహ్రాం స్థితిలో మేము, ముఖాలను పర పురుషుల నుండి దాచివుంచే వాళ్ళం మరియు దానికి ముందు దువ్వుకొనే వాళ్ళం."

*(ఇర్వాఉల్ గలీల్ : 4వ సంపుటం, 212 పేజీ, సహీ–అల్‌బానీ)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం:

"మేము దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు ఇహ్రాం లో వున్నాం. పర పురుషులు మా ముందుకు రాగానే మాలోని ప్రతి స్త్రీ తన దుప్పటిని ముఖంపై వ్రేలాడ దీసేది. వాళ్ళు (పర పురుషులు) ముందుకు వెళ్ళిపోయాక మా ముఖాల మీది పరదాలను మేము తొలగించే వాళ్ళం."

*(అబూదావూద్:1833, ఇబ్నెమాజా:2935, జయీఫ్ – అల్‌బానీ, కానీ దీని రెండు సాక్ష్యాలు ముందు వివరించబడ్డాయి)*

8. ఇహ్రాం స్థితిలో స్నానం చేయటం, తలను గోక్కోవడం, గొడుగును ఉపయోగించడం మరియు బెల్ట్‌లు వాడడం సరైనదే.

నీడ కలిగించడం గురించి ఉమ్మె హుసైన్ (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం ఆమె 'హజ్జతుల్ విదా' లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు వున్నారు. ఆమె, ఉసామా (రజి అల్లాహు అన్హు) మరియు బిలాల్ (రజి అల్లాహు అన్హు) లను చూడగా వారిలో ఒకరు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒంటె త్రాడు పట్టుకొని వుండగా మరొకరు, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ఎండ తగలకుండా, వస్త్రాన్ని పైకి లేపి పట్టుకొని వున్నారు. *(ముస్లిం:1298)*

## 2) తవాఫ్

1. మస్జిదుల్ హరామ్ కు చేరుకున్నాక 'తల్బియ' పఠించడం ఆపేయాలి. తదుపరి 'హజ్రె అస్వద్' ముందుకు వచ్చి తన కుడి భుజాన్ని నగ్నంగా చేసుకోవాలి. దీనిని 'ఇజ్తెబా' అంటారు.

*(అబూదావూద్:1883,1884,సహీహ్ – అల్‌బానీ)*

ఒకవేళ 'హజ్రె అస్వద్' ను తేలిగ్గా ముద్దాడ గలిగితే మంచిదే. లేకపోతే చేత్తో తాకి దానిని ముద్దాడవచ్చు. ఒకవేళ ఇది కూడా సాధ్యం కాకపోతే, కుడిచేత్తో దాని వైపుకు సంజ్ఞ చేస్తూ 'బిస్మిల్లాహ్, అల్లాహు అక్బర్' అని పలికి తవాఫ్ ప్రారంభించాలి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉమర్ (రజి అల్లాహు అన్హు) తో ఇలా అన్నారు:

"ఓ ఉమర్! మీరు బలవంతులు, కనుక హజ్రె అస్వద్ వద్ద ఇబ్బంది పెట్టి (మీ పరాక్రమం చూపి) బలహీనులలకు కష్టం కలిగించకండి. హజ్రె అస్వద్ ఇస్తెలాం (తాకడం) చేయాల్సి వచ్చినప్పుడు ఒకసారి చూసుకోండి. ఒకవేళ తేలిగ్గా చేయగలిగితే మంచిదే. లేకపోతే, దాని ముందుకు వచ్చి తవాఫ్ సంకల్పం చేసుకొని తక్బీర్ పలకండి." *(ముస్నద్ అహ్మద్ : 1/321)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రె అస్వద్ మహత్యాన్ని గూర్చి ఇలా సెలవిచ్చారు.: "హజ్రె అస్వద్ స్వర్గం నుండి అవతరించినప్పుడు పాల కన్నా తెలుపుగా వుంది. ఆదం సంతానం తప్పులు దానిని నల్లగా మార్చేశాయి." *(తిర్మిజి: 877, సహీహ్– అల్‌బానీ)*

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రె అస్వద్ గురించి ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ సాక్షి! ప్రళయం రోజు అది – తను చూడగలిగే రెండు కళ్ళు, మాట్లాడ గలిగే గొంతు వున్న స్థితిలో లేపబడుతుంది. అది – సత్యంతో తనను తాకిన వారి గురించి సాక్ష్యమిస్తుంది."

*(తిర్మిజి, ఇబ్నె హిబ్బాన్, సహీ అత్తర్ గీబ్ వ తర్‌హీబ్: 1144)*

కానీ, హజ్రె అస్వద్ లాభం కానీ, నష్టం కానీ చేకూర్చలేదు అన్న విషయాన్ని హాజీ గుర్తుంచుకోవాలి.

ఉమర్ (రజి అల్లాహు అన్హు) ద్వారా ఉల్లేఖించబడిన దేమిటంటే – ఆయన హజ్రె అస్వద్ ను ముద్దాడారు. తదుపరి, ఇలా సెలవిచ్చారు:

"నువ్వొక రాయివని నాకు తెలుసు. నువ్వు లాభం కానీ, నష్టం కానీ చేకూర్చలేవు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిన్ను ముద్దాడుతుండగా నేను గనక చూసివుండక పోతే, నేనెప్పుడూ నిన్ను ముద్దాడే వాణ్ణి కాను."

*(బుఖారీ:1597, ముస్లిం:1270)*

2. తవాఫ్ చేస్తున్నప్పుడు, మొదటి మూడు ప్రదక్షిణలు భుజాలను కదుపుతూ, చిన్న చిన్న అడుగులు వేస్తూ వేగంగా నడవాలి. దీనిని 'రమల్' అంటారు. కానీ, ఒకవేళ రద్దీ ఎక్కువగా వుంటే కేవలం భుజాలను కదిపినా సరిపోతుంది. ఈ ఆజ్ఞ స్త్రీలకు, వారితో కలిసి వెళ్ళిన పురుషులకు వర్తించదు.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ లేదా ఉమ్రా కోసం తవాఫ్ చేస్తున్నప్పుడు, మొదటి మూడు ప్రదక్షిణలు వడివడిగా అడుగులు వేస్తూ, వేగంగా చేసేవారు. మిగిలిన నాలుగు ప్రదక్షిణలు సాధారణ వేగంతో చేసేవారు. తదుపరి రెండు రకాతులు చదివి, ఆ తర్వాత సఫా, మర్వాల మధ్య 'సయీ' చేసేవారు.

*(బుఖారీ:1616, ముస్లిం:1261)*

3. తవాఫ్ చేస్తున్నప్పుడు స్మరణ(జిక్ర్), దుఆ, ఖుర్ఆన్ పారాయణంలలో నిమగ్నమై వుండాలి. ప్రతి ప్రదక్షిణ కోసం ప్రత్యేకమైన దుఆ ఏదీ లేదు. కానీ, రుక్నె యమానీ మరియు హజ్రె అస్వద్ ల మధ్య 'రబ్బనా ఆతినా ఫిద్దునియా హసనతవ్వఫిల్ ఆఖిరతి హసనతవ్వఖినా అజాబన్నార్' పఠించండం సున్నత్.

*(అబూ దావూద్: 1892, హసన్–అల్బానీ)*

జిక్ర్, దుఆల ను బిగ్గరగా చేయడం సరైనది కాదు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**وَاذْكُر رَّبَّكَ فِي نَفْسِكَ تَضَرُّعًا وَخِيفَةً وَدُونَ الْجَهْرِ مِنَ الْقَوْلِ بِالْغُدُوِّ وَالْآصَالِ**
**وَلَا تَكُن مِّنَ الْغَافِلِينَ (205)**

**"నీ మనసు లోనే – కడు వినమ్రతతో, భయంతో – నీ ప్రభువును**

**స్మరించు. ఉదయం, సాయంత్రం బిగ్గరగా కాకుండా, మెల్లగా నోటితో కూడా (స్మరించు). విస్మరించే వారిలో చేరిపోకు." *(ఆరాఫ్:205)***

ఇంకా, ఇలా సెలవిచ్చాడు:

ٱدۡعُواْ رَبَّكُمۡ تَضَرُّعٗا وَخُفۡيَةًۚ إِنَّهُۥ لَا يُحِبُّ ٱلۡمُعۡتَدِينَ ٥٥

**"మీరు మీ ప్రభువును కడుదీనంగా వేడుకోండి. గోప్యంగా కూడా విన్నవించుకోండి. హద్దు మీరిపోయే వారిని ఆయన ఎంత మాత్రం ఇష్టపడడు." *(ఆరాఫ్:55)***

4. " బిస్మిల్లాహ్, అల్లాహు అక్బర్" అంటూ రుక్నె యమానీని తాకడం కూడా సున్నత్. అందుకే ఎవరైనా, దీనిని తేలిగ్గా గనక చేయగలిగితే మంచిదే. కానీ, ఒకవేళ అలా చేయలేక పోతే చేత్తో సైగ చేయకుండానే, ముద్దాడ కుండానే దానిని దాటిపోవాలి.

అబ్దుల్లా బిన్ అమ్ర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "నిశ్చయంగా రుక్న్ (హజ్రె అస్వద్) మరియు మఖామ్ (మఖామె ఇబ్రాహీం) స్వర్గంలోని విలువైన రాళ్ళలో రెండు రాళ్ళు. అల్లాహ్ వాటిని కాంతిహీనంగా చేసేశాడు. ఒకవేళ ఆయన వాటిని కాంతిహీనంగాచేసి వుండక పోతే, అవి తూర్పు పడమరల మధ్య ప్రపంచం మొత్తాన్నీ కాంతివంతం చేసేవి." *(తిర్మిజి:878, సహీహ్–అల్బానీ)*

5. ఏడు ప్రదక్షిణలు పూర్తయ్యాక, మఖామె ఇబ్రాహీం వెనుక, ఒకవేళ స్థలం దొరికితే మంచిది, లేకపోతే మస్జిదుల్ హారామ్ లోని ఏ భాగంలో నయినా రెండు రకాతులు చదవాలి. దీనిలో – మొదటి రకాతులో ఫాతిహా సూరాతో పాటు 'కాఫిరూన్' సూరా మరియు రెండవ రకాతులో 'ఇఖ్లాస్' సూరా పఠించాలి. *(ముస్లిం:1218)*

తదపరి, జమ్‌జమ్ నీళ్ళు త్రాగాలి మరియు తలపై వేసుకోవాలి. ఆ తర్వాత, ఒకవేళ అవకాశం దొరికితే హజ్రె అస్వద్ ను తాకాలి. ఎందుకంటే ఇలా చేయడం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్. ఒకవేళ ఇలా చేయడం కుదరకపోతే, నేరుగా సఫా కొండవైపుకు వెళ్ళాలి.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మక్కా ముకర్రమ చేరుకొని, మస్జిదుల్ హరాంలో ప్రవేశించారు.

తదుపరి, హజ్రె అస్వద్‌ను తాకి, తన కుడి వైపుకు నడిచారు. మొదటి మూడు ప్రదక్షిణలలో ఆయన 'రమల్' చేసారు. మిగిలిన నాలుగు ప్రదక్షిణలు సామాన్య వేగంతో పూర్తి చేసారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మఖామె ఇబ్రాహీం వద్ద కొచ్చి – 'మీరు ఇబ్రాహీం నిలబడిన ప్రదేశాన్ని నమాజు స్థలంగా చేసుకోండి' *(బఖర:125)* అన్న ఆయతును పఠించారు. మఖామె ఇబ్రాహీంను తనకూ, బెతుల్లాహ్ కు మధ్యగా వుంచి రెండు రకాతులు నమాజు చదివారు. తదుపరి మళ్ళీ హజ్రె అస్వద్ వద్ద కొచ్చి ఇస్తెలామ్ (తాకడం) చేశారు. ఆ తర్వాత సఫా వైపుకు వెళ్ళి పోయారు." *(ముస్లిం:1218)*

## తవాఫ్ లో జరిగే కొన్ని పొరపాట్లు:

హజ్రె అస్వద్‌ను ముద్దాడేటప్పుడు ఇబ్బంది పెట్టి ముస్లిములకు కష్టం కలిగించడం, రెండు చేతులెత్తి హజ్రె అస్వద్ వైపు సైగ చేయడం, హాతీమ్ నుంచి పోతూ తవాఫ్ చేయడం, రుక్నె యమానీ ని ముద్దాడడం, ఇలా చేయలేకపోతే దానివైపు సైగ చేయడం, ప్రతి ప్రదక్షిణ కొరకు ఒక దుఆను ప్రత్యేకించుకోవడం, కాబా గోడలపై, ఆశీర్వాద సంకల్పంతో చేతులు త్రిప్పడం, ఖుద్దూమ్ తవాఫ్ తర్వాత కూడా కుడిభుజాన్ని నగ్నంగా వుంచడం. తవాఫ్ చేస్తున్నప్పుడు బిగ్గరగా దుఆలు పఠించడం.

## జమ్‌జమ్ మహత్యం

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"యావత్ భూమండలంలో అన్నింటికన్నా శ్రేష్టమైన నీరు జమ్‌జమ్ నీరు. అది (తినేవారికి) భోజనం కూడాను. దీనితో పాటు, దీనిలో వ్యాధులకు ఉపశమనం కూడా వుంది."

**(తబ్రానీ, ఇబ్నె హిబ్బాన్, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 1161)**

ఇబ్నె అబ్బాస్ (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలాసెలవిచ్చారు:

"జమ్ జమ్ నీటిని ఏ ఉద్దేశ్యంతో త్రాగితే, అతని ఆ ఉద్దేశ్యం పూర్తి చేయబడుతుంది." *(దారెఖుత్ని, హాకిం, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్:1164)*

6. తవాఫ్, రెండు రకాతులు, హజ్రె అస్వద్ ఇస్తెలామ్ ల తర్వాత 'ముల్తజమ్' వద్దకు వెళ్ళాలను కుంటే వెళ్ళవచ్చు. ఎందుకంటే ఇలా చేయడం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా నిరూపించబడి వుంది.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, ఆయన తవాఫ్ చేసారు, తదుపరి రెండు రకాతులు నమాజు చేసి, ఇస్తెలామ్ చేసారు. ఆ తర్వాత హజ్రె అస్వద్ మరియు కాబా ద్వారం మధ్య నిలబడి తన ఛాతీని, చేతులను, చెంపలను బైతుల్లాహ్ తో కలిపారు. తదుపరి ఇలా సెలవిచ్చారు: నేను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలాగే చేస్తుండగా చూశాను. *(తిర్మిజి:2962, అస్సహీహ లిల్ అల్బానీ: 2138)*

## 3) సయీ

సఫా దగ్గరికి వెళ్ళి – 'ఇన్నస్సఫా వల్ మర్వత మిన్ షాఇరిల్లాహ్' (నిస్సందేహంగా సఫా, మర్వాలు అల్లాహ్ చిహ్నాల లోనివి) అని పఠించి తదుపరి సఫా పైకెక్కి, కాబా గృహం వైపు ముఖం త్రిప్పి ఈ దుఆ పఠించాలి:

"లా ఇలాహ ఇల్లల్లాహు, వహదహూ లాషరీకలహు, లహుల్ ముల్కు వలహుల్ హమ్దు, యుహ్యీ వయుమీతు, వహువ అలాకుల్లి షయ్యిన్ ఖదీర్. లా ఇలాహ ఇల్లల్లాహు వహదహూ లాషరీ కలహు అన్జజ వాదహు వ నసర అబ్దహు వ హజమల్ అహ్జాబ వహదహు."

తదుపరి చేతులెత్తి ప్రార్థించాలి. మూడుసార్లు ఇలాగే చేసి ఆ తర్వాత మర్వా వైపుకు వెళ్ళాలి. దారిలో రెండు ఆకుపచ్చరంగు చిహ్నాల మధ్య పరుగెత్తాలి. కానీ, స్త్రీలు, వారివెంట వున్న పురుషులు పరుగెత్త కూడదు. తదుపరి మామూలుగా నడుచుకుంటూ మర్వా చేరుకోవాలి. అక్కడికి చేరగానే ఒక ప్రదక్షిణ పూర్తవుతుంది. అక్కడ కూడా, సఫాపైన చేసినట్లే చేయాలి. తదుపరి సఫా వైపుకు రావాలి. దారిలో రెండు ఆకుపచ్చరంగు చిహ్నాల మధ్య పరుగెత్తాలి. సఫా చేరుకోగానే రెండవ ప్రదక్షిణం పూర్తవుతుంది. ఇలా ఏడు ప్రదక్షిణలు పూర్తి చేయాలి. ఆఖరి ప్రదక్షిణం మర్వాలో పూర్తవుతుంది. సయీ చేస్తున్నప్పుడు జిక్ర్, దుఆ, ఖుర్ఆన్ పారాయణంలలో నిమగ్నమై వుండాలి.

**కొన్ని పొరపాట్లు:** సఫా, మర్వాలపై ఖిబ్లా వైపు తిరిగి రెండు చేతులతో సైగ చేయడం. నమాజ్ కోసం ఇఖామత్ చెప్పబడిన తర్వాత కూడా సయీ ని

ఆపక పోవడం, సయీ కోసం ఏడు ప్రదక్షిణలు కాకుండా 14 ప్రదక్షిణలు చేయడం....

## 4) శిరోముండనం లేదా వెంట్రుకలు కత్తిరించడం.

సఫా, మర్వాల మధ్య సయీ పూర్తి చేసిన తర్వాత శిరోముండనం చేసుకోవాలి లేదా వెంట్రుకలన్నీ చిన్నగా కత్తిరించుకోవాలి. శిరోముండనం చేసుకోవడం ఉత్తమం. స్త్రీ తన జడలలో, ప్రతి జడ నుండి వ్రేలి ఒక కట్టుకు సమానంగా వెంట్రుకలు కత్తిరించుకోవాలి. పురుషులు తలలో, కేవలం కొంతభాగం లోని వెంట్రుకలను చిన్నగా కత్తిరించుకొని హలాల్ కావడం సున్నత్‌కు విరుద్ధం.

ఇలా, మీ ఉమ్రా పూర్తవుతుంది. ఇహ్రాం మూలంగా ఏవైతే నిషేధాలు పాటించబడ్డాయో, అవి సమాప్తమై పోతాయి. ఇక మీరు ఇహ్రాం ను విప్పేయ వచ్చు.

అల్లాహ్ మనందరికీ, హజ్ చేసేవారికి, స్వీకరించబడే ఉమ్రాను చేసే భాగ్యాన్ని ప్రసాదించు గాక! ఆమీన్!

## రెండవ ఖుత్బా

మొదటి ఖుత్బాలో మేము హజ్ ప్రాధాన్యత, విధిత్వము, హజ్ మహత్యాలు, హజ్ ప్రయాణ మర్యాదలు మరియు ఉమ్రా ఆదేశాల గురించి వివరించాం.

ఇక, ఉదయించే ప్రశ్న ఏమిటంటే, హజ్ కోసం వెళ్ళిన వారు (హాజీలు) ఉమ్రా పూర్తి చేసుకున్నాక జిల్‌హిజ్జ 8 వ తారీఖు (యౌముత్తర్‌వియ) వరకు ఏం చెయ్యాలి?

1. కొంతమంది ఉమ్రా పూర్తి చేసుకున్నాక, వివిధ మస్జిద్‌ల మరియు పర్వాతాలను పుణ్యఫలాపేక్షతో సందర్శిస్తారు. కానీ ఇది సమయాన్ని వృధా చేయడమే అవుతుంది. అలాగే, మస్జిద్ ఆయెషా (రజి అల్లాహు అన్హా) నుండి ఇహ్రాం ధరించి మాటిమాటికి ఉమ్రా చేయడం కూడా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఆయన సహాబాల ద్వారా నిరూపించబడిలేదు. కేవలం ఆయెషా (రజి అల్లాహు అన్హా) ద్వారా నిరూపించడి వున్న విషయమే

మిటంటే – ఆమె, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు మక్కా ముకర్రమ చేరుకున్నప్పుడు అపరిశుద్ధ అవస్థలో వున్నారు. అందుకే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెను ఉమ్రా చేయడం గురించి వారించారు. తదుపరి ఆమె, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తో కలిసి హజ్ చేసారు. తదుపరి మదీనా మునవ్వర కు తిరిగి వెళ్ళే ముందు ఆమె, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో – ప్రజలంతా హజ్ మరియు ఉమ్రా, రెండూ చేయగా నేను మాత్రం హజ్ మాత్రమే చేశాను – అన్న విషయం నా మనసులో వుండిపోతుంది అని అన్నారు. దీనితో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమె సోదరునికి – ఆమెను తీసుకొని 'తనీమ్' వద్ద కెళ్ళి, అక్కడ ఇహ్రాం సంకల్పం చేసుకొని వచ్చి ఉమ్రా చేయించమని ఆజ్ఞాపించారు. ఇలా ఆమె ఉమ్రా పూర్తి చేసుకున్నారు. *(బుఖారీ:1556, ముస్లిం:1211)*

ఇదొక ప్రత్యేక విషయం. కానీ ప్రజలు దీనిని సాకుగా తీసుకొని ఉమ్రా మరియు హజ్‌ల మధ్య మాటిమాటికీ తనీమ్ వద్దకెళ్ళి ఇహ్రాం ధరించి ఎన్నో ఉమ్రాలు చేస్తుంటారు. వాస్తవానికి ఇది దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ద్వారా కానీ, సహాబాల ద్వారా గానీ నిరూపించబడి లేదు. అందుకే మేము అనుకునే దేమిటంటే – మాటి మాటికీ ఉమ్రా చేసే బదులు, మస్జిదుల్ హరామ్‌లో సామూహిక నమాజ్ చేస్తూ, ఐచ్ఛిక కాబా గృహం ప్రదక్షిణ (నఫిల్ తవాఫ్) పలుసార్లు చేయడం ఎంతో ఉత్తమం.

2. మస్జిదుల్ హరామ్‌లో సామూహిక నమాజ్ క్రమం తప్పకుండా నెలకొల్పుతూ వుండాలి. దీని మహత్యం గురించి చెప్పాలంటే, కేవలం ఈ విషయం చాలు – దీనిలోని ఒక్క నమాజ్ ఇతర మస్జిద్‌లలోని లక్ష నమాజుల కన్నా మేలైనది. ఈ విషయం మేము గత శుక్రవారపు ఖుత్బాలో వివరించి వున్నాం.

3. కాబా గృహం ఐచ్ఛిక పదక్షిణ (నఫిల్ తవాఫ్) చేస్తూ వుండాలి.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఎవరైనా బైతుల్లాహ్ తవాఫ్ చేసి, రెండు రకాతులు నమాజ్ చదివితే అతనికి, ఒక వ్యక్తికి స్వేచ్ఛ ప్రసాదించినంత పుణ్యం దొరుకుతుంది."

*(ఇబ్నెమాజ: 2956, సహీ – అల్‌బానీ)*

మరో సహీ హదీసులో ఇలా వచ్చింది:

“(తవాఫ్ చేస్తున్నప్పుడు) వేసే ప్రతి అడుగుకు గాను 10 పుణ్యాలు వ్రాయబడతాయి, 10 పాపాలు తుడిచి వేయ బడతాయి, 10 అంతస్తులు (పైకి) లేపబడతాయి.”

**(అహ్మద్, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ లిల్ అల్‌బానీ:1139)**

4. ఒకవేళ మీరు కాబా గృహం లోపల నమాజ్ చదివిన గౌరవాన్ని పొందాలనుకుంటే ‘హతీమ్’లో చదువుకోండి. ఎందుకంటే, హతీమ్ కూడా కాబాలోని అంతర్భాగమే.

ఆయెషా (రజి అల్లాహు అన్హ) కథనం:

నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను, కాబా గృహం లోపలికి వెళ్ళి నమాజు చేస్తానని విన్నవించుకున్నాను. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నా చేయి పట్టుకొని అల్ హిజ్ర్ (హతీమ్) లోపలికి తీసుకెళ్ళి ఇలా సెలవిచ్చారు:

“ఒకవేళ నువ్వు బైతూల్లాహ్ లోపలికి ప్రవేశించాలనుకుంటే హతీమ్ లోపలే నమాజు చేసుకో. ఎందుకంటే ఇది (హతీమ్) కూడా కాబా యొక్క ఒక భాగమే, కానీ నీ జాతివారు కాబా గృహాన్ని నిర్మించేటప్పుడు చిన్నదిగా చేద్దామనుకున్నారు. అందుకేవారు దీనిని (హతీమ్‌ను) బైతుల్లాహ్ నుండి వేరు చేసారు.” *(తిర్మిజి: 876, సహీ – అల్‌బానీ)*

హజ్‌కు సంబంధించిన మిగతా ఆదేశాలు ఇన్షాఅల్లాహ్ వచ్చే శుక్రవారం వివరించబడతాయి. అల్లాహ్ హాజీలందరి మరియు మనందరి ఆరాధనలన్నీ స్వీకరించుగాక! ఆమీన్!

# హజ్ మహత్యాలు, ఆదేశాలు మరియు మర్యాదలు - (2)

## ఖుత్బాయందలి ముఖ్యాంశాలు

1. హజ్‌కు సంబంధించిన సమగ్ర ఆదేశాలు, వివరాలు.
2. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్‌కు సంబంధించి బాగా ప్రాచుర్యం పొందిన జాబిర్ (రజి అల్లాహు అన్హు) హదీసు.
3. మదీనా సందర్శన మర్యాదలు.

## మొదటి ఖుత్బా

గత శుక్రవారపు ఖుత్బాలో ఖుర్ఆన్ మరియు హదీసుల వెలుగులో హజ్ ప్రాధాన్యత, విధిత్వము, హజ్ మహత్యాలు, హజ్ ప్రయాణానికి సంబంధించిన కొన్ని మర్యాదలు, ఉమ్రాకు సంబంధించిన సమగ్ర ఆదేశాలు, వివరాలు వివరించాం. నేటి ఖుత్బాలో, హజ్ ఆదేశాలు, దాని వివరాలతో పాటు మదీనా మునవ్వర సందర్శనకు సంబంధించిన మర్యాదలను సమగ్రంగా వివరిస్తాం.

## హజ్‌కు సంబంధించిన సమగ్ర ఆదేశాలు, వివరాలు

### జిల్ హిజ్జ - 8వ తేది (యౌముత్తర్‌వియా)

మక్కా ముకర్రమ లో మీరు నివాసముంటున్న స్థలం నుంచే ఇహ్రాం కట్టుకోవాలి. ఇహ్రాం కట్టుకోవడానికి ఉమ్రా కోసం అవలంబించిన పద్ధతే హజ్ కు కూడా వర్తిస్తుంది. కనుక, పరిశుభ్రత, స్నానం ముగించి, శరీరంపై సువాసన పూసుకొని ఇహ్రాం దుస్తులు ధరించాలి.

తదుపరి 'లబ్బైకల్లాహుమ్మ హజ్జన్' అని అంటూ హజ్ గురించి సంకల్పించుకొని 'తల్బియ' పఠించడం ప్రారంభించాలి. జిల్ హిజ్జ 10 వ తేదీనాడు కంకర్రాళ్ళను కొట్టే వరకు తల్బియ పఠిస్తూనే వుండాలి. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'రమీ' చేసే వరకు తల్బియ పఠిస్తూనే వున్నారు. *(బుఖారీ:1670,1685, ముస్లిం:1281)*

ఇహ్రాం ధరించాక, జొహర్ కు ముందు 'మినా' బయలుదేరాలి. 'మినా'

లో జొహర్, అసర్, మగ్రిబ్, ఇషా మరియు జిల్ హిజ్జ 9వ తేది ఫజర్ నమాజులను 'ఖసర్' చేస్తూ వాటి వాటి సమయాల్లో చదవాలి మరియు రాత్రి అక్కడే గడపాలి. ఇది దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్.

*(బుఖారీ: 1653,1655,ముస్లిం: 694,1309)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మినా లో మాకు జొహర్, అసర్, మగ్రిబ్, ఇషా మరియు ఫజర్ నమాజులు చేయించారు. ఆ తర్వాత అరాఫాత్ వైపుకు ప్రయాణమయ్యారు." *(తిర్మిజి: 879, సహీ – అల్‌బానీ)*

ఈ విషయాన్నే జాబిర్ (రజి అల్లాహు అన్హు) తన సుదీర్ఘ హదీసులో ఉల్లేఖించారు. *(ముస్లిం:1218)*

## జిల్ హిజ్జ 9వ తేది (యౌమె అరఫా)

అరఫా దినం (యౌమె అరఫా) ఎంతో మహోన్నతమైన దినం. ఈరోజు అరాఫాత్ లో గడపడం. హజ్ మౌలికాంశాలలో అన్నిటి కన్నా ముఖ్యమైన అంశం. అందుకే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అరాఫాత్ లో గడపడాన్ని హజ్ గా ఖరారు చేశారు.

*(తిర్మిజి:889, ఇబ్నెమాజ:3015, సహీ – అల్‌బానీ)*

ఈ దినపు మహత్యాన్ని గూర్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "అల్లాహ్ అరాఫాత్ దినం నాడు అత్యధికంగా తన దాసులను నరకాగ్ని నుండి విముక్తి కలిగిస్తాడు మరియు దగ్గరగా వచ్చి దైవదూతల ముందు ఇలా అడుగుతాడు: వీరేం కోరుకుంటున్నారు?"

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆరాఫాత్ లో బస చేశారు. తదుపరి, సూర్యాస్తమయం కాబోయే సమయంలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) బిలాల్ (రజి అల్లాహు అన్హు) తో – ఓ బిలాల్! నిశ్శబ్దంగా వుండి నా వైపు దృష్టి సారించమని ప్రజలకు చెప్పు అని అన్నారు. దీనితో ఆయన, ప్రజలను నిశ్శబ్ధం గావించగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "ప్రజలారా! ఇంతకు ముందే జిబ్రయీల్ (అలైహిస్సలాం) నావద్ద కొచ్చారు.

ఆయన నాకు, నా ప్రభువు సలాం అందజేసి ఇలా సెలవిచ్చారు – అల్లాహ్ అరాఫాత్ వాసులను, మష్అర్ వాసులను మన్నించాడు మరియు వారి హక్కుల బాధ్యతను తనపై వేసుకున్నాడు.”

దీనిపై, ఉమర్ (రజి అల్లాహు అన్హు) లేచి నిలబడి – ఓ దైవ ప్రవక్తా! ఇది కేవలం మా కోసమే ప్రత్యేకమా? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – “ఇది మీ కొరకు మరియు ప్రళయం వరకు వచ్చే ప్రతి వ్యక్తి కొరకు” అని జవాబిచ్చారు.

*(సహీ అత్తర్గీబ్ వ తర్హీబ్ లిల్ అల్బానీ : 1151)*

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం:

“దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అరాఫాత్ దినం నాడు ఫజర్ నమాజు మినా లో చేశారు. తదుపరి (సూర్యోదయం తర్వాత) ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అరాఫాత్ వైపుకు ప్రయాణమయ్యారు. అరాఫాత్ చేరుకొని ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) 'నిమ్రా' (స్థలం) వద్ద ఆగారు. అరాఫాత్ లో ఇమామ్ దిగే స్థలం ఇదే. జొహర్ సమయం కాగానే ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) దాని (జొహర్ సమయం) ఆరంభంలోనే జొహర్ మరియు అసర్ నమాజులను కలిపి చదివారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజల కోసం ఉపన్యసించారు. ఆ తర్వాత అరాఫాత్‌లో బస చేశారు.” *(అబూదావూద్:1913,హసన్ – అల్బానీ)*

1) జిల్ హిజ్జ 9వ తేది, సూర్యోదయం తర్వాత తక్బీర్ మరియు తల్బియ పఠిస్తూ అరాఫాత్ వైపుకు ప్రయాణమవ్వాలి.

ముహమ్మద్ బిన్ అబూబక్ర్ అస్సఖఫీ కథనం ప్రకారం ఆయన మరియు అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) మినా నుండి అరాఫాత్‌కు వెళు తున్నప్పుడు, దారిలో ఆయన, అనస్ (రజి అల్లాహు అన్హు) తో – మీరు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు ఈరోజు ఏం పఠించేవారు అని అడగ్గా, ఆయన జవాబిస్తూ – మాలో ఒకరు తల్బియ పఠించగా అది నిరోధించ బడేది కాదు, మరొకరు తక్బీర్ పలికినా అది కూడా నిరోధించబడేది కాదు. *(బుఖారీ:1659, ముస్లిం:1285)*

అరాఫాత్ చేరుకున్నాక, అరాఫాత్ హద్దులలో వున్నామో లేదో అని

నిర్ధారించుకోవాలి. తదుపరి, మధ్యాహ్నం తర్వాత వీలైతే ఇమామ్ ఇచ్చే ఖుత్బాను వినాలి, అతనితో పాటు జొహర్, అసర్ నమాజులను ఖసర్ చేసి చదవడానికి ప్రయత్నించాలి. ఒకవేళ సాధ్యం కాకపోతే, మీ గుడారాలలోనే రెండు నమాజులను కలిపి మరియు ఖసర్ చేసి సామూహికంగా చేసుకోవాలి.

2) ఆ తర్వాత సూర్యాస్తమయం అయ్యే వరకు జిక్ర్, దుఆ, తల్బియ, ఖుర్ఆన్ పారాయణంలలో నిమగ్నమై వుండాలి. అల్లాహ్ ముందు వినయ విధేయతలు కనబర్చాలి. తమ పాపాలకు గాను మనస్ఫూర్తిగా తౌబా (పశ్చాత్తాపం) చేసుకోవాలి. చేతులెత్తి ఇహపరలోకాలలో మంచి మరియు సాఫల్యం కొరకు ప్రార్థించాలి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“అన్నిటికన్నా ఉత్తమమైన దుఆ ఆరాఫాత్ దినపు దుఆ మరియు నేను, నాకు ముందు గతించిన ప్రవక్తలు చేసిన ఉత్తమమైన దుఆ ఇది:

“ లా ఇలాహ ఇల్లల్లాహు వహదహూ లా షరీ కలహు, లహుల్‌ముల్కు, వలహుల్ హమ్దు వహువ అలాకుల్లి షయ్యిన్ ఖదీర్.”

*(తిర్మిజి: 3585, హసన్ – అల్‌బానీ, అస్సహీహ:1503)*

3) అరాఫాత్ లో బస చేసే సమయం – మధ్యాహ్నం తర్వాత జిల్ హిజ్జ 10వ తేది ఫజర్ కు ముందు వరకు వుంటుంది. ఈ వ్యవధిలో హాజీ ఒక్క నిమిషం కోసమైనా, అరాఫాత్‌లోకి వెళితే, అతని ఈ అంశం నెరవేరుతుంది.

ఉర్వా బిన్ ముజర్రస్ బిన్ ఔస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముజ్దలిఫాలో ఫజర్ నమాజు కోసం తయారవుతున్న సమయంలో నేను ఆయన వద్దకు వచ్చి – ఓ దైవ ప్రవక్తా! నేను (తై) యొక్క రెండు పర్వతాల గుండా (ప్రయాణం చేసి) వచ్చాను. నేను నా వాహనాన్ని కష్టానికి గురి చేయటంతో పాటు స్వయంగా కూడా బాగా అలసి పోయాను. నేను (అరాఫాత్‌లో) రాతి ప్రదేశాన్ని దేనినీ వదలకుండా ప్రతిచోటా బస చేశాను. మరి నా హజ్ సరైనదేనా? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“ఏ వ్యక్తి అయినా మాతో పాటు నమాజ్‌లో పాలుపంచుకొని, మేమిక్కడి

నుండి (మినాకు) బయలుదేరే వరకు మాతో గడిపి, అతను, దానికి ముందు రాత్రి లేదా పగటి వేళలో ఏదో ఒక సమయంలో అరాఫాత్‌లో గడిపివుంటే అతని హజ్ సంపూర్ణమైనట్లే మరియు అతను తన (హజ్) ఆచారాలను పూర్తి చేసిన వాడవుతాడు.” *(తిర్మిజి: 891, ఇబ్నెమాజ:3026,సహీ – అల్‌బానీ)*

అరాఫాత్ సరిహద్దులో ఎక్కడ బస చేసినా సరిపోతుంది.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“నేనిక్కడ బస చేశాను – అరాఫాత్ మైదానం అంతా బస చేయబడే స్థలం.” *(ముస్లిం : 1218)*

4) సూర్యాస్తమయం అయ్యాక ఎంతో ప్రశాంతంగా అరాఫాత్ నుండి ముజ్దలిఫాకు ప్రయాణమవ్వాలి.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, ఆయన, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు అరాఫాత్ దినం నాడు అరాఫాత్ నుండి తిరిగి వచ్చారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన వెనుక – వాహనాలను కొడుతూ, తీవ్రంగా కోపగించుకుంటున్న శబ్దాలు విని, తన వద్దనున్న కొరడాతో వారివైపు సైగ చేస్తూ ఇలా సెలవిచ్చారు: “ప్రజలారా! ఎంతో ప్రశాంతంగా బయలుదేరి వెళ్ళండి. ఎందుకంటే త్వరత్వరగా చేయడంలో పుణ్యం లేదు.” *(బుఖారీ : 1671)*

5) అరాఫాత్ దినం నాడు మగ్రిబ్ నమాజును అరాఫాత్‌లో కాకుండా ముజ్దలిఫా చేరుకొని ఇషా నమాజుతో జతచేసి చదవాలి.

ఉసామా బిన్ జైద్ (రజి అల్లాహు అన్హు) కథనం:

“నేను, అరాఫాత్ నుండి (బయలుదేరినప్పటి నుండి) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వాహనం పై ఆయన వెనుక కూర్చొని వున్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముజ్దలిఫాకు ముందు, ఎడమవైపున గల ఒక లోయలో తన వాహనాన్ని కూర్చోబెట్టారు. తదుపరి ఆయన కాలకృత్యాలు తీర్చుకున్నారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తిరిగి రాగా, నే నాయనకు నీళ్ళు పోసాను. ఆయన తేలిక పాటి వుజూ చేసు కున్నారు. నేను – ఓ దైవ ప్రవక్తా! నమాజ్ చదువుతారా? అని అడిగాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – “ఇంకా కొంచెం ముందుకెళ్ళి నమాజ్

చదువుదాం" అని అన్నారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వాహనం ఎక్కి ముజ్దలిఫా చేరుకున్నారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నమాజ్ చదివారు.

6) ముజ్దలిఫాలో అన్నిటికన్నా ముందుగా మగ్రిబ్ మరియు ఇషా నమాజులు జత మరియు ఖసర్ చేసి సామూహికంగా చదవాలి. తదుపరి, తమ అవసరాలు తీర్చుకొని నిద్రపోవాలి.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మగ్రిబ్ మరియు ఇషా నమాజులను ముజ్దలిఫాలో జత చేసారు. ప్రతి నమాజుకు ప్రత్యేకంగా ఇఖామత్ చెప్ప బడింది. ఈ రెండింటి మధ్యలో గానీ మరియు వీటి తర్వాత గానీ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎలాంటి నఫిల్ నమాజ్ చదవలేదు. *(బుఖారీ : 1673)*

7) స్త్రీలు మరియు వారితో పాటు వున్న పురుషులు, పిల్లలు, అలాగే బలహీనులు అర్ధరాత్రి దాటాక ముజ్దలిఫా నుండి బయలుదేరి మినా కు వెళ్ళవచ్చు.

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, ఆయన ఇంట్లోని బలహీనులు ముజ్దలిఫాలో మష్అరుల్ హరాం వద్ద రాత్రి బస చేసేవారు. వారికిష్టమైనంత సేపు అల్లాహ్ స్మరణ చేసేవారు. తదుపరి, ఇబ్నె ఉమర్ (రజి అల్లాహ్ అన్హు), ఇమామ్ తన విడిది తర్వాత మినా తిరిగి వచ్చే లోపు ఆ బలహీనులను ముజ్దలిఫా నుండి త్వరగా పంపించేసే వారు. ఇలా, వారిలో ఒకరు ఫజర్ కు ముందు మినా చేరుకుంటే మరొకతను ఫజర్ తర్వాత చేరుకునే వారు. మినా చేరుకోగానే 'జమ్రా –ఏ–అఖ్బా' (సామాన్యంగా పెద్ద షైతాను అని పిలుస్తూ వుంటారు) ను 'రమీ' (కంకరాళ్ళు విసరడం) చేసేవారు. అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా అనేవారు – వారికి (బలహీనులకు) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (ముజ్దలిఫా నుండి మినా కు ముందుగా వెళ్ళడానికి) అనుమతి ఇచ్చారు.

*(బుఖారీ: 1676, ముస్లిం: 1295)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం:

మేము ముజ్దలిఫాలో బస చేసినప్పుడు, సౌదా (రజి అల్లాహు అన్హా) –

ప్రజల రద్దీ కన్నా ముందుగానే తను మినా వెళ్ళిపోవడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కు అనుమతి అడిగారు. తను భారీ కాయం కలవారు, మెల్లమెల్లగా నడిచేవారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు అనుమతి నిచ్చారు. అందుకే ఆమె ప్రజల రద్దీ కన్నా ముందుగానే బయలుదేరారు. మేము మాత్రం తెల్లవారే వరకు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటే వున్నాం. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటే మినా కు తిరిగి వచ్చాం. ఒకవేళ నేను కూడా సౌదా (రజి అల్లాహు అన్హా) లాగా అనుమతి తీసుకొని వుంటే అది నేను సంతోషపడిన (ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తో పాటు వుండవచ్చు అన్న) విషయం కన్నా మేలుగా వుండేది. *(బుఖారీ:1681, ముస్లిం:1290)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఇంట్లోని బలహీనులతో పాటు ముజ్దలిఫా నుండి (మినాకు) ముందుగానే పంపించిన వారిలో నేనూ వున్నాను. *(బుఖారీ: 1678, ముస్లిం:1293)*

**కొన్ని పొరపాట్లు:**

1. అరాఫాత్ సరిహద్దుకు బయట బస చేయడం.

2. జబలె రహ్మత్‌ను అధిరోహించక పోతే ఆరాఫాత్ విడిది సంపూర్ణం కాదని విశ్వసించడం. వాస్తవానికి జబలె రహ్మత్ ఎక్కడానికి ప్రత్యేక మహత్య మేమీ లేదు. ఇలా చేయడం సత్కార్యం కూడా కాదు.

3. సూర్యాస్తమయానికి ముందుగానే అరాఫాత్ నుండి వెళ్ళిపోవడం.

4. ముజ్దలిఫా కు చేరుకున్నాక అన్నిటికన్నా ముందుగా మగ్రిబ్, ఇషా నమాజులు చదవడానికి బదులు కంకర్రాళ్ళు ఏరుకోవడం.

5. ముజ్దలిఫాలో రాత్రి నఫిల్ నమాజులు చేయడం.

## జిల్‌హిజ్జ 10వ తేది (యౌమె ఈద్)

1) ఫజర్ నమాజు ముజ్దలిఫా లో చేయాలి. తదుపరి వెలుతురు వ్యాపించే వరకు ఖిబ్లావైపుకు తిరిగి – జిక్ర్, దుఆ మరియు ఖుర్‌ఆన్ పారాయణంలో నిమగ్నమవ్వాలి.

2) పెద్ద జమ్రాకు కంకర్రాళ్ళు కొట్టడానికి ముజ్దలిఫాలో లావు చనగల సైజుకు సమానంగా వున్న కంకర్రాళ్ళను తీసుకోవచ్చు. కానీ, ముజ్దలిఫా లోనే తీసుకోవాలన్న నియమం ఏమీ లేదు.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) ముజ్దలిఫా నుండి మినాకు తిరిగి వెళుతూ మినా లోని 'ముహస్సిర్' కు చేరుకున్నాక ఇలా సెలవిచ్చారు:

"రమీ చేయడానికి మీరు కంకర్రాళ్ళను ఏరుకోండి." *(ముస్లిం:1282)*

'అయ్యామె తష్రీఖ్' లో జమ్రాత్ కు కంకర్రాళ్ళు కొట్టడానికి, వాటిని (కంకర్రాళ్ళను) ముజ్దలిఫా నుండి తీసుకోవటం తప్పనిసరి కాదు. మినాలో కూడా తీసుకోవచ్చు.

3) తదుపరి సూర్యోదయానికి ముందు మినాకు ప్రయాణమవ్వాలి. దారిలో ముహస్సిర్ లోయను దాటేటప్పుడు వేగంగా నడవాలి.

4) మినా లో పెద్ద జమ్రా వద్దకు చేరుకొని తల్బియ పఠించడం ఆపేయాలి మరియు మక్కా ముకర్రమ వైపు ఉన్న పెద్ద జమ్రాకు ఏడు కంకర్రాళ్ళు, ఒక్కొక్కటిగా కొట్టాలి. ప్రతి కంకర్రాయి తో పాటు 'అల్లాహు అక్బర్' అని అనాలి. బలహీనులు, వ్యాధిగ్రస్తులైన పురుషులు, చిన్న పిల్లలు, అలాగే బలహీనులు, వయసు మీరిన స్త్రీలు కంకర్రాళ్ళను కొట్టడానికి ఇతరులను పంపించవచ్చు.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్ (రజి అల్లాహు అన్హు) కథనం: దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యౌమున్నహర్ (ఖుర్బానీ రోజు) లో చాష్త్ సమయంలో కంకర్రాళ్ళు కొట్టేవారు మరియు మిగతా రోజుల్లో మధ్యాహ్నం తర్వాత రమీ చేసేవారు. *(ముస్లిం:1299)*

అబ్దుల్లా బిన్ మస్ ఊద్ (రజిఅల్లాహు అన్హు) 'అల్ జమ్రతుల్ కుబ్రా' (పెద్ద జమ్రా) వద్దకు చేరుకొని, బైతుల్లాహ్‌ను తన ఎడమవైపుకు మరియు మినా ను తన కుడివైపుకు చేసుకొని పెద్ద జమ్రాకు ఏడు కంకర్రాళ్ళు కొట్టారు. తదుపరి ఇలా సెలవిచ్చారు: బఖర సూరా అవతరించిన వ్యక్తి (దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా ఇలాగే కంకర్రాళ్ళు కొట్టారు.

*(బుఖారీ:1748, ముస్లిం:1296)*

5) ఆ తర్వాత ఖుర్బానీ పశువును జిబహ్ చెయ్యాలి. అది ఏలోపమూ లేనిదై, తగినంత వయస్సు కలిగినదై వుండాలి. ఖుర్బానీ కోసం పశువు యొక్క వయస్సును పట్టించుకోకుండా, ఏదైనా లోపం గల పశువులను ఉపయోగించడం సరికాదు. గురించుకోవాల్సిన విషయమేమిటంటే – మీరు ఖుర్బానీని జిల్ హిజ్జ 11 లేదా 12 లేదా 13 తేదీలలో కూడా చేయవచ్చు.

ఖుర్బానీ పశువును జిబహ్ చేశాక దాని మాంసాన్ని మీ కోసం కూడా తీసుకోండి మరియు బీదవారికి కూడా పంచిపెట్టండి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَيَذْكُرُوا اسْمَ اللَّهِ فِي أَيَّامٍ مَّعْلُومَاتٍ عَلَىٰ مَا رَزَقَهُم مِّن بَهِيمَةِ الْأَنْعَامِ ۖ
فَكُلُوا مِنْهَا وَأَطْعِمُوا الْبَائِسَ الْفَقِيرَ ﴿٢٨﴾

**"అల్లాహ్ తమకు ప్రసాదించిన తమ పెంపుడు పశువుల మీద ఆ నిర్ణీత దినాలలో అల్లాహ్ నామాన్ని స్మరించాలి (ఉచ్చరించాలి). ఆ తర్వాత వాటిని మీరూ తినండి, దుర్భర పరిస్థితిలో ఉన్న అగత్య పరులకు కూడా తినిపించండి."** ***(హజ్ : 28)***

మీ వైపు నుంచి ఖుర్బానీ ఇచ్చే బాధ్యతను తీసుకున్న కంపనీలో కూడా డబ్బును జమ చేయవచ్చు. ఒకవేళ మీరు (హజ్ తమత్తు చేస్తూ) ఆర్థిక ఇబ్బందుల దృష్ట్యా ఖుర్బానీ ఇవ్వగలిగే స్థితిలో గనక లేకపోతే అప్పుడు 10 రోజులు ఉపవాసం ఉండాలి. హజ్ దినాలలో మూడు మరియు ఇంటికి తిరిగొచ్చాక 7 రోజులు ఉపవాసం ఉండాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَإِذَا أَمِنتُمْ فَمَن تَمَتَّعَ بِالْعُمْرَةِ إِلَى الْحَجِّ فَمَا اسْتَيْسَرَ مِنَ الْهَدْيِ ۚ فَمَن لَّمْ يَجِدْ فَصِيَامُ
ثَلَاثَةِ أَيَّامٍ فِي الْحَجِّ وَسَبْعَةٍ إِذَا رَجَعْتُمْ ۗ تِلْكَ عَشَرَةٌ كَامِلَةٌ ۗ ذَٰلِكَ لِمَن لَّمْ يَكُنْ أَهْلُهُ حَاضِرِي
الْمَسْجِدِ الْحَرَامِ ۚ وَاتَّقُوا اللَّهَ وَاعْلَمُوا أَنَّ اللَّهَ شَدِيدُ الْعِقَابِ ﴿١٩٦﴾

**"ప్రశాంతతను పొంది ఉన్న స్థితిలో మీలో ఎవరైనా ఉమ్రా మొదలు కొని హజ్ వరకు సంకల్పం బూని ప్రయోజనం (తమత్తు) పొందినట్లయితే, వారు తమ వద్ద నున్న ఖుర్బానీని ఇచ్చి వేయాలి. ఖుర్బానీ**

**ఇవ్వలేని వారు హజ్ దినాలలో మూడు రోజులు ఉపవాసం పాటించాలి. హజ్ నుండి తిరిగి వచ్చిన తరువాత ఏడు రోజులు ఉపవాసముండాలి. ఈ విధంగా మొత్తం 10 ఉపవాసాలవుతాయి. మస్జిదె హరామ్ కు సమీపంలో ఉండని వారికి మాత్రమే ఈ ఆదేశం వర్తిస్తుంది. (ప్రజలారా!) అల్లాహ్ కు భయపడుతూ ఉండండి. అల్లాహ్ కఠినంగా శిక్షించే వాడన్న సంగతిని తెలుసుకోండి."** ***(బఖర : 196)***

6) తదుపరి శిరోముండనం చేసుకోవాలి లేదా తలవెంట్రుకలన్నీ చిన్నగా కత్తిరించుకోవాలి. ముండనం చేసుకోవడం ఉత్తమం. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) శిరోముండనం చేసుకొనే వారి కోసం మన్నింపు ప్రార్థన (మరో ఉల్లేఖనం ప్రకారం కారుణ్య ప్రార్థన) మూడు సార్లు చేశారు, కానీ వెంట్రుకలు చిన్నగా కత్తిరించుకొనే వారికోసం ఒక్కసారే దుఆ చేశారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

" ఓ అల్లాహ్ ! ముండనం చేసుకున్న వారిని మన్నించు" ప్రజలు – ఓ దైవ ప్రవక్తా! వెంట్రుకలు చిన్నగా కత్తించుకున్న వారిని కూడా (ప్రార్థించండి) అని అన్నారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మళ్ళీ – 'ఓ అల్లాహ్! ముండనం చేసుకున్న వారిని మన్నించు' అని ప్రార్థించారు. ప్రజలు మళ్ళీ – ఓ దైవ ప్రవక్తా ! వెంట్రుకలు చిన్నగా కత్తిరించుకున్న వారిని కూడా (ప్రార్థించండి) అని అన్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మళ్ళీ – 'ఓ అల్లాహ్! ముండనం చేసుకున్న వారిని మన్నించు' అని ప్రార్థించారు.

ప్రజలు మళ్ళీ – ఓ దైవప్రవక్తా! వెంట్రుకలు చిన్నగా కత్తిరించుకున్నవారిని కూడా (ప్రార్థించండి) అని అన్నారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాల్గవ సారి, 'ఓ అల్లాహ్ ! వెంట్రుకలు చిన్నగా కత్తిరించు కున్న వారిని కూడా మన్నించు' అని ప్రార్థించారు. *(బుఖారీ: 1727, ముస్లిం:1301)*

అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'జమ్రా – ఏ – అఖ్బా' కు కంకరాళ్ళు కొట్టారు.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఒంటెల వద్ద కెళ్ళి వాటిని ఖుర్బానీ ఇచ్చారు. అక్కడే క్షవరం చేసే వాడు కూర్చొని వున్నాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన తలవైపు సైగ చేస్తూ అతనితో – (దీని) ముండనం చేయి అని అన్నారు. అతను ముందుగా కుడివైపు ముండనం చేసాడు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆ వెంట్రుకలను తన చుట్టు పక్కల వున్న వారికి పంచేశారు. తదుపరి ఆయన 'ఇక ఎడమవైపు ముండనం చేయి' అని అతనితో అన్నారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అబూ తల్హా (రజి అల్లాహు అన్హు) ను పిలిచి ఆ వెంట్రుకలను ఆయన కిచ్చేశారు." *(ముస్లిం:1305)*

స్త్రీలు తమ జడ నుంచి, వ్రేలి ఒక కట్టుకు సమానంగా వెంట్రుకలు కత్తిరించుకోవాలి.

ఇలా, మీరు పాక్షికంగా హలాల్ అయిపోతారు. అంటే భార్యదగ్గరికి వెళ్ళడం మినహాయించి ఇహ్రాం స్థితిలో నిషిద్ధంగా వున్న కార్యాలన్నీ హలాల్ అయిపోతాయి. భార్య దగ్గరికి వెళ్ళడం అనేది 'ఇఫాజా తవాఫ్' తర్వాత ధర్మ సమ్మత మవుతుంది. అందుకే మీరు ఇహ్రాం దించేసి శుచి, శుభ్రతలు, స్నానం వగైరా ॥ ముగించుకొని సాధారణ దుస్తులు ధరించి 'ఇఫాజా తవాఫ్ ' కోసం కాబా గృహానికి వెళ్ళాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

ثُمَّ لْيَقْضُوا تَفَثَهُمْ وَلْيُوفُوا نُذُورَهُمْ وَلْيَطَّوَّفُوا بِالْبَيْتِ الْعَتِيقِ ﴿29﴾

**"ఆ తరువాత వారు తమ మురికిని దూరం చేసుకోవాలి, తమ మొక్కుబడులను చెల్లించాలి. (అనంతరం దేవుని) ఆ ప్రాచీన గృహానికి ప్రదక్షిణ చేయాలి."** ***(హజ్:29)***

7) 'ఇఫాజా తవాఫ్' అనేది హజ్ యొక్క అంశం. ఒకవేళ జిల్‌హిజ్జ 10 వ తేదీ నాడు గనక దానిని చేయలేకపోతే, తర్వాత కూడా చేయవచ్చు. స్త్రీలు ఒకవేళ అపరిశుద్ధావస్థలో గనక వుంటే, పరిశుద్ధులయ్యాక తవాఫ్ చేయాలి. ఒకవేళ వారు 'అయ్యామె తష్రీఖ్' (తష్రీఖ్ దినాలు) లలో కంకర్రాళ్ళు కొట్టిన తర్వాత పరిశుద్ధులైతే, ఈలోగా వారి తిరుగు ప్రయాణానికి సమయం ఆసన్నమైతే అప్పుడు 'ఇఫాజా తవాఫ్' చేస్తూ 'వీడ్కోలు తవాఫ్' సంకల్పం కూడా చేసుకుంటే

ఇది సరైనదే. ఒకవేళ తిరుగు ప్రయాణం వరకు పరిశుద్ధులు కాలేకపోయి, వారి బృందం కూడా వేచిచూసే పరిస్థితిలో లేకపోతే – ఈ స్థితిలో ఆమె స్నానం చేసి, బట్టను బిగుతుగా కట్టుకొని ఆ తర్వాత తవాఫ్ చేసుకోవాలి.

8) తవాఫ్ తర్వాత మఖామె ఇబ్రాహీం వెనుక రెండు రకాతులు చేయాలి. తదుపరి సఫా మర్వాల మధ్య సయీ చేసి, మినా తిరిగి వెళ్ళి పోవాలి. 11వ తేది రాత్రి మినా లో గడపడం తప్పనిసరి.

9) జిల్ హిజ్జ 10 వ తేది నాటి నాలుగు పనులు (కంకర్రాళ్ళు కొట్టడం, ఖుర్బానీ ఇవ్వడం, శిరోముండనం లేదా కత్తిరించుకోవడం, తవాఫ్ మరియు సయీ) ఏ క్రమంలోనైతే వివరించబడ్డాయో, ఆ క్రమం లోనే చేయడం సున్నత్. అయినప్పటికీ వెనుకా, ముందూ చేసి కూడా వీటిని నెరవేర్చవచ్చు.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజిఅల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మినాలో నిలబడినప్పుడు, ప్రజలు ఆయన ( సల్లల్లాహు అలైహి వలస్లం) ను ప్రశ్నించడం మొదలు పెట్టారు. ఓ వ్యక్తి వచ్చి – ఓ దైవ ప్రవక్తా! నాకు విషయం సరిగ్గా తెలియలేదు. (దీనితో) నేను ఖుర్బానీ చేయడానికి ముందే శిరోముండనం చేసుకున్నాను అని విన్నవించుకోగా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – వెళ్ళు, వెళ్ళి ఖుర్బానీ చేయి. దీనిలో తప్పేమీ లేదు అని వివరించారు. మరో వ్యక్తి వచ్చి – ఓ దైవ ప్రవక్తా! నాక్కూడా విషయం సరిగ్గా తెలియలేదు. (దీనితో) నేను రమీ చేయడానికి ముందుగానే ఖుర్బానీ చేశాను అని విన్నవించుకున్నాడు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అతనితో – వెళ్ళు, వెళ్ళి రమీ చేసుకో, ఇందులో తప్పేమీ లేదు అని వివరించారు.

ఆ తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను , ఈ పనులను వెనుకా, ముందు చేయడం గురించి ప్రశ్నించగా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – 'వెళ్ళి చేసుకోండి, అందులో తప్పేమీ లేదు' అని జవాబిచ్చారు.

*(బుఖారీ: 1736, ముస్లిం: 1306)*

## తష్రీఖ్ దినాలు (అయ్యామె తష్రీఖ్)

*1) జిల్ హిజ్జ 11,12 తేదీల రాత్రులు మినా లో గడపడం తప్పనిసరి.*

12వ తేదీనాడు కంకర్రాళ్ళు కొట్టిన తర్వాత మినా నుండి వెళ్ళిపోవచ్చు.

కానీ 13వ తేదీ రాత్రి అక్కడే గడిపి 13వ తేదీ పగలు కంకర్రాళ్ళు కొట్టిన తర్వాత అక్కడి నుండి బయలుదేరడం ఉత్తమం. ఈ రోజుల్లో మూడు జమ్రాలకు కంకర్రాళ్ళు కొట్టాలి. దాని సమయం మద్యాహ్నం నుంచి అర్ధరాత్రి వరకు వుంటుంది.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఇబ్రాహీం ఖలీలుల్లాహ్ (అలైహిస్సలాం) ఆచారాలను పాటించడానికి రాగా, షైతాను 'జమ్రా- ఏ- అఖ్బా' వద్ద ఆయన ముందుకు వచ్చాడు. ఆయన వాడికి ఏడు కంకర్రాళ్ళతో కొట్టగా వాడు భూమిలోకి దిగి ద్రొక్కబడ్డాడు. తదుపరి వాడు రెండవ జమ్రా వద్ద ఆయన ముందుకు రాగా, ఆయన మళ్ళీ ఏడు కంకర్రాళ్ళను తీసుకొని వాడిని కొట్టగా వాడు భూమిలోకి దిగి ద్రొక్క బడ్డాడు. ఆ తర్వాత మూడవ జమ్రా వద్ద ఆయన ముందుకు రాగా, ఆయన మళ్ళీ వాడిని ఏడు కంకర్రాళ్ళతో కొట్టగా వాడు భూమి లోకి దిగ ద్రొక్కబడ్డాడు".

తదుపరి, ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా అన్నారు: మీరు షైతాను ను 'రజమ్' చేస్తారు మరియు మీ తండ్రి గారైన ఇబ్రాహీం (అలైహిస్సలాం) ధర్మాన్ని అనుసరిస్తారు.

*(ఇబ్నె ఖుజైమా, హాకిమ్, సహీ అత్తర్గీబ్ వ తర్హీబ్ : 1156)*

*2) అందరి కన్నా ముందుగా చిన్న జమ్రాకు ఏడు కంకర్రాళ్ళు, ఒక్కొక్కటిగా కొట్టాలి.*

ప్రతి కంకర్రాయితో పాటు 'అల్లాహు అక్బర్' అని అనాలి. ఆ తర్వాత ఇలాగే మధ్యలో వున్న జమ్రాకు కంకర్రాళ్ళు కొట్టాలి. ఒకవేళ మీరు ఇతరుల వైపు నుండి కూడా కంకర్రాళ్ళు కొట్టాల్సి వుంటే, ముందు మీ కంకర్రాళ్ళను కొట్టి, ఆ తర్వాత వాళ్ళ కంకర్రాళ్ళను కొట్టాలి. చిన్న జమ్రా మరియు మధ్యలో వున్న జమ్రాకు కంకర్రాళ్ళు కొట్టిన తర్వాత, ఖిబ్లా వైపుకు తిరిగి, చేతు లెత్తి దుఆ చేయడం సున్నత్.

*3) ఆ తర్వాత పెద్ద జమ్రాకు కూడా ఇలాగే కంకర్రాళ్ళు కొట్టాలి. తదుపరి, దుఆ చేయడం సున్నత్.*

సాలిబ్ బిన్ అబ్దుల్లాహ్ రహిమహుల్లాహ్ ఇలా ఉల్లేఖించారు:

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) చిన్న జమ్రాకు ఏడు కంకర్రాళ్ళు కొట్టేవారు. ప్రతి కంకర్రాయితో పాటు 'అల్లాహు అక్బర్' అని పలికేవారు. తదుపరి కాస్త ముందుకెళ్ళి, సమతల ప్రదేశానికి చేరుకొని, ఖిబ్లా వైపుకు తిరిగి ఎంతో సేపు నిలబడి, చేతులెత్తి దుఆ చేసేవారు. ఆ తర్వాత మధ్యలో వున్న జమ్రాకు కంకర్రాళ్ళు కొట్టేవారు, తదుపరి ఎడమవైపుకు వెళ్ళి సమతల ప్రదేశానికి చేరుకొని, ఖిబ్లా వైపుకు తిరిగి ఎంతో సేపు నిలబడి, చేతులెత్తి దుఆ చేసేవారు. ఆ తర్వాత 'జమ్రా–ఏ– అఖ్బా' ను లోయ క్రింది భాగం నుండి కంకర్రాళ్ళు కొట్టి, అక్కడ నిలబడకుండా వెళ్ళిపోయేవారు. తదుపరి ఇలా సెలవిచ్చేవారు– నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను ఇలానే చేస్తుండగా చూశాను. *(బుఖారీ: 1751, 1752, 1753)*

*4) మూడు జమ్రాతులను కొట్టడానికి కంకర్రాళ్ళను మినా లో ఏ స్థలం లోనైనా ఏరుకోవచ్చు.*

*5) కంకర్రాళ్ళను – జమ్రాతులను లక్ష్యంగా చేసుకొని, వీలైనంత దగ్గరగా వెళ్ళి కొట్టాలి.*

*6) జమ్రాతులను – షైతాన్ గా భావించి వాటిని తిట్టడం లేదా చెప్పులు విసరడం అజ్ఞానానికి నిదర్శనం.*

*7) తష్రీఖ్ దినాలలో, ఖాళీ సమయాల్లో, అల్లాహ్ విధేయతలో గడుపుతూ, వీలైనంత ఎక్కువగా అల్లాహ్‌ను స్మరించాలి.*

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَإِذَا قَضَيْتُم مَّنَاسِكَكُمْ فَاذْكُرُوا اللَّهَ كَذِكْرِكُمْ آبَاءَكُمْ أَوْ أَشَدَّ ذِكْرًا ۗ

**"హజ్ క్రియలన్నింటినీ నిర్వర్తించిన తర్వాత అల్లాహ్‌ను ధ్యానించండి. మీ తాతముత్తాతలను జ్ఞాపకం చేసుకున్నట్లే. ఇంకా అంతకంటే అధికంగానే అల్లాహ్‌ను స్మరించండి."** ***(బఖర : 200)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

وَاذْكُرُوا اللَّهَ فِي أَيَّامٍ مَّعْدُودَاتٍ ۚ فَمَن تَعَجَّلَ فِي يَوْمَيْنِ فَلَا إِثْمَ عَلَيْهِ وَمَن تَأَخَّرَ فَلَا إِثْمَ عَلَيْهِ ۚ لِمَنِ اتَّقَىٰ ۗ

**“గణించ దగిన ఆ దినాలలో ( తష్రీఖ్ దినాలలో) అల్లాహ్‌ను స్మరించండి. రెండు దినాలలోనే ఇక్కడి నుండి తిరిగి వెళ్ళేందుకు ఎవరైనా తొందరపాటు కనబరచినా తప్పులేదు. వెనుక ఉండిపోయిన వారు కూడా నిందార్హులు కారు. ఇది భయభక్తులు కలవారికై ఉద్దేశించినది.”**

***(బఖర: 203)***

ఈ ఆయతు ద్వారా తెలిసిందేమిటంటే – జిల్ హిజ్జ 12వ తేదీనాడు మీరు, మినా నుండి వెళ్ళదలుచుకుంటే వెళ్ళవచ్చు. కానీ, సూర్యాస్తమయానికి ముందే కంకర్రాళ్ళను కొట్టి మినా సరిహద్దుల నుండి బయటకు రావాల్సి వుంటుంది. అలా కాకపోతే, 13వ రాత్రి అక్కడే బస చేసి, ఆ తర్వాత పగలు కంకర్రాళ్ళను కొట్టిన తర్వాత మినా నుండి వెళ్ళడం ఉత్తమం.

## కొన్ని పొరపాట్లు

1) కంకర్రాళ్ళను కడగడం.

2) ఏడు కంకర్రాళ్ళను ఒక్కొక్కటిగా కొట్టడానికి బదులు ఏడింటిని కలిపి ఒకేసారి కొట్టడం.

3) కంకర్రాళ్ళను కొట్టడంలో నిర్దేశింపబడిన సమయాన్ని పాటించక పోవడం.

4) ముందుగా చిన్నది, తరువాత మధ్యలోనిది, ఆ తర్వాత పెద్ద జమ్రాను కంకర్రాళ్ళు కొట్టే బదులు దీని క్రమాన్ని మార్చి వేయడం.

5) చిన్న మరియు మధ్యలో వున్న జమ్రాలను కంకర్రాళ్ళతో కొట్టిన తర్వాత దుఆ చేయకపోవడం.

6) పెద్ద సైజు కంకర్రాళ్ళను కొట్టడం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) చిన్న సైజు కంకర్రాళ్ళను కొట్టారు.

*(ముస్లిం : 1299)*

7) తష్రీఖ్ దినాలలోని రాత్రులలో మినాలో బస చేయక పోవడం.

## వీడ్కోలు తవాఫ్ (తవాఫుల్ విదా)

మక్కా ముకర్రమ నుండి బయలుదేరే ముందు వీడ్కోలు తవాఫ్ చేయడం తప్పనిసరి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"అన్నిటికన్నా ఆఖరుగా బైతుల్లాహ్ తవాఫ్ చేయనంత వరకు ఎవ్వరూ తిరిగి వెళ్ళకూడదు." *(ముస్లిం:1327)*

ఒకవేళ స్త్రీలు అపరిశుద్ధావస్థలో వుంటే, వారికి వీడ్కోలు తవాఫ్ తప్పనిసరి కాదు.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజలకు – హజ్ ప్రక్రియల్లో వారి ఆఖరి ప్రక్రియ బైతుల్లాహ్ తవాఫ్ కావాలని ఆదేశించారు. అయితే ఈ విషయంలో, అపరిశుద్ధావస్థలో వున్న స్త్రీలకు మాత్రం (దీని నుండి) మినహాయింపు లభించింది. *(బుఖారీ: 1755, ముస్లిం:1328)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమింటంటే –

హజ్ ప్రక్రియల్లో ఆఖరి ప్రక్రియ బైతుల్లాహ్ తవాఫ్, అందుకే జిల్ హిజ్జ 12,13 తేదీలలో కంకర్రాళ్ళు కొట్టడానికి ముందుగా వీడ్కోలు తవాఫ్ చేయడం సరికాదు.

గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే – వీడ్కోలు తవాఫ్ తర్వాత వెనుకడుగులు వేస్తూ మస్జిదుల్ హరామ్ నుండి బయటకు రావడం కూడా సరైనది కాదు.

అల్లాహ్ మనందరినీ స్వీకార యోగ్యమయ్యే హజ్ చేసే మహాభాగ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్!

## దైవప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) హజ్ గురించి పేరుగాంచిన జాబిర్ (రజి అల్లాహు అన్హు) హదీసు

ఇక మేము, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ స్వరూపం గురించి ఎంతో ప్రాచుర్యం పొందిన జాబిర్ (రజి అల్లాహు అన్హు) హదీసును వివరిస్తాం.

దీనిని వివరించడంలో గల ఒక ఉద్దేశ్యం ఏమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ స్వరూపం ఎలా వుందో తెలుసుకోవచ్చు. దీనితో పాటు మరో ఉద్దేశ్యమేమిటంటే – ఇప్పటి వరకూ వివరించబడ్డ హజ్

ఆచారాలు, ప్రక్రియలను మరోసారి నెమరువేసుకోవడం ద్వారా మరింత బాగా గుర్తుంచుకోవచ్చు.

ముహమ్మద్ బిన్ అలీ బిన్ హుసేన్ రహిమహుల్లాహ్ కథనం ప్రకారం, ఆయన, జాబిర్ (రజి అల్లాహు అన్హు) ను, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ గురించి ప్రశ్నించగా, ఆయన ఇలా జవాబిచ్చారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 9 సం॥ల వరకు (మదీనా మునవ్వర లో) వేచి ఉన్నారు. ఈ వ్యవధి లో ఆయన హజ్ చేయలేదు. 10వ సం॥ వచ్చాక ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ సం॥ హజ్ చేయ బోతున్నారని ప్రకటన గావించారు. ఇది విని మదీనా మునవ్వరలో ఎంతో మంది గుమిగూడారు. ప్రతి ఒక్కరూ – తాను దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నాయకత్వంలో ఆయన లాగే హజ్ చేయవచ్చని కోరుకున్నారు. ఇలా మేమంతా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి బయలుదేరాం. మేము 'జుల్ హులైఫా' కు చేరుకొనే సరికి, అస్మా బిన్తె ఉమైస్ (రజి అల్లాహు అన్హా) ముహమ్మద్ బిన్ అబూ బక్ర్ కు జన్మ నిచ్చారు. తదుపరి, ఆమె, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు–ఇప్పుడు తానేం చేయాలి? అని కబురు పంపారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆమెకు – 'స్నానం చేసి, బట్టను గట్టిగా బిగించి కట్టుకొని ఇహ్రాం సంకల్పం చేసుకోమని' సందేశం పంపారు.

ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మస్జిద్‌లో నమాజ్ చదివారు. తదుపరి ఆయన తన ఒంటె (ఖస్వ) నెక్కి ప్రయాణం చేస్తూ బైదా (ఒక ప్రదేశం) వద్దకొచ్చి నిలబడగా నేను చూసిందేమిటంటే – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు ముందూ, వెనుకా, కుడివైపు, ఎడమవైపు – నలుదిక్కులా, కనుచూపు మేరకు ఎటుచూసినా మనుషులే కనిపించారు. ఒకరు వాహనంపై వుంటే మరొకరు నడుస్తూ వున్నారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మా మధ్యనే వున్నారప్పుడు. ఖుర్ఆన్ అవతరణ క్రమం కూడా కొనసాగుతూనే వుంది మరియు దాని విశ్లేషణ గూర్చి కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) బాగా తెలిసి వున్నారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ పనైతే చేశారో, మేము కూడా అదే చేశాం.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తౌహీద్‌తో ఇహ్రాం సంకల్పం చేసుకొని ఈ తల్బియ పఠించారు. "లబ్బై కల్లాహుమ్మ లబ్బైక్, లబ్బైక లాషరీ క లక లబ్బైక్, ఇన్నల్ హమ్ద, వన్నేమత, లకవల్ ముల్క్, లాషరీ కలక్"

"నేను హాజరయ్యాను, ఓ అల్లాహ్! నేను హాజరయ్యాను, నీకు భాగస్వాము లెవ్వరూ లేరు, సమస్త స్తోత్రాలు, అనుగ్రహాలు, విశ్వసామ్రాజ్యాధికారం నీ కోసమే, నీకు భాగస్వాము లెవ్వరూ లేరు".

ప్రజలంతా ఈ తల్బియానే పఠించడం మొదలుపెట్టారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారికోసం తల్బియ లోని ఏ పదాన్నీ రద్దు చేయలేదు ( మార్చలేదు). ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిరంతరం ఈ 'తల్బియ' ను పఠిస్తూనే వున్నారు.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: మేము హజ్ కోసమే సంకల్పించు కొని వున్నాం. ఉమ్రా గురించి మాకప్పటి వరకు అసలు తెలియనే తెలియదు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో కలిసి మేము బైతుల్లాహ్ కు చేరుకున్నాక, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్రె అస్వద్‌కు 'ఇస్తెలాం' చేశారు. ఆ తర్వాత (మొదటి) మూడు ప్రదక్షిణలలో 'రమల్' చేశారు. మిగిలిన నాలుగు ప్రదక్షిణలు ఆయన సామాన్య వేగంతో పూర్తి చేశారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మఖామె ఇబ్రాహీం వద్ద కెళ్ళి "మీరు ఇబ్రాహీము నిలబడిన ప్రదేశాన్ని నమాజు స్థలంగా చేసుకోండి" అన్న ఆయత్ పఠించి, దానిని – తనకూ, బైతుల్లాహ్‌కు మధ్యలో వుంచి రెండు రకాతులు నమాజ్ చేశారు. దానిలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాఫిరూన్ సూరా మరియు ఇఖ్లాస్ సూరా పఠించారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మళ్ళీ హజ్రె అస్వద్ వద్ద కొచ్చి దాని 'ఇస్తెలాం' చేశారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సఫా వైపుకు బయలుదేరి వెళ్ళారు. సఫా దగ్గరికి చేరుకున్నాక ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'నిస్సందేహంగా సఫా, మర్వా లు అల్లాహ్ చిహ్నాల లోనివి' అన్న ఆయత్ పఠించి ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ ప్రారంభించిన దగ్గర్నుంచే (ప్రారంభించమని ఆజ్ఞాపించిన దగ్గర్నుంచే) నేను కూడా ప్రారంభిస్తున్నాను."

ఇలా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సఫా నుండి ప్రారంభించి, దానిపైకి ఎక్కి, బైతుల్లాహ్ కనిపించాక, దానివైపుకు తిరిగి అల్లాహ్ యొక్క ఏకత్వాన్ని, గొప్పతనాన్ని చాటుతూ ఇలా పలికారు:

"లా ఇలాహ ఇల్లల్లాహు వహదహూ లాషరీ కలహు లహుల్ ముల్కు వలహుల్ హమ్దు వహువ అలాకుల్లి షయ్యిన్ ఖదీర్, లా ఇలాహ ఇల్లల్లాహు వహదహు, అన్జజ వాదహు, వ నసర అబ్దహు వ హజమల్ అహ్జాబ వహద."

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దుఆ చేశారు.

ఇలా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు సార్లు చేశారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మర్వా వైపుకు వెళుతూ లోయ మధ్య లో ఆయన అడుగులు స్థిరపడగానే ఆయన పరుగెత్తుతూ, మర్వా కొండ ప్రారంభం కాగానే సామన్య వేగంతో నడుస్తూ మర్వా చేరుకున్నారు.

అక్కడ కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) సఫా పైన చేసినట్లే చేసారు. ఇలా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆఖరి ప్రదక్షిణ మర్వాలో పూర్తయ్యాక, ఇలా సెలవిచ్చారు:

"నాకు ఇప్పుడు తెలిసిన (తెలియ జేయబడిన) విషయం గనక ముందుగా తెలిసి వుంటే, నేను- ఖుర్బానీ కోసం పశువును తీసుకు రాకుండా దీనిని ఉమ్రాగా చేసుకొనే వాణ్ణి. అందుకే, మీలో ఎవరివద్ద నైతే ఖుర్బానీ పశువు లేదో, వారు దీనిని ఉమ్రాగా భావించి హలాల్ కావచ్చు."

ఇది విని, సురాఖ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) లేచి నిలబడి – ఓ దైవ ప్రవక్తా! ఈ ఆజ్ఞ కేవలం ఈ సంవత్సరం కోసమేనా లేక ఎల్లప్పటికా? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతివ్రేళ్ళను ఒకదానిలో ఒకటి పోనిచ్చి రెండు సార్లు ఇలా సెలవిచ్చారు: "ఉమ్రా, హజ్‌లో ప్రవేశించింది (కలిసిపోయింది), ఇక ఎల్లప్పుడూ ఇలాగే వుంటుంది."

(ఈ లోగా) అలీ (రజి అల్లాహు అన్హు) యమన్ నుండి దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒంటెలను తీసుకొని వచ్చారు. ఆయన, ఫాతిమా

(రజి అల్లాహు అన్హా) ను – హలాల్ అయి, రంగుల దుస్తులు ధరించి, కాటుక పెట్టుకొని వుండడం చూసి, ఆమెతో–నువ్విలా చేయకుండా వుండాల్సింది అని అన్నారు. ఆమె జవాబిస్తూ – మా నాన్నగారు (ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వ సల్లం) దీని గురించి ఆజ్ఞాపించారు అని అన్నారు.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: అలీ (రజి అల్లాహు అన్హు) ఇరాక్ లో వున్నప్పుడు ఇలా చెబుతూ వుండేవారు – ఫాతిమా (రజి అల్లాహు అన్హా) చేసిన దాని గురించి ఫిర్యాదు చేయడానికి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్ద కెళ్ళాను. ఫాతిమ (రజి అల్లాహు అన్హా) చెప్పిన విషయం గురించి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అభిప్రాయం తెలుసుకుందామని నేను భావించాను. అంతే కాక, ఆమెతో నేను చెప్పిన విషయం కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముందు ప్రస్తావించాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ: ఆమె సత్యం పలికింది, ఆమె సత్యం పలికింది అని చెప్పి, నాతో – నువ్వు హజ్ చేద్దామని నిర్ణయించుకున్నప్పుడు ఏమని సంకల్పించుకున్నావు? అని అడిగారు.

నేను – 'ఓ అల్లాహ్! నీ ప్రవక్త ఏ సంకల్పంతోనైతే ఇహ్రాం సంకల్పం చేసుకున్నారో నేను కూడా అలాగే ఇహ్రాం సంకల్పం చేసుకుంటున్నాను' అని అనుకొన్నానని, మనవి చేసుకున్నాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు: నాతో పాటు ఖుర్బానీ (పశువు) వుంది. (కనుక నేను హలాల్ కాలేను), అందుకే (నాలాగే సంకల్పం చేసుకున్నావు కాబట్టి) నువ్వు కూడా హలాల్ కాలేవు.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం: అలీ (రజి అల్లాహు అన్హు) యమన్ నుండి 100 ఒంటెలను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్దకు తీసుకొచ్చారు. తదుపరి ప్రజలంతా హలాల్ అయ్యారు మరియు తమ వెంట్రుకలను కత్తించుకున్నారు. కేవలం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ఖుర్బానీ (పశువులు) కలిగి వున్నవారు తప్ప.

ఇలా, 'యౌముత్తర్వియ' (జిల్ హిజ్జ 8వ తేది) వచ్చాక హజ్ సంకల్పం చేసుకొని మినా వైపుకు బయలుదేరి వెళ్ళారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా తన వాహనంపై మినా చేరుకొని, అక్కడ జొహర్, అసర్,

మగ్రిబ్, ఇషా మరియు (జిల్ హిజ్జ 9వ లేది) ఫజర్ నమాజులు చదివారు. ఫజర్ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాసేపు అక్కడే గడిపారు. తదుపరి సూర్యోదయమయ్యాక ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) (అరాఫాత్‌కు వెళ్ళి) తన కోసం 'నిమ్రా'లో ఒక గుడారం ఏర్పాటు చేయమని ఆజ్ఞాపించారు. ఆ తర్వాత ఆయన అక్కణ్ణుంచి బయలుదేరారు. అజ్ఞాన కాలంలో తాము 'మష్ అరుల్ హరామ్'లో బసచేసినట్లు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కూడా అక్కడ బస చేస్తారని ఖురైషీయులు భావించారు. కానీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దానిని దాటుకుంటూ వెళ్ళి అరాఫాత్‌కు చేరుకున్నారు. తన కోసం 'నిమ్రా'లో ఒక గుడారం ఏర్పాటు చేయబడడం ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) చూశారు. దీనితో, ఆయన అక్కడే దిగారు. తదుపరి, సూర్యుడు (పశ్చిమం వైపుకు) వంగడం ప్రారంభించగానే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఒంటె (ఖస్వ)ను సిద్ధం చేయమని ఆజ్ఞాపించారు. ఆయన ఆజ్ఞ కనుగుణంగా దానిపై సీటు అమర్చబడింది. తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దాని పైకెక్కి, లోయ మధ్య భాగంలోకి చేరుకొని ఖుత్బా ఇచ్చారు.... (ఈదుల్ అజ్‌హా తరువాత ఈ ఖుత్బా గురించి వివరంగా చర్చించడం జరుగుతుంది ఇన్షా అల్లాహ్).

ఆ తర్వాత (ముఅజ్జిన్) అజాన్ మరియు ఇఖామత్ పలికారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జొహర్ నమాజు చేయించారు. తదుపరి రెండవ ఇఖామత్ పలకబడింది మరియు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అసర్ నమాజు చేయించారు. ఈ రెండు నమాజుల మధ్య ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ విధమైన (నఫిల్) నమాజు చేయలేదు.

ఆ తర్వాత దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన వాహనం ఎక్కి (అరాఫాత్ లో) తాను బస చేసిన స్థలానికి చేరుకున్నారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన బంటె (ఖస్వ) పొట్టను రాళ్ళ వైపు చేసి, నడుస్తున్న వారిని తనకు ముందుగా చేసుకొని, ఖిబ్లా వైపుకు తిరిగి సూర్యాస్తమయం వరకు అక్కడే గడిపారు.

ఆ తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉసామా (రజి అల్లాహు అన్హు) ను తన వెనుక కూర్చోబెట్టుకొని ముజ్దలిఫా వైపుకు బయలు దేరారు. ఆ సమయంలో ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒంటె త్రాడును ఎంత గట్టిగా లాగి పట్టుకున్నారంటే, దాని తల– రౌతు గనక అలసినప్పుడు

కాళ్ళను ఎక్కడికైతే చాపుతాడో, అక్కడి దాకా చేరుకొంది. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన కుడి చేత్తో సైగ చేస్తూ ఇలా సెలవిచ్చారు:

"ప్రజలారా! ఎంతో ప్రశాంతంగా, సంతృప్తిగా నడవండి."

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ముజ్దలిఫా చేరుకున్నాక మగ్రిబ్ మరియు ఇషా నమాజులను ఒక అజాన్, రెండు ఇఖామతు లతో పూర్తి చేసుకున్నారు. వీటి మధ్య ఏ విధమైన (నఫిల్) నమాజుగానీ చేయలేదు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఫజర్ వేళ అయ్యే వరకు నిద్రపోయారు. ఫజర్ వేళ అయ్యాక ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అజాన్ మరియు ఇఖామత్‌లతో ఫజర్ నమాజు చేశారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఒంటె (ఖస్వ) పై ఎక్కి 'మష్అరుల్ హరామ్' వచ్చి ఖిబ్లా వైపుకు తిరిగి దుఆ చేశారు. అల్లాహ్ స్తోత్రం చేస్తూ, ఆయన గొప్పతనాన్ని, ఏకత్వాన్ని స్మరించారు. ఉదయం వెలుతురు వ్యాపించే వరకు ఈ స్థితిలోనే గడిపారు. ఆ తర్వాత సూర్యోదయానికి ముందే ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అక్కణ్ణుంచి బయలుదేరి మినా వైపుకు వెళ్ళారు. ఈ ప్రయాణంలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఫజల్ బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ను తన వెనక కూర్చో బెట్టుకున్నారు. ఆయన (ఫజల్ బిన్ అబ్బాస్) సొగసైన వెంట్రుకలు కలిగివుండి ఎంతో అందంగా వుండేవారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దగ్గర నుండి స్త్రీలు వెళుతున్నప్పుడు ఫజల్ బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) వారి వైపు చూడసాగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చేతిని ఆయన ముఖానికి అడ్డంగా ఉంచారు. దీనితో ఆయన, తన ముఖాన్ని త్రిప్పుకొని వేరే వైపు స్త్రీలను చూడ సాగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), రెండో వైపు నుంచి కూడా ఆయన స్త్రీలను చూడకుండా వుండటానికి తన చేతిని ఆయన ముఖానికి అడ్డంగా వుంచారు. ఇలా తన వాహనం వేగాన్ని పెంచి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జమ్రా - ఏ-అఖ్బా వెళ్ళే దారికి మరలారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) ఒక వృక్షం దగ్గరే వున్న పెద్ద జమ్రాకు చేరుకోగానే, లోయ మధ్యలో నుండి దానికి ఏడు కంకర్రాళ్ళు కొట్టారు. ప్రతి కంకర్రాయితో పాటు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తక్బీర్ పలికే

వారు. కంకర్రాళ్ళు చిన్న సైజులో వున్నాయి.

ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్బానీ ఇచ్చే స్థలం వైపుకు వెళ్ళి 63 ఒంటెలను జిబహ్ చేశారు. మిగతా వాటిని అలీ (రజి అల్లాహు అన్హు) కు ఇవ్వగా, ఆయన జిబహ్ చేశారు. తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రతి ఖుర్బానీ నుండి కొంత మాంసం తీయమని ఆజ్ఞాపించారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞానుసారం ప్రతి ఖుర్బానీ జంతువు నుండి కొంత మాంసం తీసి ఒక పెద్ద కుండలో వేయడం జరిగింది. మాంసం ఉడికిన తర్వాత ఇద్దరూ ఆ మాంసాన్ని తిన్నారు మరియు దాని రసాన్ని త్రాగారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన వాహనంపై ఎక్కి 'ఇఫాజా తవాఫ్' కోసం బైతుల్లాహ్ కు ప్రయాణమయ్యారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) బైతుల్లాహ్‌లో జొహర్ నమాజు చదివారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) (హాజీలకు) జమ్‌జమ్ నీళ్ళు త్రాగిస్తున్న 'బనూ అబ్దుల్ ముత్తలిబ్' దగ్గరి కొచ్చి ఇలా సెలవిచ్చారు:

"ఓ బనూ అబ్దుల్ ముత్తలిబ్! మీరు బొక్కెనతో నీళ్ళు తీయండి. ఒకవేళ ప్రజలు మీ మీదకు వచ్చి పడిపోతారేమోనన్న భయం నాకు లేకుంటే, నేను కూడా మీతో పాటు నీళ్ళు తీసేవాణ్ణి (మరియు హాజీలకు త్రాగించే వాణ్ణి). తదుపరి వాళ్ళు, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు బొక్కెన అందించగా ఆయన జమ్ జమ్ నీరు సేవించారు." *(ముస్లిం:1218)*

ఇదండీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్ పద్ధతి.

మేము అల్లాహ్ ను వేడుకొనే దేమిటంటే – ఆయన మనందరినీ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను అనుసరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## రెండవ ఖుత్బా

ప్రియ సోదరులారా!

హజ్ అయితే మక్కా ముకర్రమ లోనే సంపూర్ణమవుతుంది. అయినప్పటికీ, మస్జిదె నబవి లో నమాజ్ చదివే పుణ్యాన్ని పొందే నిమిత్తం మదీనా తయ్యిబా కు ప్రయాణించడం ముస్తహబ్ (అభిలషణీయం).

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నా ఈ మస్జిద్ (మస్జిదె నబవి) లోని ఒక్క నమాజు, ఇతర మస్జిదులలోని వెయ్యి నమాజుల కన్నా శ్రేష్టమైనది, కేవలం మస్జిదుల్ హరామ్ లో తప్ప."

*(బుఖారీ: 1190, ముస్లిం: 1394)*

## మస్జిదె నబవి సందర్శన మర్యాదలు

1) మస్జిదె నబవిలోకి ప్రవేశించాక 'తహ్యాతుల్ మస్జిద్' చదవాలి. ఒకవేళ వీలయితే, దానిని 'రౌజతు మిన్ రియాజిల్ జన్నహ్' లోకి వెళ్ళి చదవాలి. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీనిని స్వర్గపు ఉద్యాన వనాలలో ఒకటిగా ఖరారు చేశారు.

దీని గురించి ఇలా సెలవిచ్చారు:

"నా గృహం మరియు మింబర్ (వేదిక) కు మధ్య గల భాగం స్వర్గపు ఉద్యాన వనాలలో ఒక ఉద్యానవనం." *(బుఖారీ: 1195, ముస్లిం:1390)*

2) ఆ తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధి ముందు కొచ్చి దరూర్ మరియు సలాములు పఠించాలి. నమాజులో పఠించబడే దరూదె ఇబ్రాహీం పఠించడం ఉత్తమం. తదుపరి ఆయన సహచరులైన అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) మరియు ఉమర్ (రజి అల్లాహు అన్హు) లకు సలామ్ పలకాలి.

3) ఒకవేళ దుఆ చేయాలనుకుంటే, మస్జిదె నబవి లో ఎక్కడైన గానీ, ఖిబ్లా వైపుకు తిరిగి చేయండి.

4) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధి వద్ద ఆశీర్వాదం నిమిత్తం దానిపై చేతులు త్రిప్పుడం లేదా దాని ప్రదక్షిణ చేయడం ఎంతమాత్రం సరికాదు.

5) పురుషులు 'బఖీ ఉల్ గర్ఖద్' (మదీనా స్మశాన వాటిక) లో ఖనన మైవున్న వారి గురించి, అలాగే ఉహద్ షహీదుల సమాధుల వద్ద కెళ్ళి వారికి సలాం పలికి వారి గురించి దుఆ చేయడం ముస్తహబ్ (అభిలషణీయం).

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచర సమాజానికి ఈ దుఆ నేర్పారు.

"ఈ ఇండ్లలో వున్న మోమిన్ మరియు ముస్లిములపై శాంతి కురియు గాక! ఇన్షా అల్లాహ్, మేము కూడా మీతో కలుస్తాం. మాపై, మీపై మరియు

మీ వెనుక ఉండిపోయిన వారిపై అల్లాహ్ కారుణ్యం అవతరించు గాక! మేము మా శ్రేయస్సు మరియు మీ శ్రేయస్సు గురించి అల్లాహ్‌ను అర్థిస్తున్నాం.”

*(ముస్లిం: 974, నసాయి:2037, 2040, ఇబ్నెమాజ:1547)*

6) మస్జిదె నబవి తో పాటు మదీనా తయ్యిబాలో కేవలం ఖుబా మస్జిద్‌లో నమాజు చదవడానికి ప్రత్యేకత వుంది. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్వయంగా అక్కడికి వెళ్ళేవారు మరియు అక్కడ రెండు రకాతులు నమాజు చదివేవారు.

దీని మహత్యాన్ని గూర్చి వివరిస్తూ ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“ఏ వ్యక్తి అయినా తన ఇంట్లో వుజూ చేసుకొని, తదుపరి ఖుబా మస్జిద్ కు వచ్చి నమాజు చదివితే అతనికి ఉమ్రా చేసినంత పుణ్యం లభిస్తుంది.”

*(తిర్మిజి, నసాయి, ఇబ్నెమాజ, ఇబ్నె హిబ్బాన్, సహీ – అల్‌బానీ)*

మిగతా మస్జిదులలో నమాజు చేయడానికి ప్రత్యేకత ఏదీ నిరూపించ బడిలేదు. అందుకే పుణ్యఫలాపేక్షతో వాటిని సందర్శించడం సరైనది కాదు.

## కొన్ని పొరపాట్లు

1. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధిని సందర్శించే సంకల్పంతో మదీనా తయ్యిబా కు ప్రయాణమవడం.
2. హాజీల ద్వారా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు సలాములు పంపించడం.
3. ప్రతి నమాజు తర్వాత దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమాధి వద్దకు చేరుకొని దాని ముందు వినయంగా నిలబడడం.
4. దుఆ లో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను వసీలా గా చేయడం.
5. మజ్జిదె నబవి లో 40 నమాజులను బాధ్యతగా పాటించడం (చదవడం). వాస్తవానికి ఈ విషయంలో వివరించబడే హదీసులన్నీ బలహీనమైనవి మరియు ఆధారాలుగా అయోగ్యమైనవి.

ఖుత్బా ఆఖరిలో మేము అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే – ఆయన మనందరినీ ‘మబ్‌రూర్ హజ్’ (స్వీకారయోగ్యమయ్యే హజ్) భాగ్యాన్ని ప్రసాదించు గాక!

# జిల్ హిజ్జ మాసపు ఖుత్బాలు

1. జిల్‌హిజ్జ (మొదటి) పది రోజుల మహత్యాలు మరియు ఆచరణలు
2. ఈదుల్ అజ్‌హా ఖుత్బా
3. హజ్జతుల్ విదా ఖుత్బా - 1
4. హజ్జతుల్ విదా ఖుత్బా - 2

# జిల్‌హిజ్జ (మొదటి) పదిరోజుల మహత్యాలు మరియు ఆచరణలు

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1. జిల్ హిజ్జ (మొదటి) పదిరోజుల ప్రాధాన్యత.
2. జిల్‌హిజ్జ (మొదటి) పదిరోజుల మహత్యాలు.
3. జిల్ హిజ్జ (మొదటి) పదిరోజులలో అభిలషణీయమైన (ముస్తహబ్) ఆచరణలు.
4. ఖుర్బానీ ప్రాధాన్యత.

ఇస్లామీయ సోదరులారా!

అల్లాహ్ ప్రతి వ్యక్తినీ తన అరాధన కొరకే సృష్టించాడు కాబట్టి అతను కూడా ఆయన (అల్లాహ్) ఇష్టాయిష్టాలను లోబడి జీవితం గడపాలి మరియు ఆయనను ఆరాధిస్తూ ఎల్లప్పుడూ ఆయన సాన్నిధ్యం పొందడానికి ప్రయత్నిస్తూ వుండాలి. అల్లాహ్ ఎన్నో మహత్తర అవకాశాలను (మానవుల కోసం) కల్పించాడు. కనుక మానవులంతా ఆ మహత్తర అవకాశాలను సద్వినియోగం చేసుకొని, ఆ వ్యవధుల్లో ఆరాధన కోసం నడుం బిగించి, వివిధ సత్కార్యాలలో ఒకరినొకరు మించిపోవడానికి ప్రయత్నించాలి.

ఆ శుభకర అవకాశాల్లో ఒకటి జిల్ హిజ్జ మాసపు(మొదటి) పదిరోజులు.

ఈ దినాలను అత్యుత్తమ దినాలని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సాక్ష్యమిచ్చారు మరియు వీటిలో సత్కార్యాలు చేయడం గురించి గట్టిగా తాకీదు చేశారు.

అల్లాహ్, ఖుర్ఆన్‌లో ఒకచోట ఈ రోజుల మీద ప్రమాణం చేశాడు.

وَالْفَجْرِ ﴿1﴾ وَلَيَالٍ عَشْرٍ ﴿2﴾

**"ఉషోదయం సాక్షిగా! పది రాత్రుల సాక్షిగా!"** ***(ఫజ్ర్:1-2)***

ఎంతో మంది విశ్లేషకుల దృష్టిలో పది రాత్రులంటే, జిల్ హిజ్జ మాసపు మొదటి పది రాత్రులని అర్థం. అల్లామా ఇబ్నె కసీర్ (రహిమహుల్లాహ్) కూడా

తన తఫ్సీర్ (విశ్లేషణ) లో ఈ అభిప్రాయాన్నే సరైనదిగా ఖరారు చేశారు.

అల్లాహ్ వీటి మీద ప్రమాణం చేయడం వీటి ఔన్నత్యానికీ, మహత్యానికి పెద్ద నిదర్శనం. ఎందుకంటే మహోన్నతుడైన అల్లాహ్ ఉన్నతమైన వాటిపైనే ప్రమాణం చేస్తాడు.

అందుకే, అల్లాహ్ దాసులు కూడా ఈ రోజుల్లో సత్కార్యాల కోసం వీలైనంత ఎక్కువగా శ్రమించాలి. వీటి రాక తమ కోసం మేలైనదిగా, గౌరవమైనదిగా భావించాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالَّذِينَ جَاهَدُوا فِينَا لَنَهْدِيَنَّهُمْ سُبُلَنَا ۚ وَإِنَّ اللَّهَ لَمَعَ الْمُحْسِنِينَ

**"ఎవరయితే మా మార్గంలో బాధలు భరిస్తారో, వారికి మేము తప్పకుండా మా మార్గాలు చూపుతాము. నిశ్చయంగా అల్లాహ్ సద్వర్తనులకు తోడుగా వుంటాడు."** ***(అన్కబూత్ : 69)***

అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే – ఆయన మనందరికీ ఈ దినాలలో వీలైనంత ఎక్కువగా ఆరాధించి వీటిద్వారా ప్రయోజనం పొందే సద్బుద్ధిని ప్రసాదించుగాక!

## జిల్‌హిజ్జ (మొదటి) పదిరోజుల మహత్యాలు

### 1. ప్రాపంచిక దినాలన్నింటిలోనూ ఈ దినాలు ఎంతో శ్రేష్టమైనవి.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహివ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ప్రాపంచిక దినాలన్నింటిలోనూ పది దినాలు (జిల్ హిజ్జ 10 దినాలు) ఎంతో శ్రేష్టమైనవి. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ను – ఒక వేళ ఇన్ని రోజులే (10) అల్లాహ్ మార్గంలో జిహాద్ చేస్తూ గడిపితే, అవి కూడా వీటికి సమానం కాలేవా? అని అడగబడింది.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – సమానం కాలేవు, కేవలం వీర మరణం పొందితే తప్ప అని వివరించారు.

*(బజ్జార్, ఇబ్నె హిబ్బాన్, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్:115)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"సత్కార్యాల కోసం ఈరోజులు (జిల్ హిజ్జ మొదటి పది రోజులు) అల్లాహ్ వద్ద ఎంతో ప్రియమైనవి."

సహాబాలు ఇలా అడిగారు: ఓ దైవ ప్రవక్తా! అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయడం కన్నా కూడానా? (జిహాద్ కన్నా ప్రియమైనవా?)

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): "అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయడం కూడా అంత ప్రియమైనది కాదు. కేవలం, మనిషి తన ధనప్రాణాలతో బయలుదేరి తదుపరి దేనితోనూ తిరిగి రాకపోతే తప్ప" అని వివరించారు.

అంటే – అల్లాహ్ మార్గంలో తన సంపదనంతా ఖర్చుచేసి, వీర మరణం పొందే వ్యక్తి అన్నమాట. నిశ్చయంగా అతని ఆచరణ ప్రియమైనదే. అది తప్ప మిగతా సత్కార్యాలేవీ ఈ రోజుల కన్నా అల్లాహ్‌కు ప్రియమైనవి కావు.

మరో ఉల్లేఖనంలో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఖుర్బానీ పది దినాలలో చేయబడే సత్కార్యం (ఎంత శ్రేష్ఠమైనదంటే) – అల్లాహ్ వద్ద దాని కన్నా ఎక్కువ పవిత్రత, పుణ్యఫలం కలిగిన ఆచరణ ఏదీ లేదు."

"అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయడం కూడానా? అని అడగబడింది.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – అల్లాహ్ మార్గంలో జిహాద్ చేయడం కూడా లేదు. కేవలం, ఒక వ్యక్తి తన ధనప్రాణాలతో బయలుదేరి, ఆ రెండింటినీ త్యాగం చేస్తే తప్ప అని వివరించారు.

హదీసు ఉల్లేఖకులు ఇలా అంటున్నారు:

"ఈ హదీసును ఆధారంగా చేసుకొని సయీద్ బిన్ జుబైర్ రహిమహుల్లాహ్ జిల్‌హిజ్జ మొదటి పదిరోజులు ప్రారంభం కాగానే ఆరాధనల్లో ఎంతగా శ్రమించే వారంటే, ఇతరలకు అలా చెయ్యడం సాధ్యమయ్యేది కాదు.

*(సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 1148)*

అందుకే, మనం కూడా సలఫుస్సాలిహీన్ ల ఆచరణ రీతిని స్వీకరించి

ఈ రోజుల్లో వీలైనంత ఎక్కువగా ఆరాధించాలి. ఎందుకంటే, ఈ హదీసు ప్రకారం, ఈ రోజుల్లో చేయబడే సత్కార్యానికి అల్లాహ్ ఎంతగా అనుగ్రహిస్తాడో, అంతగా వేరే రోజుల్లో అనుగ్రహించడు.

**2) ఈ దినాలలోనే అరాఫాత్ దినం కూడా వుంది.**

అవునండీ! హజ్ యొక్క అసలు దినమైన, హజ్ యొక్క ముఖ్యాంశమైన అరాఫాత్ దినం (అరాఫాత్‌లో గడపడం) కూడా ఈ దినాలలోనే వస్తుంది. అరాఫాత్ వాసులందరినీ అల్లాహ్ మన్నించి, అత్యధిక మందిని నరకాగ్ని నుండి స్వేచ్ఛ ప్రసాదించబడే మహోన్నత దినం అది.

ఈ కారణంతో, ఒకవేళ జిల్‌హిజ్జ పదిరోజులలో, ఏ దినానికి ఏ మాత్రం ప్రత్యేకత లేకపోయినా కేవలం అరాఫాత్ దినమే ఈ దినాల మహత్యానికి సరిపోతుంది.

**3) ఈ దినాల్లోనే ఖుర్బానీ దినం (యౌమున్నహర్) కూడా వుంది.**

కొంత మంది విద్వాంసుల ప్రకారం 'ఖుర్బానీ దినం' యావత్ సం॥లోని దినాలన్నిటికన్నా శ్రేష్టమైనది. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ వద్ద అన్నిటికన్నా ఘనమైన, ఉన్నతమైన దినం ఖుర్బానీ దినం (అంటే జిల్ హిజ్జ 10వ దినం), ఆ తర్వాత (మినా లో) గడిపే దినం (జిల్ హిజ్జ11వ దినం)". *(అబూదావూద్, నసాయి, సహీ – అల్‌బానీ)*

**4) ఈ దినాలలో, ప్రముఖ ఆరాధనలు ఎన్నో కలిసిపోతాయి.**

అల్లామా ఇబ్నె హజర్ రహిమహుల్లాహ్ 'ఫతహుల్ బారీ' లో దీని గురించి ఇలా వివరించారు:

"జిల్‌హిజ్జ 10 దినాలకు 'అత్యధిక శ్రేష్టత' వొసగబడటానికి తెలిసే కారణమేమిటంటే–ప్రముఖమైన ఆరాధనలన్నీ ఈ పది దినాలలో కలిసి పోతాయి. అవి నమాజ్, ఉపవాసం, దాన ధర్మాలు మరియు హజ్. ఈ దినాలు తప్ప మిగతా దినాలలో అవి ఇలా కలిసిపోవు."

*(ఫతహుల్ బారీ: 2వ సంపుటం, 460 పేజీ)*

## జిల్ హిజ్జ పది దినాలలో అభిలషణీయమైన ఆచరణలు

ప్రియ సోదరులారా!

సం॥లోని మిగతా రోజులకన్నా జిల్‌హిజ్జ పది రోజుల్లో చేయబడే సత్కార్యాలకు ఎక్కువ మహత్యం వుందన్న విషయం మీరు తెలుసుకున్నారు కాబట్టి, అల్లాహ్ ప్రసాదించిన ఈ సువర్ణావకాశాన్ని మీరు అదృష్టంగా భావించి ఈ దినాలను ప్రత్యేకంగా పాటించాలి. ఇలాంటి మహత్తర అవకాశాలు మాటి మాటికి రావు. అందుకే ఈ అవకాశాలను ఏ మాత్రం వృధా చేయకుండా, వీలైనంత ఎక్కువగా సత్కార్యాలను చేయడానికి సలఫుస్సాలిహీన్‌లు ఎలాగైతే ప్రయత్నించే వారో మనం కూడా ఈ దినాలలో వీలైనంత ఎక్కువగా ఆరాధించ డానికి గట్టిగా ప్రయత్నించాలి.

అబూ ఉస్మాన్ అన్నహది రహిమహుల్లాహ్ ఇలా సెలవిచ్చారు:

"సలఫుస్సాలిహీన్ పదిరోజులతో కూడుకున్న మూడు వ్యవధులను ఎక్కువగా ప్రాధాన్యత ఇచ్చి గౌరవించేవారు. అవేమిటంటే – రంజాన్ మాసపు ఆఖరి పది దినాలు, జిల్ హిజ్జ మరియు ముహర్రం మాసాల మొదటి పది దినాలు."

ఈ దినాలలో అభిలషణీయమైవుండి, ముస్లిములందరూ ప్రత్యేకంగా పాటించాల్సిన ఆచరణలు ఇవి:

### 1) హజ్ మరియు ఉమ్రా లను నిర్వర్తించడం.

జిల్ హిజ్జ పది దినాలలో చేయబడే సత్కార్యాలన్నిటిలో శ్రేష్టమైన ఆచరణ – హజ్ మరియు ఉమ్రా లను నిర్వర్తించడం. ఎందుకంటే, అల్లాహ్, ఏ వ్యక్తి కైనా తన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ ప్రకారం బైతుల్లాహ్ హజ్ మరియు ఉమ్రాలను నిర్వర్తించే సద్బుద్ధిని గనక ప్రసాదిస్తే దాని ప్రతిఫలం అల్లాహ్ వద్ద స్వర్గమే.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఒక ఉమ్రా తర్వాత మరొక ఉమ్రా, రెండింటి మధ్య జరిగే వాటికి (పాపాలకు) పరిహారం (కఫ్ఫారా). అలాగే మబ్‌రూర్ (స్వీకార యోగ్యమయ్యే) హజ్ కు ప్రతిఫలం స్వర్గమే."

'మబ్రూర్ హజ్' అంటే–దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ ప్రకారం చేయబడే హజ్. అన్ని రకాల పాపాల నుండి, ఉదా॥కు ప్రదర్శనా బుద్ధిని చాటే మరియు చెడు, అనవసర మాటల నుండి పవిత్రంగా వుండి, కేవలం సత్కార్యాలతో, సత్ప్రవర్తనతో నిండివున్న హజ్.

## 2) ఉపవాసముండడం.

ఉపవాసం కూడా సత్కార్యాలలోనిదే. అల్లాహ్ వద్ద శ్రేష్టమైన, ప్రియమైన ఆచరణలలో ఒకటి.

అబూ సయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా అల్లాహ్ మార్గంలో ఒక రోజు ఉపవాసం ఉంటే, దీనికి ప్రతిగా అల్లాహ్ అతని ముఖాన్ని నరకం నుండి 70 సం॥ల ప్రయాణ మంత దూరం చేస్తాడు." *(బుఖారీ : 2840, ముస్లిం:1153)*

ఉపవాసానికి గల సాధారణ మహత్యం ఇది.

ఇక, జిల్ హిజ్జ పది దినాలలో ఉపవాసం గురించి చెప్పాలంటే–

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) భార్యలలో ఒకరి ద్వారా ఇలా సెలవియ్యబడింది:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జిల్‌హిజ్జ లో మొదటి తొమ్మిది దినాలు ఉపవాసముండే వారు. అలాగే అషూరా దినం మరియు ప్రతి నెలలో మూడు దినాలు ఉపవాసం ఉండేవారు."

*(అబూ దావూద్ : 2437, సహీ – అల్‌బానీ)*

ఈ కారణంగా, జిల్ హిజ్జ మాసపు మొదటి తొమ్మిది రోజులు ఉపవాసముండడం అభిలషణీయం. ఇక ఆయెషా (రజి అల్లాహు అన్హా) గారి "నేను జిల్ హిజ్జ మొదటి పదిరోజుల్లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఉపవాసముండడం ఎప్పుడూ చూడలేదు" (ముస్లిం:1176) అన్న వచనం విషయాని కొస్తే, ఇమామ్ నవవీ దీని గురించి ఇలా వివరించారు:

ఈ హదీసు ద్వారా – జిల్ హిజ్జ లోని పది దినాలలో, అంటే మొదటి తొమ్మిది దినాలలో ఉపవాసముండడం అవాంఛనీయం (మక్రూహ్) అన్న

అనుమానం కలుగుంది. కానీ, విద్వాంసులు దీనిని ఇలా విశ్లేషించారు – ఈ దినాలలో ఉపవాసముండడం ఏ మాత్రం అవాంఛనీయం కాదు. పైగా ఇలా చేయడం (ఉపవాసముండడం) అన్ని రకాలుగా అభిలషణీయం (ముస్తహబ్) ఎందుకంటే, వీటి మహత్యం గురించి ఎన్నో హదీసులు ఉల్లేఖించబడ్డాయి. అంతేగాక, సహీ బుఖారీలో – ఈ రోజుల్లోని ఆచరణలు, మిగతా రోజుల్లో చేయబడే ఆచరణల కన్నా అల్లాహ్ కు ఎంతో ప్రియమైనవి – అన్న దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసు కూడా వుంది. వాస్తవం ఇదైనప్పుడు, ఆయెషా (రజి అల్లాహు అన్హ) – ఈ దినాలలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఉపవాసం పాటించలేదు – అని అన్నారంటే, దాని అర్థం, బహుశా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అనారోగ్యం కారణంగా లేదా ప్రయాణం మూలంగా పాటించలేదు. ఆమె చూడకపోయినంత మాత్రాన, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆ దినాలలో అసలు ఉపవాసమే పాటించలేదు అని భావించడం సరికాదు. ఆ తర్వాత ఇమామ్ నవవీ (తన వివరణ కు) ఆధారంగా, మేమింతకు ముందు వివరించిన అబూదావూద్ లోని హదీసును వివరిం చారు. *(షరన్నవవీ – సహీ ముస్లిం: 4వ సంపుటం, 58 పేజి)*

హాఫిజ్ ఇబ్నె హజర్ రహిమహుల్లాహ్ ఇలా వివరించారు:

"ఆయెషా (రజి అల్లాహు అన్హ) వచనం గురించి చెప్పాలంటే, అది బహుశా ఇలా జరిగి వుండవచ్చు: అదెలా అంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కొన్ని సార్లు ఏదైనా ఆచరణ ఇష్టపడినప్పటికీ, కేవలం అది ఫర్జ్ (విధి) గావించబడుతుందేమో నన్న భయంతో త్యజించే వారు. కనుక, వీటిని కూడా (జిల్ హిజ్జ మొదటి తొమ్మిది దినాల ఉపవాసాలు) వాటి విధిత్వ భయంతో బహుశా వదిలిపెట్టి ఉండవచ్చు."

*(ఫతహుల్ బారీ: 2వ సంపుటం, 460 పేజి)*

ఆయెషా (రజి అల్లాహు అన్హ) వచనాన్ని ఏవిధంగా విశ్లేషించినా (అర్థం చేసుకున్నా), దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రవచనం – ఈ దినాలలోని ఆచరణలు, ఇతర దినాలలోని ఆచరణల కన్నా అల్లాహ్ కు ఎంతో ప్రియమైనవి – లో ఉపవాసం కూడా వచ్చేస్తుంది. గుర్తించుకోవాల్సిన విషయమేమిటంటే – జిల్ హిజ్జ 10 దినాలలో అరాఫాత్ దినం ఉపవాసం గురించి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రత్యేకంగా ప్రాధాన్యతనిచ్చి,

దాని మహత్యం గురించి వివరిస్తూ ఇలా సెలవిచ్చారు:

"అరాఫాత్ దినపు ఉపవాసం గురించి నాకు అల్లాహ్ పై గల నమ్మకం ఏమిటంటే – అది గడిచిన మరియు రాబోయే 1 సం॥లోని పాపాలకు గాను పరిహారం (కఫ్ఫారా) అవుతుంది. *(ముస్లిం: 1162)*

అందుకే, జిల్‌హిజ్జ 9వ తేది (అరాఫాత్ దినం) నాడు ఉపవాసముండడం సున్నత్.

## 3) నమాజ్ చదవడం

నమాజ్ అన్నింటికన్నా ఉన్నతమైన, మహత్యం గల ఆచరణ. అందుకే దీనిని సం॥ అంతా క్రమం తప్పకుండా మరియు సామూహికంగా నెలకొల్పడం ప్రతి ముస్లింపై విధిగా వుంది. ప్రత్యేకించి ఈ దినాలలో ఫర్జ్ నమాజులతో పాటు, వీలైనంత ఎక్కువగా నఫిల్ నమాజులను కూడా చదువుతూ వాటిని కూడా పాటించాలి. ఎందుకంటే, నవాఫిల్ (ఐచ్ఛిక ఆరాధనలు) అల్లాహ్ సాన్నిధ్యం పొందడానికి ఉత్తమ సాధనాలు.

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు – ఏ వ్యక్తి అయినా నా మిత్రునితో శత్రుత్వం కలిగి వుంటాడో నేనతనితో యుద్ధ ప్రకటన చేస్తాను. నా దాసుడు తనపై విధి (ఫర్జ్) గా విధించబడిన వాటిని ఆచరిస్తూ నా సాన్నిధ్యాన్ని ఎక్కువగా పొందగలుగుతాడు. (అంటే ఫర్జ్ ల ద్వారా నా సాన్నిధ్యాన్ని పొందడం నా కెంతో ఇష్టం). ఇంకా ఐచ్ఛిక (నఫిల్) ఆరాధనల ద్వారా కూడా నా సాన్నిధ్యాన్ని పొందుతూ వుంటాడు. చివరికి నేను అతన్ని ప్రేమిస్తాను. నేనతన్ని ప్రేమించడం మొదలు పెట్టాక, అతను వినే చెవినై పోతాను, అతను చూసే కళ్ళయిపోతాను, అతను పట్టుకొనే చెయ్యినై పోతాను, అతను నడిచే కాళ్ళయి పోతాను (అంటే అతని శరీర అవయవాలన్నిటినీ నా విధేయతకు అనుగుణంగా మార్చుతాను) తదుపరి అతను ఏ విషయం గురించి అయినా అర్థిస్తే, నేనతనికి అనుగ్రహిస్తాను. ఒకవేళ అతను నా శరణు కోరుకుంటే, నేనతనికి నా శరణు ప్రసాదిస్తాను."

*(బుఖారీ:6502)*

### 4) అల్లాహ్ స్మరణ (జిక్ర్) చేయడం

ఈ శుభకర దినాలలో వీలైనంత ఎక్కువగా అల్లాహ్‌ను స్మరించాలి. ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ వద్ద ఘనమైన, ఎంతో ప్రియమైన దినాలు జిల్ హిజ్జ (మొదటి) పది దినాలు. వీటికి సాటిగా మరే దినమూ లేదు. అందుకే ఈ దినాలలో మీరు వీలైనంత ఎక్కువగా "లా ఇలాహా ఇల్లల్లాహ్" "అల్లాహు అక్బర్" మరియు "అల్ హమ్దులిల్లాహ్" లను పఠిస్తూ వుండండి."

*(అహ్మద్: 9వ సంపుటం, 323 పేజీ మరియు 10వ సంపుటం, 296 పేజి)*

అల్లాహ్ ను స్మరించడం ద్వారా ఆయన సాన్నిధ్య భాగ్యం దొరకడం కన్నా గొప్ప ప్రయోజనం ఇంకేం వుంటుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ ఇలా సెలవిస్తున్నాడు- నా దాసుడు నా గురించి ఎలా ఊహించు కుంటాడో, నేను అతని పట్ల అలాగే ప్రవర్తిస్తాను. అతను నన్ను స్మరించేటప్పుడు నేనతనితో వుంటాను. ఒకవేళ అతను నన్ను మనసులో గుర్తుకు తెచ్చుకుంటే నేను కూడా అతన్ని మనసులో గుర్తుకు తెచ్చుకుంటాను. ఒకవేళ అతను ఏదైనా సమూహంలో నన్ను గుర్తు తెచ్చుకుంటే, నేను దానికన్నా ఉత్తమమైన సమూహంలో అతన్ని గుర్తు తెచ్చుకుంటాను. ఒకవేళ అతను జానెడంత నావైపుకు జరిగితే, నేను ఒక చెయ్యి అంత అతని వైపుకు జరుగుతాను. ఒకవేళ అతను ఒక చెయ్యి అంత నావైపు జరిగితే, నేను రెండు చేతులంత అతని వైపుకు జరుగుతాను. ఒకవేళ అతను నడుచుకొంటూ నావైపు కొస్తే, నేను పరుగెత్తు కొంటూ అతని వైపుకు వెళ్తాను."

*(బుఖారీ: 7405, ముస్లిం: 2675)*

ఈ హదీసు – సామాన్యంగా చేయబడే జిక్ర్ గురించి వివరించింది.

ఇక దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రత్యేకంగా సెలవిచ్చిన కలిమాల (సద్వచనాలు) విషయానికొస్తే, వాటి పఠనం ద్వారా ఎన్నో ప్రయోజనాలు వున్నాయి.

అబూమాలిక్ అష్ అరీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

పరిశుద్ధత అనేది విశ్వాసం. 'అల్ హమ్దులిల్లాహ్', త్రాసును (పుణ్య ఫలంతో) నింపేస్తుంది. 'సుబ్హానల్లాహ్' మరియు 'అల్హమ్దులిల్లాహ్' – ఈ రెండు కలిమాలు భూమ్యాకాశాల మధ్య స్థలాన్ని (పుణ్యఫలంతో) నింపేస్తాయి....

*(ముస్లిం:223)*

ఈ లాభాలేకాక, ఈ కలిమాల ప్రయోజనాలు మరెన్నో వున్నాయి.

1) ఈ కలిమాలు అల్లాహ్ వద్ద అత్యంత ప్రియమైన కలిమాలు (వచనాలు).

సమురా బిన్ జున్దుబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నాలుగు కలిమాలు అల్లాహ్కు అత్యంత ప్రియమైనవి. వాటిలో మీరు దేనితో ప్రారంభించినా తప్పులేదు. అవి – సుబ్హానల్లాహి వల్హమ్దు లిల్లాహి వ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్." *(ముస్లిం:2137)*

2) ఈ కలిమాలు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు కూడా ఎంతో ప్రియమైనవి.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఒకవేళ నేను – 'సుబ్హానల్లాహి, వల్ హమ్దులిల్లాహి,వలాఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్' అని పఠిస్తే ఇది నాకు – సూర్యుడుదయించే వస్తువులన్నింటికన్నా (భూమిలోని వస్తువులన్నింటి కన్నా ) ప్రియమైనది."

*(ముస్లిం:2695)*

3) స్వర్గంలో వృక్షారోపణం.

అబ్దుల్లా బిన్ మస్ ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఇస్రా వ మేరాజ్ రాత్రి నేను ఇబ్రాహీం (అలైహిస్సలాం) ను కలవడం జరిగింది. ఆయన, నాతో – ఓ ముహమ్మద్! మీ అనుచర సమాజానికి నా సలామ్ చెప్పండి. స్వర్గపు మట్టి ఎంతో మేలైనదని, దాని నీరు ఎంతో చల్లగా

వుంటుందని, దాని భూమి సమతలంగా వుంటుందని మరియు 'సుబ్‌హానల్లాహి వల్ హమ్దు లిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్' ల (పఠనం)తో దీనిలో వృక్షారోపణం చేయవచ్చని వారికి తెలియజేయండి."

*(తిర్మిజి:3462, సహీ – అల్‌బానీ)*

మరో హదీసులో ఇలా వుంది:

అబూహురైరా (రజి అల్లాహు అన్హు) ఓసారి చెట్లు నాటుతుండగా, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అటునుండి వెళుతూ, ఆయన వద్ద కొచ్చి – ఓ అబూ హురైరా! దీనికన్నా మేలైన వృక్షారోపణం గురించి నేను నీకు తెలియజేయనా? అని అన్నారు.

ఆయన – తప్పకుండా ఓ దైవ ప్రవక్తా అని జవాబిచ్చారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయనతో – నువ్వు 'సుబ్‌హానల్లాహి వల్ హమ్దులిల్లాహి వ లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్' అని పఠిస్తూ వుండు. ప్రతి యొక్క దానికి (కలిమాకు) బదులుగా స్వర్గంలో ఒక చెట్టు నాటబడుతుంది అని వివరించారు.

*(ఇబ్నెమాజ:3807, సహీ – అల్‌బానీ)*

4) అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఈ భూమి మీద ఏ వ్యక్తి అయినా, 'లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్, వ సుబ్‌హానల్లాహి వల్ హమ్దులిల్లాహి, వలాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్' కలిమాలు గనక పఠిస్తే సముద్రపు నురుగుకు సమానంగా అతని పాపాలున్నప్పటికీ, అవన్నీ తుడిచివేయబడతాయి."

*(తిర్మిజి: 3460, హసన్ – అల్‌బానీ)*

5) అనస్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక చెట్టు వద్ద నుండి వెళ్ళసాగారు. దాని ఆకులు ఎండిపోయి ఉన్నాయి. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన (చేతిలోని) కర్రతో దానిని కొట్టగానే ఆ ఎండిన ఆకులు రాలి క్రింద పడిపోయాయి.తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నిశ్చయంగా, అల్ హమ్దులిల్లాహి వ సుబ్‌హానల్లాహి వ లా ఇలాహ

ఇల్లల్లాహు వల్లాహు అక్బర్ కలిమాలు – చెట్టు నుండి ఎండుటాకులు రాలినట్లే, దాసుని పాపాలను రాలుస్తాయి.” *(తిర్మిజి:3533, హసన్ – అల్‌బానీ)*

6) అల్లాహ్ ఈ కలిమాలను తన దాసుల కోసం ఎన్నుకున్నాడు మరియు వీటిపై ఎంతో పుణ్యఫలాన్ని వుంచాడు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) మరియు అబూ సయీద్ (రజి అల్లాహు అన్హు) ల కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“నిశ్చయంగా అల్లాహ్, మాటలలో – నాలిగింటిని (కలిమాలను) ఎన్ను కున్నాడు. అవి ‘సుబ్‌హానల్లాహి వల్ హమ్దులిల్లాహి వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్.’ ఏ వ్యక్తి అయినా ‘సుబ్‌హానల్లాహ్” అని పఠిస్తే అతని కోసం 20 పుణ్యాలు లిఖించబడతాయి మరియు 20 పాపాలు క్షమించబడతాయి. ఏవ్యక్తి అయినా ‘అల్లాహు అక్బర్’ అని పఠిస్తే అతని క్కూడా ఇదే దొరుకుతుంది. ఏ వ్యక్తి అయినా ‘లా ఇలాహ ఇల్లల్లాహ్’ అని పఠిస్తే అతని క్కూడా ఇదే దొరుకుతుంది. ఏ వ్యక్తి అయినా తన వైపు నుంచి ‘అల్ హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్’ అని పఠిస్తే అతని కోసం 30 పుణ్యాలు లిఖించబడతాయి మరియు 30 పాపాలు తుడిచి వేయబడతాయి.”

*(ముస్నద్ అహ్మద్, ముస్తద్రక్ హాకిమ్, సహీ – అల్‌బానీ, సహీఉల్ జామె:1718)*

తన వైపు నుంచి ‘అల్‌హమ్దు లిల్లాహి రబ్బిల్ ఆలమీన్’ అని పలకడం అంటే – కారణమేదీ లేకుండానే ‘అల్ హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్’ పఠించడం అన్నమాట. అల్లాహ్ అనుగ్రహాలకు గాను కృతజ్ఞతలు చెప్పేటప్పుడు, ఉదా॥కు తిని త్రాగిన తర్వాత, నిద్ర నుండి మేల్కొన్న తర్వాత, దొరికే పుణ్య ఫలం కన్నా దీనికే మాత్రం (కారణమేదీ లేకుండానే పఠించినప్పుడు) ఎక్కువ పుణ్య ఫలం అతనికి లభిస్తుంది.

7) ఈ కలిమాలు కవచం లాంటవి.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

“మీ కవచాలను తీసుకోండి.”

మేము: మా దగ్గరకి వచ్చేసిన శత్రువు నుండి రక్షణ కొరకు కవచాలా! అని అడిగాం.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం): లేదు, నరకాగ్ని నుండి రక్షణ కొరకు కవచాలు అని చెప్పి తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“మీరు ఈ కలిమాలను పఠిస్తూ వుండండి – సుబ్‌హానల్లాహి వల్ హమ్దులిల్లాహి, వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. ఎందుకంటే ఇవి ప్రళయం రోజు (నరకాగ్ని) నుండి విముక్తి కలిగించి (స్వర్గం వైపుకు) ముందుకు తీసుకెళ్తాయి మరియు ఇవే మిగిలి వుండే సత్కార్యాలు.”

*(హాకిమ్, సహీ ఉల్ జామె: 3214)*

8) ఈ కలిమాలు అర్ష్ (అల్లాహ్ సింహాసనం) చుట్టూ తమను పఠించే వారిని స్మరించుకుంటూ ఉంటాయి.

నోమాన్ బిన్ బషీర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“అల్లాహ్ మహిమతో మీరు నేర్చుకుంటూ వుంటారు. దానిలో ఈ కలి మాలు కూడా వున్నాయి– సుబ్‌హానల్లాహి, వల్ హమ్దులిల్లాహి, వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్. ఇవి అల్లాహ్ అర్ష్ చుట్టూ తిరుగుతూ వుంటాయి. ఇవి తమను పఠించే వారిని స్మరించుకొంటూ తేనెటీగలు శబ్దం చేసినట్లు శబ్దం చేస్తూ వుంటాయి. మరయితే మీలో – ఇతరులు తమను స్మరించుకోడానికి ఇష్టపడేవారు ఎవరైనా వున్నారా?” *(ఇబ్నెమాజ:3089, సహీ – అల్‌బానీ)*

9) ఈ కలిమాలలో (తస్బీహ్‌లో) ప్రతి ఒక్క కలిమా ఒక సదఖా (దానం)

అబూజర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సహాబాలలో కొందరు ఆయనతో ఇలా విన్నవించుకున్నారు: ఓ దైవ ప్రవక్తా! ధనవంతులు మా కన్నా ఎక్కువగా పుణ్యఫలాన్ని అర్జిస్తున్నారు. మాలాగే వారు కూడా నమాజు చదువుతారు, ఉపవాసాలు కూడా వుంటారు, తమ వద్ద మిగిలిన సొమ్మును దానం కూడా చేస్తారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – అల్లాహ్ మీకోసం కూడా దానం చేసే అవకాశం కల్పించలేదా? నిస్సందేహంగా ప్రతి ‘సుబ్‌హా

నల్లాహ్’ఒక దానం, ప్రతి ‘అల్లాహు అక్బర్’ ఒక దానం, ప్రతి ‘అల్‌హమ్దులిల్లాహ్’ ఒక దానం మరియు ప్రతి ‘లా ఇలాహ ఇల్లల్లాహ్’ ఒక దానం. ప్రతి సత్కార్య ఆదేశం ఒక దానం, ప్రతి చెడు నుండి ఆపడం ఒక దానం ...”అని వివరించారు.

*(ముస్లిం: 1006)*

ఈ శుభప్రద కలిమాల మహోన్నత ప్రయోజనాలను దృష్టిలో వుంచుకొని వీటిని సాధారణ రోజుల్లోనూ, ప్రత్యేకించి ఈ దినాలలోనూ వీలైనంత ఎక్కువగా పఠిస్తూ వుండాలి.

ప్రత్యేకించి ‘తక్బీర్లు’ పఠించడాన్ని మాత్రం వీలైనంత ఎక్కువగా పాటించాలి.

ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) మరియు అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) లు ఇలాగే చేసేవారు.

ఇమామ్ బుఖారీ రహిమహుల్లాహ్ ఇలా సెలవిచ్చారు:

“ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) మరియు అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) లు జిల్ హిజ్జ మొదటి 10 రోజుల్లో బజారుకు వెళ్ళి అక్కడ ‘తక్బీర్’ పఠించేవారు. ఇది చూసి ఇతరులు కూడా వారితో పాటు తక్బీర్లు పఠించేవారు. *(బుఖారీ)*

ఈ దినాలలో సామాన్యంగా తక్బీర్లను బిగ్గరగా పఠించడం మరియు స్వరాన్ని వీలైనంత ఎక్కువగా పెంచడం అభిలషణీయం. ప్రత్యేకించి అరాఫాత్ దినం ఫజర్ మొదలుకొని జిల్‌హిజ్జ 13వ తేదీ అసర్ నమాజు వరకు ప్రతి ఫర్జ్ నమాజ్ తర్వాత వీటిని పఠిస్తూ వుండాలి.

ఈ ఐదు దినాలలో ఫర్జ్ నమాజ్ తర్వాత తక్బీర్లు పఠించడం, ఉమర్ (రజి అల్లాహు అన్హు), అలీ (రజి అల్లాహు అన్హు), అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు), అబ్దుల్లా బిన్ మస్ ఊద్ (రజి అల్లాహు అన్హు) మరియు ఇతర సహాబాల ద్వారా నిరూపించబడి వుంది.

*(ఇర్వా ఉల్ గలీల్ : 3వ సంపుటం, 125 పేజీ)*

తక్బీర్ల పదాలు ఇవి:

“అల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, లా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్, అల్లాహు అక్బర్, వలిల్లాహిల్ హమ్ద్.”

అబ్దుల్లా బిన్ మస్ ఊద్ (రజి అల్లాహు అన్హు) ఈ పదాలతోనే తక్బీర్లు పఠించేవారు. వీటి ప్రారంభంలో 'అల్లాహుఅక్బర్' రెండు సార్లు వుంది. మరో ఉల్లేఖనం ద్వారా ఆయన ప్రారంభంలో మూడు సార్లు 'అల్లాహు అక్బర్' పఠించే వారని నిరూపించబడి వుంది.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా పలికేవారు:

"అల్లాహుఅక్బర్, అల్లాహుఅక్బర్, అల్లాహుఅక్బర్, వలిల్లా హిల్ హమ్ద్, అల్లాహుఅక్బర్ వఅజల్, అల్లాహుఅక్బర్ అలామా హదానా."

*(ఇర్వాఉల్ గలీల్:3వ సంపుటం, పేజీ:125)*

ఈ తక్బీర్లను సామూహికంగా పఠించకూడదు. ఎందుకంటే ఇలా చేయడం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా గానీ, సలఫు స్సాలిహీన్‌ల ఆచరణ ద్వారా గానీ నిరూపించబడి లేదు. పైగా సున్నత్ ఏమిటంటే, ప్రతి వ్యక్తి ఒంటరిగా తక్బీర్లు పఠించాలి.

## 5) దాన ధర్మాలు చేయడం

ఈ దినాలలో అభిలషణీయమైన సత్కార్యాల్లో దానం చేయడం కూడా ఒకటి. అల్లాహ్, దాన ధర్మాల గురించి ఇలా సెలవిచ్చాడు:

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوٓا۟ أَنفِقُوا۟ مِمَّا رَزَقْنَٰكُم مِّن قَبْلِ أَن يَأْتِىَ يَوْمٌ لَّا بَيْعٌ فِيهِ وَلَا خُلَّةٌ وَلَا شَفَٰعَةٌ ۗ وَٱلْكَٰفِرُونَ هُمُ ٱلظَّٰلِمُونَ ﴿254﴾

**"ఓ విశ్వాసులారా! వ్యాపార లావాదేవీలు గానీ, స్నేహబంధాలు గానీ, సిఫార్సులు గానీ ఉండని ఆ రోజు రాకముందే మేము మీకు ప్రసాదించిన దానిలో నుంచి ఖర్చు చేయండి. వాస్తవానికి తిరస్కారులే దుర్మార్గులు."**

***(బఖర:254)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏదైనా సంపద నుండి దానం చేస్తే, అది సంపదను తగ్గించదు."

*(ముస్లిం)*

అందుకే మనం ప్రత్యేకంగా ఈ దినాలలో వీలైనంత ఎక్కువగా దాన ధర్మాలు చేయాలి. అల్లాహ్ మనందరినీ ఈ (సత్) కార్యాలన్నిటినీ చేయగలిగే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

**రెండవ ఖుత్బా**

ఇస్లామీయ సోదరులారా!

జిల్ హిజ్జ (మొదటి) పది రోజులలో అభిలషణీయమైన కార్యాల గురించి వివరంగా తెలియజేశాం. ఈ కార్యాలలోనే, షరీయత్తు ద్వారా గట్టిగా తాకీదు చేయబడి, జిల్ హిజ్జ పది దినాల సమాప్తి వేళ ఆచరించబడే మరో కార్యం కూడా వుంది. అదేమిటంటే –

## 6) ఖుర్బానీ

ఖుర్బానీ చేయడం అల్లాహ్ సాన్నిధ్యం పొందడానికి ఒక సాధనం. ఇది దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నత్. ఆయన దీనిని ప్రతి సం॥ ఆచరించేవారు. ఇమామ్ బుఖారీ రహిమహుల్లాహ్, తన 'సహీ బుఖారీ'లో 'కితాబుల్ అజహ' అధ్యాయం క్రింద ఒక శీర్షిక పెట్టారు. దాని పేరు 'బాబ్ సున్నతుల్ అజ్హియ'. తదుపరి ఆయన, బరా (రజి అల్లాహు అన్హు) ద్వారా ఉల్లేఖించబడ్డ ఈ హదీసును వివరించారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఈ రోజు మేము అన్నింటికన్నా ముందుగా పండుగ నమాజు చదువుతాం. తదుపరి తిరిగొచ్చి ఖుర్బానీ చేస్తాం. ఇక ఎవరైనా ఇలా చేస్తే వారు మా సున్నత్‌ను పొందినట్లే. ఏ వ్యక్తి అయినా నమాజ్ కు ముందు ఖుర్బానీ చేస్తే అది ఖుర్బానీ కాలేదు. కేవలం మాంసాన్ని తన ఇంటి వారికి సమర్పించిన వాడవుతాడు." *(బుఖారీ : 5545)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే ఖుర్బానీ చేయడం సున్నత్. వాజిబ్ (తప్పనిసరి) కాదు. అంతే గాక, సునన్ తిర్మిజి లో ఇలా ఉల్లేఖించబడింది:

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) తో ఒకతను ఇలా ప్రశ్నించాడు:

"ఖుర్బానీ చేయడం వాజిబా (తప్పనిసరా)?"

ఆయన : 'దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మరియు ముస్లిములు ఖుర్బానీ చేసేవారు.' అని అన్నారు.

అతను మళ్ళీ – ఖుర్బానీ చేయడం తప్పని సరా? అని ప్రశ్నించాడు.

ఆయన జవాబిస్తూ – నీకేమైనా బుద్ధి వుందా? దైవ ప్రవక్త (సల్లల్లాహు

అలైహి వ సల్లం) మరియు ముస్లిములు ఖుర్బానీ చేసేవారు(అని చెబుతున్నాను గా) అని అన్నారు. *(తిర్మిజి: 1506, హసన్ సహీ)*

ఇమామ్ తిర్మిజి, ఈ హదీసును ఉల్లేఖించిన తర్వాత ఇలా పేర్కొన్నారు:

"ఈ హదీసు ఆధారంగానే, విద్వాంసుల దృష్టిలో ఖుర్బానీ చేయడం తప్పనిసరి (వాజిబ్) కాదు. పైగా దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) సున్నతులలో ఒక సున్నత్. దీనిపై ఆచరించటం అభిలషణీయం (ముస్తహబ్).

అలాగే, ఇబ్నె ఉమర్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనాలో 10 సం॥లు గడిపారు. ఈ వ్యవధిలో ఆయన ప్రతి సం॥ ఖుర్బానీ చేస్తూ వున్నారు."

*(తిర్మిజి:1507, హసన్)*

ఈ రెండు హదీసుల ద్వారా తెలిసిందేమిటంటే – ఖుర్బానీ వాజిబ్ (తప్పనిసరి) కాదు. అయినప్పటికీ, స్థోమత గల ప్రతివ్యక్తీ దీనిని తప్పకుండా చేయాలి.

ఎందుకంటే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చి వున్నారు:

"ఏ వ్యక్తి అయినా సామర్థ్యమున్నప్పటికీ ఖుర్బానీ చేయడో, అతను మా 'ఈద్‌గాహ్' లో రాకూడదు."

*(హాకిమ్, హసన్ – అల్‌బానీ, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 1087)*

అలాగే, ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) అరాఫాత్ లో ఇలా సెలవిచ్చి ఉన్నారు:

"ప్రజలారా! ప్రతి ఇంటిపై, ప్రతి సం॥ ఒక ఖుర్బానీ చేయడం తప్పనిసరి."

*(అబూదావూద్: 2788, తిర్మిజి:1518, ఇబ్నెమాజ, 3125, సహీ – అల్‌బానీ)*

అందుకే, ఒకవేళ శక్తి సామర్థ్యాలు గనక కలిగివుంటే, ఖుర్బానీ ని వదిలి పెట్టకూడదు.

మరి కొంతమంది అనుకొనే దేమింటంటే – ఖుర్బానీ కేవలం హజ్ యాత్రికులకే ప్రత్యేకం, ఇతరులు దీనిని చేయాల్సిన అవసరం లేదు. మరి

చూడబోతే, దీనిగురించి అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) వచనాన్ని మేమిదివరకే వివరించాం. దాంట్లో ఆయన – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మదీనాలో పదేళ్ళు గడిపారని, అందులో ఆయన ప్రతి సం॥ ఖుర్బానీ ఇచ్చేవారని సెలవిచ్చారు.

ఖుర్బానీ కేవలం హజ్ యాత్రికుల కొరకే ప్రత్యేకం కాదు, ముస్లిములందరి కోసం అని అనడానికి ఇదొక ఆధారం.

హజ్ యాత్రికులయితే, హజ్ విధులను నిర్వర్తిస్తూ ఖుర్బానీ చేస్తారు, ఇతర ముస్లిములు తమ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్‌ను అనుసరిస్తూ, అల్లాహ్ సామీప్య భాగ్యాన్ని పొందడానికి ఖుర్బానీ చేస్తారు.

అలాగే, అనస్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రెండు గొర్రె పోతులను ఖుర్బానీ ఇచ్చేవారు. నేను కూడా అలాగే రెండు గొర్రె పోతులను ఖుర్బానీ చేస్తాను." *(బుఖారీ: 5553)*

అనస్ (రజి అల్లాహు అన్హు) ప్రస్తావించిన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యొక్క ఈ ఆచరణ (రెండు గొర్రె పోతులను ఖుర్బానీ చేయడం) మదీనా లోనిది. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కేవలం ఒక్కసారే హజ్ చేశారు. అందులో ఆయన 100 ఒంటెలు ఖుర్బానీ ఇచ్చారు.

అంతే కాదు, సునన్ అబూదావూద్‌లో ఇదే హదీసు యొక్క పదాలలో 'మదీనా లో ' అని స్పష్టంగా వుంది.

దీని ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్ లోనే కాకుండా, (ప్రతి యేడూ) ఖుర్బానీ ఇచ్చేవారు. *(అబూదావూద్:2793, సహీ – అల్‌బానీ)*

అంతే కాక, ఇంతకు ముందు మేము వివరించిన సహీ బుఖారీ లోని హదీసు – "ఈ రోజు మేము అన్నింటికన్నా ముందుగా పండుగ నమాజ్ చేస్తాం, తదుపరి తిరిగొచ్చి ఖుర్బానీ చేస్తాం" – ద్వారా కూడా నిరూపించబడే విషయమేమిటంటే, ఖుర్బానీ చేయడం ముస్లిములందరి కొరకు సున్నత్. కేవలం హాజీల కొరకు కాదు. ఎందుకంటే, ఒకవేళ ఖుర్బానీ, కేవలం హాజీల కొరకే

వుండి వుంటే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ఈ రోజు మేము అన్నింటి కన్నా ముందుగా పండుగ నమాజు చేస్తాం, తదుపరి తిరిగొచ్చి ఖుర్బానీ చేస్తాం అని సెలవిచ్చేవారు కాదు. పైగా, జిల్ హిజ్జ 10 వ తేదీ నాడు హాజీలు పండుగ నమాజు చేయరు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా 'హజ్జతుల్ విదా' లో పండుగ నమాజు చేయలేదు.

అందుకే, ప్రపంచం లోని ముస్లిములందరూ ఈ సున్నత్‌పై ఆచరించాలి.

ప్రియులారా!

ఖుర్బానీ కి సంబంధించిన ప్రముఖ వివరాలను మేము 'ఈదుల్ అజ్‌హా' నాటి ఖుత్బాలో ఇన్‌షా అల్లాహ్ వివరిస్తాం. కొన్ని విషయాలు మాత్రం పండుగ కు ముందే తెలుసుకోవడం తప్పనిసరి. అవి ఇవి:

**మొదటి విషయం:**

ఖుర్బానీ చేయదలుచుకున్న వ్యక్తి జిల్ హిజ్జ నెలవంక కనిపించిన తర్వాత తలగొరిగించుకోవడం గానీ, గోర్లు కత్తిరించుకోవడం గానీ చేయకూడదు.

ఉమ్మె సలమా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఖుర్బానీ గురించి సంకల్పించుకున్న వ్యక్తి జిల్ హిజ్జ నెలవంక చూసిన తర్వాత తలగొరిగించుకోకూడదు మరియు గోర్లు కత్తిరించుకోకూడదు.

*(ముస్లిం:1977)*

**రెండవ విషయం:**

ఖుర్బానీ కోసం ఎన్నుకోబడే జంతువులు – ఆవు, ఒంటె, గొర్రె, మేకల జాతుల లోనివై వుండాలి. దీని గురించి, అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**وَلِكُلِّ أُمَّةٍ جَعَلْنَا مَنسَكًا لِّيَذْكُرُوا اسْمَ اللَّهِ عَلَىٰ مَا رَزَقَهُم مِّن بَهِيمَةِ الْأَنْعَامِ**

**"తమకు అల్లాహ్ ప్రసాదించిన వున్న పశువులపై, అల్లాహ్ పేరును స్మరించటానికి గాను మేము ప్రతి అనుచర సమాజం కోసం ఖుర్బానీ ఆచారాన్ని నిర్ధారించాము." *(హజ్ : 34)***

ఇక్కడ పశువులంటే అర్థం – ఒంటె, ఆవు, గొర్రె మరియు మేకలు.

అందుకే ఇమామ్ నవవీ రహిమహుల్లాహ్ – ఖుర్బానీ కోసం కేవలం

ఈ పశువులే సరిపోతాయి అని సెలవిచ్చి, దీనిపై ముస్లిం సమాజమంతా ఏకాభిప్రాయం (ఇజ్మా) కలిగి వున్నారని పేర్కొన్నారు.

*(షరహ్ ముస్లిం లిన్నవవీ : 13వ సంపుటం, 125 పేజి)*

**మూడవ విషయం:**

ఖుర్బానీ పశువులు లోపాలు లేకుండా వుండాలి. అంటే, ఉదా॥కు కుంటి తనం, మెల్ల కన్ను, అత్యంత బలహీనత, లేదా వ్యాధి లాంటి లోపాలు. అందుకే ఇలాంటి లోపాలలో ఏ లోపం వున్నా, అలాంటి పశువులను ఖుర్బానీ చేయడం సరికాదు. అలాగే చెవులు తెగి వుండకూడదు మరియు కొమ్ములు కూడా విరిగి ఉండకూడదు. కాని వృషణాలు లేకపోవడం లోపం అనిపించుకోదు.

బరా బిన్ ఆజిబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఖుర్బానీ కోసం నాలుగు రకాల పశువులు సరైనవి కావు. మెల్లకన్ను గల పశువు, దాని మెల్ల కన్ను స్పష్టంగా తెలియాలి. రోగం బారిన పడ్డ పశువు, దాని రోగం స్పష్టంగా కనబడాలి. కుంటుతున్న పశువు, దాని కుంటితనం బహిర్గతమవ్వాలి. (అలాగే) ఎముకల్లో ఏ మాత్రం గుజ్జు లేకుండా అత్యంత బలహీనమైపోయిన పశువు."

*(అబూ దావూద్: 2802, తిర్మిజి:1497, సహీ–అల్‌బానీ)*

**నాలుగవ విషయం:**

**పశువుల వయస్సు:** ఖుర్బానీ పశువులు లావుగా, కండ కలిగి వుండడంతో పాటు రెండు దంతాలు కలిగి వుండడం తప్పనిసరి.

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"మీరు రెండు దంతాలు కలిగిన పశువులను మాత్రమే జిబహ్ చేయండి. ఒకవేళ మీ స్థితి గనక బాగాలేకపోతే, అప్పుడు 1 సం॥పు గొర్రె జిబహ్ చేసుకోండి." *(ముస్లిం:1963)*

మరికొన్ని హదీసుల ద్వారా–అగత్య పరిస్థితి లేక పోయినప్పటికీ, 1సం॥పు గొర్రెను ఖుర్బానీ చేయడం కూడా సరైనదే – అన్న విషయం బోధపడుతుంది.

ఈమాటే ఉత్తమమైనదవి 'తోఫతుల్ హౌజీ' గ్రంథకర్త కూడా ఖరారు చేశారు. *(తోఫతుల్ హౌజీ : 4వ సంపుటం, 440 పేజి)*

ఉదా॥ కు, ఒక హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నిస్సందేహంగా (ఖుర్బానీ కోసం) రెండు దంతాల గొర్రె సరిపోయినట్లే, 1 సం॥ పు గొర్రె కూడా సరిపోతుంది."

*(అబూ దావూద్: 2799, సహీ – అల్బానీ)*

ఈ హదీసులో 'అల్ జజుఅ' అన్న పదం సాధారణమైనది, దీనిలో గొర్రె పోతు, మేక పోతు–రెండూ చేరి వున్నాయి.

కానీ, మరో హదీసు ప్రకారం, దీనిని కేవలం గొర్రె కోసం ప్రత్యేకించడం తప్పనిసరి. అది బరా (రజి అల్లాహు అన్హు) హదీసు. ఆ హదీసులో, ఆయన వివరించిన దేమిటంటే – ఆయన చిన్నాన్న, పండుగ నమాజు కు ముందే ఖుర్బానీ చేశారు. దీనిపై దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి అన్హు) – అది కేవలం మేక మాంసమే, (ఖుర్బానీ మాంసం కాదు) అని అనడంతో ఆయన – ఓ దైవ ప్రవక్తా! నా వద్ద 1 సం॥పు మేకపోతు వుంది అని విన్నవించుకోగా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)–నువ్వు దానినే ఖుర్బానీ చేయి. కానీ నీకు తప్ప మరెవ్వరికీ ఇది వర్తించదు అని వివరించారు.

*(బుఖారీ: 5556, ముస్లిం: 1961)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే 1 సం॥పు మేకపోతు ఖుర్బానీ కోసం సరిపోదు.

**ఐదవ విషయం:**

**ఖుర్బానీ సమయం:** ఖుర్బానీ సమయం పండుగ నమాజు తర్వాత వుంటుంది. అందుకే పండుగ నమాజుకు ముందు ఖుర్బానీ చేయకూడదు.

జున్దుబ్ బిన్ సుఫ్యాన్ (రజి అల్లాహు అన్హు) కథనం:

"నేను ఖుర్బానీ (చేసే) సమయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో పాటు ఉన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ నమాజును ముగించిన వెంటనే, నమాజుకు ముందు జిబహ్ చెయ్యబడిన పశువుల మాంసం చూశారు. దీనిపై ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయితే ఖుర్బానీ పశువును పండుగ నమాజుకు ముందు జిబహ్ చేశాడో, అతను దాని స్థానంలో మరో పశువును జిబహ్ చేయాలి. ఇక, ఎవరైతే జిబహ్ చేయలేదో వారు 'బిస్మిల్లాహ్' అని పలికి జిబహ్ చేయవచ్చు." *(బుఖారీ: 985, ముస్లిం: 1960)*

బరా (రజి అల్లాహు అన్హు) కథనం:

"మా చిన్నాన్న, పండుగ నమాజుకు ముందే ఖుర్బానీ చేశారు. దీనిపై, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)–అది కేవలం మేక మాంసం మాత్రమే (ఖుర్బానీ మాంసం కాదు) అని అనడంతో, ఆయన– ఓ దైవ ప్రవక్తా! నా వద్ద 1 సం॥పు మేకపోతు వుంది అని విన్నవించుకోగా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – నువ్వు దానినే ఖుర్బానీ చేయి. కానీ, నీకు తప్ప మరెవరికీ ఇది (ఈ ఆదేశం) వర్తించదు."అని పలికి,

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా పండుగ నమాజుకు ముందు ఖుర్బానీ చేస్తే, అతను (కేవలం) పశువును జిబహ్ చేసినట్లే. ఒకవేళ ఎవరైనా పండుగ నమాజు తర్వాత ఖుర్బానీ చేస్తే అతను ఖుర్బానీని పూర్తి చేయడంతో పాటు, ముస్లిముల సున్నతును పొందిన వాడవుతాడు." *(బుఖారీ: 5556, ముస్లిం:1961)*

**ఆరవ విషయం:**

ఒక మేకపోతు లేదా మేక, ఒక గొర్రె పోతు లేదా ఒక గొర్రె – ఇంటి వారందరి తరఫున సరిపోతుంది. అందుకే, ఇంట్లోని ఒక్కొక్కరి తరఫున ఒక్కొక్క పశువును జిబహ్ చెయ్యాల్సిన అవసరం లేదు. పైగా ఒకవేళ ఉద్దేశ్యం గనక – ఫలానా వ్యక్తి, ఇంట్లోని ప్రతి వ్యక్తి తరఫున ఒక ఖుర్బానీ ఇచ్చాడని ప్రజలు చెప్పు కోవాలి లేదా స్వయంగా తనే – నేను ప్రత్యేకంగా నా తరఫు నుంచి ఖుర్బానీ చేశాను అని చెప్పుకోవచ్చు – అని అయితే అప్పుడది ప్రదర్శనా బుద్ధి అవుతుంది మరియు అది హరామ్ (నిషిద్ధం).

అతా బిన్ యసార్ రహిమహుల్లాహ్ కథనం:

నేను, అబూ అయ్యూబ్ అన్సారీ (రజి అల్లాహు అన్హు) ను – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి అలైహి వ సల్లం) కాలంలో ఖుర్బానీ ఎలా చేసేవారు? అని అడిగాను.

ఆయన జవాబిస్తూ – ఒక వ్యక్తి తన మరియు తన ఇంటివారి తరఫు నుండి ఒక మేకను ఖుర్బానీ చేసేవాడు. తదుపరి దానిని స్వయంగాను తినే వాడు, ఇతరులకు కూడా తినిపించేవాడు. (ఇలాగే జరుగుతూ వుండేది). రాను రాను, (దీని గురించి) ప్రజలు ఒకరిపై నొకరు గర్వపడడం ప్రారంభించారు. ఇక నేటి ప్రజల స్థితిని మీరు స్వయంగా చూస్తూనే వున్నారు.”

*(తిర్మిజి: 1505, సహీ – అల్‌బానీ)*

కనుక, ఒకరిపై నొకరు, గర్వపడేందుకు కాకుండా, మనస్ఫూర్తిగా కేవలం అల్లాహ్ మెప్పు పొందటానికే ఖుర్బానీ చెయ్యాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قُلْ إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَالَمِينَ ﴿162﴾
لَا شَرِيكَ لَهُ ۖ وَبِذَٰلِكَ أُمِرْتُ وَأَنَا أَوَّلُ الْمُسْلِمِينَ ﴿163﴾

**“ఇలా ప్రకటించు: నిస్సందేహంగా నా నమాజు, నా సకల ఆరాధనలు, నా జీవనం, నా మరణం – ఇవన్నీ సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. దీని గురించే నాకు ఆజ్ఞాపించబడింది. ఆజ్ఞాపాలన చేసే వారిలో (ముస్లిములలో) నేను మొదటి వాణ్ణి.”** ***(అన్ ఆమ్: 162–163)***

**ఏడవ విషయం:**

ఆవులో ఏడుగురు మరియు ఒంటెలో 7 లేదా 10 మంది భాగస్వాములు కావచ్చు.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: “ఒకసారి మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో కలిసి ప్రయాణంలో వుండగా ‘ఈదుల్ అజ్‌హ’ వచ్చింది. దీనితో మేము ఆవులో ఏడుగురు మరియు ఒంటెలో 10 మంది భాగస్వాములై ఖుర్బానీ చేశాం.” *(తిర్మిజి:1501, సహీ – అల్‌బానీ)*

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“ఆవు ఏడుగురికి మరియు ఒంటె కూడా ఏడుగురికి సరిపోతుంది.”

*(అబూదావూద్: 2808, సహీ – అల్‌బానీ)*

ఈ రెండు హదీసుల ద్వారా నిరూపించబడిందేమిటంటే– ఆవులో ఏడుగురు మరియు ఒంటెలో 7 లేదా 10 మంది భాగస్వాములు కావచ్చు.

**ఎనిమిదవ విషయం:**

పండుగ నమాజు కోసం బయలు దేరేటప్పుడు ఇంట్లో ఏమీ తినకుండా, త్రాగకుండా, తక్బీర్లు పఠిస్తూ ఈద్‌గాహ్ వైపుకు పోవాలి.

బరీరా (రజి అల్లాహు అన్హు) కథనం: "దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈదుల్ ఫిత్ర్ నాడు (నమాజు కోసం) బయలుదేరే ముందు ఏదో ఒకటి తినే వారు. కానీ ఈదుల్ అజ్‌హ నాడు పండుగ నమాజు చదివే వరకు ఏమీ తినేవారు కాదు." *(తిర్మిజి: 542, సహీ – అల్‌బానీ)*

ఇంట్లో స్త్రీలను కూడా తప్పనిసరిగా ఈద్‌గాహ్‌కు తీసుకెళ్ళాలి. ఎందుకంటే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్త్రీలను ఈద్‌గాహ్ కు వెళ్ళమని ఆజ్ఞాపించి వున్నారు. సహీ బుఖారీ మరియు సహీ ముస్లింలో ఉమ్మె అతియా (రజి అల్లాహు అన్హా) ఉల్లేఖించిన హదీసులో ఇది స్పష్టంగా వుంది. చివరికి, రుతుక్రమంలో వున్న స్త్రీలను కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇండ్లలో నుండి బయటికొచ్చి, ఈద్‌గాహ్ బయట కూర్చోమని, ముస్లిముల దుఆలో పాలుపంచుకోమని ఆజ్ఞాపించారు. *(బుఖారీ: 974, ముస్లిం:890)*

**తొమ్మిదవ విషయం :**

ఈద్‌గాహ్ కు చేరుకొని, ఇమామ్ వెనుక పండుగ నమాజు చేయాలి. దీనిలో, ఇమామ్ ఖిరాత్‌కు ముందు, మొదటి రకాత్‌లో 7 అదనపు తక్బీర్లు మరియు రెండవ రకాతులో 5 అదనపు తక్బీర్లు పలుకుతాడు. ముఖ్తదీలు కూడా ఇమామ్ తోపాటు తక్బీర్లు పలకాలి. నమాజు ముగించాక ఇమామ్ ఖుత్బా ఇస్తాడు.

ఇస్లామీయ సోదరులారా!

ఖుర్బానీకి సంబంధించిన ప్రముఖ విషయాలు, ఇన్షా అల్లాహ్ మేము ఈదుల్ అజ్‌హ నాడు వివరిస్తాం.

అల్లాహ్ ను వేడుకొనే దేమిటంటే – ఆయన మనందరినీ జిల్ హిజ్జ లోని ఈ పది దినాలలో వీలైనంత ఎక్కువగా ఆరాధించే (సత్కార్యాలు చేసే) సద్బుద్ధిని ప్రసాదించు గాక! ఆమీన్!

# ఈదుల్ అజ్‌హా ఖుత్బా

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1. ఖుర్బానీ: ఇబ్రాహీం ఖలీలుల్లాహ్ (అలైహిస్సలాం) సున్నత్.
2. ఖుర్ఆన్ లో ఇబ్రాహీం (అలైహిస్సలాం) ప్రశంస.
3. ఖుర్బానీ: ప్రవక్తల నాయకులైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్.
4. ఖుర్బానీకి సంబంధించిన కొన్ని ప్రముఖ విషయాలు, మర్యాదలు.
5. పండుగ దినాలలో కొన్ని చెడు కార్యాలు చేయడం!

ఇస్లామీయ సోదరులారా!

ఈరోజు ఈదుల్ అజ్‌హ అంటే ఖుర్బానీ దినం. ఈ దినం ఎంత మహెూన్నతమైనదంటే – ప్రపంచంలోని ముస్లిములు ఈ రోజు ఇబ్రాహీం ఖలీలుల్లాహ్ (అలైహిస్సలాం) సున్నతును బ్రతికిస్తూ, తమ ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) పద్ధతిని ఆచరిస్తూ లక్షల కొద్దీ పశువులను కేవలం అల్లాహ్ పేరుతో ఖుర్బానీ చేస్తారు.

ఇబ్రాహీం (అలైహిస్సలాం) అల్లాహ్ యొక్క గొప్ప ప్రవక్త, అల్లాహ్ ఆయనను తన మిత్రునిగా చేసుకున్నాడు.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاتَّخَذَ اللّٰهُ اِبْرٰهِيْمَ خَلِيْلًا ﴿125﴾

**"ఇబ్రాహీం (అలైహిస్సలాం) ను అల్లాహ్ తన మిత్రునిగా చేసుకున్నాడు."**

***(నిసా:125)***

అల్లాహ్, ఆయనకు ఎంతటి మహెూన్నత స్థానం కల్పించాడంటే – ఆయన తర్వాత వచ్చిన ప్రవక్తలంతా ఆయన వంశంనుండే ప్రభవించబడ్డారు. ఆయన తరువాత అవతరించిన అల్లాహ్ గ్రంథాలన్నీ, ప్రవక్తలుగా వున్న ఆయన సంతతి మీదే అవతరించాయి. ఖుర్ఆన్‌లో అల్లాహ్ తన ఈ ప్రియ ప్రవక్తను గూర్చి 69 సార్లు ప్రస్తావించాడు. ఆయన వృత్తాంతాలను మాటిమాటికీ వివరిస్తూ, ఆయనను ప్రశంసించాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ إِبْرٰهِيْمَ كَانَ أُمَّةً قَانِتًا لِّلّٰهِ حَنِيْفًا وَلَمْ يَكُ مِنَ الْمُشْرِكِيْنَ ۝ شَاكِرًا لِّأَنْعُمِهٖ ۚ اجْتَبٰهُ
وَهَدٰهُ إِلٰى صِرَاطٍ مُّسْتَقِيْمٍ ۝ وَاٰتَيْنٰهُ فِى الدُّنْيَا حَسَنَةً ۚ وَإِنَّهٗ فِى الْاٰخِرَةِ لَمِنَ الصّٰلِحِيْنَ ۝
ثُمَّ أَوْحَيْنَآ إِلَيْكَ أَنِ اتَّبِعْ مِلَّةَ إِبْرٰهِيْمَ حَنِيْفًا ۚ وَمَا كَانَ مِنَ الْمُشْرِكِيْنَ ۝

“నిశ్చయంగా ఇబ్రాహీం ఒక అనుసరణీయ నాయకుడు. నికార్సయిన దైవ విధేయుడు. అల్లాహ్ యందే మనస్సు నిలిపినవాడు. అతడు బహు దైవారాధకులలో చేరిన వాడు కాడు. అల్లాహ్ అనుగ్రహాల పట్ల కృతజ్ఞతా భావం కలవాడు. అల్లాహ్ అతన్ని ఎన్నుకున్నాడు. అతనికి రుజుమార్గం చూపించాడు. మేమతనికి ప్రపంచంలోనూ మేలును ప్రసాదించాము. పరలోకంలోనూ అతను సజ్జనులలో చేరి వుంటాడు. తరువాత మేము, ఏకాగ్రచిత్తుడైన ఇబ్రాహీం ధర్మాన్ని అనుసరించమని నీ వద్దకు వహీ పంపాము. అతడు బహుదైవోపాసకులలో చేరిన వాడు కాడు.”

*(నహ్ల్ : 120–123)*

అలాగే, ఇలా సెలవిచ్చాడు:

وَمَنْ يَّرْغَبُ عَنْ مِّلَّةِ إِبْرٰهٖمَ إِلَّا مَنْ سَفِهَ نَفْسَهٗ ۚ وَلَقَدِ اصْطَفَيْنٰهُ فِى الدُّنْيَا ۚ وَإِنَّهٗ فِى
الْاٰخِرَةِ لَمِنَ الصّٰلِحِيْنَ ۝ إِذْ قَالَ لَهٗ رَبُّهٗٓ أَسْلِمْ ۙ قَالَ أَسْلَمْتُ لِرَبِّ الْعٰلَمِيْنَ ۝

“శుద్ధ అవివేకి మాత్రమే ఇబ్రాహీం ధర్మం (విధానం) పట్ల విరక్తి చెందుతాడు. మేము అతన్ని ప్రపంచంలోనూ ఎన్నుకున్నాము. పరలోకంలో కూడా అతడు సజ్జనుల సరసన ఉంటాడు. ‘(ఆత్మ) సమర్పణ చేసుకో’ అని అతని ప్రభువు అతన్ని ఆదేశించినప్పుడల్లా,‘సకల లోకాల ప్రభువు సమక్షంలో నన్ను నేను సమర్పించుకున్నాను’ అని అతను సమాధానం ఇచ్చాడు.”

*(బఖర : 130–131)*

అలాగే, అల్లాహ్ ఇలా కూడా సెలవిచ్చాడు:

مَا كَانَ إِبْرٰهِيْمُ يَهُوْدِيًّا وَّلَا نَصْرَانِيًّا وَّلٰكِنْ كَانَ حَنِيْفًا مُّسْلِمًا ۚ وَمَا كَانَ مِنَ الْمُشْرِكِيْنَ ۝67

“ఇబ్రాహీం యూదుడూ కాదు, క్రైస్తవుడూ కాదు. ఆయన ఒకే దేవుని వైపు అభిముఖుడైన ముస్లిం. ఆయన ముష్రిక్కులలోని వాడు ఎంత మాత్రం కాదు.”

*(ఆలి ఇమ్రాన్:67)*

అల్లాహ్ – ఇబ్రాహీం (అలైహిస్సలాం) ను ఎన్నో విధాలుగా పరీక్షించాడు. ఆయన ప్రతి పరీక్షలోనూ నెగ్గారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَإِذِ ابْتَلَىٰ إِبْرَاهِيمَ رَبُّهُ بِكَلِمَاتٍ فَأَتَمَّهُنَّ ۖ قَالَ إِنِّي جَاعِلُكَ لِلنَّاسِ إِمَامًا ۖ قَالَ وَمِن ذُرِّيَّتِي ۖ
قَالَ لَا يَنَالُ عَهْدِي الظَّالِمِينَ ﴿124﴾

**“ఇబ్రాహీం (అలైహిస్సలాం)ను అతని ప్రభువు అనేక విషయాలలో పరీక్షించగా, అతను అన్నింటిలోనూ (నికార్సుగా) నెగ్గుకు వచ్చాడు. అప్పుడు అల్లాహ్ అతన్ని ఉద్దేశించి, ‘నేను నిన్ను ప్రజలకు నాయకునిగా చేస్తాను’ అన్నాడు. దానికి అతను ‘నా సంతానాన్ని కూడానా!’ అని అడిగాడు. అప్పుడు అల్లాహ్, ‘దుర్మార్గులకు నా వాగ్దానం వర్తించదు’ అని సమాధానం ఇచ్చాడు.”** ***(బఖర: 124)***

“ఇక్కడ ‘అనేక విషయాలు’ అంటే సమస్త ఆజ్ఞలు మరియు నిషేధాలు అని అర్ధం. ప్రత్యేకించి హిజ్రత్ చేయమని మరియు కుమారుణ్ణి ఖుర్బానీ చేయమని ఇవ్వబడ్డ ఆజ్ఞలు.

ఇబ్రాహీం (అలైహిస్సలాం) విశ్వాస పాత్రత గురించి అల్లాహ్ ఇలా ప్రశంసించాడు:

وَإِبْرَاهِيمَ الَّذِي وَفَّىٰ ○

**“(అలాగే) విశ్వాస పాత్రుడైన ఇబ్రాహీము గ్రంథ ప్రతుల్లోని విషయం గురించి”.** ***(నజ్మ్ : 37)***

ఆయనకు పెట్టబడిన పరీక్షలలో ఒక పరీక్ష – ఆయన పుత్రరత్నం ఇస్మాయిల్ (అలైహిస్సలాం) గురించి. దీని గురించి అల్లాహ్ ఖుర్ఆన్‌లో ఇలా సెలవిచ్చాడు.:

సాఫ్ఫాత్: 99-107 అరబిక్ పెట్టాలి

**ఆయతులు అరబిక్ టెక్స్ట్ రావాలి.......**

ఈ ఆయతులలో అల్లాహ్, తన మిత్రుడైన ఇబ్రాహీం (అలైహిస్సలాం) గురించి సెలవిచ్చిందేమిటంటే – ఆయన తన పుట్టిన ప్రదేశాన్ని విడిచిపెట్టినపుడు

అల్లాహ్‌తో – “నా ప్రభూ ! నాకు గుణవంతుడైన కుమారుణ్ని ప్రసాదించు అని ప్రార్థించారు. అల్లాహ్ ఆయనకు ఒక విధేయుడైన కుమారుని గురించి శుభవార్త ఇచ్చాడు. ఆయన వయస్సు అప్పుడు 80 సం॥లకు పైబడి వుంది. ఆ సమయంలో అల్లాహ్ ఆయనకు ‘హాజిరా’ ద్వారా ఒక కుమారుణ్ణి ప్రసాదించాడు. ఆయన అతని పేరు ‘ఇస్మాయీల్’ అని పెట్టారు.

ఈ కుమారుని గురించి అల్లాహ్, ఇబ్రాహాం (అలైహిస్సలాం) కు పెట్టిన మొదటి పరీక్ష ఏమిటంటే – అతన్ని మరియు అతని తల్లిని నీటి, వృక్ష వనరులు లేని, జన సంచారం లేని లోయలో విడిచిపెట్టి రమ్మని ఆజ్ఞాపించాడు. అల్లాహ్ వైపు నుండి పెట్టబడిన పరీక్షలో ఇబ్రాహీం (అలైహిస్సలాం) పూర్తిగా నెగ్గారు. కేవలం అల్లాహ్ పై నమ్మకం వుంచి, తన చిన్న కుటుంబాన్ని అల్లాహ్ ఆజ్ఞ ప్రకారం మక్కా ముకర్రమ లో వదిలి వెళ్ళిపోగా, అల్లాహ్ ఆ కుటుంబంపై తన కారుణ్య వర్షాన్ని అవతరింపజేశాడు.

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం: స్త్రీలలో మొదటి సారిగా వడ్డాణం ఉపయోగించినవారు ‘హాజిరా.’ తద్వారా ‘సారా’ కు ఆమె గురించి తెలియకుండా ఉండటానికి.

ఇబ్రాహీం (అలైహిస్సలాం) హాజిరా ను, ఆమె కొడుకు ఇస్మాయిల్ (అలైహిస్సలాం) ను అక్కడి నుండి తీసుకెళ్ళారు. ఆ సమయంలో హాజిరా, ఇస్మాయిల్ (అలైహిస్సలాం) కు పాలుపడుతుండేవారు. ఇబ్రాహీం (అలైహిస్సలాం) వారిద్దరినీ బైతుల్లాహ్ దగ్గర ఎత్తైన స్థలం వద్ద, నేడు జమ్‌జమ్ నీళ్ళు వున్నచోట, ఒక పెద్ద వృక్షం క్రింద కూర్చోబెట్టారు. ఆ సమయంలో అక్కడ ఒక్క మనిషి కూడా లేడు, నీటి సౌకర్యం కూడా లేదు. ఆయన వారికి ఖర్జూరాలు కలిగిన ఒక సంచి మరియు నీళ్ళు కలిగిన ఒక తోలు సంచి ఇచ్చి వెళ్ళసాగారు. హాజిరా, ఆయన వెనుకనే వస్తూ ఇలా అడిగారు: ఓ ఇబ్రాహీం! మమ్మల్ని ఏ మాత్రం జన సంచారం లేని, నీటి సౌకర్యం లేని లోయలో విడిచి వెళుతున్నారు? హాజిరా పలుసార్లు ఇలా అడిగారు, కానీ ఇబ్రాహీం (అలైహిస్సలాం) కనీసం వెనక్కి తిరిగి కూడా చూడలేదు.

దీనితో ఆమె–మీకిలా చెయ్యమని అల్లాహ్ ఆజ్ఞాపించాడా? అని అడిగారు. ఇబ్రాహీం (అలైహిస్సలాం) జవాబిస్తూ ‘అవును’ అని అన్నారు. ఆమె – అలాగా! (అయితే వెళ్ళండి), అల్లాహ్ మమ్మల్ని వృథా చేయడు అని చెప్పి తిరిగి వచ్చేసారు.

ఇబ్రాహీం (అలైహిస్సలాం) అక్కణ్ణుంచి బయలుదేరి ఒక ఇసుక దిబ్బ పైకి చేరుకున్నారు. అక్కడి నుండి ఆయన వారిని చూడలేరు. తదుపరి, ఆయన బైతుల్లాహ్ వైపు తిరిగి తన చేతులెత్తి ఇలా ప్రార్థించారు:

"మా ప్రభూ! నా సంతానంలో కొందరిని పంటలు పండని కటిక లోయలో, నీ పవిత్ర గృహం వద్ద వసింపజేశాను....."

ఇటు, హాజిరా, ఇస్మాయిల్ (అలైహిస్సలాం) కు పాలుపట్టి నీళ్ళు త్రాగిస్తూ వున్నారు. చివరికి ఆ నీళ్ళు అయిపోయాయి. దీనితో ఇద్దరూ దాహార్తులై పోయారు. పిల్లవాడు దాహంతో కొట్టుమిట్టాడడం ఆమె గమనించారు. పిల్లవాడి పరిస్థితి చూసి ఆమె చలించి పోయారు. చుట్టూ దృష్టి సారించారు. సఫా కొండ ఆమెకు దగ్గరగా కనిపించింది. దీనితో ఆమె దాని పైకి ఎక్కి తదుపరి లోయలోకి దిగారు, తద్వారా జన సంచారం ఏదైనా కనబడుతుందేమో అని అటూ ఇటూ చూశారు. కానీ ఆమెకు ఎవరూ కనిపించలేదు. ఆమె సఫా కొండ నుండి దిగి లోయలోకి వచ్చేశారు. తన వస్త్రాన్ని కాస్తపైకి లేపి కష్టాల్లో వున్న వ్యక్తి లాగా పరుగెత్తుతూ లోయను దాటి మర్వా కొండ పైకి వచ్చేశారు. తదుపరి దానిపై నిలబడి, జనసంచారం ఏమైనా కనబడుతుందేమో అని అటూ ఇటూ చూశారు. కానీ ఆమెకు అక్కడ కూడా ఎవరూ కనిపించలేదు. ఈ స్థితిలోనే ఆమె సఫా, మర్వాల మధ్య ఏడుసార్లు ప్రదక్షిణ చేశారు.

ఆయన (సల్లల్లాహు అలైహివసల్లం) ఇలా సెలవిచ్చారు:

"అప్పటి నుంచే ప్రజలు సఫా, మర్వాల తవాఫ్ (ప్రదక్షిణ) ప్రారంభించారు."

ఆమె ఏడవసారి పరుగెత్తుతూ, మర్వా పైకి ఎక్కినప్పుడు ఒక శబ్దాన్ని విన్నారు. ఆమె తన మనసులో – నిశ్శబ్దంగా వుండి ముందు ఆ మాటలు వినాలనుకొని మనసును అటువైపు కేంద్రీకరించారు. తదుపరి ఆమె – మేము నీ మాటలు విన్నాం, మాకు నీవేమైనా సహాయం చేయగలవా? అని అడిగారు. ఆ సమయంలో ఆమె జమ్‌జమ్ వున్న స్థానంలో ఒక దైవదూతను చూసారు. అతను తన కాలితో లేదా తన రెక్కతో భూమిని త్రవ్వగా దాని నుండి నీళ్ళు బయటికి వచ్చాయి. హాజిరా ఆ నీటిని నియంత్రంచే ఉద్దేశ్యంతో చేతులతో అడ్డుకట్టవేసి, తనవద్ద నున్న తోలు సంచిని నీళ్ళతో నింపుకున్నారు. ఆమె

చేతులలో నీళ్ళు నింపి బయటకు తీయగానే నీళ్ళు మరింత వేగంగా భూమి నుండి బయటికొచ్చేవి.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్, ఇస్మాయిల్ తల్లిపై కరుణించుగాక! ఆమె ఒకవేళ జమ్‌జమ్‌ను యధావిధిగా వదిలిపెట్టి వుంటే (లేదా ఇలా సెలవిచ్చారు) తన చేతులతో దానిని మాటిమాటికి తీసి వుండక పోతే జమ్‌జమ్ ఒక ప్రవహించే కాలువ లాగా వుండేది. తదుపరి హాజిరా ఆ నీళ్ళు త్రాగారు మరియు పిల్లవాడికి పాలుపట్టారు. దైవదూత, ఆమెతో – మీరు భయపడకండి, ఇక్కడ అల్లాహ్ గృహం వుంది. ఈ పిల్లవాడూ మరియు ఇతని తండ్రి దానిని నిర్మిస్తారు. ప్రస్తుతం కాబాగృహం వున్న స్థలం ఆ సమయంలో నేలనుండి కొంత ఎత్తుగా వున్నది.

వర్షపునీరు దాని ఇరుప్రక్కలనుండి ప్రవహించేది. కొంత కాలం గడిచాక 'జుర్‌హుమ్' తెగవారు లేదా వారి కుటుంబీకులు (కదా అనబడే) మార్గం ద్వారా ప్రయాణిస్తూ అక్కడి నుండి వెళుతూ మక్కా లోయలో బసచేశారు. అక్కడ ఒక పక్షి ఎగురుతూ వుండడం చూసి–ఈ పక్షి (సాధారణంగా) నీళ్ళున్న స్థలం లోనే తిరుగుతూ వుంటుంది, కానీ మనకీ ప్రదేశం గురించి బాగా తెలుసు, ఈ ప్రదేశంలో నీరు ఎక్కడా లభించదు అనుకొని, ఎక్కడైనా నీరు లభిస్తుందేమో చూసి రమ్మని ఒక వ్యక్తిని పంపించారు. అతను నీళ్ళున్న ఆ స్థలాన్ని కనుక్కొని తిరిగి వెళ్ళి తన తెగ వారికి తెలియ జేశాడు. దీనితో వారంతా అక్కడికి చేరుకున్నారు. హాజిరా నీళ్ళ వద్దే కూర్చొని వున్నారు. వాళ్ళు ఆమెను – మేమిక్కడ బస చేయడానికి మీరు అనుమతిస్తారా? అని అడిగారు. అమె సరే, కానీ ఈ నీటిపై మీకు ఏ విధమైన అధికారం వుండదు అని జవాబిచ్చారు. వాళ్ళు– సరే, మంచిది అని అన్నారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఇస్మాయిల్ (అలైహిస్సలాం) తల్లి కూడా మనషులు అక్కడ స్థిరపడాలనే కోరుకొనేవారు. ఇలా వారంతా అక్కడ స్థిర పడ్డారు మరియు తమ కుటుం బీకులను కూడా పిలిపించుకున్నారు. దీనితో అక్కడ ఎన్నో ఇళ్ళు వెలిశాయి (నిర్మించబడ్డాయి). ఇటు ఇస్మాయిల్ (అలైహిస్సలాం) కూడా యౌవన దశకు

చేరుకొని, వారి నుండే అరబ్బీ భాషను నేర్చుకొని వాళ్ళ దృష్టిలో ఒక మంచి యువకుడిగా పేరు తెచ్చుకున్నారు. వాళ్ళు ఆయనను ప్రేమిస్తూ తమ కుటుంబంలోని ఒక యువతినిచ్చి ఆయనతో వివాహం జరిపించారు. ఆ తర్వాత ఆయన తల్లి (హాజిరా) మరణించారు.” *(బుఖారీ: 3364)*

ఇస్లామీయ సోదరులారా!

పరీక్షల గురించి అల్లాహ్ వివరించిన ఆయతులలో, తను సెలవిచ్చిందేమి టంటే – ఇస్మాయిల్ (అలైహిస్సలాం) యౌవనం లోని అడుగుపెట్టాక, ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన పుత్రరత్నాన్ని ‘జిబహ్’ చేస్తున్నట్లు కలలో చూశారు. దైవ ప్రవక్తల స్వప్నాలు కూడా వహీ (దైవ వాక్కు) అవుతాయి గనుక, ఆయన, తన పుత్రరత్నాన్ని జిబహ్ చెయ్యడానికి నిశ్చయించుకున్నారు. దీనిని అమలులోకి తేవడానికి ముందు ఆయన తన కుమారునికి విషయమంతా వివరించి, అతని అభిప్రాయం అడిగారు. గుణవంతుడు, అత్యంత విధేయుడూ అయిన ఆ కుమా రుడు వెంటనే – “నాన్న గారూ! మీకు ఆజ్ఞాపించబడిన దానిని (నిస్సంకోచంగా) నెరవేర్చండి.” అని అన్నాడు. అంతే కాదు, తన ముసలి తండ్రిని, తన సహనం గురించి నమ్మకాన్ని కలుగజేస్తూ– “అల్లాహ్ తలిస్తే మీరు నన్ను సహన శీలిగా పొందుతారు” అని అన్నాడు. తండ్రీ కొడుకుల ఉత్సాహం చూడండి! అల్లాహ్ ఆజ్ఞను పాలించడానికి ఎల్లప్పుడూ సిద్ధం!

తండ్రి తన పుత్రరత్నాన్ని జిబహ్ చెయ్యడానికి ఆతృత కనబరిస్తే, కుమా రుడు జిబహ్ కావడానికి ఆతృత చూపించాడు. నిశ్చయంగా ఒక కఠిన పరీక్ష నుండి ఇద్దరూ సఫలీకృతులయ్యారు. అల్లాహ్ దీనిని ‘యదార్థానికి అదొక బహిరంగ పరీక్ష’ అని పేర్కొన్నాడు.

తదుపరి, ఇబ్రాహీం (అలైహిస్సలాం) తన కుమారుణ్ణి తీసుకొని మినా వైపుకు వెళ్ళారు. ప్రపంచంలోనే మొదటి సారిగా– ఒక ముసలి తండ్రి, యౌవనంలో వున్న తన కుమారుడి మెడపై కత్తి వుంచిన దృశ్యం కనబడింది! అదే తరుణంలో అల్లాహ్ తరఫు నుండి ప్రకటన వచ్చింది. – “ఓ ఇబ్రాహీం! నువ్వు కలను నిజం చేసి చూపావు.”

విశ్వప్రభువు తన ప్రవక్త యొక్క విధేయతా ఉత్సాహాన్ని ధృవీకరించాడు మరియు ఇస్మాయిల్ (అలైహిస్సలాం) స్థానంలో ఒక గొర్రెను పంపించగా, ఇబ్రాహీం (అలైహిస్సలాం) దానిని జిబహ్ చేశారు.

ఎంతో విశిష్టమైన ఖుర్బానీ ఇది. దీనిని ఆధారంగా చేసుకొనే, లక్షల కొద్దీ ముస్లిములు ప్రతియేడూ అల్లాహ్ సామీప్యాన్ని పొందటానికి ప్రయత్నిస్తుంటారు.

గత శుక్రవారం ఖుత్బాలో మేము- ఖుర్బానీ చేయడం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ అనీ, మదీనాలో వున్నంత కాలం, ప్రతియేడూ ఆయన ఖుర్బానీ చేశారని వివరించాం. పైగా, శక్తి సామర్థ్యాలు వున్నప్పటికీ, ఖుర్బానీ చేయని వారి గురించి ఆయన గట్టిగా హెచ్చరించారు. "స్థోమత కలిగి వున్నప్పటికీ ఖుర్బానీ చేయనివారు మా ఈద్‌గాహ్ లోకి రాకూడదు." *(హాకిమ్, హసన్ - అల్‌బానీ, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్: 1087)*

అలాగే, ఆరాఫాత్ లో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ప్రజలారా! ప్రతి ఇంటి నుండి ప్రతియేడూ ఖుర్బానీ చేయడం తప్పని సరి." *(అబూదావూద్:2788, తిర్మిజి:1518,ఇబ్నెమాజ:3125, సహీ - అల్‌బానీ)*

అందుకే, స్థోమత గనక వుంటే, ఖుర్బానీ చేయడం వదిలి పెట్టకూడదు.

మరొక విషయం కూడా గుర్తించుకోవాలి. అదేమిటంటే - అన్ని ఆరాధనల లాగానే, ఖుర్బానీలో కూడా సంకల్ప శుద్ధి ఎంతో అవసరం. అందుకే కేవలం అల్లాహ్ ప్రసన్నత కొరకే ఖుర్బానీ చేయాలి. ప్రదర్శనా బుద్ధిని కలిగి వుండడం గానీ, తన గురించి ప్రజలు-ఇతను ఖుర్బానీ చేశాడు - అని మాట్లాడుకోవాలన్న తలంపు గానీ వుంటే, ఈ రెండూ, ఖుర్బానీ పుణ్య ఫలాన్ని వ్యర్థం చేసేస్తాయి.

అల్లాహ్ ఇలా సెలివిచ్చాడు:

فَصَلِّ لِرَبِّكَ وَانْحَرْ ۝

**"నువ్వు నీ ప్రభువు కోసమే నమాజు చెయ్యి మరియు (అతని కోసమే) ఖుర్బానీ ఇవ్వు."** ***(అల్ కౌసర్: :2)***

అలాగే, అల్లాహ్ ఇలా కూడా సెలవిచ్చాడు:

قُلْ إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَالَمِينَ ﴿162﴾
لَا شَرِيكَ لَهُ ۖ وَبِذَٰلِكَ أُمِرْتُ وَأَنَا أَوَّلُ الْمُسْلِمِينَ ﴿163﴾

**"ఈ విధంగా ప్రకటించు: నిస్సందేహంగా నా నమజు, నా సకల ఆరాధనలు, నా జీవనం, నా మరణం – ఇవన్నీ సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే, ఆయనకు భాగస్వాము లెవరూలేరు. దీని గురించే నాకు ఆజ్ఞాపించ బడింది. ఆజ్ఞాపాలన చేసేవారిలో నేను మొదటివాణ్ణి."**

***(అన్ ఆమ్ : 162–163)***

దీనితో పాటు మీకు తెలియజేసే మరొక విషయమేమిటంటే – ఖుర్బానీ పశువైనా, ఇతర పశువైనా, ప్రతి పశువునూ కేవలం అల్లాహ్ పేరుతోనే జిబహ్ చెయ్యాలి. దైవేతరుల పేరుతో జిబహ్ చెయ్యబడే పశువు హలాల్ కాదు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**إِنَّمَا حَرَّمَ عَلَيْكُمُ الْمَيْتَةَ وَالدَّمَ وَلَحْمَ الْخِنْزِيرِ وَمَآ أُهِلَّ بِهِ لِغَيْرِ اللهِ**

**"అల్లాహ్ మీ కొరకు నిషేధించినవి ఇవే: మరణించిన జంతువులు, (ప్రవహించిన) రక్తం, పంది మాంసం, ఇంకా అల్లాహ్ తప్ప ఇతరుల పేరు ఉచ్చరించబడినది."** ***(బఖర: 173)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) గారి ఒక హదీసు ప్రకారం, దైవేతరుల కోసం జిబహ్ చేసే వ్యక్తి శపించబడ్డ వ్యక్తి.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"దైవేతురుల కోసం జిబహ్ చేసే వ్యక్తి పై అల్లాహ్ శాపం అతరించుగాక."

అందుకే, ఖుర్బానీ పశువును జిబహ్ చేసే ముందు రెండు విషయాలు గుర్తుంచుకోవాలి.

ఇందులో మొదటిది– సంకల్ప శుద్ధి అంటే ఖుర్బానీ ద్వారా కేవలం అల్లాహ్ ప్రసన్నత పొందే ఉద్దేశ్యం వుండాలి. ఇక రెండవది– ఆ పశువు కేవలం అల్లాహ్ పేరుతోనే జిబహ్ చెయ్యాలి. దైవేతరుల పేరుతో కాదు.

అలాగే, గుర్తుంచుకోవాల్సిన ఇంకో విషయం ఏమిటంటే – ఖుర్బానీ సమయం, ఈదుల్ అజ్హా నమాజు తర్వాత వుంది. ఒకవేళ ఎవరైనా, పండుగ నమాజు చదవడానికి ముందే గనక ఖుర్బానీ చేసి వుంటే, దానికి బదులు మరో పశువును అతను ఖుర్బానీ చెయ్యాలి.

జున్దుబ్ బిన్ సుఫ్యాన్ (రజి అల్లాహు అన్హు) కథనం:

"నేను, ఖుర్బానీ (చేసే) సమయంలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో పాటు ఉన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) పండుగ నమాజును ముగించిన వెంటనే, నమాజుకు ముందు జిబహ్ చెయ్యబడిన పశువుల మాంసం చూశారు. దీనిపై ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయితే ఖుర్బానీ పశువును పండుగ నమాజుకు ముందు జిబహ్ చేశాడో, అతను దాని స్థానంలో మరో పశువును జిబహ్ చెయ్యాలి. ఇక ఎవరైతే, జిబహ్ చేయలేదో వారు 'బిస్మిల్లాహ్' అని పలికి జిబహ్ చేయవచ్చు." *(బుఖారీ: 985, ముస్లిం:1960)*

మరో విషయం కూడా గుర్తుంచుకోవాలి.

ఖుర్బానీ కొరకు మీరు ప్రత్యేకించుకున్న పశువు లేదా దీని కోసం ఈ రోజే మీరు కొనుగోలు చేసిన పశువు లావుగా, లోపాలు లేకుండా వుండాలి.

అబూ ఉమామా బిన్ సహల్ ఇలా సెలవిచ్చారు:

"మేము మదీనాలో ఖుర్బానీ పశువులను బాగా మేపి లావుగా చేసేవాళ్ళం. అలాగే ఇతర ముస్లిములు కూడా ఖుర్బానీ పశువులను లావుగా చేసేవారు. *(బుఖారీ)*

బరా బిన్ ఆజిబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఖుర్బానీ కోసం నాలుగు రకాల పశువులు సరైనవికావు. మెల్ల కన్ను గల పశువు – దాని మెల్ల కన్ను స్పష్టంగా తెలియాలి. రోగం బారిన పడ్డ పశువు – దాని రోగం స్పష్టంగా కనబడాలి. కుంటుతున్న పశువు – దాని కుంటి తనం బహిర్గతమవ్వాలి. (అలాగే) ఎముకల్లో ఏ మాత్రం గుజ్జు లేకుండా అత్యంత బలహీనమైపోయిన పశువు."

*(అబూదావూద్: 2802, తిర్మిజి:1497, సహీ – అల్‌బానీ)*

అందుకే, ఈ లోపాలలో ఏది వున్నా, అలాంటి పశువును ఖుర్బానీ చేయడం సరైనది కాదు. అలాగే చెవులు తెగి వుండకూడదు మరియు కొమ్ములు కూడా విరిగి వుండకూడదు. కానీ వృషణాలు లేకపోవడం లోపం అనిపించుకోదు.

ప్రియ సోదరులారా!

ఈ ప్రాథమిక విషయాల తర్వాత, ఖుర్బానీ కి సంబంధించి, తప్పని సరిగా పాటించాల్సిన కొన్ని మర్యాదలు కూడా తెలుసుకోండి.

1. ఖుర్బానీ పశువును జిబహ్ చేసే ముందు కత్తి లేదా చాకు ను పదును గా చేసుకోవాలి.

షద్దాద్ బిన్ ఔస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నిశ్చయంగా అల్లాహ్ ప్రతి దానిపై ఉపకారాన్ని (ఇహ్సాన్) విధిగా చేశాడు. అందుకే మీరు (ఖిసాస్‌లో)ఒకవేళ చంపితే సరిగా చంపండి. పశువును జిబహ్ చేసేటప్పుడు సరిగా జిబహ్ చెయ్యండి. మీలో ప్రతి వ్యక్తి తన కత్తిని పదును చేసుకోవాలి మరియు జిబహ్ చెయ్యబడే పశువుకు ప్రశాంతతను అందించాలి." *(ముస్లిం: 1955)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఒక వ్యక్తి దగ్గరి నుంచి వెళ్ళసాగారు. అతను, ఒక మేక మెడపై తన కాలు నుంచి, కత్తిని పదును చేస్తున్నాడు. ఆ మేక అతని వైపే చూస్తూవుంది. (ఇది చూసి) దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)–నువ్వు దీనికి ముందే ఎందుకిలా చేయలేదు? (కత్తిని ఎందుకు పదును చేసుకోలేదు) నువ్వు దానిని పలుసార్లు చంపాలను కుంటున్నావా? అని అన్నారు.

*(తబ్రానీ, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 1090)*

2. మనిషి తన స్వహస్తాలతో జిబహ్ చెయ్యటం మేలు. ఒకవేళ అతను జిబహ్ చెయ్యలేక పోతే ఇతరులెవరైనా జిబహ్ చెయ్యవచ్చు. ఒక వేళ స్త్రీలు కూడా జిబహ్ చేయాలనుకుంటే జిబహ్ చెయ్యవచ్చు.

పశువును జిబహ్ చేసే సున్నత్ పద్ధతి ఏమిటంటే – దానిని ఎడమ వైపుకు పడుకో బెట్టి, దాని మెడపై తన కాలు పెట్టి, "బిస్మిల్లాహ్ అల్లాహు అక్బర్" అని పలికి కుడి చేత్తో జిబహ్ చెయ్యాలి.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

"దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం), నలుపు తెలుపు రంగులు

కలిగిన రెండు గొర్రెలను ఖుర్బానీ చేశారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వాటి మెడలపై కాలుపెట్టి 'బిస్మిల్లాహ్ అల్లాహు అక్బర్' అని పలికి, వాటిని తన చేతితో జిబహ్ చెయ్యడం నేను చూశాను."

*(బుఖారీ:5558, ముస్లిం:1966)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాళ్ళు నలుపురంగులో, పొట్ట కూడా నలుపురంగులో, కళ్ళ చుట్టు ప్రక్కల కూడా నలుపు రంగులో వున్న కొమ్ములు గల ఒక గొర్రె (పొట్టేలు) తీసుకు రమ్మని ఆజ్ఞాపించారు. ఆయన ఖుర్బానీ చేసేందుకు, అది తీసుకురాబడింది.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆయెషా (రజి అల్లాహు అన్హా) తో – 'కత్తి ని తీసుకురా' అని పలికి, తదుపరి, 'దానిని రాతిబండ సహాయంతో పదునుగా చేయి' అని అన్నారు.

ఆయెషా (రజిఅల్లాహు అన్హా) కత్తిని పదును చేసి ఇవ్వగా, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దానిని చేతిలో తీసుకొని, గొర్రెను పట్టుకొని జిబహ్ చేస్తూ ఇలా పలికారు – "అల్లాహ్ పేరుతో, ఓ అల్లాహ్! ముహమ్మద్, ముహమ్మద్ కుటుంబీకులు మరియు ముహమ్మద్ అనుచర సమాజం తరఫు నుండి (దీనిని) స్వీకరించు." తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దానిని జిబహ్ చేశారు.

3. ఖుర్బానీ మాంసాన్ని స్వయంగా తినాలి, తమ బంధువులకు, ఇంటికి వస్తూ పోతూ ఉండేవారికి, బీదవారికి కూడా తినిపించాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

فَكُلُوا مِنْهَا وَأَطْعِمُوا الْبَائِسَ الْفَقِيرَ ۝

**"ఆ తరువాత వాటిని మీరూ తినండి, దుర్భర స్థితిలో ఉన్న అగత్య పరులకు కూడా తినిపించండి."** ***(హజ్: 28)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

فَكُلُوا مِنْهَا وَأَطْعِمُوا الْقَانِعَ وَالْمُعْتَرَّ

**"వాటిని (మీరూ) తినండి, అడగని అభాగ్యులకు, అడిగే అగత్య పరులకు కూడా తినిపించండి."** ***(హజ్ : 36)***

ఈ ఆయతులను ఆధారంగా చేసుకొని, విద్వాంసులు – ఖుర్బానీ మాంసాన్ని మూడు భాగాలుగా విభజిస్తారు. ఒక భాగం స్వయం కోసం, రెండవది బంధువులు, పరిచితుల కోసం మరియు మూడవది నిరుపేదలు, అగత్యపరుల కోసం.

ఇక్కడ, గుర్తుంచుకోవాల్సిన మరో విషయం ఏమిటంటే– తమ వాట లోని మాంసాన్ని నిల్వ చేసుకోవడం కూడా సరైనదే. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముందుగా దీనిని వారించారు, కానీ తర్వాత అనుమతి ఇచ్చారు.

జాబిర్ బిన్ అబ్దుల్లా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్బానీ మాంసాన్ని మూడు రోజులకు మించి తినడాన్ని వారించారు. ఆ తర్వాత ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఇప్పుడు మీరు తినవచ్చు ప్రయాణ సామగ్రిగా ఉపయోగించవచ్చు మరియు నిల్వ కూడా చేసుకోవచ్చు". *(ముస్లిం: 1972)*

సల్మా బిన్ ఉకూ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చివున్నారు:

"మీలో ఎవరైనా ఖుర్బానీ చేస్తే అతని ఇంట్లో మూడు రోజులకు మించి దాని మాంసం ఉండకూడదు."

దాని తర్వాత, మరుసటి సం।। వచ్చినప్పుడు, ప్రజలు ఆయనతో – ఓ దైవ ప్రవక్తా! గత సం।। మేము పాటించినట్లుగానే ఈ సం।। కూడా ఆచరించాలా? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – "ఇప్పుడు మీరూ తినండి, ఇతరులకూ తినిపించండి మరియు నిల్వ కూడా చేసుకోండి. ఎందు కంటే గత సం।। ప్రజలు దారిద్ర్య స్థితిలో వున్నారు, అందుకే నేను (మిగిలిన మాంసం ద్వారా) ఒకరి కొకరు సహాయపడ్తారని భావించాను"అని వివరించారు. *(బుఖారీ: 5569, ముస్లిం:1974)*

4. ఖుర్బానీ చర్మాలు

ఖుర్బానీ మాంసం ఎలాగైతే అమ్మడం సరికాదో, అలాగే, దాని చర్మాలు

కూడా అమ్మి వాటి ధరను తమ ఉపయోగాలకు గాను వాడుకోవడం సరికాదు. ఆ చర్మాలను స్వయంగా ఉపయోగించుకోవాలి లేదా దానం చేసేయాలి.

అలీ (రజి అల్లాహు అన్హు ) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నన్ను – ఖుర్బానీ పశువుల దగ్గరుండి వాటిని కనిపెట్టుకొని వుండమని, వాటి మాంసాన్ని, చర్మాలను, వాటి అంతర్భాగాలను (ప్రేగులు వగైరా।।) ఖసాబ్ (పశువులను జిబహ్ చేసి విక్రయించేవాడు) కు కూలీ (వేతనం) క్రింద ఇవ్వకుండా, దానం చేయమని ఆజ్ఞాపించారు. *(బుఖారీ:1717, ముస్లిం:1317)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా తన ఖుర్బానీ చర్మాన్ని విక్రయిస్తే, అతని ఖుర్బానీ నెరవేరదు."

*(హాకిమ్, హసన్– అల్‌బానీ, సహీ అత్తర్ గీబ్ వ తర్‌హీబ్: 1088)*

5. ఖుర్బానీ దినాలు

ఖుర్బానీ దినాలు 4 రోజులు. పండుగ రోజు తోపాటు దాని తర్వాత వచ్చే మూడు రోజులు (11,12,13 తేదీలు). వీటిని 'తష్రీఖ్ దినాలు' అని పిలుస్తారు. కనుక, ఈ నాలుగు దినాలలో ఏ దినమైనా ఖుర్బానీ చేయవచ్చు. *(జాదుల్ మిఆద్: 2వ సంపుటం, 319 పేజి, ఫతావా అలల్ జన్నతుల్ దాయిమ: 8వ సంపుటం, 406 పేజీ)*

## పండుగ రోజుల్లో వినోదం

పండుగ రోజుల్లో వినోదం సరైనదే. కానీ షరతు ఏమిటంటే దీనిలో షరీయత్తుకు విరుద్ధంగా ఏ కార్యం జరుగకూడదు. అందుకే, ముస్లిములందరూ ఈ తరుణంలో తమ ఇంటి వారిని, బంధువులను, మిత్రులను కలిసి షరీయత్తు హద్దులకు లోబడి ఆనందం వ్యక్తం చేయాలి.

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం:

అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) నా దగ్గరికి విచ్చేశారు. ఆ సమయంలో అన్సారీ యువతుల్లోని ఇద్దరు యువతులు 'బుఆస్' దినం నాడు అన్సారీలు

చదివిన కవితలతో పాడుతున్నారు. వాస్తవానికి వారు పాటలు పాడే వాళ్ళు కారు. కానీ ఆ రోజు పండుగ రోజు. అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇంట్లోనే షైతాను మాట మారుమ్రోగుతోందా? అని అడిగారు. దీనిపై, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – “ఓ అబూ బకర్! ప్రతి జాతికి ఒక పండుగ వుంటుంది మరియు ఈ రోజు మన పండుగ” అని అన్నారు. *(బుఖారీ: 454, ముస్లిం: 892)*

సహీ ముస్లిం లోని మరో ఉల్లేఖనంలో, ఆయెషా (రజి అల్లాహు అన్హ) ఇలా వివరించారు: దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ‘మినా’ లో వున్న రోజుల్లో అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) ఆయన వద్దకు వచ్చారు. ఆ సమయంలో ఇద్దరు యువతులు డప్పు వాయిస్తూ పాడుతున్నారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దుప్పటి కప్పుకొని నడుంవాల్చి ఉన్నారు. అబూబక్ర్ (రజి అల్లాహు అన్హు) (ఆ యువతులను) కోపగించుకున్నారు. దీనితో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తన ముఖాన్ని దుప్పటి నుంచి బయటకు తీసి – ఓ అబూబక్ర్ ! వారిని వదిలి పెట్టండి(అంటే పాడుకోనివ్వండి), ఎందుకంటే ఈ రోజులు పండుగ రోజులు అని హితవు పలికారు.

అలాగే, ఆయెషా (రజి అల్లాహు అన్హ) ఇలా వివరించారు:

పండుగ రోజు కొందరు నల్ల జాతీయులు మస్జిద్ కు వచ్చారు మరియు (యుద్ధానికి ఉపయోగించే) ఆయుధాలతో ఆటను ప్రదర్శించ సాగారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నా కుటీరం యొక్క ద్వారం వద్ద కొచ్చి స్వయంగా దీనిని వీక్షిస్తూ నన్ను కూడా పిలిచారు. నేను రాగానే ఆయన తన దుప్పటిని ద్వారానికి అడ్డుగా పెట్టారు. తద్వారా నేను పరదాలో వుంటూ వారి ఆటను వీక్షించవచ్చు అని. ఇలా నేను ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) భుజంపై నా తలపెట్టి వారి ఆటను వీక్షించాను. తదుపరి నేను అలసిపోవడం చూసి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) నాతో – ఇక చాలా? అని అడిగారు. నేను – అవును అని అన్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – సరే, నువ్వు లోపలికి వెళ్ళిపో అని అన్నారు.

*(బుఖారీ: 454, ముస్లిం: 892)*

ఈ హదీసుల ద్వారా తెలిసిందేమిటంటే – పండుగ రోజుల్లో వినోదం ధర్మసమ్మతమే. కానీ వినోదం పేరుతో సంగీతం, పాటలు వినడం, టి.వి.లలో

సినిమా హాళ్ళలో సినిమాలు, నాటకాలు చూడడం మాత్రం సరైనది కాదు.

ఎందుకంటే పాటలు మరియు సంగీత వాయిద్యాలు అన్నీ నిషేధం. ఖాళీ సమయాన్ని ఇలాంటి విషయాల్లో గడపడం మహాపాపం.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు.

**وَمِنَ النَّاسِ مَن يَشْتَرِي لَهْوَ الْحَدِيثِ لِيُضِلَّ عَن سَبِيلِ اللَّهِ بِغَيْرِ عِلْمٍ وَيَتَّخِذَهَا هُزُوًا ۚ أُولَٰئِكَ لَهُمْ عَذَابٌ مُّهِينٌ ۝ وَإِذَا تُتْلَىٰ عَلَيْهِ آيَاتُنَا وَلَّىٰ مُسْتَكْبِرًا كَأَن لَّمْ يَسْمَعْهَا كَأَنَّ فِي أُذُنَيْهِ وَقْرًا ۖ فَبَشِّرْهُ بِعَذَابٍ أَلِيمٍ ۝**

**"జ్ఞానంతో నిమిత్తం లేకుండానే ప్రజలను అల్లాహ్ మార్గం నుంచి తప్పించడానికి, దాన్ని వేళాకోళం చేయడానికి మనసును వశీకరించే విషయాలను కొనుగోలు చేసేవాడు కూడా మనుషుల్లో వున్నాడు. పరాభవం పాలు చేసే శిక్ష వున్నది ఇలాంటి వారి కోసమే. వాడి ముందు మా వాక్యాలను చదివి వినిపించినప్పుడు వాడు అహంకారంతో, తాను వాటిని అసలు వననే లేదన్నట్లుగా, తన రెండు చెవులలోనూ చెవుడు వున్నట్లుగా ముఖం త్రిప్పుకొని పోతాడు. కాబట్టి నువ్వు వాడికి వ్యధా భరితమైన శిక్ష యొక్క శుభవార్తను వినిపించు." *(లుఖ్మాన్: 6-7)***

ఈ ఆయతులో 'లహ్వల్ హదీస్' అంటే పాటలు మరియు సంగీతం అని అర్థం. ఎంతో మంది సహాబాలు దీని అర్థాన్ని ఇలాగే వివరించారు. అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) అయితే ప్రమాణం చేసి మరీ 'లహ్వల్ హదీసు' అంటే పాటలు అని అర్థం అని అన్నారు.

ఇక ఎవరైనా, పాటలు వింటూ, వినిపిస్తూ, సంగీత, నాట్య కార్యక్రమాలలో పాలుపంచుకుంటాడో లేదా ఇంట్లో కూర్చొని ఈ కార్యక్రమాలను వీక్షిస్తుంటాడో అలాంటి వ్యక్తికి ఈ ఆయతులో వివరించనట్లు వ్యధా భరితమైన శిక్ష వుంది. వల్ ఇయాజ్ బిల్లాహ్!

అలాగే, అబూ మాలిక్ అష్అరీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నా అనుచర సమాజంలోని కొందరు తప్పకుండా మద్యపానం చేస్తారు. మద్యం పేరును మార్చుకుంటారు. వారి తలల వద్ద సంగీత వాయిద్యాలు

వాయించబడతాయి, పాటలు పాడే యువతులు పాడుతూ వుంటారు. అల్లాహ్ వారిని భూమిలోకి దిగద్రొక్కుతాడు మరియు వీరిలో ఎంతో మందిని కోతులు గానూ, పందులుగానూ చేసేస్తాడు.” *(ఇబ్నె మాజ: 4020, సహీ – అల్‌బానీ)*

ఈ హదీసులో– నాట్యం మరియు ఇతర కార్యక్రమాలలో పాలుపంచుకునే వారికి లేదా వీటిని టి.వి., కంప్యూటర్లలో వీక్షించే వారికి స్పష్టమైన హెచ్చరిక వుంది.

అబూ ఆమీర్ లేదా అబూ మాలిక్ అష్అరీ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“నిశ్చయంగా నా ఉమ్మత్ (అనుచర సమాజం) లో – వ్యభిచారం, సిల్కు వస్త్రాలు, మద్యం మరియు సంగీతాన్ని హలాల్ (ధర్మసమ్మతం) అని భావించేవారు వస్తారు”. *(బుఖారీ: 5590)*

ఈ హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ఈ నాలుగు విషయాలను హలాల్ చేసుకొనే వారు వస్తారని భవిష్యవాణి చేశారు. వాస్తవానికి ఈ నాలుగు విషయాలు ఇస్లాంలో హరామ్ (నిషేధం).

ఈ రోజుల్లో వీటిని హలాల్ గా చేసుకున్న వారు ఎంతో మంది వున్నారు. ఇక పాటల విషయానికొస్తే – దీనిని పాపకార్యమని అనుకోక పోవడమే కాకుండా, నేటి సోకాల్డ్ నాగరికులు దీని ధర్మయుక్తత (హలాల్) పై ఫత్వాలు (ధార్మిక తీర్పులు) కూడా జారీ చేసేస్తారు. ఏ ఆధారమూ లేకుండా కేవలం మనుష్యుల అభిరుచులు మరియు తమ కోరికలను పూర్తి చేయడానికి వారిలా చేస్తారు.

అంతే కాక, దీని కోసం వీరు – కొందరు విద్యావంతుల బలహీన ప్రవచనాలను ఆసరాగా తీసుకొని, ఇబ్నె హజమ్ ను గ్రుడ్డిగా అనుసరిస్తూ సహీ బుఖారీ లోని ఈ హదీసును బలహీనమైనదని నిరూపించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తారు.

మరి చూడబోతే, పాటలు మరియు నాట్యం హరాం అన్న విషయంలో ఇమాములందరూ ఏకాభిప్రాయం కలిగి వున్నారు.

వీటి నిషేధం గురించి మేము వివరించిన ఆధారాలు ఒక బుద్ధిమంతునికి సరిపోతాయి. వీటితో పాటు మరో ఆధారం మీ ముందు వుంచుతాను. దీని

ప్రకారం డోలు వగైరా॥లు నిషేధించబడ్డాయి అని స్పష్టంగా తెలుస్తుంది.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నిశ్చయంగా అల్లాహ్ మీపై మద్యం, జూదం, డోలు ను నిషేధం చేశాడు, ఆయన ఇలా కూడా సెలవిచ్చారు – మత్తు కలిగించే ప్రతి వస్తువూ హరామ్."

*(అబూదావూద్: 3696, సహీ – అల్‌బానీ)*

ఈ స్పష్టమైన ఆధారాలతో, ఎవరి మనసులోనూ ఏ విధమైన అనుమానం ఇక మిగిలి వుండకూడదు. అందరూ – పాటలు మరియు సంగీతం హరామ్ (నిషేధం) అని గట్టిగా నమ్మాలి. కాని దురదృష్టవశాత్తూ నేడు ఆ సోకాల్డ్ నాగరికుల ఫత్వాలనూ ఆధారంగా చేసుకొని సంగీతాన్ని కొందరు – మనస్సును సంతృప్తి పరిచే, ఖాళీ సమయాన్ని సద్వినియోగం చేసుకొనే సాధనంగా భావిస్తు న్నారు. మరిచూడబోతే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – సంగీత వాయిద్యాలు వ్యాపించినప్పుడు, పాటలు సర్వ సాధారణమై పోయినప్పుడు, మద్యపానాన్ని హలాల్‌గా భావించినప్పుడు అల్లాహ్ యొక్క వ్యధాభరితమైన శిక్ష అవతరిస్తుందని భవిష్యవాణి చేసి వున్నారు.

సహల్ బిన్ సాద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"(ప్రళయానికి ముందు) ఆఖరి కాలంలో జనాలను భూమిలోకి దిగ త్రొక్క బడవేయడం జరుగుతుంది. వారిపై రాళ్ళ వర్షం కురిపించ బడుతుంది, వారి స్వరూపాలు మార్చివేయబడతాయి."

"ఇలా ఎప్పుడు జరుగుతుంది?" అని ఆయనతో అడగబడింది.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – సంగీత వాయిద్యాలు వ్యాపించబడినప్పుడు, పాటలు పాడే యువతులు సర్వసాధారణమై పోయినపుడు, మద్యాన్ని హలాల్‌గా భావించినపుడు" అని అన్నారు.

*(సహీఉల్ జామె లిల్ అల్‌బానీ: 3665)*

ఇస్లామీయ సోదరులారా!

పాటలూ, వాయిద్యం – ఇవి ఎలా సరైనవి కాగలగుతాయి?

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వీటిని ‘శపించబడ్డ విషయాలు’గా ఖరారు చేశారు.

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

“రెండు శబ్దాలు ఇహలోకంలోనూ, పరలోకం లోనూ శపించబడ్డాయి. సంతోషపడే సమయంలో పాటల శబ్దం మరియు దు:ఖ సమయంలో (గొంతు చించుకొని) ఏడిచే శబ్దం.” *(సహీ ఉల్ జామె లిల్ అల్‌బానీ: 3695)*

అబ్దుల్లా బిన్ మస్‌ఊద్ (రజి అల్లాహు అన్హు) ప్రకారం - పాట కపటత్వాన్ని కలిగిస్తుంది.

‘నీరు పంటను మొలకెత్తించినట్లే, పాట కపటత్వాన్ని మొలకెత్తిస్తుంది.’

చెప్పొచ్చే సారాంశం ఏమిటంటే - పండుగ రోజుల్లో తప్పకుండా ఆనందాన్ని వ్యక్తం చేయండి. కానీ మేము వివరించిన ఆధారాలను దృష్టిలో వుంచుకొని పాటలు, సంగీతం వంటి విషయాలకు దూరంగా వుండడం ఎంతైనా అవసరం.

## పండుగ రోజుల్లో చేయబడే కొన్ని చెడు కార్యాలు

ఇస్లామీయ సోదరులారా!

పండుగ దినాలలో ప్రత్యేకించి కొన్ని చెడులు కానవస్తాయి. వాటి గురించి కూడా వివరించడం ఎంతైనా అవసరం. ఆ చెడు కార్యాలలో కొన్ని ఇవి:

1. వస్త్రాలను చీల మండ క్రింది వరకు వ్రేలాడదీయడం, గర్వం, గొప్ప తనాన్ని ప్రదర్శించడం.

పండుగ రోజుల్లో ఎంతో మంది ధరించే వస్త్రాలు చీలమండ క్రింది వరకు వ్రేలాడుతూ వుంటాయి. మరి చూడబోతే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీని గురించి ఇలా సెలవిచ్చి వున్నారు:

“మూడు రకాల వ్యక్తులతో అల్లాహ్ ప్రళయం నాడు ఏమాత్రం సంభాషించడు, వారి వైపు కన్నెత్తి కూడా చూడడు, వారిని పరిశుద్ధ పరచడు. వారి కోసం వ్యధాభరితమైన శిక్ష వుంటుంది.”

ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ మాటను మూడు సార్లు పలికారు.

అబూజర్ (రజి అల్లాహు అన్హు) – నిశ్చయంగా వారు పరాభవం పాలు చేయబడి, ఎంతగానో నష్టపోతారు. ఓ దైవ ప్రవక్తా! వాళ్ళు ఎవరు? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – తన లుంగీ/ప్యాంట్ ని క్రిందికి వ్రేలాడదీసేవాడు, సహాయం చేసి దెప్పిపొడిచేవాడు, అసత్య ప్రమాణం చేసి (సరుకులు) అమ్మేవాడు అని అన్నారు. *(ముస్లిం: 106)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"చీలమండ క్రింద వుండే వస్త్రం నరకాగ్ని లో వుంటుంది."

*(బుఖారీ: 5787)*

ఈ రెండు హదీసుల ద్వారా తెలిసిందేమిటంటే – వస్త్రాలను చీలమండ క్రిందికి వ్రేలాడదీయడం హరామ్ మరియు మహాపాపం.

అందుకే ఏ వస్త్రమైనా చీలమండ క్రిందికి వ్రేలాడదీయబడి వుంటే – అది షల్వార్ దైనా, దుప్పటి అయినా, పైజామా దైనా, ప్యాంటు దైనా, (లుంగీ దైనా), దానిని చీలమండపై వరకే వుంచాలి. దీనితో పాటు గర్వం కూడా కలిగి వుంటే అలాంటప్పుడు ఇది మరింత పెద్ద పాపకార్యం అవుతుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఒక వ్యక్తి తన లుంగీని (క్రింది వరకు వ్రేలాడదీసి) ఈడ్చుతున్నాడు. అల్లాహ్ అతన్ని భూమి లోకి దిగత్రొక్కాడు. ఇలా అతను ప్రళయం వరకు భూగర్భంలోకి పోతూనే వుంటాడు." *(బుఖారీ: 5790)*

మరో ఉల్లేఖనం లో ఈ హదీసు పదాలు ఇలా వున్నాయి:

"ఒక వ్యక్తి తన పొడుగాటి వెంట్రుకలను దువ్వుకొని, అందమైన వస్త్రాలు ధరించి, నిక్కుతూ వెళుతూ గర్వాతిశయానికి లోనై వున్నాడు. ఈ తరుణంలోనే అకస్మాత్తుగా అల్లాహ్ అతన్ని భూమిలోకి దిగత్రొక్కాడు. ఇలా అతను ప్రళయం వరకు భూ గర్భంలోకి పోతూనే వుంటాడు."*(బుఖారీ:5789, ముస్లిం:2088)*

మరి చూడబోతే, అల్లాహ్ ఇలా సెలవిచ్చి ఉన్నాడు:

وَلَا تُصَعِّرْ خَدَّكَ لِلنَّاسِ وَلَا تَمْشِ فِي الْأَرْضِ مَرَحًا ۖ إِنَّ اللَّهَ لَا يُحِبُّ كُلَّ مُخْتَالٍ فَخُورٍ ۝

**"జనుల ముందు (గర్వంతో) మొహం తిప్పుకొని మాట్లాడకు, భూమిపై నిక్కుతూ నడవకు. ఎట్టి పరిస్థితిలోనూ అల్లాహ్ డాబులు చెప్పుకునే గర్విష్టిని ఇష్టపడడు."** ***(లుఖ్మాన్: 18)***

"గర్వం" ఎంత పెద్ద అపరాధమంటే – ఒకవేళ ఎవరి మనసులోనైనా ఆవగింజంత గర్వం వున్నా అతను గనక తౌబా చేయకుండా మరణిస్తే స్వర్గంలోకి ప్రవేశించలేడు.

దైవప్రవక్త(సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"హృదయంలో ఆవగింజంత గర్వం వున్నా, ఆవ్యక్తి స్వర్గంలోకి ప్రవేశించలేడు." దీనిపై ఓవ్యక్తి – ఓ దైవ ప్రవక్తా! నిశ్చయంగా ఒక వ్యక్తి తన బట్టలు, బూట్లు అందంగా వుండాలని కోరుకుంటాడు. (మరి ఇది కూడా గర్వానికి సూచనేనా?) అని అడిగాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – నిశ్చయంగా అల్లాహ్ సౌందర్యవంతుడు, సౌందర్యాన్ని ఇష్టపడతాడు. (వాస్తవానికి) గర్వం అంటే – సత్యాన్ని త్రోసిపుచ్చడం మరియు ఇతరులను అల్పులుగా భావించడం అని వివరించారు. *(ముస్లిం: 91)*

అందుకే, పండుగ దినాల ఆనందోత్సాహాలలో డాబులు, గర్వం మిళితం కాకుడదు. పైగా, ప్రజలతో చిరునవ్వుతో, వినయ విధేయతలతో కలవాలి మరియు ఇంటివారితో, బంధువులతో, మిత్రులతో మన ప్రేమను, ఆనందాన్ని పంచుకోవాలి.

2. గడ్డం గొరికించు కోవడం లేదా దానిని చిన్నదిగా చేసుకోవడం.

ఎంతో మంది సాధారణంగా గడ్డాన్ని గొరికించుకోవడమో లేదా దానిని చిన్నదిగా కత్తిరించుకోవడమో చేస్తూ వుంటారు. పండుగ రోజుల్లో అయితే దీనిని ప్రత్యేకించి చేస్తూ వుంటారు. కానీ, వాస్తవానికి ఇలా చేయడం హరామ్.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"మీరు ముష్రిక్కులను (బహు దైవారాధకులు) వ్యతిరేకిస్తూ వుండండి, గడ్డాలను పెంచండి మరియు మీసాన్ని కత్తిరించండి."

*(బుఖారీ: 5892, 5893, ముస్లిం: 259)*

మరో ఉల్లేఖనంలో ఇలా సెలవిచ్చారు:

“మీరు మీసాన్ని కత్తిరించండి, గడ్డాన్ని పొడిగించండి, అగ్ని పూజారులను వ్యతిరేకించండి.” *(ముస్లిం: 260)*

కానీ, నేడు చాలా మంది ముస్లిములు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఈ ఆదేశాలకు పూర్తి విరుద్ధంగా మీసాలను పెద్దవిగా చేసి గడ్డాన్ని పూర్తిగా గొరికించు కోవడమో లేదా చిన్నగా కత్తిరించుకోవడమో చేస్తున్నారు.

ఇలా వారు ముష్రిక్కులకు, అగ్ని పూజారులకు అనుగుణంగా వ్యవహరిస్తున్నారు. వాస్తవానికి వాళ్ళను వ్యతిరేకించమని దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆజ్ఞాపించి వున్నారు.

3. పరాయి స్త్రీలతో కరచాలనం చేయడం

ఎంతో మంది, ప్రత్యేకించి పండుగ రోజుల్లో ఇతరుల ఇళ్ళకు వెళ్ళినప్పుడు అక్కడి పరాయి స్త్రీలతో కరచాలనం చేస్తూ శుభాకాంక్షలు తెలుపుతారు. మరి చూడబోతే, మన ధర్మం అపరిచిత(పరాయి) స్త్రీలతో కరచాలనం చేయడానికి అనుమతించదు.

మాఖిల్ బిన్ యసార్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“మీలో ఏ వ్యక్తి కైనా అతని తలపై ఇనుప సూదితో కొడుతూ వుంటే–ఇది అతనికి –తనకు ధర్మ సమ్మతం కాని స్త్రీని ముట్టుకోవడం కన్నా మేలైనది.” *(అస్సహీహా: 226)*

అందుకే, మన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్త్రీలతో ‘ బైత్’ (ప్రమాణం) తీసుకున్నప్పుడు కేవలం నోటితో తీసుకున్నారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఏ స్త్రీతోనూ కరచాలనం చేయలేదు. *(ముస్లిం: 1866)*

4. పరాయి స్త్రీలతో ఏకాంతంలో సంభాషించడం.

ప్రత్యేకించి పండుగ రోజుల్లో ఎంతో మంది పరాయి స్త్రీలతో ఏకాంతంలో సంభాషిస్తూ వుంటారు. కానీ, మన ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహివ సల్లం) దీనిని వారించి వున్నారు.

ఉఖ్బా బిన్ ఆమిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"మీరు (పరాయి) స్త్రీల వద్దకు వెళ్ళడం నుండి దూరంగా వుండండి."

దీనిపై ఒక అన్సారీ– ఓ దైవ ప్రవక్తా ! మరి మీరు భర్త సోదరుని (మరిది) వద్దకు వెళ్ళడం గురించి ఏమంటారు? అని అడిగాడు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం)– మరిది అయితే మృత్యువు (లాంటి వాడు) అని వివరించారు. *(బుఖారీ: 5233, ముస్లిం: 2083)*

ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"మీలో ఏ వ్యక్తి కూడా ఇతర స్త్రీతో ఏకాంతంలో సంభాషించకండి. ఒకవేళ ఆమెతో పాటు ఎవరైనా 'మహ్రమ్' వుంటే అది వేరే విషయం. అలాగే ఏ స్త్రీ అయినా 'మహ్రమ్' లేకుండా ప్రయాణం చేయకూడదు."

*(బుఖారీ: 2862, ముస్లిం:1341)*

5. స్త్రీలు పరదా (బురఖా) లేకుండా తిరగడం.

ప్రత్యేకించి పండుగ రోజుల్లో ఎంతో మంది స్త్రీలు పరదా లేకుండా బయటికొస్తారు. అందంగా సింగారించుకుని బజార్లలో, మార్కెట్లలో, పార్కులలో తిరుగుతూ ఎంతో మందిని పరీక్షకు గురిచేస్తారు.

మరి చూడబోతే, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) దీని నుండి గట్టిగా వారించారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَقَرْنَ فِي بُيُوتِكُنَّ وَلَا تَبَرَّجْنَ تَبَرُّجَ الْجَاهِلِيَّةِ الْأُولَىٰ

**"మీరు మీ ఇండ్లల్లోనే ఆగి వుండండి. పూర్వపు అజ్ఞాన కాలంలో మాదిరిగా మీ సింగారాన్ని చూపిస్తూ తిరగకండి."** ***(అహ్‌జాబ్ :33)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"స్త్రీ – సతర్ (దాచిపెట్టే వస్తువు) లాంటిది. అందుకే ఆమె ఇంటినుండి బయలుదేరినప్పుడు షైతాను ఆమెను కనిపెడుతూ వుంటాడు. ఆమె తన ఇంట్లో వున్నప్పుడు అల్లాహ్ కారుణ్యానికి అత్యంత సమీపంలో వుంటుంది."

*(ఇబ్నెహిబ్బాన్: 5599, తిర్మిజి: 1773, మిష్కాత్: 3109)*

పరదా పాటించకుండా, పలుచటి వస్త్రాలు ధరించి ఇండ్ల నుండి బయటి కొచ్చే స్త్రీలను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – 'వారు స్వర్గంలో ప్రవేశించలేరు' అని గట్టిగా హెచ్చరించారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"రెండు రకాల నరకవాసులను నేను చూడలేదు. అందులో ఒకరు ఎవరంటే ఆవుల తోకల్లాంటి కొరడాలతో ప్రజలను గెదిమే వారు. ఇక రెండవ వారు ఎవరంటే – వస్త్రాలు ధరించినప్పటికీ నగ్నంగా కనబడే స్త్రీలు. ప్రజల మనస్సులను తమవైపుకు ఆకర్షింపజేస్తూ, గర్వంతో నిక్కుతూ నడుస్తారు. వారి శిరస్సులు ఒంటెల మూపురము లాగా ఒకవైపుకు వంగి వుంటాయి. ఇలాంటి స్త్రీలు స్వర్గంలోకి ప్రవేశించలేరు, స్వర్గపు సువాసనను సైతం పొందలేరు. వాస్తవానికి స్వర్గపు సువాసన చాలా దూరం నుండి వస్తూ వుంటుంది."

*(ముస్లిం: 2128)*

అలాగే, దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా కూడా సెలవిచ్చారు:

"ఏ స్త్రీ అయినా తన సువాసనను అనుభవింప జేయాలన్న ఉద్దేశ్యంతో కొందరి దగ్గరి నుంచి వెళితే, అలాంటి స్త్రీ అశ్లీల (చెడు నడతగల) స్త్రీ.

6. బంధువులు, బీదవారి హక్కులను దృష్టిలో వుంచుకోవడం.

పండుగ రోజుల్లో ఎంతో మంది బాగా తింటారు, అందమైన వస్త్రాలు ధరిస్తారు. తమ సంతోషాన్ని వ్యక్తం కూడా చేస్తారు. కానీ తమ బంధువులనూ, బీదవారిని మరిచిపోతారు. కానీ ఇస్లాం మనకు – మన సంతోషాలలో బంధువులనూ, బీదవారిని కూడా చేర్చడాన్ని ప్రోత్సహిస్తుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"మీరు మీ కోసం ఇష్టపడేదే, మీ సోదరుని కోసం కూడా ఇష్టపడనంత వరకు (పరిపూర్ణ) విశ్వాసులు కాలేరు." *(బుఖారీ: 13, ముస్లిం: 45)*

బంధుత్వాన్ని నెరవేర్చటం గురించి, అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా తన ఉపాధిలో వృద్ధి మరియు దాని అంతం (మరణం)లో ఆలస్యం కావాలనుకుంటే, అతను బంధుత్వాన్ని నెరవేర్చాలి."

*(బుఖారీ: 5986, ముస్లిం: 2557)*

బంధుత్వాన్ని నెరవేర్చటం గురించి చాలా మంది ఏమనుకుంటారంటే – ఒకవేళ వారి బంధువులు దానిని నెరవేర్చితే తాము కూడా దానిని నెరవేర్చాలి అని. కానీ, ఈ దృక్పథం సరైనది కాదు.

బంధుత్వాన్ని నెరవేర్చటం యొక్క సరైన దృక్పథం ఏమిటంటే – ఒకవేళ బంధువు బంధుత్వాన్ని నెరవేర్చక పోయినా తను మాత్రం దానిని నెరవేర్చాలి. ఒకవేళ వారు చెడుగా ప్రవర్తిస్తే వారితో మంచిగా ప్రవర్తించాలి. ఒకవేళ వారు ఇవ్వక పోయినా వారికి ఇస్తూ వుండాలి. ఒక్క మాటలో చెప్పాలంటే – బంధువు, బంధుత్వాన్ని నెరవేర్చినా, నెరవేర్చక పోయినా, రెండు పరిస్థితుల్లోనూ మనిషి తన శాయశక్తులా తన బంధువుతో బంధుత్వాన్ని నెరవేరుస్తూ వుండాలి.

అబ్దుల్లా బిన్ అమ్ర్ బిన్ ఆస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"బంధుత్వాన్ని నెరవేర్చేవాడంటే – ఒకరు నెరవేర్చిన దానికి బదులుగా నెరవేర్చేవాడు కాదు. పైగా బంధుత్వాన్ని నెరవేర్చే వాడంటే – ఒకరు నెరవేర్చక పోయినా తను మాత్రం బంధుత్వాన్ని నెరవేర్చుతూ వుండేవాడు."

*(బుఖారీ: 5991)*

అందుకే, పండుగ సంతోషాలలో బంధువులను, బీదవారిని కూడా చేర్చుతూ వుండాలి.

ఇస్లామీయ సోదరులారా!

ఆఖరుగా మీకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఒక సున్నత్‌ను గుర్తుకు తెప్పిస్తాం. అదేమిటంటే – పండుగ నమాజు అనంతరం దారిని మార్చి తిరిగి వెళ్ళడం.

అబూ హుర్రైరా (రజిఅల్లాహు అన్హు) కథనం:

“దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పండుగ రోజు (నమాజు కోసం) బయటికొచ్చినప్పుడు ఒక దారిలో వెళ్ళేవారు, తదుపరి (నమాజు అనంతరం) వేరే దారిలో తిరిగి వచ్చేవారు.” *(తిర్మిజి: 541, సహీ–అల్‌బానీ)*

అందుకే, పండుగ నమాజు కోసం వచ్చిన దారిలో కాకుండా, తిరిగి వెళ్ళేటప్పుడు వేరే దారిలో వెళ్ళాలి. ఖుర్బానీ పశువును జిబహ్ చెయ్యాలి.

అల్లాహ్ మనందరి ఖుర్బానీలను స్వీకరించుగాక! మరియు దానిని (పుణ్య ఫలాన్ని) మనకోసం పరలోకపు నిల్వగా చేయుగాక! ఆమీన్!

# హజ్జతుల్ విదా (వీడ్కోలు హజ్) ఖుత్బా - (1)

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1. హజ్జతుల్ విదా ఖుత్బా ప్రాముఖ్యత.
2. అరాఫాత్ లోని హజ్జతుల్ విదా ఖుత్బా యొక్క ముఖ్యాంశాలు.
3. మినా లోని ఖుర్బానీ దినపు (యౌమున్నహర్) ఖుత్బా.

## మొదటి ఖుత్బా

హజ్ కాలాన్ని దృష్టిలో వుంచుకొని మేము గత మూడు ఖుత్బాలలో హజ్ విధిత్వం, ప్రాముఖ్యత, దాని మహత్యాలు, ఆదేశాలు, మర్యాదలతో పాటు హరమైన్ షరీఫైన్ మహత్యాల గురించి వివరించాము. ఆదేశాలు, మర్యాదల గురించి తెలియజేస్తూ మేము– దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'హజ్జతుల్ విదా' వ్యవధిలో ఎన్నో సార్లు సహాబాలకు సంభోదించారు– అన్న విషయం తెలియజేశాం. వీటిలో అన్నిటికన్నా ప్రముఖమైన ఖుత్బా, అరాఫాత్‌లో ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇచ్చిన ఖుత్బా. దీనితో పాటు మినాలో కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుత్బా ఇచ్చారు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇచ్చిన ఖుత్బాలను వివరించడమే నేటి ఖుత్బా ఉద్దేశ్యం.

అల్లాహ్ ను వేడుకొనే దేమిటంటే - ఆయన మనందరికీ సత్యాన్ని గ్రహించి, దాని కనుగుణంగా ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక ! ఆమీన్!

## అరాఫాత్ లోని హజ్జతుల్ విదా ఖుత్బా

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అరాఫాత్ చేరుకున్నారు. అక్కడ ఆయన కోసం 'నిమ్రా' లో ఒక గుడారం ఏర్పాటు చేయబడింది. సూర్యుడు (పశ్చిమం వైపుకు) వంగడం ప్రారంభించగానే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన ఒంటె (ఖస్వ) ను సిద్ధం చేయమని ఆజ్ఞాపించారు. ఆయన ఆజ్ఞకనుగుణంగా దానిపై సీటు అమర్చబడింది. తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) దాని పైకెక్కి, లోయ మధ్య భాగంలోకి చేరుకొని ఖుత్బా ఇస్తూ ఇలా సెలవిచ్చారు:

“నిశ్చయంగా ఈ దినం, ఈ మాసం, ఈ నగరం ఎంత గౌరవప్రదమైనవో అలాగే మీ రక్తం, సంపదలు కూడా అంతే గౌరవ ప్రదమైనవి. జాగ్రత్తగా వినండి! అజ్ఞాన కాలపు ఆచారాలన్నీ నా పాదాల క్రింద సమాధి చేయబడ్డాయి మరియు అజ్ఞాన కాలపు హత్యలు సమాప్తం గావించబడ్డాయి. బనూసాద్ లో ప్రాలు త్రాగుతూ హుజైల్ చేతిలో హత్యకు గురైన ‘ఇబ్నె రబియా బిన్ హారిస్’ హత్యను సమాప్తం చేస్తున్నాను. అజ్ఞాన కాలపు వడ్డీ సమాప్తం అయ్యింది. అందరికన్నా ముందుగా నా కుటుంబంలో వడ్డీని సమాప్తం చేస్తున్నట్లు ప్రకటిస్తున్నాను. అంటే, అబ్బాస్ బిన్ ముత్తలిబ్ (కు రావాల్సిన) వడ్డీ. అది పూర్తిగా సమాప్తం చేయబడింది. మీరు స్త్రీల విషయంలో అల్లాహ్‌కు భయపడుతూ వుండండి. ఎందుకంటే, మీరు వారిని ‘అల్లాహ్ అమానతుల’ రూపంలో స్వీకరించారు మరియు అల్లాహ్ యొక్క కలిమా (సద్వచనం) ద్వారా వారి గుప్తాంగాలను హలాల్ చేసుకున్నారు. వారిపై మీకున్న హక్కు ఏమిటంటే – మీరు ఇష్టపడని వారిని వారు మీ పడకలపై రానివ్వకూడదు. ఒకవేళ వారు ఇలా చేయకపోతే మీరు వారిని మెల్లగా కొట్టవచ్చు. వారికి మీపై వున్న హక్కు ఏమిటంటే – మీరు వారికి న్యాయమైన రీతిలో భోజన, వస్త్రాలు కల్పించాలి.

(బాగా గుర్తుంచుకోండి!) నేను మీ మధ్య ఎలాంటి వస్తువును విడిచి వెళుతున్నానంటే, దానిని గనక మీరు గట్టిగా పట్టుకుంటే ఎన్నటికీ మార్గ భ్రష్టులవ్వరు. అది అల్లాహ్ గ్రంథం. నా గురించి మిమ్మల్ని అడిగినప్పుడు మీరేం సమాధానం ఇస్తారు? సహాబాలు – ‘నిస్సందేహంగా మీరు ధర్మాన్ని చేరవేసారని మేము సాక్ష్యమిస్తాం. మీరు (దైవ దౌత్య బాధ్యతను) నెరవేర్చారు మరియు అనుచర సమాజం శ్రేయస్సు కోసం ఏ ప్రయత్నమూ వదల్లేదు’ అని అన్నారు.

తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం), తన సాక్ష్యం ఇచ్చే వ్రేలిని ఆకాశం వైపుకు పైకి లేపి ప్రజలవైపుకు త్రిప్పుతూ, “ఓ అల్లాహ్! నువ్వు కూడా సాక్షిగా వుండు, ఓ అల్లాహ్! నువ్వు కూడా సాక్షిగా వుండు, ఓ అల్లాహ్! నువ్వు కూడా సాక్షిగా వుండు” అని పలికారు. *(ముస్లిం:1218)*

ఈ ఖుత్బాలో, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) పది విషయాలు తెలియజేశారు.

## 1) ముస్లిముల రక్తం నిషేధం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) నిషేధిత నగరం, నిషేధిత మాసం, నిషేధిత దినం లాగే ముస్లిముల రక్తాన్ని కూడా నిషేధించారు. అకారణంగా దీనిని చిందించడాన్ని హరామ్ చేశారు. అందుకే ముస్లిముల రక్తాన్ని కాపాడడం ఎంతైనా అవసరం.

ఏ వ్యక్తి అయినా ఒక ముస్లిమును హత్య చేస్తే అతని కోసం గట్టి హెచ్చరిక వుంది. ఖుర్ఆన్ లో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَنْ يَّقْتُلْ مُؤْمِنًا مُّتَعَمِّدًا فَجَزَآؤُهٗ جَهَنَّمُ خٰلِدًا فِيْهَا وَ غَضِبَ اللّٰهُ عَلَيْهِ وَ لَعَنَهٗ وَاَعَدَّ لَهٗ عَذَابًا عَظِيْمًا ﴿93﴾

**"ఉద్దేశ్యపూర్వకంగా ఒక విశ్వాసిని చంపేవానికి ప్రతిఫలం నరకమే. అందులో వాడు కలకాలం పడి వుంటాడు. వాడిపై అల్లాహ్ ఆగ్రహం, ఆయన శాపం పడుతుంది. ఇంకా ఆయన అతని కోసం పెద్ద శిక్షను సిద్ధం చేసి వుంచాడు."** ***(నిసా: 93)***

ఈ ఆయతులో అల్లాహ్, ఒక విశ్వాసిని చంపేవానికి ఐదు హెచ్చరికలు చేసాడు. అందులో మొదటిది – అతని శిక్ష నరకమే. రెండవది – అందులో అతను కలకాలం వుంటాడు. మూడవది – అతనిపై అల్లాహ్ ఆగ్రహం విరుచుకు పడుతుంది. నాల్గవది – అతను అల్లాహ్ శాపానికి అర్హుడవుతాడు. ఐదవది – అతని కోసం అల్లాహ్ పెద్ద శిక్షను సిద్ధం చేసి వుంచాడు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒక హదీసులో ముస్లిముల రక్త నిషేధం గురించి ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ తప్ప మరో నిజమైన ఆరాధ్యదైవం ఎవ్వరూ లేరని మరియు నేను అల్లాహ్ ప్రవక్తను అని సాక్ష్యమిచ్చే ముస్లిం రక్తం హలాల్ కాదు. కేవలం ఈ మూడు వ్యక్తుల్లో ఒకరిని చంపవచ్చు. వారెవరంటే – పెళ్ళయిన తర్వాత వ్యభిచరించే వ్యక్తి, ధర్మాన్ని (ఇస్లాంను) త్యజించిన వ్యక్తి, జమాత్ (సమూహం) నుండి దూరమయిన వ్యక్తి.

ఒక విశ్వాసిని చంపటం అనేది పెద్ద పాపం. ఇది ఎంత పెద్ద పాపమో, ఈ హదీసు ద్వారా మనం గ్రహించవచ్చు.

బరా బిన్ ఆజిబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ దృష్టిలో ఈ ప్రపంచం ముగింపు అనేది ఒక విశ్వాసి అకారణ హత్య కన్నా చాలా తేలిక." *(ఇబ్నెమాజ: 2619, తిర్మిజి:1395, సహీ – అల్‌బానీ)*

అబూ సయీద్ ఖుద్రి (రజి అల్లాహు అన్హు) మరియు అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) ల కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఒక వేళ ఆకాశవాసులు, భూవాసులూ –(అందరూ కలిసి) ఒక విశ్వాసి హత్యలో కనక పాలుపంచుకొని వుంటే, అల్లాహ్ వారందినీ నరకంలో వేసేవాడు." *(తిర్మిజి : 1398, సహీ – అల్‌బానీ)*

ఈ కారణం వల్లే, ప్రళయం రోజు అన్నిటి కన్నా ముందుగా హత్యల లెక్క తీసుకోబడుతుంది. దీని గురించి, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ప్రళయం రోజు, ప్రజల మధ్య అన్నిటి కన్నా ముందుగా హత్యల గురించి తీర్పు చేయబడుతుంది." *(బుఖారీ, ముస్లిం)*

అందుకే, ప్రతి ముస్లింపై విధిగా వున్న విషయమేమిటంటే – ముస్లిముల రక్తం (చిందించడం) నుండి తన చేతులను కాపాడుకోవాలి మరియు ఎవరినీ అకారణంగా చంపకూడదు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా అల్లాహ్ ను – ఆయనకు భాగస్వాములుగా ఎవరినీ కల్పించని స్థితిలో (షిర్క్ చేయకుండా) మరియు నిషిద్ధ రక్తాన్ని చిందించని స్థితిలో – గనక కలిస్తే, అతను స్వర్గంలోకి ప్రవేశిస్తాడు." *(ఇబ్నెమాజ: 2618, సహీ – అల్‌బానీ)*

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు)తో ఒక వ్యక్తి గురించి ప్రశ్నించబడింది:

అతను ఉద్దేశ్యపూర్వకంగా ఒక విశ్వాసిని హత్య చేశాడు. ఆ తర్వాత, పశ్చాత్తాపం చెంది, విశ్వసించి, మంచి పనులు చేస్తూ సన్మార్గం వైపుకు మరలాడు.

దీనిపై ఆయన ఇలా జవాబిచ్చారు: అతను నాశనమవుగాక, అతనికి సన్మార్గం ఎలా సాధ్యం? దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిస్తుండగా నేను విన్నాను –

“ప్రళయం రోజు హంతకుడు, హతుడు – ఇద్దరూ వస్తారు. హతుడు తన హంతకుని తలను పట్టుకొని ఇలా అంటాడు: ఓ నా ప్రభువా! ఇతను నన్ను ఎందుకు హత్య చేశాడో ఇతణ్ణి అడుగు.”

తదుపరి, ఇబ్నె అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) ఇలా సెలవిచ్చారు:

అల్లాహ్ సాక్షి! అల్లాహ్ తన ప్రవక్త మీద – “ ఉద్దేశ్య పూర్వకంగా ఒక విశ్వాసిని చంపేవానికి ప్రతిఫలం నరకమే” ...(నిసా:93) అన్న ఆయతును అవతరింపజేశాడు మరియు దానిని రద్దు చేయలేదు.

*(ఇబ్నెమాజ: 2621, సహీ – అల్‌బానీ)*

## 2) ముస్లిం సంపద నిషేధం.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముస్లిం రక్తం లాగే, ముస్లిం సంపదను కూడా (పవిత్రంగా ఖరారు చేసి) నిషేధించారు. అందుకే, అన్యాయంగా ఒక ముస్లిం సంపదను లాక్కోవడం హరామ్.

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَأْكُلُوا أَمْوَالَكُمْ بَيْنَكُمْ بِالْبَاطِلِ إِلَّا أَنْ تَكُونَ تِجَارَةً عَنْ تَرَاضٍ مِنْكُمْ

**“ఓ విశ్వసించిన వారలారా! ఒండొకరి సొమ్మును అధర్మంగా తినకండి. అయితే, పరస్పర అంగీకారంతో జరిగే క్రయ విక్రయాల ద్వారా లభించే దానిని ( తినవచ్చు).** ***(నిసా: 29)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

وَلَا تَأْكُلُوا أَمْوَالَكُمْ بَيْنَكُمْ بِالْبَاطِلِ وَتُدْلُوا بِهَا إِلَى الْحُكَّامِ لِتَأْكُلُوا فَرِيقًا مِنْ أَمْوَالِ
النَّاسِ بِالْإِثْمِ وَأَنْتُمْ تَعْلَمُونَ ۝

**“ఒకరి సొమ్మును ఇంకొకరు అన్యాయంగా స్వాహా చేయకండి. బుద్ధి పూర్వకంగా, అక్రమమైన రీతిలో ఇతరుల ఆస్తిలో కొంత భాగం కాజేయటం కోసం అధికారులకు ముడుపులు చెల్లించకండి. అది (న్యాయం కాదన్న సంగతి) మీకూ తెలిసినదే”.** ***(బఖర: 188)***

ఈ రెండు ఆయతులలో 'బిల్ బాతిల్' అంటే అక్రమ పద్ధతిలో (ఇతరుల) సొమ్ము తినడాన్ని వారించబడింది. దీనిలో అక్రమమైన ప్రతి పద్ధతీ చేరివుంది.

ఉదా॥ కు దొంగిలించడం, ఒకరి సొమ్మును తినేయడం, క్రయ విక్రయాలలో మోసం చేయడం, లూటీ చేయడం, వడ్డీ తినడం, అమానతులను కాజేయడం, జూద మాడడం, హరామ్ (నిషిద్ధ) వస్తువుల వ్యాపారం చేయడం వగైరా॥

రెండవ ఆయతులో ప్రత్యేకించి, అధికారులకు ముడుపులు చెల్లించి ఇతరుల సొమ్మును అక్రమంగా కాజేయడాన్ని వారించడం జరిగింది. మరి చూడబోతే, ఈ రోజుల్లో ఇది సర్వ సామాన్య మైపోయింది. పోలిస్ స్టేషన్‌లలో పోలీసులకు ముడుపులు చెల్లించి చిన్న కేసులు పెట్టి సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురి చేయడమేకాక వారిపై దౌర్జన్యం కూడా చేయడం జరుగుతుంది. సాక్ష్యులకు, లాయర్లకు, జడ్జిలకు ముడుపులు చెల్లించి తీర్పును తమ కనుకూలంగా చేసుకుంటారు. ఇదంతా, కేవలం నిజాయితీ తో వున్న ఒక మనిషి సంపదను అక్రమంగా కాజేయడానికి జరుగుతుంది.

**ఫ ఇలల్లాహి ముస్తకీ వలాహౌల వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్!**

సంపద నిషేధాన్ని దృష్టిలో వుంచుకొని అల్లాహ్, ఇతరుల సొమ్మును దొంగిలించే వానికి కఠిన శిక్షను ఖరారు చేశాడు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَالسَّارِقُ وَالسَّارِقَةُ فَاقْطَعُوٓا أَيْدِيَهُمَا جَزَآءًۢ بِمَا كَسَبَا نَكَٰلًا مِّنَ ٱللَّهِ ۗ وَٱللَّهُ عَزِيزٌ حَكِيمٌ ۝

**"దొంగతనం చేసినది – పురుషుడైనా, స్త్రీ అయినా– ఉభయుల చేతులూ నరకండి. అది వారు చేసిన దానికి ప్రతిఫలం. అల్లాహ్ తరఫున విధించబడిన శిక్ష. అల్లాహ్ సర్వాధిక్యుడు, వివేచనాశీలి కూడా."**

***(మాఇద: 38)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా అసత్య ప్రమాణం చేసి ముస్లిం సొమ్మును కాజేస్తే, అతను – (ప్రళయం నాడు) అల్లాహ్ (అతని పట్ల) అయిష్టంగా వున్న స్థితిలో కలుస్తాడు." *(బుఖారీ, ముస్లిం)*

జూదం గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**يَآيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اِنَّمَا الْخَمْرُ وَالْمَيْسِرُ وَالْاَنْصَابُ وَالْاَزْلَامُ رِجْسٌ مِّنْ عَمَلِ الشَّيْطٰنِ فَاجْتَنِبُوْهُ لَعَلَّكُمْ تُفْلِحُوْنَ ۝**

**"ఓ విశ్వసించిన వారలారా! సారాయి, జూదం, బలిపీఠాలు, జోస్యం కోసం వాడే బాణాలు – ఇవన్నీ పరమ జుగుప్సాకరమైన విషయాలు, షైతాన్ చేష్టలు. కాబట్టి వాటికి దూరంగా వుండండి. మీరలా చేస్తే సాఫల్యం పొందవచ్చు."** ***(మాఇద: 90)***

## 3) అజ్ఞాన కాలపు ఆచారాల సమాప్తి

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సెలవిచ్చారు:

"జాగ్రత్త ! అజ్ఞాత కాలపు ఆచారాలన్నీ నా పాదాల క్రింద సమాధి చేయబడ్డాయి."

ఇలా ఆయన (సల్లల్లాహు అలైహివ సల్లం), దైవ దౌత్యానికి ముందు ప్రజలలో చలామణిలో వున్న ఆచారాలన్నీ సమాప్తమైనట్లు ప్రకటించారు.

ఆయన (సల్లల్లాహు అలైహివ సల్లం) ఇతర హదీసులలో, ఆ ఆచారాలలో కొన్నింటిని ప్రస్తావించారు కూడా.

ఉదా॥ కు ఆయన (సల్లల్లాహు అలైహివ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నా అనుచర సమాజంలో, ప్రజలు విడిచి పెట్టడానికి సిద్ధపడని అజ్ఞాన కాలపు నాలుగు ఆచారాలుంటాయి. అవేమిటంటే – వంశాన్ని ఆధారంగా చేసుకొని ఒకరిపై నొకరు గర్వపడుట, ఇతరుల వంశాన్ని నిందించడం, నక్షత్రాల ద్వారా వర్షాన్ని అర్థించడం మరియు మరణ సమయంలో ఏడ్పులు, పెడబొబ్బలు పెట్టడం." *(ముస్లిం: 934)*

## 4) అజ్ఞాన కాలపు హత్యల సమాప్తి

హజ్జతుల్ విదా ఖుత్బాలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అజ్ఞాన కాలపు ఆచారాలు సమాప్తమయ్యాయని ప్రకటిస్తూ వాటిలో ప్రత్యేకించి అజ్ఞాన కాలపు హత్యలు సమాప్తం గావించబడ్డాయని సెలవిచ్చారు. అంటే, అజ్ఞానకాలంలో ఎవరైనా మరొకరిని హత్య చేసివుంటే, అతనితో ఖిసాస్ (ప్రతీకారం) తీసుకోబడదు.

అజ్ఞాన కాలంలో తరాలకొద్దీ హత్యా ప్రతీకారం తీర్చుకోవడానికి ప్రజల మధ్య యుద్ధాలు జరిగేవి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలాంటి అజ్ఞాన కాలపు హత్యలన్నింటినీ సమాప్తం చేశారు. అందరి కన్నా ముందుగా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లం) తన జాతి లోని రబియా బిన్ హారిస్ కుమారుని హత్యను క్షమించివేసారు. మరి చూడబోతే, అజ్ఞాన కాలపు ప్రజల స్థితిని గూర్చి వివరిస్తూ అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَاذْكُرُوا نِعْمَتَ اللهِ عَلَيْكُمْ إِذْ كُنْتُمْ أَعْدَاءً فَأَلَّفَ بَيْنَ قُلُوبِكُمْ فَأَصْبَحْتُمْ
بِنِعْمَتِهِ إِخْوَانًا ۚ وَكُنْتُمْ عَلَىٰ شَفَا حُفْرَةٍ مِّنَ النَّارِ فَأَنْقَذَكُمْ مِّنْهَا ط

"అల్లాహ్ మీపై కురిపించిన దయానుగ్రహాన్ని జ్ఞప్తికి తెచ్చుకోండి - అప్పుడు మీరు ఒండొకరికి శత్రువులుగా ఉండేవారు. ఆయన మీ హృదయాలలో పరస్పరం ప్రేమానురాగాలను సృజించాడు. దాంతో ఆయన అనుగ్రహం వల్ల మీరు ఒకరికొకరు అన్నదమ్ములుగా మారారు. మీరు అగ్ని గుండం ఆఖరి అంచులకు చేరుకోగా, ఆయన మిమ్మల్ని దాన్నుంచి కాపాడాడు." *(ఆలి ఇమ్రాన్:103)*

## 5) వడ్డీ సమాప్తి

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్జతుల్ విదా ఖుత్బాలో అజ్ఞాన కాలపు వడ్డీని కూడా సమాప్తం చేశారు. అజ్ఞాన కాలంలో, అప్పు ఇచ్చేటప్పుడు ధనవంతుడు వడ్డీ ప్రాతిపదికన అప్పు ఇచ్చిన వాడి గడువును పెంచేవాడు, దానితో పాటు వడ్డీ రేటును కూడా పెంచేవాడు. ఇలా చేస్తూ, చివరికి వడ్డీయే, అసలు పైకం కన్నా ఎక్కువై పోయేది. ఇదెంతో నీచమైన దౌర్జన్యం. ఇస్లాం లో ఇది పూర్తిగా నిషేధం (హరామ్).

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لَا تَأْكُلُوا الرِّبَا أَضْعَافًا مُّضَاعَفَةً ۖ وَاتَّقُوا اللهَ لَعَلَّكُمْ تُفْلِحُونَ ۝

"ఓ విశ్వసించిన వారలారా! ద్విగుణీకృతం, బహు గుణీకృతం చేసి వడ్డీని తినకండి. మీరు సాఫల్యం పొందటానికి గాను అల్లాహ్‌కు భయపడండి." *(ఆలి ఇమ్రాన్:130)*

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا اتَّقُوا اللَّهَ وَذَرُوا مَا بَقِيَ مِنَ الرِّبَا إِن كُنتُم مُّؤْمِنِينَ ۝ فَإِن لَّمْ تَفْعَلُوا فَأْذَنُوا بِحَرْبٍ مِّنَ اللَّهِ وَرَسُولِهِ ۖ وَإِن تُبْتُمْ فَلَكُمْ رُءُوسُ أَمْوَالِكُمْ لَا تَظْلِمُونَ وَلَا تُظْلَمُونَ ۝

**"ఓ విశ్వసించిన వారలారా! అల్లాహ్ కు భయపడండి. మీరు నికార్సయిన విశ్వాసులే అయివున్నట్లయితే మిగిలివున్న వడ్డీని విడిచిపెట్టండి. ఒకవేళ మీరు గనక అలా చేయనట్లయితే, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్తతో యుద్ధానికి సిద్ధం కండి. ఒకవేళ మీరు పశ్చాత్తాపం చెందితే మీ అసలు సొమ్ము మీకే వుంటుంది. మీరూ ఒకరికి అన్యాయం చేయకూడదు. మీకు కూడా అన్యాయం జరుగకూడదు."** ***(బఖర: 278 - 279)***

అందుకే, వడ్డీ లావాదేవీలను మనస్ఫూర్తిగా పశ్చాత్తాపం చెందుతూ, వెంటనే వదిలి పెట్టండి. వడ్డీ ప్రాతిపదికపై ఎవరి వద్ద నుండి గానీ, బ్యాంకు నుండి గానీ అప్పు తీసుకోకండి, మన అవసరాలు తీరడం కోసం కానివ్వండి లేదా వ్యాపార నిమిత్తం కానివ్వండి. అలాగే వడ్డీ ప్రాతిపదికపై ఇతరులకు కూడా అప్పు ఇవ్వకండి. బ్యాంకులలో 'ఫిక్సడ్ డిపాజిట్లలో' డబ్బును జమ చేయకండి. ఎందుకంటే వడ్డీ స్వరూపాల్లో ఇది కూడా ఒకటి.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఈ ప్రవచనాన్ని బట్టి, వడ్డీ ఎంతో ఘోరమైన పాపమో మనం గ్రహించవచ్చు.

"వడ్డీ లో 70 పాపాలు (ఇమిడి) వున్నాయి. వాటిలో అన్నిటికన్నా తేలికైన పాపం - మనిషి తన తల్లిని వివాహమాడటంతో సమానం."

*(ఇబ్నెమాజ: 2274, సహీ - అల్‌బానీ)*

మరో ఉల్లేఖనంలో ఇలా వుంది:

"వడ్డీకి 72 ద్వారాలు వున్నాయి. వాటిలో అన్నిటికన్నా తేలికైక పాపం - మనిషి తన తల్లితో వ్యభిచరించిన దానితో సమానం."

*(తబ్రానీ, సహీఉల్ జామె లిల్ అల్‌బానీ:3537)*

అబ్దుల్లా బిన్ హంజల అర్రాహిబ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"వడ్డీ నిషేధం గురించి తెలిసి కూడా ఒక దిర్హమ్ వడ్డీ తినడం అల్లాహ్ దృష్టిలో – 36 సార్లు వ్యభిచరించడం కన్నా ఎక్కువ చెడ్డది.

*(అస్సహీహ: 1033)*

దైవ ప్రవక్త ( సల్లల్లాహు అలైహి వ సల్లం) తన కల గురించి వివరిస్తూ ఇలా సెలవిచ్చారు: ......జిబ్రయీల్ (అలైహిస్సలాం) ఇలా అన్నారు– ముందుకు పదండి. ఇలా మేము కాస్త ముందుకు వెళ్ళి ఒక రక్తపు కాలువ వద్దకు చేరుకున్నాం. ఒక వ్యక్తి దానిలోపల వుండగా, మరో వ్యక్తి దాని ఒడ్డున వున్నాడు. ఒడ్డుపై వున్న వ్యక్తి ముందు ఒక రాయి వుంది. లోపలున్న వ్యక్తి బయటికి రావాలని ప్రయత్నించినప్పుడు, ఒడ్డుపై వున్న వ్యక్తి రాయి తీసుకొని అతని ముఖంపై కొట్టి, అతన్ని అతని స్థానంలోకి పంపించేవాడు. ఇలా ప్రతిసారీ జరుగుతూ వుంది.

నేను (దైవ ప్రవక్త): ఏమిటది? అని అడిగాను.

ఆయన (జిబ్రయీల్): ముందుకు పదండి అని అన్నారు.

మేము ముందుకు నడిచాము.. తదుపరి జిబ్రయీల్(అలైహిస్సలాం) మాట్లాడుతూ...... మీరు రక్తపు కాలువలో చూసిన వ్యక్తి వడ్డీ తినే వ్యక్తి....... అని వివరించారు. *(బుఖారీ)*

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) – వడ్డీ తినేవారిని, వడ్డీ తినిపించే వారిని, దానిని వ్రాసేవారిని, దాని సాక్ష్యులను శపించారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: "వీరంతా పాపంలో సమానులే." *(ముస్లిం:1598)*

ఇస్లామీయ సోదరులారా!

వడ్డీ వలన సంపదలో వృద్ధి జరుగుతుందని ప్రజలు భావిస్తారు. కానీ, అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَآ اٰتَيْتُمْ مِّنْ رِّبًا لِّيَرْبُوَا۟ فِىٓ اَمْوَالِ النَّاسِ فَلَا يَرْبُوْا عِنْدَ اللّٰهِ ۚ وَمَآ اٰتَيْتُمْ مِّنْ زَكٰوةٍ تُرِيْدُوْنَ
وَجْهَ اللّٰهِ فَاُولٰٓئِكَ هُمُ الْمُضْعِفُوْنَ ۝

**"ప్రజల సొమ్ములో చేరి వృద్ధి చెందుతుందన్న ఉద్దేశంతో మీరు ఇచ్చే వడ్డీ అల్లాహ్ దృషిలో ఎంత మాత్రం వృద్ధి చెందదు. అయితే అల్లాహ్ ముఖాన్ని చూసేందుకు (ప్రసన్నతను చూర గొనేందుకు) మీరు జకాతు దానం ఇచ్చినట్లయితే–అలాంటి వారే (తమ సంపదలను) ఎన్నో రెట్లు వృద్ధి పరచుకున్న వారవుతారు."** ***(రూమ్: 39)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

يَمْحَقُ اللّٰهُ الرِّبٰوا وَيُرْبِى الصَّدَقٰتِ ؕ

**"అల్లాహ్ వడ్డీని హరింపజేస్తాడు, దాన ధర్మాలను పెంచుతాడు."**

***(బఖర: 276)***

ఈ రెండు ఆయతుల ద్వారా తెలిసిందేమిటంటే–వడ్డీ వలన సంపదలో వృద్ధి జరగదు, తగ్గుదల వస్తుంది. దాన ధర్మాల మూలంగా సంపదలో వృద్ధి కలుగుతుంది!

ఇక ఎవరైతే వడ్డీ లావాదేవీలు చేస్తూ తమ డబ్బును అధికం చేసే ప్రయత్నం లో వుంటారో, వారు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యొక్క ఈ ప్రవచనాన్ని దృష్టిలో వుంచుకోవాలి.

"ఎవరైనా వడ్డీని ఎంతగా తీసుకున్నప్పటికీ, దాని అంతిమ ఫలితం మాత్రం తగ్గుదల మరియు నష్టమే." *(ఇబ్నెమాజ: 2279, సహీ – అల్‌బానీ)*

## 6) ఆచరణలో ఆదర్శం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)–అజ్ఞాన కాలపు హత్యల ప్రతీ కారాన్ని క్షమించినప్పుడు అందరి కన్నా ముందుగా తన కుటుంబంలోని హత్య లను క్షమించి ఆదర్శంగా నిలిచారు. అలాగే, అజ్ఞాన కాలపు వడ్డీని చెడుగా ఖరారు చేసినప్పుడు, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అందరి కన్నా ముందుగా తన కుటుంబం లోని అబ్బాస్ బిన్ ముత్తలిబ్ (రజి అల్లాహు అన్హు) వడ్డీని సమాప్తం చేశారు.

దీని ద్వారా నిరూపించడబడిందేమిటంటే – సందేశ ప్రచారకులందరూ తమ సందేశాలపై ముందుగా తాము స్వయంగా ఆచరించి ప్రజల ముందు ఆదర్శాన్ని నెలకొల్పాలి. ఇది, అతని సందేశ ప్రచారంలో ఎంతగానో ప్రభావం చూపుతుంది. తద్వారా ఇతరులు కూడా త్వరగా అతని సందేశాన్ని స్వీకరించ

గలుగుతారు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

أَتَأْمُرُونَ النَّاسَ بِالْبِرِّ وَتَنسَوْنَ أَنفُسَكُمْ وَأَنتُمْ تَتْلُونَ الْكِتَابَ ۚ أَفَلَا تَعْقِلُونَ ۝

**"ప్రజలకైతే మీరు మంచిని గురించి ఆదేశిస్తారు, కాని మీ స్వయాన్ని మరచిపోతారే?! చూడబోతే మీరు గ్రంథ పారాయణం చేస్తారాయె. మరి ఆ మాత్రం ఇంగిత జ్ఞానం కూడా మీకు లేదా?"** ***(బఖర: 44)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا لِمَ تَقُولُونَ مَا لَا تَفْعَلُونَ ۝ كَبُرَ مَقْتًا عِندَ اللَّهِ أَن تَقُولُوا مَا لَا تَفْعَلُونَ ۝

**"ఓ విశ్వాసులారా! మీరు చేయ(లే)ని దాన్ని గురించి ఎందుకు చెబుతారు? మీరు చేయని దాన్ని గురించి చెప్పటం అల్లాహ్ సమక్షంలో ఎంతో సహించరానిది."** ***(సఫ్: 2-3)***

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నేను మేరాజ్ రాత్రి - కొందరి నాలుకలను, పెదవులను అగ్ని కత్తెరలతో కోయబడడం చూసి, ఓ జిబ్రయీల్ ! ఎవరు వీళ్ళు? అని అడిగాను.

ఆయన: మీ అనుచర సమాజంలోని ఉపన్యాసకులు, వీళ్ళు ప్రజలకైతే మంచిని గూర్చి బోధించేవారు, కానీ స్వయాన్ని మరిచిపోయేవారు. వాస్తవానికి వాళ్ళు అల్లాహ్ గ్రంథాన్ని పారాయణం కూడా చేస్తారు. మరి వీరికి బుద్ధి లేదా? అని అన్నారు. *(అహ్మద్: 3వ సంపుటం, 120, 180 పేజీలు - హసన్)*

## 7) స్త్రీల విషయంలో అల్లాహ్ కు భయపడుతూ వుండమని ఆదేశం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన చారిత్రక 'హజ్జతుల్ విదా' ఖుత్బా యందు స్త్రీల హక్కుల గురించి ప్రత్యేకంగా తాకీదు చేసి, వారి విషయంలో అల్లాహ్‌కు భయపడుతూ వుండమని ఆదేశించారు.

దీని ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే - ఈ రోజుల్లో చెడుగా ప్రస్తావించబడే విధంగా, ఇస్లాం- స్త్రీల ప్రాథమిక హక్కులను కాలరాయదు.

వాస్తవం ఏమిటంటే - స్త్రీల సంరక్షణకు గాను నియమాలు నెలకొల్పి ఇస్లాం ఎలాగైతే, వారి హక్కులు వారికిచ్చిందో, అలా ఏ ధర్మం కూడా వారికి ఇవ్వలేదు.

ఒకవేళ అజ్ఞాన కాలపు స్త్రీ మరియు ఇస్లామీయ స్త్రీ ని గనక పోల్చి చూస్తే, ఈ వాస్తవం ఇంకా తేట తెల్లమవుతుంది. మనం ఎంతో దూరం కూడా వెళ్ళాల్సిన పని లేదు. నేడు స్త్రీల హక్కుల గురించి మాట్లాడుతూ, ఇస్లాం గురించి చెడుగా ప్రచారం చేసే దేశాలలోని స్త్రీల పరిస్థితులు కాస్త చూడండి! స్త్రీలకు వాళ్ళెంత గౌరవ మర్యాదలిస్తున్నారో ఇట్టే తెలిసిపోతుంది! (వారి దృష్టిలో) స్త్రీ విలువ దారిలో పడివున్న వస్తువు కన్నా ఎక్కువేం కాదు. ఏ వ్యక్తి అయినా, తను ఎప్పుడు కోరుకుంటే అప్పుడు ఆమెను తన మాయాజాలంలో ఇరికిస్తాడు. మరి, ముస్లిం సమాజంలో నివసిస్తూ, పరదా పాటించే స్త్రీ జీవితాన్ని గనక ముందుంచితే, ఇద్దరి మధ్య తేడాను స్పష్టంగా గ్రహించగలం. ఆ స్త్రీ జీవితం అవమానాలతో నిండుకొనివుంటే, ముస్లిం సమాజ స్త్రీ జీవితం మాత్రం గౌరవ మర్యాదలతో నిండుకొని వుంది!

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎన్నో హదీసులలో స్త్రీల హక్కులను గురించి తాకీదు చేశారు.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"మీరు స్త్రీలతో మంచిగా మెలగమని నేనిచ్చే వసీయతును స్వీకరించండి. ఎందుకంటే, స్త్రీ ప్రక్కటెముకతో సృష్టించబడింది. ప్రక్కటెముకలో పై భాగం ఎక్కువ వంకరగా వుంటుంది. ఒకవేళ మీరు దానిని తిన్నగా చేయాలనుకుంటే, అది విరిగిపోతుంది. ఒకవేళ అలాగే వదిలేస్తే, దాని వంకరతనం కూడా అలాగే వుంటుంది. అందుకే మీరు స్త్రీలతో మంచిగా మెలగండి."

*(బుఖారీ: 5185, 5186, ముస్లిం: 1468)*

## 8) భార్యభర్తల కొన్ని హక్కులు:

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) స్త్రీల ప్రాథమిక హక్కులను గూర్చి తాకీదు చేశాక, భార్యభర్తల కొన్ని హక్కులను ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ ఇలా సెలవిచ్చారు:

మీకు వారిపై ఉన్న హక్కు ఏమిటంటే – మీరు ఇష్టపడని వ్యక్తులను వారు మీ పడకలపై రానీయకూడదు. ఒకవేళ వారలా చేయకపోతే, వారిని మెల్లగా మీరు కొట్టవచ్చు. ఇక, వారికి మీపై ఉన్న హక్కు ఏమిటంటే – మీరు న్యాయోచితంగా వారికి భోజన వస్త్రాలు సమకూర్చాలి.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) వివరించిన హక్కులలో, భర్తకు భార్యపై కల ఒక హక్కు ఏమిటంటే – భర్త అనుమతి లేకుండా ఏ వ్యక్తినీ ఇంట్లో ప్రవేశింప నీయకూడదు. అలాగే, భర్త ఇష్టపడని వ్యక్తిని అతని పడకపై రానీయకూడదు.

మరో హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఆమె (భార్య) తన భర్త అనుమతి లేకుండా, అతని ఇంట్లో ఎవరినీ అనుమతించ కూడదు." తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) – ఆమె (భార్య) గనక ఇలా చేయకపోతే, భర్త ఆమెకు దెబ్బ తగలకుండా, ఎముకలు విరక్కుండా మెల్లగా కొట్టవచ్చని సెలవిచ్చారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"మీలో ఏ వ్యక్తి అయినా బానిసను కొట్టినట్లు, తన భార్యను కొట్టవద్దు. తదుపరి సాయంకాలానాకి ఆమెతో సంభోగం కూడా చేస్తారు మరి."

*(బుఖారీ: 5204, ముస్లిం: 2855)*

ఆ తర్వాత, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) భర్తపై భార్యకు గల హక్కులను వివరిస్తూ – న్యాయోచితంగా తన స్థోమతను బట్టి భర్త ఆమెకు భోజన వస్త్రాలను సమకూర్చాలని ఆదేశించారు.

ముఆవియ అల్ ఖషీరీ (రజి అల్లాహు అన్హు) కథనం:

నేను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను– భార్యకు భర్తపై గల హక్కు ఏమిటి? అని అడిగాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ– ఆమె హక్కు ఏమిటంటే – నువ్వు తినేది ఆమెకు కూడా తినిపించు, నువ్వు తొడిగేది ఆమెకు కూడా తొడిగించు. ముఖంపై కొట్టకు మరియు దుర్భాషలాడకు. ఒకవేళ, (ఎప్పుడైనా) ఆమెను వదలాల్సి వస్తే, ఇంట్లోనే వదులు."

*(అహ్మద్:4వ సంపుటం, 447 పేజి, అబూదావూద్: 2142, ఇబ్నెమాజ:185, సహీ అత్తర్గీబ్ వ తరహీబ్ లిల్ అల్బానీ:1929)*

## 9) అల్లాహ్ గ్రంథాన్ని గట్టిగా పట్టుకోమని ఆదేశం

అరాఫాత్ లోని హజ్జతుల్ విదా ఖుత్బా యందలి మరొక ప్రముఖ విషయం ఏమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచర సమాజానికి – అల్లాహ్ గ్రంథాన్ని గట్టిగా పట్టుకోమని, తద్వారా మార్గభ్రష్టులు కాలేరని, ఉపదేశించారు.

అందుకే మనమంతా తప్పనిసరిగా ఖుర్ఆన్ నేర్చుకోవాలి. దానిపై ఆలోచన చేస్తూ దాని ప్రకారం ఆచరించాలి.

కానీ, దురదృష్ట వశాత్తూ, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇంత గట్టిగా తాకీదు చేసినప్పటికీ, ఆయన అనుచర సమాజం (ఉమ్మత్) ఖుర్ఆన్ నుండి దూరమయ్యింది. ఖుర్ఆన్ నేడు అల్మారా(బీరువా)ల అలంకరణగా అయి వుండి పోయింది. ఎంతో మందికి అసలు ఖుర్ఆన్ చదవడమే రాదు. ఇక ఎవరైతే చదువుతారో, వారు మొత్తం ఖుర్ఆన్ అటుంచి, ఫాతిహా సూరా అర్థం కూడా వివరించ లేరు.

(నేడు) ఖుర్ఆన్ కంఠస్తులైతే మాషా అల్లాహ్ చాలా మంది వున్నారు. కాని, దానిపై ఆచరిస్తూ దానిని తమ జీవన శైలిగా మార్చుకున్న వారు చాలా తక్కువగా వున్నారు.

ప్రియ సోదరులారా!

దివ్య ఖుర్ఆన్, అల్లాహ్ గ్రంథాలలో అన్నింటికన్నా శ్రేష్టమైనది. వక్తృత్వం మరియు సాహిత్య పరంగా ఈ గ్రంథం ఏ మాత్రం పోలిక లేనిది. అందుకే ఈ గ్రంథం – వాక్చాతుర్యులను, సాహితీవేత్తలను, అందరూ కలిసి – కనీసం దీనిలాంటి ఒక్క సూరా నైనా (రచించి) తీసుకు రమ్మని ఛాలెంజ్ చేస్తుంది. అంతేగాక, జిన్నాతులు , మానవులు – అందరూ ఏకమైనా ఇలాంటి ఖుర్ఆన్ ను తీసుకు రాలేరని బాహాటంగా ప్రకటిస్తుంది.

దీని గురించి అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قُلْ لَّئِنِ اجْتَمَعَتِ الْإِنْسُ وَالْجِنُّ عَلَىٰٓ اَنْ يَّاْتُوْا بِمِثْلِ هٰذَا الْقُرْاٰنِ لَا يَاْتُوْنَ بِمِثْلِهٖ وَلَوْ كَانَ بَعْضُهُمْ لِبَعْضٍ ظَهِيْرًا ○

**"వారికి చెప్పు: ఒకవేళ సమస్త మానవులు, యావత్తు జిన్నాతులు**

**అందరూ కలిసి ఈ ఖుర్‌ఆన్ లాంటి గ్రంథాన్ని తేదలచినా - వారు ఒకరి కొకరు తోడ్పాటును అందజేసుకున్నా ఇటువంటి దానిని తీసుకు రావటం వారివల్ల కాని పని.”** ***(బనీ ఇస్రాయీల్ : 88)***

ఇక, ఆలోచించాల్సిన విషయం ఏమిటంటే – ఇంతటి మహోన్నతమైన గ్రంథాన్ని అల్లాహ్ ఎందుకు అవతరింపజేశాడు? ఈ ప్రశ్నకు సమాధానం స్వయంగా అల్లాహ్ యే తన గ్రంథంలో ఇలా తెలియజేశాడు:

كِتَٰبٌ أَنزَلْنَٰهُ إِلَيْكَ مُبَٰرَكٌ لِّيَدَّبَّرُوٓا۟ ءَايَٰتِهِۦ وَلِيَتَذَكَّرَ أُو۟لُوا۟ ٱلْأَلْبَٰبِ ۝

**“ఇదొక శుభ ప్రదమైన గ్రంథం. ప్రజలు దీని వాక్యాలపై చింతన చేసేటందుకు, బుద్ధిజీవులు దీని ద్వారా గుణపాఠం నేర్చుకునేందుకు మేము దీనిని నీ వైపుకు పంపాము.”** ***(సాద్: 29)***

అందుకే, మనపై విధిగా వున్న విషయమేమిటంటే – స్వయంగా మనం కూడా దీనిని నేర్చుకోవాలి మరియు మన పిల్లలకు కూడా దీనిని నేర్పించాలి. స్వయంగా దీనిపై ఆలోచన చేయడంతో పాటు మన పిల్లలను కూడా ఖుర్‌ఆన్ కంఠస్థం చేయించడంతోపాటు, దాని అర్థం, విశ్లేషణలను కూడా నేర్పించాలి. తద్వారా వారు కూడా గుణపాఠం నేర్చుకుంటారు. ఎందుకంటే, ఖుర్‌ఆన్ అర్థాన్ని, విశ్లేషణను తెలుసుకోకుండా దాని ద్వారా గుణపాఠం నేర్చుకోవడం అసంభవం.

ఖుర్‌ఆన్ ఇహపర లోకాల మేళ్ళ వైపునకు మనిషికి మార్గదర్శకత్వం వహిస్తుంది. అతనికి స్వర్గానికి తీసుకెళ్ళే బలమైన మార్గాన్ని చూపుతుంది.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: “నిశ్చయంగా ఈ ఖుర్‌ఆన్ అన్నిటికంటే సవ్యమైన మార్గాన్ని చూపిస్తుంది. మంచి పనులు చేసే విశ్వాసులకు గొప్ప పుణ్యఫలముందన్న శుభవార్తను అది వినిపిస్తుంది.”

గుర్తుంచుకోవాల్సిన మరో విషయమేమిటంటే – అల్లాహ్ గ్రంథం (ఖుర్‌ఆన్) లో ఇతర ఆదేశాలతో పాటు వున్న మరొక ఆదేశమేమిటంటే – అల్లాహ్‌కు విధేయత చూపడంతోపాటు ఆయన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు కూడా విధేయత చూపాలి. ఆయన ఆజ్ఞాపించిన దానిని ఆచరించాలి మరియు ఆయన వారించిన దాని నుండి దూరంగా వుండాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**يَآيُّهَا الَّذِيْنَ اٰمَنُوْٓا اَطِيْعُوا اللّٰهَ وَ اَطِيْعُوا الرَّسُوْلَ وَلَا تُبْطِلُوْٓا اَعْمَالَكُمْ ۝**

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి, ప్రవక్త చెప్పినట్లు వినండి. మీ కర్మలను పాడు చేసుకోకండి." *(ముహమ్మద్ : 33)***

ఈ ఆయతు మరియు ఇతర ఎన్నో ఆయతుల ద్వారా తెలిసేదేమిటంటే– అల్లాహ్ గ్రంథాన్ని (ఖుర్ఆన్‌ను) గట్టిగా పట్టుకొని, దానిని మన జీవన శైలిగా మార్చుకోవడం ఎలాగైతే మనపై విధిగా వుందో, అలాగే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నతుల ప్రకారం ఆచరించడం కూడా మనపై విధి (ఫర్జ్)గా వుంది.

అందుకే, అల్లాహ్– దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జీవితాన్ని ఆదర్శవంతమైనదిగా ఖరారు చేశాడు.

అందుకే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్జతుల్ విదా సందర్భంలో ఇలా సెలవిచ్చారు:

"ప్రజలారా! నా మాటలను బాగా అర్థం చేసుకోండి. నిస్సందేహంగా నేను అల్లాహ్ ధర్మాన్ని మీకు చేరవేశాను. నేను మీ మధ్య ఎలాంటి వస్తువును విడిచి వెళుతున్నానంటే, దానిని గనక మీరు గట్టిగా పట్టుకుంటే ఎప్పుడూ మార్గభ్రష్టులు కాలేరు. అదేమింటే – అల్లాహ్ గ్రంథం మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్." *(అస్సున్నహ్ లిల్ మర్వజి : 68)*

దీనిద్వారా తెలిసిందేమిటంటే – అల్లాహ్ గ్రంథం మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ – ఈ రెండూ సన్మార్గ చెలమలు. ఈ రెండింటినీ గట్టిగా పట్టుకోవడం ద్వారానే మార్గభ్రష్టత నుండి తప్పించుకోగలం.

10) దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచర సమాజానికి ధర్మాన్ని సంపూర్ణంగా చేరవేయడం

అరాఫాత్‌లో హజ్జతుల్ విదా ఖుత్బా యందు ఉపన్యసిస్తూ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆఖరిలో ప్రజలతో ఇలా అడిగారు: ప్రజలారా! నా గురించి మీకు అడగబడినప్పుడు ఏమని సమాధానం ఇస్తారు? దీనిపై, ప్రజలంతా ముక్త కంఠంతో– మీరు మాకు అల్లాహ్ ధర్మాన్ని చేరవేశారు.

అల్లాహ్ అమానతును నెరవేర్చారు మరియు మా శ్రేయస్సు కోసం ఏ ప్రయత్నమూ వదల్లేదు అని పలికారు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లాహ్‌ను కూడా మూడు సార్లు సాక్షిగా నిలిపారు.

దీని ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) అల్లాహ్ ధర్మాన్ని సంపూర్ణంగా, అమానతు లాగా తన అనుచర సమాజానికి చేరవేశారు.

తన అనుచర సమాజపు శ్రేయస్సు ఇమిడి వున్న ప్రతి అంశం వైపునకు ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మార్గం చూపారు.

"అల్లాహ్ కు దగ్గరగా చేర్చే, నరకం నుండి దూరం చేసే ప్రతి విషయం గురించి నేను మీకు ఆజ్ఞాపించి వున్నాను. అలాగే, నరకం దగ్గరకు చేర్చే, అల్లాహ్ నుండి దూరం చేసే ప్రతి విషయం గురించి నేను మీకు వారించి వున్నాను." *(హజ్జతున్నబీ లిల్ అల్‌బానీ : 103 పేజి)*

ఈ హదీసు ద్వారా తెలిసిందేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తన అనుచర సమాజానికి, సత్కార్యాలకు సంబంధించిన ఏ విషయమూ ఆజ్ఞాపించకుండా వుండలేదు. అలాగే, దుష్కార్యాలకు సంబంధించిన ఏ విషయమూ ఆయన వారించకుండా వుండలేదు. ఈ వాస్తవాన్ని తెలుసు కున్నాక, **"ధర్మంలో ఏ విధమైన హెచ్చుతగ్గులకు ఏ మాత్రం ఆస్కారం లేదు"** అన్న నిర్ణయానికి మనం తేలికగా రావచ్చు.

కొత్త విషయాలు సృష్టించి ధర్మంలో కలపడం ద్వారా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (అల్లాహ్ శరణు) ధర్మాన్ని, ప్రజలకు చేరవేయలేదు, మంచికి సంబంధించిన కొన్ని కార్యాలు ఆయన ద్వారా మరియు మొదట ఆయనను విశ్వసించిన వారి ద్వారా, వదిలివేయబడ్డాయి – అన్న అర్థం వస్తుంది మరి !

ఇమామ్ మాలిక్ రహిమహుల్లాహ్ ఇలా వివరించారు:

"ఎవరైనా ఇస్లామ్‌లో ఏదైనా బిద్అత్‌ను సృష్టించి, తదుపరి దానిని ఒక మంచి కార్యంగా తలపోస్తే, అతను – ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) దైవదౌత్య బాధ్యత (ధర్మాన్ని చేరవేయడం)ను సరిగా నిర్వర్తించలేదు (అంటే ధర్మాన్ని సంపూర్ణంగా చేరవేయలేదు) అని భావించినట్లే!"

అల్లాహ్ యొక్క ఈ ఆదేశం చదువుకోండి:

"ఈ రోజు మీ కొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను. ఇంకా, ఇస్లాంను మీ ధర్మంగా సమ్మతించి ఆమోదించాను..." *(మాఇద : 3)*

తదుపరి ఇమామ్ మాలిక్ రహిమహుల్లాహ్ ఇలా సెలవిచ్చారు:

"ఈ అనుచర సమాజపు మొదటి తరాల వారు ఏ విషయంతోనయితే సరిగా అయ్యారో (సన్మార్గం పొందారో) ఆ విషయంతోనే ఈ అనుచర సమాజపు ఆఖరి తరాల వారు కూడా సరిగా అవగలుగుతారు (సన్మార్గం పొంద గలుగుతారు).

ఆ సమయంలో ధర్మంలో భాగం కాని ఆచరణ ఏదైనా, ఈ రోజు కూడా ధర్మం కాలేదు. (అంటే ధర్మంలో అంతర్భాగం కాలేదు.)

ఈ వాస్తవాన్ని, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'హజ్జతుల్ విదా' సందర్భంలో అరాఫాత్ మైదానంలో ఇలా స్పష్టంగా వివరించారు:

అబ్దుల్లా బిన్ మస్ఊద్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అరాఫాత్‌లో తన ఒంటెపై కూర్చొని వున్నారు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"జాగ్రత్త! నేను చెరువు (కౌసర్) వద్ద మీకు స్వాగతం పలుకుతాను. మీ ద్వారా, ఇతర అనుచర సమాజాలపై నా అనుచర సమాజపు అధిక సంఖ్యను రుజువుచేస్తాను. అందుకే మీరు నన్ను అవమాన పరచవద్దు. జాగ్రత్త! నేను మనుషులను రక్షిస్తాను. కొంతమందిని నా నుండి దూరంగా వుంచడం జరుగుతుంది. నేను – నా ప్రభూ! వీళ్ళు నా అనుచర సమాజం వాళ్ళే అని వేడుకుంటాను. ఆయన – మీ తర్వాత వీళ్లు ధర్మంలో ఏమేం సృష్టించారో మీకు తెలియదు! అని జవాబిస్తాడు." *(ఇబ్నెమాజ : 3057, సహీ – అల్‌బానీ)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ విషయం ప్రాధాన్యతను నొక్కి చెప్పడానికే, ప్రతి శుక్రవారం ఖుత్బాలో ఇలా సెలవిస్తూ వుండేవారు:

"అల్లాహ్) స్తోత్రం తరువాత! నిస్సందేహంగా అన్నిటికన్నా ఉత్తమ గ్రంథం అల్లాహ్ గ్రంథం (ఖుర్ఆన్), అన్నిటికన్నా ఉత్తమ పద్ధతి ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం) పద్ధతి, అన్నిటికన్నా చెడ్డకార్యం– (ధర్మంలో క్రొత్తగా) సృష్టించబడిన కార్యం మరియు ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతే." *(ముస్లిం : 867)*

ఇంకా ఇలా సెలవిచ్చారు:

“మీరు నా సున్నతును గట్టిగా పట్టుకోండి, అలాగే సన్మార్గగాములైన ఖలీఫాల పద్ధతిని తప్పక పాటించండి. దీనిని వదలకుండా, ఎల్లప్పుడూ గట్టిగా పట్టుకోండి. మీరు ధర్మంలో క్రొత్త విషయాలు సృష్టించడం నుండి దూరంగా వుండండి. ఎందుకంటే ప్రతి క్రొత్త విషయం బిద్అత్ మరియు ప్రతి బిద్అత్ మార్గభ్రష్టతకు ఆనవాలు.” *(అబూదావూద్ : 4607, సహీ –అల్‌బానీ)*

ఆయెషా (రజి అల్లాహు అన్హా) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“ఎవరైనా మా ఈ ధర్మంలో లేని క్రొత్త విషయం గనక ప్రవేశపెడితే అది రద్దు గావించబడుతుంది.” *(బుఖారీ, ముస్లిం)*

ముస్లిం లోని మరో ఉల్లేఖనంలో పదాలు ఇలా వున్నాయి:

“ఏ వ్యక్తి అయినా మా ఈ ధర్మంలో లేని క్రొత్త విషయాన్ని గనక ఆచరిస్తే అది రద్దు గావించబడుతుంది.”

ప్రియ సోదరులారా!

హజ్జతుల్ విదా సందర్భంలో, అరాఫాత్‌లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇచ్చిన ఖుత్బా ఇది !

అల్లాహ్‌ను వేడుకొనేదేమిటంటే – ఆయన మనందరినీ సత్యాన్ని గ్రహించి, దాని కనుగుణంగా ఆచరించే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

## రెండవ ఖుత్బా

మొదటి ఖుత్బా లో మీరు, హజ్జతుల్ విదాను పురస్కరించుకొని, అరాఫాత్‌లో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇచ్చిన ఖుత్బా గురించి విన్నారు.

రండి! ఇక హజ్జతుల్ విదా సందర్భంలోనే, యౌమున్నహర్ (ఖుర్బానీ దినం) నాడు మినా లో ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇచ్చిన మరో ఖుత్బాను గూర్చి వినండి.

## యౌమున్నహర్ (ఖుర్బానీ దినం) ఖుత్బా

అబూ బక్ర్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“కాలం తిరుగుతూ మళ్ళీ భూమ్యాకాశాలు సృష్టించబడినప్పటి స్థితికి వచ్చేసింది. సంవత్సరంలో 12 నెలలు వున్నాయి. వాటిలో నాలుగు మాసాలు నిషిద్ధ మాసాలు. వరుసగా వచ్చే మూడు మాసాలు (జిల్ ఖాదా, జిల్ హిజ్జ, ముహర్రం) మరియు నాల్గవది జమాదిస్సానీ మరియు షాబాన్ మాసాల మధ్య వచ్చే ముజిర్ రజబ్ మాసం.

తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): ఇది ఏ నెల? అని అడిగారు.

మేము : అల్లాహ్‌కు మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు బాగా తెలుసు అని అన్నాం.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మౌనంగా వుండి పోయారు. దీనితో, మేము – బహుశా ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ నెలకు ఏదైనా క్రొత్త పేరు పెడతారేమోనని భావించాము.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): ఇది జిల్ హిజ్జ నెల కదూ! అని అన్నారు.

మేము : అవునండీ అని అన్నాం.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) : ఇది ఏ నగరం? అని అడిగారు.

మేము : అల్లాహ్‌కు, ఆయన ప్రవక్తకు బాగా తెలుసు అని అన్నాం.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మౌనంగా వుండిపోయారు. దీనితో మేము – బహుశా ఆయన ఈ నగరానికి ఏదైనా క్రొత్త పేరు పెడతారేమో అని భావించాము.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) : ఇది ‘అల్ బలద’ (మక్కా నగరం) కదూ! అని అన్నారు.

మేము : అవునండి అని అన్నాం.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) :ఇది ఏ దినం? అని అడిగారు.

మేము: అల్లాహ్‌కు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు బాగా తెలుసు అని అన్నాం.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మౌనంగా ఉండిపోయారు. దీనితో

మేము –బహుశా ఆయన ఈ దినానికి ఏదైనా క్రొత్త పేరు పెడతారేమో అని భావించాము.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) : ఇది 'యౌమున్నహర్' (ఖుర్బానీ దినం) కదూ! అని అన్నారు.

మేము : అవునండి అని అన్నాం.

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“నిస్సందేహంగా, మీ ఈ దినం, ఈ నెల మరియు ఈ నగరం ఎలాగైతే పవిత్రమై నిషేధించబడ్డాయో, అలాగే మీ రక్తం, సంపద మరియు గౌరవం కూడా నిషేధించబడ్డాయి. మీరు త్వరలో మీ ప్రభువును కలుసుకోబోతున్నారు. ఆయన మీ ఆచరణల గురించి మిమ్మల్ని ప్రశ్నిస్తాడు. జాగ్రత్త! నా తర్వాత మీరు మళ్ళీ తిరస్కారులై (మార్గభ్రష్టులై) పోయి ఒకరి మెడలు మరొకరు నరుక్కోకండి. జాగ్రత్త! ఇక్కడున్న వారు, ఇక్కడ లేని వారి వద్దకు ఈ విషయాలు చేరవేయండి. బహుశా అతను, విన్న వారి కన్నా ఎక్కువగా జ్ఞాపకముంచు కొనేవాడు కావచ్చు. తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు: జాగ్రత్త! నేను మీకు (అల్లాహ్ సందేశాన్ని) చేరవేసానా?

*(బుఖారీ : 4406, ముస్లిం : 1679)*

ఈ ఖుత్బాలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) అన్నిటికన్నా ముందుగా సంవత్సరపు 12 నెలలో 4 మాసాల నిషేధం గురించి వివరించారు. నిషేధ మాసాలకు సంబంధించిన ప్రత్యేక ఆదేశాలను గూర్చి మేము ముహర్రం మాసపు మొదటి ఖుత్బాలో సమగ్రంగా వివరించి వున్నాం. ఆ తర్వాత, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం), రక్తం, సంపద, గౌరవాల నిషేధం గురించి వివరించారు. ముస్లిం రక్తం మరియు సంపదల నిషేధం గురించి ఖుర్ఆన్ మరియు హదీసుల వెలుగులో ఈ రోజు ఖుత్బా ఆరంభంలోనే మేము వివరించి వున్నాం.

ఇక ముస్లిం గౌరవం విషయానికొస్తే మక్కా ముకర్రమ, జిల్ హిజ్జ మాసం, ఖుర్బానీ దినం ఎలాగైతే పవిత్రంగా చేయబడి నిషేధించబడ్డాయో, అది కూడా నిషేధించబడింది. అంటే, మక్కా ముకర్రమ పవిత్రతను ఎలా భంగపరచలేమో అలాగే ముస్లిం గౌరవాన్ని కూడా భంగపరచలేము. జిల్

హిజ్జ మాసం మరియు ఖుర్బానీ దినాల పవిత్రతను, నిషేధాలను ఎలాగైతే దృష్టిలో వుంచుకుంటామో, అలాగే ముస్లిం యొక్క గౌరవ మర్యాదలను కాపాడడం కూడా తప్పనిసరి.

ముస్లిం యొక్క గౌరవ మర్యాదల పవిత్రతను దృష్టిలో వుంచుకొనే, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తన ఇంటి వారి గౌరవ మర్యాదలను కాపాడుతూ మరణించే వ్యక్తిని, షహీద్‌గా ఖరారు చేశారు.

"తన ఇంటి వారిని రక్షిస్తూ ప్రాణాలు కోల్పోయే వ్యక్తి షహీద్ (అమరగతుడు)".

*(తిర్మిజి : 1421, అబూదావూద్ : 4772, నసాయి : 4094, సహీఉల్ జామె లిల్ అల్‌బానీ : 6445)*

దీని ద్వారా రూఢీ అయిన విషయం ఏమిటంటే – ముస్లిం గౌరవాన్ని భంగపరచి, అతన్ని ఇతరుల ముందు అవమాన పరచడం హరామ్ (నిషిద్ధం).

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఒక ముస్లిం, మరొక ముస్లింకు సోదరుడు. అతను అతడిపై దౌర్జన్యం చేయడు, అవమానపరచడు మరియు అతన్ని అల్పుడిగా భావించడు. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు సార్లు తన హృదయం వైపునకు చూపిస్తూ 'దైవభీతి(తఖ్వా) అనేది ఇక్కడుంది' అని అన్నారు".

తదుపరి, ఇలా సెలవిచ్చారు: ఒక మనిషి చెడ్డతనానికి (చెడ్డవాడని ఖరారు చేయడానికి) – అతను తన తోటి ముస్లింను అల్పునిగా భావించటం ఒక్కటే చాలు. ప్రతి ముస్లిం యొక్క రక్తం, సంపద మరియు గౌరవ మర్యాదలు వేరే ముస్లింపై హరామ్ గావించబడ్డాయి. *(ముస్లిం : 2564)*

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి 'ఖుర్బానీ దినం ఖుత్బా' కు సంబంధించిన మరికొన్ని ముఖ్య విషయాలను మేము ఇన్షా అల్లాహ్ రాబోయే ఖుత్బాలో వివరిస్తాం

నేటి ఖుత్బా ను మేము ఈ దుఆ తో ముగిస్తున్నాం.

అల్లాహ్ మనందరినీ, మరణించే వరకు రుజుమార్గంలో నడిచే సద్బుద్ధిని ప్రసాదించుగాక! ఆమీన్!

# హజ్జతుల్ విదా ఖుత్బా - (2)

## ఖుత్బా యందలి ముఖ్యాంశాలు

1) ఖుర్బానీ దినపు ఖుత్బా ముగింపు మరియు దాని ముఖ్యాంశాలు.

2) ఖుర్బానీ దినపు ఖుత్బా గురించిన వేర్వేరు ఉల్లేఖనాలు.

3) మినా లో మరో ఖుత్బా.

4) హజ్జతుల్ విదా ఖుత్బా మరియు మసీహ్ దజ్జాల్.

## మొదటి ఖుత్బా

ఇస్లామీయ సోదరులారా!

గత శుక్రవారం ఖుత్బాలో మేము – అరాఫాత్‌లో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇచ్చిన హజ్జతుల్ విదా ఖుత్బా గురించి సమగ్రంగా వివరించడం తోపాటు యౌమున్నహర్ (ఖుర్బానీ దినం) ఖుత్బా గురించి క్లుప్తంగా వివరించాం. దాని వివరణను రాబోయే ఖుత్బా లో వివరిస్తామని వాగ్దానం కూడా చేశాం. కనుక రండి, దాని వివరాలను వినండి!

## ఆచరణల గురించి ప్రశ్నించబడడం

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఖుర్బానీ దినం ఖుత్బా లో ఇలా సెలవిచ్చారు:

"మీరు త్వరలోనే మీ ప్రభువును కలుస్తారు, ఆయన మీ ఆచరణల గురించి మిమ్మల్ని ప్రశ్నిస్తాడు."

అందుకే మనపై తప్పనిసరిగా వున్న విషయమేమిటంటే, మనం మన విశ్వాసాలను సరిదిద్దుకోవడం తోపాటు ఆచరణల దిద్దుబాటుపై కూడా దృష్టి సారించాలి. కేవలం అల్లాహ్‌ను సంతృప్తిపరచే కార్యాలే చేయాలి. అల్లాహ్ ఇష్టపడని కార్యాలకు దూరంగా వుండాలి. అల్లాహ్‌ను సంతృప్తిపరచే కార్యాలేవంటే – అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వారించిన లేదా భయపెట్టిన కార్యాలు.

గుర్తుంచుకోవాల్సిన విషయమేమిటంటే – రెండు షరతులు నెరవేరనంత వరకు అల్లాహ్ వద్ద ఏ కార్యమూ స్వీకరించబడదు.

అందులో, మొదటి షరతు ఏమిటంటే–

ఆ కార్యం కేవలం అల్లాహ్ సంతృప్తి కొరకే చేసి వుండాలి. అందులో దైవేతరుల భాగస్వామ్యం ఉండకూడదు.

ఇక రెండవ షరతు ఏమిటంటే – ఆ కార్యం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ ప్రకారం చేయబడాలి.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**قُلْ إِنَّمَآ أَنَا بَشَرٌ مِّثْلُكُمْ يُوحَىٰٓ إِلَيَّ أَنَّمَآ إِلَٰهُكُمْ إِلَٰهٌ وَاحِدٌ ۖ فَمَن كَانَ يَرْجُوا لِقَآءَ رَبِّهِۦ فَلْيَعْمَلْ عَمَلًا صَالِحًا وَلَا يُشْرِكْ بِعِبَادَةِ رَبِّهِۦٓ أَحَدًۢا ﴿110﴾**

**"తన ప్రభువును కలుసుకోవాలన్న ఆకాంక్ష ఉన్నవాడు సత్కార్యాలు చేయాలి. తన ప్రభువు ఆరాధనలో వేరొకరికి భాగస్వామ్యం కల్పించ కూడదు." *(కహఫ్ : 110)***

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నిస్సందేహంగా అల్లాహ్ మీ ముఖాల వైపు, మీ సంపదల వైపు చూడడు. ఆయన మీ హృదయాలను మరియు మీ ఆచరణలను చూస్తాడు."

*(ముస్లిం : 2564)*

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా కూడా సెలవిచ్చారు:

ప్రతి సోమవారం, గురువారం ఆచరణలు (అల్లాహ్ ముందు) సమర్పించ బడతాయి. తనకు భాగస్వాములుగా ఎవరినీ కల్పించని (షిర్క్ చేయని) ప్రతి వ్యక్తిని అల్లాహ్ మన్నిస్తాడు. కేవలం తన సోదరుని పట్ల ఈర్ష్య, అసూయ కలిగి వుండే వ్యక్తి తప్ప.

ఇలా అనబడుతుంది: ఇద్దరి మధ్య రాజీ కుదిరే వరకు వారిని విడిచి పెట్టండి, ఇద్దరి మధ్య రాజీ కుదిరే వరకు వారిని విడిచిపెట్టండి.

*(ముస్లిం : 2565)*

ఈ రెండు హదీసుల ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – సరైన విశ్వాసాలతోపాటు ఆచరణల దిద్దుబాటు కూడా చాలా ముఖ్యమైనది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సున్నత్ వెలుగులో తమ ఆచరణలను సరిచేసుకుంటూ వుండాలి.

## ధర్మ ప్రచార ప్రాధాన్యత

అరాఫాత్ ఖుత్బాలో లేని, ఖుర్బానీ దినం ఖుత్బాలో ప్రస్తావించబడిన మూడవ ముఖ్యం విషయం– ఇక్కడ వున్నవారు, ఇక్కడలేని వారి వద్దకు అల్లాహ్ ధర్మాన్ని చేరవేయాలి.

దీని ద్వారా తెలిసేదేమిటంటే – ధర్మాన్ని ప్రచారం చేస్తూ, దానిని ఇతరుల వద్దకు చేర్చటం ఎంతో ముఖ్యమైన కార్యం.

ధర్మప్రచార కార్యాన్ని నిర్వర్తించేవాడు ఒక విషయం కారణంగా ఎంతో అదృష్టవంతుడై వుంటాడు. అదేమిటంటే – ప్రజలు అతని సందేశాన్ని విని ఆచరిస్తే, ఆచరించేవారికి ఎంత పుణ్యఫలం లభిస్తుందో అతనికూ్కడా అంతే పుణ్యఫలం లభిస్తుంది.

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా సన్మార్గం వైపునకు పిలిస్తే, దానిని అనుసరించే వారికి ఎంత పుణ్యం లభిస్తుందో అతనికూ్కడా అంతే పుణ్యం లభిస్తుంది. అనుసరించే వారి పుణ్యంలో ఏ విధమైన కొరత రాదు. అలాగే, ఏ వ్యక్తి అయినా చెడు కార్యం వైపునకు పిలిస్తే, దానిని పాటించేవారికి ఎంత పాపం లభిస్తుందో అతనికూ్కడా అంతే పాపం లభిస్తుంది. పాటించేవారి పాపంలో ఏ కొరతా రాదు. *(ముస్లిం : 2674)*

కానీ, సందేశ ప్రచార బాధ్యతలు చేపట్టినవారు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏమిటంటే – వాళ్ళు ఏ విషయం వైపునకు ప్రజలను ఆహ్వానిస్తున్నారో అది ఖుర్ఆన్ మరియు (ప్రామాణిక) హదీసుల ద్వారా నిరూపించబడి వుండాలి. దాని గురించి వారికి తగినంత జ్ఞానం వుండాలి.

ఎందుకంటే – సందేశ ప్రచార బాధ్యత కోసం 'జ్ఞానం' అనేది మొదటి షరతు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

قُلْ هَٰذِهِ سَبِيلِي أَدْعُو إِلَى اللَّهِ ۚ عَلَىٰ بَصِيرَةٍ أَنَا وَمَنِ اتَّبَعَنِي ۖ وَسُبْحَانَ اللَّهِ وَمَا أَنَا مِنَ الْمُشْرِكِينَ ﴿١٠٨﴾

**"(ఓ ప్రవక్తా!) నువ్వు వాళ్ళకు చెప్పేయి: నా మార్గం (ఇస్లాం ధర్మం) అయితే ఇదే. నేనూ, నా అనుయాయులు పూర్తి అవగాహనతో (జ్ఞానంతో), దృఢ నమ్మకంతో అల్లాహ్ వైపునకు పిలుస్తున్నాము. అల్లాహ్ పరమ పవిత్రుడు. నేను షిర్క్ చేసే వారిలోని వాణ్ణి కాను."**

***(యూసుఫ్ : 108)***

సందేశ ప్రచార బాధ్యతను నెరవేర్చేవారి మహత్యాన్ని గూర్చి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్జతుల్ విదా సందర్భంలో మినా లోని 'ఖీఫ్' ప్రదేశంలో నిలబడి ఇలా సెలవిచ్చారు:

"నా మాటను విని, దానిని ఇతరుల దాకా చేరవేసే వ్యక్తిని అల్లాహ్ తాజాగా (ఎల్లప్పుడూ సుఖసంతోషాలతో) ఉంచుగాక! ఎందుకంటే, కొన్నిసార్లు ఎంతో మంది, వినేవారి కన్నా, చేరవేయబడిన వారు బుద్ధిమంతులై వుంటారు. మూడు స్థితుల్లో విశ్వాసి హృదయంలో అసూయ ప్రవేశించలేదు– ఆచరణలను మనస్ఫూర్తిగా కేవలం అల్లాహ్ కొరకే ప్రత్యేకించుకోవాలి. ముస్లిం నాయకుల, పాలకుల శ్రేయస్సు కోరుకుంటూ, అన్ని పరిస్థితుల్లోనూ జమాత్ (సమూహం)తో కలిసి వుండాలి. ఎందుకంటే వారి సందేశం అందరినీ కవచంలా సంరక్షిస్తూ వుంటుంది. (ఎలాగైతే ఒక గోడ వారిని సంరక్షిస్తుందో అలాగే వారి సందేశం (ఇస్లాం సందేశం) కూడా వారిని సంరక్షిస్తూ, వారిని విభిన్న వర్గాలుగా విడిపోవడం నుండి కాపాడుతూ వుంటుంది.)

*(ఇబ్నెమాజ : 3056, సహీ –అల్‌బానీ)*

ఈ హదీసులో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)– ఆయన హదీసులను విని, తదుపరి వాటిని ఇతరుల దాకా చేరవేసే వారి గురించి, వారి సుఖ సంతోషాల కోసం ప్రత్యేకంగా ప్రార్థించారు.

దానితోపాటు, అదనంగా మరో మూడు విషయాల వైపునకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ప్రజల దృష్టిని మరలిస్తూ సెలవిచ్చిందేమిటంటే – ఈ మూడు విషయాలు ఈర్ష్య, అసూయలకు విరుద్ధంగా వుంటాయి. అంటే – ఈ మూడు విషయాలు గనక వుంటే, విశ్వాసి హృదయంలోకి ఈర్ష్య, అసూయ ప్రవేశించలేదు. ఆ మూడు విషయాలు ఏమిటంటే –

1) ఆచరణలను మనస్ఫూర్తిగా అల్లాహ్ కొరకే ప్రత్యేకించుకోవడం.

ఇంతకు ముందే మేము వివరించినట్లు, ప్రతి సత్కార్యం స్వీకారయోగ్యం కావడానికి మొదటి షరతు – ఆ కార్యం అల్లాహ్‌ను సంతృప్తిపరచడానికే చేయాలి. దైవేతరుల నెవ్వరినీ దానిలో భాగస్వాములుగా చేయకూడదు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَمَآ أُمِرُوٓا إِلَّا لِيَعْبُدُوا ٱللَّهَ مُخْلِصِينَ لَهُ ٱلدِّينَ حُنَفَآءَ وَيُقِيمُوا ٱلصَّلَوٰةَ
وَيُؤْتُوا ٱلزَّكَوٰةَ وَذَٰلِكَ دِينُ ٱلْقَيِّمَةِ ﴿5﴾

**"వారు అల్లాహ్‌నే ఆరాధించాలని, ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకించుకోవాలనీ, ఏకాగ్రచిత్తులై – నమాజును నెలకొల్పాలనీ, జకాత్ ఇస్తూ ఉండాలని మాత్రమే వారికి ఆదేశించబడిది. ఇదే స్థిరమైన, సవ్యమైన ధర్మం."** ***(బయ్యినహ్ : 5)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు :

تَنزِيلُ ٱلْكِتَٰبِ مِنَ ٱللَّهِ ٱلْعَزِيزِ ٱلْحَكِيمِ ۝ إِنَّآ أَنزَلْنَآ إِلَيْكَ ٱلْكِتَٰبَ بِٱلْحَقِّ فَٱعْبُدِ ٱللَّهَ
مُخْلِصًا لَّهُ ٱلدِّينَ ۝

**"మేము ఈ గ్రంథాన్ని సత్యబద్ధంగా నీ వైపునకు పంపాము. కాబట్టి నువ్వు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు – ధర్మాన్ని ఆయన కొరకే ప్రత్యేకిస్తూ. జాగ్రత్త! నిష్కల్మషమైన ఆరాధన మాత్రమే అల్లాహ్‌కు చెందుతుంది."** ***(జుమర్ : 2-3)***

అలాగే ఇలా సెలవిచ్చాడు :

قُلْ إِنَّ صَلَاتِي وَنُسُكِي وَمَحْيَايَ وَمَمَاتِي لِلَّهِ رَبِّ الْعَالَمِينَ ﴿١٦٢﴾ لَا شَرِيكَ لَهُ ۖ وَبِذَٰلِكَ أُمِرْتُ وَأَنَا أَوَّلُ الْمُسْلِمِينَ ﴿١٦٣﴾

**"ఈ విధంగా ప్రకటించు: నిస్సందేహంగా నా నమాజు, నా సకల ఆరాధనలు, నా జీవనం, నా మరణం – ఇవన్నీ సర్వలోకాల ప్రభువైన అల్లాహ్ కొరకే. ఆయనకు భాగస్వాములెవరూ లేరు. దీని గురించే నాకు ఆజ్ఞాపించబడింది. ఆజ్ఞాపాలన చేసేవారిలో నేను మొదటివాణ్ణి."**

**(అన్ఆమ్ : 162–163)**

ఈ ఆయతులన్నింటి ద్వారా తెలిసిందేమిటంటే – ప్రతి సత్కార్యాన్ని అల్లాహ్ కొరకే ప్రత్యేకించడం తప్పనిసరి. ఒకవేళ ఏ కార్యమైనా దైవేతరుల కోసం కానీ లేదా దైవేతరులను భాగస్వాములుగా చేర్చిగానీ చేస్తే లేదా దానిలో ప్రదర్శనా బుద్ధి లేదా ఇతరుల ద్వారా ప్రశంసలు పొందాలన్న సంకల్పం గనక కలిగి వుంటే ఆ కార్యం వల్ల ప్రయోజనమేమీ వుండదు. పైగా అది తలనొప్పిగా మారుతుంది.

2) రాజ్యపాలకుల శ్రేయస్సు కోరుకోవడం.

రాజ్యపాలకుల శ్రేయస్సు కోరుకుంటూ వారి శ్రేయోభిలాషులుగా ఉండడం అంటే – సత్యానికి అనుగుణంగా వున్న విషయాలలో వారికి విధేయత చూపాలి, వారికి సద్బుద్ధిని ప్రసాదించమని అల్లాహ్‌ను వేడుకోవాలి. రాజ్యానికి సంబంధించిన వ్యవహారాలలో వారికి మంచి సలహాలు ఇవ్వాలి. రాజ్యంలో న్యాయస్థాపనకు అవసరమైన విషయాలను పరిపూర్ణం చేయడానికి వారికి మార్గం చూపాలి.

సమాజంలో ఇస్లామీయ విషయాల వ్యాప్తికి మరియు చెడు కార్యాల సమాప్తి కోసం వారికి ఉత్తమ రీతిలో బోధించాలి. ఒకవేళ వారితో ఏదైనా తప్పు జరిగితే, వారి తప్పులను ప్రజల ముందు బహిర్గతం చేసి వారిని, వారికి వ్యతిరేకంగా ఉసిగొల్పకూడదు. పైగా ఒక శ్రేయోభిలాషిలా, రహస్యంగా వారి తప్పులను గూర్చి అప్రమత్తం చేయాలి.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“ధర్మం అంటే మంచిని (శ్రేయస్సును) కాంక్షించడమే.”

సహాబాలు : (మంచి) ఎవరి కోసం ఓ దైవప్రవక్తా? అని అడిగారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) : అల్లాహ్ కోసం, ఆయన గ్రంథం కోసం, ఆయన ప్రవక్త కోసం, సామాన్య ముస్లిముల కోసం, పరిపాలకుల కోసం అని వివరించారు. *(ముస్లిం : 55)*

3) ముస్లిముల జమాత్ (సమూహం)తో అన్ని పరిస్థితులలోనూ కలిసి ఉండడం.

ఒకవేళ ముస్లిములందరూ లేదా వారిలో అధికులు, ఒక ఖలీఫా (నాయకుడు) క్రింద జమ అయితే (గుమిగూడితే), ఆ జమాత్ (సమూహం)ను విడిచిపెట్టకూడదు. వారి నుండి దూరమై వారిలో మనస్పర్థలు సృష్టించకూడదు.

అబ్దుల్లా బిన్ అబ్బాస్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

“ఏ వ్యక్తి అయినా, తన రాజ్యపాలకుని యందు, తాను ఇష్టపడని విషయ మేదైనా చూస్తే దాని కోసం అతను సహనం వహించాలి. ఎందుకంటే ఏ వ్యక్తి అయినా జమాత్ నుండి జానెడంత దూరం జరిగి, తదుపరి అదే స్థితిలో గనక మరణిస్తే అతను అజ్ఞానపు చావు చచ్చినట్లే.” *(ముస్లిం : 1849)*

హుజైఫా బిన్ యమాన్ (రజి అల్లాహు అన్హు) కథనం: సాధారణంగా ప్రజలు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో మంచి విషయాల గురించి ప్రశ్నించేవారు.

నేనుమాత్రం – ఎప్పుడైనా చెడులో లిప్తమై పోతానేమో అని శంకించి – ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) తో చెడు విషయాల గురించి అడిగేవాణ్ణి.

నేను : ఓ దైవ ప్రవక్తా! మేము అజ్ఞాన కాలపు చెడులలో వున్నప్పుడు అల్లాహ్ మాకు ‘మంచి’ (ఇస్లాం) ద్వారా గౌరవించాడు. మరి ఈ ‘మంచి’ తర్వాత మళ్ళీ ‘చెడు’ వస్తుందా? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): అవును అని జవాబిచ్చారు

నేను : ఆ 'చెడు' తర్వాత మళ్ళీ 'మంచి' వస్తుందా అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): వస్తుంది, కానీ కొంత మార్గభ్రష్టతతో కలిసి అని అన్నారు.

నేను: ఆ మార్గభ్రష్టత (చెడు) గురించి చెప్పండి అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) : నా పద్ధతిని (సున్నత్) వదిలిపెట్టి ఇతరుల పద్ధతిని పాటించే వాళ్ళు వస్తారు. నా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోకుండా ఇతరుల మార్గంలో పయనిస్తారు.

వారి కొన్ని మాటలు నీకు మంచిగా తోస్తాయి. కొన్ని మాటలు మంచిగా అనిపించవు అని అన్నారు.

నేను : ఆ 'మంచి' తర్వాత మళ్ళీ 'చెడు' వస్తుందా? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): అవును. కొందరు సందేశ ప్రచారకులు వస్తారు. వారు నరకపు ద్వారాల వద్ద నిలబడి వుంటారు. వారి సందేశాన్ని స్వీకరించిన వాడిని వారు నరకంలో పడేస్తారు అని వివరించారు.

నేను : వారి గుణగణాలను వివరించండి అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): వాళ్ళు మాలోని వారై వుంటారు. మా భాషలోనే మాట్లాడుతారు.

నేను: ఓ దైవప్రవక్తా! నేనొకవేళ వారి కాలాన్ని పొందితే, మీరు నాకు ఏమని సలహా ఇస్తారు? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) : నువ్వు అన్ని పరిస్థితులలోనూ ముస్లిముల జమాఅత్‌ను, దాని పాలకుడిని పట్టుకొని వుండు అని వివరించారు.

నేను : ఒకవేళ ముస్లిముల జమాఅత్ మరియు దాని పాలకుడు గనక లేకపోతే? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) : అలాంటి స్థితిలో నువ్వు అన్ని వర్గాలను వదిలిపెట్టు. దీని కోసం చెట్టు వ్రేళ్ళను నమలాల్సి వచ్చినా సరే, ఈ

స్థితిలో నీకు మరణం వచ్చినా సరే అని హితబోధ చేశారు.

*(బుఖారీ : 3606, ముస్లిం : 1847)*

అర్ఫజ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"మీరంతా ఒక పరిపాలకుడిని మీ పాలకుడిగా స్వీకరించి వున్న సమయంలో ఎవరైనా మీ వద్దకు వచ్చి, మీ మధ్య బేధాభిప్రాయాలు సృష్టించి, మీ జమాఅత్ (సమూహాన్ని)ను ముక్కలు ముక్కలుగా చేయాలని ప్రయత్నిస్తే అతణ్ణి చంపేయండి." *(ముస్లిం : 1852)*

సారాంశమేమిటంటే – ఇంతవరకూ వివరించబడ్డ మూడు విషయాలు (ఆచరణలు అల్లాహ్ కొరకే ప్రత్యేకించడం, రాజ్యపాలకుల శ్రేయస్సును కాంక్షించడం, ముస్లిముల జమాఅత్ తో కలిసి వుండడం) ఎలాంటివంటే – వీటిని పాటించడం ద్వారా విశ్వాసి హృదయం ముస్లిముల పట్ల ఈర్ష్య, అసూయ చెందకుండా పరిశుద్ధంగా వుంటుంది.

## యౌమున్నహర్ (ఖుర్బానీ దినం) ఖుత్బా.... మరొక ఉల్లేఖనం

సునన్ ఇబ్నెమాజ లోని ప్రామాణిక ఉల్లేఖనం ద్వారా ఖుర్బానీ దినం ఖుత్బా గురించి గత ఉల్లేఖనాలలో ప్రస్తావించబడని కొన్ని పదాలు ఉల్లేఖించబడ్డాయి. అవి ఇలా వున్నాయి :

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముస్లిముల రక్తం, సంపద, గౌరవ మర్యాదల నిషేధం గురించి వివరించాక ఇలా సెలవిచ్చారు:

జాగ్రత్త! ప్రతి నేరస్తుడు తన నేరానికి బాధ్యుడు. ఏ తండ్రీ తన సంతానంపై మరియు ఏ సంతానమూ తమ తండ్రిపై దౌర్జన్యం చేయకూడదు. జాగ్రత్త! షైతాను – ఈ నగరంలో వాడిని పూజించడం జరుగుతుంది – అన్న విషయం పట్ల నిరుత్సాహపడిపోయాడు. కానీ, ప్రజలు కొన్ని ఆచరణలను తేలిగ్గా తీసుకుని, వాడిని అనుసరిస్తూ ఉంటారు. వాడు, దానితోనే సంతోషపడతాడు...."

ఈ హదీసులో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడు విషయాలను సూచించారు:

1) ప్రతి వ్యక్తీ, తన నేరానికి తానే బాధ్యుడు. అందుకే దాని ప్రతీకారం ఇతరులతో కాకుండా అతనితోనే తీసుకోబడుతుంది. అల్లాహ్ యొక్క ఈ ఆయత్‌లో కూడా ఇదే అర్థం వివరించబడింది.

وَلَا تَزِرُ وَازِرَةٌ وِّزْرَ أُخْرَىٰ

**"బరువు మోసే వాడెవడూ ఇంకొకరి బరువును తనపై వేసుకోడు".**
***(బనీ ఇస్రాయీల్ : 15)***

ఇంకా, అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

كُلُّ نَفْسٍ بِمَا كَسَبَتْ رَهِينَةٌ

**"ప్రతి వ్యక్తీ తాను చేసుకున్న దానికి (తాను చేసిన కర్మలకు) ప్రతిగా తాకట్టుగా ఉన్నాడు."** ***(ముద్దస్సిర్ : 38)***

అరబ్బులలో ఒక ఆనవాయితి ఉండేది. ఒక వ్యక్తి నేరం చేసినప్పుడు, అతని దగ్గరి బంధువులలో ఎవరినైనా పట్టుకొనేవారు. ఇది స్పష్టమైన దౌర్జన్యం. అందుకే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్జతుల్ విదా ఖుత్బా యందు దీనిని వారిస్తూ – నేరము, శిక్షల గురించి ఒక ముఖ్యమైన విషయాన్ని వివరించారు. అదేమిటంటే – చేసినవాడు అనుభవించక తప్పదు. అంతేగాని, చేసినవాడు ఒకడైతే అనుభవించేవాడు మరొకడు కాకూడదు.

2) తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం), ఒకరిపై నొకరు దౌర్జన్యానికి పాల్పడవద్దని ప్రత్యేకించి తండ్రి మరి మరియు సంతానం – ఇద్దరికీ వారించారు.

ఒక వ్యక్తి మరో వ్యక్తిపై దౌర్జన్యం చేయడం పూర్తిగా నిషేధించబడింది.

కానీ, తండ్రి, సంతానం మధ్య ప్రగాఢ సంబంధం వుండి, ఒండొకరి విధులను హక్కులను నెరవేర్చాల్సి వుంటుంది. కాబట్టి ప్రత్యేకించి వారిని దీని నుండి (దౌర్జన్యం చేయడం) వారించడం జరిగింది.

3) ఈ ఉల్లేఖనంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వివరించిన

https://teluguislam.net

మూడవ ముఖ్య విషయం, ఒకదాని గురించి హెచ్చరించడం. అదేమిటంటే –

ప్రజలు గుంపులు గుంపులుగా ఇస్లాంను స్వీకరిస్తున్నారు. నిన్నటి వరకు ఇస్లాంకు శత్రువులుగా వున్న తెగలు ఈ రోజు ఇస్లాంను స్వీకరించాయి. అందుకే షైతాను – ఇక అరేబియా ద్వీపకల్పంలో తన పూజ, అంటే తిరస్కార కార్యాలలో అతని అనుసరణ జరుగదు అని నిరుత్సాహపడిపోయాడు. కానీ, సామాన్య ప్రజలు తేలిగ్గా తీసుకొనే విషయాలు ఉదాహరణకు – అసత్యం, నమ్మకద్రోహం, చాడీలు చెప్పడం, పరోక్షనింద, మోసం వగైరాలు... వీటిలో వాడిని (షైతాన్‌ను) అనుసరించడం జరుగుతుంది. దానితోనే వాడు సంతోషపడతాడు.

## యౌమున్నహర్ (ఖుర్బానీ దినం) – మరో ఖుత్బా

అబూ ఉమామ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్జతుల్ విదా సందర్భంలో తన ఒంటె (అల్‌జుదా) మీద కూర్చొని, ఖుర్బానీ దినం నాడు మినా లో ఖుత్బా ఇచ్చారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఒంటె జీను యొక్క రికాబులో కాళ్ళుపెట్టి నిలబడి ప్రజలు తనవైపునకు అభిముఖమవడానికి, బిగ్గరగా ఇలా సెలవిచ్చారు:

'నా మాటలు మీరు వినడం లేదా?'

తదుపరి ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) మూడుసార్లు ఇలా సెలవిచ్చారు:

"బహుశా వచ్చే సంవత్సరం మీరు నన్ను చూడకపోవచ్చు."

దీనిపై, అందరికన్నా వెనక నిలబడి వున్న ఒక వ్యక్తి – (ఈ స్థితిలో) మీరు మాకేమని ఆదేశిస్తారు? అని అడిగాడు.

దీనిపై, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"మీ ప్రభువైన అల్లాహ్‌కు మీరు భయపడుతూ వుండండి. ఐదుపూటలు నమాజును నెలకొల్పుతూ వుండండి. రమజాన్ మాసంలో ఉపవాసాలు పాటిస్తూ

ఉండండి. మీ సంపద నుండి జకాత్‌ను చెల్లిస్తూ వుండండి. మీ అధికారులకు విధేయత చూపుతూ ఉండండి. ఇలా మీరు మీ ప్రభువు స్వర్గంలోకి ప్రవేశించ గలుగుతారు.

అహ్మద్ లోని ఉల్లేఖనంలో 'మీ ప్రభువైన అల్లాహ్‌కు భయపడుతూ వుండండి' అన్న పదానికి బదులు, 'మీ ప్రభువును ఆరాధిస్తూ ఉండండి' అని వుంది. *(అహ్మద్ : 36వ సంపుటం, 486 పేజీ; 2261, 22258, 22260, తిర్మిజి : 616 – హసన్ సహీ, అబూ దావూద్ ముఖ్తసర్ : 1955, సహీ –అల్‌బానీ, అస్సహీహ : 867)*

ఈ ఖుత్బాలో దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఐదు విషయాల గురించి ఆజ్ఞాపించారు. వాటిని ఆచరించే వారికి స్వర్గం యొక్క శుభవార్తను అందజేశారు. ఆ ఐదు విషయాలు ఇవి:

1) తఖ్వా (దైవభీతి)

తఖ్వా అంటే – మనిషి హృదయంలో వుండే అల్లాహ్ భయం. దీని మూలంగా అతను అల్లాహ్ అవిధేయత నుండి దూరంగా వుంటాడు. ఒకవేళ అతని మనస్సులో ఎప్పుడైనా చెడు ఆలోచన వచ్చినా లేదా షైతాన్ ఏదైనా చెడును అందంగా చేసి అతని ముందుంచినా, అల్లాహ్ భయం అతనికీ మరియు ఆ చెడు కార్యానికి మధ్య అడ్డుగా వచ్చి, ఫలితంగా అతను ఆ చెడు కార్యాన్ని చేయకుండా వుండాలి.

ఖుర్‌ఆన్ లో అల్లాహ్ మాటిమాటికీ తఖ్వా గురించి ఆదేశించాడు. గుర్తుంచుకోవడానికిగాను కొన్ని ఆయతులు మీరు కూడా వినండి:

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ ٱتَّقُوا۟ ٱللَّهَ وَلْتَنظُرْ نَفْسٌ مَّا قَدَّمَتْ لِغَدٍ ۖ وَٱتَّقُوا۟ ٱللَّهَ ۚ
إِنَّ ٱللَّهَ خَبِيرٌۢ بِمَا تَعْمَلُونَ ﴿18﴾

**"విశ్వసించిన ఓ ప్రజలారా! అల్లాహ్‌కు భయపడుతూ వుండండి. ప్రతి వ్యక్తీ రేపటి (తీర్పుదినం) కొరకు తానేం పంపుకున్నాడో చూసుకోవాలి. ఎల్లవేళలా అల్లాహ్‌కు భయపడుతూ వుండండి. నిశ్చయంగా మీరు ఏమేం చేస్తున్నారో అల్లాహ్ కనిపెట్టుకునే వున్నాడు."** ***(హష్ర్ : 18)***

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ ٱتَّقُوا۟ ٱللَّهَ حَقَّ تُقَاتِهِۦ وَلَا تَمُوتُنَّ إِلَّا وَأَنتُم مُّسْلِمُونَ ﴿102﴾

"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు ఎంతగా భయపడాలో అంతగా భయపడండి. ముస్లిములుగా తప్ప మరణించకండి." *(ఆలి ఇమ్రాన్ : 102)*

يَٰٓأَيُّهَا ٱلَّذِينَ ءَامَنُوا۟ ٱتَّقُوا۟ ٱللَّهَ وَقُولُوا۟ قَوْلًا سَدِيدًا
يُصْلِحْ لَكُمْ أَعْمَٰلَكُمْ وَيَغْفِرْ لَكُمْ ذُنُوبَكُمْ ۗ

"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు భయపడండి. మాట్లాడితే సూటిగా మాట్లాడండి (సత్యమే పలకండి). తద్వారా అల్లాహ్ మీ ఆచరణలను చక్కదిద్దుతాడు. మీ పాపాలను మన్నిస్తాడు." *(అహ్జాబ్ : 70 – 71)*

ఈ ఆయతులలో అల్లాహ్ తఖ్వా (దైవభీతి) గురించి ఆదేశించాడు. ఇక దాని ప్రయోజనాలను గూర్చి వివరిస్తూ ఆయన ఇలా సెలవిచ్చాడు:

وَمَن يَتَّقِ ٱللَّهَ يَجْعَل لَّهُۥ مَخْرَجًا ۝ وَيَرْزُقْهُ مِنْ حَيْثُ لَا يَحْتَسِبُ ۚ

"ఎవడయితే అల్లాహ్‌కు భయపడుతూ మసలుకుంటాడో అతనికి అల్లాహ్ (ఈ సంక్షోభం నుండి) బయటపడే మార్గం కల్పిస్తాడు. అతను ఊహించ నయినాలేని చోటు నుండి అతనికి ఉపాధిని సమకూరుస్తాడు."

*(తలాఖ్ : 2–3)*

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

وَمَن يَتَّقِ ٱللَّهَ يَجْعَل لَّهُۥ مِنْ أَمْرِهِۦ يُسْرًا ۝

"ఎవడు అల్లాహ్‌కు భయపడతాడో అతనికి అల్లాహ్ అతని వ్యవహారంలో అన్ని విధాలా సౌలభ్యం కల్పిస్తాడు." *(తలాఖ్ : 4)*

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

وَمَن يَتَّقِ ٱللَّهَ يُكَفِّرْ عَنْهُ سَيِّـَٔاتِهِۦ وَيُعْظِمْ لَهُۥٓ أَجْرًا ۝

"ఎవడు అల్లాహ్‌కు భయపడతాడో అతని పాపాలను అల్లాహ్ అతని నుండి రూపుమాపుతాడు. అతనికి గొప్ప పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు."

*(తలాఖ్ : 5)*

ఈ ఆయతులలో అల్లాహ్ తఖ్వా ప్రయోజనాలను వివరిస్తూ – అల్లాహ్‌కు భయపడే వారికి, ఆయన అవిధేయతకు దూరంగా వుండే విశ్వాసులకు అల్లాహ్ కష్టాల నుండి బయటపడే మార్గాన్ని ఏర్పాటు చేస్తాడు. వారి కార్యాలను తేలికగా చేసేస్తాడు. పుష్కలంగా వారికి ఉపాధిని సమకూరుస్తాడు. వారి పాపాలను క్షమించి వారికి గొప్ప పుణ్యఫలాన్ని ప్రసాదిస్తాడు అని వివరించాడు.

2) ఐదు నమాజులు

రేయింబవళ్ళలో ఐదు నమాజులు యోగ్యులైన ప్రతి ముస్లింపై విధిగా వున్నాయి. తౌహీద్ (ఏకదైవరాధన) మరియు రిసాలత్ (దైవదౌత్యం)లను అంగీకరించిన (విశ్వసించిన) తర్వాత వీటిని క్రమం తప్పకుండా నెలకొల్పడం ఇస్లాం యొక్క రెండవ మౌలిక అంశం. ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఎన్నోసార్లు నమాజును నెలకొల్పమని ఆజ్ఞాపించి వున్నాడు. దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వాటిని ధర్మం యొక్క స్థంభం అని ఖరారు చేశారు. వాటి విధిత్వము, మహత్యం గురించి ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ (తన) దాసులపై ఐదు నమాజులు విధిగా చేశాడు. ఎవరైతే వాటిని తేలిగ్గా తీసుకుని, వృథా చేయకుండా ఎల్లప్పుడూ నెలకొల్పుతారో అతనికి అల్లాహ్ చేసిన వాగ్దానమేమిటంటే– ఆయన అతన్ని స్వర్గంలోకి ప్రవేశింప జేస్తాడు. ఇక ఏ వ్యక్తి అయినా వాటిని నెలకొల్పకపోతే అతనికి అల్లాహ్ వాగ్దానం ఏమీలేదు. ఆయన (అల్లాహ్) కోరుకుంటే అతన్ని శిక్షించనూ వచ్చు లేదా స్వర్గంలో ప్రవేశింపజేయనూ వచ్చు." *(అబూదావూద్, నసాయి, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 370)*

ప్రియ సోదరులారా!

అల్లాహ్, తన ప్రియ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వ సల్లం)ను తన వద్దకు, ఆకాశాలపైకి తను కోరుకున్నంత వరకు పిలిచి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు మేరాజ్ చేయించాడు. ఈ సందర్భంగా ఆయనకు, ఆయన అనుచర సమాజానికీ ఐదు నమాజులు విధిగా చేశాడు.

దీనిద్వారా రూఢీ అయిన విషయం ఏమిటంటే – విధి (ఫర్జ్)గా వున్న

కార్యాలన్నింటిలోనూ నమాజ్ ఎంతో ప్రముఖమైన విధి. దీని ప్రాముఖ్యతను దృష్టిలో వుంచుకోనే, ప్రళయం నాడు అల్లాహ్ అన్నిటికన్నా ముందుగా నమాజు లెక్క తీసుకుంటాడు.

దీని గురించి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ప్రళయం రోజు అన్నింటికన్నా ముందుగా దాసుల నుండి నమాజు లెక్క తీసుకోబడుతుంది. ఒకవేళ నమాజు సవ్యంగా వుంటే, మిగతా ఆచరణలు కూడా సవ్యంగా వుంటాయి. ఒకవేళ నమాజు సరిగా లేకపోతే మిగతా ఆచరణలు కూడా సవ్యంగా వుండవు." *(తబ్రాని, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 376)*

మరో ఉల్లేఖనం ప్రకారం ఇలా సెలవిచ్చారు:

"అతని నమాజును చూడడం జరుగుతుంది. అది గనక సవ్యంగా వుంటే అతను విజయం సాధించినట్టే. ఒకవేళ అది గనక సరిగా లేకపోతే, అవమానం పాలై నష్టపోయే వారిలో చేరిపోతాడు. *(అస్సహీహా : 1358)*

ఐదు నమాజుల మహత్యం గురించి సల్మాన్ (రజి అల్లాహు అన్హు) కథనం:

"నేనొకసారి ఒక చెట్టు క్రింద దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)తో పాటు వున్నాను. ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఎండిపోయిన ఒక కొమ్మను పట్టుకొని బలంగా ఊపేసరికి దాని ఆకులన్నీ రాలిపోయాయి. తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం):

ఓ సల్మాన్! నేనెందుకిలా చేశానో అని నన్ను అడగవా? అన్నారు.

నేను: మీరు ఎందుకిలా చేశారు? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): నిస్సందేహంగా ఒక ముస్లిం బాగా వుజూ చేసి, ఐదు నమాజులు (వాటి వాటి సమయాల్లో) నెలకొల్పుతూ వుంటే ఈ చెట్టు నుండి ఆకులు రాలినట్లే అతని పాపాలు కూడా రాలిపోతాయి. తదుపరి, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ ఆయత్‌ను పఠించారు: "దినము యొక్క రెండు అంచులలోనూ నమాజును స్థాపించు. రాత్రి ఘడియలలో

కూడా! నిశ్చయంగా పుణ్యకార్యాలు పాప కార్యాలను దూరం చేస్తాయి. గ్రహించగలిగే వారికి ఇదొక హితోపదేశం." (హూద్ : 114)

*(అహ్మద్, నసాయి, సహీ అత్తర్‌గీబ్ వ తర్‌హీబ్ : 363)*

అబూ హురైరా (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఒకవేళ మీలో ఎవరి గుమ్మం ముందైనా ఒక కాలువ ప్రవహిస్తూ ఉండి, దానిలో అతను ప్రతి రోజూ ఐదుసార్లు స్నానం చేస్తూ వుంటే అతని ఒంటి మీద మురికి ఏమైనా మిగిలి వుంటుందా? అని అడిగారు.

అందరూ: వుండదు, ఏ మాత్రం మిగిలి వుండదు అని అన్నారు.

దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) జవాబిస్తూ – ఐదు నమాజుల ఉదాహరణ కూడా ఇలాంటిదే. అల్లాహ్ వీటి ద్వారా పాపాలను కడిగేస్తాడు.

*(బుఖారీ, ముస్లిం)*

3) రమజాన్ మాసపు ఉపవాసాలు

ఐదు నమాజుల లాగానే రమజాన్ మాసపు ఉపవాసాలు కూడా యోగ్యులైన ప్రతి ముస్లింపై విధిగా వున్నాయి. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

يَا أَيُّهَا الَّذِينَ آمَنُوا كُتِبَ عَلَيْكُمُ الصِّيَامُ كَمَا كُتِبَ عَلَى الَّذِينَ مِن قَبْلِكُمْ لَعَلَّكُمْ تَتَّقُونَ (183)

**"ఓ విశ్వసించిన వారలారా! ఉపవాసాలుండడం మీపై విధిగా నిర్ణయించబడింది–మీ పూర్వీకులపై కూడా ఇదే విధంగా ఉపవాసం విధించబడింది. దీనివల్ల మీలో భయభక్తులు పెంపొందే అవకాశం వుంది."**

***(బఖర : 183)***

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రమజాన్ మాసపు ఉపవాసాల ఎన్నో మహత్యాలను వివరించారు. వాటిలో ఒకటి ఇది:

"ఏ వ్యక్తి అయినా విశ్వాసంతో, పూర్తి నమ్మకంతో అల్లాహ్ నుండి పుణ్యఫలాన్ని ఆశిస్తూ రమజాన్ ఉపవాసాలు పాటిస్తే, అతని గత పాపాలన్నీ క్షమించబడతాయి." *(బుఖారీ, ముస్లిం)*

దీనితోపాటు ఇంకా ఎన్నో మహత్యాలు వేర్వేరు హదీసుల ద్వారా నిరూపించబడి వున్నాయి. వీటన్నిటినీ మేము రమజాన్ మాసపు ఖుత్బాలలో సమగ్రంగా వివరించాము. ఇక్కడ మళ్ళీ వాటి గురించి వివరించడంలో గల ఉద్దేశ్యమేమిటంటే – దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్జతుల్ విదాలో, ఒక పెద్ద జన సమూహం ముందు, ఎన్నో సత్కార్యాల గురించి తాకీదు చేస్తూ, రమజాన్ మాసపు ఉపవాసాల గురించి కూడా తాకీదు చేశారు. తద్వారా వాటి గురించి ఎవరి మనసులోనూ ఏ విధమైన అనుమానం మిగిలి వుండ కూడదని.

4) సంపద నుండి జకాత్ చెల్లించడం

ఈ హదీసు యొక్క నాలుగవ విషయం – సంపద నుండి జకాత్ చెల్లించడం.

ఖుర్ఆన్‌లో అల్లాహ్ ఎన్నో ఆయతులలో నమాజు గురించి ఆజ్ఞాపించిన తర్వాత, వెంటనే దానితోపాటు జకాత్‌ను కూడా చెల్లించమని ఆజ్ఞాపించి వున్నాడు.

దీని ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – జకాత్ ప్రాముఖ్యత కూడా నమాజ్ కన్నా తక్కువేమీ కాదు. అందుకే ధనవంతులు తమ సంపద నుండి జకాత్ చెల్లించడానికి ఏ మాత్రం అశ్రద్ధ చూపకూడదు.

అబూ బక్ర్ సిద్దీఖ్ పరిపాలనా కాలపు ఆరంభంలో జకాత్ ఇవ్వడానికి నిరాకరించిన కొందరికి విరుద్ధంగా ఆయన యుద్ధ ప్రకటన చేస్తూ ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ సాక్షి! దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కాలంలో ఇచ్చిన ఒక త్రాడును సయితం నేడు ఇవ్వటానికి నిరాకరిస్తే నేను వారితో యుద్ధం చేస్తాను." *(బుఖారీ : 1399, ముస్లిం : 20)*

దీనిద్వారా మీరు– జకాత్ చెల్లించడం ఎంత ముఖ్యమో అంచనా వేయవచ్చు!

ప్రత్యేకించి, ప్రస్తుత సమాజంలో – జాతుల ఆధారంగా పంపకాలు జరుగుతున్నప్పుడు, ఒక ఇంట్లో అన్ని సౌకర్యాలు, అనుగ్రహాలు వుండి, దాని ప్రక్క ఇంట్లో తినడానికి ఏమీ దొరకని స్థితి వున్నప్పుడు, ఎక్కడైతే ధనవంతులు నివాసముంటున్నారో, దాని ప్రక్కనే బీదవారు, అగత్యపరులు నివాసముంటున్నప్పుడు – ఇలాంటి పరిస్థితులలో జకాత్ ప్రాధాన్యం ఇంకా పెరుగుతుంది.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ముఆజ్ బిన్ జబల్ (రజి అల్లాహు అన్హు) ను యమన్ వైపునకు పంపించినపుడు ఆయనకు ఇలా ఆజ్ఞాపించి పంపించారు.

(అక్కడి) ప్రజలను ముందుగా తౌహీద్ (ఏకదైవారాధన) మరియు రిసాలత్ (దైవదౌత్యం) వైపునకు ఆహ్వానించు, ఒకవేళ వారు దానిని స్వీకరిస్తే, అల్లాహ్ వారికి రేయింబవళ్ళలో ఐదు నమాజులు విధిగా చేశాడని చెప్పు.

తదుపరి ఇలా సెలవిచ్చారు: "ఒకవేళ వారలా చేస్తే (అంటే నమాజు చదవడం ప్రారంభిస్తే) అల్లాహ్ వారిపై జకాత్‌ను విధిగా చేశాడని చెప్పు. అది వారిలోని ధనవంతుల నుండి తీసుకుని, వారిలోని బీదవారు, అగత్యపరుల మధ్య పంచబడుతుంది." *(బుఖారీ : 1458, ముస్లిం : 19)*

అల్లాహ్ ఖుర్ఆన్ లో ఇలా సెలవిచ్చాడు:

خُذْ مِنْ أَمْوَالِهِمْ صَدَقَةً تُطَهِّرُهُمْ وَتُزَكِّيهِم بِهَا.......

**"(ఓ ప్రవక్తా!) నువ్వు వారిని పరిశుద్ధపరచటానికీ, వారిని తీర్చిదిద్దటానికీ వారి సంపదల నుండి దానాలను తీసుకో....". *(తౌబా : 103)***

దీనిద్వారా తెలిసిందేమిటంటే – జకాత్ చెల్లించడం ద్వారా సంపద పరిశుద్ధమవుతుంది. మనలోని అత్యాశ, పిసినారితనం కూడా శుద్ధి చేయబడతాయి.

5) పాలకుని విధేయత.

ఖుర్బానీ దినపు ఈ ఖుత్బా యొక్క ఐదవ అంశం – పాలకుని విధేయత.

అంటే– మన రాజ్యపాలకులకు, బాధ్యతాయుత వ్యక్తులకు విధేయత చూపడం.

అల్లాహ్ – తన మరియు తన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత చూపమని ఆజ్ఞాపించిన తర్వాత పాలకులకు, బాధ్యతాయుత వ్యక్తులకు విధేయత చూపమని ఆదేశించాడు.

يَاأَيُّهَا الَّذِينَ آمَنُوا أَطِيعُوا اللَّهَ وَأَطِيعُوا الرَّسُولَ وَأُولِي الْأَمْرِ مِنْكُمْ

**"ఓ విశ్వాసులారా! అల్లాహ్‌కు విధేయత చూపండి, ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత చూపండి మరియు మీలోని అధికారులకు కూడా." (నిసా : 59)**

ఈ ఆయతులో అల్లాహ్ – బాధ్యత కలిగిన అధికారులకు విధేయత చూపమని ఆదేశించాడు. తనకు విధేయత చూపమని ఆజ్ఞాపించాక, ప్రవక్త విధేయత కోసం "అతీఉ" అన్న పదం ఉపయోగించాడు. కానీ, అధికారుల విధేయత కోసం ఈ పదాన్ని ఉపయోగించలేదు.

దీని ద్వారా రూఢీ అయిన విషయమేమిటంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు విధేయత చూపడం అనేది శాశ్వతమైనది (అంటే అన్ని పరిస్థితుల్లోనూ విధేయత చూపాలి). కానీ అధికారులకు విధేయత అనేది షరతులకు లోబడి వుంటుంది. మరి ఆ షరతు ఏమిటి?

దీని వివరణ మనకు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యొక్క ఈ హదీసు ద్వారా లభిస్తుంది.

"వినడం మరియు విధేయత చూపడం ముస్లింకు తప్పనిసరి. ఆజ్ఞాపించ బడ్డ విషయం అతనికి ఇష్టమైనా, ఇష్టం కాకపోయినా సరే. (అంటే అన్ని పరిస్థితుల్లోనూ విధేయత చూపాలి). కేవలం పాపకార్యాల గురించి ఆదేశిస్తే తప్ప.

(అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త) అవిధేయత గురించి ఆదేశిస్తే దానిని వినకూడదు మరియు పాటించకూడదు."

*(బుఖారీ : 7144, ముస్లిం : 1839)*

దీనిద్వారా తెలిసిందేమిటంటే – రాజ్యపాలకులు, నాయకులు, అధికారుల విధేయత అనేది అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ

సల్లం) విధేయతకు లోబడి ఉంటుంది. అందుకే, అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) కు అవిధేయత విషయంలో పాలకులకు విధేయత చూపకూడదు.

ఇస్లామీయ సోదరులారా!

ఈ రోజుల్లో సామాన్య విషయాల్లో కూడా పాలకులకు వ్యతిరేకంగా గొంతెత్తడం మొదలుపెడుతున్నారు. ధర్నాలు, ప్రదర్శనలతో శాంతియుత వాతావారణాన్ని కలుషితం చేస్తున్నారు. వాటిలో పాలకులను, మంత్రులను, దుర్భాషలాడడం జరుగుతూ వుంటుంది! మరి చూడబోతే ఈ పద్ధతి దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హదీసులకు, అహ్లుస్సున్నహ్ వల్ జమాత్ దృక్పథానికి విరుద్ధంగా వుంది. ఎందుకంటే పాలకుల గురించి అహ్లుస్సున్నహ్ వల్ జమాత్ యొక్క ఏకైక దృక్పథం ఏమిటంటే – వారి (పాలకులు) శ్రేయస్సును కాంక్షించాలి, సత్యానికి అనుగుణంగా వున్న కార్యాల్లో వారికి సహాయపడాలి. ఒకవేళ వారు ప్రజలపై దౌర్జన్యం చేస్తే గుప్తంగా వారికి హితబోధ చేయాలి, సహనం పాటించాలి మరియు వారి మేలు కోసం ప్రార్థించాలి.

దీని గురించి కొన్ని హదీసులు వినండి:

అనస్ (రజి అల్లాహు అన్హు) కథనం:

“పెద్ద సహాబాలు మాకు – అధికారుల, పాలకుల అవిధేయత నుండి వారించారు మరియు దైవ ప్రవక్త(సల్లల్లాహు అలైహి వ సల్లం) గారి ఈ హదీసును కూడా వినిపించారు:

“మీరు మీ పాలకులను తిట్టకండి, వారిని మోసం చేయకండి. వారి పట్ల ఈర్ష్య కలిగి వుండకండి. అల్లాహ్‌తో భయపడుతూ వుండండి. సహనం పాటించండి. ఎందుకంటే వ్యవహారం (అంతిమ తీర్పు) దగ్గరలోనే వుంది.

*(ఇబ్నె ఆసిమ్, సహీ–అల్‌బానీ ఫీ జిలాలుల్ జన్నహ్ : 1015)*

ఔఫ్ బిన్ మాలిక్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"జాగ్రత్త! ఒక వ్యక్తిపై ఎవరినైనా పాలకునిగా నియమించి, తదుపరి ఆ వ్యక్తి – పాలకుడు అల్లాహ్ పట్ల అవిధేయతకు పాల్పడడం చూసినా – అతని ఆ అవిధేయతను ఇష్టపడకూడదు కానీ, అతని విధేయతకు మాత్రం దూరంగా వుండకూడదు." *(ముస్లిం :1855)*

హుజైఫా బిన్ యమాన్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"నా తదనంతరం కొంతమంది పాలకులు వస్తారు. నా హితబోధను స్వీకరించరు మరియు నా సున్నత్ పైన గూడా ఆచరించరు. త్వరలో మీ నుంచి కొంతమంది లేచి నిలబడతారు. వారు మానవ శరీరాలు, షైతాను హృదయాలు కలిగి వుంటారు."

నేను: ఒకవేళ నేను అలాంటి కాలాన్ని గనక పొందితే ఏం చేయను? అని అడిగాను.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) : నువ్వు పాలకుల మాట విను. దాని కనుగుణంగా ఆచరించు. వాళ్ళు (పాలకులు) నీ వీపు వాయించినప్పటికీ, నీ సంపదను దోచుకున్నప్పటికీ (అలాగే చేయి). *(ముస్లిం : 1847)*

ఇయ్యాజ్ బిన్ గనీమ్ (రజి అల్లాహు అన్హు) కథనం ప్రకారం దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"ఏ వ్యక్తి అయినా పాలకునికి, అధికారికి హితబోధ చేయాలనుకుంటే దానిని బాహాటంగా (అందరి ముందు) చేయకూడదు. అతని చెయ్యి పట్టుకుని (ప్రజల గుంపు నుండి) వేరయిపోయి ఆ తర్వాత (హితబోధ చేయాలి). ఆ తర్వాత ఆ అధికారి, అతని హిత బోధ స్వీకరిస్తే మంచిది. అలా కాకపోయి నప్పటికీ, అతను మాత్రం తన విధిని పూర్తి చేశాడు."

*(ఇబ్నె అబీ ఆసిమ్, సహీ–అల్‌బానీ ఫీ జిలాలుల్ జన్నహ్ : 1096)*

ప్రియ సోదరులారా!

ఈ హదీసులూ మరియు ఇలాంటివెన్నో హదీసులు – పాలకులు,

అధికారుల గురించి అహ్లుసున్నహ్ వల్ జమాత్ దృక్పథాన్ని స్పష్టంగా వివరిస్తూ, దానిని నిర్ధారిస్తున్నాయి. అందుకే ఈ దృక్పథాన్ని అలవర్చుకోవాలి. అంతేగాని, దేశంలో అరాజకం, తిరుగుబాటు వాతావరణాన్ని సృష్టించకూడదు. ఎందుకంటే, దీనివల్ల లాభం తక్కువ గానూ, నష్టం ఎక్కువగానూ ఉంటుంది. పైగా, దీని మూలంగా, దేశంలో చట్టవిరుద్ధత వ్యాపిస్తుంది. ఒకవేళ పాలకులు దీనిని అణిచివేయడానికి ప్రయత్నిస్తే అమాయకులు మరణిస్తారు....

కానీ, ఒకవేళ పాలకులు, అధికారులు ఏ మాత్రం అనుమానం లేని కుఫ్ర్ (తిరస్కారం) కార్యాలు బాహాటంగా చేస్తూవుంటే, తదుపరి జ్ఞానులు, విద్వాంసులు వారికి ఎంత నచ్చజెప్పినప్పటికీ వారు దానిని త్యజించడానికి సిద్ధం కాకపోతే, వారికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేయవచ్చు. కానీ, షరతు ఏమిటంటే తిరుగుబాటు వల్ల పెద్ద అల్లర్లు, నష్టం జరగకుండా వుండాలి మరియు ఏ మాత్రం రక్తం చిందించకుండా ఆ పాలకుణ్ణి, అధికారిని తొలగించగలిగే బలాన్ని తిరుగుబాటుదారుడు కలిగి వుండాలి.

ఒకవేళ తిరుగుబాటుదారునికి, వారిని తొలగించగలిగే బలం లేకపోతే, తిరుగుబాటు మూలంగా పెద్ద అల్లర్లు, నష్టం జరిగే అవకాశముంటే – ఆ స్థితిలో సహనం పాటించడం తప్ప మరో మార్గం వుండదు.

ఉబాదా బిన్ సామిత్ (రజి అల్లాహు అన్హు) కథనం:

మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) వద్ద ఈ విషయాలపై బైత్ (ప్రమాణం) చేశాం – మేము అన్ని పరిస్థితులలోను వింటాం మరియు విధేయత చూపుతాం. మాకు అన్యాయం జరిగినప్పటికీ మేము అవిధేయత చూపం. అధికారి యొక్క అధికారాలను మేము లాక్కోవడానికి ప్రయత్నించం.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఇలా సెలవిచ్చారు:

"కేవలం, అతని(పాలకుని) కుఫ్ర్ ను బాహాటంగా చూసినప్పుడు తప్ప. ఎందుకంటే ఆ స్థితిలో, మీ వద్ద అల్లాహ్ తరఫు నుండి ఆధారం లభ్యమై ఉంది." *(బుఖారీ: 7055, ముస్లిం : 1709)*

సారాంశమేమిటంటే – దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ ఖుత్బాలో ఐదు విషయాల గురించి ఆజ్ఞాపించారు. (తఖ్వా, ఐదు నమాజులు, రమజాన్ మాసపు ఉపవాసాలు, జకాత్ చెల్లింపు మరియు పాలకుల పట్ల విధేయత). దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఈ ఐదు విషయాలను గురించి ప్రాస్తవించాక – ఒకవేళ మీరు వీటిపై ఆచరిస్తే, స్వర్గంలోకి ప్రవేశించ గలుగుతారు.

అందుకే మనమంతా ఈ ఐదు విషయాలను ఎల్లప్పుడూ పాటిస్తూ ఉండాలి.

## రెండవ ఖుత్బా

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) హజ్జతుల్ విదా సందర్భంలో ఇచ్చిన ఖుత్బాల గురించి మరికొన్ని ఉల్లేఖనాలు మీకు వివరిస్తాం. తద్వారా ఈ విషయాన్ని మరింత సమగ్రంగా తెలుసుకోవచ్చు.

## దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) యొక్క మరో ఖుత్బా

జాబిర్ (రజి అల్లాహు అన్హు) కథనం :

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'అయ్యామె తష్రీఖ్' (ఖుర్బానీ దినాలు) మధ్యలో మాకు హజ్జతుల్ విదా ఖుత్బా ఇచ్చారు. దానిలో ఆయన ఇలా సెలవిచ్చారు:

ప్రజలారా! మీ ప్రభువు ఒక్కడే, మరియు మీ తండ్రి కూడా ఒక్కడే. జాగ్రత్త! అరబ్బులకు ఇతరులపై, అలాగే ఇతరులకు అరబ్బులపై ఏ విధమైన శ్రేష్టత లేదు. నల్లవాడికి తెల్లవాడిపై, తెల్లవాడికి నల్లవాడిపై ఏ విధమైన ప్రత్యేకత లేదు. కేవలం తఖ్వా (దైవభీతి) మరియు భయభక్తుల వైఖరి మూలంగానే ఒకరిపై శ్రేష్టత పొందవచ్చు.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

إِنَّ أَكْرَمَكُمْ عِندَ اللَّهِ أَتْقَاكُمْ

**"యదార్థానికి మీలో అందరికన్నా ఎక్కువ భయభక్తులు కలవాడే అల్లాహ్ సమక్షంలో ఎక్కువ ఆదరణీయుడు."** ***(హుజురాత్ : 13)***

జాగ్రత్త! నేను మీకు (అల్లాహ్ ధర్మాన్ని) చేరవేసానా?

సహాబాలు : అవునండీ అని బదులిచ్చారు.

ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం): ఇక్కడున్న వారు ( ఈ విషయాలను) ఇక్కడ లేని వారి వద్దకు చేరవేయాలి.

*(ముస్నద్ అహ్మద్ : 5వ సంపుటం, 416 పేజీ, అస్సహీహా : 2700)*

ఈ ఖుత్బాలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) రెడు ముఖ్య విషయాల గురించి తాకీదు చేశారు. అందులో మొదటిది అనుచర సమాజపు ఏకత్వం. అంటే, ఆయన (సల్లల్లాహు అలైహి వ సల్లం) అనుచర సమాజం ఒకే అనుచర సమాజం. దీని ప్రభువు ఒక్కడే మరియు దీని తండ్రి కూడా ఒక్కడే. అందుకే, ఈ అనుచర సమాజపు ప్రతి వ్యక్తిపై తప్పనిసరిగా వున్న విషయం ఏమిటంటే – అతను ఒకే అల్లాహ్‌ను ఆరాధించాలి, దైవేతరులను ఆరాధించి దీనిలో (అనుచర సమాజంలో) మనస్పర్థలు, వర్గ విభజనలు సృష్టించకూడదు. ఇదే విషయాన్ని అల్లాహ్ కూడా ఖుర్ఆన్‌లో వివరించాడు:

إِنَّ هَٰذِهِۦٓ أُمَّتُكُمْ أُمَّةً وَٰحِدَةً وَأَنَا۠ رَبُّكُمْ فَٱعْبُدُونِ ۝

**"మీరు ఈ సమాజం (లేక మత ధర్మం) వాస్తవానికి ఒకే సమాజం (ఒకే మత ధర్మం). నేను మీ అందరి ప్రభువును. కనుక మీరు నన్నే ఆరాధించండి."** ***(అంబియా : 92)***

ఇంకా ఇలా సెలవిచ్చాడు:

وَٱعْتَصِمُوا۟ بِحَبْلِ ٱللَّهِ جَمِيعًا وَلَا تَفَرَّقُوا۟

**"అల్లాహ్ త్రాడును అందరూ కలసి గట్టిగా పట్టుకోండి, చీలిపోకండి."**
***(ఆలి ఇమ్రాన్ : 103)***

ఈ ఆధారాలు మరియు ఇలాంటివెన్నో ఆధారాల ద్వారా తెలిసేదేమిటంటే– ఇస్లాం, ఈ అనుచర సమాజానికి ఏకాభిప్రాయం వైపునకు, ఐకమత్యం వైపునకు ఆహ్వానిస్తూ, అభిప్రాయ బేధాలు కలిగి వర్గాలుగా చీలిపోవడం నుండి (గట్టిగా) వారిస్తుంది.

కానీ, అనుచర సమాజం యొక్క నేటి పరిస్థితి చూస్తే, దురదృష్టవశాత్తూ అది విభిన్న వర్గాలుగా చీలిపోయి వుంది. దీని మూలంగా అది చాలా బలహీనమై పోయింది మరియు (దాని) శత్రువు దానిపై ప్రాబల్యం వహించి వున్నాడు! దీని నుండి బయటికొచ్చే మార్గం ఒక్కటే. అదేమిటంటే – ఈ అనుచర సమాజపు మొదటి తరాల వారు అనుసరించిన మార్గము. ఒక అనుచర సమాజం అంటే ఇలా వుండాలి అని, ఇతరులు అసూయ చెందేలా ఒక మంచి ఉదాహరణ వారు (ప్రపంచం) ముందుంచారు. ఏకాభిప్రాయాన్ని, ఐకమత్యాన్ని సాధించారు. వారనుసరించిన ఆ ఒకే ఒక్క మార్గం ఏమిటంటే – ఒకే ఒక్క అల్లాహ్ ఆరాధన మరియు కేవలం దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)కు విధేయత చూపడం.

కేవలం, అల్లాహ్ ఖుర్ఆన్ మరియు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) ఆదేశాల అనుసరణ. ఈ రెండు తప్ప, అనుసరించడానికి, విధేయత చూపడానికి మూడో విషయం, ఏదియూ వారి వద్ద లేదు.

వాస్తవానికి ఖుర్ఆన్ – అనుసరించమని ఆజ్ఞాపించే రుజుమార్గం ఇదే.

అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

وَأَنَّ هَٰذَا صِرَاطِي مُسْتَقِيمًا فَاتَّبِعُوهُ ۖ وَلَا تَتَّبِعُوا السُّبُلَ فَتَفَرَّقَ بِكُمْ عَن سَبِيلِهِ ۚ
ذَٰلِكُمْ وَصَّاكُم بِهِ لَعَلَّكُمْ تَتَّقُونَ ۝

**"ఇదే నా రుజుమార్గం. కనుక మీరు దీనినే అనుసరించండి. ఇతరత్రా మార్గాలను అనుసరించకండి. అవి మిమ్మల్ని అల్లాహ్ మార్గం నుండి వేరుపరుస్తాయి. మీరు భయభక్తుల వైఖరిని అవలంబించేటందుకు గాను అల్లాహ్ మీకు ఈ విధంగా తాకీదు చేశాడు."** ***(అన్ ఆమ్ : 153)***

హజ్జతుల్ విదా యొక్క ఈ ఖుత్బాలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) తాకీదు చేసిన రెండో విషయం – ప్రదేశాలు, జాతులు, రంగుల ఆధారంగా జరిగిన విభజనను సమాప్తం చేయడం. అంటే, ఒక జాతికి మరో జాతిపై, ఒక రంగుకు మరో రంగుపై ఏ విధమైన శ్రేష్టత లేదు. ఒకవేళ ఒకరిపైనొకరికి శ్రేష్టత అంటూ వుంటే అది కేవలం తఖ్వా (దైవభీతి) మూలంగా

ఉంటుంది. అందువల్ల, ఏ జాతి అయినా లేదా ఏ వ్యక్తి అయినా ఎక్కువగా దైవభీతి కలిగి ఉంటే, వారికి ఇతర జాతులపై లేదా వ్యక్తులపై శ్రేష్టత లభిస్తుంది. వారు అరబ్బులైనా కావచ్చు, ఇతరులైనా కావచ్చు. నల్లవారైనా కావచ్చు, తెల్లవారైనా కావచ్చు.

## హజ్జతుల్ విదా ఖుత్బా మరియు మసీహ్ దజ్జాల్

అబ్దుల్లా బిన్ ఉమర్ (రజి అల్లాహు అన్హు) కథనం :

"మేము దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) సమక్షంలో 'హజ్జతుల్ విదా' గురించి చర్చించుకొనే వాళ్ళం. వాస్తవానికి మాకు 'హజ్జతుల్ విదా' అంటే ఏమిటో తెలియదు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) (హజ్జతుల్ విదా సందర్భంలో) అల్లాహ్ స్తోత్రం చేశాక మసీహ్ దజ్జాల్ గురించి చెబుతూ సమగ్రంగా వివరించారు.

ఆయన ఇలా సెలవిచ్చారు:

"అల్లాహ్ ద్వారా పంపబడ్డ ప్రవక్తలందరూ తమ అనుచర సమాజానికి వాడి (దజ్జాల్) గురించి భయపెట్టారు. వాడి గురించి నూహ్ (అలైహిస్సలాం) మరియు ఆయన తర్వాత వచ్చిన ప్రవక్తలందరూ భయపెట్టారు. అతడు నిస్సందేహంగా మీ మధ్యకు వస్తాడు.

వాడికి సంబంధించిన ఒక విషయం ఇప్పటి వరకు మీకు గోప్యంగా వుంది. కానీ ఇక ఆ విషయం మీకు గోప్యంగా వుండదు. నిశ్చయంగా మీ ప్రభువు మిమ్మల్ని గోప్యంగా వుంచడు. ఇలా మూడు సార్లు సెలవిచ్చారు.

నిస్సందేహంగా మీ ప్రభువు ఒంటికన్ను కలవాడు కాడు. వాడు (దజ్జాల్) మాత్రం కుడి కన్ను లేని వాడై వుంటాడు. వాడి కుడి కన్ను ఉబ్బిన ద్రాక్ష పండులా వుంటుంది."

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) 'హజ్జతుల్ విదా' ఖుత్బాలో, తన అనుచర సమాజానికి దజ్జాల్ గురించి భయపెట్టారు. ప్రతి కాలంలోనూ ప్రతి ప్రవక్త, వాడి గురించి భయపెట్టడం చూస్తే, వాడి పరీక్ష (పీడన) ఎంత తీవ్రంగా వుంటుందో అంచనా వేయవచ్చు.

కానీ దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం) భయపెట్టడంతోపాటు, ఇంత వరకు ఎవరూ వివరించని ఒక సూచనను తెలియజేశారు. అదేమిటంటే– వాడు కుడి కన్ను లేనివాడై వుంటాడు. దీనికన్నా మరో స్పష్టమైన సూచనను దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లం)మరో హదీసులో వివరించారు. అదేమిటంటే – అతని నుదిటిపై 'కాఫిర్' (كفر) అని లిఖించబడి ఉంటుంది...

అల్లాహ్ మనందరినీ వాడి పరీక్ష (పీడన) నుండి సురక్షితంగా వుంచుగాక! ఆమీన్!

# ZAADUL KHATHEEB (Vol.1)
## (Khuthbaala Sangrahamu) (Telugu)

## అల్ ఇదారతుల్ ఇస్లామియ, కొత్తగూడెం

### ముఖ్య కార్యక్రమాలు

1. దివ్యఖురాను, ప్రామాణిక హదీసుల వెలుగులో సలఫుస్సాలిహీన్‌ల దృక్పథంతో ధార్మిక విద్య (ఆలిమ్ కోర్సు)తోపాటు సాధారణ విద్యా బోధన.
2. తర్బియతీ (శిక్షణ) కోర్సులు.
3. బైతుల్‌మాల్ ద్వారా పేదలు, అనాథలు మరియు వితంతువుల సహాయం.

### ఆశయాలు

1. స్వచ్ఛమైన ఇస్లామీయ బోధనలతోపాటు సాధారణ విద్యా బోధన ద్వారా సమాజ సంస్కరణ.
2. పేదలు, అనాథలు మరియు వితంతువుల సంక్షేమము.

ఈ మహత్తర కార్యాలలో పాలుపంచుకోదలచిన వారు మరియు ఈ సంస్థ ద్వారా ప్రయోజనం పొందగోరేవారు మరిన్ని వివరాలకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు.


**9951388332, 7382551686,9949155819, 9949205380**

# Al Idaaratul Islamia

(Educational, Welfare and Charitable Society.)
H.No.9-82/1A, Prashanthi Nagar, L.D. Pally,
Kothagudem - 507 101 Cell: 9951388332


Our Bank Details: Al Idaaratul Islamia,
A/c. No.4810135000002693 IFSC : KVBL0004810
Karur Vysya Bank, Kothaguem.

**Google Pay : 9951388332**